సాయి మార్గంలో!

జీవిస్తూ...ప్రేమిస్తూ...పరిమళిస్తూ!!

(ఆత్మ కథ కాదు...ఆత్మీయుల కథ)

బాలచంద్ర
B.Sc., LL.B., FCS.

ॐ

సాయి మార్గంలో!

జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!!

(ఆత్మ కథ కాదు... ఆత్మీయుల కథ)

బాలచంద్ర

సాయి మార్గంలో!

జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!!

(ఆత్మ కథ కాదు... ఆత్మీయుల కథ)

బాలచంద్ర

Published by
abhaya FOUNDATION
Hyderabad - 500 004. TG
www.abhayafoundation.org

Sai Margamlo!

Jeevistu... Premistu... Parimalistu!!
(Atma Katha Kadu... Atmiyula Katha)

Author : **Balachandra**
Copy Right © Balachandra

All rights reserved. No part of this work may be reproduced in any form without written permission of the publisher

First Edition : November, 2025
Copies : 500
Price : Invaluable

Typing & Layout Design
R. Bhagya Laxmi
+91 9542247373

Published by
abhaya FOUNDATION
502, Vipanchi Residency, Lane Besides Paradise Take Away,
Masab Tank, Hyderabad - 500 028. Telangana
abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org
Mobile: 99592202450 | What's App: 8143707803

www.abhayafoundation.org | www.abhayahome.org
fb: abhayafoundationHyd | fb Page: abhaya Foundation - Home of Happiness
Twitter: abhayaheart | Youtube: abhayaheart
fb: Balachandra Sunku | Youtube : Balachandra Sunku

Printed at :
Dolphin Graphics
IDA, Uppal, Hyderabad - 500 039, TG
dolphingraphicsads@gmail.com
Ph: 8106988009

ప్రకాశకుల మనవి

అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులైన బాలచంద్రను ఒకటిన్నర దశాబ్ద కాలం నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా, అపరోక్షంగా గమనించే భాగ్యం నాకు కలిగింది. వీరిని నేను చాలా ప్రేమగా అంకుల్ అని పిలుచుకుంటాను. ఆయన నన్ను తన సొంత పాప వలే భావించి ఆదరిస్తారు.

వారి ఆలోచనలు, మాటలు, చేతలు, సేవలు నన్ను ఎంతో ప్రభావితం చేస్తుంటాయి. వారిని చూసినా, వారి మాటలు విన్నా నాలో స్ఫూర్తి, ప్రేరణ కలుగుతూ ఉంటాయి. ఇక వారితో చేరి సేవలో పాల్గొన్నప్పుడు నాలో ఏదో తెలియని దివ్య శక్తి ఆవిష్కృతం అవుతుంది. ఇట్టి వారి సహవాసం నాకు ప్రసాదించినందుకు భగవంతునికి నేను సదా కృతజ్ఞతలు తెలియ చేస్తూనే ఉంటాను.

వారి సహచర్యం దొరకడం నా అదృష్టంగా భావిస్తాను. నాకు లాగా ఆ అదృష్టం అందరికీ దొరకక పోవచ్చు. ఎలాగైనా సరే, మా తరం, ఈ తరం, ముందు తరం వారందరి ప్రయోజనం కోసం వీరిని, వీరి అసమాన్యమైన భావాలను, మాటలను, చేతలను, సేవలను అందరికీ అందించాలని ఆలోచిస్తున్న సమయంలో, అంకుల్, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 96వ పుట్టు పండుగ సందర్భంగా ఒక సంవత్సరం పాటు వారానికి రెండు చెప్పున, చేసిన 96 Divine Daffodils వీడియోలు (2019) YouTubeలో చూసాను. తద్వారా మరెన్నో విషయాలు విశేషాలు తెలుసుకున్నాను. వాటిని చక్కగా సంకలనం చేస్తూ పుస్తక రూపంలో ప్రచురించి, మరింత మందికి ప్రేరణను ఇవ్వచ్చు కదా అని ఆలోచన వచ్చింది.

వీడియోలని చూడడం కంటే వినడం బాగుంది... వినడం కంటే వ్రాయడం ఇంకా బాగుంది. వ్రాయడం కంటే వ్రాసింది చదవడం ఇంకా ఎక్కువగా అనుభూతిని ఆనందాన్ని ఇచ్చింది. ఎంత త్వరగా వీలవుతే అంత త్వరగా దీనిని ప్రచురించాలన్న తపనతో సుమారు 2 సంవత్సరాల క్రితం పని మొదలు పెట్టాను. నేను చేస్తున్న పని గురించి తెలుసుకుని, నా భుజం తట్టి ప్రోత్సహించారు అంకుల్. అంతే కాదు "నేను, వారి మాటలలో వ్రాసిన తన కథను స్వయంగా వారే సమీక్షించడం ప్రారంభించారు". ఎప్పటికప్పుడు మధ్యలో మిస్ అయిన అంశాలను కూడా జోడిస్తూ... వారి సంపూర్ణమైన కథను నా ద్వారా ఆవిష్కరింప చేశారు.

వీడియోలు అన్నింటినీ కూడా అభయ ఆత్మ బంధువు అయిన సురేష్ కుమార్, మాచర్ల, సాంకేతికతను ఉపయోగించి అందులో సంభాషణలను వచన రూపంలోకి తెచ్చారు. దానిని నేను సరి చేశాను. అలా బాలచంద్ర అంకుల్ కథను "సాయి మార్గంలో! జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!!" అన్న పేరున పుస్తకముగా రూపంలో అభయ ఫౌండేషన్ ద్వారా ప్రచురించ గలిగాను. 108 సుదీర్ఘ వ్యాసాలను ఈ పుస్తకములో కూర్చి వారి గురువు, గురి, గాడ్ అయిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా, వారి పాద సన్నిధిలో అర్పించాలని వారి ఆశ.

ఈ పుస్తక ప్రచురణలో మాతో పాటు నిలబడ్డ భాగ్యలక్ష్మి, మహమ్మద్ రంజాన్, రాజశేఖర్ రెడ్డి, సురేష్ కుమార్, శివకృష్ణ, సుష్మ, దత్తాత్రేయ, రజని, సునీల్ తదితరులకు ధన్యవాదాలు.

అడగగానే బాలచంద్ర మీద ఎంతో వాత్సల్యంతో ముందు మాట వ్రాసిన శ్రీ హెచ్ శ్రీనివాసులుకు మరియు తమ సందేశాలను ఎంతో ప్రేమతో అందించిన అనేక మంది శ్రేయోభిలాషులకు శిరము వంచి అభివాదం చేస్తున్నాము.

మీరు అనేక జీవిత చరిత్రలు, ఆత్మకథలు చదివి ఉంటారు. కానీ ఈ పుస్తకం చాలా భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే, ఇది కేవలం ఆత్మ కథ కాదు, ఆత్మీయుల కథ. ప్రతి వ్యాసము ప్రత్యేకమైనదిగా చదవాలి.

ఈ పుస్తకంలో పేర్కొన్న
ప్రతి మనిషిది ఒక విలక్షణ గాథ,
ప్రతి జీవితం ఒక పాఠశాల,
ప్రతి కథ మేల్కొలిపే ఘంటారావం అనడంలో సందేహం లేదు

ఈ కథ సాధారణ మనిషి గురించి కాదు, సేవను శ్వాసగా మార్చుకున్న అసాధారణ వ్యక్తి గురించి. పైకి కోపంగా కనిపించినా, ఎల్లప్పుడు వారి హృదయం ప్రేమతో పొంగిపోతుంటుంది, దేహం సదా దేశ హితం కోసమై పరిగెడుతూ వుంటుంది, చేతులు నిస్వార్థ సేవలో చేతనం అవుతూ ఉంటాయి, ఇక అంకుల్ సృజనాత్మతకు, నైపుణ్యానికి ఆకాశమే హద్దు అని చెప్పాలి. వారి ప్రతి ఆలోచనలో ఆదర్శం నిండి ఉంటుంది, చెప్పిన ప్రతి మాట ఆచరిస్తారు, ఆచరణతోనే జీవిస్తారు. అలా జీవితాన్ని త్రికరణశుద్ధితో పవిత్రం చేస్తూనే వుంటారు.

వీరి కథను వారి శైలిలో సంకలనం చేస్తుంటే ప్రతి అంశంలోనూ వారి నిబద్ధత, నిజాయితీ, నిస్వార్థము, సేవను శ్వాసగా చేసిన వైనము, సమాజ హితం కోసమై వారు పడే తపన ప్రకటితమవుతుండడం నేను గమనించాను.

ఈ పుస్తకం పాఠకుడి అంతర్ముఖ యాత్రకు తోడ్పడుతుంది.

చదువరులు, మనిషి ప్రేమతో ఉంటే ఇతరులకు ఎంత స్ఫూర్తిగా మారతాడో తెలుసుకుంటారు.

పాఠకులకు, సాధారణ వ్యక్తి, సాయి సందేశ వ్యాప్తికి దివ్య సాధనంగా ఎలా తయారయ్యాడో అర్థమవుతుంది.

చదువుతుంటే నాయకత్వం అనేది అధికారం ద్వారా రాదు, వినయం ద్వారా వెలుగుతుంది అని తెలుసుకుంటారు.

తనకు ఎదురయ్యే ప్రతి సవాల్ ను భగవంతుడికి అర్పించి, ఆశీర్వాదాలుగా ఎలా మలచుకున్నారో అర్థం అవుతుంది.

సృజనాత్మకత, కార్యశీలత, కారుణ్య భావనా మనిషిలో చేరితే వేల మంది జీవితాలలో ఎలా వెలుగు నింపగలరో స్పష్టమవుతుంది.

ఆలోచన, మాట, చేత ఒక్కటవుతే ప్రపంచానికి ప్రేరణగా ఎలా నిలుస్తారో చూడగలుగుతారు.

పరిపూర్ణమైన వ్యక్తిత్వం అంటే ఏమిటి? జీవితం ఎందుకు? దాన్ని ఎలా జీవించాలి? అన్నది స్పష్టంగా తెలుస్తుంది. సేవ మనిషిని ఎంతలా తీర్చి దిద్దగలదో తేటతెల్లం అవుతుంది. ఆలోచన మంచిదైతే, దైవబలం ఎలా తోడవుతుంది అన్నది అర్థం అవుతుంది. ఇలా ప్రతి విషయానికి అనేక నిదర్శనాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి.

జీవితంలో కన్నీళ్లను మార్పు కోసమై తీసుకుని, విమర్శలను ప్రేరణగా చేసుకుని, అవమానాలను ఆశీర్వాదాలుగా మలుచుకున్న సన్నివేశాలెన్నో వీరి కథలో గోచరిస్తాయి.

ఇది కేవలం ఒక ఆత్మ కథ కాదు
ఆత్మీయుల కథ అని చెప్పాలి.
ఈ పుస్తకం అంతా కూడా
ప్రతి సాధకునికి జీవిత పాఠం,
ప్రతి సేవకునికి నిలువెత్తు అద్దం,
ప్రతి హృదయానికి కావాల్సిన ప్రార్థన.

ఈ పుస్తకం మనలో నిద్రాణమై ఉన్న చైతన్యాన్ని మేల్కొలుపుతుంది. అసలు ఈ భూమి మీదకు మనం వచ్చింది పోగు చేయడానికి కాదు పంచిపెట్టడానికి అన్న సత్యాన్ని గుర్తు చేస్తుంది. సేవ చేయించుకోవడానికి కాదు, సేవ చేయడానికి పుట్టామన్న సందేశాన్ని స్ఫూరింపజేస్తుంది.

నేను ఎంత చెప్పినా తక్కువే... ఎందుకంటే... ఈ పుస్తకంలో ఉన్న విషయాలను నిజంగా అనుభవించి, అనుభూతి చెంది, నేర్చుకుని, మన జీవితాలలో అమలు పరిచినప్పుడే దాని తియ్యదనం తెలుసుకోగలం. ఇక ఎందుకు ఆలస్యం... ఇక చదవటం మొదలు పెడదామా?

ప్రేమతో, పునీతమైన భక్తితో,

డా. పి. సాయిలత
MBBS, MS, DNB (OBGY)
Board Member
abhaya Foundation
abhayafoundation@yahoo.com
Hospet, Karnataka

Note : ఎంతో జాగ్రత్తగా అచ్చు తప్పులు చూసినా, మా దృష్టిలో పడకుండా కొన్ని తప్పులు మిగిలి ఉండవచ్చు. దయవుంచి క్షమించి మా దృష్టికి తీసుకుని వస్తే మళ్లీ ముద్రణలో సరి చేయడం జరుగుతుంది.

ముందుమాట

సాయి మార్గంలో జీవిస్తూ, ప్రేమిసూ, పరిమళిస్తూ!! పుస్తకానికి ముందు మాట వ్రాసే అదృష్టం నాకు కలగడం భగవత్ సంకల్పమే.

శ్రీ సత్య సాయి సేవా సంస్థలో గత 60 సంవత్సరాలుగా సాయి సేవా కార్యంలో జీవితాన్ని సార్థకం చేసుకున్న, చేసుకుంటున్న, చేసుకోబోతున్న సాయి ఆత్మ బంధువులకు ప్రేమ పూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుకునే అవకాశం ఈ విధంగా నాకు దొరినందుకు ఎంతో సంతోషంగా వుంది.

అవతార పురుషులు భూమి పైకి వచ్చినప్పుడు, తమ అవతార కార్యంలో ఉపయోగ పడే గుంపును తమతో పాటు దివి నుండి భువికి తీసుకుని వస్తారు. ఆ గుంపులోని వారే మన స్వామి బాలచంద్ర, వీరితో నేను 35 ఏళ్ళకు పైగా కలిసి స్వామి వారి సేవ చేసే భాగ్యం కలిగింది.

గ్రామా సేవా మహా యజ్ఞము, HEART ప్రణాళిక (Health, Educare, Awareness, Rural Development, Transfoation), శ్రీ సత్య సాయి గురుకుల సేవా యజ్ఞం, శ్రీ సత్య సాయి సుజల స్రవంతి పథకం వంటి అనేక బృహత్తర కార్యక్రమాలలో ఇతని పాత్ర బహు ప్రశంసనీయం. హైదరాబాద్ బృందంతో చేరి తెలుగు రాష్ట్రాలలో ఎన్నో సేవలు చేసుకున్నాడు. మరెంతో స్వామి అనుగ్రహానికి నోచుకున్నారు.

భగవానుడి కృపా విశేషం చేత సదా స్వామి మార్గంలో నడుస్తూ, జీవితంలో ఎంతో మంది ప్రేమను పొందాడు. స్వామి వారి అనుగ్రహం, మానవతా విలువలు, శిక్షణ, మార్గదర్శనము, అనుభవము మరియు జ్ఞానములు అతనితో 2006లో అభయ ఫౌండేషన్ స్థాపించేలాగా చేశాయి తద్వారా దేశ వ్యాప్తంగా అవసరంలో వుండి, ఆపన్న హస్తం కోసమై ఎదురు చూసే లక్షలాది మందికి విద్య, వైద్య, పర్యావరణ, సాధికారత, ఆధ్యాత్మిక రంగాలలో నిస్వార్థ సేవ కార్యక్రమాలు ఆదర్శవంతంగా నిర్వహిస్తున్నారు.

బాలచంద్ర తనదైన శైలిలో చేసే అద్భుతమైన రచనల ద్వారా సదా మానవ జాతి హితం కోసమై పాటుపడుతుంటారు. ప్రస్తుతం దైవ సంకల్పం చేత, తన జీవితాన్ని, ప్రేమను, పరిమళాన్ని తెలియజేయడానికి, తను ఏ విధంగా సమాజంలో వ్యక్తుల నుండి, శక్తుల నుండి, వ్యవస్థల నుండి, సంస్థల నుండి చివరికి దివ్యత్వం నుండి ప్రభావితం చెందారు అన్నది ఈ పుస్తకం ద్వారా తెలిపే ప్రయత్నం చేశారు.

గత 3 సంవత్సరాలుగా ఈ పుస్తకం కోసమై ఎన్నో రకాలుగా బాలచంద్ర ప్రయత్నం చేస్తున్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా (23.11.2025) స్వామి వారి సన్నిధిలో సమర్పించ బోయే ఈ పుస్తకములో వారిని ప్రభావితం చేసిన విషయాలు మాత్రమే కాకుండా, సాయి కార్యములు ఎలా సాధించ బడుతున్నాయో కూడా అద్భుతంగా వివరించారు. చక్కని తెలుగులో ఎన్నెన్నో విషయాలను కన్నులకు కట్టినట్లుగా వివరించారు.

ఈ సందర్భంగా నేను బాలచంద్ర మిత్రులు మరియు శ్రేయోభిలాషులందరి తరఫునా ఈ సాయి ఆత్మబంధువును ఆశీర్వదిస్తున్నాను. స్వామి వారు ఇతనికి ఆరోగ్యం, ఉల్లాసం మరియు శ్రేయస్సు ప్రసాదించాలని తానెంచుకున్న మార్గంలో ఇలాగే ప్రేమతో ముందుకు తీసుకెళ్లాలని ప్రార్థిస్తున్నాను. ఈ అరుదైన ప్రచురణ అందరి చేత ఆదరించబడి దిగ్విజయం అయ్యేలా స్వామి వారు అనుగ్రహించి ఆశీర్వదించాలి.

ప్రేమతో...

శ్రీనివాసులు హుగ్గహళ్లి
1-11-252/1A-1D/Street No 3
415, Alladin Mansion-B Bloc
Begumpet, Hyderabad-500016. TG
srisathyasaihyd@gmail.com
Mobile : 91 9849754445

Mentor

తను నమ్మిన సేవా సిద్ధాంతం కొరకు జీవితమును త్యాగం చేసాడు

లౌకిక విద్యలు గొప్పతనం అందిస్తాయే కానీ మంచి తనమును చేకూర్చలేవు. హృదయము నుండి ఆవిర్భవించే దయ, ప్రేమ, సహనం, మంచితనం తదితర సద్గుణములు మాత్రమే సేవా భావాన్ని కలిగిస్తాయి. తద్వారానే ప్రేమ ఆవిర్భవిస్తుంది. ప్రేమభావము లేకపోతే సేవ చేయటం సాధ్యం కాదు.

ఇప్పటి యువతలో ఆధ్యాత్మికత లేకపోవడంతో స్వార్థంతో భౌతిక జ్ఞానమునకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనిని కేవలం Information Oriented Knowledge అని చెప్పవచ్చు. కానీ స్వామి దీనితో పాటుగా Transformation Oriented Knowledge కూడా ఉన్నప్పుడే వ్యక్తి మరియు వ్యవస్థ బాగు పడతాయని చెప్పారు.

బాలవికాస్‌లో శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నతమైన భావాలతో ఉంటున్నారు. కానీ, నా బాలవికాస్ విద్యార్థి బాలచంద్ర మాత్రం ఆధ్యాత్మిక విద్యలను మరియు లౌకిక విద్యలను రెండు రెక్కలుగా చేసుకుని మహోన్నతమైన సేవా దృక్పథంతో ప్రవాహంలా సాగిపోతున్నాడు. భగవాన్ సత్యసాయి బాలవికాస్ గురువులు వేసిన విత్తనాలు మొక్కలుగానే నిలచి పోతున్నాయి. బాలచంద్ర బాలవికాస్ విద్యార్థిగా, స్వామి భక్తుడిగా తాను చేస్తున్న సేవలతో ఒక మర్రి వృక్షంలాగా విస్తరించాడు. అతను చేస్తున్న సేవలకు అంతము లేకుండా పోతున్నాయి. సేవనే జీవిత లక్ష్యం చేసుకుని, సేవయే శ్వాసగా అహరహం సేవ కోసం కృషి చేస్తున్నాడు.

అన్ని రంగాలలో ఉన్న వ్యక్తులను కలుస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఉన్నవారి పరిచయాలతో, ఉన్నతమైన వారి సహాయంతో, లేనివారికి నేనున్నానంటూ అభయమిచ్చి ఆదుకుంటున్నాడు. తన జీవితమును మరియు అభయ ఆదర్శములకు ముగ్ధులై, వేల మంది సాయం అందిస్తున్నారు.

2022 సంవత్సరంలో తను రచించిన కంపాస్ పుస్తకం దేశంలోని వేలాది మంది విద్యార్థులకు చక్కటి స్ఫూర్తి నిచ్చేదిగా నిలిచింది. నాకు చాలా సంతోషం కలిగించింది ఏమిటి అంటే, బాలచంద్ర చిన్నారి పిల్లలతో సన్నిహితంగా ఉంటూ వారితో చమత్కారంగా మాట్లాడుతూ, వారిలో ఒక్కడిగా మారి వారి మనోభావాలను గ్రహించి వారి సమస్యలకు చేసిన దిశా నిర్దేశం కంపాస్.

ఈ అశాశ్వతమైన ప్రపంచంలో ప్రతిదీ నశిస్తుంది కానీ ఆదర్శములు ఆశయాలు మాత్రం నశించవు. ఒక వ్యక్తి ఆదర్శమునకు బలి కావచ్చు, కానీ అనంతరము అదే ఆశయం ఆదర్శం కొన్ని వేల మంది మనసులలో ప్రవేశించి ఒక దివ్య కార్యము ఆవిష్కరింప బడుతుంది. ఈ ప్రపంచంలో ఏ ఆశయం కూడా బాధలు యాతనలు అనుభవించకుండా సాధించబడ లేదు. తను నమ్మిన సేవా సిద్ధాంతం కొరకు జీవితమును త్యాగం చేసాడు. తన సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా విలువలతో జీవితాన్ని సాగిస్తున్న బాలచంద్ర లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు.

ఇక, శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష బ్రహ్మోత్సవం సందర్భంగా అందిస్తున్న ఈ పుస్తకం తన జీవిత కథ మాత్రమే కాదు ఆత్మీయుల కథ. ఆత్మీయులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. బాలు హృదయ స్పందన ఈ పుస్తకంలో ప్రతి అక్షరంలో కనిపిస్తుంది.

ఆశీస్సులతో...
జ్యోతి పద్మన్
బాలవికాస్ గురువు
బెంగుళూరు
కర్నాటక

Balachandra is a Guide, Friend and Philosopher for Many!

Sri Balachandra is more than just my younger brother; he is a guide, friend, and philosopher for the modern era. His unwavering devotion to Bhagavan Sri Sathya Sai Baba has been the driving force behind his selfless service to humanity. From a young age, he immersed himself in the teachings of Bhagavan, embracing the principle of 'Service to Human is Service to God. ' Serving Baba's mission for decades throughout his life, he has dedicated himself to the noble cause. I am humbled by his privilege of having personal audience and guidance with Bhagavan and spreading Sai ideas and ideologies at various forums across the country, inspiring with his spellbound sessions.

His dedication to serving the needy knows no bounds. What our family members started as abhaya Foundation in 2006 has now become a nationally reputed NGO, a testament to his dedicated leadership and compassion, with its doors open 24/7 to those in need, regardless of caste, creed, or color. One thing I've observed about him is that he chooses to live a simple and unassuming life, often not even using his initials or qualifications, preferring to remain a common man with an uncommon persona in his selfless service. His remarkable ability to mobilize resources and inspire others has made a significant impact in the lives of the underprivileged.

We, the Sunku & Putta Families, are fortunate to have him as a part of our family. We're delighted to note that he's written articles about a few of our family members as well. This book is a reflection of his heart and his journey of transformation, guided by Bhagavan's blessings. May his selfless service continue to inspire and uplift humanity.

Samastha Loka Sukhino Bhavantu.

CA Narayana Rangaiah Sunku
President, abhaya Foundation &
A Brother among many to Balachandra
Bengaluru,
Karnataka
President@abhayafoundation.org

May this Book not just be read... But, Lived

It is with deep joy and admiration that I pen these lines that is destined to inspire all who encounter it. I was truly delighted when I came to know that Swami Balachandra has chosen to pen down his life journey in the form of an autobiography, a precious gift for the present and future generations. That this book's release coincides with the centenary celebrations of Bhagwan Sri Sathya Sai Baba lends the moment a poetic symmetry, for it is Baba's guiding light that set Swami Balachandra on his journey of compassion and service.

In a world often clouded by indifference, there are rare souls who choose to walk the path of compassion with unwavering conviction. Balachandra is one such soul a visionary, a servant-leader, and a relentless force for good. Swami Balachandra's decision to dedicate his life to societal upliftment, forsaking the comforts of family for a larger mission, exemplifies the principle that greatness is not defined by what one accumulates, but by what one gives. His founding of abhaya FOUNDATION in 2006 was not merely an organizational act; it was the birth of a movement animated by universal values -Truth, Right Conduct, Peace, and Love -rooted in the timeless motto: "Love All, Serve All". Under his leadership, abhaya has become not just an institution, but a sanctuary of hope for needy people with over a million individuals benefiting across 15 states in India during the last two decades.

What sets Swami Balachandra apart is his unwavering inclusivity. His compassion recognizes no boundaries of caste, creed, religion, or region. Every initiative, every outstretched hand, is guided by the singular question: "Who is in need?" He encourages all to follow their faiths with sincerity, celebrating unity in diversity and reinforcing that all spiritual paths ultimately point towards the same truth.

The spirit of selfless service -Seva is the beating heart of his philosophy. In every act, whether it is caring for the sick, uplifting the marginalized, or empowering the voiceless, there is no expectation of reward or recognition. Swami Balachandra's impact, however, transcends numbers; it is lived every day in the values he embodies.

- Humanity with No Borders: His interventions extend to all, focused only on alleviating suffering and bringing dignity to the destitute.
- Selfless Service (Seva): Every gesture of help carries the spirit of "abhaya" fearlessness and kindness in action.

- Purity of Conduct: He models a life shaped by discipline, devotion, and unwavering ethical standards, merging spiritual growth with societal transformation.
- Patriotism: His deep pride in the motherland is a rallying call for all to serve, respect, and uphold the values that bind us as a nation.

This book is more than a chronicle of initiatives and it is a testament to the transformative power of empathy in action. The stories and insights woven through the 100 chapters of this autobiography are not just pages from the past they are beacons for the future. As you read these gems of experience and insight, I would urge you to practice the eternal principles of Shravanam (attentive listening), Mananam (deep reflection), and Nidhidhyasanam (contemplative meditation), so that they may ultimately lead you to Saakshatkaaram (the realization of Truth) and Sath kriya (good work).

I invite each of you to not just read, but to engage with this book to let its wisdom guide and ignite in you the courage to serve, the humility to love, and the resolve to make our world more just and compassionate. May Swami Balachandra's life and message continue to light the way for countless souls now, and in generations yet to come.

Let this book be a mirror to your own compassion, and a map to the kind of world we can create when service becomes our highest calling. May this book not just be read, but lived, so that its spirit spreads far and wide.

With respect and heartfelt wishes,

K V Ramakrishna
Chairman,
abhaya FOUNDATION
Mumbai
Ramakrishna_kv@yahoo.com

ఈ పుస్తకం నిజ మానస ధర్మ పరుల కరములకు చేరాలి

నేను మాట్లాడే వాడిని కాదు, ఏదో ఒకటి వ్రాయగలిగే వాడిని అంతకన్నా కాదు. నాకు ఏమి వ్రాయాలో అర్థం కావడం లేదు. మానవతా విలువలు మరియు జీవిత నైపుణ్యాలే పునాదిగా, ఆత్మవిశ్వాసం, కృతజ్ఞత, క్రమశిక్షణ మరియు కుతూహలమనే నాలుగు స్తంభాల మీద బాలచంద్ర నిర్మించిన అభయ భవనం ఒక అద్భుతం. సమాజం కోసమే జీవించే త్యాగ నిరతిని వివరించడానికి నా వద్ద పదాలు లేవు. బాలచంద్రకు ఆయురారోగ్యాలు, పేదవారికి సేవ చేయడానికి మరెన్నో అవకాశాల ప్రసాదించాలని నేను స్వామిని ప్రార్థిస్తున్నాను. మనసులోని భావాలు మాటల రూపంలో వ్రాయలేను. వ్రాయడానికి ఎంతో సతమతమయ్యాను. ఈ సంఘర్షణలో స్వామి 1974లో చెప్పిన ఈ పద్యం యాదృచ్ఛికంగా విన్నాను. ఈ పద్యము నా హృదయ భావనకు అద్దం పట్టినట్లు తోచింది.

"వెతుకుచున్నాను నేను వెతుకుచునే యున్నాను
వెతుకు చుంటి నాడు నేడు నిజమానస ధర్మపరుని
కొదువలేదు నరులకు నన్నూరు కోట్లు ఉన్నారు
నరుని రూపములే జూచితి నిజ రూపములు గాంచనైతి
బూరగ కాయలు జూచి మామిడియని భ్రమసినట్లు
వెర్రిచెరుకు రూపు చూసి చెరుకని తానమిలినట్లు
స్ఫటిక రాయి రూపుజూచి కలకండని నమిలినట్లు
రూపు చూచి మోసపోకు గుణమే నిజ నరుని రూపము
వెతుకుచున్నాను నేను వెతుకుచునే యున్నాను"

-భగవాన్ శ్రీ సత్య సాయి బాబా

సుమారు అర్ధ శతాబ్దం ముందు స్వామి వారు ఎంతో ఆవేదనతో చెప్పిన మాటలు నాటికి, నేటికి కూడా వర్తిస్తాయి అనుకుంటున్నాను. ఏ నాటికైనా స్వామి వెతుకులాటకు ముగింపు కావలి. అందుకు నీవు, నేను, మనము మనసా వాచా కర్మణా ప్రయత్నం చేస్తూ సాగి పోదాం. ఈ జన్మలో మనలని కలిపిన స్వామి పాదాలకు నమస్కరిస్తూ, ఈ పుస్తకం స్వామి తలచిన నిజ మానస ధర్మ పరుల కరములకు చేరాలని కోరుకుంటున్నాను.



ప్రేమతో...
ఎం. ఉదయ భాస్కర రెడ్డి
సాయి సేవకుడు,
హైదరాబాద్.

He Melts for Those in Need

I first met Balachandra as a trainee in my erstwhile company, NATCO Pharma Ltd. (1996), Hyderabad. He, along with Vasudeva Rao, came as CS trainees, and both of them are my prathama shishyas (first trainees).

During his training, if something went wrong, I would scold and sometimes throw files or other objects. However, Bala and Vasu never took it to heart. Today, they prostrate before me, showing immense gratitude. I was humbled by their behavior, realizing it was a reflection of their upbringing and the values instilled in them by their parents. For the past 30 years, Bala has been wishing me on every Guru Poornima & Teachers Day and I'm touched by his devotion.

During his training, I used to ask him, "When is your marriage?" I was surprised to hear that he was considering remaining a bachelor. He further said, "I want to dedicate my life to serve the deserving and live up to the ideals of Bhagwan Sri Sathya Sai Baba." With his inspiration, I visited Prasanthi Nilayam (2011) along with the team of Abhayans. Although we couldn't get a glimpse of Bhagawan, we were fortunate to witness the impact of his work. From then on, we realized how Bala had developed infrastructure facilities not only in Anantapuram, Andhra Pradesh, but across India and the world.

I'm impressed and pleased to know that Bala established abhaya Foundation in 2006, serving thousands of people and catering to their needs. Every project he undertakes requires money, men, material, machinery, and mindset – everything he mobilizes as a team effort, which always leaves me in awe. I still feel he needs to take care of his health. His dedication to community development, child welfare, old age care, and other initiatives is exemplary. He melts for those in need.

I'm amazed by his energy, enthusiasm, and ability to speak on various topics. He seems to be fueled by a higher purpose, and I wish him all the best in his endeavors. Penning a compilation of his journey through 55 years of life is awesome. Thank you Bala, for giving me the opportunity to write a few lines about you. I hope this book will surely create an impact on every reader.

With Best Regards,
CS M Adinarayana
Former Vice President & CS
NATCO Pharma Ltd.,
Hyderabad.
Telangana.

Bala's Life Exemplifies the Union of Wisdom and Action

There are some journeys that begin in simplicity and grow into greatness.

My association with CS Balachandra spans over three decades: a journey that began in 1995, when I first knew him as a sincere, hardworking, and focused student. Even then, there was a quiet intensity about him, a rare blend of humility and purpose that hinted at the remarkable path he was destined to walk.

Over the years, I have watched Bala transform from a brilliant learner into a reformer, a Swamiji, a Sage, and a Voice of conscience for an entire generation. What moves me most is that his evolution has never been about fame or recognition, but about service — service to humanity, to truth, and to the timeless principles of Dharma.

As the Bhagavad Gita reminds us:

कर्मण्येवाधिकारस्ते मा फलेषु कदाचन।
मा कर्मफलहेतुर्भूर्मा ते सङ्गोऽस्त्वकर्मणि।।

(Bhagavad Gita 2. 47)

"You have the right to perform your duty, but not to the fruits of your actions."

This verse could well describe Bala's life. He has lived it in spirit, dedicating every action to a higher cause, never swayed by results, yet tirelessly committed to his calling.

Personally, he is so special to me, to our family, and to each one of my colleagues in our office. He earned that respect by virtue of unwavering commitment and the passionate work he has been doing for society over the last three decades

In these three decades, Bala has touched thousands of lives across the Telugu states and beyond. His inspiring talks have not only motivated students to achieve success but also reminded them of the deeper purpose of education: to serve, to uplift, and to transform. His work has rekindled the moral and spiritual fabric of society, particularly among the youth who seek direction in a complex world.

As the ancient Sanskrit wisdom beautifully declares:

परोपकाराय पुण्याय पापाय परपीडनम्।।

"Helping others brings virtue; causing pain to others brings sin."

These timeless words, perfectly capture the spirit of Bala's life. His compassionate service through abhaya Home, where he cares for the elderly in their final years, speaks volumes about his devotion to the helpless and forgotten. The women empowerment initiatives of abhaya Foundation rooted in the spirit of Sakti, have brought strength and self-respect to countless women, awakening in them the power to lead independent and dignified lives.

There is a profound yoga in everything he does- a harmony of thought, word, and deed. As the Gita further says:

योगः कर्मसु कौशलम्।। (Bhagavad Gita 2. 50)

"Yoga is excellence in action. "

Bala's life exemplifies the union of wisdom and action. Whether addressing a gathering, comforting an elder, or guiding a young mind, he operates from a space of divine balance, where compassion meets clarity, and devotion meets discipline.

Reading his life story, one cannot help but feel that Bala's journey is not merely a personal odyssey, it is a tapasya, a sacred offering. His story reminds us that spirituality is not withdrawal from life, but deeper participation in it : to serve, to uplift, and to love without condition.

As I reflect on our long association, from those early classroom days to the present moment where he stands as a beacon of hope and transformation. I cherish decades of journey with him and remains so forever. Few people have the strength to translate ideals into action; Bala has done so with grace, humility, and unshakable faith.

May this autobiography serve as a mirror of that extraordinary journey- not just of one man's path, but of what each of us can become when guided by conviction, compassion, and the eternal light of the Self.

With deep reverence and affection,

CS PS Rao

Board Trustee, abhaya Foundation
Corporate Advisor
PSRAU & Associates
Hyderabad,
Telangana

Walking the Path of Love and Service: Balachandra's Story

Dear Readers,

Sai Ram, with loving salutations at the divine Lotus Feet of Bhagawan Sri Sathya Sai Baba, I consider it a privilege to pen a few lines about this book and the remarkable soul behind it, Balachandra. This is a tale of Selfless Love in Action.

I first met him in 1995 during the AP State Youth Meet in Prasanthi Nilayam. Among hundreds of spirited youngsters, one young man stood out – his energy, passion for Bhagawan's message, and natural ability to connect with people left a lasting impression. He was pursuing ACS, but his heart was devoted to spreading Swami's teachings.

As part of the Hyderabad youth group, Balachandra was a divine gift to us from Bhagawan Himself. He was instrumental in various initiatives, including the Sri Sathya Sai Gram Seva Mahayajnam, which was conducted across Andhra Pradesh from 1995 to 2011. His unwavering faith in God and infectious positivity inspired countless young minds. He was also inducted into the Sri Sathya Sai Youth Committee for the state of Andhra Pradesh, where he played a pivotal role in spreading Swami's message (1995)

After collaborative service efforts, we invited him to Hyderabad, hoping his dynamism would invigorate our youth group. To our delight, he accepted and stayed with us for nearly five years, becoming part of our family and seva journey. During those years, Balachandra shared with my wife, Smt. Ganga Pidatala, his dream of founding an NGO to serve the needy. True to his word, he established the abhaya Foundation, a beacon of service that uplifts countless lives.

Balachandra's seva is not occasional; it's a way of life. His acts of kindness flow with quiet intensity and unwavering commitment, inspiring others to serve. He has imbibed Bhagawan Sri Sathya Sai Baba's teachings into his being, and his life exemplifies Swami's message: "Love All, Serve All."

This book is a real-life account of a young man who dared to dream and devoted himself to a life of purpose. It carries the wisdom of Bhagawan Sri Sathya Sai Baba, distilled through years of experience, reflection, and service. I believe this work is a must-read for anyone seeking clarity, inspiration, or direction in life.

As we celebrate the centenary of Bhagawan's advent, this book stands as a heartfelt tribute – an offering of gratitude from a devotee who has walked the path with sincerity and love. May Swami bless Balachandra with continued health, joy, and strength to serve. And may every reader be touched by the light of truth, love, and service.

With love and salutations,

Dr. Gopi Krishna Pidatala
CEO, Vista Imaging and Medical Centre
National Team Member –
Sri Sathya Sai Seva Organisations, India
gopipidatala@gmail.com
M: 9550190055

Please Remain Unmistakably You!

To introduce my uncle is to speak about a life that chose love over comfort, service over applause, and perseverance over every pressure that might have persuaded a lesser will to stop. This book chronicles his cherished association with Bhagawan Sri Sathya Sai Baba; for me, it also chronicles the quiet making of a man who became my first teacher in what devotion looks like when it is lived, not declared.

Years ago, I wrote to him from the heart and tried to name what everyone feels in his presence: that the most remarkable thing about him is simply him -his unshaken spirit for service. I told him that many would have yielded to money, fame, or luxury; he did not. Many would have paused under strain; he would not. He carried a mission for years without expectation, without transaction, and with the gentlest smile. I keep those lines close because they remain true: people love him most because he is, unfailingly, himself.

What did I learn from watching this? That joy is not a prize life hands out when circumstances behave; it is a discipline born of faith. That leadership does not thunder; it softens, includes, and lifts. That the highest worship is work done with a clean heart. When challenges came and they did, often he answered them with patience, clarity, and kindness. He showed me that "service" is not a project; it is a posture. Under his example, I learnt to keep smiling when the day is heavy, to keep giving when resources seem thin, and to keep trusting when the path is not obvious.

Readers will find in these pages moments with Sri Sathya Sai Baba that are intimate and instructive glimpses of grace that, in my uncle's keeping, turned into action. He never sermonised; he simply organised love into meals, medicines, education, and dignity. He made devotion practical. If divinity were to wear a human face, I have often thought it would look like the compassion he practises unassumingly every day.

His energy seems inexhaustible, his affection unqualified, his commitment unbargained. I know what it takes to sustain an organisation and to keep hearts aligned to its purpose; he makes that labour look effortless, not because it is easy, but because he meets it with a smile that says, "We are here to serve." That smile has lifted me through my own uncertain hours more times than I can count.

This book is therefore more than a remembrance; it is an invitation. It invites us to consider how faith can be steady without being stubborn, how humility can be strong without being loud, and how service seva can be both our sadhana and our solution. If you let it, my uncle's journey will not only inform you; it will gently rearrange your priorities. It will leave you lighter, braver, and more willing to love.

Uncle, if I may leave one line within these covers for you: please remain unmistakably you. You are a jewel rare in any age and the world is kinder because you refuse to be anything but yourself.

With love, reverence, and pride...

S. Lalitha Lahari,
B.Com., LL.B.,
Proddaturu,
Andhra Pradesh.
laharisomisetty@gmail.com

శ్రీ సత్యసాయి బాబావారు తన సైనికుడిని తయారు చేసుకున్నారు

మన భారత దేశంలో ఇతరుల కష్టాలను చూసి కరిగిపోయే మనస్తత్వం మన జీవన విధానంలోనే మమేకమై ఉంటుంది. కానీ ఈనాటి ఈ ఆధునిక ప్రపంచంలో మానవుని సహజ గుణాలు అయిన జాలి, దయ, కరుణ, సాయం చేసే మనస్తత్వం క్రమక్రమంగా సన్నగిల్లుతున్నాయి.

మనం జీవితం యొక్క ఔన్నత్యాన్ని గుర్తించి, సాధనలో ముందుకు వెళుతున్నామా లేదా అని ప్రశ్నించుకుంటే తప్పక సందేహం కలుగుతుంది. ఈ పోటీ ప్రపంచంలో ఉన్న దానితో సంతృప్తి లేకుండా, లేని దానికోసం ఆరాటపడటంలోనే మానవ జీవితం ముగిసి పోతున్నది.

సోదరుడు బాలచంద్రతో దాదాపు 40 సంవత్సరాల అనుబంధం ఉంది. మేము డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఒకే హాస్టల్లో ఉండే వారము. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి పట్ల, ముఖ్యంగా సేవల పట్ల ఎంతో ఆసక్తిని కనపరిచేవాడు. ఆ వయసు నుండే బాలచంద్ర ఆలోచన విధానం మరొక రకంగా ఉండేది. సమాజంలోని అభాగ్యులను, అన్నార్తులను చూసి చలించిపోయేవాడు.

బాలచంద్ర ఉన్నత చదువులు అభ్యసిస్తున్నా, శ్రీ సత్య సాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న సేవల పట్ల తీవ్రమైన తపన కలిగి ఉండేవాడు. ఒక సాధారణ కార్యకర్తగా తన ఆధ్యాత్మిక జీవన ప్రయాణం మొదలిడి, ఈనాడు కొన్ని లక్షల మందికి మార్గదర్శకుడు అయ్యాడు. లక్షల జీతాన్ని తృణప్రాయంగా భావించి సమాజ సేవనే తన జీవిత లక్ష్యంగా చేసుకున్నాడు. ఇది ఒక్క రోజులో సంభవించిన పరిణామం కాదు. దీని వెనుక బాలచంద్ర తపన, కార్యాచరణ, తీవ్రమైన సాధన ఉన్నాయి.

ఇతరుల కష్టాలని చూసి చలించిపోయి వారికి ఏదో విధంగా సహాయం అందించే గుణం చాలామందిలో ఉంటుంది. కానీ కొన్ని పరిధులు దాటి మనము సాయం చేయలేము. కానీ బాలచంద్ర విషయం వేరు, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఏదో విధంగా సహాయం అందించకుండా ఉండలేడు.

నా లాంటివారు విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఉద్యోగాలలో స్థిరపడి, వివాహం చేసుకుని కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ సేవకై కొంత సమయం మాత్రమే కేటాయించగలుగుతున్నాము. కానీ బాలచంద్ర తన పూర్తి జీవితాన్ని సమాజ సేవ కోసం అంకితం చేశాడు. మనం సేవా సంస్థల్లో సేవలు చేస్తున్నప్పుడు సంస్థాగత నియమ నిబంధనలు పాటిస్తూ కొన్ని అత్యవసర సేవలు చేయలేకపోతున్నాం. ఈ పరిస్థితిని గమనించే సోదరుడు బాలచంద్ర అభయ ఫౌండేషన్‌ని ప్రారంభించి ఎన్నో రంగాలలో తన సేవలను విస్తృత పరిచాడు.

మంచి కంఠము, కవిత్వము, పద్యము, గద్యము, హావ భావములతో ఏ వయసు వారినైనా ఆకట్టుకునే ఉపన్యాసములతో, సమయస్ఫూర్తితో, విచక్షణతో, హాస్యోక్తులతో, సందర్భోచితంగా మాట్లాడుతూ అవతార పురుషుల, మహానుభావుల, మఠాధిపతుల, పీఠాధిపతుల, పిల్లల, పెద్దల, వృద్ధుల, ధనవంతుల, పేదవారల, విద్యావంతుల, నిరక్షరాస్యుల ప్రేమకు పాత్రుడు కాగలిగాడు.

వారందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు.

ఈ రోజున అభయ ఫౌండేషన్ సేవలు గ్రామాలు, పట్టణాలు, నగరాలు, రాష్ట్రాలు చివరికి దేశం ఎల్లలు దాటి విదేశాలకు కూడా విస్తరించాయి అంటే దీని వెనుక బాలచంద్ర సత్సంకల్పం ఎంత ఉందో అర్థం అవుతుంది.

అయినా సరే సమాజం కోసం ఇంకా ఏదో చేయాలని ప్రతినిత్యం అతను పడే ఆరాటం చూస్తే ఈ రోజులలో ఇంత ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వారు ఉన్నారా అని అనిపిస్తుంది. నిరాడంబర జీవితం, నిర్మలమైన మనస్తత్వం, కల్మషం లేని మాటలు, కరుణతో కూడిన చేతలు, దైవంపై భక్తి, సేవకై ఆసక్తి, కష్టాలలో ఉన్నవారి ఆనందం కోసం ఆరాటపడే అనురక్తి వంటి సుగుణాలతో ఎన్నో లక్షల మందికి తను స్వంత కుటుంబ సభ్యుడిగా మన గలుగుతున్నాడు.

ఈ పుస్తకం చదువుతుంటే, ప్రతి వ్యాసం ఎన్నో మధురానుభూతులను కలుగజేస్తుంది. ఇందులో గత 55 ఏళ్లుగా బాలచంద్ర కథ ఉంది అనడం కన్నా కూడా, వందల మంది ఆత్మీయులు ఏ విధంగా ఇతనిని ప్రభావితం చేశారు అన్న విషయాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. స్వామి తన సైనికుడిని ఎలా తయారు చేసుకున్నారు, దేశం కోసమై ఇతనిని తీర్చిదిద్దారు అన్నది స్పష్టంగా తెలుస్తుంది.

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శతవర్ష బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా సాయి సన్నిధిలో సమర్పించబడే ఈ పుస్తకానికి స్వామి వారు తమ ఆశీస్సులు ప్రసాదించి వర్తమాన భవిష్య తరాలు బాలచంద్ర నుండి స్ఫూర్తిని పొందేలా చేయాలని ప్రార్థిస్తున్నాను.

ప్రేమతో... ప్రార్థనలతో!
టి. మధుసూదన రావు, B.Sc.,
LIC, హిందూపురం,
బాలవికాస్ గురువు,
శ్రీ సత్య సాయి సేవా సంస్థలు,
ఆంధ్రప్రదేశ్.

రెండు రాత్రులవుతే కేవలం రెండు గంటలు కూడా పడుకోకుండా చదివాను!

ఒక తెలుగు ఉపాధ్యాయునిగా, సాహిత్యాభిలాష ఉన్న వర్థమాన కవిగా నేను కొంతవరకు ఇతర పుస్తకాలను బాగానే చదివాను. వాటన్నిటిలో కవి గాంభీర్యత, ఊహ, అద్భుతమైన పదజాలం, అలంకారాలు, ఛందస్సు... ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో కవి ఒక్కో విధంగా తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు అందించారు. కానీ స్వామి బాలచంద్ర వ్రాసిన పుస్తకం అన్నిటికీ విభిన్నమైనదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భక్తి మనిషిని ఏవిధంగా పరిపూర్ణుడిని చేస్తుంది, సేవ మనిషిని ఏవిధంగా తీర్చిదిద్దుతుంది అనడానికి తార్కాణం ఈ పుస్తకం. ఈ పుస్తకం చదువుతుంటే ఎన్నోసార్లు కళ్ళు చెమర్చాయి. కారణం ఏంటంటే ఆ సాయి భగవానుడిని దర్శించాలి, స్పర్శించాలి, మాట్లాడాలి అన్న స్వామి బాలచంద్ర తపన చూస్తే నాస్తికులకైనా కళ్ళు చెమర్చక తప్పదు. నేను పుస్తకం చదువుతూ నా చుట్టుపక్కల ఉన్న నాస్తికులకు చూపించాలి అని పుస్తకంలోని హృదయం కదిలించే కొన్ని పేజీలను స్క్రీన్ షాట్ తీసి పెట్టాను. భక్తి అంటే ఇది అని చూపించే ప్రయత్నం చేసాను.

నేను సాయిబాబా స్వామికి దివ్యత్వం ఆపాదించడానికి అంగీకరించే వాణ్ణి కాదు. కానీ స్వామి బాలచంద్రుడి మనో ఫలకం నుండి జాలువారిన భావనలు, స్వామిని కళ్ళకు కట్టినట్లు చూపించే ఈ పుస్తకం చదివాక, జనాలకు మేలు చేయడం కొరకు, ఆపదలో ఉన్న వారిని ఆదుకొనే ఇలాంటి సాయి సైనికులను వేలాది మందిని తయారు చేసి, సమాజ సేవా మార్గాన్ని చూపించి, ఆ మార్గంలో నడిపించి, దీనజనులకు బాసటగా నిల్చేలా చేసిన సత్య సాయి బాబాను దేవుడే అనక తప్పదు.

ఈ పుస్తకం మొత్తంలో ఎక్కడా ఊహలు, కల్పనలు లేవు. కేవలం జరిగింది, చేసింది, గుర్తొచ్చింది గుర్తొచ్చినట్లు అలా వ్రాసుకుంటూ పోయారు. నాకు పుస్తకం మొత్తంలో బాబా ప్రేమను పొందాలి అన్న స్వామి బాలచంద్ర తపన ఆశ్చర్యచకితుడిని చేసింది.

వందలాది పేజీల పుస్తకాన్ని ప్రూఫ్ రీడింగ్ చేయమని స్వామిజీ చెప్పగానే అసౌకర్యానికి లోనయ్యాను. ఇది పెద్ద పనిగా ఇరిటేషన్ కూడా కలిగింది. దానికి కారణం నా వ్యక్తిగత సమస్యలు కావచ్చు, పని ఒత్తిడులు కావచ్చు. కానీ ఓ ఇరవై పేజీలు చదువుతూ పోయాక, నా మనసు పూర్తిగా మారిపోయింది. రెండు రాత్రులైతే కేవలం రెండు గంటలు కూడా పడుకోకుండా చదవడం, అచ్చుతప్పులు సరిదిద్దడంలో ఉండిపోయాను. ఈ పుస్తకము గురించి నాకు కలిగిన భావనలు మొత్తం వ్రాయాలంటే మళ్ళీ ఇంకో పుస్తకం అవ్వడం ఖాయం.

సూటిగా ఒకే మాటలో చెప్పాలంటే, మనిషిని సన్మార్గంలో నడపడానికి "సేవ –భక్తి"ని మించిన సాధనం లేదు. నేటి కాలంలో వచ్చిన సైకలాజికల్ కౌన్సిలింగ్‌లు ఇవన్నీ వృధా, మనసును దేవుడికి అర్పణ చేయడం, నిస్వార్థంగా సేవలు చేయడం జరిగితే నేటి సమాజంలో కావచ్చు, కుటుంబాలలో కావచ్చు అన్నిటిలో ఉన్న సకల రుగ్మతలు, వికృతాలు వాటంతట అవే సరిచేయ బడతాయి అని

స్వామి బాలచంద్ర జీవిత ప్రస్థానం చదివిన వాళ్ళు అంగీకరించక తప్పదు.

నేను ఎవ్వరి కాళ్లు మొక్కను. అహంకారమా అని ప్రశ్నిస్తే కావచ్చు అంటాను. ఎక్కడెక్కడో విరాళాలు తెచ్చి ఏదో మంచి పనులు చేస్తున్నంత మాత్రాన ఈయన కాళ్ళు మొక్కడమేంటి అని అనుకున్నాను. కానీ వీరి జీవిత యాత్ర చదివాక, బాలచంద్రుడు భక్తితో తనను తాను సమాజ సేవకు ఎలా అర్పణ చేసుకున్నాడో తెలుసుకున్న తర్వాత, సమాజం కొరకు తన వ్యక్తిగత జీవితాన్ని తృణప్రాయంగా ఎలా వదిలేసాడో తెలుసుకున్న తరవాత స్వామి బాలచంద్ర కాళ్ళకు నమస్కరించడం కరెక్టేనేమో అంటూ ముగిస్తున్నాను.

శుభాకాంక్షలతో

అనంత దత్తాత్రేయ

M.A., B.Ed.,
ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు
షాద్‌నగర్, తెలంగాణ

బాబాగారి అడుగుజాడల్లో నడుస్తున్న గురూజీని చూస్తే ఆ సత్యసాయిని చూస్తున్నట్లుంది

బాలచంద్ర గురూజీ స్వీయ జీవిత అనుభవాల పుస్తకాన్ని అచ్చు తప్పులు సరిదిద్దడం కోసం నేను చదివాను. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప ఈ అవకాశం నాకు రాదు. ఇది ఆ సత్యసాయి కృపా విశేషం అనుకుంటాను.

నేను ఎంతోమంది వ్యక్తులను చూసాను, వాళ్లందరి కంటే ఎంతో గొప్ప వ్యక్తి గురూజీ. నేను లింగంపల్లి పాఠశాలలో పని చేస్తున్నప్పుడు ఒకసారి మా పాఠశాలకు విచ్చేసి, అక్కడి అసౌకర్యాలను చూసి చలించి పోయి... గురూజీ పాఠశాలకు 10 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. అప్పుడు నేను అనుకున్నాను ఆ! ఏముంది!! అందరు ఇలానే వస్తారు... అది ఇస్తాం, ఇది ఇస్తామని చెప్తారు. చివరకు ఏది ఇవ్వరు అని నా మనసులో అనుకున్నా. అందుకు భిన్నంగా జరిగింది. వారు రావడం, విరాళం నిజంగానే అందించడం వల్ల పాఠశాల రూపు రేఖలు మారిపోయాయి.

వారు మా పాఠశాలలో అడుగు పెట్టినప్పటి నుండి ఆ పాఠశాల స్థితి గతులు ఎంతో అభివృద్ధి చెందాయి. గురూజీ చెప్పి, చేసి చూపించారు. అప్పటి నుండి వారి మీద ఒక దైవభక్తి, గురుభక్తి ఏర్పడింది. ఎందుకో తెలియదు మిమ్మల్ని "గురూజీ" అని పిలవాలని ఉంది అని వారికి చెప్పాను. అందుకు వారు సరే అన్నారు. నేను పుట్టపర్తిలో శ్రీ సత్య సాయిబాబా గారు ఉన్నప్పుడు ఒక మూడు సార్లు వెళ్ళాను. చాలా దూరం నుండి చూసాను. స్వామిని దగ్గరి నుంచి దర్శించలేక పోయాను అని చాలా బాధపడ్డాను.

ఇప్పుడు నాకు ఆ బాధ లేదు. సత్య సాయి బాబా గారి అడుగుజాడల్లో నడుస్తున్న బాలచంద్ర గురూజీని చూస్తే ఆ సత్యసాయిని చూస్తున్నట్లుగా ఉంది. అందుకేనేమో వారు వ్రాసిన పుస్తకం తప్పులు సరిదిద్దే అవకాశం నాకు లభించిందని అనుకుంటున్నాను.

నిజంగా గురూజీ ఒక మహా మనిషి. పుస్తకంలో వారి స్పృశించిన ప్రతి అంశం జీవితంలో ఆయన చేసిన సేవకు నిదర్శనం. ఎలాంటి లాభం ఆశించకుండా సమాజానికి సేవ చేయాలన్న ఆయన తపన ఎంతో అమోఘం. "ఎంత ఎదిగిన, అంత ఒదిగి ఉండాలి" అనే దానికి నిలువెత్తు నిదర్శనం గురూజీ.

ప్రస్తుత కాలంలో, చేసిన మేలును మరిచిపోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ బాలచంద్ర గురూజీ వారి గురువులను, వారికి సహాయం చేసిన వారిని గుర్తుంచుకున్నారంటే ఇది వారి వ్యక్తిత్వానికి నిదర్శనం.

గురూజీ వ్రాసిన ఈ పుస్తకం చదవడం వల్ల మనం కష్టపడే తత్వం గురించి, ఎన్ని కష్టాలు, ఆటంకాలు వచ్చినా మనం అనుకున్న లక్ష్యం వైపు ఎలా పయనించాలి, దైవానుగ్రహం మనము చేసే మంచి పని మీద ఏ విధంగా ఉంటుంది, సమాజానికి మన వంతు సహాయం ఏ విధంగా అందించాలి, మనకున్న దాంట్లో నలుగురికి ఎలా సహాయపడాలి... ఇలా అనేక విషయాలు మనందరికీ

తెలుస్తాయి. ఈ పుస్తకం చదివితే మనలో ఉన్న అజ్ఞానాంధకారం తొలగి పోతుంది. గురూజీ తన జీవితంలో జరిగిన ప్రతి విషయాన్ని, తప్పొప్పులను చెప్తూ తను నేర్చుకున్న జీవిత సత్యాలను తెలిపారు. ఈ పుస్తకాన్ని చదివిన నేను చెబితే మీకు అర్థం కాదు. తినబోతు రుచులెందుకు? మనమందరం కూడా ఈ పుస్తకాన్ని చదివి అందులోని అంతరార్థాన్ని తెలుసుకొని మసులుకుందాం. ఈ పుస్తకం కోసం నేను సైతం అన్నట్టుగా... కూసింత సేవ చేసినందుకు కృతజ్ఞతలతో!

ధన్యవాదాలు,

రజనీ

MA., B.Ed.,

తెలుగు ఉపాధ్యాయురాలు

TSRS & JC,

బోరబండ, తెలంగాణ

విషయసూచిక

1	మాతృశ్రీ ఈశ్వరమ్మ – ఈశ్వరునికి దారి చూపింది	1
2	నాగజ్యోతి – నా బాలవికాస్ గురువు!!	5
3	తల్లిదండ్రులే ప్రేరణ ప్రదాతలు	10
4	చిన్నప్పటి చురుకుదనం... మాయమయింది బెరుకుదనం	12
5.	కొనగంటి చూపుతో... కనుగొంటి స్వామిని	15
6.	వేయి తల్లుల ప్రేమను రుచి చూసిన సమయం	18
7.	సాయి షష్టి పూర్తి... సభ్యులందరిలో స్ఫూర్తి	22
8.	పర్తి వాసుని షష్టి పూర్తి సేవలు	27
9.	శ్రీ సత్య సాయి విద్యా విధానం	31
10.	డబ్బులు సంపాదించచ్చు... పేరు పోతే సంపాదించలేము	36
11.	వైఫల్యాలే విజయానికి మెట్లు!	40
12.	సత్య సాయి భజన మండలి – కల్లూరు (RS)	44
13.	సాయి సిద్ధాంత వ్యాప్తికై ప్రయాణం	46
14.	సాయి కార్య మార్గదర్శి – సుజాతా సారథి	49
15.	ప్రప్రథమ ప్రశాంతి సేవలు	53
16.	Decoration - No End for Imagination!	56
17.	ఏ కళాశాల అయినా స్వామి కళాశాలే!	59
18.	అనంతపురం వైశ్యా హాస్టల్... నాయకత్వానికి నాంది!	61
19.	నాగభూషణం సాయి సంస్థకు నిజ భూషణం!	66
20.	మహిమల మంజూషం – శ్రీ సత్యసాయి మహావతార దర్శనం	69
21.	మాధవుని దరికి చేర్చిన మాన్యులు డా. నలబాల అంజనయ్య	74
22.	మధురమైన హితుడు మధుసూదనరావు	79
23.	అందరి వాడు... అనిల్ కుమార్!	82
24.	No Ration for Decoration!	85
25.	సాయి సంస్థల రజతోత్సవం – జీవితానికి రజత ప్రాకారం!	90
26.	విశ్వ విభునికి వినయముతో విద్యార్థుల సమర్పణ	94
27.	అక్కున చేర్చుకున్నది అక్కయ్య	98

28.	చెన్నై – సేవకు భాష అడ్డం కాదు	102
29.	నా సంరక్షకులు శైలజా నారాయణ	105
30.	కర్ణాటక – స్వీయ సామర్థ్య నిర్వహణ వేదిక	109
31.	కర్ణాటక – సాయి జగన్నాటకంలో రక్తి కట్టించిన పాత్రలు	112
32.	బెంగళూరులో అద్భుతమైన మహిళామ తల్లులు	116
33.	స్వామి పాదాల చెంత 70 కవిత కుసుమాలు	120
34.	హృదయ తాపం – సహస్ర రూపా సాయీశా గీతం	125
35.	రజతోత్సవ బహుమతి – హైదరాబాద్ యూత్	129
36.	స్వామే ప్రకటించిన సత్య సాయి యువజన సంఘం	133
37.	"ఏయ్! సన్యాసి!!" అంటూ స్వామి నన్ను చూశారు	136
38.	పడింది కుడి వైపు – విరిగింది ఎడమ చెయ్యి!?	140
39.	ప్రథమ యువజన సమ్మేళనం (1995)	143
40.	నాకంటూ దిక్కు స్వామే అనుకున్నా... NATCOలో పడేసాడు!!	147
41.	ఉదయన్న కాదు... అందరి హృదయన్న!	151
42.	గోపి కృష్ణ – హ్యాపీ కృష్ణ	156
43.	గ్రామ సేవయే – సాయి సేవ అలా మొదలైంది!	160
44.	గ్రామ సేవా శంఖారావం	164
45.	శివం వద్ద నుండి గ్రామ సేవా యాత్రకు శ్రీకారం	169
46.	భాగ్యనగర సాయి యువత బహుముఖ ప్రజ్ఞ	174
47.	పల్లకితో పర్తి వాసుని సన్నిధికి	179
48.	భాగ్యనగర యువత భవిష్యత్తును భగవంతుడు నిర్వచించిన రోజు	184
49.	గ్రామసేవయే – రామసేవ	188
50.	GRAMA SEVA – పరమార్థం!	195
51.	YC.. Yearning to see Swami in Seva	199
52.	YC.. The Youth Co-Ordinator	203
53.	దాతృత్వం జీవితాన్ని పరిమళింప చేసింది	207
54.	ఉపనయనము – సేవకు దగ్గరగా పయనం	211
55.	ప్రజలను ప్రభువు దగ్గరికి చేర్చిన పల్లకి	215
56.	మార్పు రావాలి – అందరిని మార్చేసిన వీధి నాటకం	220
57.	డా. నర్సింగరావు – ఐక్యతకు కారణం!	225
58.	H.E.A.R.T in Grama Seva	230
59.	Sai Go - Going in Sai Way!	235
60.	మాతృశ్రీ సరస్వతమ్మ – హైదరాబాద్‌లో యశోదమ్మ	240
61.	సాయి సందేశ వ్యాప్తి – హాయి గొలిపిన ప్రాప్తి	244

62. లేఖలే దివ్యత్వమును చేర్చిన సోపానాలు 248
63. శ్రీనివాసులు – సాయి సేవకుల ఆత్మ బంధువు 254
64. స్వామి స్వయంగా తీర్చిదిద్దిన జీవితం 259
65. ఇంటర్వ్యూ కాదు – ఇన్నర్ వ్యూ 264
66. ఏకాంతంలో... దివ్యస్మృతులు 269
67. ఇంటర్వ్యూ గది... జీవిత పాఠాలు నేర్పే నెలవు 273
68. ప్రశాంతి సేవలు – ప్రణయ గాథలు 278
69. స్వామి ప్రేమయే సేవకు ప్రత్యక్ష సాక్ష్యం 283
70. హైదరాబాద్ యూత్‌కి స్వామి దివ్యదేశాలు 292
71. వి. శ్రీనివాసన్ – స్వామిని చేరువ చేసిన వారధి 298
72. ఐకమత్యమే దివ్యత్వమునకు మార్గము 304
73. గజ్వేల్ ప్రాంతంలో – గ్రామ సేవా యజ్ఞము 309
74. ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం 313
75. స్వామి దయతో హృదయం పొంగి పాటలు పల్లవించాయి! 317
76. పాలమూరు యువత పరిమితులు లేని అలంకారాలు 323
77. నా ప్రసంగాలకు ప్రేరణ శ్రీ సత్య సాయి! 330
78. సంగీత విభావరులు స్వామి మదిని దోచిన పద ప్రయోగములు 335
79. లక్షలా... లక్ష్యాలా!! 340
80. సత్యం వద... ధర్మం చర : కె.వి. రామకృష్ణ 346
81. జగన్నాటక సూత్రధారి సన్నిధిలో, నాటకాలు – పాత్రధారులు 351
82. యువకులతో సంస్థ మమేకమైన మధుర ఘట్టం 355
83. సేవకులను నాయకులుగా మార్చిన సహస్ర గ్రామ సేవా యజ్ఞము 359
84. 20 అక్టోబర్ 2003 స్వామి వారి చారిత్రాత్మక దివ్యోపన్యాసం 363
85. హైదరాబాద్ యూత్‌కు అనుగ్రహం శ్రీ సత్య సాయి గ్రామ సేవా ట్రస్ట్ 366
86. అజ్ఞాన చీకటి తొలగించిన చికోటి విశ్వనాథం 370
87. Re-Programming Lives 374
88. ఉన్నత విద్యతో ఉత్తమ యువకులు 379
89. విక్టోరియా హాస్టల్ – సంస్కార జ్యోతి 382
90. శ్రీ సత్య సాయి గురుకుల సేవా యజ్ఞం – 2004 386
91. శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్ – SaiLent Revolution 391
92. సాయి సైనికులే కాదు ఆత్మ బంధువులు కూడా 395
93. సాయి సింహం – మేడ నరసింహులు 400
94. భగవానుడే నా భావ వ్యక్తీకరణకు నేపథ్యం 404
95. అభయ – భయమును తొలగించే భరోసా 409

96. బాలచంద్ర నీకు ఎంత వీలైతే అంత కట్టేసేయ్!! 413
97 abhaya Mission to Serve with H.E.A.R.T 417
98. దశాబ్దము చేసిన దివ్య దిశా నిర్దేశము 422
99. స్వామిని లోనే ప్రతిష్టించాల్సిన తరుణం 429
100. కైలాస నాథుడి అనుగ్రహ చిహ్నం అభయ ఆనంద నిలయం 433
101. భారత దర్శన్... ఆత్మ దర్శనాభిలాషతో! 438
102. అన్ని వదిలిన నన్ను అడవికి చేర్చిన వానప్రస్థం 444
103. Reached forest for the rest of life 451
104. కరోనా నన్ను సాయి మాత కరుణ పొందేలా చేసింది 454
105. ఆచార్యులే అనుగ్రహించి పంచిన అవ్యాజ ప్రేమ 460
106. స్వచ్ఛంధ సంస్థలు... స్వీయ సంస్కరణ కేంద్రాలు 467
107. ఆ నలుగురు! ఎవరు? 474
108. సాయి మార్గంలో! జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!! 480

సాయి మార్గంలో!

జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!!



అందరి హృదయాలలో నివసించి నడిపించే నడయాడు దేవుడు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య శ్రీచరణ సన్నిధికి శతకోటి నమస్సుమాంజలులు అర్పిస్తూ స్వామి వారి శతవర్ష బ్రహ్మోత్సవం సందర్భంగా. విశ్వ వ్యాప్తముగా ఉన్న వారి భక్తులు, ప్రేమికులు, సాధకులు, సేవకులు బాబా వారి దివ్య నామాన్ని తమ హృదయాలలో నింపుకొని ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిస్తాను" అన్నట్టుగా బాబా వారి శత వర్ష బ్రహ్మోత్సవ సందర్భంగా వారి భక్తుడిగా వ్యక్తిగతంగా నేను ఏం చేయొచ్చు అని ఆలోచించినప్పుడు...

నా హృదయంలో జన్మించిన సంకల్పము, స్వామి వారి దివ్య సన్నిధిలో నా స్వీయ అనుభవాలను 108 వ్యాస పుష్పాలుగా మార్చి వారికి మాలగా సమర్పించాలని అనిపించింది. అందుకు రూపమే "సాయి మార్గంలో! జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!!" అనే ఈ పుస్తకం. 2025 నవంబర్ 23 స్వామివారి శత వర్ష బ్రహ్మోత్సవ సందర్భంగా నా అనుభవాలను మాలగా కూర్చాలని, తీర్చాలని, వారి యొక్క సన్నిధిలోకి చేర్చాలని ఈ ప్రయత్నం.

ప్రేమతో, ప్రార్థనలతో,

బాలచంద్ర

1

మాతృశ్రీ ఈశ్వరమ్మ - ఈశ్వరునికి దారి చూపింది

ఈశ్వరాంబా ప్రియతనయా సాయి నారాయణా...
సాయినారాయణా... సత్య నారాయణా
కలియుగమే అవతార్ లియే!
కణ్ కణ్‌మే తేరా నామ్ ఓ సాయి!

చాలా కాలం క్రితం వేద పండితులు రామశర్మ గారు మరియు స్వామి భక్తులు కస్తూరి గారు, స్వామి వారి మాతృమూర్తి ఈశ్వరమ్మ గారు ప్రశాంతి నిలయ ప్రాంగణంలో.. స్వామి వారితో ముచ్చటలాడుతున్న సమయంలో రామశర్మ గారు అడిగారట, "స్వామి! మీ యొక్క అవతారము ప్రసవమా లేక ప్రవేశమా? అని". అప్పుడు, స్వామి వారు అక్కడే కూర్చున్న వారి తల్లి శ్రీమతి ఈశ్వరమ్మ గారిని 'అమ్మ! నువ్వు చెప్పమ్మ,' అని అడిగితే... "నాయనా నేను ఆ రోజుల్లో నీళ్లకై బావి దగ్గరికి వెళ్ళి, బిందె తీసుకొని నీళ్లు తోడుతున్నప్పుడు... సూర్య తేజముతో కూడిన ఒక బంతి లాంటి ఆకారం వచ్చి నా కడుపులో చేరినట్టుగా నేను భ్రమించాను. దాని తర్వాత నేను మూర్ఛపోయాను, ఆ తర్వాత తెలిసింది నేను నెల తప్పాను; స్వామి వారు నా కడుపులో జన్మించారు అని చెప్పారు. అప్పుడు స్వామి "చూడు బంగారు ఇది అవతారము, ప్రసవం కాదు... ప్రవేశమే" అని చెప్పారు.

అవతరించుట అనుటలో అర్థమేమి?
ప్రజలపై ప్రీతి వాత్సల్యపరత తోడి
దైవమే వారి స్థాయికి దిగివచ్చు భువికి
జీవ ప్రజ్ఞతో పాటు దైవ ప్రజ్ఞ

నేను భక్తుల కోసం అవతరించి దివి నుండి దిగి భువికి వచ్చాను అని స్వామి ఎన్నో సార్లు చెప్పారు. ఈ విషయము నేను ఎందుకు చెప్తున్నాను అంటే ఈశ్వరమ్మగారు స్వామి అవతరణ వెనుక కారణాన్ని వివరించినట్లుగానే, నాకు కూడా స్వామితో పరిచయం మరియు జీవిత కాలపు అనుభవం మాతృమూర్తి ఈశ్వరమ్మ ద్వారానే పరిచయమైంది.

బహుశా అది నాకు 11 లేదా 12 ఏళ్ల వయస్సులో... 1980 సంవత్సరంలో జరిగిందను కుంటాను. ఒక్కసారిగా అనూహ్యంగా నాకు ఒక అద్భుతమైన అనుభవం కలిగింది, మాతృశ్రీ ఈశ్వరమ్మతో పరిచయం అయ్యే అవకాశం నాకు కలిగింది. ఇది ఎలా జరిగిందో మీకు చెబుతాను. మా ఇంటి దగ్గర 'చింతకాయల చెట్టు' అనే పేరుతో ప్రసిద్ధి గాంచిన ఒక చింత చెట్ల తోపు ఉండేది. ఈ తోపు అంతా కూడా కాస్త నిర్మానుష్యంగా ఉంటూ, చెట్ల క్రింద పెద్ద మైదానం లాగా ఉండేది. కాబట్టి నా తోటి చిన్నా పెద్ద పిల్లలందరూ కూడా బడి విడిచిన తర్వాత సెలవు దినాలప్పుడు, ఎప్పుడు తీరిక దొరికితే అప్పుడు పిల్లలు ఆ మైదానం లోనూ... వీధిలోనూ గుమికూడి చాలా ఆటలు ఆడుకునే వాళ్లు. క్రికెట్, గిల్లీ దండ, గోళీలు, కుర్రాట, కోకో, కబాడి ఇలాంటి ఆటలన్నీ అక్కడ ఆడేవారు. చాలా హడావుడిగా సుమారు ఐద ఆరు గంటల పాటు పిల్లలు అక్కడ ఆడుకునేవాళ్లు. నేను కూడా ఎప్పుడైనా వీలుంటే వెళ్లి అక్కడ కూర్చొని చోద్యం చూసే వాడిని. నాకు ఈ ఆటలు అంటే అంత ఇష్టం లేకపోయేది. పిల్లలందరూ ఉన్నారు కదా అని నేను అక్కడికి వెళ్లేవాడిని. ఒకానొక సమయంలో ఒక ఆదివారం రోజు ఏప్రిల్లో అనుకుంట, వెళ్తే అక్కడ ఎవ్వరూ కనపడడం లేదు. ఏమిటిది? ఎవరు కనపడడం లేదు అని వాకబు చేస్తే, ఈ పిల్లలందరూ కూడా సత్యసాయి బాలవికాస్‌కు వెళ్లారు అని తెలిసింది. ప్రతి ఆదివారం నైతిక తరగతులు జరుగుతాయట. అక్కడ ఏదో నాటకాలు వేసే ప్రయత్నం చేస్తున్నారు, డాన్స్ నేర్చుకుంటున్నారు అని విని నాకు ఆశ్చర్యం అయ్యింది. అరే, నాకు ఎందుకు తెలియదు ఈ విషయం అని తదనంతరం గమనించడం మొదలు పెట్టాను. పిల్లలందరూ చాలా ఉత్సాహంగా పెద్ద ఉత్సవం కోసమై తయారవుతున్నారు. వాళ్ల మాటలు, వాళ్ల పాటలు, వాళ్ల ఆటల ద్వారా ఇది స్పష్టంగా అర్థమైంది. తర్వాత పిల్లలందరూ ఎక్కడ ప్రదర్శన చేస్తున్నారంటే, మే 6వ తేదీన ఈశ్వరమ్మ వర్ధంతిని బాలవికాస్ దినోత్సవంగా చేస్తున్నాము అని చెప్పారు. నేను ఆ రోజు సాయంకాలము తాడిపత్రిలో ఉన్న RV స్వామి కళ్యాణ మండపం వెళ్ళగా ఆ పెద్ద మండపం... వేయి మందితో క్రిక్కిరిసి ఉంది. అక్కడ శ్రీ సత్య సాయి బాబా వారి ఫొటో ఉంది. "బాబా అంటే ఏమిటో నాకు అప్పుడు తెలియదు. 'సత్య సాయి బాబా' అంటే వామ్మో 'దొంగ బాబా', అని చాలా మంది చెప్పుకునేవాళ్లు. ఆయన మాయల ఫకీరు అంటూ ఇంకొంతమంది అనేవాళ్లు. అందుకే నాకు బాబా గురించి స్పష్టత ఉండేది కాదు. బాబా పట్ల ఆ రోజుల్లో నాకు పాజిటివ్ అభిప్రాయం ఉండేది కాదు. ఎందుకంటే అప్పటికి నేను ఇంకా చిన్న వయస్సులో ఉండిపోయాను. బాబా గురించి అవగాహన కూడా లేకపోయింది. అయినా ఎవరో బాబా గురించి మాట్లాడినప్పుడు, నాకర్థమైనది మాత్రం ఇదే..."

ఈశ్వరమ్మ గారి చిత్ర పటం చూస్తే అచ్చు గుద్దినట్టు స్వామి వారు అవిడలాగానే ఉన్నారు. నా మిత్రులు అందరు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటున్న విషయం తెలుసు కనుక నేను కూడా వెళ్లాను. వందలాది మంది ఆ మంటపంలో మూగారు. చాలా చక్కగా ఎన్నో అంశాలు పిల్లలు అందరూ ప్రదర్శించారు. నాకైతే చాలా ఉత్సాహం వచ్చింది. ఇదేంటి ఇంత మంచి కేంద్రం గురించి నాకు తెలియనే లేదే ఇన్నాళ్లు అని కాస్తా బాధ కూడా అయ్యింది. నాకు చిన్నప్పటి నుండి అబ్బిన కాస్త దైవ భక్తి, సరస్వతి విద్యా మందిరంలో అలవడిన సంస్కారం నన్ను తట్టి లేపింది. అరేయ్! ఇలాంటి దగ్గరకి వెళితే... నువ్వింకా మంచిగా నేర్చుకోవచ్చు. నీ ప్రతిభను కూడా పది మందికి చూపించ వచ్చు అని నా మనసు చెప్పింది. అలా, మాతృశ్రీ ఈశ్వరమ్మయే – ఈశ్వరునికి దారి చూపింది.

2

నాగజ్యోతి – నా బాలవికాస్ గురువు!!

దీపం జ్యోతి పరబ్రహ్మ
దీపం సర్వ తమోపహ ।
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యాదీపం నమోస్తుతే ॥

ఈ సంస్కృత శ్లోకం అర్థం:

జ్యోతి పరబ్రహ్మ స్వరూపం. ఆ జ్యోతి వెలుగు పాపాలను, అంధకారాన్ని, అలసత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించి... మన జీవితంలో అన్నిటినీ సుసాధ్యం చేసే కాంతిని ప్రసాదిస్తుంది. అలాంటి సంధ్యా దీపానికి నమస్సులు.

జ్ఞాన దీప్తి... దీప జ్యోతి అనే పదాలు మన జీవితాలలో వెలుగు నింపే వ్యక్తుల గురించి మాట్లాడే సమయంలో ఉపయోగించేవి. నా జీవితంలో జ్ఞాన జ్యోతి వెలిగించి, నాలో అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్న ఆధ్యాత్మిక చైతన్యమును వికసించేలా, శ్రీ సత్య సాయి బాబా వారి అనుగ్రహానికి నోచుకునేలా చేసిన శ్రీమతి నాగ జ్యోతి నా బాలవికాస్ గురువు! నేను జన్మించింది తాడిపత్రి అనే ఊరులో, అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లాలోని ఒక ప్రసిద్ధ పట్టణం.

నేను, శ్రీమతి నాగజ్యోతి గారు నడుపుతున్న బాలవికాస్‌కు వెళ్లాను. నా తోటి వాళ్లు నన్ను చేయి పట్టుకుని లోపల మూడో గదిలో పాఠం చెప్తున్న ఆవిడ దగ్గరికి తీసుకుని వెళ్లారు. సాయిరాం... అక్కా! వీడు బాలచంద్ర, తను కూడా క్లాస్‌కు వస్తాడట అని చెప్పారు. అక్క ఎంతో ప్రేమతో నన్ను దగ్గరికి పిలిచి, నా వివరాలు అడిగింది. నేను చెప్తున్నాను. ఇంతలో అక్కడే ఉన్న మిత్రులు చెప్పారు... అక్కా వీడు భలే పాడతాడు, శ్లోకాలు కూడా చెప్తాడు, వీడికి అల్లూరి సీతారామ రాజు ఏక పాత్రాభినయం కూడా వస్తుంది అని చెప్పారు.

వెంటనే, అక్క నా వైపు వాత్సల్యంతో చూస్తూ... అవునా! అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేసి... ఏదీ, ఒక సారి చెయ్యి చూద్దాం అన్నది.

తెలుగు వీరలేవరా... దీక్ష బూని సాగరా...

దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా... వందేమాతరం!!! టన్టటన్టటాంటా వందేమాతరం! వందేమాతరం!!

అంటూ ఆ సూపర్ స్టార్ కృష్ణ 100వ చిత్రం అల్లూరి సీతారామరాజు సినిమా పాట పాడాను. ఆ సినిమా నేను నా ఐదేళ్ల చిరు ప్రాయంలో చూసి కృష్ణ అభిమానిని ఐపోయి బ్రతికితే ఇట్లా బతకాలి, చస్తే ఇట్లా చావాలి... అని ఆ సినిమాలో డైలాగులు అన్నీ నేర్చేసుకున్నాను, అల్లూరి సీతారామ రాజు ఏకపాత్రాభినయం, దానిలో చివరికి చనిపోవడం, నేలకొరిగిపోవడం ఆ బుల్లెట్ దెబ్బలకి, అదంతా కూడా నేర్చుకున్నా. ఇదంతా కూడా చిన్నప్పటి నుంచి నా రక్తంలో రంగరించిపోవడం వల్ల ఫటాఫట్ చేసి పడేసాను.

అక్క ఎంతో ముచ్చట పడింది. నన్ను దగ్గరకి పిలుచుకొని, నాయనా ఎంత బాగా చేశావురా! నాయనా ఈ సారి సాంస్కృతిక కార్యక్రమాల్లో నువ్వు కూడా చేయి అని చెప్పింది.

అలా... దైవ సోదరి అయిన జ్యోతి ద్వారా దివ్య జీవిత యాత్ర ప్రారంభమైంది. సాయి మాత ఈశ్వరమ్మ, నా జీవితంలో వెలుగు నింపిన జ్యోతి, వీరిరువురి వల్లనే నేను భగవాన్ బాబా వారి అవతార కార్యంతో అనుబంధం ఏర్పరచుకున్నాను అని చెప్పుకుంటూ ఉంటాను.

ఈ రోజుల్లో నిజంగా టీచర్స్ ఎలా ఉంటే ఇలా సాధ్యమవుతుంది అని ఎవరైనా అడిగితే... "మొదటి దృష్టి యే మేలైన దృష్టి" అంటారు కదా, ఇది నిజం! ఆమెని చూసిన మొదటి సారి నుంచే నాకు దివ్య ప్రేరణ కలిగింది. అక్క ఎంతో గొప్ప ప్రభావాన్ని కలిగించేవారు. అందుకే ఈ విషయాన్ని గురువులయిన వాళ్లందరూ కూడా గుర్తుంచుకోవాలి. మన ప్రవర్తన, మన మాట, మన దృష్టి... అన్నీ విద్యార్థులపై మొదటి నుంచే మంచి ముద్ర వేసేలా ఉండాలి.

అలా మాతృశ్రీ ఈశ్వరమ్మ వర్ధంతి ఎన్నో వందల, వేల, లక్షల మంది పిల్లలని స్వామి కార్యంలో అనుసంధానం చేయడం అనేది చాలా అద్భుతమైన విషయం.

ఇంకా, జీవితంలో నేను ఎలా ముందుకెళ్లానో, నా హృదయాన్ని స్వామి హృదయంతో ఎలా కలుపుకున్నానో... ఆ సంగతులు మును ముందు వ్యాసాల ద్వారా తెలియ జేసే ప్రయత్నం చేస్తాను.

ఆవిడ పేరు నాగ జ్యోతి అని తెలుసుకున్నాను. అందరూ ఆవిడను జ్యోతక్క అని పిలుస్తున్నారు. అప్పుడు ఆవిడకు పాతికేళ్లు ఉంటాయేమో! ఇప్పుడు 72 ఏళ్ల వయసు. బెంగళూరులో పిల్లా పాపలతో కాలం గడుపుతూ... వాళ్లింట్లో ఇప్పుడు కూడా బాలవికాస్ నడుపుతూ ఉంది.

ఆ రోజు కేంద్రంలో జరిగిన సన్నివేశం నా మనసుని అలరించింది. అప్పటినుంచి ప్రతి ఆదివారం బాలవికాస్ తరగతులకు ఎంతో ఆసక్తితో వెళ్లడం నిత్యకృత్యమైపోయింది. పెద్ద పిల్లలకు తరగతులు జ్యోతక్క నిర్వహించేవారు. ఆమె బోధనా శైలి, నడవడి నా హృదయంలో చెరగని ముద్ర వేసాయి అనడంలో సందేహం లేదు.

నాగ జ్యోతి అక్క పంచే ప్రేమానురాగం
అందరినీ అక్కున చేర్చుకునే వాత్సల్యం
వెలుగును వెదజల్లే ఆమె ఆత్మ జ్ఞానం
పిల్లలను తీర్చిదిద్దాలనుకునే తాపత్రయం
నన్ను సత్య సాయి సన్నిధికి చేర్చినాయి

ఇవాళ నా అనన్య సామాన్య జీవనానికి
స్వామి సేవలో నేను అంకితమవడానికి
సమాజ సేవలో జీవితం సార్థకమవడానికి
చచ్చే లోపు చేసే మంచి పనికి కారణం
జ్యోతి నాలో సాయి జ్యోతిని వెలిగించడమే!!

జ్యోతి అక్క బోధనలో ఉన్న ప్రత్యేకత, ఆమె తరగతుల్ని మరింత ఆసక్తికరంగా మార్చేది. స్వామిని ప్రత్యక్షంగా దర్శించక పోయినా, ఆయన లీలలను అనుభవించక పోయినా, ఆమె చెప్పిన కథలు, వివరాలు, అనుభవాలు, అనుభూతులు మాత్రం స్వామి జీవితాన్ని నాకు పరిచయం చేసి, వారి సందేశాలకు ప్రాణం పోసినట్టుగా అనిపించేవి. ప్రతి తరగతి ఆరంభం కూడా ఎంతో సదాచారంతో మొదలయ్యేది. తరగతి నిర్వహించే అక్క స్థితప్రజ్ఞత, మృదువైన మాటలు, మధురమైన చూపులు, నన్ను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి మరింత లోతుగా వెళ్లేలా చేశాయి.

తరగతుల ద్వారా మా మధ్య చిగురించిన గురు శిష్య సంబంధం తరగతులు అయ్యాక కూడా ఎన్నో రకాల మాధ్యమాలలో కొనసాగేది. మాటలు, పాటలు, కవితలు, లేఖల ద్వారా పరస్పరం మనసులోని ఆలోచనలు పంచుకునే వాళ్లం. ఆ లేఖలు నా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని చర్చించడానికి, సందేహాలను వ్యక్తపరచడానికి, మార్గదర్శనం పొందడానికి అద్భుతమైన సాధనాలుగా మారిపోయాయి. వారాంతంలో తరగతులకు సమయం పరిమితి ఉండేది. కానీ తరగతుల తరవాత మిగతా రోజుల్లో సమయానికి పరిమితి ఉండేది కాదు. చాలా అపరిమితంగా సాగి పోయేది మా ఆత్మీయ బంధం.

ఒక్కోసారి నేను ఏదైనా తప్పు చేసినప్పుడు జ్యోతక్క కోపంగా కాకుండా ఎంతో మృదువుగా తప్పులు సరి చేసి మార్గనిర్దేశం చేసేది. ఒకసారి నా ప్రవర్తన ఆమెను బాధించింది. దాంతో కొంత కాలం మేమిద్దరం మాట్లాడుకోలేదు. కానీ ఆ మౌనం తీరిన తరువాత ఆమె నన్ను క్షమించడమూ, నా శ్రేయస్సు కోసం ప్రార్థించిన తీరూ, ఇవన్నీ కూడా నాకు మరపురాని అనుభూతులను మిగిల్చాయి. అక్క ప్రేమ, క్షమ, మార్గనిర్దేశం నా సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది వేసాయి

జ్యోతి అక్క వలన నేను బాలవికాస్ బోధనలపై మక్కువ పెంచుకున్నాను. శ్రీ సత్య సాయి దేవుడి మీద అఖండ భక్తి నాలో చిగురించి... శ్రీ సత్య సాయి బాలవికాస్‌ను ప్రేమించటం ప్రారంభించాను. ప్రతివారం జరిగే బాలవికాస్ తరగతులు... మౌనము, ధ్యానము, ప్రార్థనము, కీర్తనము, స్తోత్రము, శ్లోకము, వేద పఠనము, బృంద గానము, కథా శ్రవణము, విష్ణు స్మరణము, అధ్యయనము, సామూహిక చర్చలు, నైతిక విలువలతో కూడిన ఆటలతో నిండి ఉండేవి. బాలవికాస్‌లో నేను గడిపిన కాలం అంతా కూడా నా ఆధ్యాత్మిక వికాసానికి మూలస్తంభముగా మారిపోయింది.

ఇక రోజు రోజుకీ అక్క బోధనలకు నేను ఆకర్షితుడినైపోయాను. ఆమె ప్రతి మాటను, ప్రతి పాఠాన్ని మంత్రంగా గ్రహించే వాడిని. తరగతి జరుగుతున్న గదప దాటి... ఆకాశమే హద్దుగా... అనంత సాయి వైభవం... అంతరంగముపై అమితమైన ప్రభావం నాలో నానాటికీ పెరుగుతూ ఉండేది. అక్క బోధనల వల్లనే నాకు కళలపై ప్రేమ పెరిగింది, పాటలు పాడటంలో నేర్పరి తనమొచ్చింది, కవితలు వ్రాయడంలో మెలుకువ వచ్చింది. ఇలా నా వ్యక్తిత్వ నిర్మాణానికి బాలవికాస్ ఒక పీఠికగా నిలిచింది. ప్రతి పాఠానికి కూడా స్వామి సందేశం పునాదిగా ఉండేది.

బాలవికాస్ నా పరిపూర్ణ వికాసానికి కారణమైంది. సమయపాలన, క్రమశిక్షణ, ఉన్నత ఆశయ సాధన ఇవన్నీ కూడా జ్యోతక్క చూపిన మార్గంలో పయనిస్తున్నప్పుడు సాధ్యం అయ్యాయి. ఆమె సహనం, ప్రేమ, నిబద్ధత నాకు జీవితాన్ని పరోపకార లక్ష్యంగా జీవించాలనే బలమైన సంకల్పాన్ని అందించాయి.

జీవన ప్రయాణంలో సమయం, దూరం మారినా... జ్యోతి అక్క మాత్రం స్వామి సేవా సాధనలో ఈ నాటికి ఏ మాత్రం తొణకకుండా నిలబడ్డారు. ఆమెకున్న భక్తి విశ్వాసాలు, నిస్వార్థ సేవా దృక్పథం, ఆధ్యాత్మికత, సమర్పిత భావం... ఇవన్నీ విద్యార్థులకు జీవితాంతం స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆమె వంటి గురువు దొరకడం ఓ వరమే!

నా జీవన ప్రయాణాన్ని ఎప్పుడైనా సమీక్షించుకుంటే బాలవికాస్ ద్వారా కలిగిన అంతరంగ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే నా జీవితాన్ని వెలిగించిన జ్యోతక్కపై ప్రగాఢమైన కృతజ్ఞత ఉట్టిపడుతుంది. ఆమె బోధనల ద్వారా నాకు భక్తి యొక్క నిజమైన తాత్పర్యం, సేవ యొక్క మహత్త్వం, ఆధ్యాత్మికత యొక్క లోతైన విలువలు అర్థమయ్యాయి. ఈ వెలుగును పంచే మార్గదర్శకురాలిని నా జీవితంలోకి తీసుకుని వచ్చిన నా స్వామి కృపకు నేను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాను.

నా జీవిత పథాలను ప్రకాశింపజేసే ఆ దివ్య జ్యోతికి నమస్కరిస్తూ, హృదయ పూర్వకమైన గౌరవంతో వ్రాసుకున్న ఈ కవిత సదా నా హృదయాన్ని తాకుతూ ఉంటుంది.

"దేహ సోదరి రేవతి, దైవ సోదరి జ్యోతి!
సమత సోదరి సుజాత, మమత సోదరి సుధ
పంచమ సోదరిగా షాలినిని ఇచ్చావు
అందుకో వందనములు శ్రీ సత్య సాయీ"

స్వామి ప్రేమ, కృప అందించే శాశ్వత జ్యోతి నాకు మార్గదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నాను.



3

తల్లిదండ్రులే ప్రేరణ ప్రదాతలు

1970వ సంవత్సరం ఏప్రిల్ 6వ తేదీన, నేను శ్రీమతి రాజేశ్వరి మరియు శ్రీ ఎస్.ఎస్. రంగయ్య మూడవ సంతానంగా ఈ లోకానికి వచ్చాను. ఆ రోజు తెలుగు నూతన సంవత్సరాదికి ముందు రోజు... అంటే అమావాస్య! అమావాస్య రోజు జన్మించడం విశేషము అని చెప్తారు.

చాలా ఆలోచించారో, మరి యాదృచ్ఛికమో తెలియదు కానీ, నా పేరు "బాలచంద్ర" అని పెట్టారు. తర్వాత నేను కాస్త ఆలోచిస్తే నాకు తట్టింది ఏంటంటే అమావాస్య రోజు ఆకాశంలో చంద్రుడు లేడు, మా తాత గారి పేరు సుంకు బాలయ్య శెట్టి ఈ రెండు కలిపి బాలచంద్ర అని పేరు పెట్టారు' అని అనిపించింది. చిన్నప్పటి నుంచి కూడా చాలా ప్రేమగా, చాలా దయతో, చాలా క్రమశిక్షణతో అమ్మ నాన్న పెంచారు. సత్యసాయి సంస్థలో తర్వాత కాలంలో నేను చూసిన క్రమశిక్షణ, నేను పుట్టిన దగ్గర నుంచే ఇంట్లో చూశాను. మా నాన్న న్యాయ వాది, BA., BL., చదివారు. ఆ రోజుల్లో వారి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లందరిలో మా నాన్నగారే అత్యుత్తమంగా చదువుకున్నవారు. విద్యలోనూ, ప్రవర్తనలోనూ వారు ఒక ఉదాహరణగా నిలిచారు.

20 ఏళ్లప్పుడు వారు పెళ్లి చేసుకున్నారు. మా అమ్మా నాన్నలు ఇద్దరూ ఎంతో పవిత్రమైన భావనతో, భక్తి భావంతో జీవించేవారు. వారు ఇద్దరూ చాలా పుణ్యశీలురు. ఉదయం నిద్రలేస్తూనే ఒక ప్రక్క నాన్నగారు సంధ్యా వందనం చేస్తున్న దృశ్యము, ఇంకో ప్రక్క అమ్మగారు అగ్నిని పూజిస్తూ వంట చేసే దృశ్యము. ఈ రెండు ఇప్పటికీ కూడా గుర్తున్నాయి. ఏ పని చేసినా భగవదర్పిత భావంతో చేయాలి, భగవత్ చింతనతో చేయాలన్న భావనతో చిన్నప్పటి నుంచే అమ్మ నాన్నలను చూస్తూ మేమంతా పెరిగాము. అలాగే స్నానం చేసిన వెంటనే మా నాన్నగారు హాలులో ఒక కుర్చీలో కూర్చుంటే, నేను నా తమ్ముడు శుభ్రమైన బట్టలు ధరించి దగ్గర చేతులు కట్టుకొని శ్లోకాలు, దైనందిక ప్రార్థనలు చెప్పేవాళ్లము. చాలా పవిత్రమైన హృదయాలతో, ఎంతో మందికి సహాయం చేసే కుటుంబంగా నేను ఎన్నో విషయాలు గ్రహించాను. మొదట్లో సత్యసాయిబాబా అంటే వారికి

తెలీదు. నేను కూడా బాలవికాస్ ద్వారా స్వామి కార్యంలోకి ప్రవేశించడం జరిగింది. వాళ్లు మొదట కట్టడి చేశారు. తర్వాత జరిగిన ప్రతి సంఘటనను చూస్తుంటే, నిజంగా నా తల్లిదండ్రులే స్వామిపై నాకన్నా ఎంతో ఎక్కువగా అంకితభావంతో ఉన్నారని ఆశ్చర్యంగా అనిపించేది. కారణం భజన నగర సంకీర్తన ఏ కార్యక్రమం అయినా... అమ్మ నాన్న ముందుగా వెళ్లేవాళ్లు. తర్వాత నేను కూడా దాంట్లో చేరి పోయాను. వాళ్లు నమోదు చేయబడిన సేవాదళగా మారి, ప్రశాంతి నిలయంలో, స్వామి వారి పుట్టుపండుగ సేవల్లో, శివరాత్రి సేవలలో, సంక్రాంతి సేవలలో, ప్రశాంతి భద్రతా సేవలలో భాగం వహించేవారు. వారు శక్తి సామర్థ్యాలు ఉన్నంత వరకు ఇలాంటి దైవ కార్యక్రమాల్లో భాగం వహించారు. నాకు ఇంకా బాగా గుర్తుంది... వాళ్లు బెంగళూరుకు (1992) మారిన సందర్భంలో కూడా, సత్య సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు వెళ్లి అక్కడ సేవ చేసేవారు. ఇదంతా స్వామితో దర్శన, స్పర్శన, సంభాషణ, పాదన నమస్కార ప్రసాద భాగ్యాలు ఏమీ లేకుండానే సేవా దృక్పథంతో చేసేవారు. సాధారణమైన వ్యక్తులుగా, సంస్థ సభ్యులుగా, వారు స్వామితో అనుభవించిన అనుభూతులు ఎన్నో ఉన్నాయి. వాళ్లందరూ కూడా అచంచలమైన విశ్వాసంతో ముందుకు వెళ్లిపోయారు.

మా నాన్న గారి చివరి క్షణాల దాకా మా అమ్మ శ్రీమతి రాజేశ్వరి చూసుకున్నారు. ఇప్పటికీ కూడా... 82 ఏళ్లు వచ్చినప్పటికీ, సదా దైవ భక్తిలో తమ నిత్య జీవితాన్ని సాగిస్తున్నారు. నాన్న గారు చనిపోయే సమయంలో నేను వారి దగ్గర ఉన్నాను. దైవనామస్మరణతో, తులసి తీర్థం వారి నోటిలో వేస్తుంటే త్రాగుతూ నా చేతుల్లోనే నాన్నగారు ప్రాణం విడిచారు.

ఎప్పుడో జరిగిన ఒక సంఘటన నాకు గుర్తొస్తుంది. మనందరం చూస్తూ ఉంటాం కదా... దర్శనంలో, స్వామికి ఉత్తరాలు ఇచ్చేవాళ్లం కదా... అలాగా ఒక సారి నాన్నగారు బెంగళూరులో, వైట్ ఫీల్డ్ బృందావన ఆశ్రమంలో స్వామివారి దర్శనానికి వెళ్లారు, ఒక ఉత్తరం తీసుకొని వెళ్లారు. స్వామికివ్వాలని ఇచ్చుకోలేకపోయారు. చాలా కాలం తర్వాత, ఇంట్లో పుస్తకాల షెల్ఫ్ సర్దుతుంటే... నాకు ఒక పుస్తకంలో నుంచి వారు స్వామి వారికి వ్రాసుకున్న కవర్ కనిపించింది. "భగవాన్ సత్య సాయి బాబా వారి పాదపద్మములకి..." అని నాన్న గారు స్వీయ దస్తూరితో వ్రాసిన ఉత్తరం దొరికింది. నాన్నగారు పోయారు కదా! సరే... ఉత్తరంలో ఏం వ్రాసారో చూద్దాం అని చెప్పి ఉత్తరం తెరచి చదివితే, నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

ఏముందంటే దాంట్లో...

"నీ పాద కమల సేవయు నీ పాదార్చకులతోడి నెయ్యమును
నితాం తాపార భూత దయయును తాపస మందార నాకు దయ సేయుగదే"

అన్న భాగవత శ్లోకాన్ని వ్రాసినారు, అంతే! ఇంకేమీ లేదు దాంట్లో. నాకు ఎంత ఏడుపు వచ్చిందంటే వారి ప్రార్థన నిజంగా నా జీవితంలో పరిధవిల్లుతోంది. ఈరోజు నేను వెనక్కి తిరిగి చూస్తే నా జీవితం అంత ఈ ప్రార్థనకు సంబంధించినదే! అని అనిపిస్తుంది. స్వామి కార్యంలో అనుక్షణము, అనునిత్యము నేను చేస్తున్న ప్రతి కార్యంలో కూడా ఈ ప్రార్థన, ఈ భావన, సమర్పణ ఉంది. నిజం చెప్పాలంటే నా తల్లిదండ్రులు దేహాన్ని ఇవ్వడమే కాదు దైవాన్ని కూడా ప్రసాదించారు. దైవ మార్గంలో నన్ను ప్రవేశపెట్టారు. అమ్మ నాన్నలని ఈ సందర్భంగా ఒకసారి తలుచుకుంటూ వారి నుంచి నేను నేర్చుకున్న ఎన్నో విషయాలలో రెండు మూడు విషయాలని భద్ర పరిచే ప్రయత్నం చేస్తున్నాను.

అమ్మ అమాయకమైన భక్తి, సంస్కృతి సంప్రదాయాల మీద ఆసక్తి, దైవ కార్యాల మీద అనురక్తి

కలిగి మమ్ములను ఎంతో ఆదర్శంగా పెంచి పోషించారు. ఎంతో అణుకువ కలిగిన ఇల్లాలుగా ఇంటిని, తండ్రిని మమ్మల్ని చూసుకున్నారు. ఆవిడ ఎప్పుడూ పరుషమైన మాటలు మాట్లాడలేదు. మాతో కఠినంగా వ్యవహరించలేదు. దిగువ మధ్య తరగతి కుటుంబమే అయినా, ఆవిడ ఉన్న దానిలో సర్దుకుని ఇల్లు గడపడం మేము గమనించే వాళ్లము. ఎన్నో పనులను ఆమె సొంతంగా చక్క బెట్టారు. నలుగురు పిల్లలని ప్రయోజకులుగా తీర్చి దిద్దడం వెనక ఆవిడ అనుగ్రహం మాత్రమే ఉంది. నేటికి కూడా ఎంతో ప్రేమానురాగాలు మా అందరి మీద వర్షిస్తుంది. మేము పనులలో పడి మాట్లాడటం మరచి పోతే ఆవిడ ఫోన్ చేసి మాట్లాడేస్తుంది. వయోభారం వలన మునుపటి లాగా చురుకుగా లేకున్నా, మా అందరికంటే బాగా ఇంటి పనులు వంట పనులు చేస్తూ ఉంటుంది. సదా దైవ నామ స్మరణతో కాలం గడుపుతూ ఉంటుంది.

ఇక నాన్న గారు... మేము మా వైపున అయ్యా అని పిలుస్తాము. వారు చాలా తెలివైన వారు. ఏ అంశం మీద అయినా చక్కగా మాట్లాడే వారు. చిత్ర లేఖనం, కవితలు, పద్యాలు, శతకాలు, పురాణ ఇతిహాసాలు... వారికి కరతలామలకం అని చెప్పాలి. వ్యాసాలు వ్రాయడం, ఉపన్యాసాలు ఇవ్వడము అలవోకగా చేసే వారు. న్యాయ వాద వృత్తిలో, వ్యాపార వ్యవహారాల్లో వారు రాణించలేక పోయినా, ఒక వ్యక్తిగా వారు చక్కటి ఆదర్శాన్ని నిరూపించారు. వారు బహుముఖ ప్రజ్ఞాశాలి ఊళ్లో ఎవరికి పని ఉన్నా సరే, నాన్న గారి దగ్గరికే వచ్చే వాళ్లు. వ్యాస రచన పోటీలో పాల్గొనే చిన్న పిల్లల నుండి వ్యవహారంలో పోటీలు పడే పెద్ద వాళ్లూ సలహాలు సూచనల కోసం వచ్చేవారు. అందరి తలలో నాలుక లాగా ఉండే వారు. జీవితములో ఆయన ఏనాడు విలువలను కోల్పోలేదు. వారు కష్టాలు అనుభవించడం నేను నా కళ్లారా చూశాను. ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు, అప్పు చేసి చూడు. అప్పుడు కష్టాలు ఏమిటో తెలుస్తాయి అన్న దానికి వారి జీవితమే ఉదాహరణ... అప్పుడు కూడా వారు విలువలను వదులుకోలేదు. ఆస్తి అమ్మి అప్పులు కట్టేసాడు తప్ప ఎవరినీ మోసం చేయలేదు.

నేను నన్ను పరికించి చూసుకుంటే... వారి విలువలు నా జీవితంలో ప్రతి అంకములో కనిపిస్తూ ఉంటాయి. అంతెందుకు నేను మాట్లాడితే మా నాన్నను గుర్తు చేసుకుంటారు నేటికి కూడా, వారి ప్రతిభా, ప్రభావం, వాక్ చాతుర్యం, వారి సేవా దృక్పథం, వారి భక్తి ప్రపత్తులు, వారి దేశ భక్తి, వారి తర్క జ్ఞానం, వారి తత్వ చింతన, అన్ని కలగలిపితే నేను వస్తానేమో అనిపిస్తుంది.

తల్లిదండ్రులు మనకు ఈ లోకంలో కళ్లకు కనిపించే ప్రత్యక్ష దేవతలు అని నేను గాఢంగా నమ్ముతాను. వారు మన ముందు భౌతిక రూపంలో కనిపించే పరమేశ్వరులు. స్వామి వారి దయవల్ల వారికి పుత్రుడిగా జన్మించాను అనుకుంటున్నాను. ఆ తల్లిదండ్రులకి సదా నేను ఋణపడి ఉంటాను. జీవితంలో నేను చేసిన, చేస్తున్న, చేయబోతున్న ప్రతి సత్కార్యములో నాకు ఏదైనా పుణ్యం వచ్చి ఉంటే, ఏదైనా ఫలితం ఉంటే, అది అమ్మ నాన్నలకు మాత్రమే చెందుతుంది అనుకుంటున్నాను.

4

చిన్నప్పటి చురుకుదనం... మాయమయింది బెరుకుదనం

బాలవికాస్ చేత నా జీవితమంతా కూడా అద్భుతమైన ప్రేమామృత ధారలో ఓలలాడింది. ఆ బాలవికాస్‌లో ఏ ముహూర్తంలో చేరానో తెలీదు, స్వామి సంకల్పము ఏముందో తెలీదు, ఆ చిన్న వయసులో (13-15 ఏళ్లు) బాలవికాస్ ద్వారా ఎన్నో కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే అవకాశం వచ్చింది.

అంటే చిన్న పిల్లాడిని అనే కారణం ఒకటి. చక్కగా అణుకువుగా చెప్పినది చేసేవాడిని అనేది రెండో కారణం. మూడో కారణం చిన్ననాటి నుంచి అలబడిన దైవభక్తి ఇలా ఎన్నో కారణాల వల్ల చాలా చురుకుగా సేవా కార్యక్రమాల్లో నేను పాల్గొనే వాడిని.

ప్రధానంగా నేను పంచుకోవాలి, సింహావలోకనం చెయ్యాలి అంటే... 'భజన' జీవితములో ఒక అద్భుతమైన వేదికగా మారిపోయింది. ప్రతి గురువారము, ప్రతి ఆదివారము సాయంకాలం భజన జరిగేది. ఈ భజన సమయంలో అందరికంటే ముందుగా వెళ్లడం ఒక అలవాటుగా మారిపోయింది. అందరికంటే ముందు వెళ్లిపోయి స్వామి ఫోటో శుభ్రం చేయడం, స్వామి సింహాసనమును ఏర్పాటు చేసుకోవడం, తర్వాత దాని మీద చేతి రుమాలు వేయడం, పాద పీఠం పెట్టడం, మంచి పూలతో అలంకరణ చేయడం, అందరూ వచ్చేలోపుగా పట్టలు వేయడం, వృద్ధులకు కుర్చీలు వేయడం, భజన తర్వాత విభూది ప్రసాదం అందరికీ ఇవ్వడం లేదా ప్రసాదం ఏమైనా ఉంటే వితరణ చేయడం, అందరూ వెళ్లిన తర్వాత మళ్లీ అన్ని తీసి పెట్టడం... ఇలా అన్ని పనుల్లో కూడా ఎంతో చురుకుగా, ఎంతో హృదయపూర్వకంగా పాల్గొనేవాడిని.

అయితే ఇట్లా చేస్తున్న నన్ను గమనించిన పెద్ద వాళ్లు కొన్నాళ్ల తర్వాత "అరేయ్ బాబు నువ్వు ఒక భజన పాడు" అని చెప్పే వారు. ఆ భజన పాడాలి అని నేను అనిపించుకోవడానికే చాలా నెలలు లేక చాలా ఏళ్లు పట్టి ఉండొచ్చు అని అనుకుంటాను. కానీ ఆ భజనని ఇంట్లో కూర్చొని సాధన చేసి పాడే వాడిని. పెద్దవాళ్ల కంటే నేను మంచిగా పాడాలి లేకపోతే ఇంకోసారి అవకాశం ఇవ్వరు అన్న

అపేక్షతో, ఆతృతతో ప్రయత్నం చేసేవాడిని.

అలాగే 'నగర సంకీర్తన' ఇంకొక అద్భుతమైన అవకాశం. ఆ నగర సంకీర్తనలో భజనలు పాడుకుంటూ, వీధుల్లో అంతా తిరగడం అనేది ఒక మంచి సేవావకాశంగా నేను తీసుకున్నాను. అందరికంటే ముందు నిద్రలేచి, సైకిల్ తీసుకొని ఎవరైతే సభ్యులు ఉన్నారో వాళ్ల ఇంటి ముందర సైకిల్ బెల్లు మ్రోగించి "సాయిరామ్! సాయిరామ్! లేవండి..." అంటూ నిద్రలేపే వాడిని ఇలా సేవ అవకాశం వచ్చేది.

దాని తర్వాత 'బాలవికాస్'లో ఎంత చురుకు అంటే... అందరికంటే ముందు వెళ్లాలి, అందరికంటే చివర బయటికి రావాలి, ఆ రోజు చెప్పిన విషయాలని గ్రహించాలి, ఇంకా కొత్త విషయాలు నేర్చుకోవాలి, ఏమైనా హోం వర్క్ ఇస్తే అందరికంటే ముందు నేను చేయాలి, పరీక్ష చక్కగా వ్రాసేవాడిని. జ్యోతి అక్క మూడు నెలలకు ఒకసారి క్లాస్ టెస్ట్ పెట్టేది. ఆ టెస్టులో కూడా నేను మంచి మార్కులు తెచ్చుకునే వాడిని. పాటైనా, పద్యమైనా చక్కగా రాగ యుక్తంగా, భావయుక్తంగా, తాళయుక్తంగా చెప్పడం, నేర్చుకోవడం ఇవన్నీ అలవాటు అయిపోయింది.

'సత్యసాయి సమితి' కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు... నేను చిన్న అబ్బాయిని కాబట్టి... ఎక్కడైనా మీటింగులు జరిగితే, అప్పట్లో ఒక్క ల్యాండ్ లైన్ తప్ప ఫోన్ మరియు సందేశాలు ఉండేవి కాదు కదా! అలాంటి సందర్భంలో పెద్ద వాళ్లు ఒక పుస్తకము తయారు చేసి, దానిలో మీటింగ్ లేక ప్రత్యేక కార్యక్రమం సమాచారాన్ని నోటీస్‌ని వ్రాసి నాకు అప్పజెప్పితే, నేను సైకిల్‌లో అందరి ఇళ్లకు వెళ్లి సభ్యులకు చూపించి సంతకాలు చేయించుకొని వచ్చేవాడిని. ఆ తరవాత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను వ్రాసుకొని... మళ్లీ అందరి ఇళ్లకి వెళ్లి "అయ్య! ఈ రోజు మీటింగ్‌లో నిర్ణయాలు ఇవి, సంతకాలు చేయండి" అని చేయించుకునే వాడిని.

ఎప్పుడైనా ఏవైనా సేకరణ చేయాలి అంటే ఆ సేవలో పాల్గొంటూ ఉండేవాడిని. తర్వాత ఎవరైనా ముసలి వాళ్లు ఉంటే వాళ్లని ఇండ్ల దగ్గరికి విడిచి వచ్చేవాడిని. ఇలాగ చాలా సేవలు చేసేవాడిని. చాలా మంచి సేవాదృక్పథం అలవడింది. అందరు ముందుకు వెళ్తే... నేను పెద్దవాళ్లతో పాటు వెళ్లిపోయేవాడిని. అలా చాలా చురుకుగా పాల్గొనే వాడిని.

'అలంకరణ' చెయ్యడం అంటే చాలా ఇష్టం. శివరాత్రి అయితే ఇంట్లో చిన్న శివలింగానికి మంచి అలంకారం చేసి, మేడ మెట్ల క్రింద బొమ్మలను పెట్టి, శివుడికి అభిషేకం చేసి, పూల అలంకారం, శ్రీరామ నవమి అయితే రాముడికి అలంకరణ, దసరా అయితే 10 రాత్రులు అమ్మవారి బొమ్మలకు అలంకరణ చేసే వాడిని. ఆ అలంకార ప్రవృత్తి నాతో పాటు పెరుగుతూ వచ్చేసింది. సత్యసాయి బాలవికాస్ నాలో కళాత్మకతను మెరుగులు దిద్దే అద్భుతమైన వేదిక ఇచ్చేసింది. భజన, పుట్టు పండుగ, శివరాత్రి, నవరాత్రి, అఖండ భజన, జనవరి ఫస్ట్, ఎప్పుడైనా సరే... ఏదైనా అలంకరణ చేయాలి అంటే అందరికంటే ముందుగా నేను వెళ్లిపోయేవాడిని. పూలన్నీ తీసుకొని, రంగు పేపర్లతో చక్కగా అలంకరణ సేవల్లో పాల్గొనేవాడిని. ఇక ఈ కార్యక్రమాలు కేవలం బాలవికాస్‌తో ఆగిపోలేదు, బాలవికాస్ నుంచి భజన, భజన నుంచి నగర సంకీర్తన, నగర సంకీర్తన నుంచి నారాయణ సేవ, నారాయణ సేవ నుంచి సమావేశాలు, సమావేశాల నుంచి సేవా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల నుంచి ఇక ఎన్నో రకాలుగా ఎన్నో విధాలుగా ఇంటింటికి వెళ్లడం జరిగింది. తాడిపత్రి గ్రామంలో ఎంతో మంది ఆత్మీయులు నాకు పరిచయం అవ్వడం, వాళ్లందరితో మంచి సంబంధం ఏర్పడటము... స్వామి నామము మరియు రూపము... ఈ రెండింటికి నిజానికి ఇంకా

రుచి మరగ లేదు. కేవలం ఒక దైవభక్తి మాత్రమే ఉండేది.

కార్యక్రమాల్లో భాగంగా ఎక్కడైనా సేవలు ఉంటే అందరికంటే ముందు నేను వెళ్లేవాడిని. ఈ విధంగా సత్యసాయి బాలవికాస్ అనే వేదిక నాలో అద్భుతమైన సేవా ప్రవృత్తికి దారితీసింది అని చెప్పుకోవాలి. సత్యసాయి బాలవికాస్ ద్వారానే నేను ఒక పరిపూర్ణమైన సేవకుడిగా మారి, నాకు అన్ని రకాల కళలు, నైపుణ్యాలు, ప్రతిభ, చాతుర్యం అలవడ్డాయి.

"మొక్కై వంగనిది మానై వంగునా" అన్నారు కదా! ఈ రోజు చిన్న పిల్లలకు మనం చక్కటి విషయాలు నేర్పించగలిగితే అవి వాళ్లు పెద్దయ్యే కొద్ది చాలా అద్భుతమైన ప్రభావం వారిపై చూపిస్తాయి. అంతే గాక అద్భుతమైన వ్యక్తులుగా మార్చి వేస్తాయి అని నేను పరిపూర్ణంగా నమ్ముతున్నాను. ఎందుకంటే ఇది నాకు నేనుగా చేసుకున్న ప్రయోగము, నాలో కలిగిన మార్పునకు నేనే సాక్షీభూతుడను. ఈ బాలవికాస్‌లో నేను నేర్చుకున్న ప్రతి విషయము జీవితంలో ముందు ముందు చాలా ఉపయోగపడింది. సత్యసాయి బాలవికాస్ ఉద్యమంలో నన్ను పాత్రధారుడిని చేసిన సత్యసాయి బాబా అద్భుతమైన సంకల్పానికి నన్ను నేను అర్పించుకుంటూ... ప్రపంచ వ్యాప్తంగా జరిగే శ్రీ సత్య సాయి బాలవికాస్‌లో ఎంత మంది వీలైతే అంతమంది వారి పిల్లలను చేర్చాలని నేను కోరుకుంటున్నాను.



5

కొనగంటి చూపుతో... కనుగొంటి స్వామిని

1983, నేను బాలవికాస్‌లో చేరిన రెండు సంవత్సరాల తర్వాత జరిగిన విశేషం. స్వామివారి 60వ పుట్టు పండుగ 1985లో జరగబోతోంది. ఆ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా స్వామి వారి 60వ పుట్టు పండుగని వివిధ రకాల ఉత్సవాలుగా ఐదేళ్ల పాటు చేశారు. అందులో భాగంగా ప్రప్రథమ అంతర్జాతీయ బాలవికాస్ సమ్మేళనం జరిగింది. ప్రపంచంలోని వివిధ దేశాల బాలవికాస్ పిల్లలని, బాలవికాస్ గురువులని ఉత్సాహపరిచి ఈ కార్యక్రమంలో భాగం వహింపచేసే ప్రయత్నం చేశారు. భారతదేశం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. కారణం స్వామి వారు పుట్టిన దేశంలో మనమంతా ఉన్నామని, అందులోనూ స్వామివారి రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఇంకా ప్రత్యేకం! ఇక అందులోనూ అనంతపురం జిల్లా స్వామి పుట్టిన జిల్లా ఇంకా ప్రత్యేకం! అలాంటి జిల్లాలో నేను ఉండటం ఎంత అదృష్టం కదా? కారణం ఏంటంటే దేశ దేశాల వాళ్లు కొన్ని రోజులు ప్రయాణం చేసి రావాలి. కానీ అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నుంచి కొన్ని గంటల ప్రయాణం చేస్తే చాలు ప్రశాంతి నిలయం చేరేవాళ్లం. అంత దగ్గరగా ఉన్న ఆ ప్రశాంతి నిలయాన్ని నేను 13 ఏళ్ల దాకా చూడలేదు. మొట్టమొదటిసారి బాల వికాస్‌లో చెప్పిన విశేషాలన్నీ విని, అరే ఎట్టైనా సరే ఈ సమ్మేళనంకి నేను కూడా వెళ్లాలి అని చాలా ఉత్సుకతతో ఉంటిని. బాలవికాస్ రెండో గ్రూప్ అయిపోయింది, మూడో గ్రూప్ ప్రీ సేవాదళ్ విద్యార్థిగా ఉన్నాను. అలా ఆ కార్యక్రమానికి వెళ్లే ప్రయత్నం చేశాను. దీనికి సుమారు వారం రోజుల పాటు అక్కడ వసతి సౌకర్యము, భోజన సౌకర్యం కోసం ఒక్కొక్కరు 100 రూపాయలు కట్టాలి అని చెప్పారు. అలాగే ఛార్జీలకు ఒక 100 రూపాయలు. కాబట్టి మొత్తం 200 నుండి 250 రూపాయల దాకా ఖర్చు అవచ్చని చెప్పారు. నిజం చెప్పాలంటే మా ఇంట్లో ఆ రోజుల్లో ఆ మొత్తం ఇవ్వడం అంటే కూడా ఇబ్బందిగానే ఉండేది. అమ్మ నాన్న నన్ను ప్రోత్సహించలేదు. "ఎందుకయ్యా అనవసరంగా ఊరికే... ఆడా ఈడా తిరుగుతావు! బంద్ చేసేయ్! ఎక్కడికి అక్కర్లేదు!" అన్నారు. వాళ్ల కాళ్ల వేళ్లబడి, ఏడ్చి నేను ఎట్లాగైనా ఆ బాలవికాస్

కాన్ఫరెన్స్‌కి వెళ్లాలని చాలా అమాయకంగా అమ్మ నాన్నతో పోరు పెట్టి 200 రూపాయలు తీసుకుని మా గురువు గారికి 100 రూపాయలు ఇచ్చి నా జోబీలో 100 పెట్టుకొని బయలుదేరాను. సుమారు 10–15 మంది పిల్లలము జ్యోతక్కతో పాటుగా బస్సులో ప్రయాణం చేసి వెళ్లాము. నాకు గుర్తుంది, స్వామి వైపు ప్రయాణమైన తొలి సందర్భం అది.

ఆ రోజుల్లో స్వామి అంటే అందరికీ ప్రతికూల అభిప్రాయం ఉండేది. బాలవికాస్‌కు వచ్చే పిల్లలు విడిస్తే బయట ప్రపంచంలో ఎంతో మంది పిల్లలు, పెద్దలు ఈ సాయిబాబా అంటే 'దొంగ బాబా', 'సన్నాసి బాబా' అని చాలా విచిత్రంగా మాట్లాడేవారు. నాపైన కూడా ఆ ప్రభావం పడింది. "అయ్యో సాయిబాబాని నేను మొక్క కూడదప్పా! నేను వెళ్లేది బాలవికాస్ సమ్మేళనంకి మాత్రమే! నా లాంటి పిల్లలు కొన్ని వందల మంది వస్తారు, వాళ్లందరిని చూసి రావాలి అన్న ఆలోచనతో వెళ్లానే తప్ప, బాబాని ఒక దేవుడిలాగా, ఒక మహానుభావుడి లాగా నేను మనసులో ఎక్కడా ఊహించనే లేదు. పైకి మాత్రం "సాయిరామ్! సాయిరామ్!" అని చెప్పడము, లోపల మాత్రం ఒక రకమైన నెగిటివ్ ఆలోచనలతో ఉన్నాను. బస్సులో ప్రయాణం చేస్తున్నంతసేపు బయట భజనలు చేస్తూ మనసులో మాత్రం "సాయి బాబాని నేను మొక్కకూడదు సాయి బాబాని నేను అసలు చూడకూడదు!" ఇట్లాంటి ఆలోచనలు ఉండేవి, మర్చిపోతానేమో అని ఒక బాల్ పెన్నుతో చేతిలో 'సాయిబాబాని నేను మొక్కకూడదు' అని వ్రాసుకొని పదే పదే చూసుకునే వాడిని. ఎందుకంటే ఎవరో చెప్పారు అక్కడ ఏవో మంత్రాలు ఉంటాయి. లోపలికి వెళ్తే అన్ని మర్చిపోతారని. చాలా విచిత్రంగా చెప్పేవారు. చిన్న వయసు, చిన్న తలంపులు. ఆ విధంగా మూడు నాలుగు గంటలు ప్రయాణం చేసి అలసి, సొలసి ప్రశాంతి నిలయం గేట్ దగ్గరికి వెళ్లే సమయానికి, అక్కడ తండోప తండాలుగా జనాలు, ప్రజలు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయ పట్టణ వాటిక లోపలికి వెళ్లడం చూసాను. లోపలికి వెళ్తూనే ఆ గణేశ మందిరం, ఆ ఆకర్షణీయమైన విగ్రహము, దగ్గరలో ఉన్న అశ్వర్థవేప వృక్షాలు... ఇవన్నీ కూడా చూసి నన్ను నేను మర్చిపోయాను అంటే మీరు నమ్మండి!!! ఆ వాతావరణంలో... ఆ అద్భుతమైన ప్రేరణ, ఎంత ఆనందం కలిగిందంటే. మీరు నమ్మరు. ఇన్ని వేల మంది ఉన్నారు, ఎక్కడ శబ్దం లేదు!!! అంతా నిశ్శబ్దంగా ఎవరి హాడావడిలో వాళ్లున్నారు! ఎన్నో కార్యక్రమాలకు ఉత్సవాలకు అక్కడ అందరూ తయారవుతున్నారు. మగపిల్లలందరికీ కూడా ఇప్పుడు ఉన్న రౌండ్ బిల్డింగ్ వెనక షామియానాలు వేసి సౌకర్యం చేశారు. అమ్మాయిలు గురువులు అందరినీ కూడా షెడ్స్‌లో పెట్టారు. అప్పుడు సుమారు 30–40 షెడ్స్ నార్త్ సైడ్ ప్రశాంతి అంటే మన గోపురం గేట్ వైపున ఇప్పుడు మన అన్నదాన కేంద్రం ఉంది కదా! అక్కడ చాలా షెడ్స్ ఉండేవి. మధ్యాహ్నం రెండు గంటలకో మూడు గంటలకో అక్కడికి చేరాము. చేరిన వెంటనే అందరూ కూడా హడావిడిగా స్వామిని చూడాలి, దర్శనం చేసుకోవాలి అని పోలోమని పరిగెత్తుతున్న సన్నివేశం చూశాను. సుమారు నాలుగు గంటల ప్రాంతంలో ప్రశాంతి నిలయంలోకి మమ్మల్ని తీసుకెళ్లారు. ఆ రోజు సుమారు 10 వేల మంది పిల్లలు ప్రశాంతి నిలయంలో! ఇసుక తిన్నెల మీద, మొత్తం పిల్లలే కూర్చొని ఉన్నారు. నేను కూడా ఒక మూల ఒదిగి కూర్చున్నాను. అట్లా తల ఎత్తి చూస్తే కళ్ల ముందర నల్లటి తెర లాగా కనిపిస్తుంది కారణం, నల్ల తలలు కనిపిస్తున్నాయి. పైన నీలాకాశము, క్రింద నల్లటి తలలు, మధ్యలో ఆ ప్రదేశంలో బాబాగారు ప్రశాంతి నిలయం లోపలి గది నుంచి బయటికి వచ్చారు. అద్భుతమైన నిశబ్దం! ఆ నిశ్శబ్దం నాలో చెప్పలేని అనుభూతిని కల్గించింది! అయినా సరే లోపల ఎక్కడో 'ఏయ్ బాబా దేవుడు కాదు! ఏయ్ బాబాని మొక్కకూడదు... అని, చూస్తూ చూస్తూ

ఉండగా అమ్మాయిల వైపు నుంచి స్వామివారు కదులుతూ ఉంటే, స్వామి వారు కదిలి వస్తున్న ఆ ప్రదేశం వైపుకు అలా తలలన్నీ తిరుగుతున్నాయి. అంటే నాదస్వరము విన్న మిన్నాగుల్లాగా ఆ తలలన్నీ కూడా ఇలా ఇలా తిరుగుతుంటే... నాకు అప్పుడు ఏమైందో ఏమో గాని "అదేంటి! ఈ మనిషిని ఇన్ని వేల, లక్షల మంది నమస్కారం చేస్తున్నారే! పూజిస్తున్నారే! భక్తి ప్రపత్తులు చూపిస్తున్నారే! నేనేంటి ఇలా ఆలోచిస్తున్నాను!" అనే ఆలోచన నాకు తట్టింది. తట్టింది కాదు కొట్టింది. స్వామి అలా అలా అమ్మాయిల వైపు నుంచి అబ్బాయిల వైపు వస్తూ ఉంటే నాకు భయం పట్టుకుంది. "ఓయమ్మ! నాయనా! సాయిబాబాకి నేను ఏమనుకుంటున్నానో తెలిస్తే నేను ఇక్కడ ఉంటానా? ఏమంటారో ఏమో? ఏమంటారో ఏమో!" అని అనుకుంటూనే ఉన్నాను. ఎప్పుడు నా చేతులు రెండు కూడా నా హృదయానికి జోడించానో నాకే తెలియదు. కన్నీరు కారుస్తున్నాను, ఆనంద భాష్పాలు రాలుతున్నాయి, "స్వామి! స్వామి! స్వామి! క్షమించు స్వామి! క్షమించు స్వామి! తప్పయింది," అంటూ ఉంటే... స్వామి వచ్చి నా ముందు నుంచి కదులుతూ అలా ఒక్కసారి "కన్నులెత్తి ఒక్కసారి గాంచిన చాలు అంతులేని శక్తి ఆవరించు" అన్నట్టుగా... స్వామి ఓరకంట చూసినట్లు అయి గుండె ఝల్లుమనింది. ఎంత త్వరగా దర్శనం అయిపోయిందో నాకే తెలియదు! చూస్తే... తర్వాత నేను చేతులు జోడించుకుని ఉన్నాను, కళ్ల నుంచి నీళ్లు వస్తున్నాయి, చాలా ఉద్వేగం అయిపోయింది. నా భావనను నేను వివరించలేని స్థితిలో ఉన్నాను.

ప్రప్రథమ సాయి దర్శనం
నా మీద పడిన స్వామి వీక్షణము
నాలోని అజ్ఞానం తొలగిన క్షణము
నాకొక అద్భుతమైన క్షణము

ఈ చమత్కారాలు, ఇంతటితో ముగిసిపోలేదు సుమా! ఆ ప్రశాంతి ప్రస్థానము ఏ విధంగా జరిగిందో ఇంకా వివరంగా చెప్పాలి.

6

వేయి తల్లుల ప్రేమను రుచి చూసిన సమయం

అది 1983 డిసెంబర్ నాలుగవ వారం, క్రిస్మస్ పండుగ వేళ, అంతర్జాతీయ బాలవికాస్ సమ్మేళనం కోసం మేమంతా కూడా ప్రశాంతిలయం చేరాము. మొదటి దర్శనమే నన్ను తీవ్రమైన ప్రభావానికి గురి చేసింది. స్వామి అంటే అపరిమితమైన విశ్వాసము జనింపచేసింది. అయ్యో స్వామి అంటే సాధారణమైన మనిషి కాదు, అంతులేని దివ్యత్వం అనే భావన, అంత చిన్న వయసులో నాకు ఏదో తెలియని అనుభూతి, అట్టి దివ్యానుభవాన్ని ప్రథమ దర్శనంతోనే స్వామి అనుగ్రహించారు. తర్వాత చాలా అమాయకంగా ప్రశాంతినిలయం నాలుగు చరగులా తిరిగాను, ఎలా తిరిగానో చెప్పలేను. అది చలికాలము, నాకు చిన్నప్పటి నుంచి ఆస్తమా ఉంది. ఆ చలి వల్ల అస్తమా వచ్చేసింది. ఇంట్లో ఎప్పుడైనా అస్తమా వచ్చిందంటే గోడకి నాలుగైదు దిండ్లు పెట్టుకొని జారగిలా పడుకుంటే తప్ప ఛాతిలో దడ తగ్గేది కాదు. రాత్రంతా పిల్లికూతలు పెట్టేవాడిని. అమ్మ నాన్న చాలా భయపడి పోయేవారు. నేను ఇట్లా చలికాలంలో స్వామి దగ్గరికి పుట్టపర్తి వెళ్తున్నానే, ఎట్లా? ఏంటి? అనేది వారి ఆందోళన. జ్యోతక్కకు చాలా చెప్పారు, మావాడిని జాగ్రత్తగా చూసుకోండి అని.

పుట్టపర్తి గ్రామం పెద్ద కొండల మధ్యలో ఉంది కదా! చాలా చలి అన్నమాట. ఒక పక్క ఆయాసం ఉన్నా సరే కుతూహలంతో తిరిగే వాడిని. సర్వధర్మ స్తూపం వెనుక పెద్ద పెద్ద షాపులు, తండోప తండాలుగా జనాలు, భజనలు, పూర్ణచంద్ర, కళాత్మకంగా ఉండే భవన నిర్మాణ శైలి, ప్రశాంతి నిలయం ఇవన్నీ చూస్తే హృదయం అంతా చాలా దివ్యంగా మారిపోయింది.

నాకు చిత్రలేఖనం ఒక మంచి అలవాటు కదా! వెంటనే అమాయకంగా నేను బయట నుంచి డ్రాయింగ్ పుస్తకాలు, పెన్సిలు, రబ్బర్ తీసుకొని ప్రశాంతినిలయం ముందు ఇసుక తిన్నెల మీద కూర్చుని రాత్రి సమయంలో మూడు నాలుగు గంటల పాటు ప్రశాంతి నిలయాన్ని నేను అలా చిత్రంగా గీసిన సంఘటన నాకు గుర్తుంది. తరువాత ఇంకో ప్రక్క ప్రశాంతి నిలయంలో పూర్ణచంద్ర ఆడిటోరియం మరొక అద్భుతమైన అనుభవము. మధ్యలో స్తంభాలు లేకుండా వేల మంది కూర్చోగలిగే

స్థలం అక్కడ చూస్తే ఆశ్చర్యం వేసింది! ఆ షాండిలర్స్, అద్భుతమైన వేదిక, వేదికపైన స్వామి కనకాంబర వేషధారణలో చిన్న చుక్కలాగా కనిపిస్తూ ఉండేవారు. మేమే చిన్న పిల్లలము కదా, ఇక ఆ ఉన్నత వేదిక దగ్గరకు వెళ్లి చూడాలంటే ఎంత ఉద్విగ్నంగా ఉండేదో! అంతెందుకు లోపలికి వెళ్తేనే ఒక అద్భుతమైన భావన కలిగింది. స్వామి వారు ఉపన్యాసాలు ఇవ్వడం జరుగుతోంది. ఎంతెంతో మంది మహానుభావులు మాట్లాడుతున్నారు. అన్నీ ఆంగ్లంలోనే ఉన్నాయి. కానీ చిన్న పిల్లలం కాబట్టి ఆంగ్లము అంతా మాకు అర్థం కాలేదు. కానీ ఎలాగోలాగా వచ్చినవారు చిన్నా పెద్దా తేడా లేకుండా ఏదో ఒక కారణం చేత ఎంతో ఉత్సాహంగా కాలం గడుపుతున్నారు. పిల్లలం అందరం ఇవి అన్నీ చూసి మురిసిపోతున్నాము.

రాత్రిపూట మేమంతా కూడా మా విడిది అయిన షామియానాల కిందకి వెళితే, ఉన్నట్టుండి తుఫాన్ పట్టుకుంది. దాని గురించి రేడియోలో వార్త విన్నట్టుగా గుర్తు. అందరూ కూడా చాలా భయపడి పోయారు. వాతావరణం అంతా కూడా గంభీరమైంది. ఎక్కడ చూసినా చిన్న పిల్లలున్న ఆ పరిసరాలలో అందరూ చాలా జాగ్రత్తగా ఉండాలని గురువులు పిల్లలకు చెప్తున్న సంఘటనలు కూడా నేను చూశాను. చాలా అమాయకంగా మనకేమైతుందిలే అని అందరమూ షామియానా టెంట్ లోపలికి వెళ్లి ఓంకారం, భోజన మంత్రం చెప్పి భోజనానికి కూర్చున్నాము. నెయ్యి అన్నం వడ్డిస్తున్నారనుకుంటా, అసలు ఎంత ముచ్చటగా ఉందో ఆ ఆకులు వేసే విధానము, క్రమశిక్షణ, భోజన మంత్రము అన్నీ విచిత్రమైన అనుభవాన్ని కల్గించాయి. నా తోటి కొన్ని వందల వేల మంది పిల్లలు నా చుట్టూరా ఉన్నారు. కరెక్ట్‌గా ముద్ద నోటికి పెట్టుకునే సమయంలో, విపరీతమైన వేగంతో గాలి వాన మొదలైంది. ఆ గాలివాన ఎట్లా వచ్చిందంటే అంత పెద్ద టెంట్లు కూడా గాలికి ఊగడం మొదలు పెట్టాయి. పిల్లలంతా కూడా భయభ్రాంతులతో "అమ్మా! అమ్మా!" అని అరవడం నాకు గుర్తుంది. అంతమందిలో నేను ఏ భయమూ లేకుండా ధైర్యంగా షామియానా నాలుగు ప్రక్కలా పెట్టిన కట్టెలలో ఒక కట్టె పట్టుకొని "జై బోలో పవన సుత హనుమానికి" అని భజన అందుకున్నాను.

'అంజనేయ వీరా హనుమంత సూరా వాయుకుమారా వానరవీరా'

తర్వాత 'జై సాయిరాం జై సాయిరాం' అన్న భజన అందుకున్నాను.

ఇక నాతో పాటు వందల మంది పిల్లలు ఎవరు కూడా బయటకు పరిగెత్తకుండా, ఎక్కడి వాళ్లు అక్కడ షామియానా కట్టెలు పట్టుకొని, భజన చేయడం మొదలు పెట్టారు. చేస్తుంటేనే గాలివాన ఉధృతమైపోయి మా మీద షామియానాలు పడిపోయాయి. షామియానాల్లో కరెంట్ పోయింది. ట్యూబ్లైట్స్ పగిలిపోయాయి. అక్కడంతా భీతావాహమైన వాతావరణం ఏర్పడింది.

అలాంటి సమయంలో రాత్రి 9:30 గంటలకు సేవాదళ్ వాళ్లు వచ్చి మమ్మల్ని అందరినీ బయటకు తీసుకుని వచ్చారు. చిందర వందరగా పడిన సామాను అంతా ఒక చోటికి చేర్చారు.

"పదండి లైన్లో! పదండి లైన్లో! పదండి! అంటూ తీసుకెళ్లినారు. చివరికి మా లైన్ ఎక్కడికి వెళ్లిందంటే, పూర్ణ చంద్ర ఆడిటోరియం వెనకల గ్రీన్ రూమ్ ఉంది కదా, అక్కడ లోపలికి పంపిస్తున్నారు. నేను అనుకున్నాను 'అబ్బా! పూర్ణచంద్ర ఆడిటోరియం లోపల అక్కడెక్కడో కూర్చుని వేదిక వైపు చూడటానికే ఎంతో ఆనందంగా ఉంటే... ఓయమ్మ! అలాంటిది ఇలా లోపలికి కూడా వెళ్తున్నాను! ఎంత ఆనందమో! పిల్లలందరూ కేరింతలు కొడుతూ లోపలికి వెళ్తుంటే... ఆ క్షణంలో రాత్రి 10:00 గంటల సమయంలో, స్వామి వారు స్వయంగా పూర్ణచంద్ర ప్రధాన ద్వారం దగ్గర నిల్చుని, పిల్లలందరినీ... "బంగారు! బంగారు! వెళ్లండి! వెళ్లండి! మీకు ఇక్కడ మళ్లీ టిఫిన్ నేను

చేయిస్తున్నాను. పూరి, సాగు... చక్కగా తినండి." అంటూ స్వామి ఎంతో దయతో, మాతృ ప్రేమతో అంత రాత్రి వేళ పూర్ణచంద్రకి మాకోసం వచ్చారు...! భరించలేని ఆనందం అయింది పిల్లలందరికీ.

పూర్ణచంద్ర ఆడిటోరియంలో మమ్మల్ని మళ్లీ కూర్చోబెట్టారు. స్వామి స్వయంగా దగ్గరుండి అందరికీ వడ్డన చేయించారు. ఆ రోజు రాత్రి పూరి సాగు తిన్నాం. ఇక ఆనందమే ఆనందం. రెండు రోజుల్లో ముగింపు కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంలో స్వామి మాట్లాడడం మొదలు పెట్టారు. అద్భుతమైన ప్రసంగము! ఇక ఆ ప్రసంగము నన్ను ఎంత ప్రభావితం చేసిందంటే... అబ్బా! ఇదిరా అసలు జీవితం అంటే ఇట్లా ఉండాలిరా, ఇదిరా భక్తి అంటే! ఇదిరా ప్రపత్తి అంటే! అన్న ఆలోచన కలిగింది. స్వామి వారు ఉన్నట్టుండి "ముందు రోజు జరిగిన వృత్తాంతం చెప్తున్నాను నా పిల్లలో ఎంత అద్భుతమైన పిల్లలు నేను చెప్తున్నాను ప్రపంచానికి ఈ బాలవికాస్ పిల్లలు దేశ దేశాల నుంచి వచ్చి ఏ సౌకర్యము లేకున్నా, ఏ ఆధారం లేకున్నా... షామియానాల్లో... గాలీ వర్షములో కూడా ఏమాత్రం బెదరకుండా... పారిపోకుండా, ఎవరూ కూడా ఏడవకుండా, అమ్మ నాన్న అనకుండా, సాయిరామ్! సాయిరామ్! అంటూ స్వామి నామాన్ని చెప్పారు... నాకు చాలా ఆనందమైంది! ఎంతో ఆదర్శమైన భక్తి ప్రపత్తులు మా పిల్లలు కనపరిచారు" అని స్వామి చెప్తుంటే ఎంతో ఆనందమైపోయింది. అది మాటల్లో చెప్పలేను. ఆ ఆనందంలో అందరూ కూడా చప్పట్లే చప్పట్లు, జై సాయిరామ్! జై సాయిరామ్! అని అంటున్నారు. అబ్బాయిలందరూ స్వామి మా గురించి చెప్పారని చాలా ఆనంద పడిపోతున్నారు.

స్వామి చెప్పారు, "బంగారు! మీరందరూ కూడా మీ తల్లి దగ్గరికి వచ్చారు... మీ అసౌకర్యము నా అసౌకర్యం కాదా! మీరు ఏమాత్రం అసౌకర్యపడకూడదు. మీరు కడుపునిండా తినండి. మీరు ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు ఉండండి."

ఇక్కడ వసతి మరియు భోజన సౌకర్యానికి డబ్బులు వసూలు చేశారని నేను ఇప్పుడే అఖిల భారత అధ్యక్షుడి నుండి తెలుసుకున్నాను. ఛీ! ఛీ! అమ్మ, బిడ్డలకి అన్నం పెడితే డబ్బులు తీసుకుంటుందా? నేను ఇప్పుడే ప్రకటన చేస్తున్నాను, ఏ డబ్బులైతే తీసుకున్నారో సత్యసాయి కేంద్రాల ద్వారా, పిల్లలందరికీ కూడా డబ్బులని వెనక్కి ఇచ్చేయమని చెప్పాను. ఎన్ని లక్షలయినా సరే! అన్ని వెనక్కి ఇచ్చేయమని చెప్పాను" అని స్వామి వారు అంటుంటే ఆ మాటలు విని పూర్ణచంద్ర ఆడిటోరియం ఊగిపోయిందండి. పిల్లల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. సాయిరాం! సాయిరాం! అని కేరింతలు, చప్పట్లు కొడుతుంటే స్వామి మాటలు అందరి హృదయానికి హత్తుకొని పోయాయి.

నాకైతే ఇంకా ఆనందం, ఇంట్లో పోరు పెట్టి వచ్చాను కదా..100 రూపాయలు వెనక్కి ఇచ్చారే అని. అనంతపురం జిల్లా కాబట్టి 100, వేరే రాష్ట్రం అయితే? ఇంకా దూరమైతే? ఎన్ని రూపాయలు తీసుకొని ఉంటారో! అన్ని లక్షల రూపాయలు కూడా స్వామివారు వెనక్కి ఇచ్చేసారు.

అంతే కాదు, "పిల్లలు ఎప్పుడైనా ఎవరైనా అమ్మ దగ్గరికి వచ్చినప్పుడు వెళ్లేటప్పుడు ఏమి ఇవ్వకుండా పంపిస్తుందా? మీకు రేపు ప్రొద్దున పూర్ణచంద్ర సభా ప్రాంగణంలో పాద నమస్కారం ఇస్తున్నాను," అని స్వామివారు అంటుంటే, అబ్బో! అసలు ఇక ఆనందమే ఆనందం.

పూర్ణచంద్ర హాల్‌లో వేల మంది పిల్లలు వరుసలలో కూర్చుంటే మధ్యలో స్వామి వారు ఎంతో దయతో నడుస్తూ అందరికీ పాద నమస్కారం, అనుగ్రహించారు.

నా వరుసకి వచ్చి, నా ముందు నిల్చుని నా తల మీద చెయ్యి పెట్టారు, నన్ను చూశారు. నేను పాదాలు ముట్టుకున్నా అనుకున్నాను ముట్టుకోలేదు. అయ్యో పాద నమస్కారం పోయింది అనుకున్నాను.

స్వామి వారు అందరికి ఒక బహుమతి పొట్లం ఇచ్చారు. అందులో, పుస్తకము, లాకెట్, ఫోటో, క్యాలండర్, పెన్ను, విభూతి ప్రసాదము... ఇట్లాంటివన్నీ కూడా ఇచ్చారు.

అంతటితో ఆగలేదు స్వామి. వారి ఆనందం అంతా ఇంత కాదు.. పిల్లల్ని చూసుకుంటూ... ఆ స్టేజ్ మీదకి వెళ్లి, మళ్లీ మైక్ తీసుకొని చెప్పారు "బంగారు! మా అమ్మాయిలందరికీ కూడా చీరలు పెడుతున్నాను ఈ రోజు" అని చెప్పారు. ఇట్లా చేతితో తెమ్మని సైగ చేస్తూనే, స్వామి వారి విద్యార్థులు దొంతర్లు దొంతర్ల చీరలు తీసుకొచ్చారు. ఇటు వైపు మా అబ్బాయిలందరూ కూడా "స్వామి మాకు.. మాకు..." అని అంటే.. మీకు కూడా చీరలు కావాలా? అని జోక్ చేశారు. మొత్తం హాలు అంతా నవ్వేసింది. లేదు లేదు మీకు కూడా పంచెలు ఇస్తాను, అని చెప్పి మా అందరికీ పంచెలు పంపించారు. మీరు ఊహించగలరా... మొదటి సందర్శనలో ప్రశాంతి నిలయంలో ఒక తల్లి దగ్గరికి వెళ్లిన బిడ్డలాగా, తండ్రి దగ్గర ఆడుకున్న కొడుకులాగా, గురువు దగ్గరికి వెళ్లిన ఒక శిష్యుడి లాగా స్వామి వారి ప్రేమను, అనిర్వచనీయమైన అనుభూతిని నేను అనుభవించాను.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటారా? ఇంకా ఎన్నాళ్లు బ్రతుకుతానో తెలియదు. ఈ దివ్యానుభూతులు మాత్రం నా చివరి శ్వాస దాకా గుర్తుంచుకునే మధుర జ్ఞాపకాలు. అలాంటి అనుభూతులను అందరితో పంచుకోవాలని... నేను అక్కడే ఉన్నాను. స్వామి సేవలో! అలా చేసినప్పుడు, స్వామి వారు 40 ఏళ్ల క్రితం ఎలా సంచరించారు అన్నది పాఠకులందరూ మళ్లీ తలచుకోవచ్చు అనే భావనను నేను మీతో పంచుకుంటున్నాను.

7

సాయి షష్టి పూర్తి... సభ్యులందరిలో స్ఫూర్తి

స్వామి వారి ప్రథమ దర్శనం 1983 డిసెంబర్‌లో ప్రశాంతి నిలయంలో జరిగింది. స్వామి మీద అచంచలమైన విశ్వాసం కలిగింది. చిన్ననాటి నుంచి నరనరాల్లో, కణకణాల్లో జీర్ణించుకుపోయిన దైవభక్తి ప్రేరకము కాగా, స్వామిపై అనురక్తి దినదిన ప్రవర్ధమానమైంది. 1983 నుండి 1985 దాకా ఈ రెండు సంవత్సరాలు కూడా చాలా అద్భుతమైన సమయము అని నేను చెప్పాలి. కారణం ప్రపంచం దేశాలలో ఉండే స్వామి వారి భక్తులు అందరూ స్వామి షష్టిపూర్తి మహోత్సవాన్ని షష్టి స్ఫూర్తి మహోత్సవంగా చేసుకుంటున్న రోజులు అవి. ఎక్కడ చూసినా వారాల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి ఉత్సవాలు ఎలా చేయాలి అని ప్రణాళికలు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు స్వామివారి షష్టిపూర్తి మహోత్సవాలను (1980–85) ప్రపంచవ్యాప్తంగా జరిపారు.

మొదటి సారి పూర్ణచంద్రలో స్వామి వారు ఇచ్చిన చిన్న కానుకలను చాలా అపరూపంగా చూసుకునేవాడిని. ఎంత అపురూపమంటే స్వామి వారు ఇచ్చిన ఫోటో ఫ్రేమ్ కట్టుకుని నా అల్మారాలో పెట్టుకున్నాను

... ఆ తరవాత ఆ ఫోటో మా పూజా గదిలోకి చేరింది. సాక్షాత్తు భగవంతుడు ఇచ్చిన బహుమతి కదా, ఇక దాన్ని చాలా అపురూపంగా చూసుకునేవాడిని. స్వామి ఇచ్చిన పెన్నుని కేవలం పరీక్షలకు మాత్రమే వాడేవాడిని. స్వామి ఇచ్చిన పతకం మెటాలిక్ సిల్వర్‌ది. దాన్నేమో ఒక బంగారు వస్తువు లాగా చూసి మెడలో వేసుకుని లోపల ఉంటే కనపడదు, స్వామీ ఇచ్చారు, అందరికీ చూపించుకోవాలి అన్నట్టుగా నా కాలర్ కింద నుంచి షర్ట్ మీద రోజు వేసుకుని బయటకి వచ్చేవాడిని. బడికి వెళ్లినా, బయటికి వెళ్లినా, భజనకి వెళ్లినా అది మెడలో ఒక నాగాభరణం లాగా వేసుకుని తిరిగే వాడిని, నుదుటి మీద స్వామి విభూతి పెట్టకుండా, స్వామి ఫోటో జోబిలో లేకుండా, బయటికి వచ్చేవాడిని కాదు. ఇవన్నీ ఆలోచిస్తే ఏం చెప్పాలి? ఒక ప్రేమికుడు లాగా, ఒక ప్రేయసి లాగా స్వామిని ప్రేమించేవాడిని, తలుచుకునే వాడిని. స్వామి నామము, రూపము ఇదంతా కూడా నన్ను

విచలుతుడిని చేసిందంటే సందేహం లేదు.

ఇనుము అగ్నిలో కాలితే ఎలా మెత్తబడిపోతుందో అలాగా మొత్తం నా జీవితంలో ప్రతి అణువు స్వామి యొక్క నామము చేత భక్తితో మెత్తబడిపోయింది.

అలాంటి సమయంలో మరో అద్భుతమైన ఇద్దరు వ్యక్తుల్ని స్వామి నా జీవితంలోకి ప్రవేశపెట్టారు. ఆనాడు అనంతపురం జిల్లా సేవాదల్ సమన్వయకర్తగా ఉన్న డాక్టర్ నలబాల అంజనయ్య MA,Ph.D., అయితే... రెండో వ్యక్తి ఆనాటి జిల్లా బాలవికాస్ సమన్వయకర్తగా ఉన్న వి నాగభూషణరావు గారు, వారి మాటలు, వారి చేతలు నన్ను ఎంత ప్రభావితం చేశాయి అంటే, మంత్ర ముగ్ధుడిగా అయిపోయే వాడిని. వారు చెప్పే మాటలు అన్నీ వినాలని చెవి కోసుకునేవాడినంటే నమ్మండి... వేదిక మీద టేబుల్ అటు సైడ్ వారు కూర్చుంటే వేదిక ముందర క్రింద మొదటి వరుసలో నేను కూర్చునేవాడిని. ఎంతో ప్రేమగా, ఎంతో భక్తి శ్రద్ధలతో వారి ప్రసంగాలు వినేవాడిని.

ఆ సమయంలో మొట్టమొదటిసారి నేను 60వ పుట్టుపండుగ సందర్భంగా, స్వామి వారి విశేష సేవా కార్యక్రమాల గురించిన వివరాలు విన్నాను. అంజనయ్య ఒక పుస్తకం ప్రింట్ చేసి, ఆ పుస్తకంలో విద్యా విభాగము, సేవా విభాగము, ఆధ్యాత్మిక విభాగములలో చేయగలిగిన సేవా కార్యక్రమాల జాబితా తయారు చేసి ఒక్కొక్క దాని కింద 60 కార్యక్రమాలు ప్రకటించి, ఈ కార్యక్రమాలని స్వామి 60వ పుట్టుపండగ సందర్భంగా చేసుకోవాలని ఆయన ప్రచారం చేస్తున్నారు.

చాలా అమాయకంగా... ఎంత అమాయకం అంటే ఆ చిన్న పుస్తకాన్ని ఒక బైబిల్ లాగా, ఒక ఖురాన్ లాగా, ఒక భగవద్గీత లాగా తీసుకొని, నాకు 13-14 ఏళ్ల వయసులో నేను చేయగల విషయాలన్నింటినీ టిక్ వేస్తూ, వాటిని ఇంకో పుస్తకంలో వ్రాసుకొని పాటించాలి అని ప్రయత్నం చేశాను. అదే పుస్తకంలో, నేను స్వామి యొక్క 60వ జన్మదినానికి ఎలా తయారవ్వాలో, నా అర్పణ, సమర్పణ ఎలా ఉండాలో అనేక ఆలోచనలు వ్రాసుకున్నాను. అవన్నీ నా మనసును లోతుగా తాకాయి. ఈ ఆలోచనలన్నీ నన్ను ఉండనీయలేదు. అనునిత్యము ఇంకా ఇదే ఆలోచన స్వామి పుట్టు పండుగ సందర్భంగా నేను ఎలా తయారు కావాలి, వారి అనుగ్రహం నేనెలా పొందాలి అని. నాలాగానే స్వామి 60వ పుట్టు పండుగకు అందరూ ఎవరి సాధనలో వాళ్లు నిమగ్నమై ఉన్నారు. ఏమిటి సాధన అంటే... 60 రోజుల పాటు నిత్య ప్రార్థనలు, నిత్య సుప్రభాతము, నిత్య నగర సంకీర్తన, దైనందిక ప్రార్థనలు అంటే... పొద్దున లేస్తూనే కరాగ్రే వసతే లక్ష్మి, సుప్రభాతము, తర్వాత స్నానానికి ముందు చేసే ప్రార్థన, భోజన ప్రార్థన, సుఖశయన ప్రార్థన ఇలా నిత్య ప్రార్థనలు చేయడం, 60 రోజుల పాటు ప్రతి నిత్యము భజన చేయడము, నిత్య సత్యవ్రతము అంటే సత్యమే చెప్పాలి అబద్ధం చెప్పకూడదు అన్న ఆలోచనా విధానము, అలాగే నిత్య సేవా కార్యక్రమాలు, నిత్య దైనందిని (డైరీ) వ్రాయడం, 60 రోజుల పాటు నిత్య అష్టోత్తరం / నిత్య సాయి సాహిత్య పఠనం, ఇలాగా నాకు చేతనైనంత విధంగా ఎలా చేశాను అంటే ఆ 60 రోజులు తలుచుకుంటే... ఈరోజు నా యొక్క వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ఉపయోగపడిన నిత్య సేవా కార్యక్రమాలు అవి అని నేను గుండె మీద చెయ్యి వేసుకొని ఘంటాపదంగా చెప్పగలను.

ఈ విషయాలు చెప్తున్నప్పుడు... ఒక మంచి సంఘటన నాకు గుర్తుకు వచ్చింది. ఈ పుస్తకం ముద్రించిన తరవాత డాక్టర్ ఆంజనయ్య స్వామితో పాటుగా చాలా మంది ప్రముఖులకు దిన్ని పోస్ట్ చేశారు. స్వామి వారు గదిలో ఉన్నప్పుడు... శ్రీ కస్తూరి గారు మాటల సందర్భంలో ఈ పుస్తకం గురించి ప్రస్తావించారట. స్వామి! ఏమిటి ఈ అంజనయ్య ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నాడు. 60

రోజులు చేస్తే ఏమి వస్తుంది? అంటే... స్వామి వారు చెప్పారట. కనస్తూరీ, ఆయన ఉద్దేశ్యం ఏమిటి అంటే... 60 రోజులు ఏదైనా పని ఎవరైనా సరే ఒక దీక్షలా చేస్తే... 61వ రోజుకి ఖచ్చితంగా వాడికది జీవన శైలి లాగా మారుతుంది అని ఆయన ఆలోచన. మంచి ఆలోచనే కదా, బాగుంది కదా అన్నారట. ఇలా స్వామి వారి ఆశీస్సులకు నోచుకుంది కాబట్టి, గత నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రత్యేక సేవా సాధనా ప్రక్రియ ఏదో ఒక రూపంలో ఇప్పుడు, అంటే శత వర్ష బ్రహ్మోత్సవం సమయంలో కూడా ఇంకా సాగిపోతూనే ఉంది. ఆంజనయ్య స్వామితో చేరినా... వారిచ్చిన స్ఫూర్తి ఇంకా ఆరని జ్యోతిలా వెలుగుతూనే ఉంది అని చెప్పక తప్పదు.

ఈ సాధన ద్వారా ఎవరు బాగుపడ్డారో ఎవరు బాగుపడలేదో నాకు తెలియదు కానీ... నేనైతే బాగుపడ్డాను అనుకుంటాను. ఈ విధంగా 60 రోజుల పాటు చేసిన నిత్య సేవా కార్యక్రమాలు నన్ను ఎంతో పరిణితికి, పరివర్తనకి గురిచేసాయి అని చెప్పుకోవాలి.

స్వామి వారి 60వ పుట్టు పండుగ ఇంకా కొన్ని నెలలు ఉంది అన్న సందర్భంలో... ఆరోగ్య పోషణ, పోషకాహార లోపం ఉన్న చిన్నారి బాలబాలికలకి "సాయి పౌష్టికాహారం" ఒకటి సిద్ధం చేశారు. సత్యసాయి సేవా సంస్థలలో డాక్టర్ ఆంజనయ్య గారి ఆధ్వర్యంలో చాలా శాస్త్రీయంగా పరిశోధన చేసి కొన్ని రకములైన శ్రీ ధాన్యాలతో, పోషకాలతో తయారు చేసి ప్రతి ఊరిలో ఎంపిక చేసిన చిన్నారి పిల్లలకి అందించాలని ఆలోచన చేశారు. దానికి తాడిపత్రిలోని సత్యసాయి సేవా సమితి సమావేశంలో ఇది చేయాలి అని నిర్ణయం చేశారు.

ఎవరు దీనికి ముందు ఉంటారు అని అడిగితే 14 ఏళ్ల వయసులో నేను చెయ్యి ఎత్తి, నేను దీనికి ముందు ఉంటాను అని చెప్పాను. అప్పుడు చెప్పారు "బాబు ఇది అంత చిన్న విషయమేమీ కాదు, 40 రోజులు, ప్రతి రోజు ఎంపిక చేసిన మురికి వాడలో కనీసం 60 మంది పిల్లలకు ఈ పౌష్టికాహారం ఇవ్వాలి, ఆలోచించుకుని చెప్పు" అన్నారు. నేను సరే అని చెప్పాను. ప్రతి రోజు సాయంకాలం 4 గంటలకు వెళ్తాను అని చెప్పాను. అంతే కాదు నాయనా, నువ్వు సాయి సంస్థ సభ్యులు ఒక్కొక్కరి ఇంటికి వెళ్లి ఆ రోజుకు ధాన్యం సేకరించి, పిండి మిల్లుకి వెళ్లి, వాటిని పిండి కొట్టించి, ప్రోటీన్ ఫుడ్‌గా తయారు చేసి, విభూది కలిపి, దాన్ని డబ్బాలో వేసుకొని, ఒక్కొక్కటీ స్పూన్‌తో ఔషధం లాగా ఇవ్వాలని చెప్పారు.

అలా మొదలైంది సాయి పౌష్టికాహార పంపిణీ సేవ. తాడిపత్రిలో చాంద్ టాకీస్ ఉండేది. ఆ థియేటర్ వెనక ప్రాంతంలో ఇందిరా నగర్ అనే ఒక బస్తీ ఉంది. మేమంతా పెద్దవాళ్లతో వెళ్లి చూసాం. ఆ బస్తీలో చాలా చిన్న పిల్లలు ఉన్నారు. ఆ పిల్లలందరి పేర్లు వ్రాసుకుని 40 రోజుల పాటు ప్రతిరోజు వెళ్లడం అక్కడ వాళ్లకు పంచడం చేశాను. నేను వెళ్లిన మొదటి వారంలో పిల్లలందరూ కూడా నన్ను చాలా తమాషాగా చూసేవాళ్లు. అక్కడ ముస్లిమ్స్, క్రిస్టియన్స్, హిందువులు ఇలా అన్ని మతాల వాళ్లు ఉండేవాళ్లు. వాళ్లందరూ కూడా నన్ను చూసి నవ్వేవాళ్లు. వాళ్లు నా దగ్గరికి వచ్చే వాళ్లు కాదు. ఆ చిన్న వయసులో అరే స్వామికి సేవ చేయాలని, అన్న ఆలోచనతో గట్టిగా మాట్లాడుతూ, గట్టిగా భజన చేస్తూ, పిల్లలందరినీ తమాషాగా పలుకరిస్తూ, అందరినీ ఒకచోట కూర్చోబెట్టి కాస్త ప్రార్థన చేయించి, వాళ్లతో ఆ పౌష్టికాహారాన్ని తినిపించే వాడిని. క్రమేపి వాళ్ల ఆరోగ్యంలో మంచి ఫలితం కనిపించింది. అట్లాగే వాళ్ల ప్రవర్తనలో, ప్రేమ పలకరింపులో మార్పును చూశాను.

నేను నిజంగా ఆ 40 రోజుల్లో ప్రతిరోజు మధ్యాహ్నం రెండుగంటలప్పుడు, అంటే స్కూల్ ఐపోయి భోజనం చేసిన తర్వాత, ఒక్కొక్క సభ్యుడు ఇంటికి వెళ్లి చిన్న సైకిల్లో డబ్బా పెట్టుకొని, ఆ

డబ్బాలో అన్ని ధాన్యాలు వేసుకొని, పిండి మిల్ వెళ్లి పిండి కొట్టించి తీసుకొని సాయింత్రం నాలుగు గంటలకి ఆ ప్రాంతానికి వెళ్లేవాడిని.

ఇలా చేస్తున్న సందర్భంలో

నాకు ఒక సంఘటన జరిగింది, మా ఊరిలో ఉన్న బంగారు వర్తకుడు కుల్లూరు సుబ్బారాయుడు. వాళ్ళు చాలా డబ్బున్న వాళ్లు, చాలా మంచి దయ గల హృదయం వారిది. ఆయన సాయి సంస్థ సభ్యుడు. వంతు ప్రకారం ఎవరింటికి వెళ్తున్నాము అని ముందే వాళ్లకు సమాచారం ఇచ్చేవాళ్లం. అందరూ కూడా ఇళ్లకి వెళ్తే ధాన్యం బయటకు తెచ్చి ఇచ్చి పంపించారు. కానీ ఈయన ఇంటికి వెళితే, ఎంతో ప్రేమతో "అయ్యా! బాలచంద్ర! దా నాయనా! నీ గురించే వేచి ఉన్నా" అంటూ ఆయన నన్ను ఇంటి లోపల దేవుడి గదికి తీసుకెళ్లి నన్ను కావలించుకొని, "నాయనా! నువ్వు ఈ రోజు ఇంటికి వస్తావని నాకు తెలుసు. చాలా సంతోషం! మంచి సేవ చేస్తున్నావు నాయనా, మీ నాన్న కూడా నాకు తెలుసు. నువ్వు ఇంత చిన్న వయసులో మంచి పని చేస్తున్నావ్. నీ కోసం నేను కొన్ని పుస్తకాలు, పెన్నులు తెప్పించాను," అని చెప్పి దేవుడి పీఠం క్రింద నుంచి కొత్త బ్యాగ్ తీసి, ఆ బ్యాగ్‌లో కొన్ని పుస్తకాలు ఒక హీరో పెన్, తర్వాత 100 రూపాయల డబ్బు ఇవన్నీ నాకు ఇచ్చి... నమస్కారం చేశారు. "నువ్వు చేస్తున్న సేవకి నేను ఇంకా ఏం చేయాలో తెలియదు నాయనా..." అని ప్రోత్సహించారు.

ఆ ప్రేమని నేను ఊహించనే లేదు. ఇదేమిటి ఇట్లా చేశారు? అప్పుడు అనిపించింది, ఒక మంచి కార్యము చేస్తే ఇంత మంచి భావన ఎదుటి వాళ్లలో కలుగుతుందా? అని అనిపించింది. నా జీవితంలో ఇది నేను మర్చిపోలేని ప్రభావం, భావన, అనుభవం అని చెప్పుకుంటాను. స్వామి పుట్టు పండుగ సేవలలో భాగంగా సామాన్యులకు చేసిన సేవలలో అసామాన్యమైన ప్రేమను పొందిన సంఘటన ఇది.

అలాగే ఇక రెండో సంఘటన ఏంటంటే..ఆ మురికి వాడలో చాలా మంది గర్భిణీ స్త్రీలు కూడా ఉన్నారు, వాళ్లకి కూడా ఇచ్చేవాడిని ఈ పౌష్టికాహారం. ఇది రోజు తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది అని చెప్పి వాళ్లకి ఇచ్చేవాడిని. నేను ఆ 40 రోజుల్లో వెళ్లిన సందర్భంలో, ఓ గర్భిణీ పురుడు పోసుకుంది. వారు ఆ బాలుడికి "సాయిరామ్" అని పేరుపెట్టుకున్నారు. ఆ విషయం కూడా నన్ను చాలా ప్రభావితం చేసింది.

ఆ 40 రోజులు నేను ఒక్కడినే వెళ్లాను. నాతో వచ్చిన వాళ్లు ఎవరూ లేరు కానీ, 40వ రోజు యావత్ సత్యసాయి సేవా సంస్థలో సభ్యులందరూ కూడా సుమారు 40-50మంది గ్రామంలో ఉన్న వాళ్లందరూ వచ్చి అక్కడ భజన చేసి ముగింపు కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చినవాళ్లు అందరూ ఈ విశేషాలు విని "అరే ఈ చిన్న అబ్బాయి ఇట్లాంటి పని చేశాడా! చాలా సంతోషం నాన్న! చాలా మంచి పని చేశావు నాన్న!!" అని అందరు నా భుజం తట్టారు, ఉత్సాహపరిచారు, ప్రోత్సాహమందించారు.

అప్పుడు అనుకున్నాను... చేస్తే ఇలాంటి సేవలు చేయాలి. 10 మందికి ఉపయోగపడే సేవలు చేయాలి. అంటే భజనలో, నగర సంకీర్తనలో పొందే ఆనందం కంటె ఆ 14 ఏళ్ల వయసప్పుడు ఇలాంటి సేవలో ఎక్కువ ఆనందం పొందాను అనిపించింది.

దాదాపు ఆ సమయంలోనే అనుకుంటాను కంచి శంకర మఠం పరమాచార్య, శ్రీ చంద్రశేఖరేంద్ర

సరస్వతి వారు, శ్రీ జయేంద్ర సరస్వతి వారు, శ్రీ విజయేంద్ర సరస్వతి వారు మా గ్రామానికి వచ్చారు. వారు చాతుర్మాసం చేశారు, సత్యసాయి సేవా సంస్థ తరపున సేవాదళ్ అక్కడ జనాన్ని నియంత్రించడానికి, ప్రసాద వితరణ చేయడానికి, భోజనం వడ్డించడానికి, కూరగాయలు తరగడానికి ఇలా చాలా మంది పాల్గొన్నారు.

అప్పుడు నేను తొమ్మిదో తరగతి అనుకుంటా. స్కూల్ అయిపోయిన తక్షణము పరిగెత్తుకుంటూ వెళ్లేవాడిని అక్కడికి. స్వామీజీలు ఉన్న చాతుర్మాసం ప్రతిరోజు కూడా క్రమం తప్పకుండా ఒక అద్భుతమైన ప్రేరణతో వెళ్లి సేవ చేసేవాడిని. అప్పుడు శ్రీ జయేంద్ర సరస్వతి గారు నాతో సంభాషించారు. 'నీవు చాలా మంచి పని చేస్తున్నావు బాబు' అని చెప్పారు. ఆయన నా పేరును కూడా గుర్తుపెట్టుకున్నారు. 'బాలచంద్ర' అని పిలిచి, 'ఏమయ్యా బాలచంద్రా... నీవు బాల సన్యాసివే!' అని అన్నారు. ఆయన ఎంతో ఆశీర్వాదాలు ఇచ్చారు. చివరి రోజు నన్ను ప్రత్యేకంగా పిలిచి కామాక్షి పతకాన్ని ప్రసాదించారు. స్వామి వారి 60వ పుట్టు పండుగ సందర్భంగా చేసిన ప్రతి సేవ కూడా చిరస్మరణీయం అయ్యిందంటే ఏ సందేహమూ లేదు.

60వ పుట్టుపండుగ దివ్య సేవ కార్యక్రమము నా స్వీయ పరివర్తనకు అద్భుతమైన వేదికగా మారింది. ఇవన్నీ కూడా నేను స్వామి వారిని ఇంకా దగ్గరగా... మరింత దగ్గరగా... ఇంకెంతో దగ్గరగా వెళ్లడానికి కారణములుగా నిలిచాయి అని చెప్పుకోవాలి. ఈ విధంగా స్వామి యొక్క సేవలలో నేను 1985లో పుట్టు పండుగ సందర్భంగా ప్రశాంత నిలయానికి ప్రయాణం అయ్యే పరిస్థితి వచ్చింది.

8

పర్తి వాసుని షష్టి పూర్తి సేవలు

1985 నవంబర్ 23 స్వామివారి 60వ పుట్టు పండుగ మహోత్సవం చాలా పెద్ద ఎత్తున జరుగుతోందని ఎంతో మంది చెప్తూ... ఎన్నో విశేషాలు మాకు వివరిస్తుంటే చాలా ఉత్సుకతగా చాలా ఉత్సాహంగా మనసు పులకరించి పోయేది. నేను కూడా షష్టి పూర్తి సేవలకు వెళ్లాలి అని చాలా పరితపించేవాడిని. నా వయసు 14-15 సంవత్సరాలు, కనీసం 18 ఏళ్లైనా ఉండాలి సేవాదళ్‌గా నమోదు చేయడానికి, అప్పుడే సేవాదళ బాడ్జ్ ఇస్తారని చెప్పేవాళ్లు.

కానీ, నేను ఎలాగైనా పాల్గొనాలని అందుకు స్వామి దయ చూపించాలని హృదయపూర్వకంగా ప్రార్థించేవాడిని. "స్వామి నేను కూడా రావాలి! 60వ పుట్టు పండుగ సందర్భంగా, పెద్దవాళ్లందరూ కూడా రెడీ అయిపోయారు" అంటూ ప్రార్థించేవాడిని.

అమ్మ, జ్యోతక్కతో పాటూ మా ఊరు తాడిపత్రి నుండి చాలా మంది ప్రశాంతి నిలయంకి సేవల కోసం బయలుదేరారు. నేను కూడా ఎలాగో అలాగా ఇంట్లో అనుమతి తీసుకొని మొట్ట మొదటిసారి సేవాదళ్ విధులు నిర్వర్తించాలని బయలుదేరాను.

జీవితంలో ప్రశాంతి నిలయంలో 15-20 రోజుల పాటు ఉండే సువర్ణ అవకాశం స్వామి ఇచ్చారు. నేను పేరు నమోదు చేయబడని ఫ్రీ సేవాదళ్ కావున, ఇక స్కార్ఫ్ వేసుకోవడం, ఎక్కడ సేవ అవసరం ఉంటే అక్కడ సేవ చేయడం జరిగేదన్నమాట. ఎక్కడో అక్కడ తల దాచుకుని ఉండాల్సి వచ్చింది. ఆ రోజుల్లో విపరీతమైన చలి ఉండింది. దానివల్ల ప్రతి రోజు సాయింత్రం అయితే ఆస్తమా వచ్చేది. ఒక పిల్లికూనని తల్లి పిల్లి ఎలా పట్టుకొని పోయేదో అట్లాగ నా లగేజ్ బ్యాగ్‌ని ఒక్కోరోజు ఒక్కొక్క బిల్డింగ్‌కి తీసుకెళ్లి ఎక్కడ తల దాచుకునేందుకు ఉంటే అక్కడ రాత్రంతా పడుకునేవాడిని. ప్రొద్దున్న లేస్తూనే చక్కగా రెడీ ఐపోయి ఆ స్కార్ఫ్ వేసుకొని ఎక్కడ వీలుంటే అక్కడ తినేయడం సేవ చేసుకోవడం చేసేవాడిని. ఒక సౌకర్యం లేదు, సరియైన భోజనం లేదు, ఆశ్రయం లేదు, నమోదు లేదు, సేవ విధులు లేవు. ఇలా ఏమి లేకుండా కేవలం హృదయపూర్వకమైన

కృతజ్ఞతా భావంతో స్వామి మీద ప్రేమతో పుట్టపర్తికి వెళ్లడం జరిగింది.

క్యాంటీన్‌లో ప్రొద్దున నుండి మధ్యాహ్నం దాకా టిఫిన్ & భోజనం అప్పుడు వీలైనంత సేపు జల వితరణ సేవ చేసేవాడిని. ఆ సమయంలో నేను ప్రశాంతి నిలయంలో ముగ్గురు చాలా చురుకైన పిల్లలను తొలిసారి కలిసాను. సాయిరామ్, గురుప్రసాద్, అశ్విన్. వాళ్లు ముగ్గురు హైద్రాబాద్ నుండి వచ్చారు. సాయిరామ్ అప్పుడే డిగ్రీ మొదటి సంవత్సరం ఐపోయింది. వాళ్ల వేష, భాష, స్టైల్ ఇదంతా నాకు బాగా నచ్చింది. వాళ్లతో పరిచయం పెంచుకున్నాను. నాకు 15 ఏళ్లు కదా! వాళ్లతో పాటు "అన్నా! నేను కూడా మీతో వస్తాను" అని చెప్పి వాళ్లతో పాటు వెళ్లాను. అందరము కలసి ఉండాలని నిర్ణయించుకున్నాం. అప్పుడు West Prasanthi 2లో బీవీ రమణారావు గారి గది ముందర వరండాలో చిన్న పరుపులు వేసుకొని అక్కడ పడుకోవడం, పొద్దున్నే లేచి స్నానాలు చేసేసి, ఎక్కడ వీలైతే అక్కడికి పరిగెత్తుకుంటూ వెళ్లిపోయి అక్కడ సేవలు చేయడము ఇలా జరిగేదన్నమాట.

ఒకరోజు పూర్ణచంద్ర ఆడిటోరియంలో సేవ ఉంది అని తెలిస్తే మనమందరం వెళ్లొచ్చు అని మాట్లాడుకొని అక్కడ వెళ్లాము. అక్కడ 6.5 అడుగుల పొడవు ఉన్న ఒక వ్యక్తికి తారసపడ్డాడు. ఆయన పేరు ఇంద్రేశ్వరరావు. మమ్మల్ని చూసి "ఏయ్! పిల్లలు జాగ్రత్త! పిచ్చి పిచ్చి పనులు చేయొద్దు! స్వామి వస్తే చాలా జాగ్రత్తగా ఉండాలి, చాలా క్రమశిక్షణగాఉండాలి అని చెప్పారు". వారిని చూస్తే చాలా భయమైంది. మేము చిన్న బుడతల్లాగా పూర్ణచంద్రాలో కుర్చీలను శుభ్రం చేయడం, చెత్త ఊడువడం, దుమ్ము దులపడం ఇదంతా కూడా చేస్తున్నాం. స్వామి వారు, పూర్ణచంద్రకి రావడం, వేదిక మీద నిలబడి స్వామి, మమ్మల్నిందరినీ "ఏయ్! come!" అని, అనగానే మేమంతా అక్కడెక్కడో ఉన్న వాళ్ళం వెంటనే పరిగెత్తి స్వామి దగ్గర నిలబడ్డాము. అప్పుడు అక్కడ స్వామికి కాస్తా దూరంగా తచ్చాడుతున్న జోగారావుని చూసి, స్వామి, "ఏయ్ జోగారావ్! Come here" అంటే ఆయన పాపం ముసలాయన కదా! 70 ఏళ్లు అనుకుంటా! కాస్తా తడబడుతూ, నిదానంగా వచ్చాడు. "Why so late?" అని స్వామి అడిగారు. ఆయన నవ్వుతూ "స్వామి, ముసలోడిని అయిపోయాను స్వామీ! అంటే.." అప్పుడు స్వామి అన్నారు... What buda? You know what is the age of Bheeshma? కురుక్షేత్ర యుద్ధం అప్పుడు 150 ఏళ్లు భీష్ముడికి, కృష్ణుడికి 79 ఏళ్లు, అర్జునకీ 78 ఏళ్లు నువ్వేంటి 70 సంవత్సరాలె! మంచి నవ యవ్వనంతో కూడిన ఉత్సాహ పూరితమైన వయసు నీది అని చెప్పి పక పక నవ్వేసారు.

ఆ పాటికి, మేము వేదిక ముందు క్రింద నిల్చుంటే అందరం స్వామి పాదాల దగ్గరకి మా తలలు ఉన్నాయి. ఇక అదే అదునుగా స్వామి పాదాలకు నమస్కారం చేసుకునే అవకాశం దొరకడం చాలా ఆనందం కల్గించింది. పూర్ణచంద్రలో బాలచంద్ర అనుభవం చాలా అద్భుతంగా నిలిచిపోయింది. ఆ పిల్లలతో నేను చాలా స్నేహంగా ఉంటూ అక్కడ ఉన్నన్ని రోజులు ఎక్కువ శాతం పూర్ణచంద్ర ఆడిటోరియం లోనే సేవ చేయడం, ఏది సాధ్యం అయితే అది చేస్తూ ఉన్నాము.

తర్వాత ఎవరైనా పెద్ద వాళ్లు లేక ఆయా ప్రదేశాలలో విధులు నిర్వర్తించే వాళ్లు... ఎక్కడ నీ డ్యూటీ? ఎక్కడ నీ పేరు నమోదు చేసుకున్నావ్? ఐడి కార్డు చూపించు అని అంటారేమో అవే భయంతో... చుట్టూతా జనం వచ్చిన వెంటనే మెడలో స్కార్ఫ్ తీసేసి జోబులో పెట్టుకొని సాధారణ స్వామి విద్యార్థి లాగా అందరిలో కలిసిపోయేవాడిని! ఇదంతా ఈరోజు తలుచుకుంటే ఎంత తమాషాగా నేను ఉన్నాను... ఎంతో ఆనందము స్వామి పిల్లవాడినైన నాకు ఇచ్చారో గుర్తొస్తూ ఉంటుంది.

ఇలాంటి సమయంలో ఒకరోజు స్వామి వారు, కాలేజీ ఆడిటోరియం దగ్గర ప్రదర్శనశాల ప్రారంభోత్సవం చేస్తున్నారు. మనమందరం వెళ్లిపోదాం పదా అని అందరూ పోలోమని పరిగెత్తుకొని అక్కడికి వెళ్లాము. అక్కడికి వెళితే... ఎంత జనం ఉన్నారంటే, స్వామి కార్లో నుంచి నేల మీద అడుగు పెట్టిన తక్షణము తండోపతండాలుగా జనాలు అంతా కూడా స్వామిని చుట్టుముట్టారు. వెంటనే మేము ఉన్నాం కాబట్టి, జోబిలో నుండి స్కార్ఫ్ తీసి మెడలో వేసేసుకొని, స్వామి చుట్టూరా ఒక వలయం లాగా ఏర్పడి, ఆ స్వామి మీదకి ఎవరు రాకుండా చూసుకున్నాం. స్వామి చాలా ఆనంద పడిపోయారు. ఎంత దగ్గరగా అంటే స్వామిని ముట్టేంత దగ్గరగా నిల్చున్నాం!

ఎంత భక్తి ప్రపత్తి ఉన్నా సరే, మనసులో ఎక్కడో మాయ, ఎక్కడో దురాలోచన, ఎక్కడో ఒక అనుమానం! ఆ సమయంలో స్వామిని చూస్తేనే అనుకున్నా "స్వామి బుట్టతల అనేది కేవలం విగ్గుగా ఉంటుంది. ఇన్ని ఇన్ని వెంట్రుకలు ఎట్లా ఉంటాయి మనిషికి? అని నేను అనుకుంటున్నాను" అదే సమయంలో... అక్కడ ఉన్న పెద్ద చెట్లన్నీ కూడా గాలికి ఎవరో ఊపినట్టుగా ఊగడం మొదలుపెట్టాయి. ఈ మధ్యలో ఉన్న స్వామి ఒక్కసారి తీక్షణంగా నన్ను చూస్తూ ఉంటే... స్వామికి తల మీద వెంట్రుకలు అంతా గాలికి ఇలా వెనక్కిపోయి, కుదురలు అంటారు కదా... అక్కడిదాకా వెళ్లిపోయాయి... చాలా స్పష్టంగా స్వామి కురులు కనిపించాయి. అప్పుడు స్వామి వారి తల వెంట్రుకలను అలవోకగా సవరించుకుంటూ నన్ను చూసి నవ్వడం, నా గుండె అంతా జారిపోవడం, ఓ యమ్మ!! స్వామికి నిజమైన వెంట్రుకలే ఉన్నాయి అని అనుకోవడం. అంటే దీన్ని వివరించలేను... అంత అద్భుతమైన అనుభూతి అన్నమాట

నాకు ఒక అనుమానం ఉండేది. స్వామి వారి కాషాయ వస్త్రాల క్రింది నుంచి విభూతి ఏదో ఇస్తారట, ఆ డ్రెస్ లోపల ఏదో పైపు నుంచి వస్తాయట అలాంటివి అని, అలా అనుకున్నదే ఆలస్యం... స్వామి ఉన్నట్టుండి అక్కడ ఎవరికో విభూతి ఇస్తూ చేతిని ఇట్లా పైకి తీసారండి. ఇలా తన షర్ట్ చేతులు పైకి తీసి ఇలా చేయి తిప్పి విభూతి ఇస్తుంటే, నేను స్వామి వారి ప్రక్కన ఉన్నాను. బాబోయ్... ఈ వస్తువులు అన్ని కూడా శూన్యంలో నుండి వస్తున్నాయి, షర్టు చేతుల క్రింద పైపులు ఏమి లేవు అని అర్థం అయింది. ఇలా ఒక్కొక్క అనుభవము కూడా అలా గుండెల్లో పదిలంగా నిలిచిపోయింది.

ఇక స్నాతకోత్సవం, పుట్టు పండుగప్పుడు పొద్దున్నే రెండున్నర మూడు గంటలకు లేచిన సందర్భం గుర్తుంది. ఒక పక్క ఆస్తమ ఆయాసం ఉన్నా సరే... స్నానం చేసి తెల్ల దుస్తులు వేసుకొని, తయారు అయిపోయి స్వామిని చూడాలి! స్వామిని చూడాలి! పుట్టు పండుగ రోజు అని బయలుదేరే వాడిని. అబ్బుర పడ్డాను! స్వామి ఏమో బంగారు రథానికి నాలుగు తెల్ల గుర్రాలు కట్టి అందులో మహారాజులా, రాజాధిరాజులా! నిలయం నుండి సాయిగీత ముందడుగు వేస్తుంటే, పూర్ణ కుంభముతో వేద పండితులు కదులుతుంటే, విద్యార్థులు వేద పఠనం చదువుతుంటే, పిల్లలు భాంగ్రా నృత్యం చేస్తుంటే... అంగ రంగ వైభవంగా ఒక పెద్ద శోభా యాత్ర లాగా, చాలా కోలాహలంగా విద్యాగిరి స్టేడియం చేరుకునే సందర్భంలో నేను ఉన్నాను. పరవశించి పోయానంటే నమ్మండి. మొట్ట మొదటి సారి నేను చూసిన అతి సుందర మైన దృశ్యం... చాలా చారిత్రాత్మక దృశ్యం నాకు బాగా గుర్తుండి పోయింది. చూస్తున్న కళ్లు ధన్యం అయ్యాయి అనిపించింది. విద్యాగిరి స్టేడియంకి వెళ్లే సమయంలో స్వామిని ప్రశాంతి నిలయంలో చూస్తుంటే నాకు ఒక భజన పాట గుర్తుకు వచ్చింది.

మనోహరం మహాబలం స్వామి ఉపన్యాసం
మరపురాదు మరల రాదు మనకీ అవకాశం

రథముపై స్వామి వారు వచ్చుచూ ఉండగా
కనిన కనులు పండగా కనని కనులు దండగా
సనాతన సారథీ స్వర్గానికి వారథి
సత్యధర్మ శాంతి ప్రేమలే మన పెన్నిధి

ఆ పాటకి చివరిలో రెండు లైన్లు స్వామిని చూసాక జత చేర్చాను. స్వామి పుట్టు పండుగ రోజు శాంతి వేదికకి రావడం, ఆ శాంతి వేదిక మీద నుండి దివ్యోపన్యాసం ఇచ్చారు. దేశ దేశాల నుంచి వచ్చిన భక్తులందరూ కూడా స్వామికి సత్కారం చేసి, శరణు లెత్తి, భక్తిపూర్వకమైన అర్పణ చేస్తూ ఉన్నారు. బంగారు ఆభరణాలు ఇచ్చారు. వెండి ఆభరణాలు ఇచ్చారు. ఎన్నెన్నో కానుకలు ఇచ్చారు. స్వామి మైక్ తీసుకొని "బంగారు చాలా చాలా సంతోషం! అయితే నాకు చాలా బాధాకరమైన విషయం ఏంటంటే... సత్యసాయి భక్తులందరూ కూడా, స్వామికి ప్రేమను పంచాలని నా ఆశ. కానీ, స్వామి మెప్పు అందుకోవాలని, చాలా రకాలుగా "నేను కోరికలపై అదుపు" చేసి డబ్బులు తీసుకుని సేవలు చేయమని చెప్తే... ఇక ఒక్కొక్కరు ఒక్కో రకంగా... చాలా డబ్బులు పోగు చేసి తీసుకొచ్చారు. ఈ డబ్బు నాకు అవసరం లేదు. నాకు కావాల్సింది మీ ప్రేమ. అంతేగాని ధనము కాదు. ప్రేమదాహం తీర్చుకోండి. ధనదాహం కాదు. నేను ఈ ప్రేమదాహం తీర్చే ప్రయత్నం చేస్తున్నాను. స్వామి సంకల్పం, వజ్ర సంకల్పం అని చెప్పి ఒక్కొక్క రాష్ట్ర అధ్యక్షుడిని వేదిక మీదకి పిలిచి వెండి లోటా స్వామి వారు ఇచ్చారు. దీనితో ప్రేమదాహం తీర్చుకోండి కానీ ధనదాహం కాదు" అని చెప్పారు. అంతే కాదు... వాళ్లు స్వామికి సమర్పించిన ధనాన్ని కవర్లలో పెట్టేసి తిరిగి ఇచ్చేసారు. ఆ సంఘటన ఈ రోజు ఆలోచిస్తే... స్వామి సందేశంతో కొన్ని లక్షల మంది ప్రేరణ చెందారు అనిపించింది.

బాబా వారి పుట్టు పండుగ సందర్భంగా నాకు జీవితంలో జరిగిన మరొక దివ్యానుభవం ఏమిటంటే, స్వామి వారి 60వ పుట్టు పండుగ సందర్భంగా సత్యసాయి బాలవికాస్ ప్రీ సేవాదళ్ పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులందరికీ... స్వామి వారే స్వయంగా చేవ్రాలు చేసి ఉత్తీర్ణత ధృవ పత్రాలు అందచేశారు. నాకు కూడా ఆ ధ్రువపత్రం తీసుకునే అదృష్టం కలిగింది. స్వామి యొక్క ఆ సర్టిఫికెట్‌ని నా జీవితానికి ఒక బంగారు పట్టా అని అనుకుంటాను. నవంబర్ మాసంలో నేను పొందిన ఈ షష్టి స్మార్తి అనుభవాలు నిజంగా నాలో జీవితకాలపు స్మార్తి నింపినాయి అనిపిస్తుంది.

సత్యసాయి షష్టిపూర్తి కాదు ఇది సత్యసాయి భక్తులకు షష్టిస్మార్తి! 20 రోజుల పాటు నేను అనుభవించిన అనుభవాలు అన్నీ ఇన్నీ కాదు.

We, the Founder Trustee and Members of the Council of Management of the
SRI SATHYA SAI CENTRAL TRUST
after having been satisfied with the withinsigned
S. BALACHANDER
that he/she has undergone the required course,
Diploma
in
Sathya Sai Education
has been conferred on him/her on this 23rd Nov. 1995
IN PURSUANCE whereof is the signature of the Founder Trustee

9

శ్రీ సత్య సాయి విద్యా విధానం

1983 – 1995: ఈ 12 సంవత్సరాల సమయం చాలా అద్భుతమైనదిగా నిలిచింది. కారణం నేను ఎన్నో విషయాలు ఉన్నాయి.

1983: అంతర్జాతీయ బాలవికాస్ సమ్మేళనం, 1985: స్వామి వారి షష్టి పూర్తి సమయంలో శ్రీ సత్య సాయి విద్యా విధానంలో నాకు స్వామి వారు ధృవ పత్రం ఇవ్వడంతో నాలో ఆధ్యాత్మిక భావాలకు రెక్కలు వచ్చాయి అన్నంతగా మారి పోయాను.

శ్రీ సత్య సాయి విద్యా విధానం అన్నది, సమాజంలో ఉండే బాల బాలికలకు, యువతి యువకులకు సాయి సందేశాన్ని, మానవతా విలువలను, ఆధ్యాత్మిక జీవన విధానమును అందించేందుకు ఏర్పరిచింది. స్వామి వారు మహిళా భక్తుల మీద ఎంతో దయతో ఇచ్చిన మహా ప్రసాదం ఇది. ఇంట్లో అన్ని బాధ్యతలు నిర్వర్తిస్తూ, తమ బిడ్డల ఆలనా పాలనా చూసే తల్లుల కంటే సామర్థ్యం ఎవరికి ఉంటుంది అని తలచి, శ్రీ సత్య సాయి బాలవికాస్ ఉద్యమాన్ని స్వామి వారు సత్య సాయి సంస్థల మహిళా సభ్యులకోసమై దీనిని ప్రారంభించారు. వారాంతాల్లో తల్లులు తమ పిల్లలతో పాటుగా చుట్టు ప్రక్కల ఇండ్లలో ఉండే చిన్నారులను కూడా అక్కున చేర్చుకుని వాళ్లందరికి సంస్కారం, విలువలు బోధించేలా చేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యంలో వేలాది మంది మహిళలు గురువులుగా మారి, లక్షలాది మంది చిన్నారుల జీవితాలను సరిదిద్దుతున్నారు. అందరికీ స్వామి విద్యా సంస్థల్లో చదువుకునే అవకాశం ఉండదు కదా. ఈ బాలవికాస్ తరగతుల ద్వారా ఆ అంతరాన్ని తొలగించారు స్వామి వారు. ఇందులో మంచి నేర్చుకున్న చిన్నారులు ఎంతో మంది సమాజంలో ప్రతిభా వంతులుగా మారి చుట్టు ఉన్న వారిని ప్రభావితం చేస్తున్నారు అనడంలో ఎట్టి సందేహం లేదు. తరవాత కాలంలో పురుషులకు కూడా ఈ బాలవికాస్ ఉద్యమంలో అవకాశం కల్పించారు.

బాలవికాస్ గురువులు చేస్తున్న కార్యానికి, స్వామే స్వయంగా దిశా నిర్దేశం చేసేవారు. వారితో

మాట్లాడిన ప్రతి మాట కూడా ఒక మంత్రం లాగా ఉండేది. ఇక స్వామి ఉపన్యాసం ఒక గంట బాలవికాస్ ఎలా ఉండాలో చెప్తుంది.

స్వామి దివ్యోపన్యాసం మనం గమనించినట్లయితే, ఈ క్రింది విషయాలు అవగతం అవుతాయి.

సభా ప్రాంగణం, వేదిక సిద్ధంగా ఉంటుంది
అందరూ నిశ్శబ్దంగా ఉంటారు
చెప్పిన సమయానికి స్వామి వస్తారు
వేద పఠనంతో సభ మొదలవుతుంది
ఒకరో లేక ఇద్దరో క్లుప్తంగా మాట్లాడతారు
స్వామి దివ్యోపాన్యాసం చేస్తారు
చక్కటి పద్యంతో మొదలు పెడతారు
విషయాన్ని చక్కగా వివరిస్తారు
పాటలు, పద్యాలు, చిన్న కథలు చెప్తారు
చెప్పేది ఏదైనా మనసుకు హత్తుకుంటుంది
చివరగా ఆశీర్వాదం చేస్తారు
భజనతో ముగిస్తారు
ప్రసాదం అందరికీ ఇస్తారు
సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి
మంగళ హారతితో సభ ముగిస్తారు.

స్వామి వారు మాట్లాడే సమయంలో ఒక సారి చుట్టూరా పరిసరాలు గమనిస్తే మనకు కనిపించేవి ఏమిటి తెలుసా?

క్రమ శిక్షణ, భక్తి, విశ్వాసం, ఆతృత, నిశ్శబ్దం, శ్రద్ధ, ఏకాగ్రత, జాగృతి, స్ఫూర్తి, ప్రేరణ, కర్తవ్యం, ఆధ్యాత్మికత, మానవతా విలువలు, ఇలా ఎన్నో బోధ పడతాయి. శ్రీ సత్య సాయి విద్యా విధానంలో బోధించబడే విలువలు ఇవే కదా!?

ఇలా ఇవన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తే, బాలవికాస్ గురువు తన తరగతిని ఎలా నిర్వహించాలి అన్నది తెలుస్తుంది. మనం నిర్వహించే బాలవికాస్‌లో కేవలం పాతిక మంది ఉంటారు... కానీ స్వామి వారు నిర్వహించే బహిరంగ బాలవికాస్‌లో లక్షలాది మంది ఉంటారు. వయసుతో సంబంధం లేని చిన్న పిల్లలే అంతా.

అలా స్వామి వారే నా ప్రథమ గురువుగా నిలిచారు. స్వామి నాతో ప్రత్యేకంగా మాట్లాడింది లేదు, ఇంటర్వ్యూ ఇచ్చింది లేదు, మార్గదర్శనం చేసింది లేదు. నా చుట్టూరా తారసపడే ఎంతోమంది స్వామి విషయాలు చెప్పేవాళ్లు, నాకు స్వామి ఇలా చెప్పారు, అలా చెప్పారు అంటూ ఉండే వాళ్లు. వెనుతిరిగి చూసుకుంటే, స్వామి దర్శనమే హృదయాంతరంగ తీర్థయాత్ర లాగా, వారు బహిరంగంగా చేసే ఉపన్యాసాలే ఉపనిషత్ సారంలా తీసుకుని ఆనంద పడే వాడిని. స్వామి మాట్లాడే ప్రతి మాట ఒక మంత్రమే అనుకునే వాడిని. వాటిని అర్థం చేసుకునే మనసుంటే, ఆచరించే జీవితం మనదవుతుంది అని నాకు అర్థమైంది.

నాకు బాగా గుర్తుంది, స్వామి ఏ సందర్భంలో ఎలాంటి విషయాలు చెప్తారని ఎంత ఉత్సుకతగా వినేవాడిని. సంక్రాంతి, ఉగాది, శివరాత్రి, గురుపూర్ణిమ, కృష్ణాష్టమి, దసరా, పుట్టు

పండుగ మరియు క్రిస్మస్ ఇలా ఏ విశేషమైన పర్వదినం తీసుకున్నా స్వామి వారు ఇచ్చే ఆ దివ్య సందేశములు. నన్ను చాలా చాలా ప్రభావితం చేసేవి. ఎంత అమాయకంగా స్వామి ఉపన్యాసాలను అనుసరించే వాడినంటే, వాటిని పుస్తకంలో వ్రాసుకునేవాణ్ణి. ఆ కాలంలో రికార్డు చేయడం అరుదుగా ఉండేది.

సో, స్వామి ఏమి చెప్పినా అది మొదట పుస్తకంలో వ్రాసి, ఆ తరవాత మస్తకంలోకి ఎక్కించే వాడిని. కారణం అవన్నీ కూడా బంగారు మాటలు, దివ్య మంత్రాలు జాగ్రత్తగా దాచుకుని జీవితాన్ని వాటితో అనుసంధానం చేయాలి. అంత మధురంగా ఉండేవి స్వామి మాటలు, పాటలు, పద్యాలు మరియు గద్యాలు.

స్వామి ఒకే ఉపన్యాసంతో ఏక కాలంలో పండిత పామరులందరినీ ఆనందాబ్ధిలో ఓలాడించే వారు అనడంలో ఎట్టి సందేహం లేదు. పసిపాప నుండి పరమ మూర్ఖుని వరకు అందరినీ స్వామి ఉపన్యాసాలు ప్రభావితం చేసేవి. ఆ ఉపన్యాసాలు వింటూ ఏడుస్తున్న వాళ్లను చూశాను, వింటూ వింటూ తమను తాము మైమరిచిపోయిన వాళ్లని చూస్తుండే వాణ్ని. ఎన్నోసార్లు నేను కూడా ఆనంద భాష్పాలు కార్చే వాడిని.

పూర్వం, స్వామి ఉపన్యాసాలను క్యాసెట్లలో రికార్డ్ చేసి సాయింత్రం వేళకు షాపింగ్ సముదాయంలో అమ్మే వాళ్లు. వాటిని కొని మళ్లీ వినాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఆ తర్వాత కాలంలో స్వామి ఉపన్యాసాన్ని ఉన్నదున్నట్టుగా తెలుగు, ఇంగ్లీష్‌లో టైప్ చేసి కొన్ని గంటలలో చిన్న పుస్తకంలా ప్రచురించే వాళ్లు. ఆ తర్వాత కాలంలో స్వామి ఉపన్యాసాల సీడీలు అందించడం మొదలుపెట్టారు. దాని తర్వాత వీడియోలు వచ్చేసాయి. ఇప్పుడు అంతా ప్రత్యక్ష ప్రసారాలు చూస్తున్నాం. ఈ రోజు మనం ఇంట్లో కూర్చొని గూగుల్ చేసినా చాలు, స్వామి వారు మన ముందు ప్రత్యక్షమై తమ సందేశాన్ని అందిస్తారు.

కానీ ఆ రోజుల్లో, పర్తి క్షేత్రంలో వేల మంది భక్తులలో ఒకడిగా కూర్చొని స్వామి ఉపన్యాసం వింటున్నపుడు నిజంగా మనసుకు చాలా హత్తుకునేది. ఎంత ప్రేమతో, దయతో, వాత్సల్యంతో స్వామి సందేశం అందిస్తున్నారో చూస్తే నన్ను నేను మరచి పోయేవాడిని. నేను కూడా అలా మాట్లాడాలి అని తపించే వాడిని.

జ్యోతి అక్క మాటలు నాపై మంచి ప్రభావం చూపించేవి. ఇక స్వామి మాటలు నా హృదయ కవాటాలు తెరిచి జీవిత కాలపు ప్రేరణను అందించాయి. అసలు పాఠాలు చెప్పడం అంటే ఇలా చెప్పాలి. జ్ఞానం బోధించాలంటే ఇలాంటి చాతుర్యం ఉండాలని స్వామి ఉపన్యాసాలు వింటూ నన్ను నేను ఒక అద్భుతమైన గురువులా తీర్చి దిద్దుకున్నాను.

సేవాదళ్ శిక్షణా తరగతులు, బాలవికాస్ గురువుల శిక్షణా తరగతులు, వేసవి తరగతులు, భగవద్ గీతా తరగతులు, వ్యక్తిత్వ వికాస తరగతులు ఇలా అన్నింటిలో కూడా ప్రథమ మరియు ఉత్తమ శిక్షకుడు ఎవరు అంటే భగవాన్ శ్రీ సత్య సాయి బాబా అని చెప్పుకోవాలి కారణం, వారు చెప్పే విషయాలన్నీ కూడా అట్లా ఇట్లా ఉండవు. అసలు కలలో కూడా ఊహించని విషయాలు, పుస్తకాల్లో చదవని విశేషాలు, ఎక్కడా వినని విషయాలు స్వామి వారు చాలా సందర్భాల్లో ప్రభోదిస్తూ ఉంటారు. అలా స్వామి ఉపన్యాసం విన్న వాళ్లు ఎవరైనా సరే ఒక బాలవికాస్ గురువు అంటే ఎలా ఉండాలి అని తెలుసుకునే వాళ్లు.

ఇక నేనవుతే స్వామి మాట్లాడే విధంగా మాట్లాడాలి, స్వామి నడిచే విధంగా నడవాలి, స్వామి

ఎంత నీట్‌గా ఉంటారో నేను కూడా అంతే నీట్‌గా ఉండాలి అనుకుంటూ వారితో మమేకం అయిపోయే వాడిని. జీవితంలో స్వామినే అనుకరించడం మొదలు పెట్టాను, అట్టి దివ్య ప్రభావం స్వామి నా మీద చూపారు.

స్వామి ఇచ్చిన ధృవ పత్రం తీసుకుని తాడిపత్రిలో నేను కూడా బాలవికాస్ గురువుగా వెళ్లాలని చెప్పేసి ఫస్ట్ గ్రూప్‌తో మొదలు పెట్టాను. చిన్న పద్యాలు చెప్పడం, భజన పాటలు నేర్పించడం, ప్రార్థన శ్లోకాలు నేర్పించడం అలా మొదలైంది.

నాలో ఉరకలు వేస్తున్న ఉత్సాహం, ఉప్పొంగి ప్రవహించే భావాలను ప్రకటించాలనే తపనతో ఇక చిన్నపిల్లలు కనిపిస్తే చాలు మమేకం అయిపోయే వాడిని. ఈ రోజుకి కూడా ఇదే వ్యవహార శైలి. ఎక్కడ పిల్లలు ఉంటే అక్కడ నేను వెళ్లిపోతాను. నేను వాళ్లని ఎంత ప్రేమగా చూస్తాను అంటే స్వామి ఎలా అవుతే పిల్లలతో ఉంటారో అంతలా అన్న మాట.

అలాగే సేవాదళ్ అంటే కేవలం మాటలు మాత్రమే కాదు, ఉపన్యాసాలు కాదు సేవలు చేయాలి. సేవించితేనే కదా మనల్ని భగవంతుడు వరిస్తాడు అని తలచే వాడిని. బాల వికాస్ విద్యార్థిగా, బాల వికాస్ గురువుగా, ప్రీ సేవాదళ్ విద్యార్థిగా, సేవాదళ్ సభ్యుడిగా భక్తుడిగా, సామాజిక కార్యకర్తగా, సాధకుడిగా అన్ని రకాల దశలలో స్వామి మార్గదర్శనం చేశారు.

నాకే ఇంటర్వ్యూ ఇవ్వలేదు, ఏ రింగు సృష్టించి ఇవ్వలేదు, ఏ బంగారు చైను మెడలో వేయలేదు... కానీ నా జీవితానికి దిశ దశ ప్రసాదించారు అని నమ్మే వాడిని. చాలా మంది అడిగే వాళ్లు, మీకు స్వామి ఏమి ఇచ్చారు అని, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా, ఆలస్యం చేయకుండా, ధృడ విశ్వాసంతో నేను చెప్పే వాడిని "స్వామి నాకు ఈ జీవితాన్ని ప్రసాదించారు" అని.

కారణమేందంటే ఈ జీవితం ఉంది అంటే

"It's solely because of Swami that my life is dedicated to service until my last breath. This is my way. It doesn't matter to me whether Swami has seen me or not, but I'm grateful to have HIS presence in my life. That's all I need. I must live, love, and lead like Swami. Let my life be His message."

ఇలాంటి భావాలతో కాలం అంతా గడిచిపోయింది. నేను అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఉండడం వల్ల జిల్లాలో జరిగే ప్రతి శిక్షణ శిబిరానికి క్రమం తప్పకుండా వెళ్లేవాణ్ణి. విన్న విషయమే వినే వాణ్ణి, చెప్పిన విషయం చెప్పేవాళ్లు అయినా సరే ఎంతో భక్తి విశ్వాసాలతో వెళ్లే వాడిని. అప్పటి బాలవికాస్ సంచాలకులు శ్రీమతి నందివాడ రాణి చాలా అద్భుతమైన వ్యక్తిత్వంతో ఆంధ్ర రాష్ట్రములో బాలవికాస్ ఉద్యమానికి నాయకత్వం అందించేవారు.

వీరితో పాటుగా, కుమారి సీతాలక్ష్మి, శ్రీమతి సులోచన, శ్రీమతి శశిబాల, శ్రీమతి భ్రమరాంబ, కుమారి వసంత లక్ష్మి, శ్రీ నాగభూషణరావు, శ్రీ మధుసూదనరావు, శ్రీమతి వల్లీ, శ్రీ పలివెల సుబ్బారాయుడు, శ్రీమతి త్రిలోచన మొదలగు వారు స్వామి వారి సైనికులుగా ఉంటూ సేవించుకునే వారు.

ఒకసారి ప్రశాంతి నిలయంలో రాష్ట్ర స్థాయిలో బాలవికాస్ గురువుల శిక్షణ జరిగింది. స్వామివారు చాలా చాలా దయతో అవకాశం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మంది గురువులు వచ్చారు. నేను చక్కగా మాట్లాడుతూ ఉండే వాడిని కనుక నన్ను కూడా గురువులకు శిక్షకుడిగా నియమించారు. గ్రామీణ బాలవికాస్ గురించి మాట్లాడాను. వచ్చిన 16 మంది శిక్షకులలో

కేవలం ముగ్గురే పురుషులు ఉన్నారు. అందులో ఒకరు నాగభూషణ రావు, రెండు నాగరాజు, మూడు నేను. అందరిలో చిన్న వాడిని నేనే. అట్లా అని నేనేమి స్తబ్దుగా ఉండే వాడిని కాను. నాకు తెలిసింది నేను చక్కగా సిద్ధమై, సోదాహరణములతో, చిన్ని కథలతో, నిజ జీవిత దృశ్యాలతో చాలా ప్రభావ వంతంగా చెప్పేవాడిని.

అలాంటి సందర్భంలో, దర్శన సమయంలో మేమంతా ప్రత్యేకంగా కూర్చునే అవకాశం కలిగింది. దర్శనములో మేమంతా కూడా స్వామికి వ్రాసుకుని కూర్చున్నాము. మగవాళ్ల వైపు 4 మంది, ఆడవాళ్లు 12 మంది. స్వామి ఆడ వాళ్లని ఇంటర్వ్యూ పిలిచారు. మగ వాళ్ల వైపుకు వచ్చి, శిక్షకులు మాత్రమే రండి అని చెప్పి వెళ్లి పోయారు. కానీ మిగతా శిక్షకులు ఆ పాటికే వెళ్లి పోయారు, దర్శనంలో నేనొక్కడే ఉండిపోయాను. స్వామి పిలిచారు కదా అని ఇంటర్వ్యూ గది వైపుకు పరిగెత్తుకుంటూ వెళ్లాను. అంత దూరం నుండి స్వామి నన్ను చూస్తూ "ఏయ్! వెనక్కి వెళ్లు" అని చేత్తో సైగ చేసారు.

అన్ని వేల మంది భక్తులున్న ప్రశాంతి నిలయంలో అందరూ నన్ను చూస్తుంటే చాలా అవమానం అయి బాధపడ్డారు. చాలా ఏడుపు వచ్చింది. ఎందుకు నన్ను స్వామి వెనక్కి పంపించారు అని. తర్వాత స్వామి గది లోపలికి వెళ్లి వచ్చిన ఆడ వాళ్లు చెప్పారు, "బాలచంద్ర మేం అడిగాం. స్వామి! ఇద్దరు ముగ్గురు మగవాళ్లు బయట ఉండిపోయారు." అప్పుడు స్వామి "గది చిన్నదిగా ఉంది కదా బంగారు" అన్నారు. రెండోసారి మళ్లీ అడిగినప్పుడు "గది శుభ్రంగా లేదు, బంగారు ఏం చేసేది" అని చెప్పారు. ఈ రెండు మాటలు కూడా నాపై చాలా ప్రభావం చూపించాయి ఆ రోజు. కారణం ఏందంటే స్వామికి దగ్గర అవ్వాలంటే గది విశాలంగా ఉండాలా? ఏ గది!? ఇంటర్వ్యూ గదా? లేక హృదయ గదియా?

భగవంతుని అనుగ్రహం కావాలి అంటే మన హృదయం విశాలంగా చేసుకోవాలి అంతే కాదు హృదయం శుభ్రంగా ఉంచుకోవాలి అప్పుడే కదా భగవంతుడు మన హృదయంలో నివసించేది అన్న అద్భుతమైన సందేశం ఇచ్చారని అర్థం అయింది. చాలా సేపు ఏడ్చాను దర్శన సమయంలో నిశ్శబ్దంగా. సో ఆరోజు నిర్ణయం చేసుకున్నాను, లోనైన బయటైనా శుభ్రంగా ఉండాలి. Pureగా ఉండాలి. పవిత్రత మాత్రమే దివ్యత్వానికి దగ్గర దారి అని తెలుసుకున్నాను.

ఈ విధంగా ఎన్నో సందర్భాలలో, ఎన్నెన్నో ఉపదేశాలను స్వామి అందించారు. ఈ విషయాలని చెప్పుకోవడాని నాకు ఎలాంటి సిగ్గు కానీ దాపరికం కానీ లేదు. ఈ సందేశం అందరికీ ఉపయోగపడాలి. ఆ రోజైనా, ఈ రోజైనా, ఏ రోజైనా ఎప్పుడైనా సరే మనం భగవంతుడికి దగ్గరవ్వాలంటే పవిత్రంగా ఉండాలి అని చెప్పి నమ్ముతాను.

అంటే 1982 నుండి 1995 దాకా అసలు స్వామితో వ్యక్తిగతంగా సమయం దొరకలేదు. అట్లా అని నేను ఏమి ఎక్కడ ఆగింది లేదు. స్వామి మీద భక్తి విశ్వాసాలతో ఎక్కడ వీలవుతే అక్కడ సేవలలో పాల్గొంటూనే ఉన్నాను. ఏదో దర్శనంలో ఒక సారి చూసినట్లు అనిపించేది. కొన్ని సార్లు పాద నమస్కారం దొరికింది. మరి కొన్ని సార్లు ఒకటి లేక రెండు మాటలు స్వామితో మాట్లాడే అవకాశం... అంతే! వీటినే చాలా గొప్పగా చెప్పుకుని తృప్తిగా స్వామి కార్యంలో పాల్గొనేవాడిని.

10

డబ్బులు సంపాదించచ్చు... పేరు పోతే సంపాదించలేము

నా జీవిత ప్రయాణం గురించి చెప్తున్న సమయంలో చాలా వరకు స్వామితో ముడిపడిన విషయాలు, విశేషాలు చెప్తూ ఉన్నాను. కానీ నా స్వీయ అనుభవాలు, అనుభూతులు, జీవిత పాఠాలను కూడా చెప్పాల్సి ఉంది. అప్పుడే కదా... నేను ఎలాంటి పరిస్థితులలో చిన్ననాటి నుండి బ్రతికాను అన్నది తెలుస్తుంది.

1985 సంవత్సరం నా జీవితంలో ఎన్నో విశేషాలకు తెర తీసింది అని చెప్పాలి. కారణం నా విద్యాభ్యాసంలో ఒక మైలు రాయి అప్పుడే పడింది.

చిన్నప్పటి నుండి కూడా నేను గొప్ప చదువరిని కాదు, సాధారణ విద్యార్థిని మాత్రమే! ఎప్పుడూ ప్రథమ శ్రేణి మార్కుల కోసం తహతహ లాడింది లేదు. మార్కుల పట్ల, ర్యాంకుల పట్ల అంతగా ఆసక్తి ఉండేది కాదు. ఏదో సాఫీగా చదువుకునే వాడిని అంతే. ఒకటవ తరగతి నుండీ అదే పరిస్థితి. అలా చదువు అంతా ప్రభుత్వ బడిలోనే చదువుతూ, చివరకు 10వ తరగతికి వచ్చాను.

బాగా గుర్తు, నేను చదువుకునే బడిలో 10వ తరగతిలో అందరికీ మంచి మార్కులు రావాలని టీచర్స్ అందరూ ఆశ పడేవారు. ఇంకా చెప్పాలంటే, వారు ఎంతో శ్రద్ధ చూపించేవారు కూడా. అప్పుడు తాడిపత్రిలో సుమారు నాలుగు ప్రభుత్వ పాఠశాలలు ఉండేవి. నేను చదివే ప్రభుత్వ పాఠశాల... ఇంకా మున్సిపల్ బాలుర పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, ఇక ఇతర ప్రైవేట్ స్కూల్స్ కూడా ఉండేవి. పెద్ద పరీక్షలు వ్రాసేవాళ్లు మా ఊళ్లో సుమారు 600 మంది దాకా ఉండేవారు. అందులో ఒక పాఠశాలకు మరొక పాఠశాలకు పోటీ ఉండేది.

ఎవరి స్కూల్‌కి వాళ్లు పేరు తేవాలని, వాళ్ల విద్యార్థులు బాగా మార్కులు తెచ్చుకోవాలని, ఆ బడి టీచర్లు చాలా ప్రయత్నించేవారు. ట్యూషన్లు చెప్పడం, స్పెషల్ క్లాసులు పెట్టడం చేసేవాళ్లు. పిల్లలు పరీక్షలు బాగా వ్రాయక పోతే, వాళ్ల స్కూల్ పేరు పోతుందని భయపడేవారు. అందుకే, కొందరు టీచర్లు పరీక్షా కేంద్రాలలో తెలిసిన వాళ్లు ఉంటే వారి సాయంతో వాళ్ల బడి పిల్లలకు

చూసి వ్రాయమని ప్రోత్సహించేవారు కూడా. ఇది ఒక చేదు నిజం. అప్పట్లో ఇది చాలా స్కూళ్లలో జరిగేదే.

మరో ప్రక్క, విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల బయట నిలబడి, చీటీలను గోడల మీదుగా, కిటికీల నుండీ, లోపలికి విసిరే దృశ్యాలు నేను చూస్తూ ఉండేవాడిని. ఈలలు వేసేవారు, సమాచారం అందించడానికి

నిజం చెప్పాలంటే, నేను పదో తరగతిలో చాలా కష్టపడ్డాను. పరీక్షల సమయంలో, నేను చదువుకున్న ప్రాథమిక పాఠశాల టీచర్లే పర్యవేక్షకులుగా వచ్చారు. నేనంటే ఎంతో ప్రేమ వాళ్లకు, పైగా నేను అంత చదివే వాడిని కాదని వాళ్లకు కూడా తెలుసు. నన్ను కూడా కాపీ చేయమంటూ ప్రోత్సహించారు. "అబ్బాయీ! చూసి వ్రాయి, ఇదిగో వాడి దగ్గర చూసి వ్రాయి, అదిగో చీటీ! అందులో చూడు" అంటూ సహాయం చేసేందుకు ప్రయత్నించారు. కానీ నాకు అది నచ్చలేదు, సున్నితంగా వారించాను. అప్పటికే 'నైతికత' నాలో మొగ్గ తొడిగిందో... ఏందో తెలియదు.

ఏది తెలిస్తే అదే వ్రాసాను. ఆరు పరీక్షలు అలాగే నిజాయితీగా వ్రాసాను. చివరకు ఫలితాలు వచ్చాయి. నాకు పెద్ద మార్కులు ఏమి రాలేదు, ప్రథమ శ్రేణి కూడా రాలేదు. ఏదో ద్వితీయ శ్రేణి మార్కులతో (52%) ఉత్తీర్ణుడయ్యాను. అప్పట్లో నాకు మాత్రమే కాదు, ఇంట్లో వాళ్లకు కూడా నేను పరీక్ష తప్పుతానేమో అనిపించింది. కానీ ఫలితాల్లో నా నంబర్ చూసిన వాళ్లంతా ఆనందపడ్డారు. "ఇది చాలులే" అని నేను కూడా సంబర పడ్డాను.

కానీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదీ కాక ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు కావలసిన మంచి మార్కులు నేను సంపాదించ లేక పోయాను. మా నాన్నగారు ఒక అడ్వకేట్‌గా, ఆ పట్టణంలో ఎంతో మందికి తెలిసిన వ్యక్తి. ప్రభుత్వ కళాశాలలో ఆ సమయంలో, చాలా కఠినమైన క్రమ శిక్షణతో ఉండే ప్రిన్సిపాల్. ఆయన చాలా స్ట్రిక్ట్ అని అందరూ అనే వాళ్లు.

మా నాన్న, నన్ను ఆయన దగ్గరకు తీసుకెళ్లారు. ఆ రోజుల్లో కామర్స్ (CEC)కు చాలా డిమాండుగా ఉండేది. నేను CEC తీసుకోవాలని కోరుకున్నా. కానీ, నా మార్కులు తక్కువగా ఉండటంతో, "ఈ మార్కులతో CEC తగదు, పిల్లాడు ఫెయిల్ అయ్యే అవకాశం ఉంది. సైన్స్ గ్రూప్‌కి పంపించండి" అని వీరా రెడ్డి గారు చెప్పారు. మా నాన్నగారు కూడా, ఏదో ఒకటి చేయాలి కదా అనే ఉద్దేశంతో, నన్ను ఇంటర్మీడియట్‌లో సైన్స్ గ్రూప్‌కి జాయిన్ చేశారు.

ఆ సమయానికి కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటోంది. ఇంట్లో అమ్మ, నాన్న, మేము నలుగురు పిల్లలు. మా నాన్నగారు వృత్తిరీత్యా న్యాయవాది. కోర్టులకు వెళ్లి సంపాదించేది చాలేది కాదు, కుటుంబాన్ని చూసుకోవాలన్న ఆపేక్షతో మరో ప్రక్క ఇంట్లో ముందు భాగంలో చిన్న బట్టల కొట్టును కూడా నిర్వహించారు. అప్పుడే కొత్తగా కట్టుకున్న ఇల్లు ప్రధాన రహదారిలో, బస్ స్టాండ్‌కి చాలా దగ్గరగా ఉండేది. కాస్తా వచ్చి పోయే వాళ్లు ఎక్కువగానే ఉండే వాళ్లు. షాపులో అమ్మ & అన్నయ్య ఇద్దరూ కూర్చుని వ్యాపారం నడిపే వాళ్లు. నాన్న కచేరికి వెళ్లినప్పుడు వాళ్లు, ఆ తరవాత తీరిక సమయంలో ఆయన బట్టల కొట్టులో కూర్చునే వారు.

కొత్తగా ఇల్లు కట్టడం, పొలం మీద ఆదాయం లేక పోవడం, వృత్తి రీత్యా సంపాదించేది తక్కువ అవ్వడం, వ్యాపారం మీద పెట్టుబడి పెట్టడం, వ్యాపారంలో అప్పులు ఇవ్వడం, వీటిని మించి అక్కయ్య (17 ఏళ్లు)కు అదే సమయంలో పెళ్లి చేశారు. ఇంటికి అల్లుడు వస్తే ఉండాలి అని మేడ కూడా కట్టారు. ఇలా ఎన్నో బాధ్యతలు మోసారు నాన్నగారు. ఒకవైపు అప్పులు, వాటి మీద

వడ్డీలు పెరిగి పోయాయి. ఇంటి ఖర్చులు ఎక్కువ అయ్యాయి, అయినా ఎక్కడా ఎవరికీ అన్యాయం చేయని నిజాయితీ గల జీవితం నాన్నది.

ఎంతవరకు వెళ్లారు అంటే చివరకు ఆస్తులన్నీ అమ్మి, అప్పులు తీసుకున్న వాళ్లకు డబ్బు బ్యాగులో పెట్టుకుని ఇంటింటికి వెళ్లి చివరి రూపాయి వడ్డీ కూడా చెల్లించి వాళ్లకు కృతజ్ఞతలు తెలుపుకున్న దృశ్యం నాకు బాగా గుర్తు. కారణం, ఆ సమయంలో నేను నాన్న చేయి పట్టుకుని వెళ్లాను. అరె ఏమిటి ఇది? ఇలా ఆస్తులు అమ్మి డబ్బులు ఇచ్చేస్తున్నారు అని నాకు ఒక్కటే సందేహం వచ్చేది. మేము అప్పులు ఇచ్చిన వాళ్లు ఎగ్గొట్టి వెళ్లి పోయారు. నాన్న ఇలా ఆస్తులు అమ్మేసి కట్టేస్తున్నారు అదే అడిగాను. నాయనా! డబ్బులు పోతే మళ్లీ సంపాదించ వచ్చు కానీ పేరు పోతే మళ్లీ సంపాదించ లేము అని చెప్పారు. ఈ మాటలు నాలో చెరగని ముద్ర వేసాయి. నన్ను చాలా ప్రభావితం చేశాయి.

నాకు గుర్తుంది మా నాన్న గారు న్యాయవాది కదా, కోర్టులో IP వేస్తే పది రూపాయలు ఇచ్చిన వాడికి ఒక రూపాయి ఇచ్చే అవకాశం ఉంది. కానీ అట్లా చేసిన సందర్భం లేదు. స్వయంగా వాళ్ల అన్నయ్యలు, తమ్ముళ్ల నుంచి తీసుకున్న డబ్బులకు కూడా చివరి రూపాయి వడ్డీ కట్టారు.

అమ్మ కూడా అంతే. ఎంత కష్టంలో ఉన్నా మమ్మల్ని మంచి మార్గంలో నడిపించింది. ఎంతో ఓపికగా ఒక భార్య, తల్లి పాత్రలు పోషించింది. అమ్మ నన్ను ఎంత ప్రేమగా చూసుకునేదో నాకు గుర్తుంది. ఇంట్లో నేను కూరలు తినడానికి ఇష్ట పడే వాడిని కాదు. రోజూ పప్పు కావాలని నేను మంకు పట్టు పట్టేవాడిని. 14-15 ఏళ్లప్పుడు ఏమి తెలియక మొండి చేసేవాడిని. అమ్మ చాలా బాధపడేది, కందిపప్పు ఇంత ధర ఐతోంది, ఎట్లబ్బా చేసేది అని ఉపాయం ఆలోచించి, నాకు మాత్రమే పప్పు చేసేది. ఇక ఇంట్లో ఏమైనా చిరుతిండ్లు చేస్తే, నలుగురికి నాలుగు డబ్బాలలో వేసి ఇచ్చేసి, ఇదిగో ఇది మీది, మీ ఇష్టం వచ్చినట్టు తినండి, ఇక నన్ను అడగ కూడదు అని చెప్పేది. ఇవి అన్ని చిన్న విషయాలు కాదు ఆ రోజుల్లో చాలా పెద్ద సమస్యలు. వీటన్నిటిని అన్ని నవ్వుతూ ఎదుర్కున్నాం ఆ రోజుల్లో ఇంట్లో ఒక రూపాయి తీయాలంటే కష్టమయ్యేది. అలాంటి సందర్భంలో కూడా షాప్‌లో మేము ఉంటూ, గల్లా పెట్టెలో పెట్టే చిల్లర, చిన్న నోట్లు తీసుకునే వాళ్లం. ఇప్పుడు ఆలోచిస్తే అయ్యో, అప్పుడు తెలియలేదు కదా! అని బాధ అవుతుంది.

అలా... ఆర్థిక సమస్యలు ఎదుర్కుంటూ... కడుపు చేత పట్టుకొని, అన్నీ అమ్ముకుని, ఉన్న ఊరిని... అయిన వాళ్లను వదిలి కల్లూరు (అనంతపురం జిల్లా)కు చేరుకున్నారు. అక్కడ కాసంశెట్టి రాధాకృష్ణయ్య పరిశ్రమలో నాన్న ఖాతాల పని చూసే ఉద్యోగిగా కొత్త జీవనాన్ని ప్రారంభించారు. ఎంత కష్టం వచ్చినా, ఎంత నష్టం వచ్చినా, విలువలు మాత్రం ఎప్పుడూ వదులుకోలేదు.

అమ్మ, నాన్న, తమ్ముడు అటు వెళ్లిపోయారు. అక్కయ్యకి పెళ్లి అయిపోయి అత్త గారి ఇంటికి వెళ్లింది. అన్నయ్యకు 19 సంవత్సరాలు డిగ్రీ అయిపోయింది. చాలా కష్ట పడి కెనరా బ్యాంకులో విద్యాభ్యాసం కోసం తక్కువ వడ్డీతో అప్పు తీసుకొని CA చేయాలని బెంగళూరుకు వెళ్లాడు. ఈ విధంగా నేను ఒక్కడినే మిగిలి పోయాను. నేను ఇంటర్మీడియట్ తాడిపత్రిలో చేరడం వల్ల వాళ్లతో వెళ్లలేక అక్కడ ఉండిపోయాను.

అప్పుడు నేను ఎక్కడ ఉండాలి? అన్నప్పుడు మా పెద్దనాన్న అంటే, మా నాన్నగారి అన్నయ్య, సుంకు వెంకట రంగయ్య కుటుంబము నన్ను అక్కున చేర్చుకుంది. (చెప్పడం మరిచాను... మా నాన్న బాగున్నప్పుడు... మా పెద్ద నాన్నల పిల్లలను మా ఇంట్లో పెట్టుకుని పోషించారు. నాకు గుర్తుంది, ముగ్గురు నలుగురు కజిన్స్ మాతో పాటు పెరిగారు. అలా ఉండేది నాన్న గారి ప్రేమ.

పెద్ద నాన్న వాళ్లు ఎవరు పల్లె నుండి వచ్చినా మా ఇంట్లోనే ఉండే వాళ్లు. ఎంతో మర్యాదగా చూసుకునేది మా అమ్మ వాళ్లందరిని.)

ఇక పెద్ద నాన్న ఇంట్లో వాళ్లేమో నలుగురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు చాలా పెద్ద సంసారము. అప్పటికే వాళ్లు కూడా చాలా కష్టాల్లో ఉండేవాళ్లు. వాళ్ల పిల్లల్ని మా నాన్నగారు చూసుకున్నారు, మా ఇంట్లోనే పెరిగారు కాబట్టి నన్ను వాళ్లు ఎంతో ప్రేమగా... మేము చూసుకుంటాంలే, రెండేళ్లే కదా? మాకు చేతనైంది మేము పెడతామని నాకు ఆశ్రయం ఇచ్చారు. వాళ్ల ఇంట్లో ఉన్న మూడు గదుల్లో పెద్ద వాళ్లు ఉండేవాళ్లు. నేను స్నానాల గది మెట్ల మీద ఒక చిన్న గదిలో ఉండేవాడిని! అది సరిగ్గా వేడి నీళ్ల కోసం స్నానాల గదిలో ఉండే కట్టెల పొయ్యి పొగ గొట్టం మీద ఉండేది. ఇక రాత్రంతా కూడా నేను ఉన్న గదిలోకి పొగ వచ్చి ఆస్తమ, ఆయాసము, దగ్గుతో బాగా ఇబ్బంది పడేవాడిని. బట్టలు, పుస్తకాలు పెట్టుకున్న చిన్న అల్మరాలోకి పొగ దూరి... వాటి మీద బూడిద పేరుకుని పోయేది. రోజు వాటిని దులుపుకునే వాడిని. కానీ అవేమీ నేను పెద్దగా పట్టించుకోలేదు. వాళ్లకు ఉన్న దాంట్లో నన్ను చూసుకున్నారు అదే గొప్ప అనుకుని ఎంతో కృతజ్ఞతతో కాలం గడిపేవాడిని. అందరితో పాటు వాళ్ల ఇంట్లో పని చేసుకుంటూ, బావికి వెళ్లి నీళ్లు చేదుకుని తెస్తూ, ఒక ప్రక్క చదువుకుంటూ, ఇంకో ప్రక్క ట్యూషన్‌కి వెళ్తూ ఉండే వాడిని.

ఈ సమయంలో అడిగేవాళ్లు లేక చాలా స్వేచ్ఛ వచ్చింది. అమ్మ నాన్న దగ్గర లేరు, నన్ను నియంత్రణ చేసే వాళ్లు లేరు. నేను ఏం చేయాలంటే అది చేసే అవకాశం. దాన్ని చాలా రకాలుగా దుర్వినియోగం చేసుకున్నాను. ఈ విషయాలన్నీ ఎందుకు చెప్తున్నాను అంటే ఒక మనిషి బాగు పడడానికి ఎన్ని అవకాశాలు ఉన్నా కూడా చెడిపోవడానికే ప్రయత్నం చేస్తాడు. దాని వల్ల జీవితంలో ఎన్నో విషయాలలో, ఎన్నో సందర్భాలలో మనం ఓటమి పాలవుతామని చెప్పడానికి ఈ సంఘటనలు వివరిస్తున్నాను. అందుకు నాకేమి సిగ్గుగా లేదు. ఈ అనుభవాలన్నీ తెలుసుకుని కొందరైనా తప్పులు చేయకుండా ఉంటారని నా ఆశ.

"కష్టాలే వచ్చినా, కన్నీరే కార్చినా, ఉప్పెనలు వచ్చినా, ఊపిరే పోయినా... ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము." అనే స్ఫూర్తి నాకు నిండుగా, దండిగా, మెండుగా కుటుంబ నేపథ్యం ఇస్తే దానికి మరింతగా బలం చేకూర్చింది స్వామి సిద్ధాంతాలే! అలా ఎన్నో సవాళ్లను ఎదుర్కుంటూ, నవ్వుతూ, ముందుకు ప్రయాణం చేశాము.

11

వైఫల్యాలే విజయానికి మెట్లు!

నేను ఇంటర్ చదివే సమయంలో చాలా అనానుకూలతలను, సవాళ్లను ఎదుర్కొన్నాను. 10వ తరగతి దాకా తెలుగు మాధ్యమం చదువుతున్న నాకు ఇంటర్‌లో నాన్న దూరదృష్టితో ఇంగ్లీషు మాధ్యమానికి మార్చేసారు. ఇది నా చావుకు వచ్చిందని అనుకున్నాను. అంతేకాక, తల్లిదండ్రుల / పెద్దల చెప్పడానికి నాతో లేకపోవడం వల్ల నేను అడ్డు అదుపు లేకుండా తెలియని నీటిలో ఈదడం మొదలెట్టాను. కొత్త స్నేహాలు, సహచరుల ఒత్తిడికి కూడా లోనయ్యాను. యవ్వనాకర్షణలు నా విషయాలను ప్రయాణాన్ని మరింత క్లిష్టతరం చేసాయి. అందులోనూ కాలేజీలో అమ్మాయిలు అబ్బాయిలు కలిసి చదువుకునే వాతావరణం.

నేను సగటు విద్యార్థి అయినప్పటికీ, తరగతిలో రామప్రసాద్ మరియు రవీంద్ర వంటి ప్రథమ శ్రేణి స్నేహితులతో తిరిగే వాడిని, ఆ ఇద్దరూ కూడా తరగతులకు క్రమం తప్పక వచ్చే పట్టణ ప్రథమ విద్యార్థులే... నేనేమో సత్య సాయి బాలవికాస్ నేపథ్యము నుండి వచ్చిన సగటు విద్యార్థిని. ఇక 10వ తరగతి నుండి మేము చేస్తూ వచ్చిన సంయుక్త అధ్యయనాలు, విహారయాత్రలు మరియు ఆటలు పాటలు మా బంధాన్ని మరింత దృఢంగా చేసింది. అయితే, అమాయకంగా ప్రారంభమైన స్నేహం అతి త్వరలోనే తోటివారి ఒత్తిడి మరియు సినిమా పట్ల వ్యామోహం వల్ల చెడ్డ దారి పట్టింది.

ముఖ్యంగా కృష్ణ, ఎన్టీఆర్, ఏఎన్ఆర్ వంటి సూపర్ స్టార్లు నటించిన సినిమాల పట్ల మాకున్న వ్యామోహం, కీలకమైన ఇంటర్ చివరి పరీక్షల సమయంలో కూడా మా చదువును నిర్లక్ష్యం చేసేలా చేసింది. మాకు మరుసటి రోజు కెమిస్ట్రీ పరీక్ష సమయంలో మా ప్రాధాన్యతలు ఏంటో తెలుసుకోలేక... దాని వల్ల కలిగే పరిణామాలు స్పష్టంగా అర్థం చేసుకోలేక... తర్వాత సవరించుకోవచ్చని భావించి, పరీక్షకు శ్రద్ధగా సిద్ధం కావడానికి బదులుగా, మేము 'అఖండుడు' అనే సినిమాకి వెళ్లాం. ఇంట్లో పెద్దలకు మాత్రం మేము కలిసి చదువుతున్నాం అని చెప్పాము. సినిమా నుండి మధ్య రాత్రి వచ్చి

చదువుదామని కూర్చున్న 10 నిముషాలకు విద్యుత్తు అంతరాయం వల్ల మా ప్రణాళికలు దెబ్బ తిన్నాయి. ఫలితంగా మేము ముగ్గురమూ ఆ పరీక్షలో తప్పి పోయాము. మా లాంటి ప్రథమ శ్రేణి విద్యార్థులు పరీక్ష తప్పడం తల్లిదండ్రులను కలవరపెట్టింది. కానీ వారికి మేము తీసుకున్న నిర్లక్ష్య నిర్ణయాల గురించి తెలియలేదు.

మా తప్పుల తీవ్రతను గ్రహించి, మమ్మల్ని మేము సరిదిద్దుకోవాలని నిర్ణయించు కున్నాము. నిజాయితీగా చదవడం ప్రారంభించాము. స్వామి వారి విలువలు మార్గదర్శకత్వం చేస్తున్నప్పటికీ... బాల వికాస్ విద్యార్థి అయినప్పటికీ యవ్వనాకర్షణ, పరధ్యానము అధిగమించ లేక పోయాను. చదువు మీద దృష్టి కేంద్రీకరించడానికి అసాధారణమైన నిర్ణయం తీసుకున్నాను, తరగతిలో ఉన్న సహచర బాలికలతో రక్షా బంధన్ కట్టించుకున్నాను, సోదర సోదరీ సద్భావన ప్రాముఖ్యతను వారికి చెప్పాను. దీని వల్ల మా మధ్య స్వచ్ఛమైన స్నేహము మొగ్గ తొడిగింది. చివరికి అది విద్యాభివృద్ధికి దారితీసింది.

అయితే, శుభం అనేది అందుబాటులోకి వస్తుందని అనిపించనే లేదు. తప్పిన కెమిస్ట్రీ పరీక్ష అనంతపురంలో వ్రాయడానికి బస్సులో బయలుదేరాను. వెళ్లే దారిలో విషాదం అలుముకుంది. ఊహించని బస్సు ప్రమాదం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఎదుట వస్తున్న బస్సు మలుపు వద్ద టర్న్ చేస్తుంటే... కిటికీలో పెట్టుకున్న నా కుడి చేయికి ఎదురుగా వస్తున్న బస్సు రాసుకుంటూ వెళ్లిపోయింది. నా చేయి గాలిలో రక్తం ఓడుతూ తెగి వేలాడుతోంది. అలాగే బస్సు గంట ప్రయాణం తరవాత అనంతపురం చేరుకుంది. కేసు సంక్లిష్టత, అధిక రక్తస్రావం కారణంగా అనేక ఆసుపత్రులు నన్ను చేర్చుకోవడానికి తిరస్కరించాయి.

గవర్నమెంట్ ఆసుపత్రిలో ప్రొద్దున 11.30 గంటల సమయంలో చేర్చారు. నేనేమో స్పృహ తప్పిపోయి పడి ఉన్నాను, ఆ స్ట్రెచర్ పైన, గవర్నమెంట్ ఆసుపత్రి పరిస్థితి ఎలా ఉంటుందో మనందరికీ తెలుసు. ఒకటి, కెమిస్ట్రీ పరీక్ష వ్రాయలేక పోయినందుకు సంవత్సరం పోయింది అన్న బాధ. రెండు చేయి తీసేస్తారన్న ఒక భయము ఆందోళన. మూడు, తల్లిదండ్రులు బాధ చూసి నాకు బాధ అయిపోయింది. నన్ను నేను ఎంతో తిట్టుకున్నాను. అయ్యో! ఇంత అజాగ్రత్తగా ఉన్నానే, ఎందుకు స్వామి నన్ను రక్షించలేదు, స్వామిని నేను ఇంతగా పూజిస్తాను కదా! అని చాలా బాధపడ్డాను. ఆ పరిస్థితుల్లో అక్కడ అనంతపురంకి దగ్గరలో ఉన్న సమత గ్రామం గురించి అమ్మ నాన్న తెలుసుకున్నారు. ఎముకల డాక్టర్, డా. వెంకటరమణప్ప. వారు కమ్యూనిస్టు. చాలా ప్రసిద్ధి గాంచిన హస్తవాసి. ఉచితంగా వైద్యం చేస్తారని కూడా తెలుసుకున్నారు. రాత్రికి రాత్రి నన్ను ఒక ఆటోలో తీసుకుని అమ్మ నాన్న 30 కిలోమీటర్లు ప్రయాణం చేసి అక్కడికి వెళ్తే, అక్కడెమో మేడే కార్మికుల దినోత్సవం సందర్భంగా కమ్యూనిస్టుల సంబరాలు జరుగుతున్నాయి. నాకు బాగా గుర్తు, నన్ను ఒక చెట్టు కింద పడేసారు. ఇప్పుడు రాత్రి కదా, ఏం చేయలేము. డాక్టర్ ఇంకా ప్రొద్దున 10 గంటలకి OPలో చూస్తారు అని చెప్పారు. నేను రాత్రి అంతా ఆసుపత్రిలో చెట్టు కింద, చలికి తట్టుకుంటూ మగతగా పడుకున్నాను. అక్కడ పాడే పాటలు వినిపిస్తున్నాయి. ఆ సాంస్కృతిక కార్యక్రమాల్లో 'సాయిబాబా సన్యాసి బాబో దొంగ బాబో' ఇట్లా పాడుకుంటూ ఉన్నారు. నేను తల్లడిల్లిపోయాను, అయ్యో ఇలా కమ్యూనిస్టు ఆసుపత్రికి వచ్చానే, స్వామిని తిడుతున్నారే వీళ్లు, ఇలా పాటలు పాడుతున్నారే, నా జీవితం ఏందప్పా! ఇలా అయిందేమిటి నాకు అని బాధ పడ్డాను.

మరుసటి రోజు OPలో నన్ను చూసి, "ఈ అబ్బాయికి ఆపరేషన్ చేయాల్సి వస్తుంది, చేసినా

చేయి వస్తుందొ రాదో చెప్పలేను. కనీసం అన్నం చేతితో తినేదానికి వచ్చేటట్టు ప్రయత్నం చేస్తాను" అని చెప్పారు. అలాగా మరుసటి రోజు నన్ను ఆపరేషన్ థియేటర్ లోకి తీసుకెళ్లారు. డాక్టరు నన్ను బాల గంగాధర తిలక్ అని పిలిచేవారు. ఆ రెండు రోజుల్లో నేను ఎవరో అర్థమైంది? మత్తు ఇస్తూ ఆయన అడిగారు, అరే బాల గంగాధర్, నీకు ఇష్టమైన దేవుడు ఎవర్రా? అంటే సాయిబాబా అని చెప్పాను. ఆహా! నీకు ఇష్టమైన సినిమా హీరో ఎవరు? అంటే కృష్ణ... ఎందుకు అంటే అల్లూరి సీతారామరాజు అంటూ నేను మత్తులోకి జారిపోయాను. సుమారు 3:30 గంట ఆపరేషన్ చేశారు. ఒక 2:30 మూడు కిలోల ప్లాస్టర్ ప్యారిస్ కట్టు కట్టి, గాయం అయిన చోట గ్యాప్ ఇచ్చి డ్రెస్సింగ్ చేయడానికి వీలుగా చేశారు. ఆపరేషన్ తరువాత నేను 3 రోజులు అపస్మారకంగా ఉండి పోయాను. అమ్మ నా కోసం స్టవ్, బియ్యం, పప్పు దినుసులు అన్ని తెచ్చుకుని వంట చేసుకుంటూ నన్ను కంటికి రెప్పలా చాలా జాగ్రత్తగా చూసుకునేది, మా అమ్మ అన్నం తిన్నదొ లేదో కూడా నాకు తెలియదు. తల్లిదండ్రులు పిల్లల మీద ఎంత మమకారం పెట్టుకుంటారు అనేది నాకు పూర్తిగా తెలిసింది. నా తమ్ముడు నా చెయ్యి పట్టుకొని నడిపించాడు, నేను అక్కడ కూర్చో లేకపోతే ఆ పొదల్లోకి తీసుకెళ్లి టాయిలెట్ చేయించి ముడ్డి కడిగి, కాళ్లు చేతులు కడిగి ఇదంతా చేశాడు.

ప్రతి గురువారం, ఆదివారం గాయానికి డ్రెస్సింగ్ చేసేవాళ్లు. దానికోసం పాతిక మంది వరుసలో ఉండే వాళ్లు. వాళ్లందరికీ స్వయంగా డా. వెంకటరమణప్ప గాయాలు శుభ్రం చేసి మళ్లీ కట్టు కట్టే వాళ్లు. ఎంత భయంకరమైన అనుభవం అంటే, పట్టకారాలు పెట్టి కర కర గీకి అలా తీసి పడేసేవాళ్లు. అమ్మా! నాయన! ఇక అరిచి గీ పెట్టేవాళ్లందరూ. నాకు జ్వరం వచ్చేసేది ఆ భయంతో. ఏం చేయాలో తెలీదు. అలవాటు ప్రకారం "సాయిరాం! సాయిరాం!" అని అరిచే వాడిని. డాక్టర్ గారికి కోపం వచ్చేది. "అరేయ్! బాల గంగాధర్ నేను నీకు సేవ చేస్తుంటే నువ్వేమో సాయిబాబాని తలుచుకుంటావా? చంపేస్తా నా కొడుకా? నువ్వు సాయిబాబా అని తలుచుకుంటే" అని అరిచేవారు.

సాయిరాం అని నేను అనుకుంటే చాలు కదా. ఆయనకెందుకు అర్థం కావాలి? అని చెప్పి. సాయిలో 'సా' రామ్‌లో 'రా' "సారా సారా" అని అరవడం మొదలుపెట్టాను. డాక్టర్ హ్యాపీ, నేను హ్యాపీ. నాకు తెలుసు 'సారా' అంటే సాయి రామ్ అని, ఆయనేమో సార్ అని ఆయన అనుకున్నాడు. ఈ విధంగా మూడు నెలల తర్వాత డాక్టర్ మా అమ్మకు చెప్పారు, నేను ఎటువంటి బరువులు మోయలేనని. మరొక సారి శస్త్రచికిత్స అవసరంవుతుందని చెప్పారు. 15 రోజులకు ఒకసారి తీసుకొని రండి చూద్దాం అని పంపించేశారు.

ఇంటికి వచ్చాక ఇక చేయి రాదని చెప్పి చాలా ఏడ్చేవాడిని, ఇలా అయిపోయానే అని. కల్లూరు (RS)లో నేను ఈ చేయి విరిగిన సమయంలో, ఒక ప్రక్క సత్యసాయి బాల వికాస్ ఇంట్లోనే మొదలు పెట్టాను. ఆ చేయి విరిగిన బాధలో, పని లేకుండా ఇంట్లో కూర్చోకుండా, ఆ గ్రామంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను.

ఒకానొక మధ్యాహ్నం నిద్రపోతున్న సమయంలో స్వామి కలలోకి వచ్చారు. స్వామిని చూసి ఏడుస్తున్నాను. స్వామి అడిగారు "ఏమీ ఎందుకు ఏడుస్తున్నావ్?" నేను, "చెయ్యి రాదన్నారు స్వామి" అన్నాను. స్వామి అడిగారు "ఎవరు రాదని చెప్పింది" అంటే... డాక్టర్ వెంకటరమణమ్మ స్వామి అని చెప్పాను.

స్వామి, "డాక్టర్ ఎవర్రా? ఆయనా నేనా డాక్టర్? అంటే, "స్వామి you are my doctor" అన్నాను. "Give me your hand" అన్నారు. అప్పుడు నా ఎడమ చెయ్యి అదంతకదే లేచింది.

స్వామి చాలా కోపంగా "ఏయ్, you are giving left hand to swamy? you should always give right hand to swamy" అని అన్నారు. ఎట్లా ఇస్తాను 3. 30 కిలోల ప్లాస్టర్ ప్యారిస్ కట్టు ఒఉంది కదా అది కూడా మెడకు గంటు వేశారు కాబట్టి స్వామిని ప్రశ్నార్థకంగా చూసాను? స్వామి నవ్వుతూ ఒక కత్తెర సృష్టించి గంటుని కట్ చేశారు. కట్ చేసిన చేతిని ఆ ప్లాస్టర్ పారిస్ మీద సాగదీసి, మూడు సార్లు దాని మీద ఆశీర్వదించారు. "I am giving this hand back to you", రెండు చేతులు పట్టమని చెప్తే పెట్టాను, స్వామి విభూతి సృష్టించారు. నా చేతులు నిండుగా వచ్చింది. గ్రామంలో బాల వికాస్ పిల్లలందరికి పంచాలని అనుకుంటున్నాను. స్వామి అన్నారు "ఏయ్ close the hands and open" అంటే అలానే చేశాను. విభూతి అంతా ఒక చిన్న మాత్ర పరిమాణానికి అయిపోయింది. "నోట్లో వేసుకో, మింగు" అంటే, తిన్నాను.

3 నెలల తరవాత డాక్టర్ను చూసేందుకు వెళ్లిన సమయంలో, అక్కడ డాక్టర్ నా చేతికి ఎక్స్‌రే తీసి తనిఖీ చేసినప్పుడు ఆశ్చర్యపోయాడు. నా చేతికి రెండవ సారి శస్త్రచికిత్స చేసే అవసరం లేదని తేల్చి చెప్పారు. దీనిని అద్భుతం అంటూ... పంపేసారు.

ఆ తరువాత, కొన్ని సంవత్సరాల పాటు ముంజేతిలో ఒక చిన్న ఎముక కదులుతూ చేతిని కదిలించినప్పుడు నెప్పిగా ఉండేది. ఎంత ప్రయత్నించినా నెప్పిపోలేదు. వైశ్యా హాస్టల్‌లో చదివే సమయంలో, మరొకసారి స్వామి వారు కలలో కనిపించి, నెప్పి ఉన్న ప్రదేశంలో చూపుడు వ్రేలితో రాస్తూ తగ్గిపోతుంది అని చెప్పారు. ఇక అంతే నెప్పి ఇప్పటి దాకా (2025) కూడా రాలేదు అంటే నమ్మండి.

ఏమి చేయాలో తెలియ లేదు నాకు... వైద్యమా? లేదా దివ్యమా? స్వామి దీవెనతో అభయమిచ్చి, కరుణతో నాకు వారు ప్రసాదించిన జీవితాన్ని... సాయి కార్యంలో పునరంకితం చేసుకోవాలని నిర్ణయించాను. పునరుద్ధరించబడిన చేయియే ఆ తరవాత కాలంలో అభయమయ్యి ఒక మహత్తర సేవా చిహ్నంగా మారుతుందని నాకానాడు తెలియలేదు. ఈ సంఘటన ఇక ముందు ధర్మమార్గంలో నడవాలని మరియు ఆ చేతితో ఇతరులను సేవించడం ద్వారా ప్రేమను పంచాలని నాకు గుర్తు చేస్తుంది.



12

సత్య సాయి భజన మండలి – కల్లూరు (RS)

దాదాపు ఒక సంవత్సరం పాటు ఇంట్లోనే ఉండి, ఆపరేషన్ చేయబడిన చేతిని మళ్లీ మంచిగా మార్చుకున్నాను. మా కుటుంబం తాడిపత్రి నుండి, అనంతపురానికి 30 నిమిషాల దూరంలో ఉన్న కల్లూరు అనే చిన్న గ్రామానికి మకాం మార్చింది. నా తండ్రి పామిడిలో జన్మించిన కాశంశెట్టి రాధా కృష్ణయ్య గారి RK ఇండస్ట్రీస్‌లో అకౌంటెంట్‌గా చేరినారు. శెట్టిగారు మంచి పేరు ప్రఖ్యాతులున్న పారిశ్రామికవేత్త మరియు మానవతావాది. సేవా దురంధరుడు, వితరణ శీలి. అంతేగాదు దేశములోనే అందరికీ తెలిసిన వైశ్య ప్రముఖులు.

వారికి వంట నూనెల కర్మాగారాలు ఉండేవి. దాని కారణంగా వందలాది మందికి ఉపాధి కల్పించారు.

కల్లూరులో అద్దె ఇల్లు నిరాడంబరంగా ఉండేది, అయినప్పటికీ నేను స్వామి ద్వారా నింపబడిన సమృద్ధిని అనుభవించాను. ప్రతి క్షణం, స్వామి సేవలో నా సమయాన్ని ఎలా అంకితం చేయాలో ఆలోచించాను. స్థానికముగ పిల్లలను సేకరించి, నేను స్వామి వారి మాటలను, కథలను, ఆలోచనలను పంచుకోవడం ద్వారా ప్రేమను పంచేవాడిని.

హనుమాన్ మందిరంలో శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా నేను వెళ్లాను. వెళ్తూనే అక్కడ చిందర వందరగా అందరూ వదిలి వెళ్లిన చెప్పులు మరియు అక్కడి అపరిశుభ్రమైన పరిసరాలను గమనించాను. స్వామి పరిశుభ్రత గురించి బోధించిన విషయాలను గుర్తుచేసుకుంటూ, చెప్పులు అన్ని వరుస క్రమంలో ఉంచి ఆ ప్రాంతాన్ని ఊడ్చే బాధ్యతను తీసుకున్నాను. అక్కడే కూర్చుని ఉన్న నా సహచరులు నన్ను ఎగతాళి చేస్తున్నా నేను పట్టించుకోలేదు.

అదే సమయంలో ఖరీదైన కార్లలో కొద్ది మంది సంపన్న వ్యక్తులు వచ్చారు. నేను కంగారు పడకుండా నేను చేస్తున్న పనిని కొనసాగించాను. ఆ కార్‌లో నుండి ఒక సంపన్న మహిళ నన్ను చూసి నాతో మాటలు కలిపింది.

మా సంభాషణలో, ఆమె నా చదువులు మరియు ఆకాంక్షల గురించి అడిగింది. గ్రామంలో ఎలాంటి కార్యకలాపాలు చేయవచ్చో అడిగింది. సత్యసాయి భజనలు నిర్వహించడం గురించి నేను ప్రస్తావించినప్పుడు, ఆమె తన కుటుంబానికి సత్యసాయి బాబాతో ఉన్న అనుబంధాన్ని వెల్లడించింది. అంతే కాదు ప్రతి వారం భజనల కోసం వారి ఇంటి ప్రాంగణాన్ని వాడుకోవచ్చు అని చెప్పింది. ఇంతకు ఆవిడ ఎవరు అంటే వైశ్య ప్రముఖులు మరియు పారిశ్రామిక వేత్త రాధాకృష్ణయ్య కుమార్తె, మాతృ మూర్తి సుజాతా సారధి. చాలా ఆశ్చర్యం అయింది వారిని చూసి. ఆమె మాటలకు ఎంతో సంతోషించి, గురువారం భజన కార్యక్రమాలను వారింట్లో ప్రారంభించాము. తదాదిగా గ్రామం అంతటా సందేశాన్ని వ్యాప్తి చేశాము.

నేను చిన్నవాడిని కదా, నేను భజనకు మాత్రమే వెళ్లే వాడిని. ఆ తివాచీలు పరచడం, కుర్చీలు అమర్చడం, ఫోటోల అలంకరణ మొదలైనవి, సుజాతక్క చేస్తున్నది గమనించాను. సమయపాలన మరియు నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను త్వరలోనే గ్రహించాను. ఒకసారి భజనలకు నా ఆలస్యానికి సంబంధించి సుజాతక్క నుండి సున్నితమైన మందలింపు శాశ్వత ప్రభావాన్ని చూపింది. అప్పటి నుండి, నేను సమయపాలన పాటించాలని నిశ్చయించుకున్నాను. ఈ లక్షణం నేటికీ నాతో ఉంది.

కల్లూరులో భజన మరియు బాలవికాస్ ఊపందుకుంటున్నందున, గ్రామంలోని ప్రసిద్ధ వ్యక్తులు అయిన రాధా కృష్ణయ్య గారు మరియు వేముల శేషయ్య శెట్టి గారు వంటి ప్రభావవంతమైన వ్యక్తుల నుండి మద్దతు లభించింది. తమ సేవలకు 'వైశ్య రత్న' అవార్డు పొందిన వారు రాధా కృష్ణయ్య స్వామి వారిని 'చక్రవర్తి' అని ప్రేమగా సంబోధించేవారట.

ఇక వ్యాపారము నష్టాల ఊబిలో ఉన్న సమయంలో స్వామి వారు వేముల శేషయ్య శెట్టి ఇంటికి స్వయంగా వెళ్లి వారి పరిశ్రమను కూడా సందర్శించి అక్కడి యంత్రాల దగ్గరకు వెళ్లి మనుషులను ఆశీర్వదించినట్లుగా ఆశీర్వదించినారు. అంతే కాదు, టెంకాయ కొట్టి... ఇక ముందు టెంకాయలో నీళ్లు ఎలా ఊరుతాయో అలా వారింట ధనం ఊరుతుంది అని చెప్పారట. అప్పటి నుండి వారి జీవితాల్లో ఇక నష్టం ఎక్కడా లేకుండా చక్కగా వృద్ధిలోకి వచ్చారట.

వారి అనుభవాలు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. కాబట్టి వారి మద్దతుతో, కల్లూరులో శ్రీ సత్య సాయి భజన మండలి స్థాపించబడింది, భజనలలో సుమారు 50 మంది భక్తులు మరియు 30 మంది బాలవికాస్ విద్యార్థులు వచ్చే వారు.

ఈ విషయాలు అన్ని ఎప్పటికప్పుడు Dr అంజనయ్య (సేవాదల్ కోఆర్డినేటర్), నాగభూషణ రావు (బాలవికాస్ కో ఆర్డినేటర్) మరియు జ్యోతి అక్క వంటి ఆత్మీయులకు ఉత్తరాల ద్వారా తెలిపేవాడిని. వారు కల్లూరు కేంద్రాన్ని సందర్శించి అందరికీ స్ఫూర్తి నందించమని అభ్యర్థించే వాడిని.

విద్యాభ్యాసంలో సవాళ్లు, జీవితంలో ఎన్ని ఎదురుదెబ్బలు ఉన్నా స్వామి సేవలో నా సమయం మాత్రం నిరాటంకంగా సాగిపోయిందన్న ఓదార్పు లభించింది.

వెను తిరిగి చూసుకుంటే, ఎదుర్కొన్న ఎదురుదెబ్బల పట్ల నాకు ఏ చింత లేదు. ఎందుకంటే అవి చివరికి కల్లూరులో స్వామి సంస్థ స్థాపన మరియు అభివృద్ధికి దారితీసాయి. సాయి బోధనలు మరియు ప్రేమను వ్యాప్తి చేయడంలో నా జీవిత ఉద్దేశ్యం నెరవేరింది కదా అనిపించింది.

13

సాయి సిద్ధాంత వ్యాప్తికై ప్రయాణం

కల్లూరు (RS) అనంతపురం జిల్లాలో... జాతీయ మార్గములో ఉండే రైల్వే స్టేషన్. ఆ రైలు పట్టాల ఇరువైపులా గ్రామం ఏర్పడింది. కాల క్రమంలో అది కాస్తా కల్లూరు (RS)గా మారిపోయింది. ఇక్కడ RS అంటే Railway Station అన్న మాట.

చాలా ప్రశాంతమైన కుగ్రామం. అక్కడ భజన, బాల వికాస్ మరియు సేవా కార్యక్రమాలలో పాల్గొనడానికి గ్రామస్తులు అందరూ కూడా ఎంతో ఆసక్తిగా ముందుకు వచ్చే వాళ్లు. వారి ఉత్సాహం ప్రోత్సాహంతో ఆ గ్రామంలో ఒక అద్భుతమైన వాతావరణం ఏర్పడింది. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కాశం శెట్టి రాధకృష్ణయ్య ఒక ప్రక్కన మరియు వేముల శేషయ్య మరొక ప్రక్కన సాయి సంస్థకు పెట్టని కోటలు అని చెప్పాలి. ఆ గ్రామంలో ప్రతి మంచి పనికి వారిరువురు కూడా మూల స్తంభాల లాగా నిలబడే వారు. వారి అచంచలమైన మద్దతుకు నేను సదా ఋణపడి ఉన్నాను. వారి సదాచారమే గ్రామ ఆధ్యాత్మిక చైతన్యానికి ఆయువు పట్టుగా నిలిచింది. నిజానికి గ్రామాలలో / పట్టణాలలో వైశ్య సమాజంలో ఇలాంటి వాళ్లు ఉండటం వలననే ఎన్నో ధార్మిక సామాజిక ఆధ్యాత్మిక దైవిక కార్యక్రమాలు నిరాటంకంగా జరుగుతున్నాయి అనుకోవడంలో తప్పు లేదు.

ఈ ఉత్సాహంతో కల్లూరులో జరుగుతున్న విశేషాలను వివరంగా వ్రాసి Dr. అంజనయ్యకు మరియు V నాగభూషణంకు లేఖ పంపించాను. వారిరువురూ ఎంతో సంతోషంతో నన్ను మెచ్చుకుంటూ ప్రత్యుత్తరం ఇచ్చారు. అంత చిన్న వయసులో స్వామి కార్యానికి నేను పాటు పడటం అన్నది వాళ్లకు విశేషంగా తోచింది. అందుకే వాళ్లు మేము వస్తాము, సమావేశం ఏర్పాటు చేయి అని సూచించారు. చాలా ఉత్సాహంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి, సాయి సంస్థల పెద్ద వాళ్లు వస్తున్నారు మనం అందరం చేరి సమావేశం నిర్వహించాలి అని చెప్పాను. దానికి ప్రతిస్పందనగా, భక్తులు గ్రామస్తులు ఎంతో మంది సమావేశ మయ్యారు.

స్వామి దయ వలన రాధాకృష్ణయ్య గారి ఎస్టేట్‌లో ఉండే సభా మందిరంలో సమావేశానికి ఏర్పాటు చేశారు. ఇక పెద్దలు వచ్చిన సందర్భంగా అక్కడ బాల వికాస్ పిల్లలు మరియు భక్తులు అందరూ చేరి గ్రామ సంకీర్తన చేశారు. అందరూ వైట్ డ్రెస్సులు వేసుకుని ఆ గ్రామ విధుల్లో భజనతో నడుస్తుంటే చాలా విచిత్రంగా ఉత్సాహంగా ఉండే.

ఈ ఉత్సాహం, కార్య శీలత, ప్రముఖుల ప్రోత్సాహం అన్నీ చూసి సాయి సంస్థ పెద్దలు ఎంతో సంతోషంగా అప్పటి దాకా కల్లూరులో నడిచే "శ్రీ సత్య సాయి భజన మండలి"ని కాస్తా శ్రీ సత్య సాయి సేవా సంస్థగా ప్రకటించారు. ఆధ్యాత్మిక సేవలో కొత్త అధ్యాయాన్ని లిఖించినారు.

8-9 నెలల వ్యవధిలో, సంస్థ వికసించింది, అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇక ఆ ప్రాంతములో ఇంకా భక్తులు రావడానికి మార్గం సుగమం చేసేందుకు సేవాదళ్ శిక్షణా శిబిరం ఏర్పాటు చేశాము.

విరిగిన చేతితో, ఆరోగ్యం బాగా లేనప్పటికీ. ఆ చేతి కట్టుతోనే నేను అలంకరిస్తూ, అందరినీ ఉత్సాహ పరుస్తూ. శిబిర ఏర్పాట్లు చేశాము. ప్రయత్నాలు కొనసాగాయి.

అనంతపురం జిల్లాలో చేసే పునఃశ్చరణ తరగతులు, బాల వికాస్ గురువుల శిక్షణా తరగతులు, మరెన్నో సేవా కార్యక్రమాలు మరియు సమావేశాలు ఆ చిన్న గ్రామంలో చాలా భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. అందులో పాల్గొన్న ప్రతి హృదయం స్పందించే హృదయం అయ్యింది. వారందరికీ చెరగని జ్ఞాపకాలను సాయి సంస్థ ప్రసాదించింది. ప్రతి ప్రశంస, ప్రతి ప్రేరణ వెనక ఉన్న స్థిరమైన మూలం ఒకటి ఉంది అదే శ్రీ సత్య సాయి బాబా.

స్వామి కార్యాన్ని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలన్న స్థిర సంకల్పంతో, ప్రతి నిత్యమూ కూడా చుట్టూ ప్రక్కల గ్రామాలకు వెళ్లి సేవ చేయడానికి నా సమయం అంకితం చేయబడింది.

ఈ కాలంలోనే, నాకు ఎంతో మంది నవ యువకులు తోడు నిలబడ్డారు. రాధాకృష్ణ, లక్ష్మి ప్రసాద్, సతీష్ కుమార్, సాయి సుబ్రమణ్యం, పుట్టయ్య, పాపయ్య, రాము ఇలా ఎంతో మంది సాయి సంస్థతో ప్రయాణించారు. నా బాల వికాస్ విద్యార్థి అయిన పాపయ్య తరవాత కాలంలో అనంతపురం జిల్లా సాయి సంస్థల యువజన విభాగం సంచాలకుడు అయ్యారు. ఇది నిజంగా సాయి కార్యంలో ప్రయాణించడం వలన కలిగిన ప్రభావం అని చెప్పాలి.

అదే సమయంలో డిగ్రీ చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, వారంతాలలో, సెలవులు ఉన్నప్పుడు అనంతపురం నుండి వెళ్లి కల్లూరు గ్రామము మరియు చుట్టూరా ఉన్న గ్రామాలకు వెళ్లే వాడిని. అక్కడ సాయి సంస్థ వ్యాప్తికి ప్రయత్నించే వాడిని.

అలాంటి సమయంలో తోటి స్నేహితులతో పుట్టపర్తికి వెళ్లాను. అక్కడ పూర్ణ చంద్ర సభా మందిరంలో స్వామి ఉపన్యాసం జరుగుతోంది. శ్రద్ధగా వింటున్నాను. చాలా ఆశ్చర్యంగా ఒక వ్యక్తి వెనక నుండి వచ్చి నా ప్రక్కనే స్థలం చేసుకుని కూర్చున్నారు. పామిడికి చెందిన పారిశ్రామికవేత్త వారు. వారి పేరు శివాజీ రావు, మరాఠి వారు. పూర్వం ఎప్పుడో వచ్చి పామిడి గ్రామంలో స్థిరపడినారు. వారు అడిగారు... "మీరు బాలచంద్ర కదా" అని. ఆశ్చర్యపోవడం నా వంతు అయింది. అవును అన్నాను. వారు ఎంతో వేడుకోలుగా పామిడి గ్రామంలో సాయి భజనలు మరియు సేవా కార్యకలాపాలను ప్రారంభించడానికి మార్గదర్శకత్వం కోరుకొన్నారు నేను ఆనందంతో పొంగి పోయాను.

ఆ తర్వాత పామిడికి వెళ్లి అక్కడ గ్రామస్తులతో, భక్తులతో మాట్లాడి ఉత్సాహపరచి, పామిడిలో చాలా వైభవంగా భజన కేంద్రాన్ని ప్రారంభించాము. దీనితో సాయి కార్య ప్రభావం పొరుగు గ్రామాలకు

విస్తరించింది. నేను మిగతా మిత్ర బృందంతో వివిధ మార్గాల ద్వారా అంటే సైకిళ్లు, బైకులు లేదా కాలినడకన ప్రయాణిస్తూ సాయి సందేశాన్ని అన్ని ప్రాంతాలకు విస్తరించాలని తపించే వాడిని. హృదయాలను సాయి నామంతో సృజించడము, జీవితాలను మార్చడం... ఇదే పని. వేరే పనీ పాట లేదు!! ఈ పరివర్తనయే మా అందరి సేవా ప్రయాణ గమ్యం.

ఒక సంశయాత్ముడే భక్తుడవుతాడు, వాడే అనుచరుడవుతాడు, అతని సేవ మరియు అంకితభావం చూసే స్వామి వాడి దరి చేరతాడు. ఇదిగో ఇందుకు నిదర్శనమే అనంత ఆణిముత్యం, 'ఆదర్శ రైతు పురస్కారం' అందుకున్న తాతిరెడ్డి. మార్తాడు గ్రామానికి చెందిన ఆయన అక్కడ జరిగే సభలో స్వామిని గూర్చిన ప్రశ్నలు వేసి విసిగించాడు. ఆ తర్వాత స్వామి తత్వం తెలుసుకుని, సాయి కార్యానికి ఆకర్షితుడై, వాళ్ల గ్రామంలో సాయి భజన మండలిని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాలంలో జిల్లా స్థాయి సంస్థ క్రియాశీల కార్యకర్తగా మారి... స్వామి అనుగ్రహాన్ని అందుకున్నారు.

కల్లూరు మరియు పామిడి జంట గ్రామాల మధ్యలో కేవలం పెన్నా నది వేరు చేస్తుంది. ఈ రెండు గ్రామాలు సాయి బోధనల బురుజులుగా ప్రకటితం అయ్యాయి. ఇక్కడ నా ప్రయాణం అచంచలమైన భక్తి విశ్వాసాలతో, అంకితభావంతో కొనసాగింది.

ఎన్ని సవాళ్లు ఎదురైనా, ఎన్ని కఠిన పరిస్థితులు చుట్టూ ఉన్నా, సేవలకు ఏ నాడు అడ్డం కాలేదు. స్వామి భక్తి అనే బంధం మాత్రం పదిలంగా ఉండి. స్వామిని సదా స్మరించే అవకాశం ఇచ్చింది. స్వామి ఇచ్చిన అవకాశంతో నా హృదయంలో కృతజ్ఞత పొంగిపొర్లుతూ ఉండేది. అనంతపురం జిల్లాలో సాయి సిద్ధాంత వ్యాప్తికి చేసే ప్రయాణం నాలో విశ్వాసాన్ని మరెంతో పెంచింది. నన్ను సాయిని చేరుకునే చుక్కానిగా నిలిచింది.

14

సాయి కార్య మార్గదర్శి – సుజాతా సారథి

ఒకసారి మనం ఆలోచిస్తే ఒక వ్యక్తిని బాగుపరచడానికి దైవశక్తి మాత్రమే అవసరం లేదేమో అనిపిస్తుంది. కారణం, చుట్టూరా ఉన్న పరిసరాలని మనుషులని మనసులని మనం గమనిస్తే అద్భుతమైన ప్రేరణ తీసుకోవచ్చు అని నేను ఎప్పుడూ నమ్ముతాను. ఒక మనిషికి ఇంతలా ప్రభావితం చేయగలిగిన శక్తి ఉన్నదా అనే విషయాన్ని నేను జీవితములో స్వయంగా గమనించి... ఔను అనే సమాధానం చెప్తున్నాను.

నన్ను స్వామి వారు పరోక్షంగా ప్రభావితం చేయడానికి ఎన్నుకున్న ఒక వ్యక్తి గురించి మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. జీవితంలో ఋణపడి ఉండాలి అంటే చాలామంది ఉన్నారు. అందరిలో కూడా ప్రధానంగా నేను ఐదు మంది సోదరీమణులను తలుచుకుంటాను.

సుజాత సారథి నాకు మూడవ అక్క. ఈ మాతృమూర్తి గురించి నేను వివరించే ప్రయత్నం చేస్తాను, ఎందుకంటే స్వామి సన్నిధిలో, స్వామి కార్యంలో నాకెదురైన అతి ముఖ్యమైన అనుభవాలు అన్ని కూడా ఈ తల్లి వ్యక్తిత్వంతో ముడిపడి ఉన్నాయి.

వీరి పేరు తిరువీధి సుజాత సారథి. ఈవిడ కాశం శెట్టి రాధాకృష్ణయ్య కుమార్తెలలో నాల్గవ వారు. ఈవిడ వివాహం చార్టర్డ్ అకౌంటెంట్ అయిన పార్థసారథితో జరిగింది. వారు RK ఇండస్ట్రీస్‌కి సంబంధించిన మొత్తం ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షించే వారు.

రాధాకృష్ణయ్య గారి ప్రాంగణం అంటే, ఆ కాలంలోనే ఒక గేటెడ్ కమ్యూనిటీ అనవచ్చు. అసలు వేరే వారు లోపలికి వెళ్లాలి అంటే కొంచెం సంకోచంతో, జంకుతో ముందు వెనుక ఆలోచించి మాత్రమే వెళ్లేవారు. అలాంటి కమ్యూనిటీలో నన్ను ఎంతో ప్రేమతో చేరదీసిన సోదరి సుజాత అక్క. వయసులో మేము తల్లి బిడ్డల లాగా ఉన్నా, నేను ఆమెను "అక్క" అనే పిలిచేవాణ్ని. ఆవిడ ఎంతో ప్రేమగా నన్ను ప్రోత్సహించేది.

సత్యసాయి సేవా సంస్థను కల్లూరు గ్రామంలో ప్రారంభించడానికి ప్రధాన కారణం సుజాత

సారధియే. ఆమెనే దగ్గరుండి నన్ను ముందుకు నడిపించారు. వారి ప్రాంగణంలో ఉన్న సభా ప్రాంగణమును సత్యసాయి కార్యక్రమాల కోసం ఉపయోగించుకునేలా ఆమె అనుమతించారు. అలాగే ఆమెతో రెండున్నర నుండి మూడేళ్ల వరకు ఎంతో సన్నిహితంగా ఉండే అదృష్టం నాకు లభించింది. ఆ సమయంలో ఆమెను నేను ఎంతో సమీపంగా, బాగా పరిశీలించగలిగాను, గమనించగలిగాను. ఆ కాలంలో నేను నేర్చుకున్న కొన్ని విషయాలు, ఆవిడ ఏ విధంగా నన్ను ప్రభావితం చేసింది అన్నది ఇక్కడ చెప్తున్నాను.

ప్రథమంగా చెప్పాలంటే... ఆమె విజ్ఞాన సర్వస్వంలా అనిపించేవారు. ప్రవాహం లాగా ఏ విషయం గురించైనా అనర్గళంగా మాట్లాడగలిగేవారు. ఆమెను చూస్తూ నేను ఆశ్చర్యపోయేవాడిని. "ఇంత అందంగా, చక్కగా, విస్తృతంగా వివరించడం నేర్చుకోవాలి" అనిపించేది. ఆమె మాటల్లో విషయాల వరిజ్ఞానం ఎక్కడి నుండి ఎక్కడికో చేరేది. ఏ విషయాన్ని ఏ కోణంలోనైనా పొందుపరచగలిగేది. ఒక్కోసారి ఆమెతో మాట్లాడుతుంటే క్షణాలు అనుకున్నవి కాస్తా గంటలుగా మారిపోవడం సహజంగా జరిగిపోయేవి. ఒక గంట, గంటన్నర, రెండు గంటలైనా ఆ మాటల ప్రవాహంలో కాలం గమనించకుండా ముచ్చటించేది. మేమిద్దరం కూర్చుంటే, నిజానికి నాకు మాట్లాడే అవకాశం తక్కువే! ఆమె చెప్పేది విని తీరాల్సిందే. ఎందుకంటే ఆమె మాటలు అంత ఉత్సాహ భరితంగా, లోతుగా ఉండేవి. మైకులో ప్రసంగించేవారు కాకపోయినా, నాకు వ్యక్తిగతంగా ఎన్నో విషయాలు బోధించేవారు. నిజంగా చెప్పాలంటే, ఆ అక్కతో గడిపిన ప్రతి క్షణం నాకు మరొక బాల వికాస్ తరగతిలా అనిపించేది.

ఇక రెండోది! చాలా నిక్కచ్చిగా సమయపాలన చేసేది. అది ఎవరైనా సరే నేను ఎప్పుడైనా తప్పుగా చేస్తే వెంటనే నన్ను సరిదిద్దే ప్రయత్నం చేసేది. ఎంతో సేవా దృక్పదంతో ఆవిడ మసలుకునేది. ఇంటికి వెళ్లిన ఏ సమయంలోనైనా ఏదైనా పెట్టి గాని, ఏదైనా ఇచ్చి గాని, ఏదైనా చెప్పి గాని, పంపించేది.

ఇక మూడో విషయం ఏంటంటే? ఆమె నా జీవితంలో ఒక అపూర్వ అవకాశాన్ని ఇచ్చిన మహానుభావురాలు. అదేంటంటే, నా ప్రేమను జనాల పట్ల వ్యక్తీకరించుకునే దారిని చూపినవారు ఆమె. నేనొక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడను. మా నాన్న గారు అక్కడ ఫ్యాక్టరీలో పని చేసేవారు. అమ్మ గృహిణి. ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత డిగ్రీలో చేరిన సమయంలో, ప్రతి వారాంతం నేను ఆ కల్లూరు గ్రామానికి వెళ్లడం, అక్కడ జరిగే ఎన్నో కార్యక్రమాల్లో భాగస్వామిని కావడం మొదలైంది. ఈ కార్యక్రమాల్లో అందరికీ చేదోడు వాదోడుగా ఉండేవాడిని అందరూ నన్ను ప్రేమించడం మొదలు పెట్టారు. ఆ ఊరంతా కూడా నా పేరు తెలియని వాళ్లు ఉండేవారు కాదు. సత్యసాయి సంస్థ ద్వారా చేస్తున్న కార్యక్రమాల వల్ల అందరికీ నా పేరు బాగా తెలిసిపోయింది. "స్వామి! బాల స్వామి! సాయిరామ్!!" అనే వాళ్లు అందరూ కూడా. బాలచంద్ర అని పేరు పెట్టి పిలిచే వాళ్లు ఎవరు ఉండే వాళ్లు కాదు. అట్లా అందరికీ బాగా దగ్గర అయ్యానన్నమాట. నన్ను అందరూ కూడా వాళ్లింట్లో వేడుకలకు, సామాజిక కార్యక్రమాలకు పిలిచేవారు.

ఆ ఊళ్లో ప్రధాన కుటుంబం వీరిది కాబట్టి, వాళ్లకు కూడా ఆహ్వానం వెళ్లేది. ఆ ఆహ్వానం పత్రిక పట్టుకొని నన్ను ఇంటికి పిలిచేది. "ఏం బాబు నిన్ను కూడా పిలిచారా?" అంటే అవునక్కా, పిలిచారు అని చెప్తే, 'ఏం తీసుకెళ్తున్నావ్?' అని ఆడిగేది. 'అయ్యో! నేనేం తీసుకెళ్తాను అక్క? వెళ్లి భోజనం చేసుకొస్తాను' అని నేను అంటే... అయ్యో అలా చేయకూడదు!

నువ్వు అందరికీ కావలసిన వాడివయ్యా! నువ్వు అందరి దృష్టిలో ఉన్నావు, నువ్వు ఉత్త చేతులతో

వెళ్లకూడదు. ఉండు, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు అని ఇంట్లోకి వెళ్లి ఓ చిన్న వెండి పతకం కానీ, వెండి వస్తువు కానీ, ఏదన్నా చిన్న బహుమతి కానీ, వస్తువు కానీ నా చేతిలో పెట్టేసి... నాయనా! నువ్వు వెళ్లినప్పుడు వాళ్లకి ఇది ఇచ్చేయ్. నువ్వు ఇస్తే ఎంతో సంతోషపడి పోతారయ్యా! స్వామే. స్వయంగా నీ ద్వారా ప్రేమను అందించినట్టుగా అనుకుంటారు బాబు. నా పేరు ఏం చెప్పక్కర్లేదు, నువ్వు ఇచ్చేసిరా అనే వారు. ఇది నన్ను ఎంత ప్రభావితం చేసిందంటే తర్వాత కాలంలో నేను కనీసం రెండుమూడు వేల మందికి ఆవిడ జ్ఞాపకాన్ని నెమరు వేసుకుంటూ ప్రేమతో వెండి పతకాలు అందించి ఉంటాను. ఇప్పుడు కూడా ఆవిడ పేరు మీద నేను అర్పణం చేస్తున్నాను... ఇక ముందు కూడా చేస్తుంటాను.

మరొక స్ఫూర్తి దాయకమైన విషయం ఏమిటి అంటే వారు, నేను అనంతపురం హాస్టల్లో చదువుకుంటున్న రోజులలో, నాకు అప్పుడప్పుడు లేఖలు వ్రాస్తుండేవారు. కానీ వాటిని 'లేఖలు' అని పిలవడం అన్యాయం అవుతుంది. అవి నిజానికి విజ్ఞానసారములు తీసుకుని వచ్చే విలువైన ఉత్తరాలు... ప్రేమతో నిండి ఉండేవి ఆ లేఖలు, పరిపూర్ణమైన ప్రేమాభిమానాలు వాటి ద్వారా పరిమళించేవి. ఏ విషయమైనా సరే వ్రాస్తే విశ్లేషణాత్మకమైన ఆలోచనల ప్రవాహాలు లేఖలో దుమికి నన్ను తడిపేసేవి.

ఆవిడ నుంచి లేఖ వస్తే నేను ఎంత ఆనందపడే వాడినో చెప్పలేను. రెండు మూడు రోజుల పాటు ఆ లేఖను మళ్లీ మళ్లీ చదివేవాణ్ణి. ప్రతి అక్షరం అర్ధంతో నిండినదిగా అనిపించేది. ఎంతో చక్కగా, గుండ్రమైన అక్షరాలతో వ్రాసేది. వసతి గృహంలో జీవితం ఎలా గడపాలి, ఎలాంటి ప్రవర్తనతో ఉండాలి, విషయాలను ఎలా అర్థం చేసుకోవాలి అన్న వాటి గురించి ఎంతో ప్రేమగా, ఓర్పుగా వివరించేది.

ఆ లేఖల్లోని ప్రతి మాట నాకు మార్గదర్శిగా మారింది. వ్రాయడం అంటే ఇదే అని నేర్చుకున్నాను. ఎందుకంటే మనం ఏదో వ్రాయగలగడం పెద్ద విషయం కాదు. కాని అది ఎవరికైనా సరే ఎలా ఉపయోగపడాలి, ఎలా మార్గాన్ని చూపించాలి అనేది నాకు ఈ అక్క ద్వారా తెలిసింది. అలాగే నేను హాస్టల్‌లో ఉన్న సందర్భంలో ఆవిడ పనివాళ్ల ద్వారా లేఖలు పంపించేవారు. ఒకసారి అలా వచ్చిన వాళ్లు తిరిగి వెళ్లి ఆవిడకి చెప్పారట. "అమ్మయ్యా! బాలచంద్ర కొద్దిగా బలహీనంగా ఉన్నాడు," అని. మీరు నమ్మరు మిత్రులారా! సుజాత అక్క ఇక ప్రతినెల హార్లిక్స్ పంపడం ప్రారంభించారు. "బాబు, నీవు బలహీనంగా ఉండకూడదు, బలంగా ఉండాలి. బలమే జీవితం, బలహీనతే మరణం కదా! నీవు ఆరోగ్యంగా ఉండడం నేర్చుకో" అని చెబుతూ చీటి వ్రాసి మరీ పంపించే వారు.

ఆవిడ నాకు హార్లిక్స్ మాత్రమే కాదు, తర్వాత జేబు ఖర్చులకు కూడా కొంత డబ్బు పంపేవారు. నిజంగా చెప్పాలంటే, నా తల్లిదండ్రులు కూడా నాకు ఇలా పంపించారో లేదో! కానీ ఆవిడ మాత్రం పంపిస్తూ ఉండేవారు.

హార్లిక్స్ బాటిల్, లేఖలు, ఏదైనా తిను బండారాలు ఉంటే, అవన్నీ చక్కగా ప్యాక్ చేసి పంపించేవారు. కొన్ని సందర్భాల్లో డ్రెస్లు, వస్త్రాలు కూడా నాకోసం బహుమతిగా పంపేవారు!

సత్యసాయి భక్తులలో ఇలా ఎవరికి తెలియకుండానే నాలాంటి వారిని ఉద్ధరించే వాళ్లు చాలామంది ఉన్నారు. అలాంటి వాళ్లలో సుజాత సారధి గారు ఒక ఆదర్శ మాతృ మూర్తి. నా జీవితంలోఎంత స్థాయికి వెళ్లినా నేను మరువలేని మహానీయులలో తిరువీధి సుజాత సారధి ఒక్కరు. నేను ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటాను ఆ తల్లిని. ఇప్పుడు వారికి 80 సంవత్సరాలు దాటినాయి.

అప్పుడప్పుడు వెళ్లి వారిని దర్శించుకుంటూ, వారితో మాట్లాడుతూ, నమస్కారం చేసుకుంటూ వారి ఆశీర్వాదాలు తీసుకుంటూ ఉంటాను.

ఆమె వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెడితే, ఆమె నాకు ఒక ప్రేరణ, ఒక ప్రచోదన, ఒక ఆదర్శం. స్వామి నాకు చూపించిన అద్భుతమైన వ్యక్తుల్లో ఆమె ఒకరు. ఈ విషయాలన్నీ ఇలా చెప్పుకుంటూ పోతే, సత్యసాయి సంస్థలో నాకు ఎదురైన ఎందరో మహానుభావుల గురించి చెప్పాల్సి ఉంటుంది.



15

ప్రప్రథమ ప్రశాంతి సేవలు

స్నేహితులారా! కల్లూరు (రైల్వే స్టేషన్) గ్రామంలో, స్వామి దయవల్ల సత్యసాయి సంస్థ కార్యక్రమాలు చాలా అద్భుతంగా సాగిపోతున్నాయి. కేవలం ఆ గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు కూడా నేను చురుకుగా ఉండే నాతోటి సోదరసోదరీమణులందరినీ తీసుకొని వెళ్లే వాడిని. ఈ ప్రక్రియలో మేమందరం కూడా సేవాదళ సభ్యులుగా పేర్లు నమోదు చేసుకున్నాం. మాకు సేవాదళ్ శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఇది చూసినపుడు అంతా ఏ విధంగా స్వామి నాలో నాయకుణ్ణి తయారు చేశారు అనిపిస్తుంది. జీవితంలో మరిచిపోలేని గొప్ప అనుభవాలు ఇవన్నీ కూడా.

1989-90 సంవత్సరం అనుకుంటాను... మొదటి సారి ప్రశాంతి నిలయంలో అనేక మంది పెద్దలు గుర్తించిన విషయం ఏమిటి అంటే నిలయంలో భద్రతా సంబంధ సేవల అవసరం ఉంది అని!

అంటే పండుగల సమయంలో మాత్రమే సేవాదళ్ రావడం, వచ్చి పనులు చేసి వెళ్తుండే సందర్భాలు అప్పటివరకు కనిపించేవి. కానీ 1987-88 ప్రాంతంలో ప్రశాంతి నిలయం ఒక సువిశాలమైన క్షేత్రంగా మారింది. అంత పెద్ద ప్రాంగణంలో అను నిత్యం వేలాది మంది వచ్చి పోతూ ఉంటారు. ప్రతి మూలన పహారా మరియు నిఘా అవసరం ఏర్పడింది.

ఇలాంటి సమయంలో స్వామి వారు ఎంతో దయతో... సాయి సంస్థ సభ్యులందరినీ అనుగ్రహించి అవకాశం ఇచ్చారు. సేవాదళ్ సభ్యులు స్వచ్ఛందంగా నిలయంలో కనీసం ఒక వారం రోజులు లేక 15 రోజులు ఉండి అన్ని చోట్లా భద్రతా పరమైన సేవలలో వంతుల ప్రకారము పాల్గొనాలి అని.

ఇది స్వామి ఆశీస్సుతో ప్రారంభమైన ఒక కొత్త అధ్యాయం! తదనంతర కాలంలో దీన్నే ప్రశాంతి సేవలు, ప్రశాంతి సెక్యూరిటీ సర్వీసు అని పిలిచారు.

అయితే, నా అదృష్టం ఏమిటి అంటే, సత్యసాయి సేవా సంస్థ చరిత్రలోనే స్వామి వారి ఆదేశాల మేరకు ప్రారంభించిన ప్రప్రథమ ప్రశాంతి భద్రతా సేవలో పాల్గొనే అవకాశం 1988 ప్రాంతంలో నాకు లభించింది. సరిగ్గా ఏ సంవత్సరం అన్నది నాకంతగా గుర్తు లేదు. కానీ, తొలిసారిగా స్వామి ఆశీస్సులతో, స్వామి ఆదేశాల మేరకు సత్యసాయి సేవా సంస్థల వారు ఇది ప్రారంభించారు.

నాకు గుర్తున్నది, అనంతపురం జిల్లాకు మొట్ట మొదటిసారి ఈ అవకాశం ఇచ్చారు. అందులో 45 మంది మహిళలు, 45 మంది పురుషులు, మొత్తం 90 మంది అక్కడ వాచ్ అండ్ వార్డ్ కోసం ప్రశాంతి నిలయానికి వెళ్లే అవకాశం పొందారు.

ఇవాళ అదే సెక్యూరిటీ సేవ ప్రస్తుతం దాదాపు 900 మంది మహిళలు మరియు 900 మంది పురుషులుగా విస్తరించింది. అంటే, ఎన్నో రెట్లు పెరిగిపోయింది. అనేక కార్యక్రమాల్లో ఈ సెక్యూరిటీ సేవలు విస్తృతంగా జరుగుతున్నాయి.

నేను ఎందుకు ఈ భద్రతా సేవల గురించి చెప్తున్నాను అంటే... నాకు ఆ మొట్టమొదటి ప్రశాంతి భద్రతా సేవలు బాగా గుర్తున్నాయి. అంజనయ్య గారు అప్పుడు స్వయంగా ఈ భద్రతా సేవలను పర్యవేక్షించారు, సమన్వయం చేసేవారు. హైదరాబాద్ నుంచి వచ్చిన భాస్కరావు గారు, అలాగే మల్లికార్జున రావు గారు, తదితర పెద్దలు కూడా ఆ సేవలలో పాల్గొన్నారు. ఈరోజు కూడా వాళ్లు ఉన్నారు. ఇలాంటి అద్భుతమైన వాళ్లతో కలసి పని చేసే అవకాశం వచ్చింది.

నేను చిన్నవాడిని కావడం వల్ల, మిగిలిన వాళ్లంతా వయసులో పెద్దవారైన కారణంగా... నన్ను పిలిచి సేవాదళ్‌కు కేటాయించిన ప్రదేశాల్లో భద్రత పరమైన పర్యవేక్షణ చేయాలని, వారు తమ విధులను సరిగా నిర్వహిస్తున్నారా లేదా అన్నదాన్ని పరిశీలించడానికి గస్తీ తిరగాలని, అది పిల్లాడిని కదా నాకు అప్ప చెప్పారు. అందులో నా బాధ్యత ఏమిటంటే, ప్రాంగణం అంతటా కలియ తిరుగుతూ, ఎక్కడెక్కడ ఎవరు ఉన్నారు? వారు తమ సేవ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారా? మౌనంగా? ధ్యానంలో ఉన్నారా? లేక నిద్రలోకి లీనమయ్యారా? అన్నదానిని చూసే బాధ్యత నాది అనమాట.

ఈ బాధ్యత ఎంతో ఉల్లాసంగా ఉండేది. ఇచ్చిన బాధ్యతను ఎంత నిక్కచ్చిగా నిర్వహించే వాడినంటే... చివరికి అంజన్నయ్య గారి దగ్గరికి పెద్దవాళ్లందరూ వెళ్లి, 'సార్ ఇదేంటి సార్ మమ్మల్ని ఈ అబ్బాయి చాలా సతాయిస్తున్నాడు! మమ్మల్ని అసలు కూర్చోనివ్వట్లేదు, నిల్చోనివ్వట్లేదు. చాలా నిక్కచ్చిగా ఉన్నాడు సార్!' అని.

అంజన్నయ్య గారు నవ్వుతూ... అయ్యా! ఈ అబ్బాయికి మనం నేర్పించింది అదే కదా! ఆ డ్యూటీ మంచిగా చేయాలని కదా. సరే లెండి... నేను చెప్తానులే అని, నాకు చెప్పాడు... 'అయ్యా! కొద్దిగా జాగ్రత్త బాబు, పెద్దవాళ్లు కదా, నువ్వు ట్రిక్ట్‌గా ఉండొదయ్యా... కొద్దిగా చూసి చూడనట్టుగా ఉండవయ్యా!' అని చెప్పడం గుర్తుంది.

వచ్చిన వాళ్లందరికీ ప్రశాంతి నిలయం ప్రాంగణం ఎవరికీ తెలిసేది కాదు. వచ్చిన వాళ్లకి ప్రశాంతి నిలయంలో ఈ ప్రదేశం ఎక్కడ? దక్షిణ ప్రశాంతి అంటే ఎక్కడ? ప్రశాంతి నిలయం అంటే ఎక్కడ? అలాగే గోకులం ఎక్కడ? కల్వర్ట్ గేట్ ఎక్కడ? గోపురం ఎక్కడ? సమాధి ఎక్కడ... ? ఇలాంటివన్నీ కూడా చెప్పే అవసరం... చూపించే అవసరం ఉండేదన్నమాట. అప్పుడు అంజన్నయ్య గారు బాగా ఆలోచన చేసేవాళ్లు ఎట్లా చెప్పేది వీళ్లకి అని. ఆ అవకాశాన్ని నేను అందిపుచ్చుకుని స్వామి సేవ చేసే భాగ్యంగా తీసుకున్నాను.

నాకు బాగా గుర్తుంది, అప్పుడు నేను కూర్చొని దాదాపు 2 రోజులు సమయం వెచ్చించి, ఒక

పది A4 షీట్స్‌ని ఒకదానితో ఒకటి అతికించి, దాని మీద ప్రశాంతి నిలయం క్యాంపస్ ప్లాన్ అంతా లోపల బయట ఉన్న ప్రదేశాలను అన్నీ కూడా అందులో గుర్తించి ఇచ్చాను. అప్పుడు నాకు చాలా తృప్తిగా అనిపించింది, స్వామి నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు. సుమారు ఒక 20 ప్రదేశాలు గుర్తించి దానికి నంబరింగ్ ఇచ్చి, ఫలాని నంబర్ ఫలాన ప్రదేశం అని ఒక బోర్డు వేసి ఇస్తే, అంజన్నయ్య గారు దాన్ని ఉపయోగించి అందరికీ చెప్పేవాళ్లు. ఇప్పుడు అలాంటి లొకేషన్ మ్యాప్‌లు సాంకేతికతను ఉపయోగించి అన్ని మూలల్లో కూడా డిజిటల్ బోర్డులుగా పెట్టినారు.

అట్లా ప్రశాంతి సెక్యూరిటీ సర్వీసు మొదలైంది. ఆ రోజు అనంతపురం జిల్లాలో మాతో మొదలు పెట్టిన సెక్యూరిటీ సేవలు "ప్రశాంతి సెక్యూరిటీ సర్వీస్ (PSS)" అని తర్వాత నామకరణం చేయబడింది. తర్వాత కాలంలో ఈ సేవ మరింత విస్తరించ బడి, ప్రత్యేక శిక్షణతో, ప్రత్యేక మాడ్యూల్స్ ద్వారా ప్రశాంతి నిలయంలో జరిగే అన్ని రకాల కార్యక్రమాల గురించి వివరించి, వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. అప్పటి దాకా సేవాదళం అంటే స్కార్ఫ్ వేసుకుని తెల్లటి దుస్తుల్లో సేవ చేయడం అనుకునేవాళ్లం. కానీ దీని తర్వాత సేవాదళ సభ్యులు రహస్య భద్రత కూడా నిర్వహించే సామర్థ్యం వచ్చింది. అంటే సాధారణ దుస్తుల్లో ఉండి, భక్తుల మధ్య కలిసిపోయి, చుట్టూ జరిగే పనులను గమనిస్తూ, ఎక్కడైనా అనైతిక లేదా అసాంఘిక చర్యలు గమనిస్తే వెంటనే, వారిని పట్టుకోవడం, పోలీసులకు అప్పచెప్పడం వంటి విధులు ప్రారంభమయ్యాయి. కేవలం 90 మందితో ప్రారంభం అయిన ఈ భద్రతా సేవలు ప్రస్తుతం వేలాది మంది పురుషులతో, మహిళలతో సాగిపోతుంది.

ఈ విధంగా భద్రతా సేవలు తర్వాత ఒక అద్భుతమైన దిశలో అభివృద్ధి చెందాయి. అనంతర కాలంలో డిజాస్టర్ మేనేజ్మెంట్, ప్రశాంతి భద్రతా విధులు, ప్రశాంతిలో జరిగే అన్ని ముఖ్యమైన కార్యక్రమాలకు ఈ సేవ ఆధారంగా నిలిచింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆ 15 రోజులు ఒక ప్రక్క చదువుకుంటూ, ఇంకో ప్రక్క ఇంట్లో చెప్పకుండా నేను అనంతపురం నుంచి సేవలో పాల్గొన్నట్లు గుర్తు, ఎంతో ఆర్తితో ఆ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, చివరి రోజు స్వామి మా అందరికీ పాదనమస్కార ప్రసాద భాగ్యాలు ఇవ్వడము, నిజానికి ఇది ఒక అద్భుతమైన దివ్యానుభూతి. ఆ సమయంలో స్వామి నా భుజం తట్టి, నేను ఏదో ఫోటో పట్టుకుంటే దాన్ని ఆశీర్వదించి, పాద నమస్కారం ఇచ్చి, విభూతి పొట్లాలు నాకు ఇచ్చారు.

స్వామి ఇచ్చే విభూతి పొట్లాలు ఉంటాయి కదా... ఆ సాచెట్స్‌ని నేను మొట్ట మొదటిసారి 1983లో బాల వికాస్ అంతర్జాతీయ సమ్మేళనంలో స్వామి హస్తాలతో తీసుకున్నాను, తర్వాత మళ్లీ ప్రశాంతి సేవల సందర్భంగా తీసుకున్నట్టు నాకు గుర్తు.

ఇలాగా స్వామి ప్రత్యక్షంగా ఇచ్చిన దర్శన, స్పర్శన, పాద నమస్కార ప్రసాద భాగ్యాలు నన్ను ఎంతో ప్రేరణకి గురి చేశాయి. సేవాదళ్‌గా ఎప్పుడైనా... ఏ సమయంలోనైనా ముందు కురికే అద్భుతమైన ప్రేరణ స్వామి ప్రసాదించారు. ఈరోజు సేవకి సర్వదా నేను తయారుగా ఉన్నాను అంటే దానికి కారణం ఆ రోజుల్లో స్వామి ఇచ్చిన అవకాశాలు అని నేను ఎప్పుడూ తలుచుకుంటాను.



16

Decoration - No End for Imagination!

నేను ఇంతకు ముందే అలంకరణ పట్ల నా ఆసక్తిని చెప్పాను. కారణం, నా బాల్యం నుంచే, నేను అలంకరణ కళలో ఎప్పుడు వీలవుతే అప్పుడు అపారమైన ఆనందంతో ఆసక్తితో నిమగ్నమై ఉండేవాడిని.

మా ఇంట్లో నాన్న పూజా సమయంలో ఎంతో ఒద్దికగా ఆ చిన్న విగ్రహాలకు, దేవుడి పటాలకు పుష్పాలంకరణ చేసే వారో చూసే వాడిని. చిరు ప్రాయంలోనే వారి సృజనతో నన్ను ఎంతో ప్రభావితం చేసారు.

చిన్న నాడు సరస్వతి విద్యా మందిరంలో ప్రార్థనా సమయంలో చిత్ర పటాలకు ఎలా పుష్పాలు అలంకరించే వారో చూసే వాడిని. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో భగవద్ ధ్వజాన్ని ఎలా ఏర్పాటు చేసే వారో గమనించే వాడిని. పర్వదినాలలో ముగ్గు పిండి, రాళ్ల ఉప్పు, పూల రెక్కలు, రంగు కాగితాలతో ఎలా రంగోలీ తీర్చిదిద్దేవారో చూసి నేర్చుకునే వాడిని.

నాన్న ఎంత చాతుర్యంతో చిత్రాలు గీయడం, వృధా వస్తువులతో చేసే బొమ్మలు, బొమ్మల కొలువు ఇలాంటి నైపుణ్యాలు నన్ను చాలా ప్రభావితం చేసాయి.

చిన్న వయసులో, దేవుడి బొమ్మలను అందంగా అలంకరించడం, వాటికి వస్త్రాలు కట్టడం, పూసల దండలు తయారు చేయడం ఎంతో ఆసక్తితో చేసే వాడిని.

ఇక తరవాత కాలంలో ఈశ్వరమ్మ దినోత్సవం, శివరాత్రి తదితర పర్వదినాలలో సాయి సంస్థలో చేసే అలంకరణముల వలన డెకరేషన్ మీద ఆసక్తి మరింతగా పెరిగింది. అలా తెలియకుండానే చాలా విశేషమైన ప్రతిభ దానిలో పొందాను. అది కాస్తా స్వామి సంస్థలో చేరిన తరువాత ఇంకా అద్భుతమైన పరిణితికి దారి తీసింది.

నాకు గుర్తు, 1989 సంవత్సరములో జరిగిన సంఘటన. కల్లూరు, పామిడి తదితర గ్రామాలలో తిరుగుతున్న సమయంలో సత్యసాయి సంస్థలలో ఎక్కడ ఏ కార్యక్రమం జరుగుతున్నా సరే ముందుగానే వెళ్లిపోయి అక్కడ నాకు చేతనైనంత విధంగా అలంకరణలో పాల్గొనే వాడిని. ఈ ప్రక్రియలో ఎక్కడ

ఏమి చేయొచ్చు, ఎలా చేయచ్చు, ఏమి ఉపయోగించి చేయచ్చు అనే ఊహలు వచ్చేవన్నమాట. వివిధ కోణాల్లో ఆలోచించే వాడిని, తద్వారా ఎంత సృజనాత్మకత, పరిపూర్ణత వచ్చిందంటే... కళ్లతో చూస్తే చాలు అది సరిగా ఉందా లేదా అని చెప్పే నైపుణ్యత వచ్చేసింది.

ఈ అనుభవాలు కేవలం సృజనాత్మక నైపుణ్యాలను మెరుగుపరచడమే కాకుండా, సామూహిక సేవ యొక్క పరమార్థాన్ని, అలంకరణ ద్వారా భక్తులను భగవంతుని వైపు మరల్చ గలిగె శక్తిని లోతుగా అర్థం చేసుకుంటారనే పరమార్థాన్ని బోధించాయి.

స్వామితో ప్రత్యక్ష సంభాషణలు ఎక్కడా జరగలేదు ఇన్నేళ్లలో. అయితే నా పరిశీలనాత్మక స్వభావం వలన, ప్రశాంతి నిలయానికి ఎప్పుడు వెళ్లినా అక్కడి అలంకరణలను సునిశితంగా గమనించే అలవాటు వచ్చింది.

ప్రత్యేకించి శ్రీ నటరాజన్ (అల నాటి కేరళ రాష్ట్ర అధ్యక్షులు) నాయకత్వంలో కేరళ బృందం పర్వదినాల రోజుల్లో, విశేష కార్యక్రమాల రోజుల్లో అద్భుతమైన అలంకరణలు ప్రశాంతి నిలయంలో చేసే వాళ్లు. అయితే అప్పుడు పాత మందిరం రోజులన్నమాట. ఆ కాలంలో ఇసుక తిన్నెల మధ్య, ఇనుప స్తంభాలపై, గాలిలో ఊగే చెట్ల మధ్య కట్టిన బట్టల తోరణాలతో, మామిడి, అరటి ఆకులతో, టెంకాయ ఆకులతో చేసే అలంకరణలతో ఆ ప్రాంగణం అంతా అందం చెందేది. ప్రతి స్తంభంపై ఒక రంగు జెండా ఉంచడం, స్వామి దర్శనంలో ఆ అలంకారాలు భక్తులకు అలౌకిక ఆనందం కలిగించేవి. స్వామి అలంకార ప్రియుడు కదా. వారి చుట్టూ సౌందర్యం వెల్లివిరిసేది.

అయితే, ఎప్పుడు చూసినా ఒకే రకమా, ఇలా ఎందుకు చేయకూడదు, అలా ఎందుకు చేయ కూడదు అనుకునే వాడిని. అసలు మనం ఎందుకు అలంకరణ చెయ్యకూడదని నా అంతరంగంలో ఎప్పుడూ కొత్త దనపు తపన కలిగేది. సాధారణ అలంకరణ పద్ధతులను మించి, కొత్త ఊపిరి ఊదాలని, అందంలో కూడా నూతన సృష్టిని జోడించాలని భావించే వాడిని.

ప్రశాంతి భద్రతా సేవలలో ఉన్న కాలంలో, నా డ్యూటీ ముగించుకున్న తరువాత, ఒక పుస్తకము తీసుకొని, ప్రశాంతి నిలయంలో అణువణువు శోధించే వాడిని. ఆయా స్థలాలలో ఎలా డెకరేషన్ చేయచ్చు అని అహరహం తహతహలాడే వాడిని. కొత్త ఆకృతులు, కొత్త భావనలు ఊహించి వాటి ఊహా చిత్రాలను పుస్తకంలో గీసుకునే వాడిని. ఈ ప్రక్రియలో అలంకరణలో స్వామి నన్ను ఒక అద్భుతమైన పనిముట్టు లాగ చేశారు.

నాకు బాగా గుర్తుంది, 32 పేజీల డ్రాయింగ్ పుస్తకం తీసుకుని ప్రశాంతి నిలయంలో ఏ చోట ఏమి చెయ్యాలని చిత్రాలు వేసాను. ప్రశాంతి నిలయములో మధ్యభాగంలో ప్రధాన మైన మండపం, గోపురం, వృత్తాకార లోగిలి ఆధారంగా రంగు రంగుల వస్త్ర తోరణాలను మైదానంలో ఉండే ఇనుప పైపుల వరకు గుంజి కట్టే వాళ్లు. ఇంకా ఏమి చేయొచ్చు అన్నప్పుడు ఒక ఆలోచన తట్టింది, వస్త్రాలను కేవలం త్రికోణం లాగా కాకుండా వివిధ రకాల ఆకారాలతో కట్ చేసి తోరణంగా చేస్తే బాగుంటుందని అలా చిత్రం గీసాను, ఇది మొదటిది. ఇక రెండోది, ఆ డోమ్/ గోపురంకి కూడా ఉట్టి లైట్లు పెడుతున్నారు, దానికి రెండు మూడు రకాల డిజైన్స్ నేను వేశాను. అలాగే ప్రశాంతి నిలయం అంతా కూడా కిటికీలు ఉన్నాయి. అవి ఎప్పుడు మూతబడి ఉండేవి, అవి మూసి ఉన్నప్పుడు వాటిని అలంకరణకు ఏవిధంగా ఉపయోగించుకోవచ్చు అని కొన్ని డిజైన్స్ గీశాను. తరువాత బంటింగ్స్ ఎన్ని రకాలుగా చేసుకోవచ్చు, ఎక్కడ వేయొచ్చు, ఎలా వేయచ్చు అని నా ఆలోచనలను చిత్రాలుగా గీసి పెట్టుకున్నాను (1989).

ప్రశాంతి నిలయంలోని ప్రతి మూల, ప్రతి భాగాన్ని అలంకరించేలా, మధ్య గోపురం నుండి అన్ని మూలల వరకూ, ప్రతీ చోటునూ నేను అత్యంత శ్రద్ధతో చిత్రలేఖనం రూపంలో ఆవిష్కరించాను.

ఇంత కంటే ఎలా ముందుకు వెళ్లాలో నా చిన్న మనసుకు తెలియలేదు. ఎంతో అమాయకంగా జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ డా. అంజనయ్యని ఆశ్రయించాను. వారు ఎంతో ఉత్సుకతతో, నేను గీసిన అలంకరణ చిత్రాలు, కల్పనలతో కూడిన 32 పుటల ప్రణాళికను చూసారు. ఎంతో సంతోష పడ్డారు. అంతే కాదు చాలా ఆశ్చర్య పోయి, బాగుందని ప్రశంసించి 'నాయన! నాకు దీనిలో అంత అనుభవం లేదయ్య. నువ్వు ఇప్పుడు ఏమి చేయాలనుకుంటున్నావు చెప్పు, నేను ఏమి చెయ్యాలో చెప్పు' అని అడిగారు. అప్పుడు, నా ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చే నమూనా అలంకరణ వస్తువులు చేయాలనే నా ప్రణాళికను వివరించాను. నా భక్తి విశ్వాసములను చిన్ననాటి నుండి చూస్తున్నారు కాబట్టి ఎంతో నమ్మకంతో అలంకరణ సామగ్రి కొనుగోలు, కుట్టు కూలి, ప్రయాణము మరియు భోజన వ్యయాలు వంటి ప్రతీ అంశాన్నీ ఆయన లెక్క వేసి కొంత ధనాన్ని నా చేతిలో పెట్టీ ఎంతో ఆప్యాయంగా భుజం తట్టి ప్రోత్సహించారు. ఇలాంటి పెద్ద వాళ్లందరూ కూడా మాలాంటి వాళ్లను సంస్థలో తయారు చేశారు.

నాకు భోజనం పెట్టి, మంచి మాటలు చెప్పి, "నీవు పైలెట్ ప్రాజెక్ట్ చేస్తే, నేను ప్రశాంతి నిలయ వాసులకి చూపిస్తాను. వారు ఒప్పుకుంటే ఇవన్నీ చేద్దాం" అని చెప్పారు. ఎంతో ఉత్సాహంగా, విశ్వాసంతో, పామిడి గ్రామానికి వెళ్లి, కట్ పీసెస్ అన్ని తీసుకొని, నేనే దగ్గరుండి టైలర్తో కుట్టించి వాటిని తీసుకెళ్లాను. అలా తీసుకెళ్లిన బంటింగ్ ని మొదటి సారి మందిరం ముందు భాగంలో ఉండే సింహ ద్వారం పైన వృత్తకారపు బాల్కనీకి అలంకరించారు. చూసిన వాళ్లు చాలా ప్రశంసించారు. ఇక అప్పటి నుండి కనీసం అంటే ఒక పాతిక రకాల తోరణాలు వచ్చాయి.

నిజానికి ఇదంతా జరిగి పాతికేళ్లు అయింది. ఒక సారి వెను తిరిగి చూస్తే, ఆ రోజు నేను ఊహా మాత్రంగా గీసిన ప్రతి అంశము కూడా ఈ రోజు వాస్తవంగా అమలులోకి వచ్చింది. రథము షెడ్, కార్ షెడ్, కిటికీలు, బాల్కనీ, రూఫ్ హ్యాంగింగ్స్, స్తంభాలు ఇలా ప్రతి ప్రదేశంలో నేను తయారు చేసిన డిజైన్లు వచ్చేశాయి, అలంకరణ శైలి అమలు లోకి వచ్చింది. ఆ రోజు స్వామి ఇచ్చిన సంకల్పము ప్రకారం వేశాను. అన్ని నేను చేయలేదు. కానీ సంకల్పం పవిత్రం అవుతే అది ఏదో ఒక రూపంలో... ఎవరో ఒకరి రూపంలో ఆవిష్కరించ బడుతుంది అంటారు కదా.

ఇవి నేను చేస్తే వచ్చిందనుకోవట్లేదు. స్వామి దీనిని చూసిన, చూడకున్న ఏదో ఒక రూపంలో, ఎవరికో ఒకరికి మనసుల్లో రావడం, వారు వాటిని అక్కడికి తీసుకొని రావడం జరిగింది, జరుగుతోంది మును ముందు కూడా జరుగుతుంది. దేశ విదేశాల నుండి ఎంతో మంది భక్తులు స్వామి మీద ప్రేమతో తెచ్చే ప్రతి అలంకరణ వస్తువు కూడా ప్రశాంతి నిలయ శోభను మరింత పెంచి స్వామికి ఆనందం కలిగించాయి.

ఇలా చిన్న వయసులో నా భక్తి విశ్వాసాలు ఏవిధంగా నన్ను అలంకరణ సేవలో పదును పెట్టాయి అంటే, స్వామి దయతో ఎన్నో సృజనాత్మకమైన ఆలోచనలకు ప్రాణం పోయగలిగాను. డెకరేషన్ అంటే రేషనే లేకుండా ఆలోచించడము నేను నేర్చుకున్నాను. Yes, there is no ration for imagination in Decoration!

17

ఏ కళాశాల అయినా స్వామి కళాశాలే!

కల్లూరు గ్రామంలో (1986-87) సాయి సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, అదే సమయంలో నేను బలహీనంగా ఉండే సబ్జెక్ట్‌లలో ఉత్సాహంగా కృషి చేస్తున్నాను.

"తర్వాత ఏమిటి?" అనే ప్రశ్న నా జీవితంలో తలెత్తినప్పుడు స్వామిని, పుట్టపర్తి లోని ప్రేరణ కలిగించే కళాశాలలు మరియు విద్యార్థులను గుర్తుచేసుకుంటూ, స్వామి కళాశాలలో డిగ్రీ సీటు పొందాలన్న ఆశ నన్ను ముందుకు నడిపింది. లెక్చరర్ కావాలన్న తపనతో, B.Sc., (గణితం, భౌతికశాస్త్రం, గణాంకశాస్త్రం) చేయాలనే స్పష్టత కలిగింది. విద్యారంగంలో సేవ చేయడం, యువ మేధావులను తయారు చేయడం నా లక్ష్యంగా మారింది. ఈ దిశగా నాకు ప్రేరణగా నిలిచింది స్వామి యొక్క బోధనలు మరియు వారు స్థాపించిన విద్యా సంస్థలే!

ఇంటర్ పరీక్షల తరువాత, నేను సాయి విశ్వ విద్యాలయంలో డిగ్రీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేశాను. స్వామిని ప్రార్థిస్తూ ఆశగా పరీక్ష వ్రాసాను. అయినప్పటికీ, ప్రశ్నాపత్రం నాకు అంతగా పరిచయం లేకపోవడంతో తగిన విధంగా వ్రాయలేకపోయాను. ఏదో విధంగా ఆ పరీక్షను పూర్తి చేశాను. ఫలితాలు ఆశించినంతగా రాకపోయినా, నిరుత్సాహపడకుండా ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యాను. కానీ, తక్కువ మార్కుల కారణంగా వారు B.Sc., రాదు, 'B.Com.,'లో చేరమని సూచించారు. అప్పుడు నాకు అదంటే ఏమిటో కూడా స్పష్టంగా తెలియదు. నేను సరే అంటే... మరేదైనా, దానికి సంబంధించిన ప్రశ్నలు వేస్తారేమో అని అనుకుని భయపడ్డాను.

భయంతో కంపిస్తూ వారికి వచ్చి రాని ఇంగ్లీషులో మాట్లాడుతూ, నాకు B.Sc చేయడానికి అవకాశం ఇవ్వమని ప్రార్థించాను. నాకు పూర్తిగా తెలియని కోర్సు తీసుకోమన్నారు అని భయంతో కలవరపడ్డాను. సీటు రాలేదు అనే అనుభవం నన్ను తీవ్రంగా కలచివేసింది. కన్నీళ్లు పెట్టుకున్నాను, ముందున్న అనిశ్చిత భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ నిస్సహాయంగా నిలిచిపోయాను. స్వామి కాలేజీలో సీటు రాక దుఃఖంలో మునిగిపోయిన నేను నిలయంలో విజయ్ సాయి, సతీష్ మరియు ఇతర

మిత్రులను కలిసాను. వారు కూడా నాతో పాటుగా దరఖాస్తు చేసుకుని స్వామి కాలేజీలో సీటు సంపాదించారు. ప్రస్తుతానికి వస్తే వారిరువురు కూడా స్వామికి వ్యక్తిగత సహాయకులుగా సేవించే భాగ్యాన్ని అందుకున్నారు, అంతే గాక విశ్వ విద్యాలయంలో అంకితభావంతో సేవ చేసే బోధకులుగా ఉన్నారు. వారి సాన్నిధ్యం కొద్దిసేపు నా బాధను మర్చిపోయేలా చేసింది. విజయ్ సాయి గొంతు ఎంతో మధురంగా ఉండేది. అతను ఒక అద్భుతమైన గాయకుడు. సాయి విద్యాలయాల్లో ఇరువురి గురించి తెలియని వ్యక్తులు లేరంటే సందేహం లేదు. వారి పాటలు మాటలు సాగుతున్నంత సేపు నా మనసు మౌనంగా ఉన్నా తర్వాత నిరాశతో నిండి పోయింది.

ఒకరోజు స్వామి నా కలలో ప్రత్యక్షమయ్యారు. నేను ఏడుస్తున్నాను... స్వామి, ఎందుకు ఏడుస్తున్నావు అని అడిగారు. నేను చెప్పాను... స్వామీ! నాకు స్వామి కాలేజీలో సీటు రాలేదు! అని భోరుమన్నాను. అప్పుడు "ఈ ప్రపంచంలోని అన్ని కళాశాలలు నావే! నీవు ప్రేమతో, లక్ష్యంతో చదివితే అది ఏదయినా స్వామి కాలేజీ అయిపోతుంది," అని స్వామి మృదువుగా పలికారు. స్వామి మాటలు నా హృదయంలో వేళ్లూనుకున్నాయి. స్వామి ఈ విధంగా ప్రత్యక్షమై నాకు ధైర్యం చెప్పిన ఘటన ఆశ్చర్యకరంగా వున్నప్పటికీ, నాలో ఓ పరవశాన్ని, ఓదార్పును నింపింది. ఆయన వాక్యాలు నాకు మళ్లీ కోల్పోయిన విశ్వాసాన్ని కలిగించాయి.

మరో ప్రక్క అనంతపురంలో డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో కూడా సీటు రాలేదు. మార్కులు తక్కువ రావడం వలన అలా జరిగింది. నా నిరాశను గుర్తించిన నాన్న, నా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అనంతపురంలోని ప్రఖ్యాత ప్రైవేట్ కళాశాలలలో నన్ను చేర్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే నా మార్కుల కారణంగా B.Sc., / B.Com సీటు పొందడం అసాధ్యంగా మారింది.

ఈ సమయంలో దైవ సంకల్పంగా అన్నట్టు, నాన్న అనంతపురంలో మాకు దూరపు బంధువు అయిన SS రంగయ్యను సంప్రదించారు. ఆయన రంగా మెడికల్ ఏజెన్సీకి యజమానిగా ఉండటమే కాకుండా, స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ కళాశాల కౌన్సిల్ సభ్యుడిగా కూడా ఉండేవారు. ఆయన సూచనలతో, సానుభూతితో నేను ఆ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడం నా జీవితంలో ఆశా కిరణంలా నిలిచింది. ఆయన మాటలు, ప్రోత్సాహం నాకు ఎంతో బలాన్ని ఇచ్చాయి.

ఆ కళాశాల పేరు ఏంటో తెలుసా... SSBN Degree College. అంటే శ్రీ సాయి బాబా జాతీయ డిగ్రీ కళాశాల. అక్కడి బోర్డు చూసిన క్షణం నా హృదయం ఆనందంతో నిండిపోయింది. అంతే కాదు ఎక్కడో ఒక మూల ఆ కాలేజీ శంకుస్థాపన స్వామి చేసినారు అన్నట్టు ఉండే శిలాఫలకం చూశాను. నా ప్రియమైన స్వామి పేరు ఉండటంతో ఎంతో ఆనందం కలిగింది. అదేదో స్వామి కాలేజీలో చేరినట్లు అనిపించి, హృదయం పొంగి పోయింది. B.Sc., (MPS)లో అడ్మిషన్ ఇచ్చారు. రంగయ్య గారి చొరవతో! "తమ్ముడూ... మీ నాన్న చాలా మంచి వారు, నువ్వు బాగా చదవాలి. నీ మంచి ప్రవర్తన వలన సీటు ఇస్తున్నాము" అని చెప్పి అడ్మిషన్ ఇచ్చారు. ఇక్కడి డిగ్రీ విద్య నా భక్తి డిగ్రీని పెంచింది అని చెప్పాలి. ఇతరులకు సేవ చేయాలనే నా తపన మరింత బలపడింది

కొత్త ఉపాధ్యాయులు, కొత్త స్నేహితులతో కూడిన కొత్త వాతావరణంలో అడుగుపెట్టడం నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. SSBN కళాశాల నా విద్యాభ్యాసంలో ఆకర్షణీయమైన వేదికగా మారింది. ఫిజిక్స్‌కు నరసింహారెడ్డి, & నరసింహమూర్తి, మ్యాథ్స్‌కు రాజేంద్ర ప్రసాద్ & రవీంద్ర, గణాంక శాస్త్రానికి సాయి ప్రసాద్ & చంద్రశేఖర్ రెడ్డి వంటి మంచి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నా విద్యా ప్రయాణం అర్థవంతంగా సాగింది. ఒక పూట కాలేజీకి హాజరవుతూనే, మరో ప్రక్క కష్టమైన సబ్జెక్టుల కోసం ట్యూషన్లకు హాజరవడం నా దినచర్యగా మారింది. ముఖ్యంగా తెలుగు మరియు సంస్కృతంలో నేను మంచి ప్రతిభ కనబరిచాను.

18

అనంతపురం వైశ్యా హాస్టల్... నాయకత్వానికి నాంది!

శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కాలేజీలో చేరిన క్షణాలు చాలా వింతగా విశేషంగా తోచాయి. కాలేజీకి దగ్గరలో ఉన్న RCVS హోమ్ (రాయలసీమ కాలేజీ వైశ్య స్టూడెంట్స్ హోమ్) "వైశ్య హాస్టల్" అని పిలుస్తారు. ఇది ఆంధ్ర రాష్ట్రంలోనే చాలా పెద్ద హాస్టల్. సుమారు 75 ఏళ్ల చరిత్ర ఉన్న హాస్టల్. కొంత మంది వైశ్య ప్రముఖులు మరియు పుణ్యాత్ములు అనంతపురం నడి బొడ్డులో, కమలానగర్ ప్రాంతంలో నిర్మాణం చేశారు. నిజానికి, ఈ జీవితంలో నేను ఎవరికైనా ఋణపడి ఉన్నాను అనుకుంటే... మొదట చెప్పవలసిన పేరు RCVS హోమ్ మాత్రమే. ఈ హాస్టల్ నా ఇంటికి దూరంగా ఉన్న మరొక ఇంటిలా మారిపోయింది.

కల్లూరు(RS)లో ఉండే మా అమ్మ నాన్న ఆ సమయంలో గుంతకల్ వెళ్లడం, నేనేమో అనంతపురం కాలేజీలో చేరడం, వైశ్యా హాస్టల్‌లో జాయిన్ అయ్యే ప్రయత్నం చేయడం జరిగింది కానీ... ఎక్కడ చూసినా సీటు ఇవ్వడం అన్నది నేను ఇంటర్‌లో తెచ్చుకున్న మార్కుల మీద ఆధారపడి ఉండేది. నాకు చాలా తక్కువ మార్కులు వచ్చాయి. కానీ, నాన్న గారి పేరు, వారి ప్రవృత్తి, నా స్వామి భక్తి, సాయి సంస్థతో, వైశ్య ప్రముఖులతో ఉన్న సంబంధ బాంధవ్యాల వలన కాలేజీ మరియు హాస్టల్‌లో సీటు దొరికింది అని చెప్పాలి. లేదంటే ఉన్నత చదువుల ముందుకు సాగే అవకాశమే లేకుండేది.

స్వంత ఊరు, తాడిపత్రి వైశ్య సమాజంలో చాలా పెద్దవారు, మంచి వాళ్లు ఉండేవాళ్లు. వారు సిఫారసు లేఖ ఇస్తే ప్రవేశం ఉంటుంది అని అన్నారు. ఎవరిని అడగాలో తెలియలేదు. తాడిపత్రిలో కుమ్మెత వస్త్రాలయం, పెద్ద బట్టల షాప్ ఉండేది. ఆ షాప్ యజమాని కుమ్మెత్త కృష్ణమూర్తి. వారు వైశ్యా హాస్టల్‌కు పెద్ద మొత్తం విరాళం ఇచ్చిన వారు. వారు విద్యార్థులని సిఫారసు చేయొచ్చు అని చెప్పి విన్నాను. మొదటి సిఫారసు మా పెద్దనాన్న సుంకు పెద్ద కోన రంగయ్య ఇచ్చారు. తర్వాత వారి దగ్గరికి వెళ్తే, చాలా సంతోషంగా, "నాయనా నువ్వు చాలా మంచి అబ్బాయివి.

మార్కులు తక్కువ వచ్చినా పర్వాలేదు, జీవితంలో ఫెయిల్ అవ్వకూడదు కదా! నేను తప్పకుండా నిన్ను సిఫారసు చేస్తాను" అని సిఫారసు లేఖ వ్రాసి సంతకం చేసి ఇచ్చారు. అలా ఆర్థికమైన ఇబ్బందుల్లో ఉన్న నాకు ఉచిత వసతి మరియు భోజన సదుపాయం హాస్టల్లో ఇచ్చారు. హాస్టల్లో వెళ్లిన తక్షణము, నేను వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 200 మంది విద్యార్థులతో ఉండాలి కదా! కాబట్టి చాలా ఉత్సుకతగా ఉండేది. అంతమంది విద్యార్థులతో కలవడం, కలిసి భోజనం చేయడం, ఆడడం, పాడడం, గలాట చేయడం, అంతా చాలా వింతగా ఉండేది. ఆ జోషులో కూడా ఏ విధంగా నేను స్వామికి సేవ చేయగలను? స్వామి సందేశాన్ని వ్యాప్తి చెయ్యగలను అని ఆలోచించే వాడిని.

నేనే 18 ఏళ్ల డిగ్రీ మొదటి సంవత్సరం అబ్బాయిని. ఆ సమయంలో హాస్టల్లో రాగింగ్ చేసేవాళ్లు. అన్ని హాస్టల్స్లో జరిగే సామాన్యమైన విషయం. కానీ మా హాస్టల్లో చాలా భయంకరంగా రాగింగ్ చేసేవాళ్లు. ఇలాంటి సందర్భంలో ఏం చేయాలో తెలియక నాకు చాలా భయమయ్యేది. హాస్టల్లో డిగ్రీ రెండో సంవత్సరం చదివే మధుసూదన రావు గురించి నాకు తెలుసు. అతను స్వామి భక్తుడు. సేవలలో చురుకుగా పాల్గొనే వాడు. అప్పటికే అనంతపురం జిల్లా సాయి సంస్థల్లో నా పేరు "బాలచంద్ర అన్న!" "బాలవికాస్ అన్న!" "సాయిబాబా అన్న!" అని చాలా మందికి తెలిసి ఉండేది. ఆయన నా గురించి ముందుగానే హాస్టల్లో సీనియర్స్కి చెప్పాడు 'అరేయ్! ఈ అబ్బాయి చాలా మంచి అబ్బాయి. రాగింగ్ అంతా అనవసరంగా చేయొద్దండి.' అని. కానీ వాళ్లు నన్ను రాగింగ్ అని పిలిచి అర్ధరాత్రి దాకా నన్ను వాళ్ల గదిలో కూర్చోపెట్టుకొని నా కథంతా వినడం, స్వామి గురించి వాళ్లకి చెప్పడం, చాలా విచిత్రమైన అనుభవం. 'స్వామి నువ్వు వెళ్లు స్వామి, చాల్లే ఈ రోజుకి... మళ్లీ రేపు విందాంలే!' అని విని పంపించేసారు. నిజానికి రాగింగ్ వాళ్లు నన్ను చేశారా? లేకుంటే నేను వాళ్లని చేశానా? తెలియదు అలా నేను ఏ సంకోచం, భయం లేకుండా తిరిగి వచ్చేవాడిని.

ఆ హాస్టల్లో మిగతా పిల్లలందరికీ చాలా ఆశ్చర్యం అయిపోయింది... బాలచంద్రని రాగింగ్ చేయలేదట! పిలిచి మంచి మాటలు చెప్పి పంపించేసారట! అని. తర్వాత ఏమైందంటే నాకంటే చిన్న వాళ్లు అంటే ఇంటర్ చదువుతున్న విద్యార్థులు, పాలిటెక్నిక్ చదువుతున్న పిల్లలతో నేను ప్రేమతో మాట్లాడే వాడిని నేను వాళ్లతో స్నేహం చేయడము, ఆ పిల్లలందరూ నన్ను అన్నయ్య! అని పిలవడం జరిగేది...

అప్పుడు నాకు అనిపించింది. నిజానికి, ఈ బాలవికాస్ అనేది కేవలం 15 ఏళ్లకి ఆగిపోతుంది కదా... 16-17 ఏళ్ల పిల్లలకు కూడా మనం ప్రేరణ ఇవ్వచ్చు కదా! స్వామి మానవతా విలువలని వాళ్లకి కూడా నేర్పించాలి, స్వామిని పరిచయం చేయాలన్న ఆలోచనతో చిన్న చిన్నగా ఆ పిల్లలందరితో చేరి చక్కగా ప్రతిరోజు భోజన మంత్రం పఠించడం మొదలు పెట్టాను. అసలు అది వరకు వైశ్యా హాస్టల్లో భోజన మంత్రం అన్న పద్ధతి లేదు. హాస్టల్లో భోజన మంత్రం, ప్రార్థన చేయడం ఆ పిల్లలందరూ తమాషాగా చూసే వాళ్లు, కానీ సీనియారిటీ వల్ల నన్ను గౌరవించేవాళ్లు. అలా నేను అందరిని కూర్చి, అందరినీ మోటివేట్ చేసి, తరవాత కాలంలో ప్రతి ఆదివారము నైతిక తరగతులు మొదలు పెట్టాను. వైశ్యా హాస్టల్లో అటువంటివి సాధ్యం అయ్యేవి కావు. కారణం హాస్టల్లో వేరు వేరు నేపథ్యాలు ఉండడం వల్ల అట్లాంటి విషయాలు జరిగేవి కాదన్నమాట. 20 నుండి 30 మంది యువకులు ప్రతి ఆదివారం ఉదయం 10 నుండి 12 దాకా అక్కడ మేడ పైన ఉండే వాటర్ ట్యాంక్ నీడలో కూర్చుంటే వారికి చక్కగా ఆనందంగా మంచి విషయాలు, మంచి పాటలు, పద్యాలు,

శ్లోకాలు నేర్పిస్తూ ఉండే వాడిని. పిల్లలు ఎంతో సంతోషపడి పోయేవాళ్లు. నాకు జ్ఞాపకం, ఆ టీం అంతా కూడా ఇప్పటికీ నాతో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు అంటే ఎట్టి సందేహము లేదు. ఎంత పెద్ద వాళ్లు అయ్యారు అందరూ కూడా. కానీ ఆ భావన అలాగే ఉండిపోయింది.

ఇలా సాగుతున్న హాస్టల్ జీవితంలో... నేను ఒక విషయం గమనించాను. అప్పటిదాకా వినాయక చవితి వస్తే, ఒక హాల్లో మూల చిన్న వినాయకుడిని పెట్టేవాళ్లు. మధు మరియు మిత్రులు ఎవరైతే నాకు కనెక్ట్ అయ్యారో... ప్రోత్సహించే వారు వాళ్ల అండ దండలతో హాస్టల్లో వినాయక చవితిని వైభవంగా చేయాలి. ఈ ఉత్సవం నాలుగు గోడల మధ్యలో చేసేది కాదు... బహిరంగంగా చేయాలి, పెద్ద ఎత్తున చేయాలి, కనీసం తొమ్మిది రోజులు అనంతపురంలో జరుగుతున్న వినాయక చవితి కార్యక్రమాలతో సమానంగా మనం చేయాలి అని ప్రతిపాదన చేశాను. వినాయక చవితి వైశ్యా హాస్టల్‌లో ఆ విధంగా మొదలు అయింది. ఈ వేదిక నాకు నేను ఊహించనలవి గాని నాయకత్వాన్ని, జీవిత నైపుణ్యాలను ఇచ్చింది. వైశ్యా హాస్టల్లో నేను ఒక ఆకర్షణ కేంద్రంగా మారిపోయాను అంటే సందేహం లేదు. సీనియర్స్ నన్ను ప్రోత్సహించడం, నేను వినాయక ఉత్సవాన్ని ముందుండి తొమ్మిది రోజులు పాటు రకరకాల కార్యక్రమాలతో అంగ రంగ వైభవంగా 75 ఏళ్ల వైశ్యా హాస్టల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేను స్వామి వారిని బహిరంగ ప్రదేశంలో తీసుకొచ్చి పెద్ద పందిళ్లు వేసి చేశాము. చాలా అద్భుతంగా జరిగింది.

ఇక మరో ప్రక్క స్థానిక సత్యసాయి సేవా సంస్థ, అనంతపురం జిల్లా సాయి సంస్థలలో కూడా నేను చురుకుగా పాల్గొనే వాడిని. అనంతపురంలో నాగరాజు, అశ్వర్థ నారాయణ, సత్యనారాయణ, జ్వలనయ్య, మారెప్ప, లక్ష్మీదేవమ్మ, పిన్ని సూర్యప్రకాశం, గోవింద రాజు, రుక్మిణమ్మ, మనోరమ, మేడా సుబ్బయ్య, మేడా రామయ్య, మేడా సుబ్రహ్మణ్యం ఇలా ఎంతో మంది మహామహులందరూ పరిచయం అయ్యారు, వాళ్లని చాలా దగ్గరగా పరిశీలించే అవకాశం కలిగింది. వారు ఎంతో భక్తి శ్రద్ధలతో జీవించేవాళ్లు, స్వామి వారితో ఎంతో దగ్గరగా చేరి చరించేవాళ్లు. చాలా ఆశ్చర్యముతో... ఆహా నేను ఎంత అదృష్టవంతుడినో అనుకునేవాడిని. వీళ్లతో ఎవరితో మాట్లాడినా ఎన్నో అద్భుతమైన విషయాలు నాకు తెలిసేవి. కాబట్టి ప్రతి ఆదివారము, గురువారము భజనలకు వెళ్లడము, సత్సంగ కార్యక్రమాల్లో పాల్గొనడము, ముక్కోటి ఏకాదశి వస్తే సేవలు చేయడానికి వెంకటేశ్వర స్వామి గుడిలో కలవడము, శివరాత్రి వస్తే సేవలు చేయడము, అఖండ భజన ఇలా ఎన్నెన్నో కార్యక్రమాలు ఏ కార్యక్రమంలోనైనా నేను చాలా చురుకగా పాల్గొనేవాడిని.

ఇంకో ప్రక్క, తోటి మిత్రుల సాంగత్యంలో కాస్త దారి కూడా తప్పాను. తరగతులు ఎగ్గొట్టడం, బయట తిరగడం, షికారు వెళ్లడం, గేట్లు దూకి అర్ధరాత్రి సినిమాలకు వెళ్లడం... అడ్డు అదుపూ లేక పోయింది.

ఈ ప్రక్రియలో నేను డిగ్రీ మొదటి సంవత్సరం తప్పాను. ఏదైతే కాకూడదు అనుకున్నానో, అదే జరిగిపోయింది. వైశ్యా హాస్టల్లో చాలా పెద్ద ఎత్తున చర్చ మొదలైంది యాజమాన్యంలో. అప్పుడు హాస్టల్ అధ్యక్షుడిగా జి.పి. రామయ్య ఉన్నారు. చాలా మంచి వ్యక్తిత్వం గల మనిషి. ఇంతకుముందు వ్యాసంలో నేను వీరి గురించి చెప్పాను. నాకు చెయ్యి విరిగినప్పుడు వారు వచ్చి నాకు ఎంతో సహాయమందించారు. చాలా పెద్ద ఔషధ వ్యాపారస్తులు వైశ్యా హాస్టల్ అధ్యక్షులు.

పరుచూరి రమేష్, గోవిందరాజు, ఏవి రమణయ్య గుప్త మొదలగు వాళ్లందరూ కూడా వార్డెన్స్‌గా ఉండేవాళ్లు. నా మటుకు నాకు నిజానికి సిగ్గుతో బిక్క చచ్చిపోయాను, ఏమిటిది నేను

ఫెయిల్ ఐపోయానే అని. లెక్కల్లో పోయింది అనుకుంట. హాస్టల్‌లో పెద్ద గొడవ అయిపోయింది. ఉచిత వసతి మరియు భోజన సదుపాయం కల్పిస్తున్నా విద్యార్థులు పరీక్ష తప్పితే ఏమిటి ప్రయోజనము? వీళ్లు బీద పిల్లలు అని కదా మనం సహాయం చేశాము. ఇలాంటి పిల్లలు కూడా చదవకుండా చెడిపోతే ఎట్లాగా? అని అందరూ అనుకున్నారు. సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినవారికి తదుపరి విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ఇవ్వకూడదని మేనేజ్మెంట్ నిర్ణయం తీసుకుంది. అలాంటి వాళ్లను బయటకు పంపించాలి అని డిసైడ్ చేశారు. తరవాత విచారిస్తే మొత్తం హాస్టల్‌లో మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయిన పిల్లలు ముగ్గురే ముగ్గురు, ఆ ముగ్గురు కూడా ఉచిత వసతి భోజన సౌకర్యం తీసుకునే వాళ్లు. ఇంక అందరూ పాస్ అయ్యారు. ఆ ముగ్గురు ఎవరంటే నేను, వేణు గోపాల్ (ఆళ్లగడ్డ) శ్రీనివాస్ (బుక్కచర్ల). కానీ ఏ విద్యార్థి కూడా మమ్మల్ని బయటికి పంపించడానికి ఒప్పుకోలేదు. మేము బయటకు వెళ్లకూడదు అని మిగతా పిల్లలు అందరూ చేరి గొడవకు దిగారు. ధర్నా చేశారు. పోలీసులు వచ్చారు.

ఏమిటి వీళ్లంతా ఇలా మాకు ఎందుకు సపోర్ట్ చేస్తున్నారు అని ఆలోచిస్తే... మా పైన ప్రేమతో కాదు వాళ్లు చేస్తోంది, ఇలాంటి నిర్ణయం ఈరోజు ఆమోదిస్తే రేపు ఎవరు ఫెయిల్ అయినా బయటికి వెళ్లాలి కదా... కాబట్టి మేము వెళ్లకూడదు అని నిర్ణయం చేశారు. వారి ఆందోళన వెనక ఉన్న నేపథ్యం అది.

ఈ పరిస్థితుల్లో, స్వామివారి ఆశీస్సుల వలన ఆయన బోధనలు నా జీవితంలో ఒక కఠిన మైన నిర్ణయాన్ని తీసుకునేందుకు దోహదం చేశాయి. నేను సిగ్గుపడినప్పటికీ, అందరి ముందు తల దించుకునే అనుభవం కలిగినప్పటికీ, అవమానించబడినా కూడా... నేను ఉచిత సదుపాయాలు తీసుకొని ఉండడం ఎందుకు? ఫెయిల్ అవ్వడం ఎందుకు? నేను చేయకూడదు కదా?? ఇక హాస్టల్‌లో ఉండటానికి నాకు అర్హత లేదు. నేను ఈ హాస్టల్ నుంచి వెళ్లిపోవాలి అని చెప్పి, మిగతా ఇద్దరిని అడిగాను... అరేయ్ నేనైతే వెళ్తున్నానురా. "నేను మేనేజ్మెంట్ దగ్గరకు వెళ్లి, నేను హాస్టల్ వదిలి వెళ్తున్నానని చెప్పాలనుకున్నాను" అని చెప్తానంటే... ఆ పిల్లలు కూడా ఎందుకో మరి నా మీద మర్యాదో, ప్రేమో, విశ్వాసమో తెలియదు కానీ 'నువ్వు ఏది చెప్తే అదేరా!' మేము కూడా... అని మనం ముగ్గురం బయట ఏదో రూమ్ తీసుకొని ఉందాంలే అని అన్నారు. నిజానికి అద్దె కట్టడానికి, భోజనానికి డబ్బులు కూడా మా దగ్గర ఏమీ లేవు ఆ రోజుల్లో.

అయినా సరే స్వామిని తలుచుకొని, ఆ హాస్టల్ యాజమాన్యం అంతా బోర్డ్ రూమ్‌లో ఉంటే... అక్కడికి వెళ్లాం. నేను ముందున్నాను.

మమ్మల్ని చూసి ఏమయ్యా? బాలచంద్ర... ఇట్లా చేసినారు మీరు అంతా? అని రామయ్య గారు అడిగితే... నేను నమస్కారం చేసి, కన్నీళ్లు పెట్టుకొని, క్షమించండి సార్! తప్పు మాదే, మేము తప్పకుండా బయటికి వెళ్లాల్సిందే... మీరు ఎట్లా అంటే అట్లా చేస్తాం అని చెప్పాము. ఎంత సంతోషపడిపోయారంటే యాజమాన్యం, "అబ్బా! చాలా మంచిది, మీరు దిశా నిర్దేశంచేసారు. ఫెయిల్ అయినా ఫర్వాలేదు, రేపు పొద్దున హాస్టల్ బాగుపడడానికి మీరు ముందుకు వచ్చారురా. మేము మిమ్మల్ని చూసుకుంటాం" అని చెప్పేసి వాళ్లు మమ్మల్ని బయటికి పంపించేసారు. మేమేమో హాస్టల్ గేట్ దాటి ఫుట్ పాత్ మీద మా బ్యాగ్‌లు పెట్టుకొని కూర్చున్నాం. బోర్డు మీటింగ్ అయిన తర్వాత జిపి రామయ్య, జీప్‌లో వెళ్తూ మమ్మల్ని చూశారు. ఏం చిన్నా! ఇక్కడ ఉన్నారు? ఎక్కడికి పోతామని? అంటే 'తెలియదన్న! మాకు, ఏం చేయాలో తెలియదు!' అంటే... అయ్యో రామ! ఇంత

మంచి నిర్ణయం తీసుకున్నారు. నేను సహాయం చేస్తాను మీకు. రండి... హాస్టల్ లేకుంటే ఏమి? అని, జీపులో ఎక్కించుకొని లగేజ్‌తో పాటు, అనంతపూర్ కొత్తూరులో ఉన్న గుల్జార్ పేట ప్రాంతంలో ఉండే బిల్డింగ్‌కి తీసుకెళ్లి అక్కడ తాళం చెవులు ఇచ్చారండి. మీరు నమ్మరు... ఏం జరిగిందో? ఆ భవనం పేరు ఏంటో తెలుసా "శ్రీ సాయి నిలయం" తలుపు తెరుస్తూనే... ఒక నిలువెత్తు సత్యసాయిబాబా ఫోటో. నాకెంత ఉద్వేగం అయిపోయిందంటే, నా సామి రంగా! ఇక్కడ కూడా స్వామి నాకు కనిపించాడే అని అనుకున్న. ఆయన నన్ను అప్పుడు కూడా వదలలేదు అనిపించింది. అది మూడు అంతస్తుల భవనము. వైశ్య హాస్టల్లో అయితే ఒక్కో గదిలో ముగ్గురు నలుగురు ఉండేవాళ్లము. కానీ ఇక్కడ మూడు అంతస్తుల్లో మూడు వేర్వేరు గదులు, అటాచ్డ్ బాత్రూంలు. మమ్మల్ని ఒక్కొక్క రూములో ఒక్కొకరిని పెట్టేసారు. మరి భోజన పరిస్థితి ఏందంటే ఏదైన స్టవ్ తెచ్చుకుంటామ్ అంటే... 'అయ్యో ఎందుకు చిన్నా! మంచిగా చదువుకోండి, పాస్ అవ్వండి. పాస్ అవుతే నేను మళ్లీ హాస్టల్లో అడ్మిషన్ ఇస్తాను' అని చెప్పి మమ్మల్ని అదే జీప్‌లో సిటీ టవర్ క్లాక్ దగ్గర, శాంతి థియేటర్ పక్కన వెంకటరమణ మెస్ అని ఒకటి ఉంది, ఆ మెస్‌కి తీసుకెళ్లి... 'ఏమయ్యా వెంకటరమణ! మన పిల్లలు... ఏం డబ్బు తీసుకోవద్దు... నేను చూసుకుంటా. భోజనాలు పెట్టేసేయి. రోజు' అని చెప్పారు. నిజానికి స్వామికి ఋణపడి ఉండాలి. ఎన్ని తప్పుడు పనులు చేసినా... ఆ తప్పుడు పనుల నుంచి మళ్లీ వెనక్కి లాగుతూ మిమ్మల్ని స్వామి రక్షిస్తూ వచ్చారు. ఇక గుల్జార్పేటలో కూడా మళ్లీ నేను బాలవికాస్ మొదలు పెట్టి అక్కడ చుట్టుపక్కల బస్తీలో ఉన్న పిల్లలందరికీ సత్యసాయి విలువలు నేర్పించడం, వాళ్లందరికీ కూడా ఎన్నో విషయాలు చెప్పడం... ఇలా గడిచింది. ఆ విధంగా మళ్లీ పరీక్షలు రాసి పెండింగ్ పేపర్లో పాస్ అయిపోయి. మళ్లీ రెండో సంవత్సరానికి వైశ్యా హాస్టల్ తిరిగి వచ్చాను. ఈ విధంగా వైశ్యా హాస్టల్ నాకు పలు దిశలలో నన్ను మెరుగు పరుచుకునేందుకు ఒక వేదికగా మారింది.



19

నాగభూషణం సాయి సంస్థకు నిజ భూషణం!

ఆ ఈశ్వరుడికి నాగ భూషణం
సాయీశ్వరుడికి వి నాగ భూషణం
బాలవికాసును కార్యముగా తలచినాడు
అనంత ఉద్యమానికి ఊపిరులూదినాడు
ఆనంద జ్యోతి వెలిగించి నాడు
ఆనంద పారవశ్యమందించినాడు

నాగభూషణ రావు, ఆంధ్ర రాష్ట్రంలో శ్రీ సత్య సాయి బాలవికాస్ ఉద్యమానికి 'కలికి తురాయి' అని చెప్పొచ్చు. ఆయన నాకు ప్రాతఃస్మరణీయుడు. సాయి సంస్థలో నా ప్రయాణానికి మరియు ప్రస్థానానికి ప్రధాన కారకుల్లో వారు ఒకరు. వాసుకి శివునికి భూషణం అయినట్లే, శ్రీ నాగభూషణ రావు శ్రీ సత్యసాయి కార్యానికి భూషణుడు.

అనంతపురం జిల్లాలో బాలవికాస్ కార్యక్రమాన్ని ప్రారంభించినది వారే. అనేక మంది చిన్నారుల జీవితాల్లో సాయి విలువల బీజాలు నాటి వారికెంతో ఆనందాన్ని పంచారు. నాకు స్ఫూర్తినిచ్చినది నలుగురు గురువులు: శ్రీమతి నాగ జ్యోతి, శ్రీ నాగభూషణ రావు, శ్రీ అనిల్ కుమార్, శ్రీ అంజనయ్య వీరందరూ నా బాల్యదశలోనే మంచి విలువలను నేర్పారు.

నాగభూషణ రావు ధర్మవరంలో ఉన్నప్పుడు 1969వ సంవత్సరంలో ఒక పాఠశాలలో మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సాయి భగవంతుడిని మొదటిసారి దర్శించిన వెంటనే భక్తునిగా మారారు. తన ఇంట్లోనే బాలవికాస్ ప్రారంభించి తన భార్యను కూడా గురువుగా తీర్చిదిద్దారు. వారి పిల్లలే మొదటి విద్యార్థులుగా మారారు.

ఆయన ధర్మవరం, అనంతపురం, గుత్తి, తాడిపత్రి, గుంతకల్ వంటి పట్టణాలలో ఉద్యోగ బదిలీలతో పాటు బాలవికాస్‌ను కూడా తనతో పాటుగా ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఇండియన్

రైల్వేలో పార్సెల్ సూపర్వైజర్‌గా ఉద్యోగం ప్రారంభించి గుంతకల్‌లో చీఫ్ పార్సెల్ ఆఫీసర్‌గా పదవీ విరమణ చేశారు.

సాధారణ నేపథ్యం కలిగి ఉన్నా, ఆయన చేసిన సేవ అసాధారణమైనది. నేను డిగ్రీ చదువుతున్న సమయంలో మా కుటుంబం గుంతకల్‌కు మారింది. అప్పట్లో శ్రీ నాగభూషణం గారు కూడా అక్కడే పనిచేస్తుండటం యాదృచ్ఛికం అనిపించింది. ఆయన ఎంతో వినయంగా, అందరితోనూ మృదువుగా ప్రవర్తించేవారు. సాయి సాహిత్యాన్ని చదివేవారు, నిత్య సంధ్యా వందనము ఆచరించే వారు, క్రమశిక్షణ పాటించేవారు.

ధర్మవరంలో బాలవికాస్ గురువుగా ప్రయాణాన్ని ప్రారంచినవారు. అనంతరం ఆనాటి సేవాదళ్ కో ఆర్డినేటర్ డా. అంజనయ్య మరియు జిల్లా అధ్యక్షుడు బుక్కపట్నం నత్యనారాయణ మార్గదర్శకత్వంలో జిల్లా స్థాయిలో ఎన్నో బాధ్యతలు చేపట్టారు. సాయి సంస్థలో అరుదుగా పురుషులు బాలవికాస్ బాధ్యతలు తీసుకునేవారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా బాధ్యత నిర్వహించిన అతి కొద్ది మంది పురుషులలో ఆయన ఒకరు. అనంతపురం జిల్లా బాలవికాస్ సమన్వయకర్తగా సేవలందించారు. ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొనేవారు, అనేక మంది గురువులను శిక్షణ ఇచ్చేవారు. వారి పరమపద యాత్ర 83 ఏళ్ల వయసులో జరిగింది. అప్పటి వరకు కూడా పిల్లలతో ఉంటే ఆయనే ఒక పిల్లాడిలా మారి పోయేవారు. ఆయనే, నన్ను సాయి సాహిత్యానికి పరిచయం చేసి, సాయి సాహిత్య ప్రియుడిగా మార్చి వేసింది అని చెప్పాలి.

"దేవుడు ఇచ్చిన దానితో సంతృప్తిగా జీవిస్తూ కోరికలపై నియంత్రణ చేయాలి" అనే సూత్రాన్ని జీవితాంతం పాటించారు. ప్రయాణాలు ఎప్పుడన్నా జనరల్ కంపార్ట్‌మెంట్లో ప్రయాణించి, స్వయంగా సామాన్లు మోసుకుంటూ, అనేక కార్యక్రమాల్లో పాల్గొనే వారు. మంది మార్బలం, ఆడంబరం, హడావుడి ఎక్కడా కనిపించదు వారి చుట్టూరా!

60 సంవత్సరాలకు పైగా సాయి సంస్థలో ఆయన సేవ చేశారు. అయినప్పటికీ స్వామిని వ్యక్తిగతంగా కలిసే అవకాశం రాలేదు. అయినా సరే ఎంతో నిబద్ధతతో తన బాధ్యతలను నిర్వర్తించారు. ప్రతి బాలవికాస్ గురువు, ప్రతి విద్యార్థి ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి.

ఎవరైనా నన్ను బాబా మీకు మహిమలు ఏమైనా చూపించారా? అని అడిగితే, "నాకు జీవితంలో నాగభూషణ రావుని అందించడమే బాబా చేసిన అద్భుతము" అని చెపుతాను. ఆయన లేకపోతే నేను ఈ స్థాయికి రాలేను. నాకు ఆయన గుర్తొచ్చినప్పుడు ఒక మంచి మాట గుర్తుకు వస్తుంది: "అన్నీ చేద్దాం, కానీ ఏమీ ఆశించవద్దు."

ఆయన చివరి సంవత్సరాల్లో ప్రశాంతి నిలయంలో సేవ చేశారు. నడిచేందుకు కూడా ఇబ్బంది పడే ఆ సమయంలో TVS పెట్టుకుని దగ్గరి గ్రామాలకు వెళ్లే వాళ్లు. అంతే గాక అనంతపురం జిల్లా అంతటా తిరిగి, భవిష్యత్తు తరాలకు నాయకులను తయారు చేశారు. వారు ఏరి కూర్చిన వాళ్లల్లో చాలామంది తర్వాత కాలంలో రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగారు. సాయి భక్తుడు ఎలా జీవించాలో నేర్పిన వెలుగు దివ్వె వారు.

1983లో అనుకుంటా ఆయన ఓ చిత్ర ప్రదర్శన నిర్వహించి అందులో బాబా సందేశాలను అందమైన చిత్రములతో భక్తులకు వివరించడం నేను తాడిపత్రిలో మొదటి సారి చూశాను. ఫోటోలు, ప్రింటింగ్, టైపింగ్ మరియు సామాజిక మాధ్యమాలు లేని ఆ కాలంలో వారు అలాంటి ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన తయారు చేశారు.

ఆ రోజు నాకు కలిగిన స్ఫూర్తియే, శ్రీ సత్య సాయి మహావతార దర్శన్‌కు నేపథ్యమై నిలిచింది. దీని గురించిన విశేష కథనం మును ముందు వ్యాసాలలో వివరిస్తాను.

వందలాది సంస్థ సభ్యులకు ఎన్నో సందర్భాలలో పోస్ట్ కార్డులను స్వయంగా వ్రాసి పంపేవారు. ఈ రోజుల్లో అది ఒక్క క్లిక్‌తో చేయగలిగె పని, కానీ ఆయన చేసినది భక్తితో కూడిన హృదయపూర్వక సేవ.

ఆయన నాలో ఎన్నటికీ నిలిచిపోయే స్ఫూర్తి. అలాంటి మహాత్ముడిని నాకు పరిచయం చేసిన స్వామికి నేను శత సహస్ర వందనములు తెలుపుకుంటున్నాను.

20

మహిమల మంజూషం – శ్రీ సత్యసాయి మహావతార దర్శనం

స్వామి వారు తన దివ్య కార్యంలో నన్ను ఒక సుశిక్షితమైన సేవకుడిలా సైనికుడిలా తీర్చిదిద్దడానికి ఎన్నో అవకాశాలు ప్రసాదించారు. అవన్నీ కూడా వారు ప్రత్యక్షంగా ఇవ్వలేదు, ఇవన్నీ పరోక్షంగా అపరోక్షంగా ప్రసాదించిన అవకాశాలు. ప్రతి అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేశాను. సత్య సాయి సంస్థ సభ్యులు నమ్మే సిద్ధాంతము! ప్రతిదీ స్వామే మన దగ్గరకు వచ్చి చెప్పే అవసరం లేదు. మనకి ఏ అవకాశం వచ్చినా దాన్ని వారే ఇచ్చారని చక్కగా అంది పుచ్చుకుని ముందుకెళ్లాలి. అలా మనల్ని మనం మెరుగు పరచుకోవాలి లేదా తిరిగి నిర్వచించుకోవాలి. కొన్ని విషయాలను నేర్చుకోవడం, కొన్నిటిని విడిచిపెట్టడం, మరికొన్ని తిరిగి అభ్యాసం చేయడం ఎంతైనా అవసరం. ఇలాంటి ప్రక్రియలో ముందుకు వెళ్తే చాలా మంచి ఫలితం వస్తుందని నేను నమ్ముతాను. కారణం ఏమిటో తెలుసా? నా జీవితంలో చోటు చేసుకున్న అద్భుతమైన విషయాలే! అ ఎన్నో సంఘటనల ఫలితమే నేను.

1986లో అమ్మ నాన్న గుంతకల్‌లో ఉండడం వల్ల నేను అనంతపురంలో డిగ్రీ చేస్తున్నప్పుడు చాలా రోజులు సెలవులలో ఇంటికి వెళ్లే వాడిని.

ఆ ఊళ్లో ఉద్యోగరీత్యా ఉండే శ్రీ సత్య సాయి బాలవికాస్ సమన్వయకర్త, శ్రీ నాగభూషణరావుని కలిసేవాడిని. నేను వారిలో చూసిన అత్యంత స్ఫూర్తిదాయకమైన విషయం ఏమిటి అంటే వారు దశాబ్దాల క్రితం (1975) తయారు చేసిన ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన. అది మొదటి సారి తాడిపత్రిలో చూసినప్పుడు నేను కూడా అట్లాంటిది ఏదైనా చేయాలని అనుకున్న.

1988లో స్వామి వారి 65వ పుట్టు పండుగ రాబోతున్నది. ఆ సందర్భంలో స్వామి వారి విలువలని, బాబా వారి జీవితమును, సాయి మహిమలను, వారి లీలను, సందేశాలను, జనబాహుళ్యానికి ఇంకా విరివిగా అందించాలంటే ఏం చేయాలని చాల తపించే వాడిని. అలాంటి సమయంలో నాకు స్వామి గురించి ప్రత్యేకంగా ప్రదర్శన తయారు చేస్తే ఎలా ఉంటుంది అనే

ఆలోచన వచ్చింది. నాకున్న బలహీనతా ఏంటంటే... ఏదైనా ఒక ఆలోచన వస్తే, ఆ ఆలోచన క్రియారూపం దాల్చేదాకా, ఫలితము వచ్చేదాకా ఇక నిద్రాహారాలు మానేసి పనిచేసే శక్తిని నాలో స్వామి పాదుకొల్పారు. రోజు అలా రాత్రి పగలు దీని గురించి ఆలోచించే వాడిని. రెండు మూడు రోజుల తర్వాత అనుకుంటా నాగభూషణ్ రావు గారిని కలిసాను. ఆయనకి అప్పుడు 60 సంవత్సరాలు. ఆ వయసులో వారు ఆ విషయం విని ఒక చిన్న పిల్లాడిలాగా కేరింతలు కొట్టారంటే నమ్మాలి. "బాబూ! అద్భుతమైన ఆలోచన ఇది! మన అనంతపురం జిల్లాకే కాదు, యావత్ ఆంధ్రదేశానికే కాదు, ఎన్నో రాష్ట్రాలకు పనికి వచ్చే మంచి ఆలోచన. చాలా మంది సామాన్యులకి స్వామి గురించి ఏమీ తెలియదు ఈ రోజుల్లో."

ఇంకా ఏమన్నారంటే "ఏదో స్వామిని చూడడము, స్వామికి నమస్కారం చేయడము, అంతే! కానీ ఎవరికీ పుస్తకాలు చదివే సమయం, ఓపిక లేదు. చాలా మంది నిరక్షరాస్యులు, పల్లె వాళ్లు ఉంటారు. సామాన్యులు, మూర్ఖులూ ఉంటారు, వీళ్లందరికీ మనం స్వామి వాణిని ఎలా వినిపించగలము అన్న విషయం చాలా బాగా చెప్పావు. తప్పకుండా చేద్దాం, నువ్వు రెడీ ఐతే నేను రెడీ!" అన్నారు.

ఒక బాలవికాస్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉన్న ఆయన నాలాంటి సాధారణ కార్యకర్తను, అదీ చిన్న పిల్లాడిని ప్రోత్సహించడం. ఆ వ్యక్తిని, వ్యక్తిత్వాన్ని నేను కలలో కూడా మర్చిపోలేను. అదే ఆదిగా మా అమ్మ నాన్న అనుమతి తీసుకున్నాను. నేను! "ఈ విధంగా ఒకటి లేక రెండు నెలలు స్వామి మీద చిత్ర ప్రదర్శన తయారు చేస్తున్నాను" అని అడగగానే. ఏ మూడ్‌లో ఉన్నాడో మా నాన్న, నీ ఇష్టం చేసుకో అని అన్నాడు. మా నాన్నని మరింత ప్రసన్నం చేసుకోవాలని చెప్పి... నేను చార్ట్స్, ఫోటోలు, పెన్నులు & పెన్సిళ్లు, స్కెచ్ పెన్నులు, స్కేలు మొదలగు వస్తువులు తీసుకొచ్చి మా ఇంట్లో... మా నాన్న గారితో, ఓంకారం వ్రాయిద్దాము అని అనుకున్న. చార్ట్ మీద మొదటి ఓంకారం మా నాన్నతో వ్రాయిస్తే నాకు కొద్దిగా స్వేచ్ఛ ఉంటుంది అని పని సులువు అవుతుందని నా భావన. స్వామి కార్యంలో చేయ బోయే ప్రయాణానికి ఇక అడ్డు ఉండదు అని నా ఆలోచన.

అప్పుడు గుంతకల్ రాజేంద్రనగర్లో ఉండేవాళ్లము. ఇంట్లో భజన పెట్టించాము. చుట్టపక్కల వాళ్లని, అక్కడ బాలవికాస్ భారతీ టీచర్నీ, తెలిసిన భక్తులను, గురువులను పిలిచాను. స్వామి కోసమై ప్రత్యేకంగా అలంకరించిన సింహాసనం ముందర నేను తెచ్చిన వస్తువులు పెట్టాను.

మీరెవ్వరు ఊహించలేరు! అప్పుడు జరిగిన సంఘటన. మేము ఓంకారం చేసి 'గణేశ శరణం... శరణం గణేశ, గణేశ శరణం... శరణం గణేశ' అంటూ పాడుతుంటే, ఎక్కడి నుంచి వచ్చిందో ఒక చిన్న ఎలుక ఆ చార్ట్ మీద ఇలా పరిగెత్తి అలా వెళ్లి పోయిందండి. నా మనసు ఆనందంతో నిండిపోయింది. అబ్బా! స్వామి, ఆ మూషిక వాహనాన్ని పంపించి ఆశీర్వదించాడు. ఇక ఈ కార్యము నిర్విఘ్నంగా జరుగుతుంది అనుకున్నాను.

ప్రతి రోజు సాయింత్రం ఇంట్లో భోజనం చేసి రావు గారింటికి సైకిల్‌లో వెళ్లే వాడిని. చాలా దూరం మా ఇంటి నుండి వారి ఇల్లు. రైల్వే క్వార్టర్‌లో ఉండేవాళ్లు అనుకుంటా. కొన్ని సార్లు త్వరగా వెళితే భోజనం కూడా వారి ఇంట్లోనే చేసేవాడిని. వాళ్లింట్లో అబ్బాయిలా ఉండేవాడిని. నాగభూషణరావు, వారి శ్రీమతి లక్ష్మీ సుందరమ్మ, వారి యొక్క తమ్ముడు సుబ్బారావు, కొడుకు ప్రసాద్, కోడలు సరోజ ఇట్లా కుటుంబ సభ్యులు అందరూ కూడా నాకు తోడు నీడగా ఉండేవారు. వీళ్లందరూ కూడా ఆ ఇంట్లో చిన్న పిల్లలు లాగా... ఏదో అద్భుతమైన కార్యం చేస్తున్నట్లుగా, ఏ ఆశలు, ఫలాపేక్షలు

లేకుండా స్వామి కార్యం చేయాలన్న తదేక ధ్యానంతో, ఏకాత్మ భావంతో, ఏకాగ్ర చిత్తంతో తలా ఒక స్వామి పుస్తకం తీసుకోవడం... ఆ పుస్తకంలో విశేషాలను ప్రవీణులు, నిపుణులు లాగా బయటకు తీయడము, దానికి సంబంధించిన ఫోటో వెతుక్కోవడము, డిజైన్ మరియు రంగులు ఏ విధంగా ఉండాలో చూసుకోవడం... ఇక ఒక్కొక్కరు ఒక్కో చార్ట్ తీసుకోవడము... మంచి ప్రచార చిత్రాన్ని తయారు చేయడం. మా తపన అంతా తపస్సుగా మారిపోయింది. ఈ విధంగా సుమారు 30-40 రోజుల్లో స్వామి జీవితానికి మరియు కార్యానికి సంబంధించిన ఎన్నో చిత్రాలకు ప్రాణం పోసాము.

ఆ రోజుల్లో అంజనయ్య గారు ఉపన్యాసాలలో ఎప్పుడు చూసినా సత్యసాయిది అవతారం కాదయ్యా ఇది మహావతారం అని చెప్పేవారు. ఈ ప్రదర్శనకు అలాంటి పేరు పెట్టాలని "శ్రీ సత్యసాయి మహావతార దర్శన్" అన్న పేరు పెట్టాము. పేరు ఏ ముహూర్తంలో పెట్టామో తెలీదు. అది ఒక పెట్టెలో అద్భుతంగా మారిపోయింది (charts పెట్టేందుకు... ప్రత్యేకంగా ఇనుప రేకులతో ఒక పెట్టె చేయించారు రావు గారు) అది పెట్టె కాదు... మహిమల మంజూష.

కొన్ని ఏళ్ల తర్వాత ఆ చిత్రాలను అన్ని కూడా ఒక కాపీ చేయించి పెట్టుకున్న. కాలక్రమంలో ఆ Exhibition Pannels, Charts అన్ని కూడా కనుమరుగయ్యాయి. కానీ, దాని ద్వారా వెళ్లిన సాయి సందేశం మాత్రం చిరకాలం ప్రజల్లో నిలిచిపోయింది.

అందులో నాగభూషణ్ రావు గారు స్వయాన వ్రాసినవి కూడా ఉన్నాయి. స్వామి నామాన్ని, స్వామి కీర్తి ప్రతిష్టలని, స్వామి మహిమలని, సిద్ధాంతాలని ఇలా అన్ని విశేషాలన్నీ కూడా ఇందులో చెప్పడం జరిగింది.

తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు మహారాష్ట్ర ఇలా ఎన్నో రాష్ట్రాలకు శ్రీ సత్యసాయి మహావతార దర్శన్ వెళ్లింది. ఆ రోజుల్లో వారాంతము వస్తే చాలు, నాగభూషణరావుతో కలవడము, అదేదో పెద్ద యాత్ర లాగా, అద్భుతమైన దీక్ష లాగా, యజ్ఞం లాగా ఈ ప్రదర్శన చిత్రాలను ఉంచిన ఆ పెద్ద ట్రంకు పెట్టెని తల మీద ఎత్తుకోవడం, అన్ని ఊళ్లకు వెళ్లడము, ఆ ఊళ్లలో ప్రత్యేకమైన ప్రదర్శన ఏర్పాటు చేసి వందల, వేల మందికి స్వామి సందేశాన్ని అందించడము జరిగేది. ఈ ప్రయాణాలలో మేము ఒకరికొకరు ప్రేమికులూగా మారిపోయాము. ఆయన నన్ను చాలా ప్రేమించేవారు.

సత్యసాయి మహావతార దర్శన్ నాలోని జిజ్ఞాసను మరియు కుతూహలాన్ని మరింత పెంచింది. 100 అనుకుని మొదలు పెట్టిన ప్రదర్శన చివరికి సుమారు 200 ప్రదర్శనాంశములుగా మారి పోయింది. ఎప్పుడు వీలవుతే అప్పుడు, ఎప్పుడు కొత్త విషయం తెలిస్తే అప్పుడు ఆ విషయాన్ని మేము జత చేసేవాళ్లము. రెండేళ్లలో ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నో ఊళ్లు తిరిగాము. హైదరాబాదులో శివం ప్రాంగణంలో ఈ ప్రదర్శన వారం రోజుల పాటు ప్రదర్శించాం. కొన్ని వందల మంది పరిచయమయ్యారు. కొన్ని వేల మందికి సాయి సందేశాన్ని అద్భుతమైన రీతిలో మేము ప్రచారం చేయడం జరిగింది. తదాదిగా ఈ ప్రదర్శనను ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న అన్ని సంస్థల కేంద్రాలకి తీసుకెళ్లాము.

ఆ సమయంలో 65వ (1990) పుట్టిన రోజు అనేది స్వామి కార్యంలో ఒక మైలు రాయిగా మేము భావించేవాళ్లం. అన్ని చోట్లా ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయి. మేము మాట్లాడుకున్నాం, పుట్టపర్తికి కొన్ని లక్షల మంది వస్తారు కదా... సామాన్య భక్తులు ఏం చేస్తారు? వారికి మనం సాయి సందేశాన్ని అందచేస్తే ఎలా ఉంటుంది? అని అలా అనుకోవడమే ఆలస్యము... అంజనయ్య గారితో మాట్లాడడం... వారు W2 - W3 మధ్యలో ఉండే ఆంధ్రప్రదేశ్ కార్యాలయం ఎదురుగా ఒక

షామియానా లాగా వేయించి ఇచ్చారు. అందులో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశాము. ఒక 10 రోజుల పాటు ఉదయాన నిద్ర లేచింది మొదలు పెడితే రాత్రి 11 దాకా అనర్గళంగా అవిశ్రాంతంగా మాట్లాడేవాడిని. ఒక్కడు వచ్చినా సరే మొత్తం "అ" నుంచి "అ" దాకా చెప్పేవాడిని. ఆ ప్రదర్శనకు జనం తండోప తండాలుగా వచ్చేవారు. అలా అవిశ్రాంతంగా మాట్లాడటంతో, ఆయాసం, ఛాతి నెప్పి, జ్వరం వచ్చేసి పడుకున్న సందర్భాలు ఉన్నాయి. అన్నం కూడా తినకుండా స్వామి కార్యంలో నిమగ్నమైన సందర్భాలు ఉన్నాయి. నేను పడుకున్నప్పుడు అక్కడ ఉండే పర్యవేక్షకులు, సేవాదళ్, రాష్ట్ర కార్య నిర్వాహకులు చూసేవాళ్లు. ఒక వేళ నేను నిద్ర లేకుండా మాట్లాడేది గమనిస్తే... అరే! ఈ పిల్లాడు ఏంట్రా బాబు, భలే ఉన్నాడు... నిద్రాహారం మానేసి చెప్పేస్తున్నాడు...' అని బాబు నువు పడుకో... నేను చెప్తా అని మొదలు పెట్టే వాళ్లు... వచ్చినవాళ్లకి వీళ్లు చెప్పేది నచ్చేది కాదు... ఎవ్వడు వినేవాడు కాదు. పల్లె వాళ్లు అందరు వచ్చి బాబు సాయిరాం! ఆ పిల్లోడిని పిలవండి... సాయిరామ్! మేము వింటాం. బాగా చెప్తున్నాడు. అందుకే మా వాళ్లను కూడా తీసుకుని వచ్చాము... ఆ పిల్లోడు బాగా చెప్తాడు సాయిరామ్! అని చెప్పేవాళ్లు.

సత్యసాయి మహావతార దర్శనం చూస్తున్న వాళ్లు ఎవరైనా సరే కళ్ల నీళ్లు పెట్టుకోకుండా వెనక్కి వెళ్లిన సందర్భం నేను చూడలేదు. అందులో మేము సచిత్రంగా చూపించే మహిమలు, స్వామి కథలు, స్వామి సందేశాలు అన్నీ... అందరి మన్ననలు పొందేవి.

"నేను స్వామికోసమే బ్రతుకుతున్నాను, స్వామినే ప్రేమిస్తున్నాను, స్వామితో చేరి స్వామి కార్యంలో నడుస్తున్నాను!" అని ఎంతో ఆనందం కలిగేది నాకు. ప్రశాంతి నిలయంలో ఉన్న ఆ పది రోజులూ వేలమందికి సాయి జీవిత విశేషాలు చెప్పే భాగ్యం కలిగింది.

తర్వాత కాలంలో 'సత్య సాయి మహావతార దర్శన్ ను' నందివాడ రాణి గారు, రాష్ట్ర బాలవికాస్ సమన్వయకర్త చూసి చాలా సంతోషపడి దీన్ని పిల్లలకు కూడా తీసుకెళ్లాలన్న ఆలోచనతో పేరును కాస్తా మార్చి "ఆనంద జ్యోతి" కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీన్ని నేపథ్యంగా చేసుకుని కొన్ని పోటీలు ఏర్పాటు చేశారు. అలా బాలవికాస్ పిల్లలకి ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేసి అద్భుతమైన అనుభూతిని, అనుభవాన్ని ఇచ్చారు.

1990లో అనుకుంటాను నేను కంపెనీ సెక్రెటరీ కోర్సు కోసమై మద్రాసు/ బెంగళూరుకు వెళ్లడం జరిగింది. అలా వెళ్లినప్పుడు కర్ణాటక, తమిళనాడు మరియు మహారాష్ట్ర ఇత్యాది ప్రదేశాల్లో కూడా ఈ ప్రదర్శను ఎక్కడ వీలవుతే అక్కడికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాము.

నాకు గుర్తు కర్ణాటక స్టేట్ కోఆర్డినేటర్ గారు, మరియు బెంగళూర్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ Dr RS పద్మనాభన్ గారు, అలాగే వారి సతీమణి కమల పద్మనాభన్ గారు, బాలవికాస్ కోఆర్డినేటర్ సుచరిత గారు ఆ రోజుల్లో ఎగ్జిబిషన్ చూసి చాలా ఆనందపడి, వారే స్వయంగా పూనుకుని వాళ్లింట్లో నన్ను కూర్చోబెట్టుకుని ప్రదర్శనను కన్నడలోకి తర్జుమా చేశారు. అలాగే బెంగుళూరులో ఉన్న స్వామి భక్తులు సోమసుందరం ఈ ప్రదర్శనను చాలా మెచ్చుకొని ప్రత్యేకంగా సమయాన్ని ఇచ్చి, ఒక దీక్షలా, యజ్ఞంలా తీసుకుని ఎంతో భక్తితో మొత్తం ప్రదర్శనను ఆంగ్లములోకి తర్జుమా చేశారు.

ఇలా 3 భాషలలో సిద్ధం చేసిన ఈ ప్రదర్శనను ఒక అద్భుతమైన పుస్తకములా తీసుకురావాలనే ఆలోచన వచ్చింది. తద్వారా మరింత మందికి కలకాలం స్వామి విశేషాలను అందించవచ్చు అని భావించాము. అంటే ఈ యాత్ర / ప్రక్రియ ద్వారా స్వామి కార్యాన్ని విస్తరించడమే మా ధ్యేయంగా మారిపోయింది!

బెంగుళూరులో... సాయి కేంద్రం, South End Circleలో ప్రదర్శన ఏర్పాటు చేశాము. ఆ సందర్భంలో ఈ ఎగ్జిబిషన్ చార్ట్‌తో పాటుగా మమ్మల్ని Dr RS పద్మనాభన్ గారు బృందావనంలో స్వామి దగ్గరికి తీసుకుని వెళ్లి సాయిరాం షెడ్డులో స్వామి ముందు కూర్చో బెట్టారు. స్వామి వారు నాగభూషణ రావుని నన్ను ఆ చార్టులను ఆశీర్వాదించారు.

శ్రీ సత్యసాయి మహావతార దర్శనము ద్వారా నేను అద్భుతమైన ఉపన్యాసకుడిగా మారిపోయాను. సత్యసాయి సాహిత్యాన్ని శోధించి పరిశోధించే అవకాశం కలిగింది! స్వామి కార్యం మీద ప్రత్యేక అవగాహనకు అవకాశం కలిగింది. ఎట్టి భయము లేకుండా ధైర్యంగా ఏ కేంద్రంలో నైనా, ఏ భాష వారికైనా, అసలు భాషే రాకున్నా ఫోటోలు చూపించి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లగలిగే ధైర్యము, చాతుర్యము కలిగింది. కోడి గీతల్లా ఉండే నా చేతి వ్రాత సత్యసాయి మహావతార దర్శన్ వలన అద్భుతమైన గుండ్రటి చేతి వ్రాతగా మారిపోయింది. తపన, చాతుర్యం, పట్టుదల, సృజనాత్మకత ఇలా ప్రతీదీ వచ్చాయి నాకు.

సాయి సోదరులారా 'సత్యసాయి మహావతార దర్శన్' నా జీవితంలో జరిగిన ఒక అద్భుతమైన మహిమ అని చెప్పుకోవాలి. కారణం, దీని ఫలితంగానే కదా స్వామి కోసం బ్రతికే అద్భుతమైన సేవకుడిగా నన్ను నేను మలచుకోగలిగింది.

నాకు గుర్తు ఆ తర్వాత కాలంలో కరీంనగర్ జిల్లా యువజన సమ్మేళనం సందర్భంగా గంగారం గ్రామంలో గ్రామ సేవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాము. ఎక్కడికి వెళ్లినా కూడా నాతో పాటు ఈ చిత్ర ప్రదర్శనను కూడా తీసుకుని వెళ్లి ఉదయం నుండి సాయింత్రం దాకా గ్రామంలో వాళ్లకు చెప్పేవాడిని.

అఖిల భారత సాయి సంస్థల అధ్యక్షులు వి శ్రీనివాసన్ గారు, సెంట్రల్ ట్రస్ట్ మెంబర్, నేను గ్రామం మధ్యలో షామియానా వేసుకుని చెప్తున్న ప్రదర్శనను చూసి ఆయన మంత్ర ముగ్ధుడయ్యారు. వారు కూడా కాసేపు ఆ ప్రదర్శనలో ఒక మూల కూర్చుని ఆసక్తిగా వినడం చూసి అందరూ ఆశ్చర్య పోయారు. ఆ రోజు నుండి నన్ను వారు మరువలేదు.

శ్రీ సత్యసాయి మహావతార దర్శన్ కేవలం భక్తులకు బాలవికాస్ పిల్లలకే కాకుండా, నేను హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత నాగభూషణ రావుతో బ్రతిమలాడి, వారు ఎంతో అపురూపంగా కాపాడుకుని పెట్టుకున్న ఆ సాయి సాహిత్య రత్న కోశాన్ని, ఆ స్వామి మహిమల మంజూషాన్ని నెత్తిన పెట్టుకుని వచ్చాను.

సాయి యువతతో చేరి యావత్ ఆంధ్రదేశంలో ఉన్న కొన్ని వేల మంది యువతీ యువకులకి దీన్ని చేర్చే అదృష్టం కలిగింది. ఈ ప్రక్రియలో నేను మంచి వక్తగా మారడమే గాక పరిపూర్ణ వ్యక్తిగా కూడా మారిపోయాను.

21

మాధవుని దరికి చేర్చిన మాన్యులు
డా. నలబాల అంజనయ్య

బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సుల వలన చాలా అద్భుతమైన అనుభవాలు జీవితంలో పదిలమయ్యాయి.

నాగజ్యోతి మరియు నాగభూషణరావు
అనిల్ కుమారు, నలబాల అంజనయ్య
నల్గరితో నను చేర్చి నవ్యభావమలు నేర్పితివి
అందుకో వందనములు శ్రీ సత్యసాయి

అని నా హృదయ ఫలకంపై వ్రాసుకున్నాను. నిజానికి ఈ నలుగురు వ్యక్తులు భగవాన్ బాబా వారు ఇచ్చిన అనుగ్రహానికి చిహ్నాలుగా జీవితంలో నిలిచిపోయారు. జీవితంలో డాక్టర్ నలబాల అంజనయ్య M.A,Ph.D., ఒక అద్భుతమైన ప్రేరణ అని చెప్పాలి.

నా జీవితంలో స్వామిని ఏమైనా అర్థం చేసుకున్నాను, స్వామి యొక్క విలువలని ఏమైనా వంట పట్టించుకున్నాను, స్వామి ఇచ్చిన సందేశాలని జీవితంలో ఆచరిస్తున్నారు, స్వామి కార్యంలో ఒక సుశిక్షితమైన సైనికుడిలా ముందు కురికాను అంటే... కారణం డాక్టర్ అంజనయ్య గారు అని నేను గుండె మీద చేయేసుకొని చెప్పగలను. వృత్తిరీత్యా ఆర్థిక శాస్త్రములో నిష్ణాతుడు. చాలా పెద్ద ప్రొఫెసర్‌గా ఉండాల్సిన వారు. శిరిడీ బాబా భక్తుడుగా ఉన్న ఈయన, స్వామి ఇచ్చిన దివ్యానుభవంతో శిరిడీ బాబానే సత్యసాయి బాబా అని గ్రహించి, అతి యుక్త వయసులో స్వామి కార్యంలో ప్రవేశించారు. వారు స్వామి కార్యంలో ప్రవేశించినది మొదటగా వారు స్వామిలో ఐక్యమైన క్షణం దాకా (2025) అవిశ్రాంతంగా, అనర్గలంగా, అహరహం అనుక్షణం స్వామి కోసమే పరితపిస్తూ... అలుపే ఎరుగని వీరుడిలా సేవలు చేశారు. వారు సుమారు 87 వసంతాలు స్వామి సేవలో బ్రతికి, దేశవ్యాప్తంగా ప్రయాణం చేశారు.

ఆయన సత్యసాయి సేవా సంస్థ యొక్క ఆధ్యాత్మిక విభాగానికి జాతీయ సమన్వయకర్తగా సేవలందించారు. ప్రపంచానికి కూడా వారు అలానే పరిచయం. కానీ స్వామి ఇచ్చిన అనుగ్రహంతో నేను నిక్కరు వేసిన దగ్గర నుంచి వారితో చేరి పని చేశాను. వారు అనంతపురం జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్‌గా ఉన్న సమయంలో నుండి కూడా వారిని చూసే భాగ్యం నాకు కలిగింది.

చాలా దగ్గరగా, అత్యంత సన్నిహితముగ వారిని గమనించే అవకాశం నాది. ఆ పరిశీలనలో వారి ఉదాత్తమైన వ్యక్తిత్వము నా ముందు ఆవిష్కరించ బడింది. వారి నుంచి నేను నేర్చుకున్న విలువలు అన్నీ ఇన్నీ కాదు. ఈ రోజు నిజంగా స్వామి కార్యంలో ఉడతా భక్తితో నాకు సాధ్యమైనంత ఏమైనా చేస్తున్నానంటే డాక్టర్ అంజనయ్య లాంటి వారి చలువ వల్లనే అని చెప్పగలను. ఆయన అనంతపురం జిల్లా సేవాదళ్ సమన్వయకర్తగా పని చేస్తున్న సమయంలో చూశాను. దాని తర్వాత జిల్లా అధ్యక్షుడిగా ఉంది నేను చూశాను. దాని తర్వాత వారికి సాయి సంస్థల ఆంధ్ర రాష్ట్ర సేవా విభాగానికి సమన్వయకర్తగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా చూశాను. నాలుగు దశాబ్దాల నుండి వారి చెయ్యి పట్టి నడిచే అవకాశం నాకు దొరికింది.

ఆయనలో చాలా అద్భుతమైన స్నేహితుడు, తత్వవేత్త మరియు మార్గదర్శిని చూసే అదృష్టం నాది. వారు ఈ మూడు అంశాల ప్రతిరూపం అని అనిపిస్తుంది. వారి స్నేహశీలత, వేదాంత ధోరణి, తత్వ ధోరణి ఇవన్నీ కూడా నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తుంటాయి.

ఆయనను 1982, మే 6వ తేదీ రోజు ఈశ్వరమ్మ వర్ధంతి & బాలవికాస్ దినోత్సవ సంబరాలు, సత్యసాయి సేవా సమితి, తాడిపత్రిలో జరుతుండగా చూశాను. మొదటి వరుసలోనే కూర్చుని ఎంతో ఆపేక్షగా, శ్రద్ధగా వారిని చూస్తూ... వారి మాటలు వింటుంటే, ఏమిటి ఈయన ఇట్లా ఇంత అద్భుతంగా మాట్లాడుతున్నాడే? చాలా విచిత్రంగా ఉన్నారు ఈయన! ఫుల్ హ్యాండ్ సఫారీ... పైన రెండు ప్యాకెట్స్, కింద రెండు ప్యాకెట్స్, White and White... Petromax Light లా... నుదుటి మీద విభూతి ధారణము, ఆ మధ్యలో కుంకుమ బొట్టు, ఎప్పుడైనా సరే ముఖంలో తాజాతనం, శుభ్రత... దానికి తోడు చేతిలో ఒక చిన్న తువ్వాలు... ఇలా వారి రూపం ఉండేది. ఒక లెదర్ బ్యాగ్ తెచ్చుకునేవారు, ఇక సర్వము దాంట్లో ఉండేదన్నమాట.

చాలా చమత్కారంగా వారిని చూసేవాళ్లము! సునిశితమైన దృష్టి వారిది. కారణం, ఎక్కడ ఎన్నిసార్లు చూసినా... ఏమీ మాట్లాడరు... ఏమీ వినరు కానీ అన్నీ గమనిస్తూ ఉంటారు. కనిపించకుండానే అన్ని చేస్తూ ఉంటారు. రాజీపడని నిక్కచ్చితనము.

తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత దూరమైనా ప్రయాణం చేస్తారు. ఎంతమందితో అయినా మాట్లాడగలరు. ఎన్ని వందల మంది ఉన్న సభలోనైనా కూడా స్వామి తత్వాన్ని ప్రదర్శించగలరు, నిరూపించగలరు అని నేను వారిలో గమనించాను.

అలాగే చాలా క్రమశిక్షణ. ఒక టైమ్ అంటే టైమ్. ఒక్కసారి మాట్లాడటం మొదలు పెట్టారంటే ఇక వారిని ఆపే తరము ఎవ్వరి వల్ల కాదు, చివరికి స్వామికి కూడా సుమా! ఓ రెండు మూడు సార్లు నేను అది కూడా గమనించాను. ఇది కేవలం వారి యొక్క ఆర్తిని, వారి యొక్క జిజ్ఞాసని, వారి యొక్క కుతూహలాన్ని, చెప్పాలనే ఆపేక్షని, అందరికీ వివరించాలనే ఒక ఆలోచన తప్ప అందులో మరొకటి నేను గమనించలేదు. ఇదివరకు ఆయనంటే తెలియని వారు చాలా చెప్పేస్తున్నారని భయపడుతారేమో కానీ, చిన్నప్పటి నుంచి చూస్తున్నాను కాబట్టి నాకు అది ఒక వినోదంగా, విన్నూతంగా, విజ్ఞానంగా ఉంటుంది కానీ విచారకరంగా ఎప్పుడూ ఉండదు.

వారు అందరి మీద ఎంతో ప్రేమానురాగాలు చూపించేవారు. నేను చాలా చిన్నప్పటి నుంచి వారిని చూస్తున్నాను. వారితో కలిసిన ప్రతిక్షణము, ప్రతి అవకాశం, ప్రతి సందర్భం కూడా వారి ప్రేమను అనురాగాన్ని చవి చూసిన అనుభవం నాది.

ఆయన సత్యసాయి సంస్థలలో నడిచే విజ్ఞాన ఖని అని చెప్పాలి. కారణం, సత్యసాయి సంస్థలో దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా ఇప్పటిదాకా ఇట్లాంటి వ్యక్తులు పుట్టలేదు అని అంటే ఎట్లాంటి సందేహము లేదు. అలాంటి మహా అద్భుతమైన చాతుర్యము, మేధో సంపత్తి వారి సొంతము. స్వామి చేతిలో ఉన్న పాంచజన్యమేమో (శంఖం) డాక్టర్ అంజనయ్య గారు అనిపిస్తుంది. అంత అనర్గలంగా మాట్లాడుతారు. స్వామి సంస్థలో ఎన్నో విశేషాలు వారు మదిలో పదిల పరచుకున్నారు. సంవత్సరం, రోజు, తేదీ, సందర్భము అన్నీ కూడా ఆయనకు కరతలామలకం.

మాట్లాడే ప్రతి విషయంలో కూడా ఆధ్యాత్మికతని ముడివేయడం వీరిలోనే చూశాను. ఈరోజు ఎక్కడైనా నేను చాలా సందర్భాలలో మాట్లాడుతున్నప్పుడు ఆధ్యాత్మికతను ముడి వేస్తున్నాను అంటే డాక్టర్ అంజనయ్య గారి యొక్క చలువనే అని చెప్పాలి. వారి వ్యక్తిత్వాన్ని చూసి నేను నేర్చుకున్న విషయాలలో ఇది బాగా నాకు గుర్తుకొస్తూ ఉంటుంది.

అంజనయ్య గారు నా వ్యక్తిత్వముపై చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. కారణం సేవాదళ్ పునఃశ్చరణ శిబిరాలు, సేవాదళ్ శిక్షణా శిబిరాలు, బాలవికాస్ శిక్షణా శిబిరాలలో వారెప్పుడూ కూడా మొదటి గురువుగా ఉండి అందరికీ దిశ దశ చూపే వారు.

1985 సంవత్సరం, స్వామి వారి షష్టి స్మూర్తి సందర్భములో ఆంధ్రప్రదేశ్ సత్యసాయి సేవా సంస్థలలో చేపట్టాల్సిన షష్టి స్మూర్తి సాధన, 60 రోజుల 'సాధన' పుస్తకం వారు ప్రచురించారు. నాకు ఇప్పటికీ గుర్తున్నది, అది నన్ను చాలా ప్రభావితం చేసింది. అంటే ఇన్ని రకాలుగా సేవలు చేయొచ్చా అని తెలిసింది. అలాగే ఒక నాయకుడు కింది వాళ్లని ఎలా చూస్తారు అని చాలామందిని చూస్తూ ఉంటాం. సంస్థలో నాయకుడు అంటే ఈ రోజుల్లో ఓ స్థాయిలో ఉంటాడు. కింది వాళ్లతో అంత కలివిడిగా ఉండలేడు, ఎంతో కొంత అంతరం ఉంటుంది. కానీ, అంజనయ్య రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నప్పుడు అందరితో అన్యోన్యంగా, వాత్సల్యంగా, వచ్చినవాడు చిన్నవాడైనా, పెద్దవాడైనా, గొప్పవాడైనా, సామాన్యుడైనా, అసామాన్యుడైనా, అందరినీ ప్రేమానురాగములతో అక్కున చేర్చుకుని ఆతిథ్యం ఇస్తూ వారితో పాటుగా కూర్చొని కొసిరి తినిపిస్తూ, వారికి ఏదో ఒకటి చేతిలో పెట్టి గానీ పంపించే వారు కాదు. అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అనిపిస్తుంది.

వారి వాక్ చాతుర్యము గురించి ఇంకా నేను తెలుసుకున్నది 1990లో స్వామి వారి 65వ పుట్టు పండుగ సందర్భంగా వారితో పాటు పది రోజులు ప్రయాణం చేసే ఒక అవకాశం నాకు కలిగింది. ఆ యాత్రలో... సభలలో ఎంతమంది ఉన్నా సరే... వారు మాట్లాడే కంటే ముందు... "అయ్యా! బాలచంద్ర, మాట్లాడు" అని మాటలు దగ్గర ఉండి నేర్పించారు. వీరిని సదా స్మరణ చేసుకోవాలి నేను. కారణం ఈరోజు నేను ఇలా మాట్లాడగలుగుతున్నాను అంటే కారణం డాక్టర్ అంజనయ్యలాంటి వారి వల్లే, వారు నాకు ఆరోజులలో ఇచ్చిన అవకాశాల వల్లనే!

ఎక్కడ ప్రతిభ ఉంటే అక్కడ వాళ్లను ఉత్సాహ పరిచేవారు. ఎవరిలో ప్రతిభ ఉంటే వారిని ప్రోత్సహించే వారు. అలా వారు ఇచ్చిన ప్రోత్సహము వల్ల సాయి సంస్థలలో ఎంతో మంది సైనికులుగా తయారయ్యారు. అందులో శ్రీ వి నాగభూషణరావు, శ్రీ M మధుసూధన రావు దాని తర్వాత నేను కూడా అని ఉదాహరణగా చెప్పవచ్చు. స్వామి, వారికి ఇచ్చిన అవకాశం ఏమిటంటే, అలాంటి

వాళ్లని సత్యసాయి సంస్థకి అంకితం చేయడం అన్నమాట.

1995లో 'ఆంధ్రప్రదేశ్ సత్యసాయి యూత్ కమిటీ'ని స్వామి వారు ఏర్పాటు చేసినప్పుడు, డాక్టర్ అంజనయ్య గారు స్టేట్ యూత్ కమిటీలో నన్ను సభ్యుడిగా చేసినారు. తద్వారా నాకు స్వామితో మొట్ట మొదట ఏకాంత సౌధ సంభాషణకు అవకాశం దొరికింది.

స్వామిని పరిచయం చేయడమే కాదు, స్వామి దగ్గరికి తీసుకురావడమే కాదు... స్వామితో సమాగమనానికి కూడా మార్గం సుగమం చేసింది డాక్టర్ అంజనయ్యనే!!

ఆయన నా కోసం సిఫారసు లేఖను శ్రీ సత్య సాయి విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ మరియు పరీక్షల నియంత్రణాధికారికి ఇచ్చారు. నా B.Sc., చివరి పరీక్ష మరియు పుట్టపర్తిలో M.Sc., ప్రవేశ పరీక్ష రెండు ఒకే సమయంలో వచ్చాయి. నాకు స్వామి కాలేజీలో M.Sc., చేసి ఉపన్యాసకుడిగా పని చెయ్యాలని ఆసక్తి ఉండేది. వారు నా ఆసక్తిని గమనించి ఎంతో అమాయకంగా, చాలా ప్రేమగా, చాలా వాత్సల్యంతో... 'అయ్యా! నేను ఒక లెటర్ వ్రాస్తాను, వెళ్లి శ్రీ నంజుండయ్యని కలువు' అని ఇచ్చారు. నేను వారి దగ్గరికి వెళ్లి 'సార్ నేను పరీక్ష రాయలేక పోయాను సార్, ఇదిగో చూడండి అని లెటర్ ఇస్తే... చాలా సంతోష పడిపోయారు. ఇప్పటి దాకా ఇలా ఎవ్వరిని కూడా రాష్ట్ర అధ్యక్షులు సిఫారసు చెయ్యడం నేను చూడలేదు' అని చెప్పడం నాకు ఆశ్చర్యం వేసింది. అది ఒక మర్చిపోలేని అనుభవం. నాకు అవకాశం రాలేదు... అది వేరే విషయం.

1995లో బెంగళూర్లో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్న సమయంలో... ఆంధ్ర సత్యసాయి యువజన ఉద్యమం కోసం సేవ చేసే భాగ్యాన్ని స్వామి వారు ఇచ్చారు. అప్పుడు నేను ఆంధ్రప్రదేశ్ సంస్థలో పని చేయాలి కదా? ఆంధ్రప్రదేశ్ యువకులతో చేరి స్వామిని సేవించుకోవాలి అనుకున్నప్పుడు బెంగళూరు విడిచి రావాల్సిన అవసరం ఏర్పడింది. నేను హైదరాబాద్‌కి రావాలనుకున్నాను. హైదరాబాద్ యూత్‌లో ఉన్న సీనియర్ సోదరులు మాత్రమే పరిచయం ఉన్నారు.

అ తరుణంలో అంజనయ్య గారు అప్పటి డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ శ్రీ గోపాలకృష్ణమూర్తి గారు, నాట్కో పరిశ్రమకికి డైరెక్టర్‌గా ఉన్నారు. వారికి నన్ను సిఫారసు చేసి ఈ అబ్బాయి చాలా అద్భుతమైన వ్యక్తి, సత్యసాయి సంస్థలో ఆణిముత్యం లాంటివాడు అని చెప్పి, వారికి పరిచయం చేయడము, వారి ద్వారా నాట్కో కంపెనీ సెక్రెటరీ ట్రైనింగ్ నేను పొందడం జరిగింది.

అంటే, ఏ స్థాయిలో మార్పుకు నాంది పలికారో... ఏ స్థాయిలో సహకారం అందించారో, ఎంత స్థాయిలో ఉత్సాహాన్ని అందించారో, ఎంత విలువైన మార్గదర్శనం ఇచ్చారో చూడండి. అంజనయ్య గారు నాకు చిరస్మరణీయులు.

వారితో పాటు సామాన్య సభలలో మాట్లాడిన నేను 2003వ సంవత్సరంలో (1983 – 2003) రెండు దశాబ్దాల తర్వాత స్వామి సన్నిధిలో ఒకటే వేదిక మీద స్వామి సమక్షంలో మాట్లాడే అద్భుతమైన అవకాశం కూడా ఇచ్చారు. వారు మాట్లాడారు నేను మాట్లాడాను. ఇది ఒక మరిచిపోలేని అనుభవం అనుకోండి. అంటే ఒక సామాన్య కార్యకర్తలా నన్ను చెయిపట్టి సత్యసాయి సంస్థలో ప్రవేశపెట్టిన అంజనయ్యతో పాటుగా స్వామి సమక్షంలో నేను మాట్లాడడం అన్నది నేను ఎలా వివరించాలి మీరే ఆలోచించండి.

అలాగే ఉరవకొండలో వారి చిరునామా చాలా చమత్కారంగా ఉంటుంది. డాక్టర్ ఎన్ అంజనయ్య, M.A,Ph.D, టవర్ క్లాక్ దగ్గర, ఉరవకొండ, అనంతపురం జిల్లా, అంటే చాలు ఆయనకి లెటర్ వెళ్లిపోతుంది. అంత విశేషమైన ప్రజాదరణ కలిగి ఉండేది వారికి ఉరవకొండలో.

స్వామి యొక్క పుట్టు పండుగ అంగరంగ వైభవంగా సుమారు ఏడు రోజుల పాటు సప్తాహం నిర్వహించడం వారి భక్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. చివరి రోజు రథోత్సవం చేస్తారు. ఆయన ఏం చేసినా, స్వామి మీద భక్తి, ఉత్సాహము, అంకిత భావం కనిపిస్తుంది. ఒక లీడర్ అంటే ఇట్లా ఉండాలి. "సేవకుడు కానివాడు నాయకుడు కాలేడు, కింకరుడు కానివాడు శంకరుడు కాలేడు" అని చెప్పడానికి వారు నిలువెత్తు నిదర్శనం.

అత్యంత సామాన్య కార్యకర్తలా ప్రవేశించారు, అసమాన్యమైన కార్య నిర్వాహకుడిగా మారిపోయినారు డాక్టర్ అంజనయ్య. తర్వాత కాలంలో స్వామివారు 'మానస బజరే గురుచరణం' అని చెప్పిన ఉరవకొండ స్థలాన్ని, క్షేత్రముగా, పుణ్యక్షేత్రముగా చేయాలని శ్రీ బాలసాయి శిలా మందిరం (అక్కడ శిల మీద స్వామి కూర్చున్నారు కదా! ఆ శిలకు మందిరం) నిర్మాణానికి పూనుకున్నారు. స్వామి వారు స్వయంగా ఈ మందిరం ఫలకాన్ని ఆవిష్కరించారు.

అంజనయ్య గారు అద్భుతమైన ప్రేరణ సత్యసాయి సంస్థలకి ఇచ్చారు. ఇలాంటి మహనీయుని నాకు అండదండగా నిలిపిన మన అందరి దేవుడు శ్రీ సత్య సాయికి ఆజన్మాంతం ఋణ పడి ఉంటాను. సాయి నాథుని అడుగుజాడల్లో నేను ముందుకు నడిచేందుకు చేయూతనిచ్చిన డాక్టర్ నలబాల అంజనయ్య గారు సదా నాకు ప్రాతఃస్మరణీయులు.

22

మధురమైన హితుడు మధుసూదనరావు

స్వామి బాటలో నా పయనం సాగుతున్న సమయంలో, ఎంతో మంది సాయి బంధువులతో పని చేసే భాగ్యాన్ని స్వామి ప్రసాదించారు. ఈ కష్టమైన సామాజిక సేవలు చేస్తున్నప్పుడు నాలో ఇష్టమైన ప్రవర్తనను ప్రవృత్తిని ప్రసాదించిన వాళ్లు చాలా మంది ఉన్నారు. వారందరిని కూడా స్వామి అనుగ్రహ చిహ్నాలుగా భావిస్తాను. ఈ సందర్భంగా మరొక సాయి ఆత్మ బంధువు గురించి మీతో పంచుకుంటున్నాను

ఈ మనిషి పుట్టుకతోనే, తల్లిదండ్రుల పుణ్యఫలం వలన స్వామి భక్తుడు అయ్యాడు. చాలా అద్భుతమైన చదువరి. విశేషమైన ప్రతిభతో, ఆకాంక్షలతో, ప్రేరణతో నిండిన యువకుడు, అన్నిటికి మించి శ్రీ సత్యసాయి బాలవికాస్ విద్యార్థి.

B.Sc. చదివిన తరువాత యుక్త వయసులోనే LICలో ఉద్యోగం సంపాదించి, మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకొని హిందూపురంలో స్థిర పడ్డాడు. చిన్న నాటి నుండి తను విడువకుండా ఉండిన మార్గం ఏదైనా ఉంది అంటే, అది సత్య సాయి మార్గము అని చెప్పక తప్పదు. ఎంత అచంచలమైన విశ్వాసం అంటే తనకు మూడు ఏళ్లకు ప్రమోషన్ వస్తే, వెళ్లాలా వద్దా అన్న ఆలోచనతో, స్వామి సన్నిధిలో బాలవికాస్ విద్యార్థులతో ఏదో సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శన చెయ్యడానికి అవకాశం వస్తె, స్వామికి విన్నవించుకున్నారు. స్వామి! "నీవున్న చోటనే సేవ చేసుకో బంగారు" అని సెలవిచ్చారు. అంతే గత మూడు దశాబ్దాల కాలం పాటు, అదే ప్రదేశంలో, ప్రమోషన్ కూడా తీసుకోకుండా, బదిలీ కూడా ఒప్పుకోకుండా, పదోన్నతులు కోల్పోయి తను చేస్తున్న క్లెరికల్ ఉద్యోగమే చేస్తూ, జీతానికి ఆశించకుండా, జీవితానికి ఆశయాన్ని సమకూర్చుకొని, జీవాన్ని సాయికి సంపర్పించుకునే తత్వంతో ముందుకు వెళ్తున్నాడు. ఇది విన్నాక ఎంతో అద్భుతమైన ప్రేరణ కలిగింది. ఈయన పేరు టి. మధుసూదనరావు. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ విద్యా విభాగం సమన్వయకర్తగా ఉన్నారు. చివరి క్షణం దాకా బాలవికాస్ గురువుగానే ఉంటాను అంటారు.

మాట, ఆట, పాట, చేత, సేవ, సృజనాత్మకత, ముద్ర, నృత్యం, అభినయనము, ఏకపాత్రాభినయం, నాట్యము, నాటకము, ఉపన్యాసము, వేదాంతము, నాయకత్వము కలబోసిన ఆధ్యాత్మికత. ఇన్ని అద్భుతమైన విషయాలని ఒక వ్యక్తిలో చూడటము చాలా అరుదు. తదేకమైన తపస్సు తన జీవితం.

శ్రీమతి లక్ష్మీ రావు కూడా LICలో ఉద్యోగము చేస్తుంది. తనని సైతం బాలవికాస్ గురువుగా మార్చి కార్యక్రమాలు చేస్తున్నారు. వాళ్ల పాప, మీరా. ఇప్పుడు డాక్టర్ అయ్యి, పెళ్లి చేసుకొని మంచి కుటుంబంలో అడుగుపెట్టబోతుంది. అబ్బా! వారిని చూస్తే వచ్చే స్ఫూర్తి అంతా ఇంతా కాదు. అరే! బ్రతికితే ఇలా బ్రతకాలి అనిపిస్తుంది. ఎల్లవేళలా, ఏమి చేస్తున్నా, ఎన్ని సమస్యలు, కష్టాలు, నష్టాలు, విమర్శలు, అడ్డంకులు వచ్చినా కదలక, వదలక, కరగక స్వామి పాదాలను విడువక పట్టి నిలిచిన మహానుభావులు చాలా కొందరే ఉన్నారు. అందులో మధుసూదన రావు ఒక్కరని తలచుకుంటాను.

ఎన్నో అద్భుతమైన అనుభవాలు వారికి స్వామి ప్రసాదించారు. స్వామి సమక్షంలో ఎన్నో సార్లు బాలవికాస్ నాటికలు, సంగీత నృత్య రూపకాలు, పాటలు, భజనలు ప్రదర్శించారో చెప్పలేను.

అంతే గాక హిందూపూరం సత్య సాయి సంస్థకి ఆద్యుడుగ నిలచారు. యుక్త వయసులో నాయకత్వ ధోరణి వల్ల హిందూపూరం సత్య సాయి సమితికి కన్వీనర్‌గా సేవలందించారు. 2 దశాబ్దాలుగా సుమారు 100 మంది దిక్కు లేని చిన్నారులను చేరదీసి శ్రీ సత్య సాయి దీనజనోద్ధరణ పథకం కింద వారి ఆలనా పాలనా చూస్తున్నారు హిందూపూరములో.

1987 సంవత్సరంలో నేను మొదటి సంవత్సరం డిగ్రీ చదువున్న సమయంలో RCVS Homeలో ఉచిత వసతి భోజనంతో ఉంటున్న రోజుల్లో, కొత్తగా హాస్టల్‌లో చేరిన మా లాంటి వాళ్లను చాలా ర్యాగింగ్ చేసేవారు. ఆ ర్యాగింగ్ నుండి నన్ను రక్షించిన వ్యక్తిగా మొదటి సారి చూసాను. నాకు తన గురించి తెలియదు. కానీ నేను అప్పటికే చేస్తున్న సేవా కార్యక్రమాల వలన నా గురించి ముందే తెలుసుకొన్నాడు.

ఇక హాస్టల్‌లో చేస్తున్న స్వామి కార్యక్రమాలలో ఎంతో చాతుర్యంతో, చలాకి తనంతో తను నాతో నిలబడ్డాడు. ఎన్నో సందర్భాలలో నాకు పాకెట్ మనీ, వేసుకోవడానికి బట్టలు, తిండి, పుస్తకాలు ఇచ్చేవాడు. ఒక సొంత తమ్ముడిలాగే నన్ను చూకున్నాడు.

సాయి సంస్థలో స్వామిని దగ్గరగా చూడాలి అనేకంటే ముందుగా, మన చుట్టూ ఉన్న ఇలాంటి భక్తులను చూడగలిగితే, పరిశీలించగలిగితే చాల ఉన్నతమైన భావాలు వచ్చి స్వామిని అర్థం చేసుకునే స్థాయి కలుగుతుంది అని నేను నమ్ముతాను.

నాలో ఈ సేవా భావన ఉండి, నన్ను నేను సేవలో అర్పించుకుంటున్నాను అంటే.. కారణం, మధుసూదనరావు లాంటి వ్యక్తుల వల్లే అని నేను గుండెల పైన చెయ్యి వేసుకొని చెప్తా.

అసలు ఈ రోజుల్లో ఉద్యోగము, వ్యాపారం, ఇల్లు, ప్రమోషన్లు, డబ్బులు, సుఖము, స్థలాలు... ఇలాంటి ధోరణిలో ఉన్న యువతీ యువకులకు ఇలాంటి వారు దారి దీపంలా సమాజంలో నిలబడతారు అని నేను విశ్వసిస్తాను.

ఈ అన్నయ్య నాకు ఇప్పటికీ ఏ సమస్య వచ్చినా, తను ఎన్ని రకాల సేవల్లో ఉన్నా, నాకు ఎప్పటికీ ఒక ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటారు. వారు హిందూపూరములో నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలకు నేను అతిథిగా వెళ్లాను. ఆ చుట్టు ప్రక్క ఊళ్లకు ఎప్పుడూ వెళ్లినా, ఏ కారణం చేత వెళ్లినా వాళ్ల ఇంట్లోనే నన్ను స్వాగతించి, సొంత సోదరునిలా ఆశ్రయ మిచ్చి ఆదరిస్తారు.

ఒక సంధ్యా వందనం, జ్యోతి ధ్యానం, సేవ, బాలవికాస్ తీసుకోవడం, పూజ ఏదైనా అనుకోండి ఒక వ్యక్తి తలచుకుంటే... సమాజానికి ఏమి చెయ్యగలరో మా మధుసూదనరావుని చూస్తే అర్థం అవుతుంది. నాకు ముప్పై మంది తోబుట్టవులు ఉన్నా, సాయి సంస్థలో ఎంతో మంది తోబుట్టువులను ప్రసాదించిన స్వామికి సదా రుణపడి ఉంటాను.

అన్ని వదిలేసి, సన్యాసిలాగ మారిపోయి కేవలం సేవ చెయ్యడం గొప్ప సంగతి కానే కాదు. సంసారం, భార్య పిల్లలూ, ఇల్లు వాకిలి, ఉద్యోగము సద్యోగము ఇవన్నీ పెట్టుకొని సాయి సంస్థలో సేవ దృక్పథముతో ఉండడము అనేది చాల అద్భుతమైన అరుదైన విషయం. ఇలాంటి వాళ్లే సాయి సంస్థలో దిశా నిర్దేశము చేయగలిగిన నాయకులుగా ఉండాలి.

ఈ రోజు వాళ్ల తల్లి దండ్రులు 80 సంవత్సరాలుపైబడి ఉన్నా సరే, కదలలేని స్థితిలో ఉన్నా సరే, ఉన్నా పోయినా స్వామి సన్నిధిలోనే ఉండి గోకులంలో సేవ చేసుకుంటామన్న వారి ఆలోచన దృక్పథం, తపన, విశ్వాసం చుస్తే కాస్తా సిగ్గుగా ఉంటుంది. వాళ్ల నాన్న గారు వెటర్నరీ డాక్టర్. తల్లి దండ్రులు ఇలా ఉంటే... పిల్లలు ఎలా ఉంటారు చెప్పండి.

స్వామి సమాజానికి ఇచ్చిన వరాలు వీళ్లందరూ కూడా. వారిని వాళ్ల కుటుంబాన్ని ఇవాళ తలచుకుంటూ ఈ వ్యాసంలో వారి గురించి చెప్పడానికి అవకాశం తీసుకుంటున్నాను.

మన దగ్గర ఎంత చదువు, జీతము ఉన్నా ఇవేమీ స్వామికి అవసరం లేదు, ఎంత ఉన్నా, ఏమి ఉన్నా స్వామిని వదలక, స్వామి నుంచి కదలక మనము నిలబడితే అప్పుడు స్వామి సంతోషిస్తారు మన జీవితము జీవము చూసి.

23

అందరి వాడు... అనిల్ కుమార్!

సమస్త సాయి సంస్థల సభ్యులందరికీ ఎప్పుడూ ఒక ప్రశ్న ఉంటుంది: నాయకుడు అంటే ఎవరు? ప్రజలతో మమేకమై, స్వామి మార్గంలో మనందరికీ దారిచూపుతూ, అద్భుతంగా, ఉదారంగా, ఆకర్షణీయంగా ఉండే నాయకుడు ఎవరైనా ఉన్నారా? ఉంటే ఆ నాయకుడు ఎలా ఉండాలి అన్నది, గత నాలుగు దశాబ్దాలుగా నా జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తిలో నేను అన్వేషిస్తూ వస్తున్నాను.

బాబా వారి దివ్య అనుగ్రహం చేత అద్భుతమైన నాయకులని నేను చూసే అవకాశం అదృష్టము కలిగింది. నిజానికి జీవితంలో నేను ఎవరికైనా ఋణపడి ఉన్నాను అంటే నన్ను చేయిపట్టి నడిపించిన కొద్దిమంది నాయకుల గురించి చెప్పుకోవాలి.

గత నలభై సంవత్సరాల నా జీవితంలో దివ్యమయిన మార్పు తీసుకువచ్చిన నాయకుడి గురించి చెప్తాను. ఈ వ్యక్తి ఆంధ్ర రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థలో ఉన్న సమయంలో అనుకుంటా. 1982లో మొట్టమొదటి సారి మే 6, ఈశ్వరమ్మ వర్ధంతి మహోత్సవాలు జరుగుతున్న సందర్భంలో తాడిపత్రి పట్టణానికి ముఖ్య అతిథి విచ్చేశారు. వారి యొక్క స్వరూపం, వారి యొక్క చాతుర్యం, చమత్కారం వారి యొక్క వేషము, భాష, విగ్రహం, సుజ్ఞానము, అన్ని కూడా నన్ను చాలా ఆశ్చర్యచకితున్ని చేశాయంటే సందేహమూ లేదు. అసలు ఏందబ్బా ఇంతటి విద్యావేత్త ఇలా మాట్లాడుతున్నారు. అబ్బ! అబ్బ! స్వామిని అసలు కనులతో చూడక మునుపే, ఈ వ్యక్తి స్వామిని పరిచయం చేశారు. ఈ వ్యక్తే ఇలా ఉంటే స్వామి ఎలా ఉంటారో అన్న అవ్యక్తమైన అనుభూతి కలిగింది. ఆ నాటినుండి నేటిదాకా, నాలుగు దశాబ్దాలుగా నేను గురుతుల్యులుగా భావిస్తున్న ఈ వ్యక్తి. అందరికి తెలుసు, అతి సామాన్య కార్యకర్తలా జీవితం మొదలుపెట్టి, ఒక మధ్య తరగతి కుటుంబీకుడిగా సంసారం సాగిస్తూ, గుంటూరు ఏసీ కాలేజీలో అధ్యాపక వృత్తిలో ఉంటూ, తీరిక సమయాన్ని సత్య సాయి సంస్థకు సమర్పణ చేసిన మహానుభావుడు ప్రొఫెసర్ కామరాజు అనిల్

కుమార్. వీరు సత్యసాయి సంస్థకి ఒక ఆయువు పట్టుగా నిలిచారు. యావత్ ఆంధ్ర రాష్ట్రాన్ని పర్యటన చేసి, సత్యసాయి సిద్ధాంత వ్యాప్తికి తానొక శంఖారావమై నిలిచాడు.

బాబా వారి మానవతా విలువలకి నిలువెత్తు నిదర్శనముగా సత్యసాయి సంస్థలకి దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడే విధానం ఒక అద్భుతం. ఆయనకు ఉన్న విజ్ఞానం చాలా ఆశ్చర్యం. జనాలతో కలిసి మెలిసి వెళ్లేది వారితత్వం, వారి యొక్క అందం చందం అంత కూడా ఒక ఆకర్షణీయ నాయకత్వాన్ని సత్యసాయి సంస్థకి పరిచయం చేసింది. జీవితంలో కనీసం అంటే 8 మంది రాష్ట్ర అధ్యక్షులను చూశాను. బి.వి. రమణ రావు, అనిల్ కుమార్, డాక్టర్ నర్సింగ రావు, డాక్టర్ యన్ అంజనయ్య, ఎస్ జి చలం, అలాగే తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు కానీ వీళ్లందరిలో కంటే కూడా ఆకర్షణీయ నాయకత్వం ప్రొఫెసర్ అనిల్ కుమార్‌ది అని చెప్పాలి.

అసలు మనుషులతో ఎలా కలిసిపోతారు? సంస్థలో ఉన్న అతి సామాన్య కార్యకర్తకు కూడా ఎంత అందుబాటులో ఉంటారో, ఎంత అనర్గళంగా ఉపన్యాసం చేస్తారో, స్వామి అంటే ఎంత భక్తి, ఎంత ప్రపత్తి, అచంచలమైన విశ్వాసం ఉందో వారిని చూస్తే ఎవరికైనా తెలుస్తుంది.

ఆయన ఆల్ ఇండియా ప్రెసిడెంట్ అవ్వాలి. కానీ మరి స్వామి సంకల్పము. ఆయన వారిని హత్తుకున్నారు. ఫిజికల్ ఫ్రేమ్‌లో ఆలోచిస్తే స్వామికి అంతరంగీకులుగా మారిపోయారు.

ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అనిల్ కుమార్ గారు తదనంతర కాలంలో స్వామి వారి బృందావనం క్యాంపస్ బెంగళూరుకు ప్రధానాచార్యులుగా వెళ్లడం, అక్కడి నుండి ప్రశాంతి నిలయం క్యాంపస్‌కి రావడం, ఆ ప్రక్రియలో స్వామికి అధికార ప్రతినిధి (Official Spokes Person of Swamy) అవ్వటం, స్వామివారి సమక్షంలో స్వామివారి నీడలా ఉంటూ, స్వామి వారి యొక్క తెలుగు సందేశాలను తెలుగు దివ్యోపన్యాసాలను... ఆంగ్లంలోకి తర్జుమా చేసే దివ్య అనువాదకుడిగా (Divine Translator) మనందరికీ సుపరిచితం.

వీరు సుమారు 82 సంవత్సరాలు జీవించారు. ప్రశాంతి నిలయంలో 2024లో స్వామిని చేరుకున్నారు. కానీ నాలాంటి చాలా మంది హృదయాలలో పట్టిన రష్టుని, బెస్టుగా తొలగించిన వీరికి... రెస్ట్ అనేది ఏమి లేదు అని అనుకుంటాను. ఆయన రిటైర్డ్ ఐనా, ఆయన శేష జీవితాన్ని విశేషంగా గడిపారు.

ఆ కంఠంలో ప్రాణమున్నంత వరకు స్వామి వాణిని దశదిశలా, దిశదిశలా, యావత్ ప్రపంచ దేశాలలో కూడా అద్భుతమైన ప్రసంగాలతో జనసామాన్యాన్ని, కొన్ని లక్షల మందిని ప్రశాంతి నిలయం వైపు ప్రయాణం చేసే అద్భుతమైన ప్రేరణ కలిగించారు అనిల్ కుమార్ గారు.

వారిలో ఎంత ఆత్మీయత అంటే... బతికితే ఈ విధమైన జీవితం గడపాలి. నోరెత్తితే స్వామి వేదాంతం, జీవితంలో మానవతా విలువల ఆచరణ, సేవ అంటే ఉరికి ఉరికి వెళ్లే తత్వం, నాకు తెలిసినంత వరకు నేను చూసినంత వరకు దాక, ఇలా సుడిగాలి పర్యటనలు ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఇంతదాకా చేయలేదు అని చెప్పాలి. ఆయన ఎద్దుల బండ్లలో వెళ్లిన సందర్భాలున్నాయి, స్కూటర్లలో వెళ్లిన సందర్భాలున్నాయి, బస్సులో ప్రయాణించిన సందర్భాలు ఉన్నాయి, షిప్పుల్లో వెళ్లిన సందర్భాలున్నాయి, ప్లెయిన్‌లో వెళ్లిన సందర్భాలున్నాయి.

అంతర్జాతీయ సమాజాన్ని, స్వామి సందేశంతో వారి వాక్చాతుర్యం చేత ఓలలాడించిన మహానుభావుడు ప్రొఫెసర్ అనిల్ కుమార్. వారు నిజంగా సత్యసాయి సంస్థకి ఒక వరం. వారు ఇప్పుడు మన మధ్యలో లేకపోవచ్చు. కానీ సంస్థలో ఎవరైనా ఈ రోజు చక్కగా పని చేస్తున్నారు

అంటే, అచంచల విశ్వాసంతో స్వామి పాదాలకు దగ్గరయ్యారు అంటే, సమాజంలో సాయి సైనికుడిగా బతుకుతు న్నారంటే... క్రెడిట్స్ అన్నీ కామరాజు అనిల్ కుమార్ వంటి నాయకులకు వెళ్లాలి.

వారి యొక్క చమత్కారం, చాతుర్యం, ఆధ్యాత్మిక చింతన, వేదాంత ధోరణి... ఇవన్ని కూడా ఒక విశిష్టమైన నాయకుడు ఎట్లా ఉండాలి అని మనకు కనిపిస్తుంది తెలుపుతుంది.

ఎన్ని పుస్తకాలు వ్రాశారో! ఇంగ్లీష్ తెలుగులో చాలా పుస్తకాలు వారు వ్రాయడం జరిగింది. ఇవన్నీ కూడా తలుచుకుంటే రాష్ట్రానికి ఎలాంటి నాయకుడు కావాలి అంటే? ఇదిగో ఇలాంటి నాయకుడు అవ్వాలనిపిస్తుంది. He looks like a celebrity, Nothing less than celebrity

వారిని చూస్తే పాదాలకు నమస్కారం చేయాలన్న గౌరవ భావన, వారి మాటలు వింటే చాలు జీవితానికి, వారితో మాట్లాడితే చాలు, మన హృదయం తీర్థయాత్రగా మారిపోతుంది అన్న ఆలోచన కలగకుండా ఉండదు. స్వామితో వారి అనుభవాలని పుంఖానుపుంఖాలుగా మనం చెప్పుకోవచ్చు.

కానీ వీరినుంచి నా జీవితంలో, నేను నేర్చుకున్న విషయాలు ఏమిటి అంటే... ఒకటి శుభ్రత అనేది నేర్చుకున్నాను. తర్వాత, డ్రెస్ అడ్రెస్సు రెండు బాగుండాలి అని తెలుసుకున్న. కేవలం వాచా వేదాంతం కాదు, ఆచరణ వేదాంతం ఉండాలి నాయకులకి అని తెలుసుకున్నాను. వారికి సాహిత్యాభిలాష, కేవలం సత్యసాయిబాబా చరిత్రను డౌన్లోడ్ ఎప్పుడు చేయరు... కానీ ఆయన మాట్లాడే దానిలో సర్వతోముఖమైన విషయాలు అభిప్రాయాలు, అనుభవాలు, అనుభూతులు, కోట్స్, రెఫరెన్సులు మనకు కనిపిస్తాయి. అంటే ఒక మనిషి ఒక సిద్ధాంతాన్ని ప్రవచించాలి అంటే... మిగితా విషయాలన్నీ కూడా తెలిసుండాలి. అప్పుడే ఇది రైట్, ఇది గొప్ప, ఇది పెద్ద, ఇది మంచి, ఇది చెడ్డ, అని చెప్పగలిగే స్థాయిలో సామర్థ్యం వస్తుందని నమ్ముతున్నాను. స్వామితో ఉన్న సాన్నిధ్యం, సామీప్యం ఇదంతా కూడా భక్తులకు చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

స్వామితో కూడా జోకులేసే సామీప్యము, నియర్నెస్, డియర్ నెస్ అని తెలుసుకుంటాం వీరిని చూస్తే. అలాగే అచంచలమైన విశ్వాసం, ఎంత విశ్వాస అంటే వారి చివర క్షణంలో కూడా స్వామి సమక్షంలో నిలవాలి, స్వామి సమక్షంలో మాట్లాడాలి, స్వామి కార్యంలో పాల్గొనాలి, 80 సంవత్సరాలు జీవించినా, ప్రయాణాలకు భారంగా ఉన్నా కానీ అవకాశం వచ్చినప్పుడల్లా ఎన్నో మాధ్యమాల ద్వారా వారు జనంతో భక్తులతో మమేకం అయ్యింది మనం ఎరుగుదుము. అంటే అంత విశ్వాసంతో స్వామి కార్యంలో జీవించారు.

ఇలాంటి వాళ్లని నేను గురువుగా తీసుకున్న జీవితంలో! ఆయన ఎంతోమందిని ప్రభావితం చేశారు. నా జీవితంలో ఇదిగో సత్యసాయిబాబా అని వేలుపెట్టి చూపించిన వాళ్లు ఇలాంటి మహానుభావులు. నేను సర్వదా శతదా, సహస్రదా క్షణక్షణం అనుక్షణం అహరహం తలచుకునే ప్రాత స్మరణీయులలో అనిల్ కుమార్ ఒకరు. ఒక నాయకుడు అంటే ఇదిగో ఇలాగే ఉండాలి అనిపిస్తుంది వారిని చూస్తే.

అతని తేజస్సు, అతని గ్లామర్, అతని శైలికి సాటిరాగల నాయకుడిని నేను మరెక్కడా చూడలేదు, కేవలం ఆంధ్ర రాష్ట్రానికే కాదు, తెలుగు రాష్ట్రాలకే కాదు, యావత్ భారతదేశానికే కాదు విశ్వవ్యాప్తంగా ఉన్న సత్యసాయి సేవాసంస్థల అందరూ కూడా ఆణిముత్యంగా తలచేవారు అనిల్ కుమార్. అలాంటి అనిల్ కుమార్ గారి తలుచుకుంటూ వారి నుంచి నేర్చుకున్న పాఠాలని స్వామి సన్నిధిలో సమర్పిస్తున్నాను.

24

No Ration for Decoration!

1985, నేను 15 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు, మొదటిసారి ప్రశాంతి నిలయంలో... అక్కడి ప్రదేశాల అందమును ఇనుముడింప చేస్తున్న అద్భుతమైన అలంకరణలను చూసి ముగ్ధుడినయ్యాను. నన్ను నేను మరచిపోయాను. కన్నులకు విందుగా పనందుగా ఉండేవి అలంకారాలన్నీ. ఏ మూల చూసినా అద్భుతమైన అలంకారములతో ధగధగాయమానంగా వెలిగి పోయే పరిసరాలు కనిపించేవి.

ప్రశాంతి నిలయంలో గోపురాలకు, ప్రహరీలకు రంగు రంగుల విద్యుత్ బల్బులు, ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు... చాలా వినూత్నంగా అనిపించేవి. నాకు చాలా ఆనందం కలిగేది.

నాకు గుర్తు, ప్లాస్టిక్ బిందెలతో... సైకిల్ చక్రాలతో... స్టీల్ బిందెలతో చేసిన స్వాగత ద్వారాలు, కొన్ని చోట్ల మెరిసే కాగితాలతో (డిస్కో బంటింగ్స్ / చెంకీ పేపర్) దండలు అల్లి వాటితో చేసిన స్వాగత ద్వారాలు, దారి పొడుగున వేలాడే తోరణాలు, ఇవన్నీ కూడా ఎంతో చక్కగా బాగా చేసే వాళ్లు. భలే వింతగా అనిపించేవి.

స్వతహాగా నాకు చిన్నప్పటి నుండి అలంకరణ అంటే ఇష్టం! ఇవన్నీ ఎవరు చేస్తున్నారు? ఎప్పుడైనా సరే నేను కూడా నిలయంలో ఇలాంటి సేవల్లో పాల్గొనాలి అని అంత చిన్న వయసులో ఆలోచించినట్లు నాకు గుర్తు.

ప్రశాంత నిలయానికి ఎప్పుడు వెళ్లినా నా దృష్టి అంతా చుట్టూతా చేసిన వివిధ అలంకారముల మీద, వస్తువుల మీద, దండల మీద, రంగు రంగుల తోరణాల మీద పడేది. అరె "ఇది ఎట్లా చేశారు? ఇంకా ఈ విధంగా చేస్తే బాగుండేది" అలా ఆలోచించేవాడిని.

ప్రశాంతి నిలయంలో ఏ మూల ఏం చేస్తే బాగుంటుంది, అని చిత్ర రూపంలో ఒక పుస్తకాన్ని చేయడం నేను మీతో పంచుకున్నాను ఈ పుస్తకంలో మరో చోట.

1985 నుండి 1995 వరకు, అంటే 10 సంవత్సరాల కాలంలో నాకు చాలా విశేషమైన

అలంకార ప్రతిభ చేకూరింది. నాలో సృజనాత్మకత మరింతగా వికసించింది అని చెప్పచ్చు.

నా సృజనాత్మకతను మరియు అలంకరణ మీద నాకున్న భక్తి శ్రద్ధలను గమనించిన అప్పటి సేవాదళ్ సంచాలకులు, ఆత్మీయులు, డాక్టర్ అంజనయ్య గారు, 1989లో ఒక రోజు పిలిచి, అయ్యా! ప్రశాంతి నిలయంలో అలంకార సేవలు కూడా ఉన్నాయి, నేను ఒక వ్యక్తిని పరిచయం చేస్తాను అని, ఒక మనిషిని పరిచయం చేశారు. ఆయన చాలా చాలా సామాన్య మనిషిలా, సాదా సీదాగా ఉన్నారు. బక్కచిక్కిన ఆ మనిషిని చూస్తే, ఈయన అలంకార సేవలకు నాయకత్వం వహిస్తున్నారా? అని ఆశ్చర్యమైంది!

తర్వాత తెలిసింది, ఆయన గోదావరి జిల్లాల నుంచి సుమారు వంద మంది అలంకార సేవకులను సమీకరించి వారికి నాయకత్వం వహిస్తూ, రాజోలు నుంచి ప్రశాంతి నిలయానికి, ప్రతి పండగకి వస్తారని. అత్యంత సౌమ్యంగా, సామాన్యంగా, సేవకులతో పాటు తాను కూడా ఉంటూ దిశ దశ చూపించే వాళ్లని. నిలయంలో వారాల పాటు ఉండాలి అంటే ఆ రోజుల్లో సరి అయిన వ్యవస్థ లేని కారణంగా వాళ్ల ప్రాంతాల నుండి పెద్ద షామియానాలు, పక్క తెరలు, జంబకానాలు, ప్లాస్టిక్ షీట్స్ మొదలైనవి పట్టుకొని, తెచ్చి అవి కట్టుకుని... వాళ్ల సరంజామా, అలంకరణ సామాగ్రి, కుట్టడానికి మిషన్లు పెట్టుకుని... అల్లికలు, కుట్టడాలు, కట్టడాలు, రంగులు వేయడాలు ఇలా అన్ని చేసుకునే వాళ్లు. మొత్తానికి ప్రశాంతి నియంలో ఎవరిని ఏమి అడగకుండా... ఎవరి మీదా ఆధార పడకుండా మనది మనమే చేయాలన్న తపనతో వారంతా రావడం నేను గమనించాను. వారి అచంచలమైన భక్తి విశ్వాసము చాలా హృద్యంగా అనిపించింది.

వారే డాక్టర్ ప్రభాకర్ గారు. తరువాత కాలంలో ప్రభాకర్ గారు నా జీవితంలో మర్చిపోలేని వ్యక్తిగా మారిపోయారు. కారణం సుమారు ఐదేళ్ల పాటు, ప్రశాంతి నిలయంలో జరిగే ప్రతి పండగకు నేను వారి అలంకార బృందంలో ఉన్నాను. వారితో ఉన్న సమయంలో నేను వారిని గమనిస్తూ ఉండే వాడిని. అప్పుడు గుర్తు వచ్చింది 1989లో అనుకుంటా, గుంటూరు నారాయణ రావు గారు స్వామి సన్నిధిలో జ్యోతి ఉత్సవం అంగరంగ వైభవంగా చేశారు. ఆ సమయంలో నిలయంలోకి ఒక పెద్ద నౌకను తీసుకుని వచ్చారు. చిన్న వాన్‌ను చాలా తమాషాగా వెదురు తడికలతో ఒక పెద్ద నౌక లాగా చేశారు. దాని పైన స్వామి సింహాసనం ఏర్పాటు చేసి... ఎక్కడానికి మెట్లు ఏర్పాటు చేశారు. భలే వింతగా అనిపించింది. స్వామి రావడం, ఎక్కడం జరిగింది. అప్పుడు అనంతపురం జిల్లా భజన బృందం వాళ్లను అనిల్ కుమార్ గారు తీసుకుని వెళ్లి ఆ నౌక ముందు కూర్చో బెట్టి... స్వామి సన్నిధిలో 'సాయి రామ నౌక సాగిపోతోంది...'" అన్న పాట పాడించారు. స్వామి సన్నిధిలో పాడిన మొదటి సందర్భం అది. స్వామి నమస్కారం ఇచ్చారు కూడా. ఆ నౌక చేసింది డాక్టర్ ప్రభాకర్ గారే సుమా! వారు చాలా కుతూహలంగా ఉండే వారు అలంకార సేవలలో తనకేమి తెలియదు అన్నట్టుగా, ఎవరైనా ఏదైనా ఆలోచన చెప్తే వెంటనే, ఆహా! అట్లానా... చెయ్యండి చూద్దాం అనేవారు.

నేనేమో, ఏదో చేయడం, ఆయన అది బాగా లేకున్నా, అరే భలే ఉంది! బాలచంద్ర... చాలా బాగుంది! మనం చేద్దాం అని, దాన్ని మెరుగులు దిద్ది, అదేదో నేనే చేసినట్టుగా చూపించేవారు జనానికి.

నాకు గుర్తుంది. అప్పుడప్పుడే నిలయంలో సింహా సర్వ ద్వార బంధనాలను తొలగించి నిర్మాణము చేసిన సుందరమైన వేదికకు ఇరువైపులా నిలబెట్టిన ఎర్ర గ్రానైట్ బండలతో చేసిన స్తంభాలకు డెకరేషన్ చేయాలనే ఆలోచన వచ్చింది నాకు స్థంబాలు ఇంత ఎత్తు ఉన్నాయి. వీటికి ఏం చేయొచ్చు?

అని ఆలోచించే వాడిని.

స్వామి ప్రస్తుతం సమాధి ఉన్న స్థలంలోనే... ఆ రోజుల్లో ఆ రెండు స్తంభాల మధ్యలో స్వామి సింహాసనం మీద కూర్చునే వారు. ఆ సింహాసనము ఇరు ప్రక్కలా ఈ స్తంభాలు రెండూ కూడా వందిమాగధులు లాగా, జయ విజయుల లాగా ఉండేవి. ఆ స్తంభాలకు ఏం చేస్తే బాగుంటుంది అని నిద్రాహారాలు మాని ఆలోచించేవాడిని.

అలా ఆలోచించి, బెంగుళూరులో చిక్ పేట మార్కెట్‌కి వెళ్లి ముత్యాల పూసలు తీసుకొచ్చి, వాటిని సరాలుగా కుట్టి, ఆ స్తంభాల చుట్టూ వేలాడదీసే ఆలోచనను ప్రభాకర్ గారితో పంచుకుంటే వారు చాలా ఆనంద పడ్డారు. ఆ ఆలోచనను మరెన్నో రకాలుగా తీర్చి దిద్దారు.

1995-97 మధ్య కాలంలో ఉన్నవాళ్లకు ఖచ్చితంగా గుర్తుంటుంది. ఆ పిల్లర్స్‌కి వేసిన ముత్యాల సరాలు. పెళ్లి కూతురుకు ఉత్తర భారత దేశంలో తలమీద అలంకరిస్తారు కదా ఎర్రటి దుప్పట్ట, పల్చగా చెమ్కి జలతారు ఉంటుంది. అది ఎక్కడో సంపాదించాను. ఊరికే ముత్యాలు వేస్తే అంత కరెక్ట్‌గా ఉండదేమో, అని ఆ స్తంభాలకి చెమ్కి క్లాత్ చుట్టూతా కట్టి దాని మీద ముత్యాల సరాలు వేలాడ దీసాము. చాలా బాగా వచ్చింది. డాక్టర్ గారు చాలా సంతోష పడ్డారు. ఇక ఏ ఫోటోలో చూసినా ఆ రోజుల్లో స్వామి వారి ఇరు ప్రక్కల ఉన్న స్తంభాలు, వాటి మీద వేసిన ముత్యాల సరాలు కనిపించేవి. ఆ తరవాత కాలంలో నిలయంలో స్తంభాలకు చేసే అలంకారాలకు నేపధ్యం ఇదే అని చెప్పచ్చు.

అప్పటి నుండి ప్రతి పండగకు వేదికను ముత్యాల సరాలతో అలంకరించడం పరిపాటి అయింది. ఇది చాలా చిన్న విషయమే అయినా! కానీ తర్వాత కాలంలో ఆ రెండు స్తంభాలు కూడా అద్భుతమైన అలంకారానికి నోచుకున్నాయి. దేశ విదేశాల భక్తులు ప్రధానంగా వీటిని అలంకరించుకుని మురిసి పోయే వారు. అలా ఆ స్తంభాల మధ్యలో స్వామిని చూసినప్పుడు చెప్పలేనంత ఆనందం అయ్యేది అందరికీ.

అప్పుడప్పుడే, స్వామి వేదిక మీద పై భాగంలో హంసలు, ఏనుగులు ఉన్న అర్ధ చంద్రాకారపు ఆర్చి చేశారు. వాటికి కూడా ఇంటి ద్వారాలకు మనం వేసే తోరణం చేయాలి అని ప్రయత్నం చేశాను. అలా మొదటి తోరణం కళంకారి బట్టతో కుట్టించి వేశాం. ఆ తర్వాత ఆ శాండిలర్స్ పైన స్వామి వేదిక ముందు భాగంలో ఎన్ని రకాల తోరణాలు వచ్చాయో చాలా మంది గమనించి ఉంటారు.

ఇంకొక విషయం ఏంటంటే, స్వామి వారి దర్శన సమయంలో ఒక పెద్ద సర్వధర్మ ఆర్చి తయారు చేయాలి, అది కూడా స్వామి ఎక్కే విధంగా ఉండాలనే సంకల్పం వచ్చింది. బృందం అంతా కలిసి కూర్చొని మాట్లాడి, కొన్ని వేల రూపాయలు ఖర్చు పెట్టి, 10 అడుగులు ఎత్తులో సర్వధర్మ ఆర్చ్‌ను తయారు చేశాము. దాన్ని ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి దశావతార ద్వారంలో పెట్టగలిగాము, మేమందరం దానికి ఇరువైపులా కూర్చుని స్వామి కోసము ఎదురు చూస్తున్నాం. కానీ స్వామి వారు రాకుండా వెళ్లిపోయారు. హతాసులైపోయాము అందరము. అయ్యో స్వామి కరుణించలేదు అని మదనపడుతున్నాము. ఇంతలో స్వామి అంతరంగికుడు రమణరావు గబ గబా వెళ్లి స్వామి! మన వాళ్లు చేశారు ఆర్చ్... డెకరేషన్ టీమ్ అని చెప్పి చూపించారు. అంతే స్వామి వారు ఎంతో దయతో మళ్లీ వెనక్కి వచ్చి, లోపలి నుండి ఆర్చ్ మెట్ల మీదుగా ఎక్కి, బయట మేము ఉన్న వైపు దిగి, ఆ మెట్ల దగ్గర కూర్చున్న మమ్మల్ని అందరిని ఆశీర్వాదం చేసి, చాలా బాగుంది అని చెప్పి, సంతోషంగా వెను తిరిగారు. మీ ఆనందమే నా ఆహారం అంటారు కదా అట్లాగా, మా

ఆనందాన్ని చూసి వారు సంతోషపడ్డారు. ఇది మరొక అద్భుతమైన అలంకార సేవల దివ్యానుభూతి అని చెప్పాలి.

అలాగే ఈరోజు ప్రశాంతి నిలయంలో ఏ పండగ జరిగినా ఒక పెద్ద రెయిన్బో పెడతారు కదా! అందరికీ గుర్తుండొచ్చు. దాని మీద Happy Birthday Swamy, Salutations at the Divine Feet, Happy Guru Purnima అని ఆయా పర్వదినాల విశేషాల గురించి వ్రాస్తూ ఉంటారు. దీనిని బెంగళూరు బృందావనం సాయి రమేష్ హాల్ లోకి కూడా తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. నేను ఈ రైన్బో తయారు చేసిన బృందంలో ఒకడిని అని చెప్పడానికి ఎంతో గర్వంగా ఉంటుంది. అరే ఇందులో నా చెయ్యి కూడా ఉంది అని ఆనందిస్తూ ఉంటాను.

ప్రభాకర్ గారి సేవదళ్ టీంలో టైలర్స్ ఉండేవాళ్లని నాకు గుర్తు. వాళ్లు స్వామి కోసమని "సాయిరామ్, సాయిరామ్, సాయిరామ్" అంటూ పొద్దున, రాత్రి బట్టలు కుట్టడం, ముఖమల్ / వెల్వెట్ క్లాత్‌లు కుట్టడం, మరో ప్రక్క మిగతా వాళ్లు థర్మోకోల్ షీట్స్ కట్ చేయడం, దండలు అల్లడం, తోరణాలు కట్టడం, ఒకరికొకరు సాయం చేసుకోవడము ఇలా మొత్తం బృందం అంతా ఒక కుటుంబం లాగా మారి పోయింది. నేను నా మాటలతో, పాటలతో, ఛలోక్తులతో అందరిని నవ్విస్తూ... ఉత్సాహ పరచేవాడిని. అందరూ నన్ను వారి ఆత్మీయుడిలా చూసుకునే వారు.

ఇదంతా ఇప్పుడు నెమరు వేసుకుంటూ ఉంటే... ఆ సమయంలో స్వామికి ఇంతలా చేసుకోగలిగాం కదా అని అనిపిస్తుంది.

అలాగే శివరాత్రి వచ్చిందంటే పూర్ణచంద్ర ఆడిటోరియంలో స్వామి యొక్క సింహాసనం వేసేవారు. వెనకాల పెద్ద తెరలు ఉండేవి. నాకెందుకో అక్కడ చాలా వెలితిగా అనిపించేది. మనం ఏదైనా చేయాలి స్వామికి అనే. ఆ ఆలోచనలో నుంచి పుట్టిందే స్వామికి శివలింగాకార సింహాసనం సంకల్పం! ప్రభాకర్ గారికి కూడా అలాంటి ఆలోచన వచ్చింది. వారి భక్తి ప్రపత్తి అంతా ఇంతా కాదండి. ఆ శివలింగ సింహాసనాన్ని ఒక అద్భుతమైన కళాకృతిగా తీర్చిదిద్దారు. ఇక దాని అందం గురించి నేను వివరించలేను. స్వామి దాంట్లో కూర్చుంటే, ఇక శివుడిలో స్వామి ప్రత్యక్షమైనట్లు ఉండేది. శివరాత్రి రోజు ఎంత అద్భుతంగా ఆ దర్శనం ఉండేది అంటే, ఆ వర్ణనాతీతం! డెకోలెం షీట్‌తో కట్ ఔట్ తయారు చేసి లైట్స్ పెట్టాము. ముందర శివలింగాకారంలో కట్ చేసి, పాణిపట్టం చేసి, శివలింగానికి మరియు పాణి పట్టము మధ్యలో స్వామి సింహాసనం వేసాము.

ఆ శివరాత్రి రోజు, మేము అందరం వేదిక మీద శివలింగ సింహాసనాన్ని అమరుస్తున్నాము. ఎవరి పనులలో వారు మునిగి ఉన్నారు. నేనేమో పూల దండలన్నీ కూడా ఆ పాణిపట్టం మీద జాగ్రత్తగా గ్లాస్ టేప్‌తో అతికిస్తున్నాను. ఏదో సరదాగా మాట్లాడుకుంటూ, ముచ్చట్లు చెప్పుకుంటూ ఉన్నాను. హఠాత్తుగా ఎవరో, నా తల మీద డామ్ అని కొట్టారు. "ఏయ్ దున్నపోతు... ఏమిటిది?" అని ఏమిటి, ఎవరు కొట్టారు అని చూస్తే స్వామి! స్వామి నన్ను తల మీద కొట్టి ఇక్కడ కరెక్ట్‌గా లేదు. "ఏం వేసావు నువ్వు" అని అంటే, లేదు స్వామి టేప్ వేసాను అని అన్నాను. ఏం వేసావ్? సరిగ్గా లేదు అని మళ్లీ అన్నారు. నేను మళ్లీ ఆ సెల్లో టెప్ అంతా వేసి దాన్ని కరెక్ట్‌గా కూర్చుండబెట్టాను. ఇది సభకు ముందర జరిగింది.

20-30 వేల మంది ఉన్న పూర్ణ చంద్ర సభా మంటపంలో, శివరాత్రి పర్వదినము రోజు స్వామి వేదిక మీదకు రావడం, ఇట్లా కుర్చీ జరిపి స్వామివారు కూర్చోవడం ఆలస్యం... స్వామి ఎక్కడైతే కరెక్ట్‌గా లేదని చెప్పారో, ఆ పూలమాల ఎవరో కట్ చేసినట్టుగా టాం అని తెగిపోయి కింద

పడి పోవడం జరిగింది. చాలా ఆశ్చర్యం అయింది. ఏమిటబ్బా ఇట్లా అయింది, స్వామి అంతగా చెప్పారు, నేను ఇంతగా చేసినా పడింది ఏంటి అని.

నాకు అనిపించింది, ఫోటోకి వేసిన మాల కింద పడితే స్వామి అనుగ్రహం అంటాం కదా... మరి నిజంగా స్వామికే చేసిన మాల, నా చేతులతో చేసి వేసిన మాల కింద పడింది అంటే... అది నాపై స్వామి యొక్క అనుగ్రహం ఈ అలంకరణలో అని అనుకున్నాను.

అలాగే మరొక సారి పూర్ణచంద్ర ఆడిటోరియం వేదిక మీద పెద్ద తెరలు ఉన్నాయి కదా! ఆ పైన ఉన్న ఫ్రేమ్స్ ఆధారంగా డెకరేషన్ చేసే ప్రయత్నం చేస్తున్నాం కాస్త పిల్లలుగా ఉన్నవాళ్లు. నేను మరొక ఇద్దరు ముగ్గురు నిచ్చన మీద పని చేస్తున్నాం. ఇద్దరు పట్టుకుంటే ఒకరు ఎక్కండి అని చెప్తే నేనేమో నిచ్చన ఎక్కాను. ఆ నిచ్చెనకు సరిగ్గా వెనక వైపు నుండి స్వామి తెరలు తీసుకుంటూ వస్తారు కదా వెల్వెట్ కర్టెన్స్... వాటిని తీసుకుంటూ అదే సమయంలో స్వామి వచ్చారు. మొత్తం కింద ఉన్న వాళ్లందరూ పులకరించి పోయారు. స్వామి వస్తూనే... "చాలా సంతోషం. ఏం చేస్తున్నారు? ఏంటి ఇదంతా?" అని పరిశీలిస్తూ... అందరినీ చూస్తూ... అందరినీ పిలిచి ప్రసాదం ఇచ్చి పాద నమస్కారం ఇవ్వడం మొదలు పెట్టారు. నేనేమో నిచ్చెన మీదే ఉన్నాను. పై నుంచి దిగాలా వద్దా? దిగితే ఏమవుతుందో? అని భయంతో అలా ఉండిపోయాను. స్వామి అందరికీ ఇచ్చిన తరువాత, పైన ఉన్న నన్ను చూసి 'నువ్వు కూడా రా' అంటే నేను దిగి వచ్చి నమస్కారం చేసుకున్నా, స్వామి ప్రసాదం ఇచ్చారు. ఇది ఇంకొక ఒక విశేషము.

తర్వాత పాద నమస్కారాలు ఎన్ని సార్లు ఇచ్చారో తెలియదు, ప్రసాదాలు ఎన్ని సార్లు ఇచ్చారో తెలియదు, ఒక సమయంలో "డెకరేషన్ టీం స్వామి!" అని అంటే, స్వామి చెప్పారు నవ్వుతూ... No ration for Decoration'. అలంకార ప్రియులు స్వామి... ఆయనకి రేషన్ ఏముంది అంతా డెకరేషన్. ఎంత ప్రీతిగా, ఎంత ప్రేమగా, ఎంత కుతూహలంగా ఈ డెకరేషన్ అంతా చూసేవారో మాకు గుర్తు. ఎందుకు చెప్తున్నాను అంటే, స్వామికి ఏమి కూడా క్యాజువల్ కాదు. హార్ట్ ఫుల్‌గా మనం ఏం చేసినా, అది ఎంత చిన్న విషయమైనా, స్వామి వాత్సల్యముగా చూస్తారు.

అలాగే మీరందరూ కూడా చూసి ఉంటారు. ప్రశాంతి నిలయంలో ఆ చెమ్కీ బంటింగ్స్ కలర్ ఫుల్‌గా రెప రెపలాడుతూ ఉంటాయి. మొదటి సారి చేసినప్పుడు స్వామి వారు అవి చూసి 'ఏమిది ఎట్లా చేశారు?' అని అడిగారు. స్వామి వీటిని మన వాళ్లు చేశారు అని చెప్పారు స్వామితో ఉన్న వాళ్లు. స్వామి ఎంతో ఆనందభరితులయ్యారు వాటిని చూసి. ఆ మెటీరియల్ అంతా కలిసినా కూడా 5000 కాదు. కానీ, స్వామి ఎంతో కుతూహలంతో ఏమిది అని అడిగారంటే... అది కష్ట పడి చేసిన 10 మంది సోదర సోదరి మణులకు ఎంత సంతోషం అయిందో చెప్పలేను. ఇంక అప్పటినుంచి ప్రతి పండగ సందర్భంలో కూడా స్వామి కళ్ల ముందర రెప రెప లాడుతూ ఉండే డిస్కో బంటింగ్ వేస్తున్నారు. అలాగా ప్రశాంతి నిలయంలో చేసిన ప్రతి డెకరేషన్ ఒక అద్భుతమైన జ్ఞాపకంగా తీసుకోగలిగాము.

డా. ప్రభాకర్, పంతులు, సింహాద్రి, ఏశూ, కొండబాబు, సురేష్, రమేష్, రమ, శశి, వెంకటేశ్వర్లు, దొరబాబు, రాజా బాబు, చిన్న, అప్పన్న ఇలా ఎందరో ఆత్మీయులతో చేరి స్వామిని సేవించుకోగలిగినందుకు జన్మ ధన్యం అయిందనుకుంటాను.



25

సాయి సంస్థల రజతోత్సవం – జీవితానికి రజత ప్రాకారం!

ఒక్కోసారి ఆలోచిస్తే స్వామి వారి అనుగ్రహంతో వారి మీద భక్తి విశ్వాసములతో చేసిన ప్రతి సేవా కార్యము కూడా నన్ను ఒక ఉత్తమమైన వ్యక్తిగా తీర్చిదిద్దినట్లుగా అనిపిస్తుంది. జీవితానికి రజత ప్రకాశం చేకూర్చింది అని చెప్పాలి. 1987 నుండి 1990 మధ్య కాలంలో నేను అనంతపురం RCVS Homeలో ఉంటూ శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కాలేజీలో చదువుకున్న ఆ మూడేళ్లు, ప్రతి రోజు సుమారు ఏడు ఎనిమిది గంటల చదువు తప్ప, మిగతా మేల్కొన్న ఎనిమిది గంటలు కూడా స్వామి కార్యంలో మునిగిపోయేవాడిని.

ప్రతి వారాంతరం ప్రశాంతి నిలయం వెళ్లి స్వామిని చూడాలి, భక్తితో భజనలో పాల్గొనాలి అని అనంతపురం నుంచి పుట్టపర్తికి చాలాసార్లు డబ్బు లేకుంటే అప్పు చేసి, ఇంట్లో చెప్పి ఓసారి, ఇంట్లో చెప్పకుండా రెండు సార్లు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అనంతపురం సత్యసాయి సేవా సంస్థలో చాలా చురుకుగా పాల్గొనే వాడిని. నాలో సృజనాత్మకతకు మొగ్గ తొడిగిన ప్రదేశము అనంతపురం అనుకోవాలి. నాగరాజు, లక్ష్మీదేవమ్మ ఇలాంటి మహనీయులు స్వామి చిరకాల భక్తులు సత్యనారాయణ, జ్వలనయ్య, అశ్వర్థ నారాయణ వీళ్లందరూ కూడా స్వామికి ఎంతో సమీపంలో చరించేవారు.

స్వామి 1965లో బాంబేలో మొదటి సారి సత్యసాయి సేవా సంస్థను స్థాపించారు. అనంతపురంలో నేను ఫైనల్ ఇయర్ డిగ్రీ చేసే సమయంలో సాయి సంస్థకు (1965 – 1990) 25 సంవత్సరాలు పూర్తి అయ్యింది అని, ప్రశాంతి నిలయం స్వామి సమక్షంలో 'సత్యసాయి సేవా సంస్థ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్' చేయాలని ప్రకటించారు.

యావత్ రాష్ట్రం నుంచి కొన్ని వేల మంది సాయి సంస్థ సభ్యులు ఎన్నెన్నో కార్యక్రమాలు తీసుకొని స్వామి వారి సమక్షంలో ఉత్సవం చేసుకోవడానికి విచ్చేస్తున్నారని విన్నాను. ఆ సమయంలో చాలా ఉత్సాహంగా నేను ఏం చేయొచ్చు అని ఆలోచించాను. 20 ఏళ్ల వయసులో ఇలా తపించాను.

పెద్దలందరూ సిల్వర్ జూబ్లీ ఉత్సవ నేపథ్యంలో స్వామి వారి సమక్షంలో పద సంచలనము చేపట్టాలని, బాల్ వికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, విచిత్ర వేషాలతో స్వామి ముందు ప్రదర్శన చేపట్టాలని సంకల్పము చేశారు. నా ఆనందానికి అంతే లేకుండా పోయింది. నేను కూడా ఆ పిల్లలతో పిల్లాడిగా కలిసిపోయి బాలవికాస్ పిల్లలకి వీరపాండ్య కట్టబొమ్మన, అల్లూరి సీతారామరాజు ఇలాంటి వేషాలన్నీ కూడా వేసి వాళ్లకి తర్ఫీదు ఇచ్చే ప్రయత్నం చేశాను.

అయితే ఇంకా ఏం చేయొచ్చు అని ఆలోచించినప్పుడు, స్వామి వారి ముందు నిర్వహించే పద సంచలనములో ఒక పెద్ద సర్వ ధర్మ గుర్తు కటౌట్ చేయాలని ఆలోచన వచ్చింది. నన్ను ఎవరూ కూడా ఉత్సాహ పరచలేదు. అలాగని నిరుత్సాహ పరనూలేదు కానీ కావలసిన పట్టుదల మాత్రం స్వామి ఇచ్చారు. ఏదైనా మనం కూడా చేయాలి స్వామికి అని చాలా అమాయకంగా డబ్బులంతా కూడబెట్టి ఒక రెండు ప్లైవుడ్ షీట్స్ తీసుకొచ్చాను.

చాలా కష్టపడి వాటిని ముక్కలుగా చేసి స్వర్వధర్మ సింబల్ లాగా అతికించి ఒక పెద్ద కట్ ఔట్ చేశాను. ఆ సింబల్‌ని రెండు పక్కల రెండు కట్టెలు పెట్టి ఆ ర్యాలీలో, అనంతపురం జిల్లా సంస్థల వాళ్ల ముందు తీసుకుని రావాలి అని చేశాను. ఎవరూ దాన్ని నచ్చలేదు. బస్సు మీద వేసుకొని ఎంతో ఆర్తితో దాన్ని పుట్టపర్తికి తీసుకెళ్లి షెడ్‌లో చేర్చాము ఒక ఐదు ఆరు మంది స్నేహితులందరితో కలిసి.

అప్పుడు నాకు గుర్తు, ప్రశాంతికి వెళ్లిన తర్వాత, అప్పటి ఆంధ్ర రాష్ట్ర సాయి సంస్థల అధ్యక్షులు మిగతా కార్యవర్గ సభ్యులతో షెడ్లలో విడిది చేసిన వేలాది మంది సంస్థ సభ్యులను పలుకరిస్తూ... ర్యాలీ ఎట్లా చేయాలి అని ఆలోచన చేస్తూ... ఏమేమి తీసుకురావాలి అనుకుంటున్నప్పుడు, అందరి దృష్టి ఆ షెడ్‌లో ఒక మూల ఉన్న సర్వ ధర్మ సింబల్ మీద పడింది. సత్యసాయి సేవా సంస్థల ర్యాలీ కాబట్టి ర్యాలీకి మొట్టమొదట ఇదే రావాలి అని నిర్ణయం చేశారు. నాకు చాలా ఆనందం అయింది. స్వామి కోసం చేయాలి అనే తపనతో చేసిన ఆ చెక్క కటౌట్‌ను ఇద్దరు సేవాదళ్ కార్యకర్తలు భుజాల మీద మోసి, ఆ మొత్తం ర్యాలీకి ముందర తీసుకుని వచ్చారు.

అలాగే పద సంచలానికి ముందుగా నాలుగు బైక్‌ల మీద 8 మంది సేవాదళ్ సబ్యులు ఎస్కార్ట్ చేస్తూ నిలయంలోకి ప్రవేశించడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. స్వామికి ఎస్కార్ట్ బైకులు చాలా ఇష్టంగా ఉండేది. అప్పటి దాకా ప్రశాంతి నిలయం బయట రోడ్డు మీద స్వామి కారు ముందర బైకులు వెళ్లే సందర్భం చూశాము కానీ, ఇప్పుడు స్వామి కూర్చున్న చోట ప్రశాంతి మందిరంలో నుంచి ఈ బుల్లెట్ బండ్లు గడ గడ శబ్దం చేస్తూ తీసుకొచ్చినారు. ఇక వాళ్లకు ఏక రూప వస్త్రాలు తయారు చేసి, వాటి వెనకా ముందు స్వామి సింబల్స్‌ను అతికించగలిగే సౌభాగ్యం కలిగింది. ఎంతో మంది స్వామి మీద భక్తితో తీసుకుని వచ్చిన ఎన్నో అంశాలలో అనంతపురం నుండి నేను అమాయకంగా చేసుకొచ్చిన ఈ అంశాలు ముందు భాగంతో ప్రదర్శించే అవకాశం కలిగింది.

ఇంకా ఆ ఉత్సవాలలో చాలా చాలా విశేషాలు జరిగాయి. గుంటూరు నుంచి నారాయణరావు 'సాయిరామ నౌక' తీసుకొచ్చారు. అంటే ఒక పెద్ద మెటడోర్ వ్యాన్‌కి తడికలతో, వెదురు బొంగులతో తయారు చేసిన పెద్ద పడవ... రంగులు వేసి, ప్రశాంత నిలయంలో స్వామి మందిరం ముందర తెచ్చిపెట్టారు.

భక్తితో చేస్తే, స్వామి ఏదైనా సరే, ఏ చిన్న పనైనా, నాణ్యత ఉన్నా... నాసి రకంగా చేసిన

పనైనా తప్పక మెచ్చుకుంటారు. నారాయణరావు గారు తెచ్చిన నౌక ఆకారము చాలా విశేషంగా ఆకట్టుకుంది జనాల్ని.

మేమంతా ఎక్కడో ఉన్నాం ఎక్కడెక్కడో తిరుగుతున్నాం. ఆ సందర్భంలో మాకు ఒక కబురు వచ్చింది. ఏమని అంటే అనిల్ కుమార్ గుంతకల్ భజన బృందాన్ని వెతుకుతున్నారని. అప్పుడు నేను కూడా గుంతకల్లో ఉండే వాడిని, వెంటనే మా వాళ్లందరిని పిలిచి అందరం కలిసి వెళ్లాం వారి దగ్గరికి... ఏంటి సార్ అంటే, 'స్వామి ఆ సాయిరామ నౌక పైకి ఎక్కుతున్నారయ్యా!' మీరంతా స్వామి సమక్షంలో పాట పాడాలి అంటుంటే... ఆ మాటలు విన్న మా అందరి గుండెలు ఝుల్లు మన్నాయి అంటే నమ్మండి.

ఎప్పుడో ఒకసారి అనిల్ కుమార్ గారు గుంతకల్‌కు వచ్చినప్పుడు, 'ఘంటశాల' వెంకటేశ్వరరావు, మా భజన కన్వీనర్ పాడిన "సాయిరామ నౌక" పాటలో తన్మయత్వంతో మైమర్చిపోయారు.

"సాయి రామ నౌక సాగిపోతోంది, సాయి కృష్ణ నౌక సాగిపోతోంది, అందులో చుక్కాని శ్రీ సాయిరాముడు, నామంబు పలికితే నావ సాగిపోవును, హైలెస్సా లేలో హైలెస్సా" అంటూ సాగే పాట.

అయ్యా ఈ పాట స్వామి ముందర పాడాలి అని అనిల్ కుమార్ గారు చెప్పడం, ఆ అవకాశం ఆ సమయంలో ప్రశాంతిలో యాదృచ్ఛికంగా గుంతకల్ సత్యసాయి సంస్థ సభ్యులకు రావడం, ఆ సభ్యుల బృందంలో నేను ఒకడిగా వెళ్లడం... ఎంత అద్భుతమైన అవకాశమో, చిరస్మరణీయమైన అవకాశం స్వామి ఆ రోజు మాకు ఇచ్చారు. స్వామి మెల్లగా మందహాసముతో, మృదు మధురమైన మాటలతో ఆ మెటడోర్ వ్యాన్ మీదకి చెక్కతో చేసిన మెట్లు ఎక్కి, పైన ఏర్పాటు చేసిన ఛత్రము దాని క్రింద వేసిన సింహాసనంలో స్వామి కూర్చుంటే మేము గొంతెత్తి ఆ 'సాయి రామ నౌక సాగిపోతుంది' అన్న పాట పాడితే స్వామి ఎంతో సంతోషంచి చాలా వాత్సల్యంతో, చాలా దయతో కిందికి దిగి వచ్చి మమ్మల్ని పలకరించి, మా అందరికీ నమస్కారం ఇచ్చి, ఫోటోలు తీసుకుని ఆశీర్వదించారు. అంటే స్వామి సంస్థలో నేను చేరిన దశాబ్ద కాలం తర్వాత ప్రశాంతి నిలయంలో స్వామి సన్నిధిలో గొంతెత్తి పాడే అవకాశం నాకు కలిగింది.

ఇక ఆ మరుసటి రోజు స్వామి ఎంతో దయతో దివ్యోపన్యాసం చేశారు. చివరి రోజు అందరూ తిరుగు ప్రయాణం చేస్తున్నారు. స్వామి ఎంతో దయతో... ప్రధానంగా పిల్లలందరికీ పాద నమస్కార ప్రసాద భాగ్యాలు అనుగ్రహించారు. ఎంతో అచంచలమైన విశ్వాసంతో, భక్తి ప్రపత్తులతో పిల్లలందరూ 'స్వామి... స్వామి... సాయిరాం... సాయిరాం' అంటూ కేరింతలు కొడుతూ స్వామికి ఆకర్షితులై స్వామి మీద పడి పోతున్నారు.

పిల్లలు అందరూ గొడవ చేస్తుంటే... స్వామి వారు నన్ను వారిని అదుపు చేయమని సంజ్ఞ చేయడం జీవితంలో మరచి పోలేను. స్వామి వెనక నేను కూడా వెళుతూ, స్వామికి పక్కన అటు వైపు, ఇటు వైపు పిల్లలు పడకుండా స్వామిని సంరక్షణ చేస్తున్న ఒక దివ్యమైన అవకాశం నాకు కలిగింది. అలాగే స్వామి నా దగ్గరికి రావడం, పాద నమస్కారం ఇవ్వడం జరిగింది. ఇచ్చిన తర్వాత స్వామి వెళ్లిపోతున్నారేమో అని నేను స్వామి పాదాలు పట్టుకొని, స్వామీ! అందరికీ విభూది ప్రసాదం ఇవ్వండి స్వామి అంటే... అన్ని వందల మందికి విభూది ప్రసాదం ఇచ్చి అందరికీ చాలా ఆనందం కలిగించారు.

బాబా వారి సమక్షంలో చూసిన ప్రతి విషయము, నేర్చుకున్న ప్రతి అంశము కూడా నా

జీవితానికి మెరుగులు దిద్దినాయి, నగిషీలు దిద్దినాయి అనడం అతిశయోక్తి కాదు.

చెయ్యి నీకు తెలుసు...

పట్టు నాకు తెలుసు...

ఏదో కావాలని ఆశించావు...

ఇంకేదో సాధించాలని శోధించావు...

నేను ఉన్నానయ్యా నీకు నాతో రా!

ఆ స్వామి మాటలు... సదా గుర్తుంటాయి. ఈ 20, 30 ఏళ్లుగా స్వామి ఏ విధంగా వేలు పట్టి నడిపించారు అని మరీ మరీ నేను తలుచుకుంటూ ఉంటాను. సాయి సంస్థల రజతోత్సవ వేడుకలు నా జీవితానికి, వ్యక్తిత్వానికి, సృజనాత్మకతకు, విశ్వాసానికి, భక్తికి, నాయకత్వానికి ఒక రజత ప్రభగా ఏర్పడింది అని చెప్పడంలో ఎట్టి ఆశ్చర్యం లేదు.



26

విశ్వ విభునికి వినయముతో విద్యార్హతల సమర్పణ

ఇదివరకే చెప్పాను, 1987లో నేను B.Sc.,లో చేరాను. 1990 డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడిని అయ్యాను. అదేదో మహా గొప్ప విజయం అన్నట్టు... స్వామికి చెప్పాలి అనే ఆతురత! ఎందుకంటే స్వామి కాలేజీలో నాకు సీట్ రాలేదు కానీ స్వామి చెప్పారు, ప్రతి కళాశాల నా కళాశాలనే అని. కాబట్టి స్వామికి నేను B.Sc., డిగ్రీలో విజయం సాధించానని, పట్టభద్రుడిని అయ్యానన్న విషయం చెప్పాలని. అనంతపురం నుండి ప్రశాంతి నిలయంకు స్వామి దగ్గరికి వెళ్లాను. చాలా సార్లు వెళ్తూ ఉంటాను కానీ పరీక్ష ఫలితాల తర్వాత మొట్ట మొదటిసారి వెళ్లాను. సాధారణ దర్శన విధానము ఉండేది. అంటే చెట్టు క్రింద వరుసల్లో కూర్చుంటే టోకెన్ ఇచ్చే వాళ్లు. నేను 3 రోజులున్నాను. మొదటి వరుస, రెండో వరుస వచ్చినా, ముందే కూర్చున్నా. స్వామి ఆ వైపు వచ్చేవారు కాదు. ఇక తిరుగు ప్రయాణం చేసే రోజు దర్శనంలో చివరి వరుస వచ్చింది, ఇక ఇదే చివరి దర్శనం, నా ముందు సుమారు 5/6 వరుసల్లో భక్తులు కూర్చున్నారు. స్వామి ముందున్న స్థలంలో ఇసుక మీద వయ్యారంగా నడిచి వచ్చి, మళ్లీ తిరిగి వెళుతున్నారు. ఇక నేను తట్టుకోలేక లేచి నిలబడి అరిచాను 'స్వామి' అని. స్వామి వారు 'ఏమీ' అన్నట్టు చూశారు.

"స్వామి B.Sc., First Classలో పాస్ అయ్యాను స్వామి" అని గట్టిగా అరిచేశాను. "చాలా సంతోషం గుడ్" అని స్వామి చెప్పారు. ఇక నా ఆనందానికి ఉత్సాహానికి అంతే లేకుండా పోయింది స్వామి గుడ్ అన్నారు, అని చెప్పి నేను సంతోషంగా వెనక్కి వచ్చాను. ఇవన్నీ తలుచుకుంటే ఇప్పుడు చాల నవ్వొస్తుంది... చిన్న పిల్లల ఆట ఆడాను స్వామితో అని.

తీరా వెనక్కి వచ్చాక తర్వాత ఏం చేయాలి అన్న ఆలోచన వచ్చింది. M.Sc., చేసి లెక్చరర్ అవ్వాలి అని అనుకున్నాను. కానీ సరిగ్గా B.Sc., Final Exams చివర పరీక్ష రోజే, ప్రశాంతి నిలయంలో PG ప్రవేశ పరీక్ష పెట్టారు. నేను దానికి హాజరు అవ్వలేక పోయాను. అప్పటి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. అంజనయ్యకు విషయం చెప్పి బాధపడుతుంటే... వారు ఎంతో దయతో అప్పటి

సత్య సాయి విశ్వ విద్యాలయం పరీక్షల నిర్వహణ అధికారి అయిన నంజుండయ్యకు ఒక ఉత్తరం వ్రాసి ఇచ్చారు. నా గురించి వ్రాస్తూ... ఈ అబ్బాయి సాయి సంస్థలకు పెద్ద ఆస్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి! స్వామి విద్యా సంస్థకి చేరితే ఇంకా అభివృద్ధి లోకి వస్తాడు అవకాశం ఇవ్వండి అని చెప్పారు. తమ్ముడూ... ఒక సారి వెళ్లి కలువు. నీ చివరి పరీక్ష రోజు వారు ప్రవేశ పరీక్ష పెట్టడం జరిగింది కాబట్టి నీ తప్పులేదు. వారు పెద్ద మనసు చేసుకుని ఏమైనా అవకాశం ఇస్తే సంతోషం అని చెప్పారు. నేను ఎంతో ఆశతో వారి దగ్గరికి వెళ్లి... వారి పాదాలపై పడి ఏడ్చాను. అయ్యా నాకు స్వామి విశ్వ విద్యాలయంలో చదివే అవకాశం ఇవ్వండి అని. కానీ విద్యాలయంలో నియమ నిబంధనలకు అందరూ కూడా లోబడే పని చేయాలి కదా అని వారు సున్నితంగా చెప్పి ఓదార్చి పంపించారు.

స్వామి దగ్గర చదువుకునే అవకాశం చెయ్యి జారింది అని భోరున ఏడ్చాను. ఇక చేసేది ఏమీ లేక, శ్రీ కృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం PG ప్రవేశ పరీక్ష వ్రాస్తే, 28 మార్కులు వచ్చినాయి. కనీసం పాస్ కూడా అవ్వలేదు. ఏం చేయాలో తెలియక ఇంట్లో కూర్చొని తరువాత సంవత్సరం ప్రవేశ పరీక్ష కోసం చదువుకుంటున్నాను.

ఆ సమయానికి మద్రాసు నుండి CA పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్న అన్నయ్య, నారాయణ రంగయ్య నన్ను పలకరించడానికి ఫోన్ చేశారు. 'ఏం చేస్తున్నావ్ రా?' అని అన్నయ్య అడిగితే... నేను మరుసటి సంవత్సరం PG పరీక్ష వ్రాసి, చదువుకుని... లెక్చరర్ అవ్వాలనే ఆలోచన చెప్పాను... ఒక సంవత్సరం అనవసరంగా వృధా అయిపోతుంది రా! అన్నారు.

నువ్వు కూడా CA ఎందుకు చెయ్యకూడదు అని సలహా ఇచ్చారు. అన్నయ్య CA ఎంత కష్టపడి చేశాడు అన్నది తలచుకుంటేనే వణుకు వచ్చేది. కారణం ఆ విద్య ఎంత కష్టమో నాకు తెలుసు కాబట్టి... అదీ గాక నేను సైన్స్ గ్రాడ్యుయేటు కాబట్టి కామర్స్, అకౌంట్స్ విషయ పరిజ్ఞానం నాకు లేదు, అందువలన నేను CA చేయలేను అని చెప్పాను.

అప్పుడు అన్నయ్య, కంపెనీ సెక్రెటరీ చేయి అని చెప్పాడు. అసలు కంపెనీ సెక్రెటరీ అంటే ఏంటో కూడా నిజంగా నాకు తెలియదు అప్పుడు వారు చెప్పారు... ఒరేయ్ కంపెనీ సెక్రెటరీ అంటే చాలా మంచి కోర్సు CA ఎలాగో కంపెనీ సెక్రెటరీ కూడా అలాగా, ఇందులో అకౌంట్స్ కామర్స్ ఇట్లాంటివి తక్కువ ఉంటాయి. న్యాయ సూత్రాలు, చట్టాలు, ఇట్లాంటివన్నీ కూడా ఎక్కువగా ఉంటాయి అన్నారు. అది చేస్తే ఎలా ఉంటుంది... ఎలాంటి అవకాశాలు ఉన్నాయి అని చెప్పారు. అమ్మా నాన్న కూడా దానికి సరే అంటూ, అన్నయ్యతో పాటు మద్రాసుకు వెళ్లొచ్చు, చదువుకోవచ్చు, మంచి అవకాశమే అని చెప్పారు.

నేనేమో... ఉపన్యాసకుడు కావాలని కదా అనుకున్నాను అన్నాను. అప్పుడు అన్నయ్య చెప్పాడు... తమ్ముడూ! నువు ఏ చదువు చదివినా నీకున్న విజ్ఞానముతో తప్పక పది మందికి చెప్పే నైపుణ్యం వస్తుంది. దిగులు పడొద్దు. అవకాశాలను సమయాన్ని కోల్పోవద్దు అని హితవు పలికారు.

కానీ స్వామికి చెప్పాలి, స్వామితో చెప్పి చేయాలి ఏదైనా సరే అని ఒక ఆతృత నాకు. ఆ రోజుల్లో అంత అమాయకమైన భక్తి విశ్వాసము. నేను ఈ రోజుల్లో ఏం చేసేవాడినో తెలియదు కానీ, ఆ రోజుల్లో స్వామి మీద భక్తితో పుట్టపర్తికి వెళ్లిపోయాను. కంపెనీ సెక్రెటరీ దరఖాస్తు చేతిలో పెట్టుకొని, స్వామి... స్వామి... సాయిరామ్... సాయిరామ్! స్వామి చూడాలి... నాతో మాట్లాడాలి అని తహతహలాడుతూ' దర్శనంలో కూర్చున్నాను. కారణం ఏంటంటే స్వామి వద్దు అని చెప్తే నేను

CS చేయకుండా మళ్లీ లెక్చరర్ అయ్యే ప్రయత్నం చేయచ్చు అన్న పిచ్చి.

నా మనసులో వ్యధ బాధ తపన అయ్యో ఏం చేయాలో తెలియదే అని.

ప్రశాంతి నిలయంలో రెండు రోజులు అయింది దర్శనంలో అవకాశం దొరకలేదు. ఇక మూడో రోజు నేను మళ్లీ ఇంటికి వెళ్లిపోవాలి. ఏం చేయాలో తెలియక నాలో నేను మదన పడుతున్నాను.

అప్పుడే ప్రశాంతి నిలయానికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఒక పెద్ద సేవాదళ్ బృందం వచ్చింది. వీళ్లందరూ కూడా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో చాలా సేవలు చేసి స్వామి దర్శనం కోసం తండోపతండాలుగా వచ్చి ప్రశాంతి నిలయంలో స్వామి దర్శనం కోసము ప్రత్యేకంగా కూర్చున్నారు. చిన్న పిల్లాడిని కదా నేను స్వామిని ఎట్లాగైనా చేరాలన్న తపనతో ఉన్నాను.

స్వామి, వాళ్లని మధ్యాహ్నం మందిరంలోకి రమ్మన్నారని అక్కడ ఎవరో సేవాదళ్ చెబితే విన్నాను.

స్వామి దగ్గరికి చేరడానికి... మాట్లాడ డానికి ఇది సరియైన సమయం అనుకొని, వెంటనే వాళ్ల బృందంలోకి వెళ్లిపోయి కూర్చున్నాను. నన్ను ఎవరైనా చూస్తే బయట పడేస్తారేమో... ఎట్లప్పా సాయిరామ్... సాయిరామ్... స్వామి నన్ను క్షమించు... స్వామి, నాకు ఇది జీవన్మరణ సమస్య... స్వామి నువ్వు చెప్పకపోతే నేను ఇంటికి వెళ్లలేను స్వామి... అనుకుంటూ లోలోపల ఆలోచిస్తూ... ఆ మొఖాన్ని కిందకి దించుకుని, ఎవరు చూడకుండా ఆ బృందంలో కలిసిపోయాను.

స్వామి వారు అందరిని మధ్యాహ్నము భజన మందిరంలోకి పిలిచారు, అక్కడున్న వందలాది మంది కూడా వరస క్రమంలో వెళ్లడం మొదలు పెట్టారు, నేనేమో చిట్ట చివరలో కూర్చున్నాను భయం భయంతో... ఆ భజన మందిరం ప్రధాన ద్వారం దగ్గర ఒక తలుపు వేసి ఇంకో తలుపు ముందర స్వామి చెయ్యి అడ్డుగా పెట్టి నిలుచున్నారు. ఓరి నాయనా గుండెకాయ కిందికి జారిపోయింది. దేవుడా నేను ఇప్పుడు ఎట్లా చేసేది? స్వామి నన్ను చూస్తే ఎట్లా అని భయం భయంగా... ఎర్రగా మొఖం చేసుకొని 'స్వామి నువ్వే దిక్కు స్వామి, నన్ను బయటికి పంపించొద్దు స్వామి అని అనుకుంటూ' స్వామి చెయ్యి అడ్డంగా పెడితే... నేను వినయంగా వంగి వెళ్తూ స్వామి నన్ను చూస్తున్నారేమో అని భయంతో మందిరం లోపలికి వెళ్లిపోయా. స్వామి నన్ను చూశారు కానీ ఆపలేదు కారణం ఆయనకు నా వ్యధ తెలుసు కాబట్టి. అమ్మయ్య అని గాలి పీల్చుకున్నాను. మందిరం లోపల వెనక భాగంలో గీత బోధ విగ్రహాలు ఉన్నాయి కదా అక్కడిదాకా సేవాదళ్ వాళ్లు కూర్చున్నారు. నేను అలా వెనక్కి వెళ్లిపోయి చివరలో కూర్చున్నాను.. అందరితో స్వామి చక్కగా మాట్లాడారు, నా మనసు అయితే మనసులో లేదు. తరువాత స్వామి అందరికీ పాద నమస్కారము ఇవ్వడం మొదలు పెట్టారు. సాధారణంగా పాద నమస్కార సమయంలో ఎదురు బదురు కూర్చుంటారు కదా అలా చివరలో నేను కూర్చున్నాను. నేను కూర్చున్న ప్రదేశానికి కూడా స్వామి వచ్చారు. వెంటనే మోకాళ్ల మీద లేచి, స్వామి కంపెనీ సెక్రెటరీ కోర్సు చేస్తున్నాను స్వామి అని దరఖాస్తు చూపిస్తే 'శబాష్... సంతోషం! మంచిది చెయ్యి నాయనా,!!' అని స్వామి అనుగ్రహం చేశారు. స్వామికి ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియలేదు. మనస్సంతా తేలిగ్గా అయ్యి... శరణాగతి భావనతో ఇంటికి వచ్చి, CS కోర్సుకు దరఖాస్తు చేసుకుంటున్నాను అని చెప్పి నేను ఆ కంపెనీ సెక్రెటరీ కోర్సు చేశాను. 1990 నుండి చేస్తే 2001లో అంటే సుమారు 11 ఏళ్లకు పూర్తి చేశాను. దానికి కారణాలు చాలా చాలా ఉన్నాయి కానీ ఎలాగోలా కోర్సు పూర్తి చేయగలిగాను.

ఈ ప్రక్రియలో బెంగళూరులో ఒక ప్రక్క చిన్న ఉద్యోగం చేస్తూ, ఇంకో ప్రక్క సాయంకాలం న్యాయ కళాశాలలో చేరి న్యాయవాద విద్య అభ్యసించాను. ఇది కూడా స్వామికి నేను తెలుపుకున్నాను.

ఈ మధ్య కాలంలో మా అన్నయ్యేమో మరిన్ని సార్లు నేను CA చేస్తే మంచిది అని పట్టు పట్టాడు. కంపెనీ సెక్రెటరీ ఇంటర్మీడియట్ అయిపోయింది కదా ఇప్పుడు CA కూడా చెయ్యి నువ్వు అని అన్నారు. నాకేమో భయం ఇంకా పోలేదు. స్వామి ఓకే అంటే చేస్తాను అని చెప్పి మళ్లీ దరఖాస్తు తీసుకొని పుట్టపర్తికి వెళ్లాను. స్వామి దగ్గర రెండు మూడు రోజులు వేచి ఉన్న తర్వాత... ఒక రోజు దర్శనం మొదటి వరుసలో అవకాశం వచ్చింది. కానీ స్వామి మాత్రం నాకు దూరంగా వెళ్లారు. ఇక లాభం లేదనుకుని స్వామి తిరిగి వెళ్లే సమయంలో కాస్తా మోకాళ్ల మీద నిల్చుని స్వామి CA అప్లికేషన్ అంటూ చూపించాను, స్వామి దయతో నిండిన కళ్లతో నన్ను చూస్తూ "వెయిట్ వెయిట్ వెయిట్" అని చెప్పి ముందుకు వెళ్లి పోయారు. నాకు సందేశం ఇచ్చారు అని అర్థం అయింది. వేచి ఉండు అన్నారు. ముందుకు వెళ్లొద్దు అని చెప్పినట్లు అర్థం చేసుకున్నాను. అదే ఇంట్లో వాళ్లకి చెప్పాను. వాళ్లు కూడా అర్థం చేసుకున్నారు. నాకు ఆ శక్తి సామర్థ్యాలు ఉంటే స్వామి చేయమని చెప్పేవారు కదా? లేవు కాబట్టే వెయిట్ చేయమన్నారు. ఇక CA జోలికి మళ్లీ వెళ్లలేదు.

నిజానికి ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే నా జీవితములో స్వామి చెప్పిన ప్రతి విషయము నాకు ఒక అర్హతను, అర్థాన్ని, పరమార్థాన్ని ప్రసాదించాయి.

నేను ఇప్పుడు సైన్స్ గ్రాడ్యుయేట్ (B.Sc.,) లా గ్రాడ్యుయేట్ (LL.B.,) మరియు ఫెలో మెంబర్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రెటరీస్ ఆఫ్ ఇండియా (FCS) చేసిన వృత్తి నిపుణుడుగా మారిపోయి స్థిరపడ్డాను.

ఒకసారి ఆలోచిస్తే మా నాన్న వాళ్లు, ఆరు మంది అన్నదమ్ములు ఇద్దరు అక్కచెల్లెళ్లలో... నాన్న ఒక్కరే రెండు డిగ్రీలు (BA., BL) చేయగలిగారు. ఇక నా తరంకి వచ్చే సమయానిక మా కుటుంబములో ఉన్న మొత్తం 30 మంది అన్నదమ్ములు అక్కచెల్లెళ్లలో మూడు డిగ్రీలు చేసిన ఏకైక వ్యక్తిగా నేను మిగిలిపోయాను.

ఈ విద్యార్హతలు అన్ని కూడా స్వామి దయతోనే వచ్చాయి. స్వామి చెప్పడం వల్లనే వచ్చాయి. స్వామితో ఉన్న అనుబంధం వల్లనే వచ్చాయి అని నేను నమ్ముతూ ఉన్నాను. ఈ అర్హతలతో జీవితంలో ఎన్నో అద్భుతాలు సాధించ గలిగాను కూడా. విశ్వ విభునికి వినయముతో ఈ నా విద్యార్హతలను సమర్పిస్తున్నాను.

27

అక్కున చేర్చుకున్నది అక్కయ్య

చాలా సందర్భాల్లో నేను విన్నది ఏంటంటే, స్వామి తన భక్తుడిని ఎన్నిక చేసుకునే సమయంలో... భక్తుడు ఎక్కడ పుట్టాలి, ఎలా పుట్టాలి, ఎవరికి పుట్టాలి, ఏ కుటుంబంలో పుట్టాలి ఇవన్నీ కూడా చూసి భక్తున్ని కూర్చి తీర్చిదిద్దుతారు అని చెప్తూ ఉంటే విన్నాను.

స్వామి కార్యంలో నన్ను నేను సమర్పించుకున్న ఈ జీవిత కాలంలో అద్భుతమైన కుటుంబం నా చుట్టూ ఏర్పడింది. ఏర్పడింది కాదు ఏర్పరిచారు బాబా వారు అని చెప్పాలి.

"ప్రేమతో పెంచెడి తల్లిదండ్రులనిచ్చావు,
నాకు తోడు నిలిచెడి అన్నదమ్ములనిచ్చావు,
ఆదరణ చూపేటి అక్కయ్యనిచ్చావు,
అందుకో వందనములు శ్రీ సత్యసాయి"

అని నేను ఎప్పుడు చెప్పుకుంటాను. అమ్మ నాన్న అన్నయ్య తమ్ముడు. మా నలుగురికి తల్లి తర్వాత తల్లి స్థానాన్ని భర్తీ చేసేందుకై వచ్చినట్టు అక్కయ్య మా తోబుట్టువుగా నిలిచింది.

రేవతి మోహన్ చాలా అద్భుతమైన వ్యక్తి. ఆమె నుండి నేను ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నాను. స్వామి కార్యంలో నేను ముందడుగువేస్తున్నాను అంటే ఇదంతా కేవలం వారి చలువ అని అనుకోవాలి. వారు నాపై చూపించిన ప్రేమ, అనురాగము, వాత్సల్యము, శ్రద్ధ ఇవన్నీ కూడా నన్ను తీర్చిదిద్దాయి.

సుమారు 17 ఏళ్ల చిరు ప్రాయంలోనే అక్కయ్యకు పెళ్లి చేశారు. మధ్య తరగతి కుటుంబం నుండి కాస్తా ఉన్నత కుటుంబానికి వెళ్లారు. అత్తగాని అత్త ఇంట్లో సంసారం ప్రారంభించారు. బరువు బాధ్యత నెత్తినేసుకున్నారు. చాలా చిన్న వయసులోనే ఇద్దరి పిల్లలకి తల్లి అయ్యింది. కార్తీక్ & కీర్తి. కానీ ఆవిడకు ఎంత కష్టమున్నా, ఎంత నష్టమున్నా, తన చుట్టూ ఏ పరిస్థితులు ఉన్నా కూడా, మా బంధం మాత్రం ప్రేమ బంధమై, దృఢమై, సుద్రుఢమై కలకాలం నిలిచిపోయింది. ఇంట్లో అందరము అందరితో కొట్లాడిన సందర్భాలు ఉన్నాయి కానీ, మా అమ్మ నాన్న గాని, అన్నదమ్ములు గాని ఎప్పుడు

కూడా అక్కయ్యతో కొట్లాడిన సందర్భం లేదు అని చెప్పుకోవాలి. ఇన్ని ఏళ్ల జీవితంలో అక్కయ్యకి ప్రేమ పంచాము తప్ప, వేరే ఆలోచనలు, మనస్పర్థలు మా మధ్యలో ఎప్పుడూ రాలేదు. కారణం ప్రేమైక మూర్తిగా ఆవిడ మాకు కనిపించేది. మాకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా, కష్టం వచ్చినా... నష్టం వచ్చినా, మొదట సంప్రదించేది మా అక్కయ్యతోనే.

ఆమె సాంగత్యంలో ఉన్న కారణంగా సమాజంలో, ప్రక్కవాడికి ఏ విధంగా ఉపయోగపడాలి, పది మందికి ఏ విధంగా మనము అందుబాటులో ఉండాలి, అవసరంలో ఎలా ఆదుకోవాలి అన్న విషయాలను నేను అక్కయ్య ద్వారా తెలుసుకున్నాను. నా జీవితములో మా అక్కయ్య నన్ను చాలా ప్రభావితం చేసిన వ్యక్తిగా నిలిచిపోయింది. అందుకే!

దేహ సోదరి రేవతి, దైవ సోదరి జ్యోతి,
సమత సోదరి సుజాత, మమత సోదరి సుధ,
పంచమా సోదరిగా షాలినిని ఇచ్చావు...
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

అని చెప్పుకుంటాను. మొదట తలచుకునేది దేహ సోదరి రేవతియే సుమా! ఆమెను అక్కయ్య అని మేము ప్రేమగా పిలుస్తాం. తన నుంచి నేను నేర్చుకున్న అంశాలు, నన్ను ప్రధానంగా ప్రభావితం చేసిన అంశాలు కొన్ని పాఠకులతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

నేను 1996 హైదరాబాద్‌కి రావడం హైదరాబాద్‌లో కంపెనీ సెక్రెటరీ పరీక్షల కోసం సిద్ధం అవుతున్న సందర్భము అది. సత్యసాయి కార్యంలో నన్ను నేను అంకితం చేసుకున్న సమయం. హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత నాలో లోపించిన అంశం ఏమిటి అంటే? చదువు, పరీక్షలు. ఇవి తప్ప మిగతా అన్నింట్లో చాలా చురుకుగా ఉండేవాడిని. పరీక్షలు వస్తే మాత్రం చాలా భయం అయ్యేది. కారణం ఏంటంటే, సందర్భం ఏదైనా... సమయం ఏదైనా... నేను ఎలాంటి పరిస్థితిలో ఉన్నా... నా చుట్టూ ఉన్న అన్నదమ్ములు, సాయి కార్యంలో నన్ను ఒకచోట ఎప్పుడూ కూర్చోనివ్వలేదు అనే చెప్పాలి. నేను పరీక్షలకై పుస్తకాలు తీసుకోవడం... ఒక రెండు రోజులు బాగా నడిచేది. ఇక ఆదివారమో... శనివారమో వచ్చేది, నేను ఉద్యోగానికి రెండు నెలలు సెలవు పెట్టి మరి చదువుకునే వాడిని. ఇక శుక్ర వారం రాత్రి నుంచి గొడవ మొదలవుతుంది. సాయి సోదరులు అందరూ రావడం. "అరేయ్ పదా!! గ్రామ సేవకు వెళ్దాం," ఆ మీటింగ్‌కు వెళ్దాం... ఈ కార్యక్రమానికి వెళ్దాం, అక్కడికి వెళ్దాం, ఇక్కడికి వెళ్దాం అని చెప్పే వాళ్లు. ఎంత వద్దు అనుకున్నా అయ్యో, స్వామి కార్యంలో అవకాశం పోతుంది గిల గిల లాడుతూ, తహ తహలాడుతూ వెళ్లిపోయేవాడిని. అదేదో వ్యసనం లాగా... అంటే సాయి సేవ అనే మత్తులో పడిపోయినట్టు అయిపోయింది. స్వామి మీద భక్తి, సేవ మీద ఆసక్తి వలన ఆ పుస్తకాలు పక్కన పడేయడం. శనివారం ఆదివారం వస్తే రోడ్డు మీదకి వెళ్లిపోయి సేవల్లో పాల్గొనడం. ఇలా జరిగేది.

కొన్ని సందర్భాలలో అయితే నాకు బాగా గుర్తు. ఇంకో వారం... పది రోజులో పరీక్షలు వస్తుంటే, అప్పుడు కూడా సేవకు పోదాం పదా అని సాయి సోదరులు చెప్తే, రాధ పిలుపుతో... దేహాన్ని విడిచి ఆత్మగా వెళ్లి పోయే కృష్ణుడి లాగా వెళ్లిపోయే వాడిని సాయి సోదరులతో.

ఇక నా మంచి కోరే వాళ్లు, కొద్ది మంది అన్నయ్యలు నన్ను కూర్చోబెట్టుకుని, మృదువుగా 'అరే నువ్వు ఇక్కడ ఉంటే! ఇక చదువవురా. నువ్వు ఇంటికి వెళ్లు' అని చెప్తే బెంగళూరుకి వెళ్లే వాడిని. ఒకటీ రెండు నెలలు అక్కడ పరీక్షలకు చదువుకునే వాడిని. అమ్మ నాన్న అన్నయ్య వదిన

పిల్లలు అక్కడ ఇంట్లో ఉండేవాళ్లు. మేడ పైన మంచి గది ఉండేది నా కోసం. ఆ గదిలో కూర్చొని చదువుకునే వాడిని. ఓ రోజు అర్ధరాత్రి నేను చదువుకుంటున్న సమయంలో నీళ్లు త్రాగాలని మెట్ల మీద నుండి దిగి కిందికి వస్తుంటే, క్రింద గదిలో నాన్న మా అమ్మని మందలిస్తూ అంటున్న మాటలు నా చెవిలో పడ్డాయి.

'ఈ వెధవ... పనికిమాలినోడు... ఇలా సంవత్సరాల తరబడీ కంపెనీ సెక్రెటరీ చేస్తున్నాడు. వాడికి సిగ్గు లేదు, బుద్ధి లేదు. వాడిని మనం ఇంట్లోకి రానివ్వడమే తప్పు. ఇదేమైనా లాడ్జి నా?' వాడిష్టం వచ్చినట్లు రావడానికి? ఏమనుకుంటున్నాడు? వాడిని బయటికి పంపించేసేయ్ మొదట,' అని మా అమ్మని అరుస్తున్నాడు.

"వీడు నెలల తరబడి వచ్చి ఉండటానికి ఇదేమైనా సత్రం అనుకున్నాడా, వీడు అక్కడ హైదరాబాద్ రోడ్డు మీద బలాదురుగా తిరుగుతున్నాడు, పరీక్ష పాస్ అయ్యేదాకా వీడికి మనం అసలు ఏమీ ఇవ్వొద్దు, ఏమీ చేయొద్దు", అని నన్ను తిడుతున్నారు.

మా నాన్నగారి కఠినమైన మాటలు విని చాలా బాధపడ్డాను. మరో 24 గంటలలో నా బ్యాగు సర్దుకొని ఇంట్లో చెప్పి హైదరాబాద్‌కి వచ్చేసాను. అమ్మ చాలా ఏడ్చింది. ఆమెకు సర్ది చెప్పి, నేను బయటకు వచ్చేసా.

అప్పుడు మా అక్కయ్య, స్వామి పట్ల నా ఆసక్తిని చూసి నాన్న తొందర పడొద్దు అని మా నాన్నకు ఫోన్ చేశారు. మరో ప్రక్క నాకు ఫోన్ చేసి "మా ఇంటికి వచ్చేయ్ రా, నేను చూసుకుంటాను. చదువుకో, ఏం తొందర లేదు" అని చెప్పింది. నాకు ఇప్పటికీ గుర్తుంది. నాకు స్వామి మీద ఉన్న భక్తిని ఆవిడ ఎప్పుడూ ఏమి తిట్టలేదు, ఏమి అరవలేదు, ఏమి విచారం వ్యక్తం చేయలేదు, కానీ ప్రేమగా వాత్సల్యంగా అక్కున చేర్చుకుంది అక్కయ్య. అక్కున చేర్చుకునేది కాబట్టి అక్కయ్య అన్నారేమో మరి తెలియదు.

అలా తాడిపత్రిలో అక్కయ్య ఇంటికి వెళితే, ఆవిడ తన సొంత గదిని ఖాళీ చేసేసింది. నాకు మాత్రమే విడిగా సౌకర్యం చేసింది. ఉదయం కాఫీ దగ్గర నుంచి, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంకాలం కాఫీ మళ్లీ రాత్రి భోజనం, మధ్యలో పళ్లు పాలు అన్ని నేను కూర్చున్న చోటికే తెచ్చి ఇచ్చేది. నన్ను కూర్చున్న చోటు నుంచి కాలు కింద పెట్టనివ్వలేదండి. తనకి చిన్న పిల్లలు, ఆ పిల్లల్ని కూడా నాకు సహాయం చేయడానికి ఉసిగొలిపేది. ఆమె నాకు చెప్పేది ఒక్కటే... అరేయ్ నువ్వు బాగా చదువుకోవాలి! పరీక్ష పాస్ అవ్వాలి! ఇంతే. అక్కయ్య నాకు ప్రేమని ఇంత పంచుతూ ఉంటే నేను దానికి ఫలితం చూపించాలి కదా అనే ఆలోచనతో నేను పరీక్షల కోసం శ్రద్ధగా చదువుకునే వాడిని. కొన్ని సార్లు తప్పాను... చివరికి విజయం సాధించాను. దీనికి నా ప్రయత్నం కంటే కూడా అక్కయ్య ప్రేమ మాత్రమే కారణం అని చెప్పగలను.

నాకు గుర్తు, నా కోసము అక్కయ్య పూజలు చేసేది, తమ్ముడు బాగుండాలి అని అంటే రక్త సంబంధంతో ఇంత నిస్వార్థంగా ఒకరు ఒకరికి చేయడం అనేటువంటిది చాలా అరుదుగా జరుగుతుంది. ఈ సంఘటనలన్నీ కూడా నన్ను ఏ విధంగా ప్రభావితం చేశామంటే రక్త సంబంధమే లేకుండా ప్రేమించడం ఎలాగా అన్నది నేర్చుకున్నాను. అసలు బంధమే లేకుండా సేవతో ఆ సత్సంబంధాన్ని భగవంతుడితో పెంచుకోవడం, పది మందితో పంచుకోవడం అన్నది చాలా అద్భుతమైన విషయం అని నేను తెలుసుకున్నాను.

నేను అక్కడ ఉన్న ఆ రెండు నెలల్లో అక్కయ్య వద్ద గడిపిన సమయములో, అక్కయ్య పిల్లలకు,

ఆ చుట్టుపక్కల పిల్లలకి, బాలవికాస్ చెప్పడం జరిగేది. ఆ పిల్లలు కూడా నన్ను 'సాయిరామ్ మామ, సాయిరామ్!' అని చెప్పేవాళ్లు. దైనందిన ప్రార్థనలు నేర్పించే వాడిని. ఇక నేను హైదరాబాద్‌కి వెళ్లే సమయంలో ఆ పిల్లలను తీసుకుని వెళ్లి తాడిపత్రి కేంద్రములో ఉండే జ్యోతక్కకు పరిచయం చేసి ఆ పిల్లలు అక్కడ బాల్ వికాస్‌కి వెళ్లే విధంగా చేశాను.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే, కాదేది సేవకు అనర్హము. నన్ను ఇంత సేవించే మా అక్కయ్యకు నేను ఏం చేయగలను అని నేను ఆలోచించాను. అందుకే ఆ పిల్లలకు బాలవికాస్ చెప్పేవాడిని. వాళ్లకు మంచి పాటలు మంచి పద్యాలు నేర్పించేవాడిని. ఒకసారి పిల్లలు స్కూల్లో పాటల పోటీలో పాడాలంటే పాత భజన పాటలు ఎందుకు పాడాలి? కొత్తగా మనం ఎందుకు చేయకూడదు అని చెప్పేసి అప్పటికప్పుడు ఒక పాటను వ్రాసాను. సొంతంగా రాగం కట్టి... వాళ్లకు మధురంగా పాడటం నేర్పించాను.

సీతా మనోభినాయకం
రఘుకులాన్వయ రత్న దీపం
సీతా సీతా సీతా మనోభినాయకం
ఆజానుబాహుం అరవింద దళ నేత్రం
మనసాస్మరామి రామ శిరసా నమామి
సరిగమ... మగరిస... సనిదప... పదనిస
సా... రీ... గా... మా... ర... ఘ... రా... మా...

ఆ పిల్లలు పాటను చక్కగా నేర్చుకుని వెళ్లి పోటీలో పాల్గొని మొదటి బహుమతి తెచ్చుకోవడం, ఇవన్ని కూడా ఎంతో అద్భుతమైన జ్ఞాపకాలు.

చివరిగా నేను హైదరాబాద్‌కు పరీక్షల కోసమై వెళ్లే సమయంలో అక్కయ్య దాచుకున్న డబ్బులు. నేను మళ్లీ డబ్బుల కోసం కష్ట పడకూడదని నాకు ఇచ్చేది. ఆ చిన్న పిల్లలు ఏడుస్తూ, వాళ్ల అమ్మ నాకు డబ్బులు ఇస్తున్నది చూసి, అమ్మా... బాలా మామకు తక్కువ అవుతాయేమో... మామకు మేము కూడా ఇస్తాం అని చెప్పి వాళ్ల హుండీలు పగలగొట్టి "మామ ఇదిగో ఈ డబ్బులు కూడా తీసేసుకో, నీకు ఏం తొందర లేదు మామ, బెస్ట్ లక్! సాయిరామ్! మామ నువ్వు వెళ్లు... పరీక్ష బాగా రాసేయ్ మామ" అని చెప్పేవాళ్లు.

స్వామి కార్యంలో నన్ను నిలబెట్టిన వాళ్లు... వీళ్లందరనీ ప్రాత: స్మరణీయులుగా తలుచుకుంటాను. ఎంతో అద్భుతమైన వ్యక్తిగా నన్ను తీర్చిదిద్దినారు మా అక్కయ్య వారి కుటుంబం అంతా కూడా.

జీవితములో నన్ను ప్రభావితం చేసిన 5 మంది సోదరీమణులను సదా తలుచుకుంటూ వారిని కాపాడాలని స్వామిని కోరుకుంటూ ఉంటాను.

అక్కయ్యకి సుమారు 58 సంవత్సరాలు దాటుతున్నాయి... అందరం పెద్ద వాళ్లుగా మారిపోయాము. కానీ మా మధ్యలో ప్రేమానురాగాలు మాత్రం రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి.

అక్కయ్య ఆ రోజుల్లో నాకు చెప్తే, ఈ రోజుల్లో అక్కయ్యకు నేను చెప్పే అవకాశం కలిగింది. ఏం చేసినా, ఎలా చేసినా... ఈ జీవము, జీవితము, దేహము, ప్రాణము ఉన్నంత దాకా నా సంరక్షణ కోసమై భగవాన్ సత్యసాయి బాబా వారు నాకు ప్రసాదించిన అద్భుతమైన వ్యక్తుల్లో అక్కయ్య ఒకరుగా నేను సదా తలుచుకుంటూనే ఉంటాను మరి.

28

చెన్నై - సేవకు భాష అడ్డం కాదు

అనంతపురంలో డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను స్వామి వారి ఆశీస్సుల వల్ల. ఏం చేయాలో... ఎలా ముందుకు వెళ్లాలో... అన్న ప్రయత్నంలో కంపెనీ సెక్రెటరీ కోర్సు చేయాలనుకోవడం, అన్నయ్య నారాయణ రంగయ్య దానికి ఆద్యుడిగా నిలవడం, ప్రశాంతి నిలయంలో స్వామి వారు స్వయంగా ఆ కంపెనీ సెక్రెటరీ దరఖాస్తు మీద చేయి వేయడం, తప్పక చెయ్యి అని చెప్పడంతో చాలా అద్భుతమైన ఉత్సాహముతో, ముందుకు వెళ్లడం ప్రారంభించాను.

ఎక్కడ ఉండి దీన్ని చేయాలి అనంతపురమా? గుంతకల్లా? అట్లా ఆలోచిస్తున్నప్పుడు, మద్రాసులో అప్పుడప్పుడే CA పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్న అన్నయ్య మాట్లాడారు. ఇంట్లో పెద్ద వారు కావడం వలన, మంచి చదువులు చదవడం వలన, ఇక మా అందరికి అన్నయ్య ప్రతి విషయంలో సలహాలు సూచనలు ఇచ్చేవారు.

కష్టపడి పైకి వచ్చిన కుటుంబము... అందులోనూ ఇంట్లో పెద్ద కొడుకు అన్నయ్య, ఇంట్లో ఆర్థిక పరిస్థితులని అర్థం చేసుకుని, నాన్నకి భారం కాకూడదు, అలాగని చదువు ఆపకూడదు అని, పెద్దవాళ్లు బంధువులు సలహా ఇస్తే, దాన్ని ఆధారంగా చేసుకొని కెనరా బ్యాంకులో ఎడ్యుకేషన్ లోన్ తీసుకొని వారు విజయవంతంగా CA పూర్తి చేశారు. తమిళనాడు రాజధాని మద్రాసులో ఆల్ఫా ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలో ఉద్యోగం చేసేవారు. అన్నయ్య మొదటి నుంచి కూడా ఇంట్లో నాన్న తర్వాత నాన్నగా మా ముందు నిలుచున్నారు. ముందు కూడా, నేను అనంతపురంలో డిగ్రీ చదివే సమయంలో కూడా వారి సంపాదనలో కొంత డబ్బు నాకు పంపే వారు. నా పరీక్ష ఫీజులు, తిండి, బట్ట, ఖర్చు ఆలోచించి, మద్రాసులో నా దగ్గరికి వచ్చేయి అని చెప్పారు. నేను అయోమయానికి గురయ్యాను. అప్పటిదాకా ఆంధ్రదేశంలో తెలుగు వాళ్లతో ఉండి ఇప్పుడు తమిళ భాష రాని మద్రాసుకి వెళ్లాలా అని, కానీ స్వామిని తలచుకుంటూ ఆత్మ విశ్వాసంతో చాలా సంతోషంగా తమిళనాడుకు ప్రయాణం అయ్యాను. వెస్ట్ మాంబలం అనే ప్రాంతంలో అన్నయ్య

కొత్త ఫ్లాట్ అద్దెకి తీసుకున్నారు. అన్నయ్యతో చేరి నేను అక్కడ జీవనం ప్రారంభించాను.

అక్కడ నా దిన చర్య ఏంటంటే, లేవడం ఇంట్లో కాస్త వంట చేయడము, అన్నయ్యతో పాటు నేను తినేయడము, CS ఫౌండేషన్ కోర్సు పూర్తి చేయాలంటే వ్రాయాల్సిన ప్రశ్నా పత్రాలకు సమాధానాలు వ్రాసి, ఉత్తీర్ణత సంపాదించి CS ప్రధాన కోర్సుకు అర్హతను తెచ్చుకోవాలి. ఈ పని అయిన తర్వాత మళ్లీ రాత్రి అన్నయ్య వచ్చేదాకా ఇక వేరే ఏం పని ఉండేది కాదు. ప్రతి క్షణం స్వామిని, స్వామి కార్యాన్ని తలుచుకోవడం అంతే అన్నయ్య అలా ఆఫీస్‌కి వెళ్లడం నేను కాస్త ప్రశ్నలకు సమాధానాలు వ్రాయడం, ఒక రెండు మూడు గంటలు రోడ్డు మీదకి వెళ్లడం, అక్కడ ఎక్కడయిన సత్యసాయి కేంద్రం ఉందా అని వెతికే వాడిని. వెస్ట్ మాంబళంలో సుమారు మా ఇంటి చుట్టూరా నాలుగు ఐదు కిలోమీటర్ల వరకు నడుచుకుంటూ నేను వెతకడం మొదలు పెట్టాను. ఎక్కడ బాబా వారి ఫోటో కనిపిస్తే ఆ ఇంటికి వెళ్లడం సాయిరామ్ చెప్పడం, తెలుగు వాడు అవ్వడం వల్ల తమిళ్ తెలియకపోవడం వల్ల చాలా కమ్యూనికేషన్ గ్యాప్ వచ్చేసింది. అప్పుడు మొదటి సారి నాకు ఇంకో భాష అంటే ఇంగ్లీష్ వచ్చింటే బాగుండు కదా అనిపించింది. నిజానికి తమిళనాడులో ఇంగ్లీష్ వాళ్లకు రాదు, నాకు కూడా రాదు, వాళ్లకు తమిళ్ మాత్రమే వచ్చు నాకు తెలుగు మాత్రమే వచ్చు. కాబట్టి ఈ మూడు భాషల్లో కూడా ప్రాబ్లం అయిపోయిందన్నమాట. ఎలాగో అలాగ చేతి సైగలతో, బట్లర్ ఇంగ్లీష్‌లో మాట్లాడేవాడిని. అలా నేను సౌందర్యరాజన్ అనే మహానుభావుడిని వెస్ట్ మాంబలం చెన్నైలో కలిసాను. యాదృచ్ఛికంగా ఇలాగే వెతుకుతూ వెతుకుతూ ఉంటే అక్కడ ఉన్న వాళ్లు చెప్పారు ఫలానా చోట సత్యసాయి కేంద్రము ఉందని, అలా వారి ఇంటికి వెళ్లాను. స్థానిక సత్యసాయి సంస్థకు వారే కన్వీనర్ అని తెలుసుకున్నాను. వారు ఆరు అడుగుల ఆజానుబాహుడు. నిజంగా పేరుకు తగినట్టు సుందరంగా ఉండేవారు. వారు నన్ను అక్కున చేర్చుకొని చాలా సంతోషించి 'ఓ తెలుగు అబ్బాయి అనంతపురం, స్వామి యొక్క జిల్లా... రండి' అని చెప్పి నన్ను ఉత్సాహ పరచినారు. నాకు గుర్తు భజనలకి వెళ్లేవాడిని. పాటలు చక్కగా గొంతెత్తి పాడేవాడిని. తమిళ వాళ్లందరూ కూడా ఒకసారి ఉలిక్కి పడేటట్టుగా ఉండేవి నా పాటలన్నీ కూడా. వారు కూడా చాలా ఉత్సాహపడేవారు. అక్కడ నేను నేర్చుకున్న పాటల్లో శ్రీ రంగా శ్రీ రంగా రంగ రంగ శ్రీ రంగా 'ఇలా వాళ్లు పాడే పాటలు నేను, నేను పాడే పాటలు వాళ్లు ఉదాహరణకు 'రాజాధిరాజా, రాజ గంభీర, రాజకుమారా రాజ మార్తాండ' అలా అందరూ చక్కగా నేర్చుకుని భజనలో పాడే వాళ్లం. వాళ్లు మాట్లాడే తమిళ భాషను, మాటలని అర్థం చేసుకునే ప్రయత్నం చేసేవాడిని. గురువారం వచ్చినా, ఆదివారం వచ్చినా చక్కగా భజనలకు వెళ్లేవాడిని. ఇక ఆదివారం వస్తే అన్నయ్య నా భక్తి, తాపత్రయ్యాన్ని అర్థం చేసుకొని నాకు తోడుగా మందిరంకి వచ్చేవారు. మొదటి సారి చెన్నైలో సుందరం మందిరాన్ని చూశాను. ఎంతో అద్భుతమైన ప్రేరణ కలిగింది. అబ్బా నిజంగానే సుందరంగా ఉంది. ఆ కమలాకార మధ్యమ భాగం. సాయి కమలాకరుడు ఆ కమలంలోకి వచ్చి దర్శనం ఇస్తారట, నగర సంకీర్తన తరవాత అది జరిగేది.

అక్కడ అంజలీ దేవి ఆదినారాయణ లాంటి మహా భక్తులందరిని కూడా నేను తలుచుకున్నాను. అక్కడ నాకు తెలిసింది ఏంటంటే వాళ్లకు ఉన్న అచంచల విశ్వాసాన్ని ఎవరూ తూచలేరు అనిపిస్తుంది. తమిళనాడులో స్వామి మీద అచంచల భక్తి విశ్వాసములు చూశాను. స్వామి చిరకాల భక్తుల్లో ఎవరు ముందు అడుగు వేసారు అంటే తప్పకుండా తమిళ భక్తులే అగ్రేసరులు అని చెప్పుకోవాలి మనం. కారణం ఈ రోజుకి కూడా ప్రశాంతి నిలయంలో చాలా మంది తమిళ భక్తులు స్థిర

నివాసం ఏర్పరచుకున్నారు. అంతే కాక ఆశ్రమ నిర్వహణ కూడా చేస్తున్నారు. కారణం వారి విశ్వాసము అట్లాంటిది అని చెప్పుకోవాలి. స్వామి తమిళనాడు చెన్నైలో ఎన్నో ప్రదేశాలకు కారు నడుపుకుంటూ కూడా ప్రయాణం చేశారని విన్నాను. ఎన్నో రకాల రవాణా వాహనాలలో ప్రయాణం చేసి చాలా మంది భక్తులను ఆశీర్వదించారు. తమిళనాడులో స్వామి వెళ్లన పాత భక్తుల ఇళ్లు లేవంటే అతిశయోక్తి కాదు. అంత అద్భుతమైన తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై నాలో సాయి చైతన్యాన్ని నింపివేసింది. చెన్నై స్వామి భక్తులతో చేరి సాయి సేవా కార్యంలో పాల్గొనే మహత్తర అవకాశం వచ్చింది. ఆదివారం వచ్చిందంటే మధ్యాహ్నం బాలవికాస్ కేంద్రానికి వెళ్లేవాడిని. అక్కడ భాష వల్ల ఇబ్బంది ఏర్పడింది. తమిళము చిన్న చిన్న పదాలు నేర్చుకున్న. మూడు భాషలు తమిళ్, తెలుగు, ఇంగ్లీష్ కలిపి మాట్లాడేవాడిని. కాదేది సేవకు అనర్హం అంటే... సేవ చేయాలని ఆలోచన ఉంటే ఏ పనైనా మనకు సాధ్యమే! ఉంది ఒక్కటే భాష అది హృదయ భాష! అన్నారు కదా స్వామి. ఇక సాయి కార్యంలో నా చాతుర్యం అంతా కూడా పదును తేలిపోయింది. అంటే ఆ బాలవికాస్‌కి వెళ్లి అక్కడ తరగతులు తీసుకొనే వాడిని. తర్వాత సుందరం భజనలకు వెళ్లేవాడిని, అఖండ భజనకు వెళ్లేవాడిని. ఇలా సుమారు ఒక సంవత్సరం నేను స్వయంగా నా కళ్లతో చూసింది ఏంటంటే తమిళనాడులో సాయి భక్తులు అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

వాళ్ల భక్తి విశ్వాసాలు అచంచలమైనవి. సాంస్కృతిక కార్యక్రమాలలో వాళ్లు అందవేసిన చెయ్యి. నాట్యము, దృశ్యము, శ్రవణము, లైటింగ్, సంగీతము, పాడటం ఇట్లాంటివి అంతా కూడా చాలా ప్రతిభతో చేసేవారు. తర్వాత సుందరం భజన పాటలు అంటే చాలా చెవి కోసుకునే వాడిని. నాకు గుర్తు అక్కడ సుందరంలో ఉన్నప్పుడు ఎప్పుడు వెళితే అప్పుడు అన్నయ్యని అడిగో, లేకపోతే నా దగ్గర పాకెట్ మనితోనో ఏదో ఒకటి చేసి సుందరం భజన్ క్యాసెట్స్ తీసుకునే వాడిని. ఇప్పుడు ఆ క్యాసెట్స్ అన్ని ఒకసారి చూస్తే, తమిళనాడులో 100 పైన నేను కలెక్ట్ చేసిన క్యాసెట్స్ ఉన్నాయి. అంత అద్భుతమైన పాటలు ఈరోజు కూడా వింటూ ఉంటాను. నిజంగా ఆ భజనలు విన సొంపుగా ఉంటాయి. స్వామికి కూడా సుందరం భజన బృందం అంటే ఎంతో ఇష్టం. సాయి సంస్థలలో భజనకు ప్రాణం పోస్తుంది సుందరం భజనలు అంటే తప్పేమీ లేదు అనుకుంటాను. స్వామి కార్యానికి ఎంతో మంది ఆద్యులుగా నిలిచారు. వారిలో సుందరం భజన గ్రూప్ ఒకటి అలాగే అంజలి దేవి, ఆదినారాయణ, రమణి, రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న మోహన్, కృష్ణమూర్తి, మేజర్ జనరల్ మహదేవన్ ఇంకా వేణు శ్రీనివాసన్, వి శ్రీనివాసన్, విద్యా శ్రీనివాసన్, ఇలాంటి వాళ్లని చూస్తే చిరస్మరణీయులు అనిపిస్తుంది కారణం వీళ్లంతా స్వామి కార్యంలో నిలబడినారు.

జనరల్ మహాదేవన్ చెప్పే విశేషాలని అనుభవాలని వినాలి. స్వామి అతనికి బృందావన్ సత్సంగాలలో విరివిగా అవకాశాలు ఇచ్చేవారు. సాయి రమేష్ హాల్‌కి గాని లేదా ప్రశాంత్ నిలయంలో గాని ఎప్పుడో ఒకప్పుడు మహాదేవన్ గారికి మాట్లాడే అవకాశం ఇచ్చేవారు. వారు చెప్పేదంతా వింటుంటే ఎంతో ఉత్సాహం వచ్చేది. అబ్బా ఎట్లాంటి మహామహులు స్వామి కార్యంలో ఉన్నారు. మనం కూడా ఇట్లాగా చేయాలి, ఇలాగ ఉండాలి అని ఒక ప్రేరణ కలిగేది. తెలుగు వాళ్లు ఎప్పుడూ చెప్పుకునే సామెత ఒకటి ఉంది... చెడిపోయి చెన్నపట్టణం పోతారు అని! కానీ నేను మాత్రం నాలో చైతన్యం నింపుకునేందుకు చెన్నపట్నం వెళ్లాను అని చెప్తాను. ఒక పక్క కంపెనీ సెక్రెటరీ ఫౌండేషన్ కోర్సు నేను విజయవంతంగా ముగించి, CS ఇంటర్ లెవెల్‌కు రిజిస్టర్ చేసుకున్నాను. తమిళనాడు చెన్నైలో నన్ను నేను ఇంకాస్త తీర్చి దిద్దుకున్నాను.

29

నా సంరక్షకులు శైలజా నారాయణ

1990-95 దాక సుమారు 5 సంవత్సరాలను నేను చాల పవిత్రంగా భావిస్తున్నాను. కారణం ఏంటంటే నేను ఒక వ్యక్తిగా స్థిరపడటానికి, సాంఘికంగా, సామాజికంగా, శారీరకంగా, కుటుంబ పరంగా, ఆధ్యాత్మికంగా, దైవపరంగా ఎదగడానికి ఈ కాలం కలిసి వచ్చింది... ఈ 5 సంవత్సరాలు నన్ను మంచి వ్యక్తిగా తీర్చిదిద్దిన సమయం. ఎన్నో విశేషాలు ఉన్నాయి. మద్రాసులో నేను కంపెనీ సెక్రెటరీ ఫౌండేషన్ కోర్సు రెండు సార్లు ప్రయత్నించిన తరవాత పాస్ అయ్యాను. అదే ఒక పెద్ద విజయంగా భావించాను. తరచి చూస్తే నేను సాధించింది చాల చిన్న విషయం, ముందుంది ముసళ్ల పండగ అన్నది తెలియక ఆ మాత్రం దానికే జబ్బలు చరుచుకొని నేను గుంతకల్ రావడం. ఆ రోజుల్లో అమ్మ నాన్న తమ్ముడు అక్కడ ఉండేవాళ్లు. నాన్నగారు రాజేంద్ర నగర్లో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని, భారత్ గ్యాస్ ఏజెన్సీలో మేనేజర్‌గా పని చేసేవారు. ఆ సమయంలో నేను ఎక్కడికి వెళ్లినా, ఏమి చేసినా, సమయం ఏదైనా, స్థలం ఏదైనా, గ్రామం ఏదైనా, పరిశ్రమలు ఏదైనా, ఎప్పుడైనా సరే స్వామిని తలుచుకోని సందర్భం లేదంటే నమ్మాలి. చాలా అమాయకంగా రాజేంద్ర నగరం అంతా రోడ్డు రోడ్డు తిరిగేవాడిని. ఎక్కడైనా ఏమైనా భజనలు జరుగుతున్నాయా, ఎక్కడైనా స్వామి ఫోటోలు ఉన్నాయా, ఎక్కడైనా స్వామి మాటలు వినిపిస్తాయా, స్వామి పాటలు వినిపిస్తాయా అని. అలాంటి సందర్భంలో అక్కడ భారతీ టీచర్ పరిచయం అవ్వడం, వారి ఇంట్లో ఇదివరకే అప్పుడప్పుడు భజనలు చేస్తూ ఉంటారని తెలిసింది. వెంటనే అదే అదునుగా ప్రేరణ తీసుకొని, రాజేంద్ర నగర్లో ఇంటింటికి వెళ్లి ఇక్కడ ఫలానా చోట భజన జరుగుతుంది, అందరూ రండి సాయిబాబా భజన, అని చెప్పేసి స్వామి గురించి మాట్లాడుతూ... వాళ్లకి చెప్తూ... రాజేంద్ర నగర్ సత్యసాయి భజన మండలి ఏర్పాటు చేసి, బాల వికాస్ కార్యక్రమాలు, పర్వదినాలు, నగర సంకీర్తనలు, నారాయణ సేవలు, ఇలా ఎన్నో కార్యక్రమాలలో అక్కడ నేను మునిగి తేలాను. ఒక 6-9 నెలలు రాజేంద్ర నగర్‌లో ఉండటం వలన నాతో పాటూ అమ్మ నాన్నలు కూడా చురుకుగా అన్ని సేవలలో

పాల్గొనే వాళ్లు. ఈ విధంగా నా సమయాన్ని పరిపూర్ణంగా అక్కడ సాయి సేవా కార్యక్రమాలలో గడిపే వాడిని.

అలాంటి సందర్భంలో అన్నయ్యకి పెళ్లి కుదిరింది. వదిన పేరు శైలజ, ఆవిడ బైసాని శ్రీనాథ్ గుప్త కూతురు. తుంగభద్ర ప్రాజెక్ట్‌లో వారు చాలా ఉన్నత ఉద్యోగిగా ఉండేవారు. చాలా కలవారి కుటుంబం వారిది. శ్రీనాథ్ గుప్త, రుక్మిణి గుప్త చాలా ప్రేమానురాగాలతో వాళ్ల పిల్లల్ని పెంచి పోషించారు. శైలజ M.Sc., చేశారు. ఆ రోజుల్లోనే ఆమె కళలకు కాణాచి అని చెప్పాలి. చాలా మంచి కర్ణాటిక్ సంగీత విద్వాంసురాలు, గాయనిగా రేడియోలో కూడా పాడేది అక్క నీరజ నాగేంద్రతో. ఆమె మా అన్నయ్య చెయ్యి పట్టుకొని చాలా ఆశలతో... ఆశయాలతో మా కుటుంబంలోకి కోడలిగా వచ్చారు. నిజానికి వాళ్ల యొక్క కుటుంబ నేపథ్యం ముందర మా కుటుంబం చిన్నదే అని చెప్పాలి.

మధ్య తరగతి కుటుంబం మాది. కానీ మా వదిన తండ్రికి మాత్రం మా యొక్క చదువు, సంస్కారము, నేపథ్యము, మంచితనము, నిరాడంబరత బాగా నచ్చాయి. వాళ్లు అందరూ కూడా మాట్లాడుకుని ఏకాభిప్రాయంతో మా అన్నయ్యని వాళ్ల ఇంటి అల్లుడిగా చేసుకున్నారు. పెళ్లైన తర్వాత అన్నయ్య తను చేస్తున్న మద్రాసు ఉద్యోగానికి రాజీనామా పెట్టి బెంగళూరుకి సంసారము మార్చారు.

అలాంటి సందర్భంలో CS ఇంటర్ చేయాలంటే నేను మద్రాసు లేదా బెంగళూరుకు గాని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

మా అయ్య తర్వాత అయ్యగా మారిపోయాడు మా అన్నయ్య. నిజానికి అన్నను అయ్యతో కలిపితే అన్నయ్య వస్తుంది కదా. అది అక్షరాలా నా జీవితములో నిజమైంది. నన్ను, నా చదువును, నా వ్యాసంగాలను, వారు పరిగణలోకి తీసుకొని ఎంతో దయతో నా వేలు పట్టుకొని బెంగళూరుకు తీసుకెళ్లారు. మా వదిన కొత్తగా సంసారానికి రాకముందే నేను మా అన్నయ్యతో జయనగర్ 4th బ్లాక్‌లో ఒక చిన్న ఇంట్లో అద్దెకి ఉండేవాడిని. ఇక అన్నయ్య వివాహం తర్వాత మా వదినను ఆ ఇంట్లోకి మేమిద్దరం చేరి స్వాగతించాము. వదినలా కాకుండా ఒక తల్లిలాగే చూసుకునేది ఇంట్లో. చాలా చిన్న గదులు ఉండేవి. అంతా చేరి రెండు గదులు. నేను హాల్‌లో ఉండేవాడిని. అక్కడే కూర్చొని చదువుకునే వాడిని. నేను ఇంట్లో నిష్క్రియగా ఉండకూడదని అన్నయ్య ఒక చిన్న ఉద్యోగాన్ని ఇప్పించారు, 750/-నెల జీతము. గిరీష్ మూర్తి అండ్ కుమార్, హై పాయింట్లో ఆఫీసు ఉండేది. ఆ ఉద్యోగం కోసం ఉదయం 8 నుండి సాయంకాలం 7 గంటలకు వరకు సమయం వెచ్చించే వాడిని. అయితే ఈ కంపెనీ సెక్రెటరీ కోర్సు చేయడానికి కావలసిన ప్రత్యేక బోధన తరగతులు కన్నింగం రోడ్‌లో CS చాప్టర్ ఆఫీస్‌లో ఇచ్చేవారు. దానికి నేను నమోదు చేయాలంటే అప్పటికే సమయం అయిపోయింది. ఈసారి మళ్లీ ఆరు నెలల తర్వాతనే అని చెప్పారు. చాలా బాధ అయిపోయింది. ఏం చేయాలో తెలియలేదు.

ఆ సమయంలో, మా పెద్ద నాన్న కూతురు వాణి ఉండేది. ఆమె మామ గారి గురుంచి తెలిసింది. వారు CA KR కుమార్, FCA, FCS, CMA. అవెన్యూ రోడ్‌లో ఒక పురాతనమైన బంగ్లాలో ఉండేవారు. వాళ్లది ఉమ్మడి కుటుంబం. వారి గురించి తెలుసుకొని వారి దగ్గరికి వెళ్లి, మామయ్య! ఈ విధంగా నేను CS కోచింగ్‌కు వెళ్లాలి అనుకుంటున్నాను, కానీ అక్కడ తరగతులలో చేరేందుకు సమయం అయిపోయింది అని చెబితే... వారు చాలా ఆనందపడి, CS Chapter వాళ్లకు ఫోన్ చేసి నా గురించి చెప్పి నన్ను ప్రత్యేకంగా పరిగణించి ప్రవేశం ఇవ్వమని చెప్పారు. చాలా ఆనందం అయింది.

ఇక ఆ ఇంట్లో అడుగు పెట్టిన వెంటనే నాకు తెలిసిన మరొక అద్భుతమైన విషయం ఏంటంటే బాబా వారు చాలా ఏళ్ల క్రితం స్వయంగా వారి ఇంటికి వచ్చారు, వారి ఇంట్లో నడుపుతున్న విచార దర్పణ ప్రింటింగ్ ప్రెస్... ముద్రణాలయానికి విచ్చేసి, అక్కడ ముద్రణ యంత్రాలు ఎట్లా పని చేస్తాయి అన్నది విచారించినారట. 1958లో అనుకుంటాను సనాతన సారధి ముద్రణ ఒకటి లేక రెండు ప్రతులు అక్కడ జరిగింది అని విన్నాను. రెండవది స్వామికి అ యంత్రాలని ప్రశాంతినిలయంలో ఏర్పాటు చేసి అక్కడి నుండే సనాతన సారధిని ముద్రించాలని సంకల్పించారు అని విన్నాను. అందువలన స్వామి వారు వాళ్ల ఇంటికి వచ్చి, ఆ ముద్రణా యంత్రాలను పరిశీలించి, వాటి మీద తమ హస్త చాలనంతో విభూతిని అభిషేకించి, ఆశీర్వదించి... ఆ ముద్రణా యంత్రం తనదే అన్నట్టు రాజు లాగా దానిమీద చేయి వేసి ప్రక్కన నిలబడి దర్జాగా (కార్ ముందర ఓనర్ నిలబడినట్టుగా) స్వామి వారు ఫోటోలు తీసుకున్నారట. అప్పటి నలుపు తెలుపు ఫోటోలు కొన్నింటిని గోడల మీద వేలాడ దీయబడి ఉండటం నేను చూశాను. నా ఉత్సాహానికి అంతే లేదు. అంటే CS గురించి వాకబు చేస్తున్నప్పుడు కూడా నేను స్వామిని చూసానే, స్వామి యొక్క విశేషం విన్నానే అని చాలా ఆనంద పడ్డాను.

ఇక ఆ తర్వాత ప్రతి రోజు సాయింత్రం పూట CS బోధనా తరగతులకు వెళ్లేవాడిని. బెంగళూరులో ఆ 3 నెలల కోచింగు పూర్తి అయిన తక్షణము. మళ్లీ పాత పద్ధతిలో నా దినచర్య మొదలయింది. అదే నండి స్వామిని ఎక్కడ చూడాలి? స్వామి కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నాయి? స్వామి విశేషాలు ఎలా తెలుసుకోవాలని? ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు, బస్సులో దిగేటప్పుడు, బస్సులో ఎక్కేటప్పుడు, లోకల్ బస్సు ప్రయాణంలో కిటికీల్లో నుంచి ఆ పరిసరాల అంతా చూసేవాడిని. సుమారు ఒక గంట ప్రయాణం కన్నింగ్హామ్ రోడ్డు నుండి మా ఇల్లు లేక ఆఫీస్ నుండి ఇల్లు. అక్కడ ఇక్కడ అంతా చూసేవాడిని. అలాంటి పరిస్థితులలో జయనగర్‌లో మేము ఉండే రోడ్డుకి అవతల జయనగర్ 3rd బ్లాక్ ఉండేది. ఆ రోడ్డులో నేను వెళ్తుంటే, ఒకానొక ఇంటి ముందర స్వామి ఫోటో పైన బాల్కనీలో కనిపించింది. చాలా సంతోషం అయిపోయింది. వెంటనే కాలింగ్ బెల్ కొట్టాను, వారిని వాకబు చేసే ప్రయత్నం చేశాను. ఓ పెద్ద ఆవిడ వచ్చింది. "యారప్పా" అంటూ మాట్లాడింది. అప్పటికి ఇంకా నాకు నిజంగా తెలుగు తప్ప ఏమీ రాదు. ఇంక ఇంగ్లీషు కన్నడ అసలు రాదు. బట్లర్ ఇంగ్లీష్‌లో నేను బాలచంద్ర, అనంతపురం నుండి వచ్చాను, స్వామి భజన్ సెంటర్ గురించి తెలుసుకుందామని వచ్చాను అని చెప్పాను. అప్పుడు ఆవిడ చెప్పారు... ఇదే స్వామి సెంటర్, ప్రతి గురువారం సాయంకాలం మాతో పాటు భజనకు కూర్చోవచ్చు అని చెప్పడం, ఇక అప్పటినుంచి నా ఆనందానికి హద్దులు లేవు. మా ఇంటి నుంచి కేవలం రెండు మూడు నిమిషాల్లో వాళ్ల ఇంటికి చేరిపోవచ్చు.

అలాగే ఇంటికి వస్తే ఆ చిన్న గదిలో చదువుకోవడం, చదువుతూ చదువుతూ... నిద్రపోతే వదిన 'ఏయ్ బాలా ఏమిటి నిద్ర పోతున్నావు... చదువుకో అప్పా చదువుకో' అని వదిన చెప్పేవారు.

చాలా ఉన్నత భావనతో జీవనం గడిపే వారు. ఎంతో చక్కగా నన్ను చూసుకునేది వదిన. ఇంటికి ఎవరైనా వస్తే, ఆవిడకి ఇష్టం ఉన్నా లేకపోయినా నాతో వచ్చారు కాబట్టి వచ్చిన వాళ్లకి ఆతిథ్యం ఇచ్చి పంపించేది. ఆవిడ పరీక్షల్లో చిన్నప్పటి నుంచి PG దాకా ఎప్పుడు తప్పింది లేదు. ప్రతి తరగతిలో కూడా క్లాస్ ఫస్ట్, డిస్టింక్షన్ వచ్చేది. అలాంటిది, నేను ఈ కంపెనీ సెక్రెటరీ కోర్సును... ఒక ఉద్యమంలా చేయడం చూసింది, ఎందుకంటే? CS ఇంటర్ పూర్తి చేసేందుకు కొన్ని ఏళ్లు

పట్టింది. ఇక ఆ ఉద్యమంలో పరీక్ష తప్పినప్పుడల్లా చాలా ఆశ్చర్యపోయేది. ఇదేందబ్బా వీడు ఊరికే పరీక్ష తప్పుతాడు. ఏంటి? ఇలా తప్పుతున్నావు అని అడిగేది. నాకు కారణం చెప్పాలంటే... చాలా కష్టంగా అనిపించేది. మా మధ్యలో చాలా తక్కువ మాటలు ఉండేవి. ఒక వేళ మాటలు వచ్చినా... స్వామి మాటలు, స్వామి పాటలే వచ్చేవి. బాబాలు అన్న, స్వాములు అన్న ఆమెకు ఇష్టం ఉండేది కాదు. కానీ నేను చేసే ఏ పనులలోనూ నన్ను నిరుత్సాహ పరచలేదు.

ఒకసారి సింహావలోకం చేసుకుంటే, బెంగళూరులో నా స్థాయి చాలా విశాలమైపోయింది. నా దృక్పథము చాలా విశాలమైంది. ఎంతెంతో మంది కొత్త వాళ్లని పరిచయం చేసుకునే భాగ్యం కలిగింది. ప్రధానంగా స్వామి కార్యంలో బెంగళూరు జిల్లా సాయి సంస్థల అధ్యక్షులు Dr ఆర్ ఎస్ పద్మనాభన్, వారి శ్రీమతి కమల పద్మనాభన్, అప్పటి కర్నాటక విద్యా విభాగ సమన్వయకర్త శ్రీమతి సుచరిత, శ్రీమాన్ కృష్ణన్, శ్రీమాన్ గంగాధర శెట్టి, శ్రీమాన్ నరసింహమూర్తి, శ్రీమతి గాయత్రి మూర్తి, శ్రీమతి లలితమ్మ, ఇలా ఎంతో మంది సభ్యులు, అద్భుతమైన వ్యక్తులు మరియు వ్యవస్థలతో నాకు పరిచయం ఏర్పడింది. ఎన్నెన్నో జీవిత సత్యాలను, పాఠాలను, విలువలను మరియు నైపుణ్యాలను నేర్చుకున్నాను. ఈ విషయాలను మళ్లీ నేను మును ముందు వ్యాసాలలో మరింత వివరంగా చర్చించే ప్రయత్నం చేస్తాను.

30

కర్ణాటక – స్వీయ సామర్థ్య నిర్వహణ వేదిక

కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు నాకు అద్భుత వేదికగా మారి సత్యసాయి కార్యంలో నన్ను మరింత ముందు వెళ్ళే విధంగా తీర్చిదిద్దింది అని చెప్పాలి. కారణం ఎన్నో అద్భుతమైన అనుభవాలు, అనుభూతులు, వ్యక్తిత్వాలు, వ్యవస్థలు నాకు అక్కడే పరిచయమయ్యాయి. ఏం చేసినా, ఏం చదువుతున్నా, ఏం జరుగుతున్నా, ఏ విధమైన కార్యంలో ఉన్నా హృదయమంతా కూడా స్వామి కార్యం మీద మాత్రమే ఉండేది. కర్ణాటకలో నేను తెలుసుకున్న విషయాలు స్వామికి మరింత దగ్గరగా వెళ్లగలిగేవిగా మారాయి.

ఏ భజన కేంద్రానికి వెళ్లినా ఎంతో హృద్యంగా నేను పాడే భజనలు భక్తులందరినీ కూడా చాలా ఆనందపరిచేవి. తెలుగు యాస, ప్రాస, భాష, అభిలాష ఇవన్నీ కూడా వాళ్లందరికీ విచిత్రంగా తోచేవి. అలాగే వచ్చి రాని కన్నడలో మాట్లాడే ప్రయత్నం చేసేవాడిని. తెలుగులో ప్రధానంగా నా మాటలు స్వామి మాటలకు దగ్గరగా ఉండడం వల్ల, ఎక్కడికి వెళ్లినా సరే నన్ను మాట్లాడమని ప్రోత్సహించేవారు. ఇక నేను మాట్లాడితే చాలా సందర్భాలలో ఉత్సాహంగా ఉద్రూతలూగిపోయేవారు. నాకు గుర్తు, ఆ దక్షిణ బెంగళూరులో సుమారు ఒక 10–15 సాయి కేంద్రాలను సందర్శించే అవకాశం, అదృష్టం నాకు కలిగింది.

ఎక్కడికి వెళ్లినా అక్కడ ఉన్న భక్తులందరితో పరిచయం చేసుకుని, స్వామి గురించి నాకు తెలిసిన మాటలు వాళ్లకి చెప్పడం, చక్కటి భజనలు చేయడం, వీలైతే బాలవికాస్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగేది. ఈ ప్రక్రియలో నాకు సౌత్ ఎండ్ సర్కిల్‌లో ఉండే సత్యసాయి సేవా సంస్థ సభ్యులతో పరిచయం అయ్యింది. లలితమ్మ గారి ప్రాంగణంలో కార్యక్రమాలు జరిగేవి. లలితమ్మ, వారి అత్త, భర్త, పిల్లలు అందరూ అక్కడ నివసించే వారు. చాల పెద్ద ఎస్టేట్ వాళ్లది. అక్కడ అద్భుతమైన మందిరం వాళ్ల ఇంట్లో కట్టుకున్నారు. అది చూసినప్పుడు నాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. అంటే అతి సామాన్యమైన ఇలాంటి భక్తుల వల్లనే కదా స్వామి యొక్క అవతార కార్యం

ముందుకు వెళుతోంది అనిపించేది. వాళ్ల ఇంట్లో 24 గంటలు ఎవరో ఒకరు వచ్చే వాళ్లు, తినే వాళ్లు, పోయే వాళ్లు, ఉండేవాళ్లు! అక్కడికి కస్తూరి లాంటి మహానుభావులు కూడా వచ్చి, శిబిరాలు, భాగవత సప్తాహాలు, క్యాంపులు, శిక్షణ తరగతులు నిర్వహించారని విన్నాను. ఎన్నెన్నో అరుదైన స్వామి ఫోటోలు వారి ఇంట్లో చాలా కనపడేవి. నిలువెత్తు షిర్డీ సాయి, పర్తి సాయి రంగు రంగుల ఫోటోలు మందిరంలో ఉండేవి. అలా ఆ సంస్థ కేంద్రానికి నేను వెళ్లడం వల్ల వాళ్లకి చాలా దగ్గర ఐపోయాను. జయనగర్ నుంచి సౌత్ ఎండ్‌కి నడుచుకుంటూ ప్రతి వారాంతంలో వెళ్లేవాడిని. నేను అక్కడికి బాల వికాస్ కార్యక్రమానికి వెళ్లే సమయంలో నేను చూసింది 10-20 మంది పిల్లలు ఐతే, ఉత్తరోత్తర అక్కడ నేను క్లాసులు తీసుకునే సమయంలో సుమారు 50 నుండి 60 మంది పిల్లలు బాలవికాస్‌కి వచ్చేది చూశాను. ఎంతో ఆతృతగా ఆ పిల్లల్ని దగ్గరికి తీసుకొని, హత్తుకొని, చక్కగా వాళ్లకి స్వామి మాటలు చెప్పే అవకాశం నాకు కలిగింది.

అలాంటి పరిస్థితుల్లో ఒకసారి మే 6వ తేదీ మాతృశ్రీ ఈశ్వరమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని బృందావనంలో స్వామి వారి సమక్షంలో చేయాలి అని నిర్ణయం జరిగింది. బెంగళూరు సౌత్ ప్రాంతంలో పిల్లలందరినీ సౌత్ ఎండ్ భజన కేంద్రానికి పిలిచారు. ప్రజ్ఞ నైపుణ్యం ఉండి, ధైర్యంగా ఉండే పిల్లలందరినీ కూడా డాన్స్ అని... డ్రామా అని... ఏకపాత్ర అభినయం అని, నృత్య రూపకం అని, ఇలా అందరిని కూడా ఎన్నిక చేశారు. ఇదంతా మందిరం వెనకాల పెద్ద మైదానంలో జరిగేది. వందల మంది పిల్లలు వారి గురువులతో వచ్చేవారు. సీనియర్ గురువులు, కోఆర్డినేటర్స్‌తో పాటుగా నేను వారితో చేరి చెట్టు కింద కూర్చొని పిల్లలను పరిశీలిస్తున్నాను.

కొద్ది మంది పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడానికి అవకాశం రాలేదు. అంటే వాళ్లు ఎన్నుకోబడలేదన్న మాట. నాకేమో చాలా బాధ అయింది. అవకాశం రాలేదని పిల్లలు నిరాశ చెందారు అని అర్థం అయింది. వాళ్లు అందరూ ముఖాలు దిగులుగా పెట్టుకుని అమాయకంగా... ఆర్తిగా చెట్టుకింద అశోక వనంలో సీతల్లాగా కూర్చున్నారు. వాళ్లను మనం ఏం చేయొచ్చు, ఏ విధంగా ఉత్సాహ పరచొచ్చు అని అనుకున్నాను. కాబట్టి అవకాశం రాని పిల్లలందరిని ప్రక్కకి తీసుకెళ్లి, మిమ్మల్ని ఏ టీంలో ఎంపిక చేయలేదు కదా! కాబట్టి మనమంతా ఒక టీం అవుదాము. 'రెడీ యా మీరు స్వామి దగ్గర ఏమైనా చేయడానికి? అంటే వాళ్ల ఉత్సాహానికి హద్దే లేకుండా పోయింది. గెంతులు వేస్తున్నారు. అందరూ కూడా, మేము తప్పకుండా మీరు ఏం చెప్తే అది చేస్తామని ఉత్సాహం చూపించారు. అది చూసి అక్కడున్న కోఆర్డినేటర్స్‌కి వెళ్లి చెప్పాను. 'అమ్మ నాకు ఒక అవకాశం ఇవ్వండి, మీరు ఎవరినైతే సెలెక్ట్ చేయలేదో, ఆ పిల్లలందరిని తీసుకొని నేను ఇంకేదైనా కార్యక్రమం చేస్తాను అని చెప్పాను'. సో వాళ్లు మొదట అంత ఉత్సాహం చూపించలేదు. కానీ, అంత మంది పిల్లల్ని నేను ప్రేరణ చేయడం చూసి వాళ్లు కూడా కాదనలేకపోయారు. అలాగా ఆ పిల్లలందరినీ తీసుకొని ఒక అద్భుత మైన "సర్వధర్మ నృత్య రూపకాన్ని" నేను డిజైన్ చేశాను. చక్కగా వాళ్లకి ఒక్కొక్క మతానికి సంబంధించిన వేషాలు వేయించి, స్వామి ముందర ప్రదర్శన చేసి, వాళ్ల చేతుల్లోని ఒక ప్లే కార్డ్స్ మీద మతముల గుర్తులు వేసి వాళ్లందరిని స్వామి సన్నిధిలో చూపించాను. బృందావన ఆశ్రమంలో అలా చేయడం నాకు అద్భుతమైన అవకాశమే కాదు అనుభూతిని కూడా ఇచ్చింది.

అప్పుడు సాయి రమేష్ హాల్ లేదు. సాయిరామ్ షెడ్ ఉండేది. ఆ షెడ్ క్రింద పిల్లలందరితో కార్యక్రమం చేయించాము. అసలు నేను ఎవరికీ తెలియదు. నేను చేశాను అని కూడా ఎవరికి

తెలియదు. కానీ స్వామి నా దగ్గర దాకా వచ్చి పాద నమస్కారం చేసుకొమ్మని ఆశీర్వాదం చేశారు. అలాగే ఆ పాట పాడిన గాయకుడిని స్వామి పిలిచి విభూది ఇచ్చారు. ఆ తర్వాత అందరిని కూడా గ్రూప్ ఫోటో కోసము ఇప్పుడు సాయి రమేష్ హాల్ వేదిక ఉన్న దగ్గర స్వామి అందరిని కూర్చోమని చెప్పారు. ఇక వందలాది మంది పిల్లలు వేదిక వైపు పరుగులు తీసారు. అందరూ ఆ వేదిక దగ్గర కూర్చున్న తర్వాత, నేనేమో స్వామి సెంటర్‌లో ఉంటారు కదా అనే ఆలోచనలో మధ్య భాగంలో పిల్లలను అదుపు చేస్తున్నాను. స్వామి సరిగ్గా నేను ఎక్కడైతే కూర్చున్నానో, అక్కడికే వచ్చారు. స్వామి మధ్యలో నిలబడితే పిల్లలందరూ స్వామి మీద పడకుండా, నేను వాళ్లని ఆపాలని నా రెండు చేతులు పెట్టి ఫెన్సింగ్ లా స్వామి వెనక మోకాళ్ల మీద నిలబడ్డాను.

ఒక అద్భుతమైన ఆశీర్వాదం అనుగ్రహం అది. ఆ మధుర క్షణాలు నాకు ఇప్పటికీ జ్ఞాపకమే. స్వామి ఆ సమయంలో అందరికీ విభూతి ప్రసాదము ఇవ్వడము జరిగింది. అంటే చిన్న పని అయినా సరే ప్రేమతో చేస్తే, స్వామికి అందుతుంది. అనడానికి ఇది మరొక నిదర్శనంగా నిలిచి పోయింది. నిజానికి నా జ్ఞానం గాని, సాంస్కృతిక విజ్ఞానం గాని, కళా చాతుర్యం గాని ఏమీ లేవు. స్వామి మీద, ఆ చిన్నారి పిల్లలమీద ప్రేమ మాత్రమే ఉంది. పిచ్చి ప్రేమ అనుకోవాలి స్వామి మీద. ఆ పిల్లలందరిని ఎగదోసి, ఆ పిల్లల మధ్యలో నేను వెళ్లిపోయి, నేను పిల్లాడిగా మారిపోయి, వాళ్లతో చేసిన ఆ కార్యక్రమం నాకు అలా హృదయ వేదిక మీద శాశ్వతంగా నిలిచిపోయింది.

అలాగే శ్రీ సత్యసాయి మహావతార దర్శన్ బెంగళూరుకి తీసుకొని రావడం, సౌత్ ఎండ్ సర్కిల్ కేంద్రంలో ఆ చిత్ర ప్రదర్శనను సప్తాహం లాగా చేసి రోజుకొక కార్యక్రమం చేస్తూ... వందల మంది భక్తులందరికీ ప్రదర్శన ద్వారా స్వామి సిద్ధాంతాలని, స్వామి ప్రేమని, స్వామి సేవా కార్యక్రమాలని వివరించే ప్రయత్నం చేశాము. అలాంటి పరిస్థితుల్లో స్వామి దగ్గరికి వెళ్లే అవకాశం కలిగింది. స్వామి చాలా సంతోషంగా, చాల దయతో ఆ ప్రదర్శనలో వినియోగించిన చిత్ర పటాలను తమ కరకమలములతో తాకి ఆశీర్వదించారు. ఇక ఆ సందర్భంలో గంగాధర్ శెట్టి, ఆనాటి సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్, అలాగే డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.ఎస్. పద్మనాభన్, వారి సతీమణి శ్రీమతి కమల పద్మనాభమన్, విద్యా విభాగ సంచాలకులు శ్రీమతి సుచరితమ్మ తదితర మహనీయుల సహచర్యము లభించింది. వారు అందరూ నన్ను మొదట్లో ప్రోత్సహించకున్నా, నా వాక్ చాతుర్యం, తపన, ఆతృత, ఆవేదన చూసి తరవాత కాలంలో చక్కగా నన్ను ప్రోత్సహించారు. ఒకానొక సమయంలో బాలచంద్ర అంటే దక్షిణ బెంగళూరు ప్రాంతంలో తెలియని వాళ్లు లేరు అని చెప్పుకోవాలి. అలాంటి సందర్భంలో వారు నన్ను దగ్గరికి తీసుకొని, కన్నడ భాషని నేర్చుకోమని చెప్పి, అలాగే నాకు ఆంగ్ల భాష రావట్లేదు కదా, ఆ భాషలకు బాగా పరిచయం కావాలని నాకు ప్రత్యేకంగా మూడు నెలల పాటు శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం చేసి నన్ను ఇంగ్లీష్ తరగతులకు కూడా పంపించారు. అంటే స్వామి కార్యంలో ఇది లేదు, ఇది రాదు, ఇది కూడదు, ఇది కాదు అనే ఆలోచన ఎక్కడా ఏమీ లేదు. అహరహం అనుక్షణము స్వామి కార్యంలో నన్ను నేను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం కలిగింది.

తదనంతర కాలంలో అన్ని కేంద్రాలకు వెళ్లి స్వామి సందేశాలను తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషలలో మాట్లాడే వాడిని. చాలా విశేషమైన ప్రజ్ఞా పాటవాలను స్వామి దయతో నాలో ప్రకటితం చేశారు. స్వీయ సామర్థ్య సాధనకు కర్ణాటక వేదికగా మారింది అనడంలో ఎట్టి సందేహం లేదు.

31

కర్ణాటక – సాయి జగన్నాటకంలో రక్తి కట్టించిన పాత్రలు

Dr. RS పద్మనాభన్, స్వామి వారు వారిని ఉన్నత విద్య కోసం పంపించే సమయంలో వారు చాలా బెంగతో భయపడుతుంటే, ఒక పెన్ను సృష్టించి వారికిచ్చి 'పరీక్షలు దీనితో వ్రాయి తప్పకుండా పాస్ అవుతావు' అని చెప్పడము, అలాగే చాలా ఏళ్ల క్రితం అంటే స్వామికి 16 ఏళ్లు ఉన్నప్పుడు స్థానికంగా ఉన్న KR మార్కెట్‌కి వచ్చినప్పుడు, స్వామిని నిక్కర్ షర్టుతో చూసిన కుటుంబ సభ్యులుగా పద్మనాభన్ అందరికీ పరిచయం. వారి కుటుంబం అంతా కూడా, అంటే వారి సతీమణి కమలా పద్మనాభన్, గీతమ్మ, సుచరితమ్మ, రావత్, శేషగిరి రావు ఇలా అంతా కూడా స్వామికి చాలా అంతరంగీకులుగా ఉండేవారు, వీళ్లతో పరిచయ భాగ్యం కలిగింది. ఎన్ని సార్లు వాళ్ల మాటలు విన్నా అబ్బా! ఎంత అదృష్టవంతులు వీళ్లు, ఎంత అనితరమైన మహిమలు వాళ్లు చవి చూశారు అని తలుచుకుంటూ ఉప్పొంగి పోయే వాడిని.

కర్ణాటక రాష్ట్రంలో బాలవికాస్‌కు మార్గదర్శకులు శ్రీమతి కమలా పద్మనాభం. నేను బెంగళూరులో ఉన్న కాలంలో (1990 – 96) శ్రీ సత్య సాయి సంస్థల రాష్ట్ర విద్యా విభాగపు సంచాలకులుగా వారి భర్త Dr. R.S. పద్మనాభన్‌తో చేరి, నన్ను స్వామి కార్యంలో దరి చేర్చుకుని, దారి చూపి... నా వ్యక్తిత్వానికి సొబగులు అద్దిన వ్యక్తి ఆమె. నేను వారి ఇంటికి తరచుగా వెళుతూ బాబా జీవితం మరియు సందేశాన్ని తెలుగు నుండి కన్నడలోకి అనువదించాను (శ్రీ సత్య సాయి మహావతార దర్శన్ – చిత్ర ప్రదర్శన)

వారు నాపై కురిపించిన ప్రేమ, ఆదరణలకు నేను మాటలతో కృతజ్ఞత చెప్పలేను కానీ వారి అంచనాలను చేరుకునేందుకు చివరి శ్వాస వరకు పనిచేస్తాను అని మాత్రమే చెప్పగలను. స్వామి వారికి కూడా, వారంటే ఎంతో దయ. చాలా అవకాశాలు, అనుభవాలను వాళ్లకు ప్రసాదించారు. బెంగుళూరులో ఉన్నప్పుడు నేను ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఆ దంపతులు సత్య సాయి ట్రస్ట్ ద్వారా సాయం చేయడమే కాక, కన్నడ నేర్చుకోవడానికి అండగా నిలబడ్డారు. వారి సహచర్యంలో నన్ను

మించి నేను ఆలోచించేలా చేశారు. వారి వల్ల మాత్రమే నేను మరో 10 అడుగులు బాబాకు దగ్గరగా చేరుకోగలిగాను అనుకుంటాను.

ఇక మరో ప్రక్క సాయంకాలము న్యాయ శాస్త్ర విద్య కోసం BMS న్యాయ కళాశాలలో చేరాను. అక్కడ చేరడం వలన కొత్త పరిచయాలు మరియు కన్నడ భాష నేర్చుకోవడానికి కావలసిన అవకాశం దొరికింది.

ఒక ప్రక్క అన్నా వదినలతో ఉంటూ, ఉద్యోగం చేసుకుంటూ, అలాగే కంపెనీ సెక్రెటరీ పరీక్షలు, ఇంకో ప్రక్క న్యాయ శాస్త్ర పరీక్షలు, మరో పక్క స్వామి కార్యము, స్వామి సన్నిధిలో జరిగే వేసవి తరగతులు ఇలా ఎన్నో పనుల్లో నా ప్రతి క్షణం కరిగి పోయేది అని చెప్పాలి.

వేసవి తరగతులు నిర్వహించే ఆ వారం రోజులు కూడా బృందావనంలో పండగ వాతావరణం, ప్రొద్దున్నే లేచి సిటీ నుండి పబ్లిక్ రవాణాలో వైట్ ఫీల్డ్‌లో ఉండే బృందావన ఆశ్రమానికి వెళ్లిపోయి, అక్కడ స్వామి దర్శనము చేసుకోవడం, మధ్యాహ్నం ఉపన్యాసం తర్వాత వెనక్కి తిరిగి రావడము జరిగేది. స్వామి ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటూ వ్రాసుకొనే వాడిని. స్వామి, ఎన్నో సార్లు పాద నమస్కారాలు ఇచ్చారు. మరెన్నో సార్లు మాట్లాడారు, ఎన్నో సార్లు స్వామి యొక్క మాటలు వినే భాగ్యం కలిగింది. స్వామి దర్శన, స్పర్శన, సంభాషణ, పాద నమస్కార, ప్రసాద, సందేశ భాగ్యాలు అందుకో గలిగాను. నేను మరెక్కడున్నా కూడా స్వామి సన్నిధిలో గడిపే ఇన్ని అవకాశాలు నాకు రాక పోవును అనుకుంటాను. ఈ విషయంలో మాత్రం బెంగళూరు వాళ్లు చాలా అదృష్ట వంతులు అని చెప్పుకోవాలి.

అలాగే నన్ను చాలా ప్రభావితం చేసిన స్వామి భక్తుల్లో కృష్ణన్ ఒకరు. వారు బెంగళూరు జిల్లా సాయి సంస్థల సేవా విభాగ సంచాలకులుగా ఉండేవారు. ఆ తర్వాత కాలంలో కర్ణాటక రాష్ట్ర సాయి సంస్థల కోఆర్డినేటర్‌గా కూడా ఉన్నారు. ఆరు అడుగుల ఆజానుబాహుడు! స్వామి చెప్పిన మాటని తూచా తప్పకుండా పాటించేవాడు. చాలా మంచి వ్యక్తిత్వము. వారిని చూస్తేనే నమస్కారం చేయాలనిపించేంత వర్చస్సు వారిది. సేవదళ్‌గా బృందావనంలో ఎప్పుడు 24/7 స్వామి కోసం ఉండేవారు. బెంగుళూరు ఆశ్రమంలో స్వామి ఉన్నారు అంటే ఇక స్వామి వారి వెనక నడుచుకుంటూ స్వామితో పాటుగా వచ్చేవారు కృష్ణన్. ఒక నిటారైనా బల్లెం లాగా స్వామి ప్రక్కలో కాస్తా దూరంగా నడుస్తూ... నలు దిక్కులలో చూస్తూ... స్వామిని జాగ్రత్తగా చూసుకునే వారు.

వారు బసవనగుడిలో భజన కేంద్రము ప్రారంభించారు. ఆ కేంద్రాన్ని కూడా నేను సందర్శించాను. వారు ఎంత అద్భుతమైన వ్యక్తి అంటే, పూర్వం ఎప్పుడో సంస్థ పెట్టిన కొత్తలో స్వామి నగర సంకీర్తన గురించి చెప్పారని, వారు అక్కడ సభ్యులందరికీ కూడా నగర సంకీర్తన ప్రాశస్త్యం గురించి చెప్పారట. తర్వాత కొన్నాళ్లకి నగర సంకీర్తనలో వచ్చే సభ్యులు తగ్గిపోతే, వారు ఏ మాత్రం సంకోచించకుండా, మెడలో హార్మోనియం వేసుకుని తను ఒక్కడే ఆ బుల్ టెంపుల్ రోడ్డులో నగర సంకీర్తన చేసుకుంటూ వెళ్లిన సందర్భం ఉందని చెప్పగా విన్నప్పుడు నాకు చాలా ప్రేరణ కలిగింది. ఇది స్వామి వారే చెప్పారట, అంత ఉత్సాహము వారిది. నేటి చైతన్య మహా ప్రభువు అనిపిస్తుంది.

కింకరుడు కాని వాడు శంకరుడు కాలేడు, సేవకుడు కాని వాడు నాయకుడు కాలేడు అని అన్న దానికి నిలువెత్తు నిదర్శనము కృష్ణన్ అనిపిస్తుంది. బృందావనంలో స్వామి వచ్చే ముందర ఎంతో మంది సేవాదల సభ్యులకు ప్రేరణ అందించి, ప్రత్యక్ష పర్యవేక్షణలో సేవా దళ సభ్యులందరి చేత త్రయి బృందావనమును, పరిసరాలను శుభ్రం చేయించేవారు. ఈ విషయాలన్నీ కూడా నేను కృష్ణన్ విషయంలో గుర్తు చేసుకోవాలి.

బృందావన్ భజన బృందాన్ని నేను దగ్గర నుంచి చూసే అవకాశం నాకు కలిగింది. ఎంత ఉదాత్తమైన రీతి, ఎంత భక్తి పారవస్యత, వారి భజనలు వింటే స్వామి ఎక్కడున్నా కదిలి వచ్చేలా కీర్తనలు, భజనలు, పాటలు పాడేవారు. స్వామి దర్శనం కోసము చేరిన భక్తులను ఆనంద డోలికలలో ఓలలాడించే చాతుర్యం బృందావన్ భజన బృందానికి ఉండేదని చెప్పాలి. ఎంతో మంచి ప్రేరణతో వారు భజన గీతాలు స్వామి సన్నిధిలో ఆలపించేవారు. వారు బెంగళూరు మాత్రమే కాక కర్ణాటక రాష్ట్రంలో ఎన్నో కేంద్రాలకు వెళ్లి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించే వారు. ఆధ్యాత్మిక విభాగము, సేవా విభాగము, విద్యా విభాగము... ఈ మూడింటిలో స్వామి కార్యంలో నేను పాల్గొనే అవకాశం కలిగింది. ఇందిరా నగర్‌కి స్వామి వచ్చినప్పుడు, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు కూడా చూశాను. సాయి గీతాంజలిని JP నగర ప్రాంతంలో ఏర్పాటు చేశారు, అలాగే సత్యసాయి సంస్కృతి కళ్యాణ మండపము మొదలగు సాయి దివ్య మందిరాలకు నేను అక్కడ ఉన్నప్పుడు అంకురాలు ఏర్పడ్డాయి. తర్వాత కాలంలో ఇవన్నీ కూడా అద్భుతమైన దివ్య మందిరాలుగా తీర్చిదిద్దబడ్డాయి. స్వామి వారు స్వయంగా ఈ ప్రదేశాలకు రావడం ఇదంతా నేను చూశాను. కోర మంగళ వెంకటేశ్వర్లు... వారి సంస్థ కేంద్రాన్ని సందర్శించాను. బుల్ టెంపుల్ రోడ్‌లో ఉన్న రామకృష్ణ మఠానికి కూడా అప్పుడప్పుడు వెళ్లేవాడిని. తర్వాత జెపి నగర, జయనగర సెకండ్ బ్లాక్, అశోక్ పిల్లర్, బనశంకరి, కుమారస్వామి లేఔట్, పద్మనాభ నగర, ఇలా ఎన్నెన్నో కేంద్రాలకు వెళ్లే వాడిని. ఎక్కడ వీలైతే అక్కడ ఈ యొక్క కార్యంలో పాల్గొనే వాడిని, ఎక్కడ భజనలు ఉంటే అక్కడికి వెళ్లేవాడిని. ఎక్కడ ఉపన్యాసం ఉంటే అక్కడికి వెళ్లేవాడిని.

అద్భుతమైన వ్యక్తుల పరిచయం ఏర్పడింది. ఈ ప్రక్రియలో నేను కన్నడ భాషలో కూడా వక్తగా మారిపోయాను. కానీ కన్నడ కంటే తెలుగు వినేదానికి చాలా మంది ఉత్సాహం చూపించేవాళ్లు.

ఆ తర్వాత బనశంకరిలో కామాఖ్య బడావని ప్రాంతంలో మేము కొత్త ఇంటికి చేరడంతో, అక్కడ సత్యసాయి కేంద్రాన్ని నేను ప్రారంభం చేసే అదృష్టం కలిగింది. ప్రారంభ సమయంలో ఎంతో మంది గొప్ప వాళ్లని, పెద్దవాళ్లని కలుసుకోవడం జరిగింది. అంటే కర్ణాటకనే కాదు, బెంగళూరు కాదు, తమిళనాడు కాదు, ఆంధ్ర కాదు, ఎక్కడికి వెళ్లినా స్వామి కార్యంలో ముందుకు ఉరకడము నాకు పరిపాటి అయింది.

చివరకు నేను ఎలా తయారయ్యానంటే ఒక వేళ నేను ఏ రోజైనా స్వామి కార్యంలో పాల్గొలేక పోతే అయ్యో ఈ రోజు నేను ఏం చేయలేకపోయాను అని ఏడ్చిన రోజులు ఉన్నాయి. కర్ణాటకలో నా వ్యక్తిత్వాన్ని నేను తీర్చి దిద్దుకుని, నా భక్తి విశ్వాసాలకు పదును పెట్టుకునే అవకాశం కలిగింది.

అలాగే సాంఘిక,సామాజిక, ఆధ్యాత్మిక, సేవా క్షేత్రాలలో నన్ను నేను తర్ఫీదు ఇచ్చుకునే ప్రయత్నం అక్కడ జరిగిందని చెప్పాలి. గత మూడున్నర దశాబ్దాలుగా (1990–2025) బెంగళూరులో పరిచయమైన ప్రతి వ్యక్తి నాకు ఈ రోజుకు కూడా అలాగే గుర్తుండిపోయారు. వెళ్లినప్పుడు వీలున్నప్పుడు ఆ పాత భక్త బంధువులను ఈ రోజుకు కూడా కలుస్తుంటాను. ఆ పరిచయాలు అలాగే ఉన్నాయి.

కోలార్ జిల్లా సత్యసాయి సంస్థ పెద్దలు శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసమూర్తి ఇలాంటి వాళ్లందరితో కూడా పరిచయం ఏర్పడింది. 60వ స్వామి పుట్టు పండుగ సందర్భంగా, స్వామి, బెంగళూరు నుండి పుట్టపర్తి వచ్చే భక్తులందరికీ కూడా సదుపాయం చేయాలనే ఆలోచనతో, ఎక్కడో దర్శనంలో కూర్చుంటే, శ్రీనివాస్ రెడ్డిని పిలిచి, "బంగారు! నాకు ఒక సాయం చేస్తావా?" అంటే వారు చాలా ఆశ్చర్యపోయి... స్వామి ఏం చేయాలని అడిగితే? బంగారు "ఆ బాగాపల్లి హైవేలో రోడ్డు వైపున

షామియానా వేసి వచ్చి పోయే భక్తులకు మంచి నీళ్లు ఇచ్చి సేద దీరడానికి సదుపాయం చేస్తే 60వ పుట్టు పండుగకు వచ్చే వాళ్లందరికీ మంచి సౌలభ్యం అవుతుంది." అన్నారట.

అనాడు స్వామి దివ్య సంకల్పము ఈ రోజు ఒక 60 ఎకరాల కేంద్రముగా మారిపోయింది. సర్వధర్మ సమన్వయ ట్రస్ట్ ఏర్పాటు చేసి, శ్రీనివాస్ రెడ్డి అక్కడ ఒక వృద్ధాశ్రమము, స్వామి ప్రార్థన మందిరము, స్వామి స్కూలు, Rural Shore Village BPO, నవగ్రహ దంపతులతో కూడిన మంటపాలు, గణేశ మందిరము... కట్టించారు. ప్రతి వేసవి కాలములో కూడా, స్వామి బృందావన్‌కి వెళ్లేటప్పుడు కానీ, వచ్చేటప్పుడు కానీ, అక్కడ కొన్ని గంటలు సేద తీరేవారు. ఇంత అద్భుతమైన వ్యక్తుల్ని నేను కలుసుకున్నాను.

అలాగే బెంగళూరు నుండి ఉగాది ఉత్సవానికి బస్సులో బృందావనానికి ప్రయాణం అవుతుంటే, గాయిత్రి నరసింహమూర్తి వీళ్లిద్దరు వారిద్దరి పిల్లలతో పరిచయం అయ్యారు. ఆ పరిచయం కాస్తా దిన దిన ప్రవర్ధమానమై ఒక మహా వృక్షంగా నిలిచింది అని చెప్పాలి. గాయత్రి మూర్తి గురించి మరింత వివరంగా మును ముందు వ్యాసాలతో వివరిస్తాను.

32

బెంగళూరులో అద్భుతమైన మహిళామ తల్లులు

బెంగళూరు అంటూనే చాలా మధురమైన జ్ఞాపకాలు, విషయాలు, వ్యక్తులు, భక్తులు మనసులో మెదులుతూ ఉంటారు. బెంగళూరులో మా ఇంటికి వెళితే ఎంత ఆనందమో... ఇలాంటి భక్తులు వ్యక్తుల ఇళ్లకు వెళ్లినా కూడా అంతే ఆనంద పడుతూ ఉంటాను ఈ రోజుకి కూడా. ఈ సందర్భంగా కొద్ది మంది అలాంటి మధుర భక్తుల గురించి, వారి నుంచి నేను నేర్చుకున్న విషయాల గురించి చెప్పే ప్రయత్నంచేస్తున్నాను.

అతి సామాన్యమైన వ్యక్తులు, అసామాన్యమైన భక్తులు, సాధారణమైన జీవితాలు అసాధారణమైన అవగాహన, ఇలాంటి భక్తులతో నాకు పరిచయం ఏర్పడడము నా పూర్వజన సుకృతము అనుకుంటూ ఉంటాను. స్వామి వారు నేను ఎక్కడికి వెళ్లినా అక్కడ కొద్దిమంది ఇలాంటి భక్తులని నా చుట్టూరా కంచె లాగా (బ్రీ గార్డ్స్‌లా) నాకు ఏర్పాటు చేస్తారేమో అని నేను ఎప్పుడూ అనుకుంటుంటాను.

ఏళ్ల క్రితం అనుకుంటాను, జయనగర్ నుంచి KR Market దారిలో నేను బృందావనానికి స్వామి దర్శనం కోసమై ఉగాది పర్వదినాన, వెళ్లే ప్రయత్నం చేశాను. బస్సు అంతా కూడా కిక్కిరిసి ఉంది. స్వామి భక్తులకు KR Market నుంచి ఆ మార్గంలో ఉదయం అయిదు గంటలకు అది ఒకటే ప్రైవేట్ బస్సు నడుస్తుంది. విపరీతమైన జనం ఉంటారు. ఆ జనంలో నాకు ఒక సీట్ దొరికింది. సీటింగ్ కెపాసిటీకి మించి బస్సులో సుమారు 80 – 90 మంది ప్రయాణం చేసే పరిస్థితి ఉండేది.

అలాంటి సమయంలో నేను నా ధోరణిలో ఆ సీట్లో కూర్చుంటే, ఆ జనం మధ్యలో ఒక చిన్నారి, ముద్దులొలికించే పాప, చాలా సౌమ్యంగా చాలా అమాయకంగా అలాకదిపితే కందిపోయే విధంగా ఉన్న చిన్నారిని నేను చూశాను. ఆ పాప కూర్చోవడానికి నిలుచుకోవడానికి కూడా స్థలములేక వాళ్ల అమ్మ కాళ్లని పట్టుకొని అలా అలా బస్సుతో పాటుగా ఊగుతూ ఉంది. చిన్నప్పటి నుంచికూడా చిన్న పిల్లలు అంటే బాగా ఇష్టము. ఎక్కడ చిన్న పిల్లలు నాకు కనిపించినా వాళ్లని వాత్సల్యంతో దగ్గరకు తీసుకోవడం చేస్తూ ఉంటాను. ఇది సత్యసాయి బాల వికాస్‌లో ప్రేమించడం మరియు

వాత్సల్యం చూపించడం అనేది. ఇంకా ఎక్కువగా నా జీవితంలో ఒక భాగం అయిపోయింది. ఆ వాత్సల్యంతో, ఆ మూడేళ్ల పాప కళ్లలో కళ్లు పెట్టి నేను సైగలతో మాట్లాడటం మొదలుపెట్టాను. "రా నాన్న! ఇక్కడ కూర్చో అని నేను చెప్తున్నాను" పాపం, ఆ చిన్నారి చాలా సిగ్గుతో రావాలా? వద్దా? అని సంకోచిస్తుంది. ఆ పాపకి నా దగ్గర రావాలంటే నేను కొత్త అయిపోయాను. ఏం చేయాలో తెలియక వాళ్ల అమ్మ కళ్లలో చూస్తే, వాళ్ల అమ్మ నన్ను చూడడము, ఆ పాపని ప్రోత్సహించి 'వెళ్లు అంకుల్ దగ్గర కూర్చో' అని చెప్పి నా దగ్గర కూర్చో బెట్టడము జరిగింది. ఈ ప్రక్రియలో మేము మంచి స్నేహితులుగా మారిపోయాము. ఆ పాప పేరు సాయి జాహ్నవి. ఒక మూడు సంవత్సరాలు ఉండొచ్చు. బృందావనానికి వెళ్లే సమయానికి వాళ్ల అమ్మ, వాళ్ల నాన్న, వాళ్ల అన్నయ్య అందరూ పరిచయం అయ్యారు. మేము స్వామి దర్శనం తర్వాత, భోజనాల సమయంలో మళ్లీ కలిసాము. అలా స్వామి సన్నిధిలో స్నేహము పరిమళించింది. ఆ స్నేహము పరిఢవిల్లింది. సుమారుగా 35 ఏళ్లు ఈ కుటుంబంతో పరిచయం అయిన వారి పేరు శ్రీమతి గాయిత్రి మూర్తి. గాయిత్రి మూర్తి నాకు స్ఫూర్తి కలిగించే వ్యక్తిగా నిలిచింది. ఈ రోజుకి కూడా చాలా ఉన్నతమైన వ్యక్తిత్వము. ఈ కుటుంబంలో నేను ఎన్నో విషయాలు గమనించాను. అంటే సామాన్యమైన జీవితము, అసామాన్యమైన విలువలు సాధారణమైన జీవన విధానము, అసాధారణమైన భక్తి ప్రపత్తి, ఇలా ఇవన్నీ కూడా వాళ్లలో నేను చూసేవాడిని. ఎంతో అనురాగముతో ఇంటికి వస్తే నన్ను ఒక చిన్న స్వామి లాగా చూసి, నాకు పాలు పళ్లతో ఆతిథ్యం ఇచ్చేవారు. చాలా చిన్న ఇల్లు. రెండు రూముల గదిలో నేను వాళ్లని చూశాను. ఆ రెండు రూములగదిలోనే వాళ్లు ఎంతో ప్రేమగా నన్ను చూసుకునేవారు. నన్ను నేను అర్పించేసుకున్నాను అంటే సందేహం లేదు. అంటే వాళ్లకు ఉన్న భక్తిని చూసి చాలా ఆశ్చర్యమేసేది అబ్బా! ఎంత అచంచలమైన విశ్వాసము, ఎంత సేవా దృక్పదము, ఎంత ఆతిథ్యం ఇస్తారు వాళ్లు అని. ఇంటికి ఎప్పుడు వెళ్లినా ఆ చిన్నపాపతో బాగా ఆడి పాడి నా సమయాన్ని గడిపేవాడిని. జయనగర్‌లో మా ఇంటి నుండి వాళ్ల ఇల్లు కూడా దగ్గర ఉండడం వల్ల, అటు పోయినా, ఇటు వచ్చిన, వాళ్ల ఇంటికి తప్పకుండా వెళ్లి, ఆ పాపతో ఆడేవాడిని. అమ్మ కూడా చాలా వాత్సల్యంతో చూసేవారు. అమ్మ బెంగళూరులో అప్పుడు లేకపోయేది. కానీ ఈవిడ నన్ను తన సొంత బిడ్డలా భావించేది. అప్పుడప్పుడు నాకు పాకెట్ మనీ ఇచ్చేది. నాకు ఏమైనా కష్టం వస్తే, ఆవిడకే కష్టం వచ్చినట్టుగా తల్లడిల్లిపోయేది. ఆవిడ సేవా దృక్పథాన్ని చూసినప్పుడు అయ్యో నేను కూడా ఇట్లా ఉండాలని తలుచుకునే వాడిని. స్వామి భక్తుల్లో ఇలాంటి వాళ్లు ఉంటారా? అని అనిపించేది.

ఒకానొక సమయంలో ఆవిడ ఎందుకో చాలా మదనపడుతూ కనిపించింది. ఇంట్లో ఎవరూలేరు. ఏమమ్మా ఏమైంది అట్లా కష్టపడుతున్నారు, బాధపడుతున్నారు అంటే.. "అయ్యా నేను హిందీ టీచర్‌ని ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్లో! కానీ రకరకాల కారణాల వల్ల గత పదేళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నానే తప్ప, జీతం ఎప్పుడు రాలేదు. "నీకు ఇంకా జీతం రాలేదు, నువ్వేం పని చేస్తావు" అని మా వారు తిడుతూ ఉంటారు. నాకెందుకో బాధ అవుతుంది. నేను ఆ పిల్లలకి పాఠం చెప్పేదాంట్లో జీవిత పాఠాలు బోధించాలి, స్వామి చెప్పిన దాంట్లో మనం గొప్ప పనులు చేయ లేక పోయాము, కనీసం ఇదైనా చేయాలి. జీతం ఏముంది వస్తుందిలే అనుకుని చేస్తున్నాను. అందువల్లనే నాకు అప్పుడప్పుడు కష్టం అవుతుంటుంది అని చెప్పింది. ఇది విని నాకు చాలా చాలా ఆశ్చర్యమైంది. అబ్బా జీతమే లేకుండా, జీవిత విలువలని ఇంకో 10 మందికి ఆవిడ అందిస్తోంది, ఎంత మహానుభావురాలు? "అమ్మ మీరు చేస్తున్నది నిజంగా అనితర సాధ్యమైన పని, కష్టమైనా సరే

ఇష్టంగా మీరు వెళ్లి సేవచేస్తున్నారు, స్వామి ఊరికే ఉంటాడా? చూస్తూ ఉండండి అమ్మా... అంతా బాగా అయిపోతుంది. మీకు అన్ని డబ్బులు వచ్చేస్తాయి" అని నేను అలా అమాయకంగా చెప్పాను. మీరు నమ్ముతారో నమ్మరో తెలియదు కానీ స్వామి నా నోట్లో నుంచి పలికించిన మాట నిజమైపోయింది. మూడు నెలల్లో ఆవిడకి మొత్తం డబ్బులన్నీ వచ్చేసాయి. పదేళ్ల అరియర్స్ వచ్చేసాయి. స్వామికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, నాతో ఆనందంగా ఈ విషయాన్ని పంచుకుంటున్నపుడు, నేను చెప్పిన మాటలు ఆమె గుర్తు చేసుకుంది.

ఆ పిల్లలతో కూడా... వాళ్లు పెరిగి పెద్దయ్యే కొద్దీ మా మధ్య ప్రేమ వాత్సల్యం అనురాగం కూడా పెద్దదైపోయింది. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత కూడా బెంగళూరుకి వెళ్లినపుడు, ఖచ్చితంగా మా ఇంటికి వెళ్లే ముందు, వాళ్ల ఇంటికి వెళ్లే వాడిని. ఆ చిన్న పాప, బాబు పడుకొని ఉంటే, వాళ్ల మధ్యలో నేను పడుకొని వాళ్లతో ఆడి పాడి వాళ్లకి స్నానం చేయించి, బ్రష్ ఎలా చేయాలో చెప్పి, ధ్యానం ఎలా చేయాలో చెప్పి, ప్రార్థన ఎలా చేయాలో చెప్పి, ఒక బాల వికాస్ అయిపోయేది. ఎప్పుడు వెళ్లినా గంటల తరబడి సత్సంగం జరిగేది, భజనలు చేసుకునే వాళ్లం, ఇట్లాంటి వాళ్లు చుట్టూరా ఉంటే మన వ్యక్తిత్వం శోభిస్తుంది అని నేను ఎట్టిసందేహం లేకుండా చెప్తాను.

అలాగా తదనంతరం వాళ్లు బాగా పెద్ద పిల్లలు ఐపోయారు. వాళ్లేమో డబ్బులు బాగా వెనకేసి ఆదా చేసి జయనగర్‌లో ఒక పెద్ద డూప్లెక్స్ హౌస్ కట్టారు. ఆ ఇంటికి ఏం పేరు పెట్టాలి అని నన్ను అడగడం, నేను "సాయి పాదం" అని పేరు పెట్టడం, సాయి పాదాల ఫోటోలు అందరికీ ఇవ్వడం, ఆ ఇంటి కార్యక్రమంలో వచ్చిన వాళ్లందరికీ కూడా స్వామి గురించి చెప్పడం జరిగింది.

వాళ్లు చెప్పారు బెంగళూరులో మీరు జీవితాంతము ఎప్పుడైనా ఎలాంటి సమయంలో అయినా సరే మా ఇల్లు మీదిగా అనుకోండి, మీకు ఒక రూమ్ కట్టిస్తున్నాము, అని చెప్పేసి వాళ్ల ఇంట్లో డాబా మీద ఒక రూమ్ కట్టించేసారు. సాయి పాదంలో నాకు ఒక రూమ్ ఇప్పటికి కూడా ఉంది. అలాంటి అద్భుతమైన వ్యక్తులని నేను చూశాను. ఇలాంటి భక్తులు ఉన్న సంస్థలు తప్పకుండా అద్భుతంగా ప్రకాశిస్తాయని నేను తెలుసుకున్నాను. అంటే నిస్వార్థంగా ఎలా ఉండాలి? స్వార్థ ఫలాపేక్ష లేకుండా ఎలా జీవించాలి? ఎంత ఎదిగినా అణిగి మణిగి, ఒదిగి ఎలా ఉండాలి? అన్నది నేను ఈ భక్తులను చూసి నేర్చుకున్నాను.

అలాగే జయనగర్ మూడవ బ్లాక్, మాధవన్ పార్క్ దగ్గర ఉన్న ఇంకొక తల్లి, పేరు శ్రీమతి రంగనాయకమ్మ. వీరు చాలా ఉన్నతమైన కుటుంబానికి చెందిన వాళ్లు. అలాగే లలితమ్మ, సుశీలమ్మ ఇలాంటి మహిళామ తల్లులని నాకు సత్యసాయి సంస్థలో పరిచయం అయ్యేభాగ్యం కలిగింది. ఆ ఇళ్లలో నిత్య భజనలు, పర్వదినాలలో విశేష కార్యక్రమాలు, నారాయణ సేవలు, నగర సంకీర్తనలు, దసరా మహోత్సవాలు, శివరాత్రి, ఏ పండగ అయినా ఆ ప్రాంతంలో ఉన్న ఆ ఇళ్లల్లో... నేను చాలా చురుకుగా పాల్గొనే వాడిని.

అలాంటి సందర్భంలో పరిచయం అయ్యారు శ్రీమతి రంగనాయకమ్మ గారు. ఈవిడను ఈ రోజుకి చూసినా ఆశ్చర్యమే! ఎంత అచంచలమైన విశ్వాసం అంటే... స్వామి అంటే అసలు ఇక ప్రాణమే వచ్చి లేచి కూర్చునే భక్తి పారవశ్యత చూశాను. ఎంత అమాయకతత్వము... అందరిలో స్వామిని చూసే ఆలోచన, ఇంటికి ఎవరు వచ్చినా స్వామే వచ్చాడు అని అనుకుంటారు. రంగనాయకమ్మ గారు రుమాటిక్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. ఎన్నెన్నో సార్లు శస్త్ర చికిత్సలు జరిగాయి. ఎన్ని జరిగినా స్వామిని మాత్రం వదలలేదు. ఈ రోజుకి కూడా ఆవిడ బాధపడుతుండొచ్చు కానీ, ఆవిడని

చూస్తే నాకు ఒక ఆర్తి, స్ఫూర్తి కలుగుతుంది. అంటే ఇంత కష్టం ఉన్నా సరే స్వామిని ఎంత ఇష్టంగా అలా పాదాలు పట్టుకున్నారో వీళ్లు! వీళ్లు కదా నిజమైన ఆదర్శము అని నేను అనుకుంటాను. మనకి ఈరోజు ఇంత చిన్న కష్టం వస్తే వెంటనే స్వామిని స్వామి కార్యాన్ని తీసి పక్కన పెట్టేస్తుంటాము. కానీ ఇలాంటి భక్తులను చూసినప్పుడు, జీవితం అంటే ఎంత కష్టం వచ్చినా నిలిచి ఉండాలన్న అద్భుతమైన ప్రేరణ కలుగుతుంది. శ్రీమతి రంగనాయకమ్మ వారి కుటుంబమును నేను వెళ్లినప్పుడల్లా కలుస్తూ ఉంటాను, ఆనందంగా మేమందరం కూడా స్వామి గురించి తలుచుకుంటూ ఉంటాము. ఇలాగ బెంగళూరులో ఏ ఇంటికి వెళ్లినా, ఏ మూలకువెళ్లినా ఇలాంటి భక్తులు చాలా మంది కనిపిస్తారు.

ఈ ఇద్దరి గురించి నేను ఎందుకు చెప్పానంటే, సాధారణ మైన గృహిణిగా ఉన్న ఈ ఇద్దరు కూడా చాలా ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని నాకు ప్రసాదించారు. స్వామి ఇట్లాంటి వాళ్లకి సదా తోడు నీడగా ఉండాలి, ఇంట కంట జంటగా ఉండాలి అని నేను ఎప్పుడూ ప్రార్థిస్తూ ఉంటాను.

33

స్వామి పాదాల చెంత 70 కవిత కుసుమాలు

బెంగళూరులో ఉన్న ఐదేళ్ల సమయంలో (1990–1995). చాలా విశేషాలు జీవితంలో చోటు చేసుకున్నాయి. ప్రధానంగా, స్వామితో చాలా మమేకమయ్యే సంఘటనలు జరిగాయి. 20–25 ఏళ్ల వయసులో చాలా దృఢమైన సంకల్పాలు కలిగేవి. స్వామికి నేను ఇంకా ఏంచేయాలి? ఎలా నేను సేవలో పాల్గొనాలి? స్వామికి ఏ విధంగా దగ్గర అవ్వాలి? స్వామి కళ్లలో నేను ఏ విధంగా పడాలి? ఒక ప్రియుడు ప్రియురాలి మీద ఉండే విరహాన్ని నేను అనుభవించే వాడిని. ప్రతి నిత్యము స్వామి గురించి తలుచుకునేవాడిని. నా వయసు నన్ను ఒకచోట నిలబడ నిచ్చేది కాదు. ఏదో విధంగా స్వామి కార్యంలో పాల్గొనాలని ఉవ్విళ్లూరుతూ ఉండేవాడిని. ఈ ప్రక్రియలో బెంగుళూరు సౌత్ కర్ణాటకలో సత్య సాయి సేవ సంస్థలో చాల చురుకుగా అయిపోయాను. కానీ పెద్ద వాళ్లందరూ కూడా నన్ను చాలా దూరం పెట్టే ప్రయత్నం చేసేవారు. ఈ అబ్బాయి అధికోత్సాహంతో ఉన్నాడు. కాస్త పక్కన పెట్టండి అనే మాటలు వినిపించేవి. అలాగే నాయకులు కొద్దిమంది, ఆ అబ్బాయిని దూరంగా పెట్టండి, పిలవకండి అని చెప్పే వాళ్లు కూడా... కానీ నా ధ్యాస మాత్రం కేవలం స్వామి మీదనే కానీ మరే దాని మీద ఉండేది కాదు. నేను ఎలా స్వామికి నన్ను అర్పించుకోవాలి అని చాలా బాధ పడే వాడిని. ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపే వాడిని. ఎన్నో రాత్రులు ఏడ్చుకుంటూ పడుకునే వాడిని. అయ్యో స్వామికి నేను ఏమి చేయ లేదే ఈ రోజు, ఎక్కడా భజనలో పాల్గొన లేదే, ఎక్కడా మాట్లాడ లేదే, ఎక్కడ బాల వికాస్ తీసుకో లేదే, ఇలా వివిధ ఆలోచనలు నన్ను అలా ఊరికే ఉంచేవి కాదు. స్వామి 68వ పుట్టు పండుగ అనుకుంటాను, ఆ సందర్భంలో ఒకరోజు రాత్రి నిద్ర పోతూ ఉంటే... తెల్లవారు ఝామున ఒక కుదుపుతో లేచి కూర్చున్నాను. ఆశువుగా స్వామి మీద విరహములో, ఆ బాధలో, ఆ కలతలో స్వామి మీద ఒక కవిత వచ్చేసింది.

"బ్రహ్మాండమున నిండియున్న బ్రహ్మవు నీవు
విశ్వంబులో వ్యాప్తి అయి ఉన్న విష్ణువు నీవు

మహిలోన వెలసిన మహేశ్వరుడవు నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి"

చాలా ఉత్సాహం వచ్చేసింది. అబ్బా ఏం వచ్చిందయ్యా పద్యము అని చక్కగా డైరీ తీసి వ్రాసుకున్నాను. ఇక ఆ తర్వాత నిద్రపోలేదు. పరిపరి విధాలుగా ఆలోచించాను. స్వామి అరవై ఎనిమిదవ పుట్టు పండుగ వస్తుంది కదా, ఆ సందర్భంగా నేను ఎందుకు కవితలు వ్రాయకూడదు? అని మొదలు పెట్టాను. ఆ రోజు నిజంగా లెక్క వేస్తే, నేను నిద్ర మేల్కొన్న రోజు నుంచి నవంబర్ 23వ తేదీకి 68 రోజులు ఉందండి! ఇది యాదృచ్ఛికం అనాలో, స్వామి సంకల్పం అనాలో నాకు తెలియదు కానీ, ఆ విధంగా రోజులు లెక్క వేసుకున్నాను. ఇక ఏ రోజుకి ఆ రోజు ఒక కవిత వ్రాసి గాని నిద్రపోకూడదు అని నిర్ణయంచుకున్నాను. ఎంత తపన పడేవాడినో 68 భావనలని స్వామికి అర్పించాలి అని! అచంచల భక్తి విశ్వాసములతో ప్రయత్నం చేయడం మొదలు పెట్టాను. మీరు నమ్మినా... నమ్మక పోయినా, ఇది నిజమండి. 68 రోజులు, 68 పద్యాలు నేను వ్రాయగలిగాను. నేను వ్రాసాను అంటే అది తప్పు... స్వామి వ్రాయించారు నాతో. ఎలాంటి సాహిత్య విలువలు తెలియకుండా, వ్యాకరణం తెలియకుండా, కేవలం హృదయములో కదలాడే భావనలని కవితలు / పద్యాల రూపంలో స్వామికి సమర్పించాలని నేను ప్రయత్నం చేశాను. సరిగ్గా నవంబర్ వచ్చే సరికి మొత్తం 68 పద్యాలను చిన్న పుస్తకంలో వ్రాసి దాన్ని తీసుకెళ్లి స్వామికి ఇవ్వాలని తపించాను. తర్వాత పుస్తకం ముద్రించాలని ఆలోచనలు వచ్చాయి. కానీ, నాకు స్వామి దగ్గరకు వెళ్లే అవకాశం రాలేదు. 68 సంఖ్య సరి కాదేమో అని వాటికి ఇంకా రెండు పద్యాలు జత చేసి స్వామి 70వ పుట్టు పండుగకు అందజేద్దాం అని నిర్ణయించాను. చిట్టచివరికి రకరకాల అనుభవాలను తీసుకుని 70వ పండుగకు అలాగ జనరల్ దర్శన్ లైన్‌లో స్వామిని చేరి, ఈ పుస్తకం ఇస్తూ "స్వామి మీ పుట్టు పండుగ కోసమై వ్రాసాను స్వామి ఈ పద్యాలు" అంటే స్వామి ఆ పుస్తకాన్ని తనచేతిలో నుంచి నా ఒళ్లోకి జార విడుస్తూ "నీ హృదయంలో పెట్టుకో బంగారు" అని చెప్పారు. అంటే అక్కడ ఎందుకు పెట్టుకో మన్నారో తెలియదు. అప్పుడు ఒక టేపు రికార్డర్ పెట్టి క్యాసెట్‌లో రికార్డు చేశాను.

సుమారు 30 సంవత్సరాలు అయ్యింది నేను రికార్డు చేసి. ఆ క్యాసెట్ లేదు, పుస్తకమూ లేదు, ఏమీ లేదు. మళ్లీ నేను పుస్తక రచనలో భాగంగా ఈ పద్యాలని స్వామికి అర్పించాలని అనిపించింది. బెంగళూరులో, హైదరాబాద్లో ఎన్నో చోట్ల నేను దీని గురించి వెతికాను. ఎక్కడ దొరకలేదు. ఇప్పటి సమయంలో టేప్ రికార్డర్ అంతా వాడుకలో లేదు. కానీ ఆ క్యాసెట్స్ ఇంట్లోఎక్కడో ఒక మూల పడి ఉన్నాయి అని గుర్తు చేసుకున్నాను. వెంటనే వెళ్లి నా వద్ద ఉపయోగంలో లేని వందల క్యాసెట్స్‌లో నాకు కావాల్సిన క్యాసెట్, దాని కలర్, దాని పైన వ్రాసిన 'సత్యసాయిబాబా బాలచంద్ర' గుర్తు ఉండడం వల్ల అది దొరికింది. చాలా విచిత్రంగా సాయి సోదరుడు వినోద్ టేప్ రికార్డర్ ఒకటి తెచ్చిస్తే... ఆ క్యాసెట్ని నేను వినే అవకాశం దొరికింది. ఆ 70 పద్యాలని స్వామి పాదాల చెంత సమర్పించిన దివ్య పుష్పాలతో కొన్ని మీకు విన్నవించే ప్రయత్నం చేస్తున్నాను.

1. **మానసంబునవెలసిన మీనాక్షి నీవు**
కామితార్థములు తీర్చు కామాక్షి నీవు
హృదయ విశాలత కలిగించు విశాలాక్షి నీవు
అందుకో వందనములుశ్రీ సత్యసాయి!

2. దిక్కులే అంబరముగా కలిగిన దిగంబరుడు నీవు
రవిచంద్రులు ఇరువురు నీదు దృక్కులు
బ్రహ్మాండమంతయున్నది నీ బొజ్జలో కదా
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

3. అనుగ్రహ వర్షము కురిపించు వాడవు
ఆనంద వసంతమందించు వాడవు
వేయి తల్లుల ప్రేమను పంచు వాడవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

4. త్రేతలో సత్యధర్మముల సాయి రాముడు నీవు
ద్వాపరంబున శాంతి ప్రేమల సాయి కృష్ణుడు నీవు
కలి మొదలులో అహింస రూపైన బుద్ధుడు నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

5. సత్య బోధన చేయు సద్గురువు నీవు
స్వాంతనము కలిగించు సాయి నాథుడు నీవు
భయమంతయు తొలగించు బాబావు నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

6. అందమైన దానికి ఉన్న రూపంబు నీవు
అద్భుతంబుకున్న అర్థంబు నీవు
అనంతమున కున్న ఆది అంత్యము నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

7. అఖలాండ బ్రహ్మాండ మంత నిండి యున్న నిత్య సత్యము నీవు
పదునాలుగు భువనాలకు ప్రాణమై ఉన్న పరమ శివము నీవు
మూడు లోకములకు మేటి అతిలోక సుందరుడు నీవు
అందుకో వందనములు శ్రీసత్య సాయి!

8. భావమంతయు నిండి యున్న భక్తి నీవు
దేహమందిరములో వెలిసిన దైవంబు నీవు
నాదు కరముల నిలిచియున్న శక్తి నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

9. అజహరాదులకైన అందనట్టి వాడవు
సృష్టి చేయు బ్రహ్మకైన భ్రమకూర్చు వాడవు
భూదేవి రక్షింప భువిలోన వెలసినాడవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

10. పాప ఫలము ద్రుంచు పావనుండు నీవు
ప్రాణికోటిని రక్షించు ప్రాణనాథుడు నీవు
ప్రశాంతతనందించు ప్రణవ శబ్దము నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

11. తామసంబును రూపుమాపగా సమత తోడ వచ్చినాడవు
రాజశంబు రాగమణచగ రాజరాజై నిలిచినాడవు
సాత్వికంబుకు స్థానమివ్వ వచ్చిన సాయినాథుడవు నీవు
అందుకో వందనములు శ్రీసత్యసాయి!

12. అష్ట కష్టములు పడుచున్న వారికి అద్భుత ధైర్యంబు నీవు
అంతులేని దుఃఖము అనుభవించు వారికి ఎంతో ఓదార్పు నీవు
దారియే తెలియక వ్రుగ్గుచున్న వారికి సత్యమైన బాటవి నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

13. ఆద్యంతములు లేని అద్భుతము నీవు
అనాధనాథుడవైన సనాతనుడవు నీవు
ఆకార సాకార నిరాకారుడవు నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

14. పూర్ణావతారమున పుడిమి కేతించిన కృష్ణుడు నీవు
ప్రేమ రూపు దాల్చి ప్రేమను పంచిన క్రీస్తు నీవు
పరి పూర్ణ ప్రేమావతారమైన పర్తి సాయివి నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

15. గగన తలమున వెలుగు భాస్కరుండు నీవు
చల్లని వెన్నెల పంచు చంద్రుండు నీవు
తళుకు బెళుకులీను చక్కని చుక్కలు నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

16. ఓంకార రూపమున వెలుగొందు వాడవు
ఓంకార నాదసుస్వరములు కలిగిన వాడవు
ఓంకార రాగరసామృతములు పంచువాడవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

17. అనసూయకు దత్తుడై ప్రభవించిన వాడవు
దేవగిరి అమ్మకు పుత్రుడై జన్మించిన వాడవు
ఈశ్వరమ్మకు తనయుడై అవతరించిన వాడవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

18. ప్రాక్ పశ్చిమంబులు ఒక్కటి చేయగ బూని
భవ్యభారతంబున దివ్య భావము చేకూర్చ
పుణ్యజనుల కోరికపై పుడమికొచ్చితివి నీవు
అందుకో వందనములుశ్రీ సత్యసాయి!

19. నీ తీపి నామము తలచిన వారికి తోడు నీడ నీవు
నీ దివ్య నామము స్మరించినవారి వెంట జంట నీవు
నీ ఇష్ట నామము జపించిన వారి ఇంట కంట నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

20. కొలచిన వారికి కొంగు బంగారమైన వాడవు
శరణన్న వారి సంకటము తొలగించు వాడవు
భజియించిన వారి భయమంతయు పోగొట్టు వాడవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి!

ఇలా ఒక భావము కాదు, ఎన్ని భావాలో, ఎన్ని ఆలోచనలో, ఎన్ని మధురానుభూతులో నేను చెప్పలేను. ఇలా సుమారు ఒక 70 రోజుల పాటు దీక్షగా పద్యాలు వ్రాశాను.

34

హృదయ తాపం – సహస్ర రూపా సాయీశా గీతం

బెంగళూరు నాకు చాలా అద్భుతమైన, అమరమైన, అమృతమైన జ్ఞాపకాలను ప్రసాదించింది. 1993-1995 మూడు ఏళ్లు కామాఖ్య బడావనిలో నివసించే వాళ్లం.

ఆ ప్రాంతంలో అంతా నిర్జన ప్రదేశం. ఏ రోడ్డు చూసినా నిశ్శబ్దంగా ఉండేది, ఏ ఇల్లు చూసినా ప్రశాంతంగా కనిపించేది. మా ఇల్లు శ్రీ ధామ చాలా పెద్ద ఇల్లు. ఆ ఇంట్లో అన్నయ్య వదినలతో ఉంటూ నేను CS కోర్సు చేసుకునే వాడిని. ఆ ప్రొఫెషనల్ కోర్స్ నాకు దుర్భేద్యమైన లక్ష్యముగా నిలబడింది. ఉద్యోగం, న్యాయ శాస్త్ర చదువు, ఇంటి పనులు ఇలా నన్ను సతమతం చేసేవి. ఇక స్వామి గురించి నా తపన తెలిసిందే! ఆ రోజుల్లో సంస్థలో చాల మంది నన్ను దూరం పెట్టినారు. నేను ఎలాగైనా స్వామికి దగ్గర అవ్వాలి అనే తపనతో ఆ చుట్టు పక్కల ఉన్న జనాలందరినీ కలవడము, ఎక్కడైనా స్వామి భక్తులు ఉన్నారా అని వెతకడము జరిగింది. అలా వెతుకుతున్న సమయంలో, మా ఇంటికి దగ్గరలో అమృతవల్లి పరిచయం కావడము, వారి ద్వారా వారి కుటుంబం పరిచయం కావడం జరిగింది. వాళ్లందరికి స్వామితో ఎన్నో అనుభవాలు ఉన్నాయి. వారు తమిళియన్స్. చిన్నప్పటి నుంచి స్వామి కార్యం కోసమై చాలా పాటుపడ్డారు. అలాంటి కుటుంబంతో పరిచయం అవ్వడం, ఆ కాలనీలో ఉన్న ఆరు ఏడు రోడ్లు వెళ్లి... స్వామి భక్తుల కోసమై జల్లెడ పట్టడం, ఆ ప్రాంతంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలనే తపనతో ఇలా చేశాను.

తర్వాత కాలంలో ఆ కాలనీలో సత్యసాయి భజన మండలిని ప్రారంభం చేసే అవకాశం కలిగింది. అక్కడ ప్రతి గురువారము మరియు ప్రతి ఆదివారం సాయి కార్యాన్నే ప్రపంచంగా చేసుకుని ఎన్నెన్నో కార్యక్రమాలు చేసుకునే వాళ్లము. నగరసంకీర్తన, పర్వదినాలు, పారాయణాలు, బాల వికాస్ కేంద్రం మా జీవితములో భాగం అయ్యాయి. ప్రతీది కూడా ఒక అనుభవమే! ప్రతీది కూడా నేర్చుకోవడమే అయ్యింది.

రాత్రి అయితే చాలు, చాలా మదన పడేవాడిని. అయ్యో స్వామికి నేను ఏం చేయలేదే అని.

ఏమైనా చేయాలి అన్న ఆకలి ఉండేది. "అయ్యో! స్వామి!! 'నిన్ను దగ్గర నుండి చూసే అవకాశం నాకు లేదే, అయినా నిన్ను చూడాలంటే కావలసింది చర్మ చక్షువులా? లేక జ్ఞాన చక్షువులా? అంతర్ముఖంగా నిన్ను చూడాలి. అప్పుడు నువు సహస్ర రూపాలలో, చుట్టూ ఉన్న వాళ్లందరిలో నీవు కనిపిస్తావు". అని నేను చాలా అమాయకంగా, ఆ సాధనలో నేను చాలా అంతర్ముఖుడిగా మారిపోయి నా గదిలో తలుపులు పెట్టుకొని ఏడ్చుకునేవాడిని.

అలాంటి స్థితిలో నేను ఉన్నప్పుడు ఒకరోజు రాత్రి ఒక మంచి భావన హృదయాంతరాళము నుండి అశువుగా పుట్టింది.

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్ర పాత్
సభూమిం విశ్వతో వృత్వా అత్యతిష్టదశాంగుళం

ఇది పురుష సూక్తంలో నేర్చుకున్నాను... సహస్రమైన రూపాల్లో నువ్వు కనిపిస్తున్నావు స్వామి అని. అలా ఆ బాధలో హృదయంలోనుండి పుట్టుకొచ్చింది ఒక భజన పాట. చాలా చోట్ల ఆ పాట నేను పాడేవాడిని. ఆ పాట పాడినప్పుడు చాలా ఉద్వేగం అయిపోయేది. స్వామిని నేను చూస్తున్నాను. స్వామి కోసం నేను ఆవేదన చెందుతున్నాను అని అనుకునే వాడిని. విన్న వాళ్లందరూ కూడా భక్తి పారవశ్యంతో వూగి పోయే వాళ్లు.

సహస్ర రూపా సాయిశా
వేద వేదాంత గుణశీలా
సహస్ర రూప సాయిశా
నీ చరణం భవ భయ హరణం
నీ స్మరణం సంకట హరణం
నీ దర్శనం సర్వ పాపనాశనం
పాద స్పర్శనం పాప విమోచనం
సాయిశా సాయిశా సాయిశా సత్య సాయిశా
సాయిశా సాయిశా సాయిశా సత్య సాయిశా

అంటూ ఈ పాట పాడుతుంటే, ఏడుపు కూడా వచ్చేసేది. అంత ఆర్తి, అంత కృతజ్ఞత భావన, అంత భక్తి ప్రపత్తి, స్వామిని చేరుకోవాలి, స్వామిని అందుకోవాలి, స్వామి పాద నమస్కారం చేస్తే ఇట్లా ఉంటుంది. స్వామి స్మరణం చేస్తే ఇట్లా ఉంటుంది. స్వామి నామము చేస్తే ఇట్లా ఉంటుంది. అని నేను అలా పాడుకుంటూ నా కాలాన్ని గడిపే వాడిని. ఈ పాట కొన్నేళ్లకి నేను హైదరాబాద్ వచ్చిన తర్వాత కూడా చాలా సందర్భాలలో పాడే వాడిని. ఎలా అయిపోయింది అంటే... ఈ పాట అందరికీ బాగా నచ్చేది. యూత్ మీటింగ్స్, కాన్ఫరెన్స్, స్పెషల్ భజన్స్, యువకులందరూ కలిసిన సమ్మేళనాలు ఏదైతే ఏమిటి, ఎక్కడ వీలైతే, అక్కడ ఈ పాట పాడే వాడిని.

1998 సంవత్సరంలో ఒకానొక సమయంలో హైదరాబాద్ నుండి పుట్టపర్తికి వెళ్లినప్పుడు పూర్ణచంద్ర ఆడిటోరియంలో, స్వామి సమక్షంలో, ఈ పాటని పాడ గలిగే అదృష్టం మా బృందానికి కలిగింది. సాయిరామ్ బోర్డు వెనక ఉన్న ఆ చిన్న ఆ ఖాళీ స్థలములో మేము కూర్చుని, స్వామి వేదిక మీదకు వస్తూనే స్వామికి నివేదించాము. మైకే లేకుండా గొంతెత్తి పూర్ణచంద్ర ఆడిటోరియం అంతా వినిపించే విధంగా పాడాము. స్వామి వేదిక మీద కూర్చొని విన్నారు. ఈ పాట విని చాలా సంతోషపడ్డారు. ఈ విషయము ఒకసారి సింహావలోకనం చేసుకుంటే, ఎంత విరహంలో పాడాను? చివరకు ఈ పాట, నా

ప్రియుడికి, నా స్వామికి, నా శ్రీనాథుడికి, నా శ్రీవారికి నిజంగానే అందిన సందర్భము నన్ను మైమరిపింపచేసింది.

నేను స్వామికి ఎప్పుడూ చాల ఋణపడి ఉంటాను. నేను ఎప్పుడో ఎక్కడో ఎంతో సాధారణంగా, ఎంతో దీనంగా, ఏడుస్తూ నాలో నేను చెప్పుకున్న భావనలు... మాటలు... పాటలు... విషయాలు అన్ని కూడా తర్వాతి కాలంలో స్వామి స్వయంగా స్వీకరించి అనుగ్రహించారు. ఇలా స్వామి నన్ను ఆశీర్వదించారు అని నేను తలుచుకుంటాను. ఎక్కడికి వెళ్లినా నా ఆర్తిని చూసి ఎంతో మంది కొత్త వాళ్లు పరిచయం అయ్యి, స్వామి భక్తులుగా మారిన సంఘటనలు ఉన్నాయి. ఆ రోజుల్లో బాలవికాస్ తరగతుల ద్వారా పరిచయం అయిన పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు, పెళ్లిళ్లు చేసుకున్నారు, ఈ రోజుకు కూడా వాళ్లెవరూ స్వామిని మరచి పోలేదు! నన్నూ మరచి పోలేదు! ఏం చేసినా సరే ఎవ్వరూ మర్చిపోలేదు.

కొన్ని రోజుల క్రితం గురు చరణ్ అనే ఒక అబ్బాయి నాకు కాల్ చేసి గుర్తుపట్టారా అని అడిగారు.

"నేను మీ బాలావికాస్ విద్యార్థిని, బెంగళూరు కామాఖ్య బడావనిలో మీ విద్యార్థిని. ఇప్పుడు నేను CA చేసి హైదరాబాద్‌కి వచ్చాను మిమ్మల్ని కలవగలను అనుకోలేదు... మిమ్మల్ని చూస్తున్నాను" అంటే, నా ఆశ్చర్యానికి అంతే లేదు. ఆ అబ్బాయి తన భార్యా పిల్లలతో వచ్చి, నమస్కారం చేసి, నాకు పళ్లు ఇచ్చి, నన్ను ఒక మిరాకిల్ అన్నట్టుగా చూసి, అభయ చేస్తున్న కార్యక్రమాలు అంతా విని ఎంత సంతోష పడ్డారో! వాళ్లని చూస్తుంటే నా బిడ్డలను చూసినట్టే అనిపించింది. అలాగే పిల్లలందరూ కూడా ఈ రోజుకి నాతో సంబంధ బాంధవ్యాలు నెరపుతూనే ఉన్నారు. ఈ అసిధారా వ్రతములో స్వామి గురించి చెప్తున్న సమయంలో... అలవోకగా నా గురించి నేను చెప్పడం అవుతుంది. నా గురించి నేను చెప్పడం లేదు, ఇది కేవలం స్వామి నాలో కూర్చిన, తీర్చిన, భావాలు, అనుభవాలు, అనుభూతులు... నేను కేవలం పంచే ప్రయత్నం చేస్తున్నాను.

ప్రతిదీ కూడా స్వామియే... వ్యక్తిగతం ఏమి లేదు. ఈ వ్యక్తి వెనక ఉండే శక్తి స్వామియే అని చెప్తూ ఉంటాను. ఇలాగ 1995 వచ్చే వేళకి, ఆ స్వామి 70వ పుట్టు పండుగ వచ్చింది. ఎక్కడికీ పోయిన సందర్భం లేదు, కారణం, సేవకు వెళ్లాలన్నా, పుట్టపర్తికి వెళ్లాలన్నా, CS/ Law పరీక్షలు నాకు బాగా అడ్డు పడేవి. ఇంకో ప్రక్క ఉద్యోగము. రెండు రోజులు మూడు రోజులు కూడా సమయం దొరికేది కాదన్నమాట. ఈ సమయంలో నేను ఏం చేసేవాడిని అంటే... ఎక్కడ పని చేస్తే ఆ ఆఫీస్‌లో అంతా కూడా స్వామి గురించి చెప్పడము, వాళ్లని బాబా భక్తులుగా చేయడము, ఇదే పని ఇంక వేరే పని పాట ఏమి లేదు అన్నట్టుగా ఉండేవాడిని. ఒక పెయిడ్ అసిస్టెంట్ ఉద్యోగమైనా, ఒక అకౌంటెంట్ ఉద్యోగమైనా, ఒక సెక్రటేరియల్ అసిస్టెంట్ ఉద్యోగమైనా సరే, అను నిత్యము, అనుక్షణము, అహరహము, అవిశ్రాంతంగా.. స్వామి గురించి తలుచుకోవడం జరిగేది. 1995, 70వ పుట్టు పండుగ నవంబర్‌లో వస్తుందంటే, నాకు చాలా ఉద్వేగం అయిపోయింది. అందరూ పెద్ద పెద్ద కార్యక్రమాలు చేస్తున్నారే, నేనేమి చేయలేదే అని మదన పడే వాడిని. స్వామికి ఏం చేసుకోవచ్చు అని అలాంటి ఆర్తిలో నుంచి ఒక మూడు కార్యక్రమాలు చేయాలి అన్న ఆలోచన వచ్చింది. ఒకటి పెద్దల కోసం, రెండు యువత కోసం, మూడు పిల్లల కోసం చేయాలి అని నిర్ణయించుకున్నాను.

చిన్నారుల కోసం "సాయి నందన" అనే కార్యక్రమం కామాఖ్య బడావనిలో నివసించే తెలిసిన మరియు తెలియని పిల్లలందరిని కూర్చి వాళ్లందరిని తీసుకొచ్చి చాలా సంతోషంగా వాళ్లకి మంచి

విషయాలు చెప్పడం ఒక రెండు మూడు గంటల కార్యక్రమము కల్చరల్ ప్రోగ్రామ్స్, భజన ఇలాంటివి చేశాను.

యువత కోసం "సాయి చందన" అనే కార్యక్రమాన్ని చేయడము. ఆ కార్యక్రమంలో యువతీ యువకులను చేర్చి, ఆ బెంగళూరులో లా కాలేజీలో స్టూడెంట్స్, కంపెనీ సెక్రెటరీలో స్టూడెంట్స్, ఆఫీస్‌లో కొలీగ్స్ నా యొక్క వయసులో ఉన్న వాళ్లందరిని కూడా ఇంటికి తీసుకొచ్చి కార్యక్రమం ఏర్పాటు చేశాను.

అలాగే పెద్దవారికి "సాయి వందన" అనే కార్యక్రమం ద్వారా ఆ చుట్టుపక్కల ఉన్న పెద్దవాళ్లందరినీ తీసుకొచ్చి స్వామి యొక్క పుట్టపండుగ జరుపుకోవడం జరిగింది. అంటే ఏ రకంగా స్వామికి నేను చేసుకోగలను, ఏ విధంగా స్వామిని నేను పూజించగలను, స్వామిని నేను ఏ విధంగా ప్రేమించగలను, చుట్టు పక్కల ప్రజలకి నేను ఏ విధంగా ఉపయోగపడగలను, అనే ఆలోచన, నన్ను నిలువనీయలేదు, ఇందులో సందేహం లేదు, ఇలా స్వామిని గురించి అనుక్షణము నేను తపిస్తూ ఉండే వాడిని.

35

రజతోత్సవ బహుమతి – హైదరాబాద్ యూత్

1995వ సంవత్సరానికి, నేను 25 ఏళ్లవాడిని. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో నా జీవితం సాగింది. అద్భుతమైన భక్తి విశ్వాసాలు, వాక్ చాతుర్యం, నాయకత్వ ధోరణి, సేవా దృక్పథంతో నన్ను చాలా వైవిధ్యమైన వ్యక్తిగా స్వామి వారు మార్చేసారు. 25 ఏళ్లు అంటే యుక్త వయసు. యుక్త వయసులో ఏ అబ్బాయికైనా మోహము, ప్రేమ, అనురాగము ఇవన్నీ కూడా హృదయంలో మొగ్గ తొడిగే సమయము. పెళ్లి చేసుకోవాల్సిన సమయము. అమ్మాయిల గురించి ఆలోచించాల్సిన సమయము. కానీ నా జీవితంలో ఎవరి గురించి ఎక్కువగా ఆలోచించాను? ఎవరి ప్రేమ గురించి అర్రులు జాచాను? ఎవరి అనుగ్రహము కోసమై పడిగాపులు కాచాను? ఎవరి యొక్క సహచర్యం కోసమై పరితపించాను? అని ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటే, నేను ఆ వయస్సులో స్వామిని మాత్రమే కాంక్షించాను. బాబాని ప్రేమించాను, స్వామిని మోహించాను, వారిని చూడాలని తహతహ లాడేవాడిని... ఆ విరహం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఎప్పుడు వీలైతే అప్పుడు బెంగళూరు నుంచి చాలా కష్టంగా పుట్టపర్తికి వెళ్లడం లేదా బృందావనంకి వెళ్లడం, స్వామి దర్శనం చేసుకోవడం ఇదే జీవితం ఐపోయింది. స్వామి కళ్లలో కళ్లు పెట్టిచూస్తే చాలు ఆ రోజు ఇక ఆనందం ఐపోయేది! ఇక పాద నమస్కారం దొరికితే అద్భుతమే. స్వామి మాట్లాడితే ఆహా ఇక ఆ అనుభూతి నేను మర్చిపోలేని విధంగా ఉండేది.

అలాంటి సందర్భంలో ఒకానొక శివరాత్రి రోజు, స్వామి వారి దర్శనం చేసుకోవాలని, ప్రశాంతి నిలయానికి వెళ్లాలి అని, ఇంట్లో చెప్పుకుని రెండు మూడు రోజులు సమయము తీసుకున్నాను. CS చదువు, ఉద్యోగం చెయ్యడం, లా కోర్సు చేస్తుండటం మొదలగు కారణాల వల్ల సెలవులు మరియు అనుమతులు చాల కష్టంగా ఉండేవి. అయినా సరే స్వామిని చాలా రోజులు ఐంది చూడక. అని అందరి సమ్మతి తీసుకొని పుట్టపర్తికి వెళ్లాను. పుట్టపర్తిలో గణేశ మందిరం ముందర నమస్కారం చేసిన తక్షణం డాక్టర్ నలబాల అంజనయ్య గదికి వెళ్లి పలకరిద్దామని వెళ్లాను. ఆయన నన్ను చూసి

'ఏమయ్యా బాలచంద్ర, సమయానికి వచ్చావే, స్వామి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పిల్లలందరిని కూడా రమ్మని చెప్పారు. హైదరాబాద్ వాళ్లంతా దీనికి నాయకత్వం వహిస్తున్నారు. నువ్వు కూడా ఎట్లాగో వచ్చావు కదా, మొత్తం రాయలసీమ, అనంతపురం, కడప, కర్నూలు నుంచి కేవలం 10 మంది కూడా రాలేదయ్యా. నువ్వు ఎట్లాగో వచ్చావు, చాలా మంచిది. నాకు తెలుసు నువ్వు ఏంటో, నువ్వు కూడా మన పిల్లలతో చేరి పో' అంటే, నా ఉత్సాహానికి అంతే లేదు.

వారు నా పేరు ఇచ్చి, ఒక ఐడి కార్డు స్టార్ఫ్ ఇచ్చినారు, అప్పటికే వందలాది మంది ఆంధ్రదేశం నలుమూలల నుండి వచ్చేసారు. స్వామి వారు పిల్లలందరిని కూడా ఈశ్వరమ్మ హై స్కూల్‌లో విడిది చేయమని చెప్పారట, అక్కడికి వెళ్లాలి అని చెప్పారు. ఎవరిని కలవాలి? అంటే హైదరాబాద్ పిల్లలు ఉంటారు అక్కడ వాళ్లతో కలువు నేను పంపించాను అని చెప్పమన్నారు. చాలా విచిత్రం కదా ఈ విషయం! ఎక్కడ బెంగళూరు? ఎక్కడ నేను? ఎక్కడ ఆంధ్ర ప్రదేశ్? ఎక్కడ శివరాత్రి? ఇలా అన్ని కలిసి వచ్చాయి నా జీవితంలోకి! ఉదయం స్వామి దర్శనం తర్వాత. సాయంకాలము నేను రెడీ అయి ఈశ్వరమ్మ స్కూల్‌కి వెళ్లాను. అక్కడ చాలా కోలాహలంగా, హడావుడిగా ఉంది. కొన్ని వందల మంది నా వయస్సులో ఉన్న పిల్లలందరూ కూడా గట్టి గట్టిగా మాట్లాడుకుంటూ, ముచ్చట్లాడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. వేదిక మీద ఉన్న కొద్దిమంది సోదరులు అందరినీ పర్యవేక్షిస్తున్నారు. వాళ్లందరూ చాలా కష్టపడి అక్కడ నిలబడి ఉన్న యువకులకు ఏదో చెప్పే ప్రయత్నం చేస్తున్నారని అర్థం అయింది. కానీ ఎవరు ఎవ్వరీ మాట వినే పరిస్థితుల్లో లేరు. కారణం మైక్ లేదు. గట్టిగా మాట్లాడే వాళ్లు నాకు అక్కడ కనపడ లేదు. అదేంటి క్రమశిక్షణగా ఉండాల్సిన పిల్లలు ఈ సమయంలో ఇట్లా గొడవ చేయడం ఏమిటి అని చాలా విచిత్రంగా అనిపించింది. గొంతు సవరించుకుని సింహనాదం చేశాను ఒక్కసారి 'జై బోలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబాజీ కి' అని నేను మధ్యలో ఉండి నినదిస్తే వందలమంది చేరి జైజై కారాలు కొట్టడమే గాక చాలా ఉత్సాహంగా అందరూ నాతో గొంతు కలిపారు. దాంతో నేను మంచి పాట అందుకున్నాను.

ఢమ్ ఢమ్ ఢమ్ ఢమ్ ఢమరు బజే
హర భోలేనాథ శివ శంభో భజే...

ఇక ఆ దెబ్బతో మొత్తం అక్కడున్న వందలాది మంది ఏకాగ్ర చిత్తంతో... మాటలు మానేసి అందరూ ఒకటిగా మారి పాట అందుకున్నారు, అద్భుతమైన భజన మొదలు అయింది. మంచి వాతావరణం ఏర్పడింది. ఇక అలా అంతటితో ఆగకుండా

జై సాయి రామ్ జై సాయి రామ్
జై సాయి రామ్ బోలో జై సాయి రామ్
అనాధ రక్షక సాయి రామ్
ఆపద్బాంధవ సాయి రామ్
ప్రేమ స్వరూప సాయిరామ్
ప్రేమావతార సాయి రామ్
పరి పూర్ణావతార సాయి రామ్

ఇలా ఒకటి రెండు పాటలకి అక్కడి వాతావరణం అంతా దివ్యమైన ప్రకంపనలతో నిండి పోయి సమావేశానికి అనువుగా మారి పోయింది.

అక్కడ వేదిక మీదున్న హైదరాబాద్ సోదరులలో, ఒకరు ఎవరో పిలిచారు వేదిక పైకి వచ్చి

పాడమని. నాకు కూడా ఆనందమైంది. అలవోకగా ఏమీ తెలియని విధంగా ఆ గుంపులో నుంచి నేను వేదిక మీదకు వెళ్లడం జరిగింది. కాసేపు అలా భజనలతో అందరిని ఉర్రూతలూగించేసా!! అక్కడ ఉండే వాళ్లలో నలుగురు నా దృష్టిని ఆకర్షించారు. ఒకరేమో నల్లగా ఉన్న వ్యక్తి, ఇంకొకరు లావుగా ఉన్న వ్యక్తి, ఇంకొకరు పొట్టిగా ఉన్న వ్యక్తి, మరొకరు బాగా పొడవుగా ఉన్న వ్యక్తి. ఈ నలుగురు నన్ను బాగా ఆకర్షించారు. వాళ్లు నిర్వహణ విధానం, సమన్వయం చేసే పద్ధతి, చురుకుదనం చూసి ఆనందం అయింది.

ఎంత అద్భుతంగా ఉన్నారు, అని వాళ్లతో నేను పరిచయం చేసుకొన్నాను. డాక్టర్ అంజనయ్య... ఈ విధంగా ఇక్కడికి పంపించారు. నేను అనంతపురము తరపున అని చెప్పి, వాళ్లకి నా పేరు ఇచ్చాను. అసలు పరిచయం చేసుకోకుండానే... నా ఎంట్రీ తోనే అందరికీ ఆకర్షితుడిగా మారిపోయాను కదా! వాళ్లు కూడా చాలా సంతోషంగా నన్ను ఆహ్వానించి నన్ను అక్కున చేర్చుకున్నారు. అలా ఆ బృందంలో నేను కూడా చేరిపోయాను.

ఆ మరుసటి రోజు ప్రశాంతి నిలయంలో దర్శనం సమయంలో అందరూ కూర్చోవడం, స్వామి రావడం... ఎంతో మాతృ ప్రేమతో, అనురాగముతో, వాత్సల్యంతో నలుగురితో మాట్లాడటం, అందరి కంటే ముందర హైదరాబాద్ పిల్లలు కూర్చోవడం గమనించాను. ఆశ్చర్యం ఏమిటి అంటే... ముందు రోజు వేదిక మీద నేను ఎవరినైతే చూసానో, ఎవరైతే నన్ను వేదిక మీదకు రమ్మని ఆహ్వానించారో వాళ్లందరూ కూడా ముందు వరుసలో ఉన్నారు. ఒకరిని కర్రోడు అని పిలిచేవారు స్వామి. నల్లగా ఉండేవాడు, ఆయన పేరు ఉదయ భాస్కర్‌రెడ్డి. ఆ తర్వాత లావుగా ఉండి బురుగు మీసాలతో ఉన్న వ్యక్తి పిడతల గోపికృష్ణ అని తెలుసుకున్నాను. పొట్టిగా ఉన్న వ్యక్తి శ్రీనివాస చంద్రశేఖర్ అని తెలుసుకున్నాను. అలాగే పొడవుగా ఉన్న వ్యక్తి వై శ్రీనివాస్ అని తెలుసుకున్నాను.

అలాగే చాలా మంది బ్రదర్స్‌ను కూడా ఆ సందర్భంలో కలవడం జరిగింది. పూర్ణచంద్రలో స్వామి వారు భజన చేయమని చెప్పడం గమనించాను. 1995వ సంవత్సరం శివరాత్రి ముందే ఈ కార్యక్రమం అంతా జరుగుతోంది. పూర్ణచంద్రలో స్వామి కేవలం, హైదరాబాద్ పిల్లల ద్వారా సమీకరించబడిన ఆరు వందల మంది పిల్లల్ని స్వామి కూర్చోమని చెప్పారు. చాలా ఉత్సుకతగా ఉంది వాతావరణం ఏమిటి? ఏం జరగబోతుంది? స్వామి ఎందుకు పిలిచారు? కొద్ది మందికి తెలుసు అనుకుంటాను. కానీ వచ్చిన నాలాంటి పిల్లలకు ఏమి తెలియదు. నాకు అదే మొదటి అనుభవం. అంటే వందల మంది యువ జనులతో కలిసి కూర్చోవడం ఒక ఉద్విజ్ఞతకి దారి తీసింది. నాలో తెలియని అనుభూతి కలుగుతోంది. ఆ రెండు మూడు రోజులు అన్ని మర్చిపోయాను. ఇక స్వామి సమక్షంలో నేను ఉండబోతున్నాను అని ఆనందపడ్డాను. పూర్ణ చంద్ర ఆడిటోరియంలోకి వెళ్లే ముందర నాకు ప్రధానంగా గోపి కృష్ణను చూసినప్పుడు చాలా డైనమిక్‌గా కనిపించాడు. నేను పాట పాడు తాను అని అంటే, నువ్వు వద్దు కూర్చో అని కూర్చోబెట్టాడు. నాకు కొంచెం బాధ అయ్యింది అవకాశం ఇవ్వలేదని. కానీ అన్ని జిల్లాల నుంచి వచ్చిన వాళ్లని నిర్వహించడం చాల కష్టమైన పని అని తరువాత అర్థమయ్యింది. వచ్చిన వాళ్లతో మాట్లాడడము, వాళ్లతో కార్యక్రమం చేయడము, వాళ్లకు వివరించడము ఇవన్నీ కష్టమైన విషయాలు.

నాకు గుర్తు అదే సందర్భంలో, స్వామి సమక్షంలో హిందూపూర్ నుండి వచ్చిన మధుసూదన్‌ని కలుసుకోవడం. ఆ రోజు స్వామి ఏమో పూర్ణచంద్ర సభా మంటపం ఒకటే షటర్ తీయమని చెప్పారట. ఆ షటర్‌లో నుంచి స్వామి అందరిని లోపలికి పిలిపించడము, మేమందరం కూడా

లోపల వేదిక ముందు భాగంలో... క్రిందనే ఏర్పాటు చేసిన సింహాసనం ముందర 4-5 అడుగుల దూరంలో కూర్చోవడం, భజన చేయడం, స్వామి రావడము, స్వామి వారు మమ్మల్ని అందరిని ఉద్దేశించి చారిత్రాత్మిక దివ్యోపన్యాసం చేయడం నాకు గుర్తు. ఆ రోజు బాగా గుర్తున్న విషయాలు ఏమిటి అంటే 'బంగారూ! మంచి పని చేయండి! మంచి పని చేస్తే మీ ఇంట వెంట కంట జంటగా నేను ఉన్నాను" అని చెప్పడం, "మీరందరూ చాలా మంచి పిల్లలు, మీరు ఇక్కడికి రావడం చాలా ఆనందం అవుతుంది. మీరు డబ్బుల కోసం ఏమి యోచించొద్దు, మంచి పనులు చేస్తే ధనము వర్షమై కురుస్తుంది... అని చెప్పడము' చాలా విషయాలు సుమారు రెండున్నర గంటలు స్వామి మాట్లాడారు.

ఈ విధంగా మొట్ట మొదటి సారి స్వామి ద్వారానే, హైదరాబాద్ యూత్ గ్రూప్‌తో పరిచయం ఏర్పడింది. పుట్టపర్తి యాత్ర జీవితానికి దిశా నిర్దేశం చేసే దివ్య యాత్రగా మారిపోయింది. స్వామి సాన్నిధ్యంలో హైదరాబాద్ పిల్లలతో ప్రధానంగా నా ప్రేమ బంధము చాలా సుదృఢమైపోయింది. ఒకరితోఒకరు మాట్లాడుకోవడం, ముచ్చటించుకోవడం, స్వామి అనుభూతులను పంచుకోవడం... నేనేమిటో వాళ్లకి చెప్పడం, వాళ్లు ఏమిటో నాకు చెప్పడం... ఇలాగ మేమందరం కూడా ఒకటే దారిలో వెళ్తున్న బాటసారులుగా మారిపోయాము. నా 25 ఏళ్ల ఆర్తి, ప్రేమ, విరహము, అనురక్తి, భక్తికి ఫలితం స్వామి వారు ఇవ్వాలనుకున్నారేమో! హైదరాబాద్ పిల్లలని నాకు ప్రసాదించారు అనుకున్నాను. అనుకోవడం కాదు... ఇది అక్షర సత్యం కూడా. హైదరాబాద్ పిల్లలతో నన్ను సంధించడం ద్వారా స్వామి నా జీవితంలో ఒక అద్భుతమైన సేవా ప్రస్థానానికి తెర తీసారు!



36

స్వామే ప్రకటించిన సత్య సాయి యువజన సంఘం

1995లో జరిగిన శివరాత్రి పర్వదినము నాకు ఎన్నో మరచిపోలేని అనుభూతులని, దివ్యానుభవాలని అందించింది. శివరాత్రి సందర్భంలో ఆంధ్రప్రదేశ్ 23 జిల్లాల నుండి విచ్చేసిన యువజనులతో నేను కాలం గడపడం ఆ సమయంలోనే జరిగింది. హైదరాబాద్ యూత్‌తో కలవడం అప్పుడే జరిగింది. శివరాత్రి ముందు రోజు 600 మంది యువజనులను ఉద్దేశించి స్వామి వారు చేసిన ఉపన్యాసం విన్న తర్వాత వందలాది మంది గురించి నాకు తెలియదు కానీ నాకు మాత్రం ఎంతో ఉత్సాహం అయింది. అందులోనూ స్వామి వారు, ఉదయ్, వై. శ్రీనివాస్, రాజా వీళ్లందరితో కూడా... వాళ్లు ఎక్కడున్నా సరే స్వామి వాళ్ల మధ్యలోకి వచ్చి మాట్లాడేవారు. చాలా విచిత్రంగా అనిపించేది ఈ అనుభూతి. అరే ఎంత అద్భుతమైన యువకులు వీళ్లు, ఎంత ప్రేమగా ఉన్నారు స్వామితో! స్వామి కూడా ఎంత ప్రేమగా వాళ్లని చూస్తున్నారు! ఎంత వాత్సల్యం పంచుతున్నారు, వీళ్లందరూ నా హృదయానికి హత్తుకొని పోయారు. అరే! స్వామికి దగ్గర అయిన వాళ్లు ఎంత అదృష్టవంతులో కదా! మనమేమో 600 మందిలో ఒకరు, కానీ 600 మందికి ఆరు మంది ముందర ఉండే వాళ్లలో వాళ్లు ఉన్నారే, అని అనుకునే వాడిని. చాలా ప్రేరణ దాయకంగా ఉండేది వాళ్లతో మాట్లాడడము. ఇది అంతా చూస్తే, 'హైదరాబాద్ యూత్ లవ్ స్టోరీ విత్ స్వామి' అనిపిస్తుంది.

ఇలా స్వామి వారు వారితో ఎన్నో విషయాలు చర్చించడం, మాట్లాడటం, మార్గదర్శనం చేయడం, ఆదేశాలు ఇవ్వడం జరుగుతూ ఉంది. స్వామి ఇలా చెప్పారు, ఇలా మాట్లాడారు, అలా మాట్లాడారు అని అంటూ తర్వాత బృందంలో వాళ్లందరూ కూడా వచ్చి చెప్తూ ఉండేవారు. అవన్నీ కూడా వింటూ ఉంటే చాలా ఉత్సాహం వచ్చేసేది. అలా స్వామి ప్రకటించింది ఏమిటి అంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒక యూత్ కమిటీని ఏర్పాటు చేయమని చెప్పారుట' ఆహా! చాలా సంతోషం అయింది. ఏమిటి? ఎందుకు? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియదు, వాళ్లకు స్వామి ఏం చెప్పారో తెలియదు. కానీ రాష్ట్ర స్థాయిలో సాయి యువజన సంఘటనకు తెర తీసారు అని అర్థం

అయింది. దీని కోసమై మంచి పిల్లలను సభ్యులుగా తీసుకొని, పేర్లు ఇవ్వమని చెప్పారట!

తర్వాత అందరూ కూడా ఆ బృందంలో ప్రధానంగా నేను చురుకుగా ఉండడం, చక్కగా మాట్లాడడం, భక్తితో పాటలు పాడటం, అచంచల భక్తి విశ్వాసాలు ఇలా ఏదైతే ఏమిటి... సభ్యుడికి కావలసిన అర్హతలు తెలియదు, కానీ రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన కొద్ది మందిలో, కాస్తో కూస్తో ముఖం తెలిసిన వాడిని అవ్వడం వల్ల అవ్వొచ్చు, నా పేరు ఆ కమిటీలో ఉండాలని తలచి నా పేరు వ్రాసుకున్నారు పేపర్లో. ఇలా సుమారు 5 మంది హైదరాబాద్ జిల్లా నుండి... ఆంధ్ర, సర్కారు, రాయలసీమ ప్రాంతాల నుండి మరొక 5 మంది సభ్యుల పేర్లు వ్రాసుకున్నారు. నేను చాలా ఉత్సాహంతో, అయ్యో! స్వామి ఏర్పాటు చేయబోతున్న యూత్ కమిటీలో నా పేరు కూడా ఉంది అని చాలా సంతోషపడ్డాను. కాబట్టి వెంటనే వెళ్లి ఈ విషయాన్ని డాక్టర్ ఆంజనయ్యతో చెప్తే చాలా సంతోషం అయ్యా, మంచిది అని చెప్పారు.

ఇక మధ్యాహ్న సమయానికి నాకు తెలిసిన విషయం ఏంటంటే... ఆ సమయంలో అక్కడ ఉన్న పెద్దలందరు కూడా హైదరాబాద్ యువకులతో సమావేశం అయ్యి, 10 మంది మొత్తం పిల్లలే ఉండటం వద్దు... అనుభవం లేదు కదా! పెద్దవాళ్లని కూడా పెడితే బాగుంటుంది, అని స్వామి చెప్పారు మాకు అన్నారట. ఆ విధమైన చర్చ అయ్యిందట. ఇక స్వామి మాట్లాడి చెప్పిన సోదరులు కూడా చాలా అమాయకంగా ఔనా అలాగైతే మీరు ఎవరి పేరు చెప్తే ఆ పేర్లు పెడదాం అని చెప్పినట్టుగా, ఆ 10 మందిలో ఒక 5 మంది పెద్దవాళ్లని పెట్టడం జరిగింది. దాంట్లో రాయలసీమ జిల్లా నుంచి అంజనయ్య, విశాఖపట్నం నుంచి పాపారావు, నల్గొండ జిల్లా నుంచి విఠల్ రావు... ఇలా ఐదు మంది పెద్ద వారి పేర్లు దాంట్లో పెట్టడం, ఒక 5 మంది యూత్‌ను చేర్చి 10 మందితో లిస్ట్ తయారు చేసి శివరాత్రి రోజు స్వామి వారికి పంపించడం జరిగింది. నా పేరు తీసేసారు కదా! అంజనయ్య పేరు తీసుకున్నారు. అయ్యో అవకాశం వచ్చినట్టే వచ్చి... జారి పోయిందే అని నేను బాధ పడ్డాను. నాకు ఇవ్వన్నీ పెద్ద పట్టింపు లేక పోయినా, ఈ కమిటీ ద్వారా స్వామి దగ్గరకు వెళ్లొచ్చు కదా అనుకున్నాను.

ఇదంతా కూడా నాకు చూచాయ గానే తెలుసు సుమా! ఇంతకంటే లోతుగా నాకు తెలియదు. 10 మందిలో నేను ఏం తెలుసుకున్నానో అదే చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. శివరాత్రి పర్వదినం రోజు ఉదయం స్వామి వారు అద్భుతమైన వర్చస్సుతో, పసుపు పచ్చ వస్త్రాలతో, దర్శనం కూడా ఇవ్వకుండా, సరాసరి తమ గది నుండి మందిర ప్రాంగణంలో కూర్చున్న పిల్లల్ని దాటుకుంటూ మేము అందరం కూర్చున్న వేణుగోపాల స్వామి విగ్రహం వైపుకు వచ్చారు. అక్కడ నుండి అరిచారు 'ఏయ్ శ్రీనివాస్' అని!!. ఒక విధమైన కోపం ఆ పిలుపులో చూసాం. స్వామి వైపు పరిగెత్తుకుంటూ ఈ అబ్బాయి వెళ్లాడు. శ్రీనివాస్ (వైసీ) స్వామి దగ్గరికి వెళ్లడం ఆలస్యం... స్వామి చేతిలో నుండి ఒక పేపర్ వాడికి ఇస్తూ హెచ్చరిస్తున్నట్టు అనిపించింది. మాకు ఏమి వినపడలేదు.

కానీ తరువాత అర్థం అయ్యింది. స్వామి చెప్పారట, "ఎవరు చెప్పారు? ఈ పేర్లన్నీ వ్రాయమని? యూత్ కమిటీ అన్నాను కదా! యూత్ కమిటీలో పెద్ద వాళ్లు ఏం చేస్తారు? వాళ్ల పనులు వాళ్లకు ఉంటాయి కదా! వెళ్లి యువకుల పేర్లు వ్రాసుకుని తీసుకురండి" అని చెప్పారట. YC కూడా ఆ మాటలు విని ఒణికి పోయి, స్వామికి ఏం చెప్పాలో తెలియక అలాగే స్వామి! అని చెప్పేసి వెనక్కి రావడం జరిగింది.

శివరాత్రి రోజు, స్వామి ఆదేశం ప్రకారము మళ్లీ మొదట తయారు చేసిన యువకుల లిస్టును

స్వామి దగ్గరికి పంపించడం, స్వామి దాన్ని తీసుకొని చాలా అనుగ్రహ దృష్టితో 'నేను మాట్లాడతాను. ఉండమని చెప్పండి' అని సమాచారం ఇవ్వడం జరిగింది.

అప్పుడు స్వామి కళాశాలలో పని చేస్తున్న ప్రభాకర్ మరియు సుధీర్ భాస్కర్... స్వామి వారి వెనక వస్తూ దర్శనంలో స్వామి దగ్గర ఉండేవారు. ఎప్పుడైతే స్వామి ఫోకస్ ఈ యువ జనుల మీద పడిందో అందరూ కూడా వాళ్లతో మాట్లాడటం, వాళ్ల అభిప్రాయాలు తీసుకోవడం, స్వామి విశేషాలు వినడానికి ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు.

శివరాత్రి పండగ అయిపోయింది. ఎక్కడి వాళ్లు అక్కడ వెళ్లిపోయారు. శివరాత్రి ముందు రోజు జరిగిన విశేషం అనుకుంటా, స్వామి యూత్ కమిటీ ఎందుకు చేయమన్నారో తెలియదు అని అన్ని జిల్లాల ప్రెసిడెంట్లు, స్టేట్ ప్రెసిడెంట్, స్టేట్ కో ఆర్డినేటర్స్ అందరూ కూడా ఈశ్వరమ్మ స్కూల్లో రాత్రి భోజనం తర్వాత కూర్చొని మాట్లాడుతున్నారు. మేము చాలా చిన్న పిల్లలం కదా! పెద్దలు ఒకరికొకరు మాట్లాడుకుంటున్నారు. వై. శ్రీనివాస్, గోపి, ఉదయ భాస్కర్ రెడ్డి వీళ్లందరూ కూడా ఆ బృందంలో మాట్లాడుతున్నారు. మిగిలిన వాళ్లం ఊరికే కూర్చున్నాం. అలాంటి సమయంలో ఒక వ్యక్తి లోపలికి హడావిడిగా వచ్చాడు. వచ్చి చాలా కోపంగా, చాలా తపనతో, చాలా గట్టిగా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఏడుపు వచ్చేస్తుంది ఆయనకు మాట్లాడుతుంటే... నా పేరు ఎందుకు లేదు ఈ కమిటీలో? నేనేం తక్కువ చేశాను? నేను సేవాదళ్. మీరంతా నన్ను మోసం చేశారు... నన్ను తోసేసారు... తొక్కేశారు.. అని చాలా ఉద్వేగంగా మాట్లాడేది చూసిన నాకు ఆశ్చర్యం అయింది. ఆయన ఎవరో నాకు తెలియదు కానీ విశాఖపట్టణం నుండి వచ్చిన వాళ్లలో ఒకడు అని అర్థం అయ్యింది. స్వామికి నేను సేవ చేస్తాను. ఎంత దూరమైనా వెళ్తాను. ఎప్పటికైనా సరే నేను దీంట్లోకి వస్తాను అని చెప్పి, వాళ్ల జిల్లా ప్రెసిడెంట్ ఎంత ఓదార్చినా వినకుండా అందరి ముందు అలా పెద్ద పెద్దగా మాట్లాడేసి ఏడుస్తూ వెళ్లిపోయాడు.

ఆ వ్యక్తికి 1995లో AP సాయి యూత్ కమిటీలో అవకాశం దొరకక పోయి ఉండచ్చు... కానీ అదే వ్యక్తి తరువాతి కాలంలో రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్‌గా, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్‌గా, తరవాత జాతీయ మార్గ దర్శన్ మండలి సభ్యుడిగా, ప్రశాంతి నిలయ పర్యవేక్షకుడిగా మారిపోయాడు. ఆయన మరెవరో కాదు, ఈ రోజు అందరూ చూస్తున ఎస్ జి చలం. స్వామికి ఎవరిని ఎప్పుడు ఎలా చేయాలి అనేది ప్లాన్‌లో ఉంటుంది. ఇది మరచి పోలేని ఒక అనుభూతి. అంటే, ఆర్తి ఉంటే ప్రాప్తి స్వామి కల్పిస్తారు. ఆ ఆర్తి ఉంటే ఆర్త జనరక్షకుడై స్వామి చెయ్యి పట్టుకుంటాడు, వేలుపట్టి నడిపిస్తాడు అన్నదానికి మరొక ప్రత్యక్ష నిదర్శనం ఇది. అ ఆర్తితో కూడిన ఆశయాలు నిస్సందేహంగా స్వామి చేత నెరవేర్చ బడుతాయి. There may be a delay! But not denial!!



37

"ఏయ్! సన్యాసి!!" అంటూ స్వామి నన్ను చూశారు

1995 శివరాత్రి రోజున ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి యూత్ కమిటీ ఒకటి ఏర్పడింది. సుమారు 11 మంది సోదరులతో, హైదరాబాద్ నుండి 5 మంది సభ్యులు ఉన్నారు. అలాగే ఒక్కొక్క ప్రాంతం నుంచి ఒక్కరు చొప్పున మరొక 6 మంది ఉన్నారు. చాలా సంవత్సరాలు అయ్యింది కాబట్టి, ఆ కమిటీలో ఒక 7 మంది మాత్రమే నాకు గుర్తున్నారు. ఉదయ భాస్కర్ రెడ్డి, పిడతల గోపికృష్ణ, వై శ్రీనివాస్, రాజా, శ్రీనివాస చంద్రశేఖర్ వీళ్లు హైదరాబాద్ నుండి, నేను అనంతపురం, కడప, కర్నూల్, ప్రకాశం రాయలసీమ జిల్లాల నుండి, ఉదయ్ కిరణ్ గుంటూర్ నుండి, రమేష్ విశాఖపట్నం నుండి ఆ టీమ్‌లో ఉన్నాము. ఇంకొక ఇద్దరు ఎవరు అన్నది గుర్తే లేరు. శివరాత్రి అయిన తర్వాత ఎవరి కొద్ది వాళ్లు వెళ్లిపోయారు. కానీ మేమందరం కూడా ప్రశాంతి నిలయంలో ఉండిపోయాము. కారణము స్వామి మా కమిటీతో మాట్లాడుతారు, ఇంటర్వ్యూ ఇస్తారు అని ఏదో దివ్య సంకేతం మాకు అనిపించడం, బృందంలో అన్నయ్యలను అనుసరించడం వల్ల హైదరాబాద్ టీంతో పాటు నేను అలాగే ఉండి పోయాను ప్రశాంతి నిలయంలో.

ఆ వందల మంది కూడా నిదానంగా ఒకటో రెండో రోజుకి వెళ్లి పోవడం జరిగింది. రెండు మూడు రోజులు అని చెప్పి నేను తీసుకున్న అనుమతి కాస్తా గాలిలా కలిసి పోయింది. అప్పటికి సుమారు వారం రోజులు అయిపోయింది. స్వామి చూస్తే అసలు దర్శనంలో మా పక్కకే రావట్లేదు. మాట్లాడిన సందర్భం లేదు, వచ్చినా... అలా చూస్తూ కళ్లు కలుపుతూ వెళ్లిపోతున్నారు. హైదరాబాద్ టీం మెంబర్స్ ఒక 30 మంది పిల్లలు కూడా ఆ సమయంలో నిలిచి పోయారు. తర్వాత నిదానంగా వాళ్లు కూడా వెళ్లిపోయారు. 10 రోజుల సమయం తర్వాత ఆ 11 మంది సభ్యులలో కూడా నలుగురు వెళ్లిపోయారు. ఇక ఏడు మంది మిగిలాము.

ఆ ఏడు మందితో, ఒకానొక భజన సమయంలో సుధీర్ భాస్కర్, ప్రభాకర్ భజన సమయంలో పరిగెత్తుకుంటూ వచ్చి యూత్ కమిటీలో ఎవరైతే ఉన్నారో వాళ్లని స్వామి పిలిచారు అని చెప్పారు.

నోట మాట లేదు నాకు... ఎందుకంటే జీవితంలో మొదటి సారిగా ఇలా స్వామి ఏకాంత సౌధ సంభాషణకు అవకాశం ఇచ్చారు. ఇక నా కళ్ల నుండి ఆనంద భాష్పాలు కారుతున్నాయి. అక్కడ ఉన్న 7 మంది సభ్యులు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాము.

స్వామి ఇంటర్వ్యూ రూమ్ దగ్గర నిల్చుని ఒక తలుపు వేసి ఇంకొక తలుపు మీద తన చెయ్యి పెట్టి నిలుచున్నారు. స్వామిని చూస్తుంటే నాకు చాలా భయం అయిపోయింది. కారణం ఏందంటే అంతకుముందు రెండు మూడు సందర్భాలలో స్వామి నిల్చొని ఒక్కొక్కరిని చూసి, ఒకసారి వెనక్కి పొమ్మని చెప్పిన సందర్భాలు నాకు తెలుసు. గుండెల నిండా భయము, ఎంతో ఆవేదన, ప్రేమ, అనురాగము, భక్తి, విశ్వాసము ఇన్ని భావనలతో కంపించి పోతూ... మనస్సులో, "స్వామి సాయిరామ్... సాయిరామ్..." అని స్మరిస్తూ స్వామి చెయ్యి కింది నుండి దూరి లోపలికి వెళ్లాము. మొట్టమొదటి ఇంటర్వ్యూ ఈ అనుభవం అప్పటిదాక లేదు. లోపల చిన్నగది... మూల చిన్న సింహాసనం, దివ్యమైన వాతావరణము, దివ్యమైన పరిమళము, దివ్యమైన అనుభూతి, దివ్యమైన నిశ్శబ్దము, దివ్యమైన భావనలో లోపల ఏం మాట్లాడితే ఏమవుతుందో అని అలా ముడుచుకొని... అయస్కాంతానికి అతుక్కు పోయిన ఇనుప ముక్కల్లాగా మేమందరము ఆ స్వామి సింహాసనం చుట్టూరా కూర్చున్నాము. స్వామి నిదానంగా బయట నుండి గదిలోకి వచ్చి తలుపు మూసి, అటు వైపు తిరిగి బోల్ట్ పెడుతూ... యథాలాపంగా చెప్తున్నారు.. "బంగారు! చాలా సంతోషము. మీరు చాలా మంచి పిల్లలు. అందమైన అమ్మాయిల్ని చూసి చక్కగా పెళ్లి చేసుకుని సుఖశాంతులు అనుభవించండి అని మాట్లాడారు. నేను చాల తికమక పడ్డాను ఆ మాటలకి. స్వామి ఏంటి ఇలా చెప్పారు? ఎందుకు చెప్పారు? అయినా నాకు స్వామితో ఎలామాట్లాడాలో నాకు తెలియకపోవడం వలన మిగతా వాళ్లు నిశబ్దంగా ఉండడం వల్ల, నేను అలా ఊరికే ఉండ లేక నోరు తెరిచాను. "స్వామి పెళ్లి అంటారు ఏంటి స్వామి? పెళ్లి అంటే ముందు కాళ్లకు బంధమే కదా? అని చెప్పాను." స్వామి అటు వైపు తిరిగి ఉన్నారు, ఒక్కసారి ఆ మాట నేను అంటూనే ఇలా మా వైపు తిరిగారు. నన్ను చూస్తూ "ఏయ్ సన్యాసి" అన్నారు. ఇక నా రక్తమంతా కూడా నఖసిక పర్యంతము పొంగి పోయిందండి. "చెప్పింది వినవయ్యా!" అని నిధానంగా వచ్చి ఆ చైర్‌లో కూర్చోవడము, సుమారు గంట సేపు మాతో ఎంతో దయతో ఎన్నో విషయాలు మాట్లాడారు. నాకు మనసు మనసులో లేదు, ఎప్పుడో జారిపోయింది. స్వామిని చూస్తుంటే అంత దగ్గర నుంచి వారి పాద సేవ చేసుకుంటూ, ఒక్కొక్కరు పక్కకు జరుగుతూ, మరొకరికి అవకాశం ఇస్తూ అలా అందరూ స్వామి పాదాలు మెల్లగా ఒత్తుతూ, స్వామితో మాట్లాడుతుంటే, నా మనసులో అంతా కూడా ఒక తీక్షణమైన భావన కదులుతుంది. అయ్యో! స్వామి నన్ను సన్యాసి అన్నారు. రాయలసీమ భాషలో సన్యాసి అని తమాషాగా కూడా అంటూ ఉంటారే మరి తమాషాగా అన్నారా? లేక నిజంగానే అన్నారా?? అని మదనపడుతున్నాను. కారణం ఏంటి అంటే నేను చిన్నప్పటి నుంచి కూడా సన్యాసి కావాలి, సన్యాసిగా మారాలి, బ్రహ్మచర్యంతో ఉండాలి అనికదా అనుకున్నాను. చిన్నప్పటి నుంచి కూడా ఎన్నో విశేషాలు జరగడము, ఎన్నో అనుభూతులు జరగడము. కాబట్టి నేను ఆశ్చర్య పోయాను స్వామి నన్ను సంబోధించిన తీరును చూసి. ఎందుకు అన్నారు అలా? ఊరికే చెప్పారా? అనుకుంటూ సతమత మయ్యే సమయంలో స్వామి ఉన్నట్టుండి నాలో మెదులుతున్న భావాల్ని గమనించినట్లు...

"అరేయ్ బంగారు! మీకు కామ అంటే ఏమిటో తెలుసా? అని అడిగారు. స్వామి ముందు కూర్చున్న ఒక సోదరుడు స్వామి కళ్లలో కళ్లుపెట్టి చూస్తూ... కామ (,) అని వ్రేలితో చూపించాడు.

స్వామి వాడిని చూసి 'ఏయ్! దొంగ సన్యాసి కామ అంటే ఫుల్ స్టాప్, కామా కాదురా! కోరిక'... అని చెప్పారు." నాకు అనిపించింది ఏందంటే స్వామి నన్ను నిజంగా 'సన్యాసి' అని సంబోధించారు అని.

నా హృదయం సంతోషంతో నిండి... ఒళ్లు పులకరించి పోయింది. స్వామి అన్నారు: "నన్ను సన్యాసి" అని. నేను సన్యాసిగా మారాలి. సన్యాసి జీవితాన్ని గడపాలి అని, ఆ రోజు ఆ క్షణంలో దృఢంగా నిర్ణయం చేసుకున్నాను. ఆ ఇంటర్వ్యూలో స్వామి ఎన్నో విషయాలు చెప్పారు. "బంగారు ఆ సంవత్సరం మన మందరం కూడా చాలా పెద్ద పనులు చేయాల్సి ఉంది! మీరు నాకు తోడుంటారా? నేను కూడా మీతో కలుస్తాను. మనందరం చెయ్యి చెయ్యి కలిపి మంచి పని చేద్దాం బంగారు!" అంటే మళ్లీ మేము తికమక పడి షాక్ అయ్యాము.

మేము మీకు ఏమి సేవ చేయాలి? చెప్పండి స్వామి అని అన్నాము. అందుకు స్వామి: "ఏమి లేదు బంగారు! అనంతపురం జిల్లాలో ఉన్న వందలాది గ్రామాలకి మంచి నీళ్లు ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నాం. మీకు తెలుసు కదా L&T వాళ్లందరూ కూడా వస్తున్నారు దీనికోసం. మొత్తం మీలాంటి యువకులు అందరూ కూడా కలిసి ముందుకు రావాలి. మనందరం కూడా వంతుల ప్రకారము వెళ్లి కాలువలు తవ్వుతాము" అన్న విశేషం స్వామి వారు చెప్తే మా ఆశ్చర్యానికి అంతే లేదు. అబ్బా! స్వామి ఆ వాటర్ ప్రాజెక్టు పనులను మమ్మల్ని చేయాలని చెప్తున్నారా... ఆహా! ఓహో! అని అనుకున్నాను. ఇంకా ఆ ఇంటర్వ్యూలో ఎన్నెన్నో విషయాలు చెప్పారు. నాకు ప్రధానంగా గుర్తున్నది ఒక రెండు మూడు చారిత్రాత్మకమైన విషయాలు. స్వామి వాటర్ ప్రాజెక్టులో మమ్మల్ని పాల్గొనమని చెప్పడము. జిల్లా జిల్లాకి వెళ్లి పిల్లలందరికీ ప్రేరణ కల్పించారు, ఉత్సాహపరచండి, గ్రామాలకు వెళ్లి సైనికులను తయారు చేయండి. నేను కూడా మీతో వస్తాను. షామియానాలు వేస్తాము. అక్కడ మీతో పాటు నేను కూడా రాత్రి ఉంటాను. మంచి మాటలు మాట్లాడుకుందాం. మనం చెయ్యి చెయ్యి కలుపుదాం, సేవ చేయకదులుదాం అని చెప్పడం గుర్తున్నాయి.

హైదరాబాద్ యువకులతో చాలా అన్యోన్యమైన అనురాగం ఏర్పడింది, ప్రధానంగా ఉదయ భాస్కర్, గోపి, వై. శ్రీనివాస్, రాజా, శ్రీనివాస చంద్రశేఖర్‌తో. ఆ సమయంలో స్వామి కోసం వేచి ఉన్న 10 రోజులు మేమందరం కూడా ప్రశాంతి నిలయంలో సేవలు చేస్తూ, గోడౌన్లలో మూటలు మోస్తూ, కిచెన్‌లో సహాయం చేస్తూ, మధ్యలో ఎప్పుడు వీలవుతే అప్పుడు మాట్లాడుకుంటూ, పాటలు పాడుకుంటూ, భజనలు చేసుకుంటూ స్వామి గురించి అనుభూతులు పంచుకుంటూ వేచి ఉన్నాము. అలా, అసలు ఎవరెవరు... ఏమిటి... అనేది బాగా తెలిసిపోయింది. అబ్బ! వాళ్ల యొక్క నేపథ్యము, వాళ్లకు స్వామి మీద ఉన్న విశ్వాసము, అచంచల భక్తి... ఇవన్నీ చూస్తుంటే, నన్ను నేను మర్చిపోయాను అంటే నమ్మండి. ఒక్కొక్కరు ఒక అద్భుతమైన వజ్రం లాగా అనిపించింది. ఈ హైదరాబాద్ యూత్‌తో సాంగత్యం స్వామి వారు, నా 25వ పుట్టు పండుగకు (రజతోత్సవం) ప్రసాదించిన బహుమతి అనిపించింది. స్వామి ఇచ్చిన ఈ బహుమతిని నేను ప్రాణం ఉన్నంత దాకా పదిలంగా ఉంచుకుంటాను. హైదరాబాద్ టీం స్వామి ఇచ్చింది కదా... ఎల్లప్పుడూ కూడా నేను వాళ్లని ప్రేమిస్తూనే ఉంటాను. ప్రాణం ఉన్నంత దాకా హైదరాబాద్ యూత్‌తో స్వామి కలిపిన బంధాన్ని పదిలంగా ఉంచుకుంటాను.

నా వాక్చాతుర్యం... నేను వ్రాసి పాడే పద్యాలు, కవితలూ, స్వామితో నాకున్న చిన్న అనుభవాలు, నేను చేసే కోతి చేష్టలు, మాట విరుపు, స్వామి మీదున్న భక్తి విశ్వాసాలు, సత్యసాయి మహావతార దర్శనంలో నేను నేర్చుకున్న విషయాలు నిలయంలో ఉన్నప్పుడు వారికి చెప్తూ ఉంటే... వాళ్లు కూడా చాలా ఆశ్చర్యంగా, చాలా ఆనందంగా వింటూ అందరూ నన్ను ప్రేమగా గుండెలకు హత్తుకున్నారు.

నేను, నేడు నా స్థితి... పరిస్థితి... ప్రస్థానం... ప్రాప్తం అన్నిటికి కారణం పూర్తిగా హైదరాబాద్ టీమ్ అని చెప్పాలి. వీళ్ల ద్వారానే స్వామి వారు నా జీవితానికి దిశ దశ కల్పించారు. ఇది సాధారణ విషయం కాదు, దివ్యమైన, అసాధారణమైన విషయం. హృదయ సంబంధం, ఆత్మ బంధం హైదరాబాద్ యువతతో నాకు ఏర్పడింది.

ఇలా వ్రాస్తుంటే హైదరాబాద్ యువతతో నన్ను స్వామి వారు ఎలా అనుసంధానించారో గుర్తు చేసుకుని ఆనందభాష్పాలు వస్తున్నాయి.

38

పడింది కుడి వైపు – విరిగింది ఎడమ చెయ్యి!?

స్వామి వారి ఏకాంత సౌధ సంభాషణం అయిపోయింది. చాలా దివ్యమైన అనుభూతులతో... అనుభవాలతో ప్రశాంత నిలయం నుండి అక్కడ కొత్తగా పరిచయమైన హైదరాబాద్ యూత్ దగ్గర సెలవు తీసుకొని విడవలేక విడిచినట్లుగా బెంగళూరుకి ప్రయాణం అయ్యాను.

బెంగళూరులో ఇంటికి వెళ్లిన తర్వాత అసలు నేను లేని 10 రోజులు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది అక్కడ. అన్నయ్య, వదిన అమ్మనాన్న వీళ్లందరూ కూడా బాగా అరిచారు. నా ఉద్యోగం అయితే పోలేదు, కారణం ఏమిటి అంటే నేను పని చేసేది మా పెద్దమ్మ కొడుకుల వ్యాపార సంస్థలో. బళ్లారిలో వాళ్లకి ఆర్మ్స్ అండ్ అమ్యునిషన్ బిజినెస్ ఉండేది. కాబట్టి నేను కర్ణాటక వ్యాపారము గురించి పెద్ద సంస్థలకు వెళ్లి ఎక్కడైతే జెలిటన్ లాంటి పేలుడు పదార్థాలకు అవసరం ఉందో అక్కడ ప్రొడక్ట్స్ అన్ని చూపించి ఆర్డర్ తీసుకునే వాడిని. నాకు నెలకు రూ. 3500/– దాక వచ్చేవి. కర్ణాటకలో చాలా ప్రాంతాలను ఈ ఉద్యోగం చేసే సమయంలో నేను చూడగలిగాను.

నా కజిన్ బ్రదర్స్ నా పట్ల చాల దయతో ఉండే వారు. పివిఎన్ రావు & గోవింద్ గుప్త, పి.శీనప్ప శెట్టి & Co. నాకు ఉద్యోగం పోయేంత రాలేదు పరిస్థితి. కానీ నా చుట్టూ ఉన్న వాళ్లు అంతగా సంతోషంగా లేరు అన్ని రోజులు ఉద్యోగం నుండి, చదువు నుండి, బాధ్యత నుండి మాయం అయ్యాను కదా! అవన్నీ కూడా నన్ను ఏమి బాధించలేదు. కారణం సత్యసాయి భక్తులకి జీవిత పరమావధి ఏమిటి? స్వామితో మాట్లాడగలిగే అవకాశం రావడం! స్వామితో ఏకాంత సౌధ సంభాషణ చేయడం!! ఇవే కదా జీవితకాలపు కోరికలు! అప్పుడు మొబైల్ ఫోన్స్ లేవు. అయితే బెంగళూరుకి వెళ్లిన తర్వాత రోడ్డు మీదకు వెళ్లి అక్కడ STD Phone Boothకి వెళ్లి ఐదు, పది రూపాయలు ఖర్చు చేసి హైదరాబాద్ యూత్ మెంబర్స్‌తో మాట్లాడే వాడిని. అంటే వారితో నాకు హృదయ బంధం, ప్రేమ బంధం ఏర్పడిపోయింది. స్వామి మమ్మల్ని ఒక బృందంగా ఏర్పరచడము, మమ్మల్ని ఒక పుష్పాల మాల లాగా గుచ్చడము, వారి పాదాల దగ్గర మేము కలవడము, స్వామి

అందరికీ కలిపి అనుగ్రహ భాషణము చేయడము, మా అందరికీ కొంత దిశానిర్దేశం, సందేశము ఇవ్వడము, ఇవన్నీ కలిపి చేయాల్సిన కార్యం గురించి నాలో ఎంతో విరహాన్ని రగిల్చాయి. రోజు వదలి రోజు నేను హైదరాబాద్ పిల్లలతో మాట్లాడేవాడిని. అలా చేస్తున్నప్పుడు హైదరాబాద్ టీం గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకున్నాను. వీళ్లందరూ కూడా ప్రశాంతి నిలయానికి, బెంగుళూరు బృందావనముకు, హైదరాబాద్ నుండి సైకిళ్లలో ప్రయాణించి వచ్చే వాళ్లట. స్వామి ఎన్నో సందర్భాలలో వాళ్లకి ఆశీర్వాదాలు, ఇంటర్వ్యూలు, ఎన్నో అనుభవాలు ఇచ్చిన విశేషాలు వివరాలు తెలిసాయి. ఆ విశేషాలు విని, నాకు ఎందుకు రాలేదు ఈ అవకాశం అని చాలా బాధపడేవాడిని. అయ్యో నేను కూడా ఇట్లా సేవ చేయాలి అని తపించే వాడిని. అనంతపురం, గుంతకల్, బెంగళూరు ఇలాంటి ప్రదేశాల నుండి సైకిల్లో నేను కూడా వెళ్లాలని ఎన్నో రకాల ఆలోచనలు చేసే వాడిని. ఈ ఆలోచనలు నన్ను ఒక చోట నిలవనివ్వ లేదు.

ఆ సమయంలో స్వామి వారి పూర్వ విద్యార్థి CA రఘునందన్‌తో నాకు పరిచయం అయ్యింది. తను జెపి నగర్‌లో ఉండేవాడు. అతను భజన్స్‌లో కలిసినప్పుడు అతని గురించి తెలిసిన విషయం ఏమిటి అంటే, ప్రతి వారాంతం కూడా స్కూటర్‌లో బెంగళూరు నుంచి ప్రశాంతి నిలయం వెళ్లి అక్కడ స్వామి దర్శనం చేసుకొని వెనక్కి వచ్చేవాడట. నాకు చాలా ఉత్సుకత ఏర్పడింది. అన్నా! నేను కూడా వస్తాను ఒకసారి అంటే, తప్పకుండా తీసుకెళ్తాను బాలచంద్ర అంటూ జెపి నగర్‌లో కలవు అన్నాడు.

ఆ రోజు ఇంట్లో ఏం చెప్పానంటే, బృందావన్‌లో సేవకు వెళ్తున్నాను అని చెప్పేసి ప్రొద్దున్నే మూడు గంటలకు వెళ్లిపోయాను. చాలా ఉత్సుకతతో... సైకిల్‌లో కాకపోతే కనీసం స్కూటర్‌లో వెళ్లిన అనుభవం అన్న ఉంటుంది అని రఘు ఇంటికి వెళ్లాను.

ఇద్దరం బయలుదేరి స్వామి నామం చెప్పుకుంటూ, సాయి గాయత్రి చెబుతూ, స్వామి కబుర్లు చెప్పుకుంటూ మాట్లాడుకుంటూ వెళ్తున్నాం. ఆయన హెల్మెట్ పెట్టుకున్నాడు. నేను వెనుక కూర్చున్నాను. హై పాయింట్, గోల్ఫ్ కోర్టు దగ్గరికి వచ్చిన తర్వాత, బైక్ పంచర్ అయింది. అతనికి ఇది ఏదో సరి కాదు అని అనిపించి, ఇలా చెప్పాడు, "బాలచంద్ర నేను ఎన్నో వందల సార్లు వెళ్లాను. నాకు ఎప్పుడు ఇట్లా కాలేదయ్యా. ఏదో తప్పుగా అనిపిస్తుంది" అని అన్నాడు. కానీ నాకు లోపల చూస్తే 'ఎట్టైనా సరే వెళ్లాలి' అన్న తపన ఆగలేదు. పరవాలేదు వెళదాం కదా అని అరగంట పాటు రోడ్డు ప్రక్కనే ఆగి టైర్ మార్చి మళ్లీ బయలుదేరాం.

అలా బయలు దేరిన తర్వాత, చిక్బల్లాపూర్ 100 కిమీ వేగంతో దాటుతున్నాం స్వామి గురించి మాట్లాడుకుంటూ. ఉన్నట్టుండి కుక్క అడ్డం వచ్చేసింది స్కూటర్‌కి. "సాయిరాం" అని గట్టిగా అరిచేశాము ఇద్దరం. సడెన్ బ్రేక్ వేసేసాడు దాన్ని తప్పించాలని ఇద్దరం కింద పడిపోయాము. బైక్ ఆక్సిడెంట్ అయిపోయింది. ఇద్దరం కూడా కుడి వైపు పడి పోయాము. బైక్ మమ్మల్ని ఒక పది అడుగులు అలా ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. నేను చాలా భీతిల్లిపోయాను. కానీ స్వామి దయ వల్ల ఇద్దరు కూడా లేచాము. చేతక్ బజాజ్ స్కూటర్ కాస్త డామేజ్ అయింది. మేము పడ్డం చూసి అక్కడ పోయేవాళ్లు వచ్చేవాళ్లు కాస్త ఆగి, మా బండిని పక్కకు తీసి, మాకు నీళ్లు తాగిపించి వెళ్లారు. అంతగా దెబ్బలు తగలలేదు. మేమేమో ఆ రోడ్డు పక్కన కూర్చొని ఆ బండిని ఏమి చేయాలో ఏమో అర్థం కాక, అయ్యో! స్వామి!! ఏమి ఇట్లా అయింది అని మాట్లాడుకుంటూ కూర్చున్నాము.

అప్పుడు యథాలాపంగా మమ్మల్ని మేము చూసుకున్నాము. నేను బాగానే ఉన్నాను అనిపించింది. కుడి చెయ్యి ఇదివరకే విరిగింది కదా. ఈ చెయ్యి మీద పడ్డానే! ఏమన్నా అయిందేమో! నాయనా!

స్వామీ!! ఇప్పుడు ఏమని చెప్పాలి ఇంట్లో? ఏమీ చెప్పకుండా వచ్చానే. అని చాలా గందరగోళం అయిపోయింది. కానీ కుడి చెయ్యి బానే ఉంది. ఊపిరి తీసుకున్నాను.

రఘుకు చూస్తే బాగున్నాడు కానీ, ఏదో పాంట్ ప్యాకెట్లో చెయ్యి పెట్టాలని చెయ్యి పెడితే అతని చేయి లేవలేక పోయింది. అప్పుడు చెయ్యి ఎముక విరిగిందేమో అని భయమైపోయింది. తర్వాత ఒక లారీలో ఎక్కి ఇద్దరం చిక్కుబళ్లాపూర్ వెళ్లాం. ఆ దారి పొడుగున, 'స్వామి, సాయిరామ్, సాయిరామ్ అని జపిస్తూ ఉన్నాం. నా కన్నా లోపల ఏదైనా బాధ ఉందేమో గాని... అతను మాత్రం చాలా ఆనందంగా ఉన్నాడు. పైగా 'బాలచంద్ర ఎన్నో సార్లు బైక్‌లో వెళ్లిన నాకు ఏం కాలేదు. ఎందుకంటే ఒంటరిగా వెళ్లాను కదా! ప్రతి సారి స్వామి నన్ను చూసుకునే వాడు. కానీ ఈ రోజు నువు నన్ను చూసుకోవడానికి ఉన్నావు అని జరిగిందేమో. నువ్వు లేని సమయంలో నాకు ఇలా జరిగింటే, నా పరిస్థితి ఏమయ్యేది. ఇది స్వామి నన్ను ఎల్ల వేళల కాపాడుతున్నారు అని నీ ద్వారా చూపిన నిదర్శనం. స్వామి బ్రతికించాడయ్యా! నువ్వు నాకు రక్షకుడిగా వచ్చావయ్యా!' అని చెప్తుంటే బహు ఆశ్చర్యం అయింది. ఇట్లా కూడా ఉంటుందా భక్తి అని. కానీ ఆ ఎముక విరిగిందో, ఏమి అయిందో, భుజం దగ్గర బాగా నెప్పి కలిగింది. నాకేం బానే ఉంది, తొందర లేదు. కొద్దిగా అక్కడక్కడా గీసుకపోయింది అంతే. ఇక ఉదయాన్నే 6 గంటల సమయానికి, చిక్బాల్లాపూర్‌లో ఒక ఎముకల డాక్టర్ దొరికాడు. ఆ డాక్టర్ గారి దగ్గరికి వెళ్తే జరిగింది చెప్పాము. చూద్దాం అని ఆ అబ్బాయిని పరీక్ష చేశాడు. ఫ్రాక్చర్ కాదు భుజం దగ్గర ఎముక డిస్ లొకేట్ అయ్యింది అని చెప్పి, ఇట్లా అట్లా ఒడుపుగా చేయి తిప్పాడు. అంతే చేయి మంచిగా అయిపోయింది అన్నమాట. నన్ను చూసి ఒక సారి మిమల్ని కూడా చూస్తాం కదా, ఎట్లా పడ్డారు అంటే, కుడి వైపు పడ్డాను సార్ అని చెప్పా. ఓహో అని అంతా చూసాడు. కుడి చెయ్యి అంతా బానే ఉంది, ఎడమ చెయ్యి పట్టుకుంటే నొప్పి అయిపోయింది నాకు. 'అమ్మ!!! అని గట్టిగా అరిచాను'. చాలా ఆశ్చర్యం అయ్యింది. ముందే విరిగిపోయిన కుడి చెయ్యి మళ్లీ విరిగి పోయి ఉంటే నిజంగా ఏం జరిగేదో నాకు తెలియదు కానీ, కుడి చెయ్యి మీద పడితే ఎడమ చెయ్యి విరిగింది. ఈ చెయ్యి ఎట్లా విరిగిందో నాకు తెలియదు. అయ్యో మీకు చేతి ఎముక విరిగింది అని X Ray తీసిచూస్తే... Hair Line Fracture అని నిర్ధారించారు. అప్పటికప్పుడు పెద్ద కట్టు కట్టాడు.

ఇదంతా కూడా అయ్యే సరికి ఉదయం ఏడు గంటల అయ్యింది. బస్సులో వెనక్కి వచ్చాము. ఆ బండిని కాస్తా ఇంకో బండికి జత చేసి బెంగళూరుకి చేరాము.

కానీ ఇంటికి వెళ్తుంటే నాకు చాలా భయమై పోయింది. ఏం చెప్పాలి అని. మా నాన్న అసలే కోపిష్టి. ఇంట్లో నేను బృందావన్ సేవకు వెళ్తున్నాను అని చెప్పాను. ఇంటికి వెళ్లిన తర్వాత... ఏంరా!? ఏమైంది అని అమ్మ నాయనా అందరూ వచ్చి అడిగారు. నేను అన్నాను బృందావన్‌లో సేవ చేస్తుంటే నీళ్లలో జారి కింద పడ్డాను, చెయ్యి విరిగింది. అక్కడే హాస్పిటల్‌లో కట్టు కట్టారు. 6 వారాలు చేతికి విశ్రాంతి తీసుకోవాలి అని చెప్పారు. ఈ కట్టు అట్లే ఉండాలని చెప్పారు అని వాళ్లకు చెప్పాను. మా నాన్న ఎంత కోపం చేసుకున్నారంటే ఇప్పటికీ గుర్తుంది. నన్ను ఇక బండకేసి బాదినట్టు అయిపోయింది.

కానీ అలాగే "స్వామీ" సాయిరామ్, సాయిరామ్ అనుకుంటూ కూర్చున్నాను". అంటే ఆ ఆతృత... సంఘర్షణ... విరహము... స్వామికోసం నేను ఏమైనా చేయాలనే తపన, ఆలోచన నన్ను ఈ విధంగా తీసుకెళ్లిపోయి... ఒక మహత్తరమైన అనుభవాన్ని మిగిల్చింది.

39

ప్రథమ యువజన సమ్మేళనం (1995)

బెంగళూరు నుండి పుట్టపర్తి బైక్‌లో వెళుతూ రోడ్డు ప్రమాదంలో చెయ్యి విరిగింది కదా! నేను ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాను. నేను ఆ సమయంలో ఆఫీస్‌కి వెళ్లానో లేదో కూడా గుర్తు లేదు. ఇంట్లో వాళ్లు నేను చేసిన పనికి నన్ను తిట్టడము, ఇక అస్సలు బయటికే వెళ్లొద్దు అని హెచ్చరించడం జరిగింది.

ఇది జరిగిన మూడు నెలలకు అనుకుంటా, వినాయక చవితి వచ్చింది. నేను అనంతపురం RCVS Home – వైశ్య హాస్టల్లో వినాయక చవితి ప్రారంభించి సుమారు 8 సంవత్సరాలు అయ్యింది. ప్రతి సంవత్సరము నేను వెళ్లి, అక్కడ వారం రోజుల ఉండి, వందల మంది విద్యార్థులకు ఉత్సాహ ప్రోత్సాహములు అందించి, అందరినీ ఆనంద పరిచి... వాళ్లకి మార్గదర్శనం చేస్తూ నన్ను నేను విద్యార్థుల సేవలో అంకితం చేసుకుంటూ, వినాయకుడి సేవలో తరించే వాడిని.

అలాంటి పరిస్థితుల్లో అనంతపురము నుంచి విద్యార్థులు ఫోన్ చేశారు. అన్నా! వినాయక చవితికి మీరు రావాలన్నా అని పిలిచారు. ఆ పిల్లలకు యాక్సిడెంట్ అయిన పరిస్థితిని వివరించాను. ఇంట్లో ఒప్పుకోరయ్యా, నేను ఈ చెయ్యిని ఇట్లా పెట్టుకొని రావడం అసలు చాలా కష్టం అవుతుంది, వద్దులేవయ్యా అని చెప్పా. 'అన్నా ప్లీజ్ అన్న, అట్లా అనొద్దు అన్న, మీరు రానే రావాలి, మీరు మాతో ఉండాలి అన్న, మీరు కాలు కింద పెట్టకుండా మేము చూసుకుంటాం అన్నా, ప్లీజ్ అన్నా' మీరు మాతో ఉంటే చాలు, అని చాల సార్లు బంగ పోయారు.

మీరు నమ్ముతారో లేదో కొద్ది మంది అనంతపురం వైశ్యా హాస్టల్ నుంచి ప్రత్యేకంగా నా గురించి బెంగళూరుకి వచ్చారు. ఇంట్లో మా నాన్న గారితో మాట్లాడారు. అయ్యా! ప్లీజ్, బాలచంద్రని పంపించండి. మేము చూసుకుంటాం అన్నారు. వినాయక చవితికి ఆయన లేకపోతే కాదు, అని మా నాన్నకు చెబితే, ఆయన హృదయం ద్రవించిందో లేకపోతే ఇక వీడితో ఎందుకులే వేస్ట్ ఫెలో అనుకున్నాడో తెలియదు... కానీ నన్ను పంపించడానికి ఒప్పుకున్నారు.

అలా ఆ చేతి కట్టుతో, అనంతపురం వైశ్య హాస్టల్‌కి నేను ప్రయాణం అయ్యాను. మరో ప్రక్క ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా, 6 నెలలకు ముందు, స్వామి వారు ఏకాంత సౌధ సంభాషణలో చెప్పినట్టుగా (శివరాత్రి 1995) 'మీరందరూ పిల్లలందరికీ ప్రేరణ కల్గించి, కొత్త వాళ్లను తీసుకరండి. ఈ వాటర్ ప్రాజెక్టు సేవను, మంచి విషయాలను అందరికీ తెలియపరచండి' అని చెప్పిన మాటలను మంత్రాలుగా తీసుకుని చాలా ఉవ్విళ్లూరుతూ ఉన్నారు.

అప్పటికే, హైదరాబాదు టీంతో ఫోన్‌లో మాట్లాడుతున్నా, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నా... స్వామికి! మనం ఏం చేయొచ్చు? స్వామి మనకు ఒక బాధ్యత అప్ప చెప్పారు, ఆంధ్రప్రదేశ్ యూత్ కమిటీ ఏర్పాటు చేశారు... మనకు అవకాశం ఇచ్చారు ఇలా చాలా మాట్లాడుకునే వాళ్లము. అలా మాట్లాడు కుంటుంటే, హైదరాబాద్‌లో యూత్ మీట్ పెట్టొచ్చు కదా అన్న ఆలోచన వచ్చింది. ఎందుకో తెలియదు, స్వామి నిర్ణయం ఏమిటో తెలియదు... కానీ హైదరాబాద్‌లో జరగలేదు.

అలాంటి పరిస్థితుల్లో, నేను హైదరాబాద్ అన్నయ్యలతో మాట్లాడుతున్నప్పుడు, అన్నయ్య నేను వైశ్యా హాస్టల్‌లో ఇలా వినాయక చవితి నిర్వహించడం కోసమై వెళ్తున్నాను, మీరు సరే అంటే మనం ప్రప్రథమ యువజన సమ్మేళనం అనంతపురం వైశ్యా హాస్టల్‌లో ఎందుకు చేయకూడదు?? పైగా ఇందుకోసం పెద్దగా ప్రచారం చేయనక్కర్లేదు, వైశ్య హాస్టల్‌లో ఉండే 10 రోజుల కార్యక్రమంలో చక్కగా విద్యార్థులందరూ మన మాట వింటారు. కావాలంటే హాస్టల్ కమిటీ వాళ్లతో నేను మాట్లాడుతాను. సత్యసాయి యువ జన సమ్మేళనాన్ని మనం ప్లాన్ చేద్దాము అని చెప్తే... అందరూ ఎంతో ఉత్సుకత చూపించారు. కరెక్టే... స్వామి చెప్పారు, మనం ఎట్లైనా సరే దాన్ని చేసి చూపించాలి. కష్టమైనా... నష్టమైనా... మనం స్వామికి చేసి చూపించగలిగితే బాగుంటుంది. స్వామి కూడా సంతోషపడతారు. ఈ పిల్లలు ఒట్టి మాటల వాళ్లు కాదు చేతల వాళ్లు అంటారు' అని చెప్పడము, దానికి అందరూ సమ్మతించడం... నువ్వు ముందుకు వెళ్లు, మేము కూడా వస్తాము అని చెప్పడం... నేను వెంటనే ముందుకు వెళ్లడము జరిగింది.

అనంతపురం నుండి నన్ను పిలవడానికి వచ్చిన పిల్లలకు చెప్పాను. అరేయ్ నేను వస్తాను! కానీ నాకు మీరు ఒక పని చేయాలిరా! ఏం చేయాలి అంటే... ఒక రోజు అన్నదానం చేస్తున్నాం, ఇంకో రోజు నగరసంకీర్తన చేస్తున్నాం, మరొక రోజు భజన చేస్తున్నాం, ఇంకో రోజు సహస్ర దీపార్చన చేస్తున్నాం, ఈ తొమ్మిది రోజుల్లో ఒక రోజు మాత్రం మన మందరమూ 'సత్యసాయి యువ జన సమ్మేళనం' ఒకటి హాస్టల్‌లో ఉన్న 200 మంది పిల్లల్ని కూడా కూర్చోబెట్టి ఏర్పాటు చేయాలి, మంచి వక్తలను తీసుకొచ్చి స్వామి యొక్క విషయాలను, సేవా కార్యక్రమాలను వివరిస్తాము అని అన్నాను.

అప్పుడు ఆ విద్యార్థులు సాయిబాబా అంటే, మాకు తెలియదు, మనకి ఎందుకన్నా? అన్నారు. నేను చెప్తా కదా సాయిబాబా అంటే ఏందనేది. పదా మనం ముందుకు వెళ్దాం, దీనికి ఓకే అంటే నేను వస్తాను... లేదంటే నేను రాను అని చెప్పాను. ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ అందరూ కూడా ఒక మీటింగ్ వేసుకొని అన్నయ్య చెప్పింది మనం చేద్దాం. మంచి పని చెప్తున్నారు, మంచి మాటలు వినడానికి మనకేం డబ్బు అవసరం లేదు కదా అని ఒకే చేశారు.

హాస్టల్‌లో ఒక సైకిల్ షెడ్ ఉండేది. అదే సమావేశానికి వేదికగా మార్చేసాం. సుమారు 200 మందితో మొట్ట మొదటి సత్య సాయి యువ జన సమ్మేళనాన్ని ఏర్పాటు చేశాము.

నాకు గుర్తు, అప్పటి స్టేట్ కో-ఆర్డినేటర్ డా. ఎన్ అంజనయ్య, జిల్లా బాలవికాస్ కోఆర్డినేటర్,

నాగభూషణరావు, హాస్టల్ వార్డెన్ పరిచూరి రమేష్ బాబు, అడ్వకేట్ విట్టల్ తదితరులు వక్తలుగా వచ్చారు. ఇక హైదరాబాద్ నుంచి ఉదయన్న, వైసీ, రాజ, శేఖరన్న, సుబ్రహ్మణ్య సాయి సమ్మేళనానికి వచ్చారు. ఇక వాళ్లని చూసిన నా ఆనందానికి హద్దులు లేవనుకోండి.

అబ్బా! ఎంత పవిత్రమైన అనుభూతి ఇది. స్వామి వారు ఆదేశించిన తరవాత అంటే... ఆంధ్రదేశంలో మొట్ట మొదటిసారిగా, స్వామి వారి జిల్లా అయిన అనంతపురం జిల్లాలో, యువ జన సమ్మేళనాన్ని చేయగలిగాము... అందుకు నన్ను స్వామి వారు సాధనంగా ఎంచుకున్నారు కదా!

ఇక అన్నయ్యలు నా ఆహ్వానం మేరకు అంత దూరం వచ్చారు అని చెప్పి వాళ్లతో చాలా విషయాలు మాట్లాడాను. ఎంతో మంచిగా వేదిక, ప్రాంగణం, అలంకరణ, భజన తదితర ఏర్పాట్లు నేను చేస్తుంటే వాళ్లు కూడా ప్రత్యక్షంగా చూశారు. వాళ్లకు కూడా ఎంతో విశ్వాసం కలిగింది, ఎంతో ఆనంద పడ్డారు. ఇక ఆ సభలో నేను మాట్లాడుతూ అందరికి ప్రేరణ కల్పిస్తూ.. మనమందరం కూడా పుట్టపర్తికి ఎందుకు వెళ్లకూడదు? ఇంతటి మహత్కార్యాలు చేస్తున్న స్వామి వారిని మనం ఎందుకు చూడకూడదు... ఛలో అందరం దర్శనం కోసం వెళ్దాము. 3 గంటలు ప్రయాణం అంతే... బస్సులు ఏర్పాటు చేద్దాము అని చెప్పాను. ఆ విధంగా... తక్షణం మిగతా వాళ్లు అందరు కూడా మాట్లాడు కోవడం, అనుకోవడం, ఆమోదించడం అంతా జరిగిపోయింది, ఆ 18-20 వయస్సు గల పిల్లలు సుమారు 200 మందిని తీసుకుని 3 బస్సుల్లో అనుకుంటాను, వినాయక చవితి తర్వాత బయలు దేరి పుట్టపర్తికి వెళ్లడము, పుట్టపర్తిలో మేము వెళ్లడానికి ముందు గానే స్వామి వారికి సమాచారం ఇవ్వడం వల్ల... మమ్మల్ని విడిగా కూర్చో బెట్టడం జరిగింది. అప్పట్లో షా గారు ఉండే వారు, అక్కడ దర్శన్ లైన్స్‌ను చూసుకునేవారు. హైదరాబాద్ పిల్లలు అంటే చాలా మక్కువ చూపించేవారు. మరి వారి వల్లనో లేక స్వామి చెప్పడం వల్లనో గుర్తులేదు నాకు, అందరిని వేణు గోపాల స్వామి దగ్గర కూర్చోబెట్టారు.

నాకు అనిల్ కుమార్‌ను చూసినా, అంజనయ్యను చూసినా... వాళ్ల సఫారీ సూట్ బాగా నచ్చేది. అసలు వీలయితే చాలు ఒక సఫారీ కుట్టించే వాడిని. అలాగా ఆ చెయ్యి విరిగినది కన పడకూడదు అని ఒక కొత్త ఫుల్ హాండ్స్ సఫారీ కుట్టించుకున్నా. ప్రధానంగా అనంతపురంలో యువజన సమ్మేళనం నా ఆధ్వర్యంలో జరగడం వలన, హైదరాబాద్ పిల్లలందరూ కూడా నాకు అటు వైపు ఇటు వైపు కూర్చుంటే మేము మొదటి వరుసలో కూర్చోవడం జరిగింది. దర్శన సమయంలో స్వామి వారు 200 మంది పిల్లల్ని చూశారు. ఒక్కడికి కూడా తెలుపు డ్రెస్సులు లేవు, అంతా చిత్ర విచిత్రంగా ఉన్నారు, కేవలం ఇచ్చిన మాట మీద పిల్లలందరూ హడావుడిగా వచ్చారు. భగవంతుడే అక్కడున్నాడని తెలియని అమాయకత్వంతో వచ్చారు.

అలాంటి హడావుడిలో స్వామి తెల్లటి పాలరాతి బండలమీద నడుస్తూ... అల్లంత దూరం నుంచే నన్ను చూసి "ఏమైంది?" అని అడిగారండి. నాకు ఆశ్చర్యం అయిపోయింది. అంటే... స్వామి నాతో నా కళ్లలోకి సూటిగా చూసి మాట్లాడారు, ఇంకెవరి తోనూ మాట్లాడలేదు. కాబట్టి స్వామి నా చేయి చూస్తూ ఏమైంది అని అడిగితే, 'స్వామి చెయ్యి విరిగింది స్వామి' అన్నాను. ఓ ఫ్రాక్చర్! ఫ్రాక్చర్! అంటూ వెంటనే హస్త చాలనం చేసి విభూది ఇచ్చారు. ఇక నాకు మాటలు లేవు! కారణం ఏందంటే, అంతకు ముందు చెయ్యి విరిగినప్పుడు (1987) కలలో వచ్చి చెయ్యి ఇచ్చారు. రెండోసారి కలలో (1990) వచ్చి స్వామి నెప్పి స్వామి అంటే, తన చూపుడు వేలుతో నెప్పి ఉన్న ప్రాంతంలో ఇలా రుద్ది ఇక ఏం కాదు, పోతుంది అని చెప్పారు. అప్పటి నుండి ఇప్పటి దాక

ఎప్పుడు నాకు ఎముక విరిగిన దగ్గర ఆ నొప్పి రాలేదు. ఇక మూడో సారి ఫ్రాక్చర్ అని ప్రత్యక్షంగా చెప్పేసి స్వామి విభూది ఇవ్వడము, నాకు చాలా ఆనందం అయిపోయింది. ఆ ఆనందంలో కూడా అయ్యో ఈ విభూతి నేను అందరికీ ఇవ్వాలి అని చెప్పి అలా దాచి పెట్టుకొని ఆ విభూదిలో మళ్లీ విభూతి పాకెట్స్ తెచ్చి కలిపి వచ్చిన 200 మంది పిల్లలకి పంచడం జరిగింది. శివరాత్రి సమయంలో స్వామి మార్గ దర్శనం చేసిన తరువాత 200 మంది యువకులతో సమావేశం చేయడం అనేది ఒక దివ్యమైన అనుభూతిగా నిలిచింది.

నా తపనకి, ఆవేదనకి అంతే లేదు అనుక్షణము, అహరహము, స్వామి గురించి ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఆ వినాయక చవితి నుంచి నేను వెనుతిరిగి బెంగళూరుకి రావడం జరిగింది. కానీ మనసు మనసులో లేదు.

హైదరాబాద్ అన్నయ్యలతో, తమ్ముళ్లతో నేను మాట్లాడిన మాటలన్నీ నా చెవులలో మారు మ్రోగుతూనే ఉండేవన్న మాట. ఎప్పుడెప్పుడు నేను వారితో చేరి ఇంకా ఎక్కువ సేవలు చేయాలి అనే తపన. నాలో రగులుతున్న అగ్నికి హైదరాబాద్ యూత్ ఆజ్యం పోసినట్లు అయింది. అనంతపురంలో ఉన్న ఆ నాలుగు రోజులు కూడా నేను హైదరాబాద్ యూత్‌తో అనుభవించిన ప్రేమానురాగాలు ఇక జీవితంలో మరచిపోలేనివిగా నిలచి పోయాయి. ఇదిగో ఈ సందర్భంగా వాళ్లందరిని మరోసారి తలుచుకుంటూ ఉన్నాను.

40

నాకంటూ దిక్కు స్వామే అనుకున్నా... NATCOలో పడేసాడు!!

ఉదయన్న ఉత్తరం వ్రాసాడు
అంజనయ్య సాయం చేశాడు
రమణారావు దారి చూపాడు
గోపాల కృష్ణ ఫోన్ చేశాడు
ఆదినారాయణ శిక్షణ ఇచ్చాడు
సాయి నాథుడు నన్ను పిలిస్తే
ఇంత మంది కదలి వచ్చారు
నేను సదా స్వామినే నమ్మాను
NATCOలో చేరి పోయాను
నమ్ముతారా ఎవరైనా ఈ విచిత్రం
నన్ను హైదరాబాద్ యూత్‌లో
స్వామి చేర్చిన కథకు రూపమిది...

ఇక చదవండి... ఏమైంది అన్నది!

బెంగళూరు, కామాఖ్య బడావని, నేను నివసించే శ్రీధామకు నా పేరు మీద ఉత్తరం వచ్చింది. అది ఉదయన్న స్వీయదస్తూరితో వ్రాసిన అపూర్వమైన ప్రేమ లేఖ!!

'తమ్ముడూ' ప్రశాంతి నిలయంలో నిన్ను చూసినపుడు మాకు ఆనందం అయింది. నీలాగా ఇంత తపనపడే వాడిని చూస్తుంటే ఉత్సాహం పొంగి పోయింది. మాకు నీ మాటలు, పాటలు, ఆటలు, కవితలు ఇవన్నీ కూడా చాలా ఆనందం కలిగించాయి! నీలాంటి వాడు మా దగ్గర లేడే, అని నేను బాధ పడుతున్నా తమ్ముడూ! నువ్వు చెప్పు... హైదరాబాద్‌కు నువ్వు వస్తానంటే... వచ్చేయ్,

హ్యాపీగా మనందరం చెయ్యి చెయ్యి కలుపుదాం సేవ చేయ కదలుదాము. మనందరం ఒక్కటిగా మారి స్వామికి సేవ చేసుకుందాంరా. నువ్వు హైదరాబాద్‌కి వచ్చేయ్ రా,' అని దాని సారాంశం!!

ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివానో నాకే తెలియదు. ఇక రాత్రి నిద్ర పట్టనంత పని అయిపోయింది. ఎట్టైనా నేను హైదరాబాద్‌కి వెళ్లి పోవాలి, హైదరాబాదులో ఈ అన్నదమ్ములతో నేను కలవాలి, వీళ్లతో నేను జీవించాలి... స్వామిని సేవించాలి అని పరితపించాను.

మరొక కారణం 'స్వామి, ఆంధ్రప్రదేశ్ యూత్ కమిటీకిలో నన్ను సభ్యుడిగా ఎన్నిక చేశారు కదా! మరి నేను కర్ణాటకలో ఉండడం సరికాదు. నేను ఆంధ్రాకి వెళ్లాలి, ప్రధానంగా అనంతపురం, రాయలసీమ జిల్లాల్లో లేకున్నా... కనీసం హైదరాబాద్, ఆంధ్రా రాజధానిలో ఉండేందుకు నేను ప్రయత్నించాలి... అని ఇలాగా ఎన్నో రకాలుగా ఆలోచించడం మొదలు పెట్టాను. ఇక నేను ఒక చోట నిలిచే పరిస్థితి లేదు. అనునిత్యము, అనుక్షణము, అహరహము, అవిశ్రాంతంగా హైదరాబాద్‌కి వెళ్లాలి అని ఒక పిచ్చి పట్టిన వాడిగా మారిపోయాను.

ఆ సమయంలో కంపెనీ సెక్రెటరీ కోర్స్ ఇంటర్మీడియట్ రెండు భాగాలు నేను పూర్తి చేశాను. అంతా స్వామి దయ అనుకోవాలి మరి. అప్పటికి సుమారు నాలుగైదు ఏళ్లు ఆ కోర్సు చేశాను. ఐదేళ్ల తర్వాత ఈ రెండు గ్రూపులకు నేను ముగింపు పలికాను. నిజంగా చెప్పాలంటే, నా జీవితంలో చాలా అద్భుతమైనటు వంటి సాఫల్యం అని అనుకోవాలి. ఎందుకంటే ఒక సైన్స్ గ్రాడ్యుయేటుగా నేను ఈ సేవా కార్యక్రమాల్లో పడి బాగు పడటము, ఒక వైపు కంపెనీ సెక్రెటరీ ఇంటర్మీడియట్ చేయడం అంటే చాలా విశేషమే అది.

మా ఇంట్లో కూడా చాలా ఆనంద పడ్డారు. మా ఇంట్లో ఉన్న 30 మంది కజిన్స్‌లో కంపెనీ సెక్రెటరీ కోర్సు చేస్తున్నది నేను ఒక్కటే. తర్వాత ఈ మధ్యలో సాయం కాలం కాలేజీలో న్యాయ విద్య రెండో సంవత్సరం అయిపోయింది అనుకుంటాను. కాబట్టి ఇలాగ చాలా విశేషంగా నేను నా కెరియర్‌లో కాస్త మెరుగైన ప్రతిభ కనపరిచాను.

అప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం, ఆ కంపెనీ సెక్రెటరీ కోర్సులో ఎవరైతే ఇంటర్మీడియట్ పూర్తి చేస్తారో, వాళ్లు ఏదో ఒక గుర్తించ బడిన కంపెనీలో గాని ఒక ప్రాక్టీసింగ్ ప్రొఫెషనల్ దగ్గర గాని సుమారు ఒకటిన్నర సంవత్సరం పాటుగా శిక్షణ తీసుకోవాలి అని నియమం ఉంది.

ఆ సమాచారంతో పాటు... గుర్తించబడిన వ్యాపార సంస్థలు మరియు వృత్తి నిపుణుల గురించి ప్రతి నెల ఒక విద్యార్థుల సమాచార పత్రికలో ప్రచురించేవారు. వాటిని చూసే వాడిని. అలా చూస్తుంటే, హైదరాబాద్‌లో కొన్ని గుర్తింపు పొందిన కంపెనీలు కనిపించాయి. వెంటనే నేను ఏం చేశాను తెలుసా, బెంగళూరులో నాకేం దొరకలేదు, ఉన్న వాటికి అప్లై చేశాను, ఫోన్ చేశాను... ఇప్పుడు అవకాశం లేదని చెప్పారు. నిబంధనల ప్రకారం నాకు ఇప్పుడు ఉండేది ఇంక హైదరాబాదే. నేను హైదరాబాద్‌కి వెళ్లాలి అని ఇంట్లో చెప్పడం జరిగింది. వాళ్లు కూడా దాన్ని అర్థం చేసుకున్నారు. ఆ వెళ్లరా హైదరాబాద్‌కి, హైదరాబాద్‌లో ఎవరు ఇస్తారు నీకు? హైదరాబాద్‌లో మనకు ఎవరు తెలుసు? అంటే... ఎవరు తెలియదు... స్వామి తప్ప నాకు ఎవరూ తెలియదు!! అని చెప్పాను. నిజం కూడా అదే కదా?

అలాంటి సందర్భంలో స్వామి దర్శనానికి ప్రశాంతి నిలయానికి వెళ్లాను, ఎప్పుడూ వెళ్లినట్లుగానే మా జిల్లా పెద్దలు డా. అంజమయ్య గారి దగ్గరికి వెళ్లాను వారి యోగ క్షేమాలు కనుక్కోవడానికి. మాటల మధ్యలో యథాలాపంగా అన్నాను...

ఇలా హైదరాబాద్‌లో రెండు మూడు కంపెనీలు ఉన్నాయి సార్. వాటిలో ఏమైనా తెలిసిన వాళ్లు ఉంటే, నాకు శిక్షణ అవకాశం వస్తుంది... అప్పుడు స్వామికి ఇంకా ఎక్కువగా సేవ చేసుకోవచ్చు, అని కంపెనీల పేర్లు చెప్పాను. దాంట్లో ఆయన NATCO Pharma Ltd.,ని గుర్తు పట్టారు. అరేయ్ తమ్ముడూ, ఈ సంస్థలో మన రమణరావు గారికి బాగా తెలిసిన వాళ్లు ఉన్నారు. మనం వారిని కలుద్దాం అని చెప్పేసి, నా చేయి పట్టుకుని వెస్ట్ ప్రశాంతిలో ఉండే రమణరావు గారి గదికి తీసుకువెళ్లారు.

అప్పుడు ఆయన, నాట్కో ఫార్మాలో మన గోపాల కృష్ణ మూర్తి గారు, డైరెక్టర్, ఆయన సుధీర్ భాస్కర్ వాళ్ల మామయ్యనే... ప్రస్తుతం ఇక్కడే ఉన్నారు, అని చెప్పి మా వెంట బయలుదేరి వారి దగ్గరికి వెళితే... గోపాల కృష్ణమూర్తి గారు నన్ను చూసి, నా గురించి విని, చాలా సంతోషం! కంపెనీ సెక్రటరీ, మాదినీడి ఆదినారాయణ గారు ఉన్నారు నాట్కోలో. నేను చెప్తాను. నాట్కోలో నువ్వు చేరొచ్చు అని చెప్పారు.

అస్సలు మీరు ఊహించగలరా? ఎక్కడ బెంగళూరు... ఎక్కడ కర్ణాటక... CS ఇంటర్మీడియట్ అయి పోవడము ఏంటి? మధ్యలో స్వామి ఇంటర్వ్యూ ఇవ్వడము ఏంటి? AP యూత్ కమిటీలో ప్రవేశ పెట్టడము ఏంటి? నేను హైదరాబాద్‌కి వెళ్లాలని భీష్మించుకొని కూర్చోవడం ఏంటి? ఎక్కడ నాట్కో... ఇదంతా చూస్తే నా జీవితానికి ఇది స్వామి ప్రసాదించిన దివ్య ప్రణాళికయే అనిపించింది. లేక పోతే ఏమిటి ఇదంతా?

ఆ విధంగా వెను వెంటనే అక్కడి నుంచి వారు ఫోన్ ద్వారా ఆదినారాయణ గారితో మాట్లాడటము, ఆది నారాయణ గారు నన్ను రమ్మని చెప్పడము... నేను ఇంట్లో సమ్మతి తీసుకొని, వెంటనే హైదరాబాద్‌లో అన్నయ్య ఉదయ్ భాస్కర్ రెడ్డికి ఫోన్ చేసి "అన్నా! నాకు ఈ విధంగా హైదరాబాద్‌లో ఒక అవకాశం వచ్చింది, మరి నేను ఎక్కడ ఉండాలి? రానా? అని అడిగితే... అయ్యో తమ్ముడు... రా! రా! నేనే వస్తాను, నిన్ను బస్ స్టాండ్‌కి వచ్చి రిసీవ్ చేసుకుంటాను అని చెప్పాడు. నేను ఎంతో ఆత్మ విశ్వాసంతో నాకు సాయి సోదరులు అండగా ఉన్నారన్న ధైర్యంతో.. స్వామిని నమ్ముకుని బస్సులో హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్‌స్టాండ్‌లో దిగితే, అన్నయ్య స్కూటర్ వేసుకొని వచ్చి నన్ను కావలించుకొని, నన్ను తనతో పాటు వాళ్ల ఇంటికి తీసుకొని వెళ్లిపోయాడు.

అన్న వాళ్లది మధ్య తరగతి కుటుంబమే కానీ, అత్యున్నతమైన విలువలు ఉన్న కుటుంబంగా నాకు కనిపించింది. వాళ్ల ఇంటి వెనక ఒక చిన్న గదిలో నన్ను ఉండమని చెప్పారు. ఆ గదిలో ముందుగానే ఇంకో ఇద్దరో ముగ్గురో ఉన్నారు. అక్కడ వాళ్లతో పాటు నేను కూడా సర్దుకున్నాను. రెడీ అయ్యాక అన్ననే స్వయంగా నన్ను తీసుకొని స్కూటర్ మీద మధ్యాహ్నము RTC X రోడ్స్‌లో స్వాగత్ హోటల్లో భోజనం చేయించాడు. అక్కడ పెద్ద స్వామి ఫోటో చూశాను. ఎంతో విచిత్రం అనిపించింది ఇదంతా చూసుకుంటే. స్వామి నా ఇంటా వెంటా జంటగా ఉన్నట్లు లేదా మీరే చెప్పండి.

ఉదయన్న నన్ను NATCO దాకా తీసుకొని వెళ్లి వదిలేసాడు. అక్కడ ఆదినారాయణ గారి దగ్గరకి వెళ్లి, పరిచయం చేసుకున్నాను. వారు చాలా సంతోషపడి నా అప్లికేషన్ తీసుకుని 18 నెలల శిక్షణ కోసం అనుమతి పత్రాన్ని ఇచ్చారు. ఆ పత్రాలను CS ఇన్‌స్టిట్యూట్ వాళ్లకు పంపించినాను. నెలకు 750 రూపాయలు విద్యార్థి వేతనం ఇచ్చారు. నాకు అలా హైదరాబాద్‌లో ఉండే అవకాశం కలిగింది. ఇక NATCOలో ఉన్న 18 నెలలు కూడా, నేను కోర్సు నేర్చుకున్నది తక్కువ, సేవ

చేసింది ఎక్కువ అనే చెప్పాలి. కారణం ఈ సేవలో పడి, నన్ను నేను మర్చిపోయి... ఇక చదువు లేదు ఏమి లేదు.. ఇక సేవల మీద ఊరికే తిరుగుడు... జనాలతో కలువుడు, స్వామిని తలుచుకొనుడు... సేవ చేయడు!! ఇదే జరిగింది.

ఇక NATCOలో నాకు దేవకి వాసుదేవరావు కలిసాడు. నేను తను ఇద్దరం ఒకే సమయంలో శిక్షణకు చేరాము. అతి కొద్ది కాలంలోనే మేమిద్దరూ చాలా మంచి మిత్రులుగా మారిపోయాము. తనను నేను వృత్తి పరంగా వాసు అని పిలిస్తే, నన్ను తను ప్రవృత్తి పరంగా బాసు (బాలచంద్ర సుంకు) అని పిలిచేవాడు. తరవాత కాలంలో స్వామి సన్నిధికి కూడా తీసుకుని వెళ్లాను తనని.

మా గురువు ఆదినారాయణ గారు మమ్మల్ని గైడ్ చేసేవాళ్లు. ఎంత మంచిగా, ఉత్సాహంగా మమ్మల్ని చూసుకున్నారు అంటే... మాకు ఒక తండ్రిలా ఐపోయారు వృత్తిలో. ఈ రోజుకి కూడా నేను వారిని గురుతుల్యులుగా భావిస్తాను. జీవితంలో నా చివరి శ్వాస దాకా మర్చిపోలేని వ్యక్తిగా ఉండి పోయారు. కారణం, స్వామి సామ్రాజ్యములో నేను ప్రవేశించడానికి కారణం వారే కాబట్టి, నా కంపెనీ సెక్రెటరీ జీవితానికి బీజం వేసారు కాబట్టి, నా అన్ని విషయాలలో చేదోడువాదోడుగా ఈ రోజుకి ఉన్నారు కాబట్టి, వారిని నేను ఎప్పుడూ మరవలేను.

41

ఉదయన్న కాదు... అందరి హృదయన్న!

హైదరాబాద్‌కి రావడం అనేది నా జీవితంలో జరిగిన ఏకైక అద్భుతము అని చెప్పుకోవాలి. 55 ఏళ్ల నా జీవితంలో, గత మూడు దశాబ్దాలుగా నా జీవితము, నా జీవము, నా జీతము సర్వస్వము కూడా హైదరాబాదు యూత్‌తో ముడిపడి ఉన్నాయి. ఒక వైపు హైదరాబాదుకి రావడం వెనక భగవాన్ బాబా వారి దివ్య సంకల్పము ప్రస్ఫుటముగా కనిపిస్తూ ఉంటే, హైదరాబాద్ యూత్ తోటి నన్ను ముడి వేసిన వ్యక్తి ఉదయ భాస్కర్ రెడ్డి.

స్వామి తర్వాత, సాయి కార్యంలో నడిపించిన అగ్రజుడు
హృదయ పూర్వక ప్రేమను నాకు పంచినవాడు
వేల మందిని చేయి పట్టి సేవకై నడిపించినవాడు
ఉదయన్న కాదాయన... అందరి హృదయన్న!

స్వామి పాద సన్నిధిలో పరిచయం అయ్యారు
ప్రేమ లేఖ వ్రాసి మదిని మొత్తము దోచినారు...
ఇంట ఆశ్రయమిచ్చి వారిలో ఒకడిగా చేసినారు
ఉదయన్న కాదాయన... అందరి హృదయన్న!

దగ్గరుండి నాకెంతో తండ్రి ప్రేమనుపంచినారు
జోబి తడిమి మరీ ఖర్చుకు డబ్బులు ఇచ్చినారు
దరి చేర్చి దారి చూపి అందరి వాడయ్యారు
ఉదయన్న కాదాయన... అందరి హృదయన్న!

కష్ట సుఖములలో అందరి మదిలోన కదిలినాడు,
అన్నింటిలో తానున్నా తానొక సున్నా అన్నాడు,
అన్ని స్వామే చెప్పరు కదా... కొన్ని అన్న చెప్పేవారు
ఉదయన్న కాదాయన అందరి హృదయన్న

నా మాటకు భావన వారిది నా చేతకు చేతన వారిది
నా పాటకు ప్రాణము వారిది నా సేవకు జీవము వారిది

తప్పు చేస్తే సరిదిద్దేవారు ఒప్పు చేస్తే నెత్తికెత్తేవారు
ఎప్పుడైనా మనవాడే, ఎక్కడైనా మనలోనే
ఉదయన్న కాదాయన అందరి హృదయన్న!

Encouragementలో courageవారిదే
Stabilityలో ability వారిదే

స్వామి కార్యములో cause & reason
రెండూ వారివే అని చెప్పుకోవాలి.

స్వామి సన్నిధిలో పరిచయం అయ్యారు. ఆ మనిషి, వేషము, తెలంగాణ యాస, తెలంగాణ భాష, తెలంగాణ హృదయము, తెలంగాణ రక్తము, ఆ మనిషిని చూస్తేనే ఎంతో ఉత్సాహం అయిపోయేది ఎవరికైనా. ఆయన కళ్లలో కళ్లు పెట్టి చూస్తే చాలు ప్రేమను ఆస్వాదించే అవకాశం కనిపించేది. ఆయన మాట్లాడితే ఎవరికైనా స్వాంతనం కలిగేది. ఆయన ఏదైనా చెప్తే ఒక దివ్యమైన సాయి సందేశము అందించబడేది. స్వామి కార్యంలో ఈ రోజు నేను ఇలా నిలబడగలిగాను అంటే, నిజానికి ఆయన భుజాల మీద నిలబడ్డానేమో!... అందుకని ఇలా నిల బడ గలిగాను అని అనుకుంటా.

నాకు బాబా వారి దివ్య సమక్షంలో శివరాత్రి 1995లో వీరి పరిచయము అయ్యింది. చాలా సామాన్య మైన వ్యక్తిత్వము అసామాన్యమైనటు వంటి చాతుర్యము. స్వామి యొక్క నిర్దేశం మేరకు అలనాడు 1995వ సంవత్సరంలో... శ్రీ సత్య సాయి యువజన కార్య వర్గ బృందంలో మేమందరం కూడా చేరడము, తదనంతరం స్వామి ఏకాంత సౌధ సంభాషణ సమయంలో, స్వామి పాదాల దగ్గర ఏడు మందిమి కూర్చుంటే, అందులో ఉదయన్నతో పాటు స్వామి ప్రేమను పంచు కోవడము... తర్వాత నేను ఎక్కడో బెంగళూరులో ఉంటే, 'తమ్ముడూ నీలాంటి వాడు మాతో ఉండాలిరా, మనమందరం కలిసి స్వామి కార్యం చేద్దాం'... అని ప్రేమ లేఖ వారు వ్రాసిన వృత్తాంతం మీతో పంచుకున్నాను. ఆ ప్రేమ లేఖనే నన్ను స్వామి ప్రేమకి దాసుడిగా చేసింది. స్వామి కార్యములో నన్ను ముందుకు నడిపింది అని చెప్పుకోవాలి.

హైదరాబాద్ బస్‌స్టాండ్‌కి రావడం, తర్వాత వాళ్ల ఇంట్లో నాకు ఆశ్రయం కల్పించడము ఇదంతా కూడా చాలా యాదృచ్ఛికంగా జరిగింది కాదు. అసలు అన్నయ్యతో సంబంధం ఏర్పడటం అనేది జీవిత కాలంలో నేను మర్చిపోలేని ఒక దివ్యానుభూతి... ఇది సత్యం.

ఈ రోజుకి కూడా ప్రాతస్మరణీయుడిగా నేను తలుచుకుంటాను ఉదయన్నను. ఆయనకు సుమారు 60 ఏళ్లు (2025) ఉండొచ్చు కానీ, స్వామి కార్యంలో సేవించే సమయంలో వారి ఉత్సాహం... సంకల్పం... లక్ష్యం... లక్షణం చాలా ప్రేరణాదాయకమైనవిగా గోచరిస్తాయి. నాకు గుర్తు, మా వదిన ఇంట్లో ఉన్నప్పుడు వంట చేస్తూ... మా కోసం ఆలోచిస్తూ వండి మాకు కూడా కాస్తా కూరలు ఇవ్వడము, మాకు అన్నం పెట్టడము, వేళ కాని వేళలో ఆలస్యంగా వెళితే, మాకు ఇంట్లో వంట చేసుకునే సమయం లేకపోతే వదిన మాకు వండి పెట్టడము, ఎంత ప్రేమ... ఈ ప్రేమని చూస్తే నిజంగా మేము ఎంతో అదృష్టవంతులం అనుకోవాలి.

స్వామి యొక్క సంస్థలో ఇలాంటి వాళ్లు అక్కడక్కడ ఉండడం వల్లనే కదా... మాలాంటి వాళ్లు తయారవ్వగలిగింది. వీరిని స్వామి ఎన్నుకున్న సైనికులుగా చూస్తాను. నాకు బాగా గుర్తుంది, నేను ఆ నాట్కోలో పని చేస్తున్నప్పుడు నాకు ప్రతి నెల రూ.750/– వచ్చేది. అంటే నిజానికి లీవులు పోగా, కటింగ్లు పోగా చేతికి వచ్చేది 600 రూపాయలు.

చాలా సార్లు గమనించాను... ఉదయన్న నా జేబు తడుముతూ 'ఏరా డబ్బులు ఉన్నాయా?' అని అడిగి తన జేబులో డబ్బు తీసి పెట్టేవారు. ఆకలి అయితే ఏమైనా తిను, అనేవాళ్లు. తర్వాత కాలంలో వాళ్లు వేరే ప్రాంతానికి వెళ్లినా... వాళ్ల ఇంటి వెనక ఉన్నట్టు వంటి ఐదు ఆరు మందిలో నేను మాత్రం వాళ్లతో పాటు కొత్త ఇంటికి ఉదయన్న వాళ్లతో పాటే వెళ్లి పోయాను.

హైదరాబాదులో సుమారు 10 ఏళ్ల (1995 – 2005) దాకా ఎక్కడ నా సొంతంగా నేను ఉంది లేదు. ఇదిగో ఇలాంటి అన్నయ్యల ఇళ్లలో... వాళ్ల ఇంట్లో ఒకడిగా నేను బతికాను. అ సాయి ఆత్మ బంధువులకు నేను చచ్చి పోయేదాకా ఋణపడి ఉంటాను.

ఉదయభాస్కర్ వ్యక్తిత్వం నుండి నేను తెలుసుకున్న విషయాలు... స్వామి కార్యంలో నన్ను నేను అంకితం చేసుకోవడానికి ఉపయోగపడిన కొన్ని అంశాలు... నేను పాఠకులతో విన్నవించుకునే ప్రయత్నం చేస్తున్నాను.

ఒకటి : సేవకుడికి కావలసిన లక్షణం ప్రధానమైన లక్షణం ఏంటంటే, 'సైలెంట్ వర్క్' ఎంత నిశ్శబ్దంగా పని చేస్తారంటే... ఎవరితో ఎప్పుడు మాట్లాడేసాడో, ఎవరి గురించి ఎప్పుడు తెలుసుకున్నాడో, ఎవరి గురించి ఏమనుకున్నాడో... ఇదంతా కూడా చాలా రహస్యం అన్నమాట, మేము చెప్పకుండానే తెలుసుకునేవాడు. అంటే ఒక నాయకుడు అనేవాడు, 360° యాంగిల్లో నిశ్శబ్దంగా గమనించాలి అన్నది ఉదయన్న దగ్గర నుంచి నేర్చుకున్నాను.

రెండు: అచంచలమైన భక్తి విశ్వాసము. స్వామి అంటే, అబ్బా... స్వామి తిట్టినా సరే, దాంట్లో సందేశాన్ని వెతికే వ్యక్తిత్వము అన్నయ్యలో నేను చూశాను. ఎన్నో సార్లు మా కళ్ల ముందర స్వామి ఆయనను మందలించడము, ఏదో ఒక ఆదేశం ఇవ్వడము, ఏదో మాట చెప్పడము చూశాము. పది మందిలో గట్టిగా తిట్టిన సందర్భాలున్నాయి. కానీ ఏ రోజు కూడా ఆయన భక్తి చంచలం అవ్వలేదు. ఎంత కష్టం వచ్చినా, సాయి కార్యంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా, కుటుంబంలో మనస్పర్థలు వచ్చినా, అతని భార్య బిడ్డలకి కష్టం వచ్చినా... ఇవేవీ ఆయనని స్వామికి మాత్రం దూరం చేయలేక పోయాయి. ప్రతి సారి అవి ఓడిపోయి, పారిపోయాయి తప్ప కష్టాలకు ఆయన తలవంచింది లేదు... ఈ అరుదైన అద్భుతమైన భక్తి విశ్వాసాలను వారిలో నేను గమనించాను.

మూడు: తన తోటి వాళ్లందరిని తన వాళ్లుగా భావించే అద్భుతమైన వ్యక్తిత్వం ఆయనది. నేను ఇప్పటి దాకా ఎవరిలో ఇది గమనించ లేదు. వారి పవిత్ర భావన, వాత్సల్యము, ప్రేమ,

స్వామితో ఉన్న అనుబంధము, స్వామి ప్రేమ వీరి సహచర్యంలో మేము అనుభవించి రుచి చూసేవాళ్లము.

నాలుగు: ఎక్కడైనా ఎవరిదగ్గరైనా నైపుణ్యం ఉంటే, అది స్వామికి ఉపయోగ పడుతుందంటే ఎంత దూరమైనా వెళ్లి దాన్ని పట్టుకొని... స్వామి కార్యానికి అతికించే అద్భుతమైన చాతుర్యము చూశాను. చాలా మంది ప్రక్కవాడు బాగా మాట్లాడుతున్నాడు అంటే వాడిని తొక్కేయడానికో నొక్కేయడానికో ప్రయత్నం చేస్తుంటారు. కానీ ఉదయన్న దగ్గర నేను చూసింది ఏమిటంటే, ఎంత కష్టమైనా సరే... ఎంత దూరం అయినా వెళ్లిపోయి వాడిని పట్టుకొని రావడం, నచ్చ చెప్పడం, వాడికి ప్రేరణ ఇవ్వడం... స్ఫూర్తి ప్రధాతగా మారిపోవడం.. వాడిని ప్రేరణ ప్రవక్తగా రూపాంతరము గావించడం అన్నది ఉదయన్నలో నేను చూశాను.

ఐదు: ఒక్కోసారి అనిపిస్తుంది అన్ని తనే చేస్తుంటాడు... రాత్రి ఎప్పుడు పడుకుంటాడో తెలియదు. అన్ని దగ్గరలా తనే ఉండి చేస్తాడు, స్వామి కార్యంలో నాయకులు ఎవరు అని ఎవరైనా అడిగితే మాత్రం, చాలా సైలెంట్‌గా అన్ని తానుచేసి కూడా తానేమీ కాదు అన్నట్టుగా వెనకాల ఎక్కడో లైన్‌లో కూర్చుంటారు. అరే నిజంగా స్వామి దగ్గర ఇలాగా కదా ఉండాలి మనము, అర్రులు జాచడంలో వ్యక్తిత్వం లేదు, అందరి ముందర కూర్చోవడం కాదు, తన వాళ్లను వేదిక ఎక్కించి తాను మాత్రం వెనక వైపు అరుగు మీద కూర్చుని ఆస్వాదించడంలోనే నాయకుడి వ్యక్తిత్వం ఉంది! అన్నీ గమనించే వాణ్ణి. నా లాంటి వాళ్లని ముందు లైన్‌లో కూర్చోబెట్టడం, స్వామికి చూపించడం... నిజంగా ఇది త్యాగానికి పరాకాష్ట.

ఆరు: సాయి కార్యం ముందుకు వెళ్లాలి అని అహరహం శ్రమించే వ్యక్తిత్వము, ఆర్థికమైన ఇబ్బందులు ఎన్నో ఉన్నా, ఎక్కడ కూడా తొణకలేదు బెణకలేదు. ఎంతో మంది దూరం పెట్టినా సరే, ఆయన మాత్రం స్వామికి దూరం అవ్వలేదు. ఏదో రకంగా సేవా అవకాశం తీసుకోవడము, సేవ చేయడము ఇదే వారి జీవన పయనం. అంటే సాక్షాత్తు భగవంతుడే అడ్డుపడినా భగవంతుడి సేవకు దూరంగా పోకుండా అక్కడక్కడే తచ్చాడడం అనేటువంటిది నేను ఉదయన్నలో చూశాను.

ఇలాగ స్వామి అవతార కార్యంలో మేమందరం కూడా చెయ్యి చెయ్యి కలపడము సేవ చేయ కదలడం అనేది చాలా అద్భుతమైన విషయంగా చెప్పుకుంటాము.

పూర్వం సేవలు చేసే సమయంలో, స్వామికి ఉత్తరం వ్రాయాలి అంటే, అన్నయ్య దగ్గర కూర్చొని కొన్ని అంశాలు తీసుకొని, గోపి, YC లతో కూర్చుని కొంత సమాచారం సేకరించి స్వామికి ఉత్తరం వ్రాసేవాడిని.

ఎక్కడైనా సభలలో ప్రసంగం చేయాలంటే... ఆ జిల్లాలో, ఆ సభలో, ఆ యువతీ యువకులకి ఏం చెప్పాలి అనేది నాకంటే కూడా ఉదయన్నకి బాగా తెలిసేది. అరేయ్ మీరు ఈ పాయింట్లు ప్రధానంగా చెప్పాలి అని అంటే, ఆ పాయింట్ల మీద మేము ఉపన్యాసాలు తయారు చేసుకునే వాళ్లము. అంతే కాదు స్వామి ఏం చెప్పినా దాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో వారి అనుభవాన్ని జోడించి మాకు మార్గదర్శనం చేసేవారు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే... సేవకులు ఎవరైనా సరే ఇలాంటి నాయకుల దగ్గర ఉంటే స్వామి సంస్థలో అద్భుతమైన వ్యక్తులు తయారవుతారు, అని నేను గుండె మీద చేయి వేసుకొని చెప్తాను.

నిజం చెప్పాలంటే, యువ జన సేవా కార్యం... హైదరాబాద్‌లో, ఆంధ్రప్రదేశ్‌లో, దక్షిణ

భారతములో, యావద్ భారతదేశములో, ప్రపంచములో వ్యాప్తి గావించబడింది అంటే ఇదిగో ఇలాంటి సాయి సైనికులను స్వామి వారు స్వయంగా తయారు చేసి వదలడమే అన్నది నిర్వివాదాంశం. యువ జన ఉద్యమం ఈ రోజున ఇలా ఉంది అంటే, పూర్తిగా ఏ అనుమానమూ లేకుండా, ఇది ఉదయన్న వంటి వ్యక్తుల వల్ల మాత్రమే సాధ్యమైంది. ఆ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా దావానంలా వ్యాపించింది.

స్వామి దగ్గరుండి వారి వివాహం చేశారు. అన్నయ్య ఎంత కాలం సేవలో ఉన్నా సరే, మా వదిన భరించింది. ఎంతో ఓపిక, ఎంతో ఓర్పుతో కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాగే వారి పిల్లలు ప్రశాంత్, శ్రీముఖి ఇద్దరు కూడా పెద్ద పిల్లలు అయ్యారు. ఇప్పుడు ఈ రోజు వాళ్ల దగ్గరగా నేను లేకపోవచ్చు, కానీ వాళ్లతో ఉన్న ఆత్మీయతను మాత్రం నేను మర్చిపోలేను. చివరి క్షణం దాకా వీరిని నేను సదా స్మరిస్తూ, వాళ్లు సదా సుఖ సంతోషాలతో ఉండాలని నేను ప్రార్థిస్తుంటాను. కారణం స్వామి దగ్గర స్వతహాగా నేర్చుకునే అవకాశం మిగితా వాళ్ల లాగ నాకు ఎక్కువగా రాలేదు. కానీ స్వామితో ఎలా ఉండాలి, స్వామి కార్యంలో ఎలా ఉండాలి అన్నది మాత్రము ఉదయన్న దగ్గరనే నేర్చుకున్నాను. ఇందులో ఎట్టి సందేహము లేదు. ఎంత కష్టం వచ్చినా, ఎంత నష్టం వచ్చినా, లాభం వచ్చినా, సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా, ఏం వచ్చినా సరే... ఆయన విడవంది ఏమైనా ఉంది అంటే అది స్వామి వారి పాదాలే అని నేను చెప్తాను. అలాంటి వ్యక్తిత్వము నాకు కూడా రావాలి అని నేను ప్రార్థిస్తున్నాను.

అట్టి వ్యక్తి మన జీవితంలో ఒక్కరు మార్గ దర్శకంగా ఉన్నా చాలు, మనం ఏ వృత్తిలో ఉన్నా మొదటిస్థానంలో ఉంటాము అని చెబుతూ ముందుకు వెళుతున్నాను.

42

గోపి కృష్ణ - హ్యాపీ కృష్ణ

హైదరాబాద్‌లో జీవితము అంతా కూడా స్వామి ఎంతో వాత్సల్యంతో నాకు అనుగ్రహించిన విశేషము అనుకుంటాను. హైదరాబాదులో నేను మర్చిపోలేని అద్భుతమైన వ్యక్తులు చాలా మంది పరిచయం అయ్యారు. ఇది కూడా స్వామి వారి దివ్య సంకల్పమే! ఎవరితో మాట్లాడినా, ఎవరితో సంభాషించినా, ఎవరితో సమయం గడిపినా, ఎవరితో జీవనం సాగించినా, ఎవరి సత్సంగంలో ఉన్నా, ఏ సాయి భక్తుడి ఇంటికి వెళ్లినా... అనునిత్యము నాకు వినిపించేది కనిపించేది స్వామి యొక్క దివ్యానుభవాలే అని చెప్పటంలో ఎట్టి సందేహము లేదు. కారణం, స్వామే స్వయంగా వారిని ఎన్నుకోవడం... స్వామే వారికి స్ఫూర్తిని, ప్రేరణని ప్రసాదించడం. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన ప్రేరణ ప్రదమైన అవకాశాలు నాకు కలగలేదు కానీ... హైదరాబాద్‌కి రావడం వల్ల, ఎంతో మంది సాయి ఆత్మ బంధువులను నాకు స్వామి వారు ప్రసాదించారు.

అలాంటి ఆత్మ బంధువులలో పిడతల గోపి కృష్ణ ఒకరు. నా జీవితాన్ని ప్రభావితము చేసిన వ్యక్తులలో వారు ఒకరు. 'గోపి భాయ్', 'గోపి అన్న', 'అన్నయ్య', అంటూ ప్రేమగా పిలుచుకుంటూ ఉంటాము.

గోపి గురించి చెప్పాలంటే సరళమైన వాడు... హృదయమున్న వాడు... మంచి నాయకుడు... ముందుండి పోరాడే యోధుడు... స్వామి మీద అచంచల విశ్వాసం కృషితో ప్రతిభావంతుడిగా ఎదగాలనే తపన... కార్య నిర్వాహకుడు... ప్రేరణ కర్త అని ఇన్ని రకాలుగా గోపి కృష్ణ వ్యక్తిత్వాన్ని నేను తలచుకుంటాను.

గోపి కృష్ణ కాదు హ్యాపీ కృష్ణ అనుకుంటాను. కారణం ఎప్పుడూ చాలా సంతోషంగా, ఉల్లాసంగా కనిపిస్తారు. వారి శరీరం ఏమో భీముడిలా ఉండేది కానీ మనసేమో వెన్నలా, కృష్ణుడిలా ఉండేది. వారి సహచర్యంలో, వారి సాన్నిధ్యంలో, స్వామి గురించిన విశేషాలు తెలుసుకుంటూ... ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. ప్రధానంగా ఒక ప్రక్క ఉదయన్న నాకు తోడు నిలిస్తే మరొక ప్రక్క

గోపి అన్న నా తోడు నిలవడం జరిగింది. ఇద్దరు నన్ను ఇరు వైపుల నుండి పట్టి ప్రేమ బంధములో బిగించారు అనిపిస్తుంది. వాళ్ల కుటుంబానికి నేను చాలా ఋణ పడి ఉన్నా. గంగా గోపి, సాయి సంతోష మరియు సాయి హృదయ్ ఇదీ వారి కుటుంబం. అలాగే వాళ్ల కుటుంబంకి సంబందించిన సాయి రామ కృష్ణ, కన్నా భాయ్ & శిల్పా ఇలా ఈ ఏడు ఎనిమిది మందితో నా జీవితము సుమారు ఐదేళ్ల పాటు హైదరాబాద్‌లో గడిచింది. పదేళ్లు హైదరాబాద్‌లో ఉన్నానంటే ఐదేళ్లు ఉదయన్నతో మిగితా ఐదేళ్లు గోపి అన్న వాళ్ల ఇళ్లల్లో ఉండేవాడిని. ఏ రక్త సంబంధము లేకుండా, ఏ అనుబంధము లేకుండా, ఏ స్నేహమూ లేకుండా, కేవలము... "సాయి కార్యములో ఉన్నారు," ఈ అబ్బాయి మన అబ్బాయి అన్న ఒకే ఒక్క కారణం చేత నన్ను వాళ్లు గుండెల్లో పెట్టుకొని సొంత కుటుంబ సభ్యుడులా చూసుకున్నారు. ఎవరు నమ్మినా నమ్మక పోయినా... ఇది నిజము.

ఒక్కోసారి గోపి అన్న ఉదయన్నతో 'ఏరా వీడు కొన్నాళ్లు మా దగ్గర కూడా ఉంటాడు... ఎప్పుడు నీ దగ్గరేనా?' అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పుడు ఉదయన్న నాతో, 'బాల చూడు, వాళ్ల దగ్గర కూడా కొన్నాళ్లు ఉండరా' అని అనడం... కొన్ని రోజుల తరువాత ఉదయన్న తిరిగి అడిగేవాడు,' చాలు లే రా, వాడిని ఇక్కడ పంపించండి రా' అని. వీళ్లు నడిపించిన ఈ ప్రేమ కథను ఎలా వర్ణించాలో నాకు తెలియట్లేదు.

గోపి దగ్గర అంటే, సాయిరామ కృష్ణ వాళ్ల ఇంటిలో నన్ను చూసుకునే వాడు. కృష్ణ వాళ్ల ఇంట్లో ప్రతి గురువారము భజన జరుగుతుంది. ఎంత అద్భుతమైన ప్రేరణ కలిగేది అంటే... మనుషులు 20 మంది ఉన్నా సరే, భజన మాత్రం స్వామి సన్నిధిలో... ప్రశాంతి నిలయంలో జరిగినట్టు జరిగేది. అబ్బా ఎంత విచిత్రమో! తర్వాత తెలిసింది, ఆ కుటుంబంలో ఉండే అచంచలమైన భక్తి విశ్వాసాలు వాళ్ల తల్లిదండ్రులు ముదిగొండ అనురాధ నాగేశ్వర రావు నుండి వారికి వచ్చాయి. నారాయణ సేవ చేస్తూ ఆ దంపతులు తనువు చాలించారు. ప్రతి గురువారం భజన, ప్రతి నెల నారాయణ సేవ, ప్రశాంతి సొసైటీ ఆవిర్భావము ఇలా ఎన్నెన్నో కార్యక్రమాలకి నాందిగా సాయి రామకృష్ణ వాళ్ల ఇల్లు నిలిచింది అని విన్నాను.

స్వామి కూడా ఎంతో ఔదార్యంతో, ఎంతో ప్రేమతో, వాత్సల్యంతో వారిని చేరదీసారు. సత్యసాయి సంస్థలో ఇలాంటి కుటుంబాలు ఉండడం అనేది... ఎడారుల్లో ఒయాసిస్ అని చెప్పక తప్పదు ఇక్కడ నేను నేర్చుకున్నది ఏందంటే,

ఒకటి: వ్యక్తిగతంగా ఎంత కష్టం వచ్చినా స్వామిని వదలద్దు.

రెండు: ఎన్ని అడ్డంకులు వచ్చినా... అంటే సత్యసాయి సంస్థలో గాని, సమాజంలో గాని, ఆఫీసులో గాని... మొక్కవోని దీక్షతో స్వామి మీద భక్తితో అధిగమించే విధంగా ఉండాలి.

మూడోది: అద్భుతమైన ప్రతిభ. ఒక కంజీర కొట్టడం అనుకోండి, ఒక తబల, ఒక మృదంగము, ఒక హార్మోనియము, పాట పాడడము, తాళం వేయడము, ఇన్నీ సాంస్కృతిక నైపుణ్యాలు వీళ్ల దగ్గర నేను చూశాను.

నాలుగు: అవ్యాజ ప్రేమ, హైదరాబాదులో ఉదయన్న దగ్గర ఉన్నప్పుడు ఎంత నిరాడంబరంగా ఉండే వాడినో... గోపి అన్నయ్య దగ్గర ఉన్నప్పుడు అంత ఆడంబరంగా ఉండేవాడిని. రోడ్డు మీదకి వెళ్లి హైదరాబాద్ చూడడమనేది... కేవలం గోపికృష్ణ ఫ్యామిలీతో ఉన్నపుడే నేను చూశాను. వారాంతాలు వస్తే హోటళ్లకు వెళ్లడము, టెంపుల్స్‌కి వెళ్లడము, మాల్స్‌కి వెళ్లడము, షికారుకి వెళ్లడము, వేరే ఊర్లకు వెళ్లడము... అసలు ఇంట్లో పరాయి వాడు ఉన్నాడు అంటే చాలా రిజర్వ్‌గా

ఉండే కాలం, ప్రస్తుత పరిస్థితి. కానీ వారి ఇంట్లో ఎప్పుడూ reserved గా ఎవరు లేరు. అక్కడ అనుబంధాన్ని preserve చేసుకోవాలి అంతే. నేను చేసింది ఆ ప్రేమానురాగములను పదిలం చేసుకోవడమే. అంత అద్భుతమైన ప్రేమను అక్కడ అందుకున్నాను.

అయిదు: ఒకసారి ఉదయన్న టీమ్ సైకిళ్ల పైన ప్రశాంతి నిలయానికి ట్రిప్ ఆలోచిస్తే, గోపి అన్న టీమ్ బైక్ ట్రిప్ ప్లాన్ చేసే వాళ్లంట. బైక్స్‌లో వెళ్లి స్వామి దగ్గర సంక్రాంతి క్రీడోత్సవాలలో స్వామి ముందర పైలెటింగ్ చేసే వారు. ఇది చూసి తదనంతర కాలంలో విద్యార్థులు అందరూ కూడా మోటార్ బైకులు తెచ్చి స్వామి ముందు విన్యాసాలు చేయడము జరిగింది.

1992లో హైదరాబాద్‌కి స్వామి వారి చివరి దివ్య పర్యటన. ఆ సమయంలో స్వామి కారు నలువైపులా బైకుల మీద వీళ్లందరూ కూడా పైలట్స్‌గా స్వామికి అనుయాయులుగా సిటీ రోడ్స్ మీద అద్భుతమైనా చాతుర్యంతో స్వామి మన్ననలు అందుకున్నారని విన్నాను. ఇదంతా కూడా విన్నప్పుడు నాకు చాలా ఆనందమైతది. అబ్బా! ఇట్లాంటి వ్యక్తులతో నాకు సంబంధము ఆ స్వామి ఏర్పరిచారు కదా! వీరి స్నేహ సంబంధాలు విలువైనవిగా, సుమారు మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో నేను ఉన్నాను అంటే కేవలం వీళ్ల వళ్లే అనిపిస్తుంది.

ఆరు: వారి చాతుర్యం ఎట్లా ఉండేది అంటే.. ఎలాంటి క్లిష్ట పరిస్థితి వచ్చినా ముందుండి పోరాడే యోధుడి వలె ఉండేవారు. ఎప్పుడైనా సరే సైలెంట్‌గా చివరిలో ఉదయన్న ఉంటే, ముందు గోపి అన్న ఉంటూ, మధ్యలో మాలాంటి వాళ్లందరిని కూడా సుకుమారంగా సున్నితంగా పర్యవేక్షిస్తూ పట్టి నడిపించారు. సేవా కార్యం ఏదైనా సరే మేమంతా వీరిద్దరి మధ్య పెరిగి స్వామికి దగ్గరయ్యాము.

అలాగే ఎవరికి విపత్తు వచ్చినా, కష్టం వచ్చినా, నష్టం వచ్చినా టీంలో ఎవరైనా సరే ముందుగా స్పందించే ముగ్గురిలో ఉంటారు గోపికృష్ణ. అంటే సేవ జరిగేటప్పుడు ఇన్ని రకాల విషయాలని అవగాహన చేసుకుని ఉండడం అనేది నేర్చుకున్నాను.

చక్కగా మాట్లాడాలనే తపన, స్వామి దగ్గర ఏమైనా... ఎంతైనా సరే నేను చేయాలనే భక్తి విశ్వాసం, అనురక్తి, తర్వాత, ఏదైనా ప్రదర్శన చేయాల్సి వచ్చినా, ప్రెజెంటేషన్ చేయాల్సి వచ్చినా, పవర్ పాయింట్ ప్రిపేర్ చేయాల్సి వచ్చినా... ఇంగ్లీష్‌లో ఉత్తరం వ్రాయాల్సి వచ్చినా, స్వామి కోసం ఏ సమయంలో అయినా సిద్ధంగా ఉండాలి అనేది గోపి కృష్ణ దగ్గర నేర్చుకున్నాను.

ఇక జీవితంలో మరచి పోలేని అనుభవం ఒకటి ఉంది... చెప్పేందుకు దాపరికం ఏమి లేదు. నాకు గుర్తు, నాకు రూ. 750 రూపాయలు భత్యం వచ్చేది అప్పుడు. ప్రతి నెల 300 రూపాయలు కృష్ణకు ఇద్దామని ఒక సారి ప్రయత్నం చేశాను. వాడికి చాలా కోపం వచ్చేసింది. ఏంట్రా! మేము నిన్ను ప్రేమతో చూసుకుంటూ ఉంటే స్వామి పంపినట్లు అనుకుని ఆదరిస్తూ ఉంటే... నువ్వు నీ మీద పెట్టిన ఖర్చుకు లెక్క వ్రాసి మాకు డబ్బులు ఇస్తావా? అంటూ కృష్ణ నా చెంప పగల గొట్టాడు. 'మాకు డబ్బులు ఇస్తావురా నువ్వు? డబ్బులు ఇవ్వాలంటే చాలా డబ్బులు ఇవ్వాలిరా నువ్వు... మాకు డబ్బులు ఇచ్చే వాడయ్యావా?' అని వాడు ఎట్లా తిట్టాడంటే... నాకు అనిపించింది, ఇదే వారి ప్రేమకు పరాకాష్ట అని. కొట్టించుకున్నా ఫరవాలేదు... కానీ ఆ జ్ఞాపకం మాత్రం మధురంగా నిలచి పోయింది. అంటే అన్ని డబ్బుతో కొనలేము కదా, వాళ్ల ఇంట్లో నేను ఉన్నందుకు డబ్బుతో నేను దాన్ని కొలవను... నా ప్రేమతోనే నేను వారి సహచర్యంలో ఉండాలి అని ఆ రోజు తెలుసుకున్నాను. అంటే డబ్బుతో సంబంధం లేకుండా నన్ను వాళ్ల ఇంటి వాడిలా... వాళ్ల వాడిలా... వాళ్ల తమ్ముడిలా గోపి మరియు కృష్ణ కుటుంబాలు చూసుకున్నాయి. నేను వారితో గడిపిన సమయాన్ని ఎప్పుడు

గుర్తు చేసుకున్నా సరే స్వామి అపార కరుణకు శరణు వేడుకుంటూ ఉంటాను.

ఈ రోజుకి వారికి 60 ఏళ్లు దాటి ఉండచ్చు. ఇప్పటికి కూడా అదే జీల్... అదే ఫీల్... అదే ఆవేశము... అదే ఆదర్శం... గోపిలో చూస్తున్నాను. నాయకుడి స్థానంలో ఉంటేనే పనిచేస్తాను లేదంటే పని చేయను, అనే భావన వారికి ఎప్పుడూ లేదు. లీడర్ ఎవరైనా పర్వాలేదు. కానీ వాళ్ల ఫోకస్ ఎప్పుడూ స్వామిమే! స్వామి మరియు స్వామి సేవ. ఈ మధ్యలో ఎవడు వచ్చినా ఎవడు పోయినా నాకు సంబంధం లేదు నేను మాత్రం ఈ స్వామి కార్యానికి అంటి పెట్టుకొని ఉండాలి... అనే ఆర్తి, విశ్వాసము, ప్రభు భక్తి, గోపి కృష్ణలో చూశాను.

ఇలాంటి విషయాలు మన భక్తులందరూ... యువకులందరూ తెలుసుకోవాలి.

తను ఏదైనా పనిని ఒంటరిగా చేయగలగడం తన ప్రత్యేకత. ఎవరితో నైనా మాట్లాడగల శక్తి, సామాజిక మానవీయ సంబంధాలలో అతన్ని ఆదర్శంగా భావించవచ్చు, లేదా కమ్యూనికేషన్‌లో ఆచార్యుడు అనుకోవచ్చు.

ఒక నాయకుడు సమర్థవంతంగా మార్గనిర్దేశనం చేయాలనుకుంటే మరియు సేవ చేయాలనుకుంటే, అతనిలోని భావ వ్యక్తీకరణ, చాతుర్యం, నైపుణ్యము, ప్రజెంటేషన్, శ్రోత, సమర్థత, సమన్వయము మరియు అందరినీ ప్రేమించి, సేవ చేసే అద్భుతమైన వ్యక్తిత్వం వంటి అసాధారణమైన విలువలు ఉండాలి. ఈ అన్ని లక్షణాలను నేను గోపికృష్ణలో స్పష్టంగా చూశాను.

ఇలాంటి లక్షణాలను స్వామి దగ్గర నుంచి తెలుసు కోవచ్చు... కానీ అందరికీ అలాంటి అవకాశం ఉండదు కదా. అందుకే చుట్టూరా సాయి ఆత్మ బంధువులుగా ఇలాంటి వాళ్లు ఉంటే... వారితో ఉండే మా లాంటి వాళ్లు ఎలా అవుతారంటే అద్భుతంగా తయారవుతారు అని చెప్పడానికి ప్రత్యక్ష నిదర్శనము నేనే! నేను ఈ విషయాలన్నీ కూడా, ఆ స్వామి సన్నిధిలో సమర్పిస్తున్నాను... కారణం, స్వామి నుంచి నేర్చుకుంటేనే మంచి, గోపి నుంచి నేర్చుకుంటే కాదు అని నాకు భేదం లేదు. గోపి, ఉదయన్నల నుండి నా జీవితానికి మంచి పాఠాలు తీసుకున్నాను అని నేను ఎప్పుడూ తలుచుకుంటాను.



43

గ్రామ సేవయే – సాయి సేవ అలా మొదలైంది!

అసలు హైదరాబాద్‌కి రావడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఒకటి, ఆంధ్ర ప్రదేశ్ యూత్ కమిటీలో స్వామి వారు ఎంతో దయతో నన్ను చేర్చడం. రెండు, నన్ను ఆంధ్ర యూత్ కమిటీ సభ్యుడిగా స్వామి చేస్తే నేను కర్ణాటకలో ఉంటే ఎలాగా? కనీసం హైదరాబాద్‌లో ఉండాలి కదా అన్న కారణం. మూడు, హైదరాబాద్ యూత్‌తో చేరి పని చేసే అవకాశం నాకు వస్తుంది అనే కారణం. నాలుగు, కంపెనీ సెక్రెటరీ కోర్సు ఇంటర్ తరవాత శిక్షణ నిమిత్తమై వచ్చి మిగతా కోర్సును నేను ముందుకు తీసుకెళ్లొచ్చు అనేది.

అంటే దీంట్లో నాలుగు కారణాల్లో మూడు కారణాలు స్వామికి సంబంధించినవే. ఆ నాలుగో కారణం కంపెనీ సెక్రెటరీ అనేటువంటిది ఒక సాకుగా ఇంట్లో వాళ్లకు చూపించి హైదరాబాద్‌కి రావడం జరిగింది తప్ప... నిజానికి అది ఒక కారణమే కాదు. ఇది నిజం.

సత్యం ఏంటంటే నా ఊహ... నా ఆలోచన... నా తపన... నా హృదయము... నా ఆత్మ... నా దేహము... అన్నీ కూడా స్వామి సేవతో ముడిపడి ఉండడం జరిగింది, అదే నన్ను భాగ్యనగర బాట పట్టేటట్లు చేసింది.

హైదరాబాద్‌కి రావడానికి ముందు నన్ను నిలువనీయకుండా చేసిన ప్రధానమైన ఆలోచన ఏంటంటే, నేను ఎట్లాగైనా సరే హైదరాబాద్ యూత్ సైకిల్ గ్రూప్‌లో చేరి స్వామి దగ్గరికి వెళ్లాలి, ఏదోరకంగా స్వామి ఆశీస్సులు అందుకోవాలి, స్వామి దర్శన స్పర్శన సంభాషణ పాదనమస్కార భాగ్యాలు రుచి చూడాలని ఉవ్విళ్లూరేవాడిని.

నేను 1996 మార్చ్‌లో హైదరాబాద్‌కి వచ్చాను. వచ్చిన మరుసటి మాసంలోనే ఏప్రిల్‌లో శివం మందిర వార్షికోత్సవం జరగడం, అది ఒక సువర్ణావకాశాన్ని నాకు అందజేసింది. అసలు ఏ వేదిక మీద అయితే స్వామి దర్శనం ఇచ్చేవారో, ఏ వేదికనైతే స్వామి ప్రపంచానికి శివం రూపంలో అందించారో, ఏ వేదిక నుండి స్వామి తన దివ్య వాణిని వినిపించే వారో... ఆ వేదిక మీద, శివం

వార్షికోత్సవం సందర్భంగా ప్రసంగించే అవకాశం మా అన్నయ్యలందరూ చేరి నాకు అందించారు. ఆ శివం మందిర ముందు భాగంలో నేను మొదటి సారి నిల్చొని స్వామి కార్యము గురించి, స్వామి ఆదర్శం గురించి, స్వామి మహిమల గురించి మాట్లాడగలిగే దివ్యమైన అవకాశం వచ్చింది. ఇవన్నీ కూడా నా జీవితంలో శివంతో నాకు మర్చిపోలేని అనుభూతులు అని అనుకోవాలి.

ఇక అందరూ శివంకు సుమారు 10-20 కిలోమీటర్ల దూరంలో ఉండేవాళ్లు. తిలక్‌నగర్, మల్కాజ్‌గిరి, మలక్‌పేట్, సఫీల్‌గూడ, మెహదీపట్నం, మసాబ్ ట్యాంక్, విజయనగర్ కాలనీ, పంజాగుట్ట, కూకట్‌పల్లి, ఎస్‌ఆర్ నగర్, దిల్‌షుక్ నగర్, కొత్తపేట, వనస్థలిపురం, ఎల్బినగర్ ఇలాంటి ప్రదేశాలలో అంతా కూడా ఉండేవాళ్లము. ఎప్పుడు వీలైతే అప్పుడు, ఎప్పుడు అవసరము అయితే అప్పుడు అందరూ కూడా కలుసుకునే వాళ్లం. బైక్‌లో ఇద్దరు ముగ్గురు కలసి వెళ్లడమో లేక బస్సులో వెళ్లడమో... ఏదో లాగా, అలా ఎక్కడో ఒక చోట కలుసుకునే వాళ్లం. ఈ ప్రక్రియలో స్వామి దగ్గరికి వెళ్లాలన్న ఆశ ఆసక్తితో అందరూ కూడా ఉత్సుకతగా ఉన్నారని అర్థం అయింది. సైకిల్ ట్రిప్ జరగాల్సిన సందర్భం అది.

ఇలాంటి సందర్భంలో ఒక సారి ప్రశాంతి నిలయం వెళ్లాము అందరం. స్వామి వారు పాద నమస్కారం ఇచ్చారు. అప్పుడు ఆ పాద నమస్కారం సమయంలో నేను కూడా ఉన్నాను. స్వామి ఇట్లా సైకిల్‌లో వస్తున్నాము అని చెప్పగానే ఎందుకో తెలియదు స్వామి చాలా తీక్షణంగా, చాలా కోపంగా హెచ్చరిస్తున్నట్లు, తీక్షణమైన గొంతుతో "ఏయ్! మీరు మీ యొక్క శక్తి సామర్థ్యాలు అంతా కూడా వృధా చేస్తున్నారు. సైకిల్లో అంత దూరం నుంచి తొక్కుకొని వస్తున్నారు. నేను మీ ముఖాలను చూడను, మీరు ఇట్లా వస్తే, నేను మిమ్మల్ని లోపలికి రానివ్వను. ఏదైనా పనికి వచ్చే పని చేయండి" అని చెప్పారు. వార్నింగ్! ఇచ్చారు అనిపించింది. కానీ బ్రదర్స్ అందరూ కూడా చాలా స్వీట్ గానే తీసుకున్నారు. స్వామి అట్లానే అంటాడులే. మనం ప్రేమను చూపించాలి కదా స్వామికి. ఇన్నాళ్లుగా చేస్తున్నాం. తప్పకుండా వెళ్లాలి అని. నేను 'ఏందబ్బా స్వామి ఇట్లా అన్నాడు!' అని అనుకున్న. నా పరిస్థితి ఏందో నాకే అర్థం కాలేదు. నేను వచ్చిందే సైకిల్ ట్రిప్ కోసం కదా! ఇట్లా అయిపోయింది ఏంటి? అని చాలా బాధపడ్డాను.

అలా బాధపడుతూ ఉన్న సమయంలో ఆరు నెలల కాలం గడిచిపోయింది. హైదరాబాద్‌లో YCకి చాలా దగ్గర అయ్యాను. అత్తాపూర్‌లో ఉండేవాడు. నేనేమో కృష్ణ వాళ్ల ఇంట్లో ఉండేవాడిని. ఆదివారం వస్తే వాడు బైక్‌లో వచ్చి నన్ను పికప్ చేసుకొని శివంకి తీసుకెళ్లేవాడు. పుట్టపర్తి నుంచి వచ్చిన తరవాత స్వామి వేడి వేడి మాటల సారాంశాము మా ఇద్దరికీ జీర్ణం చేసుకోలేని పరిస్థితి. మేము బృందంగా ఎక్కడ కలిసినా, స్వామికి ఎట్లా సేవ చేసుకోవాలి? స్వామి ఎందుకు ఇట్లా అన్నారు? రకరకాలుగా ఊహలు, మాటలు, చర్చలు, ఆలోచనల తుఫాన్‌లా వచ్చేవి. వెళ్లకపోతే! స్వామికి దగ్గర అయ్యేది ఎట్లాగా? స్వామి దీంతోనే కదా ఇంటర్వ్యూలు ఇచ్చారు, మాట్లాడారు, రింగులు ఇచ్చారు, చైన్లు ఇచ్చారు. ఇన్నేళ్ల పాటు జరిగిన సైకిల్ ట్రిప్‌లో ఎన్నో రకాల అద్భుతాలు జరిగాయి. అప్పటికి 7 లేక 8 సార్లు జరిగింది అనుకుంటున్నాను. అలా ఎవరికి వారు తపన పడుతున్నారు. అలా మేము కూడా తపిస్తూ ఒక రోజు శివంకు... బైక్ పైన పోతూ పోతూ వెళ్లే దారిలో మేమిద్దరం మాట్లాడుకుంటున్నాం.

అరేయ్ ఏంట్రా స్వామి ఇలా అన్నారు? ఎందుకోసం అంటావ్? అని YC అడిగాడు. అప్పుడు నేను అన్నాను... 'స్వామి ఇట్లా అన్నారంటే ఇంకేదో భావన ఉండొచ్చు. ఆ భావనని మనం గమనించ

గలిగితే బాగుంటుంది.

స్వామి ఏమన్నారు?

ఒకటి, మనము సైకిల్ తొక్కడం వల్ల శక్తి సామర్థ్యాలన్నీ వృధా అయిపోతున్నాయి అని చెప్పారు.

రెండు, స్వామి మనము సైకిల్‌లో వస్తే మనల్ని చూడను అని అన్నారు.

మూడు, ఏదైనా పనికొచ్చే పని చేయండి అన్నారు.

ఏం చేయొచ్చు? అని అనుకుంటుంటే... అరే సేవ చేసి పోతే బాగుంటుంది. మనం 50 మంది రెడీగా ఉంటే మనం సైకిల్‌లోఎందుకు వెళ్లాలి? ఒక బస్సు మాట్లాడుకుందాం. తలా 1000 రూ. ఖర్చుపెట్టడానికి రెడీగా ఉన్నారు కదా. అంటే సుమారు రూ.50,000/-అవుతుంది. మనం ఇంకాస్త వనరులు సమకూర్చుకుంటే సరి పోతుంది. ఒక సైకిల్ యాత్ర ఏడు ఎనిమిది రోజులు మనం చేస్తున్నాము. దారి పొడుగున చిన్న చిన్న సేవలు చేస్తున్నాము. అట్లా కాకుండా సైకిల్‌కి బదులు బస్సు ఏర్పాటు చేసుకుని ప్రమాదరహితంగా అందరూ కలిసి మెలిసి ఆడుతూ, పాడుతూ, మాట్లాడుకుంటూ, ముచ్చట్లాడుకుంటూ, భజనలు చేసుకుంటూ, బస్సులో ప్రయాణం చేసి అదే ఏడు రోజులు ఒక్కొక్క రోజు రాత్రి ప్రయాణము చేసి, పొద్దున్నే ఒక జిల్లాకు వెళ్లి... ఆ జిల్లాలో ఒక మారుమూల గ్రామాన్ని ఎంచుకొని, ఆ గ్రామంలో సేవలు చేస్తే ఎలా ఉంటుంది? అప్పుడు ఏడు రోజుల పాటు, ఏడు గ్రామాలు, మనం సేవ చేసి స్వామి దగ్గరికి వెళదాము. స్వామి మీరు చెప్పినట్టుగానే మేము విన్నాము. సైకిల్ యాత్ర కాకుండా, సేవా యాత్రగా దీన్ని మార్చి మీ యొక్క సన్నిధికి వస్తున్నాము అని చెప్తే ఎలా ఉంటుంది?' అని అలా మాట్లాడుకున్నాం. చాలా అద్భుతం అనిపించింది ఇది. ట్యాంక్‌బండ్ మైసమ్మ ఉంది కదా, ఆ మైసమ్మ గుడి ముందు నుండి ముందుకు వెళ్తున్నప్పుడు ఈ మాటలు మాట్లాడుకుంటూ శివంకు వెళ్లడం, శివంలో మిగతా బ్రదర్స్ అందరిని చేరి వారికి వివరించడం జరిగింది.

ఉదయన్న, గోపి, రాజా, శేఖరన్న, బాలాజీ, సాయి రామకృష్ణ, సాయి సుబ్రహ్మణ్యం, సాయి సుదీప్, బోయిరాజు, రింగ్ రాజు ఎంతో మంది... ఇక వాళ్లందరూ కూడా దీన్ని విని చాలా ఉత్సాహ పడిపోయారు. ఐతే దానిని ఎట్లా చేయాలి అని అనుకున్నప్పుడు... ఏముంది, స్వామి దగ్గరికి వెళ్దాం. స్వామికి చెప్పేద్దాం. స్వామికి చెప్పేసి మనం ప్రయత్నం చేద్దాం. అని చెప్పి ఇలా అందరం ఎంతో జోష్‌తో, ఉత్సాహముతో, మరియు స్వామి పట్ల హృదయ పూర్వకమైన ప్రేమను ప్రకటించడానికి అవకాశం దొరికిందని సంతోష పడ్డాము.

ఒక మంచి ఉత్తరం వ్రాసి దానికి... ఈ యాత్రకు ఏం పేరు పెడితే బాగుంటుంది అని ఆలోచించి మాట్లాడుకున్నాము. గ్రామ సేవ అంటే రామ సేవ అని గాంధీ గారు చెప్పారు కదా, మనకు రాముడు స్వామి కదా అని అనుకుని "గ్రామ సేవయే – సాయి సేవ" అని మా సేవా యాత్రకు నామకరణం చేసుకుని, చాలా తపనతో, భక్తితో, ఆర్తితో, వేదనతో, ఆదర్శం నిరూపించాలన్న ఆలోచనతో మేము ఐదు మంది కార్లో రాత్రి ప్రయాణం చేసి పుట్టపర్తికి వెళ్లి స్వామికి లెటర్ ఇచ్చేయాలని సిద్ధం అయ్యాం. స్వామి లెటర్ తీసుకుంటే అందరం బస్సు యాత్ర చేయాలని నిర్ణయం తీసుకొని బయలుదేరాము. ఉదయన్న, గోపి, YC, రాజా మరియు నేను ఐదు మంది ఒక రోజు అనుకుని రాత్రి పుట్టపర్తికి వెళ్లడము... ఉదయము వెళ్లే సమయానికి అక్కడ షా గారు ఉన్నారు కదా అతనితో వెళ్లి ఇట్లా స్వామి వారికి చెప్పుకోవాలి అంటే... ఆ చిన్న సింహాలు దగ్గర కూర్చోబెట్టారు.

అద్భుతమైన ఉదయము. ఆర్తితో మేము ఐదు మంది కూర్చున్నాం. ఉదయ్ అన్న కవర్ పట్టుకున్నారు. "శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య పాద పద్మ సముఖమునకు శతకోటి నమస్సుమాంజలులతో" అని దాని మీద వ్రాసి ఉత్తరం పట్టుకున్నాము. స్వామి రావడము రావడము డైరెక్ట్‌గా కళ్లలో కళ్లు పెట్టి చూస్తూ ఇలా రెండు చేతులతో ఇట్లా పెడితే ఆ లెటర్ సయ్యిమని వెళ్లిపోయింది స్వామి చేతిలోకి. ఎంత అనిర్విచ్చినయమైన ఆనందమూ అనుభూతి కలిగింది అంటే... అబ్బా స్వామి గ్రామ సేవ సంకల్పానికి సమ్మతించారు. స్వామి తీసుకున్నారంటే ఓకే కదా అని చెప్పేసి స్వామికి విన్నవించుకుని వెంటనే తిరుగు ప్రయాణం చేశాము, అక్కడ ఒక్క రోజు కూడా ఉండలేదు.

అలా మొట్ట మొదటగా "గ్రామ సేవయే – సాయి సేవ" కార్యానికి శ్రీ కారము చుట్టాము అన్నమాట. తదనంతరం చాలా చాలా అద్భుతమైన విశేషాలు జరిగాయి. ఆ విశేషాలన్నీ కూడా నాకు తెలిసిన విధంగా, నాకు అర్థమైన విధంగా, నేను స్వామితో తెలుసుకున్న విషయాలని మీ ముందుకి తెచ్చే ప్రయత్నం చేస్తాను.

44

గ్రామ సేవా శంఖారావం

బాబా వారి సన్నిధిలో గ్రామసేవ యాత్రకు సంబంధించిన కార్యక్రమాన్ని ఉత్తరం ద్వారా స్వామికి అందించాం. "గ్రామ సేవయే – సాయి సేవ" అన్న నినాదాన్ని భుజాల మీదకు ఎత్తుకున్నాం. హృదయం నిండుగా నింపుకున్న విశ్వాసంతో... వెను దిరిగి హైదరాబాద్ వచ్చేసాం. తిరుగు ప్రయాణం చేస్తున్న సమయంలో కూడా కార్యక్రమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి? అంటూ మాట్లాడుకుంటున్నాం. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత వివిధ ప్రాంతాలలో ఉండే బృందాలతో భేటీలు మొదలు పెట్టాం. వనస్థలి పురం, దిల్‌షుక్‌నగర్, కూకట్‌పల్లి, ఎస్.ఆర్. నగర్, ఏ.ఎస్.రావు నగర్, సఫీల్ గూడ, మల్కాజిగిరి, మెహిదీపట్నం, అల్వాల్, సీతాఫల్ మండి, బోయగూడ ఇలాగ ఎన్నెన్నో ప్రాంతాలలో ఉన్న సాయి యువతని, స్నేహితులని కలుస్తున్నాం. గ్రామ సేవను దిగ్విజయంగా చేయాలి అని చర్చిస్తున్నాం.

సెప్టెంబర్ 21, 1996 నాడు అందరం గ్రామ సేవకు బయలుదేరాలని ముహూర్తం నిర్ణయం చేశాం. సుమారు 50 మంది యువకులు ఎలా తయారయ్యారు అంటే, కసితో రెడీ అయ్యారు అని చెప్పక తప్పదు. స్వామి కోసం ఏమైనా సరే చేయాలి! స్వామి సైకిల్‌లో రావద్దు అంటే ఏమి? స్వామి రావద్దు అని చెప్పలేదు కదా!!... అదే సంతోషము. ఇప్పుడు బస్సులో వెళ్తున్నాం కదా! ఇంకేమిటి?

శక్తి సామర్థ్యాలు వృధా చేయొద్దు అని చెప్పారు కదా?! మనమేం శక్తి సామర్థ్యాలు వృధా చేయట్లేదు, శక్తి సామర్థ్యాలని ఏకం చేసి గ్రామాలలో సేవా కార్యక్రమాలు చేయబోతున్నాం అనే సంతోషం మది నిండా!

అన్నటికి మించి స్వామి కూడా ఎంతో దయతో గ్రామ సేవా యాత్ర వినతి పత్రాన్ని స్వీకరించారు. అన్న భావనలని అందరూ అందరితో పంచుకోవడం మొదలు పెట్టారు. ఈ ప్రక్రియలో అసలు గ్రామంలో వెళితే ఏం చేయాలి అని మేము అందరం కూర్చొని మాట్లాడుకున్నాం.

కొన్ని విషయాలు... అంటే సత్యసాయి సంస్థల ప్రభావము, ప్రాభవము ఏమిటి? సత్యసాయి

సంస్థలు ఏ ఉద్దేశంతో ప్రారంభించారు స్వామి వారు? సత్యసాయి సేవా సంస్థల లక్ష్యం ఏమిటి? సత్యసాయి సేవా సంస్థలలో మూడు విభాగాలు విద్యా విభాగము, సేవా విభాగము, ఆధ్యాత్మిక విభాగము ఈ మూడు విభాగాలలో చేస్తున్న కార్యక్రమాల మౌలిక స్వరూపము ఏమిటి? ఈ విశేషాలను అన్నింటిని ఒక గుళిక మాత్రంగా చేసుకుని గ్రామాలలో సేవలు చేద్దాం. వెళ్లిన ఒక్క రోజు అంతా కూడా ఉదయం నుండి సాయంకాలం దాకా చేసిన కార్యక్రమాలన్నీ ఏ విధంగా ఉండాలంటే... ఆధ్యాత్మిక, విద్యా మరియు సేవా విభాగము ఈ మూడు కార్యక్రమాలు ఉండాలి అని నిర్ణయం చేశాము.

మొదటిది, నగర సంకీర్తన అంటే చాలా ఇష్టము స్వామికి... కావున దీనితోనే గ్రామాలలో సేవలకు శ్రీకారం చుట్టాలి. అన్నప్పుడు చాలా మంది కూడా నగర సంకీర్తన కాదు ఇది గ్రామ సంకీర్తనము అని చెప్పారు. అవునవును... ఇది గ్రామ సంకీర్తన!

ఈ విధంగా రాత్రి ప్రయాణంలోనే మనం విశ్రమించి, పొద్దున అయిదు గంటల కంతా గ్రామానికి చేరి, బస్సు ఒకచోట నిలిపి, ఆనందంగా, మంచి ఉత్సాహంగా భగవానుని నామాన్ని ఎలుగెత్తి భజిస్తూ ఆ గ్రామ వీధుల్లో తిరగాలి అని నిర్ణయం చేశాము.

రెండవది, ఈ కార్యక్రమం కోసం మన బృందంలో వంట చేసేది ఎవరు? అనే విషయంలో చర్చ జరిగింది. బయట నుంచి వంటవాళ్లను తీసుకెళ్తే ఖర్చు ఎక్కువ అవుతుంది కాబట్టి, మన టీంలోనే వంటపై ఆసక్తి ఉన్నవాళ్లుండాలి అనుకున్నాం. నాకు గుర్తు ఉన్నంత వరకు–శంకర్ భాయ్, సుదీప్ భాయ్, మల్పాణి లాంటి వారు వంట విషయంలో ఉత్సాహంగా ఉండేవారు. వాళ్లందరూ వంటపనిలో చురుకుగా పాల్గొంటామని చెప్పారు. వాళ్లు వంట పాత్రలు, కూరగాయలు, ధాన్యాలు, బియ్యం మొదలైనవన్నీ ఏం అవసరమో జాబితా తయారుచేసుకొని, వంటకు కావలసిన సన్నాహాలను చేసుకోవడం మొదలు పెట్టారు.

తర్వాత "ఇంకా ఏం చేయాలి?" అన్న సందేహం వచ్చినప్పుడు, ఉదయ్ అన్న టీం ముందుకు వచ్చారు. వాళ్లు ఇలా అన్నారు – మేము ముందుగా రెక్కీ చేసుకుంటాం. వీలైతే ముందుగా గ్రామానికి వెళ్లిపోయి ఎలాంటి సేవలు చేయొచ్చు అన్నది గుర్తిస్తాము. లేకపోతే మిగతా వాళ్లు ఆ రోజు కార్యక్రమం చేస్తూ ఉంటే, మేము మా టీంతో కలిసి ఆ గ్రామంలో ఎక్కడైనా శారీరక శ్రమ అవసరమా? ఎక్కడైనా గ్రామానికి ఉపయోగ పడే పని చేయొచ్చా అని చూస్తాము. దాని ఆధారంగా మనం తదుపరి కార్యక్రమాలు ప్రణాళిక చేసుకుందాం" అని అన్నారు. ఈ విధంగా ఉదయ్ అన్న టీం ముందుకు వచ్చి, బాధ్యత తీసుకున్నారు.

ఇంకా ఏం చేయాలి? అన్న ప్రశ్న వచ్చినప్పుడు మనం కేవలం మనుషులకే సేవ చేస్తే ఎలా? భూతదయ ఉండాలి అని స్వామి చెప్పారు కదా. అందుకే, పశువులకు కూడా సేవ అందించాలని భావించాం. ఆ దృష్టితో పశువైద్య శిబిరం నిర్వహిస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన ప్రారంభమైంది. బర్రెలు, పశువులు, ఎద్దులు, దున్నలు, ఆవులు, గొర్రెలు వంటి జంతువులకీ టీకాలు చేయడమే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నాం. వెంటనే డాక్టర్ కృష్ణ కుమార్ (కే.కే. భాయ్) ముందుకు వచ్చారు. ఆయన వెటర్నరీ డాక్టర్ మరియు వెటర్నరీ కాలేజీలో లెక్చరర్ కూడా. "ఇది నేను చూసుకుంటాను, దాని బాధ్యత నాది" అంటూ ఆయన మద్దతు ఇచ్చారు. కూకట్పల్లి నుండి పెద్ద రాజు గారు, చిన్న రాజు గారు వంటి వారు కూడా పశువైద్య శిబిరం నిర్వహణలో పాల్గొనడానికి ముందుకొచ్చారు.

ఇప్పుడు పశువులకు మాత్రమే కాదు, మనం మెడికల్ క్యాంప్ కూడా నిర్వహించాలి కదా అన్న ఆలోచన వచ్చింది. అదే సమయంలో వైసీ (Y.C.) మరియు టీం, మెడికల్ క్యాంప్ అనుభవం

ఉన్న వారు, ముందుకు వచ్చి "మేము మందులు ఇవ్వడం చూసుకుంటాము" అని తెలిపారు.

అప్పటికి మన దగ్గర డాక్టర్ల ప్రోత్సాహం తక్కువగా ఉండేది. అంతే కాకుండా, ఏడురోజుల గ్రామసేవ ప్రయాణం కూడా ఉండటం వల్ల, అందరూ కలసి ఒక ఆలోచన చేశారు. డాక్టర్ భవానీ, డాక్టర్ అనీల్ కుమార్, డాక్టర్ కశ్యప్ తదితర డాక్టర్లతో జత కట్టినాము.

మళ్లీ ఔషధాలు కావాలి కదా అనుకున్నాం. వివిధ ఫార్మా కంపెనీలను సంప్రదించి, మేము "గ్రామ సేవ – సాయి సేవ" కార్యక్రమం ద్వారా "రూరల్ డెవలప్‌మెంట్ కోసము" అని వివరిస్తే వారు మాకు అవసరమైన మందులు అందజేశారు. కొన్ని మందులు కొన్నాం కూడా.

ఈ విధంగా చూస్తూ చూస్తూనే గ్రామసేవకు ముందు దశల్లోనే సుమారు 50 మందికి పైగా ఈ కార్యాచరణలో భాగస్వామ్యులయ్యారు.

మరి మిగతా వాళ్లు ఏం పని చేస్తారు అంటే? అప్పుడు నేను అన్నాను "అయ్యా! నేను గ్రామంలో బాలవికాస్ తీసుకుంటాను. సత్య సాయి మహావతార దర్శన్ ప్రారంభం చేస్తాను. గ్రామంలో పొద్దున్నే తొమ్మిది గంటలకి ప్రారంభం చేస్తే, ఊర్లో వాళ్లందరికీ స్వామి యొక్క వాణిని, స్వామి యొక్క సందేశాన్ని, స్వామి యొక్క సేవా కార్యక్రమాలని వివరిస్తాను. పిల్లలందరిని తీసుకొచ్చి ఆరోగ్యం, పరిశుభ్రత, గ్రామ పారిశుభ్రత, స్వచ్ఛత, దివ్యత, నవ్యత, భవ్యత, మానవతా విలువల గురించి చెప్పే ప్రయత్నం చేస్తాను. కాబట్టి, బాలవికాస్ మరియు పిల్లలతో సంబంధిత కార్యకలాపాలను నేను చూసుకుంటాను. ఆ గ్రామంలో అలా మహావతార దర్శన అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేద్దామని మేము నిర్ణయం తీసుకున్నాం.

అలాగే నాతో పాటు అనేక మంది సోదరులు కూడా వచ్చారు.. కళాధర్, రింగురాజు, సాయికుమార్, బాలాజీ, సుబ్రహ్మణ్య సాయి, బోయ రాజు, సాయి రామ కృష్ణ మొదలైన వాళ్లు పాటలు పాడటంలో, చేయూత నందించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనవచ్చు అన్నారు.

సాయంత్రం ఏం చేయాలా? అన్న ఆలోచనలో మేము అల్వాల్లో బృందంగా చర్చిస్తున్నప్పుడు, అక్కడ ఉన్న సోదరులు, ముఖ్యంగా కళ్యాణ్ సింగ్ ఒక అద్భుతమైన ఆలోచనను పంచుకున్నారు. వారు పల్లకీ తయారుచేసారు, అది ఎంతో దివ్యమైన ప్రభావాన్ని కలిగించేది.

"సాయంత్రం సమయంలో స్వామిని ఆ గ్రామ వీధుల్లో పల్లకీలో ఊరేగిస్తే ఎలా ఉంటుంది?" అని బాలాజీ సూచించాడు. అందరూ ఎంతో ఉత్సాహంగా స్పందించారు. "బ్రహ్మాండంగా ఉంటుంది! పల్లకీ కోసం ప్రత్యేకంగా పాటలు పాడదాం, భజనలు చేద్దాం" అని నిర్ణయించుకున్నారు.

స్వామిని పల్లకీలో ఊరేగించడం అంటే ప్రతి గ్రామంలో ప్రజలు ఆ మహిమాన్విత రూపాన్ని దర్శించి భక్తితో నీళ్లు పోస్తారు, పూలు చల్లి ఆరాధిస్తారు. చెక్క భజనలు, కోలాటాలు, నృత్యాలు, ఉత్సాహభరిత భజనలు నిర్వహించవచ్చు. ఇలా ప్రతి గ్రామంలో పల్లకీ ఉత్సవం జరపాలనే నిర్ణయం తీసుకున్నారు.

పల్లకి ఉత్సవం తర్వాత మనతో పాటుగా జనాలు వస్తారు కదా! మనమందరం వాళ్లని తీసుకొని ఒక వేదిక దగ్గర సమావేశం అవుదాం. అప్పుడు ఉదయం నుంచి సాయంకాలం దాకా చేసిన ప్రతి కార్యక్రమాన్ని ఆ రోజు వివరిద్దాము. గ్రామం బాగుపడాలాంటే ఏమి చేయాలో వారికి వివరిద్దాం అనుకున్నాం. స్వామి కోసం వాళ్లు ఏ విధంగా తమను తాము మార్చుకోవాలి అని చెప్దాము. దుర్వ్యసనాలు దూరం చేద్దాము. దురలవాట్లు దూరం చేద్దాము అనే భావనలు వాళ్లలో కలిగిద్దాం అనుకున్నాం.

ఇక ఎంతో ఉత్సాహంతో, ఒకరినొకరు ప్రోత్సాహించుకుంటూ... అందరూ కూడా ఏకం అవ్వడం మొదలు పెట్టాము. కనీసం ఒక నెల ఎవరు కూడా నిద్ర పోలేదంటే నమ్మాలి!

అలాంటి సమయంలో మరొక ప్రశ్న వచ్చింది. మౌనంగా గ్రామస్తులను మనం ఎలా ఉత్సాహపరచాలి? అప్పుడే ఎవరో అన్నారు "బాలచంద్ర, నువ్వు ఉన్నావుగా... నువ్వే మాట్లాడు." అప్పుడు నేనన్నాను – "అవును, నేనెంతో మనస్ఫూర్తిగా వాళ్లని ఉత్సాహ పరుస్తాను"

కానీ కేవలం ఉపన్యాసాలు మాత్రమే సరిపోవు కదా? కొంచెం వినోదం కూడా ఉండాలి, మనసుకి హాయిగా ఉండేలా. అందుకే వినోదాత్మక కార్యక్రమాలు చేయాలని నిర్ణయించాం.

అప్పుడు లయోలా కాలేజీకి చెందిన విద్యార్థులు ఋషికుమార్ టీం వాళ్లు మేము "మైమ్ షో" చేస్తాము అన్నారు. ఫణి కుమార్ కోతి బొమ్మతో మిమిక్రి చేస్తా అన్నాడు. అలాగే డాన్స్ ఇంకా దురలవాట్లు మరియు దుర్వ్యసనాలపై వీధి నాటకాలు ప్రదర్శించ వచ్చు అనుకున్నారు. అలాంటి వీధి నాటకాలు ప్రతి గ్రామంలో చేస్తే ఎంత బావుంటుందో కదా అనిపించింది.

ఇక పురుషోత్తమ్. అతని తపన ఎంతో గొప్పది. తను "నేను స్వామి దగ్గరికి వెళ్లినప్పుడు తలెత్తుకుని నిలబడగలగాలి. నేనూ ఏదైనా చేయాలి," అనే ఆతృతతో, ఆవేదనతో, ఆదర్శంతో... గ్రామ సేవ కోసమే ఇంద్రజాలం (మ్యాజిక్ షో) నేర్చుకున్నాడు. తద్వారా ఆధ్యాత్మిక భావనలు, సందేశాలు తమాషాగా చెప్పచ్చు అని అతని ఆలోచన ఏ అంశం చేసినా దానికో అర్థవంతమైన భావన ఉండేలా నేను సహకరించాను.

ఈ విధంగా గ్రామంలో ఉన్న వారందరినీ ఏకం చేసి, ఆనందంగా, అద్భుతంగా, ఆదర్శంగా కార్యక్రమాలను కొనసాగించాలన్న తపనతో మేము ముందుకు సాగాము. ఇలా "గ్రామ సేవయే – సాయి సేవ" కార్యక్రమానికి శంఖారావము చేశాము.

ఈ విధమైన పూర్వ నేపథ్యంతో... ఉదయన్న బృందం బస్సు ఏర్పాటులో నిమగ్నమయ్యారు. వనరుల సమీకరణలో అందరూ ముందుండి సహకరించారు. గోపీ బృందాన్ని కమ్యూనికేషన్ చూసేందుకు నిర్ణయించారు. YC మందులను సేకరించడం, ఆయా జిల్లాల సాయి సంస్థలతో అనుసంధానానికి కృషి చేశాడు. వేరే ప్రాంతాల్లో ఎక్కడైనా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయా తెలుసుకొని, అక్కడి పెద్దలతో మాట్లాడి, "మేము స్వామి కోసం ఇలా చేస్తున్నాం, మీరు కూడా సహకరించండి" అని చెప్పడం జరిగింది.

అయితే మరోవైపు, ఎందుకో తెలియదు, స్వామి సంకల్పం ఎలా ఉందో అర్థం కాలేదు. హైదరాబాద్‌లోని సత్యసాయి పెద్దలకేమీ పట్టలేదు అన్న భావన మాకు కలిగింది. ఎవరూ ప్రోత్సహించలేదు. అయినా మా లోపల ఉంది ఒకే ఒక్క భావన, స్వామి కోసం ఏదైనా చేయాలి అన్న తపన! గ్రామాల్లో సేవ చేయాలన్న ప్రేమ భావన! మనం చేసే ప్రతి కార్యం సృజనాత్మకంగా ఉండి సమాజానికి స్ఫూర్తినివ్వాలని ఒక నూతన ఆలోచనతోనే అందరూ ముందుకు సాగి పోయారు.

ఉదయన్న ఒక మాట అన్నారు – "బస్సు కేవలం కూర్చోవడానికి సరిపోతుంది. మన సరుకులు, వంట సామాను, మందులు అన్నీ ఎలా తీసుకెళ్లాలి?" అని. తర్వాత, షకీర్ అనే వ్యక్తితో డీసీఎం ట్రక్కు మాట్లాడారు. అతను VST క్రాస్ రోడ్డులో పని చేస్తున్నవాడు. అతను కూడా స్వయంగా 7 రోజుల పాటు మాతో ప్రయాణించాడు. ఇదంతా ఎట్ల జరిగింది అంటే... ఒక "ఉద్యమోత్సాహం! ఒక సాయి సేవోత్సాహం!"

"స్వామిని చేరాలంటే సేవ తప్ప మరొక మార్గం లేదు" అనే నమ్మకంతో, "కర్మ యోగం"

అన్న సిద్ధాంతాన్ని హృదయపూర్వకంగా ఆచరించిన యువజన హృదయ భావన ఇది. ఇదే భావం సుమారు వంద మందిని ఒక తాటిపైకి తెచ్చింది.

అయితే ఈ మధ్య కాలంలో కొన్ని సంఘటనలు ఇలా జరిగాయి. సైకిల్ ట్రిప్ రద్దు కావడం వల్ల కొంతమంది బ్రదర్స్, శేఖర్ అన్న టీం చాలా నిరుత్సాహ పడ్డారు.

"స్వామి వద్దు అంటారు, అట్లా అని సైకిల్‌లో వెళ్లడం ఆపేద్దామా? స్వామి దగ్గరికి పోకుండా ఎట్లా ఉంటాం?" అని చెప్పారు. ఆయన అలిగారు కూడా, "సైకిల్‌లో వెళ్లడం లేదు అంటే నేను రాను... మీరు పోండి," అన్నాడు.

దీనికి కారణం లేక పోలేదు... ఈ సైకిల్ యాత్ర ద్వారా టీంకు స్వామి ఇచ్చిన అనుగ్రహం, అనుభవాలు. వారి యొక్క విరహం చూస్తే మనం అర్థం చేసుకోవచ్చు. ఇది వారికి కేవలం ట్రిప్ కాదు, ఒక తపన!

ఇలా, ఎన్నో అద్భుతమైన విశేషాలు 30–40 రోజుల్లో జరిగాయి. స్వామికి ఉత్తరం ఇచ్చిన తరువాత, స్వామి కార్యం కోసం బయలుదేరిన ప్రయాణంలో ఎన్నో అపురూపమైన సంఘటనలు జరిగాయి.

హైదరాబాద్ టీంని ఎవరైనా చూస్తే నమ్మ లేని విధంగా తయారైంది. ప్రతి ఒక్కరిలో కనీసం నాలుగు / ఐదు నైపుణ్యాలు! కళలు!! ఉట్టిపడేవి.

పల్లకీ ఉత్సవం సమయాన సాయంకాల భజనలైతే చెప్పలేనివి. అసలు భాష రాని వాళ్లు కూడా డాన్స్ చేయాల్సిందే! ఆ భజన పాటలు వింటూ... కోయ వాళ్లు, గిరిజనులు, పురజనులు, పిల్లలు / పెద్దలూ భేదం లేకుండా అందరూ భక్తితో కన్నీళ్లు పెట్టాల్సిందే.

"స్వామి మా ఊరికి వచ్చారు... మా ఇంటికి వచ్చారు" అనే ఆనందంతో సాగిల పడాల్సిందే. అంత ఉత్సాహమైన భజనలు, గాయకులు సాయి రామకృష్ణ, బాలాజీ, సుబ్రహ్మణ్య సాయి, రవి శంకర్, వై. శ్రీనివాస్, రాజా... ఇలా ఎంతో మంది చాలా గొప్పగా పాడే వాళ్లు! నా గొంతు కూడా జత కలిపాను

కంజీరా, మృదంగం, హార్మోనియం, శంఖం, తాళంతో... ఆ గ్రామాన్ని ఆధ్యాత్మికంగా ఏకం చేయ్యాలి అన్న తపనతో బయలుదేరారు. ఈ విధంగా "గ్రామ సేవయే – సాయి సేవ" అనే మహోద్యమానికి హైదరాబాద్ బృందం శ్రీకారం చుట్టింది అని చెప్పాలి.

45

శివం వద్ద నుండి గ్రామ సేవా యాత్రకు శ్రీకారం

1996వ సంవత్సరం

గ్రామ సేవయే – సాయిసేవ మహోద్యమ స్ఫూర్తి, అందరి హృదయాలలో నిండిపోయి, ఎవ్వరిని నిద్ర పోలేని విధంగా మార్చేసింది అనటంలో ఎట్టి సందేహము లేదు. 50 మంది అన్నదమ్ముల ఇళ్లల్లో రాత్రి ఎవరూ నిద్రపోలేదనే చెప్పాలి నెల రోజులు. అంత అద్భుతమైన ప్రేమ, అనురక్తి, భక్తి అందరికీ స్వామి మీద ఉన్న విరహము, స్వామిని ఎట్లాగైనా మనల్ని చూసేలా చేయాలి... వారు మాట్లాడేలా సేవ చేయాలన్న ఒకే సంకల్పం. మేము ఆయన్ను చూడాలి ఆయన మమ్మల్ని చూడాలి అన్న ఆలోచన తపస్సు లాగా మారిపోయిందంటే అనుమానం అవసరమే లేదు.

అలాగా సెప్టెంబర్ 21, 1996 నాడు... శుభ ముహూర్తం నిర్ణయం చేసి శివం ప్రాంగణంలో స్వామి సన్నిధిలో టెంకాయకొట్టి హారతి ఇచ్చి, ఆ స్వామి సన్నిధి నుండి 'జై బోలో భగవాన్ శ్రీ సత్య సాయిబాబాకి... జై' అన్న నినాదంతో ప్రారంభం చేయాలని సంకల్పం చేశాము. కానీ తానొకటి తలిస్తే దైవం ఒకటి తలుస్తున్నట్టుగా, పెద్దలు ఎందుకో మరి అంటీ అంటనట్టుగా, చూసీ చూడనట్టుగా, వినీ విన్నట్టుగా ఉండడము... మేము వెళ్లే సమయానికి శివం ప్రాంగణము తాళం వేయబడి ఉండటం జరిగింది. అయినా సరే ఎవరు దాని గురించి అంత ఆలోచించినట్లు నాకు కనబడ లేదు. నాకు బాగా గుర్తు. శివం ప్రాంగణము నుంచి కదులుదాం అనుకున్నాం కదా అయినా స్వామి సన్నిధి అంటే మందిరం లోపల స్వామి ఫోటోనా? స్వామి అనుగ్రహ సంకల్పం చేత భాగ్యనగర భక్తుల ఆకాంక్షల మేర ప్రభావించిన శివ లింగాకారమే నిజమయిన సన్నిధిగా తలచి, అక్కడి నుండే తప్పకుండా కదలాలనిచెప్పి, బస్సుని శివం ముందర నిలబెట్టి, రోడ్డు మీద ఆ బస్సుకి "శ్రీ సత్యసాయి సేవాసంస్థలు – యువజన విభాగము" : "గ్రామ సేవయే – సాయి సేవ" అని ఉండే బ్యానర్ దానికి ఏర్పాటు చేసి మొత్తం 50 మంది తెల్లవారు ఝామున 5 గంటలకు శివం ప్రాంగణకి చేరిపోయారు.

ఉరకలేసే ఉద్యమోత్సాహంతో వచ్చేసారు

మందిరంలో స్వామి ఫోటో ముందు కొడదాం అనుకున్న టెంకాయను, జై బోలో గణేష్ మహారాజ్‌కి, జై బోలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబాజీకి అంటూ జయ జయ ధ్వనులు చేస్తూ ఆ బస్సు ముందరే టెంకాయ కొట్టి బయలుదేరాలని నిర్ణయించాము.

ఆ శివంప్రాంగణం వెనక నివాసం ఉన్న మాన్యులు హరిహరన్ గారు జరుగుతున్న కార్యక్రమం గురించి విని ఉత్సాహంగా... ప్రోత్సాహంగా మాతో చేరి అందరిని పలకరించి, ముందుకు వెళ్లండి, జాగ్రత్త వెళ్లండి, అని చెప్పినారు. ఇక వారినే స్వామి ప్రతినిధిగా భావించి వారి చేతనే టెంకాయ కొట్టించి స్వామి సేవకు నాంది పలికాము.

సేవా స్ఫూర్తితో హైదరాబాదు, రంగారెడ్డి, మహబూబ్ నగర్, కర్నూలు మరియు అనంతపురం ఈ 5 జిల్లాల్లో ప్రయాణం సాగింది. రోజుకి ఒక గ్రామం చొప్పున ఎంచుకుని 7 రోజులు ప్రయాణం చేశాము. నాకు గుర్తున్నంత దాకా, ధర్మాన్ని వరంగా ఇవ్వడానికి స్వామి వారు వచ్చిన దానికి చిహ్నంగా ధర్మారము అనే గ్రామంలో మొట్టమొదటి "గ్రామ సేవయే సాయి సేవ" కార్యక్రమము మొదలైంది.

ఎంత ఉత్సాహంతో సేవ చేశారంటే... గ్రామములోకి వెళ్లిన సమయం నుండి రాత్రి పడుకునే దాకా ఎవ్వరూ విశ్రమించినట్లు నాకు కనపడలేదు. ఏదైనాచెట్టు కింద కూర్చున్నాను అంటే అది నేనే కూర్చొని ఉండాలి. కారణం, చెయ్యి విరిగి బలహీనుడిగా ఉంది నేనే మరి! మరొక కారణం, గ్రామంలో నేను ప్రధానంగా సాయి సందేశ వ్యాప్తి సేవలో నేను ఉండటం. గ్రామంలో పిల్లలతో పెద్దలతో ఏ చెట్టు క్రిందనో, పాఠశాల ఆవరణం లోనో, ఎక్కడైనా షెడ్ లోనో కూర్చోని శ్రీ సత్య సాయి మహావతార దర్శన్ (చిత్ర ప్రదర్శన) ఏర్పాటు చేసి స్వామి విషయాలు చెప్పడం తప్ప... మిగతా వాళ్లందరూ కూడా చెమటోడ్చడం అంటే నిజంగా చెమటోడ్చడమే! అవిశ్రాంతంగా సేవలు చేస్తూ అనిర్విచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఏ పని ముట్టుకుంటే ఆ పనిని శత శాతం చేయాలనే దీక్షతో... తపనతో స్వామిని తలుస్తూ చేసుకోవడం జరిగేది.

ఎన్ని వందల గొర్రెలకు పశువులకు పశు వైద్య శిబిరం నిర్వహించాము. ఎన్ని వందల మందితో మాట్లాడాము. ఎన్ని వందల మంది మహిళలకి, యువకులకి, వృద్ధులకి వైద్య శిబిరం నిర్వహించాము. ఎక్కడెక్కడో శ్రమ దానం చేశాము... ఇలా ఎవరికి వారు తదేకమైన సేవలో మునిగిపోయేవారు.

ఉదయం గ్రామ సంకీర్తన సమయంలో కలవడం, తరువాత అక్కడే ఎక్కడో రోడ్డువైపు కాలకృత్యాలు తీర్చుకోవడం, టిఫిన్ చేయడం, అక్కడి నుంచి గ్రామాల్లో ఎవరి సేవా బాధ్యత మేరకు వారు వెళ్లి సేవని 100% చేయడము, అందరూ మళ్లీ మధ్యాహ్నం భోజనంలో కలవడం! అలా సాయంకాలం దాకా అందరూ ఎవరి కార్యక్రమంలో వాళ్లు ఉండడము. చివరికి చూస్తే ఆ గ్రామంలో ఉన్న ప్రతి ఇంటా చైతన్యం వెల్లివిరిసేదంటే, ఎట్టి సందేహము లేదు. కారణం ఏంటంటే... ప్రతి ఇంట్లో ఒక పండగ వాతావరణం! ఏదో కొత్తగా జరుగుతోంది, ఏదో సత్యసాయి బాబా వారి భక్తులు మన ఊరికి వచ్చారు. బాబా గారి పల్లకి ఉత్సవం అంట అనుకుంటూ సాయంకాలానికి అంతా గ్రామంలో జరిగిన అద్భుతమైన నిస్వార్థమైన సేవలు చూస్తున్న గ్రామస్తులు అందరూ కూడా చాలా స్ఫూర్తి పొందేవాళ్లు, వాళ్ల జీవితాల్లో ఇలా నిస్వార్థ సేవలు చేసిన వాళ్లు వాళ్లకు తారసపడలేదు. వైద్య శిబిరంలో వైద్యులకు తమ ఆరోగ్య సమస్యలు చెప్పుకుని, అక్కడ ఇచ్చిన ఇన్నిన్ని మందులు

తీసుకొని "అబ్బో సాయిబాబా పంపించారు... సాయిబాబా దేవుడండి! మా ఆరోగ్యం చూడ్డానికి ఈ పిల్లలు వచ్చారండి!" అని... మూగ జీవాలకు కూడా సేవచేస్తున్నారని... రైతులు, మరో ప్రక్క బాల వికాస్ కార్యక్రమంలో ఆడి పాడి నాతో చేరిన ఆ చిన్న పిల్లలు... ఇట్లాగా ఏ అంశము తీసుకున్నా, సాయంకాలానికి అన్ని వయసుల వాళ్లు ఈ గ్రామసేవ మహోద్యమంలో భాగం వహించడం ద్వారా చాలా ఉత్సాహపడేవారు.

ఇక సాయంకాలం పల్లకి తీయడము, ఆ పల్లకీలో స్వామివారి చిత్రపటానికి ఆ ఊర్లో దొరికిన పూలను మాలలుగా కట్టి చేతనైన విధంగా అలంకరించి సాయి పల్లకి తీస్తే... అబ్బా! ఇక అంతా ఇంత ఉత్సాహం కాదు, ఆ గ్రామం అంతా కూడా ఆ పల్లకి వెనక వచ్చిందా ఏమి అన్నట్టుగా అనిపించేది.

ధర్మారం నుండి కర్నూలు దగ్గర బోరవెల్లి గ్రామము, అక్కడి నుంచి పాలమూరు గ్రామము, తరువాత గుత్తి దగ్గర తొండపాడు గ్రామము, పామిడి, తుర్కపల్లి, కల్లూరు, ఇల్లూరు, అనంతపురము ఇలాగ గ్రామ గ్రామాన సేవలు చేసుకుంటూ గ్రామ సేవా యాత్ర చేశాము.

గ్రామాల్లో అలా సేవలు చేస్తున్న సమయంలో ఎన్నో ఆశ్చర్యకరమైన విశేషాలను, మరెన్నో అద్భుతమైన అనుభవాలను స్వామి ప్రసాదించారు.

అంటే పని చేయడం ఎట్లాగా? ఒక బృందం అంతా కలిసి కార్యక్రమం నిర్వర్తించేది ఎట్లాగా? సమన్వయం ఎట్లా చేయాలి? సరఫరా నిర్వహణ ఎలా నిరూపించాలి? సంకట పరిస్థితి వస్తే ఏం చేయాలి? అక్కడ స్థానికంగా సమస్యలు వస్తే సమర్థవంతంగా పరిష్కరించేది ఎలా? ఇవన్నీ కూడా సేవకులను నాయకులుగా చేసే అద్భుతమైన ప్రణాళిక, తంత్రము, యంత్రము, మంత్రము... ఇవన్నీ సేవ ద్వారా హైదరాబాద్ యూత్‌కి స్వామి వారు అందించారు అనిపించింది.

నాకు గుర్తు తొండపాడు అనే గ్రామానికి వెళ్లినప్పుడు... ఇక్కడ శిబిరం వద్దు, అక్కడికి దగ్గరలో ఉన్న శ్రీ రంగనాథస్వామి క్షేత్రమునకు వెళ్లండి అని ఎవరో చెప్పడం వలన, శిబిరాన్ని గుడిలో పెట్టాము, ఇక అక్కడే వంట వార్పూ చేస్తూ, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్న సమయంలో... స్థానికులు కక్షలు కార్పణ్యాలతో పెద్ద పెద్ద వేట కొడవళ్లు వేసుకొని నరుక్కోవడము, బాంబులు వేసుకోవడము జరిగింది. చాలా భయానకమైన వాతావరణం సృష్టించబడింది చూస్తూ ఉండగానే. బయట ఉన్న వాళ్లు బయటే ఉండిపోయారు, లోపల ఉన్నవాళ్లు లోపలే ఉండిపోయారు. ఆ గుడి యాజమాన్యం అంతా కూడా నాలుగు వైపులా తలుపులు వేసేసింది. మేమంతా లోపలే ఉన్నాం. ఆ కిటికీల ద్వారా చూస్తున్నాం బయట ఏంజరుగుతుందో అని. అయ్యో ఏంటి స్వామి ఇట్లా చేసినారు... ఏం చేయాలో తెలియలేదు!

అదే సమయంలో 'ఎవరో పిలిచినట్టుగా... ఎవరో ఫోన్ చేసి నట్టుగా స్వామి వారి చిరకాల భక్తులు నాటి ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీ మారెప్ప గారు అనంతపురం నుండి ఏదో పని నిమిత్తమై జీపులో ఆ ప్రాంతానికి రావడం, వెంటనే అలర్ట్ అయిపోయి గ్రామంలో జరుగుతున్న విషయాలను పోలీసు వారికి చెప్పడం జరిగిపోయింది.

చాలా సులువుగా, చాలా కొద్ది సమయంలో పరిస్థితులు సద్దు మణిగాయి, మేమంతా సేవాకార్యక్రమాలు అన్నీ ముగించుకుని మళ్లీ ముందుకు వెళ్లడం జరిగిపోయింది. ఇదంతా చూస్తే స్వామి "మా ఇంటా వెంటా కంటా జంటా" ఉండడం అంటే ఇదేనేమో అనిపిస్తుంది. మారెప్ప గారిని మేము ఎప్పుడు గుర్తు పెట్టుకుంటాం. కారణం, ఆ విపత్కర పరిస్థితులలో చిరస్మరణీయమైన విధంగా వారు మాకు తోడుగా నీడగా నిలిచారు.

గ్రామ సేవ మహోద్యమం ఆద్యంతం...

డబ్బులు ఇచ్చే వాళ్లు ఇచ్చారు...
ఆనందం పంచే వాళ్లు పంచారు...
ఆశీస్సులు అందించే వాళ్లు అందించారు...
ఉత్సాహ పరిచేవాళ్లు ఉత్సాహపరిచారు..
ఎవరు ఏమన్నా సరే, ఎవరు ఏం చెప్పినా సరే,
ఏకాత్మత భావంతో, ఏకాగ్రచిత్తంతో...
స్వామి గ్రామ సేవ మహోత్సవంలో ముందుకు వెళ్లడం మొదలు పెట్టాము.

ఆ విధంగా కర్నూలు, గుత్తి దాటిన తర్వాత ఎక్కడ చూసినా తుఫాను ప్రభావం వల్ల చాలా వర్షం వచ్చే సూచనలు. ఏం చేయాలో తెలియలేదు. నిజానికి మేము పామిడి ప్రాంతానికి వెళ్లినప్పుడు కల్లూరులో మేము హనుమంతుడి గుడిలో మజిలీ చేసి అక్కడ వంటలు చేస్తున్నాము. అక్కడి గ్రామస్తులు, "అయ్యా ఫలాన దగ్గర కాలువ కట్ట తెగిపోతుంది మీరేమన్నా సాయం వేయగలరా?" అని అడగడం... అదే తడవుగ సుమారు 40 మంది బయలుదేరి పామిడిలో వాళ్లు చెప్పిన కాలువలకి గట్టు వేసే ప్రయత్నం చేశారు. అసలు ఎలాంటి విపత్తు నిర్వహణ నైపుణ్యం లేదు... కానీ స్వామి కోసం ఏమైనా సరే చేయాలనే తపన, ఆలోచన తప్ప ఇంకేం లేదు. ఒక పది మంది అయితే కాలువలోకి దిగిపోయారు కూడా. ఎంత లోతు అంటే నడుమంత లోతు. నిజానికి కట్ట వేయగలి గారు గాని, లోపల బురదలో కూరుకుపోయిన జలగలు వీళ్ల శరీరం మీద పడి ఒక్కొక్క జలగ రక్తం పీలుస్తుంటే కూడా నవ్వుతూ... 'అరరే జలగ పట్టింది' అంటూ బయటికి రావడం జలగ తీయడము లోపలికి వెళ్లడం, ఇదీ జరిగింది!

అబ్బా! సేవలలో పొందిన ఆనందము అట్లా ఇట్లా కాదు... ఏ రోజుకి ఆ రోజు స్వామి వారికి నివేదించడము జరుగుతూనే ఉంది. టెలిగ్రామ్ ద్వారా, లెటర్ ద్వారా, ఫాక్స్ ద్వారా... స్వామి! ఫలానా గ్రామంలో ఇంతమంది ఈ విధంగా హైదరాబాద్ నుండి బయలుదేరి మొదటి గ్రామంలో ఈ విధంగా చేశాము.. ఇన్ని వందల మందికి మెడికల్ క్యాంపు నిర్వహించాము... ఇన్ని వందల పశువులకి పశువైద్య శిబిరం నిర్వహించాము, ఈ విధంగా బాలవికాస్ చేశాము సాయంకాలం కార్యక్రమం ఈవిధంగా జరిగింది, చైతన్యం జరిగింది, స్వామి యొక్క నామాన్ని ప్రతిధ్వనింప చేసి మరొక గ్రామానికి ముందుకు వెళుతున్నాము అని శేఖర్ అన్న ఏదైనా సరే, స్వామికి చెప్దాం... చిన్నైనా, పెద్దైనా, తప్పైనా ఒప్పైనా స్వామికి మనమే ముందు చెబుదాం అనే సమాచార మార్గాన్ని కల్పించాడు. అలాంటి సోదరులు ఇచ్చిన ఆలోచన.. ఈ రోజుకి కూడా హైదరాబాద్ యువకులు మాత్రమే కాదు, హైదరాబాద్ యూత్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది సాయి భక్తులకు ఆదర్శమై నిలచింది. చేసిన ప్రతి మంచి పనినీ స్వామి వారికి భక్తి శ్రద్ధలతో విన్నవిస్తూ ఉంటారు, అనడంలో ఎట్టి సందేహము లేదు.

స్వామి ఎప్పుడో 70 ఏళ్ల క్రితం వెళ్లిన ఇల్లూరు, కల్లూరు గ్రామాలకు వెళ్లి అక్కడ కార్యక్రమం చేశాం. కల్లూరులో నేను అక్కడ సత్యసాయి సేవా సంస్థ ఏర్పాటు చేయడం వల్ల కల్లూరు ఇల్లూరు పామిడి అనంతపురము ఇదంతా కూడా సమన్వయం చేయగలిగే అదృష్టం నాకు కలిగింది.

మరొక విశేషం ఏమిటంటే బస్సులో ఉన్న ఆ 50 మందిలో ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాల

ప్రాతినిధ్యం వున్నది. ఒక మినీ ఆంధ్ర ప్రదేశం ఏర్పడింది అన్నమాట! హైదరాబాద్ రాజధాని నగరంకాబట్టి పొట్ట చేత పట్టుకొని రావడమో, ఉద్యోగ నిమిత్తమై రావడమో, సంసారం కోసమై రావడమో.. ఇలా ఏదో విధంగా వివిధ జిల్లాల్లో ఉన్న వాళ్లు అందరూ రావడం వల్ల మొత్తానికి సాయి యువతలో ఆంధ్రా, సర్కారు, నైజాం రాయలసీమ మరియు తెలంగాణ ఇలా అన్ని ప్రాంతాలకు సంబంధించిన వాళ్లు ఉండేవారు. ఏ ప్రాంతానికి వెళితే ఆ ప్రాంతం వాళ్లు ముందుకు వెళ్లి సమన్వయం చేయడం మొదలు పెట్టారు.

అలా చివరి మజిలిగా అనంతపురం చేరడం, అక్కడ పుర విధులలో పల్లకీ ఉత్సవం చేయడం జరిగింది. స్థానిక సత్యసాయిసేవా సంస్థలు పెద్ద వాళ్లు అందరూ రావడం జరిగింది. అయితే అక్కడ మొదటి సారి అనుకుంటాను నాకు గుర్తుంది చాలా ఉధృతమైన వర్షము, ఆ వర్షంలో అందరూ కూడా తడిచి పోయాం. పెద్దవాళ్లందరూ కూడా కాస్త ప్రక్కకు జరిగిపోయారు. కానీ ఉత్సాహంగా సాయి యువత బృందంగా ఏర్పడి వర్షాన్ని ఏ మాత్రం కూడా లెక్క చేయకుండా ప్రధాన విధుల్లో ఆ పల్లకీతో నృత్యాలు చేసి భజనలు పాడుతూ ఉంటే... ఉద్యమోత్సాహం అంటే ఉద్యమోత్సాహం! ఎందుకంటే అనంతపురం నుంచి పుట్టపర్తికి రెండు గంటల ప్రయాణం కాబట్టి, స్వామి దగ్గరికి వెళ్లిపోతున్నాం అనే ఆలోచన ఎవ్వరిని కూడా కాళ్ల మీద నిల్చోబెట్టలేదు అంటే నమ్మాలి. నిలువెల్లా సేవ ద్వారా పొందిన దివ్యానుభూతులు... ఒక్కో గ్రామంలో జరిగిన అద్భుతమైన విశేషాలు... అనుభవ మాలలుగా చేసి మెడలో వేసుకున్నట్లు... పూనకం వచ్చేసింది అందరికీ... ఇలా అందరం స్వామి పాదాల చెంతకు చేరుకునేందుకు సిద్ధం అయ్యాము.



46

భాగ్యనగర సాయి యువత బహుముఖ ప్రజ్ఞ

భాగ్యనగర యువత / సాయి యువత / హైదరాబాద్ యూత్. హైదరాబాద్ బాయ్స్... అంటూ వందల వేల మందికి పరిచయమైన హైదరాబాద్ బృందం, "గ్రామ సేవయే సాయి సేవ" నినాదాన్ని, శంఖారావం లాగా... ప్రపంచం నలుదిక్కుల ప్రతిధ్వనించేలాగా ఎలుగెత్తి చాటారు.

1996 ప్రప్రథమ 'గ్రామ సేవయే – సాయి సేవ' కార్యం ద్వారా శ్రీ సత్య సాయి దివ్య సంకల్పము చేత వివిధ నేపథ్యాలు కలిగిన సుమారు 50 మంది యువకులను, ఒకే నామము, ఒకే భావన, ఒకే శక్తి, ఒకే భక్తి, ఒకే చిత్తముతో... స్వామి వారే తమ దగ్గరికి చేర్చుకోవాలన్న ఆకాంక్షలో కూర్చిన బృందంగా మారింది. ఒకసారి సింహావలోకనం చేసుకుంటే, 'గ్రామ సేవయే – సాయిసేవ' ఒక బీజము లాగా మొదలైన ఈ ప్రస్థానము తదనంతర కాలంలో ఒక మహా వృక్షమై... ప్రపంచ వ్యాప్తంగా ఒక మహోద్యమంలాగా రూపుదిద్దుకుంది అని చెప్పక తప్పదు. కారణము ప్రధానమైన బీజములో, చేర్చబడిన, కూర్చబడిన 50 మంది స్వామి పిల్లల నేపథ్యమే అని చెప్పాలి.

వారి కులం ఏదైనా, మతం ఏదైనా, వర్గం ఏదైనా, వర్ణం ఏదైనా, ప్రాంతం ఏదైనా, భాష ఏదైనా, కావొచ్చు కానీ సాయి సేవా ఉద్యమంలో మాత్రం ఒకటే ఊపిరిగా, ఒకటే మాటగా, ఒకటే బాటగా ముందుకు సాగడం చాలా అద్భుతమైన విషయంగా నాకు అనిపిస్తుంది.

అసలు అక్కడ ప్రశాంతి నిలయంలో స్వామి మా బృందం గురించి అంతలా వేచి ఉన్నారు... అంతలా మాట్లాడుకున్నారు.. అంటే దానికి కారణం ప్రేమ, భక్తి, ప్రపత్తి, అనురక్తి కంటే కూడా 'ఐకమత్యము' మాత్రమే అని నేను అనుకుంటాను. అనుకోవడం కాదు, నిజమే! స్వామి వారే, మాతో మాట్లాడే సందర్భంలో ఎన్నో పర్యాయాలు ఈ ఐకమత్యం గురించి ప్రస్తావించారు.

ఈ సందర్భంగా "గ్రామసేవయే – సాయి సేవ" ప్రస్థానంలో స్వామి కృప చేత చేర్చబడిన 50 మంది పేర్లను నేను గుర్తు చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను.

ఉదయ భాస్కర రెడ్డి, పిడతల గోపి కృష్ణ, వై శ్రీనివాస్, శ్రీనివాసరాజ, బాలచంద్ర, సాయి

సుదీప్, మల్వాణి, ఉమాశంకర్, బోయరాజు, రింగురాజు, చిన్నరాజు, పెద్దరాజు, రవిశంకర్, డా. కృష్ణ కుమార్, కృష్ణ మూర్తి, సాయి కుమార్ (బేగంపేట), సాయి కుమార్ (మెహదీ పట్నం), శివ కళాధర్, జి.శ్రీనివాస్ (జి.సి.), శిరీష్, డా.కశ్యప్, డా. భవాని, డా. సత్య నారాయణ, డా. నవీన్, డా. అనీల్ కుమార్, రాజశేఖర్, అమర్, కిరణ్, సాయి రామ కృష్ణ, బాలాజీ రాఘవేంద్ర, సుబ్రమణ్య సాయి, రవిశంకర్, యశోనాథ్, రామకృష్ణ, శ్రీనివాస్, మానవేంద్ర, ఋషి కుమార్, పురుషోత్తం, ఉదయ్ సింగ్, నీలాంబర్, కుక్కు బాలాజీ, శివసాయి చైతన్య, మాధవ్, పుష్కర్, దయానంద్, సాయి శ్రీధర్, గొందు ప్రసాద్, బజ్జు, బామ్మ. ఇలా సుమారు 50 మంది ఆ రోజు ఒక బృందంగా ఏర్పడ్డారు. ఒకసారి వారిని తలుచుకోవడం అనే చాలా అద్భుతమైన విషయంగా నేను అనుకుంటున్నాను. కాల గతిలో కొన్ని పేర్లు మరచి ఉంటనేమో! మన్నించాలి.

ఈ రోజు ఎవరూ సామాన్యులుగా లేరు, అసామాన్యమైన ప్రతిభా పాటవములతో, వారు ఎంచుకున్న రంగాలలో, అద్భుతమైన పరిణితితో, ప్రభావముతో జీవిస్తున్నారు! స్వామి సేవలో తరిస్తున్నారు అనటంలో ఎట్టి సందేహము లేదు. ఎవ్వరిని కూడా స్వామి పలుకరించ కుండా, మెరుగు పరచకుండా, అనునయించకుండా, రీప్రోగ్రామింగ్ చేయకుండా వదల లేదు. ఈ యువకులు అందరూ అద్భుతమైన చరిత్రను సృష్టించారు అని చెప్పాలి.

ఒకసారి ఈ హైదరాబాద్ యువతలో ఉన్న విలక్షణ లక్షణాలను పరిశీలన చేస్తే... నేను తెలుసుకున్న కొన్ని పాఠాలను పాఠకులతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

1. ఐకమత్యం

ప్రధానంగా నేను గమనించింది 'అద్భుతమైన ఐక్యమత్యము'. మన చెయ్యైనా, ముడిస్తే పిడికలిలో కాస్త అటు ఇటు కొంత గ్యాప్ ఉంటుందేమో కానీ... హైదరాబాద్ యూత్ ఒకసారి కలిస్తే మాత్రం అసలు మనస్పర్థలు, భేదాభిప్రాయాలు లేని అద్భుతమైన ఐకమత్యం ప్రకటితమవుతుంది.

సత్యసాయి బాబా వారి దివ్యసన్నిధికి హైదరాబాద్ యూత్‌ని చేర్చిన ప్రధాన అంశము ఏదైనా ఉంది అంటే... అది కేవలం ఐకమత్యమే అని నేను చెప్పగలను.

కేవలం హైదరాబాద్ యూత్‌కు మాత్రమే కాదు ఇది, యావత్ సత్యసాయి సేవా సంస్థలకు కూడా అను నిత్యము, అహరహం, అనుక్షణము, ఈ ఐకమత్యం అనే మంత్రాన్ని తారక మంత్రంగా తీసుకోవాలని స్వామి వారే ఎన్నో సందర్భాలలో వచించారు.

2) అచంచల విశ్వాసం

ఎంత విశ్వాసము అంటే... సాయిరామ్ అంటే కదలాలి, సాయి రామ్ అంటే నిలవాలి, సాయి రామ్ అంటే ఉరకాలి, సాయి రామ్ అంటే కూర్చోవాలి, సాయి రామ్ అంటే ఎలుగెత్తి నినదించాలి. అంత ప్రేమ స్వామి కోసం! ఎవరికి వారు స్వామి కోసం నేను ఏమైనా సరే చేయాలి అన్న తపన, ఆలోచన, కసి, ఆర్తి, అనురక్తి, భక్తి, ప్రేమ ప్రతి హృదయంలో నేను చూశాను. అలా 50 మంది హృదయాలలో జనించిన ఆర్తికి ఫలితమే స్వామి వారి దివ్యానుగ్రహము అని నేను ఎప్పుడూ తలుచుకుంటూ ఉంటాను.

3) నిస్వార్థ సేవా దృక్పథము

ఎవ్వడిలో కూడా స్వార్థము లేదు. వాడెవడో ముందు పోతున్నాడే, వాడికి అది వచ్చిందే... వీడికి ఇది రాలేదే... అయ్యో నేను వెనక బడిపోతున్నానే... అలా ఏమీ లేదు. ఏదున్నా సరే కృష్ణుడి అనుగ్రహం కోసమై అర్రులు జచిన అలనాటి గోపికల మధుర భక్తి గుర్తొస్తుంది తప్ప ఇక మరేది గుర్తుకు రాదు అనిపిస్తుంది. ఎందుకంటే అంత అచంచలమైన విశ్వాసము, అంత అచంచలమైన ప్రేమ, ఆ సేవా దృక్పథము, ఆ సేవలో ఎవరికి వాళ్లు తమను తాముగా అర్పించుకునే ప్రయత్నం చేయడం, నేను నా కళ్లారా చూశాను. అంతో ఇంతో నేను సేవా దృక్పథం నేర్చుకున్నాను అంటే అది వీళ్లనుండే అని చెప్పాలి.

4) ఉద్యమోత్సాహము

"ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము
కష్టాలే వచ్చిన, కన్నీరే కార్చినా,
ఉప్పెనలు వచ్చిన, ఊపిరే పోయినా,
ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము,
సేవ సేవ అంటూ... స్వామి మార్గంలో పయనిద్దాం"

అని చెప్తూ ఉంటాను. దానికి నేపథ్యం కేవలము హైదరాబాద్ యూత్ అని నేను చెప్పుకుంటాను. అంత అద్భుతమైన ఉత్సాహము. ఆ ఉత్సాహానికి అంతు లేదు. అసలు ఉదయం 5 నుండి అర్ధ రాత్రి దాకా... కనీసం మూడు నాలుగు గంటలు కూడా నిద్ర లేకుండా... మళ్లీ ఉదయం 5 గంటలకు లేచి నిర్విరామంగా విశ్రాంతి లేకుండా అలా నిరంతరమై గంగా ఝరిలాగా ఉత్సాహం పొంగి పొరలేది.

5) చాతుర్యము

ఏ పని చేసినా, చేసే వాడి నేపథ్యం ఏదైనా, వాడి కుటుంబం పరిస్థితి ఏదైనా, వాడి కులం ఏదైనా, మతం ఏదైనా సరే, అప్పటికప్పుడు నేర్చేసుకునే వాళ్లం. అప్పటికప్పుడు దాంట్లో పాటు పడేవాళ్లం. ఒక మట్టి తవ్వడము అన్నా, ఒక మైదానం చదును చేయాలన్నా, చెట్లు నాటాలన్న, పశువులను పట్టుకొని నూదులేపించాలన్న, వైద్య శిబిరం నిర్వహించాలన్న, మందులు ఇచ్చి వివరించాలన్నా, సాంస్కృతిక కార్యక్రమం అన్నా... ఏదైనా సరే జస్ట్ అలా నీళ్లు తాగినట్టుగా నేర్చుకొని చేసేవాళ్లం. అంత చాతుర్యము. ఇది కేవలం స్వామి మీదున్న ప్రేమతో అందరికీ అలవడింది అని నేను తెలుసుకున్నాను.

6) నైపుణ్యము

ఎంత స్కిల్ అంటే నిజానికి అలాంటి నైపుణ్యం ఇక వేరే బృందాలలో, సమూహాల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. కారణం హార్మోనియం, తబలా, కంజీర, మృదంగం వాయించడంలో ప్రావీణ్యం చెందిన వాళ్లు ఉన్నారు. అలాగే ఈ బృందంలో నిపుణులైన రన్నర్లు, ఉత్సాహభరితమైన బైకర్లు, అద్భుతమైన డ్రైవర్లున్నారు, వేదికనెక్కి ప్రదర్శించే కళాకారులున్నారు, మైకులు పట్టి ఉపన్యాసాలు ఇచ్చే వాళ్లున్నారు. నైపుణ్యం గల లాజిస్టిక్స్ నిపుణులు ఉన్నారు. ఏ సవాలునై

ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉంటారు. ఒక్కొక్కరికి 4 – 5 నైపుణ్యాలు ఉండేవి. అంటే ఒక సేవ చేయడానికి కేవలం సేవానురక్తి మాత్రమే ఉంటే సరిపోదు... నిజానికి కావలసింది నైపుణ్యం అని తెలుసుకున్నాను.

7) బహుముఖ ప్రజ్ఞ పాటవం

ఒక్కొక్కరికి కనీసం 5 – 6 కళలు వచ్చేవి. ఒక్కొక్కరిని మనం విడిస్తే బరువు లెత్తి ఆగమనేదాకా ఆగకుండా ముందుకు వెళ్లేవాళ్లు... గొంతెత్తితే అసలు అమృతము కురిసేది. ఆ గొంతువిని, భజన పాటలు విని ఆ గ్రామస్థులందరూ మైమరిచిపోయి స్వామి ముందు సాగిలపడి మొక్కే వాళ్లు అంటే ఎలాంటి సందేహము లేదు. అసలు బృంద ప్రభావము అంతా కూడ బహుముఖ ప్రజ్ఞ పాటవంలోనే ఉందని తెలుసుకున్నాను.

8) త్యాగం

ఒకరు భోంచేయ లేదు అని తెలుసుకుంటే నలుగురు భోజనం పెట్టడానికి ముందుకు వచ్చే వాళ్లు. ఒకరికి కాస్త అలసట అయిపోయిందంటే, ఆ పని నేను చేస్తాను అంటే నేను చేస్తా అని పోటీలు పడి ఇంకో ఇద్దరు వచ్చేవాళ్లు. ధాన్యం మూటలు మోయాలంటే ఉన్న మూటలు మోసి అవతల పడేసే దాకా పక్కన కూర్చునే వాళ్లు కాదు. పక్క వాడికి సమస్య ఉంది అని గుర్తిస్తే మూకుమ్మడిగా అందరూ కూడా వచ్చి తోడుగానిలిచే వాళ్లు. సత్యసాయి బాబా ఉన్నాడు అని చాలా మంది అంటారు కానీ, అది ప్రత్యక్షంగా ఈ హైదరాబాద్ బృందంలో నేను చాలా తరచుగా చూసి దర్శనం చేసుకున్నాను.

9) ఏకాగ్ర చిత్తము

చేసే పని మీద ధ్యాస తప్ప ఇక ప్రపంచం ఏమైపోతుంది అని ఆలోచించే వాడు ఎక్కడా కనబడడు. ఎవరి పని వాడి లోకం అంతే. టీ సునామి వచ్చిన సందర్భంలో మేము సేవలో ఉన్నాం, భూకంపములు వచ్చిన సందర్భంలో సేవలో ఉన్నాం, వరదలు వచ్చిన సందర్భంలో సేవలో ఉన్నాం, ముంపుకు గురైన ప్రాంతాలలో సేవలో ఉన్నాం. గత 3 దశాబ్దాలుగా అద్భుతమైన ప్రవృత్తితో ఈ యువకులు ఉన్నారు అంటే... కారణం సింగిల్ పాయింట్ ఆఫ్ ఫోకస్ అదే శ్రీ సత్యసాయి! SSS.

S అను వానికి S అనురా,
No అను వానికి No అనురా,
సాయికి సర్వము SSS
అన్యము ఇక తెలియదు
అన్నట్టుగా, అందరూ కూడా బృందములో ఏకాత్మ భావనతో బ్రతికారు.

10) ప్రేమ బంధము

స్వామి మమ్మల్ని కలిపినట్టుగా భావించి, స్వామి సంకల్పం వల్లనే ఫలానా వ్యక్తి వచ్చాడు, అనుకొని వాళ్లని ప్రేమగా హత్తుకునే వాళ్లు. ఎవ్వరినీ కాదనే వాళ్లు కాదు. ఒకరికొకరి మధ్య అంత ప్రేమ బంధము ఉండేది. అందరము కలసి ఒకే చోట పడుకునే వాళ్లం, ఒక్కొక్కరి ఇంట్లో రాత్రుళ్లు

సత్సంగం పెట్టుకునే వాళ్లం. ఒక్కొక్కటి కూడా ఒక అద్భుతమైన పరిణామంగా, పరివర్తనగా మారిపోయింది.

11) క్షమా హృదయము

ఎవడైనా పొరపాటున తప్పు చేసినా, వాడిని వేలెత్తి ఎవడూ చూపించేవాడు కాదు. చక్కగా క్షమించి వాడిని సరిదిద్ది నెత్తికెత్తుకునే లక్షణం చూశాను. అంటే ఒకవేలికి దెబ్బ తగిలితే, ఆ గాయానికి పుండు మానడానికి మందు రాసేవాళ్లే తప్ప... ఈ వేలికి పుండు అయింది అని చెప్పి దాన్ని కట్ చేసేవాళ్లు ఈ బృందంలో లేరు. అందుకనే శాఖోపశాఖలుగా... రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వ్యాప్తంగా, గ్రామాల వ్యాప్తంగా హైదరాబాద్ యువజనుల ఉత్సాహము వెల్లివిరిసింది అని చెప్పాలి

12) సేవ

సేవలో ఉంటే వేరేదే అసలు ఎవరి దృష్టికి వచ్చేది కాదు. ఎవడు ఎలాంటి నేపథ్యం అయినా సరే. సేవ మాత్రమే మమ్మల్ని పట్టి ఉంచిన తారక మంత్రం అని నేను ఎప్పుడూ తలుస్తాను.

ఒకరి నొకరు ప్రేమించడం,

ఒకరినొకరి హత్తుకోవడం,

ఒకరితో ఒకరు చెయ్యి కలపడం.

చేయి చేయి కలుపుదాం...

సేవ చేయకదులుదాం...

అన్న భావనకి నిలువెత్తు నిదర్శనము హైదరాబాద్ యూత్.

అంటే ఇవన్నీ కూడా నా మటుకు నేను నేర్చుకున్న అంశాలే. వేరే వాళ్లు వేరే రకంగా కొన్ని విషయాలు నేర్చుకుని ఉంటారు. హైదరాబాద్ యువకులతో ముడి పడి సాగిన నా జీవితము, జీతము, జీవమును సుమారు నాలుగు దశాబ్దాలుగా ఎన్నెన్నో సందర్భములలో ప్రభావితం చేసినవి పైన ఉదహరించిన అంశాలు... ఇలా పాఠకులతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

వయసు ఏదైనా, సమస్య ఏదైనా, సమయం ఏదైనా, ప్రాంతం ఏదైనా, భాష ఏదైనా, బృందం ఏదైనా, టీం ఏదైనా, స్పిరిట్ ఏదైనా, లక్ష్యం ఏదైనా, ధ్యేయం ఏదైనా సరే... ఈ ద్వాదశ మంత్రములు, గుర్తు పెట్టుకుంటే, తప్పకుండా అది అమృతత్వానికి దారి తీస్తుంది. ఆ బృందము చరిత్రను సృష్టిస్తుంది అని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.

ఈ సందర్భంగా హైదరాబాద్ బాయ్స్ అందరిని ఒక్కసారి నేను స్మరిస్తున్నాను... వారు ఎక్కడెక్కడో ఉన్నారు, రాష్ట్రాలు దాటారు, దేశాలు దాటారు, విదేశాలలో స్థిరపడి ఉన్నారు కొద్ది మంది. అద్భుతమైన జీవితాలను గడుపుతున్నారు. పిల్లా పాపలతో సుఖ శాంతులతో వర్ధిల్లుతున్నారు. నాలాంటి వాళ్లు కూడా లేక పోలేదు సుమా... ఉన్నారు. కానీ ఎవ్వరు కూడా ఆకలితో కూర్చోలేదు. అందరికీ బాబా వారు మూడు పూటలా తిండి దొరికే విధంగా చేశారు.

ఈ బృందములోని వారందరూ కూడా అద్భుతమైన చరిత్రను సృష్టించారు అని చెప్తూ... ఇలాంటి వ్యక్తుల సాహచర్యాన్ని ప్రసాదించిన స్వామి వారికి అందరి తరపున మరొక్కసారి శిరము వంచి అభివాదం చేస్తున్నాను.

47

పల్లకితో పర్తి వాసుని సన్నిధికి

అప్పటిదాకా ఆడుతూ, పాడుతూ, ముచ్చట్లాడుతూ వివిధ రకాల వేష భాషలతో ఉన్న మేమందరం కూడా అనంతపురంకి వచ్చే సమాయానికి చాలా శుభ్రంగా, అందంగా, చక్కగా మారిపోయాము. అక్కడ అందరూ తలలు, గడ్డాలు గీసుకుని, అభ్యంగన స్నానం చేసి, దర్శనానికి శ్వేత వస్త్రాలు రెడీ చేసుకుని మొత్తానికి ఎలా తయారయ్యారంటే... ఏదో గులక రాళ్లను ఒక డబ్బాలో వేసి గిలగిలా... గిలగిలా... కొడితే ఏ విధంగా ఆ రాళ్లకు ఉన్న అదనపు ముక్కులు రాపిడికి రాలిపోయి నునుపైన గుండ్రని రాళ్లు (పెబల్స్) లాగా మారినట్లు! అంటే సాలగ్రామాలు లాగా మారిపోయిట్లు! భాగ్యనగరం నుంచి ప్రయాణం చేసిన 50 మంది యువకులు భగవానుని దివ్య సన్నిధికి సిద్ధమైపోయారు అని చెప్పాలి. పిల్లలందరూ కూడా పక్వానికి వచ్చిన పళ్ల లాగా ఐపోయారు. ఇక ఉత్సాహానికి అంతే లేదు

సుమారు ఏడు మారు మూల గ్రామాలలో "గ్రామ సేవయే – సాయి సేవ" సుసంపన్నంగా నిర్వర్తించుకొని, సుమధురమైన జ్ఞాపకాలని మూట కట్టుకొని, సుందరమైన హృదయములతో, గుండెల్లో గూడు కట్టుకున్న సేవా భావనతో, నిలువెల్లా నిండి పోయిన సేవోత్సాహముతో... సేవాఝరులు హృదిలో ప్రవహిస్తూ ఉంటే... స్వామిని చూడాలి అన్న తపనతో, స్ఫూర్తితో, ప్రేరణతో, ఆర్తితో, విరహముతో, మేమందరం అనంతపురం నుండి ప్రశాంతి నిలయానికి ప్రయాణం అయ్యాము.

ఇక దారి పొడువునా... ఆ రెండు గంటల ప్రయాణములో, ఎలా జరిగింది మన కార్యక్రమం? ఎంత బాగా జరిగింది? అబ్బా! ఏ విధంగా జరిగింది? అని ముచ్చట్లాడుకుంటూ మేము వెళ్లడం జరిగింది. సుమారు మధ్యాహ్నం ఒంటిగంటకి అనుకుంటాను, మేము ప్రశాంతి నిలయానికి చేరుకున్నాం. చూస్తుండగానే గోకులం వచ్చేసింది. అక్కడ అందరం అనుకున్నాం... అరే స్వామి దగ్గరికి వస్తున్నాం కదా! మనం పల్లె పల్లెలో, గ్రామ గ్రామాల్లో పల్లకీ తీసాము. మరి పుట్టపర్తిలో మన స్వామి దగ్గర పల్లకి భుజాల మీద మోసుకుంటూ, భజనలతో పుట్ట పర్తి ప్రధాన రహదారిలో

తీస్తే ఎలా ఉంటుంది అని. ఇంకేముంది అందరూ ఏకగ్రీవంగా జై కొట్టేసారు.

అందరము కూడా గోకులం దగ్గర బస్‌లో నుండి దిగి, DCM నుంచి పల్లకినీ దింపి కాస్తా అలంకరణ చేసుకుని, ఆ చిన్న పల్లకిని భుజాల మీద ఎత్తుకొని చాలా ఉత్సాహంగా, భజన పాటలతో, నృత్యాలు చేస్తూ, ఆడుతూ పాడుతూ.. ఎంతో ఉత్సాహంగా బయలుదేరాము. పర్తి యాత్రలలో మనం ఈ రోజు చేస్తున్న శోభా యాత్రలకు నాంది ఇదే అని అనుకోవాలి.

ఈ గ్రామ సేవ మహోద్యమంలో స్వామి ప్రసాదించిన స్ఫూర్తి చేత పల్లకి పాటని రాయడం జరిగింది. ఇది చాలా మందికి తెలుసు. ఇప్పటికీ గత 30 ఏళ్ల నుండి, వివిధ గ్రామాలలో, వివిధ పట్టణాలలో, వివిధ సమితులలో, వివిధ సంస్థలలో చేస్తున్న కార్యక్రమాలలో ఈ పల్లకి పాట చాలా ఉత్సాహంగా పాడుకుంటూ ఉంటారు.

దేవుడొస్తున్నాడు రామం భజే,
సాయి దేవుడొస్తున్నాడు రామం భజే,
ముత్యాల పల్లకిలో... దేవుడొస్తున్నాడు,
రతనాల పల్లకిలో... దేవుడొస్తున్నాడు,
పుష్పాల పల్లకిలో... దేవుడొస్తున్నాడు,
మా హృదయ పల్లకిలో... దేవుడొస్తున్నాడు,
దేవుడొస్తున్నాడు రామం భజే
సాయి దేవుడొస్తున్నాడు రామం భజే

ఈ పాట సుమారు ఎనిమిది గీతలు. కానీ ఈ పాటని ఏ గ్రామములో పల్లకి తీస్తే ఆ గ్రామం పేరు, అక్కడి విశేషాలను ఆ పాటలో జత చేసి గ్రామంలో పెడుతూ ఇక అదుపు అంతం లేకుండా ఒక 20 నిమిషాలు పాడుకునే వాళ్లం.

'రాజాధి రాజ రాజ గంభీర రాజకుమార రాజమార్తాండ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక సమర్థ సద్గురు సాయినాథ మహారాజుకి' అంటే... వందల మంది గొంతెత్తి జై అంటూ ఉంటే... అబ్బా స్వామి నిజంగా పల్లకిలో వస్తున్నారా ఏమిటి అన్నట్టు ఉండేది.

జై జై జై గణనాయకా
ఓం శివాయ ఓం శివాయ
ఓం నమో నారాయణాయ
శ్రీ రంగా శ్రీ రంగా రంగ రంగ శ్రీ రంగా
ఆంజనేయ వీరా హనుమంత శూరా
రామలక్ష్మణ జానకి జై బోలో హనుమానుకి
ఓయి రామా సాయి రామా
హరి నారాయణ గోవిందా...
రామా అనరాదా ఒకసారి
అల్లాహూ అక్బర్
సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం
రాధా నాచే గోపీ నాచే

ఇలా పది మంది చేరి గొంతెత్తి పాటలు పాడుతుంటే... రహదారులకు ప్రాణం వచ్చి ఊగినట్లు

ఉండేది. ఇక ఆ సమయంలో రోడ్డుకు అటువైపు ఇటువైపు ఉన్న కాలేజీలో ఉన్న విద్యార్థులు ఐతేనేమి, ఉపాధ్యాయులు ఐతేనేమి, రోడ్డుమీదకి వచ్చి ఏమిటీ కోలాహలము అని చూస్తూ హైదరాబాద్ పిల్లలు మోసుకొస్తున్న పల్లకిని చూసి వాళ్లు కూడా కలసి మాతో చేరిపోయి, చెయ్యి కలిపి, కాలు కదిపి... గజ్జలు కట్టినట్టు, పాడుతూ ఆడుతూ మాతో పాటు మూగి పోయారు.

ఇలా ప్రశాంతి నిలయంలో గణేష్ ద్వారం దగ్గర దాకా వచ్చిన తర్వాత, అప్పటి దాకా ఉన్న ఉత్సాహం కాస్త క్రమశిక్షణగా మారిపోయింది. ఓయమ్మ! ప్రశాంతి నిలయం వచ్చేసింది! సేవాదళ్ వాళ్లు వారిస్తున్నారు అప్పటికే... ష్.. ష్... నిశ్శబ్దం అని. కాబట్టి అందరం రాముడు మంచి బాలుడు అన్నట్లు నిదానంగా, నిశ్శబ్దంగా గణపతి మందిరం ముందుకు చేరుకున్నాము. అక్కడికి వెళ్లిపోయి, పల్లకిని దించి... అలంకరణలు తీసేసి వెళ్లి పోదాము అనుకున్న సమయంలో ఒక గంభీరమైన ఒక గొంతు "ఎవరు మీరంతా? ఎక్కడి నుంచి వచ్చారు?" అంటూ వినపడింది. అడిగింది ఎవరు అని చూస్తే, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు, కార్యదర్శి శ్రీమాన్ చిరంజీవి రావు గారు, స్వామికి చాలా అంతరంగికులుగా ఉన్న మహానుభావులు.

వారు ఈ విధంగా ప్రశ్న వేసే సరికి అందరూ కూడా వణికి పోయాము. "ఓరి నాయన...! ఇప్పుడు ఏమవుతుందో ఏమో, ఏం చెప్పాలి?" అంటూ గోపి, ఉదయ్, YC వీళ్లందరూ కూడా... "అంకుల్! మేము హైదరాబాద్ నుంచి గ్రామ సేవ చేసుకొని వస్తున్నాము" అని చెప్పారు, అప్పుడు ఏమి జరిగింది అన్నది మేము ఊహించ లేక పోయాము మిత్రులారా! వారి ముఖము ప్రసన్నంగా మారి పోయింది. ప్రేమ భావన ప్రస్ఫుటంగా కనిపించింది. అప్పుడు చెప్పారు... "చాలా సంతోషం! హైదరాబాద్ యూతా! స్వామి ప్రతి రోజు అడుగుతున్నారు మీ గురించి. చాలా సంతోషం! స్వామి మీ కోసం వెయిట్ చేస్తున్నారు" అన్నారు... ఇక మా హృదయాలలో అమృతం కురిసినట్లు... మా తపస్సుకు మెచ్చి స్వామి సందేశం పంపినట్లు మురిసి పోయాము. ఆ ఒక్క మాటతో అప్పటి దాకా పడిన శ్రమ అంత మటు మాయం అయిపోయింది.

ఇక మేము వెళ్తున్నామండి, అని వారికి చెప్పి పల్లకిని ప్యాక్ చేయడానికి సిద్ధం అయ్యాము అలా కాదు, పల్లకిని ఇక్కడి దాకా తెచ్చారు, ఒక రౌండ్ నిలయం లోపల కూడా తీసుకుని వెళ్లండి అన్నారు...

అబ్బా! ఏంటి?! ప్రశాంతి నిలయంలో, ఆ మాడ వీధుల్లో... అంటే నాలుగు వీధుల్లో ఆ పల్లకిని తీయడమా... ఎంత అనిర్వచనీయమైన భావన అంటే ఇక మా జన్మలో మర్చిపోలేని అనుభూతిగా మారిపోయింది. ఇక మా ఉత్సాహానికి అంతే లేదు. అసలు స్వామే మమ్మల్ని ఆజ్ఞాపించినట్టుగా ఉంది అని అనుకున్నాము.

చెప్పలేదు కదూ... 50 మంది కూడా గ్రామాల్లో సేవలకు సౌలభ్యంగా ఉంటుందని పసుపు మరియు నీలపు టి షర్టులు వేసుకున్నాం... అదిగో ఆ దుస్తులతో ఉన్నాం... అయినా ఎవడి మీద వాడికి ధ్యాసనే లేదు. అందరి హృదయాలలో ఆ స్వామి నిండి పోయి ఊగుతున్నట్లు ఉంది.

అందరూ మళ్లీ పల్లకి తీసి 'రాజాధి రాజ రాజ గంభీర... అని పాడుకుంటూ... అబ్బో! భక్తి పారవశ్యంతో నృత్యాలు చేసుకుంటూ... 'శ్రీరంగా శ్రీరంగా రంగ రంగ శ్రీరంగా... గోవిందనారాయణా గోపాల నారాయణ... ఆ భజన పాటలతో... చిందులేస్తూ, ఆనందంగా స్వామిని తలుచుకుంటూ... స్వామి నామాన్ని స్మరిస్తూ... స్వామి ఉన్న పల్లకిని, ప్రశాంతి నిలయంలో, ఆ నాలుగు వీధుల్లో తిప్పుతూ ఉంటే... ఆ అనుభూతిని వివరించడానికి అక్కడున్న మాలో ఎవరికి కూడా సాధ్యం కాదు

అని చెప్పాలి. గుండెల్లో ప్రేమ ప్రవాహం... కన్నుల్లో ఆనంద బాష్పాల ప్రవాహం... అంతే! ఇదంత కూడా మా అందరికీ మాటలకందని అనుభూతిగా మారింది.

అలాగ మేము ఒక ప్రదక్షిణ చేసి మళ్లీ తిరిగి గణేష్ మందిరం దగ్గరికి వచ్చే వరకు చిరంజీవి రావు గారు అక్కడే వేచి చూస్తున్నారు. వారితోనే స్వామికి మంగళ హారతి ఇప్పించాము. మేము పల్లకిని ప్యాక్ చేయడానికి సిద్ధం అవుతుంటే దీన్ని ఎక్కడ పెడుతున్నారు అని వారు అడిగారు! అంకుల్, షెడ్‌కి తీసుకెళ్తాము అన్నాము. ఎందుకు షెడ్‌కు? వద్దు... దీన్ని ప్రశాంత్ నిలయం లోపలికి తీసుకెళ్లండి, స్వామి వారు కూడా చూస్తారు. అనే మాట వినగానే మాకు నోట మాటే రాలేదు. నిదానంగా పల్లకిని తీసుకెళ్లి ప్రశాంతి నిలయంలో, సాయి కుల్వంత్ సభా మంటపంలో వేణుగోపాల స్వామి దగ్గర పెట్టాము.

ఇక అటు నుండి షెడ్డుకి వెళ్లి మధ్యాహ్న భోజనాలు చేసి సాయింత్రం నాలుగు గంటల కంతా మీరు వచ్చేయండి అని వారు చెప్పడం, స్వామి చూస్తారు అని చెప్పడం... అదంతా వింటూ ఇక మమ్మల్ని మేము మర్చిపోయి, పరిగెత్తుకుంటూ, టక టకా రెడీ ఐపోయి మంచి శుభ్ర మైన శ్వేత వస్త్రాలు వేసుకొని, విభూది పెట్టి, ఒక్కొక్కరు నా సామి రంగా... హీరోస్ లాగా కుల్వంత్ హాల్‌లో స్వామి దర్శనానికి కూర్చున్నామన్నమాట.

నాలుగు గంటలకంతా స్వామి చాలా మృదు మధురమైన మందహాసంతో, సుందరమైన నడకతో, ప్రశాంతి నిలయంలో, సాయి కుల్వంత్ సభా మంటపంలో... తమ గదిలో నుంచి వరెండాలో కూర్చున్న మగవాళ్లని దాటుకుంటూ... వేణుగోపాల స్వామి దగ్గర కూర్చున్న మా దగ్గరికి వచ్చారు. అందరము సైలెంట్ అయిపోయాము! అందరూ స్వామిని చూసి చేతులు జోడించి... స్వామి! స్వామి! అంటే... "ఏమి సమాచారము?" అని అడిగితే... స్వామి గ్రామ సేవలు చేసుకొని వచ్చాం స్వామి, స్వామి మమ్మల్ని పిలవండి స్వామి... అని చెప్పడం, స్వామి మా ముందు అలా అలవోకగా తల మీద వెంట్రుకలు సరి చేసుకుంటూ... తన చేతి వేళ్లను అలవోకగా కదిలిస్తూ... చాలా చమత్కారంగా అక్కడే మా పక్కనే కూర్చున్న అనిల్ కుమార్ గారిని చూస్తూ... ఏం అనీల్ కుమార్ ప్రైవేట్‌గా మాట్లాడుకుందామా? పబ్లిక్‌గా మాట్లాడుకుందామా? అని అడిగారు. మాకు ఏమి అర్థం కాలేదు... ఈ ప్రైవేట్ ఏమిటి? పబ్లిక్ ఏమిటి అని? మేము అన్నాం, స్వామి మీరు మమ్మల్ని లోపలికి పిలవండి స్వామి!

అప్పుడు స్వామి, 'అనీల్ కుమార్ ఏమంటావ్?' అని అడిగారు... అనిల్ కుమార్ గారు వెంటనే టక్కుమని లేచి "స్వామి మీరు ప్రైవేట్‌గా లోపల గదిలో మాట్లాడితే వాళ్లు ఎవరు? ఏం చేశారు? మాకు ఎలా తెలుస్తుంది స్వామి? మీరు పబ్లిక్‌లో మాట్లాడితే వీళ్లు ఏం చేశారు అన్నది ప్రపంచానికి తెలుస్తుంది స్వామి అంటూ పబ్లిక్‌లోనే మాట్లాడండి స్వామి" అని చెప్తే... "అవునవును కరెక్ట్‌గా చెప్పావు, పబ్లిక్ మీటింగ్ పెట్టుకుందాము, రేపు నాలుగు గంటలకి సాయి కుల్వంత్ హాల్‌లో పబ్లిక్ మీటింగ్ పెట్టుకుందాం, రేపు మాట్లాడతాను" అని చెప్పి చాలా చాలా ప్రేమగా, వాత్సల్యంగా, అనురాగ దృక్కులను మా మీద ప్రసరింపచేస్తూ.. ముందుకు కదిలిపోయారు.

అలా స్వామి నా ముందుకు వచ్చారు. నేనేమో టీమ్ తీసిన ఛాయాచిత్రాల ఆల్బమ్ చేతిలో పెట్టుకుని స్వామికి చూపించే ప్రయత్నం చేశాను. అందులో తుర్కపల్లి గ్రామంలో సాయంత్రం సమావేశంలో తీసిన ఫొటోలలో దివ్యకాంతి పుంజాలు బాబా అన్న రూపంలో వచ్చాయి. స్వామి వాటివైపు చూడకుండా మా వైపు చూస్తూ... ఏమిటివి అని అడిగితే, చాలా అమాయకంగా ఫొటోలు

అని చెప్పాను. అప్పుడు వారన్నారు... ఇంతేనా నన్ను అర్థం చేసుకుంది? మీతో నేను ఉన్నాను రా... నాకంతా తెలుసు అని చెప్పడం మరొక మరపురాని అనుభూతి.

మాలో ఎవరో ఒకరు మాట్లాడాలి అని స్వామి మాకు సూచించారు. స్వామి ముందు మాట్లాడటానికి Y శ్రీనివాస్‌కి అవకాశం వచ్చింది.

దర్శనం తరువాత మేమందరం శ్రీనివాస్‌తో కూర్చున్నాం. ఏం చెప్పాలి? ఏవిధంగా చెప్పాలి? అనే విషయంతో చిన్న ఉపన్యాసం తయారు చేసుకున్నాడు శ్రీనివాస్ స్వామి ముందు మాట్లాడానికి. అలాగే ఏం పాట పాడితే బాగుంటుంది స్వామి దగ్గర అంటే... అందరూ కూడా ఏకగ్రీవంగా 'దేవుడొస్తున్నాడు రామం భజే' పాడదాము బాగుంటుంది అని చెబితే... నాకెంత దివ్యమైన అనుభూతి కలిగిందంటే... నేను మాటలలో చెప్పలేను. అప్పుడే ఆ భజన వ్రాసి తనకు ఇచ్చాను. తను బాగా సిద్ధం అయ్యాడు. మేమంతా మూడు గంటలకి సాయి కుల్వంత్ హాల్‌లో వెళ్లి కూర్చున్నాం. మేము ఎక్కడ కూర్చున్నామంటే... వేదము చెప్తారు కదా, ఆ స్థలం పక్కన స్తంభం దగ్గరగా మమ్మల్ని కూర్చోబెట్టారు.



48

భాగ్యనగర యువత భవిష్యత్తును భగవంతుడు నిర్వచించిన రోజు

మొత్తం సాయి కుల్వంత్ సభా మంటపంలో అందరికంటే ముందు మేమే కూర్చున్నాం. ఇంకా భక్తులు ఎవ్వరూ రాలేదు. మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో స్వామి తమ గదిలో నుండి బయటికి వచ్చి వేదిక మీద ఏర్పాట్లు చూస్తున్నట్లుగా వచ్చారు... ఆ పెద్ద సింహాలు ఉన్నాయి కదా... ఆ సింహాల దగ్గరి నుండి మమ్మల్ని చూశారు. ఏయ్ బాయ్స్! అని గట్టిగా పిలిచారు. మేమందరం ఒక్కసారి తలలెత్తి చూసాం. "ఏమిటి అక్కడ కూర్చున్నారు? అక్కడ ఎవరు కూర్చోబెట్టారు మిమ్మల్ని?" అని స్వామి అనగానే అంటే మాకు అర్థం కాలేదు. మరి ఇక్కడ కూడా కూర్చోకూడదా... ఇంకా వెనక కూర్చోవాలా ఏందో మరి అని అనుకున్నాం. స్వామి నవ్వుతూ అన్నారు "బంగారు! మీరు అక్కడ కాదు... ఇక్కడికి రండి, ఇక్కడ కూర్చోండి..." అని ఎక్కడ కూర్చోమన్నారు అంటే... ఆ వేదిక మీద స్వామి సింహాసనం ఇరు ప్రక్కల వేసిన కంబళి మీద కూర్చో మన్నారు. మళ్లీ స్వామి అన్నారు కదా! 'మీ స్థానము అది కాదు ఇది రా!!' అని స్వామి పక్కన 50 మంది పిల్లలము కూర్చోవడం... ఆ దివ్యానుభూతి మాకు అందరికీ ఎంతో విశిష్టంగా అనిపించింది. అంత ప్రేమను మాపై స్వామి చూపించడాన్ని మేము ఎవరమూ మాటలలో వివరించలేము ఈ రోజుకి కూడా.

అసలు స్వామి పక్కన ఒకరు కూర్చోవడమే చాలా పెద్ద సంగతి. మీ అందరూ చూసి ఉంటారు కదా! స్వామి పక్కన కూర్చోవడానికి ఏ రాష్ట్రం వాళ్లు వస్తే ఆ రాష్ట్ర అధ్యక్షులు లేకపోతే సంచాలకులు / కార్యనిర్వహకులు స్వామి పక్కన దూర దూరంగా కూర్చుంటారు. అలాంటిది ఆ రోజు స్వామి మా అందరినీ తమ సింహాసనానికి ఇరువైపులా కూర్చోమని ఆజ్ఞాపించారు. అలా కూర్చున్నాం.

మళ్లీ నాలుగు గంటలకి స్వామి రావడం. YC, స్వామి సన్నిధిలో మాట్లాడడం... గ్రామాల్లో ఏం జరిగింది? ఈ గ్రామ సేవ సాయి సేవ అన్న నినాదాన్ని ఏ విధంగా భుజ స్కంధాల మీద వేసుకొని గ్రామగ్రామాన, ఇంటింటా, ఇంచించూ... ఏ విధంగా స్వామి నామాన్ని ప్రతిధ్వనింప చేస్తూ, స్వామి

ఆదేశించిన ప్రకారం ఎలాంటి సేవా కార్యక్రమాలు మేము చేసుకున్నాం? మా అనుభూతులు ఏమిటి? ఇవన్నీ కూడా చెప్పి స్వామి పల్లకి ఈ విధంగా మేము మోసుకుంటూ మిమ్మల్ని మా భుజాల మీద ఎత్తుకొని ఆ గ్రామాల్లో తిరిగాము స్వామి. అని చివర్లో ఆ పల్లకి పాట పాడాడు.

'దేవుడోస్తున్నాడు రామం భజే

సాయి దేవుడు వస్తున్నాడు రామంభజే'

ఇక మేమందరం గొంతు కలిపి సాయి కులవంత హాల్ అంతా కూడా ప్రతిధ్వనింప చేశాం అందరం కూడా గట్టి గట్టిగా పాడుతూ. స్వామే పక్కన ఉంటే... స్వామే మా మధ్యలో ఉంటే... స్వామే భజనలు వింటూ ఉంటే... వారి చేతులతో లయబద్దంగా తాళం వేస్తూ ఉంటే ఎలా ఉంటుందో ఆలోచించండి... మమ్మల్ని మేము మరచి ఎలుగెత్తి ఆ పల్లకి పాటను అద్భుతంగా పాడుకున్నాం. స్వామి సింహాసనం మీద నుంచి నిదానంగా లేచి ఎంతో మధురమైన చిరునవ్వుతో, ఆశీర్వాద దృక్కులతో చూస్తూ... టేబుల్ మైక్ సిద్ధంగా ఉన్నాయి కదా నిదానంగా లేచి... అనిల్ కుమార్‌ని పిలిచి తన దివ్యోపాన్యాసం మొదలుపెట్టారు.

గ్రామ సేవయన్న రామ సేవయే సుమీ!

రామ రాజ్య మన్న ప్రేమ మయమే...

ప్రేమ లేక యున్న క్షేమంబు లేదయా...

సేవ లేకయున్న శాంతి లేదు!!

దివ్యాత్మ స్వరూపులారా! అని స్వామి మొదలు పెట్టారు. ఈ నాలుగు గీతల పద్యము కాస్త... యావత్ భారత జాతినే కాక, యావత్ విశ్వ మానవాళిని చైతన్య పరిచే తారక మంత్రంగా మారింది అనడంలో ఎట్టిసందేహము లేదు. ఆ నాడు స్వామి ప్రవచించిన ఈ పద్యము కాస్త మా యొక్క హృదయ ఫలకాలలో ముద్రించుకొనిపోయింది. ఆ విధంగా స్వామి మొదలు పెట్టి "బంగారు! చాలా సంతోషమైంది. ఎంతో మంచి సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. మీ గురించి నేను ప్రతిరోజు మీరు ఎప్పుడు వస్తారా? అని వేచి చేస్తున్నాను బంగారు మిమ్మల్ని చూడాలని. ఆనందంగా ఉంది బంగారు. ఆ ఉపన్యాసంలో మేము ఆయా గ్రామాలలో ఎదుర్కొన్న అనుభూతులను కూడా స్వామి ఉదహరించి మాట్లాడిన విధానం చూస్తే... స్వామి ఎంత నిశితంగా మమ్మల్ని, మా ఉత్తరాలను, ఫాక్స్‌లను టెలిగ్రాంలను చూసారో అర్థం అవుతోంది... అన్నిటికీ మించి వారి సర్వజ్ఞత తెలుసుకున్నాము. ఈ విషయలన్ని కూడా నిజంగా మా ఊహకు కూడా అందనిగా ఉన్నాయి.

స్వామి మాట్లాడుతూ "బంగారు! ఈ విధమైన గ్రామ సేవలు మీరు చేస్తూ ఉంటే... నిజానికి మీ ఇంట వెంట కంట జంటగా నేను ఉంటాను. సేవా కార్యక్రమాల్లో మీరు ముందడుగు వేయండి మీ వెంట నేను వస్తాను, అంతే కాదు గ్రామ సేవలు చేసే మీ అందరిని కూడా మీ యొక్క కుటుంబంలో, మీ వంశంలో, మీ యొక్క ఇంట్లో, గ్రామంలో, వీధిలో ఎక్కడైనా సరే వచ్చే తరాలు మీ ఫోటోలను గోడల మీద తగిలించి స్వతంత్ర సమరయోధుల్లాగా, గ్రామ సేవ యోధుల్లాగా మిమ్మల్ని చూస్తారు మీ వాళ్లందరూ కూడా... నా సంపూర్ణ అనుగ్రహం మీకు ఇస్తున్నాను" ఇవన్నీ వింటూ ఉంటే మా ఆనందానికి అంతు లేకుండా పోయింది.

ఆ రోజు స్వామి అనుగ్రహించిన దివ్య సందేశాన్ని భావి తరాల వాళ్లకు అందించాలన్న ఆర్తితో, భక్తితో మేము సేకరించాము. అది కూడా తరువాత భాగములో ప్రచురించే ప్రయత్నం చేస్తున్నాము.

స్వామి చెప్పిన విషయాలన్నీ కూడా వినడం కాకుండా మస్తకాల్లో పెట్టేసుకున్నాము, కణకణములలో కలిపేసుకున్నాము, స్వామి మాటలు మంత్రాలుగా మారిపోయి అణువణువులో మిళితం అయిపోయాయి. అలా ఉండింది స్వామి సందేశంలో స్ఫూర్తి ప్రేరణ అంతా కూడా... వెనక్కి వెళ్లడం ఆలస్యం, మళ్లీ మర్చి పోతామేమో అని స్వామి చెప్పిన మాటలన్నీ మళ్లీ మననము స్మరణము చేసుకునే ప్రయత్నం చేశాము. ఒక సమావేశం పెట్టుకొని, స్వామి ఏం చెప్పారు? ఇవన్నీ మాకు అర్థం అయినట్లు వ్రాసుకున్నాము, తెలుసుకున్నాం, మాట్లాడుకున్నాం.

మరుసటి రోజు స్వామి చాలా దయతో ప్రత్యేక దర్శన, స్పర్శన, పాద నమస్కార, ప్రసాద భాగ్యాలు అందించారు హైదరాబాద్ యూత్‌కి ఎంతో అద్భుతమైన దివ్య ప్రేమను అనుగ్రహం చేశారు.

ఒక్కొక్కరిది ఒక్కొక్క అనుభవము. నేను స్వామితో ఏదో చెప్పాలని పోతే... "ఏయ్! నువ్వు! వాడు! వాడు ఎక్కడ!! వైజాగ్ పకోడా... వాడు!? మీరిద్దరు కూడా ఎక్కువగా మాట్లాడుతున్నారు. జాగ్రత్త! నోరు మూసుకొని కూర్చోండి." అని చెప్తే నాకు చాలా భయమైపోయింది. ఏమి ఇట్లా అన్నారు అబ్బా! అసలు గ్రామ సేవలో మాట్లాడిందే నేను, మాటలతో ప్రచారం నేను మాత్రమే చేశాను. మరి ఇట్లా అన్నారేంటి స్వామి? అని నేను చాలా వ్యధపడ్డాను. మళ్లీ నా మరుసలో స్వామి పాదనమస్కారం ఇవ్వడానికి వస్తున్నప్పుడు చెప్పాను నేను స్వామి మాటలే కదా స్వామి! అని చెప్పబోతుంటే, 'ఏయ్! చూశావా... అధిక ప్రసంగం. నోరు మూయ్' అన్నారు. అంటే స్వామి దున్నపోత అంటే డిన్నరు, తిడితే టీ పార్టీ అన్నట్టుగానే అప్పుడు తీసుకున్నాను. కానీ ఈ రోజుకి కూడా స్వామి చెప్పిన మాటను నేను హృదయంలో పెట్టుకున్నాను, "మాటలు తక్కువ చెయ్యి" అన్నటువంటిది. స్వామి నా జీవితాన్ని ఎలా రూపొందిస్తున్నారో నాకు తెలియదు అని అనుకున్నాను. కాస్తముందుకు వెళ్లిన తర్వాత స్వామి విచారించారు. "ఎవరు బాగా పనిచేసారు?" అంటే YC చెప్పాడు "స్వామి అందరూ పని చేశారు స్వామి." "ఏయ్! కాదు కాదు? ఎవరు మంచి పని చేసారు? అట్లా అంటూ అంటూ... నాకు గుర్తున్నంత వరకు గంగాధరశర్మ, అదే ముద్దుగా రాజు అని పిలుస్తాము కదా... వాడు అక్కడినుండి రెండో వరుసలో కూర్చుంటే వాడిని చూసి ఏయ్ నువ్వు లే అని చెప్పివాడిని లేపడం, స్వామి వాడిని ఆశీర్వదించి "చాలా మంచి పని చేశావు బంగారు. చాలా అద్భుతంగా పని చేశారు మీరంతా..." అంటూ హస్త చాలనముతో వాడికి బంగారు అంగుళీయకాన్ని సృష్టి చేసి స్వామి ఇవ్వడం... ఆ విధంగా ఎంతో అద్భుతమైన విషయాలు ఆ రోజు జరిగాయి. ఆ రోజు నుండి వాడిని రింగు రాజు అని పిలవడం మొదలైంది వాడు తరవాత కాలంలో ఆంధ్ర రాష్ట్ర యువజన విభాగానికి నాయకత్వం వహించాడు. చాలా ఆత్మీయంగా, అందరితో చేరి తాను ఎన్నో అద్భుతమైన సేవలు చేశాడు, చేస్తున్నాడు.

స్వామి యొక్క దర్శన స్పర్శనసంభాషణ పాద నమస్కార ప్రసాద భాగ్యాలు తీసుకొని, గ్రామ సేవయే సాయి సేవ ఉద్యమాన్ని ఒక మహోద్యమంగా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో స్వామి ఇచ్చిన సందేశాన్ని గుండెల నిండా నింపుకొని, మను ముందు కార్యక్రమాలు ఏం చేసుకోవాలి? ఎలా చేసుకోవాలి? అనే ఆలోచనలతో మేమందరం కూడా మళ్లీ వెనుతిరిగి హైదరాబాద్‌కి ప్రయాణం అయ్యాము.

సంకల్పం మంచిదవుతే భగవంతుడు కదలి వస్తాడు అన్న దానికి నిదర్శనం ఆరోజు జరిగింది... స్వామినే! నాయకుడిగా తీసుకుంటే జరిగే అద్భుతము మా ముందు సాక్షాత్కరించిన రోజు

అది! అందరం ఐకమత్యంతో... భక్తి విశ్వాసములతో చేసే చిన్న సేవ కూడా ఎలా దేవుని మెప్పిస్తుంది అని అర్థమైన రోజు అది!!

"గ్రామ సేవయే... సాయి సేవ" అన్న నినాదానికి స్వామి ప్రాణ ప్రతిష్ఠ చేసిన రోజు అది.

సత్య సాయి సంస్థలకు స్వామి నిర్దేశించిన మార్గమునకు ఆవిష్కరణ జరిగింది ఆ రోజు.

భాగ్యనగర యువతకు, భవిష్యత్తులో ఎలాంటి సేవలు స్వామికి ఇష్టం కలిగిస్తాయి అని చెప్పిన రోజు ఆ రోజు. స్వామి సదా సేవకుల ఇంటా వెంటా జంటా కంటా ఉంటూ కాపాడతాడు అన్న దానికి నిదర్శనం చూసిన రోజు ఆ రోజు. మంచి చేస్తే... సామాన్యులను సైతం... వారు తమ అక్కున చేర్చుకుని ప్రేమను పంచుతారు అన్న దానికి నిదర్శనం ఆ రోజు.

ఇలా ఎన్నో అనుభూతులు మనసుల్లో, గుండెల్లో, హృదయాల్లో పదిలమై... పవిత్రమై... ప్రాణమై... ప్రవాహమై... కదులుతుంటే... అరే! బ్రతికితే ఇలాంటి సేవలలో మాత్రమే బ్రతకాలన్న భావాలు అందరినీ సేవలో మమేకం చేశాయి. భవిష్యత్తులో ఇలాగే అందరం చేరి మరిన్ని సేవలకు శ్రీకారం చుట్టాలి అన్న ధృఢ సంకల్పంతో తిరుగు ప్రయాణం చేశాము.

నేటికి (2025)... ఇది జరిగి సుమారు 30 వసంతాలు అయింది. ఆ నాటి గ్రామ సేవకులు ఇప్పుడు వివిధ ప్రాంతాలలో... వివిధ రంగాలలో స్థిర పడిపోయారు. ఎవరికి వారు, వారి జీవితాలను సేవలో సార్థకం చేసుకుంటూనే ఉన్నారు.

49

గ్రామసేవయే – రామసేవ

(29th సెప్టెంబర్ 1996 స్వామి వారి దివ్యోన్యాసం)

గ్రామ సేవయన్న రామసేవయే సుమీ
రామరాజ్యం అన్న ప్రేమ మయమే
ప్రేమ లేక యున్న క్షేమంబు లేదయా
సేవ లేక యున్న శాంతి లేదు.

ప్రేమస్వరూపులారా!

నిజమైన కార్యాచరణకు ప్రేరణనిచ్చేది, ప్రోత్సహించేది గ్రామసేవే. గ్రామాలు పట్టణాలలో భాగం. గ్రామాలు బాగుంటే, పట్టణాలూ బాగుంటాయి. మొక్కకు పువ్వు లేకుండా పండును ఆశించలేము. కాయ లేకుండా పండు రాదు. గ్రామం లేకుండా పట్టణమూ ఉండదు.

భారతదేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో చెన్నై (మద్రాస్) అనే నగరం గతంలో చిన్న గ్రామమే. అప్పట్లో దానిని చెన్నప్పపల్లె అని పిలిచేవారు. అలాగే బెంగళూరు కూడా ఒక చిన్న గ్రామమే, "బాగల్ కాయలూరు" అనే పేరు ఉండేది. వేయించిన పల్లీలు అమ్ముకుంటూ జీవనాన్ని గడిపే వారు అక్కడ నివసించేవారు. అదే ఇప్పుడు గొప్ప నగరమైంది.

పూర్వం, పుట్టపర్తి గురించి చెప్పాల్సిన అవసరమే లేదు, ప్రస్తుతం అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన పుట్టపర్తి విశేష స్థానం పొందింది. ఈ విధంగానే వ్యక్తిగత స్థాయిలో మార్పు జరగాలి. ఆత్మతత్వాన్ని గుర్తించగలగాలి. సరైన సమయంలో, సరైన స్థితిలో, మీరు కూడా మహానుభావులు కావచ్చు.

ఒకసారి మనిషి తన మానవతత్వాన్ని గుర్తిస్తే, అతను ఆదర్శవంతుడవుతాడు. ఆధునిక యుగంలో

కలియుగ ప్రభావంతో మానవుడు తన మానవత్వాన్ని మరచిపోయాడు. తన స్వరూపాన్ని తెలియని ఆధునిక మానవుడు, లోపల దాగి ఉన్న దైవత్వాన్ని ఎలా గుర్తించగలడు?

మొదటగా మానవ తత్వాన్ని తెలుసుకోవాలి. తన స్థాయిని, స్వభావాన్ని తెలుసుకోవాలి. అదే అతనికి శక్తిని ప్రసాదిస్తుంది. గ్రామాల్లో నివసించే వారిని ఎప్పుడూ తక్కువగా చూడకూడదు. ఇవే గ్రామాలు రేపు పట్టణాలవుతాయి. భారతీయ సంస్కృతి గ్రామాల్లో కనిపిస్తుంది, నగరాల్లో కనపడదు.

భారతీయ సంస్కృతి మొదలైనది గ్రామాల నుండే. గ్రామాల్లోని నీతి, నిజాయితీ, నిబద్ధత నగరాల్లో కనపడదు. గ్రామాల్లో కనపడే ఐక్యత, అనురాగం అనేవి నగరాల్లో కనపడవు. అందుకే గ్రామమే ధర్మానికి మూలం, కేంద్రబిందువు.

గ్రామం అనేది సేవా కేంద్రంగా మారాలి. అందరూ గ్రామాలను ప్రేమించాలి, అందులో సేవచేయాలి. ముందుగా అక్కడ భజనలు నేర్పించాలి. గ్రామవాసులు భజనలను చాలా ఇష్టపడతారు. ప్రతీ సాయంత్రం దేవాలయంలో చేరి, నామ సంకీర్తనలతో భక్తిని పెంపొందించుకోవాలి.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి. పరిశుభ్రత వల్ల ఆరోగ్యం, ఆనందం లభిస్తుంది. యువత గ్రామాల్లో సేవకార్యక్రమాలు చేపట్టాలి. నిస్వార్థ సేవయే మనస్సును వికసింపజేస్తుంది, బుద్ధిని శోభింప చేస్తుంది.

సేవతోపాటు మనము శీలాన్ని కూడా అభివృద్ధి చేయాలి. సహనం, ఓర్పు, దయ, కరుణ, త్యాగం, ప్రేమ వంటి పవిత్ర గుణాలు పెంపొందించాలి. గ్రామస్తులతో మాట్లాడేటప్పుడు ప్రేమతో ఉండాలి. నీళ్ళు పాలతో కలిసినట్టుగా వారితో మనమూ కలవాలి. దగ్గర సంబంధంతో, పరిచయంతోనే వారిని మనం అర్థం చేసుకోగలుగుతాము.

గ్రామసేవ అనేది పవిత్రమైన పని. “Love All -Serve All” –అందరినీ ప్రేమించు, అందరిని సేవించు, ఇది భగవంతుడిని ప్రేమించే ఉత్తమ మార్గం.

సేవలో ఉన్న శక్తి వేరే ఎక్కడా కనిపించదు. అష్టోత్తర శతనామావళి చదివినా, యజ్ఞ యాగాలు చేసినా, ఋగ్వేద పారాయణ చేసినా! వీటన్నింటికన్నా సేవయే గొప్పది.

సేవలో త్యాగం ఉంది. హృదయం, మనస్సును అనుసంధానించే అనుబంధం ఉంది. ఈ త్యాగము వల్లనే ‘అహంకారం’ అనే విషాన్ని తొలగించవచ్చు. ఆధునిక మానవుడు అహంకారంతో నిండిపోయాడు, అందుకే ప్రేమ లేదు. విద్య ఉన్నా, విలువలు లేవు.

విద్య అనేది తెలివితేటలకు దోహదపడుతుంది, కానీ గుణాలకు కాదు. గుణగణాలు లేని విద్యతో ఏమౌతుంది? విద్యార్థులకు చక్కటి గుణాలు బోధించాల్సిన అవసరం ఉంది. ప్రాచీన సంస్కృతిని తెలుసుకోవాలంటే గ్రామాలకు వెళ్ళాలి.

భారతదేశపు సంస్కృతి గ్రామాల ద్వారా ఇంకా నిలిచి ఉంది. అందుకే గ్రామాలకు వెళ్లి సేవ చేయాలి, అక్కడి జీవనరీతులను మనం నేర్చుకోవాలి.

సేవా భావన –జీవనంలోని మూలతత్వం

మనం సేవ అంటే అర్థం చేసుకోలేము. సేవ అనేది రాజో లేక పండితుడో మాత్రమే చేయాల్సిందేం కాదు. సేవ ప్రతి ఒక్కరి జీవితంలో ఉంది. తల్లి తండ్రిని సేవిస్తుంది. భార్య భర్తను సేవిస్తుంది. భర్త భార్యను సేవిస్తాడు. పిల్లలు తల్లిదండ్రులను సేవిస్తారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సేవిస్తారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సేవిస్తారు.

ఈ ప్రపంచంలో ఏ సంబంధమైనా సేవలపై ఆధారపడి ఉంది. ప్రతి సంబంధమూ ఒకరిని మరొకరు సేవించడంలో ఉంది. శరీరంలోని అన్ని అవయవాలు కూడా సేవే చేస్తున్నాయి. కన్నులు చూడటానికి సేవ చేశాయి. చెవులు వినేందుకు, నాలుక మాటల కోసం, చేతులు పనికోసం... ఇవన్నీ మన మనస్సుకు సేవ చేస్తున్న అవయవాలే.

మన మనస్సు అనేక ఇంద్రియాలకు ప్రభువుగా ఉండాలంటే, అవయవాలు సరిగ్గా పని చేస్తేనే సాధ్యం. అవి పని చేయకపోతే, ఆ మనస్సే బానిసగా మారుతుంది. కాబట్టి ఈ లోకంలో ప్రతి జీవి కూడా సేవకుడే.

ఒకప్పుడు ఇద్దరు బాల్య మిత్రులు ఉండేవారు: ఒకరు ధనికుడు, మరొకరు పేదవాడు. కాలక్రమేణా ధనికుడు రాజయ్యాడు. పేదవాడు ఓ చిన్న పని చేసుకుంటూ బ్రతుకుతున్నాడు. ఒకరోజు పేదవాడు రాజును కలవడానికి వెళ్ళాడు. రాజును చూసి, "ప్రపంచంలోని ప్రతివాడు సేవకుడే" అన్నాడు. రాజు నవ్వుతూ, "నేను రాజు నయ్యాను, నా దగ్గర బానిసలు ఉన్నారు, నేనేం సేవకుడిని?" అన్నాడు.

అప్పుడు అతని స్నేహితుడు అక్కడే ఒక చిన్న పరీక్ష చేశాడు. తన చేతిలోని కర్ర నేలపై పడేయగా, తన నడుము నొప్పితో దానిని ఎత్తలేకపోయాడు. రాజు దగ్గరికి వచ్చి, ఆ కర్రను ఎత్తి ఇచ్చాడు. వెంటనే స్నేహితుడు అన్నాడు "ఏమిటి రాజా! నువ్వే నాకు సేవ చేశావు, కర్రను ఎత్తి ఇచ్చావు. ఇప్పుడు నువ్వే సేవకుడిని" అన్నాడు.

ప్రేమతో చేయబడిన సేవ సేవ కాదు, అది భక్తి! అందులో స్వార్థం లేదు. అందులో అహం లేదు. అందుకే ప్రతి ఒక్కరూ సేవకులే. సేవ చేయడం మానవజీవితానికి గౌరవాన్నిచ్చే మార్గం.

మానవ జీవిత విశిష్టత –ఆత్మతత్వ జ్ఞానం

ఈ లోకంలో కోట్లాది మంది ఉన్నారు. కానీ మానవ జీవితం ఎంతో విలువైనది. ఎందుకంటే మానవుడు మాత్రమే ఆత్మతత్వాన్ని తెలుసుకునే సామర్థ్యం కలవాడు. సమస్త జీవులు కూడా దివ్య తేజస్సు నుండి ఉద్భవించాయి భగవద్గీత చెబుతుంది అని.

ఆ పరమాత్మ ప్రతి ఒక్కరిలో ఆత్మరూపంలో ఉన్నాడు. మానవుడిలో ఐదు ''కోశాలు'' ఉన్నాయి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ. వీటిలో "విజ్ఞానమయ కోశం" అంటే బుద్ధి, ఇది మానవుడికి మాత్రమే ఉంటుంది. అందుకే మానవుడు తత్వవేత్తగా మారగలడు.

మానవుడే ఏది మంచి, ఏది చెడు అని తార్కికంగా విచారించగలడు. ఏది చేయాలో, ఏది చేయకూడదో నిర్ణయించగలడు. శాస్త్రవేత్తలు చంద్రుడి వరకు ప్రయాణించగలరు. ఇది మనిషి మేధస్సు మహిమ. ఇది అందరికీ ఉండదు, కొంతమందికి మాత్రమే ఉండే దేవుడి వరం మేధస్సు.

దైవత్వం అంతర్లీనమైనదే

మనము ముత్యాల దండను గమనిస్తే, అందులో తీగ కనిపించదు. కానీ ఆ తీగ లేకపోతే ముత్యాలన్నీ ఒక్కటిగా ఉండవు. అదే దైవత్వం. మనలో అంతర్లీనంగా ఉంటుంది. ఇది మనం సాధించాల్సింది కాదు, గమనించాల్సింది.

మన హృదయం పవిత్రమైతే దైవస్ఫూర్తి పుడుతుంది. హృదయం పవిత్రమవడానికి మనం చేయవలసింది సేవ. సేవతో హృదయం పవిత్రమవుతుంది. పవిత్ర హృదయం ఉన్నవాడు జ్ఞానాన్ని పొందుతాడు. జ్ఞానం ద్వారా మోక్షాన్ని పొందుతాడు.

సేవ –మన కోసం

మీరు ఎవ్వరిని సేవించినా, అది భగవదర్పణగా భావించాలి. మీరు సేవచేయకపోయినా, ఈ లోకానికి నష్టం ఏమాత్రం లేదు. కానీ మీరు చేసే సేవ మీకోసమే. రేపటి భవిష్యత్తులో మీరు అందుకు ఫలితాన్ని పొందుతారు.

సర్వత్రా భగవంతుడే ఉన్నాడు. ప్రతి ప్రాణిలో భగవంతుడే ఉన్నాడు. అందుకే ఎవ్వరినైనా సేవించటం అనగా భగవంతుని సేవించటమే. మీకు శక్తిలేకపోతే మాటలతోనైనా సహాయం చేయండి.

మనసు –మాట –చేతల ఏకత్వమే మానవతా ధర్మం

ఈ రోజుల్లో మనం గందరగోళాన్ని చూస్తున్నాము. విద్య అందరికీ ఉంది. కానీ లోపల మనస్సులో సహానుభూతి లేదు. ఆందోళన ఉంది. హృదయం అనగా దయతో నిండినది అని అర్థం. కానీ ఈ రోజుల్లో దయ లేదు. మనం మానవులం, కానీ మానవత్వం లేదు. మానవత్వం లేని మానవుడికి విలువ ఏముంది? మన భావనల్లో, మాటల్లో, క్రియల్లో దయను వ్యక్తీకరించాలి వేదాంతం ఈ మూడింటిని "త్రిపుటి శుద్ధి"గా పేర్కొంటుంది. మనో వాక్కాయ కర్మ, ఈ మూడింటిలో ఏకత్వం ఉంటే అది నిజమైన మానవత్వం.

"The proper study of mankind is man" అంటే మానవత్వమును గుర్తించన వాడే మనిషి. అదే నిజమైన విద్య. ఆధ్యాత్మికత అనేది మన మనసు లోపల ప్రారంభం కావాలి. మన భావనలు పవిత్రంగా మారాలి.

గ్రామాల్లో సేవ చేయడం ద్వారా ప్రేమ వ్యాప్తి చెందుతుంది

ఒక గ్రామానికి వెళ్ళినపుడు, దేవుని కీర్తనలు పాడుతూ సేవను ప్రారంభించండి. మీరు భగవంతుని నామస్మరణతో పనులు ప్రారంభిస్తే, ఆ గ్రామమంతా ప్రేమతో నిండిపోతుంది. గ్రామస్తులు కూడా మీకు తోడై, సేవలో పాల్గొంటారు.

ఈ నిజాన్ని ఇప్పటికీ చాలామంది గుర్తించడం లేదు. అయితే విద్యార్థులు, యువత మీరే ముందుకు రావాలి. యువతే సమాజ మార్పుకు కారణం కావాలి. మంచి లేదా చెడు ఏదైనా యువత చేతుల్లోనే ఉంది. చెడు స్నేహితుల వల్ల యువత చెడిపోతారు. అందువల్ల మంచి సత్సంగతి అవసరం.

ఎక్కడికైనా వెళ్ళినా – భజనలు నిర్వహించాలి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలి. గ్రామస్తులు ఈ కార్యకలాపాలను గమనించి, వారూ మిమ్మల్ని అనుసరిస్తారు. విద్యావంతులు సేవలో పాల్గొంటే గ్రామస్తులకు స్ఫూర్తి కలుగుతుంది.

HINDU అనే పదంలో భారతీయ జీవనవేదం

HINDU అనే పదానికి పవిత్రమైన అర్థం ఉంది:

H -Humility (వినయం)

I -Individuality (వ్యక్తిత్వం)

N -Nationality (జాతీయత)

D -Divinity (దైవత్వం)

U -Unity (ఐక్యత)

ఈ ఐదు గుణాలు భారతదేశానికి జీవ నాడులు. ఈ విధంగా జీవించడమే భారతీయ సనాతన ధర్మం. ఈ లక్షణాలను అనుసరిస్తే మన దేశం సక్రమంగా పయనిస్తుంది. మనము ఆనందంగా ఉంటూ, ఇతరులతో ఆనందాన్ని పంచుకోవాలి.

మాతృదేవోభవ -పితృదేవోభవ

నేటి విద్యార్థులు, ఉన్నత చదువులు చదివిన తర్వాత పదవులు, డబ్బు సంపాదన వైపు పరుగులు పెడతారు. కానీ అన్నిటికన్నా ముఖ్యమైనవి మానవతా విలువలు, ప్రేమ, ఓర్పు, నైతికత! వీటిని అందించగలిగేది తల్లిదండ్రులే. అందుకే "మాతృదేవోభవ, పితృదేవోభవ" అని చెప్పారు. ఎవరికైనా సేవ చేయాలంటే, ముందుగా తల్లిదండ్రులను గౌరవించాలి. గౌరవం ఇంటి నుండే మొదలవాలి. మన blood, మన head, మన good, అన్నీ కూడా తల్లిదండ్రుల భిక్ష. వారిని గౌరవించకపోతే? ఇతరులను గౌరవించడం ఎందుకు?

అహంకారాన్ని త్యజించండి -ఆత్మస్వరూపాన్ని దర్శించండి

మీరు ఎంత విద్యావంతులైనా సరే, మీరు సేవచేయకపోతే అహంకారం తొలగదు. అహంకారం ఉన్నంత కాలం మీరు ఆత్మతత్వాన్ని గ్రహించలేరు. "నాది" అనే భావన, "నేను" అనే భావన ఇవే అహంకారము, మమకారమూ. ఇవి లేకపోతే మీరు నిజమైన మానవులవుతారు.

మీరు శరీరమా? మనస్సా? బుద్ధియా? చేతనా? ఇవన్నీ పరికరాలే. మీరు ఆత్మ! ఆత్మలో అహంకారం ఉండదు. అది నిర్మలమైన ప్రేమ! అదే మీరు.

మీ లోపలే శాంతి -మీలోనే సత్యం -మీరే భగవంతుడు

మీరు శాంతిని వెలుపల వెతుకుతున్నారు, కానీ మీరు శాంత స్వరూపులే! మీరు సత్యాన్ని వెలుపల వెతుకుతున్నారు, కానీ మీరు సత్య స్వరూపులే! మీరు భగవంతుణ్ణి వెలుపల వెతుకుతున్నారు, కానీ మీరే భగవంతుడు. ఈ నిజాన్ని గ్రహించండి. అప్పుడు అహంకారం ఉండదు. లోపల ప్రేమను పెంచుకోండి.

సేవే ఆత్మబలానికి ఆధారం

మానవుడు జీవితంలో అన్నం తినటానికి సమయం కేటాయిస్తాడు. అలాగే సేవ కూడా "ఆత్మకు ఆహారం" లాంటిదే. సేవ చేస్తే మనలో శక్తి పెరుగుతుంది. పట్టణంలోనైనా, గ్రామంలోనైనా, వీధిలోనైనా, ఎక్కడ అవసరం ఉన్నా, అక్కడ సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలి.

మీతో ఎవ్వరూ లేకపోతే, ఒంటరిగా మొదలుపెట్టండి. తదనంతరం ఇతరులు చేరతారు. ప్రతి యువకుడు సేవా మార్గాన్ని అనుసరించాలి. పెద్దలు చెప్తున్నారంటే తప్పుకాదు. కానీ యువత ఎదుగుతున్న తరం, దేశానికి వారే మార్గదర్శకులు.

మీ పిల్లలు, మనవళ్లు మీ గురించి గర్వపడేలా సేవ చేయండి. మీ తరువాతి తరాలకు సంపద కాదు, మంచి పేరు ఇచ్చి వెళ్ళండి. దానికే స్థిరత్వం ఉంది. డబ్బు, భూములు, ఇండ్లు తాత్కాలికమే. సత్యం మరియు మంచి పేరు శాశ్వతం.

సేవ మనిషిని దైవత్వానికి దగ్గర చేస్తుంది

ఈ ప్రపంచంలో మీరు ఎంత గొప్ప చదువులు చదివినా, ఎంత ఉన్నతమైన పదవుల్లో ఉన్నా, సేవ లేకపోతే అంతా వ్యర్థమే. మనిషిని మానవునిగా మార్చేది ప్రేమ. దాన్ని కార్యరూపంలో చూపించేది సేవ. అందుకే నేనెప్పుడూ చెబుతున్నాను

"Help Ever, Hurt Never" (ఎప్పుడూ సాయం చేయండి – ఎవరికి హాని కలిగించ వద్దు)

ఇది మానవత్వానికి మూల సూత్రం. ఇది మరిచిపోకండి. మీరు ఎవరికి చిన్న నష్టం చేసినా అది మీకే తిరిగి వస్తుంది. ఇది "Reaction -Resound" అనేది ప్రకృతి ధర్మం. మీరు పంచింది మీకే తిరిగి వస్తుంది. అది ప్రేమ అయినా సరే, ద్వేషమైనా సరే.

మీలో దైవత్వాన్ని పెంపొందింప చేయండి

ఒక చెట్టు లోపల విత్తనం దాగి ఉంది. దానిని మీరు గమనించలేరు. కానీ విత్తనమే చెట్టుకి మూలం. అలాగే మీ శరీరంలో దాగిన దైవత్వం మీరు చూడలేరు. కానీ అదే లేకపోతే మీరు ఈ శరీరాన్ని తీసుకోలేరు.

ఇది ఎలా తెలుసుకోవాలి? సద్బుద్ధి ద్వారా, సత్సంగ ద్వారా, సేవ ద్వారా, ప్రేమపూరిత మృదువైన వాక్యాల ద్వారా, శ్రద్ధతో చేసిన కార్యాచరణ ద్వారా... అప్పుడే మనలో ఉన్న దైవతత్వం బయటకు వస్తుంది. దాని కోసం దేవాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మీ హృదయమే దేవాలయం. మీరు చేసే సేవే దైవారాధన.

గ్రామసేవ – దైవసేవ

మీరు గ్రామాల్లోకి వెళుతున్నప్పుడు, మిమ్మల్ని వారు అభినందించాలి, ఆశీర్వదించాలి. "ఈ యువకులు వచ్చారు, వారు మాకు ప్రేమను ఇచ్చారు, సేవను అందించారు" అని వారంతా అనాలి. అది నిజమైన పూజ.

మీరు వారికి ఏమిచ్చారు అంటే, మీరు ప్రేమను ఇచ్చారు. ప్రేమంటేనే భగవంతుడు. అందుకే నేను చెబుతుంటాను: Love is God, live in Love (ప్రేమయే దేవుడు –ప్రేమలో జీవించండి)

మీరు ప్రేమతో చేసిన ప్రతి పనిలో భగవంతుడు ఉంటాడు. మీరు ఎవరికైనా సేవ చేస్తే, ఆ సేవను స్వీకరించేది భగవంతుడే. మీరు ఒక పేదవాడికి మందులు ఇవ్వగలిగితే అది నరసింహరూపుడికి చేసిన సేవే. మీరు ఒక ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టగలిగితే అది అన్నపూర్ణామాతకి సమర్పించిన నైవేద్యమే.

సర్వదేవతా స్వరూపమైన మానవుడు

శరీరంలో అందరు దేవతలు ఉన్నారు:

వాగ్దేవత నాలుకలో ఉంది
విఘ్నేశ్వరుడు చేతులలో
సూర్యచంద్రులు కళ్లలో
వాయుదేవుడు శ్వాసలో
అగ్ని హృదయంలో

విష్ణువు కడుపులో
శివుడు శిరస్సులో
శక్తి నాడుల్లో

అంతటి మహిమాన్వితమైన శరీరాన్ని మనం దుర్వినియోగం చేయకూడదు. దానిని సేవకు సాధనంగా మార్చాలి. ఇది శరీర దానం కాదు, ఇది శక్తిదానం! ఇది కర్తవ్య మార్గం.

నివాసులు కాదు -సేవావసులు కావాలి

ఇవాల్టి యువతీ, యువకులు దేశంలో భద్రత కోసం బయటకి పోతున్నారు, కానీ గ్రామాల్లో భద్రత కోసం ఎదురు చూస్తున్నారు. మీరు విద్యతో, వినయంతో, ప్రేమతో, నిస్వార్థంతో గ్రామాలలోకి వెళితే, గ్రామాలే పునీతమవుతాయి. మీరు నివసించేవాళ్లు కాదు, సేవ చేసేవాళ్లు కావాలి. Not residents… but, sevaks. మీ జీవితం ఓ సందేశంగా మారాలి. మీరు మాట్లాడే ఒక్క మాట, మీరు ఇచ్చే ఒక్క చిరునవ్వు, మీరు పట్టే ఒక్క చేయి... వంద మందికి ఆశను, ధైర్యాన్ని, శాంతిని ఇవ్వగలగాలి. అదే మీ జీవితం విజయవంతమైనదన్న దానికి నిదర్శనం.

ఉపసంహారం:

ఈరోజు ఈ ఉపన్యాసం ద్వారా నేను మీకు చెప్పదలచుకున్నది ఒక్కటే: సేవే జీవితం. సేవే మార్గం. సేవే ముక్తి. మీరు ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా, ఎవరిచేతైన సేవను వాళ్ళు ప్రేమతో చేయండి. అది చాలు. మీరు సేవ చేస్తున్నంతకాలం... భగవంతుడు మీతో ఉంటాడు. మీరు ప్రేమ పంచుతున్నంతకాలం ప్రపంచానికి మీరు వెలుగవుతారు.

50

GRAMA SEVA – పరమార్థం!

మిత్రులారా! "గ్రామ సేవయే – సాయి సేవ" ఉద్యమము, ఒక జీవిత కాలపు ప్రభావాన్ని మా అందరి మీద చూపించింది... ఇది సత్యం. ఈ తారక మంత్రం వలన సత్య సాయి సంస్థలలో ప్రపంచ వ్యాప్తంగా కొన్ని వందల, వేల మందికి దిశానిర్దేశం జరిగింది. ఆ కారణం చేతనే, నేను ఈ "గ్రామ సేవ" నేపథ్యంగా చాలా వ్యాసాలు వ్రాస్తున్నాను. నాలుగైదు భాగాలుగా "సాయి సేవా" ప్రస్థానం గురించి నేను ముచ్చటించే ప్రయత్నం చేస్తున్నాను. ఈ విషయాలు నేను స్మరించు కోకపోతే తప్పు చేసిన వాడినవుతానని నా బాధ.

స్వామి వారు సెప్టెంబర్ 29, 1996 ప్రశాంతి నిలయంలో గ్రామ సేవయే – సాయిసేవ నినాదంతో తాను అక్కున చేర్చుకున్న భాగ్యనగర యువజనులకు... అనుగ్రహ సూచకముగా ఇచ్చిన దర్శన, స్పర్శన, సంభాషణ, పాదనమస్కార, ప్రసాద భాగ్యములు, యువజనుల యొక్క జీవితాలన్నిటినీ మార్చివేశాయి, సంస్కరింప చేశాయి అనడంలో ఎట్టి సందేహము లేదు.

ప్రప్రథమ గ్రామ సేవ యాత్రను దిగ్విజయముగా ముగించుకొని, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత ఎన్నో అద్భుతమైన విషయాలు, విశేషాలు జరిగాయి. ప్రధానంగా అప్పటిదాకా అంటి అంటనట్టుగా, వినీ విన్నట్టుగా, చూసి చూడనట్టుగా, ఉన్న పెద్దలూ మరియు సత్యసాయి సేవా సంస్థలూ... హైదరాబాదులోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సత్యసాయి కేంద్రాలన్నీ కూడా... మమ్ములను, వారి సమాజములకి, సంస్థలకి, కేంద్రాలకి ఆహ్వానించడం ప్రారంభించారు. స్వామి ఇచ్చిన సందేశాన్ని మళ్లీ మననం చేసుకునే అవకాశం ఇవ్వడం చాలా విశేషంగా తలచి మేమంతా స్వామి సేవలను గురించి అన్ని చోట్లా ముచ్చటించే వాళ్లము.

నాకు గుర్తున్నంత వరకు మెహదీపట్నంలో ఉన్న వివేకానంద కమ్యూనిటీ హాల్, అక్కడ... మొదటిసారిగా, "గ్రామ సేవయే – సాయి సేవ" విజయ యాత్రని మేము అందరం చేరి సంబరంగా చేసుకున్నాం. ఆ సందర్భంలో అతిథిగా, పిడతల సీతాపతి IAS Retd., వచ్చాను. ఎంతో ఖ్యాతి

గల వ్యక్తిత్వం. పూర్వ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు మరియు గవర్నర్ శ్రీ కృష్ణకాంత్ గారి పేషీలో సేవలందించారు.

కొంతకాలం స్వామి దగ్గర పుట్టపర్తి, ప్రశాంతి నిలయంలో సేవలు నిర్వహించారు. అలాగే ఆయన, హైదరాబాద్ బృందానికి చెందిన సీనియర్ బ్రదర్స్‌లో ఒకరైన పిడతల గోపీ కృష్ణ తండ్రి.

ఇక ఆ సందర్భంగా అక్కడ హాజరైన అనేకమంది భక్తులు, పెద్దలు, సంస్థల నిర్వాహకులు మన సోదరుల మాటలను, అనుభవాలను చాలా సేపు చెవులార్చుకుంటూ ఎంతో ఆసక్తిగా విన్నారు. అన్నీ విన్న తరవాత అతిథిగా వచ్చిన సీతాపతి హృదయ పూర్వకంగా మాట్లాడే ప్రయత్నం చేశారు. మిత్రులారా "గ్రామ సేవయే – సాయి సేవ" అనే తెలుగు పదాలని తారక మంత్రాలుగా చేసుకున్న మేము, నిజానికి గ్రామ సేవ నాలుగు అక్షరాలు, సాయి సేవ నాలుగు అక్షరాలను అప్పటి దాకా తెలుగులోనే మాట్లాడుకున్నాం.

కానీ, సీతాపతి గారు అద్భుతమైన రీతిలో ఆంగ్ల అక్షరాలని ఆధారంగా చేసుకుని "GRAMA SEVA" (గ్రామ సేవ) బీజాక్షరాలని మాకు ఆ రోజు అందించారు అని చెప్పుకోవాలి. కారణం ఒక్కొక్క అక్షరాన్ని వారు వివరిస్తూ సేవకు అనుసంధానిస్తూ స్వామి సందేశాలను జోడిస్తూ... సోదాహరణాలతో ప్రసంగం చేశారు. హైదరాబాదు యువత గ్రామాలలో చేసిన కార్యక్రమాలను నేపథ్యంగా తీసుకొని, ప్రతి అక్షరానికి ఒక అద్భుతమైన ఆదర్శాన్ని ఆపాదింప చేశారు. ఆ బీజాక్షరములను ఈ వ్యాసం ద్వారా అందరికీ అందించాలని ప్రయత్నం చేస్తున్నాను.

ఈ సందర్భంగా కీ॥శే॥ శ్రీమాన్ పిడతల సీతాపతి గారికి శిరము వంచి అభివాదం చేస్తున్నాను. ఆచంద్రతారార్కం నిలిచిపోయే గాయత్రి మంత్రంలా, గ్రామ సేవ మంత్రాన్ని మాకు ఉపదేశించి నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. GRAMA SEVA తొమ్మిది అక్షరాలకు వారు ఇచ్చిన అద్భుతమైన వివరణ మా గుండెల్లో నిండిపోయింది. నిజానికి గ్రామసేవ గురించి స్వామి వారు ఎన్నో సందర్భాలలో చెప్పిన విశేషాలను క్లుప్తంగా ఈ అక్షరాలలో ప్రకటించారు. ఇది ఒక అద్భుతం! ఆ కాలం, ఈ కాలం కాదు, ఏ కాలంలో అయినా గ్రామాలలో సేవలు చేసే వారు చేయాల్సిన పనులు ఇవే అని ఘంటాపదంగా చెప్పచ్చు. ఆ మంత్రక్షరాలను... వాటి అర్థాన్ని ఇక్కడ మనము తెలుసుకుందాం.

G - Glory of the Lord

గ్రామాలకు వెళ్లేది దేవుడి యొక్క దివ్యత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పడం కోసమే కదా. గ్లోరీ అంటే దివ్య వైభవం – ప్రభావం. వారి దివ్య సందేశాన్ని, దివ్య నామాన్ని, దివ్య మహిమలని యావత్ జాతికి మనం అందించాలి అనేదే ఆలోచనగా చేసుకోవాలి అని చెప్పడం జరిగింది. గ్రామ సంకీర్తన, పల్లకి ఉత్సవం, భజనలు, పాటలు, హరికథలు ఇలా ఇవన్నీ ఇందులోకి వస్తాయన్నమాట.

R - Rural Leadership

గ్రామీణ యువ నాయకత్వాన్ని సేవలో మనం ప్రోత్సహించాలి. గ్రామీణులు తమ పని తాము చేసుకునే విధంగా ఉత్సాహపరచాలి. గ్రామీణ నాయకత్వం ఎప్పుడైతే వస్తుందో... గ్రామ స్వరాజ్యం అప్పుడు వచ్చినట్టే. గాంధీ కలలు గన్న స్వరాజ్యము అప్పుడు వస్తుంది అనే విధంగా గ్రామాలలో యువజన చైతన్యాన్ని ప్రవహింప జేయాలి అనేది రెండో బీజాక్షరానికి అర్థం చెప్పారు. మేము ఎక్కడికి వెళ్లినా ఆ గ్రామంలో నివసించే యువతతో మాట్లాడి సేవలో వారిని భాగం చేయడం

ద్వారా స్వయం శక్తిని వారిలో ప్రేరేపించడం ఒక లక్ష్యంగా పెట్టుకున్నాము. లేదంటే మనమే వెళ్లి చేసి వస్తే, గ్రామస్తులు చోద్యం చూస్తారు తప్ప ప్రయోజనం లేదు.

A - Animal Husbandry

భూతదయని మనం పాటించాలి అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ యూత్ అంతాకూడా గ్రామాలలో పశు వైద్య శిబిర నిర్వహణ చేయడము అనేది ఒక అద్భుతమైన విషయం. ఇది మూడవ మంత్రంగా వారు తీసుకొచ్చారు.

M - Medical Camp

కేవలం పశువులకు మాత్రమే కాదు మనుషులకు కూడా వైద్య సహాయం అందించాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వారి నుండి మానసిక శారీరక భౌతిక రుగ్మతలను దూరం చేసి ఆధ్యాత్మిక జీవన శైలిని కల్పించాలి అన్న దివ్య సందేశాన్ని వారు ఇందులో వివరించారు.

A - Agricultural Services

వ్యవసాయాన్ని ప్రధానంగా మనం భుజాల మీదకి ఎత్తుకునే విధంగా గ్రామాల్లో సేవలు చేయాలి. రైతులతో మాట్లాడాలి, రైతుసభలు చేయాలి, రైతులకు అవగాహన కల్పించాలి. రైతులకు ఎలాంటి పంటలు వేయాలో తెలియజేయాలి. ఇలాంటి విషయాల మీద మనం ప్రధానంగా పని చేసున్నం కాబట్టి సేవ చేస్తున్నాము కాబట్టి, వారు Agriculture Best Practices గురించి వివరించాలని చెప్పినారు. నిజానికి హైదరాబాద్ యూత్ గ్రామాలలో ఇలాంటి పనులే చేస్తున్నారు. వారి మాటలకు నేపథ్యం ఇదియే!

S - Service

భౌతిక సేవ చెయ్యాలి. అంటే కేవలం మాటలతో ఆటలతో పాటలతో కాదు, గ్రామాలలో నడుం బిగించి శరీరాన్ని స్వేదంతో నిండేలా సేవలో నిమగ్నం చేయాలి. ఇట్టి విశేషమైన ఆదర్శాన్ని వారు S అనే అక్షరం ద్వారా మాకు వివరించారు. హైదరాబాద్ యువకులు గ్రామాలలో చాలా ఆదర్శవంతంగా చేశారు. ఈ సేవ అని చెప్పాలి. చిన్నా చితకా పనులు కాదు... ఒకటి లేక రెండు రోజుల్లో... గ్రామాల్లో రోడ్డు వేశారు... బావుల పూడిక తీసారు... వరదతో కొట్టుకు పోయిన కాలువ బాగు చేశారు... కొండల్లో బండలు కొట్టి నారు, చెరువుల పూడిక తీశారు, అడవిలో కట్టెలు కొట్టినారు, ఇళ్లు కట్టినారు... బస్ షెల్టర్లు కట్టినారు! ఇలా సామాన్యులు ఎవ్వరూ కూడా తలవని తలపెట్టని పనులు స్వామి నామాన్ని గుండెల్లో నింపుకుని చేసేవారు. ఈ నాటికి కూడా అలనాటి హైదరాబాద్ యువకులకు (30 ఏళ్ల తరవాత) ప్రస్తుతం వయసు 60 అనుకుంటే ఇప్పుడు కూడా వాళ్లు అదే స్ఫూర్తితోనే పని చేస్తున్నారు.

E - Educational Activities

గ్రామీణ యువతకి మార్గదర్శనం చేయాలి. బాలబాలికలకి అద్భుతమైన మానవతా విలువలు అందించాలి. అక్కడ ఉన్న బీద, సాదా, యువతీ, యువకులు, వృద్ధులు, పెద్దలు, పిల్లలు ఎవరైనా

సరే వయసుతో సంబంధం లేకుండా వాళ్లకి లౌకిక మరియు అలౌకిక విద్య మీద అవగాహన కల్పించాలి. జీవిత సత్యాలను, జీవిత నైపుణ్యాలను, గుర్తు చేయాలి అనే ఆలోచనను వారు చెప్పారు.

V - Value based Activities

నిజానికి గ్రామాలలో మనం చూస్తున్న దుర్వ్యసనాలకు... దుర్మార్గాలకు కారణం వాళ్లలో దిగజారి పోతున్న విలువలే. సో, వాళ్లకు విలువలు నేర్పించాలి. విలువలతో కూడిన జీవన విధానాన్ని నిరూపించాలన్న ఆలోచనని వారు ఆ పదంలో చెప్పారు. మేము చేస్తున్న గ్రామీణ బాలవికాస్, ఈ అక్షరాలలో వివరించిన విలువలను ఆచరిస్తే ఏమొస్తుంది అంటే ఆనందం లభిస్తుంది.

A - Attaining Ananda

హృదయాలలో ఆనందము నిండుతుంది. మన ఆ ఆనందమే స్వామి హృదయాన్ని సైతం కదిలిస్తుంది, స్వామిని కరిగిస్తుంది, స్వామిని మనతో మాట్లాడింప చేస్తుంది, స్వామి అనుగ్రహమునకు పాత్రులను చేయిస్తుంది. ఇలాంటి అక్షరార్థములను... ఆలోచనలను వారు చెప్పినప్పుడు, మేము అవక్కయ్యాము అంటే ఆశ్చర్యం లేదు.

అబ్బా! 'గ్రామ సేవయే – సాయి సేవ' తెలుగులోనే కాదు, 'GRAMA SEVA' అనే ఆ తొమ్మిది అక్షరాలలో కూడా అద్భుతమైన విలువలు, అద్భుతమైన స్వామి సందేశము నిండి ఉన్నదే... అని ఆ రోజు మేము చాలా ఉప్పొంగిపోయాము. తదాదిగా "గ్రామ సేవ" అన్నదే మేము మంత్రంగా తీసుకొని, గ్రామసేవ అక్రోనియంని మేము చక్కగా అన్ని కరపత్రాలలో, స్వామి ఫోటోల వెనక ముద్రించి, విభూది – ప్రసాదంతో పాటు వీటిని జత చేసి గ్రామ సేవ మంత్రాన్ని తారక మంత్రంగా చేసి, ఈ బీజాక్షరాలని యావదాంధ్ర యువజనులందరికీ కూడా అందించే ప్రయత్నం చేశాము. ఈ గ్రామ సేవా మంత్రం రాష్ట్రం, దేశం ఎల్లలు దాటి విదేశాలకు కూడా చేరింది.

నిజానికి స్వామిని కదిలించిన గ్రామ సేవ ఉద్యమం ఆ చంద్రతారార్కం నిలిచిపోయేలా ఉండాలి అని మా అందరి తపన. కేవలం పదేళ్లో, పాతికేళ్లో కాదు, తర తరాల వాళ్లు కూడా దాన్ని భుజస్కంధాల మీద వేసుకొని గ్రామ సేవయే సాయిసేవ నినాదాన్ని నాలుగు దిక్కులా, దిశ దశల, దశ దిశల చాటి చెప్పే విధంగా తీసుకెళ్లాలి. ఇలాంటి ఆలోచనతో ఈ విషయాలు నేను చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. మిత్రులారా స్వామి నిర్దేశించిన గ్రామ సేవలో ఆదర్శం చాలా ఉంది అని మేము గ్రహించాము. నిజానికి కేవలం ఈ ఐదు ఆరు గ్రామాలలో చేసిన సేవ గ్రామ సేవ కాదు, కానీ దాన్ని నేపథ్యంగా తీసుకొని, శ్రీ సత్య సాయి భగవానుడు ఒక శంఖారావము చేసి యావత్ జాతిని మేల్కొలిపినారు. దానికి స్వామి మమ్మల్ని తమ సాధనలుగా చేసుకున్నారు.

ఈ సందర్భంగా, గ్రామసేవ మహోద్యమానికి ఊపిరిలూదిన పెద్దలు, చిన్నలు, యువతీ యువకులు, శ్రేయోభిలాషులు, దాతలు, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు, సత్యసాయి సేవా సంస్థ నాయకులు... అందరికీ శిరము వంచి అభివాదం చేస్తూ, ఈ అద్భుతమైన ప్రస్థానంలో మా తోడునీడగా ఉండి నడిపించిన మన అందరి స్వామికి జే జే లు పలుకుతున్నాను. అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అన్న ఆలోచనతో ప్రార్థన చేస్తున్నాను.

51

YC.. Yearning to see Swami in Seva

2003వ సంవత్సరంలో స్వామి దివ్య సన్నిధిలో "అఖిలాంధ్ర సత్యసాయి యువజన సమ్మేళనము" ఏర్పాటు చేసుకున్నాం. సుమారు 6000 మంది యువజనులు, ఆంధ్రదేశంలోని 23 జిల్లాల నుంచి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. ఎంతో దయతో స్వామి తన ప్రేమని, అనురాగాన్ని, వాత్సల్యాన్ని, అనుగ్రహాన్ని వర్షంలాగా, ధారాపాతంగా కురిపిస్తున్న మధురమైన రోజులు అవి. సుమారు మూడు నాలుగు రోజుల పాటు అద్భుతమైన కార్యక్రమాలు చేసుకున్నాము. అందులో ఒక రోజు బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సత్యసాయి యువజన సమ్మేళనంలో, సత్యసాయి గ్రామసేవ మహాయజ్ఞంలో పాల్గొన్న వాళ్లందరినీ కూడా తమ దివ్య సందేశంతో అనుగ్రహించాలని స్వామి వారు సంకల్పం చేశారు. అందులో భాగంగా ముందు రోజు స్వామి మా బృందంతో మాట్లాడుతూ రేపు మీటింగ్‌లో ఎవరైనా మాట్లాడండి అని సూచించారు. వెంటనే పెద్దవాళ్లందరూ కూడా చేరి ఎవరు మాట్లాడితే బాగుంటుందని చర్చించారు. స్వామి దగ్గర మాట్లాడడం కాబట్టి, ప్రోటోకాల్ ప్రకారం సాయి సంస్థల ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు Dr అంజనయ్య మాట్లాడతారు అని నిర్ణయించారు. ఇక అక్కడ జరిగే యువజన సమ్మేళనానికి ముందుండి నడిపిస్తున్న ప్రముఖ యువకులలో ఉన్న YC మాట్లాడతారు అనుకున్నారు. అందులోనూ, YC స్వామికి బాగా తెలిసిన అబ్బాయి, స్వామి ప్రేమను అందుకున్న పిల్లాడు అని అందరూ అనుకుని నిర్ణయించారు.

అయితే బృందంలో ఉన్న వాళ్లు చాలా మంది నన్ను చూస్తూ... అరే నువ్వు మాట్లాడితే బాగుంటుంది కదా అన్నారు. నాకు ఎంతో ఉత్సాహం వచ్చింది. స్వామి సన్నిధిలో మాట్లాడే అవకాశం వస్తే ఎవరికైనా ఉత్సాహమే కదా! ఆంధ్ర రాష్ట్రంలోని 23 జిల్లాల్లో స్వామి ఆదేశాల మేరకు పర్యటించే సమయంలో గ్రామ సేవలలో ప్రధానంగా మాట్లాడిన అతి కొద్ది మందిలో నేను ఉన్నాను. నాతో పాటుగా YC, గోపి లేదా మరి కొద్ది మంది మాట్లాడేవారు. ఎవరున్నా లేకున్నా నాకు మాత్రం తప్పక మాట్లాడే అవకాశం అన్ని సభలలో స్వామి ఇచ్చారు.

YC కూడా, అరే! నువ్వు కూడా మాట్లాడితే బాగుంటుంది అని చెప్పాడు. కానీ పెద్దలు అందరూ స్వామి ఒక్కరే మాట్లాడాలి అని అన్నారు. కాబట్టి YCనే మాట్లాడుతాడు అని చెప్పారు. ఇక నేను దిగులుగా, అయ్యో! నాకు బంగారు అవకాశం తప్పి పోయిందే అనుకుంటూ గదికి వెళ్లి భాదతో పడుకొని ఏడుస్తూ ఉండి పోయాను. మరో ప్రక్క, రాత్రంతా కూడా పెద్దలు, యువకులు చాలా సేపు చర్చలు జరిపారని తరవాత తెలిసింది. మధ్య రాత్రి అనుకుంటాను, YC నా దగ్గరికి వచ్చి నన్ను లేపి, అరేయ్ నువ్వు కూడా స్వామి ముందు మాట్లాడాలి, సిద్ధంగా ఉండు. నువ్వు నేను ఇద్దరం మాట్లాడతాము అని చెప్పాడు. నాకు నిజంగా ఎంతో ఆశ్చర్యం అయింది. నన్ను నేను నమ్మలేక పోయాను.

తర్వాత ఎవరో చెప్పారు నాకు. it looks like YC stood by the cause of me speaking in front of Swamy. ఈ రాష్ట్రంలో ఎవడైనా స్వామి సన్నిధిలో, ఈ క్షణంలో, ఈ యొక్క సందర్భంలో మాట్లాడాలి అంటే అది బాలా ఒక్కడే. నిజానికి నాకంటే కూడా బాలా మాట్లాడితే బాగుంటుంది అని చెప్పాడంట అందరి ముందు. ఇలా విన్నప్పుడు నాకు మాటలు రాలేదు. అంటే ఒక నిజమైన నాయకుడు ఎలా ఆలోచిస్తాడు అనేది తెలిసింది, సామాన్యంగా స్వామి సన్నిధిలో మాట్లాడే అవకాశం వస్తే, ఎవరైనా సరే ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తారు కానీ, YCకి మాత్రమే తనకు ఉన్న అవకాశాన్ని ప్రేమతో నాకు కూడా పంచడం అనేది చాలా అరుదైన విషయం.

సాయి కుల్వంత్ సభా మంటపంలో సమావేశం ఏర్పాటు చేశారు మేమందరము నిలయంలో వేదిక మీద ఉన్న స్వామి సింహాసనం ముందు ప్రాంగణంలో కూర్చుంటే, ఆ నాటి సమావేశంలో స్వామి కంటే ముందుగా మాట్లాడ బోయే వాళ్ల పేర్లు ముగ్గురివీ కాగితం మీద వ్రాసి అందించారు. ఆ పేర్లు చదివి, మూడో పేరు చూసి... వేదిక మీద సింహాసనంలో కూర్చున్న స్వామి... ఎదురుగా మొదటి వరుసలో కూర్చున్న YCని చూస్తూ... మూడో వాడు ఎవరు అని చేతి వేళ్లతో 3 అంకె చూపిస్తూ సైగల ద్వారా అడిగారు. నేను YC ప్రక్కనే కూర్చుని ఉన్నాను కదా! వాడు ఇలా తన వేలు నావైపు చూపించి, ఇతను అన్నట్లు సైగల ద్వారానే విన్నవించాడు. స్వామి నా వైపు చూశారు. నేను ఎంతో వినయంగా స్వామికి చేతులు జోడించి నమస్కరించాను. స్వామి, తన కుడి చేయి ఎత్తి మంచిది అన్నట్లు సైగ చేశారు. అలా నన్ను స్వామికి మౌనంగానే పరిచయం చేశాడు YC.

నాకు తెలుసు, స్వామి దివ్య సన్నిధిలో ప్రసంగించ బోవడమన్నది ఎంతటి అరుదైన అవకాశమో ఇన్నేళ్లు గడిచినా జరిగింది కలనా నిజమా అన్నది ఇంకా అర్థం కాలేదు. కల లాంటి ఆ దృశ్యాన్ని సాకారం చేసింది YC.

ఎంతైనా శ్రీనివాస్ అంటే స్వామికి చాలా ఇష్టం అనుకుంటాను. ఎందుకంటే ఒక శ్రీనివాస్ కాదండి, సత్యసాయి సంస్థలలో చాలా మంది స్వామి అనుగ్రహానికి పాత్రులైన శ్రీనివాసుళ్లు ఇంకా ఉన్నారు. మీ అందరికీ తెలుసును కదా శ్రీనివాసులు స్వామి దగ్గర పాడతారు, V శ్రీనివాసన్ అఖిల భారత సత్య సాయి సంస్థల పూర్వ అధ్యక్షులు మరియు సత్య సాయి కేంద్ర సంస్థ ధర్మాధికారి, బాగేపల్లి శ్రీనివాసరెడ్డి, బెంగళూరు శ్రీనివాస మూర్తి, సి శ్రీనివాస్, హైదరాబాద్ సాయి సంస్థల శ్రీనివాసులు హుగ్గుహల్లి... ఇలా చూస్తే ఎంతోమంది శ్రీనివాసుళ్లు ఉన్నారు. వీళ్లందరిని చూస్తే శ్రీనివాస్ పేరంటేనే స్వామికి ఇష్టమేమో అనిపిస్తుంది.

YC... Y శ్రీనివాస్!!

స్వామియే తీర్చిదిద్దిన ఆరడుగుల శిల్పము
స్వామిపై భక్తికి తను నిలువెత్తు నిదర్శనము
స్వాభిమానమును నిలువెల్లా నిలిపినాడు
గుండెలో గుడి కట్టి స్వామిని ప్రతిష్టించాడు
శ్రీనివాసంటే స్వామికి చాలా ఇష్టమైనవాడు

శ్రీనివాస్ అంటేనే అచంచల విశ్వాసము
దర్శనంలో శ్రీనివాసుంటే ఇక చాలును
ఎక్కడ కూర్చున్నా ఏ మూలన కూర్చున్నా..
స్వామి మాట్లాడటం నా కళ్లతో చూశాను
శ్రీనివాసంటే స్వామికి చాలా ఇష్టమైనవాడు

స్వామి మన హృదిలో ఉంటే గొప్ప కాదు
సాయి హృదయంలో మనముండాలి
స్వామికి ఆనందం కలిగించాలని యోచన
సాయిని సదా సంతోష పెట్టాలన్న తపన
శ్రీనివాసంటే స్వామికి చాలా ఇష్టమైనవాడు

ఇంటిని వదిలి... ఒంటిని మరిచి... ఎల్లెడలా కదిలాడు:

అబ్బా! ఒకసారి ఇల్లు వదిలాడు అంటే... ఇక ఇంటి మీదే కాదు ఒంటి మీద కూడా ధ్యాస ఉండదు. ఎక్కడ బ్రష్ చేస్తాడో, ఎక్కడ స్నానం చేస్తాడో, ఎక్కడ తింటాడో తెలియదు. కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నాడా అని ఆశ్చర్య పోవాల్సిందే. వాడు మార్కెటింగ్ జాబ్ చేసేవాడు. మార్కెటింగ్లో ఉండే పని తిరిగే పనే! కానీ ఆఫీస్ కోసం 100 కిలోమీటర్లు తిరిగితే. ఇక స్వామి కార్యం కోసం ఇంకో 100 కిలోమీటర్లు తిరిగేవాడు అనుకోండి. అలా సేవ చేసేవాడు.

వృత్తిని కాదని సేవనే తన ప్రవృత్తిగా మార్చినాడు:

అసలు ఒకటి ఏదైనా పట్టుకున్నాడంటే దానంతు చూసేవాడు. ఆ పని సాధించేందుకు ఎంత స్థాయికైనా వెళ్లి పోవడమే! అది ఏ పనైనా పర్వాలేదు, అది ఒక ఇన్సూరెన్స్ అయినా, ఫార్మా బిజినెస్ అయినా, కంప్యూటర్ బిజినెస్ అయినా, గ్రైన్స్ బిజినెస్ అయినా... ఏదైనా సరేనండి పట్టాడంటే నా సామి రంగా ఉన్నత శిఖరాలకు వెళ్లాల్సిందే! ఆశ్చర్యం ఏమంటే అంత ఎత్తుకు వెళ్లినప్పుడు కూడా అవసరం ఉంది అంటే, స్వామి పిలిచారు అంటే, ఇక స్వామి కార్యం కోసం ఆ స్థాయిని తృణప్రాయంగా తలచి, వెంట్రుక ప్రాయంగా ఎంచి అలా వదిలి వచ్చేసింది నేను చూశాను. ఈ త్యాగము సామాన్యమైన యోగము కాదు. ఈ రోజు నేను అన్నీ వదిలేసాను అంటే, ఇదిగో ఇలాంటి వాళ్లే వాళ్ళే కారణం. అరే, వీళ్లు అందరూ అమ్మా నాన్నా, ఇల్లు వాకిలి, ఇల్లాలు పిల్లలు, పనులు పాటలు ఇలా అన్నీ ఉండి కూడా స్వామి కోసం ఇంత చేస్తున్నారే... నాకు ఏముంది? నాకు ఇట్లాంటివి ఏమి లేవు కదా?

మరి నేను ఇంకా ఎంత సులభంగా నాకున్న ఒకటి రెండూ వదిలి సేవలో పాల్గొనాలి? ఇదిగో అందుకనే వదిలేసా! నా సామిరంగ, బ్రతికితే ఇదిగో ఇట్లా బ్రతకాలను కున్నాను.

సేవకోసం ఇల్లు వదిలితే... ఇక అమ్మ నాన్నకు కనిపించనే లేదు:

వాళ్ల అమ్మ నాన్న వాడి మీద ఎప్పుడో ఆశలు వదులుకున్నాము అని చెప్పడం నేను విన్నాను. అంతా స్వామే చూసుకుంటాడు అని చెప్పే వాళ్లు. స్వామి మాత్రం YC తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యుల మీద ఎంతో కరుణ చూపించేవారు. వారి బాగోగులు చూసే వారు. పుట్టపర్తికి వెళ్లిన ప్రతిసారి YC చేస్తున్న సేవలకు వాళ్లు ఎంతో సంతోషించేవారు. మా కనులార మేము చూశాము స్వామి ఎలా వారిని చూసే వారు, ఎంత కరుణ చూపించారు, ఎన్నెన్ని అద్భుతమైన అవకాశాలు వారికి ఇచ్చారన్నది అందరికీ తెలిసిన విషయమే! ఎంతైనా శ్రీనివాస్ అంటే స్వామికి ఇష్టమైన వాడని చెప్పాలి. స్వామి ఎంతలా ఆలోచించే వారంటే... YC సోదరి బాగోగులు చూశారు, వాడికి పెళ్లి సంబంధాలు చూశారు, వాడికి పెళ్లి నగలు బట్టలు పెట్టారు, వాడికి కొడుకు పుడితే వాడికి పేరు పెట్టారు. ఇదంతా చెప్పాలంటే మరొక పుస్తకం వ్రాయాల్సి వస్తుంది.

52

YC.. The Youth Co-Ordinator

YC ఎల్లప్పుడూ స్వామి భక్తి, సత్య సంధత, క్రమచర్యతో... నిర్భయ నిస్సంకోచ నిస్వార్థములతో కదిలే వాడు. స్వామి అంటే ఎంతో భక్తి వాడికి. నేను చెప్తున్నదంతా కూడా నేను స్వయంగా వాడి సహచర్యంలో చూసింది, అనుభవించింది మాత్రమే! అందులో ఇంతైనా, ఇసుమంతైనా ఎక్కువా తక్కువా లేదు. వాడికి స్వామి అంటే ఎంత భక్తి అంటే నేను వివరించలేనంత! YC అంటే నాకు జీవితకాలపు Youth Co-Ordinator అంటాను. అంత భక్తి YCలో నేను చూశాను.

సత్య సంధత:

స్వామి తనకు ఏమైనా చెప్తే, ఆ దర్శన సమయంలో ఎంతో ఓపికతో అందరికీ చెప్పేవాడు... లేనివి చెప్పడం వాడికి అలవాటు లేదు ఎవడైనా సరే అవతలి వైపు పొరపాటు చేస్తే ఆ పొరపాటును చెప్పడము, స్వామి ఒప్పంటే ఒప్పని చెప్పడమే తప్ప ముసుగులో గుద్దులాట అనేది వాడి వద్ద ఎప్పుడూ నేను చూడలేదు. అది నేను అతనిలో గమనించిన అసాధారణ లక్షణం.

ఒకవేళ ఏదన్నా బాధాకరమైన విషయాలు... చెప్పకూడని విషయాలు ఉంటే... ఎదుటి వాళ్ల మంచి కోసం గొంతులో పెట్టుకోవడమే తప్ప బయటకి చెప్పడం ఉండదు. ఇది ఒక నాయకుడికి ఉండాల్సిన లక్షణం అనిపిస్తుంది.

క్రమచర్య:

ఎంత క్రమశిక్షణ అంటే... ఒక ప్రక్క ఆఫీసు పని చూడాల్సిందే, ఇంకో ప్రక్క స్వామి కార్యంలో ఉండాల్సిందే, ఒక ప్రక్క భజనలో పాడాల్సిందే, మరో ప్రక్క సాంస్కృతిక కార్యక్రమాలు చేయాల్సిందే, ఒక ప్రక్క ఫార్మసీ చూసుకోవాల్సిందే, మరో ప్రక్క రిసోర్స్ మీద వర్క్ చేయాల్సిందే... ఇన్ని రకాల కార్యక్రమాలు 24 గంటలలో చేయడానికి ఒక వ్యక్తికి సాధ్యం అవుతుందా? అసలు ఎప్పుడు

పడుకుంటాడు? ఎప్పుడు లేస్తాడు? అసలు ఎప్పుడు చూసినా ట్రిమ్‌గా, శుభ్రంగా ఉంటాడు, శుభ్రమైన బట్టలు ఉంటాయి. స్వామి రోజూ మాట్లాడతాడు అన్నట్లే ఉండే వాడు. ఆ విధమైన ప్రవృత్తి, అంత క్రమశిక్షణ తనలో నేను చూశాను.

దార్శనికత:

మన సంస్థ ఇలా ఉండాలి. సత్యసాయి సంస్థలో భవిష్యత్ నాయకత్వం ఇట్లా ఉండాలి. ఒక్కొక్కడితో మనం మాట్లాడాలి. ఒక్కొక్కడితో వ్యక్తి గతంగా మనం స్నేహం చేయాలి. అందరికీ స్వామిని కనెక్ట్ చేయాలి. మనం ఈ రోజు ఉండొచ్చు, రేపు పోవచ్చు... మన ద్వారా స్వామి దగ్గరికి చేరిన వాళ్లను శాశ్వతంగా స్వామి సంస్థలో ఉండేలా చేయాలి, దిశా నిర్దేశం చేయాలి అన్న ఆలోచనలతో ఎల్లప్పుడూ తపించిపోయేవాడు. అలా సేవలో పాల్గొనే వాడు. మీరు నమ్ముతారో నమ్మరో, జిల్లా మరియు రాష్ట్ర అధ్యక్షులు ఎవరైనా సరే అందరికీ మార్గదర్శకత్వం, దిశా నిర్దేశం చేసేవాడు. దీనికి కారణం స్వామి వాడిని తీర్చి దిద్దిన విధానం! ప్రతి విషయంలో కూడా స్వామి, వాడికి ఎలా చేయాలి, ఏమి చేయాలి, ఎప్పుడు చేయాలి అన్నది గైడ్ చేసేవాడు.

భవిష్య నాయకత్వం మీద శ్రద్ధ:

ఈ రోజు తెలుగు రాష్ట్రాలలో సత్య సాయి సంస్థలలో ఎక్కడ చూసినా ఒక్కరో ఇద్దరో నాయకులు ఎక్కడన్నా ఉన్నారు అంటే ఏదో ఒక రకంగా వారికి హైదరాబాద్ యూత్‌తో అనుబంధం ఉండే ఉండటమో లేదా వారు YC లాంటి సోదరుల ఉత్సాహ ప్రోత్సాహములందుకుని ఉంటారు.

ప్రార్థనా మందిరాలు కాదు... సార్వజనిక సేవా మందిరాలు:

శివం ప్రాంగణంలో ఇలా ఉండాలి, ఇలా ఇక్కడికి వచ్చే వాళ్లు ముందుకు వెళ్లే విధంగా చేయాలి, శివం ప్రాంగణాన్ని మనం సిద్ధం చేసుకోవాలి, ఇక్కడ కేవలం Religious & Devotional కార్యక్రమాలు మాత్రమే కాదు: caste... cader... creed... colour... launguage... religion... region... reason... season... fusion... ఇలా ఏ బేధము లేకుండా సేవలు జరగాలని... భజన మందిరాలు అందరికీ ఉపయోగ పడే సేవా మందిరాలుగా తీర్చి దిద్ద బడాలని... మేమంతా ఎప్పుడు తపించే వాళ్లము... సదా ఆలోచన చేసే వాళ్లము. స్వామి వారి దగ్గరికి వెళ్లినప్పుడు, అవకాశం వచ్చినప్పుడు చెప్పుకునే వాళ్లం. ఆ విత్తనాలని శివం ప్రాంగణంలో చల్లే ప్రయత్నం చేసే వాళ్లం మేమంతా. శివంలో ఈ రోజు జరిగే ఎన్నో కార్యక్రమాలకు, శిక్షణా తరగతులకు, ఉపాధి మరియు నైపుణ్య తరగతులకు అనాడు చల్లిన విత్తనాలే మూలం అని చెప్పచ్చు, ఈ రోజులలో ఎక్కడైనా... ఏవైనా... సేవా కార్యక్రమాలు వైవిధ్యంగా జరుగుతున్నాయి అంటే... YC లా తపించే సాయి సైనికులే కారణంగా చెప్పాలి.

శోధించి సాధించే తీరు వాడిది సేవలో:

ఏదైనా సరే సాధించడం అంటే! నేనైతే తప్పకుండా YCని చూస్తాను. ఎక్కడైనా సవాళ్లు ఎదురైతే, డామేజ్ కంట్రోల్ చేయాల్సి వస్తే తను వెళ్లాల్సిందే! అన్ని చోట్ల మాట్లాడుతూ మెప్పులైనా, ఒప్పులైనా, తప్పులైనా, తన మీద రుద్దుకునేవాడు. ఎవరినైన మెప్పించి పని చేయించాలంటే అతనే... మనుషులు

కానీ, వనరులు కానీ సంపాదించాలి అంటే తనే కదిలే వాడు. ఎవరితో పని అవుతుంది అంటే వాళ్లను మొదట బృందంలో కలిపే వాడు. ఎవడినైనా చూసాడు, వాడు సంస్థకు పనికి వస్తాడు అనుకుంటే ఇక ఎంత కష్టమైనా సరే... ఎంత దూరమైనా సరే వెళ్లి వారిని పట్టుకుని వచ్చేవాడు. సంస్థకి, స్వామికి, సేవకి, వాడు నిరంతరంగా, అవిరామంగా, అవిశ్రాంతంగా ఎలా పని చేసేవాడో నేను కళ్లారా చూశాను. ఎందుకంటే నేను కూడా వాడి ద్వారా అలా పని చేసిన వాడినే కాబట్టి.

ఎంతో మందిని స్వామి కార్యములో ప్రోత్సహించాడు. హైదరాబాద్‌లో గాని, తెలంగాణలో గాని, ఆంధ్రదేశంలో గాని... ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా హైదరాబాద్ యూత్ ఈ రోజు స్వామి కార్యంలో ఉన్నారు అంటే... అందరూ కూడా YC లాంటి నిస్వార్థ సాయి సైనికులకు ఋణపడి ఉండాలి అనుకుంటా నేను.

సత్సంగముతో సాయి సైనికులని తీర్చాడు:

ఎన్ని సత్సంగాలండీ!? అబ్బా! తను హృదయం నుండి మాట్లాడితే చుట్టూ ఉన్నోళ్లు ప్రేరణ చెంది విని ఏడ్చేవారు! ఎంతో ఆరాధన భావంతో స్వామికి వెంటేనే కనెక్ట్ అయిపోయే వారు. ఇలా బ్రతికేలా స్వామి వాడికి మార్గ దర్శనం చేసేవారేమో అని అనుకునేవాళ్లం మేమంతా కూడా. తన నిద్రను సైతం మానుకుని... ఆఫీసు పని ముగించుకుని ఎవరో ఒకరి ఇంట్లో ఒక పది మందితో చేరే వాడు... అక్కడ నిద్రాహారం ఉందా లేదా అన్నది ఎవరికీ ఎప్పుడు పట్టలేదు సాయి సంగతులు... ముచ్చట్లు చెప్పుకుంటూ కడుపు నింపుకునే వాళ్లు. స్వామికి ఏమి ఇష్టం? ఏ విధంగా సేవలు చేసుకుందాం? మళ్లీ ఏమి చేద్దాం? ఏ విధంగా స్వామికి దగ్గరవుదాం... ఇవే విషయాలు! చర్చించుకునే వాళ్లు. ఇన్నో వందల మందిని సాయి కార్యానికి దగ్గర చేసింది ఈ సత్సంగములే! అని చెప్పక తప్పదు.

సత్యసాయి మార్గంలో ముందుండి నడిపాడు:

అంటే వెనకాల, పక్కన, బృందంలో కాదండీ. ఏ సమయం అయినా ముందుండి నడిపించే వాడు. నాకు బాగా గుర్తు, స్వామి మంగళ హారతి తీసుకొని, మేమంతా ఎంతో ఇష్టంగా ప్రిపేర్ అయ్యి స్వామి ముందు ప్రదర్శించాలి అనుకున్న డ్రామాను చూడకుండానే స్వామి వారు గదిలోకి వెళ్తూ ఉంటే అక్కడున్న పెద్దవాళ్లకి ఏం చెయ్యాలో తెలియక, YCని ముందుకు తోసి, నువ్వు చెప్పు అని చెప్తే... వాడు అయ్యో వందల మందికి నిరుత్సాహం అవుతుందన్న ఆదుర్దాతో చాలా ధైర్యంగా, చాలా విశ్వాసంతో స్వామి బ్యాటరీ కార్ దగ్గరికి వెళ్లి, "స్వామి డ్రామా చూస్తామన్నారుగా?" అంటూ విన్నవించడం మేమంతా చూశాము. అప్పుడు స్వామి ఆ!! అవును!! అవును!! అని, ఎంత సేపట్లో రెడీ చేస్తారు అంటూ... ఎంతో దయతో మళ్లీ కార్‌ను వెనక్కి తిప్పమని చెప్పి, వేదిక మీదకు రావడం చూశాము. ఇలాంటిది ఎప్పుడైనా ఎరుగుదుమా? మనం ఎక్కడైనా విన్నామా ఇట్లాంటి విషయము?

మంగళహారతి అయిన తర్వాత స్వామి బ్యాటరీ కార్‌లో వెనక్కి వచ్చి, మరొక సారి సింహాసనంలో కూర్చొని డ్రామా చూసి మళ్లీ మంగళహారతి తీసుకుని వెళ్లిన సందర్భం... అబ్బా! ఇలాంటి విషయాలు చెప్పాలంటే కొన్ని పేజీలు సరిపోవు.

YC నుంచి నేను నేర్చుకున్న పాఠాలు, విషయాలు, అద్భుతమైన చాతుర్యాలు... ఇవన్నీ

కూడా ఒక నాయకుడు ఎలా ఉండాలో తెలియ జేస్తాయి. ప్రతి మనిషిలో మానవ సహజమైన తప్పొప్పులు ఉంటాయి. ఏమున్నా లేకున్నా... ఎవరికైనా సరే! స్వామి మీద ఉండే భక్తి విశ్వాసములు, శ్రద్ధా భక్తులు మాత్రమే మనం గుర్తుంచుకోవాలి.

మంచి పని చేస్తున్నాము అంటే స్వామికి చెప్పాల్సిందే:

ఒకసారి వెస్ట్ గోదావరిలో అనుకుంటాను... కోయ గూడెంలో... కొండల్లో ఇళ్లు కట్టించమని ప్రతిపాదన వచ్చింది. దాన్ని చేపట్టాలని ప్రణాళికలను రచించి స్వామి దగ్గరకు తీసుకొస్తే, స్వామి ఆ ఫోటోలు, ఆ ప్రాంతం, అక్కడి మనుషులను చూసి స్వయంగా అడగడం మేము విన్నాము. "బంగారు! ఈ సేవ నాకు ఇవ్వు బంగారు... నేను చేసుకుంటాను, నేను చేస్తాను" ఇలా స్వామి అన్నారంటే ఆలోచించచండి. "స్వామి! మేము చేసుకుంటాము... మమ్మల్ని ఆశీర్వదించండి... మీరే కదా చేస్తున్నారు మా ద్వారా" అంటూ విన్నవించాడు YC.

స్వామికి మంచి పని చేస్తే ఎంత సంతోషము చూడండి. ఇట్లాంటి సంఘటనలకు మేమందరం సాక్ష్యంగా ఉండటం ఎంత అదృష్టము? ఇలాంటి బ్రదర్స్‌తో మేము చేరి స్వామి కార్యంలో జీవించడం అనేది ఎంతటి భాగ్యం? అని సదా తలుచుకుంటాను. నాకు ఇవన్నీ చెప్పుకోవడానికి ఏమీ నామోషిగా లేదు.

నేను YCని అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా సరే దళపతిగా, సేనాధిపతిగా, నాయకుడిగా, మార్గదర్శకుడుగా కో-ఆర్డినేటర్‌గా భావిస్తాను.

ఎంతైనా శ్రీనివాసంటే స్వామికి ఎంతో ఇష్టం
శ్రీనివాస్ స్థాయి సాయి హృదయ స్థాయి
సాయి సంస్థలకు తనలా సేవ చేస్తే హాయి
నిలిచిపోవునులే కీర్తి తప్పక చిరస్థాయి

"గ్రామ సేవయే - సాయి సేవ" బహిరంగ సభలో, స్వామి వారు చేసిన అనుగ్రహం భాషణం నాకు బాగా గుర్తు. "మీ అందరినీ తరతరాలు గుర్తుంచుకుంటారురా, మా నాన్నలు, తాతలు ఇలా గ్రామ సేవలు చేశారని మిమ్మల్ని మీ చిత్రాలను పెట్టుకొని మరీ తలుస్తారురా!" అన్న స్వామి మాటల ఎన్నడూ వృధా పోవు. YC లాంటి వాళ్లకి అది తప్పక వర్తిస్తుందని చెప్పుకుంటాను.

ఇలాంటి వ్యక్తుల గురించి నేను ఎందుకు చెప్తున్నాను అంటే... నేను ఎంత కాలం ఉంటానో, ఎంత కాలం ఇలా మాట్లాడ గలుగుతానో తెలియదు. నా శ్వాస ఆడే దాకా నేను తలుచుకోవాల్సిన వ్యక్తుల్ని తలచుకోవాలి... గుర్తుంచుకోవాల్సిన అనుభవాలని గుర్తుంచు కోవాలి... లేదంటే నేను జీవచ్ఛావంలా నిలిచిపోతాను. అందుకే నా ఆలోచనలను నేనిలా పంచుకుంటున్నాను. ఇది వ్రాస్తుంటే... గుండెలో ఉద్వేగం... హృదయంలో ఆనందం... కళ్లలో కన్నీళ్లు వస్తున్నాయి... ఎంతటి భాగ్యం ఇది? భగవానుడు భాగ్యనగర యువతకు ప్రసాదించాడు! అనుకుంటే హృదయంలో స్వామి మీద, సేవ మీద, ప్రేమ వేయింతలు అవుతుంది.



53

దాతృత్వం జీవితాన్ని పరిమళింప చేసింది

ఛారిటీ అన్నది జీవితానికి చార్మ్ ఇచ్చింది. నిస్వార్థ సేవా దృక్పథం నిలువెల్ల నిండిపోయింది. స్వామి ఒక భక్తుడిని ఎంపిక చేసే సమయంలో అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూస్తారని ఎవరో చెప్పారు. ఆ తరాలు అంతరాల యొక్క విషయం నాకు తెలీకపోవచ్చు. కానీ. ఈ తరంలో, ఈ జీవితంలో స్వామి ఏ విధంగా నన్ను చూసారో పరిశీలిస్తుంటే చాలా విశేషాలు నాకు కనిపిస్తున్నాయి.

పుట్టిన దగ్గర నుంచి ఇప్పటిదాకా ఎన్నో అనుభవాలు, అనుభూతులని స్వామి ఎంతో దయతో, ప్రేమతో నాకు అందించారు. పుట్టినది చాలా మధ్య తరగతి కుటుంబం. శ్రీమతి. రాజేశ్వరమ్మ శ్రీ సుంకుసాల రంగయ్య తల్లిదండ్రులు. చిన్నప్పటి నుంచి వాళ్లను దగ్గర్నుంచి చూసినప్పుడు, అప్పటి విశేషాలు సింహావలోకనం చేసుకుంటే వారు సదాచార సంపన్నులు అని తెలుస్తుంది. దైవ భక్తి, మంచి, మర్యాద ఉన్న కుటుంబం.

ఈ రోజు నేనిలా పద్యాలు, పాటలు, సంస్కృత శ్లోకాలు, సుభాషితాలు అలవోకగా చెప్తున్నానంటే కారణం అమ్మ ఉగ్గుపాలతో నేర్పించింది కావచ్చు, నాన్న ఇచ్చిన తర్ఫీదు ఇచ్చినది కావచ్చు. నాకు బాగా గుర్తు. చిన్నప్పుడు అమ్మగారు నేను కళ్లు నులుముకొని నిద్ర లేచే సమయానికి వంట ఇంట్లో అగ్ని దేవుడికి పూజించి దైవ నామ స్మరణంతో ఆ వంట చేసే ప్రయత్నంలో మునిగిపోయేది. అలాగే ఇంకో ప్రక్క నాన్న సంధ్యావందనము చేస్తూ చక్కటి గళంతో ప్రార్థనలు చేసే దృశ్యం కనిపించేది.

ఇంటికి ఎవరైనా వస్తే చేసే మర్యాద, వారిని స్వాగతం చెప్పే రీతి, ఆతిథ్యం ఇచ్చే పద్ధతి ఇవన్నీ నేను బాగా గమనించే వాడిని. తల్లి తండ్రులు ఎంత చక్కగా మాట్లాడుతున్నారు అని తలుచుకునే వాడిని. నాన్న అందరి తలలో నాలుక లాగా ఉండే వారు. వారు నిస్వార్థంగా ఆలోచిస్తూ, వచ్చిన ఎవరికైనా సరే సహాయ సహకారాలు అందించడం నన్ను బాగా ప్రభావితం చేసింది.

నాకు ఊహ తెలియని సమయంలో జరిగిన సంఘటన ఒకటి ఈ మధ్య కాలంలో మా అమ్మ చెప్తుంటే విన్నాను. నాకు నాలుగైదేళ్లు ఉన్న సమయంలో మేము మేడ పైన ఉన్న ఇంట్లో నివసించేవాళ్లం.

రాత్రి పూట మేమంతా కూడా డాబా మీద నిద్రపోయేవాళ్లము. నాన్న కోసం ఒక చెంబులో నీళ్లు దాని మీద ఒక గ్లాసును మూతగా పెట్టి ఉంచేది. ఆ సమయంలో మేడ క్రింద విధిలో ఒక బిక్షగాడు అరుస్తున్నాడట, "అమ్మా! ఏమైనా ఉంటే పెట్టమ్మా!" అమ్మ ఇంట్లో పని చేసుకుంటోంది. నేను ఠక్కున లేచి అక్కడ ఏమున్నాయో చూసి, ఏమీ లేదు అని తెలుసుకుని. ఆ చెంబు మీద ఉన్న గ్లాసు తీసుకుని హడావుడిగా వెళ్లిపోయి మేడ మీద నుంచి వాడి మీద వేశానట. అది టంగు మని శబ్దమైంది. అమ్మ బయటకొచ్చింది. ఏమిరా ఏం చేసావురా అని అడిగితే, "అమ్మ, మరి వాడు వచ్చాడు ఏమి లేవు. ఇదిగో పాపం అమ్మ, బీద వాడు కదా ఈ గ్లాస్ ఇచ్చేశాను వాడికి" అని చెప్పి చెప్పానట.

ఈ సంఘటన విని నాకు ఆశ్చర్యమైంది. నాలుగైదేళ్ల ప్రాయంలో ఇలా జరిగిందా అని. తర్వాత సరస్వతి విద్యా మందిర్‌లో ప్రవేశము. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విలువలతో కూడిన విద్యను అందించారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో సేవా భావన, దేశభక్తి నన్ను ప్రభావితం చేసాయి. క్రమశిక్షణ, అనురక్తి, భక్తి, ప్రపత్తి, వృత్తి ప్రవృత్తి ఇవన్నీ కూడా అతి చిన్న వయసులో నాకు బాబావారే అందించారేమో. వారి అక్కున చేర్చుకోవడానికి ముందు నన్ను ఇలా తయారు చేశారేమో అనిపిస్తుంది.

అలాగే చిన్ననాడు పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో భగత్ సింగ్, చంద్రశేఖర్ అజాద్, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస ఇలాంటి మహానీయుల కథలు తెలుసుకుని అరే బ్రతికితే ఇలా బ్రతకాలి అనుకునే వాడిని. అలాగా చిన్న నాటి నుంచి కూడా నేను ఎన్నో విషయాలు సేవా దృక్పథాన్ని అలవరచుకున్నాను. ఊహే తెలియని సమయంలో ఇలా నా రక్తం అణువణువు కరుణ, సేవ, దేశభక్తి, దైవభక్తి తదితర పవిత్ర భావనలతో నిండి పోయింది.

నన్ను బాగా ప్రభావితం చేసిన మరొక అంశం ఏంటంటే. మేమంతా కూడా ఉమ్మడి కుటుంబం లాగా కింద మీద పక్కన వెనకాల ఉండే వాళ్లము. ప్రతి శనివారం ఊళ్లో సంత జరిగేది. మా పెద్దనాన్న, చిన్నాన వాళ్ల షాప్ ముందర కూర్చొని చిన్న డబ్బాలో చిల్లర నాణేలు పెట్టుకుని, వచ్చిపోయే సాధువులకు, బీద వాళ్లకు, అభాగ్యులకు ఇస్తుండేవారు. ఇది చూసినప్పుడల్లా నేను కూడా ఇట్లా చేయాలి. ఇలా నేను కూడా సేవ చేయాలని ఒక భావన కలిగేది. శనివారం వెళితే మా పిల్లలందరికీ కూడా తల ఐదు పైసలో, పావలానో ఇచ్చేవారు. అది తీసుకొని చిన్న చిన్న బర్ఫీలు, చిన్న చిన్న చాక్లెట్స్ తీసుకుని ఎంజాయ్ చేసే వాళ్లం. నిస్వార్థంగా ఇవ్వడం అన్నది అక్కడ చూశాను.

మరొక సంఘటన ఏమిటంటే మేము బళ్లారిలో ఉండే పెద్దమ్మ వాళ్లింటికి వెళ్లినప్పుడు, శ్రీమతి ఇందిరమ్మ, శ్రీమతి విశాలమ్మ, శ్రీమతి లలితమ్మ వీళ్లందరూ చాలా ఉన్నత కుటుంబాల వాళ్లు. మేము మధ్య తరగతి కుటుంబం కదా, వాళ్లు మమ్మల్ని ఎంతో అనురాగంగా, ప్రేమగా ఆదరించే వాళ్లు. డబ్బులు ఇచ్చేవాళ్లు, వాళ్ల పిల్లలు వేసుకొని ప్రక్కన పడేసిన బట్టలిచ్చే వాళ్లు, కొత్త బట్టలు ఇచ్చే వాళ్లు ఎన్నో రకాలుగా మమ్మల్ని ప్రేమగా చూసుకొనేది చూసి చాలా ప్రభావితం చెందే వాడిని. వాళ్లు వేసుకున్న బట్టలైనా పర్వాలేదు, గుండెలకి హత్తుకొని అబ్బ మాకు మంచి బట్టలిచ్చారు అని ముచ్చట పడే వాడిని. ఇంటికి వెళ్లి వాటిని చక్కగా ఆల్టరేషన్ చేసుకొని వేసుకునే వాళ్లం.

మరొక విశేషం ఏంటంటే చిన్నప్పుడు వేసవి సెలవులు వస్తే అమ్మతో పాటు మద్రాసులో ఉ

న్న తాతయ్య దగ్గరికి వెళ్లేవాళ్లం. తాతయ్య పేరు శ్రీ తల్లం పుల్లన్న గుప్తా. వీరు ఒక లిక్కర్ కంపెనీకి అధినేత. తమిళనాడులో చాలా ఉన్నత కుటుంబం మరియు పేరు గాంచిన వ్యాపార వేత్త. పిల్లలు లేరు కాబట్టి తాతయ్య అవ్వయ్య పిల్లలందరూ వెళితే చక్కగా ప్రేమిస్తూ వాత్సల్యంతో చూసేవాళ్లు.

పిల్లలందరిని అడిగేవాళ్లు, "నీకేం వచ్చు చెప్పు నీకేం వచ్చు, డాన్స్ వచ్చా, పాట వచ్చా, ఆట వచ్చా, మాట వచ్చా అని అడిగితే ఎవరికొచ్చింది వాళ్లు చేసేవాళ్లు కానీ ఆ ఇంట్లో చేరిన పిల్లందరి లోనూ నేను చాలా ప్రత్యేకంగా ఉండే వాడిని. నన్ను పిలుస్తూనే, చక్కగా లేచి నిలబడి భగవద్గీత శ్లోకాలు చెప్పడం, పద్యాలు చెప్పడం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయము చేయడము చేసే వాడిని. నన్ను బాగా ఇష్టపడే వాళ్లు. తాతయ్య అంత మందిలో కూడా నన్ను మెచ్చుకొని ఆ కొత్త? 100 నోటు బహుమతిగా ఇచ్చేవాళ్లు. నాకు చాలా ఆశ్చర్యమయ్యేది. అంత చిన్న వయసులో? 100 ఎవరైనా ఇచ్చారంటే గొప్ప సంగతి కదా. చాలా ఆశ్చర్యంగా, చాలా వింతగా ఆ కొత్త?100 నోట్‌ను చాలా పదిలంగా దాచుకొని అమ్మ దగ్గరికి తీసుకెళ్లేవాణ్ణి. అమ్మ దాన్ని దాచిపెట్టి డ్రెస్ లేక ఆట బొమ్మలో కొని పెట్టేది.

ఒకసారి మా తాతయ్య కార్యాలయంలో పని చేసుకుంటున్న సమయంలో నేను నిదానంగా వెళ్లాను. 10 పన్నెండేళ్ల ప్రాయంలో జరిగిన విశేషం చెప్తున్నాను. నన్ను చూసి తాతయ్య ఏమి నాయనా, దా దా, ఏం విషయం అని అడిగారు.

"తాతయ్యా! నేనొక విషయం అడగాలనుకుంటున్నాను. మీరు అట్లా డబ్బులు ఇచ్చేస్తున్నారే. ఎక్కడ నుంచి వస్తున్నాయి డబ్బులు మీకు" అని అడిగాను. నాయనా "వ్యాపారము విలువలతో చేయడము తెలుసుకోవాలి. విలువలతో చేసిన వ్యాపారము విలువైన సంపాదనకి మార్గంగా ఏర్పడుతుంది. అలా విలువైన సంపాదన మన చేతిలో ఉన్నప్పుడు విలువైన రీతిలో దాన్ని ధార్మిక కార్యక్రమాల్లో ఖర్చు పెట్టాలి. ఎవరైనా మంచి పని చేయాలి. దానితో అదే చేస్తున్నానయ్యా. బ్లడ్డు దుడ్డు రెండు కూడా సర్కులేషన్‌లో ఉండాలి బాబు." అని చెప్పిన మాటలు నన్ను చాలా ప్రభావితం చేశాయి.

తాతయ్య ఎలా చేస్తున్నారు? ఈ డబ్బులన్నీ ఎక్కడ పెడుతున్నారని అడిగితే, "అయ్యా తల్లం ఛారిటీస్ అనే ట్రస్ట్ పెట్టాను. ఆ ట్రస్టు ద్వారా ఈ విధంగా కార్యక్రమాలు చేస్తున్నాను అని చెప్పారు. చిన్మయ మిషన్‌కు వారు విరివిగా విరాళం ఇచ్చేవారు. అప్పుడు అనిపించింది ఏ రోజైనా నేను కూడా ఇలాగా ఒక సంస్థని పెట్టి సమాజ సేవ చేయాలని. అలా పది పన్నెండేళ్ల వయసులో జరిగిన విశేషం ఇది.

తదనంతర కాలంలో సత్యసాయి బాల వికాస్ కార్యంలో నేను చేరడం, సత్యసాయి బాల వికాస్ కార్యం ద్వారా నన్ను నేను పునీతం చేసుకోవడం అప్పటిదాకా వేడివేడిగా ఉన్న నా జీవితం అనే లోహం సత్య సాయిబాబా నామం అనే సుత్తితో కొట్టబడి మెత్తగా చేయబడినది అని చెప్పాలి. ఇక ఎప్పుడైతే స్వామి వారిని చూశానో, ఎప్పుడైతే స్వామి కార్యాన్ని అర్థం చేసుకున్నానో, ఎప్పుడైతే స్వామి దర్శన స్పర్శన సంభాషణ పాద నమస్కార ప్రసాద భాగ్యాలు అందుకున్నానో ఇక హృదయం అంతా కరిగిపోయి సదా సేవలలో మునిగి పోయాను.

ఈ విషయాలు జరిగి ఇప్పటికీ సుమారు 4 దశాబ్దాలు గడిచినా సరే, కరిగిన హృదయం నుండి పరహితం చేయాలన్న దృక్పథం అలా గంగా ప్రవాహం లా పారుతూనే ఉంది. అలా ఛారిటీ

అన్నది. ఒక ఛార్ము క్రియేట్ చేసింది. నిస్వార్థ సేవ అన్నది నిలువెల్ల నిండిపోయిన భావనగా మారిపోయింది.

ఒక పెద్ద శిలను ఎవరైనా కొట్టాలి అంటే ఒక దెబ్బతో కొట్టలేరు. దాని మీద పెద్ద సుత్తితో 20 దెబ్బలు వేస్తే పగులుతుంది అనుకుందాం. బండ ఆ 20వ దెబ్బకి పగిలింది అని ఎవరైనా అనుకుంటే మోసమే అవుతుంది. ఇరవయ్యో దెబ్బ మునుపే 19 దెబ్బలు పడ్డాయి కాబట్టి మొత్తం 20 దెబ్బలకే బండ విరిగింది అని తెలుసుకోవాలి. అలాగా స్వామి శక్తి పాతానికి నన్ను నేను గురిచేసుకోవడం వెనక అద్భుతమైన సేవా దృక్పథాన్ని నాకు అలవర్చిన వాళ్లు చాలా మంది ఉన్నారు. వారందరినీ నేను ఈ సందర్భంగా తలుచుకుంటున్నాను.

స్వామి కార్యంలో నన్ను నేను పునరంకితం చేసుకోవడానికి కావాల్సిన నేపథ్యాన్ని స్వామి వారు సృష్టించారు. ఆ నేపథ్యం అంతా ఇంతా కాదు. నేను పుట్టకమునుపే నేపథ్యం తయారైంది అనుకుంటున్నాను. అంటే స్వామి ఎంత దూరమైనా రాగలరు. ఎవరితోనైనా మాట్లాడగలరు. తన పాదాల దగ్గరికి రప్పించుకోగలరు అని మనం తెలుసుకోవాలి. గువ్వ కాలికి దారము కట్టి ఈడ్చినట్టుగా నా జీవితానికి సాయి యొక్క భావనని ముడి వేసి స్వామి యొక్క సాన్నిధి లోకి చేర్చుకున్నారు అని చెప్పుకోవాలి. స్వామి యొక్క కార్యంలో ఒక సుశిక్షితమైన సైనికుడిగా నేను మారిపోయాడు. సాయి ఆత్మ బంధువుగా మార్చేశారు అయన.

54

ఉపనయనము – సేవకు దగ్గరగా పయనం

1970 ఏప్రిల్ 6వ తేదీ, అమావాస్య రోజు పుట్టాను. తల్లిదండ్రులు జాతక చక్రాన్ని వేయించారట. ఈ పిల్లాడు యోగి లాగా అవుతాడు లేదా భోగి లాగా అవుతాడు. రాజులా అయినా ఉంటాడు లేక దొంగలా అయినా మారుతాడు అని తేల్చారట.

1984లో కంచి పరమాచార్య బృందము తాడిపత్రికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులందరూ విడిదిలో దివ్య ఆచార్య త్రయాన్ని దర్శించుకున్నారు. మా అమ్మ గారు స్వామీజీలకి వినయంగా నమస్కరించి నా గురించి విన్నవించారు... 'స్వామి! మా వాడు మాట వినట్లేదు, ఆ అంటే... సన్యాసం అంటాడు, ఊ అంటే వెళ్లి పోతాను అంటాడు' అని ఫిర్యాదు చేశారు. పరమాచార్య నన్ను తీక్షణంగా చూస్తూ... మౌనంలో ఉండటం వలన చేతితో సైగ చేస్తూ చూశారు. జయేంద్ర సరస్వతి స్వామి వారు... "నాయనా! నువ్వు బాగా చదువుకో. బాగా చదివితే సమాజమే నీకు సన్యాసం ఇస్తుందయ్యా!" అని ఆదేశించారు. చాలా చిన్న వయసు కదా! వారి మాటలు గుర్తున్నాయి. కానీ అందులో విషయం అర్థం కాలేదు.

1995 శివరాత్రి పర్వదినం... ప్రశాంతి నిలయంలో స్వామి వారు ఏకాంత సౌధ సంభాషణము అనుగ్రహించారు. అదే స్వామితో నా ప్రప్రథమ సమాగమము... గదిలోకి వస్తూ స్వామి వారు యథాలాపంగా గది తలుపులు మూస్తూ... నన్ను చూడకుండానే "ఏయ్! సన్యాసి!!" అని పిలిచారు (ఈ విషయాన్ని పూర్తి వివరాలతో మరొక వ్యాసంలో చెప్పడం జరిగింది)

1996లో నేను హైదరాబాద్‌కి రావడం, హైదరాబాదు బృందంతో ఎన్నో కార్యక్రమాలలో తలమునకలై పోవడం జరిగింది. ఒక ప్రక్క కంపెనీ సెక్రెటరీ కోర్సు చదువుతూ మరొక ప్రక్క NATCOలో శిక్షణని పూర్తి చేసుకోవడము జరిగింది.

2000 సంవత్సరము నాటికి నేను కంపెనీ సెక్రెటరీ తుది పరీక్ష వ్రాస్తున్నాను. అప్పటికి నా వయస్సు 30 ఏళ్లు. నాకు 28 సంవత్సరాలు వచ్చిన దగ్గర నుండి, నాకు పెళ్లి చేయాలని, సరైన

అమ్మాయిని చూడాలని తల్లి తండ్రులు భావిస్తున్నారు. అప్పటికే భక్తి, భజనలు, సేవలు అంటూ తిరగేస్తున్నాను అని వారు కాస్తా కంగారు పడుతున్నారు. కనీసం పెళ్లితో అయినా జీవితంలో కుదురుగా ఉంటానని వారు అనుకున్నారు.

చాలా రకాల సంభాషణలు, చాలా రకాల చర్చలు జరిగాయి ఇంట్లో. నేను పెళ్లికి ససేమిరా అంటూ, ' నేను ఈ విధంగా సేవలో ముందుకు వెళ్తాను' అని చెప్పడము... స్వామి వారు సన్యాసి అన్నారు చూశారా? నేను అమావాస్య రోజు పుట్టాను, తప్పకుండా ఇట్లాగే ఉంటానని చెప్పడం, వాళ్లు కూడా నన్ను చిన్నప్పటి నుండి చూస్తున్నారు కాబట్టి కాస్త అటు ఇటుగా ఆలోచించడం మొదలు పెట్టారు.

అలాంటి సందర్భంలో ఒక సంబంధం వచ్చిందట. ఇది జరిగిన కొన్ని సంవత్సరాల తరవాత అమ్మతో నేను మాట్లాడుతున్నప్పుడు ఆవిడ చెప్పింది. నాయనా! ఆ జాతకం సరిపోయింది. పెళ్లి కూతురు వాళ్లకి మీ నాన్న ఆ విషయం చెప్పారు. నీ అంగీకారం చెప్తే అమ్మాయిని చూడటానికి అబ్బాయిని తీసుకొని వస్తాము అని కబురందిస్తాము. ఇంతలో పెళ్లి కూతురు నాన్న ఉత్తరం వ్రాసాడు. ఆ ఉత్తరం ఇంట్లో నేనే అందుకున్నాను. ఆ కార్డుముక్కకు మా నాన్న వ్రాసినట్టుగా ఆ పెళ్లి కూతురు వాళ్ల నాన్నకి వ్రాస్తూ 'అయ్యా! మా పిల్లాడు చదువుకున్నాడు. కానీ పెళ్లికి ఇష్ట పడటం లేదు. అందువలన ఈ పెళ్లి కుదరదు. మీరు అన్యదా భావించవద్దు. ఇట్లు భవదీయ: SS రంగయ్య అని, మా నాన్నగారి సంతకం నేను చేసి పంపించానట.

ఆ పెళ్లి కూతురు నాయన తరవాత ఎప్పుడో కలిసి నప్పుడు మా నాన్నతో సంభాషిస్తున్నప్పుడు ఈ విషయం ప్రస్తావిస్తే... అది విన్న మా నాన్నగారు ఆశ్చర్యపోయి! నేను ఎప్పుడు వ్రాసాను లెటర్ అన్నారట. ఆ తర్వాత ఇంటికి వచ్చాక విషయం తెలిసింది.

అమ్మ నాన్న, ఇక నన్ను కూర్చోబెట్టి నాయనా ఇట్లా కాదు నువ్వు ఏం చేస్తావో చెప్పు? పెళ్లి చేసుకుంటావా చేసుకోవా అంటే... ఖరాఖండిగా నేను పెళ్లి చేసుకోను అని చెప్పాను. ఈ జీవితం నాకు బాగానే ఉంది. ఒంటరిగా ఉండాలని ఉంది. ఒకే లక్ష్యం కోసమై జీవించడం నా జీవన సూత్రంగా చేసుకుంటాను అని చెప్పాను.

అంటే ఈ నిర్ణయం వెనక నా మదిలో ఒక్కటే ధ్యాస... స్వామి నన్ను సన్యాసి అన్నారు కదా! దాన్ని నిజం చేయాలి. స్వామి అలవోకగా అన్నారా? క్యాజువల్‌గా అన్నారా? ఉట్టిగా అన్నారా? ఏ విధంగా అన్నారో నాకు తెలియదు. స్వామి చెప్పారు!! ఆ మాట నిజం చేయాలి... అన్న ఆలోచన దృఢంగా, వజ్ర సంకల్పంలా మారిపోయింది. స్వామి చెప్పింది చేయాలి అనుకున్నాను.

ఇదే విషయం అమ్మ నాన్నకు చెప్పాను. ఆ మాటలు విని అమ్మ ఏడ్చారు... అయ్యో! ఏం నాయనా ఇట్లా అంటావు? మేము ఉన్నన్నాళ్లు నిన్ను చూసుకుంటాము నాయనా, కన్నాము కాబట్టి మేము చూసుకుంటాము. మేమిద్దరం పోయిన తర్వాత నీ పరిస్థితి ఏమిటి? అంటూ ఏడ్చారు. నాన్నగారు చాలా అద్భుతమైన వ్యక్తి. ఆయన నా మాట విని, దృఢమైన స్వరముతో చెప్పారు... "రేయ్! పెళ్లి చేసుకోకుంటే ఏమి తొందర లేదు కానీ, పెళ్లి చేసుకోకుండా తప్పు మార్గంలో వెళ్లాలి అని అనుకుంటే మాత్రం వద్దు. మంచి మార్గంలో వెళ్తాను అంటే సంతోషంగా ముందుకు వెళ్లు నాయనా!" అని చెప్పారు. ఆ క్షణం అలా నిర్ణయం అయింది.

తదనంతరం చాలా విశేషాలు జరిగాయి. అమ్మ నాన్న, తమ్ముడి పెళ్లి చేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అందరూ మీ రెండో వాడికి ఏం చేశారు? రెండో వాడు ఏంటి? అని

అడగడం మొదలు పెట్టారు. ఇక ఇంట్లో ఒక నిర్ణయానికి వచ్చారు. తమ్ముడు పెళ్లికి ముందే నాకు ఉపనయనము చేస్తాము అన్నారు. మేము ఆర్య వైశ్యులం కాబట్టి, పెళ్లికి ముందు ఉపనయనం చేయడం పరిపాటి. కానీ పెళ్లి ఎట్లాగు జరగట్లేదు కాబట్టి ఉపనయనం ప్రత్యేకంగా చేద్దాం అని నిర్ణయం చేశారు. అందరి కోసం, అందరి దృష్టిలో ఇది ఒక సెటిల్మెంట్ లాగా ఉంటుంది అని ఉపనయన సంస్కారాన్ని ప్రతిపాదించారు.

2000 సంవత్సరములో CS తుది పరీక్షలు వ్రాయబోతున్నాను. బెంగళూరులో ఇంట్లో ఉపనయన సంస్కారము ఏర్పాటు చేశారు. బంధుమిత్రులు వచ్చారు. పెళ్లి చేసుకోవట్లేదు అన్న విషయం అందరికీ అర్థమైంది కాబట్టి, ఉపనయనం ప్రత్యేకంగా చేయడం మా ఇళ్లలో లేదు కాబట్టి, చాలా మంది బంధు మిత్రులు వచ్చారు. మా బాలవికాస్ గురువు, శ్రీమతి నాగజ్యోతి కుటుంబంతో వచ్చారు. చాలా శాస్త్రోక్తంగా గాయత్రి మంత్రోపదేశం చేశారు నాన్న. యజ్ఞం కూడా చేయించారు. నాకు ఇదంతా అలౌకిక ఆనందాన్ని కలుగజేసింది. తెలియకుండగానే చాలా భావోద్వేగానికి గురి అయ్యాను. అనుకున్నది జరుగుతోంది కదా... నేను సేవాచారుడిగా ముందుకు వెళ్తున్నాను కదా... అన్న భావనతో బాగా ఉద్వేగంగా ఉన్నాను. యజ్ఞ కుండము నుండి వెలువడే పొగలు నా కళ్లలోకి పోయి నీళ్లు వస్తుంటే, లేచి నిలుచున్నాను.

స్వామి వారిని తలుచుకొని! 'నేను ఇప్పుడు మాట్లాడదాం అనుకుంటున్నాను...' అని చెప్తే అందరూ కూడా నవ్వారు. 'ఏమిరా బాబు! ఇప్పుడు కూడా సుత్తి కొడతావా మాకు...' అన్నారు. సుత్తి కాదు! నా భావనలను, నా జీవిత కార్యాన్ని మీ అందరితో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. దయచేసి ఏమనుకోకుండా వినండి అని చెప్పాను. అందరూ స్తబ్దుగా ఉండి పోయారు.

చెప్పడం మొదలు పెట్టాను. ఉపనయనము అంటే స్వామి ఏం చెప్పారు? "ఉప అంటే దగ్గరగా... నయనము అంటే దృష్టి" ఉపనయన సంస్కారం చేసుకున్నాను అంటే దగ్గర దృష్టి ఉండాలి. ఎవరికి దగ్గరగా దృష్టి ఉండాలి? సేవకు దగ్గరగా ఉండాలి, ఆధ్యాత్మికతకు దగ్గరగా ఉండాలి, స్వామికి దగ్గరగా ఉండాలి. ఈ రోజు నుండి అట్టి ప్రయాణంలో ఉంటాను అని చెప్పాను. మన ఇళ్లల్లో అందరూ దేవుడి దయవలన చక్కగా చదువుకుని వ్యాపార వ్యవహార వాణిజ్యాలలో స్థిరపడ్డారు. అందరం చేరి అవసరంలో వున్నోళ్లకు సాయం చేయాలి. అలాంటి భావనలతో ఈ ఉపనయనం సందర్భంగా ఒక ఫౌండేషన్‌ను స్థాపించాలని అనుకుంటున్నాను అని చెప్పాను. అందరూ కూడా ఆశ్చర్య పోయారు. ఏమిరా? ఏం ఫౌండేషన్ రా నాయనా?! అంటే... నేను చెప్పాను "సమాజంలో అనానుకూలములు అన్నీ జీవితంలో భయాన్ని కలిగించేవే! అందుకు భయము తొలగించే విధంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలను కుంటున్నాను. ఏ విధమైన భయముతో వచ్చినా సరే... ఈ సంస్థకు వస్తే ఆ భయాలు తొలగించే విధంగా నేను పని చేయాలను కుంటున్నాను. ఈ ఫౌండేషన్ రంగు, కులం, మతం, ప్రాంతం, కాలం, సంస్కృతి, భాష, రాష్ట్రం వంటి భేదాలు లేకుండా సమాజ హితానికి పని చేయాలన్నది నా అభిమతం అని ప్రకటించాను. ఎక్కడున్న మనిషికైనా అవసరం ఉంటే చాలు సేవ చేయాలన్న తపనతో పని చేయాలి. ఆ సేవలు భయము తొలగించేవిగా ఉండాలి కాబట్టి, "అభయ" అని నామకరణం చేస్తున్నాను, "అభయ ఫౌండేషన్" అనే సంస్థని ఏర్పాటు చేయాలని సంకల్పం చేశాను అని ప్రకటించాను.

అది వింటూనే అందరూ నవ్వుతూ అడిగారు. "ఏం రా బాబు! ఇప్పుడు చందాలు అడుగుతావా? ఏమిటి? అంటే నేను అన్నాను... చందాలు ఎందుకు అడగడం? మీరందరూ కూడా ఈ రోజు నాకు

బహుమతులు ఇచ్చారు కదా! అక్కయ్య గోల్డ్ చైను ఇచ్చింది, ఇంకో అక్క గోల్డ్ రింగ్ ఇచ్చింది, అన్నయ్య నుండి వెండి సామాను వచ్చింది, మీరంతా బహుమతులు చదివింపులు ఇచ్చారు, ఇవన్నీ కూడా డబ్బుగా మార్చి దాన్నే మూల ధనంగా చేస్తాను. నేను సేవలకు ఎప్పుడైతే సిద్ధంగా ఉన్నానో... అప్పుడు నేను ఈ ఫౌండేషన్‌ను అధికారికంగా నమోదు చేస్తాను అని చెప్పాను. అది విని ఆశ్చర్యపోయారు అందరూ కూడా.

అబ్బా! అవునా! సరే చూద్దాం!!! అన్నారు అందరూ. ఇంటికి వచ్చిన అన్నదమ్ములకు (స్వర్ణ మహల్ జూవెలరీస్, బళ్లారి) వచ్చిన విలువైన బహుమతులను చూపించి, కాస్త వెలగట్టండి అని అర్థించాను. ఆ వస్తువులకు 60 వేల రూపాయలు విలువ కట్టి ఇచ్చారు. నా ఉపనయన సంస్కారం జరిగిన సుముహూర్తంలో అభయ సంస్థని ఏర్పాటు చేయాలనే సంకల్పం జరిగింది. ఇది దైవ నిర్ణయము అనుకుంటున్నాను. శ్రీ సత్య సాయి బాబా వారే సాక్షాత్తు అక్కడ నిలబడి నాతో చేయించిన నిర్ణయం అనుకుంటున్నాను.

అమ్మ బాగా బాధ పడింది. తర్వాత, 'నాయనా! పెళ్లి చేసుకుని నలుగురని కనాలి అంటారు రా! ఎందుకంటారో తెలుసా... రేపు పొద్దున చస్తే ఎవడు రాకున్నా, కనీసం ఈ నలుగురైనా మోసుకెళ్తారు కదా! మరి, నీవు ముసలి వాడైతే ఎవర్రా చూస్తారు? అని బాగా ఏడ్చింది.

నేను అమ్మతో చెప్పాను 'అమ్మా! ఎందుకమ్మా బాధ పడతావు? ఏ రోజైనా మనిషికి గ్యారెంటీ ఉందా చెప్పమ్మా? సరే నువ్వు చెప్పిందే కరెక్ట్ అనుకుందాం. మన ఇంట్లో పెద్ద నాన్న ఉన్నారు కదా! శ్రీమాన్ సుంకు చిన్న కోన రంగయ్య గారు, వారు కడవకల్లు సర్పంచ్‌గా ఉండేవారు. వారికి నలుగురు కొడుకులు, ఒక బిడ్డ. నలుగురు కొడుకులు ఉన్నా కూడా పెద్దమ్మ... పెద్దయ్య చనిపోయిన తర్వాత అనంతపురంలో, వృద్ధాశ్రమంలో చేరింది కదా!

ఇంకా ఇలా చెప్పాను. అమ్మా! ఇంకో పెద్దమ్మ ఉన్నారు కదా నాకు, విశాలక్ష్మమ్మ... మీ అక్క! పెళ్లి చేసుకుంటే నలుగురిని కనాలని నువ్వు చెప్తున్నావు కదా... మరి వాళ్లకి పిల్లలే లేరు! వాళ్లని ఎవరు చూసుకొనే వాళ్లు? చాలా కాలం క్రితం ఆవిడను రోడ్డు మీద వదిలేసి పెద్దయ్య వెళ్లిపోయారు కదా! ఆ పెద్దమ్మ మళ్లీ అదే అనంతపురం వృద్ధాశ్రమంలో చేరింది. ఇద్దరు పెద్దమ్మలు అక్కడే!

అమ్మా! నువ్వే చెప్పు! పెళ్లి చేసుకుంటే మనుషులు బాగుంటారని ఏమిటి గ్యారెంటీ? తొందర పడొద్దమ్మా! ఎక్కువగా ఆలోచించద్దు అని అనునయించాను.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే...

దేహంలో ప్రవహించే శక్తి శ్రీ సత్యసాయిదే!

సేవా భాగ్యము వెనక భావన బాబాదే!

సేవా సాధన వెనక సంకల్పం సాయిదే!

సేవా జీవనము వెనక జీవం స్వామియే!

వారి దివ్యాశీస్సులు ఉన్నాయని జీవితంలో విశ్వసిస్తున్నాను.

ఇది నా జీవితంలో ఒక అద్భుతమైన సంఘటన. స్వామి తత్వమును హృదయము నిండుగా తీసుకొని ముందడుగు వేసే ప్రయత్నం చేశాను. నా 30 ఏళ్ల వయసులో 2000 సంవత్సరంలో ఉపనయనము ద్వారా సేవకు తద్వారా భగవంతునికి దగ్గరగా వెళ్లే ప్రయత్నం చేశాను. అలా ఉపనయనం ద్వారా సేవా యాత్రకు తెర తీయబడింది.

55

ప్రజలను ప్రభువు దగ్గరికి చేర్చిన పల్లకి

మిత్రులారా 1996 సంవత్సరం నుండి సుమారు దశాబ్ద కాలము పాటు, కొన్నివందల మంది హైదరాబాద్ యువ జనుల హృదయాలలో నిలిచిన ఉద్యమ స్ఫూర్తికి 'గ్రామ సేవ' ప్రధాన కారణం. ఈ "గ్రామ సేవయే – సాయి సేవ" మహోద్యమంగా రూపుదిద్దుకునే సమయంలో ప్రాణ వాయువులు ఊదిన... రెండు అతి ప్రధానమైన విషయాలని పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

అందులో ఒకటి స్వామి వారందించిన స్ఫూర్తి. 1996 సంవత్సరంలో చాలా నిరాడంబరముగా మొదలైన "గ్రామసేవయే – సాయి సేవ" కార్యం, స్వామి వారి యొక్క దర్శన, స్పర్శన, సంభాషణ, పాద నమస్కార, ప్రసాద భాగ్యాలు అందరిలో జీవిత కాలానికి కావలసిన అనన్య సామాన్య స్ఫూర్తిని అందించింది. ఆ దివ్యానుభూతి హైదరాబాదు యువకులని మళ్లీ ఇక నిద్రపోనివ్వలేదు. ఆహరహం, అనుక్షణము నిద్రాహారాలు మాని వారాంతం ఎప్పుడు వస్తుందా, ఏదైనా గ్రామంలో ఎలా సేవ చేద్దామా, స్వామికి ఆనందము కలిగించే పని ఎలా చేద్దామా, స్వామి మెచ్చుకునే పని ఏ విధంగా చేద్దామా, అంటూ ఒక ఐదు మంది చేరారు అంటే ఈ విషయాలు చర్చించుకునే వాళ్లు.

ఇక రెండు: గ్రామాలలో జరిగిన పల్లకి ఉత్సవం. అల్వాల్ సత్యసాయి కేంద్రంలో ఉండే చెక్క పల్లకిని మాతో పాటు తీసుకుని వెళ్లడము గురించి చెప్పడం జరిగింది కదా. తదనంతర కాలంలో ఏ గ్రామానికి వెళ్లినా అల్వాల్‌కి వెళ్లి, వాళ్లకి ఏ కార్యక్రమం లేకపోతే ఆ పల్లకిని తీసుకొచ్చేవాళ్లం. తర్వాత సేవ కార్యక్రమాలు ఎంతో ఉధృతంగా జరగడం మొదలైంది... ఒకసారి పల్లకి తీసుకుని వస్తే నెల రోజులపాటు మళ్లీ వెనక్కి వెళ్లేది కాదు. అలాంటి సందర్భంలో వాళ్లకి ఇబ్బంది అయ్యేది. అప్పుడు అనిపించింది, మనకంటూ ఒక పల్లకి ఉంటే ఎలా ఉంటుంది అని. 1997–98 ప్రాంతంలో అనుకుంటాను. చాలా గ్రామాలలో సేవ చేస్తున్నాం. అలాంటి సందర్భంలో నిర్ణయం చేశాము, ఒక చక్కటి పల్లకి ఉండాలి అని.

చిన్నప్పటి నుంచి అలంకరణ సేవలు ఇష్టంగా చేసే నేను, పల్లకిని ఎట్లా అయినా సరే మనం

బాగా చేయాలి, అసలు ఆ పల్లకి ఉత్సవంతోనే కదా... గ్రామాలన్నీ కూడా ఏకమవుతున్నాయి. గ్రామస్తులందరూ కూడా భక్తి పారవశ్యంతో నిండి పోతున్నారు అనుకుంటూ... దాన్ని ఎలా చేయాలి అని ఆలోచించే వాడిని.

ఆ పల్లకిని చూస్తే రాజసం ఉట్టి పడాలి, స్వామి చిత్ర పటాన్ని అందులో పెడితే నిజంగా స్వామే కదిలి వస్తున్నారా! అనేట్టు పల్లకి కనిపించాలి అని, ఈ సేవలకి, భక్తిని సంధించే ప్రయత్నం జరగాలి అనుకునే వాడిని. గ్రామాలలో జరిగే అద్భుతమైన వైద్య సేవలు, బాల వికాస్, భౌతిక సేవలు, పశు వైద్య శిబిరములు, ఇట్లాంటి సేవలన్నీ అందరినీ ఒకప్రక్క సేవా మార్గంలో పయనించేలా చేస్తే... భజనలు, గ్రామ సంకీర్తనలు, తర్వాత పలకీ ఉత్సవము ఇలాంటివన్నీ కూడా భక్తి మార్గంలో గ్రామస్తులను తీసుకుని వెళ్లేవిగా ఉండేవి.

కాబట్టి, ఆ పల్లకిని ఎలా చేయాలని తపిస్తూ చాలా డిజైన్లు వేసి ఇట్లా చేస్తే బాగుంటుంది, అట్లా చేస్తే బాగుంటుంది అని అందరితో చెప్పేవాడిని. కొన్ని రోజులు నిద్రనే పోలేదు. పల్లకిని ఎట్టైనా సరే... వచ్చే గ్రామ సేవకంత మనం చేయాలి అని అనుకున్నాం. అదే సందర్భంలో అనుకుంటూ గజ్వేలు కేంద్రంగా 5 రోజుల మహా గ్రామ సేవా యజ్ఞము సంకల్పం చేశాము.

ఆ సందర్భంలో కొత్త పల్లకి చేయాలని ఆలోచించాము. రెండు మూడు నెలలు దాని మీద పని చేశాము కానీ ఏ డిజైన్ కూడా సరిగ్గా రాలేదు. ఏం చేయాలో తెలియలేదు, చాలా తపనపడ్డాను, ఎట్టైనా సరే ఈ పల్లకిని మనము తీసుకురావాలి అని అందరూ కూడా ఉత్సాహంగా ఉన్నారు. అలాంటి సందర్భంలో ఒక రోజు కలలో మంచి అద్భుతమైన, దివ్యమైన పల్లకి రూపము స్వామి వారు చూపించారు. ఆ పల్లకి చూసిన వెంటనే నా హృదయము ఉప్పొంగి పోయింది. వెంటనే నిద్రలేచి, ఒక పేపర్ తీసుకుని కలలో స్వామి నాకు చూపించిన ఆ పల్లకి రూపు రేఖలని గీసే ప్రయత్నం చేశాను. చాలా అద్భుతమైన పల్లకి రూపంగా మారింది. ఆ పల్లకి ఎట్లా చేయాలి అంటే? మంచి టీక్ ఉడ్‌తో నాణ్యమైనదిగా ఉండాలి అని. టీక్ వుడ్ అంటే బరువు అవుతుందేమో? అని, చాలా మంది అన్నారు. "అయ్యా! ఎంత బరువు అయితే ఏమయ్యా? మన బరువు బాధ్యత స్వామి మోస్తున్నప్పుడు, స్వామి పల్లకిని మనం మోయలేమా? నలుగురు మోయడానికి కష్టమైతే... ఎనిమిది మంది మోస్తాం!" కాబట్టి టీక్ వుడ్‌తోనే చేద్దాం అని అనుకున్నాము. చాలా వెతికాము. యాదృచ్ఛికంగా హబ్సిగూడా ప్రాంతంలో ఒక వడ్రంగిని కనుక్కోవడం జరిగింది. వారితో మాట్లాడి, ఈ విధంగా సత్యసాయి బాబా కోసం పల్లకీ చేస్తున్నాం. అది మీరు చేయాలి అంటే... వారు కూడా ఎంతో ఉత్సాహంగా చేస్తాను, ఒక నెల పడుతుంది అన్నారు. ఓ యమ్మ నెలనా! అనుకున్నాం. పని మొదలు పెట్టాము. కానీ అది చేసి ఇది చేసి సుమారు రెండు మూడు నెలల పాటు పట్టింది చేయడానికి. చెక్క ఛత్రం, ఇరు వైపులా హంసల కళాకృతులు చెక్కడం జరిగింది. చాలా దివ్యమైన తేజంతో విలసిల్లింది ఆ పల్లకి. ఎంత పెద్ద పల్లకి అయిపోయింది అంటే... సుమారు 2 క్వింటాళ్ల బరువుతో, ఐదు అడుగుల పల్లకి అయిపోయింది. దానికి రెండు వైపులా భుజాల మీద పెట్టుకొని నడవడానికి అడ్డ కట్టెలు, ఎక్కడైనా సరే నిలపడానికి నిలువు కట్టెలు, పల్లకి లోపల సింహాసనము లాగా చేసి అందులో స్వామి కూర్చునే లాగా... అవసరమైతే స్వామి నిజంగానే కూర్చోవచ్చు అన్నంతగా, ఒక సింహాసనం లాగా ఛత్రాకార పల్లకి తయారు చేసి, దాంట్లో రాత్రి పూట అయినా సరే స్వామి అందరికీ కనిపించాలి అని ఒక విద్యుత్ బల్బ్ బిగించినాము. ఇట్లా దానికి రకరకాలుగా నగిషీలు, రకరకాలుగా అలంకరణలు అన్ని చేసుకుని ఆ పల్లకిని తీసుకుని మేము బయలు దేరాము.

ఒక పల్లకిని గురించి ఇంత ఎందుకు ఆలోచించాము అంటే... స్వామి వారు మా హృదయంలో ఉన్నారు... అంతటా ఉన్నారు. కానీ గ్రామాల్లో ప్రజలకి స్వామిని చూపించడానికి మేము హృదయాలు చీల్చి చూపించలేము కదా! ఆకారమే లేని నిరాకారుడికి రూపము మనం ఇవ్వలేము కదా! కాబట్టి ఆధారాన్ని సృష్టించాలి. ఈ పల్లకి కార్యక్రమంలో జనాన్ని అంతా కూడా సమ్మోహనం చేయాలి అని, ఆ పల్లకి తీయడము, ఆ పల్లకితో పాటుగా ఆడి పాడి మైమరిచిపోయి, ఆ స్వామిని కొలుస్తూ, స్వామిని తలుస్తూ, స్వామికి జయజయ ధ్వనులు చేస్తూ గ్రామాల్లో తిరుగుతుంటే... 'గ్రామసేవ – సాయి సేవ' మహోద్యమములో శ్రీ సాయి పల్లకి గ్రామాలలో, సేవలో ఉన్న వారందరిని ఒక చోటికి చేర్చింది అని చెప్పాల్సిందే. అలాగా ఎన్నో గ్రామ సేవలలో ఆ పల్లకిని చూసి నిజంగానే స్వామిని చూస్తున్నట్టుగా భావిస్తూ ఎంతో మంది ఆనంద భాష్పాలు రాల్చిన వాళ్లని చూశాము. ఆ పల్లకిలో కనిపించే స్వామి వారికి మంగళ హారతులు ఇచ్చే వాళ్లని చూశాము, స్వామి పల్లకి వస్తున్న దారిలో నీరుపోసి స్వామికి స్వాగతం చెప్పే వాళ్లను చూశాము, స్వామి పల్లకి వస్తుందని చెప్పేసి ఇంటింటి గడపకి కూడా ఆ మామిడాకులు తోరణాలు కట్టిన వాళ్లను చూశాము, పండగ వాతావరణమును ఆ గ్రామాలలో పల్లకీ ద్వారా మేము తీసుకురాగలిగాము అనిపిస్తుంది. ఆ పల్లకి ముందు మేము చేసిన నృత్యాలు, పాడిన భజనలు, ఎత్తుకున్న పద్యాలు, వేసిన అరుపులు అయితేనేమి... ఆ కేకలు కేరింతలు, మంగళ వాయుద్యాలు, భాజా భజంత్రీలు, తప్పెట్లు, ఇట్లా అంతా కూడా ఒక అద్భుతమైన ప్రేరణని గ్రామాల్లో కలిగించేలా చేశారు స్వామి వారు. ఇక ఆ పల్లకితో పాటుగా బెల్లం వెనక చేరే చీమల దండు లాగా గ్రామాల్లో అందరూ వచ్చేవారు.

ఆ సందర్భంలో స్వామి వారి దయతో నా హృదయం స్పందించి వ్రాసుకున్న భజన పాట:

"దేవుడొస్తున్నాడు రామం భజే సాయి దేవుడొస్తున్నాడు రామం భజే"

స్వామి వారే స్వయంగా రచించి పాడిన పాట:

"ఓయి రామా సాయి రామ నీవు నా వెంట ఉండు కోదండ రామ..."

తమిళనాడులో నేను నేర్చుకున్న పాట:

"శ్రీరంగా శ్రీరంగా రంగ రంగ శ్రీరంగా శ్రీరంగా శ్రీరంగా రంగ రంగశ్రీరంగా"

ఆంధ్రాలో ఉన్నప్పుడు నేర్చుకున్న పాట:

రాజాధి రాజ... రాజ గంభీర... రాజ కుమార...

చిన్నప్పటి నుండి నేను ఇష్టంగా పాడుకునే పాట:

అంజనేయ వీరా... హనుమంత సూరా వాయు కుమారా... వానర వీరా

తెలంగాణలో పిల్లలు పాడుకునే పాటలు

ఓం నమో నారాయణాయ... శ్రీ లక్ష్మీ నారాయణాయ!

God is one... God is one... God is one for everyone!

అల్లాహో అక్బర్... అల్లాహో అక్బర్... అల్లాహో అక్బర్!

ఇలా మేమందరం చేరి పాటలు భజనలు పాడుతుంటే... చుట్టు చేరిన గ్రామస్తులు భక్తులు ఎలుగెత్తి గొంతు కలుపుతూ... మైమరచి నృత్యాలు చేయడం చూస్తుంటే, నిజంగా స్వామే ఆ గ్రామంలో విజయ యాత్ర చేస్తున్నట్లు ఉండేది. ఇలా ప్రతి విషయం ఆ పల్లకి ఉత్సవానికి మరింత శోభను సమకూర్చాయి.

ఒక్కడు పాడితే వందల మంది గొంతు కలిపేవారు. ఒకరు ఆడితే ఆ గ్రామస్థులందరూ

చేయ్యి చేయ్యి కలిపి, అడుగు అడుగు జత చేసి ఆడేవారు. ఇలాంటి ఎన్నో విషయాలన్నీ పల్లకితో ముడిపడి ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా ఆ పల్లకీని వందలాది గ్రామాలకి తీసుకొని వెళ్లి ఉంటాము.

ఏ గ్రామంలో అయినా సరే... పల్లకి మోసేందుకు మేము ఒక ఎనిమిది మంది బయలుదేరే వాళ్లము. కాని వీళ్ల భుజాల మీద కంటే కూడా జనం భుజాల మీదే పల్లకి ఎక్కువగా ఉండేది. ఈ ఎనిమిది మంది కాపలా వాళ్ల లాగా పల్లకికి ఇరు వైపులా నడిచే వాళ్లు అంతే!

నాకు గుర్తు... ఒక వృద్ధుడు వచ్చి కళ్ల నుండి కారుతున్న ఆనంద భాష్పాలతో కాళ్ల మీద పడిపోతూ, అయ్యా స్వామిని మాకు చూపించారు మీ భక్తి శ్రద్ధలతో అని చెప్పిన దృశ్యం...

ఊరి వాళ్లందరూ చేరి, మేము కూడా చెక్క భజన చేస్తాము, పండరి భజన చేస్తాము, కోలాటం చేస్తాము అని గ్రామీణ ప్రాంతాల్లో మరుగున పడి పోయిన జానపద కళలను వెలికి తీసి పదును పెట్టడం చూశాను.

ఇక ఈ పల్లకి... కేవలం గ్రామాలకి మాత్రమే పరిమితం కాలేదు. గ్రామ గ్రామానా, ఊరు ఊరునా, వీధి వీధినా, ఇంటింటా, ఇంచించూ, దైవ నామాన్ని ప్రతిధ్వనింప చేయడానికి స్వామి వారు హైదరాబాద్ యువతకి ఇచ్చిన మహా ప్రసాదంగా ఈ పల్లకిని మేము భుజాల మీద మోసుకెళ్లే వాళ్లము.

ఏ సందర్భం అయినా సరే పల్లకి ఉత్సవం జరపడం ఆనవాయితీగా మారిపోయింది.

అంతటితో ఆగిపోలేదు సుమా! సుమారు 2003వ సంవత్సరంలో "సత్యసాయి సహస్ర గ్రామ సేవ మహా యజ్ఞ" సంకల్పం జరిగింది. ఆ సందర్భంగా సుమారు మూడు వేల మంది యువ జనులు యావదాంధ్ర దేశంలోని 23 జిల్లాల నుంచి ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ప్రశాంతి నిలయంలో స్వామికి ముందే చెప్పినట్టుగా, ఒక యువ జన చైతన్య పద సంచలనం చేయాలని నిర్ణయం జరిగింది. అందులో 23 జిల్లాల ప్రతినిధులు మరియు ఎన్నిక చేసిన యువజనులు అందరూ వస్తూ ఉంటే... ఒక్కొక్కరు ఒక్కో రకమైన ఒక్కో వేషము, ఒక్కో భాష, ఒక్కో యాసతో, భజనలు పాడుకుంటూ వస్తూ ఉంటే... ప్రధాన ఆకర్షణంగా ర్యాలీలో చిట్ట చివరగా ఈ పల్లకిని స్వామి ముందు ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ విశేషాలన్ని కూడా నేను మాటలతో చెప్పలేను. నిజంగా వీలైతే ఆ వీడియోని మన మందరం కూడా చూడొచ్చు. ఆ వీడియో చూస్తే అర్థమవుతుంది. భక్తి ప్రపత్తులతో చేసిన ఆ పల్లకి ఉత్సవాన్ని ఆ విధంగా స్వామి ఆశీర్వదించారేమో ఆ రోజు అనిపించక మానదు. టివి ద్వారా చూస్తున్న ప్రేక్షకులు, ఆ పల్లకి కదులుతుంటే ఉట్టి పడే రాజసము, సాయి కుల్వంత్ సభా మందిరంలో యావత్ప్రపంచములో భక్త జనులందరూ కూడా చూస్తూ ఉంటే స్వామి వచ్చినట్టుగా, ఆ పల్లకిని మేము తీసుకొని రావడము, చాలా చాలా అద్భుతమైన జ్ఞాపకాలివన్నీ కూడా... పల్లకితో మా జీవితాలన్నీ ముడిపడి పోయాయి.

ఆ మధ్య కాలంలో బెజ్జంకి, శ్రీ సత్యసాయి విద్య నికేతన్ వెళ్లినప్పుడు... ఆ పల్లకిని అక్కడ చూశాను నేను. ఇక్కడ చేరి, అక్కడ చేరి, అటు కదిలి, ఇటు కదిలి, స్వామి వారు చివరికి తన పల్లకిని బెజ్జంకి సత్యసాయి విద్యానికేతన్‌కు చేర్చుకున్నారు అనిపించింది. చాలా ఆనందమైంది, ఆ పల్లకిని చూసినప్పుడు. ఆ పల్లకితో ముడిపడిన ఎన్నో అద్భుతమైన భావనలు, ఎన్నో జ్ఞాపకాలు, ఆ పల్లకీతో పాటుగా సేవకులు, ఆ పల్లకీ రక్షకులు, ఆ పల్లకీకి అలంకారము చేసిన సేవకులు, ఆ పల్లకీని మోసే బోయీలు, ఆ పల్లకీని తిప్పిన దారులు, ఆ పల్లకి వెనక నడిచిన గ్రామస్థులు,

పల్లకి వెంట ఆడిపాడే యువజనులు, ఇలా ఎన్నో వందల వేల మందికి ఆ పల్లకి ప్రేరణ కలిగించింది, దిశానిర్దేశం చేసింది. సత్యసాయి దివ్య రూపానికి ఒక నిలువెత్తు నిదర్శనంగా పల్లకి నిలిచింది. ఆ పల్లకిని చేయ గలిగినందుకు నా జన్మ చరితార్థం అయింది.

హైదరాబాద్ యువజనుల హృదయాలలో స్థిరమైన స్థానాన్ని ఆ పల్లకి ఏర్పరచుకున్నది అని చెప్పుకోవాలి. అందరికీ వందనాలు అభివందనాలు ఆనంద పారవశ్య తందనాలు!

56

మార్పు రావాలి – అందరిని మార్చేసిన వీధి నాటకం

గ్రామ సేవయే – సాయి సేవ కార్యం గురించి ఎన్ని సార్లు మాట్లాడుకున్నా, ఎన్నిరకాలుగా విశ్లేషించిన, ఏ కోణంలో పరిశీలించినా... స్వామి ఒక అద్భుతమైన వేదికని హైదరాబాద్ యువకులకి ప్రసాదించారు అనిపిస్తుంది. ప్రతి ఒక్క గ్రామ సేవ కార్యము కూడా స్వామి గ్రంథము లాగా, సాయి ప్రబంధము లాగా, సేవతో అనుబంధము లాగా అనిపిస్తుంది.

నాకు బాగా గుర్తు 1996వ సంవత్సరంలో ప్రప్రథమ గ్రామ సేవ కార్యక్రమాన్ని చేసుకున్నప్పుడు, సాయంకాలం అవుతూనే గ్రామాలలో పల్లకి ఉత్సవాన్ని చక్కగా చేసుకుంటూ తర్వాత ఏం చేసే వాళ్లంటే బృందంలో కాస్తోకూస్తో మాట్లాడగలిగే వాళ్లు కాస్త మాట్లాడే వాళ్లం. కానీ, మాటల వల్ల ఎవరైనా మారుతారా? లేదనే అనుకున్నాం. మరి ఎట్లా చేయాలి? బృందంలో సాయి సోదరులు చాల సృజనాత్మకంగా ఆలోచించి, చిన్న చిన్న నాటికలు రచ్చబండ మీద అలాగ అలవోకగా కూర్చుని, పల్లకి వెనక వస్తున్న జనాలందరికి కూడా ఒక మంచి సందేశం ఇవ్వాలి, వాళ్లలో చైతన్యాన్ని సృష్టించాలన్న ఆలోచనతో... ఉదయం నుంచి రాత్రిదాకా చూసిన ఎన్నో కార్యక్రమాల సమాహారాన్ని, మంచి మాటల ద్వారా, చలోక్తుల ద్వారా, చతురోక్తుల ద్వారా, జోకుల ద్వారా సందేశాలను జోడించి ఎప్పటికప్పుడు ప్రదర్శించే వాళ్లం. కానీ అది అంత ప్రభావ వంతంగా ఉండేది కాదు. ఆ తర్వాత ఉధృతంగా గ్రామసేవలు జరుగుతున్న సందర్భంలో మేము అనుకున్నాం... గ్రామస్తులను చైతన్యపరచడానికి ఒక ప్రత్యేక సాంస్కృతిక బృందం ఉండి పని చెయ్యాలి అని అనుకున్నాం... అలాంటి సందర్భంలో కొద్దిమంది డాన్స్ చేసే వాళ్లు ముందుకు వచ్చారు, కొద్దిమంది మూకాభినయము చేసేవాళ్లు వచ్చారు, కొద్దిమంది మ్యాజిక్ చేసేవాళ్లు, కొద్దిమంది పాటలు పాడేవాళ్లు, కొద్దిమంది మాటలు మాట్లాడేవాళ్లు, వీళ్లందరినీ పరిచయం చేసే వాళ్లు ముందుకు వచ్చారు. ఇలాగ చేస్తున్న దానికి పరాకాష్టగా డాక్టర్ నాగరాజ్ (ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు), వారు గ్రామ సేవ ఉద్యమములో ఉండేవాడు... తను అన్నాడు ఏదైనా నాటకం చేయొచ్చు కదా అని చెప్తే... ఓయమ్మ! నాటకం అంటే

వేషాలు, భూషణలు, ధారణలు ఉంటాయి కదా అని అనుకున్నాం. కానీ ఏమీ లేదు ఒక రచ్చబండలో మనం మాట్లాడుకుంటున్నట్టుగానే నలుగురు చేరి నాటక రూపంలో మాట్లాడితే బాగుంటుంది కదా అని వ్రాయడం మొదలు పెట్టారు.

ఆ తర్వాత అదే మూలంగా తీసుకుని ఎవరికి చేతనైన ఆలోచనలని, సంభాషణలను దానికి జోడించినారు. ఇక ఆ నాటికను డాక్టర్ అనిల్ కుమార్ గారి మాతృమూర్తి శ్రీమతి లావణ్య సరస్వతికి అందించి సరి చేయమని అడిగాము. వారు తెలుగు పండితులు కావున వారు దాన్ని ఇంకా చక్కగా మెరుగుపరచి, సంస్కరించి ఇవ్వడం జరిగింది. ఆ సంభాషణలు అన్నీ కూడా ఒక మూడునాలుగు మతాల వాళ్లకి సంబంధించిన వ్యక్తులు మాట్లాడుకునే విధంగా, గ్రామ చైతన్యం దిశగా, గ్రామాల్లో చూస్తున్న వాళ్లు ఎవరైనా సరే... ఉత్సాహంగా, ముందుకు ఉరికే విధంగా... సినిమా పాటలు కూడా జోడించి, పేరడీ పాటలు చొప్పించి, జోకులు కూడా కలిపి, సంభాషణలు జోడించడం వల్ల అంతా కూడా చక్కగా అయిపోయింది.

ఇక డాక్టర్ నాగరాజు పంతుల్లాగా వేషం వేయడము, తర్వాత బాలాజీ రాఘవేంద్ర ఏసు పాదం అని, సాయి రామకృష్ణ రామయ్య అన్నట్టుగా... రహీంగా కళాధర్‌ను ఇలాగ ఒక ఐదు ఆరు మంది వ్యక్తులు చక్కటి కంఠం ఉన్నవాళ్లు చక్కటి అభినయం చేసే వాళ్లు కుదిరారు. అలా వీధి నాటకానికి తెర తీశారు. 'మార్పు రావాలి' అని చాలా విచిత్రమైన టైటిల్ పెట్టుకున్నాం.

మరో ప్రక్క పురుషోత్తమ్ ఇంద్ర జాల ప్రదర్శన, ఋషి కుమార్ మూకాభినయం చేసేవారు. ఎవరు కూడా సామాన్యమైన మనుషులు కాదు వీళ్లందరూ కూడా. అద్భుత ప్రతిభ, అర్హతలు కలిగిన వారు. అన్నిటి కన్నా ఎక్కువగా భగవంతుని పట్ల భక్తి, ప్రేమ కలిగి, స్వామి కోసం ఏదో చేయాలి అన్న తపన ఉన్న వాళ్లు.

తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లినప్పుడు ఏలూరులో మొట్టమొదటి సారిగా ఆ తరవాత పెదపాడు గ్రామంలో ఇంకొకసారి, తర్వాత ఎర్రంపల్లి గ్రామంలో మరొకసారి ఈ నాటకాన్ని వేయడం జరిగింది. నిజానికి ఆ నాటకము ఎంత ఉత్సాహాన్ని రేకెత్తించేది అంటే... చూసే వాళ్లందరూ మైమరిచిపోయి, తమ గ్రామంలో నిజంగా రచ్చబండలో జనాలు మాట్లాడుకుంటున్నట్టుగా ఊగిపోయే వాళ్లు.

ఇక తదాదిగా ఏ గ్రామానికి వెళ్లినా, ఏ జిల్లాకు వెళ్లినా, ఏ సమ్మేళనాలకి వెళ్లినా ప్రధానంగా "మార్పు రావాలి" ప్రదర్శించాము. సుమారు 1997-98లో ఈ నాటకం, గ్రామ సేవ కార్యక్రమానికి ఒక విశిష్టమైన విలువను, అపూర్వమైన రంగును సమకూర్చిందని చెప్పాలి.

గజ్వేల్ గ్రామంలో, "గ్రామ సేవ మహా యజ్ఞం" ఒకటి సంకల్పం చేసి ఆ గ్రామం చుట్టూరా ఉన్న ఆరు ఏడు గ్రామాలలో... ఐదు ఆరు రోజులు కార్యక్రమం చేయాలి అని తలచాము.

నాకు గుర్తు, గజ్వేల్‌లో భాస్కర్ సేట్ అనే వ్యక్తి, చాలా అంకిత భావం ఉన్న సాయి సైనికుడు. వారి ఆధ్వర్యంలో... సేవ చేసుకుంటూ వచ్చాం. ప్రతి గ్రామం, అక్కడ జరిగిన విశేషాల గురించి ఒక వ్యాసం వ్రాయొచ్చు. కానీ ప్రస్తుతానికి నేను "మార్పు రావాలి" నాటకం గురించి మాత్రమే చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. ఏ విధంగా మాలో ఈ నాటకం పరిణితి కల్పించింది, ఏ విధంగా మాలో ఉన్న నిద్రాణమై ఉన్న చైతన్యాన్ని మేలుకొలిపింది, ఏవిధంగా అది మమ్మల్ని స్వామికి దగ్గరగా చేసింది, స్వామి ఏ విధంగా దాన్ని తీసుకున్నారు అనే విశేషాలు నేను చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

గజ్వేల్ గ్రామ సేవలు అయిపోయాక మేమంతా స్వామి వారి దగ్గరికి వెళ్లడం, స్వామి ఎంతో

సంతోషంగా అందరికీ ఏకాంత సౌధ సంభాషణ అనుగ్రహించడం (ఇంటర్వ్యూ) ఆ సమయంలో మేము మొదటి సారి స్వామి ముందు "సాయి మాత బిడ్డలం అందరం" పాడటం జరిగింది. మాకు సాయి కుల్వంత్ సభా ప్రాంగణము నందు... స్వామి సన్నిధిలో భజన చేసే అవకాశం కూడా వచ్చింది. స్వామి పాద నమస్కారం ఇచ్చారు. ప్రసాదం ఇచ్చారు. ఇక అందరూ వెళ్లిపోవాలనే ప్రయత్నం చేస్తున్నారు.

అలాంటి సమయంలో స్వామి "ఏమిటి? ఏం విశేషము?" అని అడిగితే... స్వామి ఒక నాటకం ఉంది, నాటకం వేస్తాం అంటే... "ఏం నాటకము?" అంటే 'మార్పు రావాలి' అన్న నాటకము అని అన్నాము. "ఎవరికి రావాలి మార్పు?" అంటే... స్వామి 'ఇది మాలో మార్పు రావాలి, జనంలో మార్పు రావాలి, సేవకుల్లో మార్పు రావాలి, అందరిలో మార్పు రావాలని మేము చేసుకుంటున్నాం' అని చెప్పడంతో స్వామి చాలా సంతోషపడి, పూర్ణచంద్ర ఆడిటోరియంలో చాలా పనులు జరుగుతున్నాయి, చాలా వాహనాలన్నీ నిలిపినారు, కాబట్టి అక్కడ కుదరదు. "ఏం చేద్దాము?" అని మాట్లాడుతుండగా, సోదరుడు YC మరియు ఇతరులు 'స్వామి... మరి కాలేజీ ఆడిటోరియం' ఉందిగా అని ప్రస్తావించారు. వెంటనే స్వామి 'సరే!' అని, నరేన్ రామ్‌జీని పిలిచి, 'ఆడిటోరియం రెడీగా ఉందా?' అని అడిగారు. ఆయన లేచి 'స్వామి, ఇట్ ఈజ్ నాట్ రెడీ, స్వామి,' అని సమాధానమిచ్చారు. దాంతో స్వామి చాలా కఠినంగా 'స్వామి ఏమైనా అడిగితే సమాధానం యస్ ఉండాలి, నో ఉండకూడదు. వెళ్లండి, నేను సాయంత్రం వస్తాను ఆడిటోరియంకి. బాయ్స్, యూ గెట్ రెడీ,' అని చెప్పేసి వెళ్లి పోయారు.

తర్వాత మళ్లీ సరైన సందేశము అందలేదు. బస్సు పర్మిట్ ఆ రోజు రాత్రికి అయిపోతుంది. వెళ్లాలా? వద్దా? అనే ఊగిసలాట. సోదరుడు ఉదయ్ మనం ముందుకు వెళ్లిపోదాం. ఎందుకయ్యా మనం అనవసరంగా ఇరుక్కున్నాం? స్వామి ఎస్ చెప్పలేదు నో చెప్పలేదు. ఇలా రకరకాలుగా సంభాషణలు జరిగాయి.

తర్వాత మధ్యాహ్నం ఎప్పుడో వేదనారాయణ గారి ద్వారా స్వామికి సందేశం పంపించడం, స్వామి 'ఇంకా వీళ్లు వెళ్లలేదా? ఏమి ఇట్లా చేసినారు? సరే కూర్చోమని చెప్పు.' అని కూర్చున్న తర్వాత స్వామికి ఆరు గంటలకు వెళ్తామని చెప్పడం... ఇలా ఎన్నెన్నో విశేషాలు జరిగాయి.

తర్వాత భజన చేసే అద్భుతమైన అవకాశం స్వామి హైదరాబాద్ యువతకు ఇవ్వడము, భజన మందిరంలో స్వామి ముందే కూర్చుని పాడటం జీవితములో మరచిపోలేని అనుభవంగా నిలిచి పోయింది. స్వామి YCని ఆశీర్వాదం చేస్తూ చేతి గడియారాన్ని సృష్టించి ప్రసాదించడము, ఇలా చాలా జరిగాయి.

ఆ సమయంలో స్వామి మాట్లాడుతూ... "సాయంత్రం నాటకానికి వేషాల పరిస్థితి ఏమిటి? అంటే... స్వామి కాస్ట్యూమ్స్ ఏమి అవసరం లేదు, అవునా? కాస్ట్యూమ్స్ లేని నాటకమా! సరే చూద్దాం!" అంటూ చెప్పి స్వామి మమ్మల్ని ఆశీర్వదించడం జరిగింది. ఇక అక్కడి నుండి పరిగెత్తు కుంటూ కాలేజీ ఆడిటోరియంకు చేరుకున్నాం.

వేదిక వెనక భాగంలో మేకప్ వేసుకునే పనిలో ఉన్నాం, స్వామి అంతకు ముందే మేజర్ జనరల్ చిబ్బర్, అలాగే వి కే నరసింహన్ గారు, జి వెంకటరామన్ గారు... ఇలాంటి మేధావులకు కూడా చెప్పి... వెళ్లండి, నేను కూడా వస్తున్నాను, హైదరాబాద్ పిల్లలు డ్రామా వేస్తున్నారంట... అని పంపించారు.

ఏమిటి ఇదంతా!? అసలు ఊహించ లేమంది! కేవలం రచ్చబండ మీద ఆడుతూ, పాడుతూ, ఉల్లాసభరితంగా మేము సరదాగా చేసిన ఈ నాటకాన్ని, స్వామి చూస్తున్నారు అనేది చాలా అద్భుతమైన విషయం. కారణం, ఏంటంటే... మొట్ట మొదటిసారి మాకు తెలిసినంత వరకు స్వామి ముందు ప్రీరికార్డెడ్‌గా (ముందుగా రికార్డ్) చేసిన నాటకం కాకుండా... మైకులు పెట్టుకొని, ఒక వీధి నాటకం లాగానే చేయడము, వేషాధారణ లేని నాటకము, వాద్య సంగీతం లేని నాటకము ఇవన్నీ లేకుండా... మొట్ట మొదటిసారి ఇలా మేము చేసే అవకాశం ఇచ్చారు. కారణం, స్వామి చూసింది వీధి నాటకాన్ని కాదు, గ్రామాల్లోకి వెళ్లి ఆ జగన్నాటక సూత్రధారి అవతారకార్యంలో... తొలి అడుగులు వేస్తున్న హైదరాబాద్ పిల్లలని చూశారు. ఆశీర్వాదం చేయడం కోసం, ఈ అవకాశం ఇచ్చారు అనిపించింది.

స్వామి ఆడిటోరియం లోకి రావడము, సరాసరి ఆ వేదిక వెనక వైపు వచ్చేసి, మీసాలు, గడ్డాలు, టోపీలు, కలర్ డ్రెస్సులతో మేకప్ చేసుకుంటున్న పిల్లలందరిని ఆశీర్వదించారు. ఆ సమయంలో... అమెరికా నుండి వచ్చిన జర్మీ (హైదరాబాద్‌లో నాతో ఉండే వాడు) తెర వెనక నుండి నాటకాన్ని ఆంగ్లంలో పరిచయం చేశాడు. నేనేమో తెలుగులో చెప్పాలనుకొని తయారై తెర వెనక నుండి మైక్ పట్టుకుని... ఓం శ్రీ సాయిరాం! అనడం ఆలస్యం!! వేదిక ముందు కూర్చున్న స్వామి, ఇంగ్లీష్‌లో అయిపోయింది కదా! ఇంక తెలుగులో ఎందుకు? అవసరం లేదు అని చెప్పడం జరిగింది. ఎంతో ఆశతో మాట్లాడే ప్రయత్నం చేసిన నాకు ఇది శరాఘాతంలాగా తగిలింది. గాలి బుడ్డలో నుండి గాలి తుస్సుమని వెళ్లి పోయిన భావన! షాక్ అయిపోయాను. అయ్యో అవకాశం పోయిందే అని.

ఇక ఆ నాటకం చివరిలో నేనే జనం మధ్యలో నుండి వేదిక మీదకు పరిగెత్తుకుంటూ వెళ్లి పాట పడాలి... ఏమి చేయాలో తెలియక 'స్వామి ఇట్లా అన్నారని చాలా బాధపడుతూ కిందికి వస్తే... చాలా విచిత్రము! విద్యార్థులందరితో కూడా ఆడిటోరియం నిండిపోయింది. హైదరాబాద్ యువకులు మాత్రము స్వామి చైర్ చుట్టూతా కూర్చోవడము జరిగింది, నేను కూడా అందరితో పాటూ కూర్చున్నాను.

ఆ నాటకం అంతా కూడా చాలా విశేషంగా జరిగింది, మంచి ఊపులో ఉండే, 'ముస్తఫా ముస్తఫా డోంట్‌వర్రీ ముస్తఫా', '(గ్రీకు వీరుడు నా రాకుమారుడు', 'నిన్ను గని శరణమని సన్నుతించు వేళ...' అలాగే "ఓ ఆంధ్ర యువకుడా లేవోయి, సత్యసాయిని చూడ పదవోయి..." "సాయి మాత బిడ్డలం అందరం, సాయి మాత బిడ్డలమే అందరం" ఇలా ఈ ఐదు పాటలతో కూడిన, సుమారు 40 నిమిషాల నాటకము, మూల మాతృకలో మార్పులు చేయనిది ప్రదర్శించాము. ఆ గ్రామాల్లో ఏం జోకులు వేసేవాళ్లమో, ఏ విధంగా చతురోక్తులు ఆడేవాళ్లమో, ఏ విధంగా మాట్లాడే వాళ్లమో, ఆ యాస, భాష, ప్రాస, అంతా కూడా అలాగే చేశాము.

నిజానికి నాటకం చూసేది స్వామి అంతరంగిక భక్తులు, విద్యాసంస్థ అధ్యాపకులు, పెద్దవాళ్లందరూ. వాళ్లందరికీ ఈ నాటకం చాలా విచిత్రంగా చూశారు. ఏంటబ్బా! కొంచెం కూడా మార్చకుండా చేశారే, స్వామి ముందర అని. కానీ మాకు మాత్రం ఇంకెవ్వరూ లేరు. స్వామి మాత్రమే! స్వామి ఎంతో ఏకాగ్రతలో చూస్తున్నట్లు అనిపించింది. ప్రతి సీన్‌ను ఆస్వాదిస్తున్నట్టు అనిపించింది.

తర్వాత నా పాత్ర వచ్చేసరికి – నేను జనం మధ్యలో నుంచే 'నేను వస్తున్నాను... నేను వస్తున్నాను...' అని గట్టిగా అరుస్తూ వేదిక పైకి పరిగెత్తి, ఓ ఆంధ్రా యువకుడా లేవోయీ...

పాడడం జరిగింది.

ఈ పాటను 1995లో స్వామి ఏకాంత సౌధ సంభాషణ సమయంలో ఇచ్చిన స్ఫూర్తి చేత వ్రాసి, ఆంధ్ర రాష్ట్రం అంతా పాడిన అదృష్టం నాది. అది కూడా స్వామి ప్రత్యక్ష సన్నిధిలో పాడటం... అలాగే "సాయి మాత బిడ్డలం అందరం" పాట కూడా స్వామి సమక్షంలో పాడగలిగే అదృష్టం కలిగింది.

నాటకం ముగిసిన తర్వాత స్వామి చాలా మెల్లగా... మందహాసంతో వేదిక మీదికి రావడము, మా అందరితో గ్రూప్ ఫోటో తీసుకోవడము, అందరిని ఆశీర్వాదము చేయడము, తర్వాత కిందకి వచ్చి చాలా విశేషంగా అందరితో మాట్లాడి "చాలా సంతోషం బంగారు! బాగా చేశారు బంగారు!" అని చెప్పడము... మంగళ హారతికి ముందు స్వామి వై శ్రీనివాస్‌ని పిలిచి, ప్రొద్దున ఒక పాట పాడారు కదా... భజనలో, ఏం పాట అది?" అని అడిగారు. స్వామి ఏ పాట గురించి అడుగుతున్నారో తెలియక... తికమక పడి... కొన్ని పాటలు గుర్తు చేశాడు. చివరికి రామ అనరాదా మరొక సారి రామా అనరాదా స్వామి" అని చెబితే... వెళ్లు వెళ్లు అది పాడు ఇంకో సారి పాడు అని చెప్పారు.

"రామా అనరాదా మరొక్కసారి రామా అనరాదా... రామా అంటే రాగము తొలగును! కృష్ణా అనరాదా మరొక్కసారి కృష్ణా అనరాదా... కృష్ణ అంటే కష్టము తొలగును" పాట మళ్లీ వేదిక మీద నుండి అందరం చేరి పడినాము.

ఈ పాట 1996 నుండి ఇప్పటి దాకా... సుమారు దశాబ్ద కాలపు జీవిత సేవాకార్యములో, నేను వ్రాసి, స్వర పరిచి పరిచయం చేసిన ఎన్నో భజన పాటలలో మరొక పాట. ఇలా ఈ పాటలన్నీ కూడా... ఏదోవిధంగా స్వామి సన్నిధిలో పాడే అవకాశం కలిగింది. పాటల వెనక స్వామియే స్ఫూర్తి. నేను పాడిన పాటలన్నీ కూడా... జనాలను డాన్స్ చేయించిన పాటలే. ఈ పాటలన్నీ కూడా స్వామి ముందు పాడాం. అలాగా ఆ రోజు YC పాడాడు, అందరిని స్వామి ఆశీర్వదించాడు.

దీనికంతా నేపథ్యము ఏమిటి అంటే "మార్పు రావాలి" అన్న నాటకం. తర్వాత కాలంలో మార్పురావాలి నాటకం కాస్త హైదరాబాదు ఎల్లలు దాటి, జిల్లాల వ్యాప్తంగా వెళ్లిపోయి... రాష్ట్రల వ్యాప్తంగా వెళ్లిపోయి... ఎక్కడ గ్రామ సేవలు జరిగితే అక్కడ, మా అవసరం లేకుండా, ఈ డ్రామా స్క్రిప్ట్ వ్రాయించుకొని, తీసుకుని, నేర్చుకుని వాళ్ల ప్రాంతాలలో నాటకం వేసుకోవడం మొదలు పెట్టారు. ఇలా ఎన్ని వేల మంది స్ఫూర్తి పొందారో అనిపిస్తుంది. హైదరాబాద్ యూత్ సంస్కృతిక కార్యక్రమాలను, పాటలను, భజనలు చూస్తూ ప్రేరణ పొందిన ఎన్నో జిల్లాల యువ నాయకులు వాళ్ల బృందాలను తయారు చేసుకున్నారు అని చెప్పడంలో సందేహం లేదు.

అలాగా తర్వాత కాలంలో డాక్టర్ నాగరాజు లండన్‌కి వెళ్లిపోవడం, అప్పుడి నుండి సుబ్రహ్మణ్య సాయి ప్రధాన పాత్ర పోషించాడు, కళాధర్ ఉన్నప్పుడు రహీం పాత్ర చేసేవాడు, కళాధర్ లేకపోతే YC చేసేవాడు, యేసు పాదం పాత్ర బాలాజీ రాఘవేంద్ర... సాయిరామ కృష్ణ, బోయిరాజు వీళ్ల ఇద్దరిలో ఎవరూ ఒకరు రామయ్య పాత్ర ఇలాగ ఈ కార్యక్రమంలో ఒక 10, 20 మంది అద్భుతమైన చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఇవన్నీ కూడా గుర్తుచేసుకుంటుంటే ప్రతి ఒక్క అంశాన్ని స్వామి ఎలా కూర్చారు, ఎలా తీర్చారు, ఎలా చేర్చారు, ఎలా మార్చారు... ఈ "మార్పు రావాలి" అన్న నాటకం, జనం కోసం చేసింది కాదు, మాలో మేము మార్పు తేవాలి, అన్న ఆలోచనతో చేసింది. ఇలాంటి అవకాశం ఇచ్చిన స్వామి వారికి శిరము వంచి అభివాదం చేస్తూ... ఈ వ్యాసాన్ని స్వామి పాదాల చెంత సమర్పిస్తున్నాను.

57

డా. నర్సింగరావు – ఐక్యతకు కారణం!

సాయి బాటలో నా పయనం...
సాయి సేవలో నా జీవనం...
సాయి కార్యంలో నా జీవితము...
అప్రతిహతంగా సాగుతున్న రోజులు!

1996 నుండి 2000 మధ్య కాలం చాలా గుర్తు ఉంటుంది. ఎప్పుడూ కూడా ఆడిందే ఆటగా, పాడిందే పాటగా, చేసిందే సేవగా, స్వామి వారి దివ్యాదేశాలకు అణుగుణంగా, సాయి మార్గంలో ఒక గంగా ప్రవాహం లాగా సాగుతున్న కాలమది. ఎక్కడికి వెళ్లినా స్వామి ప్రేమనే ఆధారంగా, ఏమి చేసినా సేవయే లక్ష్యంగా ఎంచుకొని వెళుతున్న సత్య సాయి యువత (హైదరాబాద్ యూత్)కి నిజము చెప్పాలంటే స్వామిని విడిస్తే... ఇక బయట ప్రపంచంలో చాలా అరుదుగా సంస్థ సభ్యులు, భక్తుల ఆదరణ, ఆలోచన, ప్రేమ, అనురాగము అందేదని చెప్పాలి.

కారణాలు ఏమైనా... ఆ రోజుల్లో మాకు స్వామితో మాత్రమే హృదయాంతరంగ సంబంధం ఉండేది. ఏదైనా భావాలను పంచు కోవాలంటే... స్వామికే ప్రాసుకునే వాళ్లం, స్వామికే చెప్పుకునే వాళ్లం, స్వామి దగ్గరే కూర్చునే వాళ్లం, స్వామి ఏమి చెప్తే దాన్ని తారక మంత్రంగా తీసుకొని వెళ్లే వాళ్లం.

అలాంటి సందర్భంలో సత్యసాయి సేవా సంస్థలో మొదటిసారి ఒక అద్భుతమైన నాయకుణ్ణి... స్వామి పైన అచంచల విశ్వాసము ఉన్న వ్యక్తిని మేము కలిశాము.

చాలా అత్యున్నత నాయకత్వాన్ని సుమారు ఒకటిన్నర దశాబ్దాల కాలము సత్య సాయి సంస్థలకు అందించిన మహానుభావుడు ఆయన. చాలా యాదృచ్ఛికంగా ఆ హైదరాబాద్ యువత చేస్తున్న కార్యక్రమానికి వచ్చారు. సాయి యువత చేసే పనుల వారి గురించిన వివిధ విషయాలు, సంస్థలో

నాయకులు, కార్యకర్తలు మాట్లాడే మాటలు ఆయన దృష్టికి వెళ్లాయి.

అలాంటి సందర్భంలో, ఒకసారి శివం ఆఫీసులో ఉన్న ఆయన కార్యాలయానికి మమ్మల్ని పిలిచారు. మొదటి సారి మేము చేస్తున్న విశేషమైన సేవా కార్యక్రమాల గురించి విని ఎంతో ఆనందపడి... ఉప్పొంగిపోయారు. 'అయ్యా, ఇంత మంచి పని చేస్తున్నారు మీరు. చెప్పండి, మీరు ఎక్కడికి రమ్మంటే మీతో పాటు నేను కూడా వస్తాను. మనందరం కలిసి వెళ్దాం, చేయి చేయి కలిపి సేవలు చేద్దాం... అని చెప్పారు. మనందరం ఒక్కటే! సాయి సంస్థ, సాయి యువత, వేరు వేరు కాదు. మనందరం కలిసి పని చేద్దాం. మీకు ఎవరైనా అడ్డం వస్తే నాకు చెప్పండి. నేను వచ్చి మాట్లాడతాను అంటూ ఆయన హైదరాబాద్ యువజన బృందానికి మార్గనిర్దేశం చేశారు. వారు ఎవరో కాదు ఆ నాటి ఆంధ్ర రాష్ట్ర సాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షులు... Dr G నర్సింగరావు.

ఒకసారి సింహావలోకనం చేసుకుంటే మేము అందరం నర్సింగరావుకు ఋణపడి ఉన్నాము. వారి యొక్క మార్గదర్శనం వల్లనే హైదరాబాద్ యువత అంతా... ఈ రోజు సత్య సాయి సంస్థలలో అద్భుతమైన నాయకత్వ శ్రేణిలో కొలువు తీరింది అని చెప్పాలి. సాయి మిషన్‌లో, స్వామి ప్రేమకు సజీవ సాక్ష్యంగా నిలిచిన డాక్టర్ నర్సింగరావు వారిని ఈ సందర్భంగా స్మరించుకుంటున్నాను.

ప్రతిదీ స్వామి నుంచే నేర్చుకోక్కర్లేదు అని నేను ఎప్పుడు నమ్ముతాను... స్వామి దగ్గర నుంచి నేర్చుకోవడము అనేది ఒకటైతే, స్వామి చుట్టూరా ఉన్న మహనీయులనుంచి కూడా మనం నేర్చుకోవాల్సింది మరొకటి. సత్యసాయి మహిమలని మనం అర్థం చేసుకోవాలి అంటే... స్వామి ఇచ్చిన రింగో, ఉంగరమో, చైనో, విభూతో ఇది చూస్తే ఏమీ అర్థం కాదు. ఇదిగో ఇలాంటి మహనీయులను చూస్తే, స్వామి ఎలాంటి అద్భుతమైన మహిమలని ప్రపంచానికి ఇచ్చాడో తెలుస్తుంది. సుమారు నాలుగైదు దశాబ్దాల పాటు గాంధీ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా, డీన్‌గా, ప్రిన్సిపల్‌గా మాత్రమే కాకుండా, అనేక మందికి మెంటార్ గానూ, గైడ్ గానూ సేవలు అందించిన మహనీయులు వారు.

చాలా స్నేహశీలి నిగర్వి, అజాత శత్రువుగా, సాయి సంస్థలలో నాయకత్వం అందించారు. 1985వ సంవత్సరంలో తిలక్ గారితో కలిసి, స్వామి షష్టి పూర్తి సందర్భంగా సత్యసాయి తాలూకాలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలలో, స్వామి వారిని చూడడము, స్వామి వారు ఆయన్ని ఆశీర్వాదం చేయడము, తదాదిగా ఎన్నో వైద్య సేవలకి శ్రీ కారం చుట్టడం జరిగింది. సంస్థలో ఎంతో సౌమ్యులుగా... మృదు స్వభావిగా పేరు తెచ్చుకున్నారు.

అలాంటి సందర్భంలో... బీవీ రమణరావు గారి నుండి నాయకత్వం అందుకున్న కామరాజు అనిల్ కుమార్, స్వామి ఆదేశాల మేరకు బెంగుళూరు కాంపస్‌కి స్వామి లెక్చరర్‌గా వెళ్లినారు. పెద్దలు అందరితో పాటుగా దర్శనంలో కూర్చున్న డాక్టర్‌ని చూస్తూ... వారిని అధ్యక్షులుగా చేయమని చెప్పారట.

అలా స్వామి వారే రాష్ట్ర స్థాయి సంస్థల అధ్యక్షులుగా ఎంపిక చేసిన డాక్టర్ సుమారు ఒకటిన్నర దశాబ్దం పాటుగా రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. 2000 సంవత్సరంలో వారిని స్వయంగా కలిసి మాట్లాడినప్పుడు మాకు అనిపించింది... పదేళ్లుగా అలాంటి అద్భుతమైన వ్యక్తిని మిస్ అయ్యామేమో అని! ఎంత అద్భుతమైన క్రియాశీలత్వము అంటే... చాలా తక్కువగా మాట్లాడేవారు, చాలా తక్కువగా స్పందించే వారు. చాలా కఠినమైన నిర్ణయాలు కూడా అలవోకగా తీసుకునే వారు. ఎక్కడా విమర్శలకి తావులేదు. అలాగే ఎవరి విమర్శలకి వారు భయపడే వారు కాదు. తానే స్వయంగా చూసి అర్థం

చేసుకునే వారు. ఒక నాయకుడు ఎలా ఉండాలి అంటే ఇలాగే ఉండాలి అని అనిపించేది డాక్టర్ నర్సింగరావు గారిని చూస్తే.

వారు ఒక సారి మాతో మాట్లాడుతూ... చెప్పారు. అయ్యా ఇలాగ మీ అంతకు మీరు, మా అంతకు మేము వెళుతూ ఉంటే... ఐకమత్యం ఉండదయ్యా. అందరం కలుద్దాం. నేను మీతో వస్తాను, మీరు ఎక్కడికి వెళితే అక్కడికి వస్తాను. మీరు కూడా నాతో రండి, నేను ఎక్కడికి వెళితే అక్కడికి మీరూ రండి, మీరు మాట్లాడండి, మేము మాట్లాడతాము, మీరు సేవ చేయండి, మీ సేవలో మేము కూడా చేయి చేయి కలుపుతాం... సేవ చేయ కదులుదాం అంటూ వారు చెప్పడం విని ఎంతో ఆనంద పడినాము. చాలా సర్ది చెప్పారు. అయ్యా! మనమందరం కూడా కలిసి పని చేయాలి అని అక్కున చేర్చుకుని అనునయించినారు.

కలిసిమలిసి తిరుగుదాం
కలిసి మెలిసి పెరుగుదాం
కలిసి మెలిసి తెలుసుకున్న
కలిమి బలము పంచుదాం
కలిసి మెలిసి తెలుసుకున్న
గుణము బలము పెంచుదాం
ఓం ఓం ఓం అనుచు ఓంకారము పలుకుదాం
సేవ సేవ సేవంటూ సేవ చేయకదులుదాం!

అన్న భావనలని మాలో పాదుకొలిపినారు. తదాదిగా మేము కూడా సేవాదళ సభ్యులుగా పేర్లు నమోదు చేసుకున్నాం. తర్వాత ఇక ఇంటింటా, వాడ వాడ, గ్రామ గ్రామాన, జిల్లా జిల్లాలో, రాష్ట్రమంతా కూడా... మేము ఎక్కడికి వెళితే అక్కడికి వారు కూడా వచ్చారు... ఒక నాయకుడు అంటే పని చేసే వాళ్లకి ఇవ్వాల్సిన ప్రేమ అనురాగాన్ని ఇలా ఇస్తే అద్భుతమైన చాతుర్యము సిద్ధమవుతుంది అని చెప్పడానికి ప్రత్యక్ష నిదర్శనము డాక్టర్ జి నర్సింగరావు అని చెప్పాలి.

వీరి వ్యక్తిత్వాన్ని గురించి చెప్పాలి... సేవ చేస్తున్నప్పుడు వీరిని దగ్గరగా గమనించే అవకాశం, అదృష్టము మిగతా సోదరులతో పాటుగా నాకు కూడా కలిగింది.

వీరు చాలా స్నేహశీలి! ఎదుటివాడు పెద్దవాడా? చిన్నవాడా? తెలియని వాడా? తెలిసిన వాడా? జ్ఞానా? అజ్ఞానా? సాధకుడా? ఏమీ అవసరం లేదు. ఎవరు వారి దగ్గరికి వెళ్లినా... ఎంతో సౌమ్యంగా, ఎంతో సులభంగా, ఎంతో అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు అందించేవారు. ఇది చాలా ప్రధానంగా ఒక నాయకుడికి కావలసిన విషయము.

అజాత శత్రువు. ఎవరితోనూ శత్రుత్వం అనేది లేదు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేవారు. ఎవరిని కాదనే వాడు కాదు. అందరిని తన వాళ్లుగా అనుకునేవాడు.

నిరాడంబరుడు. అరే ఒక రాష్ట్ర సంస్థ అధ్యక్షుడు అంటే ఎలా ఉండాలో మనము చూస్తుంటాము... కానీ ఎట్టి హడావుడి ఉండేది కాదు. చాలా నిరాడంబరంగా వారి వేషము, భాష ఉండేవి. సామాన్యముగా కనిపించేవాడు. ఎవరైనా ఆయన రాష్ట్ర అధ్యక్షుడు అంటే తప్ప, ఎదుటి వాడికి అర్థంకాని విధంగా ఉండేవాడు. అందుకనేమో అతనిని స్వామి అలా ఆశీర్వదించే వారు.

వారధి, సాయి సంస్థకి, సాయి యువతకి మధ్యలో వారధిని నిర్మించిన మహానుభావుడు డాక్టర్ జి నర్సింగరావు. సాయి సేవా ఝరి మాస పత్రికకి నూతన సొబబులు అద్ది, నూతన

శీర్షికలతో పాఠకులకు భక్తులకు నూతనోత్సాహాన్ని అందించాలనే ఆలోచనతో, సాయి యువతను పిలిచి, అయ్యా! మీరు దీన్ని ముందుకు తీసుకెళ్లండి, అని మా చేతిలో పెట్టడం నేను నిజంగా గుర్తు పెట్టుకునే అంశం జీవితంలో.

నాయకత్వం, మరొక సమయంలో మమ్ములను పిలిచి మేము అందరం కూడా ముసలి వాళ్లం అయిపోతున్నాము... వయస్సు అయిపోతున్నది, ఈ సంస్థకి మీరందరూ కూడా నాయకత్వం తీసుకోవాలి... అని నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ యువజన బృందానికి నాయకత్వం ఇవ్వాలని మొట్ట మొదటిసారి, గంగాధర శర్మ (రింగురాజు)ను హైదరాబాద్ జిల్లా యువజన సేవలకు సమన్వయకర్తగా నియమించారు. తరవాత కాలంలో అంటే గత పాతికేళ్లుగా హైదరాబాద్ యువత నుండి వచ్చిన వాళ్లే నాయకత్వము వహించారు. అంతే కాదు... ఆ నాడు హైదరాబాద్ యూత్‌లో సేవలు అందించిన వాళ్లు ఈ నాడు సాయి సంస్థల క్రియాశీల కార్యకర్తలుగా... కార్య నిర్వాహకులుగా... జిల్లా నాయకులుగా... రాష్ట్ర నాయకులుగా సేవలు అందిస్తున్నారు.

ఇలాగ విశేషమైన ప్రేమని, అనురాగాన్ని, వాత్సల్యాన్ని హైదరాబాద్ యువతకి అందించిన వారు డాక్టర్ జి నర్సింగరావు గారు.

వారిని చూస్తే, పిల్లల్లో పిల్లాడిగా, పెద్దల్లో పెద్దాడిగా ఉండేవారు. ఇక్కడ కూర్చోకూడదు, ఇక్కడ నాకు గది కావాలి, ఇక్కడ స్టేజ్ కావాలి, చైర్ కావాలి... అలాంటివి ఏ మాత్రం లేవు. ఆయనలో ఉన్న ఆ సాదాసీదా స్వభావాన్ని మేము అందరం చూశాము.

వాత్సల్యం, మేము మాట్లాడుతుంటే వారు చిన్న పిల్లాడిలాగా, ఆ వేదిక ముందుకూర్చొని వినేవాళ్లు, మాకు బాగా గుర్తు. తన అభిప్రాయం చెప్పేవారు, "బాలచంద్ర బాగా చెప్పావు! వైసీ బాగా చెప్పావు. బాగుంది సంతోషం. అని అలా ముచ్చట పడేవారు. మమ్మల్ని చూస్తే తన పిల్లలుగా తలచి మురిసి పోయే వాళ్లు. అంటే ఒక నాయకుడు కార్యకర్తలను ఎలా చూసుకోవాలో, ఎలా ఉత్సాహపరచాలో వారినిచూస్తే తెలిసింది. ఎప్పుడూ కూడా ఎంతపెద్ద విషయాన్ని అయినా మూడు ముక్కల్లో చెప్పే శైలి, నైపుణ్యం వారిది అని తెలుసుకోవాలి.

స్వాధ్యయనం, వారి ఇంటికి చాలా సార్లు వెళ్లేవాళ్లం. ఎప్పుడు చూసినా ఏదో ఒక స్వామి పుస్తకం చక్కగా చదువుకునే వాళ్లు అన్నమాట. ఒక పక్క మాట్లాడుతూనే ఉంటారు, ఇంకో పక్క ఫట ఫట ఆ పేపర్లు తిప్పేస్తూనే ఉంటారు. అంటే స్వాధ్యయనము అనేది వారి యొక్క రక్తంలో ఇమిడిపోయింది అని చెప్పుకోవాలి.

స్థితప్రజ్ఞత, నాకు బాగాగుర్తు, స్వామి ఆశీర్వదించినా, అరిచినా, మందహాసము చేసినా, మందలించిన ఒకటే రకంగా తీసుకున్న వ్యక్తిత్వం వారిది. బహిరంగ సభలో స్వామి కఠినంగా మాట్లాడటం, వినడం నేను ఎప్పుడూ చూడలేదు. ఒక గురుపూర్ణిమ రోజు, స్వామి తన దివ్యోపన్యాసంలో భాగంగా మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుల పేరు తీసుకున్నారు. కొన్ని రాష్ట్రాల అధ్యక్షులని సూచిస్తూ స్వామి మందలించారు. చాలా తిట్టారు. అంటే నిజానికి మాకే ఆశ్చర్యం అయింది. అయ్యో మిగతా రాష్ట్ర అధ్యక్షుల గురించి మాకు తెలియదే, మరి ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులను ఈ విధంగా తిట్టారే! ఏమనుకున్నారో పాపం! అక్కడ ఆ సభలో అందరికంటే ముందర కూర్చున్న రాష్ట్ర అధ్యక్షులలో డాక్టర్ గారు కూడా ఉన్నారు. అంకుల్ ఏమనుకున్నారో ఏమో? అని నేను వారిని చూస్తున్నాను. కానీ ఆయన తల్లిముందు ఒక చిన్న పిల్లాడిలా ఉన్నాడు. అలా స్వామిని చూస్తూ దండం పెట్టుకొని ఉన్నారు తప్ప ఆయన ముఖంలో ఎలాంటి భావాలు పలకలేదు. తర్వాత అక్కడ

ప్రశాంతిలో నుంచి బయటికి వెళ్తున్నప్పుడు అడిగాను... "అంకుల్! ఏంటి అంకుల్? మీరు ఏమనుకుంటున్నారు ఇప్పుడు స్వామి చెప్పిన మాటకి? అంటే.. "అయ్యో! దానికి ఏముంది, స్వామి మనల్ని సరి చేస్తారు. ఏదైనా సరే... స్వామి మన మంచికోసమే చెప్తారు, అంతే... మనం ముందుకు వెళ్దాం, మంచి పని చేద్దాం, అంతే. దాని గురించి చింతించకు. సాయిరామ్!" అట్లా అంత అద్భుతమైన రీతిలో ఆయన స్పందిస్తారు అని నేను అనుకోలేదు, నా ఊహకు కూడా అందలేదు. ఇలాంటి నాయకులు ఉండడం వల్లే కదా... సాయి సంస్థలు పరిఢవిల్లినాయి. తిడితే కుంగడం, పొగిడితే పొంగడం అనే ఎక్కడా చూడలేదు. సుమారు 84 ఏళ్లు వారు బతికారు. చాలా సునాయాసంగా, అనాయాసముగా... అలా తన జీవితాన్ని స్వామి పాదాల దగ్గర సమర్పించి స్వామిలో ఐక్యం అయ్యారు.

ఇవన్నీ గుర్తు చేసుకుంటుంటే... స్వామి సేనాధిపతి అయిన వీరి జీవితంలో మన లాంటివాళ్లు, నాలాంటి వాళ్లు, ఎన్ని విషయాలు తెలుసుకోవాల్సి వస్తుంది? నిజంగా చెప్తున్నానండి... ఇలాంటి మహనీయుల ముందు మనం నాయకులమని అనుకోవడం కూడా తగదు. వారి స్థాయికి సరితూగటం అసాధ్యం. అలాంటి వ్యక్తిత్వము వారిది!

మాట్లాడుతున్న ప్రతి మాట కూడా ఆచితూచి మాట్లాడే వారు. ఎక్కడ ఎవరితోనూ కోట్లాడినట్టు ఉండేది కాదు. ఆ మాటల్లో తొణికిసలాడే అమాయకత్వము, ప్రేమ, అందరినీ కూడా సమ్మోహితులను చేసేవి. ఆయన 2000 నుండి ప్రపంచాన్ని విడిచిపెట్టే వరకు హైదరాబాద్ యువతకు అండగా నిలిచారు. నిజంగా మేమంతా కూడా చాలా బాధ పడ్డాం వారు స్వామిలో ఐక్యమైన రోజు. అయ్యో! ఇంత మంచి వ్యక్తిని మేము కోల్పోయామే అని చాలా బాధపడ్డాం.

"సత్యసాయి ఆదర్శ గ్రామ నిర్మాణ" పథకంలో భాగంగా వారు హైదరాబాద్ యువతతో ప్రయాణం చేసి, మాతో పాటు బోరవెల్లి గ్రామంలో సుమారు రెండు రోజులు ఉన్నారు. మాతో పాటుగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడ జరుగుతున్న విశేషాలన్నీ చూశారు. చాలా చాలా సంతోషపడ్డారు. అంతే కాదు! హైదరాబాద్ యువత ఏర్పాటు చేసిన ప్రతి జిల్లా పర్యటనలలో... తాను కూడా చాలా చురుకుగా పాల్గొనేవారు. అంతటితో ఆగలేదు. స్వామి వారే స్వయంగా పిలిచి పంపించిన అలనాటి దేశ అధ్యక్షుడు. వి. శ్రీనివాసన్ గారిని స్వయంగా తీసుకొని వచ్చి, హైదరాబాద్ యువత చేస్తున్న కార్యక్రమాలలో పాల్గొనేలా చేయడం అన్నది మా అందరికి మరొక మరుపురాని అనుభూతి. గోదావరిఖనిలో జరిగిన బృహత్తర కార్యక్రమంలో శ్రీనివాసన్ గారు, డాక్టర్ నర్సింగ రావు గారితో వేదిక పంచుకోవడం, మేమంతా కూడా మా కార్యక్రమాల గురించి వివరించడం, వారు ఎంతో ఆనందంతో వెనుతిరగడం మాకంతా గుర్తు. దీనికి అంతా కారణం... స్వామి ప్రధానం అవుతే... డాక్టర్ గారి ఆదర్శ నాయకత్వం మరొక కారణంగా అనుకుంటాను. మనమందరం కూడా ఇలాంటి మహనీయులని తలుచుకున్నప్పుడు, ఇలాంటి మహనీయుల జీవితం శైలిని గమనించినప్పుడు, వారికి స్వామి మీద ఉన్న అచంచల విశ్వాసము, నిరాడంబరత, నాయకత్వ ధోరణి, సేవా దృక్పథము, స్నేహశీలత్వము, అజాత శత్రుత్వం... ఇవన్నీ కూడా మనం తెలుసుకుంటే సంస్థకి ఎంతో మేలు చేసిన వాళ్లం అవుతాము అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను. ఈ విధంగా డాక్టర్ గారిని నేను తలుచుకుంటూ... వారి నుంచి నేర్చుకున్న ఎన్నో విషయాలని సింహావలోకనం చేసుకుంటూ, వారితో మేము భాగస్వామ్యం చేసినందుకు సంతోషిస్తూ... వారికి శిరము వంచి అభివాదం చేస్తూ... అలాంటి నాయకులు ఈ సంస్థకు కావాలని కోరుకుంటూ ఈ వ్యాసానికి ముగింపు పలుకుతున్నాను.

58

H.E.A.R.T in Grama Seva

ఏ ముహూర్తంలో గ్రామ సేవని మొదలు పెట్టామో...
ఏ ముహూర్తంలో స్వామి అనుగ్రహ భాషణము చేశారో...
ఏ ముహూర్తంలో స్వామి ఏకాంత సౌధ సంభాషణమును అనుగ్రహించారో...
ఏ ముహూర్తంలో స్వామి సన్నిధిలో మమ్మల్ని మేము మరచి పోయామో...
నిజంగా ఆ ముహూర్తానికి చాలా బలం ఉందని నేను తలుస్తూ ఉంటాను.

కారణం, ఆ పుణ్య ముహూర్తము మా జీవిత కాలపు మైలు రాయిగా నిలిచిపోయింది. కేవలం ఐదు ఆరు గ్రామాలలో సేవా కార్యక్రమాలు చేసుకుని, "గ్రామ సేవయే – సాయి సేవ" నినాదాన్ని ఎలుగెత్తి చాటుతూ స్వామి సన్నిధికి వెళ్లిన హైదరాబాద్ బాయ్స్‌కి... స్వామి ఇచ్చిన అనుగ్రహము, దర్శన, స్పర్శన, సంభాషణ, పాద నమస్కార, ప్రసాద, భాగ్యాలు అన్నీ జీవిత కాలానికి సరిపడా ఉత్తేజమును అందించాయి.

తదాదిగా ఎన్ని వారాంతాలు మా జీవితములో మేమంతా కూడా గ్రామ సేవలలో తరించామో గుర్తులేదు. గత మూడు దశాబ్దాలుగా ఎన్ని వందల గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించామో నిజానికి ఒక పట్టిక కూడా లేదు. వారాంతం వచ్చిందంటే ఏం చేయాలి? ఏం చేయాలి? ఏంచేయాలి? అని తపించే వాళ్లము. స్వామికి సేవ ఇష్టము. స్వామి మీద మనకు ఎంతో ప్రేమ ఉంది కానీ, స్వామికి ఇంకా సన్నిహితంగా ఉండాలంటే పుట్టపర్తిలో లేని మేమంతా... హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలలో జీవిస్తూ ఏమి చేయాలి? మన ప్రేమని స్వామికి ఎలా తెలియ చేయాలి? అన్న ఆలోచన ఎవరిని నిద్ర పుచ్చేది కాదు. నిద్రాహారాలు కూడా ఎవరికీ రుచించ లేదు. అనునిత్యము, అహరహము ఇలాంటి ఆలోచనలతో నిమగ్నం అయ్యే వాళ్లము.

ఇక గ్రామాలలో నిర్వహిస్తున్న సేవలన్నీ కూడా దేనికి దానికి ప్రత్యేక శాఖలుగా మారిపోయాయి.

ఎవరికి వాళ్లు ఆయా శాఖలను ఎన్నుకుని... ఇక వాటి గురించే ఆలోచిస్తూ, ఎవరి పని వాళ్లు చేసుకునే వాళ్లు. ఇలాగ ఎంత లేదన్నా ఒక 100-200 గ్రామాలలో కార్యక్రమాలు జరిగి ఉంటాయి.

గ్రామాలకు వెళ్లిన సందర్భంలో, "గ్రామ సేవయే - సాయి సేవ" ఉద్యమంలో మేము తెలుసుకున్న మంత్రం...

కొంత కాలానికి ఈ గ్రామ సేవలో హృదయము కనిపించింది మా అందరికీ కూడా. అంటే సేవలు హృదయ పూర్వకంగా చేయాలి. ఏం చేసినా స్వామికి మనకి Heart to Heart సంబంధం కదా.. కాబట్టి హృదయ పూర్వకంగా చేసింది ఏదైనా సరే... స్వామికి నచ్చుతుంది, స్వామికి ఒప్పుతుంది, స్వామి ఆనంద పడతారు అనే నమ్మకం ఏర్పడింది. ఇక హృదయ పూర్వకంగా సేవా కార్యక్రమాలు చేయడం మొదలు పెట్టాము. అంటే యాదృచ్ఛికంగా కాదు, యాంత్రికంగా కాదు, మంత్రపూర్వకంగా కాదు, హృదయపూర్వకంగా చేయడం... మాకు తెలిసిన మంత్రాలు, తంత్రాలు, యంత్రాలు, ఏమీ లేవు... హృదయము నిండుగా స్వామి మీద ప్రజ్వలిస్తున్న ప్రేమ, భక్తి, విశ్వాసాలే మమ్మల్ని నడిపించాయి. కాబట్టి గ్రామ సేవలో ఏం చేసేవాళ్లము అంటే ఈ హృదయము అనే భావన ఎప్పుడైతే మేము పెట్టుకున్నామో... అసలు "హృదయము" (HEART)లో నుంచి ఎందుకు మనం గ్రామసేవ కోసం ఏదైనా కాన్సెప్ట్ లేదా థీమ్ తీసుకురాకూడదు అని ఆలోచించడం మొదలు పెట్టాము.

అలాగా చాలా నిద్ర లేని రాత్రులు చాలా రకాలుగా మాట్లాడుతున్నప్పుడు మాకు గోచరించింది ఒక అద్భుతమైన తారకమంత్రము. అదే "HEART." అంటే దయతో కూడిన హృదయమే దైవ మందిరము అని స్వామి చెప్తారు కదా! మరి గ్రామ సేవల్లో మనం ఏం చేయాలి? ఎలా హృదయాన్ని పెట్టాలి? ఎలా ఆ హృదయ పూర్వకంగా చేయాలి అని ఆలోచించినప్పుడు... ఆంగ్లములో HEART అనే పదము వచ్చింది.

ఈ HEART వల్ల మాకు వచ్చిన ప్రయోజనం ఏమిటి అంటే...

ఏది చేసినా హృదయం పెట్టి చేయాలి HEARTలో ప్రత్యేకత ఏముంది అంటారా!

"H అంటే ఏమిటి?" అని ఆలోచిస్తే ... HEALTH CARE మీద మనం పని చేయాలని తెలుసుకున్నాం. అది జంతు సంక్షేమం (Animal Husbandry) కావచ్చు, లేక మానవ ఆరోగ్య పరిరక్షణ (Human Health Care) కావచ్చు, ఎల్లప్పుడూ గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల ఆరోగ్య అంశాల గురించి ఆలోచించాలి అనుకున్నాము. అలాగే ఇది కేవలం శారీరక ఆరోగ్యానికే పరిమితం కాకూడదు; మానసిక ఆరోగ్యాన్ని కూడా మనం ఆలోచించాలి, బౌద్ధిక ఆరోగ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. శారీరక, మానసిక, భౌతిక, సాంఘిక ఆరోగ్య పరిరక్షణ ప్రయత్నాలతో ఒక సమగ్ర విధానం తీసుకుని రావాలని మేమంతా గ్రహించాము.

E అంటే EDUCARE (విద్యావినయము) EMPOWERMENT (సాధికారత).

అలాగే, A అంటే AGRICARE (వ్యవసాయ) సేవలు... ఆ తర్వాత ASSURANCE (భరోసా) క్రింద, గ్రామాల్లో ఉన్న యువతీ యువకులను ఎలా చైతన్యపరచాలో మేము ఆలోచించాము.

R అంటే, RURAL CARE (గ్రామీణ అభివృద్ధి మరియు నాయకత్వము)ను ప్రోత్సహించాలి అని మేము నిర్ణయించుకున్నాము. ఎన్నాళ్లు ఇలా మేము వెళ్లి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేసినా అవి శాశ్వతం కాదు కదా! కాబట్టి ఆ గ్రామాలలో మునుముందు ఎవరికి వాళ్లు అక్కడ ఎలా తమను తాము ఉద్ధరించుకోవాలి అని మేము ఆలోచించాము.

ఆ గ్రామస్తులకి స్వామి సిద్ధాంతాలను పరిచయం చేయాలి, మానవతా విలువలను వారికి

బోధించాలి. అప్పుడు గ్రామాల్లో చైతన్యం వస్తుంది... గ్రామస్తులు ఉత్సాహప్రోత్సాహాలతో స్వామి మార్గంలో పయనిస్తారని నమ్మాము. గ్రామాలలో మంచి పిల్లలను గుర్తించి, అక్కడ సత్యసాయి భజనమండలి ఏర్పాటు చేస్తే, ఉత్తరోత్తరా మనకు వారితో సంబంధం కొనసాగుతుంది. మనం ఎక్కడున్నా వారితో మాట్లాడి మంచి పనులు చేయించవచ్చు.

ఇలా గ్రామీణ నాయకత్వం (Rural Leadership), ఉపాధి శిక్షణ, సాధికారత (Empowerment), భరోసా (Assurance), వ్యవసాయం (Agriculture), పశుపోషణ (Animal Husbandry), వైద్య శిబిరాలు (HEALTHCARE), సామాజిక సేవా కార్యక్రమాలు (SERVICE) వీటికి ఆధ్యాత్మికత జోడించాలి అని 'HEART' అనే ప్రణాళికను రూపొందించాము.

అలా, T అంటే ఏమిటి అని చర్చించుకునే వాళ్లము. కొందరు 'TARGET' అన్నారు, ఇంకొందరు 'TIME' అన్నారు, మరి కొందరు THEME అన్నారు. ఈ విధంగా వివిధ రకాలుగా మేధో మధనం జరిగింది.

నాకు గుర్తున్న వరకు సాయి గొల్లపూడి, వై శ్రీనివాస్, రింగు రాజు, బోయ రాజు, వేణు, గజల్ శ్రీనివాస్, జి శ్రీనివాస్, సునీల్ ఇంకొంత మంది సాయి సోదరులు ఈ చర్చోపచర్చల్లో చురుకుగా పాల్గొనే వాళ్లు.

ఎంత చేసినా, ఎవరికి చేసినా, ఎలా చేసినా, ఎప్పుడు చేసినా, ఎందుకు చేసినా... ప్రయోజనం ఏమై ఉండాలి ఈ సేవా కార్యక్రమాలలో? అంటే మాకు స్వామి చెప్పిన ఎన్నో విషయాలను, సందేశాలను స్వాధ్యాయనం చేయడము, చిన్న అధ్యయన మండలులు ఏర్పాటు చేసుకొని, ఎంత మంది వస్తె అంత మంది... ఐదుగురు, ఆరుగురు, ఏడుగురు కలిసి ఎక్కడైనా సమావేశమై ు 'ఏం చేయొచ్చు? ఎలా చేయొచ్చు?' అనే విషయాలు చర్చిస్తున్నప్పుడు మాకు తోచిందేమిటి అంటే:

సేవ యొక్క పరమావధి అభివృద్ధి కాదు; సేవ ప్రతిఫలం భవనం కట్టడం, చెరువు తవ్వడం, రచ్చబండ నిర్మించడం కాదు. సేవ యొక్క అసలైన లక్ష్యం పరివర్తన (TRANSFORMATION) మాత్రమే అని తెలుసుకున్నాము. కాబట్టి సమాజంలో పరివర్తన రావాలి.

సమాజం అంటే ఏమిటి?

పరివర్తనం ఎవరికి రావాలి?

దీన్ని త్రికోణమూలా నిర్వచించుకున్నాం:

సేవ చేసే వ్యక్తి పరివర్తన చెందాలి,

సేవ పొందే వ్యక్తి పరివర్తన చెందాలి,

సేవా ఫలితం సమాజాన్ని పరివర్తన చేయాలి.

ఈ విధమైన హృదయపూర్వక సేవ మాత్రమే స్వామికి అర్పణ అవుతుంది అని మేము గ్రహించాము. అందుకే, 'T అంటే 'TRANSFORMATION' అని మేము హృదయ ఫలకం మీద ముద్రించుకున్నాము.

ఎన్నో గ్రామాల్లో... ఎన్నో వందల మందితో మాట్లాడే అవకాశం కలిగింది... ఎన్నో వందల మందితో చెయ్యి చెయ్యి కలిపి సేవ చేసే అవకాశం కలిగింది మాకు.. నిజంగా ప్రతి గ్రామ సేవ కూడా మమ్మల్ని మళ్లీ సేవ చేయాలనే సంకల్పం మాలో పుట్టించింది అంటే సందేహం లేదు.

ఎన్నో గ్రామాలలో కాలువలు నిర్మాణం చేశాం. మరెన్నో గ్రామాలలో ప్రార్థన మందిరాలు

శుభ్రపరిచే కార్యక్రమం చేసుకునే వాళ్లం. అలాగే చెట్లు నాటే వాళ్లం, తర్వాత పొలాలకి వెళ్లి, వాళ్లకి సరైన దిశా నిర్దేశం చేసేవాళ్లము. అలాగే రచ్చబండలు ఏమైనా శిధిలమై వాటిని పునర్నిర్మించే వాళ్లం. చెరువులు తవ్వే వాళ్లం, చెరువుల పూడిక తీసేవాళ్లం. రోడ్డు వేసే వాళ్లము. ఇట్లా ఏ పని కూడా ఇది మాది కాదు, మా చేత కాదు, మా వల్ల కాదు... అనే ఆలోచన ఎప్పుడూ చేయలేదు. అసలు శక్తి లేకున్నా సరే, హైదరాబాద్ బృందంలో కలిసిన ఎవరైనా సరే, ఒకొక్కరు ఒక హనుమంతుడి లాగా మారిపోయేవాడు. కొండలు ఎక్కి, ఎగిరి దుంకే వాడిలా మారే వాడు. అలాంటి అద్భుతమైన విశ్వాసము గ్రామ సేవ ఉద్యమము వందలాది మందిలో ఉద్భవించింది. అంటే చిన్న, పెద్ద, బీద, సాదా వ్యత్యాసమే లేదు. గ్రామంలోకి ఒక్కసారి వెళ్లామంటే... అందరం చేరి అద్భుతమైన శక్తి లాగా రూపొందే వాళ్లము.

ఒకటే ఒక్క మాట సాయి మాట,

ఒకటే ఒక్క బాట సాయి బాట,

ఒకటే ఒక్క మంత్రము సాయి మంత్రము,

ఒకటే ఒక్క సేవ సాయి సేవ,

ఇలాగ గ్రామ సేవ ఉద్యమము మమ్మల్ని ఏకతాటి మీదకు తీసుకొని వచ్చింది.

ఇక గ్రామాలలో... పట్టణాలలో... సాయి సంస్థలో ఏ కార్యక్రమాన్ని చేయాలన్నా కూడా ముందర స్వామికి మేము ఉత్తరం వ్రాసుకునే వాళ్లము. ఆ రోజుల్లో స్వామికి ప్రతిసారి ఇదే చేసేవాళ్లం. తర్వాత ఇక రేపు ఉదయం పోదాం అనంగా ఆ తెల్లవారు ఝామున లేదా ముందు రోజు రాత్రి స్వామికి ఒక ఫాక్స్ మెసేజ్ పంపించే వాళ్లము. అమాయకమైన భక్తి విశ్వాసములతో... స్వామి మా ఉత్తరాలు చదువుతారు, స్వామి మేము పంపించే ఫాక్స్ మెసేజ్లు చూస్తారు అని వ్రాసుకునే వాళ్లము. స్వామి! ఫలానా రోజు ఇక్కడికి బయలుదేరుతున్నాం... ఇదిగో ఈ రోజు రేపు ఇక్కడ ఉంటున్నాం అని... ఈ విధంగా సేవాకార్యక్రమానికి వెళ్తున్నాము అని... స్వామి మీరు మా ఇంట, వెంట, కంట, జంటగా ఉండి నడిపించండి స్వామి. మీరే మా లీడరు, మీరే మా లాడరు, మీరే మా ప్లీడరు, మీరే మా గైడ్... మీరే మాకు గురు & గురి అని మేమందరం వ్రాసుకునే వాళ్లము!

స్వామి కూడా అంతే అద్భుతమైన ప్రేమానురాగాలని అందరి మీద వర్షింప చేసేవారు. గ్రామాలలో మేము ఏవిధమైన సవాళ్లు వచ్చినా వాటిని సులభంగా అధిగమించి ముందుకు సాగేవాళ్లము. ఒకానొక సమయంలో కుంభవృష్టి కురిసిన గ్రామాలులో సేవ చేశాము. ఆ కుంభవృష్టి మమ్మల్ని ఏమి చేయలేకపోయింది. ఇంకొన్ని సమయాల్లో దేశంలో భూకంపం వస్తే మేము ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉండేవాళ్లము. సునామి వస్తే గ్రామ సేవల్లో ఉన్నాము. వరదలు వస్తే గ్రామ సేవల్లో ఉన్నాము. అంటే ఆరు నూరైనా, అటు సూర్యుడు ఇటు పొడిచినా, ప్రళయమే వచ్చినా, ఆకాశమే బద్దలైపోయినా, మేము మాత్రం వారాంతం వచ్చిందంటే ఎక్కడో ఒక చోట సేవలో ఉండేవాళ్లం. ఎక్కడ, ఎవరికీ ఏ బాధ, సవాలు కూడా మమ్మల్ని ఆపలేదు. ఇది అక్షర సత్యం సుమా!

చెరువులు త్రవ్వింది అయితేనేమి...

పంటలు వేసింది అయితేనేమి...

తెగుళ్లకి నివారణ చేసింది అయితేనేమి..

రైతులతో మాట్లాడింది అయితేనేమి... ఏమి చేసినా సరే... అది ఒక విద్యుల్లేఖ ఉత్సాహాన్నిచ్చిన

అనుభవం నిండుగా దండిగా పండేది. హైదరాబాద్ యువకుల సేవా కార్యక్రమాల్లో చేరిన ప్రతీ ఒక్కరి మనసులో చిరస్థాయిగా ముద్ర పడిన దివ్యానుభూతి అని చెప్పుకోవాలి.

కార్యక్రమాలు అంతా అయిన తర్వాత మళ్లీ స్వామికి ఒక ఫాక్స్ మెసేజ్ లేక ఒక టెలిగ్రామ్ పంపించుకునే వాళ్లం.

1996లో స్వామి అందించిన ఉత్సాహప్రోత్సాహములు అద్భుతమైన రీతిలో మూడు నాలుగు ఏళ్లు (1996 – 2000) కూడా హైదరాబాదు చుట్టుప్రక్కల ఉండే రంగారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్ అర్బన్ / రూరల్, మెదక్ తదితర జిల్లాల్లో మేమంతా సేవా యాత్రలు చేసే అదృష్టం కలిగింది.

ఇదంతా కూడా స్వామి భవిష్యత్తులో అందించబోయే మరింత మహత్తరమైన అవకాశాలకి నాందిగా నిలిచింది... ఇంకా చెప్పాలి అంటే అద్భుతమైన వేదికగా నిలిచింది అని చెప్పుకోవాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ అద్భుతమైన విషయాలు... ప్రతి గ్రామ సేవ గురించి ఒక దృశ్యకావ్యము వ్రాయచ్చు.

గ్రామ సేవా సమయంలో మేము తెలుసుకున్న విషయం ఏమిటంటే...

"హృదయమే వేదిక... హృదయమే వారధి...
హృదయమే సారథి... హృదయమే భావన...
హృదయమే చేతన... హృదయమే భక్తి...
హృదయమే యుక్తి... హృదయమె శక్తి...
హృదయమే ముక్తి!"

ఈ HEART అనేది ఒక తారక మంత్రం లాగా మారిపోయింది. సంస్థలో పెద్దలందరికీ ఈ సిద్ధాంతాన్ని వివరించే ప్రయత్నం చేశాము. జిల్లాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అక్కడి సభ్యులకు దీన్ని పరిచయం చేసే వాళ్లము. ఎక్కడికి వెళ్లినా స్వామి ఆశీస్సులు ఉండేవి కదా! దాని వలన మేము చెప్పే విషయాలు అన్ని కూడా అందరూ ఆమోదించి సేవలు చేసే వాళ్లు.

ఇలా హృదయ పూర్వకంగా చేసిన సేవలే... ప్రశాంతి నిలయానికి వెళ్లిన ప్రతిసారి... స్వామి మమ్మల్ని చూసే విధంగా చేసిందేమో. మేము చేసింది చిన్న చిన్న పనులే అయినా... ఆ పనిలో చిన్న చిన్న తప్పుటడుగులు వేసినా సరే, స్వామి మాత్రం ఎంతో ఆనందించి వెళ్లిన ప్రతిసారి ఇంటర్వ్యూ ఇవ్వడము, వెళ్లిన ప్రతిసారి మాట్లాడటం, వెళ్లిన ప్రతిసారి పాద నమస్కారం ఇవ్వడం, వెళ్లిన ప్రతిసారి ఏదో విధంగా పిల్లలందరినీ కూడా తన గుండెలకు హత్తుకోవడం, నేను స్వయంగా చూశాను. ఈ భావనలు చెప్తుంటే అయ్యో! ఆ Golden Days ఎంత అద్భుతంగా ఉండే... ఇప్పుడేమో మేము యూత్ కాదే... మేము ఆ యుక్త వయసులో ఉన్నప్పుడు ఎంత చేసుకున్నాము... ప్రస్తుతం అందరికీ సుమారు 50 సంవత్సరాలు దాటిపోయింది... కానీ ఆ స్ఫూర్తి ప్రేరణ మాత్రం అందరి హృదయాలలో ఇప్పటికీ నిలచి ఉంది. దానితోటి ఎవరి స్థాయిలో వాళ్లు ముందు తరాలకు ఎలా స్వామి సేవలను అందివ్వాలనే తాపత్రయంతో బ్రతికేస్తున్నారు. ఇట్లాంటి అద్భుతమైన అనుభవ సుమమాలను ఆ స్వామి పాదాల చెంత సమర్పించే అవకాశం కల్పించిన ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు అభివందనాలు ఆనంద పారవశ్య తందనాలు, మానవతా మూర్తులకు మహోజ్వల కీర్తులకు, వందనాలు అభివందనాలు ఆనంద పారవశ్య తందనాలు. ఈ విశేషాలతో ఈ వ్యాసం ముగిస్తూ మరొక భాగంతో మీ ముందుకువచ్చే ప్రయత్నం చేస్తాను.

59

Sai Go - Going in Sai Way!

1996 నుండి 2000 వరకూ గడిచిన కాలం మా అందరి జీవితాల పైన అసాధారణమైన ప్రభావాన్ని చూపింది. తహతహలాడే హృదయంతో, తపించే శరీరంతో, శక్తిసామర్థ్యాలు ఒడ్డి ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా, అలవోకగా... ఎంతో చతురతతో... చాతుర్యంతో... భౌతికంగా మా శరీరాలను సేవలో మేము అంకితంచేసుకునే వాళ్లం. ఈ భౌతికమైన స్థాయిలో సేవలు దాటి ఇంకా ఏదో ఉంది... అని నేను మొట్టమొదట తెలుసుకున్నది ఒక మహానుభావుడి యొక్క సహచర్యంలో అని చెప్పాలి.

వారిని చూసినప్పుడల్లా "అరే ఇన్నాళ్లుగా ఈ భావనలు నాకెందుకు తట్టలేదు?" అని అనుకునే వాడిని. ఆ వ్యక్తిని చూస్తే స్వామి యొక్క విలువలని, స్వామి యొక్క భావనలని, స్వామి యొక్క సిద్ధాంతాలని, స్వామి యొక్క పథమును, స్వామి యొక్క ఆధ్యాత్మికతను, స్వామి యొక్క ఆలోచనలను, స్వామి యొక్క ఆదర్శాలని, ఏ విధంగా ఆచరించే ప్రయత్నం చేయవచ్చు? అని అర్థం అయ్యేది. వారు ఈ రోజుకి కూడా నా జీవితానికి మెంటర్‌లా ఉన్నారని చెప్పుకోవడానికి ఎట్టి అభ్యంతరం లేదు.

సత్యసాయితో నా కథ చెప్పడం అంటే... స్వామి విశేషాలు మాత్రమే చెప్పుకోవడం కాదు. అలా చేస్తే నా జీవిత కథలో ఏదో లోటు అనిపిస్తుంది. అలా కాదు, స్వామి విశేషాలతో పాటు, స్వామి కార్యంలో పరిచయమైన మహానుభావులను కూడా తలుచుకుంటేనే నిజంగా నా కథకు పరిపూర్ణత సిద్ధిస్తుందని నమ్ముతాను.

స్వామి కార్యంలో, చెయ్యి చెయ్యి పట్టి, పదము పదము కలిపి, పాదము పాదము చేర్చి... నడిచిన వాళ్లలో సాయి ప్రసాద్ గొల్లపూడి ఒకరుగా నేను సదా తలుచుకుంటాను. మేమందరం, సాయి గొల్లపూడిని ప్రేమతో "సాయిగో" అంటూ ఉంటాము. "Sai Go — Going in Sai Way!" సాయి గొల్లపూడి పూర్తి పేరు "గొల్లపూడి వెంకట రామ జోగీశ్వర సత్య సాయి ప్రసాద్". వారి తల్లిదండ్రుల యొక్క దయ చేత సాయి గొల్లపూడి వారి కుటుంబం అంతా కూడా ధన్యత చెందింది.

మొదటి 10 సంవత్సరాలు అంటే ఐదవ తరగతి దాకా, పుట్టపర్తిలో 'ఈశ్వరమ్మ' పాఠశాలలో చదువుకున్నారు, అదృష్టం అనుకోవాలి. తర్వాత సుమారు 20 ఏళ్ల పాటుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వివిధ ప్రదేశాల్లో చదువుకొని, బాగుపడి, ఉద్యోగాలు చేసి... చిట్ట చివరికి 2000 సంవత్సరంలో అనుకుంటాను వారు స్వదేశానికి వచ్చారు. ఆ సమయంలో హైదరాబాద్ బాయ్స్‌తో సాయిగొల్లపుడి చేరినారు. అతని విశేషమైన అనుభవాన్ని, అప్పటికే జరుగుతున్న సేవా కార్యక్రమాలకి జోడించారు అని చెప్పాలి.

సేవకు సాంకేతికతను జోడించారు
సేవలో ఆధ్యాత్మ భావనను కూర్చారు
సాయి మాటని మంత్రాలుగా మలచారు
సాయి యూత్‌ని టెక్ బాయ్స్‌గా చేశారు

అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి... ఉన్నత ఉద్యోగాలు చేస్తూ... భారత దేశానికి వచ్చిన తర్వాత కూడా ఇంకా చదివి డాక్టరేట్ కూడా పొందినారు.

సామాన్యమైన విద్యార్హతలు కావు సాయి గొల్లప్పుడివి.

స్వామి సేవకులెవరైనా సరే ఇది గుర్తుపెట్టుకోవాలి. భక్తి ఒక్కటే ఉంటే సరిపోదు... ప్రవృత్తి ఒక్కటే ఉంటే సరిపోదు... వృత్తి నైపుణ్యం కూడా ఉండాలి... ఒక అద్భుతమైన ఉద్యోగిగా మనం మారాలి... అంటే, మనము పది మందికి చెప్పే విధంగా, మనం పది మందికి దిశా నిర్దేశం చేసే విధంగా, మన యొక్క విద్యాభ్యాసం ఉంటే బాగుంటుంది అని, ఎప్పుడు నేను తపిస్తాను. నిజానికి సాయి గొల్లపూడి తన B.Tech., M.Tech, పూర్తి చేసి, కృత్రిమ మేధస్సు (Artificial Intelligence) పై పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నారు.

మొట్టమొదటి సారి, స్వామి చెప్పే ప్రతి మాటని విశ్లేషణము చేయడము ఈయన తోనే చూశాను. ఒకసారి స్వామి ఉపన్యాసం అయింది అంటే... ఆ ఉపన్యాసం రికార్డును, ఆ ఉపన్యాసం యొక్క నకలను, ఆ ఉపన్యాసం క్యాసెట్ ను, మళ్లీ మళ్లీ చూడడము, వినడం చేసే వారు. ఎన్ని రకాలుగా స్వామి మాటలను విభజించి... ఆ సందేశాలను ఏ విధంగా ఆచరణాత్మకంగా తీసుకోవాలి అన్నది మొట్ట మొదటి సారి నా జీవితంలో లోతుగా అధ్యయనం చేసింది ఈయనతోనే చూశాను.

సాయి గొల్లపూడి ఎక్కడ ఉంటే అక్కడ ఒక ఆధ్యాత్మిక వాతావరణము ఎట్లా సృష్టించాలి? ఇదేమిటి ఇందులో భావన ఏముండొచ్చు? స్వామి ఎందుకు ఎందుకు ఇట్లా చెప్పారు? స్వామి ఎందుకు ఇలా మందలించారు? స్వామి ఎందుకు ఈ ఉపన్యాసంలో, ఈ విధంగా మాటలు చెప్పారు. స్వామి ఎందుకు ఈ విధంగా ఇంటర్వ్యూలో ఈ విధమైన సూచన ఇచ్చారు? ఇలాగ ప్రతి విషయము కూడా గంటల తరబడి, మేమందరం చేరి చర్చించే దానికి వేదిక సాయి గొల్లపుడి అయ్యాడు. మనము చేసే ప్రతి పని నీ ఆధ్యాత్మికతతో పూజగా మార్చే స్ఫూర్తిని నా లాంటి వాళ్లలో నింపిన సాయి గొల్లపూడికి నేను సదా కృతజ్ఞతలు తెలుపుకుంటూనే ఉంటాను.

చిన్నప్పటి నుండి కూడా నేను పిల్లలతో బాగా ఎక్కువగా గడుపుతూ ఉండేవాడిని. బాలవికాస్ అంటే నాకు ప్రాణము. పిల్లలతో ఆడి పాడడం అనేటువంటిది నాకు అలవోకగా వచ్చిన చాతుర్యము అనుకునేవాడిని. కానీ, సాయి గొల్లపూడిని చూసిన తర్వాత సాయి గొల్లపూడి మాట్లాడే మాటలు, ఆడే ఆటలు, పాడే పాటలు, చేసే చేష్టలు నన్ను ఎంత గానో మైమరిపింప చేశాయి... ప్రభావితం చేశాయి. ఇది సత్యం.

అంటే నేను, 30 ఏళ్ల నుంచి నేను బాల వికాస్‌లో ఉన్నా కూడా, సాయి గొల్లపుడిని చూసిన తర్వాత "అరే! స్వామి సేవలో ఈ విషయాలు కూడా నేను నేర్చు కోవాలి... 'Each one can teach one, Each one can can catch one' అని స్వామి ఎప్పుడు చెప్తుంటారు కదా... అలాగా హైదరాబాద్ యువకుల బృందంలో... సాయి గొల్లప్పుడి యొక్క సహచర్యంలో, స్నేహములో ఎన్నో విషయాలని నేను నేర్చుకున్నాను. అంత విద్యాభ్యాసము చేసినటువంటి, అంత ఉన్నతమైన ఉద్యోగంలో ఉన్న వ్యక్తి, ఇంత క్రింది స్థాయికి రాగలడా! ఇన్నేళ్లుగా ఎప్పుడు ఆయన వేదిక ఎక్కింది నేను చూడలేదు. ఎప్పుడు సామాన్యులలో సామాన్యునిడి లాగా ఉంటారు. కానీ అసామాన్యమైన ప్రతిభా పాటవాలు వారికి సొంతము. అంత ఎదిగిన వ్యక్తి ఇంత ఒదిగి ఎలా ఉండగలడు!? మరి మనలాంటి వాళ్లు ఎలా ఉండాలి? ఇంకా ఇంకా ఎక్కువగా ఒదిగి ఉండాలి, తలదించుకొని బ్రతకాలి అని నేను తెలుసుకున్నాను.

వారి స్నేహశీలత, సేవా నిరతి, త్యాగము, భావము, సంసారము, సంస్కారము, సమాజము, వృత్తి, ప్రవృత్తి ఇవన్నీ కూడా... ఆధ్యాత్మిక శైలిలోనే ఉన్నాయని నేను తెలుసుకున్నాను. ఎంత సంసారి అయినా సరే, ఆ సంసారంలో కూడా ఆ సాయిని, సాయి నామాన్ని, సాయి భావాన్ని, నిత్యనూతనములైన నవసూత్ర నియమావళిని వారు ఆచరిస్తున్నది నేను గమనించాను. నిత్య భజన అయితేనేమి, సుప్రభాతం చేసుకోవడం అయితేనేమి, ప్రార్థనాది సంధ్యా వందనము, బిడ్డల్ని చూసుకోవడము, ఇంట్లో తల్లిదండ్రులు చూసుకోవడము, సేవ చేయడము, భార్యను చూసుకోవడము, ఉద్యోగము చేయడము, ఉద్యోగంలో అనితర సాధ్యమైన పనులు చేయడము, ఇంకా విద్యాభ్యాసం చేయడము, ఇవన్నీ చూస్తే... నిజంగా స్వామి యొక్క కార్యంలో నాయకుడు అనేవాడు ఎవరైనా ఉన్నారు అంటే ఇదిగో... ఇంత అద్భుతమైన చాతుర్యము ప్రతి విషయంలో సాధించ గలిగితే బాగుంటుంది అని నేను తెలుసుకున్నాను.

మేము స్వామి తత్వాన్ని అర్థం చేసుకోవడానికి గంటల తరబడి కలిసి కూర్చుని సమయం గడిపేవాళ్లం. దాని కోసమే వెళ్లేవాళ్లం. ఎంతో అంకిత భావంతో, ఎంతో సమర్పణ భావంతో, మేము ఒకరితో ఒకరం చేరి చర్చించే వాళ్లము. ఈ ప్రక్రియలో నేను గ్రహించినది ఏమిటంటే, ఒక సేవకుడికి కావలసినది కేవలం భౌతికంగా సేవ చేసే శక్తి కాదు, మాట్లాడే సామర్థ్యం కాదు, ఆటలాడే నైపుణ్యం కాదు. వీటిని మించి ఇంకొన్ని ప్రత్యేక లక్షణాలు అవసరమని నేను లోతుగా అర్థం చేసుకున్నాను.

రికార్డింగ్ విషయంలో ఆయనలో ఉన్న అద్భుతమైన చాతుర్యాన్ని చూసాక నేను ఆశ్చర్యపోయాను. అంతవరకు రికార్డింగ్ అంటే ఏమిటో, డబ్బింగ్ అంటే ఏమిటో, వాయిస్ ఓవర్ ఇవ్వడం ఎలా చేస్తారో, ఒక వీడియో తీయగానే దాన్ని ఎడిటింగ్ చేయడం ఎలా అనేది నాకు అసలు తెలియదు. కానీ ఆయనను చూసాక, ఎంత అలవోకగా, ఎంత సహజంగా ఈ పనులను చేస్తారో అనేది నాకు స్పష్టంగా తెలిసింది. అరే, ఎంత చాతుర్యం ఉండాలి! సేవలో అన్నది గమనించే వాడిని.

సేవలో ప్రతి అంశం కూడా ముఖ్యమని నాకు అప్పటివరకు తెలియదు. ఇది నేర్చుకోవాలి, అది నేర్చుకోవాలనే తపన కలిగింది. వీడియో... ఆడియో ఎడిటింగ్ నైపుణ్యం నేను సాయి గొల్లపూడి దగ్గర నేర్చుకున్నాను. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేయాలి అంటే నాకు ఏ అవగాహన లేదు. కానీ ఈ రోజు నేను గర్వంగా చెప్పగలను. స్వామి కార్యంలో సేవ చేస్తూ, సాయి గొల్లపూడి వంటి వారి సహచర్యంలో సమయము గడపడం వలన, ఈ రోజు నేను కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ సిద్ధం చేసే స్థాయికి చేరుకున్నాను. దీని కీర్తి అంతా స్వామిదే, అలాగే ఆయన సాధనాలైన సాయి గొల్లపూడి వంటి మహానుభావులదే. వీరంతా నన్ను చాలా ప్రభావితం చేశారు.

నేను ఈ రోజు ఎలా జీవిస్తున్నానో... ఆ సాధారణ స్థాయిని మించి అసాధారణంగా మరొక మెట్టెక్కేలా నన్ను తీర్చిదిద్దారు.

ఒక ప్రెజెంటేషన్ ఎలా చేయాలి? అప్పటివరకు నాకు తెలిసింది వేదికపైకి వెళ్లి మైక్ పట్టుకుని మాట్లాడటమే. కానీ ఇప్పుడు నేను జనాల్లో తిరుగుతూ మాట్లాడుతున్నాను, వారితో సమానంగా కూర్చుంటూ వారిని ప్రేరేపిస్తున్నాను. దీనికి ప్రధాన కారణం... సాయి గొల్లపూడి ఇచ్చిన స్ఫూర్తి. ఆయన నా జీవితంపై చెరగని ముద్ర వేసారు, నాలో ఎప్పటికీ నిలచి పోయే ప్రభావం చూపారు.

ఓర్నీ దుంపతెగా! అప్పటివరకు వేదిక మీద మాట్లాడడమే గొప్ప అనుకున్నాను. కానీ వేదిక మీద నుంచి మాట్లాడితే అసలు ప్రయోజనం ఏముంది? వేదికకి జనాలకి మధ్యలో 20–30 అడుగుల దూరం ఉంటుంది. ఆ దూరాన్ని నేనే బ్రేక్ చేయాలి! జనాల్లోకి వెళ్లి, వాళ్లతో కూర్చుని, వాళ్ల ఆత్మీయుడిలా మాట్లాడాలి... అలా మాట్లాడినప్పుడు ఎంత ప్రభావం ఉంటుంది అన్నది నేను చవి చూశాను. ఇక అదే బాటలో నడుస్తున్నాను ఇప్పటికి.

నిజానికి, వేదిక ఎక్కి ఉపన్యాసం చేయడం కాదు... పది మందితో తిరగాలి, కలసి మెలసి జీవించాలి, కలసి మెలసి పెరగాలి. అదే స్వామి ఆశించినది అని నేను అర్థం చేసుకున్నాను.

ఒక ప్రెజెంటేషన్ అంటే ఎలా ఉండాలి? ఒక ఉపన్యాసం అంటే ఎలా ఉండాలి? వేదికని ఏ విధంగా మెరుగు పరచవచ్చు?

స్వామి సందేశం ఎలా అర్థం చేసుకోవాలి?

సభ్యులతో ఎలా మమేకం అవ్వాలి?

ఇవన్నీ కూడా వారి సహచర్యంలో ఎన్నో అనుభవాల ద్వారా తెలుసుకున్నాను.

అలాగే, అప్పటికప్పుడు, చిన్న చిన్న స్కిట్స్ వారు చేసేవారు. ఎంతటి సృజనాత్మకమైన ఆలోచనా దృక్పథం అంటే... అంత అలవోకగా మాటలు, ఆటలు, పాటలు కలిపి జనాలను సమ్మోహితం చేయగలిగే అసామాన్య ప్రతిభను నేను సాయి గొల్లపూడి దగ్గర చూశాను.

ఒక డ్రామా చేయాలి అంటే ఎంత సౌలభ్యం ఉండాలి? ఎంత సౌకర్యాలు ఉండాలి? ఈ విషయాలన్నింటినీ మా బృందం లోనికి సునాయాసంగా సాయి గొల్లపుడి తీసుకురావడం నేను చూశాను.

డ్రైవింగ్, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డైలాగ్ చెప్పడం, డైలాగ్ వ్రాయడం, రంగుల కలయిక, స్లైడ్‌ల రూపకల్పన, ఫోటో తీయడం, వీడియోలు తీయడం, ఇంటర్వ్యూ చేయడం, పెద్దవారితో సంభాషించడం, వేదికపై ఉపన్యాసం చేయడం, భజన చేయడం, వాయిద్యాలను వాయించడం, మైకు కనెక్ట్ చేయడం, LED ప్రొజెక్టర్ కనెక్ట్ చేయడం ఇవన్నీ ఇప్పటివరకు అసలు జీవితం నేను కనీ విని ఎరుగని అద్భుతమైన విషయాలే అని చెప్పాలి. ఇలాంటి విషయాలు సాయి గొల్లపూడి ద్వారా తెలుసుకున్నాను.

సాయి మార్గంలో నడిచే ప్రతి యోధుడు జీవితం అనేది నిరంతరం నేర్చుకోవడం, వదిలేయడం, తిరిగి నేర్చుకోవడం అనే యాత్ర అని గ్రహించాలి.

ఆయన ఆంగ్లంలో వ్రాసే వ్యాసాలు చూస్తే... అబ్బా! ఎంత అద్భుతమైన చాతుర్యం! నేను కూడా ఎట్లాగైనా నేర్చుకోవాలని అనిపించేది. నేడు నా జీవితంలో ఉన్న ఏవైనా నేర్చుకున్న అంశాలు ఉంటే, వాటికి సాయి గొల్లపూడి ప్రేరణ కారణమని నేను భావిస్తున్నాను. ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఇవన్నీ నేను సాయి గొల్లపూడి దగ్గర ప్రత్యక్షంగా చూశాను.

అంటే సాయి మార్గంలో స్వామి అంటే భక్తి ఉంది, స్వామి అంటే అద్భుతమైన అనురక్తి ఉంది... కానీ ఈ మార్గంలో ఒకరితో ఒకరు తోడుగా ఎన్ని విషయాలు నేర్చుకోవచ్చు. ఎవరో అన్నారు సేవ చేస్తే తప్పకుండా పది మంది బాగుపడతారు అని... పది మంది బాగు పడతారో లేదో నాకు తెలియదు కానీ సేవా మార్గంలో సేవకులు తప్పక బాగుపడతారు. సేవకులు తప్పక పరివర్తనం చెందుతారు. సేవకులకు తప్పక అద్భుతమైన చాతుర్యము సిద్ధిస్తుంది అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను.

సాయి గొల్లపుడి హైదరాబాద్ బృందంలో చేరిన తర్వాత చేసిన ప్రతి కార్యానికి ఒక అద్భుతమైన స్ఫూర్తి ఆపాదించబడింది, ప్రేరణ తేబడింది, చైతన్యము చేర్చబడింది, ప్రతి ఆచారమూ ఆధ్యాత్మిక రంగులోకి మలచబడింది అని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు.

"సత్యసాయి గ్రామ సేవ మహాయజ్ఞము" (1008 గ్రామాలలో సేవలు) దాని తర్వాత "శ్రీ సత్యసాయి గురుకులసేవా యజ్ఞము" (108 పాఠశాలలలో సేవా సాధన), "శ్రీ సత్యసాయి ప్రేమామృతధార" పథకంలో భాగంగా నీళ్లు లేని గ్రామాలలో... నీళ్లు అందించే ప్రయత్నము. సత్యసాయి యువజన సమ్మేళనాలు, సత్యసాయి గ్రామ సేవ చైతన్య యాత్ర, శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం, ఇలా ఏ కార్యక్రమం చూసినా అందులో అద్భుతమైన శైలిని సాయి గొల్లపూడి చేర్చారు అని చెప్పుకోవాలి. స్వామి చేత ఎంచుకోబడిన సుశిక్షితమైన సైనికులలో... సాయి గొల్లపూడిని ఒకరిగా నేను చూస్తాను.

నేను సదా అనుకుంటాను, మంచి వాళ్ల సాంగత్యంతోనే ఎవరి సేవా జీవితము అయినా ప్రభావితం అవుతుంది. సాయి గొల్లపూడి సతీమణి, లక్ష్మి గొల్లపూడి, వారి కుమార్తె డాక్టర్ శాంభవి మరియు వారి కుమారుడు డాక్టర్ సాయిరామ్ అందరూ కూడా స్వామి మరియు స్వామి తత్వం, స్వామి కార్యంలో ఎలా రోజువారీ జీవితం గడుపుతారు అన్నది అందరికీ స్ఫూర్తి నిస్తుంది.

ఆ పిల్లలను చూసినా, వారి సతీమణిని చూసినా ఎంతో ఉత్సాహం వస్తుంది. ఇంత అంకిత భావనతో ఎంత మంది ఉండగలరు స్వామికి అని... జీవితంలో ఇలా గమనం ఉంటేనే కదా స్వామికి దగ్గర అవుతామని నేను అనుకుంటూ ఉంటాను.

తదనంతర కాలంలో స్వామి సంకల్పం చేత, స్వామి దయానుగ్రహము చేత సృష్టించబడిన శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్‌లో వారు ప్రప్రథమ స్థాపక ట్రస్టీగా ఉండడము. సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్ ద్వారా చేసిన ఎన్నో విశేషమైన సేవా కార్యక్రమాలలో తనదైన శైలిలో నాయకత్వాన్ని వహించడము, గ్రామసేవ ట్రస్ట్ ద్వారా జరుగుతున్న వివిధ సేవా కార్యక్రమాలకి, తలలో నాలిక లాగా ఉండి ముందుకు నడిపించడం నేను చూశాను.

ఇవన్నీ కూడా ఎందుకు చెప్తున్నాను అంటే...

ఒక సంసారిగా ఏమి చేయవచ్చు?

ఒక ఉన్నతోద్యోగిగా ఏమి చేయవచ్చు?

ఒక సేవకుడిగా ఏమి చేయవచ్చు?

ఒక తండ్రిలా ఏమి చేయవచ్చు?

ఒక భర్తలా ఏమిచేయవచ్చు?

ఒక కొడుకులా ఏమి చేయవచ్చు?

ఒక భక్తుడిలా ఏమి చేయొచ్చు?

ఒక సుశిక్షిత సైనికుడు ఏమి చేయొచ్చు?

అని తెలుసుకోవడానికి మన ముందు ఉన్న నిలువెత్తు నిదర్శనము... సాయి మార్గంలో నేను ఎప్పుడూ తలుచుకునే ఆదర్శము... ఆత్మీయులు సాయి గొల్లపూడి.

60

మాతృశ్రీ సరస్వతమ్మ – హైదరాబాద్‌లో యశోదమ్మ

అదేమిటో తెలియదు... నాకు అందరూ అమ్మలే కనిపిస్తారు! నన్ను సాయి మాత ప్రేమతో ఆదరిస్తారు! అన్ని సమయాలలో అమ్మలే తోడుగా నిలుస్తారు! సాయి కార్యములో నా వెంట ఉంటూ ప్రోత్సహిస్తు ఉంటారు. సాయి సంస్థల పురోభివృద్ధిలో మహిళల యొక్క స్థానము అంతా ఇంతా కాదు అని చెప్పక తప్పదు.

సామాన్యమైన గృహిణుల చేత, అసామాన్య సేవలు చేయించిన ఘనత సత్యసాయి నాధుడిదే అని చెప్పుకోవాలి. సత్యసాయి అవతార కార్యములో... సత్యసాయి సంస్థల కార్యక్రమాలలో... మహిళల పాత్ర ఎంతో అద్భుతంగా నిలిచింది. 100 ఏళ్ల సాయి కార్యంలో ఈ రోజుకి కూడా సత్యసాయి సంస్థల కార్యక్రమాలు అప్రతిహతంగా, నిరాటంకంగా ముందుకు సాగిపోతున్నాయి అంటే దానికి కారణం కేవలం సాయి కార్యంలో తల్లులు పోషిస్తున్న పాత్ర అని తెలుసుకోవాలి.

సత్య సాయి అవతార కార్యములో చేరి తరించిన తల్లుల గురించి మనమందరం కూడా ఎరుగుదుము. మాతృశ్రీ ఈశ్వరమ్మ, మాతృశ్రీ వెంకమ్మ, మాతృశ్రీ కరణం సుబ్బమ్మ, మాతృశ్రీ పార్వతమ్మ, పెదబొట్టమ్మ... ఇలా స్వామి వారి పూర్వ నేపథ్యంలో ఈ తల్లుల యొక్క పాత్రను మనం చూసాం, తెలుసుకున్నాం. ఎంతో మంది మహానుభావులు, కుప్పం భక్తులు అయితే నేమి... యాదాళం కుటుంబ సభ్యులు అయితేనేమి.. స్వామిని చాలా చాలా వాత్సల్యంతో చూసుకున్నారు. స్వామి కార్యాన్ని వారు ముందుండి నడిపించారు.

ఆ రోజుల్లో జరిగిన ప్రతి కార్యక్రమానికి మహిళలే నాయకత్వం వహించారు అని మనందరికీ కూడా తెలుసు. మరి సత్యసాయి అవతార కార్యంలో, సత్యసాయి సంస్థల యొక్క నేపథ్యంలో చూస్తే సాయి ప్రియులైన ఆ తల్లులందరికీ మనం ఎప్పుడూ ఋణపడి ఉండాలి. నిజానికి శ్రీమతి నందివాడ రాణి, శ్రీమతి గోటేటి సరస్వతి, శ్రీమతి వసుమతి, శ్రీమతి లలితమ్మ, శ్రీమతి కమలమ్మ ఇలా ఎందరో తల్లులు స్వామి కార్యంలో చేసిన విశేష సేవలు మనకు తెలుసు.

అదేమి యాదృచ్ఛికమో తెలియదు, స్వామి అ తల్లులను నా జీవితంలో అనుగ్రహించి నన్ను ఆశీర్వదించారు. ఈ రోజు, నా జీవితంలో స్వామి ప్రసాదించిన అద్భుతమైన తల్లులలో... సాయి విలువలు, సాయి విద్య, సాయి ఆధ్యాత్మికత, సాయి కార్యాశీలతలను నా జీవన విధానంలో నాటిన ఒక తల్లి గురించి... వారి నుండి నేను నేర్చుకున్న పాఠాలను గురించి పంచుకొనే ప్రయత్నం చేస్తున్నాను.

ఆవిడ పేరు 'మాతృశ్రీ రాచమడగు సరస్వతమ్మ'. ఆమెకు 85 సంవత్సరాల వయసు. గత మూడు దశాబ్దాలుగా వారిని నేను అతి సామీపం నుండి గమనించిన భాగ్యము నాకు కలిగింది. అతి సామాన్య గృహిణి, స్వామి భక్తి చేత ఏ విధంగా ఎదిగింది, ఏ విధంగా ఒదిగింది, ఏ విధంగా నిలచింది అన్నది చూస్తే... కచ్చితంగా మన లాంటి వాళ్లు వారి నుండి ఎన్ని నేర్చుకోవాలి అనిపిస్తుంది. చాలా సామాన్యమైన గృహిణి. రాచమడుగు వెంకటరామయ్య సతీమణి. ఖైరతాబాద్, ఆనంద నగర్‌లో వారి నివాసము. ఉదయము నిద్రలేచిన దగ్గర నుంచి, రాత్రి పడుకునే దాకా... ఏదో ఒక రకంగా స్వామి కార్యంలో మునిగి ఉండాలి అన్నది వీరి దగ్గర నేను నేర్చుకున్నాను. ఉన్నామా, తిన్నామా, పడుకున్నామా ప్రశ్నే లేదండి! అసలు ఒక గృహిణి, ఇంత అద్భుతమైన సేవలకి నేపథ్యం కాగలదా? అని అచ్చెరువు చెందాలి ఎవరైనా వీరిని చూస్తే!

ఉదయమే బ్రహ్మ ముహూర్తంలో లేవడం అనేది ఈ రోజుకి నాకు కలనే... కానీ వారిని నేను గత 30 సంవత్సరాలుగా చూస్తున్నాను. బ్రహ్మముహూర్తంలో లేవడము, సుప్రభాత సేవ చేసుకోవడము, సంధ్యావందనము చేయడము, గాయత్రి మంత్ర జపము చేయడము, సాయి రామ నామ జపము వ్రాయడము, స్వాధ్యయనము చేయడము, దైవీ భావనతో జీవించడం, ఇంటికి వచ్చిన వాళ్లని ఎవరైనా సరే... తెలియని వాడైనా, తెలిసిన వాడైనా, అక్కున చేర్చుకుని వాడికి ఒక ముద్ద పెట్టడము. సేవ అన్నది ప్రతి కార్యంలో కూడా చూచి, ప్రతికార్యంలో కూడా తలచి, ప్రతి కార్యంలో కూడా మలచి... తన జీవితాన్ని సార్ధకత చేసుకున్న వ్యక్తిత్వము... సరస్వతమ్మలో చూశాను.

ఆవిడ స్నేహశీలత, అజాత శత్రుత్వం, అందరినీ తనవారుగా చూసుకోవడం, ఎంత కోపంవచ్చినా పంటి బిగువున పట్టి ప్రేమనే పంచడం, తగాదాలకు దూరంగా ఉండే విధానం, రాజకీయాలకి దూరంగా మసలటం, ఇదంతా చూస్తే ఒక మహిళ అదీ చదువు లేని మహిళ... ఇంతలా చేయడానికి సాధ్యమవుతుందా? అనిపిస్తుంది. స్వామి తమ దివ్య కార్యంలో వ్యక్తులను ఎంచుకుంటే ఇదిగో ఇలాగే ఉంటారెమో మరి.

వాళ్ల ఇంట్లో ఆదివారం వచ్చిందంటే 30-40 మంది పిల్లలు బాలవికాస్‌కు రావడం నేను చూశాను. ఆవిడ పిల్లలకు చక్కటి పాఠాలను విలువలను నేర్పించినది. ఆ పిల్లలు ఈ రోజు బాలవికాస్ గురువులుగా... అత్యద్భుతమైన వ్యక్తులుగా మారిపోయారు అంటే సందేహము లేదు. వారి యొక్క జీవన విశేషం అంతా కూడా సేవతో సమ్మిళితమయింది.

ఒక ప్రక్క సంసారం చూసుకుంటూ... మరో ప్రక్క నారాయణ సేవ... నిత్య భజన కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తారు, నగర సంకీర్తనకు వెళ్తారు, అలంకరణ సేవలకు వెళ్తారు, పూలమాలలు కడతారు, భజన మందిరం శుభ్రం చేస్తారు, అభాగ్యులకి ఆపన్న హస్తం అందిస్తారు. కారణం నేను కూడా అలాంటి అభాగ్యులలో ఒకడిగా ఆవిడ దయకు పాత్రుడయ్యాను.

ఆనంద నగర్‌లో ఒక చిన్న గదిలో నేను ఉన్న సమయంలో జరిగిన విశేషం చెప్తున్నాను మిత్రులారా! అంటే సాయి సంస్థలలో ఇలాంటి సుశిక్షితులైన సైనికులు, మహిళామతల్లులు

ఉండడం వల్లనే... మా లాంటి వారు స్వామికి ఇంకా దగ్గరగా కదలగలిగాం అని నేను అనుకుంటూ ఉంటాను.

నాకు ఎవరూ లేరు హైదరాబాద్‌లో, ఒక చిన్న రూమ్‌లో ఉండేవాడిని మూడు అంతస్తుల పైన. ఒకసారి పొరపాటున ప్రమాద వశాత్తు నేను కాలు విరిగి గదిలో ఉన్న సమయంలో... నేను బయటికి కదలేన పరిస్థితిని చూసి తల్లిలా విల విలలాడింది... ఎంతో ప్రేమను చూపింది. అంటే స్వామి వెయ్యి తల్లుల ప్రేమ అని మనం చెప్తాము... కానీ నేను ప్రత్యక్షంగా స్వామి ప్రేమని ఇలాంటి వ్యక్తుల ద్వారా అనుభవించాను. మీరు నమ్ముతారో నమ్మరో అండీ...! దాదాపు మూడు నెలల పాటు ఉదయము, మధ్యాహ్నము, రాత్రి భోజనము డబ్బాలో పెట్టి తన కొడుకు శ్రీకాంత్ ద్వారా పంపించేది. నేను వారి పాదాల ముందర సదా మోకరిల్లాలి. అద్భుతమైన తల్లిని, అలాంటి ప్రేమను, అలాంటి నిస్వార్థ జీవిన శైలిని, అలాంటి హద్దులు లేన వాత్సల్యము నేను ఆవిడలో చూశాను. ఇలా సామాన్యంగా అందరూ చేయలేరండి... ఎవరికైతే స్వామి మీద అచంచల విశ్వాసం ఉంటుందో, భక్తి ఉంటుందో అలాంటి వాళ్లే చేయగలుగుతారు ఇలాంటివన్నీ అని అనిపిస్తుంది.

ఈ రోజుకి కూడా నా C/O అడ్రస్ వాళ్ల ఇళ్లే... 6-3-140/1, ఆనంద నగర్, ఖైరతాబాద్, హైదరాబాద్. ఈ రోజుకి కూడా నా పాస్ పోర్ట్, ఎలక్షన్ కార్డు అన్నీ కూడా ఆ సరస్వతమ్మ ఇంటి చిరునామాతోనే ఉన్నాయి. గత 3 దశాబ్దాలుగా అమ్మతో ఆ ఇంటితో... విడదీయలేని అనుబంధం ఏర్పడింది. ఆమెను నేను ఆధునిక యశోదగా భావిస్తాను. నా జీవితంలో సాయి కృష్ణుడు ప్రసాదించిన తల్లిగా ఆమెను తలుచుకుంటాను. వారి నుంచి నేను నేర్చుకున్న పాఠాలు ఎన్నో ఉన్నాయి.

అణుకువగా ఎలా మాట్లాడాలి, ఎన్ని సవాళ్లు ఎదురైనా ఏ విధంగా సమాధానంగా నిలబడాలి, ఎంత కష్టం వచ్చినా స్వామిని మరవకుండా ఎలాగ ఉండాలి? ఎంత అలుపు వచ్చినా సరే... స్వామి కార్యాన్ని నిలపకుండా ఎలా ఉండాలి? సాయి కార్యంలో నేనేం చేయగలననే? తపన ఎలా ఉండాలి... ఇవన్నీ కూడా వారిలో నేను చూశాను.

ఈ రోజుకి కూడా హైదరాబాదులో అమ్మ ఎక్కడ ఉంది అంటే నేను వారిని చూపిస్తాను, మా అమ్మ అక్కడున్నారు అని చూపిస్తాను. కారణం, సాయి మాత నాకు ప్రసాదించిన అమ్మలా... నేను వీరిని చూస్తాను. అంటే ప్రతి ఒక్కటి నేర్పును ఒకటి కదా... వారిని ఎంతో కష్టాల్లో కూడా నేను చూశాను. ఎక్కడ కూడా తొణకలేదు బెణకలేదు, అద్భుతమైన సమయ స్ఫూర్తితో, ప్రేరణతో ఆవిడ సేవా కార్యంలో నిలిచింది. ఎప్పుడు సేవకి అడ్డంగా ఏది చెప్పలేదు. ఎన్ని ఆటంకాలు వచ్చినా వారు ముందుకే వెళ్లడం నేను చూశాను. అంతేకాదు... నేను ఎవరినైనా దిక్కు లేని వాళ్లని తెస్తే, వారిని కూడా చూసుకునేది. వాళ్లకి కూడా భోజనం పెట్టేది. ఏ సమయంలోనైనా సరే... ఏవిషయంలోనైనా సరే... మంచి కార్యము అంటే...

"ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము... కష్టాలే వచ్చినా కన్నీరే కార్చిన... ఉప్పెనలు వచ్చినా ఊపిరే పోయినా... ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము!!" ఇదిగో ఈ మాటలు వారికి సరి తూగుతాయి. 85 ఏళ్లండి తల తిరుగుతూ ఉన్నా సరే, తన పని తాను చేసుకుంటూ ఎవరి మీద ఆధారపడకుండా, చేతనైతే ఇంకొక ఇద్దరు ముగ్గురికి సేవ చేసే సాధ్వీమణి, మహిళామ తల్లి, మాతృశ్రీ రాచమడుగు సరస్వతమ్మ అని చెప్పుకుంటాను.

ఆవిడ నుంచి ప్రేరణ పొందని వాళ్లు ఆనంద్ నగర్, ఖైరతాబాద్ సత్యసాయి సంస్థలో లేరు అని చెప్తే సందేహం లేదు. అందరికీ పెద్ద దిక్కుగా నిలిచారు. చాలా చాలా సౌలభ్యాలని, సౌకర్యాలని

పది మందికి పంచారు. ఇవన్నీ నేను చెప్పడానికి కారణం... సామాన్యమైన మహిళలు కూడా, స్వామి తలుచుకుంటే ఒక అద్భుతమైన శక్తులుగా మార్చగలరు అన్న విషయం తెలియాలని.

అంకిత భావన ఉంటే వయస్సు అడ్డు కాదు,
అంకిత భావన ఉంటే వ్యవస్థ అడ్డు కాదు,
అంకిత భావన ఉంటే శరీరము అడ్డు కాదు,
అంకిత భావన ఉంటే నేపథ్యం అడ్డు కాదు,
అంకిత భావన ఉంటే స్త్రీ-పురుష భేదం అడ్డు కాదు

అని నేను సరస్వతమ్మ గారిని చూసి తెలుసుకున్నాను. అంటే ఈ వయసులో కూడా వారు అనునిత్యము సేవకై తపించే విధానం, శ్రద్ధా భక్తులు చూస్తే నా జీవితాంతం నేను చచ్చిపోయేదాకా వారి లాగానే ఉండాలి, స్వామిని మరువకుండా స్వామిని తలుస్తూ, స్వామి సేవా కార్యంలో నన్ను నేను మరుస్తూ ముందుకు సాగాలి అని నేను ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను. ఆ మహిళామతల్లికి ఈ వ్యాసాన్ని అంకితం చేస్తున్నాను.

61

సాయి సందేశ వ్యాప్తి – హాయి గొలిపిన ప్రాప్తి

1995 సంవత్సరం తర్వాత కాలంలో స్వామితో జరిగిన ప్రతి సంభాషణము... స్వామి వారు ఇచ్చిన ప్రతి ఆదేశము... స్వామి ప్రసాదించిన ప్రతి సందేశము... బృహత్కార్యానికి తెరలు తీసిందని చెప్పాలి.

నాకు బాగా గుర్తు కనీసము... ఒక మూడు నాలుగు పర్యాయాలు... స్వామి ప్రత్యేకంగా మాట్లాడినపుడు... "బంగారు! ఎప్పుడూ మీరే వస్తారే? కొత్త పిల్లలను తీసుకొని రండి. నేను మాట్లాడుతాను" అని చెప్పారు. మరొకసారి "బంగారు! మీరు మాత్రమే కాదు... ఈ గ్రామ సేవ కార్యక్రమాలు అన్ని జిల్లాలలో చేయాలి, అన్ని జిల్లాలలో కూడా మీలాంటి బృందాలు తయారవ్వాలి, ఆ పని మీద మీరు ఉండాలి." అని చెప్పిన సందర్భం ఉంది. "బంగారు! కొత్త వారితో మీరందరూ రండి, మీ అందరికీ నేను టీ పార్టీ ఇచ్చి పంపిస్తాను". అని చెప్పింది గుర్తుంది".

ఇలా స్వామి చెప్పిన ప్రతి మాటని ఒక అమృత గుళిక లాగా తీసుకొని సంజీవనమైన శరీరములతో, తహతహలాడే మనసులతో, హృదయము నిండుగా స్వామిని నింపుకొని ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలకి శ్రీకారం చుట్టాము.

ఇక జిల్లాల పర్యటనకి మూల కారణము స్వామి... కర్త స్వామి... కార్యము స్వామి... కర్మ స్వామి అని చెప్పుకోవాలి. చాలా మంది యువకులు హైదరాబాద్‌కి వచ్చి స్థిరపడటం వల్ల, పుట్టపర్తికి వెళ్లిన ప్రతి సారి దర్శనంలో ప్రత్యేకంగా కూర్చున్న సమయంలో, ఎవరైనా వచ్చి 'అన్న! మీతో పాటుగా నేను కూడా కూర్చుంటాను అన్న' అంటే లేదు, వద్దు, కాదు, కూడదు, అనే ప్రశ్నే లేదు. వాడు ఎవడైనా సరే... కాస్తోకూస్తో భక్తి ఉంటే చాలు... వీడిని మనతో పాటుగా కూర్చొన పెడితే, స్వామి వీడి ముఖం చూస్తే, స్వామి దృక్కులు వీడి మీద పడితే చాలు... వాడి యొక్క అంతరంగం మారిపోతుంది. జీవిత దిశా నిర్దేశం జరుగుతుంది అనే ఏకైక లక్ష్యంతో, పిల్లలందరిని కూడా మాతో పాటు చేర్చుకునే వాళ్లము. అలా చేర్చుకోబడిన వాళ్లలో నేనుకూడా ఒకడిగా, నేను ఈ

రోజుకి కూడా గుర్తుంచు కుంటాను. ఎక్కడ అనంతపురం జిల్లా... ? అక్కడి నుండి హైదరాబాదు యువజనులతో పాటుగా చెయ్యి చెయ్యి కలపగలిగాను అంటే... కేవలము హైదరాబాద్ యూత్‌కు నాలాంటి వాళ్లను భుజాల కెత్తుకున్న అద్భుతమైన, విశాల హృదయం అని చెప్పుకోవాలి.

ఒకసారి వెనుతిరిగి చూస్తే 1996 నుండి 2006వ సంవత్సరం దాకా అంటే సుమారు ఒక దశాబ్ద కాలం పాటుగా అప్రతిహితముగా, ప్రతి నెల ఒక జిల్లా పర్యటన చేశాము. ఇక ఆ రోజుల్లో ఎలా ఉండే అంటే...

జిల్లాలన్నీ సాయి సేవ ఖిల్లాలు అయ్యాయి
ఇజాలను జనాలకు చాటే వేదికలు అయ్యాయి
సాయి శంఖారాముతో ప్రాంతములన్నీ మేలుకున్నాయి
ఆంధ్ర తెలంగాణ రాయలసీమ ప్రాంతాలన్నీ ఏకమయ్యాయి

ఎంతో అద్భుతమైన చతురతను
ఆదర్శమైన సేవా తత్పరతను
అసమానమైన త్యాగ నిరతినీ
ఆ సాయి నాథుడు ప్రకటించారు!

అంతా వారు చేస్తే... మేము కేవలం వారి చేతుల్లో సాధనములుగా మారి ముందుకు వెళ్లాము తప్ప... మా అంతకు మేము చేసింది ఏమీ లేదు అని ఇప్పుడు కూడా నమ్ముతాము. ఈ రోజుకి కూడా మూడు దశాబ్దముల కాలం నుండి ఈ హైదరాబాద్ యువజనుల ద్వారా జరపబడే ఎన్నో కార్యక్రమాలకి కర్త, కర్మ, క్రియ అన్నీ కూడా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అని నేను గుండె మీద చేయి వేసుకొని చెప్పగలను.

ఈ జిల్లా పర్యటనలో భాగంగా ఎలాంటెలాంటి ప్రాంతాలకు వెళ్లాము, ఆ జిల్లాలలో మేము నేర్చుకున్నది ఏమిటి?, ఆ జిల్లాలలో మేము చూసింది ఏమిటి? చేసింది ఏమిటి? చెప్పింది ఏమిటి అన్నది ఒకసారి సింహావలోకనం చేసుకుంటే...

అనంతపూర్ అనంత ప్యూర్ అయింది
కడప సాయి సేవకి గడపగా మారింది
చిత్తూరు చిత్తములను సరి చేసింది
కర్నూలు కన్నులలో కరుణను కురిపించింది
ప్రకాశము సాయి ప్రభావాన్ని ప్రకటించింది
రంగారెడ్డి ఎప్పుడూ సేవలకు రెడీ అన్నది
మహబూబ్ నగరు మహాబూబానగర్ అయింది
మెదక్ మేటి సేవలకు దిక్కుగా నిలిచింది
అదిలాబాదు అనితర సేవల వేదికగా నిలిచింది

అనంతపురము అనంత ప్యూర్‌గా మారింది. అనంతపూర్ అనే వాళ్లు మాకు బాగా గుర్తు. స్వామి ఎన్నోసార్లు చెప్పారు, ఇది అనంతపూరు కాదురా.. అనంతప్యూరు అని చెప్పేసి. నిజమే ఎక్కడ చూసినా, అనంతపురం జిల్లాలో పలు ప్రాంతాలలో పర్యటించినప్పుడు మాకు తెలిసింది ఇది

పూర్ కాదు ప్యూర్. ప్రధానంగా అనంతపూర్ అంటే ఆంగ్ల అక్షరాలలో 'A' మొదటిది కదా... ప్రతి సేవకి అనంతపురమే కేంద్రం కావాలి అన్నట్టుగా... అనంతపురంలో చాలా కార్యక్రమాలు మనం శ్రీకారం చుట్టాము కడప సాయి సేవకి గడపగా మారింది

చిత్తూరు చిత్తములను సరి చేసింది. నాకు ఇప్పటికీ గుర్తుంది: శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ, ఉప కులపతి, అప్పటి జిల్లా అధ్యక్షులు శ్రీ సుభాష్ చంద్రబోస్ గారు, వందలాది, వేలాది మంది చేతులు, మేధస్సులు హృదయాలు కలిపి స్వామి సేవలో నిమగ్నమయ్యారు సత్యసాయి సంస్థ కార్యక్రమాల్లో... మేమంతా కూడా – సునామి వచ్చిన సందర్భంలో కూడా చిత్తూరు జిల్లా కార్యక్రమంలో పాల్గొన్న జ్ఞాపకం ఈ రోజుకీ మనసులో నిలిచింది.

సుభాష్ చంద్ర బోస్ గారు, "అయ్యా! మిమ్మల్ని చూస్తుంటే మా శరీరం కూడా ఉరకలేస్తుందయ్యా! మా వయసును కూడా మేము మర్చిపోతున్నామయ్యా! మీరు ఎక్కడెక్కడికి వెళ్తే... అక్కడికి మమ్మల్ని కూడా తీసుకెళ్లండయ్యా! మాకు కూడా కాస్త ఉత్సాహం వస్తుంది బాబు. మీరు ఎక్కడున్నారయ్యా ఇంతదాకా? ఇన్నేళ్లుగా? అని చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి.

కర్నూలు కరుణను ప్రవహింపగా, ప్రకాశము సాయి ప్రభావాన్ని ప్రకటింపగా... అక్కడ మంత్రి శ్రీరామమూర్తి గారు జిల్లా అధ్యక్షులుగా ఉండేవారు. చాలా చాలా వాత్సల్యంతో మమ్మల్ని అక్కున చేర్చుకున్నారు. మేము నాయకులం కాదు, కార్యకర్తలము కాదు, క్రియాశీల కార్య వర్గ సభ్యులము కాదు, ఏమీ కాదు. కేవలం స్వామి బిడ్డలు, స్వామి పిల్లలు హైదరాబాద్ యువకులు. వీళ్లు వస్తే జిల్లా అంతా కూడా చైతన్యం అవుతుంది అని గ్రహించిన చాలా కొద్దిమంది జిల్లా అధ్యక్షులలో మంత్రి శ్రీరామమూర్తి గారు ఒకరు. వారి యొక్క సేవా నిరతి, వారి యొక్క అంకిత భావము, ఈనాడు కూడా మేము మర్చిపోలేదు. ఆరు అడుగుల ఆజానుబాహుడు! అయినా సరే... పిల్లల్లో పిల్లాడిగా కలిసి పోయి, మాతో పాటు పని చేశారు. చీరాల అక్కడ కార్యక్రమం జరిగినప్పుడు కుమారి సీతాలక్ష్మి (100 ఏళ్ల వయసు ఆవిడకి ఈ రోజు) మాట్లాడినది గుర్తున్నాయి. అక్కడ మాతో గుర్తించబడిన చుండూరు సురేంద్ర ఈ రోజు ఆంధ్ర రాష్ట్ర సత్య సాయి సంస్థలకు ఉపాధ్యక్షులుగా సేవలకు శ్రీకారం చుట్టారు. చీరాల సత్యసాయి భజన మండలి ద్వారా ఎన్నో విషయాలను మేము గ్రహించాము. అక్కడ జరిగిన ఎన్నో వందల కార్యక్రమాలకి, అక్కడ వేలాది మంది యువజనులు చెయ్యి చెయ్యి కలిపినారు అని నేను గుర్తుపెట్టుకున్నాను.

రంగారెడ్డి సేవలకి రెడీగా నిలిచింది. ఎవరైనా నిజ జీవితంలో పోటీ పడితే వీడు పక్కలో బల్లెం అనేది మనం విన్నాము. నిజానికి హైదరాబాద్ యూత్‌కి రంగా రెడ్డి ప్రక్కలో బలంగా మారింది, హైదరాబాద్ యూత్ చేస్తున్న సేవలకు అద్భుతమైన చేతనగా నిలిచింది ఎవరయ్యా అంటే తప్పకుండా ఎప్పుడైనా సరే రంగారెడ్డి జిల్లాని గుర్తుపెట్టుకుంటా ఉంటాము. అక్కడ జిల్లా అధ్యక్షులు, BHEL సత్యసాయి మందిరం వాళ్లు, రంగారెడ్డి జిల్లాలో ఏ కార్యక్రమం చేసినా.. మేము ఉన్నాము అని మాతో పాటుగా నిలుచుకునే వాళ్లు. వాళ్లని చూసినపుడు ఎంతో ఉత్సాహం వచ్చేది. మా సోదరులు సారథి, రవి, సోమశేఖర్ ఇలాంటి వాళ్లు అందరూ కూడా ఈ రోజు ఆ జిల్లా సాయి సంస్థల నాయకత్వంలో ఉన్నారు. హైదరాబాదులో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరికైనా తక్కువ పడింది అంటే... వెంటనే మేము తోడు అడిగేది ఎవరిని అంటే? రంగారెడ్డి జిల్లా వాళ్లని మాత్రమే. అలా హృదయానుబంధం ఏర్పడింది ఆ జిల్లాతో.

మహబూబ్ నగరు మహాబాబా నగర్‌గా నిలిచింది. నాకు గుర్తు మేడి పల్లి నుండి హైదరాబాద్

యూత్ బైక్స్ ట్రిప్‌లో గుబ్బ ఈశ్వరయ్య మరియు జంగా రెడ్డి మాతో పాటుగా చేరి ప్రశాంతి నిలయానికి కట్టు బట్టలతో పయనమైన దృశ్యం... మాతో ఎలా చేతులు కలిపారో కళ్లకు కడుతుంది. ఇక ఆ తరవాత కాలంలో మహబూబ్ నగర్‌లో అంగుళం అంగుళము, ఇంచించు, ఇంటింటా సాయి నామము ప్రతిధ్వనింప చేసే విధంగా అక్కడ కార్యక్రమాలు జరపగలిగారు వారు మరియు వారి బృందాలు. తరువాత ప్రియమైన ఈశ్వరయ్య గారు మహబూబ్‌నగర్ జిల్లా సాయిసేవా సంస్థ అధ్యక్షులయ్యారు. ఆయన నాయకత్వంలో మహబూబ్‌నగర్ జిల్లంతా అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించారు. ప్రజలు, "ఇది మహబూబ్‌నగర్ కాదు... మహా బాబా నగర్!" అని అనుకునే స్థాయిలో ఆధ్యాత్మిక స్ఫూర్తి వ్యాప్తి చెందింది.

స్వామి హైదరాబాద్ యువతకి ఎంత ప్రేమానురాగాలు అందించారో... అంతకంటే ఎక్కువ ప్రేమానురాగాలు, ఎక్కువ వాత్సల్యము, ఎక్కువ మార్గదర్శనం, ఎక్కువ ఆదేశాలు, మహబూబ్‌నగర్ జిల్లాకి ఇచ్చారు అంటే సందేహమేమీ లేదు. అంతెందుకండి... కేవలం అబ్బాయిలు మాత్రమేనా గ్రామ సేవలు చేసేది? అమ్మాయిలు ఏమి తక్కువ? అని ఆంధ్ర రాష్ట్రంలో మహబూబ్ నగర్ జిల్లాలో ప్రప్రథమ "మహిళా గ్రామ సేవ"కు నాంది పలికిన గడ్డగా మహబూబ్ నగర్‌ని ఈ రోజు నేను గుర్తుపెట్టుకుంటాను.

మెదక్ మేటి సేవలకు దిక్కుగా నిలిచింది. అదిలాబాదు అనితర సేవల వేదిక అయింది. ఇంకా నాకు గుర్తుంది, అప్పటి జిల్లా అధ్యక్షులు వ్రాసిన అభినందన లేఖ. వారి నుండి ప్రేమలేఖ ఒకటి నేను అందుకున్నాను. అదిలాబాద్‌లో కార్యక్రమం చేసిన తర్వాత, డాక్టర్ అశోక వర్ధన్ రెడ్డి... ఐదు అడుగుల వ్యక్తే... కానీ, అసామాన్యమైన ప్రతిభా పాటవాలు సుమారు రెండు దశాబ్దాల కాలం క్రితమే మాకు తెలిసింది. "అయ్యా మీరు తప్పక రండి! మా జిల్లాకు రండి మీరు మేము కలిసి మంచి పని చేద్దాం. నాకు స్పష్టంగా గుర్తుంది... అప్పుడు అక్కడ మేము వెంకట్రావుని గుర్తించాము. ఈ రోజు ఆయన తెలంగాణ రాష్ట్ర సాయి సంస్థల అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. అశోకవర్ధన్ రెడ్డి గారు ఒక లేఖ వ్రాసారు. "నాయనా మిమ్మల్ని చూస్తుంటే నాకు ఇట్లాంటి బిడ్డలు లేరే... ? నాకు ఇలాంటి బిడ్డలు ఉంటే యావత్ ఆంధ్రదేశము అద్భుతమైన పనులు చేసేవాడినే. అయ్యా మీరు నా తోడుండండి. చెయ్యి చెయ్యి కలిపి ఇంకా మంచిపనులు చేద్దాం." అని అద్భుతమైన ఉత్తరం వ్రాసారు. మీ లాంటి వాళ్ల నాయకత్వం ఈ రోజు సంస్థకు అవసరం అని తెలిపినారు. ఆ ఉత్తరం ఎన్ని సార్లు చదువుకున్నామో తెలియదు. ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లో సేవ చేస్తూ మేము పొందిన అనుభవాలను చెబుతూ పోతే ఇంకో వ్యాసం వ్రాయాల్సి వస్తుంది.

62

లేఖలే దివ్యత్వమును చేర్చిన సోపానాలు

ఉత్తరములే మాకు ఉత్తమ గతులను ప్రసాదించాయి
తెలిపిన తలపులు మా తలరాతలు మార్చినాయి
ఫాక్స్ సందేశాలు మమ్ము సాయి సేవకు ఫిక్స్ చేశాయి
టెలిగ్రాములు కూడా మా సంగతులను తెలిపినాయి
ఏమని వర్ణింతునయ్యా! అక్షరములను అనుగ్రహించారు
సేవాభాగ్యమును ప్రసాదించినారు
శ్రీ సత్యసాయి లేఖలే మమ్ము దివ్యత్వమును చేర్చు సోపానాలు

ఎన్ని రకాలుగా చూసినా 1996 నుండి 2006 దాకా అంటే ఒక దశాబ్ద కాలము, బాబా వారికి స్వయంగా ఉత్తరాలు వ్రాసుకునే మహోన్నతమైన సేవకి.. నేను సాధనంగా మారినందుకు ఎప్పుడూ స్వామి వారికి ఋణపడి ఉంటాను. హైదరాబాద్ యువత వలన కలిగిన ఈ దివ్యావకాశమునకు సదా కృతజ్ఞత తెలుపుకుంటూనే ఉంటాను. స్వామికి చాలా మంది అంటే కొన్ని వందల వందల, వేలవేల మంది వివిధ మాధ్యమాల ద్వారా ఉత్తరాలు ఇవ్వడానికి ఉత్సుకతగా ఉండడం మనం చూస్తూ ఉంటాం. ప్రతి ఒక్కరు ఏదో ఒక సమయంలో స్వామి వారికి ఉత్తరం ఇచ్చి ఉంటారు. లేదా ఏదో ఒక సమయంలో స్వామి వారికి ఉత్తరం పోస్ట్ చేసి ఉంటారు, కొరియర్ చేసి ఉంటారు. కానీ, ఇప్పటిదాకా స్వామికి నా కోసం నేను ఎప్పుడూ ఉత్తరం రాసుకోలేదంటే నమ్మండి. అంటే అన్ని తెలిసిన ఆ స్వామికి మనం చెప్పేది ఏముంది? అని అనుకునేవాడిని.

ఒక్కసారి "బంగారు! మనిషికి మాధవుడికి తేడా ఏమిటో తెలుసా?" అని అడిగారు స్వామి. అంటే ఒక్కొక్కరు ఒక్కో రకంగా సమాధానం చెప్పారు. అద్భుతమైన సమాధానం వారే చెప్పినారు. "అదేదీ కాదు బంగారు! మనిషి ఏమీ తెలియకున్నా అన్నీ తెలిసినట్టుగా ఉంటాడు. మాధవుడు అన్ని తెలిసినా ఏమీ తెలియనట్టు ఉంటాడయ్యా! ఇంతే వ్యత్యాసము." ఈ విషయం విన్నప్పుడు నిజమే

అనిపించింది. మనకు ఏమీ తెలియకుండా అన్ని తెలిసినట్టు బ్రతికేస్తూ ఉంటాం... కానీ స్వామికి అన్ని తెలిసినా ఏమీ తెలియనట్టు ఉంటారు. అలా ఎందుకో మరి తెలియదు.

1996 హైదరాబాద్ యువతతో ఏ రోజైతే సమాగమం జరిగిందో, ఏ శుభ ముహూర్తంలో అయితే నా కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం మొదలు పెట్టానో, ఆ రోజు నుండి ఒక దశాబ్ద కాలం పాటు, అంటే 2006 సంవత్సరం దాకా, ఎన్నో సందర్భాలలో స్వామికి హైదరాబాద్ యూత్ తరఫున ఉత్తరాలు వ్రాసే అవకాశం కలిగింది. ఎక్కడ కూడా నా పేరు ప్రస్తావించలేదు. ఎప్పుడూ కూడా సొంత విషయాలు ప్రస్తావించలేదు. నాయకుల పేర్లను ప్రత్యేకంగా ఉదాహరించిన సందర్భాలు లేవు. ఎక్కడా కూడా సంస్థల యొక్క విషయాలు చెప్తున్నప్పుడు, సంస్థల పెద్దవాళ్ల పేర్లు వ్రాసింది లేదు. చాలా సూక్ష్మంగా... చాలా వివరంగా అన్ని వ్రాసుకునే వాళ్లము. అలా స్వామికి లేఖలు వ్రాసే భాగ్యము... తెలుగు బాగా రావడం వలన స్వామి నాకు ఇచ్చారు అని అనుకుంటాను.

హైదరాబాద్ యువతకి అనధికార, అధికార ప్రతినిధిగా నేను ఉన్నానంటే దాంట్లో ఏ సందేహము లేదు. హైదరాబాద్ యువజన ప్రతినిధిగా స్వామికి ఏదైనా తెలపాలన్నా, సంస్థకి ఏదైనా తెలపాలన్నా, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలన్నా... ప్రధానంగా తెలుగులో అవుతే, తప్పక నన్ను గుర్తుంచుకునే వాళ్లు అన్నయ్యలు, తమ్ముళ్లు అందరూ కూడా. ఉత్తరాలు వ్రాయడం అనేది పూజ లాగా తీసుకున్నాను. స్వామిని స్మరించుకుంటూ ఎన్నో వందల, వేల హృదయాలలో ఉన్న ఆర్తికి అక్షర రూపమిచ్చి, ఎంతో భక్తి ప్రపత్తులతో స్వామికి ఉత్తరాలు పంపించే వాళ్లం.

ఏమి జరిగినా స్వామికి వ్రాసే వాళ్లము...
ఏ అభివృద్ధి అయినా సరే వ్రాసేవాళ్లము...
ఎప్పుడు అడ్డంకులు వచ్చినా వ్రాసాము...
ఉత్సాహం వస్తే స్వామికి వ్రాసుకున్నాము...
నిరుత్సాహమవుతే వ్రాసుకున్నాము...
ఎవరు ప్రోత్సాహించినా వ్రాసే వాళ్లము...
ఎలాంటి మహిమలు జరిగిన వ్రాసాము...
స్వామికి ప్రేమ తెలిపేందుకు వ్రాసినాము...
స్వామికి సేవల గురించి సదా వ్రాసాము...
అక్షరాలే ఎదుగుదలకు ఆవాసాలయ్యాయి
లేఖలే దివ్యత్వమును చేర్చు సోపానాలయినాయి
ఒక్కో ఉత్తరం స్వామిని చేరుకునే నిచ్చనలా మారింది.

అన్ని తెలిసిన స్వామికి.. మేమేదో మా అమ్మకి చెప్పుకున్నట్టుగా, నాన్నకి చెప్పుకున్నట్టుగా, గురువుకి చెప్పినట్టుగా, దేవుడికి చెప్పుకున్నట్టుగా వ్రాసుకునే వాళ్లం. స్వామి కూడా అదే స్థాయిలో స్పందించే వారు. స్వామి వారు, నేను వ్రాసిన ఉత్తరాలకు స్పందించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అందులో కొన్ని మధురమైన సంఘటనలను మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. ఇవన్నీ నా జీవితంలో, ముఖ్యంగా హైదరాబాద్ పిల్లలతో పాటూ సేవల్లో పాల్గొన్నప్పుడు చోటు చేసుకున్నవి.

హైదరాబాద్‌కి నేను తొలిసారిగా వచ్చినప్పుడు, "గ్రామసేవ – సాయి సేవ" కార్యక్రమం గురించి చర్చించినప్పుడు, ఎంతో ఉత్సాహంతో ఆ కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలను మొదటిసారి ఉత్తరం వ్రాసే దివ్యావకాశం నాకు కలిగింది. ఆ ఉత్తరం మొదటి ఉత్తరం హైదరాబాద్ యువత తరఫున వ్రాసాను.

'గ్రామ సేవయే – సాయి సేవ'

అందరి హృదయాలలో నివసించి నడిపించే నడయాడు దేవుడు మా సాయి దేవుడి దివ్య శ్రీ చరణ సన్నిధికి శతకోటి నమస్సుమాంజలి అర్పిస్తూ...

స్వామి! హైదరాబాద్ పిల్లలందరూ చేరి, మీ దివ్యాదేశాలను అనుసరించి 'గ్రామ సేవయే – సాయి సేవ' కార్యక్రమానికి శ్రీకారం చుట్ట బోతున్నాము అని వ్రాసిన ఉత్తరం, మేము ఐదు మందిమి కలసి స్వామి దగ్గరికి వెళ్లడం, ప్రశాంతి నిలయంలో ప్రభాత దర్శన సమయంలో... ఆ చిన్న సింహాల దగ్గర కూర్చున్న సమయంలో స్వామి వచ్చి, మగవాళ్ల వైపు తీసుకున్న మొదటి ఉత్తరంగా నిలిచిపోయింది. ఆ ఉత్తరాన్ని ఉదయన్న స్వామికి అందించినట్లు గుర్తు. స్వామి వస్తున్నప్పుడు

"గ్రామ సేవయే – సాయి సేవ" శ్రీ సత్య సాయిబాబా వారి పాద పద్మములకు అంకితము అని వ్రాసారు.

తర్వాత మూడు దశాబ్దాల కాలం పాటుగా, "గ్రామ సేవయే – సాయి సేవ" ఒక మహోద్యమముగా మారింది... అదిగో ఆ బృహత్ కార్యానికి ఈ ఉత్తరం నేపథ్యం అయింది. స్వామి ఆశీర్వాద పూర్వకంగా ఉత్తరం తీసుకున్నారు... మా మధ్య మాటలు లేవు... వారి పలకరింపు లేదు మాకు పులకరింపు తప్ప. ఇది ప్రప్రథమ దివ్య జ్ఞాపకంగా నేను తలుచుకుంటాను.

మరొక పర్యాయం, విజయనగరం జిల్లాలో మేమందరం పర్యటన చేస్తున్నాము. యువజన సమ్మేళనం జరిగింది. పారాది అనే గ్రామానికి సేవకు వెళ్లాము అన్నమాట. దక్షిణ భారత దేశంలో తుఫాను హెచ్చరిక జారీ చేయబడ్డది. ఇవన్నీ మాకు తెలియవు. ఎందుకంటే మేము ఆ గ్రామ సేవలలో తలమునకలై ఉన్నాము. మధ్యాహ్నం అనుకుంటాను... టైం సరిగ్గా తెలియదు, ఒక పెద్ద పొలములో, సర్కస్ టెంట్ వేయించి, అక్కడ యువజనులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నాము. నేను సభలో మాట్లాడుతున్నాను. ఉన్నట్టుండి పెద్ద పెద్ద ఉరుములతో, పిడుగులతో కుంభ వృష్టి మొదలైంది. ఆ టెంట్ మీద వర్షము పడి తడిచిపోయి... దానిక్రింద కూర్చున్న వాళ్ల నెత్తిన పడే స్థాయికి వచ్చేసింది. కానీ, స్వామి మీద అచంచలమైన భక్తి విశ్వాసముతో నేను మైక్ వదలలేదు. జనాలు టెంట్‌లో నుండి కదల లేదు. చివరకు ఆ టెంట్ మా తలల మీద పడిందే తప్ప, యువకులు మాత్రం బయటికి ఉరకలేదు. ఇంత ఉత్సాహము నిజంగా ఎప్పుడూ చూడలేదు.

"ఆంజనేయ వీరా హనుమంత శూరా
వాయు కుమార వానర వీరా"

ఈ పాట పాడటము, జనాలు ఉర్రూతలూగడం, జై జై అని ఆ టెంట్ కట్టెలను పట్టుకొని మళ్లీ లేపడము... మళ్లీ సభ యధావిధిగా జరగడము అయింది... ఇలా ఆ గ్రామంలో జరిగిన ఈ విశేషాలను... విజయనగరము ఓంకార మందిరంలో జరిగిన విశేషాలతో కూడిన ఈ అనుభవాలను, స్వామి వారికి ఒక ఆరు పేజీలు ఉత్తరం ఫాక్స్ చేసామండి.

స్వామి అప్పుడు బృందావన్‌లో ఉన్నారంట. రెండు మూడు రోజుల తర్వాత తెలిసింది, స్వామి ఆరోజు త్రయీ సెషన్‌కి వస్తూ... చేతిలో చుట్టగా చుట్టిన కొన్ని కాగితాలను తీసుకొచ్చారట. అక్కడున్న పిల్లలతో "ఏయ్! తెలుగు ఎవరికి బాగా వస్తుంది?" అంటే ఎవరో చెయ్యి ఎత్తారట. ఆ అబ్బాయికి స్వామి తన చేతిలో ఉన్నటువంటి ఆ పేపర్లదొంతరని ఇచ్చి, ఇది హైదరాబాద్ పిల్లలు పంపించింది చదువు అని ఆదేశించారట. ఉత్తరం అంతా కూడా ఆ అబ్బాయి చదివితే.. స్వామి ఎంతో ఆనందంగా... "చూడండి బంగారు! ఎంత మంచి పనులు చేస్తున్నారు హైదరాబాద్ పిల్లలు. చాలా సంతోషం!

చాలా సంతోషం! మీరు కూడా అలాంటి పనులు చేయాలి." అని ఆ ఉత్తరంలో ఉన్న విశేషముల గురించి స్వామి వారు వివరించారట. ఇది విన్నప్పుడు నా హృదయం అంతా కూడా పొంగి పోయిందండి. "అబ్బా! స్వామికి వ్రాసిన ఉత్తరాలని స్వామి చదివారే! చదవడం కాకుండా అక్కడ వినిపించారే..." అని నేను చాలా ఆనందంతో ఏడ్చాను. ఇది చాలు స్వామి ఈ జీవితానికి అని అనుకున్నాను. అంటే ప్రత్యక్షంగా భగవంతునికే నివేదించిన అక్షరార్చనము వారి సన్నిధికి చేరింది కదా!

ఒకానొక జిల్లాలో పర్యటన సందర్భంగా అక్కడి జిల్లా అధ్యక్షుడు అసంతృప్తితో కూడిన ప్రవర్తనతో మమ్మల్ని బాధించి... మేము చెప్తున్న విషయాలతో విభేదించారు. అది మాకు కొద్దిగా బాధ కలిగించింది. ఆయన మాకు తగిన న్యాయం చేయలేదు అనిపించింది. అయితే, ఆయన పేరును ఎక్కడా ప్రస్తావించకుండా, స్వామికి వ్రాసుకున్నాం.

"స్వామీ! మీరు చెప్పినట్లుగానే, మీ ఆదేశాలకు అనుగుణంగా మేము జిల్లాల పర్యటన చేస్తున్నాం. ఇదిగో, ఫలానా జిల్లాలో మేము ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నాము, స్వామీ!" అని స్వామికి వ్రాసుకున్నాము.

నాకు గుర్తుంది... ఆ తరువాత స్వామి ఆయనకు పెద్దల ద్వారా ఒక సందేశాన్ని పంపించారు అని విన్నాము.

అలాగే స్వామి అంతరంగికులాగా ఉన్న ఎంతో మంది సత్యజిత్, దేవసేన్, అరుణ్, వేదనారాయణ ఇలాంటి వాళ్లందరూ... మేము పంపే ఉత్తరాలు స్వామి దగ్గరికి చేరినట్టుగా, స్వామి చూసినట్టుగా, స్వామి టేబుల్ మీద ఉన్నట్టుగా కూడా చెప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. విన్న ప్రతిసారి కూడా అయ్యో స్వామీ! మా పైన ఎంత దయ తండ్రీ మీకు అని హృదయమంతా ఆనందాబ్ధిలో ఓలలాడేది. నాకు స్పష్టంగా గుర్తుంది... చక్రవర్తి IAS Retd స్వయంగా మా ఫాక్స్ సందేశాలను స్వామి వద్దకు చేర్చిన సందర్భాలున్నాయి. కారణం fax మిషను వారి కార్యాలయంలో ఉండేది అని విన్నాము.

మా మొదటి గ్రామ సేవ 1996లో జరిగినప్పుడు బాగా గుర్తుంది, మేము ప్రతి రోజు టెలిగ్రామ్ ఇచ్చేవాళ్లం. మేము ప్రశాంతి నిలయానికి చేరుకునే సమయానికి, వారే స్వయంగా చిరంజీవి రావుని గణేష్ గేటు దగ్గరకు పంపి మమ్మల్ని రిసీవ్ చేసుకొమ్మని చెప్పారట. ఇది మా జీవితంలో అసాధారణమైన అనుభవం. మాటలు రాక చేష్టలుడిగి మేము ఆశ్చర్య చకితులయ్యాము.

"స్వామి చెప్పారు మీ గురించి రండి రండి.." అంటూ వారు మమ్మల్ని ఆహ్వానించడం, తర్వాత మమ్మల్ని ప్రత్యేకంగా కూర్చోబెట్టిన విశేషాలను ముందు వ్యాసాలలో వివరించాను.

స్వామికి ఏమి చెప్పినా, వారెంతో ప్రేమతో విషయాలను అర్థం చేసుకుంటూ మమ్ములను అక్కున చేర్చుకునే వాళ్లు. నాకు గుర్తుంది. స్వామికి మేము చిట్టీలు కూడా వ్రాసి పంపించాము. ఇది అసలు ఊహించలేని అనుభవం... స్వామి మాకు అనుగ్రహించిన అనుభవం.

ఒకసారి, మేము ప్రశాంతినిలయంలో ఉండాలా? లేక హైదరాబాద్‌కి తిరిగి వెళ్లాలా? అన్న సందిగ్ధంలో ఉన్నప్పుడు... ఉన్న గంటల వ్యవధిలో... స్వామి వారి అంతరంగికుల సలహా మేరకు చిన్న చీటి వ్రాసి ఇచ్చాము.

"స్వామి! మీరు ఆదేశించిన విధంగా ఈ రోజు మేము ఇక్కడే ఉంటున్నాం. మీరు, మమ్మల్ని ఆశీర్వదించాలి.

ఇలా నాలుగు లైన్ల సందేశాన్ని చిట్టీ ద్వారా స్వామికి పంపించుకున్నాము అంటే ఆలోచించండి... అదేదో ప్రముఖులు వస్తె చేసే విధంగా చాలా అమాయకమైన భక్తితో చేసేసాము. స్వామి కూడా అంతే ప్రేమతో వెంటనే బయటకు సందేశం పంపించారు... మధ్యాహ్నం కూర్చోమని చెప్పండి... చూస్తాను అని.

అలా స్వామి వారు స్పందించిన ప్రతిసారి కూడా... మాలో ఉత్సాహము, గంగాప్రవాహమై పొంగి పోర్లేది. అది మరిన్ని సేవా కార్యక్రమాలకి ఆలవాలమై నిలిచింది అని చెప్పాలి. ఇది చిన్న విషయంలా అనిపించవచ్చు... కానీ నేను తప్పక చెప్పాలనుకుంటున్నాను. స్వామికి మనం ఏది సమర్పించినా అది అసలు సాధారణం కాదని, స్వామి దాన్ని ఎంతో విశిష్టంగా స్వీకరిస్తారని నాకు అప్పుడే స్పష్టంగా తెలిసింది.

ఎప్పుడు ఉత్తరాలు వ్రాయాలన్నా, ఉదయ్, గోపి, వైసీ ఇలా కొద్ది మంది సోదరులతో ఫోన్ ద్వారానో, లేకపోతే మీటింగులోనో, చర్చించి సమాచారం సేకరించి ఉత్తరం వ్రాసే వాడిని. ఆ తరవాత మళ్లీ, అందరితో చర్చించి, తప్పులు సరిదిద్ది లేదా పొరపాటు గుర్తిస్తే ఇంకో రకంగా వ్రాసి... అందరం చేరి వ్రాసుకున్న ఉత్తరాలు మమ్మల్ని ఉత్తమ గతులకు చేర్చాయి అని నేను సదా తలుస్తాను.

నేను 1996-97 సమయంలో ఉదయన్న వాళ్ల ఇంటి వెనక ఉండే వాడిని కదా! ఒక రోజు నాకు ఒక ఉత్తరం వచ్చింది. అది సుమారు నాలుగు పేజీల సుదీర్ఘమైన ఉత్తరం. చాలా ఆశ్చర్యమైంది! నన్ను ఒక అమ్మాయి బాగా పొగుడుతూ అంగాంగ వర్ణనము చేస్తూ, నా పుట్టు మచ్చల గురించి చెప్తూ, నా వాక్ చాతుర్యం గురించి చెప్తూ, నా ముక్కు గురించి చెప్తూ, నా తల వెంట్రుకల గురించి చెప్తూ, నేను వేసుకునే సఫారీ గురించి చెప్తూ... నా పై ప్రేమను వెలిబుచ్చుతూ వ్రాసిన లెటర్. ఓరి నాయనా! ఏమబ్బా ఇది... ఆమె ఏకంగా నేను ఒప్పుకుంటే పెళ్లి చేసుకుంటాను, మా ఇంట్లో వాళ్లతో ఒకసారి మాట్లాడండి అని చెప్తోంది. "ఓరి దేవుడా ఇది ఎక్కడ గొడవండీ బాబు...! నేను జనాలతో మాట్లాడడానికి వెళ్తుంటే ఇలాంటి ఉత్తరాలు వచ్చాయి ఏంటి? అని చాలా చాలా బాధపడ్డాను. ఎవరికి విషయం చెప్పలేదు... ఆ తర్వాత వారం అనుకుంటాను... మేమందరం కూడా ప్రశాంతి నిలయానికి వెళ్లాము. 26 ఏళ్లు అప్పుడు నాకు. ఏంచేయాలో తెలియలేదు. కానీ, పుట్టపర్తికి వెళ్లేముందు... రాత్రి అందరూ పడుకున్న తర్వాత, మళ్లీ ఆ ఉత్తరం చదివి, స్వామి ఫోటో ముందు కూర్చుని... స్వామి! ఈ ఉత్తరము నాకు సంబంధించింది కాదు స్వామి, మీదిగా భావించి మీకు ఇస్తున్నాను. అని అనుకుని ఆ ఉత్తరంపై ఉన్న "To: Balachandra" అన్నదాన్ని కొట్టేసి, దాన్ని "To, Bhagawan Sri Sathya Sai Baba"గా వ్రాసాను. అలా నాతో పాటుగా ఉత్తరం ప్రశాంతినిలయానికి చేరింది. స్వామి పాదనమస్కారం ఇస్తున్నప్పుడు ఈ ఉత్తరం ఇచ్చేసాను. స్వామి ఒకసారి నన్ను అలా చూసి వెళ్లిపోయారు. అంతే జరిగింది.

ఇది జరిగిన రెండు మూడు నెలల తర్వాత ఏదో పిచ్చాపాటిగా మాట్లాడుకుంటుంటే... ఎవరో అడిగారు... ఏంట్రా నువ్వు మొన్న ఎప్పుడో స్వామికి ఉత్తరం ఇచ్చావు కదా? ఏమిచ్చావు? ఎప్పుడు వ్రాయనంటివే ఉత్తరం, ఏమి ఇచ్చావు మరి? అని అడిగారు. అయ్యో నేను ఎప్పుడూ స్వామికి నా గురించి నేను వ్రాయలేదు. మొన్నేమో నాకు ఒక ప్రేమ లేఖ వచ్చిందిరా! ఆ ప్రేమ లేఖ నన్ను బాధ పెట్టింది. స్వామి నేనెందుకు దీనికి తలవంచాలి? నాకు అటువంటి అనుభవాలు నా జీవితంలో వద్దు అని స్వామికి ఇచ్చేసాను. ఆ బృందంలో ఉన్న ఐదు మందిలో ఒకడు చాలా ఆశ్చర్యంతో...'అయ్యో!

బాలచంద్ర!! ఆ లెటర్ స్వామికి ఇచ్చావా?' అన్నాడు. అవును స్వామికి ఇచ్చాను నాకేం సంబంధం అంటే... బాబోయ్ ఆ లెటర్ నేను వ్రాసానురా నాయనా... ఆట పట్టిద్దాం అని సరదాగా వ్రాసాను అన్నాడు వాడు. వీడికేదో మూడింది అని అప్పుడనుకున్నాను. వాడు ఆ తరవాత కాలంలో దీనికి తగిన ఫలితం అందుకున్నాడు.

తెలుగు బాగా వ్రాయడం వల్ల అయితేనేమి, చక్కటి చేతి వ్రాత వల్లవుతేనేమి, ఎంతో భక్తి భావనతో వ్రాయడం వలన అయితేనేమి... అప్పటికి ఇంకా తెలుగు టైపింగ్ అంత అందుబాటులో లేక పోవడం వల్లయితే నేమి... ఆంగ్లంలో స్వామికి వ్రాసుకునే అలవాటు లేక పోవడం వల్లనైతే నేమి... జిల్లాల వాళ్లు అందరూ నా సాయం కోరే వాళ్లు. ఎప్పుడూ కూడా ఎవరిని నేను "నేను ఎందుకు వ్రాస్తాను?" అనలేదు. స్వామి నాకు మరో సేవా అవకాశాన్ని ఇచ్చినట్టుగా భావించి, నేను వెంటనే కార్యచరణలోకి దిగేవాడిని. వారి తరఫున స్వామికి లేఖలు వ్రాసి, ఆ జిల్లాల విశేషాలన్నిటినీ స్వామి దృష్టికి తీసుకెళ్లేవాడిని. ఆంధ్ర రాష్ట్రంలో జిల్లాలలో ఉండే యువజన బృందాలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ... వారి తరఫున స్వామికి లేఖలు వ్రాసి, వారు కూడా స్వామి అనుగ్రహానికి పాత్రులవ్వాలని తపించేవాడిని. అలా ఎన్నో సందర్భాలలో ఈ లేఖలే వారిని కూడా స్వామి దరికి చేర్చినాయి.

నాకు గుర్తు, ఆ పది ఏళ్ల సమయంలో ఎంత లేదన్న రెండు మూడు వందల ఉత్తరాలు స్వామికి వ్రాసుకునే భాగ్యం కలిగింది. ఏ ఉత్తరము నా కోసం వ్రాసింది కాదు. అన్నీ కూడా సత్యసాయి సంస్థల పురోభివృద్ధి కోసమై, సత్యసాయి సేవా సంస్థలో జరుగుతున్న కార్యక్రమాల కోసమై, హైదరాబాద్ యువత యొక్క సమాచారం కోసమై వ్రాసినవే.

కానీ ఈ ప్రక్రియలో స్వామి నన్ను ఎలా అనుగ్రహించారో ఆలోచిస్తే... తెలిసింది:

స్పష్టంగా వ్రాయడం నేర్చుకున్నాను.
వివరముగా వ్రాయడం నేర్చుకున్నాను.
అందంగా వ్రాయడం నేర్చుకున్నాను.
హృదయ పూర్వకంగా వ్రాయడం నేర్చాను
వ్యక్తిగత విమర్శలు లేని వ్రాతలు నేర్చాను
నిర్మాణాత్మక విమర్శలు తెలిపేది నేర్చాను
భక్తుల గురించి వ్రాయడం నేర్చుకున్నాను
అసత్యం వ్రాసింది నేనెన్నడు ఎరుగను. సత్యమే స్వామికి మేము చెప్పే వాళ్లము

ఈ ఉత్తమ ఉత్తర ప్రక్రియకు సాధనముగా నన్ను ఎన్నుకున్నందుకు స్వామి వారికి సదా శరణాగతుడనై ఉంటాను. స్వామికి అనేక లేఖలు వ్రాయడం, సందేశాలు అందించడం, ఫాక్స్‌లు పంపించడం, టెలిగ్రాంలు చేరవేయడం... ఇవన్నీ సేవా కార్యక్రమాల నిమిత్తం చేసే అవకాశం నాకు దక్కింది అన్నది నా జీవితంలోని ఒక గొప్ప వరం. సేవలో నన్ను నేను అంకితం చేసుకున్న అనేక అంశాల్లో... స్వామికి లేఖలు వ్రాయడం అన్నది ఒక ప్రత్యేకమైన సేవగా భావిస్తున్నాను. లేఖలే దివ్యత్వమును చేర్చు సోపానాలు అయినాయి.

63

శ్రీనివాసులు – సాయి సేవకుల ఆత్మ బంధువు

భాగ్యనగర భక్తులకి భగవానుడు ప్రసాదించిన భవ్య మందిరము శివము. 2000 సంవత్సరం అనుకుంటాను... ఒకసారి గమనించాను, స్వామి వారి అనుమతి తోటి హైదరాబాద్ పెద్దలు అందరూ! శివం అంతరాలయంలోని స్వామి వారి వేదికను కళాత్మకంగా... సుందరీకరిస్తున్నారు.

వాళ్లను చూసినప్పుడు ఎవరైనా సరే ఎంతో గౌరవ భావంతో నమస్కరిస్తూ... ప్రక్కకు జరిగే వాళ్లు. ఎవరబ్బా వీళ్లు? అంటే... చాలా మంది చెప్పేవాళ్లు... హైదరాబాద్ పెద్దలు అని. స్వామి కూడా వీళ్లందరిని హైదరాబాద్ పెద్దలే అనే పిలిచే వాళ్లు. బివి రమణ రావు, ఈజే సత్యమూర్తి, డాక్టర్ జి నరసింగరావు, ఆనంద్ ఉచ్చిల్. వీళ్లను అలా దూరం నుంచి చూసేవాళ్లం. ఓ! వాళ్లందరూ పెద్దవాళ్లు, పెద్దవాళ్లు... సాయిరామ్! సాయిరామ్! అని అనుకుంటూ చూసేవాళ్లం.

ఈ నలుగురితో పాటుగా మరొక మహనీయుడూ ఉండేవారు. ఇదిగో వారి గురించి వ్రాస్తున్న వ్యాసం ఇది.

శివం మందిరంలో సుందరీకరణ పనులలో భాగంగా, 1970వ సంవత్సరంలో స్వామి వారు ఎంతో దయతో స్వయంగా సృష్టించి ఇచ్చిన చిత్రమున్న స్థానంలో మరొక అపురూప చిత్రము పెట్టారు. దాని మీద With Love - Baba, స్వామి వారి స్వీయ చేవ్రాలుతో!!

ఎవరు ఈ ఫోటోను మార్చగలిగె సాహసం చేశారు అని కనుక్కున్నప్పుడు అదిగో అప్పుడే మొట్ట మొదటిసారి ఈ వ్యక్తి పేరు విన్నాను.

మొదటి నుండి కూడా సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులే, హైదరాబాద్ జిల్లాకు కూడా అధ్యక్షులుగా ఉండేవాళ్లు. హైదరాబాద్ అంటే స్వామి వారికి ఎంత అభిమానం ఉండేదో దిన్ని బట్టి తెలుస్తుంది. దేశంలో మరెక్కడా లేదు ఈ విధంగా.

కానీ, ప్రప్రథమంగా స్వామి వారు జిల్లా అధ్యక్షులు ప్రత్యేకంగా ఉండి... సాయి సంస్థల పురోభివృద్ధికి మరింత నాయకత్వం వహించే వాళ్లుండాలని... రాష్ట్ర అధ్యక్షులకు కూడా చేదోడు

వాదోడుగా ఉండాలని తలంచి ఈ వ్యక్తిని ఎంపిక చేసినారు అని విన్నాను.

హైదరాబాద్‌లో సత్యసాయి సేవా సంస్థల వేగాన్ని పెంచిన వ్యక్తిగా వారు చరిత్రలో నిలచి పోయారు. కారణం, టెక్నాలజీ, ఇంటర్నెట్, ఈమెయిల్, వాట్సాప్ మేసేజెస్, ఇవన్నీ కూడా పరిచయం చేసిన టెక్నోక్రేట్ వీరు.

2000 సంవత్సరంలో వీరితో పరిచయం జరిగింది. సాయి సంస్థకు అత్యంత ప్రియమైన ఆత్మ బంధువు. ప్రస్తుతం ఆయన వయసు 87 వసంతాలు. వారి జీవితం సేవా ప్రవాహం... అసిధార వ్రతం. చుట్టుప్రక్కల వారి కోసం వారు చూపిన ప్రేమ ఆప్యాయతలు ఎవరూ కూడా మరచి పోలేనివిగా ఉండేవి.

తరాలమధ్య అంతరాలు తొలగించాలని తహతహ లాడినాడు
తన్మయత్వం చిందే హృదయముతో అనునిత్యము సేవించినాడు
తరతమ భేదము లేక అందరినీ తన వారిగా భావించినాడు
తన జీవమును జీవితమును జీతమును స్వామికే అర్పించినాడు

ఇలాంటి మహనీయులను నా కళ్లతో చూడటమే కాదు... వారితో చేయి కలిపి గత రెండున్నర దశాబ్దాలుగా సేవలు చేయగలడం అంటే ఎంత అదృష్టం నాది అని తలచుకుంటాను. చిన్న పిల్లాడిలా అందరితో కలిసి పోతారు. ఇంటికి ఎవరు వచ్చినా అక్కున చేర్చుకుంటారు. స్వామి ప్రేమను అందరికీ పంచె వాళ్లు.

వారితో ఎంత సమయం గడిపినా సరే అది దివ్యానుభూతిగా మిగిలి పోతుంది.
వారితో ప్రయాణము ఎన్నో విలువైన విషయాలు తెలిపే విధంగా సాగుతుంది
ఆ మహనీయుడు పేరు శ్రీనివాసులు హుగ్గుహల్లి

ఇంతకుముందే చెప్పినట్టుగా శ్రీనివాసులు అంటే స్వామి వారికి బాగా ప్రియము అనిపించింది. అత్యంత పిన్న వయసులోనే ఇంజినీరింగ్ పట్టా సాధించి, బిర్లా గ్రూప్‌లో మేనేజ్‌మెంట్ ఇంటర్న్‌గా చేరారు. ఆ తరువాత అత్యున్నత పదవులను అలంకరిస్తూ, అనేక అంతర్జాతీయ సంస్థలకు విశిష్టమైన సేవలు అందించారు. వృత్తి రీత్యా ఇంజనీర్ అయినా, ప్రవృత్తి రీత్యా ఎప్పటికీ సాయి సంస్థకు 'స్ట్రక్చరల్ ఇంజనీర్'గా మారిపోయారు. ఎక్కడ సాయి కార్యం ఉంటుందో, అక్కడ వారి ప్రతిభ ప్రభావం ఉండేలా ఆయన ఎదిగారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే విలక్షణ వ్యక్తిత్వం వారిలో గమనించాను.

నేను స్వయంగా కలిసి పని చేసిన అతి కొద్దిమంది సాయి సంస్థల పెద్దలలో శ్రీనివాసులు హుగ్గుహల్లి ఒకరుగా చెప్పుకావాల్సిందే. వీరి ప్రతిభ, చదువు, సంస్కారము, చాతుర్యము, చతురత, భక్తి విశ్వాసాలు, అకుంఠిత దీక్ష, నిరాడంబర జీవితము, తహతహలాడే మనసు, అజాత శత్రుత్వం, ఇవన్నీ చూస్తే... అబ్బా! మనం కూడా ఇలాగే ఉండాలి జీవితంలో అని అనిపించక మానదు.

అప్పుడెప్పుడో, 1984 సంవత్సరం అనుకుంటాను... అనంతపురం జిల్లా వ్యాప్తంగా బోర్వెల్స్ అన్నీ ఎండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుడు స్వామితో: "స్వామి, మీరు అనుగ్రహిస్తే ఈ బోర్వెల్స్ అన్నింటినీ మేము రీచార్జ్ చేసే ప్రయత్నం చేస్తాము" అని అడిగారట వీరు. స్వామి ఆశీర్వదముతో, సుమారు 40 గ్రామాలలో బోర్వెల్స్ రీచార్జ్ చేయగలిగారు. స్వామి వారు ప్రకటించిన బృహత్తర శ్రీ సత్యసాయి సుజల శ్రవంతి పథకానికి నాంది ఆ రోజుల్లోనే పడింది అనిపిస్తుంది.

దేశ విదేశాలలో తిరిగి హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్న వ్యక్తి శ్రీనివాసులు. నరసింగరావు రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నప్పుడు, స్వామి హైదరాబాద్ చాలా ప్రత్యేకమైన జిల్లా కదా,

దానికంటూ ఇంకా ప్రత్యేక మైనటువంటి మనిషి కూడా ఒకరు ఉంటే బాగుంటుంది అని చెప్తూ... శ్రీనివాసులు గారిని ఎన్నిక చేసారట. అలా మొదటి సారి రాష్ట్ర అధ్యక్షులను మరియు జిల్లా అధ్యక్షులను వేరు చేశారు స్వామి వారు. అలా హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా స్వామి వారు ఎంపిక చేసిన వ్యక్తి శ్రీనివాసులు హుగ్గహల్లి. సాంకేతికతను సత్యసాయి సంస్థలకు ఆపాదించిన వ్యక్తి వీరు. స్వామి మీద అచంచల భక్తి విశ్వాసం. భాగ్యనగరంలో వీరిని తెలుసుకోవడం... వీరితో చేరి స్వామిని సేవించుకోవడం మా అందరి భాగ్యంగా భావించాము. మొదటి సారి, డాక్టర్ జి నరసింగరావు వారిని మాకు పరిచయము చేశారు, మొదటి పరిచయంలోనే వారి ఉన్నతమైన వ్యక్తిత్వము అర్థం అయింది. మాతో పాటుగా చిన్న పిల్లాడి లాగా మారి, సేవా కార్యక్రమాలలో పాల్గొనడం చూసాను. మేము ఏదైన గ్రామ సేవకు వెళితే... ఆ గ్రామంలో ఆయన చేయగలిగిన పనులున్నా లేకున్నా, కేవలము మాతో పాటు సమయం గడపాలని ముచ్చట పడేవారు.

వారి ఆధ్వర్యంలో మేము చేసుకున్న సేవలు తలచుకుంటే తనువెల్లా పులకరించి పోతుంది.

"శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామ నిర్మాణ పథకము"

"సత్యసాయి సుజల శ్రవంతి పథకము"

"శ్రీ సత్య సాయి గ్రామ సేవ మహా యజ్ఞము"

"శ్రీ సత్యసాయి గురుకుల సేవ మహా యజ్ఞము"

"శ్రీ సత్య సాయి విలేజ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్"

"శ్రీ సత్య సాయి ప్రేమ జ్యోతి"

"శ్రీ సత్య సాయి Re Programming Lives"

"భాగ్యనగర పర్తి యాత్ర"

"University to Universality"

"Life is a Journey from I to WE"

ఇలా కార్యక్రమము ఏదైనా సరే... మౌనంగా... పరిశీలిస్తూ... సూచనలు... సలహాలు... ఇచ్చే వారు. యువకులైన మాకు ఉత్తమ ఆదర్శ నాయకత్వాన్ని అందించినారు.

"ప్రేమజ్యోతి" కార్యక్రమం సుమారు 15 రోజుల పాటు నిరాటంకంగా హైదరాబాద్ నడిబొడ్డున ఉండే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్ల భవనంలో, స్వామి దయచేత అద్భుతంగా సాగింది. ఆ కార్యక్రమానికి అలనాటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నతాధికారులు, వేలాది మంది భక్తులు యావత్ ఆంధ్ర రాష్ట్రం నుండి తరలి వచ్చి పాల్గొన్నారు.

మేమంతా కలిసి చేసిన "ప్రేమజ్యోతి" స్వామి వారికి అపారమైన ఆనందాన్ని కలిగించింది. ఈ విశిష్ట ఘట్టానికి మూల కారణం పెద్ద దిక్కుగా నిలిచిన శ్రీనివాసులు గారేనని మేమందరం భావిస్తాం.

వారి నాయకత్వంలో జరిగిన ప్రతి పర్తీ యాత్ర, వేలాది మంది భక్తుల హృదయాంతరంగ తీర్థయాత్రగా మారిపోయిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

'Re Programming Lives!' అనే కార్యక్రమం ద్వారా మా చేత శివంలో మొదటి సారి... ఆ తరవాత రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది యువతి యువకులకు నైపుణ్య శిక్షణ ఇచ్చే అవకాశం వారు అందించారు. శ్రీ సత్య సాయి ఉచిత నైపుణ్య కేంద్రాలు హైదరాబాద్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం చూసి ఆంధ్రప్రదేశ్‌లోని అనేక సంస్థలు, కేంద్రాలు, మందిరాలలో కూడా ఇలాంటి

కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వాటన్నిటిని సమన్వయం చేసి ముందుండి నడిపించిన వ్యక్తి వీరే.

పూర్వము హైదరాబాద్, సికింద్రాబాద్ రెండే కేంద్రాలు ఉండేవి సాయి భక్తులకు. శ్రీనివాసులు గారు జిల్లా అధ్యక్షులైన తర్వాత, స్వామి వారి అనుగ్రహాముతో, దిన దినానికి పెరిగి పెద్దదవుతున్న హైదరాబాద్ మరియు పెరిగుతున్న భక్తుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని... స్వామి వారి సూచనతో, వివిధ ప్రాంతాలలో సాయి సంస్థ కేంద్రాలను ప్రారంభం చేయడానికి నాయకత్వం వహించారు. హైదరాబాద్ జిల్లాలో ఈ రోజు నిర్వహించబడే ఎన్నో సాయి సేవా కేంద్రాల సభ్యులు శ్రీనివాసులు పట్ల కృతజ్ఞతతో ఉంటారు.

ఎన్నో సమయాల్లో ఆయనను ఇబ్బందులు పెట్టిన వ్యక్తులున్నారు, వ్యవస్థలు ఉన్నాయి, ఆ సమయంలో కూడా ఆయన తన చిరునవ్వును చెరగనివ్వ లేదు... తన కృతజ్ఞతా భావాన్ని వదులుకోలేదు. ఎంతో క్షమా హృదయంతో జీవించారు. ఎప్పుడూ కోపాన్ని వ్యక్తపరచలేదు, అసంతృప్తిని చూపలేదు. ఒక నాయకుడికి అవసరమైన గుణాలు ఇవే అని అనుకునే వాళ్లం. ఆ లక్షణాలలో కనీసం ఒక 10 శాతం లక్షణాలని మనం తెలుసుకున్న, మనం మంచి నాయకులుగా అవుతాము.

ఎన్ని పాఠాలండి? ఈ వ్యక్తి ద్వారా నేను నేర్చుకున్నది!!

అచంచలమైన విశ్వాసము, అకుంఠిత దీక్ష దక్షత, స్వామి భక్తులు అంటే ప్రేమ, ఇవన్నీ కూడా మాలాంటి వాళ్లకి ప్రాణం పోసాయి అని చెప్పుకుంటాం.

శ్రీమతి సరోజా శ్రీనివాసులు గారు, సుమారు నాలుగు దశాబ్దాల కాలం పాటుగా, బాలవికాస్ గురువుగా వారి ఇంటినే ఒక బాలవికాస్ కేంద్రంగా మార్చేసారు. వందల వేలమంది పరివర్తనకి దారి చూపిన దేవతగా నిలిచిపోయారు. శ్రీ సత్యసాయి బాలవికాస్ తెలుగు మాసపత్రికకి సంపాదకవర్గ సభ్యులుగా వారు భాగం వహిస్తున్నారు. వేదమాలికను సంకలనం చేశారు. శ్రీనివాసులు పదవి నివృత్తి చెందిన తర్వాత కూడా వారి ప్రవృత్తిని సేవా మార్గంలో పెట్టి, అద్భుతమైన సేవలు చేసుకుంటున్న ఈ దంపతులు నిజంగా పుణ్య దంపతులు. స్వామి వారు హైదరాబాద్ యువజనులకు ఇచ్చిన దివ్య బహుమతులు ఈ దంపతులు మాకు.

తదనంతర కాలంలో శ్రీనివాసులు గారు శ్రీ సత్యసాయి టెక్నో గ్రూప్‌కు జాతీయ సమన్వయకర్తగా నియమితులై, ఆ గ్రూప్ కార్యకలాపాలను దూరదృష్టితో ముందుండి నడిపించారు. యావత్ భారతదేశంలో ఎన్నో అద్భుతమైన సేవా కార్యక్రమాలకి వారు శ్రీకారంచుట్టారు. సాంకేతికతని సత్యసాయి సంస్థల యొక్క ప్రస్థానంలో భాగం చేశారు శ్రీనివాసులు.

వారి ఇంటికి ఎవరు వెళ్లినా సరే, "బొజ్జ నిండా తిని, మనసు నిండా ప్రేమనునింపుకొని, హృదయము నిండుగా స్వామిని నింపుకొని వెనక్కి రావాలి తప్ప ఉట్టిగా రాలేము." అందరికీ ఆతిథ్యం ఇచ్చే సరోజా శ్రీనివాసులు 75 ఏళ్ల వయసులో కూడా అదే సౌకర్యం, అదే స్నేహము.

మేము సంకల్పించిన ఎన్నో సేవలకు వారి ఇల్లు వేదికగా మారిందని చెప్పడానికి ఎట్టి సందేహం లేదు. వారి ఇంట్లో జరిగిన ప్రతి సమావేశము, అద్భుతమైన సేవలకు శ్రీకారం చుట్టింది. ఏ ప్రణాళిక అయినా యావత్ ఆంధ్ర దేశానికె కాదు, యావత్ భారతదేశానికి కూడా చేరింది.

స్వామి, వారికిచ్చిన అనుభవాలు చెప్పేందుకు ఇంకో పది వ్యాసాలు వ్రాయాల్సి వస్తుంది. కానీ నేను శ్రీనివాసులు నాయకత్వ వ్యక్తిత్వ విశిష్టతను, అంశాలను మాత్రమే ప్రస్తావించేందుకు ప్రయత్నిస్తున్నాను.

ఒక నాయకుడు ఎలా ఉండాలి అనేది వారిని చూస్తే చాలు అర్థం అవుతుంది. చక్కటి భావ వ్యక్తీకరణ చేసేవారు. ఆంగ్ల భాష మీద ఎంతో పట్టు ఉండేది. సాంకేతికతతో సేవల వేగం పెంచారు.

వారి విజ్ఞత, విలువలతో కూడిన జీవన విధానము, నిరాడంబర వ్యవహార శైలి, పనిలో ప్రేమ, ఆధిపత్య ధోరణి లేని నాయకత్వం ఇవన్నీ కూడా వారిని అందరికీ ప్రియమైన వ్యక్తిగా మార్చేసాయి.

ఎంత ప్రేమ వారిది? అరే! ఇట్లా ప్రేమతో జీవించడం ఎలా వస్తుంది? ఇంత ప్రేమ ఎలా వస్తుంది? ఎంత మౌనంగా గమనిస్తారు అన్ని? ఎంత మక్కువతో మాట్లాడుతారు, ఎంత హృదయ పూర్వకంగా మాట్లాడుతారు, మనం ఇలాగ చేయగలుగుతున్నామా? వారి జీవన శైలిలో ఎవరికైనా సరే స్వామిని చూస్తున్నట్టే ఉంటుంది.

హైదరాబాద్ యువత ప్రశాంతి నిలయం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న సమయంలో, తన బిజీ షెడ్యూల్స్ ఉన్నప్పటికీ, పండుగల్లో ప్రశాంతి నిలయంలో మీటింగ్స్ ఉన్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, ఎప్పుడు వీలవుతే అప్పుడు సమయం తీసుకుని ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో సేవ చేస్తున్న వాలంటీర్లను కలిసేవారు. ముఖ్యంగా రవాణా నిర్వహణలో, ఆయన చేతిలో ఎప్పుడూ పుస్తకం, పెన్ ఉండేవి. ఎక్కడి నుంచి ఎంత వంటపాత్రలు వెళ్తున్నాయి, ఎంత ఆహారం ఏ ఏ ప్రాంతాలకు పంపబడుతోంది... అన్ని స్వయంగా అక్కడే నిలబడి నోట్స్ తీసుకుంటూ పర్యవేక్షించేవారు.

75 ఏళ్ల వయసులో మాతో సమానంగా నిలబడి పని చేయడం అనేది మా అందరికి మర్చిపోలేని అనుభూతి. ఎంత ఉత్సాహం వస్తుందో తెలుసా వారు అక్కడ నిలుచుంటే చాలు "అరే అంకుల్ వచ్చారు!" అని చెప్పుకునే వాళ్లము. సేవలలో వయసు ఎప్పుడు సమస్య కాదు, అని వీరిని చూస్తే తెలుస్తుంది. స్వామి వారి 75వ పుట్టు పండుగ సందర్భంగా, స్వామి ఎప్పుడో "బంగారు పిల్లల్ని తీసుకురండి!" అని ఒక చిన్న సూచన ఇవ్వడము, హైదరాబాద్ యువత వీరితో చర్చించడము, తద్వారా ఎన్నో కళాశాలలకు, హైదరాబాద్ యూత్‌తో పాటుగా వీరు వచ్చి అద్భుతమైన నాయకత్వాన్ని అందించడము, మానవతా విలువలతో సత్య సాయిని పరిచయం చేయడము, మేము ఎప్పుడూ కూడా మర్చిపోలేము.

యావత్ ఆంధ్రదేశంలోని వందలాది వృత్తి నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన 'Life is a Journey from I to We' అనే శీర్షిక మీద సత్యసాయి నిగమాగమములో జరిగిన విశిష్ట సమావేశం మరచి పోలేనిది. ఎంతోమంది మహానుభావులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, బ్యూరోక్రాట్స్, వృత్తి నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్స్, కంపెనీ సెక్రటరీలు, వైద్యులు, న్యాయవాదులు పాల్గొన్న ఈ సమావేశం మా అందరికీ మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

హైదరాబాద్ యువకులు సదా శ్రీనివాసులు హుగ్గహల్లికి కృతజ్ఞతలు చెబుతూనే ఉంటారు. ఇలాంటి వాళ్ల అనుభవాలను తెలుసుకుంటూ, సత్యసాయి సంస్థ అభివృద్ధిలో మన పాత్ర, మన బాధ్యత, నాయకత్వం ఎలా ఉండాలో నేర్చుకున్నాను.

ఇలాంటి వ్యక్తులని, మాలాంటి వాళ్లకు పరిచయం చేసిన స్వామికి... సర్వదా శతదా సహస్రదా నేను శరణాగతుడనై ఉంటాను. ఈ రోజు, ఈ జీవితంలో ఏదైనా నేర్చుకొని నిలబడ్డాను అంటే... ఆ ఘనత ఇలాంటి మహానుభావులదే అని చెప్పాలి.

64

స్వామి స్వయంగా తీర్చిదిద్దిన జీవితం

ఒకసారి వెనుతిరిగి చూసుకుంటే...
స్వామి నా జీవితాన్ని ఎంత అద్భుతంగా మార్గనిర్దేశనం చేసారో!
ఆయన కార్యాన్ని నేను చేయడానికి నన్ను ఎలా తయారు చేసారో!
నేను మంచి ఆలోచించటానికి, మాట్లాడటానికి, చేయటానికి ఎంత ప్రేమతో పెంచారో!
నేను ఆయన దివ్యహస్తాల్లో ఒక సాధనమై నిలబడటానికి, నన్నెలా తీర్చిదిద్దారో...
అర్థం అయ్యి హృదయం అర్ద్రం అవుతుంది.

దశాబ్దల క్రితం స్వామికి నా ఆలోచనలు, మాటలు, కర్మలను అర్పిస్తూ వ్రాసుకున్న వాక్యాలను ఈ సందర్భంలో గుర్తు చేసుకుంటున్నాను.

తల్లివి నీవు తండ్రివి నీవు...
ఎదలో వెలసిన దైవము నీవు!
బాబా... సాయిబాబా, బాబా... సాయిబాబా

ఆటాడినావు, మాటాడినావు
అందముగా నన్నెంతో మందలించినావు
అదరించినావు బెదరించినావు
ఆదరించి నన్నెంతో చేరదీసినావు
ఆదుకున్నావు చేదుకున్నావు,
ఆదుకొని చేదుకొని గట్టునిలిపినావు
అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ॥ తల్లివి ॥

చమత్కారమెంతో చూపించినావు
మాలిన్య మంతా కడిగేసినావు
సంస్కార మెంతో నాకు నేర్పినావు,
సేవావకాశమే నాకు ఇచ్చినావు
సాక్షాత్కారమే ప్రసాదించినావు
సన్మార్గమున నన్ను నడిపించినావు

అన్యధా శరణంనాస్తి త్వమేవ శరణంమమ
బాబా సాయిబాబా... బాబా సాయి బాబా

ఇలా వ్రాస్తుంటే హృదయ మంతా కూడా స్వామి నన్ను ఎలా సంస్కరించారు అని జ్ఞాపకం వస్తూ ఉంటుంది.

1982లో ప్రప్రథమ స్వామి దర్శన భాగ్యం కలిగింది. ఏమి తెలియని అమాయకమైన మనసుతో... స్వామి అంటే దేవుడే కాదు అనుకుని నేను వెళితే... స్వామి నన్ను అదిరించినట్టు కనిపించారు... నాకు చాలా భయం అయింది... తరవాత స్వామి ప్రేమను చవి చూసాను.

స్వామి సాక్షాత్తు భగవంతుడే అన్న నమ్మకం కుదిరింది. అలాగా అదరించి బెదిరించి తను దరి చేర్చుకున్నారు. 1982 నుండి 1992 దాకా సుమారు దశాబ్ద కాలం పాటు, బాలవికాస్ విద్యార్థిగా, బాలవికాస్ ప్రీ సేవ దళ విద్యార్థిగా, అలాగే బాలవికాస్ గురువులా, సేవాదళ సభ్యుడిగా, నేను చాలా కార్యక్రమాల్లో పాల్గొనే వాడిని.

ఒక సందర్భంలో... బాలవికాస్ గురువులతో పాటుగా నేను ఇంటర్వ్యూ గదిలోకి వెళుతున్నప్పుడు, స్వామి మధ్యలో ఆపి "వెళ్లు, వెళ్లు, వెనక్కి వెళ్లు" అని చెప్పడం... అది ఆ కుల్వంతు హాల్‌లో చాలా అవమానముగా భావించాను. అయ్యో ఏమిటి ఇట్లా పంపించేసారే! నేను కూడా గురువులో ఒకడు కదా! ఎందుకు పంపించారు? అని మదన పడ్డాను. తర్వాత దాని వెనుక ఉన్న అంతరార్థాన్ని గ్రహించాను. స్వామి తనదైన శైలిలో ఒక సందేశం పంపించారు. గదిలోకి వెళ్లిన మహిళా గురువులు, స్వామిని అడిగారు "స్వామీ, ఒకరు బయట ఉన్నారు" అంటే "బంగారు గది శుభ్రంగా లేదు బంగారు" అని చెప్పారట. వాళ్లకి అర్థం కాలేదు. మళ్లీ అడిగారు, స్వామి ఒక గురువు బయటే ఉండిపోయారు మగవాళ్ల వైపు అంటే... "చూశారుకదా బంగారు! గది చిన్నదిగా ఉంది" అనిచెప్పారు. స్వామి రూము చిన్నదిగా ఉండడం ఏమిటో? గది శుభ్రంగా లేకపోవడం ఏంటో? వాళ్లకు అర్థం కాలేదు? నాకు అర్థమైంది తర్వాత? ఏ గది శుభ్రంగా లేదు... ఏ గది చిన్నదిగా ఉందంటే... ఈ హృదయం అనేటువంటి గది శుభ్రంగా లేదు... చిన్నదిగా ఉంది అని చెప్పారు. మాలిన్యమంతా తొలగించినట్లు అయింది.

నన్ను నేను మార్చుకోవడం మొదలుపెట్టాను. 1995 ప్రప్రథమ ఏకాంత సౌద సంభాషణ సమయంలో స్వామి, "బంగారు మీరందరూ కూడా చాలా మంచి పిల్లలు. చక్కగా మంచి అమ్మాయిలను చూసి, ఆనందంగా పెళ్లి చేసుకొని సుఖపడండి" అని స్వామి ఆ ఇంటర్వ్యూ గది బోల్ట్ వేస్తూ అటు వైపు తిరిగి వెనక ఉన్న మాతో మాట్లాడుతుంటే, నాకు తెలియకుండగానే "స్వామి పెళ్లి అంటారు ఏంటి? ముందు కాళ్లకు బంధమే కదా స్వామి?"అంటే స్వామి వెంటనే వెనకకుతిరిగి 'ఏయ్ సన్యాసి!'

అని చెప్పడము.

1982 ప్రథమ దర్శనంలోనే నన్ను ఎలా శరణాగతుడను చేశారు, తరవాత నా హృదయాన్ని ఏ విధంగా శుభ్రపరిచారు... ఆ తరవాత నన్ను ఏ విధంగా స్వామి మంచి వాళ్లలో భాగంగా చేశారు... 'సన్యాసి' అని ఏ విధంగా సంబోధించారు... ఇవన్నీ చూస్తే ఇందులో ఏదో వ్యూహం ఉందని అనిపిస్తుంది.

అలాగే ఆ సందర్భంలో "నాకు ఒక మాట ఇస్తారా?" అని స్వామి అడిగారు.

... "బంగారు! మీరు ఎప్పుడైనా టీవీ చూడండి, కానీ భోజనం చేసేతప్పుడు మాత్రం టీవీ చూడకండిరా. టీవీ అంటే ఏమిటో తెలుసా? అని అడిగితే టెలివిజన్ స్వామి అన్నాము. టెలివిజన్ కాదురా 'తేలు విషం' భోజనంతో పాటుగా మీరు టెలివిజన్ చూస్తే తేలు విషం ఎక్కి మీ శరీరంలో అణువణువు కలుషితమైపోతుంది అని చెప్పారు. అందరూ చాలా ఆశ్చర్య పడినాము

నేను అన్నాను అప్పుడు... "ఏం చేస్తాం స్వామి, ఇంట్లో డైనింగ్ హాల్ లోనే టీవీ ఉంటుంది. తల వంచుకొని తింటూ ఉంటే అందరూ కూడా అరుస్తూ ఉంటారు స్వామి ఇంట్లో... నీకు ఏం వచ్చింది ఇట్లా చేస్తున్నావ్ అని... నేను ఏంచేయాలి స్వామి' అంటే... స్వామి, చాలా వాత్సల్యంతో అనురాగంతో ఒక విషయం చెప్పారు. బంగారు నీకు పాము తెలుసా? అన్నారు. పాము కోరలకు విషం ఉంటుంది. అది కాటేస్తే చచ్చిపోతారని తెలుసా? తెలుసు స్వామి, అన్నాము. పాము కాటేస్తే చచ్చిపోతామని తెలిసినప్పుడు ముందు నుండి వెనక నుండి, బలవంతంగా నలుగురు దాని మీదకు తోసినా... నువ్వు తప్పించుకోవడానికి ప్రయత్నంచేస్తావా? పాము మీద పడి చచ్చి పోవడానికి ప్రయత్నం చేస్తావా? అని అడిగారు. స్వామి తప్పించు కోవడానికి ప్రయత్నం చేస్తాను స్వామి అని చెప్పాం. అప్పుడు అన్నారు స్వామి "బంగారు! అలాగే ఆ టెలివిజన్ తేలు విషం కదా, ఆ విషం నుంచి తప్పించుకోవాలంటే నీ బలమంతా ప్రయోగించి పక్కకు వెళ్లాలి తప్ప అందులోకి వెళ్లకూడదు' అని చెప్పారు. అద్భుతమైనటువంటి పాఠం, గుణపాఠంగా నిలిచి పోయింది జీవితంలో.

1996 ప్రప్రథమ గ్రామ సేవ చేసి, స్వామి సమక్షంలో మేమంతా కూర్చున్నప్పుడు. స్వామి ఎంతో ప్రేమతో, ఎంతో వాత్సల్యంతో, ఎంతో దయతో, పాద నమస్కారం అనుగ్రహించారు. 45 మంది పిల్లల మంతాకూడా నాలుగైదు లైన్స్‌లో కూర్చుని ఉంటే, మొదటి లైన్‌లో వస్తున్నప్పుడే నా ముఖం చూడడం, నేను మోకాళ్ల మీద నిల్చుని స్వామితో ఏదో మాట్లాడబోతున్నాను... "ఏయ్ కూర్చో" అని చెప్పడము, ఏమైందో అని కూర్చున్నాను. కరెక్ట్‌గా నా దగ్గరికి వస్తూనే... నేను ఏదో మాట్లాడ బోతుంటే, స్వామి నన్ను చూస్తూ... "ఏయ్ వాడెక్కడ? ఆ వైజాగ్ పకోడ! వాడు, నువ్వు.. అని ఇద్దరిని చూపించి మాటలు బాగా ఎక్కువ మాట్లాడుతున్నారు. తగ్గించండి. అని చెప్పారు."

ఏమో అర్థం కాలేదు. అలా కూర్చుండి పోయాను. తర్వాత రెండో సారి ప్రసాదం ఇస్తున్నప్పుడు వచ్చారు. మళ్లీ మాట్లాడబోతే... "ఏయ్ చూసావా... ఎక్కువ మాట్లాడుతున్నావ్, తగ్గించు" అని చెప్పేసారు. ఇక స్వామి మాటలని నా జీవితానికి మంత్రాలుగా తీసుకున్నాను.

తర్వాత మరొక సందర్భంలో ఫోటో ఆల్బంని ప్రెసెంట్ చేయడం కోసం అందరి ముందు కూర్చున్నాను. నేను ఆ ఫోటోలు అన్నీ కూడా తీసుకుని ఆల్బంలో చక్కగా పెట్టుకొని ఖాదర్‌పేటలో, పల్లకి ఉత్సవంలో నేను మాట్లాడుతున్న సమయంలో, దివ్యమైన కాంతి పుంజాలు BABA బాబా అన్న ఆకారంలో ఉన్న ఫోటోలు కూడా తీసుకుని చూపిస్తే, స్వామి నన్ను వింతగా చూశారు. ఆ ఫోటోల వైపు, నా వైపు చూసి నన్ను ఇంతేనా అర్థం చేసుకున్నది అని చెప్పారు. గమనించవలసిన

విషయం ఏమిటంటే, వారు ఏమి చేసినా అది పూర్తిగా మన సంతృప్తికోసమే. మనం సంగతులన్ని మనకంటే స్వామికి బాగా తెలుసు... ముందే తెలుసు.

మరొక సందర్భంలో స్వామి ఆ హైదరాబాద్ యువతను అంతా కూడా ప్రశాంతి నిలయానికి రమ్మని చెప్పడము, మేమంతా కూడా ప్రశాంతి నిలయంలో సుమారు వారం రోజుల పాటు ఉన్న సందర్భము అనుకుంటాను... చాలా సార్లు స్వామి సూచన ఇస్తున్నారు. పిలుస్తాను పిలుస్తాను అంటూ ఊరిస్తున్నారు. అందరూ వంతుల ప్రకారం ఒక్కొక్కరు ఐదు ఐదు మంది ఒక్కొక్క రోజు దర్శనంలో కూర్చుంటున్నాం. నేను, వైసీ, ఉదయ్ ముందు వరుసలో కూర్చున్నాం. స్వామి రావడం... రావడం ఏమైందో తెలియదు, కానీ నన్ను చూసి "ఏయ్! వీడిని చూస్తే నాకు అసహ్యం అవుతుంది... వీడు, నెలకు రెండు మూడు సార్లు వస్తున్నాడు, పుట్టపర్తి బయటకు పంపించేస్తాను వీడ్ని" అని అన్నప్పుడు నాకు చాలా భయాందోళన కలిగింది. ఏమిటీ స్వామి ఇలా అన్నారు? నేను మూడు నెలలకు ఆరు నెలకు కూడా ఒకసారి పుట్టపర్తికి రావట్లేదే? మరి నన్ను ఇట్లా అన్నారే? ఎందుకు అలా అన్నారు తెలియదు కానీ... స్వామి ఇంటర్వ్యూకి ఇద్దరిని రమ్మన్నారు. ఆ ఇద్దరిలో నేను ఒకడిని వెళ్లాల్సి ఉండే, కానీ స్వామి మాటలకి చాలా భయపడిపోయి... ఆందోళన చెంది, వద్దులే అన్న! ఏమంటారో ఏమో స్వామి బయటికి పంపించేస్తాను అన్నారు... వద్దులే, ఇక్కడే కూర్చుంటాను అనడం, దాంతో ఉదయ్ మరియు వైసి వెళ్లారు ఇంటర్వ్యూకి. స్వామి చాలా మార్గదర్శనం చేశారు ఆ ఇంటర్వ్యూలో.

శ్రీసత్యసాయి గ్రామ సేవ మహా యజ్ఞంలో భాగంగా, కుల్వంతు సభా మంటపంలో, స్వామి సమక్షంలో మాట్లాడే అవకాశం వచ్చింది. నేను వెళ్లి "స్వామి మీరు ఏం మాట్లాడిస్తే అదే మాట్లాడతాను స్వామి" అంటే... ఒకసారి అలా నన్ను చూసి, అలా తల తిప్పుకున్నారు, అలా చెయ్యి ఎత్తారు. నాకు కొద్దిగా బాధ అయింది. అయ్యో నన్ను స్వామి చూడలేదే! అని. కానీ నాకు ఒక్కటే... స్వామి చూసినా, చూడక పోయినా... స్వామి ప్రసాదించిన శక్తి యుక్తులతోనే మాట్లాడబోతున్నాను అని ఆ వేదిక మీదకి నేను వెళ్లడం, పోడియం ముందు నిల్చోవడం, ఐదు, ఆరు నిమిషాలు మాట్లాడాను. నాకు ఇప్పటికీ గుర్తు... స్వామి నా మాటలకు ఎలా భావోద్వేగానికి గురి అయ్యారో... నా హృదయం నుండి వచ్చిన మాటలకు. నాకు తెలిసి సాయి కుల్వంత సభా మండపంలో కొన్ని వందల వేల మంది యువకులు, స్వామి కళ్ల నీళ్లు పెట్టుకోవడం చూసిన సందర్భము అదే... అంటే స్వామి మాట్లాడిస్తే, నేను మాట్లాడితే ఇలా ఉంటుంది... అని చెప్పినట్టుగా తోచింది.

సత్యసాయి గురుకుల సేవా యజ్ఞంలో భాగంగా, ఆఖిల భారత అధ్యక్షుడి పిలుపు మేరకు హైదరాబాద్ నుండి మేము ఐదుగురం ప్రతినిధులుగా వెళ్లే అవకాశం లభించింది. ఆ సందర్భంలో, ఆఖిల భారత సంస్థ పెద్దలు మరియు రాష్ట్ర అధ్యక్షులకు గురుకుల సేవా యజ్ఞంలోని సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేసే భాగ్యం కలిగింది. ఆ సందర్భంలో స్వామి దర్శన సమయంలో... అప్పుడు వచ్చిన జిల్లా అధ్యక్షులకు అంతాకూడా స్వామి కాషాయ అంగ వస్త్రాలని బహుమతిగా ఇచ్చారు. చాలా ఆనందకరమైన విషయం. కొన్ని వందల మంది వరుసలో నిలబడి స్వామి దగ్గర తీసుకునే దృశ్యం ఆవిష్కృతమైంది. మేము ఎక్కడో వెనక కూర్చున్నాం. అప్పుడు ఆఖిల భారత అధ్యక్షులు వి. శ్రీనివాసన్ స్వయంగా... "ఏయ్, హైదరాబాద్ బాయ్స్, మీరూ లైన్‌లో చేరండి" అని గట్టిగా పిలిచినారు. ఆ సందర్భంలో స్వామి చేతులమీదుగా ఆ కాషాయం అంగ వస్త్రం అందుకున్న భాగ్యవంతులలో నేను కూడా ఒకడిగా ఉండటం ఒక అద్భుతమైన అనుభూతి.

25 ఏళ్ల ప్రస్థానంలో స్వామి నన్ను ఎలా మార్చారో... చివరికి ఎలా సన్యాసదీక్షగా కాషాయం

ఇచ్చారో తలుచుకుంటే, ఎలా, స్వామి ఈ ప్రయాణంలోని అన్ని బిందువులను కలిపారో నాకు స్పష్టంగా తెలుస్తోంది. స్వామిని ఎప్పుడూ ఏది కోరింది లేదు. కానీ ఒకటే తపన... స్వామి దగ్గర ఏం చేసినా మంచి పని చేయాలి.

స్వామి సందర్శనార్థం హైదరాబాద్ భక్తులందరూ కూడా సత్యసాయి సంస్థల తరఫున పర్తీ యాత్ర చేయడము, ఆ సందర్భంలో సత్యసాయి సంగీత విభావరని మేము స్వామి సమక్షంలో ప్రదర్శించడం జరిగింది. స్వామి అందరికీ కూడా సఫారీలు బహుమతిగా ఇచ్చారు. ఆ సఫారీ ఇస్తున్నప్పుడు... స్వామి ఇప్పుడు సమాధి ఉన్న స్థానంలో కూర్చున్నారు. ఆ వీల్ చైర్‌లో కూర్చుంటే స్వామి చేతులు అంతా బలహీనంగా ఉన్నాయి, ముఖం కూడా బలహీనంగా ఉంది, అయితే భౌతికంగా నీరసంగా ఉన్నా సరే... ఎంతో ప్రేమానురాగాలతో స్వామి మా అందరికీ డ్రెస్సులు ఇస్తున్నారు. నేను వెళ్లి "స్వామి మీరు ఇక్కడ కూర్చొని ఆదేశించండి స్వామి! మీరు చెప్పిన సేవా కార్యక్రమాలన్నీ మేము చేస్తాం... స్వామి" అని చెప్తే, స్వామి చాలా బలహీనంగా ఉన్న చేతిని అభయ సూచకంగా అలా పైకి ఎత్తడము, రెండు చేతుల్లో ఆ సఫారీ క్లాత్ నాకు ఇవ్వడము అయ్యింది. నేను అనుకున్నాను... ఇది స్వామి నుంచి లభించిన ఒక అద్భుతమైన అనుగ్రహం. నేను చెప్పిన మాట, నా ప్రార్థన స్వామి ఆలకించారు అనిపించింది. తర్వాత తెలిసింది... అదే హైదరాబాద్ వాళ్లకి ఇచ్చిన చివరి దివ్యదర్శన అవకాశం అని. ఆ తరువాత స్వామి భౌతిక కాయం విడిచి, సమాధి చెందిన కాలం వచ్చేసింది.

అంటే ఇవన్నీ 1982 నుంచి చూస్తే... ఈ నాలుగు దశాబ్దాల కాలంలో, స్వామి ఏ విధంగా నన్ను మలచారు... స్వామి ఏవిధంగా నన్ను తీర్చి దిద్దారో, స్వామి ఏ విధంగా మందలించారో, స్వామి ఏవిధంగా అదిరించారో, స్వామి ఏ విధంగా బెదిరించారో, స్వామి ఏ విధంగా నన్ను కాపాడారో... ఇవన్నీ ఇక్కడ ఎందుకు చెప్తున్నాను అంటే? ఈ దృశ్యాలన్నీ కలిపి చూస్తే, స్వామి నా జీవితాన్ని ఎలా మార్చినారో, ఒక మంచి మనిషిగా ఎలా తీర్చిదిద్దారో నాకు స్పష్టంగా తెలుస్తుంది. సేవలో సమయాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలి, చచ్చిపోయే లోపల ప్రతికే పనులు చేసుకోవాలి, నిస్వార్థంగా ఉండాలి, ప్రేమానురాగములతో ఉండాలి, అన్న దీక్ష, ఈ సాధన, జీవితంలో ఒక నిత్య భాగం అయిపోయింది.

ఈ జీవితము, జీవము, జీతము, జీవనము, సంజీవనము చేసి స్వామి పాదాల చెంత సమర్పించే ప్రయత్నానికి రూపం ఈ వ్యాసము. ఒక మనిషిని, స్వామి ఏవిధంగా తీర్చిదిద్దగలడు అన్న దానికి ఈ సంఘటనలు నిదర్శనంగా నిలుస్తాయి.



65

ఇంటర్వ్యూ కాదు - ఇన్నర్ వ్యూ

ఏకాంత సౌధ సంభాషణము...
ఏ జన్మమున చేసిన పుణ్యమో...
ఎన్ని వ్రతములు చేసిన ఫలమో...

ఏమని వర్ణింతు ఆ దివ్యావకాశము అని చెప్పుకోవాలి. స్వామి ఇంటర్వ్యూకి పిలిస్తే చాలు, జీవితంలో ఇంకేమీ అవసరంలేదు, అని తలుచుకునే లక్షల మంది భక్తులు తెలుసును. 1982 నుండి 1995 దాకా అలా వేచియున్న లక్షల మందిలో నేను కూడా ఒకడు, ఆ విరహము గురించి నాకు బాగా తెలుసు. స్వామి మాట్లాడడము అనేటువంటిది మనం కేవలం దర్శనంలో చూస్తాము, లేదా వేదిక మీద వారు ఉపన్యాసం చేస్తుంటే చూస్తాము. కానీ, వ్యక్తిగతంగ స్వామి మాట్లాడేటప్పుడు చూడాలి, స్వామి ఎట్లా ఉంటారో చూడాలి, స్వామికి దగ్గరగా ఉండాలి, స్వామి పాదనమస్కారం చేసుకోవాలి, పాద సేవ చేసుకోవాలి అని చాలా తపన ఉండేది.

అలా సింహావలోకనం చేసుకుంటే...
పర్తీశుని పిలుపు యద తలుపులు తెరుచు
పరమాత్మునితో గడుపు సమయం అది నిజముగాను
పరమార్థము మనకు తెలుపు సంభాషణము
సత్యముగ పరివర్తనకొక రాజమార్గమది ప్రస్ఫుటముగా

అంత అద్భుతమైన విశేషాలకి వేదిక స్వామి వారి ఏకాంత సౌధము. విశ్వ వ్యాప్తంగా, స్వామి భక్తుల జీవిత లక్ష్యము ఏదైనా ఒకటి ఉంటుంది అంటే... అది స్వామి ఇంటర్వ్యూకి పిలవాలి! అన్నదే ఆ కోరికల గదికి ఎంత ప్రాముఖ్యమైందో చెప్పలేం, ఆ గదిలోనే స్వామి వారు దేశాధ్యక్షులతో, ప్రధానమంత్రులతో, ముఖ్య మంత్రులతో, ఎమ్మెల్యేలతో... ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక వ్యక్తులు, భక్తులు... అందరితోనూ స్వయంగా సంభాషిస్తారు. అలాంటి అద్భుతమైన

చోటులో మనం కూడా పది నిమిషాలు గడపాలి స్వామితో అని అందరికీ ఉంటుంది. నిజానికి అది ఇంటర్వ్యూ కాదు మనకొక ఇన్నర్ వ్యూ అనాలి.

ఆ ఇంటర్వ్యూ గదిలో, మన హృదయం, మనసు, మన చేతలు... ఇంకా చెప్పాలంటే మొత్తం మన జీవితాన్ని స్వామి ఎలా తన ఆధీనంలో ఉంచుతారో అన్న విషయం గురించి మీకు వివరిస్తాను.

సామాన్యంగా స్వామి వారిని బయట అందరూ దర్శనం చేసుకోవచ్చు, వీలైతే పాద నమస్కారం చేసుకోవచ్చు, ఎప్పుడైనా చాలా అరుదుగా స్వామితో మాట్లాడొచ్చు, కానీ ఇన్ని విషయాలు ఒకే సమయంలో ఎక్కడైనా జరుగుతుందా... అంటే అది ఒక ఇంటర్వ్యూ గదిలో జరుగుతుంది.

బడలు తెలియని ఆనందం అక్కడ
పొంగి పొరలే ఉత్సాహం అక్కడ
దొరకదులే అట్టి అనుభవం మరి ఎక్కడ
ఉవ్విళ్లూరు మనసు తుళ్లింతకు లోనై
కారణం...
దర్శనం పాపనాశనం
స్పర్శనం సంకటహరణం
సంభాషణం సందేహ నివారణం
పాద సేవనం పాప వినాశనం
ఏకాంత సౌధములో ఇవన్నియు దొరుకునండి పుష్కలముగను

స్వామి మనలను ఇంటర్వ్యూకి పిలిచే తీరు చాలా విశేషంగా, అపూర్వంగా ఉంటుంది. మనం ఉన్న నాలుగైదు రోజుల్లో మొదటి రోజు నుంచే స్వామి పిలువబోతున్నారని సంకేతం తెలిసిపోతుంది. స్వామి, మనవద్దకు వచ్చే తీరు... స్వామి చూసే చూపు... స్వామి చేసే సంభాషణ... స్వామి ఒక్కరికి లేదా ఇద్దరికి ఇచ్చే ఆశీర్వాదం... స్వామి భక్తుల గురించి తీసే ఆరా... ఈ సంకేతాలు అన్ని స్వామి సమీపంలో ఉండే వారు వెంటనే గుర్తిస్తారు: "అహా! స్వామి మనతో మాట్లాడబోతున్నారు, ఇంటర్వ్యూకి పిలవబోతున్నారు" అని. ఈ విధంగా స్వామి ఎంతో సహజంగా, ఎంతో విశేషంగా, ఇంటర్వ్యూ రూమ్‌లోకి వెళ్లే ముందే తన దయానుగ్రహాన్ని అనుభవించేలా ఉత్సుకతను సృష్టిస్తారు.

ఇక ఆ ఉత్సాహంతో, ఎవరికి వారు తపన పడతాడు. "స్వామి పిలుస్తారేమో! స్వామి పిలుస్తారు! స్వామి పిలవాలి... మనం సిద్ధంగా ఉండాలి, సిద్ధంగా ఉండాలి... సాయి రామ్, సాయి రామ్..." అని కాలాన్ని గడుపుతుంటారు.

స్వామి దర్శనంలో మనల్ని చూస్తే చాలు... "థాంక్యూ స్వామి! థాంక్యూ స్వామి!" మమ్మల్ని చూసినందుకు అని టెలిగ్రామ్‌లు పంపడం... కొందరు లేఖలు వ్రాసి ఇస్తుంటారు కూడా... "స్వామి, కొత్త పిల్లలు వచ్చారు! అందరినీ తీసుకొచ్చాం స్వామి... మీరు మాట్లాడాలి స్వామి... చూడాలి స్వామి! వీరందరూ ఉత్సాహ పడతారు, స్వామి ప్రోత్సహించండి స్వామి... అని స్వామికి భావోద్వేగంతో వ్రాయడం! లేదా ముందర కూర్చున్న వాళ్లకి ఎవరికైనా అవకాశం వస్తే... "స్వామి మాట్లాడండి స్వామి!" అనడం, స్వామి అలవోకగా చూడడం, చాలా చాలా విశేషంగా ఉంటుంది.

అదే దృశ్యాన్ని నేను అనుభవిస్తూ వ్రాసాను
ఎప్పుడొచ్చారంటూ! ఏడ్పులు పోగొట్టు వాడవు
రా రమ్మని పిలిచి పాషాణ హృదయములు కరిగించు వాడవు
మంచిది బంగారు! అంటూ మధురానందం అందించువాడవు

అందుకో వందనములు శ్రీ సత్యసాయి

స్వామి మనతో సంభాషించే తీరు, ఒక స్ఫూర్తి, దివ్యానుభూతి. నాలుగైదు రోజులు కాదు, కొన్నిసార్లు, మన ఆర్తిని ప్రాప్తిని బట్టి వచ్చిన మొదటి రోజే, మొదటి దర్శనంలోనే స్వామి ఇంటర్వ్యూకి పిలిచేవారు.

ఆ ఇంటర్వ్యూ గదిలో, పిలిచిన క్షణం నుంచి చివరి వరకూ ఎన్నో పాఠాలు, ఎన్నో అనుభవాలు నేర్చుకోవచ్చు. అంటే ఇది స్వామి చేస్తున్న మహిమల గురించో, స్వామి ఇస్తున్న బహుమతుల గురించో ఇవన్నీ కాదు... ఈ వ్యాసంలో ఒక మానవశరీరముతో, మాధవత్వము నిండిన హృదయముతో, వెయ్యి తల్లుల ప్రేమను కురిపించే అమ్మ లాగా స్వామిని అతి దగ్గరగా చూస్తున్నప్పుడు నేర్చుకున్న, తెలుసుకున్న, విషయాలని నేను మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

స్వామి దర్శననములో ఇంటర్వ్యూకి రమ్మని చెప్పినప్పుడు... వరుసగా పిల్లలు అందరూ ఒకరి వెనక ఒకరు స్వామి వైపు వెళ్తుంటే, స్వామి! అమృత దృష్టి తో... ఎంతో రాజసంగా ఒక్కొక్కరిని గమనిస్తూ చూడడం, ఎవరెవరు వస్తున్నారో పరిశీలించడం... నిజంగా చెప్పాలంటే, స్వామి చూపు పడటం ఒక్కోరికీ ఒక గోల్డ్ మెడల్ లాంటిది. ఇక స్వామి ఇంటర్వ్యూకి పిలిచారంటే అక్కడ కూర్చున్న వేలాది మంది భక్తుల దృష్టి అంతా "అబ్బా! స్వామి ఆ పిల్లల్ని పిలిచారు... హైదరాబాద్ పిల్లలు!" అని మనలను మళ్లీ మళ్లీ చూడటము.

అబ్బో... అసలు ఎంత ఉత్సాహమో! అసలు ఒక్కొక్కడు లోలోపల గంతులు వేస్తున్నట్టుగా, బయట మాత్రం ముకుళిత హస్తాలతో వెళ్లడం... అందరూ వెళ్లి స్వామి గది ముందు కూర్చునే వాళ్లం. స్వామి చాలా చాలా ప్రేమానుగ్రహ దృష్టిని కురిపిస్తూ... దర్శనం అయిన తర్వాత స్వామి అక్కడికి వచ్చే వాళ్లు. ఊ! పదండి అని ఆ గదికున్న ఒక తలుపు మూసి, ఇంకో తలుపు దగ్గర తను నిలబడి అడ్డు నిలుచుంటారు. అడ్డు నిలుచున్నప్పుడు ఆ ఇంటర్వ్యూకి ఎవరెవరు వెళ్తున్నారు అనేదాన్ని ప్రత్యేకంగా చూస్తారు. అక్కడే సగం కడుపు నింపేస్తారు. ఎందుకంటే స్వామి అలా వచ్చిన వాళ్లందరిని కూడా చూస్తారు కదా అందుకు. చిట్టచివర స్వామి లోపలికి వస్తారు... వచ్చి, స్వామి స్వయంగా బోల్ట్ వేస్తారు. ఎంత ఉత్సాహం అండి!!! తన ఇంటికి వచ్చిన వాళ్లకి ఏకాంతము ఇవ్వాలనే భావన, మనం జగన్నాథునితో చేరాలి అంటే జగత్తు నుండి విడిపోవాలి అన్నట్టుగా బయట ప్రపంచము ముఖం మీద తలుపు మూసి లోపల నుండి గడియ పెట్టేస్తారు.

స్వామి నిదానంగా వచ్చి, ఆ గదిలో ఒక మూలలో ఉన్న సింహాసనంలో కూర్చుంటారు. మేము ఎప్పుడు వెళ్లిన 30 నుండి 60 మందిమి వెళ్లిన సందర్భాలే ఎక్కువ. స్వామి! అలా ఇలా దారి చేసుకుంటూ, ఒక్కొక్కరు అట్లా ఇట్లా సర్దుకుంటూ స్వామికి మధ్యలో దారి ఇస్తుంటారు. ఎంత దివ్యమైన నిశ్శబ్దము అంటే..."గాఢమైన నిశ్శబ్దము నందే భగవద్ వాణి వినిపించును" అన్నది అక్షర సత్యము అని అందరూ గ్రహిస్తారు. ఒకరి శ్వాస ఇంకొకరికి వినిపించేంత నిశ్శబ్దం లోపల. బయట ఎక్కడ ఏమి శబ్దం ఉండదు. దర్శనానికి భజనకి మధ్య సమయంలో స్వామి ఇంటర్వ్యూకు పిలుస్తూ ఉంటారు. అది ఉదయం అయినా సరే... సాయంకాలం అయినా సరే... ఎలాంటి శబ్దాలు ఉండవు. ఆ మధ్యకాలంలో, సంగీతం మంద్రంగా వినిపించేది. ఒక్కో సారి అసలు శబ్దమే ఉండదు.

ఆ గది సుమారు 10 x 10 అడుగుల పరిమాణంలో ఉంటుంది. ఒక మూలలో స్వామి వారి సింహాసనం! ఎంత రాజసంగా, ఎంత మహిమాన్వితంగా ఉంటుందో! స్వామి ఆ సింహాసనంలో

కూర్చుంటే 'అబ్బా! స్వామిని ఇంత దగ్గరగా చూస్తున్నామా!' అని అనిపించేది. స్వామి ఎదుట ముందు కూర్చోవాలని ఒక్కొక్కరులో లోపల పోటీ పడేవారు. ఆ ఇంటర్వ్యూ రూములోకి వరుసలో పోవడంఎట్లో గాని, స్వామి లోపలికి వచ్చే వేళ్లకి ఎవడికి వాడు ఎక్కడ వీలైతే అక్కడ అయస్కాంతానికి అతుక్కుపోయిన ఇనుము ముక్కల్లాగా ఆ సింహాసనం దగ్గరగా వెళ్లిపోయి కూర్చునే వాళ్లు.

స్వామి కుర్చీ ప్రక్కన ఒక టీపాయి, ఆ టీపాయి మీద నీళ్లు, కొన్ని ఉత్తరాలు, చిన్న బాస్కెట్ ఇవన్నీ ఉంటాయి. స్వామి అలా స్థలం చేసుకొని ఇలా ముందుకు వస్తారు, కూర్చుని, అందరిని చూసి "చాలా సంతోషం! చాలా సంతోషం!" అని మళ్లీ లేస్తారండి, అక్కడ ఎంత మందైనా ఉండొచ్చు... మళ్లీ లేచి, నిదానంగా... స్విచ్ బోర్డు దాకా వెళ్లి ఫ్యాన్ & లైట్ వేస్తారు, వేసి మళ్లీ వచ్చి కూర్చుంటారు. "ఏమి సమాచారము?" అంటూ మొదలు పెడతారు.

స్వామి మనకు మాట్లాడే అవకాశం ఇస్తారు, మన సమస్యలు చెప్పుకునే అవకాశం ఇస్తారు, సమర్పించుకునే అవకాశం ఇస్తారు, మన ఆలోచనలు, మన కార్యక్రమాలు పంచుకునే అవకాశం ఇస్తారు. స్వామి ఒక్కొక్కరిని వ్యక్తిగతంగా చూసి, వారితో మాట్లాడుతుంటే ఆ కన్నుల్లో అమృతం పొంగిపొర్లుతున్నట్టుగా అనిపిస్తుంది. ఎంత కరుణ, ఎంత స్నేహం ఆ దివ్య దృష్టిలో! ఆ ఇంటర్వ్యూలో స్వామి కన్నుల్ని చూస్తే, దివ్యమైన మాతృమూర్తి కన్నుల్లా ఉంటాయి. కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి మన ముందే కూర్చున్నట్టుగా ఉంటుంది. వెయ్యి తల్లుల ప్రేమ స్వామి రూపంలో మన మధ్య ప్రత్యక్షమై ఉన్నట్టుగా అందరం అనుభవించేవాళ్లం.

స్వామి చేతులు పట్టుకునే వాళ్లము. చేతులు పట్టుకొని పిసుకుతూ ఉంటారు. స్వామి కాళ్లు పట్టుకునే వాళ్లు... కాళ్లు పట్టుకొని పాదసేవనం చేస్తూ ఉంటారు. స్వామి అలా చూస్తూ ఉంటారు. గోపికలు శ్రీకృష్ణ భగవానుడి పరిచర్యలో ఎలా తమను తాము మరిచిపోయి ఉంటారో, ఆ మధుర భక్తికి నిలువెత్తు నిదర్శనము ఆ ఇంటర్వ్యూ రూమ్‌లో గోచరం అవుతుంది.

స్వామి మాట్లాడటం మొదలు పెడతారు. ఉన్నట్టుండి ఎవరికో ఒకరికి ఒక చైన్, ఒక రింగో ఇవ్వడము పరిపాటిగా ఉంటుంది. కొద్దిమందికి విభూదిని సృష్టించి ఇస్తూ ఉంటారు. కొద్ది మందికి ఉన్నట్టుండి ప్రశ్నలు వేస్తూ ఉంటారు. కొద్దిమందికి ఉన్నట్టుండి వారి గురించిన విశేషాలు చెప్తూ ఉంటారు... ఇలాగ జరుగుతూ ఉంటుంది.

తర్వాత స్వామి ఇవ్వాల్సిన సందేశము ఏదైతే ఉందో... చాలా శులభ రీతిలో అక్కడ కూర్చున్న వాళ్ల గుండెలకు హత్తుకునే విధంగా, వాళ్లని తను ఎత్తుకునే విధంగా, హృదయములో పెట్టుకునే విధంగా, ఎంత అద్భుతమైన విధంగా మాటలు చెప్తారు అంటే... ఇక పూర్తిగా, ఇక చాలు స్వామి! ఇక చాలు మా జీవితం! ఇక వద్దు ఇక బయటికి వెళ్తే మాకు ఏమి అవసరం లేదు... అన్నంత విరహాన్ని స్వామి సృష్టిస్తారు హృదయాలలో. ఆ గాలి వానకి అల్లల్లాడి పోయినటువంటి చిగురుటాకుల్లా వణికి పోతాం. ఒకరు ఏడుస్తూ ఉంటారు, ఒకరు నవ్వుతూ ఉంటారు, ఒకరు ఆనంద పడుతూ ఉంటారు, ఒకరు తదాత్మ్యం చెంది ఉంటారు, ఆ ఇంటర్వ్యూ గదిలో.

మిగతావాళ్లు ఏమిచేస్తుంటారో ఎలా ఉంటారో మనకు తెలియదు, ఎందుకంటే మన దృష్టి పూర్తిగా స్వామివైపే ఉంటుంది. పక్కనోడు ఏంటి అనేది కూడ ఆలోచనలో ఉండదు. అలాంటి వాతావరణం ఆ గదిలో సృషించ బడుతుంది. ఇది మంత్రం కాదు... తంత్రం కాదు... స్వామి నిస్వార్థ ప్రేమ.

ఎంత ప్రేమ అంటే... ఎన్నో ఇంటర్వ్యూ అవకాశాలు ఇచ్చారు మాకు! కనీసం ఒక 20-30

ఇంటర్వ్యూలు స్వామి ప్రసాదించారు. ఆ ఇంటర్వ్యూలో ఏదో ఒకమూల కూర్చునే అవకాశం నాకు కూడా వచ్చింది. అలా గమనిస్తూ ఉన్నప్పుడు, స్వామి ఎంత కరుణతో ఉంటారో! అనిపించక మానదు. అబ్బా! ఇంత కరుణ సాధ్యమా? బయట ఇంత ప్రపంచం ఉంటే, తను చూసుకోవాల్సిన విశ్వం ఎంతో ఉంటే... స్వామి మా కోసమే ఇంత సమయం ఇస్తున్నారే! ఇంత కరుణతో ఉన్నారే! ఇంత హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారే! అని అనిపిస్తుంది. ఆ కరుణని, ఆ ప్రేమని, మనం నిజంగా నేర్చుకోగలిగితే... మనము స్వామికి తక్కువ కాము అనిపిస్తుంది, అది సాధ్యమా? అని కూడా అనిపిస్తుంది.

తర్వాత అంతా కూడా వ్యక్తిగతంగా మాట్లాడటం, ఇదంతా చేసిన తర్వాత... ఎవరైనా ఫోటోలు చూపిస్తే చూస్తారు. గ్రూప్ ఫోటోలు తీసుకుంటారు. ఇలా సుమారు 60 నిమిషాల పాటు ఇంటర్వ్యూ జరుగుతుంది.

చిట్టచివరికి స్వామి "ఇంకా! ఏంటి విషయం?... ఏంటి సమాచారం" అంటే ఇక వెళ్లాలి అన్న సంకేతం స్ఫురిస్తుంది. వెంటనే మా బృందం అంతా తయారు అవుతాము. స్వామి ఒక పాట పాడతాం స్వామి. ఒక భజన చేస్తాం స్వామి. కారణం ఏంటో తెలుసా... అలా ఇంకాసేపు స్వామితో సమయం గడపచ్చు అన్న ఉపాయం. స్వామి మాకు అద్భుతమైన అవకాశాలు ఇచ్చేవారు. ఆ అవకాశాలు అంతా ఇంత కాదండి... ప్రపంచంలో ఏ బృందానికి కూడా ఇంత ప్రేమ అనురాగాలని పంచి ఉండరేమో అన్నంతగా ఉంటాయి. ఇతర బృందముల గురించి నాకు తెలియదు, కానీ హైదరాబాద్ బృందంలో భాగమై ఉండటం నేను దీవెనగా భావిస్తాను. ఈ జన్మ అంతా కూడా నేను హైదరాబాద్ యువతకు ఋణపడి ఉండాలి. కారణం ఏందంటే ఎన్ని ఇంటర్వ్యూలు స్వామి ఇచ్చారో!

ఆ ఇంటర్వ్యూలో... వ్యక్తిగతంగా మన దగ్గరికి ఎవరైనా వస్తే, మనం ఎలా ఉండాలి? వాళ్లకి ఏ విధంగా ఆతిథ్యం ఇవ్వాలి? ఏ విధంగా మాట్లాడాలి? ఏ విధంగా ప్రేమను చూపాలి? ఏ విధంగా శుశ్రూషలు చేయాలి? ఏ విధంగా ఆలోచించాలి? ఏ విధంగా తపించాలి? ఏ విధంగా వాళ్లకి బహుమతులు ఇవ్వాలి? ఏ విధంగా గేటు దాకా తీసుకెళ్లి మళ్లీ వీడుకోలు చెప్పాలి? ఈ విషయాలను పాఠాలుగా మనం నేర్చుకోవచ్చు.

చిట్టచివరికి పాట, మాట, ఆట, అన్ని అయిన తర్వాత "ఆ బంగారు... ఇక టైం అయిపోయింది, పదండి, పదండి... అని స్వామి పలికితే, అందరూ ఒక్కసారిగా దిగులు పడిపోతారు. 'స్వామి, ప్లీజ్... స్వామి, ఇంకా కొద్దిసేపు' అని వేడుకుంటూ ఉంటారు. అయినా స్వామి చిరునవ్వుతో మళ్లీ లోపలి రూమ్‌కి వెళ్లి, అక్కడి నుంచి స్వయంగా విభూతి ప్యాకెట్లు గానీ, పండ్లు గానీ, లేదా వస్త్రాలు గానీ ఉన్న బాస్కెట్ తీసుకుని వచ్చి అందరికీ అందజేస్తారు." ఇంకేం కావాలండి? దర్శనం, స్పర్శనం, సంభాషణం, పాద నమస్కారం, ప్రసాదము, ఏకాంత సౌధ సంభాషణ సమయంలో ఇవన్నీ జరుగుతాయి. పెద్ద లాటరీ తగిలినట్టే అనుకోవాలిఏ భక్తుడికైనా సరే.

స్వామి చెప్పినట్లు, అది అసలు ఇంటర్వ్యూ కాదు. 'ఇంటర్వ్యూ' అంటే కేవలం మాట్లాడుకోవడం కాదు, ఇన్నర్ వ్యూ, అంటే మనసులోకి తొంగి చూసే అవకాశం. ఇంటర్వ్యూ రూమ్‌లో ఎవరికైనా, అక్కడ కూర్చున్న ప్రతివారికీ, అంతర్ముఖ దర్శనం కలిగించే సువర్ణావకాశం. అలాంటి అనేక ఇంటర్వ్యూలకు స్వామి మాకు అనుగ్రహించారు.



66

ఏకాంతంలో... దివ్యస్మృతులు

ఇంటర్వ్యూ గదికి వెళ్లిన ఏ సందర్భమైనా ఎన్నెన్నో మధురానుభూతులు స్వామి మాకు ప్రసాదించారు. నా పూర్వజన్మ సుకృతమిది అని కొన్ని వేలసార్లు అనుకుంటాను. చాలా మంది భక్తులకి జీవిత కాలంలో కనీసం పాదనమస్కారానికి కూడా నోచుకోని కథలు ఎన్నో తెలుసు. కానీ... మేము చేసుకున్న పుణ్యము ఏమిటో తెలియదు. హైదరాబాద్ బృందంలో ఉన్న ప్రతి ఒక్కరికి స్వామి దర్శన, స్పర్శన, సంభాషణ, పాదనమస్కార, ప్రసాద భాగ్యాలు నిండుగా దండిగా మెండుగా ఇచ్చారు. మా తోడు నీడగా... ఇంట జంట కంట వెంటగా... స్వామి ఉన్నారు అనడానికి ఎన్నెన్నో నిదర్శనాలు ఉన్నాయి.

ఇంటర్వ్యూ గురించి నేను మాట్లాడుతున్నాను కదా! అలా కళ్లు మూసుకుంటే... నా హార్ట్ డిస్క్‌లో కదలాడే అనుభూతులు, అనుభవాలని ఈ వ్యాసం ద్వారా మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

మొట్టమొదటిది నాకు బాగా గుర్తున్న విషయం ఏంటంటే..

ఒకానొక ఇంటర్వ్యూలో మేము ఒక 7 మంది ఉన్నాము, స్వామి మాతో మాట్లాడుతూ మాట్లాడుతూ... అడిగారు, "బంగారు! సేవ ఎలా చేయాలిరా?" అని.

సేవ ప్రేమతో చేయాలి స్వామి! అన్నాడు ఒకడు.

సేవ నిస్వార్థంగా చేయాలి, స్వామి! అని చెప్పాడు మరొకడు.

ఇంకో అబ్బాయి అన్నాడు... స్వామి సేవ! స్వామి మీద భక్తితో చేయాలి అన్నాడు.

స్వామికి ఆ సమాధానాలు ఏవీ నచ్చలేదు. "అది కాదు బంగారు! నేను ఒక కథ చెప్తాను," వినండి అని మొదలు పెట్టారు.

చాలా కాలం క్రితం ఒకానొక పల్లెటూర్‌లో పెద్ద చెరువు ఉండేది. ఆ పెద్ద చెరువు గట్టు మీద పిల్లలు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎండాకాలం అవ్వడం వల్ల ఆ చెరువులో నీళ్లన్నీ ఇంకి పోయి మధ్య లోతు ప్రాంతంలో కాస్త బురదగా మారిపోయి, కాస్త అక్కడ మాత్రమే నీళ్లు కనిపిస్తున్నాయి.

మేత కోసం వచ్చిన పశువుల మందలో నుంచి అప్పుడప్పుడే పుట్టిన ఒక చిన్న లేగ దూడ, చెంగు చెంగు మని ఎగురుతూ అక్కడ నీళ్ల కోసం పరిగెత్తుకుంటూ వచ్చింది. పాపం దానికి తెలియదు! అది బురద నీరు అని. నీళ్లు తాగాలనే ఆశతో అది బురదలోకి దిగి, నీరు తాగింది. నీరు తాగిన వెంటనే, ముందు కాళ్లు బయటికి తీయాలని చెప్పి, వెనకకాళ్లు తొక్కి పట్టింది... ఆ కాళ్లు రెండు కూడా బురదలో ఇరుక్కున్నాయి. వెనక కాళ్లు అదిమి పెట్టి ముందు కాళ్లు తీస్తున్న ప్రయత్నంలో ముందు కాళ్లు కూడా ఇరుక్కుని పోయినాయి. ఇలాగ ముందుకు వెనక్కి, ముందుకు వెనక్కి జరుగుతూ కడుపు దాకా బురదలోకి కూరుకుపోయింది! ఆ దూడ చాలా విలవిల్లాడుతోంది. ఈ దృశ్యం చూసి గట్టు మీద పిల్లలందరూ కూడా చూసి కేరింతలు కొడుతున్నారు. అది ఎట్లా బయట పడుతుందో చూద్దామని వేడుక చూస్తున్నారు. అలాంటి సమయంలో ఆ గట్టుమీద వస్తున్న ఒక సన్యాసి, ఈ దూడ పడుతున్న వేదనను చూసి విలవిల్లాడి పోయాడు. వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్లిపోయి దాన్ని రక్షిద్దామని బురదలో దుంకుతుంటే 'ఏయ్! నువ్వు ఎందుకు వెళ్తున్నావ్? ఏయ్ ఉండు ఉండు' అని గట్టు మీదున్న వాళ్లు అంటున్నా సరే... అలాగా వెళ్లిపోయి ఆ బురదలో దిగాడు.

దిగి తన తలను ఆ బురదలో కూర్చి... భుజాలమీద ఆ దూడని ఎత్తుకొని గట్టు మీద చేర్చాడు. పిల్లలందరికీ చాలా కోపం వచ్చేసింది. ఆయనను పట్టుకొని అడిగారు. ఏమయ్యా! మా ఊరు, మా దూడ, మా ఇష్టం. నువ్వేంటి మధ్యలో? నీకేమి హక్కు ఉంది? దాని బాధను తీర్చడానికి నువ్వెవరు?! అని అన్నారు. అప్పుడు ఆ సన్యాసి కన్నీళ్లు కారుస్తూ... ప్రేమతో... చెప్పాడు, "నాయనా! నిజమే! మీరు చెప్పినట్టు నాకు దాని బాధ తీర్చడానికి హక్కు లేదు? అయినా నేను దాని బాధ తీర్చలేదు. ఆ దూడ పడే బాధను చూసి నాకు బాధ కలిగింది నాయనా... నా బాధను తొలగించుకునే ప్రయత్నం చేశాను తప్ప, దాని బాధ తొలగించడం నేను చేయలేదు నాయనా" అని చెప్పారు. ఈ సమాధానం విన్న పిల్లలు చేష్టలుడిగి నిలిచిపోయారు.

స్వామి ఈ కథ చెప్పి, బంగారు! పరుల బాధను చూసినప్పుడు మీకు కలిగే బాధను తొలగించుకోవడానికి, మనం సేవలు చేయాలి తప్ప... పరుల బాధను తొలగించడానికి కాదయ్యా! అని చెప్పారు.

ఎంత అద్భుతమైన కథ! నిజంగా ఎంత ప్రభావం చూపించిందంటే... గత 3 దశాబ్దాలుగా ఎన్నో వందల సార్లు ఈ కథను గుర్తు చేసుకుంటూ ఉంటాము. ఇదిగో ప్రస్తుతం మేము చేస్తున్న సేవలకు మూలం ఇదే భావన.

మరొక సారి, మేమంతా ఇంటర్వ్యూ గదిలో కూర్చున్నాం. స్వామి మాట్లాడుతూ... మాట్లాడుతూ! "ఏయ్ మీకు ఒకటి చూపిస్తాను, అని చేతిని అలవోకగా తిప్పారండి. ఆ గది అంతా మెరుపులు మెరిసినట్టుగా, స్వామి దివ్యహస్తంలోకి అద్భుతమైన వజ్రము వచ్చేసింది. దాన్ని వారి చేతిలో తిప్పుతుంటే ఒక్కొక్కరి ముఖాల మీద ఆ కాంతి రేఖలు ప్రతిబింబిస్తున్నాయి. ఆ వజ్రమును చూపించి, "బంగారు! ఇది ఎక్కడి నుంచి తెచ్చానో తెలుసా? కన్యాకుమారి ముక్కు పుడకరా... పూర్వము కన్యాకుమారి ముక్కు పుడక ఇలా ఉండేది. కానీ ఆ ముక్కు పుడక వల్ల అది లైట్ హౌస్ అనుకుని, చాలా స్టీమర్లు, పడవలు, బోట్లు అన్నివచ్చి ఆ తీరానికి గుద్దుకొని తుత్తినియలు అయిపోయేవి. అందుకోసం దాన్ని తీసి భద్రపరిచారు. ఇదిగో ఆ మొక్కు పుడకనే చూడండి అంటే... "అమ్మ! అది చూస్తూనే మాకు మాటలు రాలేదు. స్వామి తమాషాగా అడుగుతున్నారు... కావాలా? నీకు కావాల? నీకు కావాలా? అని చెప్పి ఆ చేతి రుమాలలో స్వామి ఆ వజ్రాన్నిపెట్టి చూపించారు. వాడు ఎవడో చూస్తుంటే ఉన్నట్టుండి ఆ చేతి రుమాలలోనే మాయమైపోయింది ఆ వజ్రం!!

తర్వాత స్వామి చెప్పారు... "బంగారు! నేను ఒక్కసారి చెయి ఇలా అంటె చాలు... భూమి ఆకాశంగా మారిపోతుంది, నేను ఒక్కసారి చెయి అలా అంటే ఆకాశం భూమిగా మారిపోతుంది రా! ఇది నా శక్తి. అని చెప్పిన సందర్భం నాకు బాగా గుర్తుంది.

ఒక సారి, మేమంతా కూడా గ్రామ సేవలు చేసుకుని స్వామి దగ్గరికి వెళ్లిన సందర్భము అది. స్వామి ఎంతో ప్రేమగా పిల్లల్ని చూస్తారు. ఎంత వాత్సల్యంతో పిల్లలకి కరుణ ప్రవహింప చేస్తారు. మేమంతా అక్కడ 40-45 మంది కూర్చున్నాం అనుకుంటున్నాను. ఇంకా ఎక్కువే ఉంటారు ఆ ఇంటర్వ్యూ గదిలో. సుమారు గంటసేపు సంభాషణ నడిచింది. లోపల గాలి ఆడక ఉక్కపోతకి అందరికీ చెమటలు పట్టి, ఇద్దరు ముగ్గురు కూర్చున్న దగ్గర కాళ్ల క్రింద చెమ్మ లాగా వచ్చేసింది. అందరూ వెళ్లిపోతున్నప్పుడు ఇద్దరు ముగ్గురు పిల్లలు వారి దగ్గరున్న రుమాలు తీసుకొని శుభ్రపరిచే ప్రయత్నం చేస్తున్నారు. వెంటనే స్వామి, "ఉంచండి బంగారు! ఉంచండి! అది పవిత్రమైన గంగాజలమురా... సేవ చేసినవాళ్ల చెమటరా అది, ఉంచండి అలాగే ఉంచండి!" తరవాత ఈ విషయం విన్న మా అందరికీ కూడా ఒళ్లు జలదరించి పోయింది. చివరికి మా చెమటకు కూడా స్వామి ఎంత విలువ ఇచ్చారు కదా! అని.

మరొక సందర్భంలో... ఇంటర్వ్యూ అయిపోయే ముందు, స్వామి "ఇంకా ఏమి సమాచారం! బంగారు... పదండి, పదండి" అంటూ సంభాషణకు ముగింపు పలుకుతున్నారు. కానీ స్వామితో సమయాన్ని ఇంకో పది నిమిషాలు ఎట్లా పొడిగించాలన్నది మాకు తెలిసిన విద్య! స్వామిని ఎలా ఇంకాసేపు నిలపచ్చు అంటే... స్వామి, స్వామి! ఒకపాట పాడతాం. స్వామి ఒక భజన చేద్దాం స్వామి... అంటే ఇంకొక ఐదు నిమిషాలు పది నిమిషాలు ఉండొచ్చు కదా అని ఆర్తితో అర్థిస్తాము.

స్వామి ఇంటర్వ్యూ ఇస్తారు అని ఏ మాత్రం సూచన దొరికినా, దొరక్కున్నా... సేవలు చేసుకుని పుట్టపర్తికి వెళ్తాము అంటే, ఏదో ఒక పాటనో ఒక భజననో అందరం నేర్చుకునే వాళ్లం. అది తప్పకుండా స్వామి దగ్గర సమర్పించాలని.

అలాంటి సందర్భంలో ఒకసారి గ్రామాలలో పల్లకి ఉత్సవాలు చేసిన ఉత్సాహంలో... అందరూ వేడి వేడిగా ఉన్నారు స్వామి దగ్గర పాడాలి అని. ఆ సందర్భంలో స్వామి ఇంటర్వ్యూ ఇవ్వడం, స్వామి ఒక పాట పాడతాం స్వామి... అంటే, పాడండి బంగారు అని చెప్పడం, ఆ చిన్న గదిలో సుమారు ఐదారు మంది చేరి గొంతెత్తి పాడితే మిగతా 40 మంది వంత పాడితే ఎలా ఉంటుంది? అలా పాడిన పాట ఏంటో తెలుసా!?

రాధా నాచే గోపినాచే నాచే నందకుమార్

అలాగే మరొక ఇంటర్వ్యూలో స్వామి పాట పాడుతాం అంటే... పాడమని చెప్పారు.

సాయి మాత బిడ్డలం అందరం, సాయి మాత బిడ్డలమే అందరం

ఈ పాట పాడినప్పుడు అసలు స్వామి స్పందన మేమెవరము జీవితములో మర్చిపోలేము. పాట పాడటం అయిపోయినా తరవాత స్వామి వారు తమ కళ్లు మూసుకుని... తమ బొటన వ్రేలు చూపుడు వ్రేలు కలిపి భూమధ్య స్థానములో పెట్టుకుని కొన్ని నిముషాలు అలా ఉండిపోయారు. కళ్లు తెరిస్తే... ఆ కళ్లలో ఆనంద భాష్పాలు గంగా జలంలా... అమృతం లాగా కురుస్తుంటే.. "బంగారు! నా జీవితము, నా సందేశము అంతా దీంట్లో పెట్టేసారురా. నన్ను నేను మరచి పోయాను... చాలా సంతోషం. మీరు ఎక్కడికి వెళ్లినా ఈ పాట పాడండి. ఈ పాట దేశాన్నంతా ఐక్యం చేస్తుంది." అని చెప్పారు.

తదాదిగా, స్వామి ఇచ్చిన ఆదేశం మేరకు, కొన్ని వందల, వేల సమావేశాల్లో ఎక్కడ వీలవుతే అక్కడ, ఎలా వీలవుతే అలా, ఎప్పుడు వీలవుతే అప్పుడు... ఈ పాటని మేము పాడటం జరిగింది. ఈ పాట పాడిన ప్రతి సమయంలో, ప్రతి సందర్భంలో కూడా... స్వామి ఆ రోజు చెప్పిన మాటలు మాకు వినిపిస్తూనే ఉంటాయి. వారి దివ్య వాణి మా చెవుల్లో మారు మ్రోగుతూ ఉంటుంది.

20-30 ఇంటర్వ్యూలలో జరిగిన దివ్య సంభాషణల... గుర్తించుకున్న సమాచారము, అనుభవించిన స్వామి ప్రేమ, స్వామి చూపిన అనురాగము, స్వామి వేదాంతము, స్వామి యొక్క సహచర్యము, సామీప్యము, సాన్నిధ్యము ఇలా ఇవన్నీ కూడా చెప్పాలంటే... చాలా చాలా సమయం కావాలి. గత ముప్పై సంవత్సరాలుగా ముఖ్యంగా ఇంటర్వ్యూ గదుల్లో పొందిన అనుభూతులను, సేకరించిన మధుర క్షణాలను, రికార్డు చేసిన ఉత్తమ విషయాలను ఒక చోట చేర్చి వ్రాయాలనిపిస్తోంది.



67

ఇంటర్వ్యూ గది... జీవిత పాఠాలు నేర్పే నెలవు

స్వామి చెప్పే ప్రతి మాట ఒక మంత్రముగా...
స్వామి ఇచ్చే ప్రతి సందేశము ఒక జీవిత సత్యముగా...
స్వామి నుండి వచ్చే ప్రతి ఆదేశము జీవిత లక్ష్యముగా...
తీసుకుంటూ మేమందరం ముందుకు వెళ్లాము.

ఇంటర్వ్యూ గది నుండి బయటికి వచ్చాము అంటే తరువాత ఆరు నెలల నుంచి 12 నెలల దాకా కావలసిన ప్రణాళికలని సిద్ధం చేసుకునే వచ్చే వాళ్లము అంటే ఎలాంటి సందేహము లేదు.

ఇక స్వామి రింగులు చైనులు ఒకరికో ఇద్దరికో ఇవ్వచ్చు, విభూతి సృష్టించి ఇవ్వచ్చు కొందరికి... కానీ, స్వామి శ్రీముఖము నుండి వెలువడే ప్రతి మాట బంగారు మూట లాగా మేము హృదయములలో దాచుకొని బయటకు వచ్చే వాళ్లము.

అలా కొన్ని సందర్భాలలో మాకు బాగా గుర్తుండి, మమ్మల్ని మురిపించి మరిపించిన సంభాషణలని ఈ వ్యాసము ద్వారా మీకు అందించే ప్రయత్నం చేస్తున్నాను.

ఒక ఇంటర్వ్యూలో... ఒక అబ్బాయి, "స్వామి! మేము ప్రశాంతినిలయంలో ఉన్నప్పుడు మేము బాగుంటాం. కానీ హైదరాబాద్‌కి వెళ్లిన వెంటనే మళ్లీ పాత స్నేహితులు, పాత అలవాట్లు మమ్మల్ని చుట్టుకుంటాయి. ఎలా చేయాలి స్వామి మేము?" అని అడిగారు.

స్వామి ఎంతోవాత్సల్యంగా, "బంగారు! మీరంతా మట్టి కుండలురా. నేను ఈ మట్టి కుండల్లో ప్రేమ అనే నీటిని నింపి పంపిస్తున్నాను. మీరేమో హైదరాబాద్‌కి వెళ్లి మీ పాత అలవాట్లు... పాత స్నేహితులు అనే ఎండలో ఈ మట్టి కుండలను పెడుతున్నారు. నేను ఇచ్చిన ప్రేమ అంతా ఇంకి పోతుంది! అలా కాదు బంగారు. నేను ఇక్కడ మీతో మాట్లాడిన విషయాలని, నేను మీకు ప్రసాదించిన అనుభూతులని, అనుభవాలని, మీరు సత్సంగము అనే నీళ్ల కొలను చేసి, ఈ మట్టికుండలను

అందులో పెడితే, ఆ కుండలో నీరు అలాగే ఉండిపోతుంది.

నిజానికి హైదరాబాద్ యువతని పట్టి ఉంచినది ఏదైనా ఒకటి ఉంది అంటే అది "సత్సంగము" అని చెప్పాలి. రాత్రనక పగలనక ఇద్దరు ముగ్గురు కలిస్తే చాలు స్వామి చెప్పారు కదా... మనము సత్సంగంలో ఉండాలని ఆ మాటల్లో, ఆటల్లో, పాటల్లో జీవితాన్ని సాగించేవాళ్లం!

మరొకసారి ఇంటర్వ్యూ గదిలో మాతో పాటుగా ఒక సంస్కృతాంధ్ర పండితులు హైదరాబాద్ నుంచి వచ్చారు. వారిని స్వామి రోజు పిలుస్తున్నారట. ఆ రోజు మాతో వారు కూడా గదిలో ఉన్నారు, స్వామి కుర్చీ ప్రక్కనే కింద కూర్చొని, స్వామి మాట్లాడే మాటలన్నీ వింటూ వ్రాసుకుంటు ఉన్నారు. స్వామి ఉన్నట్టుండి వారిని అడిగారు. 'ఏమి సమాచారము?' అంటే వెంటనే స్వామి ఒక పద్యం వ్రాసాను స్వామి అంటే! ఆ 'చెప్పు అన్నారు'.

వారు భక్తి పారవస్యంలో చేతులు జోడించి
చెప్పడం మొదలు పెట్టారు.
స్వామీ, మిమ్మల్నే రాముడు అంటిని...
అంటివి అని అన్నారు, స్వామి!
స్వామీ, మిమ్మల్నే కృష్ణుడు అంటిని...
అంటివి అన్నారు, స్వామి!
స్వామీ, మిమ్మల్నే శివుడంటిని...
అంటివి అన్నారు, స్వామి!
స్వామీ, మిమ్మల్నే దేవుడంటిని...
అంటివి, అన్నారు స్వామి! అలా అంటూ
ఇన్ని అంటివే... ఏదైనా వింటివా?' అన్నారు. మాకు చాలా నవ్వొచ్చింది.

అంటే ఇది సత్యం కదా! మనం స్వామి గురించి ఎన్నో విషయాలు చెబుతుంటాం. స్వామి దేవుడు అంటాం, స్వామి లేకుండా మాకేం లేదు అంటాం, మా దిక్కు మొక్కు అన్నీ స్వామే అంటాం, తోడు నీడ ఇంట వెంట జంట కంట అన్నీ స్వామే అంటాం. కానీ స్వామి చెప్పిన మాటలు ఏమైనా విన్నామా? వాటిని పాటించామా? అన్నది మనందరం ఆలోచించాల్సిన విషయమే కదా!!

మరొకసారి, ఇంటర్వ్యూలో స్వామి మమ్మల్ని అడిగారు. "అరే! మంచివాడికి చెడ్డవాడికి వ్యత్యాసం తెలుసా?" అని. అంటే చాలా మంది చాలా రకాలుగా చెప్పారు. చివరికి స్వామి చెప్పారు. "ఏమీ లేదు బంగారు!! చాలా సులభం, మంచి వాడు ఎప్పుడు ఎదుటి వాడి యొక్క బాధను చూసి బాధపడతాడురా. ఎదుటి వాడి యొక్క సంతోషాన్ని చూసి సంతోష పడతాడురా. కానీ చెడ్డవాడు ఎప్పుడు ఎదుటి వాడి యొక్క సంతోషాన్ని చూసి బాధపడతాడు. ఎదుటి వాడి యొక్క బాధను చూసి సంతోష పడతాడురా... ఇదే వ్యత్యాసము" అని చెప్పారు.

నిజానికి మన చుట్టూ జరుగుతున్న ఎన్నో విషయాల్లో... మన జీవితంలో... ఈ సరళ నిర్వచనాన్ని ఎంతమంది అర్థం చేసుకున్నాం అనేది ఆలోచించాల్సిన విషయం.

మరొక సందర్భంలో, ఇంటర్వ్యూ అంతా అయిపోయింది. స్వామి లోపలి గదిలోకి వెళ్లి ప్రసాదం బుట్టను తీసుకొని వస్తుంటే, ఒక అబ్బాయి, నేను పట్టుకుంటాను స్వామి! అన్నాడు. వాడి

ఉద్దేశం ఏందంటే స్వామికి బరువు అవుతుంది, సహాయం చేద్దాము అని. స్వామి వెంటనే "వద్దు బంగారు, మీ అందరి భారాన్ని మోస్తున్న స్వామికి ఇదేం పెద్ద భారం కాదులే" అన్నారు. గుండెల్లో ఒక రకమైన తీయటి అనుభూతి. ఆ మాట వింటే! అవును, మన భారాన్ని మోసేది స్వామే కదా! మరి అలాంటి స్వామికి బుట్ట ఒక పెద్ద బరువా అని అనిపిస్తుంది.

ఇంకో సందర్భంలో ఒక అబ్బాయి స్వామిని అడిగాడు, స్వామి మనసుని కంట్రోల్ చేయడం ఎలా స్వామి? అని. చాలా తమాషాగా అనిపించింది ప్రశ్న. అసలు ఏం చెప్తారో ఏంటో అని అనుకుంటూ అందరూ ఉత్సుకతగా వింటుంటే, "బంగారు! మనసుని నియంత్రించడం నీ తరం కాదురా, నేను ఎప్పుడూ మనసును నియంత్రణ చేయమని చెప్పను. మనసునుని మళ్లించాలి. అలా మనసును మళ్లిస్తే మంచి ఫలితం వచ్చేస్తుంది అని చెప్పి, మనసంతా కూడా మంచి ఆలోచనల వైపు, మంచి మాటల వైపు, మంచి చేతల వైపు, మంచి సేవల వైపు మరల్చండిరా అప్పుడు అంతా ఆనందం ఐపోతుంది" అని చెప్పారు. అద్భుతమైన పరస్పర సంభాషణ, అద్భుతమైన మార్గదర్శకత్వం... ఇవన్నీ స్వామి మాకు అనుగ్రహించిన వరాలు.

ఇంకోసారి బాగా గుర్తుంది, అందరికీ మీ ఆశీర్వాదం కావాలి స్వామి అని అడిగాం. స్వామి వెంటనే "బంగారు! మీరు ఇలా సేవలు చేస్తుంటే నా బ్లెస్సింగ్స్ ఆటోమేటిక్‌గా వస్తాయి" అని చెప్పారు. నిజంగా సత్యమే! మేము సేవలు చేసి ప్రతి సారి ప్రశాంతి నిలయానికి వెళ్లినప్పుడు, స్వామి ఇచ్చిన ఆతిథ్యం అద్భుతంగా ఉండేది.

మరపురాని జ్ఞాపకాలను స్వామి మాకు అందించారు. ఎన్ని సార్లు పాద నమస్కారాలు!

ప్రసాదాలు! బహుమతులు! బట్టలు! కానుకలు! సృష్టించిన వస్తువులు! ఫోటోగ్రాఫ్స్! ఆటోగ్రాఫ్స్!

ఇవన్నీ కలిపి చూసుకుంటే... హైదరాబాద్ యువతకి స్వామి ఇచ్చిన అపారమైన ఆశీర్వాదాలు జీవిత కాలం గుర్తిండిపోయేవిగా నిలిచాయి. సేవలు చేసిన ప్రతి సందర్భంలో స్వామి వెయ్యి తల్లుల ప్రేమతో మమ్మల్ని అక్కున చేర్చుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

మరొక సందర్భంలో, ఒక అబ్బాయి స్వామి శరీరం మీద నుంచి వచ్చే చమటను చూసి విలవిల్లాడి పోయాడు. ఆ చిన్న గదిలో ఉక్కపోతకి స్వామి కొద్దిగా అలసటగా కనిపించారు. అప్పుడు మోకాళ్ల మీద నిల్చుని ఆ అబ్బాయి, 'స్వామి! ఈ వయసులో కూడా ఇంత శ్రమ పడి సేవలు చేస్తున్నారు. మేము కూడా చివరి శ్వాస దాకా ఇలాగే సేవలు చేసే అవకాశం ఇవ్వండి, స్వామి!!' అని అడిగాడు. స్వామి చాలా అలవోకగా "బంగారు! అంతా బాగుంది... కానీ శ్రమ అన్నావే, అది నాకు నచ్చలేదు బంగారు. శ్రమ అనుకుంటే ఒక్క క్షణం కూడా చేయలేం బంగారు. ఇది ప్రేమరా! ఇది ప్రేమ. అవ్యాజమైన ప్రేమ అని చెప్పారు.

అబ్బా నిజమే కదా! సేవలు చేస్తున్నప్పుడు శ్రమ అనుకుంటే ఎన్నాళ్లు చేయగలం చెప్పండి?

ఏది చేసినా ప్రేమగా చేయాలి, ప్రేమైక రూపంగా మారిపోవాలి, ప్రేమానురాగములతో జీవించాలి, ప్రేమతో అందరితో మాట్లాడాలి, ప్రేమతో మనం సేవచేయాలి, ప్రేమతో సదా ఆలోచించాలి, ప్రేమతో అందరినీ సేవించాలి అన్నది ఒక తారక మంత్రంగా తీసుకున్నాను.

నేనే కాదు, హైదరాబాద్ యువతలో ఉన్న ఎవరైనా సరే ఇలాగే స్వామి మాటలను మంత్రాక్షరాలుగా తీసుకొని జీవితం గడుపుతున్నారు.

మమ్మల్ని చాలా మంది అడుగుతూ ఉంటారు... సత్యసాయి బాబా మంత్రోపదేశం చేస్తారా? అని. సత్యసాయి బాబా ఉపదేశం చేసేది ఒక మంత్రం కాదండి. చాలానే ఉపదేశిస్తారు... కారణం వారి ప్రతి మాటా మంత్రమే!! వారు ఏం చెప్పినా. ఏ మాట చెప్పినా మంత్రంగా మారిపోతుంది అనటానికి ప్రత్యక్ష నిదర్శనాలు కోకొల్లలుగా ఉన్నాయి.

మరొక సందర్భంలో ఒక సీనియర్ బ్రదర్ అడిగారు, 'స్వామి చాలా మంది పిల్లలు పెళ్లి చేసుకోవట్లేదు స్వామి, పెళ్లి చేసుకోమని చెప్పండి'. అప్పుడు స్వామి, "బంగారు! నేను ఎవ్వరిని పెళ్లి చేసుకోవద్దు అని చెప్పలేదు. ఇష్టం ఉంటే పెళ్లి చేసుకుంటారు. చేసుకోకుండా తప్పు మార్గములో వెళ్లడం కంటే పెళ్లి చేసుకోవడమే మంచిది." అని స్వామి చెప్పారు. అప్పుడు మరొక సోదరుడు అడిగాడు, 'స్వామి మరి పెళ్లి చేసుకుంటే ముందు కాళ్లకు బంధం అంటారు కదా' అని అడిగాడు అంటే స్వామి అన్నారు అనుబంధం మితిమీరి ఉండకూడదు బంగారు. అందరిని ప్రేమించినట్టే భార్యపిల్లల్ని కూడా ప్రేమించండి. అంతే తప్ప అంతకంటే మితిమీరితే మాత్రం ప్రమాదమే బంగారు. అనుబంధం, మమకారం తగ్గించుకోండి." అని చెప్పారు. ఆ యొక్క సర్వజనీనమైన ప్రేమని స్వామి మాకు ఏ విధంగా నేర్పించారు అనేది ఈ విషయంలో ప్రస్ఫుటంగా తెలుస్తుంది.

మేము ఇంటర్వ్యూలో చాలా ఉత్సుకతగా వారి మాటలు వింటున్నాం, ఉన్నట్టుండి స్వామి, చాలా సీరియస్‌గా "బంగారు మీరంతా చాలా మంచి పిల్లలు రా! ఈ 18 నుండి 35 ఏళ్ల వరకు చాలా అద్భుతమైన వయసు. ఈ వయసులో మీకు శారీరకంగాను, భౌతికంగాను అన్ని కోణాలలో మీలో శక్తి యుక్తి నూరు శాతం ఉంటుంది బంగారు. ఈ నూరు శాతం శక్తి యుక్తుల్ని మీరు సమాజ సేవలో ప్రవేశ పెట్టండి. వయసు మీరిన తరవాత అయ్యో! సేవ చేయ లేక పోయామే అని బాధపడితే ప్రయోజనం లేదు బంగారు. ఈ సమయంలో జీవితంలో సాధ్యమైనంత మంచి పని చేసి చూపించండిరా! అని స్వామి చెప్పారు. అంతా అయిన తర్వాత, వయసు ఉడిగిన తర్వాత, ముసిలి వాళ్లు అయిన తర్వాత, శారీరకంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా, మానసికంగా, కృంగిపోయి, వంగిపోయి, కుక్కలు ఎంగిలి చేసిన విస్తర లాగా ఉన్నప్పుడు, స్వామి దగ్గరికి వస్తే ప్రయోజనం ఏముంది బంగారు?" అని చెప్పారు.

మరొక సందర్భంలో, స్వామి! "ఏమిటి సమాచారము?" అంటే... గ్రామాలలో చేసిన సేవా కార్యక్రమాల గురించి చెప్తూ ఉన్నాము. స్వామి వెంటనే "బంగారు! చాలా సంతోషము. మీరంతా ఆ గ్రామాలలోనే సేవలు చేస్తూ, ఆ గ్రామాలలోనే స్వామిని చూసుకోండి బంగారు. ఇక్కడ అక్కడ ఎక్కడ చూసినా స్వామే ఉన్నాడురా, ఒక్కడే ఉన్నాడురా!" అని చెప్పారు. సేవలో మునిగిపోయి, మమల్ని మేమే మర్చిపోయేంతగా సేవ చేసే సౌభాగ్యం స్వామి ఇచ్చిన వరంగా మేము భావించాము. అసలు ఎన్నో సందర్భాల్లో మేము దర్శనాలకు కూడా వెళ్లలేదు, సమావేశాలకు కూడా హాజరుకాలేదు, ప్రారంభ కార్యక్రమాలు, ముగింపు కార్యక్రమాలు, అసలు స్వామి మాట్లాడుతున్నపుడు కూడా ఆ కార్యక్రమాల్లో లేకుండా సేవ చేసేవాళ్లం. అలాంటి కొన్ని సమయాల్లో స్వామే, సేవాదళ్‌ని పంపించి, 'చూడండి, ఆ హైదరాబాద్ పిల్లలను పిలిచి కూర్చోబెట్టండి' అని చెప్పేవారు.

నాకు గుర్తు, దసరా సమయంలో యజ్ఞ జలం చల్లేటప్పుడు కూడా స్వామి, క్యాంటీన్‌లో సేవచేసే మమ్మల్ని అలా పిలిపించి కూర్చోబెట్టారు. అంటే మేము ఎంతగా సేవలో మమ్ము మేము

మరచిపోయి ఉండిపోయాం అన్నది స్వామి గమనించారు మరి.

ఇంకో సందర్భంలో, 1997లో అంతర్జాతీయ యువ జన సమ్మేళనం జరుగుతున్న సమయంలో, స్వామి ఒక రోజు సందేశం పంపించారు: 'హైదరాబాద్ పిల్లలందరూ వచ్చి మీటింగ్‌లో కూర్చోండి' అని.

మరొకసారి ఎలా పిలిపించారు అంటే... మేము గోకులంలో పశువుల శుభ్రపరిచే పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు స్వామి వార్త పంపించారు: 'ఈ మధ్యాహ్నం ఇంటర్వ్యూకి సిద్ధంగా ఉండండి, స్వామి పిలుస్తారు' అని. ఇలా స్వామి ఎల్లప్పుడూ తన దివ్య దృష్టి మాపై ఉంచిన ఎన్నో విశేషాలు ఉన్నాయి.

68

ప్రశాంతి సేవలు – ప్రణయ గాథలు

ప్రశాంతి సేవలు స్వామి వారితో ప్రణయ గాథకి ఏ విధంగా తెరలు తీసాయి అన్నది ఈ వ్యాసంలో చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. మేము ప్రశాంతి నిలయానికి సేవల నిమిత్తమై ఎప్పుడు వెళ్లినా ఒక వైవిధ్యత ఉండేది. మేము చేసే పనులైనా, మేము ఎంచుకునే సేవలైనా, మా పాటలైనా, మా మాటలైనా, మా చేష్టలైనా సరే, అందరి కనుబొమ్మలు కూడా పైకి ఎత్తేలా ఉండేవి. అక్కడ కొద్ది మందేమో సైనికుల్లాగా చూసేవాళ్లు మమ్మల్ని.

ఒక మహత్తరమైన ఉత్సాహాన్ని, యోగాన్ని, స్వామి హైదరాబాద్ యువతకు ఆపాదింప చేశారు అనుకోవాలి. ప్రశాంతి నిలయం గణేష్ గేటు, గోపురం గేటు ఈ రెండు గేట్లకు వచ్చే సమయానికి మాలో ఉత్సాహం ఉరకలెత్తి బస్సు కిటికీలలో నుంచి బయటికి దొర్లిపోయేలా ఉండేది, నిజం చెప్తున్నాను. ఆ బస్సుని చూస్తే చాలు హైదరాబాద్ పిల్లలు వచ్చారని జనాలు అనుకునే వాళ్లు. అలాగే తిరిగి వెళ్ళేటప్పుడు అంత కంటే ఇంకా ఎక్కువ విరహంతో వెళ్లే వాళ్లము. ఎల్లలే ఎరుగని ప్రేమతో, విరహముతో వచ్చి పోయే సమయాలలో రెండు సార్లు కూడా ఎలుగెత్తి, గొంతులెత్తి, హృదయము నుండి కాదు... నాభి లోతుల నుండి అరిచే వాళ్లము స్వామికి జైకారం.

"రాజాధి రాజ రాజ గంభీర రాజకుమార రాజ మార్తాండ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక సమర్థ సద్గురు సాయినాథ్ మహారాజ్‌కి!!" అని అరిస్తే ఒక ఇద్దరో ముగ్గురో కాదు, ఆ బస్సులో ఉన్న 50 మంది ఒక్కసారి జై కొడితే ఎలా ఉంటుందో చూడండి, ప్రకంపనకు వచ్చేది అంటే నమ్మండి.

ఇలా మేము బయట కొట్టిన జై కారానికి... ఎన్నో సందర్భాలలో స్వామి తను ఏం చేస్తున్నా సరే... దర్శనంలో ఉన్నా, భజనలో ఉన్నా, ఏకాంతంలో ఉన్నా, సమయం ఏదైనా కావచ్చు... వారి చెయ్యి ఎత్తి ఆశీర్వాదం చేసేవారట. ఆ దృశ్యాన్ని చూసిన వాళ్లు చెప్పారు.

ఇంకొన్ని సార్లు తమ చుట్టూ ఉన్న అంతరంగికులతో లేదా స్వామి పిల్లలతో మాట్లాడుతూ... "హైదరాబాద్ పిల్లలు రా ఊరు వెళ్లి పోతున్నారు" అని చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

ఒక సారి, దర్శన సమయంలో హైదరాబాద్ అబ్బాయి విద్యార్థులతో పాటూ కూర్చొని ఉంటే..." ఏయ్ నీ గ్యాంగ్ వెళ్లిపోతోంది" అని చెప్పారట. అంత పెద్ద ప్రశాంతి నిలయంలో మేము ఎక్కడున్నా, ఎక్కడి నుంచి ఎలుగెత్తి అరిచినా స్వామి వారు స్పందిస్తున్నారు అని విన్నప్పుడు, ఎంత అద్భుతమైన భావన కలుగుతుందో నేను వివరించలేను.

స్వామి వారు గ్రామ సేవా మహోద్యమానికి శ్రీకారం చుట్టారు. 2001వ సంవత్సరంలో "ఇష్టం ఉన్న పిల్లలందరూ ఉండొచ్చు, పల్లెల్లోకి వెళ్లి గ్రామసేవలు చేస్తాము 10 రోజుల పాటు" అన్నట్టుగా స్వామి చెప్పారు. కాబట్టి చాలా మంది వెళ్లిపోయారు. ఆ సమయంలో, "హైదరాబాద్ యూత్ వచ్చి గ్రామ సేవలలో చేరండి" అనే పిలుపు మాకు అందింది. ఆలోచించండి, స్వామి కనుచూపును కదలించినా లక్షల మంది వచ్చి కూర్చుంటారే అలాంటిది ఆయన ఎంత ప్రేమతో హైదరాబాద్ యువతకు కబురు పంపించారు. ఆ కబురు అందుకొని సుమారు 60–70 మంది పిల్లలు హడావుడిగా వున్నపాళంగా ఎక్కడి ఉద్యోగాలు అక్కడ విడిచేసి, ఎక్కడి చదువులు అక్కడ వదిలేసి, ఎక్కడి కుటుంబాలు అక్కడ వదిలేసి, ప్రశాంతి నిలయం బాట పట్టేసారు. రమణరావు, కొమ్మారెడ్డి భాస్కర్ రావు, దొండమూడి రామారావు, సరస్వతమ్మ, వసుమతమ్మ ఇలాంటి వాళ్లందరితో ఏర్పాట్లు చేయించి, పిల్లలతో పని చేయించండి అని చెప్పి అక్కడ షెడ్ అంతా కూడా వేయించారు. దాన్నే గ్రామ సేవా షెడ్డు అని పిలుస్తున్నారు ఈ రోజుకు కూడా. ఎంత షెడ్ అంటే పెద్ద పెద్ద నాపరాళ్లని మన వాళ్లు ఒక్కొక్కరే తీసుకుని వచ్చే వాళ్లు... చిరంజీవిరావు ఈ పనులను పర్యవేక్షించే వాళ్లు. గ్రామ సేవ షెడ్ వేసే సేవ అంత కూడా బండ పని. అంత బండ పని ఇంక ఎవరు చేస్తారు అనేది తెలియదు కానీ, అతి సున్నిత దేహాలతో ఉన్న పట్నం పిల్లలు కూడా బండలు పరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక చోట ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. చిరంజీవిరావు వచ్చి అందరిని నిల బెట్టేసి బాగా అరిచేశారు. 'ఏయ్ మీకు బుద్ధి లేదు. ఇట్లా అయితే పంపించేస్తాను బయటికి,' అన్నట్టుగా చెప్పినారు. మాకు కూడా భయమే వారంటే. ఎంతో ఉన్నతమైన వ్యక్తి. మేము వారిని చాలా గౌరవంగా చూస్తాము. వారి మాటలకు మేమందరం కూడా చాలా దిగాలు పడ్డాము, అయ్యో ఇట్లా అనిపించుకున్నాం ఏంటి? అని. మరుసటి రోజు, చిరంజీవిరావు రావడము, చాలా సౌమ్యంగా, చాలా మర్యాదగా, మీరంతా హైదరాబాద్ పిల్లలు, మీరందరూ పెద్దవాళ్లు, ఈ విషయం మీరు చేయగలిగితే చేయండి! లేదంటే విడిచెయ్యండి! అలా మాట్లాడటం జరిగింది. చాలా విచిత్రం అనిపించింది! ఎప్పుడూ లేదే చిరంజీవిరావు అలా మాట్లాడడం! అని. తర్వాత తెలిసింది ఏంటంటే స్వామి ఆయనను హెచ్చరించినారట. "ఏయ్, నేను వాళ్లని పిలిపిస్తే, నువ్వెవరు వాళ్లను బయటికి పంపించడానికి? నీకు ఎంత ధైర్యం? చాలా జాగ్రత్తగా చూసుకో, వాళ్లు మన పిల్లలు" అని అన్నట్టు చూచాయగా తెలిసింది. ఎంత ప్రేరణ కలిగించిన విషయమో చూడండి, ఎక్కడ చిరంజీవిరావు? ఎక్కడ గ్రామసేవ షెడ్డు? ఎక్కడ స్వామి ఉన్నారు? కానీ, స్వామి మా ఇంట కంట జంటగా వున్నట్టుగా అనిపించదా?

మరొక సందర్భంలో, స్వామి వారు మిస్సెస్ రతన్ లాల్ మరియు గీత పరమహంస వాళ్లతో మాట్లాడుతూ చెప్పారట, "హైదరాబాద్ పిల్లలు వచ్చారు, చాలా కష్టపడుతున్నారు, పాపం పొద్దున్నే టిఫిన్ కూడా తినకుండా వచ్చేసి గ్రామ సేవ క్యాంటీన్‌లో పని చేస్తున్నారు బంగారు. వాళ్లకి ఏదైనా పెట్టండి. వాళ్లని బాగా చూసుకోండి." ఏంటండీ! ఇట్లాంటి మాటలు విన్నప్పుడు మా తనువు నిలువెల్ల పులకరించి పోదా? ఇక ఆ ఇద్దరు అమ్మలు ప్రతి రోజు ఉదయము సాయంకాలము

మాకు తిను బండారాలు స్వయంగా చేసి తీసుకుని వచ్చే వాళ్లు, తర్వాత జ్యూసులలో విటమిన్స్ అంతా ఉంటాయి కదా! వారికి ఇవ్వండి అని చెప్పారట. వాళ్లలా బలవర్ధకమైన ఆహారము తెచ్చిపెడుతుంటే. ఎన్ని జన్మల పుణ్యమిది. ఏం చెప్పుకోవాలో. ఎలా స్పందించాలో తెలిసేది కాదు! స్వామి ఇలా కూడా చేస్తారా! ఇలా కూడా మాట్లాడతారా! అని మా కళ్లలో నీళ్లు వచ్చేసాయి. అంత అద్భుతమైన ప్రేమని మాకు చూపించారు. ప్రశాంతి సేవల నేపథ్యం ఇదండీ.

ఎట్లాంటి సమయంలోనైనా మేము ఎంచుకున్న సేవలు చాలా వైవిధ్యముగ ఉండేవి. మనిషి అంత ఉండే వంట పాత్రలతో దూరి శుభ్రం చేయడము, ఆ పాత్రలు ఆరబెట్టడము, ఆ పాత్రలలో వండడం వార్చడం, వంట చెరుకు తీసుకుని రావడం, ధాన్యపు బస్తాలని దించుకోవడం, లోడింగ్... అన్లోడింగ్... ఓరి నాయనో!!! ఇన్ని వైవిధ్యమైన సేవలు గ్రామ సేవా షెడ్డులో చేసే వాళ్లము. బయట వ్యక్తులు వస్తె రెండు రోజులలో పారిపోవాల్సిందే సుమా! కానీ మన వాళ్లు మాత్రం బంక మట్టిలా అతుక్కుని ఉంటారక్కడ.

అతి వైవిధ్యమైన సేవలు ఇంకొన్ని ఉన్నాయి... ఏమిటో తెలుసా!? ప్రశాంతి నిలయంలో ఉన్న రోజుల్లో కనీసం ఒక సారి అయినా సరే గోకులం సేవ (గో సంపద) మరియు సాయి గీత (ఏనుగు) సేవలో మునిగిపోయే వాళ్లము.

సాయిగీత అంటే గుర్తొచ్చింది చెప్పడం.. సాయి గీత ఎవ్వరిని దగ్గరికి రానిచ్చేది కాదండి! చాలా పెద్దగా ఘీంకరించేది. అలా అరిస్తే ఎవరైనా సరే భయంతో అంత దూరంలో నిలుచునే వాళ్లు. కానీ ఎలాగో తెలియదు సాయి గీత హైదరాబాద్ పిల్లలతో చాలా ప్రేమగా ఉండేది. ఈ విషయం మాకు తెలియదు, సాయి గీత దగ్గర సేవ చేస్తున్న పెద్దరెడ్డి చాలా సార్లు చెప్పారు చాలా సార్లు. "బాబు, మీరంటే చాలా ఇష్టంరా దానికి! అది మీరు ఉన్నప్పుడు చేసే చేష్టలకి, మామూలుగా ఉన్నప్పుడు చేసే చేష్టలకి చాలా వ్యత్యాసం ఉంటుందయ్యా! నేను ఎప్పుడు చూస్తుంటాను. మీ అందరితో ప్రేమలో పడిందయ్యా!" అని చెప్పేవారు. మేము అంతా చేరి సాయి గీత దగ్గర భజన చేసే వాళ్లము, సాయి గీతతో మాట్లాడేవాళ్లము, తన దగ్గరికి చాలా ప్రేమగా వెళ్లేవాళ్లము. సాయి గీత కూడా మమ్మల్ని చూసి "ఉమ్!!!" అని ఊగేది. జై బోలో భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జీకీ అని జై కొడితే తొండమెత్తేది, ఆనందంగా ఊగేది!!

ఒక సారి మేమంతా కూడా సాయి గీత దగ్గర సేవ చేస్తున్నాం... నిలయంలో స్వామి పాద నమస్కారం తీసుకునే అవకాశం మేమంతా కోల్పోయాం. అయితే పెద్దరెడ్డి మదనపడ్డారు. అయ్యో బాబు మీరు ఊరికి వెళ్లాలి కదయ్యా! సాయి గీత దగ్గరికి వచ్చేసారు స్వామి పాద నమస్కారం మిస్ అయిపోయింది! అని. ఏం పర్వాలేదు అంకుల్ మేము ఈ సేవలో హ్యాపీగా ఉన్నాము అన్నాము. కాదు నేను స్వామి దగ్గర కూర్చుంటాను రేపు, అని మమ్మల్ని బిడ్డల్లాగా అనుకుంటూ, పెద్దరెడ్డి దర్శన సమయంలో వరుసలో కూర్చున్నారు. మాతో పాటుగా కూర్చున్నారు. ఎప్పుడూ దర్శనంకే రాని పెద్దరెడ్డి దర్శనంలో కనిపిస్తే, స్వామి ఆశ్చర్యంగా "ఏమి సమాచారము?" అని అడిగారు స్వామి హైదరాబాద్ పిల్లలు. సాయి గీత దగ్గర సేవలో ఉండిరి నిన్న, పాద నమస్కారము మిస్ అయిపోయారు స్వామి... అంటే, స్వామి ఎంతో ప్రేమానురాగముతో కూర్చోండి. అక్కడ కూర్చోండి. అందరికీ పాద నమస్కారం ఇస్తానని అందరికీ పాద నమస్కారం ఇచ్చారు. ప్రసాదం ఇచ్చారు. ఈ విశేషం చెప్తున్నప్పుడు స్వామి కరుణను ఎంతైనా చెప్పుకోవచ్చు కానీ, స్వామి సేవకులలో కూడా ఇంతటి కరుణ ప్రేమ వాత్సల్యములను మాకు చూపేలా చేసిన స్వామిని మనం ఏం చెప్పుకోవాలి

చెప్పండి? అంటే చిరంజీవిరావు, గీతా పరమహంస, మిస్సెస్ రతన్ లాల్, పెద్దరెడ్డి, రమణరావు, కొమ్మారెడ్డి భాస్కర రావు, వసుమతమ్మ, సేవలు ఏవైనా సరే ఇలాంటి మహనీయుల యొక్క సాన్నిధ్యాన్ని స్వామి వారు మాకు ప్రసాదించారు. వారి యొక్క ప్రేమను మేము రుచి చూసాం. ఆ సందర్భాల్లో సేవలు ఏమేమి చేసాము అన్నది వేరే సంగతి. కానీ వీళ్లందరితో సత్సంగము మాకు దొరికింది. ఎన్నో అద్భుతమైన విశేషాలు వాళ్లు చెప్పేవాళ్లు. ఎన్నో మహిమలు చెప్పేవాళ్లు. విన్నప్పుడు అదే ఒక భోజనంలా మారిపోయేది. ఇక భోజనం లేదు, ఏదో తదాప్యము చెందినట్లు, తన్మయత్వంలో మునిగినట్లు, గోపికల లాగా మారిపోయేవాళ్లం. అలాగ స్వామి చూసుకున్నారు మమ్మల్ని అందరిని కూడా.

ఒక రోజు స్వామి మమ్మల్ని చూడడము, "బంగారు! రండి గ్రూప్ ఫోటో తీసుకుందాం. స్వామి తన ప్రేమను ఆ విధంగా ఇవ్వాలని భావించారు. పాదనమస్కారం ఇవ్వక పోయినా, మాకు ఇతర రూపాల్లో కూడా అనుగ్రహం చేయగలరని మేము అర్థం చేసుకున్నాం. ఇంతవరకు అలాంటి అవకాశం మనకు ఎప్పుడూ రాలేదు. ఆ రోజున స్వామి అందరినీ వేణుగోపాల స్వామి విగ్రహం దగ్గర, రథం షెడ్డు ముందు నిలబెట్టి పెద్ద గ్రూప్ ఫోటో తీయించారు. అది మా జీవితాంతం మరచిపోలేని అద్భుతమైన జ్ఞాపకంగా మారిందంటె అతిశయోక్తి కాదు. 60-70 మంది దాంట్లో స్వామితో పాటు నిల్చొని గ్రూప్ ఫోటో తీసుకున్నాము.

1997 గురుపూర్ణమి సందర్భంగా, ప్రపంచ యువజన సమ్మేళనం జరిగింది. అప్పుడు మేము కూడా వెళ్లాము కానీ మా దృష్టి అంతా కూడా సేవల మీద ఉండేది. జరిగింది యువజన మహాసభ కానీ మేము ప్రతినిధులుగా వెళ్లలేదు, సేవకులుగా వెళ్లాము. సేవలు చేస్తున్నాము, వండడం, వార్చడం, వడ్డించడము, శుభ్రం చేయడము ఇలాంటి పనుల్లో ఉన్నాము. ఉన్నట్టుండి "ఏయ్, క్యాంటీన్‌లో హైదరాబాద్ పిల్లలు ఉన్నారు, వచ్చి సమావేశంలో కూర్చోమని చెప్పండి" అని ఒక సందేశం స్వామి పంపించారు. అదే బట్టలతో వెళ్లామండీ! మమ్మల్ని అందరినీ స్వామికి కనిపించే విధంగా కూర్చోబెట్టారు. ఏంటండీ ఇది? దీన్ని ఏమని చెప్పాలి? మేము! ఆ మహాసభలో స్వామి ఉపన్యాసంలో, హైదరాబాదు యువజనుల గురించి, మేము చేసిన నెల్లూరు ప్రయాణం గురించి ప్రత్యేకంగా కొన్ని విశేషాలు ప్రస్తావించారు. మేము విన్నాము.

గ్రామ సేవలలో చాలా రోజులు ఉండేవాళ్ళం. ఈ 25 రోజులు కూడా స్వామి ఎంతో ప్రేమను అందించారు. అప్పుడు స్వామి ఇక పాద నమస్కారాలు ఇవ్వడం ఆపేశారు. చివరి రోజు అందరం కూడా స్వామి దగ్గర దర్శనానికి కూర్చుంటే ఏదో ఒకటో రెండు రోజులో కూర్చుంటాం, స్వామి మాట్లాడారా, మాట్లాడినట్టు. పిలిచారా, పిలిచినట్టు, చూశారా, చూసినట్టు, లేకపోతే మూటముల్లె సర్దుకోవడం హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం అవ్వడము. ఈ విధంగా జరిగేది.

క్యాంటీన్‌లో పని చేస్తుంటే, పూర్వం స్వామి అన్నయ్యలకి చెప్పారు. "బంగారు! మీరు దాని గురించి, దీని గురించి, దేని గురించి, చింతించవద్దు. చేసే పని పైన శ్రద్ధ పెట్టండి. డ్రెస్ కోడ్, యూనిఫాం, స్కార్ఫ్, బ్యాడ్జీల గురించి ఏం తొందర పడొద్దు మీరు పని చేయండి. మీతో నేను ఉన్నాను." ఆ గుర్తుని, గురిగా చేసుకుని, జ్ఞాపకంగా పెట్టుకొని, ఎప్పుడు వెళ్లినా సరే ఎవ్వరితో సంపర్కం చేసింది లేదు. స్వామికి లెటర్ వ్రాసుకోవడము, సరాసరి వెళ్లి సేవ చేయడం, పని చేయడం. ఎందుకంటే, ఇంట్లో టాయిలెట్లు శుభ్రం చేయడము గురించి ఎవరిని అడగాలి? కడగటానికి కొద్ది మంది వెళ్లిపోయే వాళ్లు... పాత్ర సామాను కడగటానికి క్యాంటీన్‌లో ఉండే ఇద్దరు ముగ్గురు

పనులు చేయలేక పోయేవాళ్లు, కాబట్టి అక్కడికి మేమందరం వెళ్లిపోయే వాళ్లము. అలాగే మూటలు మోయడానికి ఎవరు రాకపోయేవారు, ఎక్కడ ఎవరు రాకపోతే, అది మాది అనుకుని వెళ్లేవాళ్లం. ఇది నిజం.

అలాగా ఒకసారి చాలా రోజులు పని చేసిన తర్వాత, స్వామి పాద నమస్కారం ఇస్తున్నారు సేవాదళ్ వాళ్లందరికి... ప్రశాంతి నిలయం నుండి సేవలు ముగించి వెళ్లిపోయే సమయంలో. స్వామి ఎలాగో గుర్తు చేసుకున్నారు "ఏయ్ పిల్లలు ఎక్కడ? హైదరాబాద్ పిల్లలు ఎక్కడ?" అంటూ అక్కడున్న పెద్దవారిని అడిగారు అంటే "స్వామి! పిల్లలు రాలేదు, స్వామి వాళ్లు పేర్లు నమోదు చేసుకోలేదు స్వామి అని సమాధానం చెప్పారు." "లేదు లేదు పిలవండి, పిల్లల్ని పిలవండి, క్యాంటీన్‌లో పని చేస్తున్నారు చూడండి" అంటే, ఆ సమాచారం ఎవరో పరిగెత్తుకుంటూ వచ్చి చెప్తే క్యాంటీన్‌లో నుంచి ఉరుకులు పరుగుల మీద ఆ మురికి బట్టలతో, అలాగే వచ్చి ఎక్కడో ఒక పక్కన కూర్చుంటే, స్వామి మా దగ్గరికి రావడం, అక్కడున్న పెద్దవారు... 'స్వామి చూడండి స్కార్ఫులు కూడా వేసుకోలేదు' అని చెప్పడం. ఇక్కడ ఎవరి గురించి ఫిర్యాదు చేయడం లేదు, అది ఎలా జరిగిందో చెప్తున్న, స్వామి తన ప్రేమను మాపై ఎలా కురిపించారో చెప్తున్న. వాళ్లు అలా చెప్పినప్పుడు, "పోనీలే బంగారు, వాళ్లకి ఆ అధికారం నేనే ఇచ్చాను" అని స్వామి అన్న మాటలు మా జీవితంలో మరచిపోలేని జ్ఞాపకంగా మారింది. ఆ మాట విన్న క్షణం మా హృదయాల్లో కలిగిన ఉత్సాహం, ప్రేరణ, ఆత్మ స్థైర్యం, భక్తి పారవశ్యానికిక ఆనకట్ట లేదు అనిపించింది.

ఇలాంటి విశేషాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. స్వామి మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. స్వామి కొట్లాడిన సందర్భాలు ఉన్నాయి. స్వామి హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. స్వామి బెదిరించిన సందర్భాలు ఉన్నాయి. స్వామి అదిరించిన సందర్భాలు ఉన్నాయి. స్వామి ఏడిపించిన సందర్భాలు ఉన్నాయి. స్వామి నవ్వించిన సందర్భాలు ఉన్నాయి. ఎన్ని సందర్భాలో! ఇవన్నీ వివరించేందుకు ఇంకొన్ని వ్యాసాలు వ్రాయాల్సిందే.

69

స్వామి ప్రేమయే సేవకు ప్రత్యక్ష సాక్ష్యం

ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో మా తల్లిదండ్రులు ఎన్ని నోములు నోచుకున్నారో మా కుటుంబ సభ్యులు ఎంత సంస్కారము నేర్పించినారో, చిన్ననాటి నుండి యుక్త వయసు దాకా, ఎందరో మహానుభావులు, ఎందరో మహనీయులు ప్రోత్సహించారేమో, ఉత్సాహపరిచారేమో. కారణం, మేము స్వామి వారి అవతార కార్యంలో సేవకులుగా పనికి రావాలన్న తాపత్రయమే!

స్వామి సేవకులుగా ఉండాలి అంటే, స్వామి సాన్నిధ్యంలో, సామీప్యంలో, సేవామాధుర్యాన్ని అనుభవించాలంటే, ఎంత ఉన్నతమైన అవకాశం అవసరమో మనందరం గుర్తుంచుకోవాలి.

స్వామి ఒక శ్రీ రామ నవమి సందర్భంగా, అందరిని కూడా... కొడైకెనాల్ దగ్గరలో ఉన్న అడవి ప్రాంతానికి తీసుకువెళ్లి, చెట్ల మధ్యలో సీతారాముల కళ్యాణాన్ని స్వామి స్వయంగా జరిపించారట. సీతారామ విగ్రహాలని భూమిలో నుంచి తీయడమే కాకుండా, అలనాడు సీతమ్మ వారికి కట్టిన మంగళసూత్రాన్ని కూడా స్వామి సృష్టించి తీసి చూపించారు. ఆ బృందంలో మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందించిన వృద్ధ నాయకులు, శ్రీ రతన్‌లాల్ కూడా ఉన్నారు. వారు ఉద్వేగానికి లోనయ్యి, "స్వామి! మా పూర్వజన్మ భాగ్యం వలన పూర్వజన్మ సుకృతం వలన మీ సన్నిధిలో బ్రతుకుతున్నాం అని చెప్తే" అప్పుడు స్వామి అలవోకగా "ఏయ్ రతన్ లాల్, ఇది ఒక జన్మ సుకృతం కాదయ్యా, కొన్ని వేల జన్మల సుకృతం వల్ల మీరు నా సన్నిధికి రాగలిగారయ్యా!" అని చెప్పారట. రతన్ లాల్ లాంటి వాళ్లకే కొన్ని వేల జన్మల సుకృతం అంటే... మనలాంటి సామాన్యులు స్వామి యొక్క సేవకులుగా మారడం వెనక ఎన్ని లక్షల జన్మల పుణ్యాల ఫలము ఉన్నదో మనం అర్థం చేసుకోవచ్చు.

వెనుతిరిగి చూస్తే నాలుగు దశాబ్దాల కాలము, 1982 నుండి 2022వ సంవత్సరం దాకా, ఎన్ని వేల మంది హైదరాబాద్ యువతకి స్వామి అవకాశాలు ఇచ్చారు, సేవా భాగ్యాన్ని ప్రసాదించారు, సేవా ఉత్సాహాన్ని అందించారు అని తలచుకుంటే పై మాటలు నిజంగా అక్షర సత్యాలు. ఎన్ని పుణ్య

కార్యముల ఫలితమో! మనం ఈ రోజు స్వామికి సేవకులుగా ఉన్నాం అనిపిస్తుంది.

ఇలా ఏదో ఒకరికో ఇద్దరికో ఇస్తే ఈ విధంగా చెప్పే అవసరం లేదు. కానీ, హైదరాబాద్ యూత్‌తో సంబంధం ఏర్పరచుకున్న ఎంతమందయినా సరే, వాళ్ల నేపథ్యం ఏదైనా సరే, వాళ్ల యొక్క గుణ, గణములు, ధనములు, సాధనములు ఏవైనా సరే. అందరికి ప్రేమను పంచినారు స్వామి. అందరికీ ఆ దివ్యానుగ్రహాన్ని అందుకునే పురాకృత జన్మ విశేషం దండిగా ఉండొచ్చు, కానీ, అందరికీ స్వామి హైదరాబాద్ యూత్‌తో లింక్ పెట్టారు.

ప్రపంచంలో ఏ బృందానికి కూడా ఇన్ని అవకాశాలు భగవంతుడు ఇవ్వలేదేమో అనిపిస్తుంది. నాకు తెలిసిన సమాచారం మేరకు నేను ఈ విధంగా చెప్తున్నాను. కారణం ఏంటంటే ప్రపంచంలో మరే ప్రదేశం నుండి కూడా తెలుగు రాష్ట్రాల నుండి వెళ్లేంత ఎక్కువగా స్వామి సన్నిధికి మిగతా వాళ్లు వెళ్లలేకపోయి ఉండొచ్చు. ఇక ఆ విదేశాల నుంచి పిల్లలు చూస్తే... వాళ్లు ఎప్పుడో సంవత్సరానికి ఒకసారి రెండు సార్లు రావచ్చు కానీ, అదృష్టం ఏమో!? హైదరాబాద్ యూత్ మాత్రం ఒక సంవత్సరంలో పది సార్లు, నెలకొకసారి, వారానికి ఒకసారి కూడా వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి... అది కూడా ఏదో ఒక సేవభాగ్యం చేత. ఎన్ని సార్లు వెళితే అన్ని సార్లు స్వామి హైదరాబాద్ బృందానికి దర్శన స్పర్శన సంభాషణ పాద నమస్కారాలు ఇస్తూనే ఉండేవారు.

ఈ సందర్భంగా ప్రశాంతి సేవలలో మమ్ము మేము ఏవిధంగా పునీతం చేసుకున్నాం మా జీవితాలను, ఏ విధంగా సార్థకం చేసుకున్నాం అనే విషయాన్ని, ఈ వ్యాసం ద్వారా నేను చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

1989 అనుకుంటాను మొదటి సారి హైదరాబాద్ యూత్ అనే సంకల్పము, భావన వచ్చింది. అలనాడు ఉదయన్న, శేఖర్ భాయ్ అలాగే ఇంకా ఇద్దరు ముగ్గురు సోదరులు అందరూ స్వామి మీద ఉన్న ఆపేక్షతో, స్వామి మీద ఉన్న అవ్యాజ ప్రేమతో, భక్తితో, స్వామికి ఏదైనా చేసుకోవాలి అని చెప్పే ఆతురతతో మొట్టమొదటిసారి సేవకు వెళ్లారు. స్వామి ప్రేమతో అందరిని అక్కున చేర్చుకున్నారు. అప్పుడు వాళ్ల ఆలోచన ఏంటంటే, ఎక్కడ పని ఉందో ఆ పని చేసుకోవాలి, అంతే! ప్రశాంతి సేవలు అంటే ప్రశాంతి నిలయానికి వెళ్లి white and white petoermax light లాగా స్కార్ఫ్‌లు వేసుకొని, 8 గంటల డ్యూటీ, నాలుగు గంటల డ్యూటీ, దర్శనంలో కూర్చోవడం, ఇది ఏమి లేదు. అతి సామాన్యమైన జీవన నేపథ్యం నుండి వెళ్లిన వీళ్లు అసామాన్యమైన సేవ అవకాశాలను అందిపుచ్చుకున్నారు. కారణం ఎక్కడైతే జనము రారో, ఎక్కడైతే స్వచ్ఛందగా సేవకులు వెళ్లరో, ఎక్కడైతే కష్టసాధ్యమైన పని ఉందో, ఎక్కడైతే బరువు పనులు ఎక్కువ ఉన్నాయో, అక్కడికి వెళ్లాలి అని నిర్ణయం చేసుకున్నారు. అది ఎట్లా వచ్చిందో నాకు ఇప్పటికి కూడా తెలియదు. అలాంటి ఆలోచనకు, ఆ తపనకు వెనుక ఉన్న స్ఫూర్తి స్వామియే అని నేను భావిస్తున్నాను. కాబట్టి వీళ్లందరూ కూడా క్యాంటీన్‌కు వెళ్లి పనులు చేసేవారు. పాత్రలు తోమడం, రవాణా వాహనాలలో ధాన్యం బస్తాలు వస్తే దించుకోవడం, ఆ బస్తాలను దొంతరలుగా పేర్చడం, అడవికి వెళ్లి కట్టెలు కొట్టి, వంట చెరుకు తేవడం లాంటి పనులు చేశారు, హైదరాబాద్ యూత్ సేవలు అలా మొదలయ్యాయి.

ప్రశాంతి సేవలు చేయాలి, ఎక్కడైతే అవసరం ఉందో అక్కడ చేయాలి అని చెప్పేసి, కూలి వాళ్ల లాగా తిరిగి చేసే వాళ్లు. ఆ రోజుల్లో "సాయి హమాలి" అని పేరు పెట్టుకుని, మసి గొట్టుకొని, మురికి బట్టలేసుకుని సేవలు చేసే వీళ్లను అందరూ ఆశ్చర్యంతో చూసే వాళ్లట. కానీ, స్వామి ఆ మురికిని మరకలను ఎప్పుడూ చూడలేదు... వారిని మరకతాలు లాగా తమ ఎదలో దాచుకున్నారు.

ఇలా నాలుగు దశాబ్దాలుగా, హైదరాబాద్ యువత స్వామి సేవలో ఉంది. మనుషులు మారారు. సేవా తత్పరత మాత్రం ఎవరిలో కూడా మారలేదు. నాటి యువకులు, ఉద్యోగులు అయ్యారు, పెళ్లిళ్లు చేసుకున్నారు, తండ్రులు అయ్యారు... ప్రస్తుతం తమ బిడ్డలతో పాటు చేతులు కలిపి సేవలు చేసుకుంటున్నారు.

1992లో స్వామి వారు హైదరాబాద్‌కు విచ్చేసినప్పుడు, సత్యసాయి నిగమాగమము ప్రారంభోత్సవ వేడుకలో, స్వామి కాన్వాయ్‌కు ఎస్కార్ట్ బైకులతో సేవ చేయడం, హైదరాబాద్ యువతకు లభించిన తొలి భాగ్యం. స్వామి ఎంతో ఆనందపడి అందరిని అద్భుతంగా ఆశీర్వాదం చేసి పుట్టపర్తికి రండి మీరు, అక్కడ కూడా చేయండి అని చెప్పడము, క్రీడోత్సవాల సందర్భంగా ఇక్కడి నుంచి బైక్స్‌లో స్వామి దగ్గరికి వెళ్లడము, ఆ విధంగా మొదలైంది. దాన్ని 'రాపిడ్ యాక్షన్ ఫోర్స్' అని పిలిచేవారు. అద్భుతమైన వేషధారణ, యూనిఫార్మ్‌తో ఉన్న ఆ బృందాన్ని ఎవరు చూసినా కళ్లు తిప్పుకోలేని విధంగా ఉండేది. ఆ సమయంలో ఎనిమిది నుండి పది మంది గోపికృష్ణ, కన్నాబాయ్, నవీన్, భవాని, సాయిరాం, రాజేష్, సాయి రామ కృష్ణ లాంటి వారు ఆ బృందంలో ఉండేవారు. తరువాత మరెంతో మంది చేరి, స్వామి వాహనాలకి ఎస్కార్ట్ సేవ చేసే అవకాశం పొందారు. అంటే స్వామి దగ్గరికి వెళ్లడానికి ఏ కారణం ఉన్నా సరే, ఏ కాలం అయినా సరే, అందరూ ప్రశాంతి నిలయం వైపు ప్రయాణం చేసేవాళ్లు. అలా 1989 నుండి 2022 దాకా అంటే సుమారు నాలుగు ఏళ్లు ఎప్పుడు వీలైతే అప్పుడు ప్రశాంతి నిలయానికి వెళ్లడం మొదలు పెట్టారు.

ఈ ప్రశాంతి సేవలు హైదరాబాద్ యూత్‌కి అద్భుతమైన ప్రేరణగా నిలిచాయి అనటంలో ఎట్టి సందేహము లేదు. ప్రశాంతి నిలయానికి వెళ్లిన ప్రతిసారి పర్తీసుడి దర్శనము కంటే, వారి దివ్య ఉపన్యాసముల కంటే, స్వామి వారితో మాట్లాడడం కంటే, భజన కార్యక్రమంలో పాల్గొనడం కంటే, సేవలు చేయడంలోనే ఎక్కువ ఆనందాన్ని పొందినారు. ఇది నేను గమనించిన అద్భుతమైన అంశము. ప్రతి అనుభవము ఒక దివ్యమైన పాఠాన్ని మాకు నేర్పింది. అవి మేము చేస్తున్న సేవలు ద్విగుణీకృత ఉత్సాహంతో చేసే ప్రేరణను అందించాయి.

ప్రధానంగా ప్రశాంతి సేవలు అంటే, జనవరి సంక్రాంతి సందర్భంగా జరిగే క్రీడోత్సవాలు, శివరాత్రి జాగరణ భజన మరియు ప్రసాద వితరణము, ఉగాది ఉత్సవాలు, గురుపూర్ణిమ మహోత్సవము, దసరా ఉత్సవాలు, గ్రామ సేవ కార్యక్రమాలు, పుట్టపండుగ, క్రిస్మస్ ఇలా సంవత్సరం పొడుగున జనము ఎప్పుడైతే ఎక్కువగా ప్రశాంతి నిలయానికి రావడానికి ఆస్కారం ఉన్నదో, అన్ని సందర్భాలలో 50 మందో లేక 100 మందో వెళ్లి తీరాల్సిందే అన్న భావన, లిఖితం కాని ఆజ్ఞలాగ తీసుకుని వెళ్లడం హైదరాబాద్ యూత్‌లో చూసాను. అలా ఎవరైనా వెళ్లలేకపోతే ఏడ్చిన వాళ్లు, బాధపడిన వాళ్లని నేను చూశాను, ఈ ఉద్యోగం ఉంటే ఏంటి లేకుంటే ఏంటి, అని అలా ప్రక్కన పడేసి, ప్రశాంతి నిలయానికి వెళ్లిన వాళ్లు ఉన్నారు, చేసే జాబ్‌కు రాజీనామాలు పెట్టిన వాళ్లు ఉన్నారు, ఉండేందుకు డబ్బులు లేక ఒక పూట తిండి తినకుండా ప్రశాంతి నిలయంలో సేవలు చేసిన వాళ్లు ఉన్నారు. ఒక చిన్న గదికి రోజుకు 300 రూపాయలు! ఆ రోజుల్లో వసతి కష్టంగా ఉండే సమయంలో, 30 మంది కలిసి ఒక గదిలో ఉండేవాళ్లు, అంటే అంత ఔన్నత్యంగా, అంత ఐకమత్యంగా, అంత తదేకదృష్టితో, తదాప్యముతో స్వామి వారి సేవలు తప్ప మరొకటి తెలియదు అన్నంతగా ఉండేవాళ్లు.

ప్రశాంతి సేవలలో ఏవిధమైన పాఠాలని నేర్చుకున్నాము అని సింహావలోకనం చేసుకుంటే

ఐకమత్యము అన్నది ఒకటి బాగా నేర్చుకున్నాం. ఇది మొదటి పాఠం. మేము ఏదైనా మాట అనుకుంటే ఆ మాట మీద పడి చావడమే ఇక, ఆరు నూరైనా, అటు సూర్యుడు ఇటు పొడిచిన అనుకున్నది సాధించాలి అన్న తపన అందరిలో కూడా గమనించాను.

ఇక రెండవది, స్వామి కోసం ఏమైనా చేయాలి అనే తపన. అహరహం స్వామి ప్రేమను పొందాలనే తహతహ.

మూడవది, ఈ అవకాశం లేకపోతే మరొక అవకాశం రాదేమో అన్న ఆతృతను ప్రశాంతి సేవలలో పాల్గొనే ప్రతి సోదరుడిలో గమనించాను.

ఇక నాలుగు, స్వామి యొక్క దర్శన స్పర్శన సంభాషణ పాద నమస్కార ప్రసాద భాగ్యముల కంటే కూడా సేవయే మిన్న అన్న ఆలోచన దృక్పథాన్ని నేను గమనించాను.

అయిదు, సేవలో మునిగితే ఇక ఎవరికి నిద్ర ఆహారము రెండు గుర్తుండవు, అంతెందుకు ఒంటి మీద స్పృహ లేకుండా సేవ చేస్తున్న సమయంలో అయిన గాయాలతో, కట్లతో, దేహాలను మర్చిపోయి సేవ చేసిన వాళ్లని నేను చూసాను.

ఇక ఆరవది, స్వామి సేవలలో ఉన్న సమయంలో ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని నష్టాలు వచ్చినా, ఎంత జ్వరములో ఉన్నాసరే, హాస్పిటల్‌కి వెళ్లరా అంటే కూడా హాస్పిటల్‌కి కాదు నేను సేవలో ఉంటాను. అవసరమైతే ఆ మూటల మీద పడుకుంటాను, నాకు ఇదే విడిది, నాకిదే విరామం, వేరేది లేదు అన్న అన్నదమ్ములను చూసాను. ఎంతో మంది దగ్గుతూ అనారోగ్యానికి గురైనా సరే, ఇంట్లో సమస్యలు ఉన్నా సరే, ప్రశాంతి సేవలకు మాత్రం వెళ్లాలి. కారణం, మళ్లీ మళ్లీ రాదేమో ఈ ప్రశాంతి సేవా భాగ్యము అని హైదరాబాద్ యూత్ పరితపించడం నేను కళ్లారా చూసాను. సేవను ఒక తపస్సులా చేసేవారంటే ఎలాంటి సందేహము లేదు.

ప్రశాంతి సేవలలో మమ్మల్ని మేము పవిత్రము చేసుకున్నాం. సేవలో పవిత్రమైన ఆ బృందాన్ని తమ హృదయంలో పెట్టుకున్నారు స్వామి వారు. ఎంత ఆనందం పంచేవారో తలచుకుంటే హృదయం ఈ రోజుకు కూడా రంజిల్లుతుంది.

ఈ రోజు చాలా బాధపడుతున్నాం... అయ్యో! మేము ఇప్పుడు యువకులు కాదే... అలాంటి అవకాశాలు లేవే మాకంతా అని. కానీ స్వామి ఇచ్చిన ఉత్సాహ ప్రోత్సాహములు ఈ రోజు కూడా ఉరకలేసే గంగా ప్రవాహంలా, ఎక్కడ వీలవుతే అక్కడ, ఎలా వీలైతే అలా, ఏ విధంగా వీలవుతే ఆ విధంగా, ఎన్ని సార్లు వీలవుతే అన్ని సార్లు, ఎన్ని రోజులు వీలవుతే అన్ని రోజులు, ఎన్ని జన్మలు వీలవుతే అన్ని జన్మలు, సేవ చేయాలనే తపన మాత్రం అలా స్థిరమైపోయింది.

ఈ రోజుకి కూడా మేమంతా సేవలు చేస్తున్నాం అంటే ఆ ప్రశాంతి సేవలలో మేము నేర్చుకున్న పాఠాలు. ఇవన్నీ చేసిన తర్వాత స్వామి మాపై చూపించిన ప్రేమ, కరుణ, స్నేహం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. వారి అనుగ్రహ వర్షాన్ని పుష్కలంగా కురిపించేవారు. ఎన్నో సందర్భాలలో స్వామి మమ్మల్ని ఇంటర్వ్యూకి పిలిచేవారు. ఒకే రోజు ఉదయం, సాయంత్రం ఇంటర్వ్యూలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. వరుసగా రోజుకో సారి కూడా పిలిచేవారు. దర్శనంలో కూర్చున్నా సరే, చివరి రెండు మూడు రోజులలో స్వామి మాతో ఎంత స్నేహంగా, చక్కగా మాట్లాడేవారో తలచుకుంటే కన్నులలో ఆశ్రువులు రాలుతాయి. స్వామికి, ప్రశాంతి సేవల సందర్భంలో ఉత్తరాలు వ్రాసుకున్న సందర్భాలు, టెలిగ్రామ్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి, ఇవన్నీ చెప్పాలి అంటే కొన్ని వ్యాసాలు సరిపోవు. కానీ నేను పాఠకులకు ఆ భావాన్ని, ఆ ఆలోచనను, ఉత్సాహాన్ని, ఆధ్యాత్మికతను, భక్తి

శ్రద్ధను పరిచయం చేసే ప్రయత్నం చేస్తున్నాను. ఇంకా చెప్పాలి అంటే ప్రశాంతి సేవల నేపథ్యంగా హైదరాబాద్ యువతకు స్వామి ప్రసాదించిన అనుగ్రహాన్ని అందరితో పంచుకోవాలనే భావన.

పూర్వము రోజుల్లో నిలయంలో వసతి దొరకడం అంటే ఇబ్బందిగా ఉండేది. ఏదో ఐదు మందో ఆరు మందో అవుతే... ఏదో ఒక గది దొరికేది. కానీ హైదరాబాద్ పిల్లలు ఎప్పుడు వెళ్లినా సరే, కనీసం అంటే ఒక 50-70 మంది దాకా వెళ్లేవాళ్లము. భోజనం దొరికేది కూడా చాలా కష్టమయ్యేది. కారణం క్యాంటీన్ ఏడు, ఎనిమిది గంటలకే మూసేసే వాళ్లు. బయటికి వెళ్లడానికి వీలుండేది కాదు.

రాత్రి లేట్ ఐపోయేది. ఎక్కడో సేవల్లో మునిగిపోయి ఉండేవాళ్లము. ఇట్లాంటి కారణాల వల్ల నిలయం బయట ఎక్కడైనా చిన్న చిన్న గదులు అద్దెకు తీసుకుని ఒక్కో గదిలో పది నుండి ఇరవై మంది దాకా ఉండేవాళ్లం. కుక్క పిల్లలాగా పడుకునేవాళ్లము. మా దృష్టి అంతా కూడా రాత్రి సమయంలో ఎక్కడైనా జాగాలో కాస్త ముడుచుకోవడానికి స్థలం ఉంటే చాలు అంతే. ఒక బాత్రూమ్‌ని 20 మంది వాడడమంటే ఏమిటో ఆలోచించండి. అలా బయట ఉన్న సమయంలో ఒక చిన్న బృందం రాత్రి భోజనానికి వెళ్లినప్పుడు, చిన్న గొడవ అయింది. హైదరాబాద్ బృందంలో ఉన్న సీనియర్ సోదరులు, కొద్ది మంది ఆ గొడవలో దూరడము, అది అటు తిరిగి ఇటు చేసి చివరికి గాలి వానగా మారిపోయి కొట్టుకోవడం దాకా వెళ్లింది.

మరుసటి రోజు దర్శనంలో కూర్చున్నాము. స్వామి అక్కడి నుంచి నడుస్తూ వచ్చేసారు, మమ్మల్ని చూసిన తక్షణం "ఏయ్! మీరు అసలు ఏంటి? రౌడీస్? రౌడీస్లాగా తయారయ్యారు! అందరూ. మీరు ఇట్లా చేస్తే, మిమ్మల్ని అసలు నిలయం లోకే రానివ్వను. బయటికి పంపించేస్తాను జాగ్రత్త." అని గట్టిగా మందలించడం మొదలుపెట్టారు. దేవుడా ఏంటి ఇట్లా అరిచేశారే!!! అని అందరూ బిత్తర పోయాము. స్వామి సంతోషంగా లేరు. మాకు కూడా బుద్ధి వచ్చింది. నిజమే కదా! మంచిగా ఉండాలనిపించింది. అలా ఆ ప్రశాంతి సేవలలో నుండి వెను తిరిగి ప్రయాణం చేశాము.

ఆ తరవాత కాలంలో, మేము ఎప్పుడైనా ప్రశాంతి నిలయానికి వెళ్లినప్పుడు, వసతి కార్యాలయంలో సేవలు అందించే ఉన్ని కృష్ణన్ మాపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. కనీసం ఒక రౌండ్ బ్లాక్ అయినా, లేకపోతే నార్త్ సౌత్ ప్రశాంతి అయినా, ఒక్కో సారి ఎనిమిది, పది గదులు ఇచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. దాని వెనక నేపథ్యం ఏమిటో తరవాత తెలిసింది. స్వామి స్వయంగా ఉన్ని కృష్ణన్‌ని పిలిచి, "బంగారు, పిల్లలంతా బయట ఉండడం సేఫ్ కాదు. వాళ్లు ఎప్పుడు వచ్చినా, ఎంత మంది వచ్చినా సరే బయట మాత్రం ఉండనివ్వకండి. ప్రశాంతి నిలయంలో వారికి కావలసిన గదులు ఇవ్వండి, సౌకర్యం కల్పించండి" అని ఆదేశించారని తెలిసింది. అలా నిలయంలో ఉద్యోగులకు సైతం హైదరాబాద్ యూత్ మీద స్వామి ప్రేమను తెలిపి, ఉన్ని కృష్ణన్ లాంటి వారి ప్రేమానురాగాలకి కూడా మమ్మల్ని సోచుకునే విధంగా చేశారు స్వామి

ఒకసారి గోకులంలో సేవ చేస్తున్న సమయము. గోకులం వెనుక స్వామి ట్రస్ట్‌కు భూమి ఉంది. అది ఎటువంటి ఆక్రమణలకు గురి కాకుండా, భద్రతా చర్యల కోసం సర్వే రాళ్లను, కొండల మీదికి మోసుకెళ్లి, అక్కడ పాతి, ఆ పరిధి చుట్టూ ఫెన్సింగ్ వైర్ వేయడానికి మేము ప్రయత్నం చేస్తున్నాం. ఇంకా మిగతా వాళ్లందరూ కూడా గోకులంలో సేవ చేస్తున్నాం. చాలా బండ పనే చేస్తున్నారు అందరూ. పెద్ద ట్యాంకు మీదకి ఎక్కి లోపలికి దిగేసి... క్లీనింగ్ చేస్తున్నాం పాచి పట్టిందని. ఇద్దరు ముగ్గురు కింద పడ్డారు. అయినా పర్వాలేదు లోపలికి దిగడం, స్వామి మాటలు చెప్పుకోవడం...

"స్వామిని మరువకురా నువ్వు సాయి బాబా దేవుడురా
కష్ట నష్టములు వచ్చిన గాని, ఇష్టాయిష్టము జరిగిన గాని
ప్రేమతో బాబా చూసిన గాని, బాగుగా చీవాట్లు పెట్టిన గాని

స్వామిని మరవకరా సాయిబాబా దేవుడారా" అని పాటలు పాడుకుంటున్నాం. అది సుమారు మధ్యాహ్నం ఒక గంట సమయములో జరిగింది. 2001 సంవత్సరమై ఉంటుందేమో! "స్వామి మధ్యాహ్న దర్శన సమయంలో మీ అందరినీ చూడాలనుకుంటున్నారు, సిద్ధంగా ఉండండి" అని మాకు సందేశం వచ్చింది. ఆ వార్త విన్న వెంటనే మా ఉత్సాహానికి అంతు లేదు! ఆ పాడు బడ్డ బురద బట్టలతోనే పరిగెత్తుకుంటూ వెళ్లి, వెంటనే షేవింగ్ చేసుకొని, తల స్నానం చేసి, శుభ్రమైన బట్టలు వేసుకుని, ముస్తాబయి నిలయానికి చేరుకున్నాం. ఆ తరవాత స్వామి బృందానికి గ్రూప్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రశాంతి నిలయంలో మేము చేసే ప్రతి సేవా కార్యానికి స్వామి అద్భుతమైన ముగింపు ఇచ్చినట్లు అనిపిస్తూ ఉంటుంది.

అలాగే మరొక సమయంలో, గోకులంలోనే జరిగింది ఈ విషయం కూడా. గోకులంలో సేవ చేస్తున్న సమయంలో... స్వామి వచ్చారు, పిల్లలందరూ కూడా అక్కడ ఉన్న పెద్ద పెద్ద ఆవుల్ని, ఎద్దుల్ని, దున్నపోతుల్ని, కడుగుతుండడం, గడ్డి పట్టుకొని మేత వేయడం. స్వామి వారు చూసి ఎంత ఆనంద పడ్డారో!!! స్వామి "ఏమి! ఎవరు ఇది? సేవ చేస్తున్నది" అని అక్కడి వారిని అడిగారు. వారు, "స్వామి హైదరాబాద్ పిల్లలు స్వామి" అన్నారు. అక్కడ సేవ చేస్తున్న పిల్లలను ప్రేమతో పిలిచి అడిగారు, ఏమిటో తెలుసా? ఇది? దీన్ని మూకుతాడు అంటారు తెలుసా?! ఎందుకంటారు? ఆ మూకుతాడు వేస్తే ఎద్దు మన మాట వింటుంది. ఆ తాడు పట్టుకుంటే అది అటు ఇటు తిరగకుండా నియంత్రణలో ఉంటుంది. దాన్ని గట్టిగా పట్టుకో!' -అని స్వామి ఒక బలమైన ఎద్దు గురించి చూపిస్తూ చెప్పారు. అలా మాట్లాడుతూ అందరిని ఆశీర్వదించి అద్భుతమైన ప్రేమని గోకులం దాకా వచ్చి పంచారంటే ఎంతటి వాత్సల్యమో వారిది ఆలోచించండి.

హైదరాబాద్ పిల్లలు చేసే మరొక ప్రత్యేకమైన సేవ ఏమిటంటే క్యాంటీన్‌లో వంటలు వండడం, పెరుగు అన్నం కలపడం, పులిహోర కలపడం. అలా చేస్తున్నప్పుడు ఒకసారి స్వామి నుండి సందేశం వచ్చింది, 'పులిహోరను పొడి బట్టల మీద కాకుండా తడి బట్టల మీద వేస్తున్నారు, దాంతో చెమ్మంతా కూడా లోపల చేరిపోయి ఆ అన్నం అంతా పాడైపోయే అవకాశం ఉంది, అన్నం పాడైపోకుండా జాగ్రత్తగా చూడండి' అని. మరోసారి లడ్డుల గురించి కూడా స్వామి సూచించారు, 'లడ్డూలను బెంచ్‌ల మీద పేర్చండి, గాలి తగలనివ్వండి, గాలి తగలకపోతే పాడైపోతాయి' అని. అంతేకాకుండా, 'చెడిపోయిన పదార్థాలను ఎవరూ తాకకుండా గుంతలు తవ్వి వేసేయండి' అని కూడా స్వామి ప్రత్యేకంగా చెప్పి పంపించే వాళ్లు. ఈ విధంగా ప్రశాంతి సేవలలో మేమెక్కడ ఏమి చేసినా, స్వామి దృష్టి మాపై ప్రసరించింది. ప్రతి చిన్న పనికీ స్వామి స్వయంగా దిశానిర్దేశం చేసే వారు. కొన్ని సందర్భాలలో మాకు ప్రత్యేకంగా స్వామి ప్రసాదం కూడా పంపించేవారు. సూర్య కాంతి నుంచి అయినా తప్పించుకోవచ్చేమో కానీ, స్వామి దివ్య దృష్టి నుండి సేవకులు తప్పించుకోలేరు!

ఒక సారి విభూది ప్యాకింగ్ నిలిచిపోయింది. ఎందుకంటే ఆ విభూది యొక్క వాసనకు, విభూది చల్లదనానికి, ఆ చుట్టుపక్కల పొదల్లో నుంచి చాలా పాములు, క్రిములు, కీటకాలు అన్ని ఆ మూటల మధ్యలో ఉండేవి. అయితే ఎవ్వరూ చేయకపోతే, అదిగో హైదరాబాద్ పిల్లలున్నారు కదా!

వాళ్లని పిలవండి అన్నారు. ఊహించండి, సమస్య ఏమిటో అందరికీ తెలిసినా, హైదరాబాద్ సోదరులు ఎంతో ఉత్సాహంతో, స్వామి నామస్మరణ చేస్తూ ఆనందంగా పని చేశారు. పాములు తిరిగే ప్రాంతంలో కూడా ఏమాత్రం భయపడకుండా కూర్చుని విభూతి ప్యాకింగ్ చేసిన సందర్భం నాకు స్పష్టంగా గుర్తుంది. ఇదంతా స్వామి మీద పొంగి పొరలే ప్రేమకు తార్కాణం!

మేము సేవలు చేస్తున్న సమయంలో మామూలు బట్టలే వేసుకొని ఉండేవాళ్లం. దానికి తోడు మేము చేసే పనులతో ఆ బట్టలకు మురికి, బురద అంటుకుని చూడటానికి పెద్ద హమాలీ బ్యాచ్‌లా తయారయ్యే వాళ్లం. కొత్తగా చూసిన వాళ్లకు రౌడీ గ్యాంగ్ కూడా గుర్తొచ్చేది.

స్వామి వారి 60వ పుట్టినరోజు, 70వ పుట్టిన రోజు సందర్భాల్లో చాలా మంది హైదరాబాద్ పిల్లలు, ఎవరికి చెప్పకుండా భక్తుల గుంపులోకి వెళ్లి పోయి దొంగలను, పిక్‌పాకెటర్లను, ఈవ్ టీజర్లను పట్టుకొచ్చేవారు. వాళ్లను లోపలికి తీసుకెళ్లి హెచ్చరించి అవసరం అవుతే దేహశుద్ధి చేసి పంపించే వాళ్లు. ఇవన్నీ నేను కళ్లారా చూసాను. ఇదంతా చెప్తుంటె, ఇంట్లో జరుగే శుభకార్యానికి వెళితే ఎన్నిరకాల కార్యక్రమాలు మనం చేసుకోవచ్చు, ప్రేమ ఉండాలే కానీ, కాదేది సేవకు అనర్హం.

అలాగే నిలయంలో పర్వదినాలలో వచ్చి పోయే లక్షలాది మంది వాడటం చేత చాలా సమయాల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేవి కావు. ఎంత చేసినా సరే వాడే వాళ్లు వాటిని మళ్లీ కంపు చేసే వాళ్లు. అలా మరుగుదొడ్లు శుభ్రంగా లేవని తెలిస్తే వెంటనే నిలయంలో నిర్వహణ విభాగంకి వెళ్లేవాళ్లం. హైదరాబాద్ యువత అందరికీ పరిచయమే కదా! అయ్యా ఫలానా చోట మరుగుదొడ్లు బాగా లేవండి. సామాగ్రి ఇస్తే శుభ్రం చేస్తాము అని అడిగే వాళ్లం. అయ్యా! మీరు ఇంత మంది వస్తే ఇవ్వడానికి అంత సామాను ఎక్కడుంది ఇక్కడ అని నెత్తి పట్టుకునే వాళ్లు. అయినా సరే ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము! కష్టాలు వచ్చినా కన్నీరు కార్చిన ఉప్పెనలు వచ్చినా, ఊపిరే పోయినా అనుకుంటూ బయటికి వెళ్లడం. ఒక 10 బకెట్లు, 20 బ్రష్లు, యాసిడ్ బాటిల్స్, ఫినాయిల్ సీసాలు ఇట్లాంటి వన్నీ తీసుకురావడం, వరుస పెట్టి 20/30 మరుగుదొడ్లు శుభ్రం చేసేవాళ్లము. అటువంటి సందర్భాలలో కూడా స్వామి ఇంటర్వ్యూస్‌కి పిలిచారు అని ఇదివరకే చెప్పాను.

యూనిటీ కప్: వరల్డ్ 11 vs ఇండియా 11 సందర్భంగా, స్వామి స్వయంగా చెప్పారు "బంగారు, మన దగ్గర ఇండియా వర్సెస్ వరల్డ్ మ్యాచ్ చూడబోతున్నాం. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఇండియా ఆటగాళ్లంతా వస్తున్నారు. మీ టెండూల్కర్ కూడా వస్తున్నాడు. మీరందరూ వచ్చి ఆనందంగా వీక్షించండి. మీకు ఏది కావాలన్నా నేను ఇస్తాను. స్నాక్స్ ఇస్తాను మీరు తింటూ ప్రత్యక్షంగా వచ్చి వీక్షించండి," అని స్వామి అనుగ్రహించారు.

అప్పుడు మేమంతా స్వామిని అడిగాం "స్వామి, మాకు ఏదైనా సేవా భాగ్యం ఇవ్వండి." అందుకు స్వామి ఇచ్చిన అపూర్వావకాశం ఏమిటంటే, శ్రీ సత్యసాయి యూనిటీ కప్ సందర్భంగా సుమారు 15 నుండి 20 రోజులపాటు జరిగిన బ్యూటిఫికేషన్ కార్యక్రమాలు, హోర్డింగ్స్ ఏర్పాటు, బ్యానర్స్ తయారీ, హ్యాంగింగ్స్ తయారు చేయడం వంటి అద్భుతమైన సేవా కార్యక్రమాలను హైదరాబాద్ యువతకు అప్పగించారు. ఆ విధంగా ప్రేమను ఇచ్చారు, అదే విధంగా ప్రోత్సాహం ఇచ్చారు, ఉత్సాహం ఇచ్చారు. ఇంకా ఎంతో ఇచ్చారు, చెప్పలేను.

హైదరాబాద్ యువత బృందానికి స్వర్ణావకాశం ఏమిటి అంటే, స్వామి వారి 75వ పుట్టు పండుగ. రజతోత్సవానికి మేము లేము. స్వర్ణోత్సవానికి మేము లేము. కానీ వజ్రోత్సవానికి ఉన్నాము. స్వామి వివేకానంద చెప్తారు కదా. ఉక్కు నరాలు ఉన్న పిల్లలు 100 మంది

ఉంటే దేశాన్ని పునర్నిర్మాణం చేస్తాను అని... అలా ఆ వజ్రోత్సవ సమయంలో సుమారు 100 మంది పిల్లల్ని వజ్రాలుగా మార్చి 30 రోజులు ప్రశాంతి నిలయంలో సేవలు చేసే భాగ్యం కల్పించారు. అట్లాంటి ఇట్లాంటి సేవలు కాదు. అన్నాహారములు మాని, దర్శన సమయాలు మరచి, స్వామిని తలచుకోవడం మరచి, ఎంత శ్రద్ధగా, ప్రేమగా పని చేసారంటే, అందరి చేతులకు పుండ్లు పడి, కాళ్లకు దెబ్బలు తగిలేలా చేశారు. దెబ్బలు తగలకుండా... పుండ్లు పడకుండా ఎవడైనా ఉన్నాడు... అంటే వాడు పని చేయనోడు అని అర్థం. ఇంకా చెప్పాలంటే, నా లాంటోడు. నేను పని చేసే వాడిని కాదు, ఎందుకంటే నా చెయ్యి విరిగిపోయింది. నేనేదో భజన చేసుకునేవాడిని అందరిలో కూర్చొని నేను ప్రత్యక్షంగా చూశాను – 75వ జన్మదినోత్సవ సందర్భంలో హైదరాబాద్ యువత చూపించిన అవిరళ సేవా స్ఫూర్తిని. ఆ రోజుల్లో ఎంతమంది తమ ఉద్యోగాలు కోల్పోయారో, ఎంతమంది చదువులో విఫలమయ్యారో నాకు తెలుసు. కానీ ఎవ్వరూ కూడా ఆ విషయాల గురించి పట్టించుకోలేదు. ఆ 30 రోజులు పూర్తిగా సేవా యజ్ఞంగా సాగింది. నవంబర్ ఒకటవ తేదీ పోతే, నవంబర్ 30 వరకు ప్రశాంతి నిలయంలో ఉన్నాము. ఆ కాలమంతా మేము సేవలోనే మునిగి ఉన్నాం. డిసెంబర్‌లో ఎప్పుడో స్వామి అందరిని పిలిచారు, వేణుగోపాల స్వామి దగ్గర కూర్చోబెట్టి స్వామి, "బంగారు! చాలా సంతోషం బంగారు. మంచి సేవలు చేసుకున్నారు," అని పాద నమస్కారం ఇచ్చారు, బట్టలు పెట్టారు, అంటే మామూలు బట్టలు కాదు, సఫారీ ఇచ్చారు. దాన్ని కుట్టించుకోవడానికని 500 డబ్బులు కవర్లలో పెట్టి ఇచ్చారు, విభూది ప్రసాదం ఇచ్చారు, లడ్డు ఇచ్చారు, లాస్ట్ 30 రోజులలో ఏమేమి ఇవ్వలేదో అవన్నీ మాకు ఇచ్చారు. కానీ స్వామి ఎందుకో తృప్తి చెందలేదు. "బంగారు చాలా సంతోషం బంగారు! చాలా సేవలు చేసుకున్నారురా... మీరు సేవలు చేసిన దానికి, నాకు ఒళ్లు నొప్పులు వస్తున్నాయిరా" అని చెప్పారంటే ఇంక ఆలోచించండి, ఆ సందర్భంలో స్వామి తన అపారమైన ప్రేమను హైదరాబాద్ యువతపై కురిపించారు. మేమంతా అలా స్వామి ఆశీస్సులు తీసుకుని వెళ్లి పోయిన తరువాత, స్వామి మెసేజ్ పంపించారు మళ్లీ. మరుసటి రోజు 'పిల్లలు అందరూ వచ్చి కూర్చోమనండి' అని.

మరుసటి రోజు వెళ్లినప్పుడు స్వామి ఎంతో ప్రత్యేకంగా, విద్యార్థుల కోసం, ప్రముఖుల కోసం తెప్పించిన చేతి గడియారాలు అందరికీ స్వయంగా అందజేశారు. అది మా జీవితంలో మర్చిపోలేని అనుభవం. స్వామి హైదరాబాద్ బృందానికి ఇచ్చిన Right Royal Reception.. రాజసంతో కూడిన ఆతిథ్యం. నిజమైన దైవానుగ్రహం. ఇన్ని విశేషాలు ప్రశాంతి సేవలతో ముడిపడి ఉన్నాయి. హృదయపూర్వకంగా కలిపిన పెరుగన్నం కూడా మాకు ప్రజ్ఞానాన్ని అందించింది. పరబ్రహ్మ తత్వాన్ని మాకు రుచి చూపించింది. మా ఆనందమే స్వామి ఆహారంగా మారిపోయింది

సత్యసాయి సంస్థ ఉపయోగం కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసే అవకాశాన్ని స్వామి వారు ప్రసాదించి, స్వయంగా రెండు మూడు సార్లు ఇంటర్వ్యూ ఇవ్వడం ద్వారా ప్రోత్సహించారు. ప్రశాంతి సేవలలో భాగంగా, మన దగ్గర ఉన్న సాఫ్ట్‌వేర్ సోదరులందరికీ, "సత్య సాయి సంస్థకు మనం ఏ విధంగా విలువ చేర్చగలం?" అన్న ఆలోచన వచ్చింది.

ఆ సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో ఎన్నో నిద్రలేని రాత్రులు, ఎన్నో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. రెండు రాష్ట్రాలు, మూడు రాష్ట్రాల్లో ఉన్న పిల్లలందర్నీ ఒక బృందంగా ఏకం చేసి, సత్య సాయి సేవా సంస్థకు ఒక సమగ్ర సాఫ్ట్‌వేర్ అందించేందుకు ప్రయత్నం జరిగింది.

ఆ సమయంలో, స్వామి వారు, అఖిల భారత సాయి సంస్థల అధ్యక్షులు వి. శ్రీనివాసన్‌ను

పిలిచి, "పిల్లలు సాఫ్ట్‌వేర్ తయారు చేశారు, మీరు వెళ్లి చూసి రండి," అని స్వయంగా చెప్పడం జరిగింది. అలా స్వామి తన ఆశీర్వాదాన్ని కురిపించారు. ఆ సేవలో పాల్గొన్న కొందరిని స్వామి ఇంటర్వ్యూకు పిలిచారు. చిన్న పని అయినా పవిత్ర భావనతో చేస్తే, "స్వామి తప్పకుండా స్పందిస్తారు" అనే సత్యానికి ఇది ఒక అందమైన నిదర్శనం.

మరొకసారి, హైదరాబాద్ పిల్లలు ప్రశాంతి నిలయంలో వసతి (Accommodation) నిర్వహణ కోసం ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ప్రశాంతి నిలయ వసతి కార్యాలయంలో చాలా రోజులు ఉపయోగించారు.

ప్రశాంతి నిలయంలో స్వామి హైదరాబాద్ యువతకు ఎన్నో అపూర్వమైన అవకాశాలు ప్రసాదించారు. హైదరాబాద్ యూత్ ద్వారా స్వామిని సేవించుకుని ప్రపంచములో ఎన్నో దేశాలకు వెళ్లి స్థిరపడిన వందల మంది సోదరులను నేను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. ఒక్కొక్కడినీ ఒక అద్భుతమైన ముత్యంలా, ఒక వజ్రంలా మార్చి పంపించారు స్వామి. ఒక్కొక్కరిలో ఉంటే విశేషమైన ప్రతిభ, ప్రజ్ఞా పాటవము, నైపుణ్యము, శక్తి, యుక్తి చూస్తే, స్వామి మా అందరికి ఎంత దయతో 'ఎప్పుడూ లేని, ఇక మళ్లీ రాని' దివ్యవకాశలను ప్రసాదించి ఉన్నతులుగా తీర్చిదిద్దారు తెలుస్తుంది.

70

హైదరాబాద్ యూత్‌కి స్వామి దివ్యదేశాలు

ఇంటర్వ్యూలను ప్రేరణలుగా భావించినప్పుడు, ప్రతి ఇంటర్వ్యూను ఇన్నర్వ్యూ అని స్వీకరించినప్పుడు, మా ప్రియమైన బంగారు స్వామితో కలిగిన ఆ అందమైన, అద్భుతమైన సంభాషణలు హృదయాలలో సదా ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి!!

ఎవరి కోసం చేస్తున్నామో గుర్తు పెట్టుకోండి

హైదరాబాద్ యువతకు గత నాలుగు దశాబ్దాలలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు ప్రసాదించిన అత్యంత దివ్యమైన దిశానిర్దేశాలు, ఈ వ్యాసము ద్వారా మీ ముందుకు తీసుకువస్తున్నాను. హైదరాబాద్ యువతని పట్టి పెట్టిన ఆదేశము ఏమైనా ఉంది అంటే అది ఐకమత్యము అని చెప్పుకోవాలి. ఒకసారి స్వామితో, "స్వామి మీ దగ్గర ఉన్నప్పుడు, సేవలో ఉన్నప్పుడు బాగానే ఉంటుంది! బయటికి వెళ్లిన మరుక్షణం భేదాభిప్రాయాలు వస్తూ ఉంటాయి" అని ఎప్పుడో ఒక సందర్భంలో స్వామి వారికి విన్నవిస్తే, స్వామి చెప్పారు "బంగారు మీరు ఎవరి కోసం చేస్తున్నారు అనేది ఎప్పుడు గుర్తుపెట్టుకోండి. సేవ మీ కోసం మీరు చేయట్లేదు, జనం కోసం చేయట్లేదు, స్వామి కోసం చేస్తున్నాము, అన్న అర్పిత భావనతో చేయండి. ఐకమత్యం దానంతట అదే వస్తుంది" అని చెప్పారు.

We are ONE!

అలాగే ఐకమత్యం అంటే గుర్తొచ్చింది, ఐకమత్యం అంటే... మాతో మేమే కాదు, భగవంతునితో ఐకమత్యం. నేను సీనియర్ సోదరుల ద్వారా విన్నాను. ఒకసారి హైదరాబాద్ యువత అంతా దర్శన సమయంలో కూర్చొని ఉన్నప్పుడు, స్వామి! 'ఎంత మంది?' అని అడిగారట. అంటే ముందర కూర్చున్న సోదరులు, స్వామి 45 మంది స్వామి అన్నారు. అంటే, స్వామి చాలా తమాషాగా "మరి నేను?" అన్నారు. కాబట్టి 46 అని అన్నారు. సరే అని ఒకింత దిగులు పడ్డారు అయ్యో చెప్పలేకపోయామే

స్వామిని కలిపి అని.

తర్వాత మళ్లీ మరుసటి రోజు దర్శనంలో కూడా స్వామి వచ్చి, "ఎంత మంది?" అన్నారు. ఈ సారి అందరూ కూడా తయారు అయి "స్వామి మేము 45 మంది మీరు ఒకరు స్వామి, 46" అన్నారు. అంటే... స్వామి, "అవునా! మరి నేను మీ ప్రతి ఒక్కరితో ఉన్నాను, 45+45=90 కదా" అని అన్నారట!! మళ్లీ తల గోక్కున్నారు అందరూ కూడా. స్వామి వెళ్లి పోయారు ముందుకి.

మళ్లీ మరో దర్శనంలో స్వామి, మళ్లీ రావడం, 'ఎంత మంది?' అని అడిగితే... అంటే ఈ సారి ఏక ఏకంఠంతో స్వామి 90 మంది అన్నారు. అంటే స్వామి ఇంకా తమాషాగా... "అవునా! అందరూ ఒక్కటే కదా! We are One! అన్నారు స్వామి. అంటే ఇలా చెప్పిన ప్రతి సందర్భంలో కూడా ఒక దివ్యమైన ఆధ్యాత్మికతని మాకు నేర్పించారు స్వామి. ఆ మాటలు మా జీవితంలో మరెప్పుడూ మేము మర్చిపోలేనంత ప్రభావాన్ని చూపించాయి. స్వామి మేము ఒక్కటే అన్నటువంటి భావన మమ్మల్ని ముందుకు నడిపించింది అని చెప్పాలి.

నీతో వున్నారు కాదు నీలో వున్నారు అనుకో!

మరోసారి, "స్వామి నాతో ఉన్నారని తెలిసినా, తప్పులు చేస్తున్నాం", అంటే! స్వామి తక్షణమే, సోదరుడు ఆ మాట పూర్తి చేయకుండానే "బంగారు! స్వామి నీతో ఉన్నాడు అంటే తప్పు చేయడానికి ఆస్కారం ఉంది. ఎందుకంటే స్వామి వేరు నువ్వు వేరు అయిపోయినావు కదా! స్వామి నీతో ఉన్నాడు కాదురా, నీలో ఉన్నాడు అనుకో బంగారు! ఇక తప్పులు ఎందుకు చేస్తావు" అని చెప్పడం నిజంగా ఆశ్చర్యం వేసింది. ఇది గుర్తుంచుకుంటే, దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటే, మన జీవితంలో మనమందరం ఏం చేయాలో అన్నది స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

నేలకు చూపులు ఆకాశానికి చేతలు!

స్వామి చాలా సార్లు గ్రామాలకు వెళ్లినప్పుడు ఎలా ఉండాలి? ఏం చేయాలి? అనే విషయాలు చెప్పేవాళ్లు. ఒకసారి స్వామి చెప్పారు "బంగారు మీరు గ్రామాలకు వెళ్లినప్పుడు, మంచి దుస్తులు వేసుకోండి. తెల్ల దుస్తులలో ఉండండి. మీ రంగు రంగు దుస్తులు వేసుకుంటే వాళ్లు బెదిరి పోతారయ్యా! అని చెప్పారు. నేలకు చూపులు, ఆకాశానికి చేతలు ఉండాలి రా! గ్రామాలకు సేవల కోసమై వెళ్లినప్పుడు తలదించుకొని మీరు సేవ చేయండి. అందరూ కూడా చాలా ఆనంద పడతారయ్యా! అందరిని చూసుకుంటూ ఇలా రాజసంగా ఉండొద్దు. నేలకు చూపులు, ఆకాశానికి చేతలు అంటే మన ఆచరణం అంతా కూడా ఆకాశమే హద్దుగా ఎదగాలి" అని చెప్పిన సందర్భం ఉంది. అలాగే "ఆడవాళ్లతో చాలా జాగ్రత్తగా ఉండండి. వాళ్లతో అవసరం ఉంటే తప్ప మాట్లాడవద్దు" అని చెప్పారు.

ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి!

ఇంకా ఆర్థిక పరమైన విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు చెప్పారు, "బంగారు! వ్యాపార సంబంధ బాంధవ్యాలు ఎప్పుడు పెట్టుకోవద్దు. మన సేవ కోసం వచ్చాము, సేవలోనే మనం మునిగిపోవాలి తప్ప వేరే విధమైన ఆర్థిక వ్యవహారాలలో తలదూర్చవద్దు" అని చెప్పారు. ఇది ఒక నిజమైన దివ్యాదేశంగా నేను వ్యక్తిగతంగా భావిస్తాను.

చేసిన తరవాత చెప్పండి!

ఒకసారి మేము బోరవెల్లి అనుకుంటాను, బోరవెల్లి గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించి, ప్రశాంతి నిలయానికి వెళ్లినప్పుడు స్వామి ఏకాంత సౌధ సంభాషణ అనుగ్రహించారు. బోరవెల్లిలో జరిగిన కార్యక్రమాలు అంతా చెప్తూ ఉంటే... స్వామితో ఒక సోదరుడేమో' స్వామి ఇక్కడ ఫ్లోరైడ్ వాటర్ ఎక్కువ ఉంది. వాటర్ ఫిల్టర్స్ ఇస్తున్నాం స్వామి' అని చెప్పారు. అయితే వెంటనే స్వామి, "ఇచ్చిన తర్వాత చెప్పండి బంగారు... చాలా మంది వచ్చి ఇది చేస్తాం, అది చేస్తాం అని చెప్పి పోతూ ఉంటారు. నాకు అదంతా ఇష్టం లేదు. చేసిన తర్వాత చెప్పండి. స్వామికి ఆనందం కలుగుతుంది!!" అని చెప్పారు. ఎంత అద్భుతమైన విషయం ఇది చెప్పండి!

వేల మంది ఎందుకు, మంచివాళ్లు 5 మంది కావాలి!

అలాగే ఒకానొకసారి స్వామి వారితో సంభాషిస్తూ, "స్వామి చాలా మంది పిల్లలు ఉన్నారు స్వామి, మీరు అనుమతిస్తే అన్ని జిల్లాలు నుండి కొన్ని వేల మందిని ప్రశాంతి నిలయానికి తీసుకొస్తాం స్వామి, మీరు వారిని అనుగ్రహించి మాట్లాడండి స్వామి" అని ఎంతో భక్తి ప్రపత్తులతో ప్రార్థన చేస్తే స్వామి అన్నారు, "బంగారు వేల మంది ఎందుకురా? త్యాగ భావము, సేవా దృక్పథము ఉన్న ఐదు మందిని తీసుకురండి రా! జిల్లాకు ఐదు మందిని తీసుకురండి. అందరికీ నేను టీ పార్టీఇచ్చి పంపుతాను" అని స్వామి చెప్పారు. స్వామికి కావలిసింది Quantity (పరిమాణం) కాదు Quality (నాణ్యత) అని మేము తెలుసుకున్నాము.

ఆ దివ్యాదేశము మేము అలాగే గుర్తుంచుకొని, ఏ జిల్లాకు వెళ్లినా, ఎన్ని వేల మంది వందల మందితో ఆ జిల్లాల్లో మేము సమావేశమైనా మా దృష్టి మాత్రము స్వామి చెప్పిన దివ్య మార్గదర్శనం మీద ఉండేది. అలా గత మూడు నాలుగు దశాబ్దాలుగా స్వామితో, ఎంతో మంది ఆత్మబంధువులను మేము అనుసంధానం చేయగలిగాము. ఆ రోజుల్లో మేము హృదయానికి హత్తుకున్న సోదరులందరూ కూడా, ఈ రోజు స్వామి కార్యంలో చాలా అద్భుతమైన పరిణితి, ప్రవర్తనతో ఎన్నో కార్యక్రమాలకి నాయకత్వం వహిస్తున్నారంటే ఎట్టి సందేహము లేదు.

అందరూ బాగా చదవాలి

స్వామి వారి 75వ పుట్టు పండుగ సందర్భంగా సుమారు 30 రోజులు సేవలు చేసుకున్న హైదరాబాద్ యువతని స్వామి చాలా విశేషంగా అనుగ్రహించారు, ఆశీర్వదించారు. ఆ సమయంలో స్వామి చెప్పారు, "బంగారు! సేవలు చాలా బాగా చేశారు బంగారు. కానీ చాలా మంది అసలు చదువుకోవటమే లేదు. ఇది సరికాదు బంగారు. అందరూ బాగా చదువుకోవాలి. బాగా ఉన్నతంగా ఎదగాలి. అంటూ... అక్కడే ఉన్న స్వామి విద్యార్థిని చూపిస్తూ, చూడండి ఈ అబ్బాయి తెలుసా... ఈ అబ్బాయి మూడు డిగ్రీలు చేశాడు, స్వామి దగ్గర సేవ చేస్తున్నాడు. మీరు కూడా అంతే... అందరూ బాగా చదవండి, అందరూ బాగా చదువుకొని ముందుకు వెళ్లండి. చదువుకోకుండా ఉంటే నాకు ఇష్టం లేదు బంగారు." అని ఎంతో ప్రేమగా ఎంతో వాత్సల్యంతో స్వామి చెప్పిన మార్గదర్శకం బాగా గుర్తుంది.

తదాదిగా మేము చాలా చోట్ల చెప్పేవాళ్లం, అయ్యా ఉట్టి నాయకులు కాదు మనకు కావాల్సింది... సత్యసాయి సంస్థలో, సత్యసాయి కార్యంలో, పరిణితి చెందిన వాళ్లు కావాలి, అద్భుతమైన

విద్యాధికులు కావాలి, ఉన్నతమైన పదవులలో ఉన్నటువంటి వాళ్లు ఉండాలి. అప్పుడు మనం ఎన్నో అద్భుతమైన సేవలలో పాల్గొనవచ్చును. ఎంతో మందిని స్ఫూర్తి కలిగించవచ్చును, ప్రేరణ కలిగించవచ్చును అని చెప్పుకునే వాళ్లం. ఈరోజు కూడా నేను నమ్ముతాను సేవ చేయడానికి కావలసింది ఆతృత, తపన, ప్రేమ, వాత్సల్యం ఇవన్నీ సరే. కానీ వాటి కంటే మించి, బాగా చదివి ఉండాలి మనందరం కూడా. ఉన్నతమైన విద్యార్హతలు ఉండాలి. అప్పుడు ఇంకా అద్భుతమైన విధంగా స్వామికి సేవ చేసుకోవచ్చు.

రెండు అక్షరాల BE – ఐదు అక్షరాల GRACE

ఒక ఇంటర్వ్యూలో స్వామి హైదరాబాద్ ఇంజనీరింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్నారు. అప్పుడు ఒక అద్భుతమైన దిశానిర్దేశం చేశారు. అది ఏంటంటే... స్వామి "మీరంతా ఏం చదువుతున్నారు అంటే?" స్వామి మేమంతా ఇంజనీరింగ్ చదువుతున్నాం! అని చెప్పారు. అయితే "ఇంజనీరింగ్‌లో ఎన్ని సబ్జెక్టులు ఉన్నాయి?" అని అడిగారు స్వామి. స్వామి! సుమారు 50 సబ్జెక్టులు ఉంటాయి, అని చెప్పారు. ఎన్నేళ్లు చదవాలి అంటే? నాలుగేళ్లు స్వామి అన్నారు వాళ్లు. స్వామి అప్పుడు చాలా వాత్సల్యంగా "బంగారు చూశారా! BE అనే రెండు అక్షరాల డిగ్రీకి ఇంత కష్టపడుతున్నారే, మరి, GRACE అనే ఐదు అక్షరాలకి... ఎంత కష్టపడాలిరా? ఎంత సేవ చేయాలిరా? ఎంత ఆర్తితో ఉండాలిరా? మీరందరూ కూడా అని చెప్పారు. మాకు ఆశ్చర్యం అయిపోయింది. ఎందుకంటే BE అంటే రెండు అక్షరాల డిగ్రీ తెలుసు, ఈ ఐదు అక్షరాల GRACE అప్పుడు అర్థమైంది. అంటే భగవంతుని దయకి పాత్రులు కావాలంటే మనం ఎంత పరితపించాలి, పరిశ్రమించాలి, సేవించాలి అన్నది ఆ రోజు మాకు అర్థమైంది. ఇది విద్యార్హతల గురించి కాదు, కానీ మనం స్వామి అనుగ్రహాన్ని పొందేందుకు ఎంత నిబద్ధతతో ఉన్నామనే దాని గురించి.

ధ్యానం కాదు – ధ్యాస ఉంచి పని చేయండి!

ఒకసారి, స్వామి ఇంటర్వ్యూ ఇస్తున్న సమయంలో ఒక సోదరుడు అడిగారు, 'స్వామి, మెడిటేషన్ ఎలా చేయాలి?' అని. నేను ఎప్పుడు మెడిటేషన్ గురించి పిల్లలకు చెప్పను బంగారు. మీరు అందరూ యవ్వనంతో, శక్తితో, చైతన్యంతో నిండినవారు. మీ వయసులో ధ్యానం అంటే సమయం వృథా అవుతుంది. కానీ నిజంగా ధ్యానం అంటే ఏమిటో తెలుసా? ఏకాగ్రత (Concentration), మననము (Contemplation) కలిసినదే నిజమైన ధ్యానం (Meditation). మీరు ఏ పని చేసినా, ఏ సేవ చేసినా, ఏ ఉద్యోగం చేసినా, ఏ చదువు చదివినా, ఎక్కడికెళ్లినా సరే ధ్యాస ఉంచి బతకండయ్య! అదే ధ్యానం అవుతుంది. కళ్లు మూసుకుని కూర్చోవడమే ధ్యానం కాదు. ధ్యాస ఉంచి జీవించడం అదే అసలైన ధ్యానం. Concentration ద్వారా Contemplation, తద్వారా Meditation అని స్వామి చెప్పారు. ఈ ఉపదేశం కూడా స్వామి ఇచ్చిన ఒక దివ్యాదేశమే.

18 నుంచి 35 ఏళ్ల దాకా ఉన్న యువకులందరూ కూడా ప్రధానంగా ఈ రోజు ధ్యానమని, రాజయోగము, జ్యోతి ధ్యానము అని చాలా సమయం వెచ్చిస్తూ ఉంటారు. కానీ! స్వామి యువకులకు చెప్పిన సిద్ధాంతంలో, ఆ యొక్క వేదాంతంలో నాకు అర్థమైంది ఏందంటే... "ఆచరణమే ఆ చరణాల సన్నిధికి చేరుస్తుంది. భౌతికంగా మనం చేసే సేవలు మాత్రమే మంచిగా స్వామిని మనకి దగ్గర చేస్తాయి అని తెలుసుకున్నాను."

సాక్షర – రాక్షస

ఒకానొక సమయంలో స్వామి చెప్పారు, "చదువులు ప్రధానం కాదయ్య. నువ్వు ఏం చదివితే ప్రయోజనం ఏముంది? చదివిన దాన్ని ఏ విధంగా ఆచరిస్తున్నావ్ అనే దాని మీద ఆధారపడి ఉందయ్యా! మీకు అందరికీ తెలుసు కదా! రాముడు కేవలం 32 విద్యలే నేర్చుకున్నాడు! కానీ రావణాసురుడు 64 విద్యలు నేర్చుకున్నాడు. కానీ రాముడు మానవుడైనా సరే, అక్షర జ్ఞానాన్ని సంపాదించడం మాత్రమే కాకుండా, నేర్చుకున్నది ఆచరణలో పెట్టాడయ్యా! అందుకని అక్షర పురుషుడైన రాముడిని "సాక్షర "అని పిలిచారు. కానీ 64 విద్యలు చదివిన రావణాసురుడు మాత్రము, రాక్షస ప్రవృత్తితో ఏదీ పాటించలేదు, ఏదీ ఉపయోగించలేదు, ఏది ఆచరించలేదు. కాబట్టి వాడు సాక్షర కాస్త తిప్పితే అంటే "రాక్షస"గా మారిపోయాడు. మీరు మానవుడిగా ఉండాలి. దైవత్వానికి దగ్గర అవ్వాలి అంటే, సాక్షరుడిగా అవ్వండి. మీకు చదువు వచ్చినా... చదువు రాకున్నా తొందర లేదు, కానీ సంస్కారంతో జీవించండి. ఆకార మానవులుగా కాదు, ఆచార మానవులుగా జీవించండి" అని స్వామి చెప్పారు. ఇది ఒక అద్భుతమైన విషయం. మనం జీవితంలో ఎంతో జ్ఞానం సంపాదించిన తర్వాత, దాన్ని ఆచరణలో పెట్టడం కోసం ఏం చేయాలో ఎప్పటికప్పుడు జ్ఞాపకం చేసుకోవాలి.

వడ్డించే వాడు మనవాడు

మేమంతా స్వామి వరకు ఎప్పుడైనా వెళితే చాలా సున్నిత మనస్కులు అయిపోయి ఉండేవాళ్లం. సుకుమారులుగా మారిపోయేవాళ్లం. చిన్న పాపల్లాగా మారిపోయేవాళ్లం. ఒకానొక అబ్బాయి కన్నీళ్లతో "స్వామీ ఇప్పుడు 70వ పుట్టిన రోజు తర్వాత మీ దగ్గర రష్ చాలా పెరుగుతుందని వింటున్నాం. అయినా కూడా మమ్మల్ని ఇలాగే పిలుస్తూ ఉండాలి స్వామి..." అని చెప్పాడు. అప్పుడు స్వామి చిరునవ్వుతో "బంగారు! ఇప్పుడే నేను మిమ్మల్ని ఎలా పిలిచాను?" అన్నారు. ఎందుకంటే ఆ సమయంలో దర్శనంలో దాదాపు ఇరవై వరుసల వెనుక కూర్చున్న ఆ బాలురిని స్వామి అంత దూరం నుంచి 'ఏయ్! పదండి' అని పిలిచి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సంఘటనను స్వామి స్వయంగా వివరించి, 'బంగారు! వడ్డించేవాడు మనవాడైతే, మీరు ఎక్కడ ఉన్నా... స్వామి మీకు ఒక ముద్ద వడ్డించి వెళ్తాడు లే!' అని అనుగ్రహించారు."

స్వామికి సమయం ఉండాలి, మీకు తపన ఉండాలి

స్వామితో మనసు విప్పి ఒకరు అన్నారు: 'స్వామి, మమ్మల్ని ఎప్పటికప్పుడు పిలవండి స్వామి... ప్లీజ్ స్వామి... చాలా రోజులుగా మమ్మల్ని పిలవట్లేదు స్వామి' అని.

అప్పుడు స్వామి చెప్పారు: 'బంగారు, నేను ఏం చేసేది? మీరు వస్తారు. కానీ కాంటీన్‌లో సేవలు చేసి సమయం ఇవ్వకుండా వెళ్లిపోతారు. మీరు వచ్చే ప్రతి సమయంలో, పర్వదినాలలో, ప్రత్యేక దినాలలో వస్తారు. అప్పుడు చాలా మంది VIPలు, వేలాదిగా భక్తులు ఉంటారు. అలాంటి సమయంలో పిలవడం కొద్దిగా కష్టం అవుతుంది కదా! కానీ బంగారు, మీరు కొన్నాళ్లు ఉంటే తప్పకుండా పిలుస్తాను'.

చివరగా స్వామి ఒక అద్భుతమైన ఉపదేశం ఇచ్చారు: 'స్వామి పిలవాలంటే రెండు విషయాలు అవసరం స్వామికి సమయం ఉండాలి, మీకు తపన ఉండాలి.' ఈ రెండు విషయాలు మనం గమనిస్తే, 'స్వామి మనల్ని చూడటం లేదు' అనుకోవడానికి అసలు కారణమే ఉండదు. స్వామికి

సమయం ఉంటే, మనకు తపన ఉంటే ఎంత కష్టమైనా సరే, తప్పకుండా స్వామి అనుగ్రహిస్తారని తెలుసుకున్నాం.

ఇది ఎందుకు చెప్తున్నానంటే, ప్రతీ బోధ ఒక దివ్యాదేశమే. మనం స్వామి కార్యంలో ఎలా నడవాలి, జీవితంలో ఎలా ప్రవర్తించాలి అన్న దానికి ఇది ఒక మార్గదర్శకత్వం.

ఒకసారి స్వామి ప్రశ్న వేశారు. 'Who is Boy?' (ఎవరు బాయ్?) అని.

స్వామి నవ్వుతూ: 'బాయ్ అంటే బిహేవియర్ (ప్రవర్తన) ఉన్న వాడే బాయ్.

Who is Man? మానర్స్ (సంస్కారం) ఉన్న వాడే మాన్' అని చెప్పారు.

చూడండి! ఎంత చిన్న చిన్న మాటలతో మహోన్నతమైన సందేశాలు స్వామి అందించేవారు!

ఒకసారి ఎవరో స్వామిని అడిగారు: 'స్వామి, True Spirituality అంటే ఏమిటి?' అని.

అప్పుడు స్వామి ఎంతో సరళంగా చెప్పారు: 'బంగారు, True Spirituality అంటే Love All, Serve All. అదే నిజమైన ఆధ్యాత్మికత.'

ఎంత అద్భుతమైన సందేశం!

కల్పవృక్షం దగ్గరికి వచ్చి – కాఫీ పొడి అడుగుతున్నరు

స్వామి ఒక అబ్బాయిని చూసి: 'బంగారు, నీకు ఏం కావాలి? చెప్పు' అని అడిగారు. ఆలోచించండి, స్వామి ఇలా నేరుగా ఒక అబ్బాయిని ఎంచుకుని ప్రశ్న అడిగితే ఎలా ఉంటుందో! అప్పుడు ఆ అబ్బాయి వెంటనే: 'స్వామి, నాకు ప్రమోషన్ కావాలి. నేను ఉద్యోగం చేస్తున్నాను. నాకు ప్రమోషన్ కావాలి స్వామి' అని అన్నాడు. అది విని స్వామి చిరునవ్వుతో అన్నారు: 'చూసావా? కల్పవృక్షం దగ్గరకు వచ్చి... కాఫీ పొడి అడుగుతున్నాడు! స్వామి, నీకు ఏం కావాలి? అని అడిగితే... ప్రమోషన్ అడుగుతున్నావా? మీరంతా ఎంత మాయలో ఉన్నారో చూడు.' అదంతా విని మేమంతా తలదించుకోవాల్సి వచ్చింది. నిజమే కదా స్వామి "నీకు ఏం కావాలి?" అని అడిగితే, మేము "మోక్షం కావాలి స్వామి" అని అడగాలి. కానీ తెలియక... చిన్న చిన్న విషయాలు అడుగుతుంటాం. ఇవన్నీ ఎప్పటికీ గుర్తుండిపోయే పాఠాలు. స్వామి ముందు నిలబడి మనం ఎలా ప్రవర్తించాలో, ఏమి కోరుకోవాలో ఇవన్నీ మనకు గుర్తు చేస్తాయి.

అలాగే దర్శన సమయంలో ఒక అబ్బాయిని స్వామి స్టేజ్ మీదకి పిలిచారు హైదరాబాద్ యువత బృందం నుండి" ఏం కావాలి నీకు అని అడిగారు? స్వామి నాకు మోక్షం కావాలి స్వామి అన్నాడు. అబ్బా! ఎంత అద్భుతమైన దృశ్యం అది. మేమందరం చూస్తున్నాం. అప్పుడు స్వామి భౌతికంగా చాలా నీరసంగా ఉన్నారు. స్వామి చెయ్యి ఆ అబ్బాయి భ్రూమధ్య స్థానంలో పెట్టి తప్పక తప్పక అని తన రెండువేళ్లని ఇలా తడిమి ఆ అబ్బాయిని ఆశీర్వదించారు. ఇలాంటి ప్రతి సంఘటన చెప్పుకుంటే తెలుస్తుంది. స్వామి మాటలన్నీ దివ్యాదేశాలే. ప్రతిసారి చాలా దివ్యమైన సందేశములతో, ఆదేశములతో, ఆదర్శములతో మేము ఇంటర్వ్యూ గది నుండి బయటికి వచ్చేవాళ్లం. నిజానికి ఈ ఇంటర్వ్యూలలో విశేషాలు చెప్పాలంటే కొన్ని వ్యాసాలు చాలవు.

71

వి. శ్రీనివాసన్ – స్వామిని చేరువ చేసిన వారధి

నా జీవితాన్ని అత్యంత ప్రభావితము చేసిన ఒక మహా వ్యక్తి గురించి నేను తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాను. పుట్టపర్తిలో వారిని చూసిన ప్రతిసారి చాలా ఉత్తేజము అయ్యేది.

ఆరు అడుగుల ఆజానుబాహుడు

స్వామి యొక్క దర్శనంలో ఏ మూల నుంచి చూసినా కనిపించే వారు. అదిగో వారే సాయి సంస్థలకు అఖిల భారత అధ్యక్షులు అనేంత ముఖవర్చస్సు, తేజస్సు. వారి మాటలు చాలా అధికారికంగా ఉండేవి. వారి దగ్గరికి వెళ్లాలంటే కూడా అందరూ భయ పడే వాళ్లు. ఎవరా అని వాకబు చేస్తే తెలిసింది వారు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు కూడా అని. పేరు వి శ్రీనివాసన్, ప్రఖ్యాత జనరల్ మోటార్స్ సంస్థకి వారు ఆద్యులు. పారిశ్రామిక వేత్త. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII)కి కూడా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. తమిళనాడు పారిశ్రామిక వర్గాలలో ప్రముఖులు.

చాలా పవిత్రమైన హృదయముతో స్వామిని పూజించారు, సేవించారు. ఒకే వ్యక్తికి రెండు బాధ్యతలు (సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు & అఖిల భారత అధ్యక్షులు) ఇవ్వడం అంటే ఆశ్చర్యమైన విషయము. స్వామికి ఎంత నమ్మకము ఉంటే ఇలాంటి అరుదైన బాధ్యతలను వారికి అప్పచెప్తారు? అనిపించింది.

ఆ కాలంలో స్వామి వారు హైదరాబాద్ యువతకి ఎన్నో అవకాశాలు, ఎన్నో దివ్యాదేశాలు, ఎన్నో ఏకాంత సంభాషణలు ఇస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ప్రధానంగా జిల్లాలలో మాలాంటి బృందాలను తయారు చేయమన్న స్వామి ఆదేశాన్ని భుజస్కంధాల మీద వేసుకొని, స్వామి సేవలని చేతులలో చూపించి, సాయి దీక్షా కంకణ బద్దులమై మేమందరం కూడా జిల్లాలకు వెళుతున్నాం. శ్రీ సత్యసాయి గ్రామ సేవ మరియు శ్రీ సత్యసాయి యువజన సమ్మేళనము, కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసుకున్నాం. స్వామి వారికి ఉత్తరం వ్రాసుకున్నాం. స్వామీ! కరీంనగర్ జిల్లా పర్యటనకు మేము ముందుకు వెళ్తున్నాం అని. ఆ సమయంలో మాకు ఒక సందేశం అందింది.

అది ఏమిటి అంటే? "శ్రీ సత్య సాయి సంస్థల అఖిల భారత అధ్యక్షులు, వి. శ్రీనివాసన్ కరీంనగర్ జిల్లాలో జరగనున్న కార్యక్రమాలకు హాజరుకాబోతున్నారు" అని.

నిజానికి అప్పటి దాకా సాయి సంస్థల ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు కూడా ఎప్పుడూ ఇలా మేము చేస్తున్న కార్యక్రమాలకు వచ్చింది లేదు. అలాంటిది సాక్షాత్తు అఖిల భారత అధ్యక్షులే హైదరాబాద్ యువత కార్యక్రమానికి వస్తున్నారు అని విని చాలా సంతోషించాము. కరీంనగర్ జిల్లాలో గోదావరిఖని పట్టణంలో, యువజన సమ్మేళనము, అలాగే గంగారం గ్రామంలో గ్రామ సేవ కార్యక్రమము మేము చేసుకున్నాం. ఈ వార్త తెలియగానే అక్కడ వాతావరణం అంతా ఒక్కసారిగా పులకరించింది ఉత్సుకతతో. అబ్బా! ఇంత కుగ్రామాలకి, అఖిల భారత అధ్యక్షులే వస్తున్నారు అని. కానీ మీరు నమ్మరు, ఆయన గ్రామంలోకి వచ్చాడని తెలిసినా సరే... హైదరాబాద్ యువత వారితో మాట్లాడలేదు. సుమారు ఆరు గంటల పాటు గంగారం అనే గ్రామంలో ఉన్నారు వారు. వైద్య శిబిరము, పశు వైద్య శిబిరము, శ్రమసేవ, సత్యసాయి బాలవికాస్, ఇంటింటికి స్వామి యొక్క నామాన్ని తీసుకెళ్లడము, ఇలాగ జరుగుతున్న అన్ని కార్యక్రమాలను వారు స్వయంగా కలియతిరుగుతూ వీక్షించారు. వారు గ్రామస్తులందరితో కలిసిపోయినారు.

నేను యధావిధిగా ఆ గ్రామంలో ఒక చోట చేస్తున్న గ్రామీణ బాల వికాస్, సత్యసాయి మహావతార దర్శనం చిత్ర ప్రదర్శనలో మునిగి తేలుతున్నాను. పిల్లలతో ఆడడము, పాడడము, ఇంకా నేను ఎక్కడ ఉంటే అక్కడ పిల్లలు కేరింతలు కొట్టాలి, గంతులు వేయాలి. పిల్లలు నాతో పాటు ఆడాలి, పాడాలి, ఎగరాలి. నేను కూర్చోమంటే కూర్చోవాలి, నిల్చోమంటే నిల్చోవాలి. ఏ వయసువాడినైనా స్వామి మాటలతో రంజింప చేయడము, ఏ వయసు వాళ్లనైనా, ఎలాంటి వాళ్లనైనా, స్వామి కార్యానికి పరిచయం చేయడము, అనేది నా పని.

అలా చేస్తున్న కార్యక్రమానికి అధ్యక్షులు వచ్చారు. వచ్చి అక్కడ కూర్చుని నేను చెప్తున్న సత్యసాయి మహావతార దర్శన కార్యక్రమాన్ని వీక్షించారు. నా పాటలు, నా మాటలు, నా ఆటలు అన్ని చూశారు. వారు ఎంత సంతోష పడ్డారో నేను చెప్పలేను. నాకు ఎంత ఉత్సాహం అయింది అంటే "అబ్బా! స్వామి ఇలాంటి వ్యక్తుల్ని మా బృందానికి పరిచయం చేశారు కదా! అఖిల భారత అధ్యక్షులే చూశారు ఈ రోజు కార్యక్రమాన్ని" అని.

తర్వాత భోజన సమయంలో అందరం కూడా ఎవరికి వాళ్లు భోజనం చేస్తున్నారు. మా నాయకుడు వచ్చారు అని చెప్పేసి ఆయన చుట్టూ మూగింది గానీ, ఊగింది గానీ ఎక్కడా లేదు. మేమెవరూ ఆయనతో లేము. ఇది బాగా నచ్చిన అంశం నాకు. అంటే ఒక నాయకుడు వస్తే చుట్టూరా మూగడం అనేది పద్ధతి కాదు అని నా అభిప్రాయం. ఎవరి పనిలో వారు ఉండాలి. మనము చేస్తున్న పనే మన గురించి పరిచయం చేయాలని నమ్మిన వాడిని నేను. నాకు బాగా అనిపించింది ఈ విషయము. వారు కూడా చుట్టుపక్కల ఎవరిని రానివ్వలేదు అనుకోవాలి.

ఇక వారు భోజనం చేసిన తర్వాత, చెయ్యి కడుక్కోవడానికి వస్తే, అక్కడే ఉన్న ఒక పెద్దాయన, చాలా వినయ విధేయతలతో, ప్రేమతో, భక్తితో, స్వామే వచ్చినాడు అన్నంత ఆర్తితో పాపం ఒక జగ్గు నీళ్లు తీసుకెళ్లి ఆయన చెయ్యిపట్టుకొని చెయ్యి కడగడానికి వెళ్లాడు. వారు చాలా కోపం చేసుకున్నాడు. "ఏయ్ దూరం పో. ఇలాంటివి చేస్తావా? పో!" అది చూసినప్పుడు నాకు గుండె జలదరించి పోయింది, దూరం నుంచి చూస్తున్నాం మేమంతా. తనే చేయి కడుక్కున్నాడు. ఆయన చేతి దస్తీ ఇవ్వబోయాడు. వద్దు అని చెప్పి తన చేతి రుమాలుతో తుడుచుకున్నాడు. ఇది చూసినప్పుడు

ఒక నాయకుడు ఎలా ఉండాలి అని నాకు అర్థమైంది. అసామాన్యులుగా ఉండొచ్చు కానీ సామాన్యంగా జీవించాలి అనేది నేను తెలుసుకున్నాను.

తర్వాత గోదావరిఖనిలో శ్రీ సత్యసాయి యువజన సమ్మేళనములో వారు మాట్లాడాలి. కానీ వారు తమిళయన్ కాబట్టి గోదావరిఖని పల్లెటూరు కాబట్టి ఆంగ్లములో మాట్లాడ లేకపోయారు, తమిళంలో మాట్లాడ లేకపోయారు. ఆంగ్లములో మాట్లాడాలి అంటే జనాలకి అర్థం కాదు. అలాంటి సమయంలో ఎవరైనా అనువాదం చేస్తే ఎలా ఉంటుంది అని, మీరు నమ్ముతారో లేదో! అందరూ నా వైపు చూశారు, వారి ప్రసంగాన్ని అనువదించు అని. అనువాదం నాకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. వేదిక మీద శ్రీ సత్యసాయి సేవా సంస్థ అఖిల భారత అధ్యక్షుని ప్రక్కన నిలబడి, వారు ఆంగ్లములో మాట్లాడుతుంటే, నాకు ఇంగ్లీష్ అంత బాగా రాకపోయినా, వారి మాటలను నాకర్థమైన విధంగా తెలుగులో అనువదించడం మొదలు పెట్టాను. వారికి ఒకసారి చప్పట్లు కొడితే నా అనువాదానికి రెండు సార్లు చప్పట్లు కొట్టారు జనాలంతా. కారణం వారు మాట్లాడిన దానికి నేను రెండు మూడు జత చేసి మాట్లాడాను. ఉపన్యాసంలో, గ్రామంలో మాట్లాడుతున్న సందర్భంలో, గంగారం అనేటువంటి పదానికి నేను చాలా పవిత్రమైన అర్థాన్ని ఆపాదించాను. అంటే ఎక్కడికి వెళ్లినా ఆయా గ్రామాలులో ఆ విశేషాలు చెప్తూ, వాళ్ల మనసులకు హత్తుకోనేలా చేయాలని నా ఆలోచన.

కించిద్ గీతా భగవద్ గీతా
గంగా జల లవ కణికా పీతా
సకృతపియేన మురారిసమర్చ
క్రియతే తస్య యమేన న చర్చ

భజగోవిందం లోని ఈ పద్యం నాకు గుర్తుకొచ్చింది ఆ గంగారం గ్రామంలో.

గంగాజల లవ కణికా పీత... గంగ బిందువునైనా మనం సేవించిన చాలు, మనకు ఇక యముడితో సమస్య ఉండదు అని ఆ శంకరాచార్య చెప్పిన ఆ శ్లోకాన్ని మరియు రామ నామము కంటే పవిత్రమైన శబ్దము ఈ విశ్వములో లేదు కదా! అట్టి రామ నామాన్ని ఎవరైతే పెదవులతో పలుకుతారో వారి పాపాలన్నీ హరించి పోతాయి అన్న భావన తీసుకున్నాను. "గంగ – రాం" రెండు పదాలు పెదవుల మీద పలికితే ఎంత రెట్టింపు ప్రభావం ఉంటుందో చూడండి అని చెప్పాను. నిజానికి ఇక్కడ అందరూ 'సాయిరామ్... సాయిరామ్' అంటున్నారు. కానీ ఈ సేవలు మనలను గంగారాములుగా మార్చేశాయి. గంగారంలో సేవ చేసిన వాళ్లందరూ కూడా గంగారాములుగా మారి పోయారు. పవిత్రాత్మ స్వరూపులుగా మారిపోయారు అని నేను చమత్కారంగా ఆ సభలో స్వామి విశేషాలను అలా చెప్పాను.

నా మాటలు విన్న తర్వాత వారు కూడా చాలా ప్రేరణ అయ్యారు. నాకు ఈ రోజు కూడా ఆయన చెప్పిన మాటలు గుర్తున్నాయి. ఆయన అన్నారు: 'ఈ రోజు నేను హైదరాబాద్ యువతతో ఉండడం చాలా సంతోషం కలిగిస్తోంది. నా సమయం వీరితో గడపడం ఆనందం కలిగిస్తోంది. కొద్దిరోజుల క్రితం బృందావనంకు స్వామి దర్శనం కొరకు చేరుకున్నాను. ఆ సమయంలో స్వామి నన్ను అడిగారు "బంగారు! వచ్చే నెల నీ ప్లాన్ ఏమిటి?" నేను చెప్పాను "స్వామి, నేను రెండు మూడు రాష్ట్రాలకు వెళ్లాలని ప్రయత్నిస్తున్నాను, అందులో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది". వెంటనే స్వామి అన్నారు "బంగారు! నువ్వు హైదరాబాద్ యువత వద్దకు వెళ్లు. వాళ్లు చాలా బాగా పని చేస్తున్నారు. వాళ్ల దగ్గరికి వెళ్లి వాళ్లతో మాట్లాడి, వాళ్ల పని చూసి రా!" అని అన్నారు. అందుకే నేను

ఈ రోజు మీ ముందున్నాను. స్వామి ప్రత్యేకంగా ప్రసాదం కూడా మీకు పంపించారు.'

ఈ మాటలు విని సభలో ఇక చప్పట్లే చప్పట్లు. స్వామి చెప్పినట్లుగానే, 'ఈ రోజు నేను ఎంతో సంతోషంగా ఉన్నాను, నా ముఖం ఆనందంతో, అద్భుతమైన ప్రకాశంతో వెలిగిపోతోంది' అని పలికారు. ఆయన మళ్లీ అన్నారు, ఒకవేళ నేను ఇంటికి వెళ్లిన తర్వాత, మా ఆవిడ అడగొచ్చు, ఏంటండీ మీ ముఖం ఇంత ప్రకాశ వంతంగా ఉంది అని అడిగితే... నేను చెప్తాను, "నేను ఇప్పుడు గంగారాం లా మారిపోయాను, ఆ గంగారం తేజస్సు నాలో ప్రవహిస్తుంది అని చెప్తాను" అంటే.. అబ్బా ఆ మాటలు విన్న అందరూ కూడా ఎంతో ఉత్సాహ పడిపోయారు.

నేను తెలుగులో మాట్లాడటమే విన్న వారు, వారి ఆంగ్ల ఉపన్యాసాన్ని నేను తెలుగులో తర్జుమా చేస్తుంటే, అందరికీ గమ్మత్తుగా అనిపించింది.

ఆయన కంప్యూటర్ గురించి మాట్లాడుతూ చెప్పారు 'కంప్యూటర్‌కు మనం ఏమి అందిస్తామో, తిరిగి మనకు అదే అందిస్తుంది.' మన మనసుల్లో ఏమి ఉంచుకుంటామో, మన చేతల్లో కూడా అదే కనిపిస్తుంది అని దానికి ఉదాహరణగా కంప్యూటర్ గురించి చెప్పారు.

అప్పుడు నేను వెంటనే, 'గార్బేజ్ ఇన్, గార్బేజ్ అవుట్ అనే కంప్యూటర్ సూత్రం!' అని చెప్పాను. ఆయన నవ్వుతూ, 'ఓహ్, నీకు ఈ సూత్రం కూడా తెలుసా!' అంటూ తమాషాగా అడిగారు. అది ఆయన ఎంత హాస్యప్రియుడో, ఎంత స్నేహపూర్వకంగా ఉన్నారో చూపించింది. హైదరాబాద్ యువతతో కొద్దిసేపు అలా మనసు విప్పి మాట్లాడి, చివరగా అందరికీ స్వామి ప్రసాదం ఇచ్చి, ఆప్యాయంగా మా వద్ద నుండి మరొక కార్యక్రమానికి వెళ్లి పోయారు.

ఆ తదనంతరము సత్యసాయి కార్యములో హైదరాబాద్ యువజన బృందం స్థానము, ఎంతో పదిలం అయింది. అద్భుతంగా వికసించింది అని చెప్పాలి. గోదావరిఖని సమ్మేళనము, గంగారం గ్రామ సేవ తరువాత, ఆయన మమ్మల్ని ప్రతి సేవా కార్యానికి వ్యూహాలు రచించడానికి ప్రత్యేకంగా పిలిచేవారు. మమ్మల్ని అన్నింటిలో భాగస్వాములుగా చేసుకునేవారు. అట్టి సమయంలో సత్యసాయి సహస్ర గ్రామ సేవా యజ్ఞం రూపుదిద్దుకుంది.

అదే విధంగా సత్యసాయి గురుకుల సేవా యజ్ఞాన్ని కూడా మేము నిర్వహించగలిగాం. వారు ఎంత ఆనంద పడ్డారు అంటే 108 ప్రభుత్వ పాఠశాలలలో సుమారు 6 మాసాలు పని చేయడము చూసి మా మీద చాలా విశేషమైన ప్రేమను చూపించారు. తర్వాత ఆ కార్యక్రమము జాతీయ స్థాయికి వెళ్లింది. పుట్టపర్తిలో జరిగిన రాష్ట్రాధ్యక్షుల సదస్సు, అంటే రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సదస్సు ప్రశాంతినిలయంలో జరిగింది. దానికి మమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఐదు మంది హైదరాబాద్ యువజనులను పిలిచి 'మీరు ఏమి చేస్తున్నారు అన్నది అందరికీ చెప్పండి' అని ఆదేశించారు. ఇది ఊహించగలరా? అఖిల భారత అధ్యక్షుడు స్వయంగా హైదరాబాద్ యువతను పిలవడం, ఒక గొప్ప గౌరవం మరియు వరం కాదా?

స్వామి పరిచయం చేసిన ప్రతి వ్యక్తి కూడా హైదరాబాద్ యువతకి విలువని జత చేశారని చెప్పాలి. జీవనాన్ని సంజీవనము చేశారని చెప్పాలి. సాయి మార్గంలో పయనిస్తున్న యువకులందరికీ, ఇలాంటి వాళ్లు చేదోడువాదోడుగా నిలిచారు.

జాతీయ స్థాయి సమావేశంలో 25 మంది రాష్ట్ర అధ్యక్షులు, పాతిక మంది రాష్ట్ర ట్రస్టు కన్వీనర్లు, వందల మంది జిల్లా అధ్యక్షులు, కార్య వర్గ సభ్యులు, సత్యసాయి సేవా సంస్థ పెద్దలు... ఇలా అందరి ముందర వారు పిలవడము, ఆ వేదిక నుంచి మేము మాట్లాడటము అంటే ఎంతో

అరుదైన అవకాశం మాకు వారు కల్పించారు అన్నది అర్థం అవుతుంది. మా మీద వారు పెట్టుకున్న నమ్మకం అది.

ఇక ఆ సందర్భంలో జరిగిన విశేషం చెప్తున్నాను. అందరినీ స్వామి వారు కుల్వంత్ సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా కూర్చోబెట్టారు. మేమందరం కూడా ఆహ్వానితులుగా వెళ్లాం కాబట్టి, మేము కూడా ఈ బృందంలో కూర్చున్నాం. స్వామి ఎంతో ప్రేమతో అఖిల భారత స్థాయి పదాధికారులందరికీ తమ కాషాయ వస్త్రాలను స్వయంగా "ఇస్తాను" అని చెప్పి సందేశం పంపించారు. సుమారు 500 మంది సాయి సంస్థల పెద్దలు ఒకరి వెనక ఒకరు వరుసలో నిలబడి స్వామి వారి చేతుల మీదుగా ఆ వస్త్రాలను అందుకుంటున్న అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది మా ముందు.

స్వామి అందరికీ స్వయంగా తమ చేతుల మీదుగా కాషాయ వస్త్రం ఇచ్చారు. ఆ సమయంలో స్వామి చాలా శారీరకంగా బలహీనంగా ఉన్నప్పటికీ, ఎంతో ప్రేమతో ఆ వస్త్రాలు ఇచ్చారు.

మేమంతా దర్శనంలో వెనక కూర్చున్నాం ఎందుకంటే మేము కార్యవర్గ సభ్యులు కాదు కదా కేవలం హైదరాబాద్ యువకులమే... కాస్తా బాధా పరితప్త హృదయంతో... కూర్చున్నాం. అప్పుడు వినిపించింది, ఆల్ ఇండియా ప్రెసిడెంట్ చేయిత్తి, Hay "Hyderabad Youth, come and join the group" అని (హైదరాబాద్ యువకులారా, రండి, బృందంలో చేరండి") అన్నారు.

అబ్బా, మమ్మల్ని కూడా చేరమన్నారు ఆ లైన్లో అని మేము వెళ్లాము. స్వామి వారు అరుదైన అనుగ్రహం చేశారు. మా అందరికీ కూడా స్వామి స్వయంగా ఆ కాషాయ వస్త్రాలు ఇచ్చారు. ఇది చెబుతున్నప్పుడు నా హృదయం ఉప్పొంగిపోతుంది. కారణం ఎక్కడి వాళ్లం మేము? మేమెవరం? మా స్థాయి ఏమిటి? మా స్వభావం ఏమిటి? స్వామికి మా శక్తి ఉపయోగించి సేవ చేయడం తప్ప మేము ఇంకేమీ చేయలేక పోయాం. అయినప్పటికీ స్వామి ఇంత ఆనందం ఇచ్చారు. ఎంత బాధతో కలిసిన ఆనందమో అది చెప్పలేను!

అఖిల భారత అధ్యక్షుడు శ్రీనివాసన్ గారి పాదాలకు నమస్కరించాలనే అనిపించింది. "ధన్యవాదాలు సార్... ఇంత అద్భుతమైన అవకాశాన్ని మాకు కల్పించినందుకు కృతజ్ఞతలు" అని మనసారా అనుకున్నాం. అంటే ఒక నాయకుడు క్రిందిస్థాయి వాళ్లకి కూడా అవకాశం ఎట్లా ఇవ్వచ్చు అనేది నేను దీని నుంచి గమనించాను.

అప్పుడే నాకు అర్థమైంది – "ఇతను నిజంగా ఇతర నాయకుల కంటే భిన్నమైన వ్యక్తి... సాయి సంస్థల నాయకులలో ఎంతో ప్రత్యేకమైనవాడు" అనిపించింది.

అతని స్వభావం ఎంత సున్నితమైనది! ఎంత మృదువైన హృదయం! ఎవరండి ఇట్లా పిలుస్తారు చెప్పండి? అలా వారు మమ్మల్ని పిలవడం, స్వామి దగ్గర అవకాశం కల్పించడం. స్వామి వారితో ఆ కాషాయ వస్త్రాలు తీసుకుంటూ నేను చెప్పాను, "స్వామి! మీరు చెప్పింది మేము చేస్తాం స్వామి! మీరు ఆదేశించండి" అని. స్వామి అలా తమ చేయిత్తి నాకు అభయ హస్తము చూపించారు. ఈ జన్మకు ఇది చాలు కదా అనిపించింది.

స్వామి వారి సహస్ర పూర్ణ చంద్రోదయ శాంతి విద్యాగిరి స్టేడియంలో జరుగుతున్న సందర్భం... స్వామి వారు వేదిక మీద ఉన్నారు. చాలా మంది మఠాధిపతులు, పీఠాధిపతులతో శాంతి వేదిక అంత నిండి పోయింది. అలాంటి సందర్భంలో మాట్లాడడానికి ఒకానొక ప్రముఖ వేద పండితుడిని, తీసుకొచ్చారు. ఆ ప్రముఖుడు తనతో పాటుగా ఒక మహిళను కూడా తెచ్చి, ఆవిడ ఈయన ఇద్దరు కలిసి ఒకటే పోడియం దగ్గర మైక్‌లో మాట్లాడటం మొదలు పెట్టారు. ఒకరు తెలుగు మాట్లాడటం,

అక్కడున్న మహిళ హిందీ మాట్లాడటం మొదలు పెట్టారు అంతే... ఎక్కడి నుంచి వచ్చారో అండి, శ్రీనివాసన్ గారు... "ఏయ్! లేదు,మీరు ఇలా చేయకూడదు... దయచేసి వెళ్లిపోండి... వెళ్లండి, వెళ్లండి" అని ఆమెకు చెప్పి, ఆమెను అక్కడి నుండి పంపించేశారు. ఆయన మైక్ ఉందని కూడా చూడలేదు. అంటే స్వామికి నచ్చని అంశం ఏదైనా సరే, అంటే ఒక మహిళ పురుషుడు వేదిక మీద ఒకే పోడియం మైకుతో కనపడటం వారికి కరెక్టగా కనపడలేదేమో!

ఈ సంఘటన ద్వారా స్పష్టంగా తెలిసింది ఏమిటంటే, స్వామి చెప్పే ప్రతి మాట, చిన్నదైనా పెద్దదైనా, దివ్యమైన ఆదేశమే. ఆ బోధలను లోతుగా గ్రహించకుండా వదిలేస్తే, మనం నిజమైన పురోగతి సాధించలేము, ఆధ్యాత్మికంగా ముందుకు సాగలేము అనిపించింది

అలాగే, ఆ తర్వాత కాలంలో ఆయన ఆక్సిజన్ మీద ఉండాల్సి వచ్చింది. ఆయనకు శ్వాస కోశ సమస్య వచ్చినట్టుంది. అప్పటికి ఆయన వయసు సుమారు 75 ఏళ్లకు పైబడింది. అలాంటి పరిస్థితుల్లో, తమిళనాడులో కంపెనీ సెక్రటరీ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహించిన పెద్ద సామాజిక సేవా కార్యక్రమానికి వారిని ఆహ్వానించేందుకు వెళ్లాము. ఆ భేటీలో ఆయన వద్ద నేను గమనించిన రెండు మూడు విషయాలు నన్ను చాలా ప్రభావితం చేశాయి.

ఒకటి, ఒక సమయం చెప్పారు వారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రమ్మని చెప్పారు వాళ్లింటికి. కాస్తా ముందు వెళ్ళిపోయాము... పెద్ద వారు కదా! లేట్ అవుతే బాగోదు అని. ఇంటి తలుపు ముందు నిలబడి ఆయనకు ఫోన్ చేశాను. "ఒంటి గంటకు అంటే కరెక్ట్‌గా ఒంటి గంటకే రావాలి" అని చెప్పారు. దాంతో నాకు భయమేసింది, "ఓరి దేవుడా! ఇది ఏమి క్రమశిక్షణ!" అని అనిపించింది. వెంటనే నేను ఏమి చేశానంటే, బయట ఫుట్‌పాత్ మీద కూర్చున్నాను. కొంత సమయం తర్వాత, కరెక్ట్‌గా ఒంటి గంటకు వెళ్లి కలిసాను. వారు అప్పుడు ఆహ్వానించి, చాలా చక్కగా మాట్లాడారు. వారి శ్వాసలో సమస్య ఉన్నట్లు కనిపించినా, ఎంతో ప్రసన్నంగా అన్నీ విని, చెప్పాల్సిన మాటలు చెప్పారు, అవసరమైన మార్గదర్శనం ఇచ్చి పంపించారు. ఇది నాపై చాలా ప్రభావం చూపింది. సమయపాలన ఎలా ఉండాలో అర్థమయ్యేలా చేసిన అంశంగా నిలిచిపోయింది.

అఖిల భారత అధ్యక్షులుగా ఉన్నవారు, ఇంతటి భక్తి భావనతో, ఆధ్యాత్మికతతో, మానవతా దృక్పథముతో, శ్రద్ధతో, ఆలోచనతో, ఆదర్శంతో, స్వామిని సేవించుకున్నారు అంటే... ఇక మన లాంటి సామాన్య వ్యక్తులు ఎలా ఉండాలి? స్వామి కార్యంలో అని తెలుస్తుంది.

ఈ విశేషాలన్నీ కూడా చెప్తూ ఉంటే... నాకు గుర్తొస్తుంది వారిది ఎంత అద్భుతమైన వాక్చాతుర్యం అన్నది. స్వామి సమక్షంలో మాట్లాడటం అంటే సామాన్యమైన విషయమా చెప్పండి! అంశము ఏదైనా... సందర్భం ఏదైనా సరే అలవోకగా, అద్భుతంగా, అప్పటికప్పుడు, చక్కగా, గంభీరంగా, వారు జనరంజకంగా మాట్లాడటం నాకు బాగా నచ్చిన అంశము.

చివరి క్షణము దాకా వారు, స్వామి సేవలో ఉన్నారు. ఆ శ్వాసలో ఇబ్బందిలో ఉన్నప్పుడు కూడా ప్యాంటు ప్యాకెట్లో మిషను పెట్టుకొని వారు ప్రశాంతి నిలయంలో తిరగడం నేను చూశాను. అలా చివరికి స్వామిలో ఐక్యమయ్యారు. నాయకుడిగా ఎదగడం గొప్ప సంగతి కాదు. నాయకుడిగా ఆదర్శాన్ని అందించడం మరింత గొప్ప సంగతి అని నేను తలుస్తూ, వారికి శిరము వంచి అభివాదం చేస్తూ, ఇలాంటి వారిని హైదరాబాద్ యువతకి పరిచయం చేసిన స్వామి వారికి మరొకసారి ప్రణతులు అర్పించుకుంటున్నాను.

72

ఐకమత్యమే దివ్యత్వమునకు మార్గము

బాబా వారి అవ్యాజ ప్రేమకి, వాత్సల్యానికి, దయకి మేము పాత్రులవడానికి కారణం ఏదైనా ఒకటి ఉంది అంటే... అది నిస్సందేహంగా, నిర్వివాదంశముగా ఐకమత్యము అని చెప్పాలి. మేము ఎప్పుడూ పాడుకుంటాం...

సాయి మాత బిడ్డలం అందరం
సాయి మాత బిడ్డలమే అందరం
కలసి ఉంటే కలదు సుఖం కలహిస్తే దుఃఖమయం
పరస్పరం ప్రేమిద్దాం పరదూషణ మానేద్దాం
కుల భేదాలు వద్దు మనకు భాషా భేదాలు వద్దు
అంటరాని తనం వద్దు అందరం ఒకటిగా ఉందాం
అందరం ఒకటిగా ఉందాం,

అన్న ఆలోచనా ధోరణి, దృక్పథము, పరస్పర ఆదరాభిమానలు, వాత్సల్యము ఇవన్నీ కూడా స్వామికి అతి దగ్గరగా తీసుకెళ్లినవిగా పరిగణించాలి.

ఈ వ్యాసం ద్వారా, హైదరాబాద్ యువత యొక్క ఐకమత్యము గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాను. చాలా సందర్భాలలో, స్వామి స్వయంగా చెప్పగా నేను విన్నాను. హైదరాబాద్‌లో చాలా మంది విన్నారు ఈ విషయం. ఏమిటంటే "బంగారు! మీ ఐకమత్యమే నన్ను సంతోష పెడుతుందిరా! అదొక్కటే రా బంగారు నన్ను కదిలిస్తుంది. కలిసి మెలిసి ఉండండి. చక్కగా సేవలు చేయండి. ఐకమత్యంగా ఉండండి బంగారు!" అనేవారు స్వామి.

ఏదో విధంగా మేమంతా 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సిద్ధాంతానికి బలంగా కట్టుబడి పోయాము. నాకు బాగా గుర్తు, "ఒక సారి స్వామి ఒక కథ చెప్పారు. ఒక్కడే పది రోడ్లు వేయడం కంటే కూడా, పది మంది చేరి ఒక రోడ్డు వేయడంలో ఐకమత్యం ఉన్నదయ్యా! దాంట్లో

నీ అర్థం, వాడి అర్థం, నీ సర్దుబాటు, వాడి సర్దుబాటు, నీ కోపతాపాలు, వాడి కోపతాపాలు అన్నీ కలిసిపోయి అందరూ దివ్యంగా మారిపోతారు. ఆ ఐకమత్యం సేవలో మిమ్మల్ని ముందడుగు వేయిస్తుంది.

ప్రక్కన వాడు ఎవడైనా సరే, వాడి ముఖం ఏదైనా సరే, వాడి నేపథ్యం ఏదైనా సరే ఒక్కసారి ఈ బృందంతో చెయ్యి కలిపాడు అంటే ఇక వాడు మన వాడు అనే ఆలోచన కలిగేది. ఎక్కడ, ఎంత కష్టం వచ్చినా సరే, ఆ కష్టం ముందు హైదరాబాద్ యువత అంతా ఒక్కటిగా మారిపోయిన సందర్భాల్లో నేను ఎన్నో చూశాను.

2000 సంవత్సరంలో అనుకుంటాను, కొద్ది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు స్వామి దర్శనం కోసము వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారు. చాలా ఆర్తితో ఉండేవారండి. అప్పుడు ఒక తమాషా జరిగింది. వాళ్లు పుట్టపర్తికి వెళ్లాలి అని అడిగితే, ఎవరో చెప్పారట, మీరు ఒక లేఖ వ్రాసి హైదరాబాద్ యువతతో సంతకాలు తీసుకోండి అని. ఆ కొత్త పిల్లలు చాలా అమాయకంగా ఆ లేఖ వ్రాసుకొని ఉదయన్న దగ్గరికి వెళితే! అన్నయ్య చెప్పిన మాటలు వాళ్లని ప్రభావితం చేశాయి. ఆ మాటలు ఈ రోజుకి కూడా గుర్తుంచుకున్నారు.

"ఒరేయ్ ఏమిట్రా బాబూ ఇది? సంతకాల ఉద్యమం? నువ్వు ఏమిటి నువ్వు వేరేనా?? నువ్వు హైదరాబాద్ యువత కాదా?? మళ్లీ దానికి సంతకాలు ఎందుకురా? మళ్లీ ఒకరి సర్టిఫికేషన్ ఎందుకురా? స్వామిని ఎవరైనా చూడొచ్చు, ఎప్పుడైనా వెళ్లొచ్చు, ఎక్కడైనా తిరగొచ్చు. మూడవ వ్యక్తి నుండి మళ్లీ దానికి ధృవ పత్రం అవసరం ఎందుకు? అరే మనమందరం ఒక్కటేరా! సాయి మాత బిడ్డలము. ముందుకు వెళ్లండిరా!"

మీరు ముందుకు వెళ్లాలి తప్ప ఇదంతా చేసుకోవద్దురా బంగారు! మనందరం ఒకటే రా! అంటూ అతి చిన్న వాళ్లు, ఇంకా చెప్పాలంటే తనకంటే వయసులో 15 ఏళ్లు చిన్న వారితో ఆయన చెప్పిన ఆ మాటలు వారిని ఎంతో ఉత్సాహాన్ని అందించాయి. అందరూ ఒకటే! చిన్న పెద్ద తేడా లేదు, మంచి చెడ్డ తేడానే ఉంది అని తెలుసుకున్నాను, ఆ క్రొత్త పిల్లలు.

స్వామికి ఎప్పుడు ఉత్తరం వ్రాసిన, FAX మెసేజ్ పంపినా, టెలిగ్రామ్ ఇచ్చినా సరే ఏనాడు కూడా వ్యక్తుల పేర్లు వ్రాసింది లేదంటే నమ్మండి. హైదరాబాద్ యూత్ అని సంతకం చేసే వాళ్లము. నేను స్వయంగా కొన్ని వందల ఉత్తరాలు స్వామికి వ్రాసుకున్నాను హైదరాబాద్ యూత్ తరఫున. అలాంటి అద్భుతమైన అవకాశం స్వామి ఇచ్చారు. ఎప్పుడు కూడా హైదరాబాద్ యూత్ అని సంతకం చేసే వాడిని. చివరికి నా సంతకం పెట్టాల్సిన ఆఫీసు పేపర్లలో కూడా మర్చిపోయి 'హైదరాబాద్ యూత్' అని సంతకం చేసే వాడిని అంటే నమ్ముతారా?

మీరంతా నమ్మండి, మేమంతా ఒక్కటే, వ్యక్తులు, సంస్థలు వేర్వేరు కాదు. ఇది ఒక ఉద్యమం, ఒక ఉత్తుంగ తరంగం, అనే ఆ అంతరంగ ప్రేరణే మమ్మల్ని నడిపించింది. హైదరాబాద్ యువతలో ఉన్న ఈ ఐకమత్య భావనే బాబాకు మమ్మల్ని దగ్గర చేసింది.

ప్రశాంతి నిలయంలో స్వామి సన్నిధిలో మేము ఉన్నామంటే, సేవల తర్వాత స్వామి మమ్మల్ని పిలుస్తారు అని ఏమాత్రము సూచనప్రాయంగా తెలిసినా, ఇక అందరూ సిద్ధం అయ్యే వాళ్లం.

నాకు గుర్తు, ఇప్పుడు కట్టిన భక్త సహాయక షెడ్లు ఉన్నాయి కదండీ, అవి కట్టడానికి ముందు ఆ ప్రదేశంలో బండలు ఉండేవి. వాటి మీద కూర్చొని మేము మాట్లాడుకునే వాళ్లం. "అరేయ్ స్వామి పిలిస్తే, నిలయంలో ఇష్టం వచ్చినట్టు పరిగెత్తకూడదు. One Man Show లా కాకుండా అందరూ

కలిసి ఒక్కటిగా కనిపించాలి.

స్వామి పిలిచినప్పుడు ఎలా వెళ్లాలి? ఎలా నిలబడాలి? ఎవరు ముందు? ఎవరు తర్వాత? ఇలా ఒకరికి తర్వాత ఒకరు వరుసలో వెళ్తే స్వామి చాలా సంతోషిస్తారు. కూర్చునేటప్పుడు కూడా క్రమంగా కూర్చోవాలి. స్వామి దగ్గర మాట్లాడేటప్పుడు ఎవరు మొదట మాట్లాడాలి, ఎవరు తర్వాత మాట్లాడాలి అన్నది నిర్ణయించేవాళ్లం. అందరికీ అవకాశాలు లభించేలా చూసుకోవాలి అని ఇలాంటి సమన్వయం, క్రమశిక్షణ, సమానత భావనలను నేను నాతో పాటు అందరూ నేర్చుకున్నారు.

స్వామి దగ్గర మూడు రోజులు ఉంటే, ఒకడే ముందర కూర్చోకూడదు. అందరికీ అవకాశం ఇవ్వాలి. వాడు చిన్నోడైనా, పెద్దోడైనా పర్వాలేదు. ఒక సీనియర్ సోదరుడు, ఒక జూనియర్ సోదరుడు, ఒక కొత్తవాడు, ఇలా ముగ్గురు లేక నలుగురు పిల్లలు వంతుల ప్రకారము దర్శనాల్లో కూర్చునే వాళ్లం. అంటే ఆ ఐకమత్యము అనే పవిత్ర భావన, హైదరాబాద్ యువతకి ఏ విధంగా విలువ చేకూర్చిందో నేను చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

అలాంటి సందర్భంలో ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. 2000 సంవత్సరంలో గోకులంలో మేము సేవ చేస్తూ ఉంటే, స్వామి వారు సందేశం పంపించారు నెల్లూరు రెడ్డి గారితో, "స్వామి పిలుస్తున్నారు మధ్యాహ్నం, దర్శనంలో కూర్చోండి, స్వామి ఇంటర్వ్యూ ఇస్తారు అని.

అప్పుడు స్వామి చిన్న మెలిక పెట్టారు! "హైదరాబాద్ నుండి అడ్వకేట్స్ బృందం కూడా వచ్చింది, వాళ్లు 15 మంది ఉన్నారు, ఇంటర్వ్యూ గదిలో స్థలం ఉండదు కాబట్టి మీరు కూడా 15 మందిని పంపించండి" అని. అది ఎంత బాధకలిగించే క్షణమో చెప్పలేం. 45 మందిమి ఉన్నాము, స్వామి మాత్రం 15 మందినే రమ్మన్నారు. మీరు ఊహించగలరా! అప్పుడు మా అందరి హృదయాల్లో ఎలాంటి ఆలోచన వచ్చిందో? "అరేయ్ మనం ఇంతకు ముందు రెండు మూడు సార్లు స్వామితో అవకాశం తీసుకున్నాం. ఇదిగో మనము 45 మంది ఉన్నాము. ఇప్పటిదాకా స్వామి ఇంటర్వ్యూ ఎవడికైతే లేదో వాడు చెయ్యి ఎత్తండిరా అంటే! అవకాశం రాని వాళ్లు చెయ్యి ఎత్తితే, వాడి ముక్కు మొఖం, నేపథ్యం తెలియకపోయినా సరే స్వామి దగ్గర వాడికి అవకాశం ఇప్పించాలన్న ఒకే ఒక్క ఆలోచనతో వారిని మాత్రమే స్వామి సన్నిధికి పంపించారు. మిగతా మేము అంత బయటే కూర్చున్నాం. ఎంత ప్రేమండి ఇది! ఎంత నిస్వార్థమైన భావన! అందరికీ ఆనందం అందించాలి అనే ఆతృతతో 15 మందిని కూర్చోబెట్టారు. ఆ పిల్లలు ఇంటర్వ్యూ గది ముందు కూర్చుంటే, చిరంజీవి రావు వచ్చారు. ఎవరు మీలో లీడర్ అంటే? పాపం అందరూ అంతా చిన్నపిల్లలు, కొత్త వాళ్లు, బిక్క ముఖాలు వేశారు. ఎవరైనా సీనియర్ సోదరుడు ఉంటే బాగుంటుంది కదా అని మాకు కబురు చేశారు. గోపి వెళ్లాడు లోపలికి కొంచెం సహాయ పడవచ్చని అన్నట్టుగా. అయితే మరి 15 మంది కాస్త 16 మంది అయ్యారు. గోపి లోపలికి వెళ్లడం వల్ల ఒక కొత్త అబ్బాయి బయటికి రావాల్సి వచ్చింది. ఎవరు వెళ్తారు అని అడిగితే అక్కడున్న అందరూ ఎవరికి వాళ్లు తలలు దించుకున్నారు. అంటే ఎవరికీ వెళ్లాలని లేదు. మేమంతా బయట నుండి చూస్తున్నాము లోపలి నుండి ఎవరు వస్తారా అని. ఒక అబ్బాయి బయటికి వచ్చాడండి. ఆ అబ్బాయిని చూస్తే నేను ఎంతో ఉద్వేగంతో ఏడ్చానండి! ఆ అబ్బాయి అలా మందిరం లోపలి నుంచి బయటికి వస్తుంటే ఒక రాజు లాగా అనిపించింది. సింహం లాగా వచ్చాడండి. ఇంటర్వ్యూ రూమ్ లోకి వెళ్లడానికి ఎంత ఆనందంగా వెళ్లాడో, బయటికి వస్తున్నప్పుడు కూడా అంతే ఆనందంగా వచ్చాడు. ఆయన కళ్లలో ఆనందం చూశాను. కారణం! "అన్నా పర్వాలేదులే అన్న, ఎవరో ఒకరు ఉండాలి కదా! పిల్లలందరూ వెళితే

చాలు కదా అన్న, స్వామి పిలిస్తే ఇంకోసారి వెళ్తానులే" అని అన్నాడు.

ఆ రోజు నేను అనుకున్నాను, "ఈ వ్యక్తి సాయి కార్యముతో అనుసంధానమై తప్పకుండా ఒక అద్భుత సాయి సైనికుడిలా నిలిచిపోతాడు" అని. ఆ వ్యక్తి వేరెవరో కాదు, శ్రీపాద రవికిరణ్. ఆ రోజుల్లో ఆయన GE కంపెనీలో ఉద్యోగం చేసే వారు. దశాబ్దం తర్వాత, 2010వ సంవత్సరంలో, హైదరాబాద్ యూత్ నిర్వహించిన "University to Universality" సమ్మేళనాన్ని ముందుండి నడిపించారు. స్వామి అతనిపై అపారమైన అనుగ్రహం చూపి, స్వయంగా హస్త చాలనంతో, బంగారు గొలుసు సృష్టించి వాడి మెడలో వేశారు. వాడిని ముద్దాడడము, వాడి తలను గుండెలకు హత్తుకోవడము, కావలించు కోవడము, స్టేజ్ మీద మాట్లాడమని చెప్పడం ఇదంతా కూడా చూస్తే ఆనంద బాష్పాలు రాలినాయి. అందరం ఒక్కటే, ప్రక్క వాడి సంతోషంలో ఆనందం వెతుక్కోవాలి అన్న భావన ఉంటే ఎవడైనా ఎంతటి స్థాయికి వెళ్లగలడు అని నేను గ్రహించాను. రవి కిరణ్‌ను నేను ఎప్పుడూ గుర్తుంచుంటాను.

చాలా సందర్భాలలో ఎన్నో వివాదాలు మమ్మల్ని చుట్టుముట్టాయి. వివాదం ఏదైనా సరే... నినాదం ఒక్కటే! "ఐకమత్యమే మహా బలమని అందరికీ చాటుదాం!" ఎవ్వరు మమ్మల్ని కదిలించ లేక పోయారు, విడగొట్టలేకపోయారు. హైదరాబాద్ యువతలో ఉన్న ఐకమత్యమే దివ్యత్వానికి దగ్గరగా చేసింది అని చెప్పుకోవాలి.

ఆ నాటి రాష్ట్ర సాయి సంస్థల అధ్యక్షులు డాక్టర్ జి. నరసింగరావు, తరచుగా మాతో మాట్లాడుతూ చెప్పేవారు, "అయ్యా, హైదరాబాద్ యూత్ అంతా గుంపులు గుంపులుగా ఒకే చోట ఎందుకు ఉంటారయ్యా? అంత మంది ఒకటే చోటు ఎందుకయ్యా? మీలో ఒక్కొక్కరు ఒక్కొక్క దిశలో వెళ్లాలి. ఒక్కొక్కరు ఒక జిల్లాకు వెళ్లండి. జిల్లాకు నాయకత్వం వహించండి. అక్కడి వాళ్లకి మార్గనిర్దేశం చేయండి" అని. అప్పుడు వారితో మేము అన్నాము, "అంకుల్! మాకు స్వామి చెప్పింది ఒక్కటే. మా నేపథ్యాలు ఏమిటనేది మేము ఈ బృందంలో మర్చిపోయాం. ప్రస్తుతం మా నేపథ్యం ఒక్కటే 'సాయి కార్యము'. మేము అందరూ ఉంటేనే శక్తి, యుక్తి, భక్తి. మేము విడిపోతే శవాల్లాగా మారిపోయినట్టే అంకుల్. మేము ఎంత గొప్పవాళ్లు అయినా, ఒక్కడిగా ఏమి చేయలేము అంకల్. కాబట్టి మేమందరం ఒక్కటిగా ఉంటాము. మేమంతా కష్టపడి, హృదయపూర్వకంగా చేయి చేయి కలిపి సేవ చేస్తాము" అని చెప్పాము.

ఇదీ హైదరాబాద్ యువత ఏకాత్మ భావన. ఈ ఐకమత్యమే మమ్మల్ని దివ్యత్వము వైపు నడిపించింది. ఎవరికి ఏ కష్టం వచ్చినా, దానిని తమకష్టం అనుకునే అనురాగం ఉంది. నేనే ఆ విధమైన భావనకు సాక్ష్యం, ఈ బృందంలో వున్నోళ్లు నాపై చూపిన అపారమైన ప్రేమ, కరుణ, వాత్సల్యం దానికి ఉదాహరణ. ఎన్నో వందల మంది ఉన్నప్పటికీ, ఎవరికైనా కష్టం వస్తె ముందుగా స్పందించే వారు హైదరాబాద్ యూత్ సీనియర్ సోదరులు. వాళ్లే కాదు, ఎవరైనా సరే ప్రక్కవాడు కష్టంలో ఉన్నాడనీ తెలిస్తే తల్లడిల్లిపోతారు, వారి కష్టాన్ని తమ కష్టంగా తీసుకుంటారు.

ఈ సందర్భంలో గంగాధర శర్మ గురించి చెప్పాలి. మేము ఆయనను నరదాగా 'రింగ్ రాజు' అని పిలిచేవాళ్లం. కారణం ఏమిటంటే, 1996లో మొదటి గ్రామ సేవ కార్యంలో, స్వామి వాడికి బంగారు ఉంగరం ప్రసాదించారు. అప్పట్లో రాజు అనే పేరుతో చాలామంది ఉండటంతో పెద్ద రాజు, చిన్న రాజు అని పిలుస్తూ ఉండేవాళ్లం. బోయగూడ నుంచి వచ్చిన వాడిని బోయ రాజు అని పిలిచాం. స్వామి వీడికి రింగు ఇచ్చిన తర్వాత 'రింగ్ రాజు' అని పిలవడం ప్రారంభించాం. అది

స్వామి ఆశీర్వాదానికి గుర్తుగా నిలిచిపోయింది. ఆ నాడు, స్వామి ఎందుకు ఇచ్చారో, ఎలా ఇచ్చారో, దానికి నేపథ్యం మనకు తెలియదు కానీ, మేము ప్రేమగా రింగురాజు అని పిలుచుకునే వీడు తరవాత కాలంలో సాయి సంస్థలో ఒక ఆదర్శ నాయకుడిగా మారిపోయారు. ఎవరికి కష్టమొచ్చినా అది తనవాళ్ల కష్టం అనుకుని ముందడుగు వేస్తాడు. 'అరే, అతను ఇబ్బందిలో ఉన్నాడంటే మనకేం సంబంధం లేదు' అని కాదు... 'మనమంతా ఒక కుటుంబం, ఒకటే' అని భావించి, వాడి కష్టం తన కష్టంగా స్వీకరించే హృదయం వాడు చూపించాడు." ఇలా ఇట్లాంటి యువకులు అందరినీ పుష్పాలుగా చేసి గంపలో పెట్టేస్తే, స్వామి వారు దారంగా మారి మమ్మల్ని మాల లాగా చేసేసారు.

ఐకమత్యమే స్వామికి దగ్గరగా చేర్చే అత్యుత్తమమైన సాధన. మనలో ఐకమత్యం ఉంటే స్వామి మన ఇంట వెంట కంట జంట తోడు నీడగా ఉంటారు అన్నది పరమ సత్యము.

73

గజ్వేల్ ప్రాంతంలో – గ్రామ సేవా యజ్ఞము

స్వామి వారి సమక్షంలో ఏదైనా అనుకున్నాము అంటే అది ఎంత కష్టమైనా, నష్టమైనా, దుఃఖమైనా, సుఖమైనా, లాభమైనా సరే ముందడుగు వేయాల్సిందే. అది హైదరాబాద్ యువత లక్షణం. స్వామి దగ్గర ఏదైనా చెప్పుకున్నాము అంటే అది జీవితాచరణం కావాలి. అంతే తప్ప వెనకడుగు వేసే ప్రశక్తే లేదు అన్న ఆదర్శము అందరిలో కూడా ప్రస్ఫుటంగా కనిపించేది.

రెండు దశాబ్దాల క్రితం, గ్రామాలలో చైతన్యం తీసుకురావాలి అంటే... కేవలం హైదరాబాద్ బృందం మాత్రం వెళ్లి గ్రామాల్లో సేవలు చేసి వెనక్కి రావడం సరి కాదేమో! ఈ రోజు శక్తి ఉంది చేస్తాము. తర్వాత పరిస్థితి ఏమిటి? ఆయా గ్రామాలు ఎన్నో జిల్లాలలో ఉంటాయి, ఎన్నో వందల వేల గ్రామాలు రాష్ట్రంలో ఉంటాయి కదా? మరి ఆ గ్రామాలకి సేవాకార్యక్రమాలు ఎలా తీసుకు వెళ్లాలి? మన శక్తి యుక్తులు దానికి చాలవు కదా? ఆ జిల్లాల్లో ఉన్న యువజనులని ఏ విధంగా ఉత్సాహపరచాలి? అన్న ఆలోచనలు మమ్మల్ని ఊరికే కూర్చోనివ్వలేదు. ఎన్నెన్నో విధాలుగా ప్రయత్నాలు చేసే వాళ్లము.

సామాన్యంగా ఎక్కడైనా ఎవరైనా పది మంది కూర్చుంటే ఏవో ముచ్చటలు మాట్లాడుకోవడము, సినిమాలు, రాజకీయాలు, వర్ధమాన విషయాల గురించి మాట్లాడుకోవడం జరుగుతుంది. కానీ హైదరాబాద్ పిల్లలు ఎక్కడైనా కలిసారు అంటే, ఇక మా మధ్యలో జరిగే చర్చ ఒకటే. స్వామికి నచ్చే విధంగా, స్వామికి మెచ్చే విధంగా ఇంకా ఏమి చేయాలి? అని మాట్లాడుకునే వాళ్లం.

అలాంటి సందర్భంలో స్వామి, "బంగారు! మీరు గ్రామాల్లో సేవలు చేస్తే, మీతో పాటు నేను ఉంటానురా!" అని చెప్పిన విషయం గుర్తుంచుకున్నాం.

ఇక రెండో విషయం, "స్వామీ! జిల్లాలలో వందల వేల మంది ఉన్నారు, వాళ్లందరిని మీ సన్నిధికి తెస్తాం అంటే, "బంగారు! సేవా దృక్పథము, త్యాగ నిరతి ఉన్న వాళ్లు ఐదు మంది చాలురా! తీసుకురండి, నేను టీ పార్టీ ఇచ్చి పంపిస్తాను" అని చెప్పిన మాటలు గుర్తుకొచ్చేవి.

మూడు, గ్రామాలలో సేవలు చేసి వచ్చాము స్వామి అంటే, "బంగారు! ఇలాంటి బృందాలు ప్రతి జిల్లాలో తయారు చేయండి!" అని చెప్పిన వారి వాక్కులు గుర్తు చేసుకున్నాం. మరి ఎలా తయారు చేయాలి? అనే దాని మీద మేధో మదనం జరిగేది.

ఒక జిల్లాలోని కొన్ని గ్రామాల సమూహాన్ని (Village Cluster) గుర్తించి, ఆ జిల్లాలో ఉన్న యువకులను ప్రోత్సాహపరిచి, వారిని కూడా కలుపుకొని, ఐదు రోజులపాటు, ఐదు గ్రామాలలో ఉండి సేవా కార్యక్రమాల చేయాలన్న ప్రణాళిక రూపొందించబడింది.

ఇది మా అందరికి వినూత్నమైన ఆలోచనగా తోచింది. "శ్రీ సత్యసాయి గ్రామ సేవ యజ్ఞము" అని పేరు పెట్టాము. ఎక్కడ చేయాలని నాలుగైదు జిల్లాల్లో తిరిగితే... మెదక్ జిల్లాలో, గజ్వేలు గ్రామం ఉదయన్నకు పరిచయం ఉండటం, గజ్వేల్లో ఎంతో మంది స్వామి భక్తులు మరియు సేవకులు ఉండటం వలన అక్కడ చేయాలని అనుకున్నాం.

అలాగే గజ్వేల్‌కు దగ్గరలో ఉన్న బూర్గుపల్లి, చాలా అద్భుతమైన గ్రామం. అక్కడి నుంచి స్వామి కోసమై పుట్టపర్తికి నడిచి వెళ్లిన వాళ్లు ఉన్నారు. అలాంటి గ్రామాల సముదాయాన్ని గుర్తించాము.

ఈ విషయం చెప్తుంటే, మేము ఆ సేవా ప్రణాళికను స్వామి దగ్గరికి ఎలా తీసుకెళ్లి, స్వామికి సమర్పించి, అమలు చేయడానికి ముందడుగు వేసామో నాకు గుర్తుకు వస్తుంది. అప్పుడేమో వేసవి కాలం అనుకుంటాను, స్వామి బృందావనంలో ఉన్నారు. ఆ రోజుల్లో సుమారు 20 – 30 మందిమి, ఒక పెద్ద చార్ట్ తయారు చేసి, ఆ చార్ట్‌లో ఆంధ్రదేశ్ మ్యాప్ వేసి, అందులో మెదక్‌ని గుర్తించి, గజ్వేల్ నియోజకవర్గములో, ఐదు గ్రామాలు గుర్తు చేసి, స్వామీ! ఇదిగో ఈ ఐదు గ్రామాల్లో ఐదు రోజులు కార్యక్రమం చేసుకోవాలి అని స్వామికి చూపించాము. మొదట ఎంతో కోపం చేసుకున్నారు ఆ చార్ట్‌ను మా మీద విసిరేశారు కూడా! కానీ ఎవరమూ విడిచి పెట్టలేదు, బెంగుళూరులో చాలా రోజులు ఉండాల్సి వచ్చింది. ఆశ్రమానికి దగ్గరలో ఉన్న అలంబిక్ గ్లాస్ ఫ్యాక్టరీ లోపల గదులున్నాయి అని తెలిసి అక్కడ ఉండే వాళ్లం. స్వామిని ఎంతో ప్రార్థించాము. చివరికి స్వామి మార్గదర్శనం చేశారు, ఆర్థిక విషయాల మీద కఠినమైన సూచనలు చేశారు, ఎంతో ఉత్సాహాన్ని ప్రసాదించారు. అలా స్వామి ఆదేశాలను అనుసరించి గ్రామ సేవ యజ్ఞానికి శ్రీకారం చుట్టాము.

గజ్వేల్ పట్టణానికి ముందే వెళ్లి రెక్కి చేశాము. ఆ గ్రామంలో అప్పటికే ఉన్న భక్తులందరిని కూడా, ఒక్కొక్కరినీ కలిసి వారికి విషయం వివరించాము.

అందులో ప్రప్రథమంగా మా దృష్టికి వచ్చిన వారు శ్రీమాన్ భాస్కర్ సేట్! చిన్న కిరాణ కొట్టు నడిపే వారు. ఎద నిండుగా స్వామి పట్ల భక్తి విశ్వాసం కలవాడు. నిరక్షరాస్యుడే కానీ, వ్యాపారంలో అందెవేసిన చెయ్యి. ఇద్దరు కొడుకులు, చిన్న కుటుంబము, చింతలు లేని కుటుంబము, స్వామికి సర్వస్వం ఇవ్వడానికి రెడీగా ఉన్న వ్యక్తిగా మాకు కనిపించారు. వారి ఇంటి మీద డాబాలో, మేడ పైన భజనలు జరిగేవి. ఆ గ్రామంలో వారితో మాట్లాడినప్పుడు ఎంత ఉత్సాహ పడ్డారు అంటే, మేము ఇప్పటికీ గుర్తుంచుకుంటాం వారి భక్తిని. అద్భుతమైన వ్యక్తిత్వము, భక్తి ప్రపత్తి, నిరాడంబర జీవితం! స్వామి గురించి ఏమైనా చేయాలనే తపన. వారు చెప్పారు "అయ్యా! మీరందరూ మా గ్రామానికి వచ్చి ఇలా సేవలు చేస్తామంటే, అంత కంటే ఏం కావాలి? మీకు ఏం కావాలో చెప్పండి, మేమంతా పూనుకుంటాము" అని చెప్పేసి ఆ రోజుల్లో ఐదు గ్రామాలలో ఉన్నటువంటి సేవాదళ్ సభ్యులను, భక్తుల్ని అందరిని సమావేశపరిచారు. అలా అందరితో చర్చించి వారికి ఉత్సాహ ప్రోత్సహములు అందించి సిద్ధం చేసాము. మెదక్ జిల్లా యువజనులని సమీకరించి, ఒకా నొక పుణ్య దినమున గజ్వేల్ గ్రామ సముదాయంలో కార్యక్రమం ప్రారంభించాము.

ఒక్కొక్క రోజు, ఒక్కొక్క గ్రామాన్ని ఎంచుకొని అక్కడ పశు వైద్య శిబిరము, వైద్య శిబిరము, బాలవికాస్, శ్రమ సేవ ఇలా అంతా చేసుకుంటూ వచ్చాము. రాత్రికి గజ్వేల్‌లో ఉన్న రైస్ మిల్లు చేరుకుని అక్కడ విశ్రమించే వాళ్లము. భోజన సదుపాయం అంతా భాస్కర్ సేటు బృందం చేశారు. ఎంత ప్రేమవాత్సల్యాన్ని పంచారు అంటే మాటలలో చెప్పలేను. హైదరాబాద్ యువతను చూసి వారు ఉప్పొంగి పోయేవారు. మాతో పాటు ఆడి, పాడేవారు. ప్రతి సాయంకాలము సత్సంగము, భజన, ప్రతి రోజు నగర సంకీర్తన జరిగేవి. గ్రామ గ్రామాన, ఇంటింటా, ఇంచించూ స్వామి నామాన్ని ప్రతిధ్వనింప చేసే విధంగా కార్యక్రమాలు చేసుకున్నాము. ఎన్నో వందల మంది యువకులు దానికి తోడు నిలిచారు.

భాస్కర్ సేటు మేము అక్కడి కుగ్రామాలలో చేస్తున్న సేవలు చూసి ఆనందంతో కళ్ల నీళ్లు పెట్టుకునే వాళ్లు. మేము ఆకలితో తలడిల్లుతున్నామేమో అని, గజ్వేల్‌లో వండి సిద్ధంగా ఉంచిన పదార్థాలన్నీ ట్రాక్టర్‌లో తీసుకొచ్చి, మేము సేవ చేసే గ్రామానికి వచ్చి ఎంతో ప్రేమతో మాకు భోజనం పెట్టే వారు. ఆ ప్రక్రియలో ఆయనతో సంభాషించే అవకాశం వచ్చింది. చాలా ప్రేమించేవారు నన్ను. "అయ్యా! నిన్ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందయ్యా!! అని. అప్పుడే అనుకుంటాను వారికి మనవడు పుడితే తొట్లలో వేశారు. ఆ సందర్భంలో మమ్మల్ని పిలిచారు. నేను వెళ్లి ఆ బాబుని చూస్తున్నప్పుడు, "అయ్యా! నీలాంటి వాడు కావాలయ్యా నాకు. నా మనవడు నీలాంటి వాడు అవ్వాలి. నీ పేరే పెట్టుకోవాలయ్యా నేను!" అని చెప్పిన వారికి నమస్కారం చేయడం తప్ప నేను ఏమి చేయలేక పోయాను. అంతలా ప్రేమించేవాడు నన్ను. అలాగా భాస్కర్ సేట్ కుటుంబం అంతా కూడా పరిచయం అయింది. ఆయన అధ్వర్యంలో శ్రీ సత్యసాయి గ్రామ సేవ యజ్ఞములో భాగంగా, మెదక్ జిల్లా అంతా ఉద్యమోత్సాహమును అందించగలుగాము.

గ్రామలలో ఇలా సేవలు చేస్తున్నప్పుడు, ఏమి జరుగుతుందో చూద్దాం అని, సాయి సంస్థల పెద్దలు మరియు ప్రముఖులు కూడా వచ్చారు. ఇక ఆ సందర్భంగా ప్రదర్శించిన "మార్పు రావాలి" నాటకం, వినోదముతో చొప్పించి అందించే సాయి సందేశాలు, ఇంద్రజాల ప్రదర్శన, మూకాభినయం, ఉపన్యాసాలు, పాటలు, ఆటలు, మాటలు, అబ్బో! చాలా ఆనందంగా ప్రతి రోజు కార్యక్రమాలు చేస్తూ ఉండేవాళ్లము. ఆ రోజులు, ఆ ఆనందాలు జీవితంలో మరచి పోలేనివి.

నాకు గుర్తు, మేము ఒక గ్రామంలో రహదారి వేసే కార్యక్రమంలో పాల్గొంటున్న రోజున, వైసీ తనకు స్వామి సృష్టించి ఇచ్చిన చేతి గడియారాన్ని అక్కడ పోగొట్టుకున్నాడు. అప్పటికే చీకటి పండింది. ఆ రాత్రి ఎంత వెతికినా అది దొరక లేదు. అయ్యో! స్వామి ఇచ్చిన వాచీ పోయిందే అనుకున్నాము.

ఆ తర్వాత అందరం ఆరో రోజు పుట్టపర్తికి వెళ్లాలి అనుకున్నాం. ఐదు రోజులు కూడా ప్రతి రోజు స్వామికి టెలిగ్రామ్ లేదా ఫాక్స్ పంపించే వాళ్లం. స్వామికి ఉత్తరం వ్రాసుకునే వాళ్లం. స్వామి దగ్గరికి వెళ్లాలనే విరహంతో అందరం కూడా బయలుదేరుతున్నాం. కొద్ది మంది స్థానికంగా మాతో పాటు చురుకుగా పాల్గొన్న యువకులను కూడా కలుపుకున్నాం. ఆ సమయంలో భాస్కర్ సేటు వచ్చారు. అయ్యా! మీరందరూ స్వామి దగ్గరికి వెళ్తున్నారు. నా జీవితంలో ఇప్పటి దాకా స్వామి పాద నమస్కారం కూడా దొరకలేదయ్యా! కనీసం స్వామిని దగ్గర నుంచి కూడా ఎప్పుడు చూడలేదయ్యా! నన్ను కూడా మీతో పాటు తీసుకెళ్లండయ్యా అని అడిగినారు. వారి మాటలు విని మాకు చాలా బాధ అయింది. అయ్యో! మేమందరము యువకులము కదా, పెద్ద వాళ్లను తీసుకెళ్లడం కుదరదు కానీ మీ అబ్బాయి నరేష్ ఉన్నాడు కదా, తనను తీసుకెళ్తామని చెప్పాము. ఇక వారు బాధా పరితప్త హృదయంతో మాకు వీడుకోలు పలికారు.

మేమంతా పుట్టపర్తికి వెళ్లాము. స్వామి మాకు ఇంటర్వ్యూ ఇస్తారని సూచన ఇస్తున్నారు. వాతావరణం అంతా చాలా ఉత్సాహంగా ఉద్విగ్నంగా ఉంది. స్వామి వారు ఆ రోజు మధ్యాహ్నం మమ్మల్ని పిలుస్తారనే సందేశం వచ్చింది. అందరం కూడా రెడీ అయిపోయి ఉన్నాం. ఆ సమయంలో గజ్వేల్ నుండి టెలిగ్రామ్ ద్వారా ఒక సందేశం అందుకున్నాము, పెద్దలు శ్రీమాన్ భాస్కర్ సేటు చివరి శ్వాస విడిచారని విన్నాము. ఉన్నట్టుండి వాతావరణము నిస్సత్తువై పోయింది.

ఆ ప్రేమ స్వరూపుడు, స్వామి భక్తుడు, మమ్మల్ని అక్కున చేర్చుకొని లాలించిన వాడు, మా కడుపు నిండా భోజనం పెట్టిన వాడు, మాతో పాటు చెయ్యి చెయ్యి కలిపి సేవ చేసిన వాడు, మేము బయలుదేరి వచ్చిన మరుసటి రోజురాత్రి చాలా నీరసం అయిపోయి, స్వామిని తలుచుకుంటూ చివరి శ్వాస విడిచారట. మాతో పాటు వచ్చిన వారి అబ్బాయికి ఈ విషయం తెలియజేయాలి, కానీ స్వామి ఇంటర్వ్యూ అవకాశం ఇస్తున్నారు. పాపం చిన్న అబ్బాయి, కొత్తగా వచ్చాడు టీంలోకి, ఆ అబ్బాయికి చెప్తే వెళ్లిపోతాడేమో అని దాన్ని అలా ఇలా ఏదో కొద్దిగా సీరియస్‌గా ఉందయ్యా అని చూచాయగా చెప్పడమా? వద్దా? అని తికమక పడ్డారు అందరూ. చివరికి, నరేష్‌కు స్వామి అనుగ్రహము అందేలా చేయాలి అని నిర్ణయించారు. తండ్రి పోయిన తనకు... స్వామిని తండ్రిగా పరిచయం చేద్దాము అని అనుకొని, అతనికి పూర్తి వివరాలు చెప్పకుండా ఇంటర్వ్యూకి సిద్ధం చేశాం. లోపలికి వెళ్లిన తర్వాత, స్వామి ముందరే కూర్చున్న సోదరులు, టెలిగ్రామ్ స్వామికి చూపించారు, "బంగారు! ఏం చేయాలో మీరు చూసుకోండి బంగారు! అతను నాలోనే ఉన్నాడు, నాతోనే ఉన్నాడు". అని చెప్పారు. అసలు ఏమి జరుగుతుందో తెలియక, ఆ అబ్బాయి అయోమయంలో ఉన్నాడు. తర్వాత, నరేష్‌కి విషయము చూచాయిగా చెప్పి దగ్గరుండి బస్సు ఎక్కించాము. వారి తండ్రి అంతిమ యాత్రలో అయినా పాల్గొంటాడు అన్న ఆలోచనతో.

ఇదంతా చెప్తుంటే నాకు ఏమనిపిస్తుంది అంటే... సేవాకార్యంలో ఉండే ఎవరైనా సరే, కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా, దుఃఖమే వచ్చినా, ఏది వచ్చినా సరే... సేవను మాత్రం విడవద్దు స్వామిని మాత్రం మరవద్దు.

మరో ప్రక్క స్వామి అందరికీ భజన అవకాశం ఇచ్చారు. భజన మందిరంలో మేమంతా కూర్చున్న సమయంలో, ఉన్నట్టుండి స్వామి వచ్చి వైసీ ముందు నిలబడి అడిగారు "ఏయ్ నీ WATCH ఎక్కడ?" అని. స్వామీ! అది పోయింది స్వామి అంటే... వెంటనే స్వామి హస్తచాలనం చేత మరొక చేతి గడియారం సృష్టించి వైసీకి ఇచ్చారు.

మేము ఓంకార మందిరంలో స్వామి ముందే కూర్చుని చక్కగా భజనలు చేసాము. అలా ఎన్నెన్నో అనుభూతులతో మా పర్తి యాత్ర జరిగింది.

మెదక్ జిల్లాలో చేసిన ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా అద్భుతమైన వ్యక్తులు మాకు పరిచయం అయ్యారు. నేను అక్కడ గ్రామాలలో చెప్పే వాడిని. 'గజ్వేల్' అంటే ఏనుగు లాంటి శక్తి ఉన్నవాళ్లు. Gaja అంటే ఏనుగు, Well అంటే మంచి. అంటే ఏనుగు శక్తి యుక్తులతో స్వామికై మంచి పని చేసేవాళ్లు, ఉన్నటువంటి సమూహము.

మెదక్ అంటే, భక్తి ప్రపత్తులతో సేవా దృక్పథముతో సేవ చేసే వాళ్లకే స్వామి దక్కుతాడయ్యా అని చెప్పే వాడిని. నన్నెంతో ప్రేమించిన, నాకెన్నో పాఠాలు నేర్పిన గజ్వేల్ సాయి భక్తులకు నమస్సులు అర్పిస్తున్నాను.

74

ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం

1993 సంవత్సరం అనుకుంటా, హైదరాబాద్ పిల్లలు స్వామిని దర్శించి ఆశీర్వాదాలు పొందడానికి హైదరాబాద్ నుండి బైకులపై ప్రశాంతి నిలయానికి వెళ్తున్న సమయంలో, ఒకసారి కర్నూలు సమీపంలో జాతీయ రహదారిపై చీకటి పడటం వలన ఆగిపోవలసి వచ్చింది. అక్కడ ప్రధాన రహదారి నుండి లోపలికి టాంగాలు వెళ్తున్నాయి. ఏమిటి టాంగాలు? ఎక్కడికి వెళ్తున్నాయి? ఏముంది లోపల? ఏదో చిన్న గ్రామం ఉండొచ్చు. వెళ్లి చూద్దాం కదా అని చెప్పి ఆ సోదరులంతా కూడా బైక్స్ మీద గ్రామం దాకా వెళ్లారు. ఆ గ్రామం పేరు బోరవెల్లి. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న అతి మారుమూల గ్రామము. చాలా వెనకబడిన ప్రాంతం, అమాయకమైన ప్రజలు. చాలా ప్రేమానురాగాలతో ఉండే గ్రామస్థులు. వెళ్లిన పిల్లలను చూసి, చాలా సంతోషపడ్డారు. ఉన్న దానిలో ఆతిథ్యం ఇచ్చారు.

అప్పుడు అనుకున్నారు, మను ముందు ఇటు వైపు ఎప్పుడు వచ్చినా, ఈ గ్రామంలో సేవ చేయాలి అని. అలా గత మూడున్నర దశాబ్దాలుగా మేము బస్సులో వెళ్లినా, బైక్‌లో వెళ్లినా, కారులో వెళ్లినా ఈ గ్రామాన్ని సందర్శించకుండా పోయిన సందర్భం లేదనే చెప్పాలి.

ఆ గ్రామంలో అందరూ మమ్మల్ని పాత రోజుల్లో ఎవరీ పిల్లలు? అని ఉత్సుకతగా చూసే వాళ్లు. తర్వాత తర్వాత ఆ గ్రామంలో ఎప్పుడు వీలవుతే అప్పుడు, ఆ వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు నిర్వహించే వాళ్లము. అంతటితో ఆగలేదు. గ్రామ సేవ ఉద్యమంలో, ఆ గ్రామాన్ని ఒక కేంద్రంగా తీసుకున్నాము. ఆ గ్రామంలో అతి పురాతనమైన చెన్నకేశవాలయము ఉంది. అలాగే ఆ గ్రామంలో అతి పురాతనమైన శివాలయం ఉంది. పచ్చటి పొలాల మధ్య, నాగరికతకు దూరంగా, చాలా సౌమ్యంగా, కష్టపడి పని చేసే వాళ్లందరూ కూడా ఆ గ్రామంలో కనిపిస్తారు.

అలాగా 1996వ సంవత్సరంలో మాకు మొదటి సారి ఆ గ్రామంలో సేవ చేసుకునే అవకాశం వచ్చింది. బాలవికాస్, శివాలయం జీర్ణోద్ధరణ, పశు వైద్య శిబిరం, శిథిలమైన రోడ్ల నిర్మాణం,

చెట్లు నాటడటం ఇదంతా కూడా చేసే వాళ్లము.

అయితే ఆ గ్రామానికి జాతీయ రహదారినుండి రావాలి అన్నా పోవాలి అన్నా, నిలువ నీడ ఉండేది కాదు. ఎండలో మలమల మాడిపోతూ బస్సు కోసం నిలుచునే వాళ్లని మేము చూసాం. అక్కడ ఏదైనా మనం బస్సు షెల్టర్ కడితే బాగుంటుంది అనుకున్నాం. ఇలా చాలానే ఆలోచించే వాళ్లము. ఎందుకో తెలియని అనుబంధం ఏర్పడింది ఆ గ్రామంతో.

మిగతా గ్రామాలకు వెళ్లినా, వెళ్లకున్నా గత దశాబ్ద కాలంలో లెక్క లేనన్ని సార్లు బోరవెల్లి గ్రామానికి మాత్రం వెళ్లడం జరిగింది.

2000 సంవత్సరం అనుకుంటాను. ఆ గ్రామంలో ఇంకా అద్భుతమైన పనులు చేయాలని ఆలోచిస్తూ, వ్యూహాత్మకంగా ఆలోచించే వాళ్లం. అలాంటి సమయంలో, ఒక సారి స్వామి వారు "బంగారు! ఆ గ్రామంలో కొంత, ఈ గ్రామంలో కొంత చేస్తే ఎక్కడా పరిపూర్ణమైన పరివర్తన రాదు. కాబట్టి మీరు అంతా కలిసి ఒక గ్రామం మీద పని చేయండి. అప్పుడు దాంట్లో ఒక ఆదర్శ గ్రామ నిర్మాణం చేయొచ్చు" అనే సూచన ప్రాయమైన సంభాషణ జరిగింది.

ఇక దాన్ని తలలోకి కాదు, హృదయంలోకి కాదు, శరీరంలో నరనరాన, కణ కణములో ఎక్కించుకున్నారు హైదరాబాద్ యూత్. అలా స్వామి దయ వలన "శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామ నిర్మాణ పథకము" రచించాం.

అందులో భాగంగా ప్రధానంగా దైవ మందిరం ఉండాలి. అక్కడ రోజు వారి కార్యక్రమాలతో పాటుగా భజన జరగాలి. చిన్న పిల్లలందరికీ కూడా ఆరోగ్యం పారిశుభ్రతను గురించిన పాఠాలు బోధించాలి. ప్రభుత్వ పాఠశాల భవనంకి సరైన సదుపాయం కల్పించాలి. జనాలు కూర్చొని మాట్లాడడానికి రచ్చబండ బాగా శిధిలమైపోయింది, అది బాగు చేయాలి. ఊరిలోకి వచ్చే బస్సులు గాని, షేరింగ్ ఆటోలు గాని, జట్కాలు గాని, ఆగడానికి గ్రామస్తులు వేచి ఉండేందుకు ఒక విశ్రాంతి మందిరం నిర్మాణం చేయాలి. కరెంటు కూడా సరిగ్గా లేనటువంటి ఆ గ్రామంలో సౌర విద్యుత్తుతో వెలిగే వీధి దీపాలు తెప్పించాలి. స్వామి చెప్పిన ఔషధ మొక్కలు ఇంటింటా పంచాలి. గ్రామంలో చైతన్యము రావాలి. గ్రామంలో పిల్లలని నాయకులుగా తీర్చి దిద్దాలి. వాళ్లని ప్రశాంతి సేవకులుగా మార్చాలి అన్న ఆలోచనలు చేశాము.

ఎట్లా చేయాలి? ఏం చేయాలని? ఈ పథకం పైన 5 సంవత్సరాలు పని చేశాం. చాలా సూక్ష్మమైన ప్రణాళికతో, చాలా వినూత్నమైన ఆలోచనలతో, ప్రతిసారి స్వామికి చెప్పేవాళ్లం. వారు చాలా సంతోషించే వారు.

ఒక సందర్భంలో, 'స్వామి! ఈ గ్రామంలో మేము నీటి శుద్ధి పరికరాలు ఇస్తున్నాము' అంటే "బంగారు! ఇచ్చిన తర్వాత చెప్పండి, నా దగ్గరికి వందల మంది వస్తూ ఉంటారు. అది చేస్తాం, ఇది చేస్తామని చెబుతూ. నాకు నచ్చదు బంగారు, చేసిన తర్వాత చెప్పండి సంతోష పడతాను." అన్నారు. తర్వాత కొన్నేళ్లకు అక్కడ ఒక వాటర్ ప్లాంటే పెట్టాము. దీని ద్వారా కొన్ని లక్షల రూపాయలను పోగు చేసుకుని గ్రామ సాధికారతను సాధించారు.

సుమారు 15 లక్షల రూపాయలతో ప్రధాన రహదారిపై బస్ షెల్టర్ కట్టగలిగాము. సుమారు మూడు నాలుగు నెలల పాటు హైదరాబాద్ యువత ఉద్యోగాలు ముగించుకుని రాత్రి వేళల్లో వెళ్లి అక్కడ పని చేసి, ఇటుకలు అమర్చి, సిమెంట్ వేసి, కాస్టింగ్ చేసి నిర్మాణం పూర్తి చేశారు. చివరగా స్వామి చిత్ర పటంతో బస్ షెల్టర్ ప్రారంభోత్సవం చేసుకున్నాము.

నిజం చెప్పాలి అంటే ఆ నాడు యావత్ ఆంధ్రదేశంలో ఇలా ఒక యువజనుల బృందం కంకణం కట్టుకొని ఇంత సూక్ష్మమైన ప్రణాళికతో, ఇంత వివరణాత్మకమైన సేవా కార్యక్రమాలు ఏ గ్రామాల్లో సేవ చేయలేదు.

ఇక ప్రణాళికలో మేము అనుకున్న ప్రతి పని చాలా అంకిత భావంతో పూర్తి చేశాము. బస్ షెల్టర్ కట్టడం, శివాలయం జీర్ణోద్ధరణ చేయడము, చెన్నకేశవ స్వామి ఆలయానికి రంగులు వేయడము, అక్కడ పక్క గ్రామానికి కాలువ వల్ల రోడ్డు తెగిపోతే ఆ గ్రామానికి ఈ గ్రామానికి సమన్వయం చేయడానికి అక్కడ రోడ్డు వేయడము, మంచి నీళ్లకి ఇబ్బంది అని స్వామికి చెప్తే "బంగారు! ఆ మంచి నీళ్లు తప్పకుండా నేను ఇస్తానని" చెప్పడము. దాని తర్వాత RO Plant ఏర్పాటు చేయడము. రచ్చబండ కట్టడము, పశువైద్య శిబిరము, వైద్య శిబిరము చేయడం. సౌర విద్యుత్ వీధి దీపాలు, ఔషధమొక్కలు ఇలా ఎన్నో చేయడం జరిగింది. ఒక ఆదర్శ గ్రామం ఆవిష్కరించ బడింది.

మాతో స్వామి చేయించిన సేవల వలన ఆ గ్రామం అంతా ఉత్సాహంతో పొంగి పోయింది. స్వామి దయతో ఆ గ్రామస్తుల హృదయాలను గెలుచుకున్నాము. తదాదిగా సేవలు ఉన్నప్పుడు మిగతా ఊళ్ల నుండి ప్రశాంతి సేవలకి 5 మందో 10 మందో వస్తే, ఈ గ్రామం నుండి మాత్రం సుమారు 20–30 మంది స్వామి వారి సేవకు వెళ్లేవాళ్లు.

చాలా సాధారణమైన జీవితం గడిపే గ్రామస్థులందరూ కూడా, పుట్టపర్తికి వెళ్లాలని పొదుపు చేసుకుని, ఆ డబ్బులతో సేవలకు వచ్చే వాళ్లు. ప్రశాంతి నిలయంలో చాలా మంది చూసి ఉంటారు, భుజాల మీద నీటి ట్యాంకులు పెట్టుకొని ("సత్యసాయి సుజల శ్రవంతి పథకము") వాళ్లు, మహబూబ్ నగర్ జిల్లాకి స్వామి నీళ్లు ఇచ్చారు, అనంతపూరం జిల్లాకు నీళ్లు ఇచ్చారు, మేము సేవకులుగా ఇక్కడికి వచ్చే లక్షల మందిలో కొద్ది మందికి నీళ్లు ఇవ్వలేమా? అంటూ, ఆ చిన్న కాన్స్‌లో నీళ్లు నింపుకొని, ఓ చిన్న పైపు, చిన్నగ్లాస్ పెట్టుకొని ప్రశాంతి నిలయంలో అంతా కూడా ఎక్కడ కార్యక్రమాలు జరిగితే అక్కడ తిరిగి వాళ్లందరూ అందరికీ నీళ్లు ఇచ్చేది మీరు చూసి ఉంటారు. ఆ సేవాదళ్ అంతా కూడా బోరవెల్లి గ్రామం నుండే వస్తుండే వారు.

నేను ఎప్పుడు చెప్తుంటాను బోరవెల్లి అంటే "Bore Well" అని చెప్తాను. బోరవెల్లి కాదు. బోర్ మనము కొడుతు ఉన్నంత దాకా నీళ్లు వస్తాయి అలాగే సేవ చేస్తుంటే స్వామి అనుగ్రహం వర్షిస్తూనే ఉంటుంది. తర్వాత అది పరిపూర్ణమైన తర్వాత, డాక్టర్ జి నరసింహారావు గారు, రాష్ట్ర అధ్యక్షులు, ఇతర జిల్లా అధ్యక్షులు మరియు వందలాది మంది సాయి భక్తులు, ఆ గ్రామానికి రావడం, వారి సమక్షంలో అక్కడ ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించడము, ఆ సభ కార్యక్రమం జరగడము ఇదంతా కూడా ఈ గ్రామాభివృద్ధి కార్యక్రమంలో ఒక తలమానికంగా నిలిచింది. బోరవెల్లిని ఆదర్శ గ్రామముగ యావత్ ఆంధ్రదేశంలోని జిల్లాల అధ్యక్షులు, జిల్లాల కార్యవర్గ సభ్యులు, సమితి కన్వీనర్లు వచ్చి చూడడము, ఇట్లాగ మనం కూడా చేయాలి అనే పూర్ణోత్సాహంతో వెళ్లడము జరిగిందండి. ఆదర్శ గ్రామ ప్రారంభానికి ఆంధ్ర రాష్ట్ర సత్య సాయి సంస్థల అధ్యక్షులు డా. జి. నర్సింగరావు మరియు ఇతర పెద్దలు వచ్చారంటే, ఈ కార్యక్రమ ఎందరి మనసులు గెలుచుకుంది అన్నది మనం ఊహించవచ్చు.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే? కేవలము గ్రామాలలో ఒక రోజు పని చేయడం కాదు, దాని వల్ల అక్కడ మళ్లీ రోగం రాదా? వస్తుంది. నష్టం రాదా? వస్తుంది. కానీ రోగం వచ్చినా, కష్టం

వచ్చినా, నష్టం వచ్చినా, ఎదుర్కొనే సత్తా, దమ్ము, ధైర్యము ఈ గ్రామస్తులకు కల్పించాలి. దాన్ని మనము చూపించాలి అన్న ఆలోచనతో, స్వామి ఇచ్చిన ఉత్సాహ ప్రోత్సాహములతో, అలుపెరగక, ఎల్లులు ఎరగని ప్రేమతో, ఉద్యమోత్సాహముతో, ఈ బోరవెల్లి గ్రామంలో మేమందరం కూడా పని చేసాము. ఇది హైదరాబాద్ యువత హృదయానికి దగ్గరగా ఉన్న గ్రామంగా మారిపోయింది. ఎన్నో అద్భుతమైన విషయాలు, ఎన్నెన్నో అద్భుతమైన అనుభవాలు, స్వామి మా అందరికీ ఇచ్చారు. ఈ విశేషాలని మీ ముందు ఉంచుతూ ఈ వ్యాసం ముగిస్తున్నాను.

75

స్వామి దయతో హృదయం పొంగి పాటలు పల్లవించాయి!

స్వామి వారి దివ్యావతార కార్యములో నన్ను నేను జోడించుకున్న సమయం నుండి నేటి దాకా అంటే నాలుగు దశాబ్దములుగా ఎన్నెన్నో విశేషాలు, ఎన్నెన్నో అవకాశాలు, ఎన్నెన్నో సందేశాలు, ఎన్నెన్నో అనుభవాలు, ఎన్నెన్నో అనుభూతులు ఈ జీవితాన్ని పునీతం చేశాయి అనటంలో ఎట్టి సందేహము లేదు.

ఆటైనా, మాటైనా, పాటైనా, సాహిత్యమైన, అక్షరాలైనా, గీతలైనా, గీతాలైన, రాతలైనా, తల రాతలైనా, దేన్నైనా సరే పరివర్తనము చేసే పవిత్రమైన శక్తి శ్రీ సత్య సాయి కార్యానికి ఉంది అని నేను దృఢంగా నమ్ముతాను. కారణం ఏంటంటే, చిన్ననాడు కేవలం భగవద్గీత శ్లోకాలకి, దైనందిక ప్రార్థనలకి పరిమితమైన నేను, నా హృదయము... సాయి మార్గంలో పయనించడం మొదలు పెట్టిన తర్వాత, స్వామితో నన్ను నేను జోడించుకున్న తర్వాత, భగవాన్ బాబా వారి దివ్యానుగ్రహానికి పాత్రుడైన తర్వాత, పలికింది అంతా పాటగా మారిపోయింది... కనింది అంతా కవితగా మారి పోయింది అనటంలో అసలు అతిశయోక్తి లేదని చెప్పాలి.

నానోటి నుంచి వచ్చిన ప్రతిదీ స్వామి పలికించినదే అని నమ్ముతాను. చాలా సార్లు నన్ను మాత్రమే కాక చుట్టు ఉన్న వందల వేల మందిని ఉత్సాహ పరిచినటువంటి కొన్ని పాటలు, భజనలు ఉన్నాయి. ఆ భజనలు నన్ను స్వామితో సంధింప చేసు కోవడానికి ఉపయోగపడ్డాయి. కానీ తర్వాత కాలంలో అదే భజనలు యావత్ భక్తులని కూడా ఉర్రూతలూగించేవిగా మారిపోయాయి.

ఆంజనేయ వీర హనుమంత శూర
వాయు కుమార వానర వీర
జై జై రామ్ జై జై రామ్ జై సీతారామ్
జై జై రామ్ జై జై రామ్ జై సాయి రామ్

ఈ పాట చాలా పాతకాలములో నేర్చుకున్నది. తర్వాత కాలంలో నేను ఎక్కడికి వెళ్తే అక్కడ

ఈ పాటతో అరే బాలచంద్ర పాడుతున్నాడు! అంటూ జనాలు నన్ను గుర్తు పట్టుకునే వాళ్లు అన్నమాట!

నాకు బాగా జ్ఞాపకం ఒక రెండుసార్లు ఈ అద్భుతమైన భజనను స్వామి సన్నిధిలో పాడాను. ఆ గొంతెత్తి పాడితే.. ఆ తాళానికి, రాగానికి కూడా అందనంత స్థాయికి వెళ్లిపోయింది ప్రశాంతి నిలయంలో. చాలా మంది 'అయ్యో! ఇదేంటి ఇట్లా పాడుతున్నాడు' అనుకున్నారు. మనకి అదంతా పట్టలేదు. స్వామిని ముందర చూస్తూ ఉంటే పాట అలా ఆరున్నొక్క రాగంలో వెళ్లిపోయింది. ఎందుకంటే, ఈ పాట మొదటి సారి పాడుతుంటే ఆనందంతో నన్ను నేను మరచిపోయాను.

స్వామి సన్నిధిలో కొట్టే జయకారము, నినాదము, జయ జయ ధ్వనులు, యావత్ సాయి యువతని కూడా మేల్కొలిపే విధంగా ఉండేది.

"రాజాధి రాజ రాజ గంభీర రాజ కుమార రాజ మార్తాండ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక సమర్థ సద్గురు సాయినాథ మహారాజ్ కీ" అంటే కొన్ని వందల గొంతులు కలిసేవి జై జై అంటూ.

రాజాధి రాజా రాజ గంభీర
రాజ కుమారా రాజ మర్తాండ
రాజాధి రాజా రాజ గంభీర
ఆవో ఆవో గాన మనోహర
పంకజ లోచన పర్తి విహార

ఈ పాట వినని సాయి భక్తుడు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ పాట స్వామిని కూడా ఎన్నోసార్లు కదిలించింది. శివరాత్రి భజన అయినా, అఖండ భజన అయినా, ఎప్పుడు అవకాశం దొరికినా, ఏ వేదిక మీదనైనా, ఏ యువజన సమ్మేళనంలో అయినా ఈ పాట లేకుండా భజన ముగియ లేదు అని చెప్పాలి. అంత ఉత్సాహ పరిచేది ఈ పాట

ఈ పాటలన్నీ కూడా చిన్నప్పుడు బాలవికాస్‌లో నేర్చుకున్నవి. ఆ ఉత్సాహం మాత్రం ఊరికే ఉంచక నాతో పాటు జనాలను కూడా ఉరికెత్తించింది.

గ్రామాలలో పల్లకి ఉత్సవం చేస్తున్న సమయంలో! పాడే
దేవుడొస్తున్నాడు రామం భజే
సాయి దేవుడొస్తున్నాడు రామం భజే
ముత్యాల పల్లకిలో... దేవుడొస్తున్నాడు
రతనాల పల్లకిలో... దేవుడొస్తున్నాడు
పుష్పాల పల్లకిలో... దేవుడొస్తున్నాడు
మాహృదయ పల్లకిలో... దేవుడొస్తున్నాడు
దేవుడొస్తున్నాడు రామం భజే
సాయి దేవుడొస్తున్నాడు రామం భజే

హృదయంలో నుంచి పొంగి పొరలే గంగా ప్రవాహంలా, ఆ పల్లకి ఉత్సవం కోసమై నాతో స్వామి వ్రాయించిన అద్భుతమైన భజన ఇది. ఏ గ్రామానికి వెళ్లినా, ఏ పట్టణానికి వెళ్లినా, ఏ వీధికి వెళ్లినా, ఆ వీధి పేరు, ఆ గ్రామం పేరు, ఆ పట్టణం పేరు, ఆ జిల్లా పేరు కలపడము, దాన్ని ఒక పది నిమిషాలు పాడే వాడిని.

1996 స్వామి సన్నిధిలో సోదరుడు వైసీకి స్వామి సన్నిధిలో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు...

ఏం పాట పాడాలి అని చర్చించారు? అందరూ ఏకగ్రీవంగా ఈ పల్లకి పాటను ఎంపిక చేశారు. అలా ఈ పాట స్వామి దగ్గర పాడుకోవడం జరిగింది. మొట్ట మొదటి సారి ఆ విధంగా నేను వ్రాసి స్వరపరచిన పాటల్లో స్వామి సన్నిధికి చేరిన పాటగా నేను దీన్ని గుర్తుంచు కుంటాను.

అలాగే 1995లో స్వామి చెప్పినట్టుగా నీళ్ల ప్రాజెక్ట్ పనులు చేయాలి అన్న సందర్భంలో... ఏ విధంగా జనాల్ని మనము మేలుకొలపాలి అన్న ఆలోచనతో వ్రాసిన పాట తదుపరి కాలంలో గజ్వేలు గ్రామ సేవ చేసి, స్వామి సన్నిధికి వెళితే... ఏం పాట పాడాలి? అని అందరూ మాట్లాడుకుంటే ఈ పాట పాడితే బాగుంటుంది అని చెప్పడము. తర్వాత ఎవరో ఒక సోదరుడు ఇంకో పాట పాడటం మొదలు పెడితే... స్వామి, "ఏయ్ ఎప్పుడు అవే పాత పాటలేనా... కొత్త పాట పాడండి అని" చెప్పడము, అలా వైసి మరియు నేను స్వామి ప్రక్కన నిల్చుని, ఈ పాట పాడటం జరిగింది.

సాయి మాత బిడ్డలం అందరం
సాయి మాత బిడ్డలమే అందరం...
కలసి ఉంటే కలదు సుఖం కలహిస్తే దుఃఖమయం
పరస్పరం ప్రేమిద్దాం పరదూషణ మానేద్దాం
కులభేదాలు వద్దు మనకు భాషా భేదాలు వద్దు
అంటరాని తనం వద్దు అందరం ఒకటిగా ఉందాం

ఈ పాట స్వామి విని ఎంతో సంతోషించింది, దయార్ద్ర హృదయముతో, కరుణారస దృష్టితో "బంగారూ! ఈ పాటలో నా జీవితము, నా సందేశం అంతా ఉంది బంగారు. మీరు ఎక్కడికి వెళితే అక్కడ ఈ పాట పాడండి. ఈ పాట దేశాన్నంతా ఐక్యం చేస్తుంది" అన్నారు.

ఆ తదుపరి ఇప్పుడు సమాధి ఉంది కదా ఆ ప్రదేశంలో, మమ్మల్ని కూర్చోబెట్టి ఐదు నిమిషాల వ్యవధిలో, రెండోసారి సాయి కుల్వంత్ సభా మండపంలో అదే పాటను మా అందరిని మళ్లీ పాడమని ఆదేశించారు.

సుమారు 50 మంది చేరి గొంతెత్తి పాడితే, మాకు ఇరు వైపులా నిలుచున్న సింహ విగ్రహాల మధ్యలో మేము... మా వెనక సింహం లాగా స్వామి నిలబడి, మాతో పాటు ఆ పాటకి అడుగులు కదుపుతూ, తాళము, రాగము కలుపుతున్న దృశ్యం ఇప్పటికీ గుర్తు ఉంటుంది. ఆ పాట పాడినప్పుడు ఇదే కదా జీవిత సారాంశం అనిపించింది.

తర్వాత స్వామి తమ విద్యార్థులను పిలిచి... ఇలాంటి పాటలు మీరు నేర్చుకోవాలి అని చెప్తే, ఆ విద్యార్థులు వచ్చి, బ్రదర్ స్వామి చాలా సంతోషపడ్డారు, ఈ పాట నేర్చుకోమని చెప్పారు అని చెప్తే, నేను ఆ పాట వాళ్లకి వ్రాసి ఇవ్వడం జరిగింది. తర్వాత ఏ సమయంలో నైనా, ఏ సందర్భంలో నైనా సరే... విద్యార్థులు, భక్తులు, యువకులు, యువతలు అందరూ, ఈ పాటని చక్కగా పాడు కుంటున్నారు. దేశవ్యాప్తంగా కాదు, ప్రపంచ వ్యాప్తంగా వెళ్లిన పాటగా నిలిచిపోయింది.

అలాగే జనాల్ని కలపాలి, జనాల్ని కదిలించి జనాల్ని కరిగించాలి, స్వామి చెంతకు నడిపించాలి అన్న ఆలోచనతో వ్రాసిన మరొక పాట...

ఓ ఆంధ్ర యువకుడా లేవోయీ
సత్యసాయిని చూడ పదవోయీ
ఓ ఆంధ్ర యువకుడా లేవోయీ
భారతావనియందే భగవంతుడున్నాడు

అఖిల లోకంబుకే అద్భుతం అయ్యాడు

ఈ పాట స్వామి వ్రాయించుకున్నారు. ఎక్కడ యువజన సమ్మేళనాలు జరిగితే అక్కడ, అందరినీ ఉత్సాహపరిచే విధంగా ఈ పాట పాడటం జరుగుతూ ఉండేది. తర్వాత "మార్పు రావలి" అనే నాటకంలో చివరి భాగంలో ఈ పాట పాడే వాడిని, దాంతో ఆ గ్రామస్థులందరిని చైతన్య పరచడము జరిగేది. ఈ పాట స్వామి దాకా వెళ్లింది. స్వామి, కాలేజీ ఆడిటోరియంలో డ్రామా చేసే అవకాశం ఇచ్చారు. ఆ డ్రామాలో స్వామి ముందర నేను తలకి పాగా చుట్టుకొని ఒక గ్రామస్తుడి లాగా జనాల్లో నుంచి... స్వామి ముందు నుంచే... వేదిక మీదకి వెళ్లి... మైక్ ముందు నిల్చుని "ఓ ఆంధ్ర యువకుడా "పాడడము జరిగింది. ఆ తర్వాత అదే సందర్భంలో మరొక పాట నేను మామూలుగా పాడే పాట, స్వామి సన్నిధిలో అడిగి పాడించుకున్నారు వైసితో.

రామా అనరాదా మరొక్కసారి రామా అనరాదా

రామా అంటే రాగము తొలగును

కృష్ణా అనరాదా మరొక్క సారి కృష్ణా అనరాదా

కృష్ణా అంటే కష్టము తొలగును

అలాగే అప్పుడెప్పుడో గుంతకల్‌లో ఉన్నప్పుడు, సోదరుడు వెంకటేశ్వర రావు పాడుతుంటే విని నేర్చుకున్న పాట ఒకటి నేను ఎప్పుడూ పాడుకునే వాడిని. ఆ తర్వాత హైదరాబాద్ యువతతో చేరిన తర్వాత ఈ పాట చాలా చిరస్మరణీయమై చాలా గుర్తింపు పొందింది. ఎంత గుర్తింపు అంటే అట్లా ఇట్లా కాదు... స్వామి సన్నిధికి కూడా వెళ్లిన పాటగా నిలిచిపోయింది.

స్వామి సన్నిధిలో ఈ భజన పడుతూ మేమంతా నృత్యం చేసిన పాటగా నిలిచిపోయింది.

రాధా నాచే గోపి నాచే నాచే నందకుమార్
యమునా కినారే పాయలు భాజే నాచే నందకుమార్
రాధా నాచే గోపి నాచే నాచే నందకుమార్
తల్లి తండ్రి గురువు నీవే సత్య సాయిబాబా
చల్లని చూపుల మెల్లని నడకల సత్యసాయి బాబా
అక్కడ ఉండే సాయీశ్వరుడే ఇక్కడ ఉన్నాడు
అక్కడ ఇక్కడ ఎక్కడ చూచిన ఒక్కడే ఉన్నాడు

ఈ పాట ఇంటర్వ్యూ రూమ్‌లో పాడుతుంటే, స్వామి మా మధ్యలోకి వచ్చి అలా అలా కదులుతుంటే... మా అన్నయ్య సాయి సుదీప్, స్వామి రెండు చేతులు పట్టుకొని 'రాధా నాచే గోపి నాచే' అంటుంటే... అబ్బా ఆ ఆనందము, ఆ విరహము, ఆ ప్రేమ, ఆ భక్తి పారవస్యము అంతా ఇంత అని చెప్పలేము.

మరొక పాట స్వామి మీద విరహముతో బెంగళూరులో ఉన్నప్పుడు వ్రాయించుకున్నారు. నేను ఎక్కడ చూసినా నువ్వే కనిపిస్తున్నావయ్యా! నన్ను ఎవడూ పిలవట్లేదు, ఎవడూ రమ్మనట్లేదు, ఎక్కడ అవకాశాలు లేవు అని ఏడ్చుకుంటూ నిద్ర లేని రాత్రులు గడుపుతూ ఆ విరహంలో వ్రాసిన భజన, తర్వాత ఎంతో అద్భుతమైన రీతిలో అందరి నోళ్లలో నానింది. నేను ఆ పాట పాడినప్పుడు అందరూ ఉత్సాహపడే వాళ్లు. కారణం ఏంటంటే, ఉత్సాహమును నాలో నేను అనుభవిస్తూ, నాలో నేను స్వామిని చూస్తూ, నోటిలో నామము, హృదయంలో రూపము, కళ్లలో తేజము, ఇవన్నీ కనిపిస్తూ ఉంటే పాడే వాడిని, అందరూ పలుకుతూ ఆనంద పడేవాళ్లు. ఆ పాట కూడా స్వామి దాకా వెళ్లింది.

ఒకానొక ఇంటర్వ్యూలో ఒక పాట ఉంది స్వామి పాడతాము అంటే, "ఇప్పుడు సమయం అయిపోయింది బంగారూ, మధ్యాహ్నం పూర్ణచంద్ర ఆడిటోరియంలో పాడండి." అన్నారు. పూర్ణచంద్ర ఆడిటోరియంలో వేదిక పక్కన, వెనక సైడ్ ఆ ప్రవక్తలు ఉన్న గోడ క్రింద, మేమందరం కూర్చొని, ఎలుగెత్తి పాడిన పాట ఇది

సహస్ర రూప సాయిషా
వేద వేదాంత గుణశీల
నీ చరణం భవ భయ హరణం
నీ స్మరణం సంకట హరణం
నీ దర్శనం సర్వపాప నాశనం
పాద స్పర్శనం పాప విమోచనం

ఎక్కడికి వెళ్లినా నన్నుచూసిన వెంటనే అందరూ అడిగే పాట మరొకటి ఉంది. ఆ పాట పాడినప్పుడు నిజంగా అందరిలో ఉత్సాహము ఉద్యమోత్సాహమయి, శక్తి యుక్తి పరిఢవిల్లేవి. పాడుతున్నప్పుడు నన్ను నేను మరిచిపోయే వాడిని. చుట్టూరా ఉన్న జనమంతా కూడా నృత్యం కూడా చేసేవాళ్లు.

రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్‌కి
అంజని పుత్ర బల భీమ ఆంజనేయ బాలభీమా
బలభీం బలభీం బలభీం బలభీం బలభీం బలభీం బలభీమా

ఈ పాట నాలుగు లైన్లు అందరికీ తెలుసు. కానీ స్వామి కోసం కొంచెం పొడిగించాను.

పర్తి పురీష సాయి రామ పావన పురుష సాయిరామ
సాయి రాం సాయి రాం సాయి రాం సాయి రాం సాయి రాం సాయిరాం సాయిరామా.

మరొక దివ్యమైన భజన నేను ఎప్పుడు పాడుకునే వాడిని. అందరిని కూడా ఉత్సాహపరిచే వాడిని.

శ్రీరంగా శ్రీరంగా రంగ రంగా శ్రీరంగా
శ్రీరంగా శ్రీరంగా రంగ రంగా శ్రీరంగా
కావేరి తటవాస కస్తూరి రంగా
కారుణ్య లావణ్య కరుణాంతరంగా
జయ పాండురంగా ప్రభు పాండు రంగా
జయ పాండురంగా జయ సాయి రంగా

నాకు తెలిసి ఈ పాట సౌందర రాజన్ గారు తమిళనాడులో, చెన్నై వెస్ట్ మాంబలం సాయి సంస్థ కన్వీనర్‌గా ఉండేవారు. ఆరు అడుగుల ఆజానుబాహుడు. ఉత్సాహంగా ఆ భజనలో ఈ పాట పాడుతున్నప్పుడు చాలా సంతోషపడే వాడిని. ఆ పాట నేర్చుకొని నేను ఎక్కడికి వెళితే అక్కడ పాడటం మొదలు పెట్టాను. ఈ పాటలన్నీ కూడా హైదరాబాద్ యువత చేసిన ప్రతి కార్యంలో ప్రతిధ్వనించేవి.

ఇలా చెప్పుకుంటూ పోతే... ఎన్నెన్నో పాటలు, ఎన్నెన్నో భజనలు... స్వామి నా ద్వారా పలికించారు. స్వామి నా ద్వారా జనాల్ని మరిపించారు. స్వామి నా ద్వారా భక్తులందరిని మురిపించారు. ఈ పాటలు పాడినప్పుడు అంతా కూడా అద్భుతమైన స్వామి వారి అనురాగాన్ని గుర్తు చేసుకుంటూ ఉంటాను. స్వామీ! ఈ నా దేహము కనీసం దీనికైనా ఉపయోగపడింది కదా

ఈ దేహం వల్లనే కదా ఇంతైనా ఈ సాయి భక్త ప్రపంచానికి నేను చేయగలిగాను కదా! అని.

ఈ భజన పాటలు ఎప్పుడు విన్నా కూడా, ఈ రోజుకి కూడా... ఎంతో మంది మాట్లాడుతూ ఉంటారు. వాట్సాప్ ద్వారా, facebook ద్వారా, ఫోన్ల ద్వారా, వివిధ మాధ్యమాల ద్వారా, అన్నా! ఈ రోజు రేడియో సాయిలో, ఈ పాట విన్నాం. ఈ భజనలో మేము ఈ పాట పాడుకున్నాం.

చివరికి జర్మీ హాఫర్ అమెరికా నుండి అంతర్జాతీయ యువజన సమ్మేళనంలో తెలుగులో మాట్లాడుతూ, నేను వాడికి నేర్పించిన మాటలు మాట్లాడుతూ, చివరలో సాయి మాత బిడ్డలం పాడితే, స్వామి ఎంతో సంతోషించి వాడికి హస్తచాలనం చేత చక్కటి బంగారు గొలుసు సృష్టించి ఇచ్చారు. అలా ఎన్నో అనుభవాలు.

ఎప్పుడు స్వామిని తలుచుకున్నా ఈ అనుభవాలన్నీ కూడా అలా గుండెల్లో కదులుతూ ఉంటాయి. హృదయం అంతా కూడా అలా తీపి భావనతో నిండి పోతుంది. ఇవన్నీ కూడా వ్రాసింది చేసింది నేను కాదు. స్వామి నాతో చేయించారు. ప్రతి ఒక్క పాటకి ఒక అద్భుతమైన నేపథ్యము. ఈ పాటల నేపథ్యాన్ని, ఈ పాటల యొక్క సంగతులను, విశేషాలని, ముచ్చటలని నేను ప్రత్యేకంగా facebookలో, you tubeలో అందరితో పంచుకోవడం జరిగింది.

సుమారు 16 పాటలని ఈ విధంగా చేయడం జరిగింది. అన్ని పాటలు కూడా స్వామి సన్నిధిలో పాడినవి, కొన్ని స్వామి నా చేత వ్రాయించినవి, మరికొన్ని నా చేత పలికించినవి, ఇంకొన్ని స్వామి నా చేత పాడించినవి, మరికొన్ని నేర్చుకున్నవి. ఇవన్నీ కూడా ఈ వ్యాసం ద్వారా స్వామి చరణాల వద్ద మరొకసారి అర్పణ చేస్తున్నాను.

76

పాలమూరు యువత పరిమితులు లేని అలంకారాలు

స్వామి అలంకార ప్రియుడు. వారు శ్రమించిన ఏ విషయం అయినా సరే అందులో సృజన ఉంటుంది. అది కట్టడం అయినా సరే చివరకు గాలిలో వేలాడే అట్ట ముక్క అయినా సరే!

స్వామి వారికి Decoration means No Ration అంటే అలంకారానికి పరిమితులు లేని అవకాశం. స్వామి సన్నిధిలో, అలంకారములే సామాన్యుల కళ్లకి పంట. స్వామిని చూడడమే భక్తుల కళ్లకి పంట. ఇక అలంకారం తోడవుతే నిజంగా ఆ ప్రభువు బంగారు కొండలా మెరిసిపోయేవారు. స్వామి చుట్టూ చేసిన అలంకారముల మధ్యలో కూర్చుంటే, సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి కూర్చున్నట్టుగా, ఆ వైకుంఠవాసుడు శ్రీమన్నారాయణుడే వెలసినట్టుగా... ఆ భోలా శంకరుడు ఉన్నట్టుగా భక్తులందరూ కూడా పరవసించి పోయేవారు. అద్భుతమైన అందము, సౌందర్యము, స్వామి చెంత పరిఢవిల్లేది. ఇక అలంకారములకే అలంకారముగా మారి పోయేవారు స్వామి.

ఈ వ్యాసం ద్వారా ఒక అద్భుతమైన బృందం గురించి నేను వ్రాసే ప్రయత్నం చేస్తున్నాను. 1996లో పరిచయమైన గుబ్బ ఈశ్వరయ్య, వారి కుటుంబము నన్ను చాలా ఔన్నత్యంతో, అనురాగంతో, వాత్సల్యంతో, ప్రేమతో దరి చేర్చుకున్నారు. ఈ కుటుంబం స్వామి కార్యానికి నన్ను మరింత దగ్గర చేసింది అని చెప్పాలి. వారి ద్వారా మహబూబ్ నగర్ జిల్లాలో చేసిన ప్రతి కార్యంలో కూడా 1996 నుండి 2010వ సంవత్సరం దాకా సుమారు ఒకటిన్నర దశాబ్ద కాలం పాటు ఎన్నో విశేష సేవా కార్యక్రమాలలో నేను పాల్గొనే అవకాశం నాకు కలిగింది.

ఆ రోజుల్లో కల్వకుర్తి సాయి మందిరములో జరుపుకున్న వినాయక చవితి ఉత్సవాలకు నన్ను పిలిచారు, అలనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రా ప్రభుత్వం నుండి ఊరి మధ్యలో సాయి సంస్థకు ఇచ్చిన స్థలము చదును చేసి, ఒక మూల షెడ్ లాగా వేసి, అందులో వినాయకుడిని కూర్చో పెట్టారు. ప్రస్తుతం ఈ స్థలంలో అద్భుతమైన నిర్మాణాలు చేసి, సకల జనులకు ఉపయోగ పడే విధంగా తీర్చి దిద్ది, సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్‌కు ఇచ్చేశారు. ఆ వినాయక ఉత్సవానికి నేను

వెళ్లాను. అక్కడ కొద్ది మంది యువకులు చాలా ఉత్సాహంగా, భక్తి శ్రద్ధలతో మంచి అలంకారాలు చేయడం గమనించాను. ఈశ్వరయ్య చిన్న తమ్ముడు విద్యా సాగర్ ఎంతో చురుకుగా అందరినీ అలంకార సేవలలో సమన్వయం చేసేది గమనించాను.

పెద్ద కొండలంతా పెట్టేసి, ఆ కొండల మీద మంచు ఉన్నట్టుగా, నీళ్లు పారుతున్నట్టుగా, గంపలతో, ఖాళీ గన్ని బ్యాగులతో, సున్నంతో ఇలా సామాన్యంగా దొరికే వస్తువులతో మంచి సెట్టింగ్ వేసి మధ్యలో వినాయకుడిని కూర్చోబెట్టారు. సహజంగా అలంకారం అంటే నాకు ఇష్టం కాబట్టి, వాళ్లు చేసిన అలంకారాన్ని చూసి నాకు చాలా సంతోషమైంది. 'అరేయ్ ఈ పిల్లల్లో స్ఫూర్తి ఉంది. మనం తప్పకుండా వీరిని ఇంకా ఉత్సాహ పరచాలని చెప్పి, వాళ్లతో మాట్లాడుతున్నప్పుడు చెప్పాను, "అయ్యా! ఇంత మంచి అలంకారాలు చేశారు. మనం దీంట్లో ఇంకా మంచి పరిణితి చెందాలి, నైపుణ్యం తెచ్చుకోవాలి, అప్పుడు స్వామి దగ్గర కూడా అలంకారాలు చేసే సేవావకాశం కోసం ప్రార్థించ వచ్చు" అని. సాగర్ ఎంతో సంతోషించాడు. తప్పక వారి నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటాము అని చెప్పారు.

అలా వాళ్లలో ఉన్న ప్రతిభను గుర్తించి, ఎప్పుడు ఎక్కడ ఏం చేసినా సరే, వాళ్లని భాగస్వాములను చేయడం మొదలు పెట్టాము. హైదరాబాద్‌లో జరిగిన ప్రతి కార్యక్రమంలో కూడా, ఈ పిల్లలందరితో చేరి ప్రాంగణంలో చేయాల్సిన అలంకారములకు పూలు తేవడం, కూర్చడము, అల్లడం, పూల గుత్తులు పెట్టడము, తోరణాలు కట్టడము, బ్యానర్లు కట్టడము, ఇలాంటి సేవలన్నీ చేసేవాళ్లం. చేస్తున్న సమయంలో వారిలో పొంగి పొరలే ఉత్సాహం గమనించే వాడిని. స్వామి కోసం చేయాలనే వారి తపన ఆశ్చర్య పరిచేది. అలాగే పల్లకి అలంకార సేవకులుగా కూడా వచ్చేవారు. అది ఇంతై ఇంతింతై అన్నట్టుగా, ముగ్గురు నలుగురితో కల్వకుర్తిలో ప్రారంభమైన ఆ బృందం అనతి కాలంలో, ఒక పెద్ద బృందంగా మారిపోయింది. ప్రస్తుతం సుమారు 200 మంది ఎప్పుడు కాల్ చేస్తే అప్పుడు వచ్చి సేవించుకునేలాగా తయారయ్యారు.

మొట్ట మొదటిసారి 2004వ సంవత్సరం స్వామి సన్నిధిలో వారి అవతార ప్రకటన మహోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 20వ తేదీన స్వామి వారిని మేమంత ప్రార్థించాము, 'స్వామీ! మీ సమక్షంలో యువజన దినోత్సవాన్ని జరుపుకోవాలని, సాగర్ బృందానికి చెప్పాము, సాయి కుల్వంత్ వేదిక మీద స్వామి సింహాసనం వేసే పరిసరాలు అంతా అలంకారం చేయాలి. సాయి కల్వంత్ సభా ప్రాంగణంలో కూడా అలకరణ చేయాలి, బ్యాక్ డ్రాప్ అంతా తయారు చేయాలని, రేఖా మాత్రమైన చిత్రం ఒకటి గీసుకొని దాని ఆధారంగా పూలు, మాలలు ఇలా అన్ని తెచ్చి డెకరేషన్ చేయాలి అని కానీ స్వామి సంకల్పం ఎట్లా ఉందో తెలియదు. ఎంత ప్రయత్నము చేసిన మేము అనుకున్న కార్యక్రమము జరగలేదు. కానీ అప్పటికే ఎంతో వ్యయప్రయాసలకోర్చి సాగర్ బృందం అంతా అలంకారం సేవల నిమిత్తం ఎన్నో ఏర్పాట్లు చేశారు. అలంకారం మాత్రం చేసుకోలేక పోవడం అన్నది ఒక శరాఘాతంలా తగిలింది వాళ్లకు.

మహబూబ్ నగర్ జిల్లాలో ఎన్నో గ్రామాల నుండి వచ్చిన వీళ్లు, సామాన్యమైన కుటుంబాల నుంచి వచ్చారు, అత్యంత భక్తి ప్రపత్తులతో, స్వామికి చేసుకోవాలనే తపనతో, వాళ్లు ప్రత్యేక వాహనంలో పూలు తెచ్చుకొని, పెద్ద బ్యాక్ డ్రాప్ అంతా తయారు చేసి, రాత్రి పగలు శ్రమకోర్చి ఏర్పాటు చేశారు. కానీ స్వామి సన్నిధిలో కార్యక్రమం జరగలేదు.

నాకు గుర్తుంది, నేను కేవలం బాధ పడ్డాను. కానీ ఈ పిల్లలందరు వెక్కి వెక్కి ఏడ్చారు. 'అన్నా!

మేము ఏం పాపం చేసాము అన్నా? మాకు స్వామి అవకాశం ఇవ్వలేదే? అయ్యో! మేము ఏమైనా తప్పు చేసామా? మా భక్తిలో ఏమైనా తక్కువ ఉందా?' అంటూ వాళ్లు వగచి వగచి ఏడ్చారు. నేను అన్నాను, 'అయ్యా! ఏడవద్దండి, చూస్తూ ఉండండి స్వామి తప్పకుండా మరిన్ని అవకాశాలు మనకి ఇస్తారు. మనం ఇంకా కసితో చేద్దాం, ఇంకా సమర్పణ భావనతో పని చేద్దాం,' అని ఆ పిల్లందరిని దగ్గరికి తీసుకుని, భుజం తట్టి ఏం పర్వాలేదు, ముందుకు వెళ్దాం అని చెప్పాను. ఎవరు కూడా ఈ సంఘటనను ఇక మరచి పోలేదు, అహరహం శ్రమించారు. ఎప్పుడు చేరినా వీళ్లందరూ, అలంకార సేవల గురించి మాట్లాడుకునే వాళ్లు. తమ నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్దుకునే వారు.

2005వ సంవత్సరానికి ఈ బృందం యొక్క ఉత్సాహము అంతా ఇంతా కాదనడానికి ఒక నిదర్శనం జరిగింది. అదేమిటి అంటే.. మొట్ట మొదటిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో, ఉగాది ఉత్సవం స్వామి సన్నిధిలో చేసుకొనే అవకాశం స్వామి వారు ఇచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా సోదరుల గురించి చెప్పడము, పెద్దవాళ్లందరూ ఉత్సాహ పడి, అయ్యా! ఈ పిల్లలు అలంకారం చేస్తే చూద్దాము అని అవకాశం ఇచ్చారు.

స్వామి యొక్క దయ గంగా ప్రవాహంలా పొంగడము, ఈ పిల్లలందరూ కూడా రేయింబవళ్లు పని చేశారు. నాకు గుర్తు వారంతా ఎంతగానో శ్రమించారు. స్వామి దగ్గర ఏం చేస్తే బాగుంటుంది, నూతనంగా చేయాలి, విన్నూత్నంగా ఉండాలి, సృజనాత్మకముగా చేయాలి, నైపుణ్యంతో చేయాలి, తపనతో చేయాలి అన్న సూత్రాలని గుర్తు పెట్టుకొని, ప్రశాంతి నిలయంలో ఏ మూలలో ఏం చేయాలి అన్ని వ్రాసుకున్నాము. ప్రధానంగా ఉగాది కాబట్టి, మామిడి తోరణాలు, అరటి చెట్లు, టెంకాయ బుట్టలు, మామిడి కాయలు, వేపాకు, చెరుకు గడలు ఇలాంటి మంగళ కరమైన వస్తువులతో అలంకారం చేయాలి అనుకున్నాం, ఆ విధంగా ఉగాది 2004లో సత్యసాయి దివ్య సన్నిధిలో ఈ బృందం పూర్తి స్థాయిలో అలంకార సేవలకి శ్రీకారం చుట్టడం జరిగింది.

శ్రీ సత్యసాయి సంస్థలో నేను ఎవరినైనా సేవలు చేసే సమయంలో ప్రేరణగా తీసుకున్నాను అంటే అది విద్యాసాగర్ అని చెప్పాలి. చదువు సంధ్య లేకపోవచ్చు కానీ, హృదయం నిండుగా భక్తి, మనసు నిండుగా సంస్కారము పరిఢవిల్లేదీ అబ్బాయిలో. ఎన్నో అద్భుతమైన అలంకార సేవా కార్యక్రమాలకి శ్రీకారం చుట్టాడు.

ఉగాది పర్వదినము నాడు మేము అందరం చేరి ప్రశాంతి నిలయంలో చేసింది ఏమిటో తెలుసా!? స్వామి నడిచే దారిలో ఇరుప్రక్కలా పూర్ణ కళశాలు పచ్చి టెంకాయలతో పెట్టాము. వెదరు బుట్టల్లో మామిడి ఆకుల మధ్యలో షడ్రుచులకు గుర్తుగా చెరుకు, వేపాకు, చింతకాయలు, మామిడి కాయలు ఇలాంటివి పెట్టాము. మధ్యలో సుందరమైన ఏనుగు బొమ్మలను పెట్టాము. మామిడి తోరణాలతో నిజమైన మామిడికాయలు వేలాడదీశాము. నిలయం అంతా ఆకు పచ్చటి శోభతో నిండి పోయింది. ఇక స్వామి వారు వాటి మధ్యలో వస్తుంటే చూస్తున్న భక్తులు ఎంత ఉత్సాహ పడ్డారో ఇప్పటికీ గుర్తు! అలంకారము చేసిన బృందం అంతా ఆనందభాష్పాలు రాలుస్తూ... అబ్బా! ఈ జన్మకిది చాలు అనుకున్నారు.

పిల్లలు ఒకసారి అలంకారం చేయడం మొదలు పెట్టారంటే, సుమారు 24 గంటల నుంచి 36 గంటల దాకా నిద్రాహారాలు మానేసి ప్రశాంతి నిలయంలో, ఎక్కడ ఎవడికి కనపడకుండా ఎక్కడో దూరంగా ఒక షెడ్లో కూర్చొని నిశ్శబ్దంగా కావలసిన మాలలు, గుత్తులు, అర్చిలు సిద్ధం చేసుకుంటారు. భక్తుల సందడి తగ్గిన తరవాత వందలాది మంది యుద్ధ వీరుల్లాగా బయలుదేరి

రాత్రికి రాత్రి కళ్లు మిరిమిట్లు గొలిపే అలంకారానికి తెరలు తీస్తారు. ఆ దివ్య సౌందర్యం మరుసటి రోజు భక్తులే చూస్తారు. అంతకు ముందు జరిగిన విశేషాలు చాలా మందికి తెలియక పోవచ్చు. కానీ ప్రశాంతి నిలయంలో చేసే ప్రతి అలంకారం వెనుక ఇలాంటి భక్తులు, ఇలాంటి పిల్లలు, ఇలాంటి యువతి యువకులు ఎంతో మంది ఉంటారు. వారి సేవానిరతిని అందరూ గుర్తించి, కొనియాడారు. స్వామి కూడా ఎంతో సంతోషించారు.

ఉగాది రోజు చేసిన ఏ మంచి పనైనా అద్భుతము అవుతుంది అని చెప్తారు కదా! అలా ఉగాదితో మొదలు పెట్టిన సత్య సాయి అలంకార సేవకుల ప్రస్థానము ఈ రోజుకు కూడా సాగుతూనే ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న ఎంతో మంది ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఎవరికీ ఎలాంటి గుర్తింపు లేదు, ఎలాంటి అహంకారము లేదు, కేవలం సేవ చేసుకోవాలని మమకారం, అలంకార సేవల్లో పొందే అనుభవాన్ని ఆనందాన్ని, భక్తులందరికీ పంచాలి. స్వామి మెచ్చే విధంగా అలంకారం చేయాలి అని ఈ పిల్లలందరూ తపించేది నేను చూసాను. ఆ పిల్లల్ని చూస్తే నాకెంతో ఉత్సాహమయ్యేది. ఈ పిల్లలందరికీ కూడా మార్గదర్శనం చేసే అవకాశం స్వామి ఇచ్చారు. ఏ పండగ వచ్చినా సరే, ఆ పిల్లలందరూ నా దగ్గరికి వచ్చేవాళ్లు. అందరం చేరి చాలా ఆలోచనలు, చర్చలు, చేసే వాళ్లం. రేఖా చిత్రాలను గీసి ఇలా చేస్తే బాగుంటుంది, అలా చేస్తే బాగుంటుంది అని ఆలోచించి, ఇది బాగుంది, ఇది చేద్దాం అని చెప్పు కోవడము. అలాగ చేసుకునే వాళ్లు. ప్రతి సంవత్సరం జనవరి 1 నూతన సంవత్సర వేడుకలు, జనవరి 12 క్రీడోత్సవాలు, ఉగాది వేడుకలు, ఈశ్వరమ్మ దినోత్సవము, పర్తి యాత్రలు, దివ్య కళ్యాణములు, సామూహిక వివాహాలు, నవంబర్ 18న జరిగే రథోత్సవము ఇలా ఒక సంవత్సరంలో కనీసం 10 పర్యాయాలు అలంకార సేవలు చేసుకునే భాగ్యం వీరందరికీ కలిగింది. ఎంతో ఉత్సాహంగా చేశారు, ఇప్పటికీ చేస్తున్నారు.

ఈ పిల్లల గురించి నేను చెప్పుకోవడం గర్వంగా భావిస్తాను. వాళ్ల నేపథ్యాలు ఏమిటో తెలుసా కొద్దిమంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్, కొద్ది మంది హార్డ్‌వేర్ ఇంజినీర్స్, కొద్దిమంది పారిశ్రామిక వేత్తలు, కొద్దిమంది వ్యాపారాస్తులు, కొద్ది మంది గృహిణులు, ఇంకా చిన్న పిల్లలు ఇలా అందరూ చేరి ఎట్టి తారతమ్యము లేకుండా, కుల మత ప్రాంతీయ భేదం లేకుండా ఎవడొస్తే వాడిని అక్కున చేర్చుకుని ముందుకు సాగుతున్నారు.

ముగ్గురితో ప్రారంభమైన అలంకార సేవా ప్రస్థానము ప్రస్తుతం 200 మంది సేవకులతో అప్రతిహతంగా సాగుతూనే ఉంది. ఈ రోజు ఒకసారి ఈల వేస్తే 50 మంది పుట్టపర్తికి వచ్చే అద్భుతమైన పరిచయ వలయం ఏర్పాటైంది.

ఇక సాగర్ నేను కలిసి, పెళ్లిళ్ళ కాలంలో సిటీలో వివిధ కళ్యాణ మండపాలకు వెళ్లి అక్కడ అలంకరణ ఎట్లా చేశారు? ఏం మెటీరియల్ ఉపయోగించారు? ఇదంతా చూసే వాళ్లము. స్వామి దగ్గర ఎట్లా చేస్తే బాగుంటుంది అని చర్చించే వాళ్లము.

హైదరాబాద్ ఐతే డబ్బులు ఎక్కువ అవుతాయి అని చెప్పేసి, ఒకరిద్దరు ప్రత్యేకంగా బండి మాట్లాడుకొని ముందు రోజు తెల్లవారు ఝామున బెంగళూరుకి వెళ్లిపోయి, ప్రొద్దున్నే తాజా పూలు స్వామికి తీసుకురావాలని చెప్పేసి, అక్కడి నుండి స్వామి దగ్గరికి తీసుకొచ్చేవాళ్లు.

వీళ్ల గురించి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకునే వాళ్లము. అచ్చం పేట దగ్గర ఉమా మహేశ్వరంలో మేము ఒక రోజు శిక్షణా శిబిరం ఏర్పాటు చేసుకున్నాము. అలంకార సేవకుల శిక్షణా శిబిరం గురించి విన్నారో లేదో నాకు తెలియదు. కానీ నాకు, మహబూబ్‌నగర్ జిల్లా

యువతకు ఇది కొత్త కాదు. అలాగే ఆమనగల్‌లో ఈ అలంకరణ సేవలపై శిక్షణ శిబిరం చేసుకున్నాం. ఎక్కడ వీలైతే అక్కడ వారితో మాట్లాడటం, ఆడటం, పాడటం, వారిని ఉత్సాహపరచడం జరిగింది.

ఒక సారి ఉగాది మహోత్సవం వచ్చింది. ఈ బృందానికి అలంకార సేవ దొరికింది. స్వామి సన్నిధిలో ప్రత్యేకంగా, కొత్తగా, వైవిధ్యంగా చేయాలనే ఉద్దేశంతో, థర్మోకోల్ షీట్లు తీసుకుని వాటిపై ఎంతో చక్కగా కార్వింగ్ చేయించారు. ఆ షీట్లు ఉపయోగించి మామిడి పిందెలు, మామిడి కాయలు, మామిడి ఆకులు, పూర్ణ కుంభం, చెరుకు గడలు వంటి ఉగాది సూచకాలను అందంగా రూపకల్పన చేశారు. వాటిని మామిడి హృదయాకారం, చక్రాకారం నమూనాలను గాలిలో వేలాడ దీశే హ్యాంగింగ్స్‌లా తయారు చేసి, స్వామి వారి ముందున్న ఇత్తడి రైలింగ్‌కు వేలాడ కట్టే ప్రయత్నం చేశారు.

నాకు గుర్తు, నిలయంలో ఈ అలంకార సేవలు పర్యవేక్షించే అతను అభ్యంతరం వ్యక్తం చేశారు: "అయ్యో, ఇలా మీరు కట్టొద్దు. ఇలా హ్యాంగింగ్స్ పెడితే, స్వామి దగ్గర ఉన్నవారికి వారు పూర్తిగా కనబడరు, దూరం ఉన్నవారికి ఇది అడ్డం అవుతుంది," అని చెప్పారు.

మేమేమో ఏదోలా సర్దుబాటు చేసుకుని, హ్యాంగింగ్స్‌ను స్వామి ఉన్న ప్రదేశానికి అడ్డం కాకుండా, రెండు వైపులా, కొంచెం ఎడంగా కట్టేశాం. అయినప్పటికీ, ఆ సమయంలో మమ్మల్ని బాగా మందలించారు. దాంతో పిల్లలంతా చాలా నిరుత్సాహానికి గురయ్యారు.

స్వామి దర్శనానికి వచ్చారు, వేదిక మీదకు చక్రాల కుర్చీలో తీసుకుని వచ్చారు. అప్పుడు ఒక సంఘటన జరిగింది. స్వామి కూర్చున్న ఐదు నిమిషాల తర్వాత, ఆ ముందర కట్టిన థెర్మోకోల్ హ్యాంగింగ్స్ వైపు చూపించి, "ఏంటిది?" అని అడిగారు.

అప్పుడు అక్కడున్న స్వామి అంతరంగికుడు, దానికి కట్టిన దారాన్ని విడదీసి స్వామి చేతిలో పెట్టారు. స్వామి దాన్ని చూసి ఒక చిన్న పిల్లాడిలా అటూ ఇటూ తిప్పుతూ సంబర పడ్డారు. ఆ తర్వాత దానిని మళ్లీ అక్కడే పెట్టేశారు. ఈ దృశ్యం స్వయంగా చూసిన అలంకార సేవకులందరికీ అది ఆ రోజు జీవితాంతం మరిచిపోలేనిదిగా నిలిచిపోయింది. అసలు ఆ హాంగింగ్ మొత్తం నిలయంలో చేసిన అలంకార వస్తువులలో అతి చిన్నది, అది కూడా కట్టొద్దు అని చెప్పింది, అలాంటిది స్వామి వారి చేతుల్లో తీసుకుని సంబర పడ్డారు అంటే ఏమనుకోవాలి?

అలాగే, అలంకార సేవలకు అవకాశం వచ్చినప్పుడల్లా, మేము హైదరాబాద్ లోని బజార్లన్నీ తిరుగుతూ, ఎక్కడైనా మంచి అలంకార వస్తువులు దొరికితే, ఆ వస్తువులను తీసుకుని స్వామి దగ్గర సమర్పించాలని ఉత్సాహంగా ఉండేవాళ్లం. అలా కళశాలు, దీప కాంతలు, పెద్ద ఏనుగు బొమ్మలు తీసుకుని వెళ్లాము. అలా మార్కెట్‌లో తిరుగుతున్నప్పుడు పూలగుత్తులు పెట్టే కళాత్మకమైన కుండీలు చూసి ముచ్చట పడి వాటిని స్వామి దగ్గరకి ఎందుకు తీసుకెళ్లకూడదు? స్వామి సింహాసనం ఇరువైపులా వీటిని పెడితే బాగుంటుందని తలచి కొనేసాము. చాలా జాగ్రత్తగా స్వామి పై మా ప్రేమని కూడా దాంట్లో ప్యాక్ చేసి, స్వామికి అర్పించాలన్న భక్తి విశ్వాసాలతో వాటిని నిలయానికి తీసుకెళ్లాం. కార్యక్రమం అయిన తర్వాత, వస్తువులన్నీ సర్దుతూ ఉంటే, మందిరంలో ఉన్న వాళ్లు ఒక విషయం చెప్పారు. "అయ్యా! ఈ కుండీలను చూసి స్వామి చాలా సంతోషపడ్డారు, స్వామికి నచ్చాయి. తీసుకుని వెళ్లి యజుర్ మందిరంలో పెట్టండి" అని. ఈ మాటలు విన్నప్పుడు ఎంత ఉత్సాహం వచ్చిందంటే, అబ్బా! మేము ఎంతో మక్కువగా తెచ్చిన ఆ పూల కుండీలు స్వామికి నచ్చాయి కదా... జీవితంలో ఇలాగే అలంకార సేవలు స్వామికి నచ్చే విధంగా చేసుకోవాలి అనుకున్నారు. ఇలాగ ఎన్నో సార్లు ఈ బృందం తీసుకువెళ్లిన అలంకార వస్తువులు స్వామి అనుగ్రహానికి నోచుకున్నాయి.

పర్వదినాలలో ఈ అలంకార బృందాన్ని ప్రత్యేకంగా దర్శనములో కూర్చో బెడతారు. గత 15 ఏళ్లుగా ఎంతో మంది అలంకార సేవకులకు స్వామి సన్నిధిలో మంగళ హారతి, గ్రీటింగ్స్, పువ్వులు, సుగంధ ద్రవ్యాలు, డ్రైఫ్రూట్స్ ఇచ్చే అవకాశం వచ్చింది.

ఇంతకు ముందు సేవలు చేసుకున్న తర్వాత ఎవరింటికి వాళ్లు వెళ్లి పోయేవాళ్లు. ఎందుకంటే సేవాదళ్ అంటే కనీసం 7 రోజులు ఉండాలి కదా, కానీ అలంకార సేవకులు మాత్రం మూడు రోజులు మహా అయితే నాలుగు రోజులు ఉండే వాళ్లు. అప్పటికి ప్రత్యేకంగా కూర్చోబెట్టే అవకాశం లేక పోయింది.

ఈ సందర్భంలో ప్రత్యేకంగా ప్రస్తావించదగ్గ విషయం ఏమిటంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాయి సంస్థల అధ్యక్షులు SG చలం, వారి సేవలను గుర్తించి ఉత్సాహ ప్రోత్సాహాలు అందించారు. పిల్లలు ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా పిలిచి, అందరినీ ప్రత్యేకంగా కూర్చోబెట్టి, స్వామి సమీపం నుండి దర్శనం దక్కేలా ప్రయత్నం చేశారు.

అలాగే, కొన్ని సందర్భాల్లో రత్నాకర్ గారు ఈ బృందాన్ని అలంకరణ కోసం స్వయంగా పిలవడం నేను గమనించాను. సత్యసాయి పూర్వ విద్యార్థుల బృందం, సత్యసాయి ట్రస్ట్ (ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ), అలాగే సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఇలా అందరూ అలంకార బృందాన్ని పిలిచి, వారి కృషిని గుర్తించి వారికి ఎన్నో అలంకార సేవలను కల్పించి ఉత్సాహ పరిచారు. స్వామి సమక్షంలో సేవ దొరుకుతుందన్న ఉత్సాహంతో, వారు ఎంతో దూరాల నుండి ప్రయాణం చేసి, వ్యయ ప్రయాసలకోర్చి, నిస్వార్థంగా సేవ చేయడానికి వచ్చేవారు. కొద్ది మందికి ఆర్థిక ఇబ్బందులు, ఇంకొందరికి ఉద్యోగ సమస్యలు, మరికొందరికి కుటుంబ సమస్యలు... ఏది ఏమైనా అలంకార సేవలు మాత్రం విడువలేదు.

స్వామి సన్నిధిలో ఈ పిల్లలందరినీ చూస్తే, హృదయం అంతా ద్రవించి పోతుంది. నా వయసు అయిపోయింది. కానీ ఈ పిల్లలు నీకు చేసుకుంటున్నారు కదా స్వామి! ఈ పిల్లల చేతుల్లో నా చేతులను చూస్తున్నాను స్వామీ! మీ సన్నిధిలో వాళ్లు నిలబడి ఫోటోలు తీసుకుంటూ ఉంటే నేనే నిలబడినట్టుగా భావిస్తున్నాను స్వామి అని నేను చెప్పుకుంటాను. ఈ రోజుల్లో అక్కడ వాళ్లు లేని అలంకారం లేదు. ఈ బృందం ఎల్లప్పుడూ నా హృదయానికి దగ్గరగా, నాకెంతో ప్రత్యేకంగా అనిపించే బృందం. స్వామి ఇచ్చిన అవకాశాల్లో దివ్యమైన అలంకార సేవా అవకాశము మహోన్నతమైనదిగా నేను చెప్పుకుంటాను.

ఈ సందర్భంగా ఆ పిల్లలందరిని గుర్తు చేసుకుంటున్నాను. వాళ్లు చేసిన సేవలు అంతా ఇంతా కాదు. ప్రశాంతి నిలయానికి రంగులు అద్దిన వాళ్లు, ప్రశాంతి నిలయానికి అలంకారం చేసిన వాళ్లు, సత్యసాయి నాథుని దివ్య అలంకార సేవల్లో తమ పాత్రలని బహు ఆనందంగా పోషించిన వీళ్లందరికీ కూడా నేను శిరము వంచి అభివాదం చేస్తున్నాను.

ఇలాంటి వాళ్లని పరిచయం చేసిన స్వామికి నేను సదా ఋణపడి ఉంటాను. కేవలం అలంకార సేవకులుగా ఉన్న ఈ పిల్లలలో ఈ రోజు కనీసం 10 మంది అలంకరణనే వృత్తిలా చేసుకున్నారంటే అతిశయోక్తి కాదు.

ప్రస్తుతం పుట్టపర్తిలో రెండు ఫ్లాట్లు అద్దెకు తీసుకొని అందులో అలంకరణ వస్తువులంతా పెట్టినారు. అంటే అంత సరంజామా అయిందన్నమాట. ఎప్పుడైనా సరే, కేవలం 24 గంటలు సమయం ఇచ్చినా ఏ అలంకారం అయినా సరే, చేసే విధంగా వాళ్లు సన్నద్ధంగా ఉన్నారు స్వామి

కార్యంలో. ఆ అలంకార సేవకులకు సాయి సంస్థలో ఒక గుర్తింపు వచ్చింది.

ఇక వీటికి కావలసిన వనరులు అంటారా? చాలా సందర్భాల్లో వీరికి సంస్థలు అందించే వనరులు చాలవు. బృంద నాయకులు నిశ్శబ్దంగా వనరులను సమీకరించి, సేకరించి అందరి కోసమై వినియోగించడం నాకు తెలుసు. అలాంటి భక్తి విశ్వాసాలు చూస్తే... ఎంతో ప్రేరణ కలుగుతుంది.

ఇలాంటి దివ్యావకాశం ప్రసాదించిన స్వామికి నన్ను నేను అర్పించుకోవడం తప్ప నేను ఏం ఇచ్చుకో గలను? ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే కాక తెలుగు రాష్ట్రాలలో ఉన్న అలంకార సేవకులకు శిరము వంచి అభివాదం చేస్తూ, ఈ వ్యాసాన్ని సత్యసాయి అలంకరణ సేవా బృందాలకు అంకితం చేస్తున్నాను.

ప్రస్తుతం స్వామి వారి శతవర్ష బ్రహ్మోత్సవ సందర్భంగా అలంకార బృందంలో సభ్యులై... కొన్ని ప్రదేశాలలో ప్రత్యేక అలంకారాలు చేసే ప్రయత్నం చేస్తున్నారు.

77

నా ప్రసంగాలకు ప్రేరణ శ్రీ సత్య సాయి!

నాలుగు దశాబ్దముల నుండి నలుగురిలో నన్ను నిలబెట్టిన అంశం ఒక్కటే.
నాలుగు చెరుగులలో ఉన్న వారితో నన్ను ఏకము చేసింది ఒక్కటే
భక్తి శ్రద్ధలున్న వారితో నిలువగా నన్ను సిద్ధము చేసింది ఒక్కటే
భగవానుడి దివ్య సన్నిధిలో కూడా నన్ను నిలిపింది ఒక్కటే
భవ బంధముల చెర విడిపోయేలాగా చేసినది ఒక్కటే
భావ వ్యక్తీకరణము... ఇదొక్కటే సేవా మార్గములో వశీకరణ మంత్రము

పుట్టిన వెంటనే నేను చూసిన మొదటి ఉపన్యాసకుడు మా నాన్ననే! వారి వృత్తి ప్రవృత్తుల గురించి ముందు వ్యాసాలలో వివరించాను. నాన్న గారి వాక్ చాతుర్యము, నన్ను చాలా ప్రభావితం చేసింది.

ఇక మాటలే తెలియని చిన్న వయసులో తాడిపత్రిలో హరికథా విద్వాంసులు నరసరాజు భాగవతార్‌ను చూసాను. అద్భుతమైన చాతుర్యంతో వారు హరికథలు చెప్పేవారు. అవి వింటున్నప్పుడు నేను కూడా ఇలాగ మాట్లాడాలి, పద్యాలు పాడాలి, కథలు, విషయాలు చెప్పాలి అనుకునే వాడిని.

ఇక మొదటి తరగతి చదువుతున్నప్పుడు చూసిన అల్లూరి సీతారామరాజు, (కృష్ణ చలన చిత్రము) సినిమా నన్ను బాగా ప్రభావితం చేసింది. ఆయన చేసిన విధంగా ఏకపాత్ర అభినయం నేను అలవోకగా చేసే వాడిని.

7వ తరగతిలో సత్యసాయి బాలవికాస్‌లో చేరిన తదనంతరం, భగవద్గీత, ప్రార్థన శ్లోకములు, భజనలు, పాటలు, ఎలాంటి బిడియమూ భయము లేకుండా చక్కగా చెప్పే నైపుణ్యము నాకు కలిగింది.

1982లో స్వామిని చూసిన మరు క్షణము, స్వామి యొక్క దివ్య వాణిని విన్న మరు క్షణము, అప్పటిదాకా నాలో లేని ఆధ్యాత్మిక వాదము చైతన్యఝరిగా మారి ఒక్క సారిగా నిలువెల్ల ప్రవహించి పోయింది. అలా స్వామినే చూస్తూ, స్వామి మాటలు వింటూ, స్వామి వాక్యాలు వ్రాసుకుంటూ, స్వామి

చెప్పే పద్యాలు ఆసక్తిగా నేర్చుకుంటూ, నేను కూడా అలాగే మాట్లాడాలి అనే తపనతో జీవించాను.

8వ తరగతి చదువుతున్నప్పుడు, ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత కళాశాలలకు సంబంధించిన వేలమంది విద్యార్థుల ముందు ప్రప్రథమంగా మాట్లాడే అవకాశం వచ్చింది.

గత నాలుగు దశాబ్దముల కాలము నుండి మాటలే ఆయుధములుగా మారి పోయాయి. ఎక్కడికి వెళ్లిన కూడా ఈ వాక్‌చాతుర్యము వల్లనే అందరితో స్నేహ సంబంధాలు ఏర్పడేవి.

అలనాడు 1995వ సంవత్సరంలో హైదరాబాద్ యువత ఆధ్వర్యంలో అనంతపురం వైశ్యా హాస్టల్ వేదికగా జరిగిన ప్రప్రథమ యువజన సమ్మేళనంలో, నన్ను నేను పరిచయం చేసుకోవడానికి ఆలవాలముగా నిలిచింది ఈ మాటలే. తదుపరి హైదరాబాద్ బృందంలో ఉన్న పెద్ద మరియు చిన్న వాళ్లందరితో కూడా స్నేహ సంబంధాలకి తోడుగా నిలిచింది ఈ మాటలే! హైదరాబాద్‌కి వచ్చిన తరవాత, శివం వేదిక మీదకు నన్ను తీసుకెళ్లింది ఈ మాటలే. "ఎక్కువ మాట్లాడుతున్నావు, తక్కువ చేయి", అన్న స్వామి హెచ్చరికకి నేపథ్యమై నిలిచింది ఈ మాటలే. హైదరాబాద్‌లో ఉన్న అన్ని ప్రాంతాలలో, సత్యసాయి కేంద్రాలలో నన్ను వెళ్లే విధంగా చేసింది ఈ మాటలే. యావదాంధ్ర రాష్ట్రం లోని జిల్లాలలో యువజన సమ్మేళనములలో నన్ను నిలబెట్టినది ఈ మాటలే.

మాటలు మంత్రాలుగా పని చేశాయి. ఎక్కడ మాట్లాడినా, ఎలా మాట్లాడినా, ఎవరితో మాట్లాడినా, ఉర్రూతలూగించే అద్భుతమైన అవకాశం స్వామి వారు ప్రసాదించారు. ఎప్పుడు దీన్ని నేను వృధా చేసుకోలేదు. ఈ 108 వ్యాసాలలో భాగంగా ఈ భావ వ్యక్తీకరణాన్ని ఏవిధంగా స్వామికి అర్పణ చేశాను అనే విషయం నేను తెలుపుతున్నాను.

నాకు గుర్తు, హైదరాబాద్ యువతతో పాటుగా చేసిన ఏ పర్యటనలో అయినా సరే ఇద్దరో ముగ్గురో మాట్లాడితే ఆ ముగ్గురిలో నేను తప్పక ఉండవలసిందే. అది కూడా అందరూ మొదటి రెండు గంటలలో మాట్లాడటానికి సుముఖత చూపేవాళ్లు. అంటే ఉదయం 10 గంటలకి కార్యక్రమము మొదలవుతే మధ్యాహ్నం 12:00 దాకా ఎవరైనా సరే మాట్లాడటానికి ముందుకు వచ్చేవాళ్లు కానీ, తర్వాత మాట్లాడటానికి ఎవ్వరు ముందుకు వచ్చే వాళ్లు కాదు. కారణం, ప్రొద్దున మొదలైన కార్యక్రమంలో బ్రేక్ లేకుండా కూర్చోవడం వల్ల, 12 తర్వాత ఆకలితో సమావేశంలో ఉన్న వాళ్లు ఇబ్బందిగా ఉంటారని, అలాంటి సందర్భంలో ఎన్నోసార్లు "ఏయ్, ఇప్పుడు నువ్వు మాట్లాడు" అని చెప్పి నన్ను వేదిక మీదకు పంపే వాళ్లు. అలా ఆ సమయంలో మాట్లాడటం నాకు నిజంగా ఒక సవాలుగా ఉండేది. భోజనము సమయంలో భాషణము చేసే అవకాశం ఇచ్చేవారు. ఎప్పుడు కూడా బెదిరింది లేదు అదిరింది లేదు. సమయం ఏదైనా సరే నేను నా మాటలతో డాన్స్ చేయడం కాకుండా జనాలతో డాన్స్ చేయించడమే. అలా ఉర్రూతలూగి పోయే వాళ్లందరూ కూడా. కారణము, "స్వామీ! ఇలాంటి అవకాశం మళ్లీ వస్తుందో రాదో ఇప్పుడే చివరి సారేమో నాకు తెలియదు. మళ్లీ ఇంత దూరం వస్తానో రానో? అవకాశం ఇవ్వండి స్వామి. నా చుట్టూరా ఉన్న జనాలను ప్రేరేపించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని అనుకునేవాడిని. ఆ రాత్రంతా కూడా ఏమి చెప్పాలి? ఏ విధంగా మాట్లాడాలి? ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామం మీద ఒక పద్యము, ఏ పట్టణానికి వెళితే ఆ పట్టణంలో ఉన్న విశేషాల మీద, విషయాల మీద ఒక కవిత, ఈ విధంగా ఎక్కడికి వెళ్లిన అక్కడకి సంబంధించిన విశేషాలు, ఆ జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలను అర్థం చేసుకునే వాడిని, జాతీయ నాయకులు, సాయి సంస్థలలో పెద్దలు, ఇలా ఎంతో మందిని నేను నేపథ్యంగా తీసుకొని మాట్లాడుతూ శ్రోతలను రంజింపజేసే వాడిని, ఉత్సాహ పరిచేవాడిని. ఎవరైనా సరే, మంచిగా మాట్లాడటం వెనుక ఇంత

హోం వర్క్ చేయాల్సి ఉంది అని నేను తెలుసుకున్నాను. ఎక్కడ మాట్లాడినా సరే, అందరూ అద్భుతంగా స్పందించే వాళ్లు.

నేను మాట్లాడటానికి ముందు బృందంలో ఉండే సీనియర్ సోదరులతోనో లేక స్థానికంగా ఉండే సమన్వయకులతోనో "ఇప్పుడు వాళ్లు ఏం చేస్తున్నారు? ఏమి అనుకుంటున్నారు? వాళ్ల నేపథ్యం ఏంటి? ఎలాంటి వాళ్లు వస్తున్నారు?" అని అడిగేవాడిని. ఈ విధంగా అన్ని కూడా ఆలోచించి, ఏ జిల్లాకు సంబంధించిన మాటలు ఆ జిల్లాలో మాట్లాడేవాళ్లం. ఏం మాట్లాడినా, ఏమి పాడినా, ఏమి ఆడినా, అన్నీ కూడా "నదీనాం సాగరోగతి" అన్నట్టుగా స్వామి శ్రీ చరణాల సన్నిధిలో అర్పించడం తప్ప, మరొకటి లేదు. అలాగా ప్రతిసారీ చివరి సారి అని మాట్లాడేవాడిని. ప్రతి జిల్లాలకు, కనీసం అంటే పది సార్లు మళ్లీ వెళ్లే అవకాశం స్వామి ఇచ్చే వాళ్లు. ఆయా ప్రాంతాలలో ఉన్న భక్తులు, యువ జనులు అందరూ నా ప్రసంగాలు వింటూ మైమరిచి పోయేవాళ్లు.

చివరకు ఎలా అయింది అంటే, నేను జిల్లాలకు మళ్లీ మళ్లీ వెళ్తుంటే, హైదరాబాద్ సోదరులంతా అడిగే వారు 'అరే ఏంట్రా బాబు? మొన్ననే కదా వెళ్లావు', అని. నాకేమో బాగా ఆకలి. అన్నం ఎక్కడ దొరుకుతుందా, ఎక్కడ నాకు ఆహారం దొరికితే అక్కడికి వెళ్లాలి. పది మందికి చెప్పాలి. నాకు శారీరక పరిమితులు ఉన్నాయి కాబట్టి ఎక్కువ శ్రమ చేయలేకపోయే వాడిని. కారణం చిన్నప్పటి అస్తమా, రెండు చేతులు చిన్నప్పుడు విరిగి అతుక్కోవడం... అలాగే రెండు కాళ్లు కూడా. అలా నేను బలహీనుడిగా మారి పోయాను. అయినా, 'నేను ఏమి చేయగలను?' అని ఆలోచించినప్పుడు, స్వామి ప్రసాదించిన మేధస్సును, దివ్యమైన కంఠాన్ని, చాతుర్యాన్ని ఉపయోగించి మంచిని పది మందికి పంచాలని దృక్పథంతో నేను ముందుకు సాగేవాడిని. గత నాలుగు దశాబ్దాలుగా, నేను ప్రతి నెల కనీసం అయిదు వేల కిలోమీటర్ల మేర ప్రయాణించాను, అలాగే ప్రయాణిస్తూనే ఉంటాను. ఇప్పటికి సుమారుగా 12 లక్షల కిలోమీటర్లు ప్రయాణం చేసి ఉంటాను అంటే ఇక ఆలోచించండి.

శ్రీకాకుళంలో ఒక ఉపన్యాసానికి వెళితే... అంతా అయిన తర్వాత ఒక మానసిక వికలాంగుడు, అసలు మాట్లాడలేక ఉండేవాడు, అకస్మాత్తుగా నా పాదాల మీద పడి పోయి 'సాయిరామ్ సర్, నాకు చాలా, చాలా సంతోషంగా ఉంది, మీ మాటలు వింటుంటే' అంటూ నమస్కరించాడు. అతని భావ ప్రకటన చూసి నేను కన్నీరు పెట్టుకున్నాను, నా ప్రసంగంతో ఆ అబ్బాయి పొందిన ప్రేరణ అది.

నేను ఏ గ్రామానికి వెళ్లినా, అనేకమంది నా చుట్టూ చేరేవారు. వారు 'సాయిరామ్! మీరు మాకు స్వామిని చూపించారు... మీరు మాట్లాడుతుంటే స్వామి మాకు కనబడుతున్నారు' అని చెప్పేవారు. సాయిరామ్ అంటూ నన్ను ఆలింగనం చేసుకునేవారు, నమస్కారం చేసేవారు. ఎన్నో యువజన సమ్మేళనాల్లో నేను అక్కడ మాట్లాడుతున్న సందర్భంలో ఎంత మంది ఆనంద భాష్పాలు రాలుస్తున్నారో నాకు కనిపించేది. ఎంతమంది కేరింతలు కొడుతున్నారో చూసేవాడిని. ఇలా చూసిన ప్రతి సందర్భంలో, చాలురా! ఈ జన్మకి ఇంత మాత్రం సేవ నేను చేసుకోగలిగాను అని అనుకునే వాడిని.

ఆ విధంగా హైదరాబాద్ యువతతో నన్ను నేను జోడించుకున్న తర్వాత, నాలో ఉన్న ఈ భావ వ్యక్తీకరణకి వంద రెట్లు శక్తి స్వామి కూర్చారు అనిపించింది. ఎప్పుడైతే ఈ కంఠాన్ని, ఈ చాతుర్యాన్ని, నైపుణ్యాన్ని, భావ వ్యక్తీకరణాన్ని, నేను సమాజం కోసం స్వామి యొక్క కార్యం కోసం ఉపయోగించడం మొదలు పెట్టానో... అది కాస్త నన్ను అయస్కాంతంలా చేసి వందల, వేల, లక్షల మందిని మేల్కొలిపేదిగా మార్చేసింది. ఆ శక్తిని, సామర్థ్యాన్ని, స్వామి వారు నా హృదయంలో, నా

మనసులో, నా శరీరంలో, అణువణువులో, ఇంచించులో, నరనరములలో పాదు కొలిపినారు.

అవకాశం ఏదైనా, అవసరం ఏదైనా, సందర్భం ఏదైనా, సమయం ఏదైనా అది గ్రామ సేవ ఉద్యమం కావచ్చు, యువజన సమ్మేళనాలు కావచ్చు, విద్యార్థులతో మమేకమయ్యే విషయం కావచ్చు, ఒక ప్రచారము కావచ్చు, ఒక ఉద్యమానికి శ్రీకారం చుట్టే సందర్భం కావచ్చు, స్వామి గురించిన విశేషాలు చెప్పడం కావచ్చు, గ్రామీణ అభివృద్ధి పథకాలని జనంలోకి తీసుకెళ్లే విషయం కావచ్చు, స్వామి దివ్యాదేశాలని సమాజానికి అందించే ప్రయత్నం కావచ్చు, పర్తి యాత్రలో జనాల్ని సమీకరించడం కావచ్చు, సత్యసాయి గ్రామ సేవ మహా యజ్ఞంలో అందరిని ఏకం చేసే ప్రయత్నం కావచ్చు, సత్యసాయి గురుకుల సేవా యజ్ఞంలో భాగంగా వందలాది ప్రభుత్వ పాఠశాలల మీద పని చేయడంలో కావచ్చు, ఎక్కడ ఏమి చేసినా... మునుముందు అందరూ స్వామిని తలుచుకునే విధంగా, స్వామి వారు నాకు అవకాశం ఇచ్చారు. కారణం, చాలా మందికి ఆంగ్లములో మాట్లాడడమే వచ్చు, నిజానికి అది నాకు అవకాశం రావడానికి బలమైన కారణంగా నిలిచింది. నేను ముందు ఉండడానికి వెనుక... బలము నాది కాదు. స్వామి అనుగ్రహం అని సదా గుర్తించుకుంటాను. నన్ను మా అన్నదమ్ములు అందరూ కూడా ముందు నిలబెట్టి మాట్లాడింపచేశారు. ఆ మాటలన్నీ స్వామి వారు సామాన్యంగా నాతో పలికించ లేదు, అపారమైన శక్తిని చొప్పించారు.

స్వామిని చేర్చే దివ్య సాధనము మాట
భక్తుల మనసులుదోచే పదముల ఊట
యువ చైతన్యముకై స్వామి వేసిన బాట
జనులను మేల్కొలిపిన శంఖారావమిట
సాయి పలికించినదే నిజముగా నా మాట
అందుకే ఆనందం పొందినారు ప్రతి చోట

ఇలాగ స్వామి, సామాన్యమైన నా మాటలకి, అసమాన్యమైన శక్తిని అనుగ్రహం చేసి ఎల్లెడలా తిప్పారు. గత నలభై సంవత్సరాలుగా, ఎంతో మంది మహానుభావులు సాయి కార్యంలో, స్వామి గురించి ఎలా మాట్లాడుతున్నారో, ఎలా ఆలోచిస్తున్నారో, నేను చాలా దగ్గరగా గమనించే అద్భుతమైన అవకాశం పొందాను. డాక్టర్ ఆంజనయ్య, నాగభూషణరావు, కామరాజ్ అనిల్ కుమార్, జివి సుబ్రహ్మణ్యం, బీవీ రమణరావు, వి శ్రీనివాసన్, జి.ఎన్. మూర్తి, సీతాలక్ష్మి, నాగరాజు లాంటి వారు మాట్లాడుతుంటే, 'అరెరే! ఇలా మాట్లాడాలి, ఇలా ప్రసంగిస్తే బాగుంటుంది' అనిపించేది. ఎలా ఇంత అలవోకగా మాట్లాడుతున్నారు. ఇంత చక్కగా మాట్లాడుతున్నారు. చాలా మంది "అయ్యా నువ్వు జూనియర్ అనిల్ కుమార్" అనే వాళ్లు. ఎన్ని జిల్లాలు నన్ను తదుపరి సమావేశాలకు ఆహ్వానించేవో నాకు గుర్తుంది. 'మీరు అనిల్ కుమార్ గారిలా ప్రసంగిస్తున్నారు' అని చాలా మంది ఆహ్వానించేవాళ్లు ఉపన్యాసాలకు. అలాగే, 'సాయిరామ్! మీరు మాట్లాడుతుంటే స్వామి మాట్లాడినట్లు ఉంటుంది. పద్యాలు స్వామి పాడినట్టే పాడుతారు' అని చాలా మంది ప్రశంసించేవారు. పద్యాలు, పాటలు, గద్యాలు, ప్రతిజ్ఞలు, అభినయం, వేష భాషలు, విషయ జ్ఞానం ఇవన్నీ ఉపన్యాసంలో నేను కూర్చేవాడిని. ఒక్కొక్క ఉపన్యాసం సుమారు 60-90 నిమిషాలు, ప్రతి సందర్భంలో మాట్లాడేకి ముందు కనీసం10 గంటలు హోం వర్క్ చేసుకునే వాడిని. ఎలా చేయాలి? ఎలా మాట్లాడాలి? నా ఏకైక ధ్యేయం ఏమిటంటే ఆ జిల్లాలో మళ్లీ నేను వస్తానో రానో, వాళ్లందరికీ కూడా నేను చైతన్య పరచాలి అనేటువంటి ఒకే ఒక ఆలోచన నన్ను నిద్ర లేని రాత్రులకి గురి చేసేది. మాట్లాడిన ప్రతి

సందర్భంలో ఆతురత, ఆవేదన, ఆదర్శము, తపన, లక్ష్యము చైతన్యము, భక్తి, శ్రద్ధ, నైపుణ్యము ఇలా ఎన్నో విషయాలని నేను ఒక పూలమాల లాగా, ఆ మాటల ద్వారా ఆ అందించే ప్రయత్నం చేసేవాడిని. ఏమి చేసినా నా కళ్ల ముందర కనిపించేది ఎవరు అంటే? చాలా మంది అడిగేవాళ్లు. 'ఏంటి సార్? అక్కడికి వెళ్లిన తర్వాత ఒక రకంగా ఉగిపోతారు' అంటే... "అయ్యా! నాకు నా ముందర ఎవరు కనిపిస్తున్నారు తెలుసా? వెయ్యి మంది జనం కాదు. సత్యసాయి బాబానే సాక్షాత్తు నాకు కనిపిస్తున్నారు. అన్ని చోట్ల విశ్వరూపమైన స్వామి వారు నాకు కనిపిస్తున్నారు. స్వామి దగ్గర మాట్లాడుతున్నట్టుగా, స్వామి చెంతనే మాట్లాడుతున్నట్టుగా, స్వామితోనే మాట్లాడుతున్నట్టుగా, స్వామి నాలో ఉండి మాట్లాడిస్తున్నట్టుగా పూనకం వచ్చినట్టు వస్తుంది అని చెప్పేవాడిని. చాలా మంది పెద్ద వాళ్లు అనంతపూరంలో అనేవారు. "అరే బాస్! వాడికి మైక్ ఇచ్చారు ఏందయ్యా? వాడు మైకాసురుడు" అని అనేవారు. మైక్ ఇస్తే నేను వదలనని మైకాసురుడు అని పేరు పెట్టారు.

ఉపన్యాస కళను సేవతో జోడించ గలిగే దివ్యావకాశము నాకు స్వామి ఇచ్చారు అని ఎప్పుడు తలుచుకుంటాను. ఈ రోజుకి గత నాలుగు దశాబ్దాలుగా లక్షల మంది జనముతో మాట్లాడే అవకాశం స్వామి ఇచ్చారు. ఒక్కడి కోసం వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. బస్సులో వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. ఫ్లైట్‌లో వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. ట్రైన్‌లో వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. ఆటోలో వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. స్కూటర్‌లో వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. సందర్భం ఏదైనా సరే.. స్వామి సేవ అంటే, నన్ను నేను మర్చిపోయి పరిగెత్తే వాడిని. నా దేహాన్ని కూడా విడిచి, ఆత్మతో వెళ్లిపోయే విధంగా ఉండేది చాలా చాలా సందర్భాలలో. 1982 నుండి ప్రారంభించిన ఈ భావ వ్యక్తీకరణము, వశీకరణముగా మారి చిట్ట చివరికి, స్వామి వారి దివ్య సన్నిధిలో మాట్లాడేదాకా నన్ను తీసుకువెళ్లింది. స్వామి సమక్షంలో మాట్లాడిన ఆ సందర్భము 2003 పుట్టపర్తిలో సమావేశమైన సుమారు పదివేల మంది యువజనుల సమక్షంలో, వేలాది మంది భక్తజనుల మధ్యలో నేను మాట్లాడిన ఐదు నిమిషాలు కూడా స్వామిని సైతం స్పందింపచేసింది అనటంలో ఎట్టి సందేహము లేదు. నా మాటలు వింటూ భావోద్వేగముతో స్వామి ఆనంద భాష్పాలు రాల్చింది ఆ రోజు సభలో చాలా మంది చూశారు. అయ్యా! స్వామితో కూడా నువ్వు కన్నీళ్లు పెట్టించావయ్యా!' అని చెప్పింది నాకు గుర్తుంది. ఇదంతా కూడా చెప్తుంటే... ఈ గొంతు మూగ పోయేదాకా, నేను ఎన్ని వందల వేల లక్షల కోట్ల మందికి సేవా కార్యాన్ని నేను పరిచయం చేయగలిగితే అంత మందికి చేసే ప్రయత్నము అహరహం, అనుక్షణం, అవిశ్రాంతంగా, అనర్గళంగా చేస్తూనే ఉంటాను. ఇది అసిధార వ్రతము. ఇది పొంగిపొరలే గంగా ప్రవాహము. ఇది స్వామి ఇచ్చినటువంటి అమృత భావ వ్యక్తీకరణము. ఈ విశేషాలు అన్నీ కూడా చెప్తూ ఉంటే స్వామి ఇచ్చిన ప్రతిభను నేను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవచ్చు, అని నేను ప్రతి క్షణము అనుకుంటూ ఉంటాను. చివరి క్షణము దాకా స్వామి ఇచ్చిన ఈ శక్తిని, యుక్తిని, స్వామి కార్యములో ఉపయోగపెట్టే నిర్ణయంతో ఈ వ్యాసాన్ని ముగిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

78

సంగీత విభావరులు స్వామి మదిని దోచిన పద ప్రయోగములు

బాబా వారి దివ్య కార్యక్రమంలో మమ్మల్ని మేము పునరంకితము చేసుకోవడానికి ఎన్నో విశేషమైన అవకాశాలు స్వామి వారు ప్రసాదించారు. గత ఐదు దశాబ్దముల నుండి హైదరాబాద్ శివం ప్రాంగణములో ప్రతి గురువారము, ఆదివారము జరిగే భజన కార్యక్రమాలకి వందల మంది వస్తూనే ఉన్నారు. కానీ ఆ భజన బృందంలో ఒకరిద్దరు పాడే భజనలు వింటూ స్వామిని తలచుకోవడానికి చాలా మంది వస్తున్నారు అని తరవాత తెలిసింది.

దానికి కారణం ఆ బృందంలో పాడేవారి భక్తి, విశ్వాసము, సంగీతానురక్తి, స్వామే స్వయంగా భజనలకి రాగము, తాళము, భావము ఎలా ఉండాలో చెప్పి భజనలను సాధన చేయించిన వ్యక్తులు. అలాంటి భజన బృందములో అగ్రేసరుడు, సంగీత కీర్తిని శేషంగా మిగిల్చి వెళ్లిన "సూర్య నారాయణ మూర్తి". శివం మందిర మధుర గంధర్వ గాయకుడు. అలాగే స్వామిని సహితము సమ్మోహనము చేసే రాగములను కూర్చి, స్వామి సమక్షానికి మాలాంటి వాళ్లందరిని తీసుకొని వెళ్లిన వారు. పాటలే నేపథ్యంగా చేసుకున్న "కృష్ణమోహన్"

వీళ్లిద్దరినీ హైదరాబాద్ యూత్ మర్చిపోలేరు. నారద తుంబురలని మేము చూడలేక పోవచ్చు కానీ, హైదరాబాద్ యువతకైన, శివం భజన బృందానికైనా, హైదరాబాద్ సత్యసాయి సంస్థలకైనా, యావదాంధ్ర తెలంగాణ రాష్ట్రములలోకైనా, ఇలాంటి వ్యక్తులు నిజంగా ఆ దివ్య మూర్తులే అనుకోవచ్చు. అలాంటి వ్యక్తుల సహచర్యంలో, మేమంతా ఎన్నో అద్భుతమైన భజనలని నేర్చుకోవడానికి అవకాశం కలిగింది. ఇంకా చెప్పాలంటే స్వామి వారి దరికి మమ్మల్ని చేర్చిన ఎన్నో అవకాశాలలో సేవ, భక్తి, తపన ఇవన్నీ పక్కనకి పెడితే, అందరూ ఏకగ్రీవంగా చెప్పుకునేది సంగీతము, భజనలు, పాటలు. సభ ఏదైనా సరే, సందర్భం ఏదైనా సరే, వేదిక ఏదైనా సరే, హైదరాబాద్ యువత ఎప్పుడూ వైవిధ్యంగా ఆలోచించేది. నా కళ్లతో చూశాను, నేను అనుభవించాను కాబట్టి చెప్తున్నాను. గత నాలుగు దశాబ్దముల కాలం నుండి ఎక్కడికి వెళ్లినా సరే ఉపన్యాసం ఉంటుంది, సేవ ఉంటుంది,

దానితో పాటుగా సంగీతము, భజన ఈ రెండూ మాత్రం తప్పక ఉండేవి. సీనియర్ సోదరులు మా అందరికీ చెప్పేవాళ్లు, అరే మనం ఎన్ని మాటలు మాట్లాడినా, ఎన్ని విధాలుగా ప్రేరణ చేసినా సంగీతము, భజన అనేది మాత్రం అందరినీ భక్తి పారవస్యంతో ముంచెత్తుతాయి అని. ఎలాంటి నేపథ్యం నుంచి వచ్చినా సరే, వాడికి భాష రాకపోయినా, నిరక్షరాస్యులైనా, శిశుర్వేతి... పశుర్వేత్తి అన్నట్టుగా ఆ సంగీతానికి తమను తాము మరచి స్వామి వారిని తలుస్తూ దివ్యానందం అనుభవిస్తారు అని చెప్పేవారు.

హైదరాబాద్ యువతలో చేరితే సంగీత వాయిద్యాలు వాయించడానికి అవకాశం వస్తుంది అని బృందంలో చేరిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. గత 35 ఏళ్లుగా కనీసం అంటే 100–200 మంది కళాకారులని హైదరాబాద్ యువత స్వామి కార్యానికి పరిచయం చేసిందని చెప్పాలి. తబల, హార్మోనియం, కీ బోర్డు, కన్జీర, జూస్, గిటార్, వయొలిన్, వీణ, ఫ్లూట్, డోలు, మృదంగం ఇలా రక రకాల వాయిద్యాలని వాయించగలిగే బృందాన్ని అంతా తయారు చేసుకుంటూ మేము కార్యక్రమాలకు వెళ్లేవాళ్లం. అలా వెళ్లిన ప్రతి సందర్భంలో కూడా, సుమారు 90 నిమిషాలు అద్భుతమైన భక్తి పారవశ్యాన్ని అక్కడ జనాలకి రుచి చూపించే వాళ్లము.

అలా ఆ వేదికల మీద చేసిన ప్రదర్శనం, అభ్యాసం ఏదైతే ఉందో, స్వామి సన్నిధిలోఎందుకు చేయకూడదు అనే ఆలోచన మాలో కలిగింప జేసింది. అవకాశాలు చాలానే స్వామి ఇచ్చారు. ప్రశాంతి నిలయంలో స్వామి విద్యార్థుల తరవాత శివరాత్రి రోజున భజన చేయడం అనేది హైదరాబాద్ యువత తోనే ప్రారంభమైంది. ఇక ప్రత్యేకమైన సందర్భాలలో స్వామి భజన కార్యక్రమం చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. అది కూడా అందరికీ తెలుసు. ప్రత్యేకంగా సంగీత కార్యక్రమాన్ని అర్పించడం అనేది హైదరాబాద్ యువతకి స్వామి 2000 సంవత్సరం నుంచి ఇచ్చారు. ఇప్పటికి ఎంత లేదన్నా సుమారు ఒక పాతిక సార్లు, స్వామి దగ్గర సంగీత రసామృతాన్ని అర్పించే దివ్యావకాశం కలిగింది. ఎన్ని అద్భుతమైన పాటలు, ఎన్నో భావయుక్తమైన భజనలు, ఎన్నో జానపదాలు, పాత మధురాలు, పాత సినిమాల్లో దేశభక్తి గీతాలు.

పాడ వోయి భారతీయుడా, ఆడి పాడ వోయి హృదయ గీత... ఈ పాట
సాయి మాత బిడ్డలం అందరం సాయి మాత బిడ్డలమే అందరం!
ఓయి రామా సాయి రామా నీవు నా అండ నుండు కోదండరామా

ఇలాగ భక్తి, దేశభక్తి, జానపదాలు, వేదాంతము తదితర పాటలన్నీ కూడా చక్కగా సమకూర్చుకొని కనీసం అంటే 15 రోజులు శివం ప్రాంగణంలో రాత్రింబగళ్లు సాధన చేసి స్వామికి మెచ్చే విధంగా మనం చేయాలని ఆలోచనతో చేసేవాళ్లము. ఎప్పుడు ఎట్లా చేసినా సరే, స్వామి వారి ముందు చేసిన ఆ ప్రదర్శన చాలా హిట్ అయ్యేది. స్వామి ఎంతో సంతోష పడేవారు. అలా ఒకసారి విన్నూత్నంగా ఆలోచించి పాటకి పాటకి మధ్యలో వ్యాఖ్యానం కూడా ఉంటే బాగుంటుందని మొదటిసారి ఆలోచించడం, దాన్ని అందరూ ఆమోదించడం జరిగింది.

మొట్ట మొదటి సారి నిలయంలో స్వామి సమక్షంలో ఇలా పాటల మధ్యలో వ్యాఖ్యానం జోడించడం హైదరాబాద్ యూత్ చేసింది అనుకుంటాను. స్వామి అవకాశం ఇచ్చారు. పాటలు అందరి లాగా పాడడానికి రాక పోయినా, ఆ పాటలు సాధన చేసిన ప్రతి సందర్భంలో నా గొంతుని అందరితో కలవడమే కాకుండా, ఆ పాటలో ఉన్న భావనని నేను అనుభవించే వాడిని. ఆ పాటలకు నేను ఏ విధంగా వ్యాఖ్యానము వ్రాయొచ్చు అని నేను ఎంతో తపన పడేవాడిని. అలా రేయింబగళ్లు

నేను పడుకున్నా, కూర్చున్నా, నిలుచున్నా ఫలానా పాటకి ఏమి వ్రాయొచ్చు అని యోచించే వాడిని. ప్రశాంతి నిలయానికి వెళ్లే సమయానికి ఆ పాటకి పాటకి మధ్యలో వ్యాఖ్యానము వ్రాసి పెట్టుకునే వాడిని స్వామి సమక్షంలో మైక్‌లో చెప్పే దివ్యావకాశము స్వామి ప్రసాదించారు. అలా చేపట్టిన శ్రీ సత్యసాయి సంగీత విభావరులు ఎన్నో అద్భుతమైన అనుభవాలకి వేదికగా నిలిచాయి.

ఒక సారి స్వామి సన్నిధిలో పాడుతున్నాం, "కన్నులు కదల్చలేమయా" అని పాట అనుకుంటాను. ఆ పాట పాడడానికి ముందర వ్యాఖ్యానం చేయాలి. "స్వామి! మీ ముఖారవిందము మెరుస్తోంది స్వామి, మీ ముఖారవిందం చూస్తుంటే... మమ్మల్ని మేము మరుస్తున్నాం స్వామి, మీ మీద నుండి కన్నులను కదల్చ లేకపోతున్నాం" అంటూ వ్యాఖ్యానం చేస్తే... స్వామి ఆ వేదిక మీద నుంచి తల ఇలా కిందికి దించి "అబ్బా!" అని స్పందించడం చూసినప్పుడు అక్కడ ఉన్నటువంటి ఆ హైదరాబాద్ యువత హృదయాలంతా ఝల్లుమన్నాయి.

అలాగే ఒకానొక సందర్భంలో చివరి పాటకి నేను వ్యాఖ్యానం చేస్తున్నాను. "స్వామి సంగీత రసామృతాన్ని మీ ముందు సమర్పించే ఈ సేవలో మేము పాల్గొన్నందుకు ఎంతో ధన్యత చెందాము స్వామి, సేవకి ప్రతిఫలం ఆశించకూడదు అన్నారు కదా స్వామి కానీ మేము ఈ రోజు సేవకి ప్రతిఫలం ఆశిస్తున్నాం స్వామి" అని అంటే... ఒక్కసారి అక్కడ ఉన్న భక్తులందరూ కూడా ఆశ్చర్య చకితులు అయ్యారు! స్వామికి కూడా ఒకింత ఆశ్చర్యం అయ్యింది అనిపించింది. నేను వెంటనే "అవును స్వామి! ఈ సేవా అవకాశానికి మాకు ఫలితం కావాలి. అదేమిటంటే మీరు ఇలాంటి అవకాశాలు మళ్లీ మళ్లీ ప్రసాదించండి స్వామి". అని చెప్పాను. స్వామి ఎంత ముచ్చట పడ్డారో, ఎంతగానో నవ్వారో ఆ మాటలు విని. ఎంతో ఆనందమైంది స్వామికి. ఈ విధంగా స్వామి దగ్గర మాట్లాడే అవకాశం చాలా అరుదుగా వస్తుంది కదా! స్వామి సన్నిధిలో ప్రత్యక్షంగా మాట్లాడటము అందులోనూ కొన్ని వేల మందిలో మాట్లాడే అరుదైన అవకాశము స్వామి నాకు ఎన్నో సార్లు ఇచ్చారు. ఈ రోజుకి నేను గుర్తు చేసుకుంటాను, ఎంత లేదన్నా... ఒక వంద పాటలకి వ్యాఖ్యానం వ్రాసి ఉంటాను.

ఉగాది, యువ జన సమ్మేళనాల సందర్భాలలో మేము స్వామి దగ్గర పాటలు పాడే వాళ్లం. ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాల్సింది ఏంటంటే, కొత్త వాళ్లు ఎవరైనా సరే, ప్రతిభ ఉంటే, హైదరాబాద్ యూత్ నెత్తికెక్కించు కోవడమే. వాళ్లను ఏదో విధంగా స్వామి దగ్గరకి పంపించే వాళ్లు. అలా ఎంతో మందికి మ్యూజిక్ ద్వారా మ్యూజిక్ జరిగింది. నేను చూశాను.

ప్రధానంగా గురుప్రసాద్ కీబోర్డు మీద అద్భుతమైన రాగాలు పలికిస్తారు. స్వామి అందరికీ బట్టలు పెడుతున్న శుభ సమయం. ఇతను స్వామి వారి దగ్గరికి వెళ్లినప్పుడు, వారు అడిగారు "ఏం కావాలి నీకు?" అని అడిగితే" అతను అన్నాడు, స్వామీ! నాకు మోక్షం కావాలి" స్వామి వారి చేతి వేళ్లను వాడి భ్రూమధ్యస్థానంలో ఉంచి, "తప్పక తప్పక" అని కాసేపు ఉంచారు.

మరొక సారి వయొలిన్ వాయిస్తున్న శ్రీధర్ చాతుర్యానికి స్వామి కరిగి పోయారు, ప్రదర్శన ఇంకా జరుగుతున్న సమయంలోనే అతని సైగలతో పిలిచారు. హస్తచాలనం చేత బంగారు గొలుసు సృష్టించి వారికి వేశారు.

నారద తుంబురులుగా సాయి సంస్థలో ప్రఖ్యాతి గాంచిన మన కృష్ణమోహన్, సూర్య నారాయణ మూర్తికి కూడా స్వామి అద్భుతమైన అనుగ్రహం ఇచ్చారు. ఈ సంగీత సేవకులందరికీ బట్టలు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. ఫోటోలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. సంగీత కళాకారుల బృందంలో

ఎంతో మందికి స్వామికి పువ్వులు, గ్రీటింగ్స్, హారతి, సుగంధ ద్రవ్యాలు ఇచ్చే అవకాశం దొరికింగి.

తరవాత కాలంలో శివ కళాధర్, ప్రభాకర్, ప్రేమ్, ప్రసన్న ఇలా ఎంతో మంది కళాకారులు ఈ సంగీత సాధనలో స్వామి అనుగ్రహానికి నోచుకున్నారు. ఎన్ని విశేషాలు ఈ సంగీతం మీద ఆధారపడి ఉన్నాయి అని చెప్పుకోవాలి.

అనంతపురం జిల్లా సాయి భక్తుల పర్తి యాత్ర సందర్భంగా జరిగిన విశేషాలు గుర్తుకొస్తున్నాయి. చాలా మక్కువతో అనంతపురం జిల్లాకి వెళ్లి, హిందూపురం సాయి కేంద్రములో జరిగే ముందస్తు కార్యక్రమాలు చూసే వాడిని. అక్కడ బాలవికాస్ చిన్నారులతో సాధన చేయిస్తున్నారు. మంచి పాటలను ఎన్నుకుని పాటలు నేర్చుకుంటూ ఉంటే, నేను, సోదరుడు మధుతో అన్నాను! "మనం పాటల మధ్యలో వ్యాఖ్యానం కూడా పెడితే బాగుంటుంది కదా అని అన్నాను. కొద్ది మందికి అంత నచ్చలేదు. కానీ ఈ వ్యాఖ్యాన ప్రాముఖ్యత, వైవిధ్యత తెలిసిన మధు సరే చేద్దాం అన్నాడు. నేను చాలా భక్తితో వ్రాశాను. అయితే ఆ మాట్లాడే అవకాశం స్థానికంగా ఉన్న వేరే ఎవరికైనా ఇద్దాం అని ప్రయత్నం చేశారు. అమ్మాయిల వైపు ఒకరిని ఏర్పాటు చేశారు. కానీ నన్ను మార్చే ప్రయత్నం సఫలం కాలేదు. ఇక వ్రాసినవి ఎంపిక చేసిన అమ్మాయికి కూడా ఇచ్చి ఎలా చెప్పాలో నేర్పించాను. నేను కూడా సిద్ధం అయ్యాను.

స్వామి సన్నిధిలో వేలాది మంది చేరారు. హైదరాబాద్ నుండి నేను అతిథి లాగా వెళ్లాను అనంతపురంకి. అక్కడ పెద్దవాళ్లందరికీ, ఎన్నెన్నో కార్యక్రమాలు చేసి మొదటి లైన్‌లో కూర్చోవాలన్న ఉత్సుకత తాపత్రయం, ఇది సహజం. అక్కడ మైక్ సెట్ చేసేవాళ్లు వ్యాఖ్యానం ఉందా? ఎవరు మాట్లాడుతున్నారు? అని అడిగారు. మైకు సెట్ చేయాలి కదా? పిల్లలు నన్ను చూపించారు. నన్ను మొదటి లైన్లో కూర్చోబెట్టి, ఆ మైక్ నా ముందు పెట్టారు. వారి ఉద్దేశ్యం మాట్లాడే వాళ్లు స్వామికి కనిపించాలి అని. కార్యక్రమం కొన్ని క్షణాల్లో ప్రారంభం అవుతుంది అన్న సమయంలో జిల్లా పెద్దలు వచ్చి, హేయ్! నువ్వు వెనక్కి వెళ్లు అని చెప్పి, రెండో మూడో లైన్‌కి మార్చారు. నాకు కొద్దిగా బాధ అయింది. అయ్యో మొదటి వరుసలో కూర్చునే అవకాశం మిస్ అయింది కదా అని. మరి ఎప్పటి అవకాశం అప్పటిదే కదా.

ఇక కార్యక్రమం ప్రారంభం కాగానే, భక్తి శ్రద్ధలతో గంభీరమైన గొంతుతో నేను మైక్ పట్టుకొని "ఓం శ్రీ సాయిరామ్!" అని ఎప్పుడైతే చెప్పానో, మీరు నమ్మరు స్వామి వెంటనే నేను మాట్లాడిన వైపుకి తల తిప్పి చూశారు. ఎప్పుడైతే స్వామి తల తిప్పి చూశారో, నన్ను వెనక్కి పంపించిన ఇద్దరు పెద్ద వాళ్లు ఒక్కసారిగా ఏదో షాక్ కొట్టినట్టు అటు వైపు ఒకరు ఇటు వైపు ఒకరు జరిగి ఒరిగిపోయారు. మధ్యలో స్వామి సారసరి నా కళ్లలో కళ్లు పెట్టి చూసేసారు. నాకు పరమానందం అయింది.

అప్పటికే స్వామి వారు దివ్యోపన్యాసం ఇచ్చేసారు. కానీ మేమంతా చక్కగా పాటలు పాడిన తర్వాత ఏమైందో ఏమో తెలియదు, స్వామి మళ్లీ మైకు తెప్పించుకొని చెప్పారు "ఈ వచనములు, ఈ భావనలు నాకు ఎంతో ఆనందం కలిగింప చేశాయి. అనంతపురం జిల్లాలో ఇంత ప్రతిభ ఉన్నదా? అని నాకు అనిపించింది. చాలా సంతోషం కలిగించారు మీరందరూ.'' అన్నారు. ఆ సమయంలో పిల్లలు పాటలు పాడారు. కానీ స్వామీ భావనలు, వచనములు అని అన్నారు. అంటే ఆ సమయంలో మాట్లాడింది నేను మాత్రమే! స్వామి నా భావనలు, వచనములకు సంబరపడిపోయారని నాకు అర్థమై పోయింది. అలా నా వ్యాఖ్యానానికి స్వామి ఇచ్చిన ఆశీర్వాదంగా స్వామి వారి ప్రశంసలు తీసుకున్నాను. తనువెల్ల పులకరించి పోయింది.

ఇక స్వామి సన్నిధిలో పిల్లలు అందరూ కూర్చుని పాడాలి. చిన్న చిన్న పిల్లలు కదా వారితో కూడా ఏదైనా వైవిధ్యంగా చేయిస్తే ఇంకా బాగుంటుంది అని ఆలోచించి ఆ పిల్లలందరి చేతుల్లో రంగు రంగుల రిబ్బన్లు గుత్తులుగా చేసి పెట్టాము. వాళ్లు పాట పడుతున్నప్పుడు ఉన్నట్టుండి ఆ చేతులలో ఆ రిబ్బన్ గుత్తులు తీసి లయబద్ధంగా వాటిని పైకి లేపి ఆడించడం చూసి స్వామి ఎంతో ముచ్చట పడ్డారు.

ఇలాగ చెప్తూ పోతే ఎన్నో అద్భుతమైన విషయాలు జరిగాయి. బాబానే పదాలు సమకూర్చారు, మాటలను మంత్రాలుగా మార్చారు. అద్భుతమైన అవకాశాలు నాకు ఇచ్చిన స్వామికి నేను ఏమి ఇవ్వగలను? సంపూర్ణ శరణాగతితో నన్ను నేను సమర్పించుకోవడం తప్ప మరి ఇంకేమి ఇవ్వగలము? ఈ విశేషాలతో ఈ వ్యాసాన్ని ఇక్కడ ముగిస్తున్నాను.

79

లక్షలా... లక్ష్యాలా!!

ఏ ముహూర్తంలో స్వామి నా చేత కంపెనీ సెక్రెటరీ చేయించాలి అని సంకల్పం చేశారో తెలియదు, కానీ చాలా క్లిష్టమైన విషయంగా మారింది ఈ కోర్సు. CS చేస్తున్న సమయంలో మూడేళ్ల పాటు సాయంకాలం కాలేజీలో న్యాయ శాస్త్రం కూడా చదివాను, పాస్ అయిపోయాను. కానీ, కంపెనీ సెక్రెటరీ మాత్రం నాకు కొరుకుడు పడలేదు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, బూడిదలో పోసిన పన్నీరు అయింది.

ఎంత చదివినా, ఎన్ని సార్లు పరీక్షలు వ్రాసినా నాకు ఫలితం దక్కలేదు. అయినా సరే

పట్టిన పట్టేదో పట్టనే పట్టితివి పట్టు నెగ్గెడుదాకా అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితివి కోరిక తీరెడు దాకా కోరి నిలువు
అడగినదేదియో అడగనే అడిగితివి అడిగెడిదిచ్చుదాక అట్టెయుండు
తలచినదేదియో తలచినే తలచితివి తలుపు తీరెడు దాకా తరల కుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు ఒడలు తెలియక మనమైన చావవలయు
అంతేయే కానీ మధ్యలో వెళ్లుట సాయి భక్తుల లక్షణము కాదు

అని స్వామి చెప్పిన మాట సదా గుర్తొచ్చేది. ఆరు నెలలకు ఒక సారి పరీక్ష వ్రాయడానికి కనీసం ఒక నెల రెండు నెలల పాటు ఎక్కడ పని చేసినా శలవు తీసుకునే వాడిని. సాయి సోదరులు వాళ్ల ఇళ్లలో నన్ను పెట్టుకొన్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అందరూ కూడా నన్ను గుండెల్లో పెట్టుకొని చూసుకున్నారు.

1998 నుండి 2001 దాకా తిరుమణి గ్రూప్ మరియు భావన గ్రూప్ సంస్థలలో పని చేశాను. మొదటి సంస్థలో ఎలా జాయిన్ అయ్యానో గుర్తు లేదు కానీ, ఆ సంస్థ యజమాని తిరుమణి వేంకటేశన్ మార్గ దర్శనంలో ఎన్నెన్నో జీవిత నైపుణ్యాలు నేర్చుకున్నాను. వారి నాయకత్వ లక్షణాలు, నిర్వహణా సామర్థ్యం, దైవ భక్తి, రాజసం, సంస్థ ఉద్యోగుల పట్ల ఆదరణ భావం, ఎట్టి వారితో

ఆయన సరే మాట్లాడి ఒప్పించగలిగే చాకచక్యం ఇలా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. నన్ను వారి బిడ్డలా చూసుకున్నారు. ప్రభుత్వ అధికారులను కలవాడనికి వారితో పాటుగా వెళితే నన్ను చూసి వాళ్ల అబ్బాయా? అని అడిగే వారు. ఎంతో చక్కగా చూశారు నన్ను. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ఉండేది పరిశ్రమ. ప్రస్తుతం వారికి సుమారు 80 ఏళ్లు. వ్యాపారాలు అన్ని కూడా తీసివేసి విశ్రాంత జీవనాన్ని గడుపుతుంటారు. ఫోన్ లేని రోజులు కదా! సంబంధం పోయింది. ఒక సభలో ప్రసంగించడానికి వెళితే నన్ను వారికి పరిచయం చేశారు. నేను వారిని చూసి ఆనంద పడ్డాను. కానీ CS పరీక్షల కోసం చదవాల్సి రావడం వలన ఉద్యోగం వదలాల్సి వచ్చింది.

పరీక్షల తర్వాత మళ్లీ బ్రతుకు రోడ్ మీదకు వచ్చింది. సాయి సోదరుడు రాబిన్సన్ సుబ్రమణ్యం నన్ను అక్కున చేర్చుకుని, చేతిలో డబ్బులు పెట్టి సిటీ అంతా తిరిగమని చెప్పేవాడు. అలా చేస్తే సిటీ తెలుస్తుందని కొద్దిగా లోక జ్ఞానం వస్తుందని. ఇంటికి తీసుకుని వెళ్లి సుధా సుబ్రమణ్యం భోజనం పెట్టేవాళ్లు.

ఆయన, వారి ఆఫీస్ ప్రక్కన ఉన్న భావన ఇన్వెస్టర్స్ సర్వీసెస్ సంస్థ యజమాని తాండూర్ రఘునాథ రెడ్డిని పరిచయం చేయడం, వారు నాతో మాట్లాడి నాకు ఆఫీసు అడ్మినిస్ట్రేటర్‌గా ఉద్యోగం ఇవ్వడం జరిగిపోయింది. సుమారు ఒక సంవత్సరం ఆయనతో పని చేశాను. ఆయన వృత్తి రీత్యా న్యాయవాది. యుక్తవయసు లోనే తన చాతుర్యంతో సంపాదించారు. షేర్ మార్కెట్ లావాదేవీలు, కొనడం అమ్మడం లాంటి వ్యవహారం చేస్తూ ఉండే వాళ్లు.

వారు న్యాయవాది కాబట్టి, చాలా అద్భుతమైన వాక్ చాతుర్యం ఉండేది. బాబా అంటే నమ్మకం లేకపోయినా సరే, నన్ను మరియు సుబ్బాని చూసి ఎంతో ముచ్చట పడే వారు. ఈ విషయం మీదైనా సరే ఎదుటి వారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మాట్లాడే సత్తా వారిది. నన్ను సునిశితంగా గమనించే వారు. చాలా డైనమిక్‌గా నిర్ణయాలు తీసుకునే వాళ్లు, డబ్బు కంటే కూడా నమ్మకానికి విలువ ఇచ్చే వారు. చిన్న వారైన ఇద్దరు కుమార్తెలు కూడా నా దగ్గరికి వచ్చే వాళ్లు. వారిని ఉత్సాహ పరచాలని చెప్పేవారు. సహోద్యోగులు నా మీద ఫిర్యాదు చేసినా సరే, నేను తప్పు చేయను అని నమ్మి నా సంజాయిషీ అడిగే వారు. నిజాయితీ కంఠంలో ధ్వనిస్తుంటే నేను చెప్పే మాటలు విని నిర్ణయాలు తీసుకునే వాళ్లు.

ఆఫీసులో అందరూ కూడా అజ్ఞాతంగా షేర్ ట్రేడింగ్ చేసుకునే వాళ్లు. నేను మాత్రం నా పని ఏమిటో అది చేసే వాడిని. ఎంతో నమ్మకంగా పని చేస్తున్న నన్ను వారు ఇంటి పిల్లాడి లాగా చూసేవారు. నా మాటలు, నా సేవలు చూస్తూ నాకు ఆఫీసు బాధ్యత అప్పగించే వారు. వారికి ఇప్పుడు 70 ఏళ్లు. గత మూడు దశాబ్దాల నుండి వారితో సత్సంబంధాలు కొనసాగుతూనే ఉంది. తరవాత మళ్లీ పరీక్షల సమయంలో సెలవు దొరకక... వదిలేసాను.

మొత్తానికి 2001 సంవత్సరంలో మొత్తం కోర్సు పూర్తి చేశాను. 1996లో నేను హైదరాబాద్‌కు వచ్చాను కాబట్టి నాకు ఎవరు తెలియదు.

స్వామి వారి చిరకాల భక్తులు పిడతల శ్రీధర్ IRS దగ్గరికి వెళ్లాను, ఏదైనా నాకు ఉద్యోగం అవకాశం ఉంటే చూడండి అని. ఆయన సురానా గ్రూప్ వాళ్లకి ఒక మాట చెప్పడం, నేను ఇంటర్వ్యూకి వెళ్లడం, ఆ ఇంటర్వ్యూలో సురానా సంస్థ వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులు శ్రీమాన్ జి.ఎం. సురానా గారు నన్ను వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేశారు. నా గురించి తెలుసుకుని, నన్ను ఎంతో అభినందించి, 'తప్పకుండా మాతో జాయిన్ అవ్వాలి' అని చెప్పారు. ఆ తర్వాత నన్ను బోర్డుకు

పరిచయం చేశారు. నరేంద్ర సురానా, దేవేంద్ర సురానా ఇద్దరూ సంయుక్త నిర్దేశకులు. అది చాలా పెద్ద గ్రూప్, పూర్తిగా మార్వాడీ శైలిలో నడిచే సంస్థ. అందుకే, హైదరాబాద్‌లో నేను మొదటిసారిగా నా సొంతంగా, స్వతంత్రంగా నిలబడడానికి సిద్ధమయ్యాను.

అప్పటి దాకా ఉదయన్న, కృష్ణ వాళ్ల ఇళ్లలో ఉండేవాడిని. ఉద్యోగం వచ్చిన తరవాత హైదరాబాద్‌లో నల్లగుట్టలో సాయి సోదరుడు వినోద్ కాకా వాళ్ల ఇంట్లో పెంట్ హౌస్‌లో చేరాను. ఆ గది నుండి ఆఫీసుకు నడుచుకుంటూ వెళ్లే దూరంలో ఉండేవాడిని. ప్రతి అడుగులో స్వామి కార్యములో నాతో నిలిచిన సోదరులు నేను ఇబ్బంది లేకుండా స్థిరపరిచే ప్రయత్నం చేశారు.

నాలుగున్నర ఏళ్ల పాటు సురానా సంస్థలో చేశాను, ఎక్కడా తప్పు చేసింది లేదు. ఎక్కడా పొరపాట్లు చేసింది లేదు. ఎక్కడ ఏ విధమైన విషయాలలో కూడా అశ్రద్ధ లేదు. కారణం ఒకటే! ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే, విలువలతో కూడిన జీవితం మాత్రమే మన విలువను పెంచుతుందని తెలుసుకున్నాను. స్వామి చెప్పింది ఇదే కదా "బాధ్యతనే భగవంతుడు – పనియే పూజ"

అర్ధ రాత్రి 12 గంటలు దాకా పని చేసిన రోజులున్నాయి. ఆ కంపెనీలో పని చేస్తున్నప్పుడు నేను సుమారు 50 కంపెనీలను రిజిస్టర్ చేశాను. సంస్థలో నేను లక్సంబర్గ్ స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో కంపెని షేర్లను లిస్ట్ చేశాను. అలాగే, FCCB ఇష్యూ కూడా నిర్వహించాను. ఇలాంటి ఎన్నో వైవిధ్యమైన సెక్రటేరియల్ పనులను ఎంతో సమర్థ వంతంగా నిర్వహించాను. చాలా విశేషంగా వాళ్లు నన్ను ప్రేమించారు, గౌరవించారు. తప్పు చేస్తే ఎవరైనా మందలించడం సహజమే కదా. అటువంటి చెడు అనుభవాలు కూడా ఉన్నాయి, కానీ అన్ని అనుభవాలు ఎన్నో జీవిత పాఠాలను నేర్పించాయి.

అలాగే, ఆ సమయంలో మరొక ఆరు మంది కంపెనీ సెక్రెటరీలకు ఉద్యోగం ఇచ్చాను. 12 వేల రూపాయల జీతంతో మొదలైన నా ప్రస్థానము సురానా గ్రూప్‌లో తర్వాత కాలంలో సుమారు 40 వేల రూపాయల దాకా వెళ్లింది. తర్వాత నేను కంపెనీలో ఉన్న వాళ్లందరికి కృతజ్ఞతలు తెలుపుతూ వీడుకోలు తీసుకునే సమయంలో, సహోద్యోగులు నాపై చూపించిన ప్రేమాభిమానాలను నేను మరువలేను. వ్యక్తిగా నేను భక్తుడైనా కావచ్చు, ఎంత సాధకుడైనా కావచ్చు, ఒక వృత్తి నిపుణుడిగా నన్ను నేను నిరూపించుకోవడం కోసం స్వామి ఇచ్చిన అవకాశంగా దీన్ని తీసుకున్నాను.

ఎక్కడైనా సరే, అవకాశం ఇచ్చినందుకు మనం కృతజ్ఞత భావనతో ఉండాలి. సురానాలో కూడా నేను బయటికి వచ్చేటప్పుడు నేను ఆ సంస్థలో ఉన్న సమయంలో ఎలాంటి పనులు చేసానో వివరిస్తూ స్వామికి ఎలాగ వ్రాస్తానో అలా మంచి ఉత్తరం వ్రాసాను. అది మొత్తం సంస్థ యాజమాన్య బృందానికి, ఉద్యోగులకు పంపించాను. ఆ నాడు నాకు వచ్చిన ప్రత్యుత్తరాలు నేటికి పదిల పరచుకున్నాను.

సంస్థలో అయిదు సంవత్సరాలు పని చేస్తేనే ఎక్స్‌గ్రేసియా వస్తుంది. నరేంద్ర సురానా నన్ను అడిగారు, "ఎంత తుది చెల్లింపు వస్తోంది?" నేను చెప్పాను, "సర్, గత నెల జీతం మాత్రమే వస్తుంది"

అప్పుడు ఆయన అన్నారు, "మీరు మా వద్ద నలుగున్నర సంవత్సరాలు పని చేశారు. మీరు చేసిన పని మాకు ఎంతో సంతృప్తికరంగా ఉంది. ఒక లక్ష రూపాయలను స్వచ్ఛందంగా ఇస్తున్నాం తీసుకోండి," అని ఆ మొత్తాన్ని ఇచ్చారు. ఇవన్నీ చిన్న విషయాలు కాదు, అలాంటి అద్భుతమైన సంఘటనలను స్వామి ప్రసాదించారు.

తర్వాత నాకు దాట్ల హనుమంతరాజు, శివ శక్తి గ్రూప్‌కి పరిచయం చేశారు. అక్కడ జి.వి. ఆంజనేయులు తెలుగు దేశం పార్టీ నాయకులు నన్ను ఇంటర్వ్యూకి పిలిచారు. చాలా పెద్ద సంస్థ... దేశ వ్యాప్తంగా వేలమంది ఉద్యోగులు కలిగిన సంస్థ. ఇంటర్వ్యూకి వెళితే కృతజ్ఞతలు చెప్పి నా విషయాలు అన్ని చెప్పాను. వారు విని చాలా సంతోషపడ్డారు, "ఓ very good, very good" అని చెప్పి. ఉద్యోగం ఇచ్చేశారు. వెంటనే రిపోర్ట్ చేయమని చెప్పారు. బయటికి వచ్చిన తర్వాత ఒక చిన్న ఉత్తరం వ్రాశాను "నమస్కారం సార్! మీరు చాలా దయతో నాకు సమయం ఇచ్చారు. మీలాంటి వ్యక్తితో మాట్లాడటం నాకు చాలా ఆనందమైంది. మీ కంపెనీలో పని చేయడం కోసం నేను ఉత్సుకతతో ఎదురు చూస్తున్నాను. కానీ ముందు కంపెనీలో నేను నోటీస్ పీరియడ్‌లో ఉన్నాను. ఒక నెల త్తర్వాత నేను వస్తాను."

తర్వాత తెలిసింది ఆ ఉత్తరం వారి టేబుల్ మీద గ్లాస్ క్రింద పెట్టుకున్నారని. వచ్చిన వాళ్లందరికీ చూపించారట... ఇది నేను నా ఉద్యోగుల నుంచి ఆశించేది. కొత్త కంపెనీలో చేరుతున్న సందర్భంలో కూడా, పాత కంపెనీలో ఉన్న నోటీస్ పీరియడ్ గురించి మాట్లాడుతున్నారు. ఎంత నిజాయితీ ఈ వ్యక్తిలో ఉంది... అని చెప్పారట.

వారు నాకు తెలిపారు. బాలచంద్ర! చాలా సంతోషం, అట్లాగే నీవు ఎప్పుడైతే అప్పుడురా! శివశక్తి గ్రూప్ యాజమాన్యం అయిన జి.వి ఆంజనేయులు, ఎన్ ఎస్ రావు, శ్రీమతి లీలావతి, కే.ఎన్.రావు, తదితరులతో పని చేసాను. సుమారు 100 కోట్ల వార్షిక వ్యాపార సంస్థ. కంపెనీ సెక్రెటరీగా బాధ్యత చేపట్టిన తర్వాత విశేషమైన పని చేయడము, ఏమి చేసినా ప్రేమతో చేయడం జరిగింది. ప్రతి చిన్న పెద్ద విశేషానికి నన్ను పిలిచే వాళ్లు. అక్కడ కూడా కంపెనీలు నమోదు చేయడము, బోర్డు సమావేశాలను నిర్వహించడం, వారి అధికారిక మరియు అనధికారిక సమావేశాలలో ప్రసంగించడం, ఉద్యోగులకు శిక్షణ అందించడం, వారికి సరైన దిశా నిర్దేశము చేయడము ఇవన్నీ కూడా చేశాను. సుమారు నాలుగు ఏళ్లు ఉన్నాను. అదే సమయం జీవితంలో మొదటి కార్ కొన్నాను. అంటే ప్రతి విషయము స్వామితో లింక్ ఉండేది. కారణము, ప్రతి వారాంతం కూడా అక్కడికో ఇక్కడికో వెళ్లాల్సి వచ్చేది స్వామి కార్యంలో. తిరగడానికి బాగా ఇబ్బంది అయిపోయేది. ఆటోలో తిరగడము, బస్సులో తిరగడము జరిగేది. అదే కారు ఉంటే కార్‌లో ఇంకో నలుగురిని తీసుకెళ్లొచ్చు కదా! అని ఆలోచన. ఆ జిల్లాకి ఈ జిల్లాకి కార్‌లో వెళ్లిపోయే వాళ్లము. మొదటిది టాటా ఇండికా తీసుకున్నాను. ఆ కార్‌లో నేను స్వకార్యము, స్వామి కార్యము రెండు చేశేవాడిని. నాకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారంటే ఆ కంపెనీలో, ఈ వ్యక్తి అద్భుతమైన వ్యక్తి, నిస్వార్థంగా ఉన్నాడు, విలువలతో ఉన్నాడు, నిజాయితీతో ఉన్నాడు, కలుషితం లేకుండా ఉన్నాడు, రాజకీయాలు లేవు, అని చక్కగా నన్ను ఒక ఆత్మీయుడిలా చూసేవారు. శివశక్తిలో రాజీనామా చేసి మరొక ఉద్యోగానికి వెళ్తూ ఉంటే, అక్కడి యాజమాన్యం మరియు సిబ్బంది ఆత్మీయమైన వీడ్కోలు పలికారు. సంస్థ చైర్మన్, జి.వి ఆంజనేయులు నన్ను కావలించుకొని, శాలువా కప్పి, బహుమతి ఇచ్చి ఏం చెప్పారో తెలుసా... "నీలాంటి తమ్ముడు నాకు ఉంటే నేను ఎన్ని పనులైనా సునాయాసంగా చేయగలను. ఇలాంటి తమ్ముడు కావాలయ్యా నాకు" అని చెప్పి చాలా ప్రేమతో నన్ను సాగనంపారు.

అక్కడ వీడ్కోలు తీసుకొని నేను మరో కంపెనీలో చేరాలని వెళ్లాను. ఆ కంపెనీ ICOMM Group, టెలికామ్ టవర్స్ తయారు చేసే పెద్ద కంపెనీ. సుమారు 1000 కోట్ల కంపెనీ. అక్కడ ఆత్మీయులు PS రావు నన్ను సూచించారు. వాళ్లు చాలా సంతోషపడి సుమారు రూ.50,000 జీత

భత్యాలు ఇవ్వాలని నిర్ణయం చేశారు. అక్కడ కూడా సుమారు నాలుగు సంవత్సరాలు ఉద్యోగం చేశాను. అప్పుడే వారి పబ్లిక్ ఇష్యూకు సంబంధించిన పనులను నిర్వహించాను. అప్పుడు, నేను అర్ధరాత్రి వరకు ఆఫీస్‌లో ఉండేవాడిని. అందరూ నన్ను బాగా విమర్శించే వారు, ఏ కంపెనీలోనైనా. ఏంటబ్బా వీడు అసలు వేళా పాళా లేకుండా ఆఫీస్‌లో పని చేస్తూ ఉంటాడు. వీడికి పని పాటలేదు. పెళ్లాం పిల్లలు లేరు. ఇల్లు వాకిలి లేదు. వీడు ఇంతే, అని అనుకునే వారు... చిన్న చూపు చూసేవారు. కానీ నాకు ఏ అవకాశం వచ్చినా దాన్ని నేను చక్కగా పూర్తి చేయాలి అనే ఆలోచనలో ఉండేవాడిని. నా చుట్టూరా ఉన్న వాళ్లు, నా సహోద్యోగులు కూడా నన్ను చాలా సార్లు అర్థం చేసుకోలేక పోయేవాళ్లు. అయినప్పటికీ, నేను వారిని ప్రేమించేవాడిని, వారిని నా సొంత మనుషుల్లా గౌరవించే వాడిని. వారు మొదట నన్ను తప్పుగా అనుకున్నా, ఆ తరువాత అర్థం చేసుకునే వాళ్లు. అలా అందరూ నన్ను ప్రేమించడం మొదలుపెట్టారు.

IPO (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) ఫైల్ చేయాల్సిన సమయంలో, నేను నెల రోజుల పాటు ఆఫీస్‌లోనే ఉండిపోయి పని పూర్తి చేశాను. నేను ఒక్కటే తలుచుకుంటాను, ఎప్పుడైనా సరే నిజ జీవితములో విలువలని మనము ఆచరించినప్పుడే స్వామికి నచ్చుతుంది అని ఎన్నో వందల సార్లు స్వామి చెప్పారు. అయ్యా Duty is God అని చెప్పారు కదా! కాబట్టి నేను ఏ పని చేసినా దైవ భావనతో చెయ్యాలి. నెల పాటు బయటకు వచ్చి సూర్య చంద్రులను చూడలేదు. ఒక చిన్న రూమ్‌లో, అక్కడే బాత్రూము, అక్కడే తినడం, అక్కడే పడుకోవడం, అన్ని అక్కడే ఎందుకంటే... లండన్ ఏజెన్సీస్‌తో నేను మాట్లాడే అవసరం ఉండేది. ఆ సమయంలో నేను నిద్ర పోకూడదు. రాత్రంతా వాళ్లతో పని చేయడం, పొద్దునంతా ఇక్కడ ఆఫీస్‌లో పని చేయడం ఇలాగ చేసి 30వ రోజున నేను విమానం ఎక్కి బాంబే స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో విజయవంతంగా IPO పత్రాలు దాఖలు చేయగలిగాను. ఇది ఒక అద్భుతమైన అవకాశం నాకు. సంస్థ బోర్డు సభ్యులు చాలా సంతోషపడ్డారు.

కానీ, ఆ ఏసీ గదిలో ఉండి, సూర్యరశ్మి కూడా సోకని కారణంగా శరీరం అంతా కూడా వాపు వచ్చేసింది. హడావుడిగా నేను ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. అయినా సరే, స్వామి చెప్పిన విధంగా పని చేసాను.

సంస్థ నిర్దేశకులు సంతోషపడి నన్ను ఎంతో ప్రశంసించారు. ఈ రోజుకి కూడా వీళ్లందరితో నా అనుబంధం, సంబంధం అలాగే ఉంది అంటే నమ్ముతారా?

ఆ తర్వాత నేను, మిత్రుడు వాసుదేవరావు ద్వారా NCC గ్రూప్‌లో చేరాను. స్వామి వారి చిరకాల భక్తుడు AVS రాజు స్థాపించిన సంస్థ. నేను దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు ఉన్నాను. 1996లో కేవలం 750 రూపాయల జీతంతో మొదలైన నా జీవితం NCC ఉద్యోగం చేస్తున్నప్పుడు సుమారు లక్షన్నర రూపాయలకు చేరింది.

కానీ 2011లో, "ఏంటిది? నేను ఏం చేస్తున్నా? లక్షలు సంపాదించడమే నా జీవితమా? లక్ష్యాల కోసం నేను బ్రతకద్దా? అని చాలా సంఘర్షణకు లోనయ్యాను.

సేవల కోసమై ఉద్యోగం చేసిన ప్రతి చోటా కూడ తరచుగా సెలవు పెట్టడము కాస్తా కష్టంగానే ఉండేది. రాను రాను నేను సేవల కోసమై ప్రతి వారాంతము వెళ్లాల్సి వచ్చేది. నన్ను ఎవరైనా పిలవాలి అంటే వాళ్లు 15 రోజులు ముందే పిలవాలి. అంత గ్యాప్‌తో మాత్రమే నేను షెడ్యూల్ ఇవ్వగలిగే పరిస్థితి.

అలాంటి పరిస్థితులలో చేసే ఉద్యోగంలో సంపాదించే డబ్బులో శాంతి దొరక లేదు... సేవ

చేయాలన్న ఆకలి నన్ను నిలువనీయలేదు. ఇల్లు, వాకిలి, పెళ్లాం, పిల్లలు ఎవరూ లేరు కదా... నేనెందుకు ఇలా లక్షలు సంపాదించడం? సేవా లక్ష్యంతో జీవిస్తే ప్రతి క్షణం పరహితం కోసం ఉండొచ్చు కదా! అలా బ్రతికితే జీవితం జన్మ రెండూ సార్థకం అవుతాయి కదా!! అనే ఆలోచనలు వచ్చేవి. ఈ ప్రాసెస్‌లో ఉద్యోగము మీద దృష్టి నిలుపలేక చీవాట్లు కూడా పడ్డాను. నా పై అధికారులు నన్ను చులకనగా చూసే వాళ్లు. ఇలా ఏమి చేయాలో తెలియక యాతన అనుభవించే వాడిని.

2011లో ఒక రాత్రి ఇక ఇలా కాదు, నేను పూర్తికాల సేవకుడిలా ఉండాలనని నిర్ణయించు కున్నాను. మరుసటి రోజు రాజీనామా చేసి, 'ఇప్పుడు నేను సేవ కోసం అందుబాటులో ఉన్నాను' అని ప్రకటించాను.

పెద్ద వాళ్లు కొందరు అలాకాదు... కనీసం పార్ట్ టైమ్ చేయమని సలహా ఇచ్చారు. ఆత్మీయులు PS రావు నన్ను GVPR గ్రూపు యాజమాన్యానికి పరిచయం చేశారు. సుమారు 1000 కోట్ల నిర్మాణ సంస్థ అది. ఆ సంస్థ అధ్యక్షుడు GSP వీరారెడ్డి నన్నెంతో ఇష్టపడ్డారు. నేను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి విని ముచ్చట పడి పార్ట్ టైమ్ గానే వచ్చి వెళ్లమని చెప్పారు. లక్షలు ఇచ్చారు. అక్కడ అది కూడా మానేసి దశాబ్ద కాలం అయినా కూడా వారు మాత్రం ఇంకా నాకు భత్యం ఇస్తూనే ఉన్నారు. ఇలా నా సేవా ప్రస్థానం సుమారు రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతోంది.

80

సత్యం వద... ధర్మం చర: కె.వి. రామకృష్ణ

2007 అనుకుంటాను. శివశక్తి సంస్థల నుండి నేను ICOMM సంస్థలో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. ఆత్మీయులు, మార్గదర్శి అయిన CS PS రావు నన్ను అక్కడి యాజమాన్యానికి పరిచయం చేశారు. సుమంత్ ఆ సంస్థ కార్యనిర్వహణ చేస్తున్నారు. నన్ను చూసి, నచ్చి... నాతో మాట్లాడి, నాకు ఉద్యోగం ఇచ్చారు. చాలా పెద్ద సంస్థ... అందులోనూ ముంబై నుండి ఇన్వెస్టర్లు కూడా పెట్టుబడులు పెట్టారు. వ్యాపార నిర్వహణ మరియు యాజమాన్య అజమాయిషీ చాలా బాధ్యతతో కూడి ఉండేది. తరచుగా ఉన్నత ఉద్యోగులను కలవడం జరిగేది. బోర్డు మీటింగ్‌లు కూడా చాలా నిక్కచ్చిగా జరిగేవి. చాలా కీలకమైన బాధ్యత నాది. ఎంతో జాగ్రత్తగా పని చేసేవాడిని. కానీ సేవ ఎక్కడా ఆగలేదు. ఆఫీసులో కొత్త పరిచయాలు... కొత్త వాతావరణానికి ఇంకా అలవాటు పడుతున్నాను. అలాంటి సమయంలో మొదటి సారి బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసాము. సంస్థ లోపలి నుండి మరియు బయట నుండి డైరెక్టర్లు మరియు ఆడిటర్లు వచ్చారు. నేను చాలా ఉత్సాహంగా అందరిని ఆహ్వానిస్తున్నాను.

ఇంతలో ఒక అపరిచితుడు సూటు బూటుతో, వచ్చి రాగానే నన్ను స్నేహంగా పలకరించాడు... ఏయ్! నువు బాలచంద్ర కదా!? అంటూ! నేను వారికి నమస్కరిస్తూ... ఒకింత ఆశ్చర్యంతో అడిగాను. ఔనండి. నేనెలా మీకు తెలుసు అని. మీ పేరు ముంబైలో కూడా తెలిసిపోయింది అని అతడు చెప్తుంటే చాలా అంటే చాలా ఆశ్చర్య పోయాను. వారు, ముంబై నుండి బోర్డు మీటింగ్‌కు వచ్చిన KV Ramakrishna, Independent Director, ICOMM అంతే కాక Head, Kotak Pvt Equity Fund. హైదరాబాద్‌కు రాక మునుపే నా గురించి తెలుసుకోవడం అంటే సామాన్యమైన విషయం కాదు. తరవాత తెలిసింది హైదరాబాద్ వాస్తవ్యులైన CMA A దుర్గాప్రసాద్, అప్పటి కాస్ట్ అకౌంటెంట్స్‌కు దేశాధ్యక్షులు, మాటల సందర్భంలో సేవా కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నపుడు

నా ప్రస్తావన వచ్చిందట. అంతేకాక, నేను అభయ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవల గురించి కూడా తెలిపారట. నాకు ఎంతో ఆనందం అయ్యింది.

వారు చాలా చురుకుగా, కంపెనీ బోర్డు మీటింగ్‌లో భాగం వహించారు. నాకెంతో ఉత్సాహం కలిగింది వారిని చూసినపుడు. వారు హైదరాబాద్‌లో కంపెనీ సమావేశాలకు వచ్చినప్పుడు మా పరిచయం పెరిగింది.

మొట్ట మొదటి సారి... ఒక వృత్తి నిపుణుడు సరైన వాడై ఉంటే... వ్యక్తులను... వ్యాపారాలను... వ్యవహారాలను... వాణిజ్యాలను... యాజమాన్యాలను... పరిశ్రమలను ఎంత ప్రభావితం చేయచ్చు అని నేను గమనించాను. చేస్తున్న ఉద్యోగానికి 100% న్యాయం చేయడం ఎలా? అన్నది వారిని చూసినప్పుడు అర్థం అయ్యేది. అరే, ఎక్కడైనా మనుషులు ఇంత సౌమ్యంగా, సుహృద్భావంగా, సునిశితంగా, కర్తవ్య నిర్వహణ చేయగలరా అనిపిస్తుంది. ఎలాంటి గురువులు లేకుండా ఏ ఆధ్యాత్మిక వాదము లేకుండా... ఇలా జీవించడం సాధ్యమా అని అచ్చెరువొందాను కూడా.

నన్ను అత్యంత ప్రభావితం చేసిన కొద్ది మంది వ్యక్తులలో నేను తప్పక జీవితాంతం గుర్తుంచుకునే వ్యక్తి రామకృష్ణ. కె వి రామకృష్ణ 1969లో తెలంగాణలోని వరంగల్‌లో శ్రీమతి కె సుశీలా దేవి & డాక్టర్ కె.సుబ్బారావు దంపతులుకు జన్మించారు. వరంగల్‌లోని ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌గా పట్టభద్రుడయ్యారు. ఆ తరవాత యాజమాన్య శిక్షణలో భాగంగా పూణేలోని టాటా మోటార్స్‌లో చేరారు.

ఆ తరవాత కాలంలో IIM బెంగళూరు నుండి మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ఉషా సుందరిని వివాహం చేసుకున్నారు. వారి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుతున్నారు. కుమార్తె శ్రుతి బెంగళూరులోని నేషనల్ లా స్కూల్‌లో ఆమె B.A.LL.B.,(Hons) చేసి, అమెరికాలోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో LL.M, చదివింది. కుమారుడు చైతన్య B.Com., చేసి, CA చేస్తున్నాడు. వీరంతా సంతోషంగా ముంబైలో నివసిస్తున్నారు.

సుమారు 2.5 దశాబ్దాలకు పైగా ఆర్థిక పరిశ్రమలో ఉండి... నవంబర్ 2021లో పూర్తి స్థాయి ఉన్నతోద్యోగానికి రాజీనామా చేసి తమ సమయాన్ని అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్న ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తలకు మరియు దిగ్గజ వ్యాపార సంస్థలకు మార్గదర్శకత్వం చేస్తూ మరియు సలహాలు సూచనలు ఇస్తు గడుపుతున్నారు.

నిజానికి ఆధ్యాత్మికత అంటే ఏమిటి!? చదువు, ఉద్యోగం, సంసారం, బాధ్యతలు అన్ని వదిలేసి జీవించడమా? ఈ రోజు ఎంతో మందిని సమాజంలో చూస్తుంటాము... ఇదే కదా నిజం అనిపిస్తుంది కూడా. కానీ, శ్రీ సత్య సాయి సిద్ధాంతాలను మనం అర్థం చేసుకుంటే నిజమైన ఆధ్యాత్మికత అంటే... నూటికి నూరు పాళ్లు అన్ని పాత్రలను ధర్మబద్ధంగా పోషిస్తూ జీవించడమే అని అర్థం అవుతుంది.

ఎంత ఎదిగినా కూడా... తనను కని పెంచిన వాళ్లను కనిపెట్టుకుని జీవించడం నిజమైన ఆధ్యాత్మికత... వరంగల్‌లో వారి తల్లి తండ్రులు (ప్రస్తుతం 90+ సంవత్సరాలు) ఎంతో స్వతంత్రంగా జీవిస్తూ, వారు దాచుకున్న డబ్బుతో ఒక ధార్మిక సేవా సంస్థను ఏర్పాటు చేసి, తద్వారా ఎంతో మందికి సాయం చేస్తున్నారు. వాళ్లకు చేదోడు వాదోడుగా ఉండటం మాత్రమే కాదు... వాళ్ల బాగోగులు చూసుకుంటూ... వారి వయసు ముదిరిపోయిన సమయంలో వారికి నచ్చ చెప్పి... వారితో పాటుగా తాము ఉండాలని, తల్లితండ్రులను ముంబైకి తీసుకుని వెళ్లడం సామాన్యమైన విషయం కాదు. కేవలం తనను కన్న వాళ్లనే కాదు... కట్టుకున్న శ్రీమతిని, కన్న బిడ్డలను... అందరినీ

ప్రేమానురాగములతో చూసుకోవడం ఈ రోజుల్లో చాలా అరుదుగా చూస్తాము. కానీ ఒక సంపూర్ణ వ్యక్తిగా... పరిపూర్ణ మానవుడిలా తన వారిని చూసుకునే విధానం ఎంతైనా అభినందనీయం.

ఒక మనిషిగా ఎలా బ్రతకాలి అన్నది వీరిని గమనిస్తే అర్థం ఔతుంది. ఒక కొడుకుగా, ఒక తోబుట్టువుగా, ఒక భర్తగా, ఒక అల్లుడిగా, ఒక తండ్రిగా, ఒక ఉద్యోగిగా, ఒక యజమానిగా, ఒక సామాజిక సేవకుడిగా, ఒక ధర్మ కర్తగా ఇలా ఏ పాత్రలో వీరిని చూసినా... అరెరె ఇలాంటి వ్యక్తిత్వం కదా మనం కోరుకోవాల్సింది అనిపించక మానదు.

నేను ICOMMలో 2010 దాకా పని చేశాను. అక్కడ పని చేసిన 4 ఏళ్లు కూడా వారు నన్ను చాలా సునిశితంగా గమనించే వారు... వయసులో తేడా పెద్దగా లేదు... కానీ వారి అనుభవం ముందు నేను అసలు ఏమి పనికి రాను అని చెప్పాలి. చాలా సార్లు నన్ను సరిదిద్దే వారు... దిశ దశ చూపే వాళ్లు. ఈ ప్రయాణంలో... అభయ సంస్థ ద్వారా చేసే పనులు వారు తెలుసుకున్నారు. ఒక సారి అభయ ఆనంద నిలయాన్ని సందర్శించి నన్ను ఎంతగానో ప్రశంసించారు. అప్పటి నుండి ఎప్పుడు వీలుంటే అప్పుడు సలహాలు ఇస్తూ... అభయ సంస్థకు తమ చేయూత నందించే వారు.

గత దశాబ్ద కాలంగా ప్రతి మూడు నెలలకి ఒక సారి వారు భూరి విరాళం పంపిస్తూనే ఉన్నారు. మాటల కంటే కూడా చేతలు ఎంత ప్రభావితం చేస్తాయి అన్నది వారిలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. చాలా సందర్భాలలో నాకు సలహాలు సూచనలు ఇచ్చేవారు.

నేను ICOMM సంస్థను వదిలి వెళ్లిన తరవాత కూడా వారి స్నేహం నేను విడువలేకపోయాను. 2016 అనుకుంటాను... మొదటి సారిగా అభయ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయిలో మార్గదర్శకులు ఉండాలని చర్చించారు. అప్పుడు దేశ వ్యాప్తంగా అత్యంత ప్రభావవంతులైన మంచి వాళ్లను సభ్యులుగా తీసుకోవాలని అనుకున్నాం. అలా అర్థించి జాతీయ మార్గదర్శన్ మండలిలో సభ్యులుగా తీసుకున్న 9 మందిలో రామకృష్ణ ఒకరు. ఆనాటి నుండి నేటి దాకా అభయను వదలలేదు. గత దశాబ్ద కాలం నుండి వారు అభయ సంస్థకు చేసిన సేవలు అసామాన్యం అని చెప్పాలి. వారి సహచర్యంలో అభయ సంస్థ ఎన్నో రకాలుగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం వారు అభయ బోర్డు ట్రస్టీగా మరియు గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

వారి నుండి నేను నేర్చుకున్న పాఠాలు చాలానే ఉన్నాయి. అసలు అంత ఉన్నత స్థాయి వ్యక్తులు ఎవరైనా సరే చాలా గుంభనంగా గంభీరంగా వ్యవహరిస్తుండటం మనం చూస్తుంటాము. కానీ వీరి శైలి మాత్రం సదా సాదా సీదాగా ఉంటూ, ఎవరికైనా సరే ఇట్టే అర్థం అయ్యే విధంగా ఉంటారు. నా జీవితంలో, ఈ రోజుకు కూడా ఇంకా ఏదైనా నేర్చుకోవాల్సి ఉంది అన్నది వీరిని చూసినప్పుడల్లా అర్థం అవుతూ ఉంటుంది. జీవితంలో వారిని గమనించినపుడు... వారినుండి నేను ఏమైనా నేర్చుకోవాలి అంటే ఇదిగో ఈ క్రింద పేర్కొన్న పాఠాలు గుర్తించుకుంటాను. ఈ పాఠాలు జీవిత పాఠాలు... ఎవరికైనా అవసరమే సుమా!!

Ready to Team:

యుక్త వయసులో పది మందితో చేరి పని చేయడం సహజంగా జరిగేది. వయసు ముదురుతున్న కొద్దీ చుట్టూతా జరిగే వివిధ సంఘటనల వలన... రోజూ చూసే వ్యక్తులు, వారి విభిన్న వ్యక్తిత్వాలు చూస్తూ... నాలో బృంద స్ఫూర్తి లోపిస్తోంది అనిపిస్తుంది. ఎంత ప్రయత్నం చేసినా నా చుట్టూరా ఉండే వాళ్లను కలుపుకుని వెళ్లేలా కాకుండా చుట్టూ ఉండే వాళ్లను నాతో పాటుగా తీసుకుని వెళ్లే అలవాటు ఎక్కువ అయ్యింది. వారిని చూసినప్పుడు టీం వర్క్ అన్నది ఎంత

ప్రధానమో మళ్లీ మళ్లీ గుర్తుకు వస్తుంది. అంత ఎదిగినా సరే అందరికీ ఆమోద యోగ్యంగా మాట్లాడటం, తమ అభిప్రాయాలను మృదువుగా వ్యక్తపరచడం, అందరితో చేరి చేయి చేయి కలిపి పని చేయడం అన్నది వారిలో గమనించాల్సిందే. ఎన్నో పర్యాయాలు సంస్థ సభ్యులు పని చేసే సందర్భంలో... దిశా నిర్దేశం కోసం నా వైపు కాకుండా ఎంతో సహజంగా వారి వైపు చూడటం నేను గమనించాను. కారణం ఏదైనా పని చేసే సందర్భంలో వారి బృంద స్ఫూర్తికి అందరూ కూడా ఆకర్షితులై వారి సూచలకోసమై ఎదురుచూస్తారు. ఇది ఒక అద్భుతమైన విషయము. ఇది నేర్చుకోవాల్సిందే... నేనైనా మరెవరైనా!

Rigorous Support:

ఎంతో ఉన్నత స్థాయిలో... తమ పనులలో తలమునకలుగా ఉన్నా సరే! అవసరం వచ్చింది అంటే ఎంత చిన్న పని నైనా చేయడానికి వారు చూపే ఉత్సాహం చాలా అరుదైన నాయకత్వ లక్షణంగా నేను గ్రహిస్తాను. చాలా సందర్భాల్లో తమ స్థాయికి తగిన పనులు చేస్తారు ఎవరైనా కానీ స్థాయికి తగని పనులు చేసేందుకు చాలా మంది ముందుకు రారు. కానీ, సంస్థ బాగు కోసమై, వారు కార్యనిర్వాహకుల కోసమై... HR మేనేజర్ అవతారం ఎత్తేది చూసాను. ఎవరికైనా ఉత్తరాలు వ్రాయాలి అంటే, వ్రాసిన కంటెంట్‌ను ఇంప్రూవ్ చేయాలంటే, PPT చేయాలంటే, ఉపన్యాసం తయారు చేయాలంటే, ఇలా ఎంత చిన్న పని ఉన్నా స్వయంగా సమయం ఇవ్వడం అన్నది అద్భుతమైన నాయకత్వ లక్షణం. చేసేవి చిన్నపనులే ఐనా సంస్థ కోసమై తమ స్థాయిని తగ్గించుకుని పని చేయడం ఒక అద్భుతం. అది నాయకులు ఎవరైనా సరే సాధించాల్సిందే. ఏదైనా సరే బృందంలో నిర్ణయం చేశారు అంట, ఒక నిబద్ధత కలిగిన సైనికుడిలా తను కూడా అందరితో పాటుగా నిల్చొని ఆ చేసే పని చిన్నదా పెద్దదా అన్న ఆలోచన లేకుండా వంద శాతం పని చేయడం వారిని చూసి నేర్చుకోవాలి.

Resourceful:

వనరుల సమీకరణలో వారిని మించిన వ్యక్తిని నేను చూడలేదు. తనకోసం ఏమైనా అడగాలి అంటే వంద సార్లు ఆలోచించే ఆయన, సమాజ సేవలో దేశంలో ఏ మూలలో ఉన్నోళ్లనైనా సరే, ఎవరినైనా సరే కలిసి, వారికి సేవల గురించి వివరించి సంస్థకు మంచి చేయిస్తారు.

వారి కుటుంబాలలో అభయ రాయబారిలా మారి, ఇక ఎవరు కూడా మాకు అభయ గురించి తెలియదు అన్నంతగా అందరికీ చెప్పేస్తారు. వారి ద్వారా కుటుంబ సభ్యులందరికీ కూడా అభయ సేవల గురించి తెలిసింది. వాళ్లంతా కూడా ఏదో రకంగా చేయూతనందిస్తుంటారు కూడా.

తను ఏ వ్యాపార సంస్థకైన సలహాలు సూచనలు అందిస్తున్నారు అంటే, వారి మంచి కోసం ఎలా ఆలోచిస్తారో, అంతే స్థాయిలో అభయ సంస్థను గుర్తించుకొని వారికి పరిచయం చేసి, వనరులను సేకరించి సేవకు అనుసంధానం చేస్తారు. ఇది చాలా అరుదుగా కనిపించే దృశ్యం సమాజంలో.

Right Leadership

మనం దేశంలో చాలా చోట్ల ఎంతో గొప్ప నాయకత్వాన్ని చూస్తూ ఉంటాము. కానీ చాలా అరుదుగా నైతిక నాయకత్వాన్ని చూస్తాము. అలాంటి అరుదైన నాయకుడిని నేను రామకృష్ణలో చూసాను. "సత్యం వద... ధర్మం చర" అన్న ఉపనిషద్ వాక్యానికి వారి జీవితం నిలువెత్తు నిదర్శనం.

Responsible:

బాధ్యత యుతమైన పౌరుల గురించి మనం మాట్లాడుకుంటూ ఉంటాము... కానీ మన చుట్టూరా అలాంటి వ్యక్తులు కనబడరు. ఇదిగో బాధ్యతాయుతమైన వ్యక్తి మరియు వ్యక్తిత్వాన్ని వీరిలో చూడచ్చు. గత 15 ఏళ్లుగా చూస్తున్నాను... తీసుకున్న ఏ బాధ్యత కూడా తప్పింది లేదు. ఆరు నూరైనా, అటు సూర్యుడు ఇటు పొడిచినా, ఎక్కడా ఇసుమంతైనా అటు ఇటు కాకుండా అన్ని పనులు చక్క బెట్టే వ్యక్తిత్వం వారిది. ఎన్నో దైనందిక వ్యవహారాలలో సతమతమైపోతూ సమాజ సేవను చివరి ప్రాధాన్యంగా చేసుకునే చాలామందికి వీరు ఒక మంచి ఉదాహరణ, తమకు ఎన్ని పనులున్నా సరే! సమాజ సేవ జీవితంలో ఒక భాగమే అనుకుంటూ భాధ్యత నిర్వర్తిస్తారు.

Rare Visionary:

సంస్థలు ఎప్పుడూ కూడా కలకాలం నిలవాలి. సమాజ హితం కోసం పాటు పడాలి అన్న ఆర్తితో జీవిస్తుంటారు. ఆ విధంగా వ్యాపార సంస్థలలో, సామాజిక సంస్థలలో ఎప్పుడూ వ్యక్తుల గురించి కాకుండా... వ్యవస్థలను సిద్ధం చేయాలన్న ఆకలితో పని చేస్తుండటం నేను చూసాను. ఇలాంటి వ్యక్తుల సహచర్యంలో నేను దిశను, దశను మార్చుకుంటూ... జీవితాన్ని సార్థకం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను.

Respecting others view

ఈ రోజు సమాజంలో ప్రక్క వాళ్ల అభిప్రాయాలను గౌరవించి నడుచుకోవడం అన్నది చాలా అరుదైన విషయం. ఎంత పెద్ద వాళ్ళైనా సరే... ఎప్పుడో అప్పుడు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ వీరి విషయంలో మాత్రం చేసే ప్రతి పని కూడా సర్వజానామోదమై, సర్వహితమై... సర్వ సంక్షేమం కోసమే ఉండేలాగా చూస్తారు, అది వారి శైలి. అసలు చిన్న పెద్ద అనే తేడా లేదు... ఎంతో మన్నన, మర్యాద వారి ప్రవర్తనలో సహజంగా ప్రకటితము ఔతుంది. నిజానికి ఈ విషయంలో నాకు ఎప్పుడూ తక్కువ మార్కులే వస్తాయి.

ఈ రోజు కూడా... నాకు కష్టం వస్తే చెవి ఇచ్చి వినే అతి కొద్ది మందిలో రామకృష్ణ ఒకరుగా నేను భావిస్తాను. వారి హృదయంలో నాకు ఒకింత చోటు ఉంటుందని భావించి సంతృప్తి చెందుతాను. అన్నట్లు చెప్పడం మరిచాను... ఇప్పుడు వారు వేద మాలిక పుస్తకం తీసుకుని వేదం నేర్చుకుంటున్నారు. భగవద్గీతా తరగతులలో పాల్గొంటారు... స్వాధ్యాయనం చేస్తున్నారు... తీర్థ యాత్రలకు వెళ్తున్నారు... ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేసుకుంటున్నారు. స్వామి గురించి తెలుసుకుంటున్నారు.

81

జగన్నాటక సూత్రధారి సన్నిధిలో, నాటకాలు – పాత్రధారులు

హైద్రాబాద్ యువతకు స్వామి వారి దివ్య సమక్షంలో ఎన్నో అద్భుతమైన సదావకాశాలు ప్రసాదించారు. ప్రతి అవకాశము ఒక దివ్యానుభవాన్ని మాకు పంచింది అని చెప్పాలి. స్వామి ఒకరితో మాట్లాడితే వాడికే ఆనందము. స్వామి ముందు భజన పాడగలిగితే పాడిన వాడికే ఆనందము. స్వామికి ఒకరు ఉత్తరం ఇవ్వగలిగితే వాడికి ఆనందం అవుతుంది. ఎవరికి వారు స్వామితో హృదయ సంబంధం పెట్టుకుని ఉండచ్చు. కానీ ఏక పర్యాయంలో వందల మందికి అనుభూతినివ్వగలిగే అంశం మాత్రం ఒకటి ఉంది అని గ్రహించాము. అదేంటంటే నాటక ప్రదర్శన. హైదరాబాద్ యువత ప్రశాంతి నిలయంలో ఇలాంటి అవకాశాలని చాలానే అందిపుచ్చుకున్నారు అని చెప్పుకోవాలి. ఒక దెబ్బకి 100 పిట్టలు రాలడం అంటే ఇదే!

2003లో శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవా యజ్ఞము సంకల్పం జరిగింది. యావదాంధ్ర దేశంలోని 23 జిల్లాల్లో ఉన్న యువకులందరిని కూడా సమీకరించే ప్రయత్నం చేస్తున్నాము. ఒక ప్రక్క సత్యసాయి సంగీత రసామృతాన్ని స్వామి ముందు అర్పణము చేయాలని, మరో ప్రక్క గ్రామ సేవ మహోద్యమంలో జరిగిన విశేషాలని స్వామికి అందజేయాలని, ఇంకో ప్రక్క స్వామి సన్నిధిలో యువ చైతన్య పద సంచలనం చేయాలని ఆలోచిస్తున్న సమయంలో... సీనియర్ సోదరులకి, స్వామికి ఈ గ్రామాల్లో జరిగిన విశేషాలను ఏ విధంగా చెప్పాలి? ఫోటోలు చూపిస్తే సాధారణంగా ఉంటుంది, వీడియోలు చూపడానికి స్వామి సమక్షంలో సౌలభ్యం లేదు. మరి ఎలా చూపించాలి అని చర్చిస్తున్నాం. స్వామి సంకల్పం ఎలా ఇచ్చారు అంటే... దీన్ని, ఒక డ్రామాలాగా చూపిస్తే ఎలా ఉంటుంది? అని ఆలోచన వచ్చింది. గ్రామాల్లో ఒక రోజు మేమేం చేసేవాళ్లమో అవన్నీ కూడా స్వామి దగ్గర చేస్తే బాగుంటుంది అని, ఆ విధంగా ఊరికే చేస్తే ఏం బాగుంటుంది, పురాణ పాత్రలైన నారదుడు హనుమంతుడిని కూడా తీసుకొని వచ్చి వారి ద్వారా ఈ గ్రామ సేవల గురించి చేప్తే ఇంకా ఎట్లా ఉంటుంది? ఇలా ఇక నిద్రాహారాలు మాని ఎంతో మంది కళాధర్, సాయి గొల్లపూడి, వైసి,

సుబ్రహ్మణ్య సాయి, బాలాజీ, రాఘవేంద్ర, ధరమ్ భాయ్, ధరం వాళ్ల మామయ్య అనుకుంటా పెద్దాయన ఇలా ఒక 20 మంది దీని మీద కూర్చొని ఒక కథా రూపాన్ని తీసుకు వచ్చారు. అందుకు మ్యూజిక్ ఒక మ్యూజిక్ లాగా అద్దడము, గ్రాఫిక్స్ జత చేయడము, నేపథ్య సంగీతం ఏర్పాటు చేయడము, డబ్బింగ్ చెప్పడము, డైలాగులు వ్రాయడము, కథ వ్రాయడము, స్క్రీన్ ప్లే చేయడము, దాన్నంతా కూడా రికార్డ్ చేసి ఒక 90 నిమిషాల పాటు అద్భుతమైన దృశ్య కావ్యాన్ని సిద్ధం చేశారు. సుమారు 100 మంది హైదరాబాద్ యువత నెల రోజుల ముందు నుండి రిహార్సల్ చేశారు. భావవ్యక్తీకరణ, అభినయము, స్వర నియంత్రణ చక్కగా ఉండాలని ఏకంగా ఒక ఫిలిం మేకింగ్ చేశారు. హైదరాబాదులో శివం ప్రాంగణంలో, నిద్రాహారాలు మాని, రాత్రింబవళ్లు సాధన చేసేవాళ్లు. ఎంతో అద్భుతమైన నాటకం తయారయింది.

"పల్లెలో ఒక రోజు" అని పేరు పెట్టాం. పల్లెలో ఒక రోజు అని అంటే.. ఆ గ్రామ సేవ, గ్రామ సంకీర్తన కార్యక్రమం, పల్లకి ఉత్సవము, మెడికల్ క్యాంప్, సత్యసాయి బాల వికాస్, గ్రామస్థులతో చర్చించేది, ఇలా అన్ని కూడా హనుమంతుడు తర్వాత నారద మహర్షి వివరిస్తున్నట్టుగా చేశారు.

సుబ్రహ్మణ్య సాయి, బాలాజీ రాఘవేంద్ర, చాలా అద్భుతంగా తోడ్పడ్డారు. ఆ విధంగా స్వామి ముందు ప్రప్రథమ నాటక ప్రదర్శన చేశాము. ఎంత స్ఫూర్తిదాయకంగా ఉండే అంటే స్వామి అదివరకే ఉపన్యాసం ఇచ్చారు, శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవ యజ్ఞం సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన వేల మంది యువకులకి స్వామి అనుగ్రహ భాషణం చేశారు. కానీ, డ్రామా చూసిన తర్వాత మళ్లీ స్వామి మైక్ ను, టేబుల్‌ని తెప్పించేశారు. స్వామి మైక్ అందుకొని "బంగారు! చాలా సంతోషము. అంతా బాగుంది. కానీ, మీరు ఎక్కడైనా సరే, ఎక్కడున్నా సరే, ఎలాగా ఉన్నా సరే, రాజకీయాలకు మాత్రం దూరంగా ఉండండి." అంటూ చాలా అద్భుతమైన సందేశం ఇచ్చారు. అంటే, ఆయన హైదరాబాదు వాళ్లు ఆనాటి నాటకంలో భాగంగా చేసిన రాజకీయ దృశ్యం గురించి వ్యాఖ్యానించారు, అంతలా స్వామి నాటకంతో మమేకం అయ్యారు. ఆ విధంగా "పల్లెలో ఒక రోజు" చాలా విజయవంతమైనది. దీంట్లో ఎన్నో అనుభవాలు స్వామి ఇచ్చారు హైదరాబాద్ యువతకి. ఐకమత్యంగా ఎట్లా పని చేయాలి? ఒక బృందంలా ఎలా పని చేయాలి? అసలు ఎవరికి రాని సౌండ్ రికార్డింగ్ ఎలా చేయాలి? వీడియో రికార్డింగ్ ఎలా చేయాలి? ఫోటోస్ ఎలా పెట్టాలి? డ్రామా ఎలా చేయాలి? కర్టెన్స్ ఎలా రైస్ చేయాలి? మేకప్ ఎలా ఉండాలి? నేపథ్యం ఎలా ఉండాలి? ఎలా వినూత్నంగా ఎలా చేయాలి? ఎన్ని రకాలుగా అండి... నిజంగా! స్వామి హైదరాబాద్ యూవతకి ఇచ్చిన అద్భుతమైన అవకాశాల్లో... డ్రామా కూడా ఒకటి అని నిస్సందేహంగా చెప్పాలి. ఈ నాటకం విషయంలో నేను ఎంతో సృజనాత్మకంగా కృషి చేసే అవకాశం స్వామి ఇచ్చారు.

మరొక సంవత్సరం స్వామి వారు మాకు రెండో డ్రామా ప్రదర్శన చెయ్యడానికి అవకాశం ఇచ్చారు. డ్రామాకు "లక్షలా? లక్ష్యాలా?" పేరు పేరు పెట్టాము. నేను ఎప్పుడూ కూడా ఈ మాట వాడుతూ. "లక్షల కోసం కాదు బతకాల్సింది, లక్ష్యాల కోసం బతకాలి అని స్వామి సందేశంతో జోడించే వాడిని? మనం అంతా ప్రపంచానికి ఏ విధమైన సందేశం ఇవ్వగలము అనుకుని, లక్షలా? లక్ష్యాల? డ్రామా చేసాము. అందులో కార్పొరేట్ జీవనశైలికి అలవాటు పడిన యువకుడు తాతయ్య దగ్గర ఏ విధంగా విషయాలు వింటాడు, వాళ్ల తాతయ్య తను చేసిన దేశ సేవ అతనికి ఎలా వివరిస్తాడు, అక్కడ ఎక్కడో హిమాలయాల్లో సియాచిన్ కొండ ప్రాంతాలలో సైనికులు ఏ విధంగా ప్రాణాలొడ్డి దేశాన్ని కాపాడుతున్నారు, వాళ్లని చూసి మనం ఏమి నేర్చుకోవాల్సి ఉంది... ఇది

మనం తెలుసుకోవాలి, చెప్పాలి అందరికీ అని అనుకున్నాము.

నాకు గుర్తు, Col గణేష్, ఇండియన్ ఆర్మీలో యువ సైనికాధికారి, అల్వాలు ప్రాంతంలో అనథాశ్రమములో సేవ చేస్తున్నప్పుడు, నన్ను చూసి చాలా ప్రేరణ పొందాడు. తరవాత సియాచిన్‌కు వెళ్లి ఉత్తరం వ్రాశాడు నాకు. "సార్! మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉందండి. యుద్ధ క్షేత్రాలలో ఉంటే, మేము ఎవరి కోసం బతుకుతున్నాము అని ఎప్పుడు ఆలోచిస్తుంటాము. కానీ మిమ్మల్ని చూసిన తర్వాత, ఈ టీంను చూసిన తర్వాత, అబ్బా! మేము ఇలాంటి వాళ్ల కోసం యుద్ధం చేస్తున్నామని ఎంతోస్ఫూర్తి పొందుతున్నామండి" అని నాకు లెటర్ వ్రాసాడు. అది చదివి ఏడ్చాను. ఆ ఉత్తరాన్ని నేపథ్యంగా తీసుకొని, ఆ డ్రామాలో అద్భుతమైన దృశ్యాన్ని సృష్టించాం. మేమంతా డ్రామా వేసేందుకు రెడీగా ఉన్నాం. స్వామి వారు ఎందుకో చూసి చూడనట్టుగా, అంటీ అంటనట్టుగా ఉన్నారు. డ్రామా స్వామి... అంటే, తప్పకుండా! అన్నారు. అందరూ కూడా రెడీ అయి కూర్చున్నాము. స్వామి చూడలేదు. రెండో రోజు కూడా రెడీ అయి కూర్చున్నారు పిల్లలు గంటలతరబడి మేకప్ అన్ని చేసుకుని సాయి కుల్వంత్ సభా మండపంలో, ఆ దశావతార గేటు దగ్గర అందరూ కూర్చోవడం జరుగుతోంది. అలా ఆ రోజు కూడా స్వామి ఏమీ చెప్పలేదు, ఏం చేయాలో తెలియదు, భజన అయిపోయింది, స్వామికి మంగళ హారతి ఇచ్చారు, స్వామి బ్యాటరీ కార్‌లో కూర్చున్నారు, బ్యాటరీ కార్ స్వామి గది దాకా వెళ్లిపోయింది. 'అయ్యో రామ! ఇంక మేము రాత్రి ఊరు వెళ్లాల్సిందే. ఏం చేయాలో తెలియ లేదు. హైదరాబాద్ యూత్ చేస్తున్న సేవలు స్వామి దగ్గర ఉండే ప్రతి చిన్నా పెద్దకు కూడా తెలిసి మమ్మల్ని అక్కడ అందరూ ప్రేమించేవారు. శివ శంకర్, బాయ్స్ హాస్టల్ వార్డెన్, వైసిని కారిడార్‌లో చూసి ఏయ్ వెళ్లు వెళ్లు, స్వామిని అడుగు అని వాడిని ముందుకు తోయడము, వాడు స్వామి ముందుకు వెళ్లి పోవడం, స్వామి వైసిని చూసి ఏమైంది డ్రామా? అని గుర్తు తెచ్చుకోవడం. స్వామి అంతా రెడీ స్వామి, "సరే ఐదు నిమిషాల్లో నేను రెడీ, మీరు రెడీ అయిపోండి. నేను చూస్తాను" అని స్వామి చెప్పడము. ఇది మమ్మల్ని అందరిని కూడా నిజంగా ఒక అద్భుతమైన అనుభూతికి గురి చేసింది. మేమంతా వివశులు ఐపోయాం. అందరం కూడా స్వామి దగ్గరికి వెళ్లి "స్వామి క్షమించండి స్వామి, మీకు ఇబ్బంది పెట్టాం అంటే, "ఏమి ఇబ్బంది లేదు నేను చూస్తాను వెళ్లండి" అని మమ్మల్ని పంపించి ఆ డ్రామాని 90 నిమిషాల పాటు చూసి, చాలా సంతోషించి, మళ్లీ మంగళ హారతి తీసుకొని వెళ్లారు. గ్రూపు ఫోటోలు తీసుకున్నారు. స్వామి సమక్షంలో డ్రామా చేస్తున్న సమయంలో, ఎవరి అనుభూతులు వాళ్లవే! ఆ డైలాగులు వ్రాసిన వాళ్లకి అనుభూతే, పాటలు పాడిన వాళ్లకి అనుభూతే, డాన్స్ చేసిన వాళ్లకి అనుభూతే, ఆ నాటకంలో పాత్ర ధారులు లక్షలా? లక్ష్యాలా!? అందరూ నిజంగానే మమేకం అయ్యారు. తర్వాత కాలంలో చాలా చాలా అద్భుతమైన వ్యక్తులుగా నాయకులుగా తయారు అయ్యారు. కారణం, ఇలా డ్రామా ద్వారా కూడా స్వామి కార్యంలో పాల్గొన్న యువకులు చాలా మంది ఉన్నారు. లక్షలా? లక్ష్యాలా?? నాటకం ఎన్నో వేదికల మీద ప్రదర్శించడం జరిగింది.

ఆ తర్వాత మూడో డ్రామా సంకల్పం ఎలా జరిగింది అంటే... అప్పుడెప్పుడో ఈనాడు ఆదివారం మ్యాగజైన్‌లో, ఒక కథ చదివాను. బీహార్ రాష్ట్రంలో ఒక గిరిజనుడు దశరథ మాంజి సుమారు 30 ఏళ్ల పాటు శ్రమ కోర్చి కొండలని బండలని కొట్టి, కొండను చీల్చి దారి ఏర్పరిచిన కథ. అతని నేపథ్యాన్ని తీసుకొని, మనిషి అనుకుంటే ఏమైనా సాధించగలడు... "కృషి ఉంటే మనుషులు ఋషులు ఔతారు" అనే నాటకం స్వామి వారికి అర్పణ చేయాలని చెప్పేసి, సత్యసాయి గురుకుల సేవా

యజ్ఞంలో భాగంగా ప్రదర్శించాలని సిద్ధం అయ్యాము.

బీహార్ నుంచి దశరథ మాంజిని విమానంలో తెచ్చి స్వామికి చూపించాలని కూడా ప్రణాళిక వేసి అతనిని స్వామి సన్నిధికి తీసుకుని వచ్చాము కూడా. కానీ ఎందుకో తెలియదు, స్వామి ముందు ఆ డ్రామా మేము ప్రదర్శించ లేక పోయాము. ఒక వ్యక్తి గురించి ఇలా చెప్పడం స్వామికి నచ్చలేదేమో అనిపించింది. ఈ విధంగా చేదు అనుభవము నుండి కూడా ఎన్నో పాఠాలు నేర్చుకున్నాము. దశరథ మాంజిని దర్శనంలో మాతో పాటుగా కూర్చో బెట్టుకుని స్వామిని చూపించగలగాము చివరకు. తర్వాత కొద్ది కాలానికి వారు పరమపదించారు. బీహార్ ప్రభుత్వం అతనిని పద్మశ్రీ పురస్కారానికి నామినేట్ చేసింది కూడా.

నాలుగో అవకాశము 2008లో స్వామి ప్రసాదించారు. అది "నమామి భారతీయం". ఈసారి కొత్త తరం నాయకులు, రవికిరణ్, రామచంద్ర ఇట్లాంటి వాళ్లందరూ కూడా సీనియర్ సోదరులు సహాయంతో, సహకారంతో నాటకం చేశారు. ఇవన్నీ చెప్తుంటే, ఆ దృశ్య కావ్యాలను చూసి, చేసిన వాళ్లు, చూసిన వాళ్లు ఎలా అద్భుతమైన స్ఫూర్తి పొందారు అనేది మేము గమనించే వాళ్లం. ఇక తరవాత కాలంలో ప్రతి జిల్లా నుంచి కూడా యువజన బృందాలు ఇలాంటి నాటకాలను తీసుకు రావడము జరిగింది.

నాకు గుర్తు మొట్టమొదటి సారి డాన్స్‌ని కూడా నాటకంలో జోడించడం అది కూడా మేము ఒక ప్రక్క పాడుతుంటే మరో ప్రక్క నృత్యం చేశారు పిల్లలు. అలా విన్నూత్నముగా లైవ్ సంగీతం, లైవ్‌లో పాడటం హైదరాబాద్ యువత స్వామి సమక్షంలో చేశారు. ఏం చేసినా, ఎలా చేసినా, ఏ విధంగా చేసినా అమ్మ ముందు పిల్లలు చేసినట్టుగా ఉండేది అంతే తప్ప అదేదో నిపుణులు చేసినట్టుగ ఉండేది కాదు. అలాగే స్వామి కూడా అమ్మలాగానే స్పందించే వాళ్లు. ఎంతో ముచ్చట పడే వారు. ప్రదర్శన చూస్తున్నంత సేపు సంబర పడే వారు, భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకునే వాళ్లు, అవసరమైన సూచనలు చేసేవారు, అందరికీ బట్టలు పెట్టే వారు, గ్రూపు ఫోటోలు, ప్రసాదం ఇచ్చి సంతోష పరిచే వాళ్లు. డ్రామా నేపథ్యంలో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. తర్వాత పబ్లిక్ మీటింగ్‌లో కూడా నాటకం విషయాలు చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

ఇవన్నీ కూడా చెప్తూ ఉంటే, మమ్మల్ని ఎన్ని రకాలుగా స్వామి ఎలా ఆశీర్వదించారు అని అనిపిస్తుంది. చివరికి డ్రామాల ద్వారా కూడా మాలో నిద్రాణమైన చైతన్యానికి మేలుకొలుపు జరిగింది అనుకోవాలి.

ఇలాంటి సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా మాకు పాట పాడటం వచ్చింది, డైలాగ్ చెప్పడం వచ్చింది, మోడ్యులేషన్లో చెప్పడం వచ్చింది, డైలాగ్ వ్రాయడం వచ్చింది, నేపథ్యం గురించి ఆలోచించడం వచ్చింది, సౌండ్ రికార్డు చేయడం వచ్చింది, వీడియో తీయడం వచ్చింది, నేపథ్య గానము ఎలాగో వచ్చింది, డాన్స్ చేయడం వచ్చింది, మేకప్ చేయడం వచ్చింది, టీం లాగా పని చేయడం వచ్చింది, భక్తి ప్రపత్తులు ఏర్పడ్డాయి. అవకాశం వస్తే చాలు అని ఎవరికి వారు స్వామికి పరిపూర్ణ సమర్పణ భావనతో చేయాలని తపించారు.

ఈ వ్యాసం వ్రాస్తున్న సమయంలో గత దశాబ్ద కాలంగా స్వామి సన్నిధిలో డ్రామాలలో భాగం వహించిన సుమారు 500 మందిని నేను తలుచుకుంటున్నాను. ఎంతో మంది విదేశాలలో స్థిరపడ్డారు. ఎక్కడున్నా సరే స్వామికి అలా అంకితమైపోయి ఉంటారు. స్వామి ఇలాంటి అవకాశాలు కూడా ఇచ్చి మమ్మల్ని మా జీవితాలను సంస్కరించారు.

82

యువకులతో సంస్థ మమేకమైన మధుర ఘట్టం

1989 నుండి 2003వ సంవత్సరం దాకా అంటే సుమారు 14 ఏళ్ల పాటుగా మేము సత్యసాయి సంస్థలలో క్రియా శీల సభ్యులము కాదు. కేవలం యువకులము, భక్తులము, ప్రేమికులము, సేవకులు మాత్రమే అని చెప్పాలి. ఎవరము నాయకులు కాదు.

కానీ, స్వామి వారి అవ్యాజ ప్రేమకి దాసోహమై యావదాంధ్ర దేశంలోని ప్రతి జిల్లాలో, ప్రతి పట్టణంలో, ప్రతి సత్య సాయి కేంద్రానికి మేము వెళ్ల గలిగాము అప్రతిహితంగా సేవలు చేయగలిగాము. దానికి కారణం స్వామి దివ్య నాయకత్వమే అని చెప్పక తప్పదు.

ఎప్పుడు వెళ్లినా ఏదో ఒక ఆదేశము, ఏదో ఒక సందేశము ఇచ్చేవారు. అరే స్వామి దగ్గరికి వెళితే ఈ విధంగా చెప్పారు, మనం ఈ విధంగా చేయాలనే ఒక తపన మమ్మల్ని ఉండనీయనే లేదు. వెళ్లిన ప్రతి చోట, గ్రామ సేవ, యువజన సమ్మేళనము, సత్యసాయి మహావతార దర్శనము, చక్కటి భజన ఇలా ఏదో ఒకటి చేసి అక్కడి వారికి ఉత్సాహ ప్రోత్సాహములు అందించడము జరిగేది. ఇలా ఏమి చేసినా, ఎలా చేసినా, ఎక్కడ చేసినా ఏ విధంగా చేసినా... అక్కడ ఉన్న యువజనలతో మమేకం అవుతూ వారి స్నేహాభిమానాలను సంపాదించుకో గలిగాము. ఎంత అభిమానము అంటే... అసలు ప్రతి రోజు ఏదో ఒక జిల్లా నుంచి పిలుపు వచ్చేది లేదా ఏదో ఒక జిల్లాకి మనం కాల్ చేసే వాళ్లము. ఆ ప్రక్రియలో హైదరాబాద్ యువతకు ఆంధ్రప్రదేశ్ లోని 23 జిల్లాలలో ఉండే యువతకు మధ్య మధురమైన అనుబంధం ఏర్పడింది. ఫోన్‌లో మాట్లాడుకున్నప్పుడు, ఉత్తరాలు వ్రాసినప్పుడు, కలిసినప్పుడు స్వామి చెప్పే మాటల్ని వారికి చెప్పేవాళ్లం. అయ్యా మొన్ననే స్వామి ఇంటర్వ్యూ ఇచ్చారయ్యా! స్వామి దగ్గర శివరాత్రి సేవలు చేసుకున్నాము. స్వామి దగ్గర గురుపూర్ణిమప్పుడు కార్యక్రమం చేసాము. పుట్టు పండుగప్పుడు సేవలు చేసుకున్నాము అని. ఆ విశేషాలు విని వాళ్లందరూ తహ తహ లాడేవారు. అన్నా! మాకు కూడా అలాంటి అవకాశం కావాలంటే మేము ఏం చేయాలి? మేము ఏ విధంగా చేయాలి? మేము కూడా చేస్తాం, మీరు

చేస్తున్న సేవలు మాకు ఎంతో ఉత్సాహంగా ఉన్నాయని చెప్పుకునే వాళ్లు.

అలాంటి సందర్భంలో, స్వామి మాటలు సందేశాలు చాలా అద్భుతమైన ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. "బంగారు! ఇలాంటి సేవలు అన్ని జిల్లాల్లో చేయాలి. అలాగే మీలాంటి బృందాలు అన్ని జిల్లాల్లో కూడా తయారు చేయాలి. మీరు వందల మంది కోసం ప్రయత్నం చేయదు. అద్భుతమైన త్యాగనిరతి, సేవా దృక్పదం ఉన్న వాళ్లని ఐదు మందిని తీసుకురండి, నేను టీ పార్టీ ఇచ్చి పంపిస్తాను" అంటూ చెప్పిన విశేషాలు. "బంగారు! గ్రామ గ్రామాన, ఇంటింటా, వీధి వీధిన సాయి నామాన్ని ప్రతిధ్వనింప చేయండి" అని ఇచ్చిన స్పష్టమైన పిలుపు, ఇదంతా కూడా మాలో అద్భుతమైన శక్తిని నింపిందని చెప్పొచ్చు.

ఇలాగ ఎన్నో రకాల కారణాల వల్ల మేము 2002 సంవత్సరంలో మేధోమధనం చేసాము. మేము అనుభవించే ఆనందాన్ని, మేము ఆస్వాదించే స్వామి ప్రేమానురాగాలని యావత్ ఆంధ్ర దేశంలో ఉన్న యువజనులకు ఏ విధంగా అందించగలము అని అహోరాత్రులు నిద్రాహారాలు మాని ఏం చేయొచ్చు అనుకుంటూ తపించే వాళ్లము.

మాకు స్వామి ఉపదేశించిన
గ్రామ సేవయన్న రామ సేవయే సుమీ
రామ రాజ్యమన్న ప్రేమమయమే
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయ్యా
సేవ లేక యున్న శాంతి లేదు

ఈ నాలుగు గీతల పద్యం మా అందరికి తారక మంత్రముగా మారిపోయింది. "గ్రామ సేవ" స్వామికి చాలా ఇష్టం అని గ్రహించాము. గ్రామ చైతన్యమే మా లక్ష్యం కావాలి. అదే ప్రథమోద్దేశం కావాలి అని ఏకాగ్ర చిత్తంతో, ఏకాత్మ భావంతో, తదాప్య భావనతో, ఆధ్యాత్మ చింతనతో, అనుభవైక జ్ఞానముతో స్వామి మెప్పు పొందాలంటే యువకులందరూ కూడా గ్రామాలకు వెళ్లాలి, సేవలు చేయాలని నమ్మాము అంతే! ఇలా మాకు చెప్పిన నాయకుడు గాని, దేశా నిర్దేశం చేసిన సంస్థ గాని ఏమీలేదు అని చెప్పాలి. మాకున్న ఒకే బ్రహ్మాండ నాయకుడు, భగవాన్ శ్రీ సత్య సాయిబాబా. ఆయనే మా నాయకుడు, మా ఆధారం, మా మార్గదర్శి, అంతే కాదు తల్లి, తండ్రి, గురువు, సఖుడు, దైవము అన్నీ కూడా సత్యసాయి బాబా అనుకున్నాం.

తదాదిగా, 2002 నవంబర్ తరువాత, మేమంతా చేరి అఖిలాంధ్రరాష్ట్రం అన్ని జిల్లాల్లో గ్రామ సేవలు చేసి, పిల్లలందరినీ స్వామి దగ్గరకు తీసుకెళ్తే బాగుంటుంది కదా అని సాయి సంస్థల పెద్దలకు తెలియజేసాము. స్వామికి కూడా తెలుపుకున్నాము. స్వామి ఎంతో దయతో సానుకూలంగా స్పందించి ముందుకెళ్లమని సంకేతాన్ని ఇచ్చారు. మనకు స్వామి అద్భుతమైన దివ్యానుభవాలని ఇచ్చారు, మనం అంతా ముందుకు వెళ్లాలి అనుకుని ప్రణాళికలు రచించాము.

రాష్ట్రంలో 23 జిల్లాలు, ఒక్కొక్క జిల్లాలో ఐదో పదో చేస్తే, 100 గ్రామాలు అవుతాయి. కానీ అది ఎట్లా అయిపోయిందంటే మాతో మాట్లాడే పిల్లలు ఉత్సాహంతో ఉరకలు వేస్తూ "కాదన్న! స్వామి దగ్గరికి వెళ్లాలంటే ఇంకాస్త చేయాలి అని ఎవడికి వాడు ముందుకు వచ్చి ఒక్కొక్క జిల్లా నుంచి మేము 5, 10, 25 గ్రామాలలో చేస్తాము అంటూ సుమారు 1000 గ్రామాల లిస్ట్ వచ్చిందండి. స్వామిని సంతోష పెట్టాలన్న ధ్యాసతో, సేవను శ్వాసగా చేసి అందరం తదనుగుణంగా ప్రణాళికలు రచించాము.

అలా "శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవా యజ్ఞము" అని నామకరణం చేసి, గ్రామ గ్రామాలలో ఎలాంటి సేవా కార్యక్రమాలు చేయాలి? GRAMA SEVA అన్న అక్రోనియం అందరికీ ఇచ్చాము. దానికి కావలసినటువంటి వనరులు సమకూర్చాము. ఆయా జిల్లాలలో పర్యటించడం మొదలు పెట్టాము. వారాంతం వచ్చిందంటే ఇక జిల్లాల దారి పట్టడమే. వేరే పని పాట లేదు. ఆ జిల్లాలలో ఉండే వాళ్లకు దిశ, దశ చూపడం, డాక్టర్లు కావాలంటే డాక్టర్లను ఇచ్చాము. నాటకానికి డైలాగ్స్ ఇచ్చాము, భజనలు నేర్పించాము, ఉపన్యాసాలు నేర్పించాము, స్వామికి ఉత్తరం ఎలా వ్రాయాలి? స్వామికి టెలిగ్రామ్ ఎలా ఇవ్వాలి? ఏ విధంగా బృందాన్ని తయారు చేయాలి? ఏ విధంగా పశు వైద్య శిబిరం చేయాలి? ఏ విధంగా మందులు సర్దుకోవాలి? మందులు లేక పోతే హైదరాబాద్ నుంచి పంపడం. ఇలా అందరికీ అన్ని వనరులు సమకూర్చే ప్రణాళిక రచించాము.

ఈ విధంగా మా పాట ద్వారా దగ్గరైన వాళ్లు కొద్దిమంది, సేవ ద్వారా దగ్గరైన వాళ్లు కొద్దిమంది, మాటల ద్వారా దగ్గరయైన వాళ్లు ఉన్నారు. ఇలా అన్నిరకాల వ్యూహాలతో భిన్న నేపథ్యాల నుంచి వందల మంది యువజనులు శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవ మహా యజ్ఞ దీక్ష కంకణం ధరించి, సుమారు మూడు నెలల పాటు సేవా సాధనలో గ్రామాల్లోకి వెళ్లారు. చిట్ట చివరికి ఆంధ్రదేశ యువజనులు వారి జిల్లాలలో జరుగుతున్న కార్యక్రమాల ఆల్బమ్స్, వీడియోలు, నివేదికలు ఇలా అన్నీ కూడా ఆయా జిల్లాల నుంచి స్వామికి పంపించడం, ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంగా ఇవన్నీ సమీకరించడం, స్వామికి ఎప్పటికప్పుడు ఉత్తరము ద్వారా, టెలిగ్రామ్ ద్వారా "స్వామి! ఈ విధంగా చేసాము. ఇక్కడ ఇంత అద్భుతమైన పని చేశారు. ఇక్కడ కాలువ త్రవ్వారు. ఇక్కడ బావి త్రవ్వారు. ఇక్కడ ఈ గ్రామంలో పశు వైద్య శిబిరంలో వెయ్యి పశువులకి టీకాలు వేసారు. ఇలాగ ఫలానా గ్రామంలో 2000 మందికి మెడికల్ క్యాంప్ చేసాము. పిల్లలందరూ అద్భుతంగా చేస్తున్నారు స్వామి" అని.

స్వామికి కూడా చాలా సంతోష పడుతున్నారు అని నిలయంలో స్వామితో ఉండే అంతరంగికుల ద్వారా అప్పుడప్పుడు తెలుసుకుని రెట్టించిన ఉత్సాహంతో సేవలు జరిగాయి. సాయి సంస్థలు, భజన కేంద్రాలు, సేవాదళ్ మరియు భక్తులు అందరూ కూడా ఈ కార్యములో మమేకమై స్వామి కార్యంలో ఐక్యం అయ్యారు. చిన్నా పెద్దా తేడా లేకుండా చేయి చేయి కలిపి సేవలు అందించే అద్భుత దృశ్యం ఆవిష్కరించ బడింది.

స్వామి కూడా పిల్లలను చూడాలి అని తపించారు. స్వామి ఈ విధంగా స్పందిస్తున్నారు అని ఎంతో మంది ద్వారా వినడం జరుగుతోంది. ఆ విధంగా గ్రామ సేవ ఉద్యమ ఫలితాలను మనం స్వామి యొక్క సమక్షంలో సమర్పించాలి అని నిర్ణయం చేసుకుని, అక్టోబర్ 20, 2003ను ముహూర్తంగా అనుకుని "శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవా యజ్ఞము" ముగింపు కార్యక్రమాన్ని స్వామి సన్నిధిలో జరుపుకుంటామని విన్నవించుకోవడము, అందుకు దయతో స్వామి సమయం ఇవ్వడము, సుమారు ఆరు వేల మంది యువజనులు యావదాంధ్ర దేశంలోని 23 జిల్లాల నుండి ప్రశాంతి నిలయానికి ప్రయాణం అవ్వడము, ఇవన్నీ చూస్తే స్వామి వారు ఒక అద్భుతమైన మహోద్యమానికి తెరలేపారు అని అనిపిస్తుంది. యావత్ సత్యసాయి సంస్థల చరిత్రలో ఇలాంటి ఒక కార్యక్రమము అప్పటి దాకా జరగనే లేదు అని నేను నమ్ముతున్నాను. కారణం ఏదో చేస్తే ఒకటి రెండు జిల్లాలో చేసి ఉండొచ్చు కానీ, కేవలం యువ జనుల నాయకత్వంలో, గ్రామాలలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క గ్రామం చొప్పున సుమారు 1000 గ్రామాలలో సేవా కార్యక్రమాలు చేసుకుని,

నిత్యావసర సరుకులు ఇవ్వడం, గ్రామీణ గర్భిణి సీమంతాలు, ప్రభుత్వ బడులకి రంగులు వేయడం, బడులలో మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామంలో రోడ్డు వేయడం, వీధి కుళాయిలు ఏర్పాటు, శుద్ధ జల యంత్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామసేవలో స్వామి ఆదేశించిన విధంగా మరెన్నో కార్యక్రమాలు చేపట్టడానికి యువకులందరూ సిద్ధం అయ్యారు. గ్రామాలలోని సమస్యల మీద యుద్ధం చేశారు అంటే సందేహం లేదు. ఏదైనా పెద్ద సమస్య గుర్తిస్తే 5–6 రోజులు దాని మీద పని చేయడము, దాని అంతు చూడడము జరిగేది తప్ప, ఎక్కడా ఎవ్వరూ ఇది మేము చేయలేము అన్నది లేదు. సేవ చేయడం... ఆనందంగా జై బోలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబాజీకీ, జై జై జై అంటూ ముందుకు కదలడం.

జిల్లాలలో యువజనుల ఉత్సాహ ప్రోత్సాహాలకు అంతే లేకుండా పోయింది. ఎప్పుడు వీలైతే అప్పుడు, జిల్లాలకి ఐదారు మంది హైదరాబాద్ యువకులు వెళ్లడము, వాళ్లతో మాట్లాడటం, వాళ్లను ప్రేమించడం, వాళ్ల ప్రేమను అందుకోవడం... అందరం చేరి స్వామిని ప్రార్థించడం చేసేవాళ్లం.

స్వామికి నచ్చింది, స్వామి ఎంతో మెచ్చింది, స్వామిని మా దగ్గరకు రప్పించింది, స్వామిని కరిగించింది ఏమిటంటే అది కేవలం సేవ మాత్రమే అని చెప్పాలి. ఆ సేవలో మమ్మల్ని మేము తరింప చేసుకున్నాము. పల్లకి సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాల ద్వారా వినోదము పంచుతూ, గ్రామస్తులకు ఆధ్యాత్మిక ఆనందమును కలుగ జేస్తూ, వారిలో సేవా దృక్పథాన్ని కలిగిస్తూ... అద్భుతమైన ఆదర్శముతో పిల్లలందరూ కూడా పునీతమైపోయారు. ఈ విధంగా సుమారు మూడు నెలల పాటు గ్రామాలలో సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధమైపోయారు. శ్రీ సత్యసాయి సహస్రగ్రామ సేవ యజ్ఞానికి ముగింపు స్వామి సన్నిధిలో చేసుకోవాలని, 2003 అక్టోబర్ 20 తేదీ లోపుగా అందరం ప్రశాంతి నిలయం వైపు ప్రయాణం చేయడం మొదలు పెట్టాము. ఈ విధంగా ప్రప్రథమ శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవ యజ్ఞము యువకులతో సాయి సంస్థను మమేకం చేసిన మధుర ఘట్టంగా నిలచి, స్వామి యొక్క పాదాల సన్నిధికి అందరినీ తీసుకెళ్లింది.



83

సేవకులను నాయకులుగా మార్చిన సహస్ర గ్రామ సేవా యజ్ఞము

యావదాంధ్ర దేశంలో సహస్రాధిక గ్రామాలలో చేసిన సేవానుభవాలను హృదయంలో నింపుకుని, పునీతులైన వేలాది మంది యువజనులు ప్రశాంతినిలయం చేరుకున్నారు. ఒక్కొక్క జిల్లా నుంచి వచ్చే యువజనుల సంఖ్య రోజు రోజుకు పెరిగి పోతుంది. ఆ సమయంలో స్వామి మాకు ఎన్నెన్నో జీవిత నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, పర్యవేక్షణ సామర్థ్యాలు ప్రసాదించారు. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన వేలాదిమంది యువతను సమర్థవంతంగా ఒకే త్రాటిపై నడిపించగలిగే శక్తిని స్వామి మాకు ఇచ్చారు.

ఫోన్‌లో మాట్లాడటం, నివేదికలు తయారు చేయడం, పిల్లలకు సూచనలు ఇవ్వడం, నివాస సముదాయాలు గుర్తించడం, స్వామి ఇచ్చిన షెడ్యూల్‌ని ఆధారం చేసుకొని ప్రశాంతి నిలయంలో ఏ విధంగా కార్యక్రమాలు చేయాలనే విషయం ఇలా ప్రతిదీ హైదరాబాద్ యువకులే ముందుండి నడిపించారు.

40% మంది భక్తులైన వాళ్లు, 60% మంది కొత్త పిల్లలు వచ్చారు. కొత్త వాళ్లకు పుట్టపర్తి మరియు ప్రశాంతి నిలయాన్ని ఎలా చూపించాలి, వాళ్లను ఎలా ఎంగేజ్ చేయాలి, ఇలా ప్రతి అంశాన్ని కూడా నిద్రాహారాలు మరచి హైదరాబాద్‌లో మాట్లాడుకునే వాళ్లము. ప్రశాంతి నిలయం విశేషాలతో ఒక చిన్న పుస్తకం కూడా ముద్రించాము.

సీనియర్ సోదరులు వైసి, గోపి, కళాధర్, GC, రింగు రాజు, బోయ రాజు ఇలా మరెంతో మంది సోదరులు సాయి కార్యములో చురుకైన పాత్ర పోషించారు స్వామి ఇచ్చిన అవకాశము మాలో నిద్రాణమైన చైతన్యాన్ని నిద్ర లేపింది.

అప్పటిదాకా మాట్లాడలేని వాళ్లు మాట్లాడటం మొదలు పెట్టారు. అప్పటిదాకా వ్రాయని వాళ్లు సంభాషణలు వ్రాయడం మొదలు పెట్టారు. అప్పటిదాకా ఫోటోలు కరెక్ట్‌గా తీయలేని వాళ్లు అద్భుతమైన ఛాయాగ్రాహకులుగా మారిపోయారు. అప్పటిదాకా వీడియోలు తీయని వాళ్లు వీడియోలు

తీయడం మొదలు పెట్టారు. అప్పటి దాకా స్క్రిప్ట్ రాయని వాళ్లు స్క్రిప్ట్ రాయడం మొదలు పెట్టారు. అప్పటిదాకా ప్రదర్శన ఇవ్వని వాళ్లు ప్రదర్శిస్తామని ముందుకు వచ్చారు. గ్రామ సేవా ప్రస్థానంలో స్వామి యావదాంధ్ర యువజనులకు అద్భుతమైన ఐకమత్యాన్ని ప్రసాదించారు. అక్టోబర్ 19, 2003 రాత్రి సమయానికి అందరూ రావడంతో ప్రశాంతినిలయం అంతా కిటకిటలాడి పోయింది. ఈ విశేషాలు ఎప్పటికప్పుడు స్వామి వారికి విన్నవిస్తూ ఉన్నాం, స్వామి ఇన్ని వందల మంది జిల్లాల నుండి వచ్చారు, ఇలా చేస్తున్నాం, ఇలా కార్యక్రమాలు చేస్తున్నాం అని. అక్టోబర్ 20 నాడు సుమారు ఆరు వేల మంది ప్రశాంతిలో గుమిగుడారు. ఇంకా దానికి తోడుగా ఎంత లేదని చెప్పినా కేవలం కార్య నిర్వహకులు మాత్రమే అని చెప్పినా సాయి సంస్థలన్నీ కూడా ఏకతాటి పైకి వచ్చేసాయి. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు, జిల్లా క్రియాశీల కార్యకర్తలు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అధ్యక్షులు ఇలా అందరూ చేరిపోయారు.

స్వామి చాలా సంతోషముగా మమ్మల్ని ఆశీర్వదించారు. ఆ దివ్య సన్నిధిలో ఉన్న నాలుగైదు రోజులు కూడా స్వామి దగ్గర ఉండి చూసుకోవడము, సూచనలు ఇవ్వడం జరుగుతూనే ఉంది. ఒక అద్భుతమైన సమయం అది మా అందరి జీవితాలలో.

ఒక రోజు స్వామి ముందు "శ్రీ సత్యసాయి యువజన చైతన్య పద సంచలనం" చేసాము. ఒక్కొక్క జిల్లా నుంచి ఒక పల్లకి, వారు చేసిన కార్యక్రమాల విశేషాల ఫలకాలు, వాళ్ల యూనిఫార్మ్, సాంస్కృతిక అంశాలను ప్రదర్శిస్తూ భజనలతో స్వామి ముందర సిపాయిల లాగా నడుస్తూ ఉంటే, ఒక ప్రక్క అక్కడ జరుగే కార్యక్రమాల గురించి మైక్‌లో ప్రత్యక్ష ప్రసారం లాగా చెప్పారు.

అందరికి భజన చేసే అవకాశం వచ్చింది. జిల్లాల నుంచి వచ్చిన వాళ్లందరిని కూడా వంతుల వారిగా ఒక్కొక్క దర్శనంలో ఒక్కొక్కరిని స్వామి ముందర కూర్చోబెట్టడము, స్వామికి ఒకరు పువ్వు ఇస్తే, ఒకరు మంగళారతి ఇస్తే, ఒకరు పాద నమస్కారం చేస్తే, ఒకరు బ్రోచర్ ఇస్తే, ఒకరు స్వామికి కలశం అందించే లాగ చేయడం వలన మొట్ట మొదటి సారి ఎంతో మంది యువజనులకి స్వామి అనుగ్రహం దొరికింది.

ఈ ప్రక్రియలో వచ్చిన వాళ్లతో ఏదో కారణాల వలన మాట్లాడటం, పోట్లాడటం కూడా జరిగింది... అన్ని పాట్లు పడ్డామండి. ఏది ఏమైనా మాకున్న ఏకైక ఉద్దేశము, స్వామి సమక్షంలో అందరం ఆ ప్రేమను అందుకోవాలి.

రాత్రి నిద్రపోయేవాడిని కాదు. ఆ ఐడి కార్డులు రాయడము, ట్యాగ్లు వేయడము, వాడికి బ్రోచర్ ఇవ్వడము, వీడికి సూచనలు ఇవ్వడము, ఇంకోడికి వివరణ ఇవ్వడము, షేవింగ్ చేసుకోమని చెప్పడము, మీసాలు తీసేయమని చెప్పడము, వైట్ డ్రెస్ వేసుకో అని చెప్పడము, వినక పోతే అరిచేయడం... తిట్టేయడం కూడా జరిగింది.

నా మీద చాలా మంది ఫిర్యాదు కూడా చేసేవారు రాష్ట్ర అధ్యక్షులకి, వీడు బాగా తిడుతున్నాడు, బాగా ఎక్కువ మాట్లాడుతున్నాడు, ఫోన్లలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడు అని. నాకు మాత్రం అన్నీ స్వామితోనే అనుసంధానమై ఉంటాయి. వచ్చిన పిల్లలందరినీ అన్నదమ్ములనుకుని, వారిని స్వామి సమక్షంలో ఎలా సమర్పించాలి అన్న తపనతోనే వారందరినీ సమన్వయం చేస్తూ ఉండేవాడిని.

ఆ సమయంలో స్వామి మొత్తం ఆంధ్రప్రదేశ్ యువతతో మాట్లాడబోతున్నారని, స్వామి నుండే సమాచారం అందుకున్నాము. పెద్దలు, క్రియాశీలకంగా పని చేసిన పిల్లలు అందరూ సమావేశం అయ్యారు. స్వామి మాట్లాడ బోతున్నారన్న విషయంతో అందరూ దివ్యానందంగా ఉన్నారు. అలాంటి

పరిస్థితుల్లో చర్చకు వచ్చింది స్వామి ముందు ఎవరైనా ఒకరు మాట్లాడాలి అని. అప్పుడు అందరూ కూడా ఏకగ్రీవంగా వైసీ మాట్లాడితే బాగుంటుందని అనుకున్నారు. వైసి చాలా ముందు నుంచి కూడా స్వామి యొక్క కనుసన్నల్లో ఉన్నారు. స్వామికి బాగా తెలిసిన ముఖం, స్వామి కూడా అబ్బాయిని ఆశీర్వాదం చేస్తున్నారు. యావదాంధ్ర దేశంలో అన్ని చోట్ల పరిచయం ఉన్న వ్యక్తి అని వైసీ పేరును ప్రతిపాదన చేశారు. ఆ సందర్భంలో నా పేరు కూడా రావడము, చాలా మంది నేను కూడా మాట్లాడితే బాగుంటుంది అని చెప్పడము జరిగింది. అలాగే మరికొన్ని పేర్లు కూడా వచ్చాయి. రాష్ట్ర అధ్యక్షులు కూడా మాట్లాడాలని అనుకున్నారు. కాబట్టి స్వామి దగ్గర ఇద్దరు ముగ్గురు మాట్లాడే అవకాశం లేదు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్ర అధ్యక్షుడు, యువత తరఫున వైసీ మాట్లాడుతారు అని నిర్ణయమైంది.

నేను రూమ్‌కి వెళ్లిపోయి చాలా బాధగా పడుకొని ఉంటే అర్ధ రాత్రి ఒంటి గంట అప్పుడు వైసీ నన్ను తట్టి లేపి ఒరేయ్ నువ్వు కూడా మాట్లాడుతావ్, నేను కూడా మాట్లాడుతాను అని చెప్పడము నాకు చాలా ఆశ్చర్యమైంది వైసీ అలా చెప్తే ఆనందానికి హద్దు లేదు.

మరుసటి రోజు స్వామి సన్నిధికి వెళ్లి, వారికి వినయంగా నమస్కరించి రాష్ట్రంలో వివిధ గ్రామాలలో జరిగిన విశేషాలు చెప్పడము, ఆ మాటలు వింటూ స్వామి వారు భావోద్వేగానికి గురి కావడం అది చూసి అక్కడ చేరిన వేలాది మంది ఉద్వేగ భరితమైపోవడము జరిగింది. అయ్యో స్వామిని కూడా కదిలించావు అన్నారు.

తర్వాత "పల్లెలో ఒక రోజు" నాటకం స్వామి దగ్గర ప్రదర్శించాము. చివరి అంకంలో ఒక రాజకీయ దృశ్యం చూసిన తర్వాత స్వామి, అప్పటికప్పుడు మళ్లీ మైక్ టేబుల్ తెప్పించి ఉపన్యాసం ఇచ్చారు.

"బంగారు! నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, రాజకీయాలకు మాత్రం దూరంగా ఉండండి. అంతే కాదు ఎన్నికలు (ఎలక్షన్) ఉన్న చోట ఉండద్దు. ఎంపిక (సెలెక్షన్) ఉన్న చోట ఉండండి" అని స్వామి ఆదేశించారు. అది అందరికీ, ప్రత్యేకంగా నాకూ ఒక సందేశం లాంటిది. అదే సమయంలో నేను రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించాను.

స్వామి తమ దివ్యోపన్యాసంలో, వారి ఆనందానికి హద్దే లేని విధంగా మాట్లాడుతూ, ఆశీర్వాదం చేస్తూ, బంగారు రేపు ఆ హైదరాబాద్ యువకులతో గుప్తంగా మాట్లాడబోతున్నాను. మీరందరూ సిద్ధంగా ఉండండి అని చెప్పారు.

ఆ నాటి దివ్యోపన్యాసంలో ఎన్నో అద్భుతమైన సందేశాలు ఇచ్చారు యువజనుల ఐక్యత, భవిష్య కార్యక్రమాల గురించి చెప్పారు. స్వామి దృష్టి, స్వామి ఆర్తి ఎట్లా ఉంది అనేది ఆ గంటన్నర ఉపన్యాసంలో మేమందరం తెలుసుకున్నాము. ఆ ఉపన్యాసం ఇప్పటికి కూడా అందరికీ అందుబాటులో ఉంది. హైదరాబాద్ యువతనే ఉద్దేశించి చేసిన ఆ ఉపన్యాసము సువర్ణాక్షరాలతో లిఖించ బడిందిగా తలుచుకోవాలి. తర్వాత జరిగిన ప్రతి కార్యక్రమానికి స్వామి ఆ రోజు చెప్పిన విశేషాలే నేపథ్యంగా నిలిచాయి అనటంలో ఎట్టి సందేహము లేదు.

ఇవన్నీ అంతా కూడా చెప్తూ ఉంటే, పుట్టపర్తిలో స్వామి మమ్మల్ని ఏ విధంగా మలచుకున్నారు, జనాలని ఏ విధంగా మాతో నాయకత్వం వహింప చేశారు, ఏ విధంగా మమ్మల్ని పునీతులను చేశారు! ఇవన్నీ కూడా మమ్మల్ని తరవాత కాలంలో అద్భుతమైన నాయకులుగా నిలబెట్టినాయి అని చెప్పాలి. అప్పుడైనా ఇప్పుడైనా ఎప్పుడైనా హైదరాబాద్ యూత్ నాయకుడు/ మార్గదర్శి ఒక్కరే...

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా.

అలా స్వామి మమ్మల్ని అక్కున చేర్చుకొని, నెత్తికెత్తుకుని, గుండెలకు హత్తుకొని, మెత్తటి మాటలతో సుతిమెత్తని సందేశాలతో మమ్మల్ని పునీతము చేసి, మా జీవితాలను సార్థకము చేశారు అని చెప్పక తప్పదు.

ఈ విధంగా హైదరాబాద్ యువత అధ్వర్యంలో జరిగిన ప్రప్రథమ సహస్ర గ్రామ సేవా యజ్ఞము ఆంధ్రజాతిని మేలుకొలిపింది.

స్వామి భక్తులు మరియు ఉపన్యాసకులు అయిన జి ఎన్ మూర్తి, కామరాజు అనిల్ కుమార్, నలబాల అంజనయ్య, లక్ష్మణరావు ఇలాంటి వాళ్లందరిని కూడా ఆ సందర్భంలో నేను షెడ్లకు తీసుకుని వెళ్లి వచ్చిన పిల్లలందరితో మాట్లాడించడం జరిగింది. కొద్దిమంది బృందాలుగా ఏర్పడి కొత్త వారిని తీసుకుని ప్రశాంతి నిలయ యాత్ర చేయడము, కల్ప వృక్షము, ధ్యాన వృక్షము, సత్యసాయి చైతన్య జ్యోతి, సత్యసాయి మ్యూజియము, నక్షత్ర శాల, స్వామి విద్యాసంస్థలు, పాత మందిరము, సత్యమ్మ గుడి, వేణుగోపాల స్వామి గుడి, చిత్రావతి నది తీరము తదితర దర్శనీయ క్షేత్రాలు చూపిస్తూ ఆధ్యాత్మికతను జత చేసి పిల్లలందరికీ ప్రతి అంగుళము చూపిస్తూ, ప్రేరణ కలిగించాము. ఏ పని చేసినా మళ్లీ ఇంక ముందు మనం చేయలేమేమో, స్వామికి మనం కనెక్ట్ చేయాలి పిల్లలందరినీ అనుకుంటూ చేసాము. ఆ రోజుల్లో కనెక్ట్ అయిన ప్రతి యువకుడు కూడా ఈ రోజు వాళ్ల వాళ్ల గ్రామాలలో ఎన్నో సేవలు చేస్తున్నారు, ఎంతో మంది నాయకులు అయ్యారు, ఎంతో మంది ఆదర్శమైన జీవితాలను గడుపుతున్నారు, ఎంతో మంది స్వామికి అతి దగ్గరగా మసలుకుంటున్నారు, ఎంతో మంది సత్యసాయి సంస్థలకి ప్రాణము అందించారు.

తన మన ధన ప్రాణములు సేవకై ఇచ్చే విధంగా స్వామి అన్ని వందల వేల మంది యువకులను మలుచుకున్నారు అని చెప్పాలి. ఈ సందర్భంగా యావదాంధ్ర దేశంలో ఆ రోజు మాతో పాటు పాడిన, ఆడిన మాట్లాడిన ఆ యువజనులందరినీ తలుచుకుంటూ, ఈ సందర్భంగా అందరి తరపున బాబా వారి శ్రీ చరణ సన్నిధిలో శిరము వంచి అభివాదం చేస్తున్నాను.

84

20 అక్టోబర్ 2003 స్వామి వారి చారిత్రాత్మక దివ్యోపాన్యాసం

ప్రేమ స్వరూపులైన హైదరాబాద్ యువకులరా!

ఇలాంటివి ఒక్కటి లేదా రెండు సంస్థలు ఉన్నా చాలునుబీ భారతదేశము తన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందగలదు. ఈ సేవా కార్యకలాపాలు యువత హృదయాలలో గొప్ప మార్పును తీసుకొచ్చాయి. ఇలాంటి పవిత్రమైన కార్యక్రమాలు ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో జరిగితే, భారత ప్రాచీన సంస్కృతి ఖచ్చితంగా పునరుజ్జీవించగలదు.

ఈ రోజున మన సంస్కృతిలోని పవిత్రమైన విలువలను ఆచరించే వారూ, ప్రచారం చేసే వారూ చాలా తక్కువమంది మాత్రమే ఉన్నారు. భారతీయులు తమ సాంప్రదాయాలను పూర్తిగా మర్చిపోయి పాశ్చాత్య సంస్కృతిని అనుకరిస్తూ తమ పవిత్రతను కోల్పోతున్నారు. భారత సంస్కృతి ప్రాచీనమైనదైనా, అది వయస్సుతో సంబంధం లేని శాశ్వతమైనది మరియు నేటి కాలానికి కూడా అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. అందుకే ప్రతి గ్రామంలో దీన్ని ఆచరించాలి, ప్రచారం చేయాలి.

సంస్థలోని కొంతమంది స్వామితో సంప్రదించి సేవా కార్యక్రమాల గురించి మార్గనిర్దేశం కోరారు. రేపు హైదరాబాదు నుండి వచ్చిన నిర్వాహకులు మరియు యువతతో మాట్లాడి వారికి అవసరమైన మార్గదర్శకాలను అందిస్తాను.

మీకు హైదరాబాదులో విలువలు ఎలా క్షీణించాయో బాగా తెలుసు. ఒకప్పుడు భాగ్యనగర్‌గా ప్రసిద్ధిచెందిన ఆ నగరంలో ప్రజలు మన పూర్వీకుల విలువలపై నమ్మకాన్ని కోల్పోయి, పాశ్చాత్య సంస్కృతిని అనుకరించి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

ఏనుగు ఎట్లా అయితే తన బలము తానేరుగలేదో అలాగే భారతీయులు కూడా తామ సంస్కృతి గొప్పతనాన్ని తెలియక జీవిస్తున్నారు.

సహనం – దయే రూపం

సత్యమే – అన్ని కర్మలకన్నా మించినది

తల్లితండ్రుల పట్ల ప్రేమ – అమృతం
ఆచారశీలత – సౌకర్య భరిత జీవనం కన్నా గొప్పది
తమ సాంప్రదాయాన్ని మరిచి
పాశ్చాత్య ఫ్యాషన్‌ల పట్ల ఆకర్షితులవుతున్న
భారతీయుల స్థితి విషాదకరం.

ప్రేమస్వరూపులారా!

మీరు చూపిస్తున్న ఆదర్శాన్ని వివరించడానికి ప్రశంసలూ, అభినందనలూ తక్కువే. మీరు గ్రామాలకు వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నేను బస్సులను అందిస్తాను. ఈరోజు ప్రపంచం ఒక విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఆధ్యాత్మికతను బోధిస్తూ, మరోవైపు వ్యతిరేకంగా ప్రదర్శిస్తున్నారు. ఇది ముఖ్యంగా నగరాల్లో సాధారణంగా మారిపోయింది. వారు ఎంత చదువుకున్నా, మన సంప్రదాయాలను పూర్తిగా మర్చిపోయి, ఆధునికత పేరిట వికృతంగా ప్రవర్తిస్తున్నారు.

మీ యువతలో కనిపించే ఉత్సాహం, చైతన్యం, సంప్రదాయ విలువలు ఇతరత్రా ఎక్కడా కనిపించవు. మన పూర్వీకుల సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకున్నవారే మీ హృదయాలలోని పవిత్ర భావాలను అర్థం చేసుకోగలరు. మన పురాతన సంస్కృతిని ప్రతి గ్రామంలో, ప్రతి పల్లెలో వ్యాప్తి చేయడం అత్యంత అవసరం. పల్లెవారు దానిని వ్యాప్తి చేయాలనుకుంటున్నా వనరులలేక చేయలేకపోతున్నారు. అందుకే నేను ఈ పవిత్ర కార్యానికి అవసరమైన మద్దతును అందిస్తాను.

గ్రామ సేవ అనే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ విద్యార్థులకు మన విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పించబడుతుంది. మీరు బయటి వారని భావించకండి. ఇది అంతా మీకే చెందింది. నేనే మీవాడిని. ఈ సంస్థలు మీవే. మీరు ఇక్కడ ఉండటానికి అన్ని హక్కులూ కలిగి ఉన్నారు. మీకు అవసరమైన ఏ సహాయమైనా అందించడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాను.

రేపు, మీ అందరితో గుప్తంగా మాట్లాడి మీ భవిష్యత్ కార్యకలాపాలకు మార్గదర్శకాన్ని అందిస్తాను. ఎప్పుడూ నిరాశకు అవకాశం ఇవ్వకండి. ఆశతో, ఉత్సాహంతో ముందుకు సాగండి. హృదయం ఆనందంతో నింపుకుని రేపు స్వామి సందేశం కోసం ఎదురుచూడండి. నేను ఎప్పుడు అయినా రావచ్చు. దైవ నామస్మరణమును ఎప్పుడూ విడువకండి. ఆ నామస్మరణే జీవిత సముద్రాన్ని దాటించే పడవ. మీ బృందానికి అవసరమైన శక్తిని నేను అందిస్తాను. గ్రామ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండండి. ఈ క్షణం నుండే మీ కార్యాచరణలను అభివృద్ధి చేయాలని, విస్తరించాలనే ధృఢ సంకల్పం చేయండి.

ప్రేమస్వరూపులారా!

ఈ రోజు మీరు నిర్వహించిన గ్రామాభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనను చూస్తూ నేను పరవశించిపోయాను. రేపు, మీతో ఎక్కువ సమయం గడుపుతూ మీకు అపారమైన ఆనందాన్ని అందిస్తాను.

"ప్రేమ ముదిత మనసే కహో..." భజన

ప్రేమస్వరూపులారా!

రాజకీయాల్లో నిమగ్నమవ్వొద్దు. మీరు రాజకీయ కార్యకలాపాల నుంచి దూరంగా ఉండండి. పవిత్రమైన సామాజిక సేవా పనులను కొనసాగించండి. దేవుని నామస్మరణతో మీ సమయాన్ని పవిత్రంగా మార్చుకోండి. మీరు ఎంచుకున్న మార్గాన్ని ధైర్యంగా, దృఢంగా అనుసరించి విజయాన్ని సాధించండి. ఈ రోజు రాజకీయ రంగంలో స్వార్థం విస్తృతంగా ఉంది. మీరు నిస్వార్థ సేవతో జీవించి, దేవుని ధ్యానంలో ఉండి జీవితంను పవిత్రంగా మార్చుకోవాలి. రేపు ఉదయం, నేను వచ్చి మీతో పూర్తిగా మాట్లాడతాను.

85

హైదరాబాద్ యూత్‌కు అనుగ్రహం శ్రీ సత్య సాయి గ్రామ సేవా ట్రస్ట్

అక్టోబర్ 20వ తేదీ సహస్ర గ్రామ సేవ యజ్ఞం ముగింపు సమావేశంలో స్వామి వారు దివ్యోపన్యాసం చేస్తూ అలవోకగా, చాలా గూఢంగా, చాలా ప్రేమతో "రేపటి దినమున హైదరాబాద్ యువకులతో నేను గుప్తంగా మాట్లాడుతాను" అని చెప్పారు.

ఆ మాటలు యావత్ హైదరాబాద్ యువజన హృదయాలలో ఆశ్చర్యాన్ని, ఆతురతని సృష్టించాయి. ఎవరికి వాళ్లు. స్వామి ఇట్లా అన్నారేంటి? స్వామి రేపు మనతో మాట్లాడబోతున్నారు? అబ్బా! ఎంత సంతోషపడి పోయారు. అందరూ కూడా రెడీ ఐపోవడం మొదలు పెట్టారు. అలాంటి పరిస్థితిలో, రాత్రి సత్యసాయి సంస్థల పెద్దలు, ఆఫీస్ బేరర్స్ అందరూ కూడా సమాలోచనలు జరిపారు. ఇది కేవలం హైదరాబాద్ యూత్ అని చెప్పారు స్వామి. కానీ, స్వామి ఉద్దేశం అందరితో మాట్లాడటమే అని నిర్వచించుకున్నారు. ఎవరైతే నాయకత్వం వహించారో, వాళ్లందరిని కూడా తీసుకువెళితే బాగుంటుంది స్వామి సన్నిధికి అని నిర్ణయించారు. మేము కూడా చాలా అమాయకంగా, నిజమే! అందరూ ఉంటే ఐకమత్యం అనేది వస్తుంది. సహస్ర గ్రామ సేవ యజ్ఞ సంకల్పము, పరమావధి ఏమిటంటే జిల్లాల నుండి వచ్చిన యువ నాయకులందరినీ స్వామి సమక్షంలో తీసుకొని వెళ్లగలిగాలి. ఇక అంత కంటే ఇంకా అదృష్టం ఏమున్నది అని మేము కూడా తహ తహలాడాము. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులనందరిని కూడా ఈ దివ్య సమావేశములో ఉండాలని నిర్ణయించారు పెద్దలు. సత్యసాయి సంస్థల రాష్ట్ర క్రియా శీల కార్యకర్తలను కూడా ఎన్నిక చేశారు. అలాగే జిల్లా యువజన సమన్వయ కర్తలనందిరినీ కూడా ఎన్నిక చేశారు. సుమారు 50 మంది, అందరూ చక్కగా సిద్ధం అయిపోయి కుల్వంత్ హాల్‌కి వెళితే, మధ్యాహ్నం మూడు గంటలకు ప్రార్థన మందిరంలో కూర్చోబెట్టారు. చాలా ఉత్సుకతగా, చాలా ప్రేమగా, భక్తి పారవస్యంతో ఆ భజన హాల్‌లో అందరం కూర్చున్నాము. చక్రాల కుర్చీలో స్వామి వచ్చారు. చాలా ప్రసన్న వదనంతో అందరినీ ప్రేమగా అమృతము కురిసే దృష్టితో చూస్తూ, స్వామి మా మధ్యలో కూర్చున్నారు. మేమందరం స్వామి

సింహాసనము చుట్టూరా కూర్చున్నాము.

స్వామి కుడి చేతి వైపు మూలలో నేను కూర్చున్నాను. నా ముందర వైసి, దాని తర్వాత గోపి దాని తర్వాత పెద్ద వాళ్లందరూ కూడా రాష్ట్ర అధ్యక్షులు, కొమ్మారెడ్డి భాస్కర్ రావు, పాపారావు, ఎస్ జి చలం లాంటి అతిరథమహారథులు అందరూ కూర్చున్నారు. ఏ స్థాయిలో ఉండే మమ్మల్ని స్వామి ఏ స్థాయికి చేర్చారో చూస్తే ఆశ్చర్యం అయింది. సామాన్యమైన కార్యకర్తల లాగా పని చేస్తున్న హైదరాబాద్ బృందము, చాలా ఠీవిగా, మరెంతో ఆత్మవిశ్వాసంతో, రాష్ట్ర క్రియాశీల కార్యకర్తలతో చేరి కూర్చోగలిగాము.

స్వామి మా అందరితో మాట్లాడు తున్నారు. చాలా విశేషమైన ప్రేమను చూపించారు. "చాలా సంతోషం బంగారు! గ్రామాలలో సేవలు చేయాలి, గ్రామాలలో ఇంకా సేవలు చేయాలి, దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకి మీరు పరిష్కార మార్గం కనుగొనండి. గ్రామాలను చైతన్య పరచండి. గ్రామ గ్రామాన, ఇంటింటా, వీధి వీధిన స్వామి నామాన్ని ప్రతిధ్వనింప చేయండి. సేవయే స్వామికి చాలా ఇష్టమైనటువంటిది. చాలా సంతోషము" అంటూ మాట్లాడినారు.

అసలు ఎవరి నోటా మాటలు లేవు. అంత పెద్ద ప్రార్థనా మందిరంలో మధ్యలో భగవంతుడి దగ్గర కూర్చుంటే, చుట్టూరా నిశ్శబ్దం ఆవరించి ఉన్న ఆ సమయంలో చాలా ఉద్విగ్నంగా ఉండింది. స్వామి చెప్పేది అతి శ్రద్ధగా వింటున్నాము.

"ఇంకా ఏం చేద్దాం అనుకుంటున్నారు?" అని అడిగారు, 'స్వామి మీరు చెప్పండి స్వామి,' అని మేము అన్నాము. స్వామి వారితో పాటుగా సత్యజిత్ ఉన్నారు. అలాగే చక్రవర్తి గారు, అలనాటి ట్రస్ట్ కార్యదర్శి గారు కూడా చేతులు జోడించి అక్కడ స్వామితో నిలుచున్నారు. అందరి సమక్షంలో స్వామి మాట్లాడటం మొదలు పెట్టారు. "ఇంకా ఏం చేయొచ్చు చెప్పండి? ఇంకా మీకు ఏం కావాలి? చెప్పండి." 'మేము సేవ చేసుకుంటాం స్వామి' అవునా, "చాలా సంతోషం, చాలా సంతోషం! చేయండి ఇంకా చేయండి, మీ అందరికీ కూడా కావలసిన శక్తిని నేను ఇస్తాను. మీకు కావలసినటువంటి వనరులు ఇస్తాను." అంటూ చాలా రహస్యంగా చెప్పున్నట్టుగా "మరి మనమంతా కూడా, ఈ పిల్లలందరికీ కూడా ఒక ట్రస్టు ఏర్పాటు చేద్దాం. ఒక వ్యవస్థని స్వామి మీకు ఇస్తారు. ఏం పేరు పెడతాం?" అని స్వామి అడిగారు. ఆ మాటలకు అక్కడున్న వారిలో ఒక్క ఉదుటన దివ్య చైతన్యము ఒంట్లో ప్రవహించింది. స్వామి ఇట్లా అన్నారా! మా కోసం ఒక వ్యవస్థను తయారు చేస్తానన్నారా!! అందరి కళ్లలో ఆనంద భాష్పాలు కార్చడం మొదలుపెట్టారు స్వామి ఆ మాటలకి. అందరిని చాలా నిశితంగా పరికించి చూస్తున్నారు స్వామి. అక్కడ 50-60 మంది ఉన్నా కూడా స్వామి దృష్టి మాత్రం ఒక ఇద్దరి ముగ్గురి మీదనే వర్షిస్తోంది. అలాగ అమృత దృష్టితో ప్రేమగా చూస్తున్నారు. ఇంకా ఏమి? అని అడుగుతున్నారు. అయితే ఏం పేరు పెడతాం దీనికి అంటే.. స్వామి మీరే చెప్పండి స్వామి అని అన్నాము. ఇదేమి ఏమి తీసుకొచ్చారు మీరు అంటే... స్వామి 'గ్రామ సేవ' గ్రామసేవ అని పేరు పెడదాం. స్వామి శ్రీ సత్యసాయి అని జత చేద్దాం అంటే... సరే "శ్రీ సత్యసాయి గ్రామ సేవ" అంటూ, శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్ ఒకటి ఏర్పాటు చేద్దాం! ఏమి రెడీ నా? అని స్వామి అంటే, ప్రక్కనే నిలబడిన సత్యజిత్ ఒక కవర్ స్వామి చేతికి అందించడం జరిగిపోయింది. ఆ కవర్‌లో నుండి స్వామి చెక్ బుక్ తీసి స్వయంగా పెన్ను తీసుకొని స్వామి వారి దివ్య చేవ్రాలు చేసి, రెండు లక్షల రూపాయలను చెక్కు మీద వ్రాసి ఇదిగో తీసుకోండి అని ఇస్తే, అక్కడున్న వాళ్లంతా ఏక కంఠంతో "అయ్యో స్వామి! డబ్బులు ఎందుకు స్వామి? ఇవి మాకెందుకు స్వామి? మీ ఆశీస్సులు

చాలు స్వామి" అన్నారు. కానీ స్వామి చెక్కు ఇస్తాను అన్న తక్షణం మా ఉత్సాహానికి అంతు లేకుండా పోయింది. 2003 అక్టోబర్ 21 రోజున ప్రార్థనా మందిరంలో స్వామి చూపినది అత్యంత కరుణామయమైన దివ్య సంకేతం. లేదు స్వామి, వద్దు స్వామి, అంటే "ఏయ్ తీసుకో! స్వామి అనుగ్రహం ఇస్తున్నారు" ఎవరికి ఇవ్వాలి? ఎవరు ఉంటారు దీనికి అధ్యక్షులుగా? అని స్వామి అడుగుతుంటే, అప్పుడు కూడా ఎవరికీ నోట మాట రాలేదు. స్వామి మీరే చెప్పండి స్వామి, మీరే చెప్పండి, ఎవరు ఉంటారు అని ఇట్లా చూస్తూ... ముందర కూర్చున్న వై శ్రీనివాస్‌ను చూసి "ఏయ్ శ్రీనివాస్" అంటూ స్వామి హస్తచాలనం చేత అద్భుతమైన గ్రీన్ ఎమరాల్డ్ రాయి ఉన్న బంగారు ఉంగరము సృష్టించి, వాడి చెయ్యిని చేతిలో తీసుకొని 'చాలా మంచిది, చాలా మంచి పని చేస్తున్నారు' అంటూ వేలికి ఉంగరం తొడిగి, తన చేతిలో ఈ చెక్కు పెట్టారు, అద్భుతమైన వాతావరణమును స్వామి ఆ ప్రార్థనా మందిరంలో ఏర్పరిచారు. హైదరాబాద్ యువతకే కాదు, యావత్ భారతదేశానికే కాదు విశ్వవ్యాప్తంగా ఉన్న సత్య సాయి భక్తులకి ఒక మరపురాని విశేషము ఆ రోజు స్వామి చేకూర్చారు. "శ్రీ సత్యసాయి గ్రామ సేవా ట్రస్ట్" అని స్వామి నామకరణం చేయడమే కాకుండా, మూల ధనాన్ని ఏర్పాటు చేసి, ప్రెసిడెంట్‌ని కూడా తనే ఎంపిక చేసి, మిగతా వాళ్లందరిని కూడా మీరు చూడండి అని చెప్పడం అంటే ఏమిటి ఆలోచించండి.

ఇక ఎవరికీ నోట మాటలు లేవు. చేష్టలు ఉడిగిన ఉత్సాహం నిలువెల్లా పెల్లుబికి ప్రవహించింది అంటే నమ్మండి. అంతటి చారిత్రాత్మకమైన సంఘటన మా కళ్ల ముందు ఆవిష్కరించ బడటం అన్నది నమ్మలేక, స్వామికి దండాలు పెట్టడం, స్వామి... స్వామి... స్వామి అని పలవరిస్తున్నారు అందరూ.

స్వామి వారు స్వయంగా ఇలా ఎన్ని సంస్థలు ఏర్పరచి ఉంటారు చెప్పండి? కానీ హైదరాబాద్ యువత అదృష్టం అనుకోవాలి. యావత్ ఆంధ్ర దేశంలోని యువజన బృందాల పూర్వజన్మ సుకృతం అనుకోవాలి. సహస్ర గ్రామ సేవ యజ్ఞము వేదికగా, బయట సుమారు ఆరు వేల మంది యువజనులు వేచి ఉంటే, లోపల 50-60 మంది సమక్షంలో, ఆ దివ్య సన్నిధిలో స్వామి ఇవంతా కూడా చేయడము మరచి పోలేని అనుభవం. గ్రామ సేవ ట్రస్ట్ ద్వారా మునుముందు జరగబోయే అత్యున్నతమైన అద్భుతమైన సేవలకి స్వామి శ్రీ కారము చుట్టారు. స్వామి చేవ్రాలులో కూడా మొదట శ్రీ ఉంటుంది. శ్రీ సత్యసాయి అని సంతకం చేయడం అంటే శ్రీకారం చుట్టినట్లే కదా!?

అలా స్వామి సంతకం చేస్తుంటే, స్వామి కుడి చేతికి ప్రక్కనే కింద కూర్చున్న నాకు స్వామి చెయ్యి మరియు పెన్ను కనిపిస్తూ ఉంటే ఎంతో ఉత్సాహం అయిపోయింది. చాలురా ఈ జన్మకు. స్వామి స్వయంగా ట్రస్ట్‌ని ఏర్పరిచారు కదా. అబ్బా! ఇది మాకు ఒక వరమయ్యా! అనుకుంటుంటే కళ్లలో నీళ్లు వస్తున్నాయి.

శ్రీకాకుళం లక్ష్మణరావు లేచారు, మహబూబ్ నగర్ ఈశ్వరయ్య లేచారు, కరీంనగర్ రంగా స్వామి లేచారు, గోపి లేచారు, చలం లేచారు. ఇట్లా ఎవరికి వాళ్లందరూ కూడా స్వామితో "స్వామి స్వామి అని మాట్లాడటము, వాళ్లు తెచ్చిన కార్యక్రమాలు చూపించడం, బంగారు! బంగారు! చాలా సంతోషం, చాలా సంతోషం అని చెప్పడం జరిగింది.

స్వామి, ఒక ఫోటో స్వామి! అని అడిగారు అందరూ, ఒక మరపురాని అనుభూతిని స్వామి అందరికీ ప్రసాదించారు. అందరం స్వామి చుట్టూరా కూర్చున్న వాళ్లు కూర్చుంటే, నిల్చున్న వాళ్లు నిల్చుంటే, తొక్కే వాళ్లు తొక్కుతుంటే, స్వామి కుర్చీ వెనక వెళ్లిన వాళ్లు మొత్తానికి ఒక అద్భుతమైన

దివ్య చిత్రం క్లిక్ చేయబడింది.

ఆ రోజు స్వామి గ్రామసేవ ట్రస్ట్‌పై ఆసక్తి చూపి, ఆ ట్రస్ట్‌ను ఆంధ్రప్రదేశ్ యువతకు, హైదరాబాద్ యువతకు, మా ప్రియమైన వై. శ్రీనివాస్ నాయకత్వములో అప్పగించారు. ఆ క్షణంలో వై. శ్రీనివాస్ పరిస్థితిని చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది, స్వామి చేత ఎన్నుకో బడినటువంటి అగ్రేశ్వరుడు, అతను అద్భుతమైన కార్యక్రమాలు చేయబోతున్నాడు. మేము కూడా దానికి తోడు నీడగా ఉంటాము అని మేమందరం ఉత్సాహపడ్డాము. ఆ విధంగా సుమారు మూడు నాలుగు రోజుల పాటు జరిగిన సహస్ర గ్రామ సేవ యజ్ఞానికి ముగింపు స్వామి పలికారు.

గుండెల నిండుగా ఉత్సాహము
అణువణువున కదనోత్సాహము
హృదయమంతా ఆదర్శము
అమృతత్వానికి సేవయే మార్గము
జన్మ సార్థకతకు సేవయే సందేశము!
దీర్ఘకాలిక సమస్యలకి పరిష్కారము!
అందరికి ఐకమత్యం మంచి మార్గము!
గ్రామ సేవయే సాయి సేవ లక్ష్యము!
SSS గ్రామ సేవా ట్రస్ట్ ఆవిర్భావము!!

అందరికి ఆశీర్వాదం చేసి, పాద నమస్కారాలు ఇచ్చి, ప్రసాదములు ఇచ్చి, స్వామి ప్రార్థన మందిరం నుంచి నిష్క్రమించారు. ఇంత మాత్రమే నాకు జ్ఞాపకం ఉంది. అక్కడ కూర్చున్న 60 మందిలో ఎవరికి వాళ్లకి ఇలాంటి జ్ఞాపకాలు మరి ఎన్నో ఉండొచ్చు.

శ్రీ సత్యసాయి సహస్ర గ్రామ సేవ యజ్ఞము ఈ విధంగా శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్‌కి నేపథ్యంగా నిలిచింది. ఈ విశేషాలతో ఈ యొక్క వ్యాసాన్ని ముగిస్తున్నాను.



86

అజ్ఞాన చీకటి తొలగించిన చికోటి విశ్వనాథం

స్వామి దివ్య కార్యములో జీతమును, జీవమును అంకితము చేసి అమృత స్వరూపులుగా మారిన మహానుభావులు ఎందరో ఉన్నారు. స్వామి వారు తమ జీవిత కాలంలో వేల లక్షల కోట్ల మందిని ప్రభావితం చేశారు. అందుకు సాక్ష్యంగా నిలిచిన వాళ్లు చాలా మంది ఉన్నారు. ఇలాంటి వాళ్లని చూసినప్పుడు మాలాంటి వాళ్లకి ఉత్సాహము, ప్రోత్సాహము, స్ఫూర్తి, ప్రేరణ కలుగుతుంది. అరే! బ్రతికితే ఇలా బ్రతకాలి, చేస్తే ఇలా సేవ చేయాలి అనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి వాళ్ల చిత్రాలు, జ్ఞాపకాలు, జీవితాలు Hard diskలో కాదు, Heart disk దాచుకోవాలి.

ఇలా Save చేయాలని చెప్తుంటే గుర్తొచ్చింది, స్వామి చెప్పారు "బంగారు! ఇలాంటి సేవలలో మీరు పాల్గొంటే మీ ముందు తరాల వాళ్లు మిమ్మల్ని మా తాత, మా అవ్వ, మా నాన్న, మా అమ్మ ఇలా సేవలు చేసుకున్నారని గుర్తుంచుకుంటారయ్యా. మీ ఫోటోలు గోడల మీద పెట్టుకొని మరీ చూసుకుంటారు" అన్న స్వామి మాటలు గుర్తొచ్చాయి.

1996-97 ప్రాంతాలలో హైదరాబాద్‌కి వచ్చిన కొత్తల్లో నాకు తెలిసిన ఒక వ్యక్తి గురించి చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. అప్పుడెప్పుడో స్వామి వారి అఖండ జ్యోతి యాత్ర, ఆ జ్యోతి యాత్రలో ఇంటింటికి స్వామి వెలిగించిన జ్యోతిని తీసుకొని రావడము, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. అన్ని చోట్లా. హైదరాబాదులో దిల్‌షుక్‌నగర్ ఈ వ్యక్తి ఇంటికి స్వామి జ్యోతిని తీసుకురావడము, అప్పటిదాకా స్వామి గురించే తెలియని వారు స్వామికి చాలా భక్తుడిగా మారి పోవడము జరిగి పోయింది.

వృత్తి రీత్యా వాణిజ్య శాస్త్రంలో ఆచార్యులుగా ఉంటూ, కళాశాలలో పిల్లలకి పాఠాలు బోధించే ఈ వ్యక్తి, తర్వాత కాలంలో మనం స్వామి భక్తులుగా మారడం కాదు, స్వామి చెప్తున్న సేవలు కూడా చేయాలి కదా? స్వామి చెప్పే ఆదర్శాలను మనం ఆచరించాలి కదా? ఈ విధంగా డబ్బులు తీసుకుని ఆ పాఠం చెప్పడం గొప్ప సంగతి కాదు, నాకు ఉన్న ప్రతిభ, శక్తి మరియు సామర్థ్యాలు నేను సేవల్లో

ఉపయోగ పెట్టాలి అని అనుకున్నారు. కోనార్క థియేటర్ దగ్గర ఉన్న ప్రాంతంలో, వైట్ల కుటుంబం వారు ఇచ్చిన చిన్న స్థలంలో, ఒక చిన్నగదిలో వారు తమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. సుమారు మూడున్నర దశాబ్దాల ముందర విషయం చెప్తున్నాను.

వృత్తిరీత్యా లెక్చరర్ అయిన వీరు కామర్స్ పట్టభద్రుల కోసం అనేక పుస్తకాలు, మార్గదర్శక గ్రంథాలు రచించిన అద్భుతమైన, చాతుర్యవంతుడైన వ్యక్తి. చాలా సామాన్యంగా, నిరాడంబరంగా ఉండేవారు. అప్పటికి ముందర ఎట్లా ఉన్నారో తెలియదుకానీ, నా దృష్టికి తెల్లటి పైజామా జుబ్బా లోనే కనిపించారు చివరి దాకా. వారిని చూస్తే ఈయన ఇన్ని వందల వేల మందిని ప్రేరణ కలిగించారా అని ఆశ్చర్యం అవుతుండేది. అలాగా 1996లో వారిని చూశాను. వారి పేరు చీకోటి విశ్వనాథం. 55 ఏళ్ల వయసులో స్వామి కార్యాన్ని భుజస్కంధాల మీద వేసుకున్నాడు. సుమారు పాతిక మంది డిగ్రీ విద్యార్థులతో ఉచిత బోధనా తరగతులు ప్రారంభంచేశారు. అసలు స్వామి అంటే తెలియని వందల మందిని స్వామి కార్యానికి పరిచయం చేసిన వ్యక్తిగా మారి పోయారు. కేవలం పాఠాలు మాత్రమే బోధించడం కాదు, పాఠాలతో పాటుగా గుణపాఠాలు, మానవతా విలువలు, సంస్కారము ఇదంతా కూడా నేర్పించే ప్రక్రియలో ప్రతి విద్యార్థి అతనికి బాగా దగ్గరై పోయారు. అరేయ్ మీరు క్లాస్‌కు రావడం కాదు, ఇవ్వాళ గురువారం కదా! భజనకు పోదాం పదండి అని ఆ పైన ఇంకో గదికి తీసుకెళ్లడం అక్కడ వాళ్లందరిని కూర్చోబెట్టి భజనలు నేర్పించడం, భజన పాడడానికి రాకపోతే ఏమిటి? చలో నేర్చుకుందాం అంటూ చెప్పేవారు. అసలు ఆయనకి పాడడానికి రాదు కానీ, ఎంత ఉత్సాహం అంటే స్వామి మీద భక్తితో ఆ వయసులో కూడా పిల్లలకి కూడా నేర్పించాలి అని పాడటం, తాళం కొట్టడం, హార్మోనియం వాయించడం చేసే వాడు. ఈయనను చూసి కదిలి పోయే వాళ్లు పిల్లలందరూ. ఆడ మగ తేడా లేకుండా అందరూ వారి సహచర్యంలో స్వామి కార్యంలో పాల్గొనే వారు. అందరి జీవితాలు స్వామితో ముడిపడి పోయాయి. సత్య సాయి ఫ్రీ ట్యుటోరియల్స్ పిల్లలు అంటే అందరికీ తెలిసేది. ఆ పిల్లల్ని, భజనతో ప్రారంభం చేసి, వారితో నారాయణ సేవ, నగర సంకీర్తన, రక్త దానము, చలివేంద్రం ఇలా ఎన్నో సేవలలో ప్రవేశపెట్టి ఏది వదలకుండా అన్ని రకాలుగా విద్యార్థులు ఉన్న మూడు ఏళ్లలో మంచి మనుషులుగా తీర్చి దిద్దేవారు.

ఎవడు వచ్చినా రాకున్నా, ఉదయం నాలుగున్నరకంతా నిద్ర లేచి మందిరంలోకి వెళ్లి పోయేవారు. వారి కుటుంబం అంతా కూడా పవిత్రమైన విలువలతో నడిచింది. వారి శ్రీమతి, కుమార్తె, కొడుకు, మనవడు, మనవరాలు అల్లుడు, కోడలు ఎవ్వరు చూసినా అందరూ కూడా వారి నాయకత్వంలో స్వామి కుటుంబం లాగా మారిపోయింది. వారి యొక్క ప్రేమ ఆదరణను చూసినటువంటి ఎందరో, విశ్వనాథం మాస్టర్‌కు శరణాగతులు అయిపోయారు అంటే సందేహం లేదు.

కానీ, ఎందుకో తెలియదు ఈ కుటుంబం చేస్తున్న పని సాయి సంస్థకు నచ్చలేదు. అయినప్పటికీ, ఆయన దానిని అసలు పట్టించుకోలేదు. ఆయనకు ఉన్న ఏకైక ఆలోచన: 'నేను స్వామి యొక్క దివ్య హస్తాలలో ఒక అద్భుతమైన సాధనంగా ఎలా మారగలను?' అన్నదే. ఏ విధంగా నేను చేయగలను? ఏ విధంగా పాటుపడగలను? నా ప్రతిభ, శక్తి సామర్థ్యాలు ఇవన్నీ ఏ విధంగా సమాజానికి ఉపయోగ పెట్టగలను అని ఆలోచన తప్ప, ఇంకేమీ లేదు. హైదరాబాద్ యూత్‌కి వీరంటే ఎంతో అభిమానం. వారు చేస్తున్న సేవలలో ఎప్పుడు వీలవుతే అప్పుడు పాల్గొనే వారు.

ప్రతి సంవత్సరము వార్షికోత్సవం జరుపుకునేవారు. అలాంటి సందర్భంలో 1997లో నన్ను ఉదయన్న వారి కేంద్రానికి తీసుకుని వెళ్లారు. వారు నన్ను చూసి ఆప్యాయంగా, అయ్యా! నువ్వు

కూడా మాట్లాడవయ్యా అని పిలవడం, అలాగా మా సహచర్యము ప్రారంభమైంది. చాలా ప్రేమించారు నన్ను. నేను కూడా వారిని చాలా ప్రేమించాను.

ఒకానొక సందర్భంలో వీరికి 102 డిగ్రీల జ్వరం వచ్చినా సరే, అందరికంటే ముందుగా క్లాస్‌కి వెళ్లారట. అలాగే వణుకుతూ పాఠాలు చెప్పిన విషయం నేను విన్నాను. వారిని చూసి ఆ పిల్లలందరూ కూడా ఏడ్చేవాళ్లు. సార్ వద్దు సార్, ఈ రోజు క్లాస్ అంటే, "ఏయ్ లేదు నేను చెప్పాలి. చివరి క్షణం దాకా చెప్పాలి అని క్లాస్‌లో చెప్తూ చెప్తూ ఒరిగిపోయి, అలా ఒరిగి పోయి పాఠం చెప్పేవారు తప్ప, క్లాస్‌లో నుంచి బయటికి వెళ్లిన సందర్భంలేదు. చివరి రోజుల్లో హాస్పిటల్‌లో ఉన్నప్పుడు కూడా బోధనా తరగతులు ఏమవుతాయి అనే ఆలోచన చేస్తూ ఉండేవాడు.

మూడు దశాబ్దముల పాటు వేలాది మంది వాణిజ్య శాస్త్ర విద్యార్థిని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు కదా, ఎవరికి చేతనవుతుంది? కేవలం దిశా నిర్దేశం చేయడం అంటే వాళ్లని వాణిజ్య శాస్త్ర పట్టభద్రులుగా చేయడం కాదు... మంచి మనుషులుగా తీర్చిదిద్దడం, అంతే కాదు సాయి సేవలో కూడా పట్టభద్రులుగా తీర్చిదిద్దడం అనేది అద్భుతమైన విషయము.

ఎన్నెన్నో కార్యక్రమాలు మేము కలిసి చేసాము. వారితో మాట్లాడిన ఏ క్షణమైనా అయ్యో ఈ వయసులో ఈయన ఇట్లా చేస్తున్నారే మరి, మేము ఎట్లా చేయాలి అని ఉత్సాహంతో వెనుతిరిగే వాళ్లము. మా హైదరాబాద్ బృందంలో నాకు వారి అవ్యాజమైన ప్రేమ, అనుగ్రహము, వాత్సల్యము అందింది. ఈ రోజుకు కూడా విశ్వనాథం విద్యార్థులు ఎంత పెద్దవాళ్లు అయినా, ఎక్కడెక్కడ స్థిరపడిన కూడా ఏదో విధంగా సేవా మార్గంలో నడుస్తున్నది నేను గమనించాను.

వారి ఇంట్లో, అతి చిన్న పిల్లలు అంటే ఎత్తుకొని పెంచిన మనవడు సాయి మనోహర్, మనవరాలు ప్రియా, ఇద్దరు కూడా CA చేసిన పిల్లలు. కుటుంబంలో ఉన్న వారసులందరూ కూడా వారి అనురాగాన్ని, ఆప్యాయతని, వాత్సల్యాన్ని, సేవా గుణాన్ని, దృక్పథాన్ని, త్యాగ నిరతిని అలవర్చుకున్నారు. వాళ్లని చూసినా కూడా ఉత్సాహం అవుతుంది.

ఒక సమయంలో ఈ సంస్థను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న విషయాన్ని చర్చిస్తున్నాం. నాకు అనిపించింది "సార్! ఇక్కడ free tutorials అనేది చాలా చిన్న పేరు. ఇక్కడ free tutorials ఎక్కడ జరుగుతుందండి? ఉచిత బోధనతో పాటుగా మానవతా విలువలు, వ్యక్తిత్వము, సేవా దృక్పథము, త్యాగనిరతి, ఇన్ని నేర్పిస్తున్నారు కదా. ఇది ట్యుటోరియల్ ఎందుకు అవుతుందండీ? ఇది ఇంకేదో గొప్పదానిగా మారాలి. మనం దీన్ని 'Sri Sathya Sai Institute of Human Excellence'గా పిలుద్దాం అని ప్రతిపాదించాను. వారు చాలా ఆనంద పడ్డారు. ఇది పుష్కర కాలం క్రితం జరిగింది అనుకుంటాను. అప్పటి నుంచి అలాగే పిలుస్తూ వచ్చాము. తర్వాత కొద్ది కాలానికి సత్యసాయి సంస్థ కూడా దాన్ని గుర్తించి, అందరూ ఆ సంస్థకు చేదోడువాదోడుగా నిలబడ్డారు. ఈ దివ్య సంస్థతో జీవితాలు మొదలు పెట్టిన ఎంతో మంది తరవాత కాలంలో సాయి సంస్థలలో యువజన సమన్వయకర్తలు, నిర్దేశకులు, సంచాలకులు అయ్యారు అంటే నిజంగా అద్భుతమైన విషయం.

చివరకు 80 ఏళ్ల వయసులో మే 6వ తేదీ, 2020 కరోనా సమయంలో వారు అనారోగ్యానికి గురై, స్వామి దివ్య సన్నిధికి చేరుకున్నారు. వారి అంతిమ వైకుంఠ యాత్రలో నేను వెళ్లినప్పుడు, నాకు అనిపించిన విషయం ఏంటి అంటే... ఈ వ్యక్తి, తరాలు మారినా, అంతరాలు మారినా యావత్ సాయి భక్తుల హృదయంలో సదా నిలిచి ఉండే అమరజీవి విశ్వనాథం.

విశ్వనాథం జీవిత పాఠము సత్యసాయి భక్తులకి ఒక సేవా పాఠంగా మారుతుంది అని నేను తలస్తున్నాను. సాయి సేవా కార్యంలో తమను తాము సమిధలుగా అర్పించుకున్న వ్యక్తులు చాలా మంది ఉన్నారు. నేను ఈ అగ్రేసురుడి జీవన పాఠమును గుర్తుంచుకుంటాను. సాయి కేంద్రం నుండి చేసిన ఎన్నో సేవలకు నేను కూడా ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాను అని చెప్పుకోవడం ఎంతో గర్వంగా ఉంటుంది. ఆ మహానుభావుడిని వారి విద్యార్థులందరి తరఫున తలుచుకుంటున్నాను. ఇలాంటి వ్యక్తులను చూసినప్పుడు ఒక అద్భుతమైన ప్రేరణ కలుగుతుంది.

సామాన్యమైన జీవనం
నిరాడంబర వ్యక్తిత్వము.
అసమాన్యమైన సేవాదృక్పథము.
అనుకున్నది సాధించాలనే పట్టుదల.
కష్ట నష్టములొచ్చినా సేవ చేయాలనే కసి.
పిల్లలని తీర్చిదిద్దాలనే ఆకాంక్ష.
వాణిజ్య శాస్త్రముతో పాటు జీవిత పాఠాలు చెప్పే ఆదర్శం
స్వామి చూడక పోతే ఏమిటి? నేను చూస్తున్నాను కదా?
నాకు అది చాలు కదా! అన్న భక్తి పారవశ్యం
ఇవన్నీ నేర్చుకున్నాం

ఈ మహానుభావుడు తన జీవితంలో నాలాంటి వారెందరికో వీధి దీపం లాగా ఉన్నారు. వీధి కుక్కల్లాగా తిరిగే ఎంతో మంది యువతీ యువకులని, వారు వీధి దీపాలుగా మార్చిన వారి జీవిత పాఠాన్ని నేను గుర్తు చేసుకుంటూ... వారినీ, వారి కుటుంబాన్నీ, అసంఖ్యాకమైన విద్యార్థుల యొక్క కుటుంబాలని తలుచుకుంటూ, వారందరి తరపున ఇలాంటి వ్యక్తులను మాకు ప్రసాదించిన బాబా వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

87

Re-Programming Lives

చాలా సార్లు సామాన్యమైన చర్చలు, అసామాన్యమైన సేవలకు వేదికలుగా మారుతాయి. స్వామి చెప్పిన ఏ మాటనైనా మంత్రంగా తీసుకొని ఆలోచించే ఒక సహజ లక్షణము హైదరాబాద్ యూత్‌కు వచ్చేసింది.

సత్యసాయి సంస్థలకు, మందిరాలకు భక్తులు కాని యువకులు ఎందుకు రావడం లేదు అని ఆలోచించే వాళ్లం. ఎప్పుడైనా పది మంది కలిస్తే చాలు సాయి సంస్థలకు కొత్త వాళ్లని ఎలా తీసుకురావాలి? అని చర్చించే వాళ్లం.

ఆ సందర్భంలో నేను Sri Sathya Sai Institute of Human Excellenceలో విశ్వనాథం నిర్వహించే ఉచిత బోధనా తరగతులకు సలహాలు సూచనలు ఇచ్చేవాడని. అయ్యా! ఇక్కడ భక్తుల కంటే యువతీ యువకులే కనిపిస్తారు కదా! కారణం ఏమిటి అంటే, వారంతా జీవనోపాధి కోసం వచ్చే వాళ్లు. అలాంటి వాళ్లకు ఉపాధి శిక్షణతో పాటుగా జీవిత నైపుణ్యాలను, మానవతా విలువలని అందిస్తున్నాము. ఈ సేవలు మంచి ఫలితాలను ఇస్తోంది అంతే గాక సదా ఈ విద్యార్థులు సేవలలో కూడా పాల్గొంటూ ఉంటారు.

జంట నగరాలలో ఎప్పుడైనా సరే, సాయి సంస్థలో 30 మంది పిల్లలు ఎక్కడ కనిపిస్తారు, అంటే, ఇదిగో విశ్వనాథం గారు నిర్వహించే కేంద్రంలో అని చెప్పక తప్పదు. ఆ కేంద్రం వార్షికోత్సవానికి నన్ను అతిథిగా పిలిచారు. అప్పుడు నేను "అంకుల్! ఈ విధంగా వార్షికోత్సవాన్ని ఒక రోజు కాకుండా, వాణిజ్య శాస్త్ర మేనేజ్‌మెంట్ సప్తాహం చేస్తే ఎలా ఉంటుంది? అప్పుడు కేవలం మన పిల్లలే కాదు వేరే పిల్లల్ని కూడా మనం ఆహ్వానిద్దాము. తద్వారా సత్య సాయి కేంద్రము, ఉచిత బోధనా తరగతుల గురించి అందరికి తెలుస్తుంది. కేంద్రంలోని ఒక్కొక్క విద్యార్థి మరో ఐదు మంది తెలిసిన పిల్లల్ని తీసుకొని వస్తారు, అప్పుడు ఇంకా ఉత్సాహం వస్తుంది. ఇలాంటి కార్యక్రమానికి పెద్దలను, సాయి సంస్థల ఆచార్యులను, ఉపన్యాసకులను ఒక్కోరోజు పిలిస్తే ఎట్లా ఉంటుంది? అని చెప్పాను.

ఇదంతా విని చాలా ఉత్సాహం అయింది వారికి. అలా Sathya Sai Institute of Human Excellenceలో మేనేజ్‌మెంట్ సప్తాహాము చేశాము. చాలా మంచి ఫలితాలు ఇచ్చింది. ఇది జరిగి సుమారు పాతికేళ్లు అయిందేమో!

కొద్ది కాలం తరవాత శివం మందిరంలో సకల జనుల కోసమై... ప్రార్థనా మందిరం కాదు, సేవా మందిరం లాగా చేయాలన్న ఆకాంక్షతో... స్వామి సంకల్పముతో "Sri Sathya Sai Reprogramming Lives" మొదలు పెట్టాము.

ఈ వ్యాసం గురించి వ్రాద్దామని బృందంలో ఆ రోజు ఉన్న వారితో మాట్లాడి సమాచారం తీసుకునే ప్రయత్నం చేశాను. అరేయ్, Sri Sathya Sai Reprogramming Lives ఎట్లా మొదలైంది అని అడిగాను. చాలా ఆశ్చర్యంగా! అదేంటన్నా నువ్వు అలా అంటావు? మీరే కదా దానికి నాంది పలికింది. పూర్వం మీరు దిల్‌షుక్‌నగర్‌లో నిర్వహించిన మేనేజ్‌మెంట్ సప్తాహమే కదా పరివర్తనము చెంది, స్వామి ఆశీస్సులను అందుకొని మీరంతా భుజస్కంధాల మీద వేసుకొని శివం మందిరంలో మొదలు పెట్టింది.

ఆ తర్వాత కాలంలో యావత్ ఆంధ్రదేశంలో 20 వేల మంది పిల్లలకి ఈ Sri Sathya Sai Reprogramming Lives వెళ్లింది. అంతే కాదు సుమారు 50 వేల మంది విద్యార్థిని విద్యార్థులతో ముచ్చటించే అవకాశం హైదరాబాద్ యువతకి కలిగింది.

ఇంత కార్యానికి బీజం నిజంగా దిల్‌షుక్‌నగర్ సాయి కేంద్రం లోనే కదా పడింది అని చెప్తే... గతం గుర్తుకు వచ్చి నాకు చాలా ఆశ్చర్యమైంది!!! నాకే గుర్తులేదు ఈ విషయము!

ఇప్పుడు గుర్తుకొస్తున్నది, ఆ ఆలోచనలను, ప్రణాళికను, ఫలితాల గురించి హైదరాబాద్ యూత్‌తో పంచుకున్నప్పుడు, ఇలాంటి కార్యక్రమాలను మనం శివం మందిరంలో పెద్ద ఎత్తున చేస్తే వందలాది మందికి మంచి జరుగుతుంది అంతే కాక స్వామిని వాళ్లకు పరిచయం చేసినట్లు ఉంటుంది అని ఆలోచించుకున్నాం.

ప్రార్థనా మందిరాలు కాదు కావలసింది, సేవా మందిరాలు కావాలి అని. అలా సత్యసాయి సార్వ జనిక సేవా మందిరాల సంకల్పం ఆ విధంగా జరిగినది. ఎక్కడ చూసినా మందిరాలు కేవలం గురువారము, ఆదివారమే నడుస్తుంటాయి. కానీ సేవా మందిరాలుగా మలచుకోలిగితే ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమం నడిచే విధంగా చేసుకోవచ్చు కదా! అన్ని మతాల వాళ్లు, కులాల వాళ్లు రావచ్చు. అవసరంలో ఉన్నవాడు ఎవడైనా సరే ఈ మందిరానికి వస్తే వాడికి అవసరం తీరుతుంది అనే భావన స్ఫురించింది. పెద్ద వాళ్లందరికీ చెప్తే, కొద్దిమంది సరే అన్నారు మరి కొద్దిమంది ఒప్పుకోలేదు. మనకెందుకు ఈ వృత్తి విద్యా నైపుణ్యాల గురించి! మనము ఎందుకు చేయడం అని చెప్పారు. అయినా స్వామి మీద భక్తి విశ్వాసంతో ప్రతి ఒక్కరి హృదయాన్ని గెలిచాము. సాయి ట్రస్ట్ నిర్వాహకులు, సంస్థ ప్రతినిధులు, అందరినీ ఒప్పించి, మెప్పించి, అందరినీ ఒకచోట చేర్చి, ప్రప్రథమంగా, 2007లో, ఈ కార్యక్రమాన్ని మొదటిసారి మూడు రోజుల పాటు, సాయింత్రం ఆరు నుండి తొమ్మిది గంటల వరకు నిర్వహించాం. అద్భుతమైన ఫలితం వచ్చింది, ఉద్యోగం లేని యువకులు శివం వైపు తండోప తండాలుగా ఆకర్షితులయ్యారు. వాళ్లకి మంచి విశేషాలు చెప్పడము జరిగింది. వచ్చిన నిరుద్యోగ యువకులు ఎంతో లబ్ధి పొందారు.

ఆ తర్వాత ఇది కాస్తా ఉచిత కంప్యూటర్ శిక్షణలా రూపాంతరం చెందింది. మూడు నెలలపాటు జరిగింది. అందుకోసమే శివం మందిరం పైన మేడ మీద ఉన్న ప్రాంగణంలో ఏకంగా 50

కంప్యూటర్లు మరియు లాప్టాప్‌లు పెట్టేశారు. వారాంతాలలో రోజంతా కూడా బయటి పరిశ్రమల నుండి ఉద్యగులు, సాంకేతిక నిపుణులు, సాయి సేవకులు వచ్చి మాట్లాడే వారు. ఇలా మూడు నెలల పాటు కార్యక్రమం చేశారు.

Sri Sathya Sai Free Multi Media & Graphic Designing, MS Office ఇలా మరెన్నో కార్యక్రమం చేశారు. ఎప్పటికప్పుడు ఈ విషయాలను, విశేషాలను స్వామి వారికి తెలుపుతున్నాం కూడా.

ఒక సందర్భంలో స్వామి హైదరాబాద్ యువజనులతో మాట్లాడటము జరిగింది. ఈ సేవా కార్యక్రమాల గురించి విన్నవిస్తే "బంగారు! చాలా సంతోషము! చేయండి, చేయండి" అని చెప్పారు

ఇంకొక సందర్భంలో ఏకాంత సౌధ సంభాషణ చేస్తూ ఈ సేవా విశేషాల ఆల్బంని స్వామికి చూపిస్తూ, స్వామి ఇలా హైదరాబాద్‌లో చేస్తున్నాం అంటే! వారు వెంటనే "మరి జిల్లాలు" అని అడిగారు. అంతే, కేవలం 'మరి జిల్లాలు' అన్న ఐదు అక్షరాలని పంచాక్షరీ మంత్రంగా తీసుకొని హైదరాబాద్ బృందం అంతా కూడా ఉత్సుకతతో శివం ప్రాంగణంలో చేరడము, స్వామి వారు 'మరి జిల్లాలు' అన్నారు కదా, మనం ఎట్లా చేయాలి? అని చర్చించేశాము.

ఆ పాటికే శివంలో చేస్తున్న కార్యక్రమాలు ఆ నోట, ఈ నోట విన్న ఎన్నో జిల్లాల యువజన సమన్వయకర్తలు ఇలా మేము కూడా చేయాలన్న ఉత్సాహంతో ఉన్నారు. ఇలా స్వామి అడిగారు... మనం చేద్దామా? జిల్లాలలో అని అడగడం ఆలస్యం. మేము కూడా చేస్తాం అని వారు చెప్పేశారు. ఆ విధంగా మొదలైన సేవా కార్యము అనతి కాలంలోనే కొన్ని వందల వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు చేరగలిగింది.

Basic Computer Course, MS Office, Tally Course, Multi Media & Grafic Designing Course ఇంకా నిరుద్యోగ యువత కోసం Campus Recruitment Training ఇలా ఎన్నో విశేష కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. విప్రో, ఇన్ఫోసిస్, జెన్‌ప్యాక్ వంటి ప్రముఖ సంస్థలు శివం ప్రాంగణానికి చేరుకున్నాయి. వారు ఎన్నో కంప్యూటర్లు ఈ అద్భుతమైన సేవాకార్యం కోసమై అందించారు. హైదరాబాద్‌లో ఏకంగా కంప్యూటర్ బ్యాంక్ ఏర్పాటు చేసాము. వందలాది కంప్యూటర్లు సేకరించి జిల్లాల వారీగా పంపిణీ చేసి, కంప్యూటర్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ ఉన్న నిరుద్యోగ యువతీ యువకులను ఉద్దేశించి వారితో మాట్లాడి, ప్రేరణ ఇచ్చి స్ఫూర్తిని అందించాము.

అనుక్షణము అహరహము, స్వామి కోసం చేసిన ఈ కార్యంలో ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు స్వామి ఇచ్చారు. మొదటి బ్యాచ్లో ఉన్న విద్యార్థులు ఈ రోజు విదేశాలలో కూడా స్థిరపడ్డారు అనడంలో ఎట్టి సందేహము లేదు. కొద్దిమంది పోలీస్ కానిస్టేబుల్స్ అయ్యారు. కొద్దిమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ అయ్యారు. కొద్దిమంది రిక్రూట్‌మెంట్ సమయంలో అద్భుతమైన ప్రతిభ చూపించి ఉన్నత ఉద్యోగాలు అందుకున్నారు. కొద్దిమంది కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నిపుణులు, ప్రోగ్రామర్స్ అయ్యారు. అన్నిటికన్నా మించి సంస్కారవంతమైన జీవితాలని కొనసాగిస్తున్నారని నేను చెప్పుకోవాలి.

ఇలాగ Reprogramming lives నిజంగానే జీవితాలను పునఃనిర్మాణం చేయడం, స్వామి దగ్గరికి పిల్లలందరిని తీసుకెళ్లడము, ఎన్నో సార్లు స్వామి దర్శన, స్పర్శన, సంభాషణ, పాద నమస్కార, ప్రసాద భాగ్యాలు ఇవ్వడమే కాకుండా పరిపూర్ణమైన ఉత్సాహాన్ని మాకు అందించారు. హైదరాబాద్ యువతకు శ్రీ సత్య సాయి Re Programming of Lives అనేది ఆకర్షణీయమైన Brand లాగా నిలిచింది.

ఇది చూసి మహిళా బృందము, 'అయ్యా! మరి యువకులకు మాత్రమే మీరు చేస్తున్నారు. యువతుల పరిస్థితి ఏమిటి? అనడము, వాళ్లకు కూడా కావలసిన వనరులు ఇవ్వడము, ఆ విధంగా సత్యసాయి సేవా సంస్థ మహిళలు మరియు బాలికల కోసం మరో కార్యక్రమాన్ని చేపట్టింది. వారు కూడా కొన్ని వందల మందిని ప్రేరేపించి ముందుకు నడిపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే, ఈ ప్రస్థానంలో స్వామి ఇచ్చిన చదువు, విజ్ఞానం, నైపుణ్యం, ఇవి ఉద్యోగానికి ఉపయోగపడేవి మాత్రమే కాక జీవితాలకు దోహదపడే అంశాలుగా మారాయి. ఈ ప్రేరణతో మేము వేల మందికి సేవ చేయగలిగాము, అంటే ఇది అంతా కేవలం స్వామి సంకల్పము అనుకోవాలి.

ఆ సమయంలో శివంకు వచ్చిన ప్రఖ్యాత సంస్థల నిర్దేశకులందరూ కూడా జరుగుతున్న సేవలను చూసి చాలా ఉత్సాహ పడ్డారు. చివరి రోజు జరిగే స్నాతకోత్సవ కార్యక్రమానికి నిరుద్యోగ యువతీ యువకుల తల్లిదండ్రులు కూడా వచ్చారు. తమ పిల్లలు చెప్తున్న విశేషాలను, వారి నైపుణ్యాన్ని, మాటలను, భావాలను, ప్రవర్తనను చూసి ఎంతో భావోద్వేగానికి గురయ్యేవారు. కొందరు తల్లిదండ్రులు వచ్చి మా కాళ్లకు నమస్కారం చేసిన సందర్భాలు నాకు గుర్తున్నాయి. అయ్యా ఈ రోజు మీకు నమస్కారం చేయాలి, స్వామిని మాకు చూపిస్తున్నారు! స్వామి ఎవరో మాకు తెలియదయ్యా! ఇదిగో మా పిల్లలు బాగుపడ్డారు,మా పిల్లాడికి ఉద్యోగం వచ్చింది, క్యాంపస్ సెలెక్షన్లు శివంలో జరిగాయి అంటే మీరు అందరూ అర్థం చేసుకోవాలి. వాళ్లకు భోజనాలు ఏమిటి, వాళ్లతో మాట్లాడటం అయితేనే ఏమిటి, సాంస్కృతిక ప్రదర్శన ఇవ్వడం అయితేనేమి, వాళ్లతో సేవా కార్యక్రమాలు చేయడం ఏమిటి?

వీళ్లు మనం చేసే గ్రామ సేవల్లో పాల్గొనే వాళ్లు, మనం వెళ్లిన ప్రశాంతి సేవలలో పాల్గొనే వాళ్లు, గ్రామ సంకీర్తనలో వెళ్లేవాళ్లు ఇలా కార్యక్రమం ఏదైనా అంతే ఉత్సాహము! వీళ్లు మా జీవితం గురించి ఆలోచిస్తూ ఇంత చేస్తున్నారు కదా! మరి మేము, వాళ్లు చెప్పిన మాట వినాలి కదా! అనే ఆలోచనతో పిల్లలందరూ నేర్చుకోవడం మొదలు పెట్టారు. స్వామి కూడా అంతే స్థాయిలో స్పందించడం జరిగింది. అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు జరిగాయి. కంప్యూటర్లు కాదు laptop కూడా పంపించిన సందర్భాలు ఉన్నాయి.

ఈ సాంకేతిక సేవా ప్రస్థానంలో ఎన్నో పాఠాలు స్వామి మాకు నేర్పించారు. సాంకేతికతను కూడా సేవకు నేపథ్యం చేశారు. కంప్యూటర్ల ద్వారా కూడా పిల్లల్ని ఏ విధంగా సంస్థకి మనం అందించగలమో నేర్పారు. అసలు స్వామి ఎవరు అన్నది కూడా తెలియకుండా, భక్తి లేకుండా, కేవలం బాగుపడాలనే తపన ఉన్నవాళ్లకి స్వామిని పరిచయం చేసే అద్భుతమైన ప్రణాళికను స్వామి మాకు అందించారు.

ఈ కార్యక్రమంలో కొన్ని వందల మంది హైదరాబాద్ యూత్ తమ వనరులని, తమ ధనాన్ని, తమ సమయాన్ని స్వామి కోసం అర్పించారు. నాకు గుర్తు, గంగాధర్ శర్మ, రొద్దం రామచంద్ర, రవి కిరణ్, వేణు గోపాల్, ప్రశాంత్, నాగేంద్ర, సోమశేఖర్, జి శ్రీనివాస్, పవన్, సంతోష్, వినయ్, శ్రవణ్ ఇలా ఎంతో మంది. చిన్న బీజములా మొదలై శాఖోపశాఖలుగా విస్తరించిన Sri Sathya Sai Re Programming Livesను ఈ రోజు స్వామి పాద సన్నిధికి సమర్పిస్తున్నాము అందరం చేరి.

సోదరుడు నాగేంద్ర ఎంతో భక్తి ప్రపత్తులతో ఈ కార్యక్రమాన్ని భుజాల మీద వేసుకుని ప్రతి సంవత్సరం కూడా వందలాది మందికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు.

మొన్నా మధ్య సాయి కేంద్ర ట్రస్టీ రత్నాకర్ పుట్టపర్తి నుంచి వచ్చి, శివం ప్రాంగణంలో

తాజాగా శిక్షణ ముగించుకున్న నిరుద్యోగలకు ధృవ పత్రాలు ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల లోనే కాదు, దేశంలోని ఎన్నో సాయి కేంద్రాలలో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.

హైదరాబాద్ యువతతో చేరి పని చేసిన వాళ్లు గానీ, వీరి సేవల గురించి తెలుసుకున్న వాళ్లు గాని ఈ నేలపై ఉన్నంత వరకూ, ఇలాంటి కార్యకలాపాలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయి. వీటికి ఎప్పుడూ ముగింపు ఉండదు. ఒక వేళ ఆగినా అది ముగింపు కాదు, కేవలం ఒక విరామ చిహ్నం (కామా) మాత్రమే అని చెప్పుకోవాలి.

ఇలాంటి అద్భుతమైన సేవా నిరతిని, త్యాగ స్ఫూర్తిని, ప్రేరణని మాకు అందించిన స్వామికి ఈ సందర్భంగా మరొకసారి అభివాదం చేస్తూ ఈ రీప్రోగ్రామింగ్ లైవ్స్ ద్వారా దేశ విదేశాలలో స్థిరపడినటువంటి వందల, వేల మంది విద్యార్థినీ విద్యార్థులందరి తరపున స్వామి వారికి శరణు వేడుకుంటున్నాను.

88

ఉన్నత విద్యతో ఉత్తమ యువకులు

హైదరాబాద్ యూత్, వాళ్ల దైనందిక జీవితంలో కూడా సేవని ఒక భాగంగా చేసుకున్నారు. కారణం ఏంటంటే వారాంతాలలో మనం గ్రామ సేవలకు వెళుతున్నాం. పర్వదినాలలో ప్రశాంతి నిలయానికి వెళుతున్నాం. ఆదివారము గురువారము వస్తే స్థానికంగా ఉన్న సాయి కేంద్రాలలో, శివం క్షేత్రంలో భజనలకు వెళ్తున్నాం అని మిగతా రోజులు ఊరికే కూర్చోలేదు.

ఇంకా ఏం చేయొచ్చు? అని సదా యోచించే వారు. ఆ సందర్భంలో స్వామి వారు దీన జనోద్ధరణ పథకాన్ని ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేయడము, తర్వాత ఆ స్ఫూర్తిని తీసుకున్న హైదరాబాద్ యూత్ అందరూ చేరి మనం ఏ విధంగా ఈ కార్యంలో పాల్గొనవచ్చు అని అందరం చర్చిస్తున్నాం. "అరేయ్ దిక్కు మొక్కు లేని పిల్లల్ని మనం కూడా చూద్దామా? కానీ ఇంకా మేము యుక్తవయసులోనే ఉండటం వలన పిల్లలను, చిన్నారులను సమర్థంగా చూసుకోవడం మన వల్ల కాదని అనిపించింది. ఎందుకంటే బాధ్యతలు, కర్తవ్యాలు ఉన్నాయి. అదీ గాక అంత చిన్న పిల్లలను చూసుకునే పరిపక్వత కూడా లేదు. మరి ఎలాచేయాలి అనుకున్నప్పుడు... మనము బీద పిల్లల్ని, అవసరంలోఉన్న పిల్లల్ని, ఆసరా కోరుతున్న పిల్లల్ని, ఆశ్రయం కోరుతున్న పిల్లల్ని, పదవ తరగతి గాని, ఇంటర్ గాని అయిన తర్వాత ఎటు పోవాలో తెలియని దిక్కు లేని పిల్లల్ని మనం చూసుకోగలిగితే, ఒక మూడేళ్ల నుంచి ఐదేళ్ల దాకా వాళ్లకి సహాయం చేయగలిగితే అద్భుతమైన వ్యక్తులను సమాజానికి అందించవచ్చు కదా! అనుకున్నాం.

అదే సమయంలో హైదరాబాద్ చిన్నరాజు మరియు పెద్దరాజు అందరికీ చాలా ఆత్మీయంగా ఉంటారు. స్వామి పూర్వ విద్యార్థులు వీళ్లిద్దరూ, వేద పాఠశాల నుంచి వచ్చిన వాళ్లు, కూకట్పల్లిలో ఉంటారు. వీళ్లు యాదృచ్ఛికంగా వెస్ట్ గోదావరి గ్రామంలో శిరిడీ బాబా మందిర ప్రారంభోత్సవానికి వెళితే, చిన్నరాజుకు ఒక అబ్బాయి తారస పడ్డాడు. చాలా బీద పరిస్థితి ఉన్న ఈ అబ్బాయి చదువుకోవాలని అపేక్షతో ఏం చేయాలో తోచక గొర్రెలు కాచుకునేది గమనించాడు. ఆ పరిస్థితిలో

ఉన్న ఈ అబ్బాయిని చూసి కదిలిపోయాడు. "ఏదైనా ప్రయత్నం చేద్దాం అని లెటర్ వ్రాస్తే, బెంగుళూరులో స్వామి లెటర్ తీసుకోవడము జరిగి పోయింది. అయ్యా స్వామి తీసుకున్నారు కాబట్టి నీకు సహాయం అందుతుంది నువ్వు వచ్చేయ్' అని చెప్పారు. ఆ అబ్బాయి ఏమో ఎంతో అమాయకంగా అసలు జీవితంలో ట్రైనే ఎక్కని ఆ బాబు ట్రైన్ ఎక్కేసి హైదరాబాద్‌కి రావడం జరిగింది. హైదరాబాద్ యువత ఇలాంటి పిల్లల కోసమే చూస్తున్నట్టుగా ఆ పిల్లాడిని గుండెలకు హత్తుకుని చేయూతను అందించడం జరిగింది. అలా మొదలైంది "ఉన్నత విద్యా ప్రణాళిక" 2002లో ప్రారంభమైన ఈ ప్రస్థానము, 2025కి అంటే సుమారు 23 ఏళ్లలో సుమారు 60 మంది అత్యంత అద్భుతమైన వ్యక్తులని ఉన్నత విద్యాభ్యాసం కోసమై చేయుతను అందించడం అదృష్టంగా భావిస్తూ ఉంటాం. ఆ రోజుల్లో ఆ పిల్లాడిని నారాయణ కాలేజీలో చదివించాము. తర్వాత B.Sc., ఐదేళ్ల తర్వాత ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం వచ్చింది.

ఇంకో సారి విక్టోరియా హాస్టల్లో కార్యక్రమము జరుగుతుంటె, ప్రిన్సిపల్, లక్ష్మయ్య 'అయ్యా ఈ అబ్బాయిది చాలా బీద కుటుంబము, ఏం చేయాలో తెలియదు. చాలా అవగాహన లేమితో బాధపడుతున్నారు. ఈ అబ్బాయికి మీరు సహాయం చేయండి అని చెప్పి మరొక అబ్బాయిని పరిచయం చేశారు. పేరు శివకుమార్. వాడు కూడా B.Com., పూర్తి చేసాడు. వాడికి కూడా ఉద్యోగం వచ్చింది.

తర్వాత కాలంలో పుట్టపర్తి నుంచి తల్లిదండ్రులు లేని సాయిరామ్ బండి హైదరాబాద్ ఆ రావడము జరిగింది, అద్భుతమైన ఉన్నత చదువులను పూర్తి చేసి, ఉద్యోగం చేసుకుంటున్నాడు.

అమెరికా, దుబాయ్, ఆస్ట్రేలియా, బెంగళూరు, హైదరాబాద్, బాంబే ఇలాంటి ఎన్నో పట్టణాలలో ఎన్నో దేశాలలో ఈ 60 మంది పిల్లలు కూడా వెళ్లిపోయారు.

ఈ రోజుకి కూడా సుమారు 10 మంది పిల్లలను హైదరాబాద్ యూత్ తమ సొంత పిల్లల్లాగా చూస్తున్నారు. ఇందుకు కావాల్సిన వనరులు అంతా కూడా సంపాదించే వాళ్లు అంతా ఎవరికితోచింది వాళ్లు సమకూర్చి ఆ పిల్లలకి ఫీజులు కడుతున్నారు. వాళ్లకి కావలసిన అవసరాలు తీరుస్తున్నారు. డబ్బుతో పాటు విలువలను కూడా వాళ్లకు అందించే ప్రయత్నం జరుగుతోంది.

ఉన్నత విద్యా ప్రణాళికకు వేదిక దిల్‌షుక్‌నగర్ లోని Sri Sathya Sai Institute of Human Excellenceలో ఉన్న చిన్న గది. తర్వాత వనస్థలిపురంలో సత్యసాయి సేవా మందిరం ప్రాంగణంలో మేడ పైన రెండు మూడు గదులకు మారింది.

సంవత్సరానికి ముగ్గరికో నలుగురికో సహాయం చేయడము జరుగుతూ ఉంది. శ్రీ సత్య సాయి దీన జనోద్ధరణ పథకం ద్వారా రాష్ట్రంలో వివిధ కేంద్రాలలో చిన్న పిల్లల్ని తీసుకుని వారిని 10వ తరగతి వరకు చూసుకుంటారు. తర్వాత వాళ్లకు దిశా నిర్దేశం జరగాలంటే హైదరాబాద్ యువతకి కనెక్ట్ చేస్తే సరిపోతుంది అనే ఆలోచన చేసేవారు. తదాదిగా హైదరాబాద్, ప్రకాశం, అనంతపురం, శ్రీ సత్య సాయి ఇలా ఎన్నో జిల్లాల నుంచి పిల్లలు రావడం మొదలైంది. కొద్దిమంది స్వామి కళాశాలలో విద్యార్థులుగా వెళ్లారు, వెళ్తున్నారు. ఎంత అద్భుతమైన ప్రస్థానమో ఆలోచించండి. మేము బాగుపడటం గొప్ప కాదు, మాతో పాటు ఇంకో ఇద్దరు ముగ్గురు బాగుపడాలనే ఒక తపన. ఒకానొక సందర్భంలో స్వామి దర్శనంలో ఈ పిల్లల్ని "స్వామి బీద కుటుంబము నుండి ఎంచుకొని, ఉన్నత చదువులు చదివిస్తున్నాము స్వామి ఈ విధంగా" అంటే, చాలా సంతోషం, మంచి పని చేస్తున్నారు, ఇంకా చేయండి, అని చెప్పడము జరిగింది.

అలాగే 2003 సహస్ర గ్రామ సేవ యజ్ఞం సందర్భంగా ఇచ్చిన ప్రసంగంలో స్వామి చెప్పారు, "బంగారు! ప్రశాంతి నిలయం మీది, మీరు నా వారు, స్వామి మీ వారు, మీరు ఎప్పుడైనా రావచ్చు,

ఎక్కడైనా తిరగొచ్చు, మీ అందరికీ స్వామి విశ్వవిద్యాలయములో ప్రత్యేకంగా సీట్లు ఇస్తాను" అని చెప్తే... ఆశ్చర్య పోయాము. కానీ ఈ మాటలు ఏదో మాట వరసకు చెప్పినవి కావు... ప్రతిదీ భవిష్యత్తులో జరగ బోయే విషయాలను ముందే చెప్పడమే!

గత దశాబ్ద కాలంగా సుమారు 60 మంది పిల్లలు తద్వారా బాగుపడ్డాయి. ఆ పిల్లలు కూడా ఉన్నతమైన చదువుతో పాటు, ఉత్తమమైన ప్రమాణాలు, ఉదాత్తమైన స్వభావం వారు పుణికి పుచ్చుకున్నారు.

నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిస్తాను అని ఈ పిల్లలు కూడా స్థిరపడిన తర్వాత ఒక చెయ్యి అందించడం మొదలు పెట్టారు. వాళ్లు కూడా తర్వాత వచ్చే పిల్లలకి నాయకత్వం వహించడం మొదలు పెట్టారు అంటే ఆలోచించండి. ఇది నిజమైన వారసత్వం కాదా!

నాకు గుర్తు, చీరాల నుండి వెంకటేశ్వర్లు. దీనజనోద్ధరణ పథకం కోసం ఎంపిక చేసి తీసుకొస్తే ఆ అబ్బాయి ఇంట్లో గొర్రెలు మేపుకునే వాళ్లు. ఎలాంటి నేపథ్యము లేదు కానీ, ఆ అబ్బాయి తర్వాత కాలంలో అద్భుతమైన ప్రతిభ ప్రభావాన్ని చూపించాడు. ఇంటిని ఉద్ధరించాడు, కుటుంబానికి పెద్దదిక్కుగా మారి పోయాడు. మంచి ఇల్లు కట్టుకున్నాడు. చెల్లెలకి పెళ్లి చేశాడు. వాళ్ల తమ్ముడిని చదివిస్తున్నాడు. ఇంట్లో ఐదు గొర్రెలు కాస్త 100 గొర్రెలు అయిపోయాయి. ఇవన్నీ చెప్పుకుంటూ పోతే ఒక్కొక్క ఉన్నత చదువులు చదివిన విద్యార్థి, స్వామి విద్యార్థిగా మారిపోయాడు. ఎక్కడా తప్పులు చేసిన విద్యార్థులు కనపడలేదు. ఈ ప్రస్థానంలో ఎంతో శ్రద్ధగా, భక్తితో మేము చదువుకోవాలి, బాగుపడాలి అని ఆలోచన చేసేవాళ్లు. చిన్న చితక పొరపాట్లు చేసిన వెంటనే పక్కన ఉన్న సోదరులు వాటిని చక్కగా గుర్తించి వాళ్లని సరిదిద్దే ప్రయత్నం చేసేవాళ్లు.

నాకు గుర్తుంది ఇలా సాగించిన ఆ ప్రయాణంలో, సీనియర్లు మరియు జూనియర్ సాయి సోదరులు కూడా ఉన్నత విద్యా ప్రణాళికకు చేయూత నిచ్చారు. గంగాధర్ శర్మతో మొదలుకుని రమణా రెడ్డి, మల్లికార్జున్, పవన్ కొండపల్లి, నితిన్, రాధాకృష్ణ, నాగరాజు, కళ్యాణ్ చక్రవర్తి, వేణు, శ్రవణ్, రవి కిరణ్ ఇంకా మరెందరో సోదరులు... తమ తమ సమయానుగుణంగా అందరూ చేయూతనందించారు. ఇదంతా కూడా ఆ స్వామి ఇచ్చిన దివ్యావకాశంగా తీసుకున్నారు. ఈ ప్రక్రియలోలో ఎన్ని పాఠాలు నేర్చుకున్నాము అంటే ఒక బాధ్యతని తీసుకోవడం ఎలాగో గుర్తుచేసుకున్నాం. ఒక పిల్లాడిని పైకి తీసుకురావాలంటే ఎలాంటి నైపుణ్యాలు మనకు ఉండాలో తెలుసుకున్నాం. ఒక పిల్లాడు తప్పు చేస్తే మందలించకుండా, వాడిని ఇబ్బంది పెట్టకుండా ఏ విధంగా సరిచేయాలో తెలుసుకున్నాం. ధన వనరులను ఏ విధంగా సమకూర్చుకోవాలో తెలుసుకున్నాం. స్వామి ఇచ్చిన సమయాన్ని ఏ విధంగా వారి కోసం ఖర్చు పెట్టాలో తెలుసుకున్నాం. వారి కోసం తహతహలాడడం ఎలాగో తెలుసుకున్నాం. వారి కష్టాన్ని మా కష్టంగా అనుభవించే ప్రయత్నం చేశాం.

ఈ పథకం ద్వారా చదివిన పిల్లలు ఎందరో ఇన్ఫోసిస్, విప్రో, బ్లాక్‌లైట్, కాగ్నిజెంట్ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ పిల్లలందరూ కూడా ఈ రోజు సుశిక్షితమైన సాయి ఆత్మ బంధువులు లాగా బతుకుతున్నారు అనడంలో ఎట్టి సందేహమూ లేదు.

వీరందరికీ కావలసిన ప్రాంగణ నియామక శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, మానవతా విలువలు, సేవా దృక్పథం, త్యాగనిరతి, నైతిక జీవనం, ధార్మిక జీవనం, ఆధ్యాత్మిక ప్రవృత్తి ఇవన్నీ అలవోకగా నేర్పించగల అవకాశాన్ని స్వామి ప్రసాదించారు.

ఈ విశేషాలన్నీ కూడా ఆ స్వామి యొక్క పాద సన్నిధిలో సమర్పిం చేప్రయత్నం చేస్తున్నాను. దేశ విదేశాలలో స్థిర పడినటువంటి ఈ విద్యార్థులందరి తరపున స్వామి వారికి శరణువేడుతూ ఈ వ్యాసం ముగిస్తున్నాను.

89

విక్టోరియా హాస్టల్ – సంస్కార జ్యోతి

హైదరాబాద్ యువత చేసిన ఎన్నో విశేష సేవా కార్యక్రమాలలో తలమానికముగా చెప్పాల్సింది మరొకటి ఉంది. ఇది హృదయానికి చాలా దగ్గరగా ఉన్న సేవా కార్యం. గత మూడు దశాబ్దముల కాలముగా ఈ సేవా కార్యక్రమంలో నేను కూడా ఒక సమిధ లాగా ఉపయోగపడుతున్నందుకు సదా ఆ స్వామికి శరణు వేడుతూ ఉంటాను.

హైదరాబాద్ యువతకి సరూర్ నగర్‌లో సుమారు 60 ఎకరాలలో ఉన్న "విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ హాస్టల్"తో అవినాభావ సంబంధం ఉంది. ఈ హాస్టల్లో అత్యంత బీద కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు, అనాధలు, తల్లి లేక తండ్రి ఒక్కరే ఉన్న పిల్లలు, కుగ్రామాల నుంచి వచ్చిన పిల్లలు అక్కడ ఉండే వాళ్లు.

ఇది విక్టోరియా రాణి అప్పుడెప్పుడో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మన హైదరాబాద్ నడివడ్డున ఆ 60 ఎకరాలలో కట్టినటువంటి భవనం. అతి పురాతనమైన భవనం. దాన్ని హైదరాబాద్ వారసత్వ భవనంగా పరిగణించవచ్చు. అక్కడ ఎన్నో సినిమా షూటింగ్లు జరుగుతాయి. అక్కడికి గొప్ప వ్యక్తులు కూడా తరచూ వస్తుంటారు. కానీ అందరూ చూసి పోయేవాళ్లే గాని చేసిపోయే వాళ్లు చాలా తక్కువగ ఉండే ప్రాంగణం అని చెప్పుకోవాలి.

సరూర్‌నగర్, వనస్థలిపురం, దిల్‌షుక్‌నగర్ సాయి కేంద్రాల పిల్లలందరూ ఒక సారి ఆ హాస్టల్ని సందర్శించడం జరిగింది. అప్పటి నుండి, అక్కడ ఉండే వందలాది మంది పిల్లలను చూసి గుండె కదిలి అప్పుడప్పుడు ఏదో చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేయడము తరచుగా జరిగేది.

అలాంటి హాస్టల్ గురించి హైదరాబాద్ యువతకు తెలిసింది. "అరెరే! ఇంత పెద్ద హాస్టల్ ఇక్కడ ఉందా! మనం వెళ్లొచ్చుకదా ఒక సారి అని వెళ్లాము. అక్కడ ఉన్న దయనీయమైన పరిస్థితి అంతా చూసి "అయ్యో! మనము దీన్ని మనదిగా తీసుకుని, ఇక్కడ స్వామి కార్యాన్ని చేయాలి" అని ఆలోచన చేశాము. అక్కడ సత్యసాయి బాలవికాస్ కార్యక్రమం, వినాయక చవితి, క్రిస్మస్, నూతన

సంవత్సర వేడుకలు, దీపావళి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా చేయాలని ఇలా అంతా కూడా ప్రణాళిక రచించాం.

ఈ పవిత్రమైన ఆలోచనలను స్వామి వారికి వ్రాసుకోవడము, స్వామి ఆనందంగా అనుగ్రహం ఇవ్వడము, ఆ అనుగ్రహాన్ని బలంగా తీసుకొని వనరులను సమీకరించుకొని, ఎవరు వచ్చినా ఎవరు రాకపోయినా ఆ హాస్టల్‌లో ఉండే ఆడ, మగ పిల్లలందరికీ కూడా ప్రధానంగా వాళ్లకి ఆధ్యాత్మికత కంటే కూడా ముందుగా మానవతా విలువలు, నైతికత, ధార్మిక జీవన విధానము, వ్యక్తిగత ఆరోగ్యము, పారిశుధ్రత ఇవన్నీ కూడా బాలవికాస్ ద్వారా చెప్పేవాళ్లం.

ఈ మొత్తం ప్రణాళికకు సంస్కార జ్యోతి అని పేరు పెట్టి, అందులో భాగంగా ఈ విషయాలన్నీ కూడా వాళ్లకి బోధించే వాళ్లము.

ఈ ప్రాజెక్ట్ ఆరంభం నుండి దీంతో చేకూరిన అనుబంధం నా భాగ్యంగా భావిస్తున్నాను. విక్టోరియా హాస్టల్లో కార్యక్రమాలు ఎలా జరిగాయి అంటే అక్కడకు మనం వెళితే పిల్లలు ఇక అలా అయస్కాంతానికి అతుక్కు పోయే ఇనుప ముక్కల్లా మనతో గడిపే వాళ్లు "అన్నా సాయిరామ్!" అంటూ సందడిగా... అదేదో వాళ్ల సొంత వాళ్లు వచ్చినట్లుగా కేరింతలు కొడుతూ... ఆడి పాడి మాట్లాడే వారు. మా అందరికీ ఒక్కటే ఆలోచన, ఆ పిల్లలతో మమేకం అవ్వాలి. స్వామి ప్రశాంతి నిలయంలో మాత్రమే కాదు, ఈ పిల్లల హృదయంలో కూడా ఉన్నాడు, అన్న ఆలోచన మమ్మల్ని వాళ్లతో ప్రేమ బంధము వేసింది.

అక్కడి ఉపాధ్యాయ సిబ్బంది, బోధనేతర సిబ్బంది, ప్రిన్సిపల్, వార్డెన్ ఇలా అందరూ మనతో కలిసిపోయి, మమేకమైపోయారు. ప్రతి సంవత్సరం జనవరి 1 రాగానే అక్కడ నూతన సంవత్సర వేడుకలు జరుగుతాయి. మేమంతా ఆ ప్రాంగణం మధ్య భాగములో చక్కటి రంగోలీలు వేసే వాళ్లము. పిల్లలతో ప్రేమగా గడిపే వాళ్లము, భజన చేయించే వాళ్లము, పోటీలు కూడా నిర్వహించేవాళ్లం, పాటల పోటీలు, ఆటల పోటీలు, మాటల పోటీలు అన్నీ జరిపేవాళ్లం. బహుమతులు ఇచ్చేవాళ్లం. అలా ఎంతో ఆనందంగా మా నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేవాళ్లం.

అలాగే వినాయక చవితి వస్తే, ఆ ప్రాంగణాన్ని అందంగా అలంకరించి, బహిరంగంగా విగ్రహం ప్రతిష్ట చేసి, పిల్లలను ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయించేవాళ్లం.

దీపావళి వచ్చింది అంటే అద్భుతంగా చేసే వాళ్లము. ఎన్ని ఎన్ని రకాలుగా ఆ పిల్లలను ఆనంద పరచే వాళ్లమో! ఆ ప్రాంగణంలో అంతా కూడా పెద్ద ముగ్గులు వేసి, కొన్ని వేల దీపాలు వెలిగించి, దీపాల వెలుగుల్లో పిల్లల కన్నుల్లో మెరుపులు చూసేవాళ్లము. వాళ్లందరితో కూడా ఆడిపాడి స్వామి భజనలు చేస్తూ బాణాలనంతా కాల్పించే వాళ్లము. ఇలాంటి విశేషమైన సేవా కార్యంలో ఎన్ని వందల మంది హైదరాబాద్ యువత పాల్గొన్నారో చెప్పలేను. అందరూ కూడా తియ్యటి జ్ఞాపకాలను ఇంటికి తీసుకొని వెళ్లేవాళ్లు. దీపావళి రోజు ఇంట్లో దీపావళి చేసుకుంటే నలుగురికి ఆనందము. కానీ, ఈ విక్టోరియా హాస్టల్లో చేసుకుంటే 1000 మందికి ఆనందం కలిగించే విధంగా కార్యక్రమం చేసుకునే వాళ్లము. ఎన్ని బాణాలు అంటే, ఒక ఆటో బాణాలు కొని తెచ్చుకునే వాళ్లం. చాలా మంది అనేవాళ్లు, ఎందుకయ్యా డబ్బులు వృధా చేస్తున్నారు? అని. మేము చెప్పేవాళ్లము, ఇది వృధా ఎట్లా అవుతుంది? వెయ్యి మంది పిల్లలు ఆనందంతో కేరింతలు కొడుతుంటే ఆనందాన్ని మేము డబ్బిస్తే తీసుకురాగలమా? భోజనం పెడితే తీసుకురాగలమా? అని చెప్పే వాళ్లం. ఎందుకంటే మేము కేవలం స్వామిని అనుసరించేవాళ్లము. స్వామి కూడా తన విద్యాలయాల్లో ఉన్నటువంటి

పిల్లలందరికీ కూడా స్వయంగా క్రాకర్స్ ఇచ్చి దగ్గరుండి కాల్పించేవారు కదా! అదే పని ఇక్కడ మేము చేస్తున్నాము.

క్రిస్మస్ వచ్చిందంటే నేను కూడా క్రిస్టియన్ ఫాదర్ లాగా వేషం వేసుకొని, ఒకరు క్రిస్మస్ తాత లాగా తయారవుతారు. వేదిక మీద క్రిస్మస్ అలంకారాలు చేసే వాళ్లము. పిల్లలతో క్యాండిల్స్ వెలిగించి క్రిస్మస్ పాటలు అంతా కూడా పాడే వాళ్లము.

Love is My Form
Truth is My Breath
Bliss is My Food
My life is My Message
Expansion is My Life
No Reason for Love
No Season for Love
No Birth No Death
Sathya Dharma Ananada
Shanti Prema Aanandha
Shirdi Sai Parti Sai Prema Sai bolo
Shirdi Baba Parti Baba Prema Baba bolo

ఇలాంటి పాటలను చక్కగా పిల్లలతో పాడిస్తూ, బైబిల్ని తెరిచి ఆ మత గ్రంధంలో ఉన్న మంచి విషయాలని పిల్లలకి బోధిస్తూ ఉండేవాళ్లం. క్రిస్మస్ పర్వదినం రోజున నేర్చుకోవాల్సింది ఏమిటి? JOY ఫుల్‌గా ఉండాలి అని స్వామి చెప్పారు కద! అదిగో అలాంటి పదాలు, అర్థాలు, పరమార్థాలు పిల్లలకు చెప్పే వాళ్లము.

J అంటే Jesus first
O అంటే Others next
Y అంటే You last

అప్పుడే Joy వస్తుందని స్వామి చెప్పిన విశేషాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ విక్టోరియా హాస్టల్‌లో సంబరాలు చేసేవాళ్లం. సుమారు 1000 మంది పిల్లలుంటారు కదా, వాళ్లందరికి పంచేందుకు పెద్ద కేక్ తెచ్చి దాన్ని పిల్లలతో కట్ చేయించే వాళ్లము.

ఇక స్వామి వారి పుట్టు పండుగ వస్తే చాలా మంది పుట్టపర్తికి సేవలకు వెళ్లేవాళ్లు. హైదరాబాద్‌లో ఉండే మిగతా సాయి యూత్ అంతా కూడా ఇదొక పెద్ద బాధ్యత లాగా తీసుకొని, స్వామికి ఎన్ని ఏళ్లు అయితే అన్ని కేజీల కేకు అక్కడికి తీసుకెళ్లి పోయి, లడ్డూలు పంచి, పిల్లలందరూ సంబ్రమాశ్చర్యాలు పొందేలా స్వామి పుట్టు పండుగ ఆ హాస్టల్‌లో చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాగే ఆదివారం వచ్చిందంటే ఎవరో నలుగురు బాలవికాస్ గురువులుగా మారిపోయే వారు. హైదరాబాద్ యువత ఆడవాళ్లు కాదు, యువకులే. ఆ సోదరులే... బాలవికాస్ గురువులుగా పాఠాలు చదువుకొని, ఆ మాటలు నేర్చుకుంటూ, ఆ పద్యాలు నేర్చుకుంటూ వాళ్లకి బోధిస్తూ బాలవికాస్ గురువులుగా మారిపోయారు వాళ్లకు వేషాలు వేయించే వాళ్లు. వాళ్లతో డ్రామాలు చేయించే వాళ్లు.

ఆలోచించండి! ఇలా 25 సంవత్సరాలుగా విక్టోరియా హాస్టల్‌లో కార్యక్రమాలు జరిగాయి,

జరుగుతున్నాయి. ఆ మధ్య కరోనా కారణంగా ఏమీ చేయలేకపోయాం. అయితే ఈ రోజుల్లో కూడా విక్టోరియా హాస్టల్తో సేవానుబంధంతో ఉంటారు.

2000 సంవత్సరం అనుకుంటా ఇక్కడ చేసే కార్యక్రమంలో భాగంగా 'సంస్కార జ్యోతి' అనే మహత్తర కార్యక్రమాన్ని కూడా నిర్వహించాము. ఆ సంస్కార జ్యోతిలో భాగంగా ఆ పిల్లలకి ఎలాంటి విషయాలు, పద్యాలు, శ్లోకాలు నేర్పించాలి. మతాలకు సంబంధించిన విశేషాలు వాళ్లకి చెప్పాలి అన్న ఆలోచనని తీసుకొని బాలవికాస్ తరగతుల్లో ఎన్నెన్నో విషయాలు ఉన్నాయి. అన్ని విషయాలు మనం చెప్పలేము మనకున్న సమయాన్ని బట్టి అని చెప్పి, ఒక చిన్న పాకెట్ బుక్ లాగా చేద్దాం అని బాలవికాస్ పుస్తకాల నుండి సేకరించిన విషయాలను ఆ పిల్లల కోసం "సంస్కార జ్యోతి" పేరు మీద సంకలనం చేశాను. సమాజానికి పిల్లలు సంస్కారముతో వెలిగే జ్యోతుల్లగా ఉపయోగ పడాలని పుస్తకము సిద్ధం చేసాము.

ఈ చిన్న పుస్తకాన్ని మేము అందరము పుట్టపర్తిలో స్వామి దగ్గరికి తీసుకు వెళ్ళాము. సీనియర్ సోదరులు బయటే ఉండాల్సి వచ్చింది. కేవలం 20 మంది కొత్త పిల్లలు ఇంటర్వ్యూ గది లోకి వెళ్లే అవకాశం స్వామి వారు ఇచ్చారు. తరవాత అందరికీ స్వామి వారు పోర్టికోలో కూర్చోమని చెప్పి పాదనమస్కారం ఇస్తున్నారు. ఆ సమయంలో రమణా రెడ్డి ఆ పుస్తకాల ప్యాకెట్ను స్వామికి అందించాడు. స్వామి దానిని ఎంతో దయతో ఆవిష్కరించి ఆ పుస్తకాన్ని ఆశీర్వదించారు. ఇది నాకు జీవితములో ఒక అద్భుతమైన స్మృతిగా నిలిచిపోయింది. అసలు అది ఒక పుస్తకం అనచ్చా? వంద పేజీల పాకెట్ బుక్. అలాంటిది స్వామే స్వయంగా విడుదల చేయడం అంటే ఏమిటి?

ఇలా ఏ కార్యక్రమంలో చూసినా అంతో ఇంతో కొంతో ఎంతో ప్రతి ఒక్కరి చేత స్వామి చేయించారు. ఎలాంటి శక్తి సామర్థ్యాలు లేనటువంటి నాలాంటి వందల వేల లక్షల మందిని సంస్కారవంతులుగా మార్చారు అంటే, అది కేవలం సత్యసాయి బాబాకి చేతనైంది అని చెప్పాలి. పిల్లలతో పిల్లాడిగా గడపడం అనేది మేము అందరం నేర్చుకున్నాము.

హైదరాబాద్ యూత్ ఏమి చేసినా అది అద్భుతమైన జ్ఞాపకంగా మారిపోయింది. ఈరోజు మేమంతా కూడా 50 ఏళ్ల పై బడిన వయసు. కానీ పిల్లలతో చేరితే మాత్రం మేము పిల్లల్లాగానే మారిపోతాము.

ఎంత ప్రతిభను ఈ ప్రక్రియలో స్వామి వారు మాకు ఇచ్చారు అంటే...

ప్రేమించడం ఎలాగో నేర్పారు,
కేర్ చేయడం ఎలాగో నేర్పారు,
ఎలా అర్థం చేసుకోవాలో నేర్పారు
దయతో ఎలా ఉండాలో చూపించారు.
సేవలో మమేకం ఎలా అవ్వాలో తెలిపారు.
పిల్లలతో ఆడి, పాడి, ఎగరేది ఎలాగో నేర్పారు
ఇలా అన్ని నేర్పించారండి.

పిల్లలలో పిల్లలుగా మమ్మల్ని కూడా మార్చిన స్వామి వారికి శరణు వేడం తప్ప మేమంతా ఏం చేయగలం చెప్పండి. ఈ విశేషాలతో విక్టోరియా రెసిడెన్షియల్ హాస్టల్లో సేవ చేసుకునే భాగ్యమును ఏ విధంగా ప్రసాదించారు. కొన్ని వేల మంది పిల్లలకి స్వామి నామాన్ని, రూపాన్ని, త్యాగాన్ని, సేవా నిరతిని అందించే భాగ్యమును మాకు అందించారు అన్నది తెలుపుతున్నాను.

90

శ్రీ సత్య సాయి గురుకుల సేవా యజ్ఞం - 2004

2003వ సంవత్సరం గ్రామ సేవ మహా యజ్ఞము సందర్భంగా హైదరాబాద్ యువజనులకు తమ దివ్యానుగ్రహ, సందేశ, సంభాషణ, స్పర్శన, దర్శన, నమస్కార, ప్రసాద భాగ్యములు ప్రసాదించడం ద్వారా అద్భుతమైన శక్తిని మాలో పాదుకొల్పారు.

స్వామి వారే స్వయంగా ఏర్పరిచిన "శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్" విన్నూతమైన రీతిలో సేవా ప్రణాళికలని రచించడం మొదలు పెట్టింది. మేమంతా చేరి చాలా ఆలోచనలు చేసేవాళ్లం.

2003 అక్టోబర్ 21 రోజు స్వామి వారు గ్రామ సేవా ట్రస్టును ఏర్పాటు చేయడం వలన ప్రతి ఏడు అదే రోజు స్వామి దగ్గరికి వెళ్లే విధంగా ప్రణాళిక రచించారు. ట్రస్టు ఏర్పాటు చేసినప్పుడు స్వామి, "దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న సమస్యలకి పరిష్కారం చూపే సేవలు చేయమని" చెప్పడం, మాకు ఒక తారక మంత్రం లాగా అయింది.

ఇక 2004లో ఏం చేస్తే బాగుంటుంది అని ఆలోచిస్తున్నప్పుడు, వివిధ సమాచార పత్రికలలో వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించే అవకాశం నాకు కలిగింది.

సమాజంలో నిరాదరణకి గురి అయిన అంశములలో ప్రభుత్వ పాఠశాలలు ఒకటిగా మాకంతా అనిపించింది. ఈ విషయాలన్నీ బృందం మాట్లాడు తున్నప్పుడు, "అయ్యా! మనం ఇంత దాకా గ్రామ సేవలు చేశాం బానే ఉంది. స్వామి కూడా అనుగ్రహం చేశారు. కానీ స్వామి ఒక రోజు గ్రామ సేవలు చేయడము, ఒక రోజు ఈ విధంగా గ్రామాల్లో మెడికల్ క్యాంప్ చేయడం వల్ల ఉపయోగం ఏమైనా ఉందా? అని అడగటం జరిగింది. మనం ఇంకాస్త విన్నూత్నమైన రీతిలో ఎందుకు మాట్లాడుకోకూడదు? అని చర్చిస్తూ ఉండేవాళ్లం.

మనమందరం యావదాంధ్ర దేశంలోని 23 జిల్లాల్లో, అత్యంత నిరాదరణకి గురైన ప్రభుత్వ పాఠశాలల మీద మూడు నెలల నుంచి ఆరు నెలలు పని చేస్తే ఎలా ఉంటుంది? అని ఆలోచించారు, అందరూ సంతోషంగా "అరే బాగుంటుంది చేయడం, మన శక్తి సామర్థ్యాలు అంతా కూడా దీనికి

పెట్టొచ్చు, మనం ముందుకు తీసుకెళ్లొచ్చు, దీనికి పరిపూర్ణమైన నమయాన్ని వనరులను కేటాయించొచ్చు. అన్ని జిల్లాల్లో ఉన్న యువజనులకి ఒక పరిపూర్ణ ఉత్సాహం దీని నుంచి వస్తుంది. గ్రామ సేవల్లో కావలసిన వివిధ నైపుణ్యాలు ఇక్కడ అవసరం లేదు. కేవలం స్కూల్ పని కాబట్టి, స్కూల్లో వివిధ కార్యక్రమాలు మనం చేయొచ్చు కదా అని ఆలోచించాము.

ఒకానొక శుభ సందర్భంలో స్వామి వారికి విన్నవించుకున్నాం. స్వామి వారు సంతోషంగా అనుగ్రహం చేయడము, దానికి ఏమి నామకరణం చేస్తే బాగుంటుంది అని అనుకున్నప్పుడు... ప్రభుత్వ పాఠశాలలు అంటే గురుకులాల కంటే తక్కువ కాదు కదా! ఎంతో మారుమూల గ్రామాల్లో కూడా అద్భుతమైన విద్యా దానాన్ని చేస్తున్న ఈ ఉపాధ్యాయులకు, పాఠశాల భవనాలకు, వేలాది విద్యార్థులకు మనం సేవ చేస్తే అది గురుకులానికే సేవ చేసినట్టు కదా అని, అది కూడా యజ్ఞం లాగా చేయాలి అని, 'గురుకుల సేవా యజ్ఞము' అని పేరు పెట్టుకున్నాం. అంతేకాదు ఏ పేరు పెట్టుకున్నా ముందర సత్యసాయి నామము లేకపోతే దానికి ఆ తీపితనం ఎక్కడి నుంచి వస్తుంది అనుకుంటూ, "శ్రీ సత్యసాయి గురుకుల సేవా యజ్ఞము" అని పేరు పెట్టుకున్నాము.

నాటి రాష్ట్ర అధ్యక్షులు డా. అంజనయ్య, మరియు రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు అందరూ కూడా ఈ యొక్క ప్రణాళికని చూశారు. మేమంతా అధికారికంగా గ్రామసేవ ట్రస్ట్ నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నాము. సత్యసాయి సంస్థల సౌజన్యంతో దీన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో, అవసరమైన సమాచారాన్ని, పత్రాలను, సామాగ్రినీ సిద్ధం చేసాము.

ప్రణాళికలో భాగంగా, ఒక ఆదర్శ పాఠశాల ఎలా ఉండాలి, ఒక గురుకులం అంటే ఏమిటి అనే దానిపై సుమారుగా 18 అంశాలను ఎన్నుకున్నాము.

ఒక ఆదర్శ గురుకులం అంటే:
మంచి విద్యార్థులు ఉండాలి
మంచి ఉపాధ్యాయులు ఉండాలి
మంచి తల్లిదండ్రులు ఉండాలి
మంచి భవనం ఉండాలి
విశాలమైన ఆవరణం ఉండాలి
ఆట వస్తువులు ఉండాలి
సమర్థమైన బోధన జరగాలి
బోధనా సాధనాలు (Teaching Aids)
Compound wall, గేట్ ఉండాలి
తాగునీటి సదుపాయం ఉండాలి
మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలి
డైనింగ్ హాల్ ఉండాలి
నీటి ట్యాంకులు ఉండాలి
పాఠశాల పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ ఉండాలి
ఆరోగ్యము ఉండాలి
పరిశుభ్రత పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి
పర్యావరణ సంరక్షణ ఉండాలి

ఇలా 18 అంశాలను పరిశోధన చేసి, ఆరు నెలల పాటు ఎన్నిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. చాలా విశేషమైన ప్రేమని సత్యసాయి సంస్థ ఆంధ్రప్రదేశ్ పెద్దలందరూ కూడా మనకి ఇచ్చారు. సాయి సంస్థ మొదటి సారి మాతో అధికారికంగా నిలవడం, మరుపురాని జ్ఞాపంగా నిలిచిపోయింది.

సాయి సంస్థలో, బహుశా నేను ముందుండి పని చేసిన మొదటి పథకం ఇదే అని నాకు గుర్తు. కారణం, చిన్నప్పటి నుంచే పిల్లలంటే నాకు ఉన్న ప్రేమ, పాఠశాలలంటే ఆసక్తి, బాలవికాస్ విద్యార్థిగా జీవితాన్ని మొదలు పెట్టిన తరువాత గురువుగా, శిక్షకుడిగా, సేవాదళ్‌గా నా అనుభవం. ఇలా ఎన్నో కారణాల వలన ఈ పథకములో పరిశోధనలు చేసే భాగ్యం నాకు స్వామి ప్రసాదించారు అనుకుంటాను.

నాతో పాటు ఎంతో మంది సోదరులు – వైసీ, సాయి గోల్లపూడి, గోపి మరెంతో మంది, తమ హృదయాలను, చేతులను, తలలను ఏకం చేసి ఈ సేవలో భాగమయ్యారు. ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపామో! అవన్నీ ఇప్పటికీ మధురమైన స్మృతుల్లా నిలిచిపోయాయి. సుమారు ఒక నెల రోజుల పాటు వెనుక, ముందు అనేక ప్రయత్నాలు చేస్తూ, అవసరమైన పత్రాలు సిద్ధం చేయడం, దరఖాస్తులు తయారు చేయడం, మార్గదర్శకాలు రూపొందించడం, నిర్వహణ సూత్రాలు అందరికీ ఇవ్వడం జరిగింది.

ఉదాహరణకు, ఆరోగ్య శిబిరం నిర్వహించాలనుకుంటే, అందుకు కావలసిన ఏర్పాట్లు ఏమేమి చేయాలో సవివరంగా తెలిపే ప్రయత్నం చేసాము. గురుకుల సేవా యజ్ఞ సంకల్పం, ఆలోచన, మాట, చర్చ, చేతలు చేసే అవకాశం స్వామి వారు, యువకులైన మాకు ప్రసాదించారు. ఈ సమగ్ర ప్రక్రియలో ఆదర్శమైన నాయకత్వాన్ని స్వామి మా అందరికీ ప్రసాదించారని చెప్పుకోవాలి.

ఇంక ఒక్కొక్క జిల్లాకి వెళ్లడం, సత్యసాయి సేవలో మాతో పాటు సంధింపబడిన అక్కడి యువజన బృందంతో చేరి వారికి ఈ పథకాన్ని వివరించి ప్రోత్సహించడం జరిగింది. అంతా చాలా అద్భుతమైన ప్రేమానురాగాలు చూపించే వాళ్లు. ఏం చేద్దాం! చెప్పండి అన్నా!! మేము రెడీగా ఉన్నాము! అంటూ చెప్పే వాళ్లు. అలా జిల్లాలోని సత్యసాయి మందిరాలలో పిల్లలందరితో భేటీ అవ్వడము, జిల్లా క్రియాశీల సభ్యులందరి సమక్షంలో సమావేశాలు చర్చలు జరగడముతో అందరూ ఏకమై, సుమారు 108 ప్రభుత్వ పాఠశాలల మీద పని చేసే ఒక మహద్భాగ్యము స్వామి ప్రసాదించారు.

శ్రీకాకుళం నుండి శ్రీహరికోట దాకా, అనంతపురం నుండి అదిలాబాద్ దాకా అన్ని జిల్లాలలో పర్యటన చేసే ఒక అదృష్టం స్వామి మా అందరికీ ఇచ్చారు, అందులో ప్రధానంగా నాకెంతో ఇచ్చారు. నేను తిరగని జిల్లా లేదు, నేను వెళ్లనటువంటి ప్రదేశం లేదు. అత్యంత మారుమూల గ్రామాలు వెళ్లాము. సుమారు 25 నుంచి 30 ప్రభుత్వ పాఠశాలలకి పక్కా భవనాలు నిర్మాణం చేసే అద్భుతమైన కార్యక్రమము జరిగింది.

గురుకుల సేవా యజ్ఞంలో భాగంగా పుస్తకాలు ఇవ్వడము, చెట్లు నాటడము, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, బోధనా సామగ్రి ఇవ్వడము, ఆట వస్తువులు అందించడం, శుద్ధ జల యంత్రాలు ఏర్పాటు చేయడం, ఇలా ఎన్ని కార్యక్రమాలు అంటే, చివరకు ఆరోగ్యం పరిశుభ్రతలో భాగంగా పళ్లు ఎలా ఎందుకు తోముకోవాలి? చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి అనే అంశాల మీద సైతం శిక్షణ ఇచ్చాము.

నాకు సుమారు 34 ఏళ్లు. చాలా దుందుడుకుగా, నిండైన ఆత్మ విశ్వాసంతో ఉండే వాడిని. ఇక ఈ సేవా కార్యంలో అనుకున్నవన్నీ సాధించాలనే తాపత్రయంతో కాళ్లకు చక్రాలు కట్టుకొని

తిరిగాను. ఎంతో ఓపిక మరెంతో దీక్షగా చేసే వాడిని. నన్ను సంతృప్తి పరచడం కష్టమైన పని అయ్యింది అందరికీ. ఎవరైనా సరే, అనుకున్నది మాత్రమే చేయాలి. చర్చించిన విధంగా చేయాలని చాలా ముక్కు సూటిగా మాట్లాడే వాడిని. చాలా మంది పెద్దలు పిల్లలు నన్ను చూసి ఒక అడుగు వెనక్కి వేసే వారు. ఇంకొంత మంది నన్ను విమర్శించే వాళ్లు. మరి కొందరైతే ఏకంగా రాష్ట్ర అధ్యక్షులకు ఫిర్యాదు చేసేవాళ్లు కూడా. అప్పుడు వారు చెప్పిన మాటలు నాకిప్పటికీ గుర్తే! అయ్యా బాలచంద్ర మన వాడు. వాడికి ఎప్పుడూ స్వామి సేవ చక్కగా చేయాలనే తపనే తప్ప వ్యక్తిగత లాభం ఏమి చూసుకోడు. అలాంటి పిల్లాడితో మీరు చేయి చేయి కలిపి సేవలు చేస్తే, మనం అనుకున్నవి సాధించవచ్చు అని అనునయించినారు. మరో ప్రక్క నాతో మాట్లాడుతూ... తమ్ముడూ నువ్విలా దుందుడుకుగా పోతే ఎలా? ప్రేమతో సాధించాలి. నీకున్న తపన నైపుణ్యం వాళ్లకు ఉండదు కదా అని నన్ను సరిదిద్దేవారు.

ఇలా నాతోటి సోదరులు, పెద్దలు, పిల్లలు అందరూ చేరి ఈ సేవా కార్యాన్ని చేసుకున్నాం. పాఠశాల అభివృద్ధి కమిటీలో విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు, అంతా కూడా పాఠశాల అభివృద్ధిలో ఏ విధంగా చేదోడు వాదోడుగా ఉండాలి అన్నది చూపించారు. ఈ విధంగా గురుకుల సేవాయజ్ఞం ద్వారా 108 పాఠశాలలు, ఒక్కో పాఠశాలలో 100 మంది అంటే సుమారు 10800 మంది విద్యార్థిని విద్యార్థులు, మరియు ఒక్కో పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు అంటే 400 మంది ఉపాధ్యాయ బృందానికి స్వామి సందేశాన్ని అందించే అవకాశం కలిగింది. ఇక అక్టోబర్ 20, 2004 నాడు శ్రీ సత్యసాయి గురుకుల సేవ యజ్ఞ కార్యక్రమానికి ముగింపు సమావేశము ప్రశాంతి నిలయంలో, స్వామి వారి సన్నిధిలో చేసుకునే అవకాశం కలిగింది. 108 పాఠశాలల నుండి ఎన్నిక చేసిన ఉపాధ్యాయులను స్వామి దగ్గరికి తీసుకువెళ్లడము, స్వామి వారి దయతో ప్రశాంతి నిలయంలో రెండు మూడు వందల మంది ఉపాధ్యాయులతో మేము సమావేశం ఏర్పాటు చేసి శ్రీ సత్య సాయి విశ్వ విద్యాలయంలో పని చేస్తున్న కామరాజు అనిల్ కుమార్, అలాగే ప్రఖ్యాత ఉపన్యాసకులు జి ఎన్ మూర్తి, రాష్ట్ర అధ్యక్షులు డా. అంజనయ్య, ఇలా పెద్ద వాళ్లందరిని కూడా ఆ సభలకి తీసుకొని వచ్చి వారితో మాట్లాడించడము జరిగింది. వచ్చిన ఉపాధ్యాయులతో మనసు విప్పి మాట్లాడుకున్నాము. మేము ఇలా ఆరు నెలలు మాత్రమే పని చేయగలము, తర్వాత పని చేయాల్సింది ఉపాధ్యాయులు కదా! వాళ్లను స్వామి సన్నిధికి తీసుకొని వచ్చి, స్వామి ఇక మీరే వారికి దిశ దశ చూపి ముందుకు తీసుకుని వెళ్లాలి అనే ఆలోచనని మేము చేశాము.

గత నాలుగు దశాబ్దాలలో నేను చేసుకున్న సేవా కార్యక్రమాలలో నాకు అత్యంత ప్రియమైన సేవ మరియు ఆతలమానిక మైన సేవ ఏదైనా ఉంది అంటే అది శ్రీ సత్యసాయి గురుకుల సేవా యజ్ఞము. ఈ సేవా యజ్ఞం ద్వారా ఆంధ్ర రాష్ట్రంలోని 23 జిల్లాల్లో అద్భుతమైన, ఆదర్శమైన, ప్రేమపూర్వకమైన సోదరులను, నాయకులని కలుసుకునే భాగ్యము నాకు కలిగింది. ఈ విశేషాలు చెప్తున్నప్పుడు ఆ గురుకుల సేవాయజ్ఞంలో భాగం వహించిన వందల వేల మంది యువకులందరికీ నేను స్మరిస్తున్నాను.

ఒకచోట 24 గంటల్లో పాఠశాలను నిర్మాణం చేశాము. ఇంకోచోట ఒక నెల రోజుల్లో అదనంగా గది నిర్మాణం చేశాము. మరొక చోట ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాము. గురుకుల సేవా కిట్స్ తయారు చేసి అన్ని చోట్లా సేవ చేస్తున్న సాయి సేవకులకు అందించి తద్వారా పాఠశాలకు వెళ్లినప్పుడు ఏమి చేయచ్చు అన్నది నిరూపించాము. ఇలా చెప్పుకుంటూ పోతే అసలు హైదరాబాద్ లోనే

సుమారు ఎనిమిదో తొమ్మిదో ప్రభుత్వ పాఠశాలల గదులు నిర్మాణం చేశాము. 108 ప్రభుత్వ పాఠశాలలో పని చేయడం అంటే, అన్ని వనరులు కలిపితే ఒక్కొక్క దానికి ఒక లక్ష రూపాయలు వేసుకున్న, సుమారు కోటి రూపాయల ప్రణాళికను స్వామి వారు హైదరాబాద్ పిల్లల ద్వారా చేయించుకున్నారు. అందుకే స్వామికి శరణు వేడడం తప్ప ఇంకేం చేయాలో తెలియదు? ఆలోచించండి మిత్రులారా! అవకాశం ఎప్పుడు వచ్చినా అప్పుడే చేసుకోవాలి స్వామి సేవ. శక్తి ఉడిగిన తర్వాత, కాళ్లు చేతులు చచ్చు బడిన తర్వాత ఇక చేసేది ఏముంది? ఈ సందర్భంగా అందరికీ చేతులెత్తి నమస్కారం చేస్తూ, నేను చేసే ప్రార్థన ఒక్కటే. అవకాశం ఉన్నప్పుడు సేవ చేద్దాం. ఈ సేవలో మనల్ని మనం పునీతం చేసుకోవచ్చు. ఈ సేవలో మన జీవితాన్ని సార్థకత చేసుకోవచ్చు అని దృఢంగా విశ్వసిస్తూ ఈ గురుకుల సేవా యజ్ఞ విశేషాలని మీతో పంచుకుంటున్నాను.

91

శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్ – SaiLent Revolution

శ్రీ సత్యసాయి గ్రామ సేవా ట్రస్ట్, 2003 అక్టోబర్ 21 స్వయంగా స్వామి ప్రారంభించిన విశేషాలు ముందు వ్యాసాలలో వివరించాను. గ్రామ సేవ ట్రస్ట్ నామకరణము, మూలధనము, నేపథ్యము, లక్ష్యములు, కార్యవర్గము, నిర్వహణ, అధ్యక్షుడి ఎంపిక, ఇవన్నీ కూడా స్వామి స్వయంగా చేశారు.

అతి మహత్తరమైన సేవా వేదికని స్వామి వారు ఎంతో దయతో హైదరాబాద్ యువతకి "శ్రీ సత్యసాయి గ్రామ సేవ ట్రస్ట్"ను అందించారు. 2003 నుండి ఒక దశాబ్ద కాలం పాటు ఎన్నో అద్భుతమైన సేవలకి ట్రస్ట్ నిలిచింది.

నా పూర్వ జన్మ సుకృతము వలన గ్రామ సేవ ట్రస్ట్ బృందంతో పని చేసే భాగ్యము కలిగింది. వై శ్రీనివాస్ అధ్యక్షుడిగా, సాయి గొల్లపూడి, గోపి కృష్ణ, నాగరాజు, డాక్టర్ అంజనయ్య, డా. కొమ్మారెడ్డి భాస్కర్ రావు, లక్ష్మణరావు, బుచ్చయ్య చౌదరి, దొండమూడి రామారావు లాంటి అద్భుతమైన వ్యక్తులను స్వామే స్వయంగా ఎంపిక చేసినారు.

ఈ వ్యాసం ద్వారా గ్రామ సేవ ట్రస్ట్ చేసిన సేవా కార్యక్రమాల సమాహారాన్ని స్వామి పాదాల చెంత సమర్పించే ప్రయత్నం చేస్తున్నాను.

స్వామి వారు గ్రామ సేవ ట్రస్ట్ ప్రారంభం చేసిన ఆ కొన్ని రోజులకి వైసీని స్వామి పిలిచి మాట్లాడారు. "స్వామి! ఎక్కడ కార్యక్రమం చేయాలి? ఎలా మొదలు పెట్టాలి?" అని అడిగితే స్వామి ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా "Let us start with A, అనంతపురం నుంచి మొదలు పెట్టండి అని చెప్పడం జరిగింది. అంతకు ముందే అనంతపురం జిల్లాలోని పెనుగొండ దగ్గరలో ఉన్న చోళేమర్రి తదితర గ్రామాలలో సేవా కార్యక్రమాలు చేసి ఉండటం వలన, స్వామి భక్తులు, అమాయక ప్రజలు, ఆ ప్రాంతంలో ప్రబలి ఉన్న కరువు కాటకాలు ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని స్వామి ఆజ్ఞను భుజాల మీద వేసుకొని చోళేమర్రి వెళ్లాం.

"బంగారు! దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న సమస్యలని గుర్తించి పరిష్కారం చేసే మార్గంలో సేవ చేయండి" అని స్వామి చెప్పిన విషయం మాత్రమే మాకు తారక మంత్రం అయింది. పల్లె వాళ్లతో మాట్లాడుతుంటే, వర్షభావం వల్ల పాడి పరిశ్రమ అంతా కూడా మట్టి కొట్టుకుపోయే పరిస్థితిలో ఉంది. మాకు పశువులు తినే గడ్డి కూడా దొరకట్లేదు. మాకు కావలసిన పశుగ్రాసం బయట ఉత్తర రాష్ట్రాల నుంచి రావాలి. డబ్బు ఉన్నోడు తెప్పించుకుంటున్నాడు, డబ్బు లేని వాడి పరిస్థితి తెలియదు అని చెప్పారు. ఇది విన్నప్పుడు మా మనసుకు వికలమైపోయాయి. అయ్యో! మూగ జీవాలు ఇలాంటి కష్టంలో ఉన్నాయా! అనుకుని, దీనికి ఏవిధంగా నైనా సరే సమాధానము కనిపెట్టాలి అని ప్రయత్నం మొదలు పెట్టాము.

మాకు బాగా గుర్తు, ఆ జిల్లాల్లో ఎన్నో గ్రామాలలో గడ్డి దొరక్క, కాగితాలు, ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు ఇలాంటివి తింటూ పశువుల కడుపులో పుండ్లు ఏర్పడి, ఆపరేషన్ చేస్తే ఆ పశువుల కడుపులో నుండి ఈ విధమైనటువంటి చెత్త చదారం అంతా కూడా బయటికి వచ్చిన సంఘటనలు పేపర్‌లో చూసాం. అయ్యో! ఎంత విచిత్రమైన వాస్తవం వాతావరణం ఇది. ఏం చేయొచ్చు? మనం బయట నుంచి గడ్డి తెప్పించొచ్చా? అంటే ఎన్ని సార్లు తెప్పిస్తాము? అది కాదు కదా దారి. మరి ఏం చేయాలి? అని ఒకటి అనుకున్నాం. అయ్యా మనం ఎట్లైనా సరే గ్రామంలోనే గడ్డి పెరిగే విధంగా చేస్తే ఎలా ఉంటుంది? అనుకున్నదే తడవుగా... మేమందరం చోళేమర్రి వెళ్లాము.

అక్కడ ఎండిపోయి ఉన్న చెరువును చూసాం. గ్రామ పంచాయతీ సభ్యులతో భేటీ అయ్యాం. అయ్యా చెరువులో ఎన్నాళ్ల నుంచి నీళ్లు లేవు అంటే, సార్ పదేళ్లగా మేము నీళ్లు చూడ లేదు అన్నారు. ఈ ఎండి పోయిన చెరువులో పశుగ్రాసం పెంచడానికి వాడొచ్చా? అంటూ అడిగితే, ఇది గవర్నమెంట్‌ది కదా, వాళ్ల సమ్మతం కావాలి, గ్రామస్తుల అనుమతి కావాలి అని చెప్పారు. వాళ్ల అందరినీ ఒప్పించాలి అనుకున్నాం. అరే ఇది చేయగలిగితే అన్ని వందల ఎకరాల్లో ఉన్న చెరువులో తేమ ముందే ఉంటుంది కాబట్టి, దాంట్లో పశు గ్రాసం పండించడం బాగా సులువు అవుతుంది అని అనుకోవడమే తడువు, స్వామికి చెప్పుకోవడం, "బంగారు! ముందుకు వెళ్లండి." అని వారు చెప్పడం అయింది.

ఆ సమయంలో అనంతపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి అనురాధ IASను కలవడం, వారు చాలా ఆశ్చర్యపోయి ఇట్లాంటి కార్యక్రమం చేస్తున్నారా, చాలా సంతోషం! అని చెప్పడం. ఇది జరిగిన కొన్ని రోజులకే ఆవిడ స్వామి దగ్గరికి రావడం, స్వామి వారితో మాట్లాడే సమయంలో ఈ పశుగ్రాసం విషయం చర్చకు రావడం, స్వామి ఇంటర్వ్యూ గదిలో నుంచి బయటవచ్చి అక్కడే కూర్చున్న శ్రీనివాస్‌ను చూసి, "హేయ్ శ్రీనివాస్! మొదలు పెట్టండి. ఇక ముందుకు వెళ్లండి. ఎక్కడ ఆగొద్దు" అని చెప్పడం జరిగింది.

ఆ విధంగా స్వామి చెంత గ్రీన్ సిగ్నల్ తీసుకుని బృందం అంతా కూడా బయలుదేరి, గ్రామ చైతన్యం కలిగించి, కలెక్టర్‌తో మళ్లీ భేటీ అయ్యాము. ఆవిడ "మీరు ఇట్లా పని చేస్తామంటే, దీనికి కావలసిన అనుమతులు మరియు వనరులు ప్రభుత్వం నుంచి మేము చేస్తాము. ప్రభుత్వం వద్ద ఉపయోగించని వనరులు ఎంతో ఉన్నాయి. తర్వాత నాణ్యమైన గడ్డి విత్తులు కూడా నేను తెప్పిస్తాను" అని చెప్పడం జరిగింది. వారు చేదోడు వాదోడుగా ఉండడం వలన ప్రభుత్వ యంత్రాంగం ముందుకు కదిలింది.

ఇక రెండో అడుగులో ఆ పరిసర గ్రామములలో ఉన్న సర్పంచు, పెద్దల్ని, అన్ని వర్గాల

వారిని, సంఘాలని కలపడం, 'అయ్యా! మనము చెయ్యి చెయ్యి కలిపితే, సేవచేయ కదిలితే, గత ఐదు ఏళ్లుగా మనం ఎదుర్కొంటున్న పశు గ్రాస సమస్యని పరిష్కరించుకోవచ్చు అని వివరించాము. అందరూ కూడా ఏకమవ్వడము, చూస్తుండంగానే ఆ వందల ఎకరాల చెరువును, కొన్ని వందల బండ్లకు ఎద్దులు కట్టి దున్నడం మొదలుపెట్టారు. ట్రాక్టర్లు తెచ్చారు, పారా పలుగు తెచ్చిన వాళ్లున్నారు. ఇంటింటికి ఒకరో ఇద్దరో బయలుదేరి సుమారు రెండు వందల మంది 3 రోజుల కార్యక్రమంగా చేసి చెరువుని మొత్తం దున్ని పడేశారు గ్రామసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గడ్డి విత్తనాలు నాటేశారు.

చూస్తుండగనే కళ్లముందర సుమారు ఏడు ఎనిమిది అడుగుల పశుగ్రాసం పెరగడము, బళ్లలో అది వాళ్ల ఇంటికి తీసుకెళ్లడం చూస్తే, ఆ రోజు మాకు బాగా గుర్తు ఒక పండగలాగా జరిగిందండి, అందరికీ భోజనాలుతో సహా అందరూ కలిసి పని చేశారు. హరిజన, గిరిజన భేదం లేకుండా, కులం, వర్గం, మతం, జాతి, సమయం తేడా లేకుండా అన్ని గ్రామాల వారు ఏకమై స్వామి నామాన్ని జపిస్తూ ఆ కార్యక్రమాన్ని చేశారు. గ్రామసేవ ట్రస్ట్ గురించి నేను వ్రాయాలి అంటే నా మనసులోకి వచ్చిన మొదటి జ్ఞాపకం ఇదే.

రెండవ జ్ఞాపకం ఏమిటంటే! మేము ప్రకాశం జిల్లాలోని గుంతపల్లికి గ్రామసేవ నిమిత్తమై వెళ్లాము. అది ఒక మారుమూల గ్రామము, ఒక మూడు కిలో మీటర్లు లోయలోకి దిగితే... కొండ మధ్యలో లోయలో ఉన్న గ్రామం, 50-60 తాటాకు గుడిసెలు ఉంటాయి అంతే. ప్రతిసారి ఎండాకాలంలో ఏదో ఒక అగ్నిప్రమాదం జరగడము, ఆ గుడిసలన్నీ కాలిపోవడము జరిగేది. వాళ్ల బతుకులు చూస్తే మాకు మనసు అంతా భారం ఐపోయింది. అయ్యో! ఇక్కడ మేమైనా చేయొచ్చా? అని ఆలోచించాము.

నిజానికి ఏం చేసినా ఆయా జిల్లాలలో ఉన్న సాయి సోదరులు, మేము ఒక్క అడుగు వేస్తే వాళ్లు పది అడుగులు వేసే వాళ్లు ఉండేవారు. చీరాల నుండి సురేంద్ర మాతో పాటు నిలబడ్డాడు. గుంతపల్లిలో కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విధానం గుర్తు వస్తోంది. గ్రామసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమై మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో నోకియా CSR నిధులతో 60 పక్కా గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ గృహప్రవేశాలకు హాజరై సత్యసాయి వ్రతకల్పం చేయడం, వారికి నీతి, నిజాయితీ గురించి చెప్పడం, అద్భుతమైన వ్యక్తిత్వం గురించి మాట్లాడడం, వారి స్థితిగతుల గురించి ఆలోచించడం, వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా ప్రయత్నించడం జరిగింది. అక్కడ బాగా చదువుతున్న ఇద్దరు ముగ్గురు పిల్లల్ని గుర్తించి వారిని ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు తీసుకురావడం జరిగింది.

ఇక చెప్పాల్సింది మూడోది, ఇది నిజంగా ట్రస్టు చేపట్టిన సేవలకు తలమానికమైనది అని చెప్పాలి. దాని పేరు శ్రీ సత్యసాయి ఔషధాలయము. అన్ని జిల్లాలలో కూడా గ్రామ సేవలు చేస్తున్న సందర్భం అది. అన్ని జిల్లాల్లో కూడా డాక్టర్లు ఉన్నారు గాని మందులు సరిపడా ఉండేవి కావు. ఎవరు ఇస్తారు మందులు? హైదరాబాద్‌ను 'ఔషధ రాజధాని' అంటారు కదా! మరి ఇంత దూరం నుండి జిల్లాల్లో మారు మూల గ్రామాలలో మందులు ఎలా వెళతాయి. ఆలోచన చేసి ఆయా జిల్లా అధ్యక్షుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని గ్రామసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. Y శ్రీనివాస్‌కు చాలాకాలం ఔషధ పరిశ్రమతో అనుబంధం ఉండటం వల్ల ఒక ఆలోచన వచ్చింది. ఈ ఔషధ సంస్థల దగ్గర ఉండే నిల్వలను మనం సేకరించి అన్నిజిల్లాలకు పంపించొచ్చు కదా అని.

అప్పుడు ఆంధ్రప్రదేశ్ మాజీ ఔషధ నియంత్రణాధికారి డా. వెంకట్ రెడ్డి, నాట్కో ఔషధ సంస్థ

డైరెక్టర్, ఇంకా అనేక మంది ఔషధ పరిశ్రమ నుండి ముందుకు వచ్చారు. అద్భుతమైన మార్గదర్శకత్వం అందించారు. సిటీలో ఉండే ఎన్నో ఔషధ సంస్థలతో కలిసి ఒక శిబిరం కూడా నిర్వహించాము. అలా పుట్టింది 'శ్రీ సత్యసాయి ఔషధ బ్యాంకు'.

ఈ శ్రీ సత్యసాయి ఔషధ బ్యాంకు ద్వారా హైదరాబాద్ కేంద్రంగా ఔషధాలను సేకరించి, అవసరమైనప్పుడు ఔషధ నిల్వలను జిల్లాల్లో నడిపే శాశ్వత వైద్య కేంద్రాలకు పంపించే ప్రయత్నం ప్రారంభించాము.

శ్రీ సత్యసాయి Reprogramming lives, (జీవితాల పునర్నిర్మాణం) అనే మరో కార్యక్రమం ద్వారా, మనము కనీసం ఇరవై వేల మంది జీవితాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 జిల్లాలలో గ్రామసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవన పునరుద్ధరణ చేయడానికి అవకాశం లభించింది.

అలాగే, తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న Ch పోతేపల్లిని, సాయి సోదరుడు కిషోర్ ఆదర్శ గ్రామంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు, గ్రామసేవా ట్రస్ట్ అక్కడ నిలబడింది. అద్భుతమైన వనరులను అందించడం ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక, భౌతిక వికాసానికి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. తదనంతరం జరిగిన ప్రణామాలతో, సాయి సంస్థలు మాత్రమే గాక దేశ విదేశాలలోని ఎంతో మంది ఆ ఆదర్శ గ్రామ నిర్మాణానికి తోడు నిలబడ్డారు. ఈ రోజు Ch పోతేపల్లి గ్రామము యావత్ భారతదేశంలోనే ఒక ఆదర్శ గ్రామం లా రూపుదిద్దుకున్నది అనటంలో ఎట్టి సందేహము లేదు. కిషోర్ మరియు వారి కుటుంబం వాళ్లందరూ కూడా అక్కడ భక్తితో పని చేస్తున్నారు.

మాకు మచ్చిలీపట్నం, కృష్ణా జిల్లా బందర్‌లో నీటి సంస్కరణ అంటే... సముద్రపు నీటిని వెలికి తీసి త్రాగునీటిగా మార్చడంపై ఒక కార్యక్రమంలో పని చేసే అవకాశం లభించింది.

అలాగే, 'శ్రీ సత్యసాయి కంప్యూటర్ బ్యాంక్' ద్వారా కంప్యూటర్లను కూడా సేకరించి, అన్ని జిల్లాలలో జరుగుతున్న 'జీవనోపాధి' కార్యక్రమాలకు ల్యాప్టాప్‌లు, డెస్క్‌టాప్‌లు అందించే ప్రయత్నం మేము చేశాము. అలాగే, గ్రామ సేవా ట్రస్ట్ ద్వారా శ్రీ సత్యసాయి గురుకుల సేవా యజ్ఞంలో భాగంగా సుమారు 108 ప్రభుత్వ పాఠశాలలపై పని చేసే అదృష్టం స్వామి ప్రసాదించారు. కొన్నివందల వేల మంది యువత, యువజనులు కూడా పాల్గొన్నారు. అలాగే, సత్యసాయి సుజల స్రవంతి పథకం ద్వారా వందల గ్రామాలకు త్రాగు నీరు అందించే ప్రయత్నం చేశారు.

గ్రామసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వందల గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణ, విద్యా అవగాహన, గ్రామాభివృద్ధి, నాయకత్వం మరియు మార్పు వంటి కార్యక్రమాలు జరిగినాయి.

ఈ కార్యక్రమాల ద్వారా, దీర్ఘకాలంగా పరిష్కారం పొందని సమస్యలకు పరిష్కారం చూపే మార్గాన్ని చూపించే ప్రయత్నం చేశారు.

2003లో ప్రారంభమైన గ్రామ సేవ ట్రస్ట్ గత 22 ఏళ్లుగా ఆదర్శమైన సేవా కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. ఈ గ్రామ సేవ ట్రస్ట్ ఆద్యుడు కర్మ, కర్త, కారణము, క్రియ అన్ని ఆ భగవాన్ సత్యసాయి బాబానే అని ఎప్పుడూ నమ్ముతున్నాను. ఇలాంటి ట్రస్ట్ ద్వారా నా చేతనైన సేవలు నేను చేసినందుకు ఎప్పుడూ గర్విస్తూ ఉంటాను. ఇలాంటి సంస్థతో అనుబంధం ఉన్నందుకు నేను పునీతుడనయ్యాను.

92

సాయి సైనికులే కాదు ఆత్మ బంధువులు కూడా

మిత్రులారా! నాలుగు దశాబ్దాల సాయి కార్యంలో వందల మంది ఆత్మీయులతో, సాయి సైనికులతో, ప్రేమికులతో, సేవకులతో, నాయకులతో, స్నేహితులతో, అన్నదమ్ములతో పని చేసే భాగ్యము స్వామి వారు ఇచ్చారు. "ప్రతి ఒక్కరు నేర్పేదరు ఒకటి" అని చెప్పినట్టుగా, నాకు తారసపడిన ప్రతి సోదరుడు, ఆ చంద్రతారార్కము నిలుచుండే జీవిత పాఠాలను నాకు నేర్పించారు.

చాలా మంది చెప్తుంటారు, "బాబు నువ్వు చాలా మందికి సహాయం చేశావు జిల్లాల్లో, చాలా మందితో నీకు పరిచయాలు ఉన్నాయి, అన్ని జిల్లాల్లో నీవు తిరిగావు, నువ్వు మాట్లాడని జిల్లా లేదు, మాట్లాడని సత్యసాయి సంస్థ, కేంద్రం లేదు" అని చెప్పినప్పుడు నేను నవ్వుకునే వాడిని.

ఈ రోజు కూడా అదే భావనతో ఉన్నాను. వాళ్లకి నేను సహాయం చేయడమా? వాళ్లకు నేను చేదోడు వాదోడుగా ఉండడమా? వాళ్లకు నేను ఉత్సాహ ప్రోత్సాహాలు అందించడమా? కాదు కాదు, కలలో కూడా అది జరగలేదు. జరిగింది ఏమిటంటే! ఇలాంటి వాళ్ల సాంగత్యముతో నా జీవితాన్ని నేను మలచుకున్నాను. నేను ఈ సోదరుల చేతులు పట్టుకుని మరొక్క అడుగు స్వామి సన్నిధికి దగ్గరగా వెళ్లాను అనుకుంటున్నాను. కాబట్టి ఎవరు ఎవరికీ సహాయం చేసినట్టు ఆలోచించండి.

అతి సామాన్యమైన జీవితం గడుపుతూ, అసామాన్యమైన వ్యక్తిత్వాన్ని పుణికిపుచ్చుకుని నేను ఏ విధంగా అయినా సరే ప్రభుత్వ ఉద్యగం సంపాదించాలి అని అనుకున్నారు ఒక తమ్ముడు. ఏంటయ్యా, ఎందుకయ్యా? మనకి ఈ గవర్నమెంట్ ఉద్యోగాలు అంటే, 'అయ్యా! నేను సత్య సాయి సంస్థలో సేవకుడిగా కేవలం సంస్థలోనే సేవలు చేసుకోవచ్చు, కానీ స్వామి ద్వారా అలవడిన ఈ సేవా దృక్పథము, త్యాగ నిరతిని సమాజానికి మరింత మందికి ఉపయోగించాలి అంటే ఏదైనా ప్రభుత్వ ఉద్యోగము చేయాలి అనేవాడు. ఇది ఎప్పుడో చెప్పిన మాట, ఈ రోజు అతనిని MPDOగా చూసే అవకాశం దక్కింది. ఆయన మరెవరో కాదు, మన సోదరుడు అమర్‌నాథ్. ఒకప్పుడు చిత్తూరు జిల్లా యువజన సమన్వయకర్తగా ఉన్నారు. ఇప్పుడు తిరుపతి జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షులుగా

బాధ్యతలు నిర్వహిస్తున్నారు. "అన్నా స్వామి కోసం ఏదైనా చేయాలన్నా! మనం ఇలా ఊరికే కూర్చోకూడదు అన్నా. స్వామి ఒక్క అడుగు వేయమంటే మనం 100 అడుగులు వేయాలి. ఆరు నూరైనా అటు సూర్యుడు ఇటు పొడిచినా... మనం ముందుకు వెళ్లాలి" అనే ఒక తపనతో తపించి పోయేవాడు. వాడిని చూస్తే అరే సేవకుడు అంటే ఇలాగ ఉండాలి. ఎన్ని పదవులు వచ్చినా, ఎంత అధికారం వచ్చినా, ఏ పదవి... ఏ అధికారము... తన సేవకు అడ్డు పడలేదు అని చెప్పుకోవాలి.

ప్రకాశం జిల్లాలో మేము చేసిన కార్యాచరణను ముందుండి నడిపిన వ్యక్తి మన సురేంద్ర. ఆ అబ్బాయి గురించి నాకు గుర్తు ఉంది. దాదాపు 20 సంవత్సరాల క్రితం, ప్రకాశం జిల్లా సమన్వయకర్త భాధ్యత కోసమై ఇంటర్వ్యూ చేసే అవకాశం మాకు లభించింది. సోదర సోదరీమణులారా! ఈ విలువల మనిషితో, ఈ కార్యదక్షుడితో, ఈ సేవామూర్తితో అనుబంధం ఏర్పడటం నాకు భాగ్యంగా అనిపించింది.

అన్నా! స్వామికి టెలిగ్రామ్ ఎట్లా ఇవ్వాలి? లెటర్ ఎట్లా రాయాలి? అని అడిగినప్పుడు నేను మందలించే వాడిని, "అరేయ్! నువ్వు వ్రాయ్, నన్ను వ్రాయమంటావేంటి? నువ్వు వ్రాసి చెప్పు, నేను సరిచేస్తాను" అని చెప్పే వాడిని.

ఇక్కడ కరెక్షన్ అనేది ఏమీలేదు.

"There is no correction… it's only connection with Swami."

మనం చేయాల్సింది కరెక్షన్ కాదు, స్వామికి కనెక్షన్ చేయడం అని ఈ అబ్బాయిని చూస్తే తెలుస్తుంది. ఈ తమ్ముడు ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్ర సాయి సంస్థల ఉపాధ్యక్షులుగా బాధ్యత నిర్వహిస్తూ సేవను జీవితంలో ఒక భాగంగా మార్చేశాడు.

ఇక మరొక సోదరుడు తన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయాలని గత 2 దశాబ్దాల నుండి అవిశ్రాంతంగా పని చేస్తున్నాడు. గ్రామాన్ని మరో ప్రశాంతి నిలయం వలె తీర్చిదిద్దాలని తపిస్తున్నాడు.

స్వామి చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని తన వంతుగా చిన్న స్థాయిలో అక్కడ ప్రారంభించాడు.

"స్వామి అంత చేస్తుంటే, మనం ఇంత చేయలేమా?" అనే ఆలోచనతో మొదలైంది. చెలికాని వారి పోతేపల్లి, కిషోర్ చెలికాని ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నాడు. కానీ హృదయం అంతా కూడా వారి గ్రామం మీద ఉంటుంది. ఆ గ్రామంలో ఈ రోజు ఏం చేయొచ్చు? స్వామికి ఏవిధంగా ఋణం తీర్చుకోవాలి? స్వామికి ఏ విధంగా మనల్ని మనం అర్పించుకోవాలి? ఏ విధంగా ముందుకు వెళ్లాలి అన్న ఆలోచన ధోరణి మరియు ఆదర్శము ఆ అబ్బాయిని ఎన్నడూ కూడా నిలువనివ్వలేదు. ఆ అబ్బాయి భారత దేశానికి వస్తే డబ్బులు ఖర్చు అవుతాయి అని చెప్పేసి, గత ఎన్నో ఏళ్లుగా ఇండియాకి రాకుండా, పైసా పైసా వాడు కూడ బెట్టడం, ఆ గ్రామంలో జరిగే సేవా కార్యక్రమాలకి తోడ్పాటు నివ్వడము, వాళ్ల తల్లి తండ్రి అందరూ కూడా ఆ గ్రామ నిర్మాణ చైతన్యానికి సేవచేస్తున్నారు. అక్కడ సత్యసాయి ఉచిత వైద్య శాల, శ్రీ సత్య సాయి మందిరము, సత్యసాయి గాయత్రి దేవాలయము, సత్యసాయి లక్ష్మి దేవాలయము, వేదపాఠశాల, సాధికారత కేంద్రం, ఉద్యానవనము, సర్వధర్మ స్తూపము, సత్యసాయి దీన జీవనోద్ధరణ పథకము, సత్యసాయి నిత్యాన్న సేవ ఇలాగ చెప్పుకుంటూ పోతే, స్వామి చేస్తున్న ప్రతి విశాలమైన కార్యం, ఈ గ్రామంలో సూక్ష్మ స్థాయిలో జరుగుతోంది చెలికాని వారి కిషోర్ ఆధ్వర్యములో. తన బిడ్డలు ఏ విధంగా పెరిగి పెద్ద వారయ్యారో, అదే విధంగా వాడి భక్తి కూడా విశ్వ విరాట్ రూపం దాల్చింది. దాని ముందు వాడి కష్టాలు, నష్టాలు ఏమి కూడా నిలువలేదు. సాయి సేవా అసిధరా వ్రతమే చేస్తున్నాడు.

అలాగే హైదరాబాద్‌లో రమణా రెడ్డితో సేవ చేసే అవకాశం వచ్చింది. రమణా రెడ్డి అసలు స్వామి భక్తుడే కాదు, నల్గొండ జిల్లా నుంచి కేవలం చదువు, ఉద్యోగం కోసమై, పొట్ట చేత పట్టుకొని వచ్చి, విశ్వనాథం మాస్టారు ఇంటి పైన గదిలో అద్దెకు ఉండేవాడు. అక్కడి నుంచి ఆయన ప్రస్థానం యావదాంధ్ర దేశ యువజన బృందానికి నాయకుడిగా ఎదిగే దాకా వెళ్లింది. ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు, సంతోషంగా అందరితో మాట్లాడుతాడు. అందరితో కలిసిపోవడం, అందరితో అనుబంధం కలిగివుండటం – ఇదే నేను రమణా రెడ్డి దగ్గర నేర్చుకున్న ముఖ్యమైన పాఠం. అయనతో నేను ఎక్కువ కాలం సన్నిహితంగా ఉండకపోయినా, ఆ స్వభావం నన్ను లోతుగా ప్రభావితం చేసింది. నేను ఆ అబ్బాయికి సహాయం చేశానో లేదో నాకు తెలియదు కానీ, ఎంత మందితో ఆయన ఎలా స్నేహపూర్వకంగా సంబంధాలు కొనసాగించగలడు, ఎలా అందంగా నవ్వుతూ మాట్లాడగలడు, ఎలా చక్కగా అందరినీ కలిపి, కనెక్ట్ చేయగలడు ఇలా ఇవన్నీ నేను ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నాను.

అలాగే సోదరుడు వేణు, నా కళ్ల ముందర ఎంతోమంది అద్భుతమైన ఆత్మీయులను చూశాను. కానీ స్వామికే ఆత్మీయుడిగా మారిన అతి కొద్ది మందిలో భమిడిపాటి వేణుగోపాల్ ఒకరు. నా కళ్ల ముందర ఈ తమ్ముడు స్వామితో పొందిన అనుభవాలు చూసాను. స్వామికి ఎంత దగ్గరగా ఉన్నాడు ఆ అబ్బాయి అంటే... అసలు పూర్వజన్మ సుకృతము, అలాంటి అబ్బాయితో మేము అనుబంధంలో ఉన్నామంటే మా అదృష్టం. ఈ అబ్బాయిని చూస్తే... ఎలా స్వామిని ప్రేమించాలి, ఎలా ఆధ్యాత్మిక వాదనలో ఉండాలి, ఎలా సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలి, ఎలా త్యాగాన్ని అభివృద్ధి పరుచుకోవాలి అని తెలిసేది. ఈ అబ్బాయిని స్వామి ఎన్నో పర్యాయాలు పిలిచి మార్గ దర్శనం చేసే వారు. Sri Sathya Sai Gems, స్వామి శ్రీ ముఖము నుండి వెలువడిన ఎన్నో అద్భుతమైన సందేశాలు, మార్గ దర్శనాలు, సమాధానాలు, ఉపదేశాలు ఇలా స్వామి పలికిన ప్రతి మాటను యథాతథంగా తీసుకుని అందరికీ అర్థమయ్యే విధంగా సుమారు 250 స్వామి వారి సంభాషణలను సంకలనం చేశాడు. అది హైదరాబాద్ యువతకి మాత్రమే కాక విశ్వ వ్యాప్తంగా ఉండే సాధకులందరికీ పంచమ వేదంలా అయ్యింది. ఇతనితో మాట్లాడిన ప్రతి సారి ఒక సేవకుడి అంతరాత్మ ప్రబోధం వినిపిస్తూ ఉంటుంది. సాయి సంస్థల యువజన బృందానికి కొన్నాళ్లు నాయకత్వం వహించిన వాడు.

రింగు రాజు (గంగాధర శర్మ) సేవా నిరతి, నాయకత్వ ధోరణి, అందరితో కలిసి పోయే తత్వము, అందరిని ప్రేమించే తత్వము, ఎవడికి కష్టం వచ్చినా తోడుండడానికి ముందుండే తత్వము నేను చూశాను. గత 50 ఏళ్లుగా అలుపెరుగని విధంగా సేవలు చేస్తూనే ఉన్నాడు. సాయి సంస్థలకు స్వామి స్వయంగా తొడిగిన రింగు అని చెప్పుకోవాలి. బహుళ జాతీయ సంస్థలో పని చేస్తూ... ఇప్పుడు కూడా సేవలో తనను తాను అంకితం చేసుకున్నాడు.

అలాగే రవికిరణ్ గూర్చి చెప్పుకోవాలి. నాకు గుర్తుంది, సుమారు 15 సంవత్సరాల క్రితం ఇంటర్వ్యూ గదిలో సంఖ్య పరిమితి ఉండటంతో, బయటకు రావడానికి ముందడుగు వేసిన వ్యక్తి రవికిరణ్. సాధారణ వ్యక్తి నుండి అసాధారణ సంకల్ప శక్తిగా ఎదిగిన దానికి అరుదైన ఉదాహరణ రవికిరణ్.

రంగారెడ్డి జిల్లాలో సోదరులు రవి మరియు సారధి వీళ్లిద్దరని కూడా నేను సదా గుర్తుంచుకుంటాను. హైదరాబాద్ తర్వాత ఉమ్మడి ఆంధ్రదేశంలో ఇంకెక్కడైనా మంచి కార్యక్రమాలు జరిగాయంటే తప్పకుండా గుర్తుంచుకోవాల్సింది రంగారెడ్డి జిల్లా యువతనే. సేవా కార్యక్రమాలు

చేస్తున్నపుడు వారి చాతుర్యము, నైపుణ్యము హైదరాబాద్ యువతకి ఏమాత్రం తగ్గదు. ఎప్పుడూ వారితో చేసే ప్రతి మాట, ఆట, పాట అన్నీ కూడా ఎంతో ఉత్సాహ పరిచేటివి మా అందరిని కూడా. అరే మేము లేకున్న ఇదిగో వీళ్లు ఉంటే చాలురా మనం ఉన్నట్టే అనే ఆలోచన మాకు కలిగేది.

నాకు సోమశేఖర్ గుర్తున్నాడు. నిజంగా గొప్ప విలువలతో కూడిన వ్యక్తి. లక్షల రూపాయలు సంపాదించే స్థితిలో ఉన్నా, ఎప్పుడూ ఎక్కడైనా సేవ చేయాలనే తహతహ లాడుతూ ముందుకు సాగేవారు. Reprogramming Livesలో ఆయన నిర్వహించిన కార్యక్రమం ఎంతో అద్భుతమైనది, ఆదర్శప్రాయమైనది.

అలాగే సాయి ప్రశాంత్ నందగిరి గూర్చి చెప్పుకోవాలి. రీ-ప్రోగ్రామింగ్ లివ్స్ ద్వారా ఆయన కొన్ని వేల మందికి స్ఫూర్తి కలిగించారు. ఈ రోజుకీ ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో, SR నగర్‌లోని వారి ఇంటి నుంచే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అద్భుతమైన సాయి ఆత్మ బంధువు నేను సదా స్మరించుకోవాలి.

ఇంతమందిని పరిచయం చేసి నన్ను ఒక సేవా సాధనంగా మలచిన స్వామికి నేను సదా కృతజ్ఞుడనై ఉండాలి అని నేను తలుచుకుంటూ ఉంటాను.

ప్రప్రథమ మహిళా గ్రామ సేవ, ప్రప్రథమ సుజల శ్రవంతి సేవ, ప్రప్రథమ పర్తి యాత్ర, ప్రప్రథమ గ్రామ సేవా మహోద్యమం, ఇన్నింటికీ వేదికగా మహబూబ్ నగర్ జిల్లా పేరు చెప్పుకోవాలి. మహబూబ్‌నగర్ కాదు ఇది మహా బాబా నగర్ అని చెప్పుకునే స్థాయిలో సేవలు చేసుకున్నారు అక్కడ. స్వామి సంకల్పం మేరకి, నా జన్మను, జీవితాన్ని సార్థకం చేసుకునే సహచర్యం నాకు గుబ్బా ఈశ్వరయ్య, జంగారెడ్డి, బాదం కృష్ణయ్య, నరసింహులు గారు, గుబ్బా సాగర్. ఇలా ఎంతో మంది సత్యసాయి ఉద్యమంలో ఊపిరి ఊదారు అని చెప్పుకోవాలి.

ఈశ్వరయ్యకి మాటలు, వ్రాతలు వచ్చేవి కాదు. వారివి చేతలు మాత్రమే ఉండేవి! నాకు గుర్తుంది, వారి తరఫున స్వామి వారికి నేను లేఖలు వ్రాసేవాడిని, టెలిగ్రామ్‌లు పంపేవాడిని. ఫ్యాక్స్ సందేశాలు పంపేవాడిని. ప్రతి కార్యక్రమంలోనూ నేను వెళ్లి, వారితో కలిసి పని చేసి, వారిని నా వారిగా భావించి సహచరుడినయ్యాను.

ఈ ప్రక్రియలో వాళ్లకు విలువ జోడింపు ఎంతవరకు జరిగిందో నాకు తెలియదు. కానీ, నాకు మాత్రం వారితో చేరడం వలన అద్భుతమైన విలువ జోడింపు అయ్యింది.

ఆ జిల్లా వాళ్లు పుట్టపర్తిలో భుజాలపై చిన్న వాటర్ ట్యాంకులు మోసుకొని, భక్తులకు నీరు అందించే సేవ అందరికీ తెలిసిందే. ఆ అద్భుతమైన సేవా కార్యక్రమం ఈశ్వరయ్య నాయకత్వంలో జరిగింది. ప్రస్తుతం సాయి సన్నిధి ఆధ్యాత్మిక, సామాజిక, సాంఘిక సేవా మందిర సముదాయాన్ని కల్వకుర్తిలో నిర్మాణం గావించి శ్రీ సత్య సాయి కేంద్ర ధార్మిక సంస్థకు ధారాదత్తం చేసిన వ్యక్తులు వీళ్లంతా.

నరసింహులు జడ్చర్ల వారు. ఎంత అద్భుతమైన ప్రేమ స్వామి అంటే! వాళ్ల వూరు నుండి నడుచుకుంటూ వెళ్లారండి స్వామి దగ్గరికి. స్వామి మాట్లాడలేదని గోపురం గేట్లో మూడురోజులు నాలుగు రోజులు అన్నం తినకుండా కూర్చున్నారండి. ఇట్లాంటి వాళ్లని చూస్తే అబ్బా! అనిపిస్తుంది. ఆయనకు స్వామిపై ఉన్న భక్తి నిజంగా అపూర్వమైనది.

జంగారెడ్డి అనారోగ్య పరిస్థితి వలన నడవలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ, అద్భుతమైన కంఠస్వరంతో, హార్మోనియం వాయించి, భజనలు ఆలపించే శక్తి ఆయనకు ఉంది. సంగీత జ్ఞానం అపారంగా

కలిగిన ఈ మహానుభావుడు, వీల్‌చైర్‌లో కూర్చొని కూడా స్వామి మందిరాన్ని చూసుకుంటూ చివరి శ్వాస విడిచే దాకా ఆనందమయ జీవనం గడిపినారు.

అచ్చంపేట బాదాం కృష్ణయ్య, కొండల్లో, కోనల్లో కష్టాలు పడుతూ, చదువు సంధ్యలేని పరిస్థితుల్లో పెరిగిన బీదోడు. "మేము బీదోళ్లమే అయ్యా" అని చెప్పుకునే స్థితి నుంచి, అద్భుతమైన మందిరాన్ని నిర్మించి, దానిని తనే పూర్తిగా చూసుకుంటున్నారు.

ఇలాంటి మహనీయులు ప్రతి సంస్థ కేంద్రంలో ఉంటారు. అలాంటి వారి తోడ్పాటుతో, వారితో సహచర్యం అవ్వడం అంటే నిజంగా ఒక అద్భుతమైన అనుభవం.

ఇక అప్పుడెప్పుడో సత్యసాయి యువజన సమ్మేళనం జరుగుతుంటే వేదిక మీద బ్యానర్ కడుతున్న ఒకరిని చూశాను. మేకు సరిగ్గా కొట్టడం కూడా చేత కావడం లేదని మందలించాను. చాలా సామాన్య వాలంటీర్ లాగా వచ్చాడు. చాలా చురుకైన కార్యకర్తగా మారి ఎన్నో సేవలలో చురుకుగా పాల్గొనే వాడు. అలా అక్కడ పరిచయం అయ్యి, తదనంతరం అన్ని సేవా కార్యక్రమాల్లో ముందుండి, సత్యసాయి సంస్థకి కన్వీనర్‌గా మారి, అదిలాబాద్ జిల్లాకి అధ్యక్షునిగా సేవలందించే స్థాయికి ఎదిగాడు, తదనంతరము తెలంగాణ రాష్ట్ర సత్య సాయి సంస్థలకు మొట్ట మొదటి అధ్యక్షుడిగా ఎదిగినాడు. వెంకట్రావు అతని పేరు. చాలా చిన్న వయసులోనే అచంచలమైన భక్తి విశ్వాసాలతో, సేవ చేయాలనే తపనతో నాయకత్వం వహిస్తున్నాడు.

సోదరుడు సాయి వినోద్ మందా, అద్భుతమైన చాతుర్యము. ఎవరికి ఇబ్బంది వచ్చినా మీరు అతనిని సంప్రదించవచ్చు, అలాంటి వ్యక్తిత్వము. సేవ అవకాశం ఉంటే చాలు దూసుకొని వెళ్లిపోవడం, అక్కడ సేవ చేయడం, తనకు తెలియకుంటే పరిశోధించడము, తెలుసుకోవడము, తెలుసుకొని మళ్లీ వచ్చి సేవలో పాల్గొనడము. ఇవన్నీ కూడా ఇలాంటి వ్యక్తుల్లో చూస్తున్నాను. ప్రస్తుతం హైదరాబాద్ సాయి యూత్‌కి పెట్టని కోటగా మారిపోయి అద్భుతమైన వనరుగా మారి పోయాడు. వయసుతో పాటూ వచ్చిన విశేష పరిజ్ఞానంతో సేవా కార్యక్రమాలలో పాల్గొనడం తన ప్రత్యేకత మరియు ప్రతిభ అని చెప్పక తప్పదు.

ఇలాంటి మహనీయులందరిని కూడా నేను ఈ వ్యాసం ద్వారా తలుచు కుంటున్నాను. ఇంకా కొన్ని వందల వేల మంది ఉన్నారండి. ఒక్కొక్కరి గురించి ఒక్కో వ్యాసం తయారు చేయవచ్చు.

అంత మందిలో నేను గమనించిన విశేషాలు కొన్ని మాటల్లో నేను చెప్తాను.

వ్యక్తిలో ప్రతిభ ఉండాలి.

కుటుంబంలో అన్యోన్యత ఉండాలి.

వ్యాపారంలో నైతికత ఉండాలి.

సేవలో సమర్పణ ఉండాలి.

ఆధ్యాత్మికతలో హృదయం ఉండాలి.

ఈ లక్షణములే మనలను సత్య సాయి సేవా కార్యంలో సంపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి. ఇట్లాంటి ఆదర్శమైన వ్యక్తులని నిర్మాణం చేసిన సత్యసాయి కేంద్రాలకి, ఇలాంటి కేంద్రాలను ప్రారంభించిన శ్రీ సత్యసాయి బాబా వారికి, ఇలాంటి సత్యసాయి బాబా గారికి భక్తులుగా ఉన్నటువంటి వందల వేల సాయి సైనికులకి శిరము వంచి అభివాదం చేస్తూ ఈ వ్యాసం ముగిస్తున్నాను.

93

సాయి సింహం – మేడ నరసింహులు

సాయి వనములో వికసించిన శాకుంతలం
నరుడిని సింహముగా మార్చిన వైనం
సాయి సేవా కార్యములో తన మెడ వంచినారు
సామాన్యుడైనా అసామాన్య భక్తితో సేవించినారు
మేడలెన్నింటినో నిలబడి తను కట్టించినారు
మేడా దంపతులకు అంజలి ఘటింతు వినయముతో

మిత్రులారా! నాలుగు దశాబ్దాల సాయి కార్యంలో నా జీవితంలో వీధి దీపాలలాగా నిలుచున్నటువంటి పుణ్య దంపతులు, శ్రీమతి శకుంతలమ్మ మరియు శ్రీ మేడనరసింహులు. అతి సామాన్యమైన కుటుంబ నేపథ్యము నుండి వచ్చిన ఈ దంపతులు గురించిన విశేషాలను మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. సాయి చరిత్ర అందరికీ విశదమే. కానీ సాయి భక్తుల చరిత్ర చాలా మందికి తెలియక పోవచ్చు. ఒక్కొక్క సాయి భక్తుడు కూడా ఒక సాయి సైనికుడిగా, సాయి సేవకుడిగా కదనోత్సాహముతో, కార్య క్షేత్రంలో జీవితాన్ని సార్థకత చేసుకునే సేవలలో మునిగి ఉన్నారు. అలాంటి భక్తుల గురించి తలుచుకున్నప్పుడు, ఆహా! ఇలాంటి వాళ్లతో నా జీవితం ముడిపడి ఉంది కదా! అని నేను అనుకుంటాను.

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి గ్రామానికి దగ్గరలో ఉన్న తిమ్మంపల్లి అనే కుగ్రామంలో అతి బీద కుటుంబంలో పుట్టిన మేడ నరసింహులు. కేవలం పాలిటెక్నిక్ సివిల్ డిప్లమా చేతపట్టుకొని ఉద్యోగము నిమిత్తమై ఒక సైకిల్ బస్సులో వేసుకొని హైదరాబాద్‌కు వచ్చారు. సుమారు ఏడు దశాబ్దాల కాలం క్రితం జరిగింది. ప్రస్తుతం మేడ నరసింహులు & కో ప్రస్తుతం నిర్మాణ రంగంలో 60 ఏళ్లు ప్రయాణించింది. వారికి నిర్మాణ రత్న, వైశ్య రత్న, అనంత ఆణిముత్యం లాంటి ఎన్నో బిరుదులు ఇవ్వ బడ్డాయి.

వారు చెయ్యి పట్టిన వారు ధర్మపత్ని శ్రీమతి మేడా శకుంతలమ్మ. ఆధ్యాత్మిక వాతావరణంలో ఉన్న కుటుంబ నేపథ్యము. అనంతపురం జిల్లాలో ఉండడం వల్ల స్వామి అంటే చూచాయగా తెలిసిన వాళ్లు. వారు వీరికి సతీమణిగా రావడం, వాళ్లిద్దరూ కూడా కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లడం, చేయి చేయి కలిపి సంసార జీవితాన్ని ప్రారంభించారు.

ఏ రోజైనా అన్నం తింటున్నాం అంటే ప్రక్కవాడికి ఒక ముద్ద పెట్టాలనే ఆలోచన ధోరణి, తన ప్రక్క వాళ్లకి ఏదో విధంగా సాయపడాలనే సేవా నిరతి, వ్రతాలు పూజలు పునస్కారాలు అంటే అనురక్తి, ఇవన్నీ కూడా శ్రీమతి శకుంతలమ్మని స్వామికి దగ్గరగా చేశాయి. హైదరాబాద్ ఆనంద నగర్‌లో జరుగుతున్న స్వామి కార్యంలో ఆవిడ భాగస్వామ్యం వహించింది. భజన కార్యక్రమాలకు వెళ్లింది. అప్పుడెప్పుడో స్వామిని 1984వ సంవత్సరంలో అనుకుంటాను, మొట్ట మొదటిసారి ప్రశాంతి నిలయానికి వెళ్లడం, అక్కడ స్వామి వారిని దర్శించడం చూసిన మరు క్షణము ఆ స్వామి యొక్క అసామాన్యమైన ప్రభకి, తేజస్సుకి తనను తాను సమర్పించుకోవడం జరిగిపోయింది. తదాదిగా ఎక్కడ సేవా కార్యక్రమాలు జరిగినా, భజనలు జరిగినా, ఆ ముందుకు దూసుకుని వెళ్లడం జరిగేది. 1985వ సంవత్సరం స్వామి వారి 60వ పుట్టు పండుగ మహోత్సవం, షష్టి స్మూర్తి కార్యక్రమంలాగ జరిగింది. ఎంతో మంది లాగానే శకుంతలమ్మ చాలా మందిని తీసుకుని ప్రశాంతి నిలయానికి వెళ్లింది. అక్కడ ఎక్కడా సరైన వసతి సౌకర్యాలు లేక బయట సత్రంలో బస కోసం వెళ్లడం జరిగింది. ఆ సత్రంలో ఫలాన కులం వాళ్లే రావాలి, మిగతా వాళ్లు రాకూడదు అని చెప్తే ఒకింత అసహనానికి గురయ్యి మనస్థాపము చెందింది. అయ్యో! పుట్టపర్తిలో ఇలాంటి సమాజిక సమస్యలు ఉండకూడదు కదా!

ఉన్నది ఒక్కటే కులము అది మానవ కులము, ఉంది ఒక్కటే మతము అది ప్రేమ మతము, ఉంది ఒక్కటే భాష అది హృదయ భాష, ఉంది ఒక్కటే దేవుడు అతడు సర్వాంతర్యామి కదా! మరి ఇక్కడ ఇలా ఉండేది ఏంటి? అందరూ కలిసి మెలిసి ఉండాలని కదా స్వామి ఆశ ఆశయము అని తలుచుకుని తలడిల్లి పోయింది.

ఆ తర్వాత సమయం తీసుకుని, వారి శ్రీ వారితో, "ఏవండీ! స్వామి దగ్గర మనమే ఒక సత్రం ఎందుకు కట్టకూడదు?" అని అనడం, ఆ విధంగా 1985లో చిన్న బీజము లాగా ప్రారంభమైన సంకల్పము, స్వామి వారి 70వ సంవత్సరానికి (1995) అత్యద్భుతమైన ఒక 'గెస్ట్ హౌస్' పుట్టపర్తిలో ఏర్పాటు చేయడానికి నాందిగా నిలిచింది. ఈ రోజు 'మేడా సాయి సదన్' పుట్టపర్తికి వెళ్లిన ఎవరికైనా తెలిసిన ప్రదేశంగా నిలిచి పోయింది.

అలా కేవలం పది మందికి ఉపయోగపడాలనే ఆకాంక్షతో మేడ నరసింహులు స్వామిపై భక్తి ప్రపత్తి లేకున్నా కూడా తన శ్రీమతి కోసమై అదంతా చేశారు. వారు సాక్షాత్తు అహోబిళ నరసింహ స్వామి భక్తులు. వారి ఇంటి దేవుడు లక్ష్మీ నరసింహ స్వామి. అక్కడ ఉచిత అన్న దాన సత్రాన్ని నిర్మించి నిర్వహిస్తున్నారు.

కానీ, ఆయన నమ్మకం మాత్రం స్వామి సిద్ధాంతాలే!

Help Ever, Hurt Never

Work is Worship, Duty is God

Be Good, See Good & Do Good. స్వామి అంటే పరిచయం లేకుండా వారు తమ జీవితంలో నేర్చుకున్న అద్భుతమైన సూత్రాలు, జీవన సత్యాలు అవి.

ఏమైతే నేమి వారు శ్రీమతి శకుంతలమ్మ ఆశయాన్ని నెరవేర్చారు. ఇక అక్కడితో ఆగలేదు

వారి ప్రస్థానము. అప్పుడెప్పుడో స్వామి దగ్గర చెప్పెదట, అనంతపురంలో. స్వామి ఒప్పుకుంటే నేను స్వామికి స్థలం ఇవ్వాలనుకుంటున్నాను అని. అలా స్వామి వారు ఆ భూమిని స్వీకరించడం. ఆ స్థలంలో కొన్ని కోట్ల రూపాయల వ్యయముతో అద్భుతమైన "శ్రీ సత్యసాయి వృద్ధాశ్రమము" నిర్మాణం చేయడం జరిగిపోయింది. స్వామి స్వయంగా ప్రశాంతి నిలయంలో దాని శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు, స్థల దాతలను, నిర్మాణ నిపుణులను ఆశీర్వదించారు. అంతే గాక వారికి ఏకాంత సౌద సంభాషణము అనుగ్రహించారు. మేడ నరసింహులు, సాయి కార్యంలో అద్భుతమైన సాధనంగా మారి పోయారు.

అకుంఠిత దీక్ష, అచంచల భక్తి విశ్వాసం, అసాధారణ వ్యాపార నిర్వహణ, పుష్కలమైన వనరులు, ఎవరిలోనైనా దేవుని చూసే సర్వోత్తమ స్వభావము, సేవ అంటే ముందుకురికే ధోరణి, ఆగడం అనేది తెలియని ధోరణి, ఇవన్నీ కూడా ఆయనలో స్పష్టంగా కనిపిస్తాయి.

ఈ మహానుభావుడి జీవితంలో మేము కూడా ఉన్నాము అని చెప్పడం గర్వంగా ఉంటుంది. దక్షిణ భారత దేశంలో ఎన్నో సత్యసాయి కేంద్రాలలో వారి సహాయమందించారు. శివం ప్రాంగణం వెనక ఉన్న పాత భవనాన్ని అంతా కూడా వారు జీర్ణోద్ధరణం చేసి, అద్భుతమైన అయిదు అంతస్తుల భవనాన్ని నిర్మించి సాయి సంస్థకి అందించారు.

స్వామి వారి సేవల్లో భాగంగా దేశవ్యాప్తంగా వచ్చే సేవాదళ సభ్యులకు సరైన వసతి సౌకర్యం ఇస్తే ఇంకా బాగుంటుందని, అది కూడా ఉచితంగా ఇవ్వాలి అన్నట్టు పుట్టపర్తిలో సాయి కృపాశ్రయము, ఐదు అంతస్తుల భవనాన్ని స్వామి వారి పుట్టపండుగ సందర్భంగా నిర్మాణం చేసి సాయి భక్తులకు అంకితం చేశారు. ఈ రోజు కూడా అందరూ దానికి వెళ్లి ఆనందంగా వసతిని మనం అనుభవించవచ్చు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతి పుణ్య క్షేత్రంలో వారి దాతృత్వం శోభిస్తూనే ఉంటుంది. వారు పాల్గొనని మంచి పని ఉండదు అని చెప్పుకోవాలి.

మేడా నరసింహులు సుమారు 75 ఏళ్లు వయసప్పుడు శ్రీమతి శకుంతలమ్మ పుణ్యస్త్రీ లాగా, చాలా సునాయాసంగా స్వామిలో ఐక్యమయ్యారు. కానీ ఇక్కడ ఆవిడ జ్ఞాపకాలతో ఉండి పోయిన మేడా నరసింహులు మాత్రం, తన భార్య శకుంతలమ్మ ఇచ్చిన స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకొని సత్యసాయి మహాత్ముని దివ్య సేవా కార్యంలో తనను తాను అంకితం చేసుకున్నారు, ఒక మహర్షి లాగా మారిపోయారు. 2017 గురుపూర్ణిమ సందర్భంలో, స్వామి వారి దివ్య సన్నిధిలో ప్రార్థన చేస్తూ ఉంటే... స్వామివారు అడిగారట "ఏమి? అనంతపురంలో ఏం చేస్తున్నావ్?" అంటే వీరికి స్వామి అనంతపురంలో ఏమి చేయాలి అని అనుకున్నారు. స్వామి దివ్య సన్నిధిలో ప్రేరణ కలిగింది. "శకుంతలమ్మ పేరు మీద ఏమన్నా చెయ్యి" అని స్వామి చెప్పినట్లు తోచింది. ఆలోచించాడు, ఏమిటిది ఇంత ప్రేరణ! దీనికి కారణం ఏమిటి అని వెంటనే వెనక్కి రావడం, "శ్రీ సత్యసాయి శకుంతలమ్మ సదన్" అనే స్వచ్ఛంద సంస్థకు అంకురార్పణ చేశారు. అప్పుడెప్పుడో అనంతపురం దగ్గరలో కొని ప్రక్కన పెట్టిన సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని ఈ ట్రస్టుకు బదిలీ చేసేసారు.

అనంతపురానికి 10 కిలోమీటర్ల దూరంలో, రోటరీపురం, SRIT కాలేజీ ఎదురుగా ఉండే స్థలంలో ఏం చేస్తే బాగుంటుందని ఆలోచించారు. స్వామి ప్రసాదించిన ప్రేరణ ప్రకారము అక్కడ సాంఘిక, సామాజిక, ఆధ్యాత్మిక, సేవా క్షేత్రాలని ఏర్పాటు చేయాలని సంకల్పం చేసుకున్నారు. పెద్ద ప్రణాళిక వేసుకొని, మాస్టర్ ప్లాన్‌తో దసరా సందర్భంలో స్వామి దగ్గరికి వెళ్లారు. స్వామి సన్నిధిలో కూర్చుని ప్రేరణ పొందడం, తదాదాగా 2017లో సుమారు ఎనిమిది కోట్ల రూపాయలతో, లక్షన్నర

చదరపు అడుగుల నిర్మాణము చేపట్టారు. మూడు సంవత్సరాలు నిర్మాణాలు జరిగాయి. కరోనా సమయంలో కూడా ఆగలేదు వారు. వారి వార్ధక్యం కూడా ఆయన్ను ఆపలేదు. అచంచల భక్తి విశ్వాసాలతో ఇల్లు వాకిలి వదిలి అనంతపురం వృద్ధాశ్రమంలో ఉంటూ... ఏకాగ్ర చిత్తంతో, అచంచల దీక్షతో పనులు చేశారు. చూస్తుండగానే మరో ప్రశాంతి నిలయం అక్కడ రూపుదిద్దుకుంది అనడంలో ఎట్టి సందేహము లేదు. ఇక్కడ నేను చెప్తున్న విషయాలు కొన్నే, చెప్పని విషయాలు, వారు చేసిన సేవా కార్యాల గురించి చెప్పాలంటే ఇంకో పుస్తకం అవుతుంది.

ఈ వ్యాసం ద్వారా నేను చెప్పాల్సింది ఏంటంటే... ఇలాంటి మహనీయులు, సాయి కార్యంలో ఉండడం వల్ల నాలాంటి సేవకులు అద్భుతమైన సేవలు చేసుకోగలుగుతున్నారు అని తలుస్తాను.

వారి దగ్గరి నుండి నేను నేర్చుకున్న విషయాలు...

అచంచలమైన భక్తి విశ్వాసములు ఆరునూరైనా అటు సూర్యుడిటు పొడిచిన సేవ చేయాలనే దీక్ష, ఎవడి దగ్గర చెయ్యి జాచే తత్వం ఉండద్దు.

ఎందులో అయినా మొదటి అడుగు మనది అవ్వాలి అనే ధోరణి, హృదయ సంబంధాన్ని స్వామితో కొనసాగించడం, అనుకున్నది సాధించే పట్టుదల

ప్రస్తుతం 86 ఏళ్ల వయసులో కూడా స్వామి కార్యంలో... అప్రతిహితమైన సేవా దృక్పథంతో అవిశ్రాంతంగా వారు చేస్తున్న సేవ నాలాంటి వాళ్లకి దిశా నిర్దేశం చేస్తాయని నేను తలుచుకుంటాను. ఇన్ని అద్భుతమైన పనులు చేసినా సరే, "తానేమీ చేయలేదు, అంతా స్వామి దయ" అనే వారి మాటలు విన్నప్పుడు, అయ్యో! మనం ఏం చేస్తున్నాం? ఇంత చేస్తే చాలు, చాలా చెప్పుకుంటామే. ఈయన ఎంతో చేసి, ఇంత కూడా చెప్పుకోడే అనిపిస్తుంది. మేడ శకుంతలమ్మ, మేడ నరసింహులు దంపతుల తనయలు అందరూ స్వామి భక్తులుగా మారిపోయి స్వామి సేవకులుగా సాయి సేవా క్షేత్రంలో వారి జీవితాలను సార్ధకం చేసుకుంటున్నారు. మూడో తరము స్వామి సేవల్లో పాల్గొంటుంది.

ఈ వయసులో ఆనందనగర్‌లో వారి ఇంటి పైన భవనం నిర్మాణం చేసి సాయి మందిరంగా మార్చి, ఆనంద నగర్ సత్యసాయి కేంద్రానికి అంకితం చేశారు మేడ నరసింహులు. అక్కడ కనీసం అంటే ఇప్పటికి మూడు నాలుగు వందల మందికి టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల ద్వారా జీవనోపాధి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఉచిత బోధనా తరగతులు చెప్ప బడ్డాయి.

గత ఒకటిన్నర దశాబ్దాలుగా వారి సలహాలు సూచనలతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసుకునే భాగ్యం నాకు కలిగింది. అనంతపురంలో వారు నిర్మించిన శ్రీ సత్య సాయి క్షేత్రంలో వారితో పాటుగా పాల్గొని తోడ్పడటం నా అదృష్టంగా భావిస్తున్నాను. అక్కడ అభయ సంస్థ ఆధ్వర్యంలో వారిచ్చిన 0.75 ఎకరా స్థలములో అభయ CCL సాధికారత ప్రాంగణం నిర్మాణము చేసి వందలాది గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణతో పాటుగా జీవిత నైపుణ్యాలను అందిస్తున్నాము.

వారికి వయసు పైబడుతున్నా కూడా లెక్క చేయకుండా ఆ సాయి క్షేత్రంలోనే ఉంటూ... నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. ఇది మాటలలో చెప్పలేని స్ఫూర్తి. ఇలాంటి వారు చాలా అరుదుగా జన్మిస్తారు. ఎక్కడికి వెళ్లినా, ఏమి చేసినా, నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిస్తాను అన్న ఆలోచన వారిలో నేను చూస్తూ ఉంటాను. ఆ మహనీయుడిని ఈ వ్యాసం ద్వారా స్మరించుకుంటున్నాను. వారు కలకాలం వర్ధిల్లాలి. వారి యొక్క సేవాకార్యం మరింత మందికి చేరాలి. అందరిని మరిపించాలి, మెరిపించాలి, మురిపించాలి అని నేను కోరుకుంటూ వారికి ఆయురారోగ్యఐశ్వర్యాలని ప్రసాదించాలని స్వామి సన్నిధిలో శిరము వంచి ప్రార్థిస్తూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

94

భగవానుడే నా భావ వ్యక్తీకరణకు నేపథ్యం

భావమందున మంచి మాటలందున మంచి
చేతలందున మంచి పొడమకున్న
సాయి మిమ్ము మెచ్చి సంతోష మెటులిచ్చు
చెప్పరయ్య మీరే ఒప్పుకుందు

అని స్వామి ఎప్పుడూ చెప్పేవారు. ఈ మాటలు మంత్రాలుగా పని చేశాయి మా అందరి మీద. హైదరాబాద్ యువతకు, స్వామి స్వయంగా ఆదర్శములను అనుగ్రహించారు. అసమాన్యమైన సేవాదృక్పథాన్ని ప్రసాదించారు.

ఎప్పుడైతే నేను శ్రీ సత్యసాయి బాలవికాస్ తరగతులకు వెళ్లడం మొదలు పెట్టానో, అక్కడ వెలిగించబడిన చిరు దీపం కాస్తా తరవాత కాలంలో అఖండ జ్యోతిగా మారిపోయింది. చిన్నప్పటి నుండి ఏదైనా వ్రాయాలి అంటే మొట్టమొదట నేనే వ్రాసేవాడిని. స్వామి పుస్తకాలు చదివినా, జీవిత చరిత్ర విన్నా, నీతి కథలు విన్న, చిన్ని కథలు విన్నా అరే మనం కూడా ఇలా చెప్పాలి, ఇలా చేయాలి అనే ఆపేక్షతో ఆతృతతో ఉండేవాడిని. ఈ జీవితంలో భావ వ్యక్తీకరణము (కమ్యూనికేషన్ స్కిల్స్) అంటే చదవడము, వ్రాయడము, మాట్లాడడము, వినడము ఈ నాలుగు అత్యంత శక్తివంతమైన పాత్రని పోషించాయి.

ఈ వ్యాసంలో భావ వ్యక్తీకరణ ద్వారా స్వామి నన్ను ఎలా వారి సాధనంగా మలిచారో, ప్రజలతో మాట్లాడేలా, వారిని ప్రేరేపించేలా, ప్రోత్సహించేలా నన్ను ఎలా ఉపయోగించారో అన్న సంగతిని వ్యక్తపరచే ప్రయత్నము చేస్తున్నా.

మిత్రులారా! నాకు బాగా గుర్తు స్వామి వారి 68వ పుట్టు పండుగ సందర్భంగా బెంగళూరులో ఉన్నప్పుడు మొట్టమొదటి సారి నేను ఆశు కవితలు వ్రాయటం మొదలు పెట్టాను.

విశ్వంబులో వ్యాప్తి అయిన విష్ణువు నీవు

సత్య లోకమున వశించు బ్రహ్మవు నీవు
కైలాసమున విహరించు శివుడు నీవు
అందుకో వందనములు శ్రీ సత్యసాయి

అంటూ మొదలు పెట్టిన కవితా కుసుమాలు నవంబర్ 23 స్వామి వారి 68వ పుట్టు పండుగ సందర్భం లోపుగా నా హృదయంలో 68 కుసుమాలు పూయించారు. భావవ్యక్తీకరణకు పరాకాష్ట ఇది.

నాగజ్యోతి మరియు నాగభూషణ రావు
అనిల్ కుమారు నలబాల అంజనయ్య
నలుగురి నడుము ననుచేర్చి నవ్య భావములు నేర్పితివి
అందుకో వందనములు శ్రీ సత్యసాయి

ఆ రోజుల్లో నాకు ఆఫీసు లేదు, CS చదువు పరీక్షల వల్ల స్వామి కార్యాక్రమాలలో పాల్గొనలేక పోయాను. అప్పుడు నేను బాధతో ఏడ్చేవాడిని...

ఆ బాధతో స్వామి పాదాల దగ్గర నా హృదయములోని భక్తిని వ్యక్తం చేస్తూ పాటలు, కవితలు సమర్పించే వాడిని. అలా నా హృదయం నుండి ఎన్నో పాటలు, మాటలు, కవితలు పుట్టుకొచ్చాయి. ఈ విశేషాలను ముందు వ్యాసాలలో వివరించాను.

నాకు బాగా గుర్తుంది, మొట్టమొదటిసారి నేను 1983 ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మా కళాశాలలో మాట్లాడాను.

ఎలా మాట్లాడాలి, ఏమి చెప్పాలి అనుకుంటూ చాలా వ్రాసుకుని సిద్ధమయ్యాను.

చాలా చిన్న వయసు నుంచే వ్రాయడం, మాట్లాడడం, పాడడం స్వామివారు అలవోకగా నాకు ప్రసాదించారు. ఆ భావనలు లోపల ఒక ఆనకట్టలు లేని గంగా ప్రవాహం లాగా పొంగి పొర్లేటివి.

దానికి తోడు స్వామి దివ్యోపన్యాసం విన్న ప్రతి సారి బయటికి వచ్చి అదేవిధంగా మాట్లాడే ప్రయత్నం చేసే వాడిని. భావ వ్యక్తీకరణ నైపుణ్యం పెంచుకోవాలంటే స్వామి మాట్లాడేది వింటే చాలు, ఏ పుస్తకము చదివే అవసరం లేదు! ఏ శిక్షణ తీసుకోనక్కర్లేదు! ఎవరి సలహాలు తీసుకోనక్కర్లేదు! ఏ వీడియోలు చూడనక్కర్లేదు! స్వామి మాట, స్వామి చేతలు, స్వామి భావన, స్వామి నడక, స్వామి రాగము, స్వామి కంఠము, స్వామిని అలా చూస్తూ ఉంటే... భావ వ్యక్తీకరణం అంటే ఏమిటో తప్పక తెలుస్తుంది!! అలాగా స్వామిని చూస్తూ చాలా నేర్చుకున్నాను. స్వామి లాగే మట్లాడాలి, పాడాలి అని నేను తపించే వాడిని.

స్వామి లాగానే పాడాలి అని. స్వామి లాగానే వ్రాయాలి. వారు ఎన్ని పుస్తకాలు వ్రాశారు. మనం కూడా అలా పుస్తకాలు వ్రాయాలి అని తపించేవాడిని.

2001లో అనుకుంటా హైదరాబాద్‌కి వచ్చిన తరువాత, గ్రామ సేవ మహోద్యమాన్ని యావత్ జిల్లాలలో ప్రవేశపెడుతున్నప్పుడు. మొట్టమొదటిసారి నేను ఒక పుస్తకాన్ని సంకలనం చేయగలిగాను.

ఆ పుస్తకానికి నేను పెట్టిన శీర్షిక: "గ్రామ సేవయే – సాయి సేవ." ఈ పుస్తకం ఎలా వ్రాసాను అని సింహావలోకనం చేసుకుంటే... చాలా ఆవేదన, ఆదర్శము, ఆతృత హృదయంలో "అయ్యో! మన యువతకు గ్రామ సేవ విషయాలు విశేషాలు తెలియజెప్పాలి, పెద్దపెద్ద పుస్తకాలు చదవలేరు, చిన్న చిన్న మాటల్లో చెప్పాలి, చిన్న భజనలు వాళ్లతో పంచుకోవాలి" అని వ్రాసిన దానికి రూపం ఈ పుస్తకం. అది నేను చేసిన మొదటి ప్రయత్నం.

ఆ సమయంలోనే నేను "సాయిమాత బిడ్డలమందరం", "ఓ ఆంధ్ర యువకుడా లేవోయి,

సత్యసాయిని చూడ పదవోయి" వంటి పాటలు కూడా వ్రాశాను. కనీసం అంటే పది భజనలు వ్రాసాను.

ఇవన్నీ స్వామి నాతో చేయించిన అద్భుతమైన కృతులు. వీటి గురించి మరొక చోట ప్రత్యేకంగా వివరించాను.

అది 2002 సంవత్సరం. మేమంతా కలిసి హైదరాబాద్, సరూర్‌నగర్‌లోని విక్టోరియా రెసిడెన్షియల్ హాస్టల్ కోసం పని చేయడం మొదలుపెట్టాం. ఆ సమయంలోనే నాకు మరో పుస్తకాన్ని సంకలనం చేసే అద్భుతమైన అవకాశం లభించింది. దానికి "సంస్కార జ్యోతి" అని పేరు పెట్టాను. ఈ పుస్తకాన్ని స్వామి స్వయంగా ప్రశాంతి నిలయంలో జరిగిన ఒక సంభాషణ సమయంలో ఆశీర్వదించి ఆవిష్కరించారు.

స్వామి నాతో ఎన్నో పనులు చేయించారు. ఎప్పుడు ఎక్కడ అవకాశం దొరికితే, ప్రతి సారి నేను చాలా వ్యాసాలు, కథనాలు వ్రాయడం మొదలుపెట్టాను.

"శ్రీవాణి" లాంటి మాస పత్రిక, సత్యసాయి బాలవికాస్ పత్రిక, ప్రశాంతి సొసైటీ వారి ప్రచురణలలో నా వ్యాసాలు రచనలు ముద్రితమయ్యాయి. వ్యాస రచన ఒక వ్యాసంగం అయ్యింది.

ఎప్పుడు వ్రాసినా, ఎక్కడ వ్రాసినా, ఎప్పుడూ వేర్వేరు అభిప్రాయాలు, వేర్వేరు దృష్టికోణాలు, వేర్వేరు వ్యక్తీకరణలే ప్రకటితం అయ్యేవి. వ్రాసిందేదైనా సరే మంచిని పదిమందికి, వంద మందికి, వేల మందికి చేరవేయాలనే ఆత్రుతతో వ్రాసే వాడిని. వ్రాయడం అనేది ఒక అర్చనము లాగా నేను తీసుకునే వాడిని అంటే ఎలాంటి సందేహము లేదు.

ఒక దశాబ్ద కాలం క్రితం అనుకుంటాను, అరే స్వామి ఇన్ని చెప్తున్నారు, మనలో ఏమైనా కొత్త ఆలోచనలు ఏమన్నా వచ్చాయా? మనం ఏమైనా మానవ ప్రపంచానికి హితం చేసే మాటలు చెప్పగలమా? అని అనుకుంటున్న కాలంలో సామాజిక మాధ్యమాలు తెరపైకి వచ్చాయి. Facebook, WhatsApp వంటి ప్లాట్‌ఫార్మ్‌లు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. అలాంటి సందర్భంలో నేను ప్రతి ఆదివారం ఒక ఆలోచనను ఆంగ్లములో అందరికీ పంపించేవాడిని. అంటే కేవలం కాపీ-పేస్ట్ చేసి డౌన్లోడ్ చేయడం మాత్రమే కాదు. ఒక ఫోటో తీసుకుని దానికి అద్భుతమైన ఆలోచనను జనంతో పంచుకునే వాడిని. దీనికి "Sunday Thoughts" అని శీర్షిక పెట్టాను. ఇప్పటివరకు గత దశాబ్ద కాలంలో సుమారు 600 ఆలోచనలు ప్రకటించి స్వామికి సమర్పించడం జరిగింది. ఇవన్నీ కూడా ఆదివారపు ఆలోచనలు పేరుతో పుస్తకం లాగా ప్రచురించబడ్డాయి.

నేను పంచుకున్న ఆలోచనలలో కొన్ని

Live like a King
Love like a Mother
Strive like a River
Serve like a Tree
then LIFE becomes a celebration
Stones becomes IDOLS when we Refine!!

సామాజిక మాధ్యమాలకి ధన్యవాదాలు. నిజంగా ఇవి నాకు ఒక అద్భుతమైన వేదికను కల్పించాయి.

స్వామిని తలుచుకోవడం, స్వామి ఇచ్చిన భావాలకి రూపం ఇవ్వడం. నేపథ్యం ఏదైనా, సమయం ఏదైనా, సందర్భం ఏదైనా, ఎలాంటి అవకాశం వచ్చినా సరే నా భావాలని ప్రకటించడం అనేది స్వామి నేర్పించారు. ఎంత మంది మహానుభావుల జయంతులు, వర్ధంతులు, సాయి సైనికుల

నిష్క్రమణ, సాయి భక్తుల విజయ భేరి, ఎప్పుడు, ఏమి, ఎవరి గురించి మనం అనుకున్నా, స్వామి అయితే ఎలా మాట్లాడేవారు? వీరి గురించి ఎలా తలుచుకునే వాళ్లు? అలా వీళ్ల గురించి నేను అనుకోవడం, వ్రాయడం జరిగింది.

2019లో స్వామి నన్ను భారత దర్శన్ చేసేందుకు ప్రేరేపించారు. 180 రోజుల పాటు, 23 రాష్ట్రాలు, 4 దేశాలు సందర్శించాను. ఒక సామాన్య వ్యక్తిలా, భిక్షగాడిలా, సన్యాసిలాగా తిరిగాను. స్వామి ఇచ్చిన ఆ అద్భుతమైన అనుభవాలు నన్ను లోతుగా స్పర్శించాయి. ఆ అనుభవాలను అందరికీ రచనల రూపంలో గ్రంథస్తం చేసే ప్రయత్నం చేశాను. 2020 ఫిబ్రవరి హైదరాబాదులో ఈ పుస్తకం స్వామి నా చేత వ్రాయించారు. "Bharat Darshan - In search of Self" అనే పుస్తకము నాటి తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళ్ సాయి సౌందర్య రాజన్, శ్రీ చిన్న జీయరు స్వామి వారి సమక్షంలో ఆవిష్కరించారు. ఇదే పుస్తకం చాలా మంది తెలుగు వాళ్లందరూ కూడా అరే ఇది తెలుగులో అనువాదం చేస్తే అందరికీ చదవడానికి బాగా ఉంటుంది అని చెప్పి చెప్పడంతో, కొంత కాలం శ్రీవాణి సాంస్కృతిక మాసపత్రిక ద్వారా ప్రతి నెల ధారావాహిక లాగా "భారత దర్శనం – ఆత్మాన్వేషణలో" ప్రచురితం అయింది. అభయ సమాచార పత్రికలో కూడా ధారావాహికలగా వచ్చింది

2020 కరోనా వల్ల యావత్ ప్రపంచం స్వీయ నిర్బంధనంలోకి నెట్టివేయబడినది. కానీ ఆ కరోనాలో కూడా నేను ప్రపంచానికి ఏం చేయొచ్చు అని స్వామి సన్నిధిలో కూర్చుని, బాధపడుతున్నాను. "అయ్యో స్వామి! నేను ఇక్కడ చిక్కుకొని పోయానే! బయటికి వెళ్లే పరిస్థితి లేదే, ఏం చేయొచ్చు?" అనుకుంటున్న సమయంలో స్వామి చిత్రం నుండి ప్రేరణ కలిగింది. "ఏయ్! విద్యార్థుల కోసం పుస్తకం వ్రాయి" అని. అలా ఆ ప్రేరణను తీసుకొని, 63 రోజుల స్వీయ నిర్బంధనములో... శార్వారీ ఉగాది పర్వదినం నుండి మొదలు పెట్టి, ప్రతి రోజు ఒక వ్యాసము వ్రాసి, విద్యార్థుల జీవితానికి ఉపయోగపడే "Compass (దిక్సూచి)" అనే పుస్తకాన్ని నేను రచించ గలిగాను.

స్వామి దయ వల్లనే ఈ ఆలోచనలు కలిగాయని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. ఈ పుస్తకము భారత జాతికి అంకితం చేసే ప్రయత్నం చేశాను. నేను బతికున్నా, చచ్చిపోయిన ఈ భావనలు కలకాలం నిలిచి పోతాయి. తరవాత కాలంలో మొదట తెలుగులో ప్రచురించిన ఈ పుస్తకం ఆంగ్లములో మరియు హిందీ భాషలలో కూడా ప్రచురించడం జరిగింది. శ్రీ చిన్న జీయర్ స్వామీజీ, పద్మశ్రీ బ్రహ్మానందం, పద్మశ్రీ రమేష్ గెల్లి, శ్రీ జిష్ణు దేవ వర్మ, శ్రీ యోగి ఆదిత్యనాథ్, శ్రీ బొచ్చ సత్యనారాయణ, శ్రీమతి సబితా ఇంద్రా రెడ్డి, శ్రీ నితిన్ గడ్కరీ వంటి ప్రముఖులు ఈ పుస్తకాన్ని ప్రశంసించారు. భారత దేశంలోని 30,000 ప్రభుత్వ పాఠశాలలకు ఈ పుస్తకం ఉచితంగా అందించ బడింది.

ఇలాగే 2025 దాకా, డ్రైవింగ్ మాన్యువల్, అభయ సంస్కార కేంద్రాలు, విముఖం, ఇండోనేషియా యాత్ర, అమరనాథ్ యాత్ర, చార్ ధాం యాత్ర, అభయ ఫౌండేషన్, అమర జీవి పొట్టి శ్రీరాములు, సత్య స్ఫూర్తి మొదలగు 20 పుస్తకాలు వ్రాయగలిగాను

ఇవన్నీ వ్రాస్తున్న సమయంలో నా హృదయంలో ఒకటే భావన...

ఓ స్వామి!

మనసులోని భావన నీది

గొంతులోని చేతన నీది

చేతలోని కర్మ నీది
ఇవన్నీ నీవైనప్పుడు
నాదంటూ ఏమీ లేదు!

నేడు నేను చేస్తున్న ఏ పని అయినా అది మొత్తం స్వామి దివ్య కృపయే అని నేను నమ్ముతున్నాను. ఈ వ్యక్తిత్వాన్ని పదును పెట్టి చాతుర్యాన్ని నాకు ఆపాదింప చేసిన స్వామికి శరణు వేడుకోవడం తప్ప మరి ఇంకేమి చేయగలను చెప్పండి.

మిత్రులారా! ఒక్క సారి మీరు గమనించండి. మూడు నాలుగు దశాబ్దముల కాలం నుండి నేను ఏమైనా భావ వ్యక్తీకరణ నేర్చుకున్నాను అంటే దానికి కేవలం స్వామి మాత్రమే కారణం అని చెప్పాలి. స్వామిని చూస్తుంటే అందరూ ఎలా చూస్తారో నాకు తెలియదు కానీ, నేను మాత్రం... స్వామి ఎలా దగ్గుతారు, స్వామి నుదటి మీద జాలువారే వెంట్రుకలను చేత్తో ఎలా సర్దుకుంటారు, తమ వస్త్రాలను ఎలా అలవోకగా సర్దుకుంటారు, స్వామి ఎవరినైనా పిలవాలంటే ఎలా పిలుస్తారు, స్వామి గోక్కుంటే ఎలా ఉంటుంది? స్వామి మైకు పట్టుకుంటే ఎలా ఉంటుంది? స్వామి తన కంఠముతో మాట్లాడితే ఎలా ఉంటుంది? స్వామి భజన పాడితే ఎలా ఉంటుంది? స్వామి నడక ఎలా ఉంటుంది? స్వామి నవ్వు ఎలా ఉంటుంది? స్వామి వ్రాతలు ఎలా ఉంటాయి, స్వామి చేతలు ఎలా ఉంటాయి? గమనించే వాడిని. ఇవన్నీ కూడా, నా అభిప్రాయం ప్రకారం, ఉత్తమ భావ వ్యక్తీకరణకు పరాకాష్టగా చెప్పచ్చు.

నేను ఏ పని చేస్తున్నా, అది కేవలం స్వామి ఆశీస్సులు, ఆయన ప్రభావం వల్లనే అని తలచుకుంటాను. స్వామి ప్రభావం నా వ్యక్తిత్వం పై ఎంతగానో ఉంది. ఇలా అందరూ కూడా ఎన్నో విషయాలని జీవితంలో నేర్చుకునే ఉంటారు.

నాకైతే ఇదంతా స్వామి మన జీవితాలని తన సందేశంగా మలుచుకోవడం కోసం చేశారు అనిపిస్తుంది. మన జీవితం ప్రజలకు, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ప్రసాదం అయ్యేలా ఉండాలి. మన జీవితం స్వామి ప్రతిబింబంగా, ఈ ప్రపంచంలో చివరి శ్వాస వరకు ప్రకటితం అవ్వాలి. అట్టి విశ్వాసంతో మనం అందరం చేతనైన మంచి ఆలోచనలు, మాటలు, వ్రాతలు, పనులు ప్రకటిద్దాం అనే అభ్యర్థనతో ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

95

అభయ – భయమును తొలగించే భరోసా

1990 సంవత్సరం నుండి 2006 దాకా అహరహం స్వామి కార్యములో అంకితమయ్యాను. సేవించాలనే ఆకలి నన్ను ఒక్క క్షణం కూడా నిలువనీయలేదు. అందరికీ వారాంతాలే సేవకి వేదికలు అయ్యాయి. కంపెనీ సెక్రెటరీగా వృత్తి రీత్యా గొప్ప సంస్థలలో పని చేస్తున్న నాకు. ఎనిమిది గంటలే పని. మహా అవుతే 10 గంటల పని. ఒక ఆరు గంటలు నిద్ర. ఇంకా ఎనిమిది గంటలు రోజుకి, ఆ ఎనిమిది గంటలు నా కళ్ల ముందు కనిపించి నన్ను వెక్కిరించేవి. అలా నేను అంత సమయాన్ని వృధా చేస్తున్నా అని ప్రతి క్షణము చాలా పశ్చాత్తాప పడే వాడిని. స్వామి అనుక్షణము సేవ చేస్తూ ఉన్నారే! స్వామి యొక్క నడక, నడత, పయనము, ప్రయాణము, ప్రస్థానము ఇదంతా సేవలో ఉన్నదే. మరి నేను చూస్తే ఇలా సమయం వృధా చేస్తున్నానే అని బాధ పడే వాడిని.

ఏ విధంగా ప్రక్కవాడిని ఉత్సాహపరచాలి, ఇంకా పది మందితో సేవ ఎలా చేయించాలి, నేను ఏ విధంగా సేవలో పాల్గొనాలి, నా సమయాన్ని ఏ విధంగా సార్థకం చేసుకోవాలి, తద్వారా నా జీవితాన్ని ఏ విధంగా పునరంకితం చేసుకోవాలి సేవకి... అన్న ఆలోచనలు నన్ను ఇబ్బంది పెట్టేవి.

పోయే లోపుగా చచ్చిన తరవాత నేను బ్రతికే పనులు చేయాలని, ప్రతి రోజు చివరి రోజుగా ఎంచి సేవించాలని, చుట్టూ ఉన్న బంధు మిత్రులను సేవలో చేర్చాలని, తహ తహలాడే వాడినంటే ఎలాంటి సందేహము లేదు.

2000 సంవత్సరంలో అమ్మా నాన్నలు నా ఖాతా సర్దుబాటు చేసే ఆలోచనతో ఉపనయన సంస్కారం చేశారు. ఆ సందర్భంలో స్వామి సంకల్పానుసారం 'అభయ స్వచ్ఛంద సంస్థ' సంకల్పాన్ని బంధు మిత్రులతో పంచుకున్నాను. ఆ సందర్భంలో పోగు చేసిన 60 వేల రూపాయలను పోస్టల్ సేవింగ్ స్కీమ్‌లో పెట్టగా, అది 2006 నాటికి లక్ష రూపాయలయ్యింది. ఆ లక్ష రూపాయలు నా జీవిత లక్ష్యమును గుర్తు చేస్తూ ఉండేది.

నిద్రపట్టేది కాదు, ఒక వేళ నిద్ర పోయినా 'అరే! మనం ఏమి చేస్తున్నాం? ఇంకా ఎందుకు

చేయలేకపోతున్నాం?' అనే ఆలోచనలతో మెలకువ వచ్చేది. స్వామి 18 నుండి 35 ఏళ్లు యౌవన దశ అని చెప్పారు. కానీ నా 35 ఏళ్లు పూర్తయ్యి, నేను 36వ సంవత్సరంలోకి అడుగుపెట్టాను. 'ఇప్పటికీ నేను ఏం చేయగలను? ఏ దిశలో నడవగలను?' అనే ఆలోచన నన్ను ప్రశాంతంగా ఉండనీయలేదు.

అలాంటి సందర్భంలో, 2006 భాద్రపద చవితి అంటే వినాయక చవితి రోజున బెంగళూరులో హరిప్రసాద్ వాళ్లింట్లో నేను, అన్నయ్య, తమ్ముడు మరియు ఇతర కుటుంబ సభ్యులందరితో కూర్చొని 'అభయ' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించే ఆలోచన, అంకురార్పణ గురించి పంచుకున్నాను.

ఏందయ్యా బాబూ! నువ్వు చదువుకున్నావు, చదువుకున్నావంటే ఉద్యోగం చేసుకోవచ్చు కదా? ఇవన్నీ ఎందుకు చేస్తున్నావని కొంతమంది అడిగారు. కానీ నా మనసు మాత్రం వేరేలా ఉంది. నాకు ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, ఇల్లు, వాకిలి అన్న బంధనాలేమీ లేవు. వృత్తి పరంగా నేను 'కంపెనీ సెక్రటరీ'గా చక్కగా సంపాదిస్తున్నాను. రోజూ ఎనిమిది – పది గంటల సమయం పూర్తిగా పని కోసం కేటాయిస్తూనే ఉంటాను.

కానీ అంతకు మించి, మిగిలిన సమయాన్ని సమాజానికి అర్పించాలనిపించింది. అందరినీ ఒక తాటిపైకి తెచ్చి మంచి పని చేయొచ్చు కదా? 'మీరందరూ నాకు తోడుగా నిలవండి' అని చెప్పాను.

అందరూ చాలా సంతోషపడ్డారు. 'సంతోషం అప్పా! నువ్వు సేవలో ముందుకు వెళ్లబోతున్నావంటే, సరే! మనమందరం కలిసి ఏదైనా చేద్దాం' అని ప్రోత్సహించారు. ముఖ్యంగా ఏ.వి. సతీష్ కుమార్, అన్నయ్య, నారాయణ రంగయ్య, హరి ప్రసాద్, నా తమ్ముడు శ్రీనివాస్ వీరందరూ ఎంతో ప్రోత్సాహమందించారు. 'సేవ పట్ల నాకున్న ఆకలి, తపన' గురించి వివరంగా చెప్పాను.

అయ్యా! మనం తల్లిదండ్రులు ద్వారా అబ్బిన సేవా దృక్పథం వలన అంతో ఇంతో, ఎంతో కొంత సేవ చేస్తూనే ఉన్నాం. ఇప్పుడు ఈ వేదిక ద్వారా ఇంకా చక్కగా సేవ చేయడానికి అవకాశం ఉంది అని వివరించాను.

"ఈ ఫౌండేషన్ లక్ష్యం ఏమిటి?" అని నేను ఆలోచించినప్పుడు, స్వామి కార్యంలో నేను పొందిన ఎన్నో అనుభవాలు నా మనసుకి తట్టడం ప్రారంభించాయి. దాంతో ఒక మిషన్ స్టేట్‌మెంట్‌ను రూపొందించుకున్నాను.

అభయ లక్ష్య ప్రకటన :

Our Mission is to Serve with the H.E.A.R.T.

H - Health Care (ఆరోగ్య సేవలు), E - EduCare (విద్యా సేవలు), A - Awareness (అవగాహన సేవలు), R - Rural Development & Rural Leadership (గ్రామాభివృద్ధి & నాయకత్వం), T - Transformation (పరివర్తన)

ఈ నాలుగు ప్రధాన అంశాలపై మనం కృషి చేస్తే, Transformation సహజంగానే సంభవిస్తుంది. ఇదే అభయ మిషన్ యొక్క హృదయం. ఇక్కడ Transformation అంటే పరివర్తన. చేసే వాడిలో పరివర్తన, చేయించుకునే వాడిలో పరివర్తన, చేయించబడే దానిలో పరివర్తన, ఫలితములో పరివర్తన ఇవన్నీ కూడా పరివర్తనము చెందుతాయి అని చాలా నమ్మకముతో అభయ సంస్థని ఏర్పాటు చేసే ప్రయత్నం చేశాను.

అభయ సంస్థ ప్రారంభం చేస్తున్నాను, మీ యొక్క ఆశీస్సులు, అనుగ్రహము, ఆ యొక్క సందేశము, ఆ ఉపదేశము కావాలని స్వామి వారికి ఉత్తరం వ్రాసుకున్నాను. అదే విషయాన్ని

బంధు మిత్రులందరికి ఉత్తరం వ్రాసాను. ఆ విధంగా సుమారు తొమ్మిది మంది పేర్లను తీసుకొని హైదరాబాద్‌కి వచ్చి పంజగుట్ట సబ్-రెజిస్టర్ కార్యాలయంకి వెళ్లడం జరిగింది (07.09.2006) CA కే.కే. గుప్త, చార్టెడ్ అకౌంటెంట్, హైదరాబాద్ సిటీలో అత్యంత సీనియర్ ఆదాయపు పన్ను నిపుణులు. ఆయన నా ఆకాంక్ష, సృజనాత్మకత, సేవా ఆకలిని అర్థం చేసుకుని, ఏమి చేయాలో, ఎలా చేయాలో, ఎక్కడ చేయాలో చక్కగా వివరించారు. ఆయన సలహా మేరకు, "అభయ" అనే సంస్థ రిజిస్ట్రేషన్‌కు కావలసిన పత్రాలు తయారు చేసి, సబ్-రెజిస్టర్ కార్యాలయంలో నమోదు చేయడం జరిగింది. రిజిస్టర్ చేసిన వెంటనే సాక్షి అవసరం అంటే... ఆ సమయంలో నాకు బాగా పరిచయం ఉన్న నా జూనియర్ మోహిత్ కామ్‌దార్‌ను పిలిపించాను. సాక్షిగా ఉండాలి అని చెప్పడంతో 'సార్, తప్పకుండ ఉంటాను సార్, నా భాగ్యంగా భావిస్తున్నాను' అని వచ్చి సాక్షి సంతకం చేశాడు. ఇలా అన్ని సరళంగా జరిగిపోయాయి.

ఇప్పుడు దీని గురించి నేను ఆలోచిస్తే, సంస్థ పేరు అభయ ఫౌండేషన్. సాక్షి పేరు మోహిత్ కామ్ దార్. అభయ ఫౌండేషన్‌కు ఉజ్వలమైన భవిష్యత్తు ఎప్పుడు వస్తుంది అంటే, ఆ సాక్షి భూతంగా నిలిచినటువంటి ఆ సంతకం చూస్తే అర్థమవుతుంది అని నాకు తెలిసింది. "సేవను మోహించే వాడు" అని తెలుస్తుంది కాబట్ట మనమందరం కూడా కామ్దారులుగా అవ్వాలనుకున్నాను.

అభయ ఫౌండేషన్‌ని నమోదు చేసి ఆ పత్రాలను బయటకు తీసుకొస్తుంటే, నాకు పరిచయం ఉన్న సాయి సోదరుడు గొల్లపూడి నరసింహమూర్తి గుర్తుకు వచ్చాడు. తను అప్పుడప్పుడే అమెరికా నుంచి వచ్చాడు. ఆయనకు ఫోన్ చేశాను. అన్నయ్య మీరు డిజైనర్ కదా, ఒక లోగో కావాలి అని. ఏమి లోగో అని అడిగితే, "అన్న! ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేస్తున్నాం", ఏం పేరు అంటే, "అభయ ఫౌండేషన్" అని చెబితే ఆయన "అరే చాలా బాగుంది. నాకు బాగా నచ్చింది. నేను ఇప్పుడే ఒక 10 నిమిషాల్లో నీకు లోగో పంపిస్తాను" అని అన్నారు.

మిత్రులారా మీరు నమ్మరు! పదే పది నిమిషాల్లో ఒక అద్భుతమైన లోగో నాకు మెయిల్ చేశారు. ఆ మెయిల్ ఓపెన్ చేస్తే నా యొక్క అణువణువు కూడా పులకరించి పోయింది. ఒక అద్భుతమైన వృత్తాకారంలో పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ మదచ్చతే... అన్నట్టుగా, పూర్ణ వృత్తాకారంలో స్వామి వారి చెయ్యి కనిపించింది. నిజంగానే, స్వామి దివ్యహస్తం అభయంగా కనిపించింది. వెంటనే ఫోన్ చేశాను, అన్నయ్య! ఎంత చక్కగా ఉంది. అసలు ఎలా చేశారు 10 నిమిషాల్లో? అంటే... ఆయన నవ్వుతూ అన్నాడు, బాలచంద్ర 10 నిమిషాల్లో చేయలేదయ్యా... ఇది ఆరు నెలల క్రితమే చేశాను. ఈ లోగో ఎందుకు చేశానో నాకే తెలియదు. కానీ నువ్వు అభయ అంటూనే ఈ యొక్క లోగో నాకు గుర్తుకొచ్చి నీకు ఇచ్చేసానయ్యా... అని చెప్పారు. నా యొక్క ఆనందానికి హద్దు లేదు. తర్వాత చెప్పాడు, నీకు ఇంకా ఏం కనిపిస్తోంది? అన్నయ్య నాకు చక్రం కనిపిస్తోంది. అభయము కనిపిస్తోంది. ఇంకేం కనిపిస్తోంది? అని అడిగితే... ఏమయ్యా బాబా కనిపించట్లేదా?? అని అడిగాడు. అప్పుడు తీక్షణంగా వీక్షిస్తే, ఆ లోగోలో స్వామి హస్తము పైన, స్వామి యొక్క ముఖార విందము కూడా ప్రత్యక్షంగా కనిపిస్తుంది నాకు. ఇది సాక్షాత్తు ఆ సత్యసాయి నాధుని దివ్య సంకల్పము చేత ఏర్పడిన సంస్థగా నేను నమ్మక తప్పలేదు.

ఈ విధంగా 2006లో నేను మధ్య వయస్కుడిగా సమాజానికి ఏం చేయొచ్చు అనే ఆలోచన ధోరణతో ముందుకు వెళ్లడం మొదలు పెట్టాను. మిత్రులారా ఇదంతా చెప్తూ ఉంటే నాకు ఇంకొన్ని విషయాలు గుర్తు కొస్తున్నాయి. అభయ ఫౌండేషన్ స్థాపనకి కారణము ఏమిటి? అను నిత్యము

సమాజంలో మనం ఎంతో మందిని కలుస్తున్నాం. సేవ చేయాలన్నా, అందుకోవాలన్నా, అందరికి సత్యసాయి బాబా తెలియనక్కర్లేదు. అభయ ఫౌండేషన్ అన్న ఈ వేదిక... మత రహితంగా, కుల రహితంగా, వర్ణ రహితంగా, రాజ్య రహితంగా, ప్రాంత రహితంగా, భాషా రహితంగా, రాజకీయ రహితంగా, ఏలాంటి సిద్ధాంతాలకి అతీతంగా పని చేసే అవకాశం ఈ సంస్థ ద్వారా కల్పించాలి అనే ఆలోచన వచ్చింది.

రెండో ఆలోచన ఇది: భారతదేశంలో ఎన్నో లక్షల మంది వృత్తి నిపుణులు (Doctors, CA, CS, CMA, Advocates etc.,) ఉన్నారు. వీరంతా తమ వృత్తిలో అత్యంత పేరు ప్రఖ్యాతులు, పదవులు, వనరులు సంపాదించిన వాళ్లే. ఇలాంటి వారు సేవా క్షేత్రంలో కృషి చేసే వేదికను కల్పిస్తే అద్భుత ఫలితాలను మనం సృష్టించగలం. ఇదే అభిప్రాయంతో 'అభయ ఫౌండేషన్'ను ఏర్పాటు చేయడం జరిగింది. మిత్రులారా! గత రెండు దశాబ్దాల కాలంగా అద్భుత మైన సేవాకార్యాలకి ఈ అభయా ఫౌండేషన్ తెర తీసింది. నాటి నుండి నేటి దాకా ఈ అభయ సంస్థ స్వామి చూపిన మార్గంలో పయనిస్తూనే ఉంది. చివరి క్షణము దాకా ఊపిరి ఆగే దాకా, శ్వాసలో విశ్వాసము నింపి, సత్యసాయి మార్గంలో అభయ సంస్థ ముందుకు వెళ్లాలనే ఆశ... ఆశయం. ఇది కేవలం స్వామి యొక్క సంకల్పంగా నేను తీసుకున్నాను.

ఓం శ్రీ సాయిరాం 07.09.2006

అందరికీ... నమస్కరించి వ్రాయునది:

దైవానుగ్రహ కృపా విశేషం వల్ల అందరూ క్షేమమని తలుస్తాను. మన అందరి మధ్య దూరాలు ఎక్కువయినా... ప్రేమానురాగాలకెన్నడూ కొరత లేకుండా వుంటాయని నమ్ముతాను. ఎవరికీ భారం కాకుండా... ఉన్నంతలో పది మందికీ ఉపయోగపడుతూ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్నాను.

తల్లితండ్రులు – గురువులు – పెద్దలు ఇచ్చిన సంస్కారంతో... సత్యసాయి 'దివ్యానుగ్రహ ఛత్ర ఛాయలో చిన్ననాటి నుండీ చిన్నా – పెద్దా సేవలు చేసుకుంటూ... దైవానుగ్రహ ప్రాప్తి కోసమై పరితపించడమే జీవితం అయింది.

సంపాదనలో కొంత భాగాన్ని సమాజం కోసమై ఉపయోగించడం అలవాటు అయింది. సంపాదన ఆర్జించడం కన్నా... సత్ కర్మలు ఆచరించడమే మక్కువ అయింది. పొదుపు చేసి కూడబెట్టిన మొత్తంతో పది మంది బాగు కోరి ఒక ట్రస్ట్ ఏర్పాటు చేద్దామని సంకల్పం.

పెద్దలు, అన్నయ్యలు, బావలతో చర్చించాను. ఎంతో ప్రేమాదరములతో అందరూ దీవెనెలందించారు. ఈ రోజు "అభయ ఫౌండేషన్" అన్న పేరు మీద ఒక ట్రస్టును రిజిష్టర్ చేయనెంచాను. ఈ పవిత్రకార్యం గురించి అందరితో పంచుకున్నప్పుడు, అందరి ఆశీస్సులు అందుకున్నప్పుడే బాగుంటుందని తలిచాను. అందుకే ఈ ఉత్తరాంశము. మీ దీవెనలనే దక్షిణ కోరుతూ ప్రేమానురాగములతో...

బాలచంద్ర

96

బాలచంద్ర నీకు ఎంత వీలైతే అంత కట్టేసేయ్!! – పి.ఎస్.రావు

ఒక ప్రక్క గ్రామ సేవలు, మరో ప్రక్క NATCOలో CS శిక్షణ, ఇంకొక ప్రక్క కంపెనీ సెక్రెటరీ ఫైనల్ పరీక్షల కోసం సిద్ధం అవ్వాల్సిరావడం, ఇలా వీటి మధ్యలో ప్రత్యేక బోధనా తరగతులకు కూడా వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. కారణం, CS ఫైనల్ పేపర్లు కాస్తా కష్టంగా ఉండడం.

హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత Hyd CS Chapterలో జరిగే బోధనా తరగతులకు వెళ్లేవాడిని. కానీ బోధన చాలేది కాదు. ఆ రోజుల్లో ఆంధ్రదేశం నుంచే కాకుండా దక్షిణ భారతదేశంలోని ఎన్నో రాష్ట్రాలలో ఉన్న పిల్లలందరూ కూడా హైదరాబాదులోని దిగ్విజయ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చే వాళ్లు. గాంధీనగర్‌లో చుట్టు ప్రక్కల చిన్న పెద్ద హాస్టల్స్‌లో ఉంటూ కేవలం ఈ తరగతుల కోసమే అక్కడ సిద్ధం అయ్యే వాళ్లు. ఈ విషయాలు తోటి మిత్రుల ద్వారా తెలుసుకుని దిగ్విజయ్ కోచింగ్‌కు వెళ్లాను. ఫైనల్ నాలుగు పేపర్లకు 5000 రూపాయలు రుసుము కట్టాలి అని తెలుసుకున్నాను. నిజానికి అంత పెద్ద మొత్తంలో డబ్బు కట్టలేని పరిస్థితి నాది. మిత్రులు చెపితే విన్నాను మొదటిసారి CS PS రావు గురించి. చాలా మంచి వారని దిగ్విజయ్ కోచింగ్ ఇన్స్టిట్యూట్లో పాఠాలు చెప్తారని... అక్కడ నవీన్ సార్ టాక్సేషన్ తీసుకుంటే, పిఎస్ రావు కార్పొరేట్ లా గురించిన బోధన చేస్తారని విన్నాను. ఒక కంపెనీ సెక్రటరీగా వారు అందరికీ సుపరిచితులు. అందువల్ల నేను సరాసరి వారి దగ్గరికి వెళ్లి నా ఆర్థిక పరిస్థితిని వివరించాను. డబ్బు కట్టలేని పరిస్థితిలో ఉన్న నన్ను చూసి వారి చలించి పోయారు. అయ్యో ఏమి పర్వాలేదు బాలచంద్ర! నీకు ఎంత వీలైతే అంత కట్టేసేయ్, మిగతాది నేను చూసుకుంటాను అన్నారు. ఈ రోజుల్లో ప్రక్క వాడి కష్టాల్లో ఆదుకునే మనసు ఎంత మందికి ఉంటుంది చెప్పండి?

అలా మొదలైంది మా పరిచయం ఆ తర్వాత తరగతులలో వారి బోధన పటిమ, వాక్యాతుర్యం ఇవన్నీ చూసి ఆశ్చర్య పోయాను. వారి తరగతులకు చాలా ఇష్టంగా వెళ్లి పాఠాలు వినేవాడిని అలా వారు నాకు ఇష్టమైన టీచరు ఐపోయారు. CS ఫైనల్ పరీక్షలు గట్టెక్కడం అంటే ఆ విజయానికి ఒక

కారణం తప్పక CS PS రావు అని చెప్పాలి.

2001లో అనుకుంటాను... ఏదోలాగా నేను CS కోర్సు పూర్తి చేయగలిగాను. అపుడు ఇక కావాల్సింది సరైన ఉద్యోగం. చాలా నెలలు ఉద్యోగం కోసం అన్వేషించే వాడిని. ఆ సమయంలో ఒక రోజు మళ్లీ రావు గారి ఆఫీసుకి వెళ్లాను. వారికి చాలా పెద్ద ప్రొఫెషనల్ నెట్వర్క్ ఉండేది. నా పరిస్థితి చెప్పి ఏదైనా ఉద్యోగం చూపించాలని కోరాను. ఆయన నన్ను అనునయించి... బాలా! ఏమి తొందర పడద్దు... ఈ ఆఫీసు నీ ఆఫీసు అనుకుని వచ్చేయ్... డబ్బుల గురించి భయంలేదు... నీకేమి కావాలో తీసుకో! ఉద్యోగం కూడా చూద్దాం అన్నారు. ఆ మాటలు విని నా కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. వారికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. త్వరలోనే సురానా గ్రూప్‌లో ఉద్యోగం వచ్చింది. కానీ వారు అన్న మాటలు... వారి ప్రేమను మాత్రం ఎప్పటికీ నేను మరచి పోలేను.

1996లో వారితో మొదలైన ప్రయాణం వజ్రోత్సవం దిశగా సాగిపోతోంది. ఎప్పుడైనా... ఇప్పుడైనా... ఎప్పుడైనా... వారు ప్రొఫెషన్‌లో కావలసిన వారుగా... నాకు పెద్ద దిక్కుగా మారి పోయారు.

జీవితంలో ప్రతి విజయం నేను వారితో పంచుకునే వాడిని. నేను ఏమి చేసినా వారితో చర్చించే వాడిని. చివరకు సమాజ సేవలో కూడా వారి సౌజన్యం కోరాను... ప్రతి మంచి పనిలో నేనున్నాను అని నాకు తోడు నిలిచారు.

వారు మాత్రమే కాదు, వారి కుటుంబము, శ్రీమతి శారద, నరేన్ మరియు సంపత్ లతో కూడా నా అనుబంధం వెల్లివిరిసింది. ఇక వారి ఆఫీసులో పని చేసే పార్టనర్ నుండి ప్యాన్ దాకా అందరూ నన్ను ప్రేమగా చూసుకునే వాళ్లు. వికాస్, వనిత, జినేష్, మోహిత్, సునీల్, రాధాకృష్ణ, శిరీష, శ్రీదేవి ఇలా ఎందరో వృత్తి నిపుణులు పరిచయం అయ్యారు. అందరి మధ్య అంతర్లీనంగా ఉండే దారం మాత్రం PS రావు మాత్రమే.

అభయ సంస్థ స్థాపించిన తరవాత... వారిని కలిసి చేస్తున్న కార్యక్రమాలు వారికి తెలియ జేసి... వారిని అభయ ధర్మకర్తగా ఉండాలని వేడుకున్నాను. వారెంతో దయతో... బాలచంద్ర! నువ్వు చేస్తున్న ఈ మంచి పనులలో నేను సదా తోడు ఉంటాను అని చెప్పి అభయ ట్రస్టీగా చేరినారు. సుమారు 18 ఏళ్ల నుండి వారు ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ... అద్భుతమైన నాయకత్వాన్ని అందిస్తున్నారు.

వనరుల గురించి వారిని ఒక సందర్భంలో అడిగితే చెప్పారు, చూడు బాలచంద్రా! నేను సంస్థకు నా వంతుగా స్వచ్ఛమైన వనరులు ఇద్దామని అనుకుంటున్నాను. వ్యాపార వ్యవహారాల ద్వారా సంపాదించే డబ్బుకు స్వచ్ఛత లేక పోవచ్చు! అందుకే నేను నా సొంత శక్తితో మేధస్సును ఉపయోగించి నిర్వహించే బోధనా తరగతుల ద్వారా సంపాదించిన వనరులను ఈ సంస్థకు ఇస్తాను. ఇది స్వచ్ఛమైన ధనం. నా తండ్రి పాతూరి శివ రామ ప్రసాద్ జ్ఞాపకార్థం ఇది చేస్తాను... అని చెప్పారు. ఇందులో ఉన్న లోతైన అర్థం తెలుసుకుని నేను చేష్టలుడిగి పోయాను.

గత రెండు దశాబ్దాలుగా వారి దాతృత్వంతో అభయ సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ఎన్నో సేవలకు శ్రీకారం చుట్టాము. వారి సహాయం, సహకారం, సౌజన్యం నేటికి కూడా మరకలు లేని మంచులా అలా వర్షించబడుతూనే ఉంది.

ఇక వారి నుండి నేను నేర్చుకున్న జీవిత పాఠాలు చాలానే ఉన్నాయి.

మొదటి పాఠం: సమయ పాలన! వారు ఎంత కఠినమైన విధంగా సమయాన్ని పాటిస్తారు అనేది నేను చూసాను. ప్రతి రోజు తెల్లవారి లేచింది మొదలు యోగ చేస్తారు. తప్పక కనీసం గంట రెండు

గంటలు స్వాధ్యాయనం చేసుకుంటారు. తరవాత బోధనా తరగతులకు వచ్చే వాళ్లు. అటునుండి కార్యాలయానికి వెళ్లే వాళ్లు. ప్రతి పని కూడా నిర్దేశించిన సమయానికి చేయడం వారి అలవాటు.

బోధన తరగతులు నడుస్తున్న రోజుల్లో జరిగిన సంఘటన చెప్తున్నాను. ఉదయం 7 గంటలకు విద్యార్థులు ఆలస్యంగా వచ్చింది చూశాము... కానీ టీచర్ అయిన PS రావు లేట్‌గా వచ్చింది చూడలేదు. ఆరు నూరైనా... వర్షమే వచ్చినా... 10 నిముషాలు ముందే తరగతి ముందు ఉండే వారు. వారిని చూసి మేము సిగ్గు పడిన సందర్భాలున్నాయి. ఎవరికైనా సమయం ఇస్తే ఆన్ డాట్ ఉండే వారు. ఒక వేళ అవాంతరాల వలన రాలేక పోతే వారు క్షమించమని నిజాయితీగా అడిగింది కూడా నేను చూసాను.

రెండవ పాఠం: తను నేర్చుకున్నది పది మందికి చెప్పే వ్యక్తిత్వం, వారు గత 3 దశాబ్దాలుగా... దేశంలోనే పేరెన్నిక గన్న మొదటి 100 మంది వృత్తి నిపుణులలో ఒకరు అని చెప్పాలి. వారు నిత్య విద్యార్థిగా ప్రతి రోజు మారుతున్న చట్టాలను, నియమ నిబంధనలను ఎప్పటి కప్పుడు చదువుకుంటూ... వాటి వడబోసి ఆచరణాత్మక మైన బోధనలుగా మార్చి వేలాది మంది విద్యార్థులకు చెప్పే వారు. వారి తరగతుల వలన లబ్ధి పొందిన వేల మందిలో నేను ఒకడిని మరి.

మూడవ పాఠం: ఉద్యోగులను తనవాళ్లుగా చూసే ఆదర్శం!

వారు బోధనా తరగతుల ద్వారా వేల మందికి విద్య అందిస్తే... తమ కార్యాలయంలో వందలాది వృత్తి నిపుణులను తయారు చేశారు. అదొక వృత్తి నిపుణులు కార్ఖానా అని చెప్పాల్సిందే. అందులోనూ... వారి కార్యాలయంలో సహోద్యోగులు మనకు కనబడరు... సహచరులు మాత్రమే కనిపిస్తారు. ఒక అద్భుతమైన వ్యూహాత్మక యాజమాన్య నిర్వహణ చూస్తాము. అసలు పని చేసే వాళ్లు అక్కడ ఉండరేమో... అందరూ యాజమానుల వలనే ఉంటారు.

నాల్గవ పాఠం: విద్యార్థులను ఎల్లవేళల్లో కూడా సొంత బిడ్డల లాగా చూసుంటారు!

CS విద్యార్థులు శిక్షణకు వస్తే వారు తప్పక పాస్ అవ్వాల్సిందే. ఆ పిల్లలకు తగిన విధంగా శిక్షణ ఇవ్వడమే కాక, వారికి మధ్యాహ్న భోజనం అందిస్తారు. 5 రోజుల పని దినాలు, కనీసం 2 నెలల పరీక్షల సెలవు, అది కూడా వేతనంతో కూడిన సెలవు. అసలు అక్కడ ఒక సారి చేరితే మళ్లీ ఎవరు కూడా బయటకు వెళ్లేందుకు ఇష్టపడరు.

అయిదవ పాఠం: Nation Wide Network!

ఏదైనా సరే వారు అనుకున్నారు అంటే... ఏదైనా చేయాలి అని సంకల్పిస్తే... అది తప్పక ఉ ద్యమ రూపం సంతరించుకుంటుంది. వారి అనుయాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, సహచరులు, అన్ని రంగాలలో వ్యాపించి పోవడమే దానికి కారణం. ఇలా ఒక వ్యక్తి ద్వారా జరగడం అన్నది ఒక మేనేజ్‌మెంట్ పాఠం అనుకోవాలి.

ఆరవ పాఠం: హద్దులు లేని దాతృత్వం!

వారి దృష్టికి ఏదైనా ఇబ్బందులున్న వాళ్లు వస్తే... ఇక వారి చేతికి ఎముక మాయం అయిపోతుంది. వారి సాయం అందుకోని వ్యక్తులు ఉన్నారంటే నమ్మడం కష్టం. వారు వీరి దృష్టిలో పడక పోవచ్చు అంతే తప్ప వారు సాయం చేయలేదు అనడం జరగదు. నా జీవితంలో... ప్రత్యక్షంగా ఎన్నో సందర్భాలలో వారి దాతృత్వం కన్నులారా చూసాను కాబట్టి ఈ విషయం చెప్తున్నాను.

ఏడవ పాఠం: నిరాడంబర జీవన శైలి!

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం వారిది. ఎన్ని కార్లున్నా... ఆఫీసుకు రెండు చక్రాల

వాహవంలోనే రావడం నేను చూసాను. అవసరం ఐతే తప్ప ఎక్కడ ఆడంబరాలకు వెళ్లింది నేను చూడలేదు. సదా సీదాగా మనిషి అందరికీ అందుబాటులో ఉంటారు. ఈ లక్షణం ఈ రోజుల్లో చాలా అరుదుగా మనం వృత్తి నిపుణుల విషయంలో చూస్తాము. ఫోన్ చేస్తే అవతలి వ్యక్తి వెంటనే స్పందించడం అనేది ఈరోజుల్లో గగనం అయింది. అలాంటిది ఈ రోజు కూడా ఫోన్‌లో అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి వీరు.

ఎనిమిదవ పాఠం: ఆడిన మాట తప్పని వైనం!

ఒకసారి అభయం ఇస్తే ఇక మళ్లీ చేయి వెనక్కి తీసుకోవడం అన్నది వారి నిఘంటువులో లేదని చెప్పాలి. ఇచ్చిన మాట వలన వారికి ఇబ్బంది కలిగినా సరే, చెప్పిన పని చేయడం... చేసిన పని పెద్దదైనా సరే నలుగురిలో చెప్పక పోవడం వారి విజ్ఞత.

ఇలా నాటి నుండి నేటి దాకా ఈ వ్యక్తి నాకు దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నారు... వారిని చూస్తూ... నన్ను నేను పునర్ నిర్వచనం చేసుకుంటూ సాగి పోతున్నాను.

జీవితంలో... సత్య సాయి మార్గంలో పరుగులిడుతున్న నాకు, ఈ లౌకిక ప్రపంచంలో అసామాన్య వ్యక్తిత్వంతో అలౌకిక ఆనందం ఇచ్చిన వారిని నేను ఎలా మరచిపోగలను? ఈ బొందిలో ప్రాణమున్నంత దాకా గుర్తుంచుకునే ప్రాతఃస్మరణీయులు వీరు!



97

abhaya Mission to Serve with H.E.A.R.T

సేవయే శ్వాసగా మారింది
పరహితమే పూజ అయింది
వృత్తిలో సేవా ప్రవృత్తి నిలచింది
యాత్ర నివృత్తి వైపు సాగుతోంది

మొదటి 10 సంవత్సరాల కాలం పాటు ఉద్యోగం చెయ్యడము, దాని నుండి వచ్చిన జీత భత్యాలు సామాజిక సేవలకు అంకితం చెయ్యడం ఇంతే. రెండవ దశాబ్ద కాలం ఆ ఉద్యోగం కూడా లేదు. జీవనోపాధి లేనందున నా ఖర్చుల నిమిత్తం కొద్ది మంది ఆత్మీయులు సాయం చేస్తున్నారు. నాకు వేరే ఏ బాధ్యత లేదు. సదా సేవలో జీవితం, అనుక్షణం పరహితమే, అహరహం అందరి కోసమే.

తెలిసిన వారైనా తెలియని వారైనా ఎవరైనా సరే నన్ను, స్వామి పట్లనా భక్తి విశ్వాసాలను, చూసి ప్రేమించడం మొదలు పెట్టారు. స్వామి అంటే పరిచయం లేని వారు కూడా సేవలను ఆదరించారు. మతం అంటే ఔన్నత్యం లేని వారు కూడా మానవత్వము ముందు చేతులు జోడించారు. స్వచ్ఛంద సంస్థలంటే సదభిప్రాయం లేని వాళ్లు సాగిలపడి మ్రొక్కడం ప్రారంభించారు.

"మతములన్నియు చేరి మంచినే బోధించు
తెలిసి మెలగవలయు తెలివి తోడ
మతులు మంచివైన మతమేది చెడ్డది
వినుము భారతీయ వీర సుతుడా"

అని చెప్పిన స్వామి వారి దివ్య వాక్కు వేద వాక్కుగా మారిపోయింది. H.E.A.R.T (HealthCare, EduCare, Awareness, Rural Development & Transformation) తో సేవ చేశాను, చేస్తున్నాను ఇక ముందు కూడా చేస్తుంటాను. కుటుంబ సభ్యులు, మిత్రులు, వృత్తి

నిపుణులు అందరూ చేస్తున్న సేవలలో చేదోడు వాదోడుగా నిలబడ్డారు.

ముందడుగు ముందడుగు ముందడుగు వేద్దాము
కష్టాలు వచ్చినా కన్నీరు కార్చిన
ఉప్పెనలు వచ్చినా ఊపిరే పోయినా
అంటూ సేవా కార్యంలో నన్ను నేను 24/7 అర్పించుకున్నాను.

ప్రతి క్షణము సేవకై వెతుకులాట
ప్రేమించడమే బ్రతుకు బాట
సేవించడమే సత్యమైన మాట
జీవించడమే ఆడాల్సిన ఆట
అని నేను తలచు కుంటాను.

ఈ ప్రక్రియలో కొన్ని వేల మందితో మమేకమయ్యే అదృష్టం నాకు కలిగింది. నిజానికి దీనికి నేపథ్యం స్వామియే. స్వామి దగ్గర నేర్చుకున్న సర్వజనీన ప్రేమ, నిస్వార్థ సేవ, త్యాగనిరతి! ఇవే నన్ను నడిపిస్తున్న మూల సూత్రములు

నాకు బాగా గుర్తు, అభయ సంస్థ ద్వారా చేస్తున్న ఎన్నో కార్యక్రమాల్లో మొట్ట మొదటి లబ్ధిదారులు ఎవరు అంటే? స్వామిని నమ్మిన వారే. స్వామి వాళ్లకి ఇలా దారి చూపించారు అనుకోవాలి.

HealthCare:

హైదరాబాద్‌లో చిన్ననాడే భర్తను కోల్పోయిన ఒక మహిళామతల్లి, స్వామి అంటే అహరహం, అనుక్షణం తపించేది. వాళ్ల ఇంటి ఆవరణం లోనే భజన చేసేందుకు ఒక చిన్న భవనం ఏర్పాటు చేసేందుకు స్థలం ఇచ్చారు. తన ఇంట్లో అయినా పూజ చేస్తుందొ లేదో తెలియదు కానీ, ఆ మందిరానికి మాత్రం క్రమం తప్పకుండా వెళ్లి శుభ్రపరచి, పూజాదికాలు నిర్వహించేది. తరువాత కాలములో క్యాన్సర్ వచ్చింది. ఆ విషయం తెలిసి, మేము ఉన్నాం అని ధైర్యం చెప్పి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స ఇప్పించాము.

గత 20 ఏళ్లుగా సుమారు 1000 మందికి వివిధ రకాల వ్యాధులు, క్యాన్సర్లు, యాక్సిడెంట్ల ద్వారా సతమత మయ్యేవారికి సేవా చెయ్యడం జరిగింది. 5000 రూపాయల నుండి 10,00,000 వరకు ఖర్చుపెట్టిన సందర్భాలు ఉన్నాయి. అంతే కాదు మానవ జీవిత చరిత్రలో ఇంతకు మునుపెన్నడూ కనీ వినీ ఎరుగని ఆరోగ్య అత్యయిక స్థితి (కరోనా) సమయంలో సుమారు 10,00,000 మందికి దేశ వ్యాప్తంగా చేయూత నిచ్చే భాగ్యం కలిగింది. అవసరమైన వారికి ఎలా సహాయం చేసి వారి జీవితాల్లో మార్పు తీసుకురావచ్చో మార్గం చూపిన స్వామికి కృతజ్ఞతలు.

EduCare:

EduCare కింద 2006లో బాలవికాస్ విద్యార్థి అయిన శివకృష్ణ ఎలా అభయ సాయం తీసుకుని ఇప్పుడు అభయ సంస్థకు నిలబడ్డాడో మరొక వ్యాసంలో వివరించాను. ఇప్పటి దాకా సాయం తీసుకున్న ప్రతి రెండవ విద్యార్థి కూడా ఎలాగో అలా స్వామితో సంబంధం ఉన్నవారు కావటం యాదృచ్ఛికం కాదు. అభయ సాయంతో తమ లక్ష్యాలను సాధించిన పిల్లల కథలు కోకొల్లలు.

దాదాపు 1000 మంది పిల్లలకు ఉన్నత చదువులు చదివించింది అభయ.

2008లో అనుకుంటా, అనంతపురం పర్తి యాత్ర సమయం. సాంస్కృతిక ప్రదర్శన తరవాత, స్వామి వున్నట్టుండి పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ "అనంతపురం పిల్లలకు ఇంత చాతుర్యం ఉందా!? చాలా సంతోషం కలిగించారు బంగారు... మీరు చాలా మంచి పిల్లలు, మీ జీవితాల్లో ఎన్నో కష్టాలు ఉన్నాయి. పిల్లలూ మీకు ఎంత కష్టం వచ్చినా, నష్టం వచ్చినా చదువును మాత్రం విడువకండి. మీకేం కావాలి అంటే అది మమల్ని అడగండి... ఒక ఉత్తరం వ్రాయండి చాలు. స్వామి స్పందిస్తారు" అని స్వామి చెప్తుంటే ఆ రోజు ఏడవని పిల్లలు లేరు. ఈ ఉపన్యాసం వల్ల ఒక 10 మంది బీద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు, ఎవరో సూచిస్తే అభయ సంస్థకు ఉత్తరం వ్రాసారు. ఒక దశాబ్ద కాలం పాటు లబ్ది పొందారు. ఇప్పుడు అందరూ చక్కగా స్థిరపడ్డారు. ఇలా అభయ సాయంతో వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్లు, శాస్త్రవేత్తలు, ఫార్మసిస్టులు, IAS ఫ్యాకల్టీలు, అరోగ్య నిపుణులుగా మారిన వారి వందలాది విజయ గాథలు ఉన్నాయి. ఈ పిల్లల్లో చాలా మంది ఏదో విధంగా స్వామితో లేదా స్వామి తత్వంతో అనుబంధమై ఉన్నవారే.

మేము అనంతపూరము జిల్లా లోని చోళేమర్రి గ్రామంలో శ్రీ సత్య సాయి గ్రామ సేవా కార్యక్రమాలు చేస్తూ ఉండగా అక్కడి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుని చూసాం. తరువాత వారు ఎర్రగుంట గ్రామానికి బదిలీపై వెళ్లారు. అక్కడ ఆ దంపతులు ఎంతో భక్తి విశ్వాసాలతో ఒక చిన్న స్కూల్ ప్రారంభించారు. కానీ అది నష్టాల బాటలో నడిచింది. అభయ సేవా కార్యక్రమాలు, లక్ష్యం తెలుసుకొని సంస్థ వారిని సంప్రదించారు. ఉపాధ్యాయుల మన్నన, మర్యాద, సేవా నిరతి చూసి మేము ఆ పాఠశాలను ఆదరించాలని నిర్ణయించుకున్నాము. దానిని ఉచిత పాఠశాలగా మార్చి, అభయ విజ్ఞాన్ స్కూల్ గా పేరుమార్చాము. ఐదు సంవత్సరాలపాటు ఆర్థికంగా నిరంతర సహాయం అందించాము.

ప్రస్తుతం దక్షిణ భారతదేశంలోని 500కి పైగా ప్రభుత్వ పాఠశాలలలో 1,50,000 మంది విద్యార్థులు, 10,000మంది ఉపాధ్యాయులు అభయా సహకారంతో తమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచుకున్నారు.

స్వామి వారి శత వర్ష బ్రహ్మోత్సవం సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లాలోని సుమారు 20 ప్రభుత్వ పాఠశాలలో సుమారు 25,00,000 రూపాయల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించే అదృష్టం కలిగింది.

మరొక ప్రక్క, ఆంధ్రా తెలంగాణ రాష్ట్రాల్లో అభయ నిస్వార్థ సూపర్ 60 అప్రతిహతంగా జరుగుతూ ప్రతి సంవత్సరం 250 మంది ప్రభుత్వ విద్యార్థులకు ఉన్నత విద్యాశాలల్లో ప్రవేశం పొందే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతోంది.

అభయ సంస్థ ద్వారా ప్రచురించిన కంపాస్ (దిక్సూచి) సుమారు 25,000 ప్రభుత్వ పాఠశాలలకు చేరింది. ప్రస్తుతం ఈ పుస్తకం మూడు భాషలలో అన్ని రంగాల వారి ప్రశంసలు అందుకుంటోంది.

ఎంత చేసిన,ఏమి చేసినా,ఎలా చైసినా, ఏవిధంగా చేసిన, ఎక్కడ చేసినా.. అక్కడో ఇక్కడో ఎక్కడో ఆ స్వామి ప్రేమ, కరుణ, వాత్సల్యము, ఆదరణము, ఆచరణం ఇవన్నీ కూడా కనిపిస్తుంటాయి.

Awareness:

ఎక్కడ వీలవుతే అక్కడ సాయి సోదరులు,ఆత్మబంధువులు వాళ్లు ఉన్నచోట విద్యార్థులను

ప్రభావితం చేయడానికి, అవగాహన కల్పించడానికి అవకాశాహం ఇచ్చారు. ఎంతలేదన్నా గత 4 దశాబ్దాలుగా సుమారు 15 లక్షల కిలోమీటర్లు ప్రయాణం చేసి ఉంటాను. నెలకు కనీసం అంటే 5000 కిలో మీటర్లు ప్రయాణం చేస్తూ ఉంటాను. కనీసం 10000 మందితో సంభాషిస్తూ ఉంటాను. అలా ఇప్పటి దాకా ఎంత లేదన్నా సుమారు లక్షల మందితో మాట్లాడి ఉంటాను.

ఇంకో ప్రక్క, హృదయంలోనుండి పొంగి పొరలే ఆతృత, ఆవేదన, ఆలోచనతో ఎన్నో పుస్తకాలు అభయ సంస్థ ద్వారా ప్రచురించే భాగ్యం కలిగింది. ఈ పుస్తకాలన్నీ కూడా కేవలం దేశ ప్రజల జీవితాలను మెరుగు పరచే ఉద్దేశ్యంతో ఉచితంగా అందించే ప్రయత్నం చేస్తున్నాము. ఏమి మాట్లాడినా ఎక్కడ మాట్లాడిన సమస్తం స్వామి ప్రసాదించిన దివ్య స్ఫూర్తితోనే సాధ్యమైంది.

Rural Development:

గ్రామ సేవయన్న రామ సేవయ సుమీ
రామ రాజ్యమన్న ప్రేమమయమే
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సేవ లేకయున్న శాంతి లేదు

ఈ సాయి వాక్యలు, నాలాంటి ఎంతో మంది హృదయాలను లోతుగా ప్రేరేపించి, జ్వలింపజేసినవి అనడంలో ఎట్టి సందేహం లేదు.

దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు మరియు కేరళ రాష్ట్రాల్లో గ్రామాభివృద్ధి మరియు గ్రామనాయకత్వం కార్యక్రమాలను ఎన్నో ప్రదేశాలలో అభయ సంస్థ ద్వారా చేపట్టాము.

తమిళనాడులో పర్యావరణ సంరక్షణలో భాగంగా 2 పెద్ద చెరువుల పూడిక తీసే అవకాశం కలిగింది.

30 గ్రామాలు తమ జీవనశైలిని, జీవన విధానాన్ని మార్చుకునే దిశగా అభయా సహకారంతో ముందుకు సాగాయి. నగరాలకన్నా ఎక్కువ అవసరం ఉంది గ్రామాలకే అన్నది మేము గమనించాము.

ఇప్పటి వరకు 20,000 మందికి పైగా గ్రామీణ యువతి యువకులు ఉచిత ఉపాధి శిక్షణల ద్వారా సాధికారత పొందారు. టైలరింగ్, డ్రైవింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, మగ్గం, ఎలక్ట్రికల్ & హౌస్ వైరింగ్, టై తయారీ, జ్యూట్ బ్యాగ్ తయారీ మొదలైన ఉపాధి శిక్షణల ద్వారా తమ జీవితాలను మెరుగు పరచుకున్నారు. ఇంట్లో ఒక వ్యక్తి లబ్ధి పొందితే, ఆ కుటుంబమంతా లబ్ధిపొందుతుంది అని నమ్ముతాము. ఇదే కదా నిజమైన అభివృద్ధి సారాంశం.

Transformation:

సాధారణంగా ఏ స్వచ్ఛంద సంస్థ అయినా సరే సేవాపరంగా మాత్రమే దృష్టి సారిస్తుంది. కానీ, స్వామి వారు ఇచ్చిన విలువలతో అభయ దృష్టి సేవను మించి ఉంటుంది.

"సేవ అనేది మనల్ని మనమే మర్చిపోవడానికి, మనల్ని మనమే ఉద్ధరించుకోవడానికి చేయాలి"

అని స్వామి ఉపదేశం మాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిచ్చింది. పేరు, ప్రఖ్యాతి, అధికారం, హోదా అనే ఆలోచనలు లేకుండా చేయడం నేర్పింది.

ఇదే నిజమైన మార్పు, పరివర్తను (Transformation). నిజానికి సేవ అనేది సేవకై వనరులు

ఇచ్చే వారికి, సేవ చేసే వారికి, సేవ అందుకునే వారికి, సేవల వల్ల వచ్చే ఫలితం ఈ నాలుగు కోణాలలో పరివర్తన వచ్చినప్పుడే లక్షం నెరవేరినట్లు అని తెలుసుకున్నాము.

ఈ ప్రేరణతో అభయ సంస్థ చేపట్టిన abhaya Hunt the Winter"లో భాగంగా ఇప్పటివరకు 15 రాష్ట్రాల్లో, చలి కాలంలో 1,20,000 దుప్పట్లు పంపిణీ చేశాము. abhaya Hunt the Summerలో భాగంగా ఎండావానలలో జీవనోపాధి నిమిత్తమై రోడ్డు పక్క చిన్న వ్యాపారాలు చేసే వ్యక్తులకు 12,000 గొడుగులు పంపిణీ చేశాము.

ఇక దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నా సరే, అభయ తన వంతుగా ఉడతా సాయం అందిస్తూనే ఉంది. గత 20 ఏళ్లుగా ఇలా లక్ష్యలాది మందిని సేవించుకునే భాగ్యం కలిగింది. చాలా సార్లు ఆయా రాష్ట్రాలలోని సాయి సంస్థలు మరియు సాయి భక్తులు తోడు నిలచి సహాయ సామగ్రి బాధితులకు అందించేందుకు నిలబడ్డారు.

స్వామి దివ్యానుగ్రహంతో దక్షిణ భారత దేశంలో 5 ప్రదేశాలలో అభయా సాధికారత ప్రాంగణాలు స్థాపించబడ్డాయి.

2025 సంవత్సరము స్వామి వారి శత వర్ష బ్రహ్మోత్సవ సంవత్సరం కదా! 2025లో జరిగిన ప్రతి సేవా కార్యాన్ని వారికి అంకితం చేయాలని నిర్ణయించాం. తద్వారా సుమారు 2,00,000 మందిని సేవించుకునే మహద్భాగ్యం కలిగింది.

మిత్రులారా, ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, చేసిందేదైనా సరే నా స్వామి దయ, ఆయన దిశానిర్దేశం, ఆయన ప్రేమ, ఆయన పవిత్ర సంకల్పం తప్ప మరేమీ కాదు.

అభయ అనేది నిజానికి శ్రీ సత్య సాయి దివ్యహస్తం యొక్క ప్రతిరూపం. శ్రీ సత్యసాయి దివ్య సంకల్పం చేతనే ఆవిర్భవించింది అభయ ఫౌండేషన్ అనే దానిలో ఎటువంటి సందేహమూ లేదని చెబుతూ... హృదయ పూర్వకంగా జరిగిన జరుగుతున్న జరుగబోతున్న సేవలను స్వామి పాదాల వద్ద సమర్పించుకుంటూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

98

దశాబ్దము చేసిన దివ్య దిశా నిర్దేశము

2000 – 2010: ఈ దశాబ్ద కాలం, స్వామి వారి దివ్యకార్యములో అప్రతిహితమైన సేవలకు వేదికగా నిలచింది. స్వామి వారి వజ్రోత్సవ వేడుకల (75వ పుట్టు పండుగ) నుండి 85వ పుట్టు పండుగ దాకా 10 సంవత్సరాలు కూడా హైదరాబాద్ యువత అద్భుతమైన సేవా కార్యక్రమాలలో తమను తాము అంకితం చేసుకున్నారు.

2000వ సంవత్సరంలో హైదరాబాద్ యూత్ సుమారు నెల రోజుల పాటుగా ప్రశాంతి నిలయంలో సేవలు చేస్తే, ఆ నాడు స్వామి వారు ఇచ్చిన దర్శన స్పర్శన సంభాషణ పాద నమస్కార ప్రసాద సందేశ భాగ్యములు జీవిత కాలపు ప్రభావాన్ని మా మీద చూపించాయి.

ప్రతి సంవత్సరం గ్రామ సేవలు చేసుకుంటూ స్వామిని దర్శించడం అనవాయితీగా మారి పోయింది. ఏదో ఒకరు సేవించడం కాదు... వందలాది మంది సాయి సేవా స్ఫూర్తిని ప్రతి హృదయంలో సాయి జ్యోతిలా వెలిగించి మండే కాగడలుగా మారిన వైనం ఎవరికైనా ఆశ్చర్యం కలిగించక మానదు.

2002వ సంవత్సరంలో సంకల్పించిన శ్రీ సత్య సాయి గ్రామ సేవా మహా యజ్ఞం సత్య సాయి సేవా సంస్థల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే చారిత్రాత్మక ఘట్టం అని చెప్పాలి.

2003వ సంవత్సరంలో స్వామి వారే స్వయంగా ప "శ్రీ సత్య సాయి గ్రామ సేవ ట్రస్ట్"కు అంకురార్పణ గావించడం మా జీవితాలకు స్వామి ప్రసాదించిన దివ్యానుభవం

2004వ సంవత్సరంలో శ్రీ సత్యసాయి గురుకుల సేవా యజ్ఞం ద్వారా యావదా ఆంధ్ర దేశంలో 108 ప్రభుత్వ పాఠశాలల మీద పని చేసే అదృష్టం కలిగింది.

2005వ సంవత్సరంలో స్వామి వారి 80వ పుట్టు పండుగ మహోత్సవము చాలా అద్భుతమైన స్థాయిలో జరిగింది. ప్రతి సవతరం కనీసం 6 పర్యాయాలు ఏదో ఒక కారణం చేత వందలాది మందిమి స్వామి సన్నిధిలో వాలి పోయాము. ఉంటే ప్రశాంతి నిలయంలో స్వామి దగ్గర ఉండాలి.

లేదంటే రాష్ట్రంలో ఏదో ఒక చోట సేవా కార్యంలో ఉండాలి. ఇక వేరే జీవితమే లేనట్లు బ్రతికాము.

మిత్రులారా! 2005 నుండి 2010 మధ్యలో ఐదేళ్ల పాటు మేము ఆంధ్రదేశంలో చాలా సేవలు చేసుకున్నాం. స్వామి వారు భౌతికంగా బలహీనమై పోయారు. వారి దివ్య శక్తిలో ఎలాంటి మార్పు లేదు.

వారిని చూసిన ప్రతి క్షణం మా ధ్యాస అంతా స్వామి చెప్పింది చేయాలి అన్నదే. స్వామి ఆశ మా ఆశయము కావాలి. స్వామి నిర్దేశము మా ఆదర్శం కావాలి. స్వామి ఒక్క మాట చెప్తే చాలు దాన్ని మంత్రంగా చేసి సేవా మార్గానికి అనుసంధానం చేసుకునే వాళ్లం.

ఆ పాటికే స్వామి చక్రాల కుర్చీలో రావడం చూశాము. స్వామికి ఆసరా కోసం ప్రశాంతి నిలయంలో ఇత్తడి రైలింగ్ ఏర్పాటు చేయడం చూశాము. స్వామి స్పోర్టి కార్‌లో కూర్చుని దర్శనం ఇచ్చే ఆ సమయం మేము చూశాము.

స్వామి వారి 80వ పుట్టు పండుగ అప్పుడు స్వామి ముందు కూర్చుంటే, వెనక డ్రైవర్ కూర్చుని నడిపే బ్యాటరీ కారును మొట్ట మొదటిసారి చూశాము. చాలా బాధ అయ్యేది దర్శనంలో వారిని చూస్తుంటే. నిశ్శబ్దంగా వారి భౌతిక స్థితిలో వస్తున్న మార్పులు చూస్తూ... ఎవరికి వారు ఆత్మ శోధనలో పడి పోయే వాళ్లము. కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతుంటే, ఎలా వారితో మాట్లాడాలి... వారిని ఎలా సంతోష పెట్టాలి అని మదన పడే వాళ్లము. ముందులా స్వామి వారి దర్శన స్పర్శన సంభాషణ పాద నమస్కారం ప్రసాద సందేశ భాగ్యాలు కనుమరుగు అయ్యాయి.

స్వామి వారు 96 ఏళ్లు ఉంటానని చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ ఎవరికి వాళ్లు సంతృప్తిగా స్వామి ఉంటారు అనుకోవడం నేను చూసాను.

స్వామి వారి 82 పుట్టు పండుగ (2008), సందర్భంగా, సాయి సంస్థల పెద్ద వాళ్లందరూ స్వామి భౌతిక దేహములో కనిపించే మార్పులు దృష్టిలో ఉంచుకొని, చాలా అద్భుతమైన రీతిలో "సహస్ర పూర్ణ చంద్రోదయ" కార్యక్రమాన్ని విద్యాగిరి మైదానంలో ఏర్పాటు చేశారు. సుమారు ఒక వారం పాటుగా జరిగిన అద్భుతమైన ఉత్సవాలలో పాల్గొనే అదృష్టం మాకు కలిగింది. స్వామి వారి దగ్గరికి నాలుగు దశాబ్దాల కాలంగా మేమందరం వెళుతున్నాం కానీ, 82వ పుట్టు పండుగ మాత్రం చాలా అంగ రంగ వైభవంగ జరిగింది.

స్వామి వారి 82వ పుట్టుపండుగ మహోత్సవానికి మహామహులు, పుణ్యాత్ములు, పీఠాధిపతులు, మఠాధిపతులు ఎందరో విచ్చేశారు. అప్పటిదాకా మాకున్న అభిప్రాయం ఏమిటంటే, ఆ స్వామీజీ వేరే, మన స్వామి వేరే. వాళ్లు మన స్వామి దగ్గరకు రారు అని మేము అనుకునేవాళ్లం. కానీ ఆ నాడు జరిగింది మాత్రం మా ఊహకే అందని విషయం. విద్యాగిరి శాంతివేదిక మీద... స్వామి మధ్యలో కూర్చుంటే, స్వామికి ఇరువైపులా కూడా మహా మహిమాన్వితులైన వంటి శ్రీశ్రీ శివకుమార స్వామీజీ (సిద్ధ గంగా మఠం) శ్రీ బాల గంగాధరనాథ స్వామీజీ (గవి మఠం) శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ (కంచి శ్రీమఠం) శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ (మైసూరు దత్త పీఠం), శ్రీ అమ్మ (శ్రీ పీఠం) శ్రీ విశ్వేశ తీర్థ స్వామీజీ (పెజావర్ మధ్వ పీఠం), శ్రీ శ్రీ రవి శంకర్ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) ఇలా ఎందరో మహానుభావులు ఆసీనులవడం మేము చూశాము. లక్షలాది మంది భక్తులతో విద్యాగిరి మైదానం క్రిక్కిరిసి పోయింది. స్వామిని బంగారు రథంలో తీసుకుని వచ్చారు. ఆ దివ్యమైన సహస్ర పూర్ణ చంద్రోదయ మహోత్సవంలో నేను పాల్గొనగలిగినందుకు ధన్యుడినయ్యాను. ఆ విశేషాలు చెప్తూ ఉంటే... నా తనువంతా పులకరించి పోతుంది. ఆ పాటికే

స్వామి కదలిక చాలా తక్కువై పోయింది, స్వామిని అలా మైదానంలోకి తీసుకుని రావడం చూసిన ప్రతి ఒక్కరు కన్నీరు కార్చినారు. కళ్ల ముందు దివ్య శక్తి కనిపించినా, దేహమును ఆధారంగా చేసుకుని వచ్చినందుకు వారు పడే శ్రమను చూసి అందరూ వివశులయ్యారు.

స్వామిని శాంతి వేదిక మీదకి తీసుకురావడం కూడా చాలా కష్టమయింది. స్వామి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి లిఫ్ట్ ద్వారా, శాంతి వేదిక మీదికి తీసుకొని వచ్చారు. భక్త జన సముద్రాన్ని చూసి, స్వామి ఎంతో భావోద్వేగానికి గురవడం చూశాము. ఎంతో కరుణతో అక్కడ గుమి కూడిన భక్తులను ఆశీర్వదించారు. శ్రీ సత్య సాయి సుజల శ్రవంతి పథకంలో భాగంగా, ఎంత మంది బాగుపడ్డారు, ఎన్ని జిల్లాల వాళ్లు బాగు పడ్డారు, ఎన్ని రాష్ట్రాల వాళ్లు బాగుపడ్డారు. ఆయా రాష్ట్రాల నుండి, ఆయా జిల్లాల నుండి స్వామి వారి యొక్క సమక్షంలో, పల్లెల వాళ్లందరూ కూడా, కల్లా కపటం లేని మాటలతో, మాయా మర్మము లేని సంభాషణలతో చాలా అమాయకంగా స్వామి వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉంటే, స్వామి కళ్లలో కన్నీటి బిందువులు మెరిసాయి,

ఇదంతా ప్రత్యక్షంగా గమనిస్తున్న నాకు అనిపించింది, స్వామి అలా ఆనందంగా ఉండాలి. దానికి మనందరం కారణాలుగా నిలవాలి. చచ్చే లోపుగా ఈ విధమైన స్వామి కార్యంలో మనల్ని మనం అంకితం చేసుకోవాలి అనే తీక్షణమైన సంకల్పం నాతో పాటు వేలాది మందికి కలిగింది.

2008వ సంవత్సరానికి మేము కోల్పోయింది ఏమిటి అని ఒకసారి చూసుకుంటే, స్వామితో మాట్లాడటం మిస్ అయిపోయాం. స్వామి నడుచుకుంటూ జనం మధ్యలో దర్శనం ఇవ్వడం కనుమరుగు అయింది. స్వామి ఇంటర్వ్యూలు ఇవ్వడం అరుదైన విషయం అయింది. చక్రాల కుర్చీలో, బలహీనమైన దేహముతో... దివ్యత్వముతో ప్రకాశించే స్వామిని చూసే వాళ్లము.

ఆ రోజుల్లో నాకు అనిపించింది, స్వామి దేహ భావన వీడి ఆత్మ భావన లోకి వెళ్లి పోతున్నారేమో అనిపించింది. తదనుగుణంగా స్వామి చాలా సార్లు తమ దివ్యోపన్యాసాలలో, వ్యక్తిగత సంభాషణల సమయంలో "దేహ భావన వీడి ఆత్మ భావనతో చరించండి. సేవయే పరమోత్కృష్టమైన సాధనగా మీరు తీసుకోండి. అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి." అని చెప్పిన ఎన్నో సందర్భాలు నన్ను దారి తప్పకుండా ఉండేలా చేసాయి. బలహీనంగా మారి పోయిన స్వామి వారిని చూసిన ప్రతి సారీ, చివరి దాకా మనం కూడా ఇలాగే సేవ చేయాలి స్వామిలాగా అనిపించేది.

నాకు బాగా గుర్తుంది, స్వామి ఎట్టి పరిస్థితిలో ఉన్నా సరే, తన భక్తుల కోసం, తాను సృష్టించిన సంస్థల కోసం ఎంతో తపించే వారు అని విన్నప్పుడు మా హృదయం అంతా కూడా కదిలి పోయేది. ఇలాంటి స్వామికి మేమేమి చేయగలం అని అనుకునే వాళ్లం. ఇక 2008 తరవాత స్వామి వారి ప్రత్యక్ష సాన్నిధ్యం మాకు తగ్గి పోయింది.

ఆ సమయంలో మాకు మూడు అద్భుతమైన ఆలోచనలు స్వామి కల్పించారు. ఆంధ్ర రాష్ట్రంలోని దివ్యాంగ యువత కోసం ప్రత్యేక పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చెయ్యాలని మొదటిది.

ఇక రెండో సంకల్పము, స్వామి కోసం శివము చాలా చిన్న ప్రాంగణం అయిపోతున్నది. స్వామి హైదరాబాద్‌కు రాకపోవడానికి కారణం శివంలో స్థలభావమే, 20-30 ఎకరాల భూమిని స్వామి కోసం మనం చూడాలి అనేది.

ఇక మూడో సంకల్పం, ఆనాటికే సత్యసాయి దీన జనోద్ధరణ పథకం ద్వారా హైదరాబాద్ లోని వివిధ కేంద్రాలలో మరియు రాష్ట్రంలోని వివిధ సంస్థల కేంద్రాలలో చిన్నారి పిల్లలని అక్కున చేర్చుకొని ప్రయోజకులు చేసే ఆ ప్రణాళికలో భాగంగా సుమారు 60 మంది పిల్లలు ఉండేవాళ్లు.

ఆ పిల్లలందరిని ఒక చోటికి తెచ్చి, అందరం చేరి వాళ్లని ప్రయోజకులు చేసే ఆలోచన చేద్దాము అన్నది మూడో సంకల్పం.

ఆంధ్ర రాష్ట్ర ట్రస్ట్ కన్వీనర్ A రంగారావు, హైదరాబాద్ జిల్లా సాయి సంస్థల అధ్యక్షులు H శ్రీనివాసులు, ఆంధ్ర రాష్ట్ర సాయి సంస్థల అధ్యక్షులు డాక్టర్ అంజనయ్య ఇలా వీరందరూ ఎంతో ఆదర్శమైన సహకారం అందించారు.

ఆ ప్రక్రియలోనే కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఉన్న JSS పాలిటెక్నిక్ కాలేజ్ గురించి తెలిసింది. ఆ కళాశాల ప్రత్యేకంగా దివ్యాంగ యువత కోసమై ఏర్పాటు చేయబడినది. మేము అంతా కూడా రెండు రోజులు వెళ్లి అక్కడ ఏం జరుగుతోంది? ఎలా నిర్మాణం చేశారు? ఏ విధంగా నిర్మాణం చేశారు? ఇది మనకు సాధ్యమేనా? అని సమాలోచనలు చేశాము.

తర్వాత రెండో సంకల్పము స్వామి వారి భక్తులకోసం స్థలం చూడాలని చెప్పేసి ఎన్ని చోట్ల తిరిగామో మాకు తెలియదు మినిమమ్ అంటే ఒక 10-15 స్థలాలని గుర్తించాము. అందులో ఏ విధమైన భూమి ఐతే స్వామి కార్యానికి బాగుంటుంది అని ఆలోచించి ఎంపిక చేసిన 3 స్థలాలను సిద్ధం చేసాము.

ఒక మంచి రోజు ప్రశాంతి నిలయంలో స్వామి మమ్మల్ని వ్యక్తిగతంగా పిలిచారు. ఎప్పుడూ లేని విధంగా ఉదయం పెద్దలను పిలిచారు, మధ్యాహ్న సమయంలో మమ్మల్ని పిలిచారు. పెద్దలతో మరియు మాతో విడిగా మాట్లాడటం మా లక్ష సాధనకు బ్రేక్ పడినట్లు అయింది. స్వామి చతురత ముందు మేము ఓడి పోయాము అనే చెప్పాలి.

మాతో స్వామి ప్రేమతో మాట్లాడుతూ, 'బంగారూ! గుర్తుపెట్టుకోండి మన స్థలం పట్టణానికి చాలా దూరంగా ఉంటే అమ్మాయిలు, అబ్బాయిలు, పిల్లలు ఎవరూ రాలేని పరిస్థితి ఏర్పడుతుంది! స్వామి కార్యం అంతా కూడా అందరికీ అందరికీ దగ్గరగా, ఆమోద యోగ్యంగా ఉండాలి. ఆ విధంగా మీరు స్థలం చూడండి, అని మార్గదర్శనం చేశారు.

స్వామి, మీరు హైదరాబాద్‌కు రావాలి స్వామి అని వేడుకుంటే, అయ్యో! బంగారు! ఇదిగో ఇప్పుడే వచ్చేస్తాను. కావాలంటే నన్ను తీసుకెళ్లిపోండి, నేను నిల్చోవాలంటే 3 అడుగుల స్థలం చాలు. కానీ భక్తులకు ఇబ్బంది అవుతుంది." అదే నేను ఆలోచిస్తున్నాను. వారి మాటల్తో మా ఆనందానికి హద్దే లేకుండా పోయింది.

మరో ప్రక్క హైదరాబాద్‌లో DD కాలనీ, సత్యసాయి విద్యా విహార్ ప్రాంగణంలో ట్రస్టు స్థలాన్ని గుర్తించి అక్కడ సత్యసాయి దీన జనోద్ధరణ పథక భవన నిర్మాణం చేయాలని మేమంతా తయారయ్యాము. కావలసిన వనరులంతా సిద్ధం చేసుకున్నాము. స్వామి హైదరాబాద్‌కు వచ్చే లోపుగా నిర్మాణం పూర్తి చెయ్యాలి. అందుకు భూమి పూజ చేసి శంకుస్థాపన జరగాలి అని స్వామికి తెలుపుకుని ఏర్పాట్లు కూడా చేస్తున్నాం. అప్పుడు స్వామి నుండి ఒక సందేశం అందుకున్నాం. సరైన పూర్వప్రణాళిక లేకుండా ముందుకు అడుగు వేయకండి.' అంతే అది అలా నిలిచిపోయింది.

అలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్ భక్తులు అందరం స్వామి దగ్గరికి వెళ్లి ప్రార్థన చేయాలి అని చెప్పి పర్తి యాత్ర చేపట్టాము. మేమందరం బయలుదేరి స్వామి సన్నిధికి వెళ్లడము జరిగింది. అందరం కుల్వంత్ హాల్‌లో కూర్చున్నాం. స్వామి వీల్ చైర్‌లో వచ్చి మమ్మల్ని చూసి, "అక్కడ ఎందుకు కూర్చున్నారు? ఇక్కడకు రండి, అని స్వామి సింహాసనానికి అటువైపు ఇటువైపు మమ్మల్ని కూర్చో బెట్టినారు. ఈ సంఘటన యావద్ భాగ్యనగర భక్తుల హృదయాలను ప్రేమతో నింపివేసింది.

స్వామి సన్నిధిలో సంగీత రసామృతాన్ని మేము సమర్పించాము. స్వామి సంగీత బృందానికి ఎంతో దయతో నూతన వస్త్రాలు ఇవ్వడము జరిగింది.

స్వామి చాలా బలహీనంగా ఉండి, చేతులు కూడా కదిలించే పరిస్థితిలో లేరు, ప్రక్కవాళ్లు వస్త్రాలను స్వామి చేతికి అలా ముట్టించి మాకు ఇస్తున్నారు. ఆ సందర్భంలో నాకు స్వామి ఒక అద్భుతమైన జ్ఞాపకం ప్రసాదించారు.

స్వామి చెయ్యిని త్రాకిస్తూ నా చేతికి వస్త్రాలు ఇస్తున్న సమయంలో నేను స్వామికి దగ్గరగా ముందుకు ఒంగి "స్వామి మీరు ఇక్కడ కూర్చొని చెప్పండి, మీరు ఏం చెప్తే అది మేమంతా చేసుకొని వస్తాము" అని చెప్పాను. అంతే స్వామి తన ఎడమ చేతిని పైకెత్తి ఆశీర్వాదం చేశారు.

సంగీత విభావరి తరవాత, స్వామి మా అందరితో గ్రూప్ ఫోటో తీసుకోవాలని సూచించారు. వారి అనుయాయులు స్వామిని నిదానంగా చక్రాల కుర్చీ నుండి లేపి, స్వామి చంకల్లో చేతులు వేసి మేము కూర్చున్న ప్రదేశానికి తీసుకుని వచ్చారు. అలా వస్తున్న స్వామిని చూసి మేమంతా వెక్కి వెక్కి ఏడ్చాము. స్వామి ఎంతో దయతో మాతో ఫోటోలు తీసుకున్నారు.

అప్పుడు నేను స్వామిని "స్వామి హైదరాబాద్‌కు రండి. మీ రాక కోసం భాగ్యనగరం ఎదురు చూస్తోంది" అని అన్నాను. 18 ఏళ్లు అయింది స్వామి తమరు వచ్చి... అంటే, అవునా 18 ఏళ్లు అయిందా అంటూ స్వామి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ సమయంలో స్వామి శేష జలాన్ని రుచి చూసే భాగ్యం నాకు కలిగింది.

ఆ రోజు మేము రాత్రి 7 గంటలకు సత్యసాయి ప్రశాంతి నిలయం రైలులో తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంది. దర్శన సమయంలో మేము చేసిన సంస్కృతిక కార్యక్రమాల వల్ల ఆలస్యం అయిపోయింది. మిగతా వాళ్లు ముందే వెళ్లి పోయారు. కానీ మేము 200 మందిమి స్టేషన్‌కు చేరుకోలేక పోయాము. రైలు వెళ్లి పోయి ఉంటుంది అనే అనుకున్నాం. అందరం హడావుడిగా... పెట్టే బేడా నెత్తినేసుకుని పరిగెత్తి స్టేషన్‌కు చేరుకున్నాం.

ఆ రోజు ట్రైన్ స్టేషన్‌కి చేరవలసిన టైమ్‌కి రైలు రానే లేదు. ఆలస్యంగా వచ్చింది. మా ఆశ్చర్యానికి అంతే లేదు. తర్వాత తెలిసింది ఏంటంటే, స్వామి, మందిరంలో చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు: "వీళ్లు ఎప్పుడు బయలుదేరుతున్నారు?" అని.

ఇప్పుడే స్వామి అని అంటే.. స్వామి 7:55 గంటలకు అని విన్నాక, "అయ్యో మరి వీళ్లకి లేట్ అయిపోతుందే పాపం. అందరూ ట్రైన్ మిస్ ఐపోతారు. రైల్వే అధికారులకు చెప్పండి, ట్రైన్ కొంచెం ఆలస్యంగా స్టేషన్‌కు రావాలి అని. స్టేషన్ దాకా వస్తే, అందరూ కూడా హడావిడి పడిపోతారు. స్టేషన్‌కి రాక ముందే ఎక్కడైనా ఆపమని చెప్పండి" అని. ఇదంతా విన్నప్పుడు స్వామి యొక్క ప్రేమకి ఆ ఏమైనా హద్దు ఉందా? అని అనిపిస్తుంది.

ఆ మరుసటి రోజు, స్వామి మళ్లీ మేమంతా హైదరాబాద్‌కు క్షేమంగా చేరుకున్నామా లేదా అని వాకబు చేశారట.

2009లో అప్పటికే ప్రశాంతి నిలయంలో ప్రేమ జ్యోతి ప్రదర్శన చేయడము, తరువాత ముంబయి, చెన్నై పట్టణాలలో ఏర్పాటు చేశారు. ఆ పరిస్థితుల్లో స్వామికి మేమంతా కూడా విన్నవించుకున్నాం. స్వామి హైదరాబాదులో ఈ ప్రేమజ్యోతి ప్రదర్శనం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి అని చెప్పుకోవడము, స్వామి దానికి దివ్యమైన అనుమతిని ఇవ్వడం జరిగింది.

అలా సుమారు రెండు నెలల పాటు ప్రేమ జ్యోతి ప్రదర్శన గురించి మేమంతా పని చేసాము.

చివరికి ఖైరతాబాద్ కూడలి వద్ద ఉన్న Institute of Engineers ప్రాంగణంలో ప్రేమ జ్యోతి ప్రదర్శన ఏర్పాటు చేశాము. నాటి ముఖ్య మంత్రి YS రాజ శేఖర్ రెడ్డి ప్రారంభం చేశారు. ప్రతి పక్ష నేత చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు, IAS & IPS అధికారులు అందరూ కూడా ఈ ప్రదర్శనకి వచ్చారు. తెలంగాణ సాయి సంస్థల సభ్యులందరూ కూడా భాగ్యనగర భక్తులు మరియు యువత చేరి పని చేశారు. చాలా విజయవంతంగా ముగిసింది. స్వామి మన్ననలు కూడా అందుకుంది.

2010 సమయానికి, హైదరాబాద్ యువత అంటే ఉదయ్, గోపి మొదటి తరం, YC, రాజా, రింగు రాజు నేను రెండో తరం, రమణా రెడ్డి బృందం మూడో తరం, వేణు, రవి కిరణ్, రామచంద్ర ఇలాంటి వాళ్లందరూ కూడా నాలుగో తరంగా, రాయుడు బృందం ఐదో తరంగా సేవలు అప్రతిహతంగా జరిగాయి. ఈ ఐదు తరాల వారితో పని చేసే భాగ్యము నాకు కలిగింది.

ఆ సమయంలో విద్యార్థులతో మాట్లాడినప్పుడు స్వామి సందేశాలను కళాశాల విద్యార్థులకు ఎందుకు అందించకూడదు అని, ఎంతో అమాయకంగా కళాశాలలకు వెళ్లడం మొదలుపెట్టాము. అలా College to Corporate అనే ప్రణాళికను రూపొందించాము.

దాని ద్వారా 10 నుండి 20 మంది సభ్యుల బృందాలను తయారు చేసి, పెద్ద పెద్ద కళాశాలలకు వెళ్లి, మానవతా విలువల గురించి వివరించి వారిలో ఉద్యోగాలకి అవసరమయ్యే సామర్థ్యం పెంచాము. ఈ కార్యక్రమాల చిత్రాలు మరియు విశేషాలు స్వామి వారికి సమర్పించినప్పుడు, "బంగారు ఈ రోజు కాలేజీలలో ఈ విషయాలు ఎవరు చెప్పటం లేదు. ఇంకా చేయండి, ఇంకా పెద్ద ఎత్తున చేయండి, అన్ని కాలేజీలకు వెళ్లండి, ఆ పిల్లలందరిని నా దగ్గరికి తీసుకురండి," అని దర్శన సమయంలో, కార్‌లో వస్తూ చెప్పడము జరిగింది.

దానినే దివ్యాజ్ఞగా తీసుకొని హైదరాబాద్ యువత అంతా కూడా College to Corporate కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా చేశారు. తర్వాత ముగింపు కార్యక్రమాన్ని సుమారు 2000 మంది యువతీ యువకులతో మొదటిసారి హైదరాబాద్ నడిబొడ్డున ఉండే రవీంద్ర భారతిలో చేశాము. ఆ కార్యక్రమంలో నేను కూడా పాల్గొన గలిగాను. చాలా అద్భుతంగా జరిగింది. అదే సమయంలో స్వామి అంతరంగికుడు సత్యజిత్, 'అయ్యా మీరు పంపిన మెయిలు, వీడియోలు అన్నీ స్వామి చూశారు. చాలా సంతోష పడ్డారు' అని సందేశం పంపించారు. ఆ సభలో ఉన్న పిల్లలందరూ ఉద్వేగ భరితమైపోయారు, హైదరాబాద్ యువత ఉత్సాహానికి హద్దే లేకుండా పోయింది ఆరోజు.

2010 జనవరి అనుకుంటాను ఐదు తరాల అన్న తమ్ముళ్లు అందరూ కూడా చేరి సుమారు 1300 మంది నవ యువకులని తీసుకొని "University to Universality (విశ్వవిద్యాలయం నుండి విశ్వ మానవత వైపు) అనే కార్యక్రమం ద్వారా, స్వామి సన్నిధికి చేరుకున్నాము.

స్వామి పూర్ణచంద్ర ఆడిటోరియంలో అందరిని కూర్చోబెట్టారు. స్వామి స్వయంగా మా మధ్యలో కూర్చుని, రవికిరణ్, సాయి గొల్లపూడి సోదరులకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. స్వామి అవ్యాజ ప్రేమని ఆ రోజు మేము అనుభవించాము. ఇది హైదరాబాద్ యువత చేపట్టిన సేవా కార్యక్రమాలకు కలికి తురాయిగా నిలిచిపోయింది. సోదరుడు రవి కిరణ్‌కు ఆ నాడు స్వామి ఇచ్చిన అనుగ్రహం అంతా ఇంతా కాదు.

ఈ దశాబ్ద కాలంలో స్వామి చూసినా చూడకపోయినా, స్వామి పిలిచినా పిలవక పోయినా, స్వామి మాట్లాడిన మాట్లాడక పోయినా, స్వామి దర్శనం ఇచ్చినా ఇవ్వక పోయినా, స్వామి కదిలినా

కదలక పోయినా, స్వామి వచ్చినా రాకున్నా యావత్ హైదరాబాద్ యువజనులందరికీ కూడా ఒకే ఒక్క పరమ మంత్రంగా గోచరించింది. అదేమిటంటే సేవయే! స్వామిని చేరడానికి సేవయే సర్వోత్కృష్టమైన, సర్వోత్తమ మార్గము."

ఎల్లప్పుడూ సాగిందే తప్ప ఇక ఎక్కడ ఆగింది లేదు. అలుపెరగని, అలసత్వము లేని, ఆలస్యము లేని అవశ్యమైన ప్రయాణము లాగా సాగి పోయింది హైదరాబాద్ పిల్లల సేవా ప్రస్థానం.

ఈ విశేషాలు చెప్పుకుంటూ ఉంటే, స్వామి మమ్మల్ని ఎలా మలచుకున్నది అవగతమవుతుంది. నిదానంగా, స్వామి వారి సామీప్యం సామాన్యులమైన మాకు అరుదుగా లభించినా సరే, వారి దివ్యసాన్నిధ్యాన్ని మేము ఆస్వాదించగలిగాము.

హైదరాబాద్ యువతతో స్వామి గడిపిన క్షణాలను హృదయంలో భద్రం చేసుకుని సేవ చేయాలన్న తపనకు ఎలాంటి లోటు రాకుండా సదా ప్రవహించే గంగాప్రవాహం లాగా ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో, స్వామి కోసం పని చేసుకున్నాం చేస్తూనే ఉన్నాం జీవితంలో.



99

స్వామిని లోనే ప్రతిష్టించాల్సిన తరుణం

మిత్రులారా! 2010వ సంవత్సరం ఎన్నో జ్ఞాపకాలు ఇచ్చింది. ఆ సమయంలో స్వామి కదలలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ కూడా ప్రతి రోజు ఏదో ఒక సమయంలో దర్శనానికి వచ్చి భక్తులకు ఆనందం పంచే వారు. రాను రాను స్వామి దర్శనము దుర్లభం అయింది. స్వామి ఒక వేళ వచ్చినా చాలా సూక్ష్మంగా నిదానంగా రావడంతో చిన్న పిల్లాడిలా కనిపించే వారు. వారిని చూసి తరించాలనే తపనతో రోజు రోజుకి తండోప తండాలుగా జనాలు వస్తున్నారు. స్వామిని చూస్తే చాలు, స్వామి వారు లైన్స్‌లో రానక్కరలేదు... అక్కడ వేదిక మీద కూర్చుంటే చాలు చూసి వెళ్తాం అనుకుంటూ వచ్చేవాళ్లు.

ఆ సమయంలో నేను స్వామిని ఎప్పుడు చూసినా ఏడ్చే వాడిని, "స్వామి ఎందుకు ఇంత కష్ట పడుతున్నారు? ఇంత కష్ట పడటం అవసరమా? ఇన్నేళ్లు దర్శనం ఇచ్చారు, ఇన్నేళ్లు మాట్లాడారు, అది చాలదా? మమ్మల్ని మేము మార్చుకోవడానికి, తీర్చుకోవడానికి, కూర్చుకోవడానికి, నేర్చుకోవడానికి, సంస్కరించుకోవడానికి!" అని చాలా బాధ పడేవాడిని. స్వామి శారీరక శ్రమను అనుభవిస్తున్నది చూస్తూ, అయ్యో! స్వామి ఎంతగా బాధపడుతున్నారో అని తల్లడిల్లే వాడిని. ఇక్కడ, స్వామిని నేను ఒక దేవుడిగా కంటే కూడా వారిని నా తాతయ్యలా, తండ్రిలా, ఆత్మీయుడిలా చూడటం వలన వచ్చిన భావనలు.

స్వామి సంతోషంగా ఉండాలంటే, కాళ్లు చేతులు బాగుండే నాలాంటి వాళ్లము స్వామి చేతలు అవ్వాలి అనిపించేది. సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్ర పాత్ అన్నట్టుగా... స్వామి కళ్లు మేము అవ్వాలి, స్వామి చేతులు మేము అవ్వాలి, స్వామి కాళ్లు మేము అవ్వాలి, స్వామి చేస్తున్న సేవలన్నీ కూడా మేము చేయడం మొదలు పెట్టాలి అన్న ఆర్తి కలిగేది.

ఇట్టి ఆర్తితో సాయి సంస్థలో జరుగుతున్న కార్యక్రమాలలో అంతో కొంతో ఇంతో పాల్గొంటూ కూడా, మరో ప్రక్క అభయ ఫౌండేషన్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను మరింత విస్తృతం

చేయడం ప్రారంభించాను. ఈ ప్రక్రియలో వందల వేల మందికి ప్రేరణనందించ గలిగాను. అలా 2006లో అభయ సంస్థను ప్రారంభం చేసుకుంటే, 2011కి అయిదేళ్లు అయింది. అభయ సంస్థ ధర్మాధికారులకు, సభ్యులందరికీ కూడా స్వామి గురించి చెప్ప గలిగాను. చిన్నప్పటి నుంచి నన్ను చూసిన వాళ్లు కూడా స్వామి గురించి తెలుసుకోలేదు. నేను కొంత సమయం తీసుకుని, స్వామి లక్ష్యాలను, సేవా దృక్పథాన్ని అభయ ఫౌండేషన్ లోని ప్రతి సభ్యునికీ చేరేలా వ్యాప్తి చేశాను. సుమారు 60 మందిని ఎన్నిక చేసి, చాలా ఆత్మీయంగా ఉన్న వాళ్లందరికి కూడా స్వామిని చూపించాలి అని ప్రశాంతి యాత్రను సంకల్పం చేశాను.

2011 ఉగాది సందర్భంలో స్వామి దర్శనం కోసమై, స్వామికి ఫాక్స్ మెసేజ్, లెటర్ వ్రాసి, నిలయంలో విడిది కోసమై ఏర్పాట్లు చేయించాను. రెండు బస్సుల్లో పౌర సేవకులు, ప్రభుత్వ అధికారులు, వృత్తి నిపుణులు, అభయ నిర్వహకులు నాతో పాటు తీసుకుని వెళ్లాను. వాళ్లందరికీ కూడా స్వామిని చూపించాలని నా తాపత్రయం.

మార్చి మాసంలో నా ఆత్మీయుల జీవితాలలో మార్పు కోసం చేసిన ఈ ప్రయాణము ప్రశాంతి నిలయంలో ముగిసింది కానీ, స్వామిని చూసే భాగ్యం మాకు కలగలేదు. అంతకు ముందు రోజే, స్వామిని ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అప్పటికే స్వామి చాలా బలహీనంగా ఉన్నారు. స్వామి అనారోగ్య వార్తలు చాలా భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉన్నాయి. స్వామి ఆరోగ్యము క్షీణించింది అంటూ చాలా మంది వివిధ రకాలుగా చెప్పుకోవడం విన్నాను.

అయినా సరే, గుండెలో బాధను దిగమింగుతూ నాతో వచ్చిన వాళ్లందరికీ కూడా ప్రశాంతి నిలయమును చూపించాను. స్వామి వారి కార్యము ఎలా జరుగుతోందో గమనించేలా చేశాను. వాళ్లంతా కూడా ఉద్వేగ భరితులయ్యారు. అయ్యో! ఇలాంటి మహనీయున్ని, ఇలాంటి బాబాని మేము చూసే భాగ్యం ఇప్పటిదాకా కలుగ లేదే అనుకుంటూ ఒక రోజు వేచి చూస్తామని, మూడు రోజుల పాటు ప్రశాంతి నిలయంలో ఉండి పోయారు.

ఆ సమయంలో వారిని ఏదో విధంగా స్వామిని పరిచయం చేయాలి అని ప్లానెటోరియం, మ్యూజియం, సత్య సాయి సంస్కృతి, పాత మందిరము, సత్యమ్మ గుడి, వేణు గోపాలస్వామి మందిరం, కల్ప వృక్షము, ధ్యాన వృక్షము, కదిరి నరసింహ స్వామి, తిమ్మమ్మ మర్రిమాను, లేపాక్షి ఇలాంటి దర్శనీయ క్షేత్రాలన్నీ కూడా చూపించాను.

ఉదయం అందరం స్వామి దర్శనానికి వెళ్లడం, స్వామి దర్శనానికి వస్తారేమో అని ఆశగా ఎదురు చూడడము జరిగేది. నిలయంలో కూర్చున్న సమయంలో స్వామి గురించి వాళ్లు తెలుసుకుంటూ ఎంతో ఆశ్చర్యానికి గురి అవుతుండే వారు. మొత్తానికి వారి పర్తి యాత్ర స్వామితో తెలియని బంధం ఏర్పరిచింది. స్వామిని కళ్లతో చూడలేక పోయినా అక్కడి అణువణువులోనా, హృదయంలో చూసేసారు.

ఇలా మూడు రోజుల ప్రశాంతి నిలయంలో ఉండి మళ్లీ తిరిగి అందరం హైదరాబాద్ వచ్చేసాము. నిజానికి ఈ పరిస్థితి అంతా నన్ను విచలితుని చేసింది, అయ్యో స్వామిని చూడలేక పోయామే... అని.

తర్వాత తెలిసింది, చివరి దర్శనము ఇచ్చిన రోజున, స్వామి సాయి కుల్వంత్ ప్రాంగణంలో వేదిక మీద నుండి నాలుగు దిక్కుల వైపు తిరిగి నమస్కారము చేసారని. అలా గతంలో ఎప్పుడూ జరగలేదు అని అనుకున్నారట. స్వామి ఎప్పుడూ చేతులు ఊపుతూ ఆశీర్వదించేవారు, 'అభయ

హస్తం'తో దీవించేవారు. కానీ ఇలా చేతులు జోడించి నమస్కరించడం మేమెప్పుడూ వినలేదు... చూడలేదు కూడా. అదే స్వామి చివరి సారిగా భక్తులకు వీడ్కోలు పలికిన రోజు అని తెలిసింది. ఆ రోజు తర్వాత స్వామి ఆస్పత్రికి వెళ్లారు. దాదాపు ఏప్రిల్ నెల అంతా స్వామి ఆసుపత్రిలోనే ఉండి పోయారు. అయినా నిలయంలో జరగాల్సిన కార్యక్రమాలు అన్ని యధావిధిగా జరుగుతున్నాయి.

ఏప్రిల్ 24వ తేదీ రోజు స్వామి వారు భౌతిక దేహాన్ని విడిచి భక్త జనుల హృదయాల్లో శాశ్వతంగా నిలచిపోయారని తెలిసింది. 86 ఏళ్ల వయసులో భౌతికంగా కళ్ల ముందు నుండి కదలి వెళ్లి లక్షలాది మంది గుండెల్లో సజీవముగా నిలిచారు. మనలను వారి ఆధ్యాత్మ సామ్రాజ్యానికి వారసులుగా చేసి వెళ్లారు.

స్వామి 96 సంవత్సరాలు జీవిస్తానని పలుమార్లు చెప్పారు. కానీ అదే స్వామి వారు 'బంగారు, నేను 96 అంటే 96 ఉంటాను, 100 అంటే 100 ఉంటాను. కానీ నేను ముందుగానే వెళ్లాలనుకుంటే వెళ్లిపోతాను' అని కూడా పలుమార్లు అన్నారు.

నా నమ్మకం ఏమిటి అంటే, స్వామి తన దేహాన్ని త్యజించాలని... తన జీవితాన్ని, జీవిత కార్యాన్ని, ప్రేమను, కరుణను లక్షలాది భక్తుల హృదయాల్లోకి నింపాలని నిర్ణయించుకున్నారు. మన జీవితాలను తమ సందేశముగా తీసుకెళ్లే ఆత్మబలాన్ని అందరికీ ఇచ్చి వెళ్లిపోయారు.

స్వామి లేరు అన్నది నేను అంగీకరించను. స్వామి లేరని కాదు... స్వామి లేని చోటు లేదని మనం విశ్వసించాలి. మన కళ్ల ముందర మనిషి కదులుతూ ప్రక్క గదిలోకి వెళితే, మనం ఆ మనిషి ఉన్నాడు అని అంటామా? లేదంటామా? చెప్పండి. అలాగే స్వామి ఈ భూ గ్రహము నుండి మరొక గ్రహానికి వెళ్లారు అంతే! మనం ఉన్నంత కాలం ఆయన జీవితం, ప్రేమ మరియు సందేశం మనలోనే నిలచినప్పుడు వారు వున్నట్లే!

స్వామి నాతో ఉన్నారు, నాలో ఉన్నారు, నా ప్రక్కన ఉన్నారు, నా ఇంట వెంట జంట కంటగా ఉన్నారు, నా తోడు నీడగా ఉన్నారు, అని నేను దృఢంగా విశ్వసిస్తాను. ఆ విశ్వాసంతోనే నా జీవితాన్ని ముందుకు తీసుకెళ్తున్నాను.

2011, మార్చి & ఏప్రిల్ నెలలలో సమయం దొరికితే చాలు, ప్రశాంతి నిలయానికి వెళ్లడం, నిశ్శబ్దంగా ఆ నిలయంలో కూర్చుని ప్రార్థించే వాళ్లం అందరం. స్వామి ఆస్పత్రిలోనే ఉండి పోయారు. ఏప్రిల్ 22 మరియు 23 అక్కడే ఉండి కొద్ది మంది హైదరాబాద్ యూత్ తిరుగు ప్రయాణం అయ్యాము.

ఏప్రిల్ 24 నాడు, స్వామి వారి మహాభినిష్క్రమణ వార్త విని, హైదరాబాద్‌కు వెళ్లే దారిలో ఉన్న మేము తిరిగి ప్రశాంతి నిలయానికి చేరిపోయాము. స్వామి భౌతిక కాయాన్ని తీసుకుని వచ్చిన వాహనానికి ఎదురు వెళ్లిన వందల మందిలో హైదరాబాద్ పిల్లలు కొద్ది మంది ఉండటం యాదృచ్ఛికం కాదు. ఆ సమయంలో నేను కూడా అక్కడ ఉండటం అంటే తండ్రి కోసం వచ్చిన కొడుకు లాగే అనిపించింది.

ప్రశాంతి నిలయంలో సాయి కుల్వంత్ సభా మండపంలో స్వామి వారిని చేర్చి, స్వామి చుట్టూరా కూర్చున్నాము. స్వామి తల దగ్గరగా కూర్చునే అవకాశం నాకు కలిగింది. నా కళ్లలో కన్నీరు లేదు, కేవలం ఒక ఆత్మ భావన మాత్రమే ఉంది. స్వామి తత్వాన్ని అనుసరించి మనం జీవించాలి. ఆయన ఆదర్శాలను ఆచరించే ఆత్మ విశ్వాసంతో నిలబడాలి, స్వామి చెప్పిన మార్గంలో చివరి క్షణము దాకా ఉండాలి అనుకుంటూ కూర్చున్నాను.

స్వామిని అలా చూస్తూ ఉంటే, అది బాధ అనాలా, ప్రేమ అనాలా తెలియదు. స్వామిని అలా చూసేసరికి నేను ఆత్మైక భావనలో ఉన్నాను. స్వామి మహాభినిష్క్రమణము అలా జరిగిపోయింది. ఇక స్వామి మన ముందు కనిపించక్కర్లేదు, స్వామి కార్యము మనకు కనిపిస్తూ ఉండాలి. అదే మన అందరి కర్తవ్యం.

తల్లివీ నీవు తండ్రివీ నీవు
ఎదలో వెలసిన దైవము నీవు
బాబా... సాయిబాబా
ఆటాడినావు మాటడినావు
అందముగా మమ్మెంతో మందలించినావు
ఆదుకున్నావు చేరదీసినావు
ఆదుకొని చేదుకొని గట్టు నిలిపినావు
సేవాకాశమే మాకు ఇచ్చినావు
సాక్షాత్కారమే ప్రసాదించినావు
అన్యధా శరణం నాస్తి
త్వమేవ శరణం మమ
త్వమేవ శరణం మమ
బాబా... సాయి బాబా

స్వామి యొక్క దర్శన స్పర్శన సంభాషణ పాద నమస్కార ప్రసాద భాగ్యములు అందుకున్న ఏ వ్యక్తి అయినా పునీతమై ఉంటాడు అని నమ్ముతాను. సాయి భక్తుడు ప్రపంచంలో ఎక్కడున్నా సరే ఆధ్యాత్మ భావనతో సేవలో అంకితమయ్యే మార్గంలో పయనిస్తుంటాడని నమ్ముతాను.

స్వామి సంజీవనముగా మన జీవనములో నిలచి ఉంటాడు. స్వామి కార్యము ఏదైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ విధంగానైనా చేసే ప్రతి ఒక్కరిలో స్వామి నిలచి ఉంటారు అని నమ్ముతున్నాను. ఈ నమ్మకమే నన్ను ముందుకు నడిపిస్తుంది.

మిత్రులారా! నేను గట్టిగా నిర్ణయించుకున్నాను స్వామి తత్వాన్ని అనుసరించాలని, స్వామి ఆదర్శాలతో జీవించాలని, స్వామి కార్యంలో చివరి శ్వాస దాకా నిలబడాలని, అందరిని ప్రేమించి సేవించే రూపములో, ఎల్లప్పుడూ సహాయం చేయాలి, హాని చేయకూడదు అనే స్వామి సిద్ధాంతాలతో బ్రతకాలని నమ్మిన లక్షల మందిలో నేను ఒక్కడినై నిలిచాను.

పవిత్రమైన భావముతో స్వామిని నా హృదయములో ప్రతిష్టించుకొని సాయి ఆత్మ బంధువుగా (Sai SoulDear) జీవించాలని నిర్ణయించాను.



100

కైలాస నాథుడి అనుగ్రహ చిహ్నం అభయ ఆనంద నిలయం

స్వామి మహాభినిష్క్రమణం సమయంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ గ్రూప్ (NCC)లో ఉద్యగం చేసే వాడిని. అనేకమంది నిపుణులు, సహోద్యోగులు స్నేహితులు అయ్యారు. ప్రఖ్యాత పారిశ్రామిక వేత్తలు, ప్రతిభావంతులైన వ్యక్తులతో కలిసి పని చేసే అవకాశమూ లభించింది.

అదే సమయంలో అభయ ఫౌండేషన్ తన రెక్కలను విభిన్న రంగాలలో విస్తరించడం ప్రారంభించింది. ఆరోగ్య సమస్యలు వచ్చిన వారు సహాయం కోసం అభయను సంప్రదించే వారు. ఉన్నత చదువులలో సహాయం అవసరం ఉన్న విద్యార్థిని విద్యార్థులు, కేవలం ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా దక్షిణ భారత రాష్ట్రాల నుండి వచ్చే వాళ్లు. ఇక ఎప్పుడు వీలవుతే అప్పుడు సమాజ కార్యంలో, మానవతా విలువలని, హృదయ పూర్వకంగా తీసుకొని, ఎక్కడికి వెళితే అక్కడ అవగాహన సదస్సుల ద్వారా మంచి మాటలు చెప్పే అదృష్టం కలిగింది.

2007లో ఉన్నత చదువులకి ఆర్థిక సహాయం కోసమై సుష్మ అభయ సంస్థకి వచ్చింది. 2011లో Infosysలో ఉద్యోగం వచ్చింది. ఆ అమ్మాయి మైసూరుకి శిక్షణ కోసమై వెళ్తూ నా ఆశీర్వాదాలు తీసుకోవడం కోసమై ఇంటికి వచ్చింది. ఆ అమ్మాయిని అడిగాను, ఏంటమ్మా! ఏమి చెయ్యాలని అనుకుంటున్నావ్? అని అడిగితే, అన్నయ్య, నేను జీవితాన్ని నిలబెట్టుకుని, ఒక మంచి వ్యక్తిని వివాహం చేసుకుని, ఆ తర్వాత అభయకు చేయుతనిస్తాను" అని చెప్పింది.

అప్పుడు నేను "అమ్మా! ఇలాంటి పనులు ఎవరైనా చేస్తారు, కానీ నీ జీవితాన్ని నిలబెట్టిన అభయ కోసం నువ్వు ఏమి చేయగలవు?"

దానికి ఆమె కొంచెం సందిగ్ధంగా, "అన్నయ్య, నిజానికి నేను ఒక అనాథాశ్రమం స్థాపించాలని కల గంటున్నాను" అని చెప్పింది.

నేను తనకు సవాల్ విసిరాను, "నువు చెప్పింది నిజమైతే, రేపు సాయంత్రం రైలు ఎక్కే లోపు నువ్వు చేయాలని కలలు కన్న పని ఏమిటో నాకు వ్రాసి పంపించు" అని. వెంటనే నాలుగు స్లైడ్స్

తయారు చేసి పంపించింది.

అప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. మనకు కూడా ఒక స్థిరమైన వ్యవస్థ ఉండాలి. అవసరం ఉన్నప్పుడు సహాయం చేయడం మాత్రమే కాదు, ఒక స్థిరమైన కేంద్రాన్ని స్థాపిస్తే అక్కడ ఎంతోమంది అవసరంలో ఉన్న వారిని మనం ఆదరించి చూసుకోవచ్చు కదా అని. ఆమె అందించిన ప్రతిపాదన నాకు కేవలం ఒక ఆలోచనగా మాత్రమే కాకుండా, ఒక దిశగా, ఒక దివ్య సంకేతంగా అనిపించింది. అందుకే దాన్ని నేను ఎంతో పాజిటివ్‌గా స్వీకరించాను.

ఆ రోజు మాట్లాడుతున్న సందర్భంలో, దీనికి "అభయ ఆనంద నిలయము" అని పేరు పెట్టాలి అని నిర్ణయం చేశాము 2012వ సంవత్సరంలో ఎవరైనా తగినంత స్థలం ఇస్తే బాగుండు అనుకోవడం జరిగింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ని కలిస్తే వారు జిల్లా రెవెన్యూ ఆఫీసర్‌ని పరిచయం చేశారు. మాణిక్యాల రావు వారి పేరు. చాలా ఓపికగా సుమారు ఎనిమిది గంటల పాటు మాతో వారు ఒక ప్రక్క పని చేస్తూ కూర్చొని మరో ప్రక్క నేను చెప్పిందంతా వింటూ, 'మేము ఏం చేయగలమో చేస్తాము' అని చెప్పి ఒక రోజు ఫోన్ చేసి ఒక పెద్దాయన నెంబర్ ఇచ్చారు. ఆ పెద్దాయన పేరు గున్నా రాజేందర్ రెడ్డి, ఏపీ భూదాన్ బోర్డు చైర్మన్. వారు నిజంగా చాలా ఆనందంగా స్పందించారు, "అయ్యా, పద పోదాం, చూద్దాం" అని పలికారు. ఆ తర్వాత వారు నన్ను తమ కారులో కూర్చో బెట్టుకుని ఒక అడవి ప్రాంతము, ఇబ్రహీంపట్నంలో, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండల్లో ఉంది. ఆ స్థలం చూపించి ఇక్కడ 100 ఎకరాల స్థలం ఉన్నదయ్యా "వినోభా నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ, దీంట్లో నీకు ఎన్ని ఎకరాలు కావాలంటే అన్ని ఎకరాలు తీసుకో అని చెప్పారు" చాలా ఆశ్చర్యకరంగా ఏప్రిల్ 18 వతేదీన భూమి లీజు పత్రాలు తయారు చేసి రెండు ఎకరాల స్థలాన్ని అభయ సంస్థకి ఇచ్చేశారు. ఆ పత్రాలు తీసుకున్న వెంటనే, అభయ క్రియాశీల కార్యవర్గ సభ్యులందరికీ కూడా నేను ఒక మెసేజ్ పెట్టాను. ఇలాగా ఆ భూమి దస్తావేజు పత్రం ఫలానా వాళ్లు విరాళంగా ఇచ్చారు, ఈ పత్రాలను దేవుడి సన్నిధిలో సమర్పిస్తున్నాను." అని నేను మెసేజ్ పెట్టాను. మెసేజ్ పెట్టిన తర్వాత నేను కారులో వెళ్తూ ఆలోచించాను 'ఏమిటి! నేను ఇలా మెసేజ్ పెట్టాను కానీ ఆ డాక్యుమెంట్ నా దగ్గరే ఉంది కదా' అని. సరిగ్గా ఆ సమయంలోనే అకస్మాత్తుగా నేను వెళ్తున్న కారు ఆగిపోయింది. కరెక్ట్‌గా ట్రాఫిక్ మధ్యలో, శివం ప్రాంగణం ముందు ఆగిపోయింది రాత్రి 8:30 గంటల ప్రాంతంలో. మందిరం తలుపులు మూసి ఉన్నాయి.

ఇప్పుడే కదా మెసేజ్‌లో అనుకున్నాను ఆ భగవంతుడి దగ్గర అర్పణచేస్తున్నానని, ఇంతకంటే భగవంతుడు ఎవరున్నారు నాకు? అని చెప్పి కనీసం లోపల ఆ స్వామి మందిరము గడప మీద అయినా ఈ డాక్యుమెంట్ పెట్టేసి నమస్కారం చేసి వద్దాం అనుకుని లోపలికి వెళ్లి చెప్పులు విడుస్తుంటే అక్కడ ఒక సీనియర్ సేవాదళ్ నన్ను చూసి "అన్నా! సాయిరామ్!" మీరు ఏమిటి ఇప్పుడు వచ్చారు అంటే, నేను విషయం చెప్పాను. ఆయన చాలా ప్రేమగా స్వామి మందిరం తాళాలు తీసుకుని వచ్చి, తలుపులు తీసి నన్ను లోపలికి పంపించాడు. లోపల స్వామి సన్నిధిలో నేను తప్ప ఇంకెవరు లేరు. ఇక నా ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఏడవడం మొదలు పెట్టాను. స్వామి మీ గడప దగ్గర పెడదాం అనుకొని వస్తే... నన్ను మీ దగ్గరికి తీసుకొచ్చారే అని స్వామి పాదాల ముందర మోకరిల్లి స్వామి ఈ భూమి మీదే... అభయ ఆనంద నిలయం మీరే సిద్ధం చేసుకోవాలి, తద్వారా వందల మందికి ఆసరా చేయాలి స్వామి... అని స్వయంగా వారితో మాట్లాడాను. స్వామి సింహాసనం ముందు కూర్చొని ప్రార్థన చేసి పత్రాలు స్వామికి ఇచ్చినట్టుగా స్వామి సింహాసనం ముందు

సమర్పించాను. మిత్రులారా దీని గురించి నేను ఏమని చెప్పాలి చెప్పండి?

ఇది మొత్తం ప్రాజెక్ట్‌కు భగవంతుని అనుమతి లభించినట్లే అని. జనవరి మాసంలో అనుకుంటాను, మానససరోవర్ కైలాస యాత్ర చేయాలన్న సంకల్పం కలిగింది. కైలాస పర్వతాన్ని దర్శించుకోవాలని ఏర్పాటు చేసుకున్నాను. భూమి పత్రాలను తీసుకుని 'ఇది భగవత్ కార్యం కాబట్టి భగవంతునికి అంకితం చేయాలి' అని భావించి 2012 జూన్ నెలలో మానససరోవర్ యాత్రకు బయలుదేరాను.

సుమారు 12 రోజుల దుర్భరమైన ప్రయాణం తరవాత ఒక రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మానస సరోవర్ చేరుకున్నాను. నా తోటి అందరూ కూడా అలసిపోయారు. ఎవరికి వారు అలా వసతి గదులలో దుప్పట్ల క్రింద పడి పోయారు. కానీ నేను మాత్రం తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంతో ఆ ఇసుకలో పరుగులు తీస్తూ మానసరోవర్ దగ్గరికి వెళ్లిపోయాను. ఆనందంగా స్నానం చేసి, గాయత్రి మంత్రం చెప్పుకుంటూ స్వామిని తలుచుకుంటూ మూడు మునకలు వేస్తుంటే... నాతో వెనక వచ్చిన ఒక యాత్రికుడు 'స్వామి ఒక్క నిమిషం నేను కూడా చేస్తాను' అన్నాడు. సరే ఆయన కూడా వచ్చాడు నాతో పాటు, స్నానం చేస్తున్నాడు. బయటికి వస్తున్న సమయంలో అడిగాడు, స్వామి నాకు గణేశ ప్రార్థన చెప్పండి, సంకల్పం చేద్దాము అని అడిగాడు. అప్పటిదాకా నేను ఆలోచించనే లేదు. కానీ ఆయన చెప్పాడని అలవోకగా విశ్వ కళ్యాణ సంకల్పం అక్కడ చేశాను, "సర్వజన సంక్షేమార్థం, సర్వలోక సంక్షేమార్థం ప్రార్థనామ్ కరిష్యామి" అని చెప్తూ కైలాస పర్వతం దిక్కు చూస్తూ అర్ఘ్యం విడుస్తూ ఆ సరోవరం నుండి బయటికి వస్తున్నా. అయ్యా! ఇక్కడి స్థానిక టిబెటియన్స్ చెప్పారు కదా, చేయి నీళ్లలో పెట్టి సరస్సులో ఏం దొరుకుతే అది తీసుకొమ్మన్నారు. మనం కూడా చేతులు ముంచుదాము, ఏం వస్తుందో చూద్దామండి అన్నాడు. ఎందుకయ్యా బాబూ మనకి పోదాం పదా అంటే, దయచేసి చేద్దాము అని బలవంతపెట్టాడు. అలా నేను నా చెయ్యి లోపల పెట్టడం, ఆ గాయత్రి మంత్రం చెప్తున్న నా చేతికి మట్టి తీసుకున్నాను. ఆయన మట్టి తీసుకున్నాడు. నేను ఇలా అంటూ ఉంటే చేతిలో పంచముఖి రుద్రాక్ష కనిపించింది. చాలా విచిత్రం అనిపించింది. నా ఒళ్లంతా పులకరించి పోయింది. రుద్రాక్ష నా చేతిలో రావడం ఏమిటి అని! అంటే అది ఎవడు పడేసాడా? లేక నాకు వచ్చిందా? మట్టిలో ఉందా? అని నేను ఆలోచించ దల్చలేదు.

ఎందుకంటే రుద్రాక్ష అనేది సాక్షాత్తు శివుని ప్రతిరూపమే కదా! రుద్రుని యొక్క అంశము, 'రుద్రుని అక్షములు' అంటే ఆయన కళ్లు అని చెప్పబడింది. ఆ భావంతోనే నేను దానిని ఎంతో పదిలంగా పట్టుకున్నాను. నా తోడుగా వచ్చిన అతను అది చూసి కేరింతలు కొడుతూ ఆనందంలో మునిగిపోయాడు.

మా అక్కయ్య 'సరస్సు తీరం వద్ద ఏవైనా గులక రాళ్లు (Pebbles) దొరికితే తీసుకురా నాయనా, అందరికీ జ్ఞాపకంగా ఇవ్వొచ్చు' అని చెప్పారు. ఆ మాట గుర్తొచ్చింది. నేను గాయత్రీ మంత్రం జపిస్తూ, చలితో వణుకుతున్న స్వరంతో ఒక చేతిలో రుద్రాక్షను పట్టుకొని, మరో చేతిని ఇసుకలో పెట్టి 'స్వామి నామం చెబుతూ ఉండగా, అద్భుతం జరిగింది. నాకు కైలాస పర్వతాన్ని పోలిన ఒక శ్వేత వర్ణపు రాయి దొరికింది. అది నిజంగా శివుడి ప్రతిరూపంలా కనిపించింది. ఇక నా ఆనందానికి హద్దే లేదు. ఏం చెప్పుకోవాలో తెలియదు.

నా సంకల్పం ఏమిటి అంటే 'అభయ ఆనంద నిలయము అందరికీ ఆమోద యోగ్యంగా ఉండాలి, అందరికీ చేదోడు వాదోడుగా ఉండాలి, అందరికీ ఆదర్శంగా ఉండాలి" ఇది ఆ సంకల్పాన్ని

అక్కడ చెప్పడం, ఆ సంకల్పానికి ఆమోద యోగ్యం చేస్తున్నట్టుగా ఈ రెండు దివ్యమైన వస్తువులు నా చేతికి అందడం అనేటువంటిది యాదృచ్ఛికం కాదు, దివ్యాదేశము అని అనుకున్నాను. అలాగే ఆ పుణ్య జలాన్ని ఒక చిన్న డబ్బాలో తీసుకొని సుమారు 52 గంటల పాటు పరిక్రమ చేసి, నడుచుకుంటూ విశ్వ కళ్యాణ కార్యమునకై చేసిన యాత్రను ముగించుకొని, విమానాశ్రయము నుంచి సరాసరి ఇబ్రహీంపట్నం వెళ్లాను. ఆ భూమిలో తవ్వ లేని రాళ్లు, పేల్చలేని రాళ్లు ఉన్నాయి అని చెప్పి ఉన్నారు. జూన్ మాసంలో అక్కడ పెద్ద మిషన్లతో పని జరుగుతున్న సమయంలో, ఈ పుణ్య జలాన్ని ఆ భూమిలో ప్రోక్షణ చేశాను. 2012 ఆగస్టు శంకు స్థాపన సమయంలో, ఈ రెండు దివ్యమైన వస్తువులని శివాశీర్వచనముగా భావించి ఈశాన్యంలో భూగర్భంలో స్థాపితం చేసాము. తదాదిగా సుమారు రెండున్నర కోట్ల రూపాయలతో, తొమ్మిది నెలల్లో 2013 ఆగస్టు సమయంలో, ఈ భవన సముదాయాన్ని ప్రారంభించుకున్నాము.

ఈ ప్రక్రియలో, నాకు వందల మంది వృత్తి నిపుణులతో, మిత్రులతో, శ్రేయోభిలాషులతో సంబంధం ఏర్పరచుకొనే అవకాశం లభించింది. తెలంగాణలో నిర్వహించిన తొలి "సామాజిక సేవా బాధ్యత సమావేశం" (CSR Seminar) ఏర్పాటు చేసే అవకాశం కలిగింది. ఆ కార్యక్రమంలో నాటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 500 వృత్తి నిపుణులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుమారు పన్నెండు లక్షల రూపాయల వరకు ప్రాయోజిత ధనాన్ని సేకరించగలిగాము. ఈ సమావేశం తర్వాత కర్ణాటక మరియు తమిళనాడు రాష్ట్రాలలో కూడా ఏర్పాటు చేసాము. రెండవ సదస్సు బెంగళూరులో నిర్వహించబడింది. ఆ సందర్భంలో స్వామి దూత లాగా నాటి సాయి విశ్వ విద్యాలయం ప్రథమ కులపతి, పద్మ విభూషణ్ వేంకటాచలయ్య పాల్గొన్నారు. GMR, విప్రో CFO, ఆటో రాజా తదితరులు వచ్చి మాట్లాడారు. తరవాత సదస్సును తమిళనాడు చెన్నైలో నిర్వహించాము. ఆ కార్యక్రమంలో నాటి తమిళనాడు గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య, రామకృష్ణ మిషన్ స్వామీజీలు విచ్చేశారు. NDSO సంస్థ దీన్ని సమన్వయం చేసింది. ఇలా దక్షిణ భారత దేశంలోని నాలుగు రాష్ట్రాలలో సుమారు 100 కార్పొరేట్ సంస్థలకు సమాజ సేవా సందేశాన్ని అందించ కలిగే అవకాశం లభించింది. ఇదంతా కేవలం స్వామి సంకల్పము అనుకున్నాను. కారణం ఏంటంటే, సేవ పది మందికి కాదు, వంద మందికి కాదు, వేల మందికి కాదు లక్షల మందికి ఎట్లా చేయాలి? ఆ సేవనే ప్రధానమైన మార్గంగా తీసుకున్నాను. ఈ రోజు ఆకాశము క్రింద నిర్మాణం చేసిన ఈ అభయ ఆనంద నిలయము కొన్ని వందల మంది నిర్భాగ్యులకి, అభాగ్యులకి, అనాధలకి, ఆశలుగా నిలిచింది.

ఈ విరాళాలు సేకరించే సమయంలో GV ఆంజనేయులు, శివశక్తి సంస్థల యజమాని, నాకు బాగా ఆత్మీయులు విరాళం ఇస్తూ, "తమ్ముడూ! చాలా సంతోషం! మంచి పని చేస్తున్నావు, ప్రతి సంవత్సరము ఈ శివశక్తి కంపెనీ నుంచి మేము విరాళం ఇస్తాం అభయ సంస్థకి" అని చెప్పారు. ఆ సందర్భంలో చెప్పారు "అయ్యా! సూర్యాస్తమం అయ్యే వారి (వృద్ధులు) మీద పని చేస్తున్నావ్? నీలాంటి వ్యక్తి, నీలాంటి శక్తి యుక్తులు సూర్యోదయం (యువత) అయ్యే వాళ్ల మీద పని చేస్తే ఇంకా బాగుంటుంది" అని చెప్పారు. ఆ ఆలోచనని ఆదర్శంగా తీసుకొని అభయ ఆనంద నిలయంలో ఒక ప్రక్క దిక్కులేని వృద్ధులకు ఆశ్రయం, మరో ప్రక్క గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ కేంద్రము కూడా స్థాపించడం జరిగిపోయింది. అలనాటి నుండి ఈ నాటి దాకా (2013 – 2025) ఈ

అభయ ఆనంద నిలయంలో సుమారు 600 మందికి డ్రైవింగ్ శిక్షణ, 100 మంది కంప్యూలర్ శిక్షణ, 100 మందికి ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, 100 మందికి టైలారింగ్, మరొక 100 మందికి బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహించడం జరిగింది.

తరవాత కాలంలో సికింద్రాబాద్ రంగా శిక్షణా కేంద్రం, అనంతపురం అభయ CCL సాధికారత కేంద్రం, బెంగళూరు అభయ యువ కేంద్రములలో 2025 నాటికి సుమారు 15000 మంది గ్రామీణ యువతి యువకులకు టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం, టై, జూట్ బ్యాగ్స్, డ్రైవింగ్, కంప్యూటర్, మొబైల్ రిపేర్ ఇలాంటి ఉపాధి శిక్షణలు ఉచితంగా చేయడం జరిగింది. వేల మందిని సేవించుకునే భాగ్యము కలిగింది.

ఎవరో అడిగారు, ఏమిటయ్యా ఆనంద నిలయం అని పేరు పెట్టావు? ఇది వెంకటేశ్వర స్వామి గర్భగుడి పేరు కదా? అంటే, నేను చెప్పాను, "అక్కడ ఆనంద నిలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ రూపంలో ఉంటాడు. ఇక్కడ ఈ ఆనంద నిలయంలో వచ్చిన ఎవరిలోనైనా మాకు వెంకటేశ్వర స్వామి స్వస్వరూపముతో కనిపిస్తాడు. అందుకనే దీనికి ఆనంద నిలయం అని పేరు పెట్టాము."

దీనికి కూడా ఒక లోగో తయారు చేయాలనుకుని మళ్లీ గొల్లపూడి నరసింహ మూర్తితో అడిగాను. ఈ సారి వారు చాలా సమయం తీసుకొని నాకు ఒక లోగో ఇచ్చారు. ఆ లోగో ఏమిటి అంటే అభయ లోగో మీద ఒక పర్వతాకారం గీత గీసి ఇచ్చారు. నాకు చాలా ఆశ్చర్యమై వారిని అడిగాను. ఇంతకుముందు నిమిషాల్లో నాకు లోగో ఇచ్చారు. ఇప్పుడేమిటి ఇన్ని రోజులు తీసుకున్నారు అంటే, "అయ్యా చాలా ఆలోచించాను" అని అన్నారు. ఏం ఆలోచించారు అన్నా? అభయ లోగో మీద ఒక గీత గీసి ఇచ్చారు! అంత దానికి ఇన్ని రోజులా? అంటే, అయ్యా గీత గీసాను అంటా వేంటి? ఏం కనిపిస్తుంది నీకు? ఒక సారి చూడు అని చెప్పారు. నిజంగా పరిశీలనగా చూస్తే అభయ ఆనంద నిలయం అనేది లోగోలో ఆశ్రయాన్ని చూపించారు. అదే చెప్పాను. ఇంకా అంటే, ఇది thumbs up లాగా ఉందని చెప్పాను. ఇంకా అంటే నేను చెప్ప లేక పోయాను. అప్పుడు వారు చెప్పారు

"ఆ చివరి నుండి ఈ చివరి దాకా ఆనందమే"

కళ్లు మూసుకుని చూడు, గుడి గోపురం, మసీదు మినార్, చర్చి శిఖరం కనిపిస్తుంది.

చివరికి చెప్పారు, "శివలింగము, రుద్రాక్ష కనిపిస్తుందా?" అని అడిగారు. ఆ మాట విని నేను స్థాణువుగా నిలిచిపోయాను. కళ్లల్లో ఆనంద భాష్పాలు రాలడం మొదలయింది. కారణం ఏ శివానుగ్రహం చేత అయితే నేను అభయ ఆనంద నిలయం నిర్మాణం ప్రారంభించానో, ఏ కైలాస పర్వతంలో సంకల్పం చేశానో, ఏ రుద్రాక్షని శంకు స్థాపన సమయంలో భూస్థాపితం చేశానో, అదే రుద్రాక్ష, ఆ శివలింగము ఈ లోగోలో ఉంది అని చెప్పినప్పుడు నాకు మాటే రాలేదు. ఈ విధంగా ప్రతి క్షణము, ప్రతి అంశములో కూడా ఏదో ఒక మహత్తరమైన శక్తి నా ముందుండి, నాలో ఉండి, నా ప్రక్క నుండి, నా వెనకుండి నడిపించింది.

ఈ యొక్క నిర్మాణ కార్యక్రమంలో చాలా మంది దాతలు చేయూత నందించారు. సాయి భక్తులు, పెద్దలు మేడా నరసింహులు మొదటిసారి నాతో ఈ సత్కార్యంలో సలహాదారుగా ఉండడమే గాక ధనమును కూడా అందించారు. ఇలా ప్రతి కార్యంలో స్వామి ప్రకటితమైనారు.



101

భారత దర్శన్... ఆత్మ దర్శనాభిలాషతో!

2019 ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ నుండి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా, ఆత్మీయుడు, మిత్రుడు దేవకి వాసు దేవరావు నిలుచున్నారు. మనం వారికి ఏ విధంగా సహాయపడొచ్చు అని ఆలోచించాను. ధన వనరులు ఇచ్చేంత సామర్థ్యం లేదు కాబట్టి సమయం ఇద్దాం అనుకున్నాను. తనకు చేదోడు వాదోడుగా ఉందాము. అలాంటి వ్యక్తి ప్రజా పాలకుడిగా, ప్రతినిధిగా మారితే సమాజానికి మరింత హితమవుతుంది అన్న ఆలోచనతో 2019, మార్చి – ఏప్రిల్ మాసాలలో సుమారు 30 రోజుల పాటు ఖమ్మంలో ఉండి పోయాను. చాలా రకాలుగా వాసు చేస్తున్న ప్రయత్నానికి ఇతోధికంగా సాయం చేశాను. నాతో పాటు మరెంతో మంది తన తోడు నిలబడ్డారు.

ఏప్రిల్ 5వ తేదీ నాడు ఎన్నికల పర్యటనలో భాగంగా మేమంతా కొత్తగూడెం వెళ్లాము. ఏప్రిల్ 6వ తేదీ నాడు నా 49వ పుట్టు పండుగ. నాకు ఊహ తెలిసిన దగ్గర నుండి, ప్రతి పుట్టు పండుగ రోజు (అమావాస్య) కూడా సాయి రామ చంద్రుడి దివ్య సన్నిధికి వెళ్లడం, ఉగాది నాడు స్వామి దర్శనం చేసుకొని, బెంగళూరులో తల్లిదండ్రుల దర్శనం చేసుకోవడం, చాలా ఆనవాయితీగా జరుగుతూ వస్తున్నది.

కానీ, ఆ సమయంలో ఖమ్మం నుంచి పుట్టపర్తికి వెళ్లడం అంటే సాధ్యమయ్యే విషయంగా తోచలేదు. అయినా సరే పుట్టపర్తికి వెళ్లి వస్తాను అని అడిగాను. వాసు దేవరావు, "అయ్యా! ఇలాంటి పరిస్థితుల్లో నువ్వు మళ్లీ రెండు మూడు రోజులు ప్రయాణం చేస్తే కష్టం మవుతుంది ఇక్కడ. నువ్వు ఇక్కడ ఉంటేనే బాగుంటుంది" అని చెప్పాడు. ఏం చేయాలో తోచక ఆ రాత్రి కొత్తగూడెంకి వెళుతూ ఉంటే అక్కడ ఎక్కడో రోడ్డు వేయడం మైలు రాయి కనిపించింది. కేవలం 40 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం ఉంది అని, చాలా ఆనందమైంది. ఆ రాత్రికి కనీసం భద్రాచలమైనా వెళ్లి నా పుట్టు పండుగ నాడు శ్రీ సీతా రామచంద్రుని దర్శనం చేసుకుంటే ఎట్లా ఉంటుంది అనిపించింది.

వెంటనే మిత్రుడికి చెప్పి నా కారు తీసుకుని ఏప్రిల్ 5వ తేదీ మధ్యరాత్రికి భద్రాచలం

చేరుకున్నాను. అక్కడ ఆలయ సిబ్బంది తెలిసున్న ఆత్మీయులు నన్ను ఉదయము అభిషేక దర్శనానికి పంపించే ఏర్పాటు చేశారు.

నాకు చాలా ఆశ్చర్యమైంది, కారణం ఏంటంటే ప్రతి ఆదివారము స్వామి వారికి అభిషేక దర్శనం ఉంటుంది అని తెలుసు, టికెట్ ఉంటుంది దానికి. కానీ ఏప్రిల్ 6వ తేదీ శనివారము అభిషేకం చేస్తున్నారట. కారణం అదే రోజున శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది మహోత్సవము. చాలా యాధృచ్చికముగా జరిగింది ఇది. ప్రభుత్వ అతిధి గృహంలో విడిది ఏర్పాటు చేశారు అక్కడి సిబ్బంది. మరుసటి రోజున బ్రాహ్మ ముహూర్తంలో నన్ను తీసుకొని వెళ్లి ఆ అభిషేక దర్శనంలో స్వామి వారి సన్నిధిలో కూర్చో బెట్టారు. గర్భగుడి ముందు ప్రాంతం అంతా కూడా భక్తులతో క్రిక్కిరిసి ఉంది. అందరూ కూడా భక్తి పారవశ్యంతో స్వామి వారి ప్రధాన ద్వారమునకు ఇరు వైపులనుండి మెడలు వంచి తొంగి తొంగి చూస్తున్నారు. నేను నా ముందు మూడు వరుసల్లో కూర్చున్న వాళ్ల మీదుగా 45 డిగ్రీల కోణములో నా శరీరాన్ని వంచి స్వామి వారిని చూస్తూ, ఏడుస్తూ ఉన్నాను.

"స్వామి! ఈ విశిష్టమైన ఉగాది పండుగ నాడు, అది కూడా నా జన్మదినము రోజున నేను ఇక్కడ ఉండటమేంటి? నేను ఈ పవిత్ర అభిషేకంలో పాల్గొనడం ఏమిటి? మీ సన్నిధిలో నిజ రూప దర్శనము జరుగుతోంది స్వామీ!! చాలా సంతోషంగా ఉంది. మరి నేను ఎప్పుడు చచ్చిపోతానో తెలియదు, నేను ఈ భూమి నుండి వెళ్లేలోపు ఏమైనా చేయాల్సింది మిగిలి ఉందా?" అని నేను ఏడుస్తూ ఉన్న సమయంలో, స్వామి వారి నుంచి ఒక్కసారిగా అనుకోకుండా లోనుంచి నాకు అంతర్వాణి వినిపించింది. "ఏయ్ భారత దర్శనము చేయి!" అని. చాలా ఆశ్చర్యం అయింది ఆ దివ్యదేశం విని.

ఆ విధంగా ఏప్రిల్ 6వ తేదీ, నా 49వ పుట్టు పండుగ సందర్భంగా భద్రాచల శ్రీ రామచంద్ర మూర్తి యొక్క దివ్య సన్నిధిలో, భారత దర్శన సంకల్పం జరిగింది.

కానీ ఎలా వెళ్లాలి అన్నది అర్థమే కాలేదు. చెప్పి వెళ్లాలా లేక ఎవరికి చెప్పకుండా వెళ్లాలా అన్న సందిగ్ధముతో చాలా రోజులు ఆలోచించాను. 9 రోజుల తరువాత, లీలావతి (అభయ సంస్థ ద్వారా చదువుకుని స్థిర పడిన అమ్మాయి) అడిగిన కారణం చేత ఏప్రిల్ 14, 2019 శ్రీ రామ నవమి రోజున హైదరాబాద్ దగ్గరలో ఉన్న ముచ్చింతల్ గ్రామంలోని దివ్య సాకేతంలో జరిగిన శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దివ్య కళ్యాణము మరియు స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలకు వెళ్లాము. వేదిక మీద జరుగుతున్న కళ్యాణం చూస్తూ, ఆ ప్రాంగణం నుండే, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారికి నా భారత దర్శన సంకల్పం, సన్యాస దీక్ష (కొన్ని నెలల ముందు నాకు వచ్చిన కలని ప్రస్తావిస్తూ) మరియు అభయ ఫౌండేషన్ (www.abhayafoundation.org) గురించి వారి దిశా నిర్దేశం ఆర్థిస్తూ మెయిల్ పంపాను.

వారు ఎంతో దయతో ప్రత్యుత్తరం ఇచ్చారు. "జై శ్రీమన్నారాయణ!" మీరిప్పుడు సన్యాసే కదా... కాకపోతే తెల్ల దుస్తుల్లో ఉంటారు." కానీ, వారు భారత దర్శన్ గురించేమి మాట్లాడనే లేదు.

భారతదేశ దర్శనము పైన స్పష్టత లభించలేదు. మరో మూడు రోజుల తర్వాత, మిత్రుడు CA. బి. వి. ప్రసాద్‌తో విజయవాడ ఇంద్రకీలాద్రి పైన కొలువై ఉన్న కనక దుర్గమ్మ దర్శన చేసుకునే అవకాశం కలిగింది. అమ్మని నాకు భారతదర్శన మార్గాన్ని చూపమని మరియు నా స్నేహితుడికి, వారి కుటుంబానికి ఆశీస్సులు ఇవ్వమని కోరుకున్నాను.

20 ఏప్రిల్ 2019, సిటీ నుండి అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆనంద నిలయానికి

వెళ్లే మార్గ మధ్యంలో, మిత్రుడు దేవకీ వాసుదేవరావు మరియు మిత్రులు, శ్రీ చిన్న జీయర్ స్వామీజీ దగ్గరకు వెళ్తున్న సమాచారం అందింది. నేను వారితో చేరి దివ్య సాకేతము ఆశ్రమానికి వెళ్లాను.

శ్రీ జియ్యర్ స్వామి వారు ఎంతో ప్రత్యేకముగా నాతో ముచ్చటించినారు. "భారత దర్శన్" సంకల్పము చాలా పవిత్రమైనది అని సెలవిస్తూ... తమ దివ్య ఆశీసుల అందిస్తూ... అభయ ఉద్భవ కారణాలని, మానవతా విలువల్ని మరియు మానవ జీవిత లక్ష్యాన్ని ఈ ప్రయాణము అంతటా ప్రకటించమని "తదేవ లగ్నం, సుదినం తదేవ... తారా బలం చంద్ర బలం తదేవా" అంటూ నన్ను పవిత్ర మాలంకృతుడిని చేసి ప్రసాద వితరణ చేస్తూ వైశాఖ దశమి (మే 14, 2019) రోజు భారత దర్శన ముహూర్తాన్ని నిర్ణయించారు.

ఏప్రిల్ 21, 2019 రోజున కుమారి లీలావతితో ఆమె పెళ్లి సంబంధం గురించి మాట్లాడటానికి కర్ణాటక రాష్ట్రంలో నున్న గ్రామానికి వెళ్లి వచ్చేటప్పుడు మార్గ మధ్యములో పావగడ క్షేత్రంలో "శీతలాంబా మాత"ను దర్శించుకున్నాను. నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉన్న అమ్మ వారి స్థానం అది. భయంకర కరువు కాటకాలలో అల్లాడుతున్న ఆ ప్రాంత ప్రజలని రక్షించడానికి ఒకానొక సిద్ధుడు 3 రోజుల పాటు ధ్యానంలో ఉండి, వారికి సిద్ధించిన 72 బీజాక్షరాలను 6 అడుగుల పొడవు గల రాతి బండ మీద చెక్కి అమ్మ వారి చల్లని చూపులు అందరి మీద ప్రసరించాలని, శీతలాంబా మాతను శిలలో అవాహనము చేసి దివ్య శక్తిని ప్రతిష్టించారు. అక్కడున్న పూజారి నన్ను బయలు ప్రదేశంలో కొలువై ఉన్న ఆ తల్లి నమీపంలోకి నా చేతులు పట్టుకొని తీసుకెళ్లారు, రోమాంచితుడనయ్యాను! అమ్మ వారికి అలంకరించిన వస్త్రములు తొలగించి చూపారు. అప్పుడు అర్థం అయింది... అక్కడున్నది ఆ 6 అడుగుల శిలయే అని... సంభ్రమాశ్చర్యములతో అమ్మను ఆలింగనం చేసుకుని చెప్పాను. "తల్లీ, భారత దేశ సౌజన్య, సౌభాగ్య, సౌశీల్యముల కోసం భారత దర్శనము సంకల్పం చేశాను! దారి చూపు తల్లీ!! మళ్లీ మీ దర్శనం చేసుకుంటాను" అని బిగ్గరగా చెప్పాను. ఆ క్షణాల్లోనే అక్కడ మరో దివ్యమైన ఆజ్ఞ నాకు వినబడింది. ''ఏయ్! శంకరాచార్యుల దిగ్విజయ మార్గంలో వెళ్లు" అని.

నా ఆనందానికి అవధులే లేకుండా పోయాయి. ఇక ఆలస్యం చేయొద్దు అనుకున్నాను. నా కూడా వచ్చిన లీలావతి బృందాన్ని తిరిగి హైదరాబాద్‌కు వెళ్లమని చెప్పేసి... పావగడ నుండి సుమారు 5 గంటలు ప్రయాణం చేసి బెంగళూరుకు చేరుకున్నాను. బస్సులో చివరి సీటులో కూర్చుని వినీలాకోసం లోకి తొంగి చూస్తూ, పక్షము రోజులుగా జీవితంలో చోటు చేసుకుంటున్న విషయాల గురించి ఆలోచిస్తూ... చేతిలో ఉన్న మొబైల్లో శంకరభగవద్ పాదుల వారి దిగ్విజయ మార్గం దొరుకుతుందేమో అన్న ఆశతో చూస్తున్నాను. చాలా సేపు శోధించిన తరవాత కంచి కామకోటి పీఠం వారు ప్రచురించిన శంకర దిగ్విజయ యాత్ర మార్గము చిత్ర పటం మరియు వారు దర్శించిన క్షేత్రాల పట్టిక కనిపించింది. ఎదో తపస్సు ఫలించి దైవ సాక్షాత్కారం పొందిన అనుభూతి కలిగింది.

భగవత్ అనుగ్రహ ప్రేరణ ఆ భద్రాచల రాముని దివ్య సన్నిధిలో జరిగిన తర్వాత, నా ఇష్ట దైవ మైన శ్రీ సత్య సాయి బాబా అనంతమైన ప్రేమను తలచుకుంటూ, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ వారి ఆశీస్సులతో నా తల్లిదండ్రులు, గురువు శ్రీమతి జ్యోతి మరియు అభయ ధర్మకర్తలందరి అనుజ్ఞను తీసుకుని, భారత పుణ్య భూమిలో "49" వసంతాలు పూర్తి చేసుకున్న ఈ దేహాన్ని, ప్రేమ, దయ మరియు అభయ విలువల వ్యాప్తికై వినియోగించాలని ఆశించాను.

అభయతో పుష్కర కాల ప్రయాణము దేశం కోసం నన్ను నేను స్వార్థ రహితంగా ఎలా అర్పితం చేసుకోవాలో నేర్పింది. జీవిత సంపూర్ణ పరివర్తన కోసం నేర్చుకోవడం, నేర్చుకున్నది వదిలేయడం, మళ్లీ కొత్త పాఠాలు నేర్చుకోవడం కోసం నాలో ఉన్న మరో వ్యక్తి కోసం ఆత్మాన్వేషణ మొదలు పెట్టాను. వీటికి సమాధానమే భారత దర్శన సంకల్పం జరిగిందని నా ప్రగాఢ విశ్వాసం. పెద్దల సలహా మేరకు ఈ ప్రయాణంలో ఎంత మంది వీలైతే అంతమంది సత్యాన్వేషకులను కలవాలని నిర్ణయించుకున్నాను. అభయ జాతీయ మార్గ దర్శన మండలి సభ్యులు, అభయ కార్యవర్గ సభ్యులను, నిర్వాహకులు, ధర్మకర్తలందరితో సమావేశం అయ్యి నా పరోక్షంలో అభయ సంస్థను H.E.A.R.Tతో ముందుకు తీసుకొని వెళ్లమని అర్థించాను. వారెంతో ప్రేమతో దయతో అంగీకరించారు. అంతే కాక అందరూ నన్ను ఉత్సాహపరిచి తోచినంత ధన సహాయం కూడా చేసినారు. ఇక అందరికీ భారత దర్శన్ సంకల్పాన్ని వివరిస్తూ విషయాన్ని తెలియ పరిచాను.

"నీకు వచ్చిన ఆశీస్సులను లెక్కపెట్టుకోకు. వేరొకరు లెక్కపెట్టుకొనే ఆశీర్వచనం నువ్వు అవ్వు."

వికారి ఉగాది పర్వదినం రోజు (6.4.19) భారత దర్శన" కాంక్ష నాలో మొదలయ్యాక నా జీవితంలో ఎన్నో విషయాలు జరిగాయి. ముందుగా నేను కలియుగ దైవము (తిరుమల వేంకటేశ్వర స్వామి), ఇంటి దైవము (ఆలూరు కోనరంగనాథ స్వామి), ఇష్ట దైవం (భగవాన్ శ్రీ సత్య సాయి బాబా, పుట్టపర్తి, ప్రశాంతి నిలయం), ప్రత్యక్ష దైవములను (తల్లిదండ్రులను) దర్శించి "భారత దర్శన్"కై ఆశీస్సులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను.

CA.బి.వి. ప్రసాద్ ఎంతో ప్రేమతో ప్రయాణ ఏర్పాట్లు చేశారు. మేము శ్రీవారి మెట్టు మార్గంలో, కాలినడకన తిరుమల చేరుకొని నాలో ఉన్న అహాన్ని, వ్యతిరేక ఆలోచనలు నశింప చేయమని స్వామి వారిని ప్రార్థిస్తూ శిరో ముండనము చేయించుకున్నాను. దశాబ్ద కాలంగా ప్రతి క్షేత్రంలో ఈ భావన తోనే శిరోముండనం చేసుకుంటున్నాను.

స్వామి వారిని చూడటానికి సర్వదర్శనం లైన్‌లో నిల్చున్నపుడు, సాంప్రదాయేతర దుస్తుల్లో ఉన్న ఒక కుర్రవాడిని పోలీసులు అడ్డగించినారు. అతను అసహాయంగా వెనక్కి వెళ్లి పోతుంటే చూసి నా భుజం మీద వేసుకున్న కండువాని ఇచ్చాను. గంటల పాటు నిలుచున్న తరవాత వెనక్కి వెళ్లడం ఎంత కష్టమో అర్థం చేసుకొన్న వాడిని కాబట్టి. నేను ఇచ్చిన కండువాను ధరించి, ముందుకు కదులుతూన్న తన కళ్లల్లో నాకెంతో ఆనందం కనిపించింది. స్వామి వారి దర్శనం చక్కగా చేసుకుని తిరిగి ప్రయాణం అయ్యాను.

తాడిపత్రి దగ్గర, ఆలురు కోనలో కొలువై ఉన్న నా ఇంటి దేవుడు శ్రీ రంగనాథ స్వామిని దర్శించుకోవాలని అనుకున్నాను. కుటుంబ పెద్దల ఆశీస్సులు తీసుకోవాలని, మే 5, 2019 రోజున తాడిపత్రి చేరుకున్నాను.

అన్నయ్య కుమారుడు సుంకు బాల మురళీ కృష్ణ, ఆలురుకోన వెళ్లడానికి వాహనం ఏర్పాటు చేశాడు.నేను బయలు దేరే ముందు నాకు ఒక కొత్త పంచ ఇచ్చాడు. ఆశ్చర్యమైన సంగతి ఏంటంటే 'అది' నేను తిరుమల సర్వ దర్శన క్యులో ఒకతని అవసరార్థం ఇచ్చిన కండువా అవ్వడం. ఈ విషయం నిజంగానే దేవుని ఆశీస్సులు అని అనిపించింది.

నా జీవితంలో మొట్ట మొదట సారిగా ఆలూరు కోన శ్రీ రంగ నాథుని అభిషేక దర్శనం చేసుకొన్నను.

పూర్వం దండకారణ్యంలో శ్రీ రాముడు తాటకిని చంపినప్పుడు ఆమె శరీరం ఒక ఎండిపోయిన

ఆకులాగా పడిపోయిన స్థలమిది. కాల క్రమేణా తాటక పత్రము కాస్తా తాడిపత్రి మారిపోయింది.

విశ్వామిత్ర మహర్షి ఇక్కడే తపస్సు చేశారు పూర్వం. వారికి దివ్య దర్శనం అయిన స్థలంగా కోన క్షేత్రాన్ని చెప్తారు. మరియు శ్రీ రంగనాథుడు స్వయంభుగా వెలసిన క్షేత్రమిది. ఆ తర్వాత అక్కడి రాజులు ఒక సుందరమైన గుడి నిర్మించారు. అభిషేక సమయంలో అక్కడి పూజారి నన్ను గోత్రనామాలు అడుగగా నేను "కాశీ గోత్రోద్భవస్య, భారత దర్శన సంకల్ప సిద్ధర్థ్యం, సకల జన సంరక్షణార్థం, సర్వలోక సంక్షేమార్థం, ప్రార్థనాం కరిష్యామి" అని చెప్పాను. దాని అర్థం ఈ సమస్త లోకాలు బాగుండాలని.

నేను పూజ తర్వాత అభిషేక ప్రసాదం తీసుకొని బయటకు అడుగు పెట్టిన మరు క్షణం ఒక పెద్ద వానరం నా చేతిలోని ప్రసాద సంచిని ఆదుకుని డబ్బాలోని పంచామృతం జుర్రుకొని అరటిపండు తిని పులిహోర వదిలేసి వెళ్లింది. స్వామి వారు, వారి బంటునే నా భారత దర్శనానికి ఆశీస్సులుగా పంపించారని అనుకుని ఆనందించి, ఆ వానరమునకు శిరము వంచి చేతులు జోడించి నమస్కరించాను

నేను గుడి బయటకు రాగానే, సుంకు కుటుంనానికి చిరపరిచుతులైన పూజారి నన్ను గుడిలోని అంతరాలయనికి, అభయ ఫౌండేషన్ సభ్యులకు తెలియ జేసి ఒక AC పెట్టించమని అడిగారు. నేనెవరు అన్నది తెలియకుండా నన్ను ఇలా అడగడం భారత దర్శనానికి ముందు శ్రీ రంగనాథుని సేవావకాశంగా ఎంచి మూడు రోజులలో శీతల యంత్రము స్వామి వారికి సమర్పించాము.

భారత దర్శనానికి ముందుగా ఎంతోమంది శ్రేయోభలాషులు మరియు అభయ కుటుంబ సభ్యుల చేయూతతో పాటుగా మరెంతో మంది సహృదయులు, నా క్షేమాన్ని ఆకాంక్షించి నన్ను కార్యోన్ముఖుని గావించి స్ఫూర్తి నింపినారు. ఇంతకు మునుపు నేను చేసిన తీర్థ యాత్రలు అన్ని కొద్ది గడువులోనే, కావల్సినంత సదుపాయాలతో నా జీతమును వెచ్చించి చక్కగా ముగించేవిగా ఉండేవి. కానీ ఎప్పుడైతే నేను NCC గ్రూప్‌లో కంపెనీ సెక్రటరీగా 2013లో పదవీ విరమణ చేసి సామాజిక కార్యకర్తగా మారానో, అప్పటి నుంచి పరిమితమైన వనరులతో జీవిస్తున్నాను. నిజానికి నా దగ్గర డబ్బు లేదు. వందల మంది 6,00,000 దాకా సేకరించి ఇచ్చారు. అందులో వయోవృద్ధులు, గృహిణులు, పిల్లలు, విద్యార్థులు, ఉద్యోగులు, బంధువులు, స్నేహితులు, సహోద్యోగులు మరియు అభయ ధర్మకర్తలు అందరూ చేయూతను ఇచ్చారు.

శ్రీ సత్య సాయి బాబా – నా స్ఫూర్తి ప్రదాత: నా తదుపరి క్షేత్ర దర్శనం పుట్టపర్తి. నా ఇష్ట దైవం, నా గురువు, నా మార్గదర్శి, నా రక్షకుడు అయిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబాకి నా ప్రార్థనలు సమర్పించుకుని నా తల్లిదండ్రులను కలవడానికి బయలుదేరాను. నా తండ్రి '83' ఏళ్ల వయో వృద్ధుడు, మంచానికే పరిమితమైనారు, మా అమ్మ, ఒక సహాయకుని తోడు తీసుకుని ఆయనకు సేవలు చేస్తున్నారు. నేను నా 'భారత దర్శనం' గురించి నాన్నకి తెలియ పరచడానికి ప్రయత్నించినప్పుడు ఆయన అర్థం చేసుకున్నట్లుగా కను సైగతో అంగీకారం తెలిపారు. అమ్మ నా కష్టతర ప్రయాణం గురించి భయాందోళనకు గురి అయినప్పటికీ, తన ఆశీస్సులతో ప్రయాణానికి అనుమతి ఇచ్చారు.

శ్రీ చినజీయర్ స్వామి వారి ప్రసాదం:–మే 13,2019 నా ప్రయాణ సన్నాహాలు శిఖర స్థాయిలో ఉన్నాయి. ఎంతో మంది శ్రేయోభలాషులు మరియు పిల్లలు నాతో కలిసి వారికి తోచినంత పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఆ సమయములో ప్రశాంతి నిలయం నుంచి సునీల్

వైట్ల కుటుంబము దివ్య సాకేతంలో ఉన్న శ్రీ చినజీయర్ స్వామి వారి దర్శనం చేయించమని, తోడు రమ్మని అడిగారు. అది నా భాధ్యత కానప్పటికీ వారికి తోడుగా వెళ్లడం సేవ అనుకున్నాను. అంతే గాక స్వామి వారిని కలవడానికి, భారత దర్శనానికి ముందు వచ్చిన మరో అవకాశమని అనుకున్నాను. అనంతరం నేను,సునీల్ కుటుంబం, సినీ నటుడు టార్జాన్ ఆశ్రమంకు వెళ్లాము. ఆశ్చర్యంగా స్వామి వారు మమ్మల్ని గదిలోకి ఆహ్వానించారు. నన్ను ఆశీర్వదించి ఆశ్రమంలో జరుగుతున్న లోకకల్యాణ యజ్ఞంలో పాల్గొనమని ఆదేశించారు. నాకు అక్కడ కంకణ ధారణ చేయబడింది. భారత దర్శన్ సంకల్పం చేశాను. పూర్ణాహుతి అయింది. తీర్థ ప్రసాదాలు ముందు స్వామి వారికి, ఆ తరవాత యజ్ఞ శాలలో ఉన్న వందలాది మందికి అందించారు. స్వామి వారు 3 సార్లు అరగించి తమ చేతిలో పెట్టుకున్న ప్రసాదం దొన్నెను అన్ని వందల మందిలో నన్ను పిలిచి నా చేతిలో పెట్టి ఆశీర్వదించారు. అలాగె నా భారత సందర్శన ప్రణాళిక, లక్ష్యాన్ని గురించి అడిగారు. ఇట్టి ఆశీస్సులు అందుకోవడానికి కారకులైన, నా స్నేహితునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

సుమారు180 రోజుల పాటు జరిగిన ఈ భారత దర్శనము అద్భుతమైన, ఆశ్చర్యకరమైన, అత్యంత దివ్యమైన, అనుభవాలని, అనుభూతులని నాకు ప్రసాదించింది భారత దర్శనము అంటే కేవలం ఒక భౌగోళిక స్వరూపాన్ని దర్శించడం కాదు, భారతమాత దివ్య స్వరూపాన్ని దర్శించడం అని నాకు తెలిపింది.

నా అనుభవాలన్నీ కూడా ఏ రోజుకి ఆ రోజు, ఎంత కష్టమైన నష్టమైనా... ఎలాంటి పరిస్థితుల్లో ఉన్న రాత్రి పడుకునే లోపుగా ఆ రోజు జరిగిన విశేషాలన్నీ వ్రాయడం మొదలు పెట్టాను ఫోన్లో ఉన్న నోట్ ప్యాడ్‌లో. ఈ అనుభవాలన్ని గ్రంథస్థం చేస్తే ఎలా ఉంటుంది అని చెప్పేసి, భారత దర్శన పుస్తకాన్ని వ్రాసాను. అయితే నా భావాలన్నీ కూడా ఆంగ్లంలో పెట్టడం వల్ల, చాలా వ్యాకరణ దోషాలు ఉండేవి, అప్పుడు నా ప్రియాతి ప్రియమైన పాప లలిత లహరి, వాటిని సరి చేసి ముందుకు తీసుకెళ్తాను అని అన్నది. చక్కగా సుమారు 250 పేజీల పుస్తకాన్ని అద్భుతంగా క్రోడీకరించి, సమీకరించి, అర్థవంతంగా చేసి, మెరుగుపరచి చక్కటి పుస్తకం లాగా ఆ అమ్మాయి ప్రచురణకు తీసుకొని వచ్చింది. ఈ పుస్తకాన్ని ఫిబ్రవరి 2020 సంవత్సరము 29వ తేదీ, శ్రీ శ్రీశ్రీ చిన్నజీయర్ స్వామీజీ వారి కరకమలముల చేత తెలంగాణ గవర్నర్ తమిళసాయి సౌందరరాజన్ సమక్షంలో మూడు వేల మంది ఆహుతుల మధ్యలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరణ చేయడం జరిగింది.

భారత దర్శనం, స్వామి దివ్య సంకల్పం చేత, నా చిన్ననాటి నుంచి దేశమంతా చూడాలన్న ఆలోచన, శంకరాచార్యుల లాగా తిరగాలన్న ఆశ, స్వామి లాగా నేను కూడా ఉత్తర దేశ యాత్ర చేయాలన్న కోరిక వెరసి సంపూర్ణ సాక్షాత్కారంగా మారింది.

స్వామే బీజముగా, కార్యముగా, కర్తగా, కర్మగా, క్రియగా మారి నన్ను ముందుకు తీసుకొని వెళ్లారు. భారత దర్శనము నా జీవితాన్ని సార్థకత చేసింది.

చివరి శ్వాస దాకా నన్ను నేను స్వామి పాదముల వద్ద అర్పించుకుంటూ, ఎప్పటికప్పుడు నన్ను నేను నిర్వచించుకుంటూ, సరిచేసుకుంటూ, అవసరంలో ఉన్నవారికి అంకితమవ్వాలన్న లక్ష్యంతో ఈ వ్యాసం ముగిస్తున్నాను.

102

అన్ని వదిలిన నన్ను అడవికి చేర్చిన వానప్రస్థం

స్వామి ఎప్పుడు చెప్తూ ఉంటారు "బంగారు! మీ జీవితం నా సందేశంగా మలిచినప్పుడే నేను అందరికీ కనిపిస్తానయ్యా!" సత్యసాయి దివ్యకార్యములో మన మందరము గుర్తుంచు కోవాల్సిన విషయము, తన మన ధన ప్రాణములు స్వామి సేవలో అంకితము చేసినప్పుడు చూసేవాళ్లకి తప్పక మనకంటే ముందు స్వామే ఎక్కువగా కనిపిస్తారు అని నేను నమ్ముతాను.

అదే విధంగా... సమాజంలో ఎక్కడికి వెళ్లినా అందరూ నన్ను ఆదరించే వాళ్లు.

అను నిత్యం నన్ను నేను మార్చుకుంటూ... దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నో రాష్ట్రాల్లో సేవల్లో పాల్గొంటున్నాను. విశ్రాంతి అనేది లేదు. ఈరోజైనా సరే సేవ లేదంటే ఆ రోజు చచ్చినట్లు అయిపోయే వాడిని.

2020వ సంవత్సరానికి 50 దేహానికి ఏళ్లు వచ్చేసాయి. ఊహ తెలిసిన దగ్గర నుండి సాయి కార్యంలో అహరహం అంకితం అయ్యాను. 2011లో ఉద్యోగానికి రాజీనామా పెట్టిన తరవాత సుమారు మరొక 3 ఏళ్లు GVPR Engineers సంస్థకు సలహాదారుగా సేవలందించాను. అదికూడా వారంలో కొన్ని రోజులు మాత్రమే ఆ సంస్థకు వెళ్లే వాడిని. కొన్నాళ్లకు అభయ సంస్థ కార్యక్రమాలు చేసేందుకు నాకున్న 24 గంటలు కూడా సరిపోని విధంగా విస్తరించాయి.

దానికి చేస్తున్నా పార్ట్ టైమ్ ఉద్యోగం, నివసించే ఇల్లు కూడా అడ్డం అయిపోయింది. భారత దర్శనం చేసి వచ్చిన తరవాత 2020 జనవరిలో అభయ వార్షికోత్సవం జరిగింది. అప్పుడు నిర్ణయం చేశాను, నా వద్ద మిగిలి ఉన్న ధనాన్ని కుటుంబంలో చిన్న పిల్లలతో పాటుగా అభయ సంస్థలో నిస్వార్థంగా సేవ చేస్తున్న ఆత్మీయుల పిల్లలను చేర్చి 12 మందిని గుర్తించి ఒక్కొక్కరికి 50,000 రూపాయలు పంపుతూ... ఈ ఉత్తరం వ్రాసాను:

March, 2020

Most Beloved Child!

Blessings for the Bright Future!

Bestowing all my love on you!!

Ever since you arrived in this world...GOD connected me to you!

It's because of sukrutham, we got to know each other. Till now, I had all the opportunities of loving and caring for everyone who has grown up around me. Now you are still a child and with your parents , I did not have an opportunity to love you by being there near you.

Now, I am crossing 50 years in life. I do not know how long I live and how long I love you my dear child. For others in the family I could do something as and when there is an opportunity based on my earning capacity. But, since I resigned from the full time job in the year 2013...I started living with minimal resources. Now that I am crossing the half way mark in life, I thought of slowly detaching from the world and attaching to the Divine.

I thought of collecting all my resources and giving them to my dear children who are still at a tender age. Accordingly I decided to give you Rs.50,000/- to you. The amount is meant for your progress and development in days to come. Treat this as my love for you. I do not know what my situations in future...But am sure you will have great features in future.

Remember:

Be Good...Do Good...See Good.

Love for GOD...Fear of Sin...Morale in Society.

If you wish to come in unity with GOD, be in community work.

Treat abhaya Foundation as our own companion in life.

Do not except from me as I do not know where and how I will be in days to come. All my blessings to you always in all the ways in life ahead.

With lots and loads of Love

Balachandra

ఇక ఎక్కడా కూడా వృత్తి నిపుణుడుగా పని చేయద్దు అని. మరొక ప్రక్క నేను Fellow Member of ICSI అయ్యాను. ఆ సభ్యత్వాన్ని కూడా వదులుకోవాలని... ఉన్న ఇంట్లో కూడా ఉండకూడదు అని ఆలోచనలు వచ్చేవి.

శ్రేయోభిలాషులు, పెద్ద వాళ్లు కొందరు సలహా ఇచ్చారు. "అయ్యా, నువ్వేమైనా చేయి పరవాలేదు, కానీ, CS సభ్యత్వం వదులుకోవద్దు. అందువల్ల నీకేమి నష్టం జరగదు కానీ ICSIకి మాత్రం అది

నష్టం చేస్తుంది. ఈ జాతీయ సంస్థలో నీ లాంటి వాళ్లు సభ్యులు అన్నది ఒక గౌరవంగా నిలవాలి" అని. సరే, నా జీవన రేఖగా మారిన CS మీద గౌరవంతో ఆ సభ్యత్వాన్ని అలాగే ఉంచేశాను. సభ్యత్వ రుసుము కూడా వేరే ఎవరో కట్టేస్తున్నారు. 5 ఏళ్లుగా ఇక వృత్తి నిపుణుడిగా నేర్చుకున్నది కాస్తా మరచిపోయాను కూడా.

ఉద్యోగం వదేలేసాను. ఇంటిని నా తదనంతరం సంస్థకు చెందేలా వీలునామా వ్రాసాను. విపంచి రెసిడెన్సీ, 502 ఇంట్లో ఒక గది నాకోసం పెట్టుకుని మిగతా గదులు అన్ని కూడా ఆత్మీయుడు మిత్రుడు అయిన CS B కిరణ్ కుమార్ నిర్వహించే కంపెనీ సెక్రెటరీ సంస్థ, BK & Associatesకు అప్పగించేశాను. దాంతో పాటుగా అప్పటి దాకా నా సంపాదన వనరులు కూడా వారికి అప్ప చెప్పాను. గత 12 ఏళ్లుగా వాళ్లే నన్ను చూసుకుంటున్నారు. నా తోడు నీడ అన్న తమ్ముడు స్నేహితుడు, శ్రేయోభిలాషి... అన్నీ కిరణ్ అయ్యాడు. నా 50వ పుట్టు పండుగ రోజున భాగ్యనగరాన్ని వదిలి అడవిలో ఉన్న అభయ ఆనంద నిలయానికి చేరుకున్నాను. సరిగ్గా అదే సమయంలో ప్రపంచం ఇప్పటి దాకా వినని కరోనా విలయం వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా స్వీయ గృహ నిర్బంధం ప్రకటించారు. నేను సిటీ విడిచి ఆనందనిలయం చేరిన కొన్ని రోజులలో ప్రపంచం అంతా చెరసాలలా మారి పోయింది. అప్పుడు నేను ఈ విధంగా వ్రాసుకున్నాను.

చిన్న నాడే నేను అనుకున్నాను... నేను కానని
సంపాదించినప్పుడు అన్నాను... నాది కాదని
అభయ మిచ్చినప్పుడు తెలిపాను... సాయిదని
అదేశమైనది అందరి వాడిగా నేను జీవించాలని
స్వర్ణవత్సరం దేహమునకు వచ్చేసిందిప్పుడు
స్వర్ణాభరణం నేనవ్వాలంటే సమర్పణం కావాలి
సాధారణము కాదు అసాధారణ కార్యం చేయాలి
అందుకు ఆనంద నిలయమే ఆలయమవ్వాలి
చేయాల్సిన కార్యమేదో నన్ను రమ్మంటోంది
చేరవలసిన గమ్యమేదో నాకొరకే వేచివుంది
అరణ్యమే అనన్య కార్యమునకు నాందిగా
ఆశ్రమ వాసమే ఆచంద్రతారార్కమైనదిగా ఎంచి
మునుముందు అభయఆనందనిలయం వేదికగా
మనమందు అంతరాత్మ ప్రభోధమే సాధనముగా
మనసిచ్చిన జనము కోసం, జన్మ సార్థకత కై
సేవా సాధనలో మరింతగా నేను కరిగి పోతున్నా
అందరికి అవసరంలో అందుబాటులో ఉంటాను
ఆనందంలో వెంట లేకున్నా ప్రేమిస్తూనే ఉంటాను
అవసరమొస్తే ఎవరు పిలవకున్నా నేను వస్తాను
అమృతత్వము వైపునేను ఇక సాగుతుంటాను
బ్రతుకు కోహం నుండి సోహంకు చేసే ప్రయాణం

(నేను ఎవరు అన్న ప్రశ్నతో మొదలయ్యి అదియే నేను అన్న సమాధానమే జీవిత పరమార్థం)

విద్ అను పదముననకు య అను ప్రత్యయము చేర్చిన విద్య యగును (విద్ అనగా జ్ఞానం: య అనగా ప్రసాదించునది)

కోవిద్ అంటే నేను జ్ఞానమే అన్న అర్థం
కరోన పీడిత విశ్వములో ఇక మనకంతా
దేవుడి కరుణ మాత్రమే కావాలన్న
జ్ఞానము మనకు ప్రసాదించమని ప్రార్థిస్తాను

అందరికి వందనములతో
అంతర్యామికి మంగళములతో
మీ
బాలచంద్ర

అలా ఆనందానిలయానికి చేరే సమయానికి, అప్పటిదాకా కట్టుకునే పంచ, జుబ్బా కూడా వదిలేసి... ఒక సామాన్య వ్యక్తి లాగా కేవలం రెండు ధోతిలు కట్టడం మొదలు పెట్టాను. అక్కడి అనాథ వృద్ధులతో చేరి నివసించడం మొదలు పెట్టాను. నేను పెట్టిన సంస్థలో నేను ఒక అనాథ లాగా కాలం గడపడం మొదలు పెట్టాను. నేను అక్కడ ఉన్నందుకు, అంతో కొంత సంపాదిస్తున్నందుకు నెలకు 10000 రూపాయలు అభయ ఆనంద నిలయానికి చెల్లించడం మొదలు పెట్టాను. చాలా క్రమ శిక్షణతో నిరాడంబర జీవన శైలిని అలవరచుకున్నాను.

పంచ వోయి ప్రేమ పరమాత్ముని కొకనికే
జీవనమ్ము సాగ సేవ చేసి
మంచి కొరకే బ్రతుకు మరణించవేనాడు
వినుర బాలచంద్ర వినయ సాంద్రా

నా ప్రేమకు హద్దులు చెరిపేసాను. నా దేహాన్ని పరహితం కోసమై పరిచేశాను. సేవలు చేస్తూ పరవశించాను... సేవలు చేయాలని పరితపించేవాడిని. ఆనంద నిలయంలో ప్రవేశించాను.

నాటి నుండి నేటి దాకా నా శాశ్వత చిరునామా అభయ ఆనంద నిలయం అయింది. అందులో మొదటి సేవకుడు నేనే అయ్యాను. నాతో పాటుగా నిలబడి పని చేసే సిబ్బంది ఇబ్బంది అయింది. ప్రతి రోజు యుద్ధం చేసినట్లే అయ్యేది. చాలా సవాళ్లు ఎదురయ్యాయి. సేవలు మాత్రం ఆగనే లేదు. నెలకు కనీసం ఒక బ్యాచ్ చెప్పున సంవత్సరం పొడుగునా గ్రామీణ నిరుద్యోగ నిరుపేద యువతకు వసతితో కూడిన ఉపాధి శిక్షణలు నిర్వహిస్తూనే ఉన్నాము. 2025 నాటికి ఆనంద నిలయం నుండి సుమారు 2000 మందికి శిక్షణ ఇచ్చాము. ఎంత ఇబ్బంది అయినా సరే స్వయంగా నా సమయాన్ని వెచ్చిస్తూ... వారి స్థాయికి వెళ్లి, వారికి జీవనోపాధితో పాటు జీవిత నైపుణ్యాలు, మానవతా విలువలు, సంసారం, సంస్కృతి అందించే ప్రయత్నం చేస్తున్నాను.

నిరుద్యోగ యువతి యువకులు వచ్చిన మొదటి 3 రోజులు నన్ను చూస్తే బ్రాహ్మ రాక్షసుడిని చూసినట్లుగా నడుచుకునే వాళ్లు. తరవాత నా తపన ప్రేమకు దాసోహం అయ్యే వాళ్లు. ఇదిగో చాలా మంది ఇలాగే వ్రాసి నమస్కరించి ఆశ్రమం వదిలి వెళ్లే వాళ్లు.

ఈ క్రింది ప్రేమ లేఖ వ్రాసింది ఒక గ్రామీణ యువతి.

"గురువు గారికి నమస్కారం! నాజీవితంలో మీలాంటి అధ్భుతమైన వ్యక్తిని ఎప్పుడు చూడలేదు. మిమ్మల్ని చూస్తుంటే, స్వయంగా భగవంతుడే మీ రూపంలో తన పిల్లలని సరి అయిన దారిలో తీర్చిదిదేందుకు వచ్చినట్లుంది. మీరు చేప్పే ప్రతి విషయం స్పష్టంగా సత్యంగా ఉంటుంది. మీ మాటలు విన్న ప్రతిసారి నాలో ఎన్నో భావనలు కలిగాయి. అసలు జీవితం అంటే ఎంటో తెలుసుకున్నాను. మీకు ఏ విధంగా కృతజ్ఞతలు తెలిపాలో తెలియడం లేదు. ఈ 30 రోజులలో నాజీవితాన్నే మార్చేసారు. నన్నేకాదు నాలాంటి ఎన్నో వందల మంది అభాగ్యుల జీవితాలను తీర్చిదిద్దే ప్రయాణం మీది.

జీవితంలో మిమ్మల్ని ఎప్పటికి మరిచిపోలేను. మిమ్మల్ని మిస్ అవుతునందుకు చాలా బాధగా ఉంది. ఇంటికి వచ్చాక కూడా మీ మాటలే గుర్తుకు వస్తున్నాయి. మిమ్మల్ని కలవడం నా పూర్వ జన్మసుకృతం అభయ ఆనంద నిలయం అందమైన కుటుంబంలో నేను ఒక్క సభ్యురాలిని అయినందుకు సంతోషంగా ఉంది. అభయ ఫౌండేషన్‌కి మరియు మంచి మనసున్న గురువు గారికి శతకోటి వందనాలు."

ఈ క్రింది ప్రేమ లేఖ వ్రాసింది ఒక గ్రామీణ యువకుడు

"గురువుగారికి నమస్కరిస్తూ వ్రాయునది. మేము ప్రతి రోజు 4:00 గంటలకు లేస్తున్నాం... యోగా చేస్తున్నాం, సూర్య నమస్కారాలు నేర్చుకున్నాము. ప్రతి రోజు స్వామీజీ వ్రాసిన కంపాస్ పుస్తకం నుండి ఒక టాపిక్ గురించి చర్చించడం జరిగింది. పుస్తకం రచయిత అయినటువంటి శ్రీ బాలచంద్ర స్వామీజీ ఆశ్రమంలో ఉన్న సమయంలో చక్కగా సరళంగా అద్భుతంగా వివరిస్తూ ఉంటారు. నిజంగా మాకు తెలియకుండా ఎంత సమయాన్ని వృధా చేసుకున్నామో ఒక్కసారిగా గుర్తు చేసుకంటే చాలా బాధ అవుతుంది. కర్మ యోగాలో భాగంగా వంటశాల పక్కనే ఉన్న స్థలంలో గడ్డి మొక్కలు తీసేయడం, చెట్లకు పాదులు చేయడం, వంటకి సాయం చేయడం మొదలగు పనులు చేసాము. తర్వాత అందరం బ్యాచ్లవారీగా డ్రైవింగ్‌కి వెళ్లాము. మేము ఆశ్రమంలో ఉన్న వాహనాలను శుభ్రపరచడం తుడవడం జరిగింది. గత 10 రోజుల నుండి మొత్తం కారుని, స్టీరింగు, గేర్లు కంట్రోల్ చేయడం జరిగింది.

మేము మా వంతుగా... ఏదో ఉడుతా భక్తిగా అందరం కలిసి తలా కొంత డబ్బులు సేకరించి ఇక్కడ జరుగుతున్న దానికి ఏమైనా చేద్దాం అనుకున్నాము. మాకు ఈ ఆలోచన కూడా ఇక్కడ వాతావరణం వల్లనే వచ్చింది. చిన్న సేవ అయినా మాకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ మధ్యలోనే వందేమాతరం ఫౌండేషన్ నిర్మాత అయిన రవీంద్ర సార్ గారు "మనం డబ్బులు ఎంత సంపాదించిన రేపు ఖర్చయిపోతుంది. అదే సేవ అనేది ఎప్పటికీ నిలిచిపోతుంది అది ఏదో ఒక రూపంలో తిరిగి వస్తుంది" అని చెప్పింది మాకు బాగా నచ్చింది.

తర్వాత గురువుగారితో పాటు చిన్న సమావేశం జరిగింది. వారు అడిగిన ప్రశ్న ఏమిటి అంటే మేము ఏమి నేర్చుకున్నాము ఇన్ని రోజులలో అని! నిజం చెప్పాలంటే చాలా వరకు నేర్చుకున్నాం. అవి అన్ని మాటలలో చెప్పలేక పోయము. కాకపోతే కొన్నింటిని చూద్దాం.

1. క్రమశిక్షణ
2. పెద్దవారిపట్ల మర్యాద
3. సమయపాలన
4. అందరితో కలిసి ఉండటం

5. ఇంట్లో వస్తువులను సరిగ్గా పెట్టడం
6. సేవా దృక్పథం
7. ప్రకృతిని ఆస్వాదించడం
8. యోగా
9. సూర్య నమస్కారములు
10. డైరీ వ్రాయడం
11. ఐకమత్యంగా ఉండటం
12. యూనిఫామ్ మైంటైన్ చేయడం
13. తినేముందు ప్రార్థన
12. ఫోన్ లేకుండా గడపడం.
13. ఎదుటి వారని అర్థం చేసుకోవడం.
14. సమాజిక దృక్పథం
15. మన అనే భావన కలిగి ఉండడం.
16. ఇంట్లో పనులలో సహాయపడటం.
17. మనసు ప్రశాంతతను పొందడం.
18. సుఖ దుఃఖాలను పంచుకోవడం
19. కృతజ్ఞత భావం తెలపడం.
20. వసుదైక కుటుంబము

మొదలగునవి మాత్రమే కాకుండా డ్రైవింగ్ మరియు ఒక ఆదర్శమైన డ్రైవర్‌కి కావాల్సినంత అర్హతలు ఏమిటి అన్నది నేర్చుకోవడం జరిగింది.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం అద్భుతమైన కట్టడము మరియు ఆశ్రమ ప్రదేశం మా మనిసులని హత్తుకున్నాయి. నిజంగా కరెక్టు మనసుపెట్టి చూస్తే పెద్దలు చెప్పినట్టు అరుణాచలం ప్రదేశానికి వెళ్లి వస్తే ఆ భక్తుడి జీవితం అరుణాచలం తరువాత, అరుణాచలం ముందు అన్నట్టుగా... ఇక్కడ కూడా అదే వర్తిస్తుంది. అభయ ఫౌండేషన్ ముందు అభయ ఫౌండేషన్ తర్వాత అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

అక్కడ నుండి వస్తుంటే ఏదో తెలియని బాధ ఏదో కోల్పోయినట్లుగా అనిపించింది. గణేష్ సార్ గారిని గాని మంగా మేడంగారు నర్సింలు అన్న నరసమ్మ అమ్మమ్మ వాళ్లు మరియు సూపర్-60 విద్యార్థులు, స్వామి వారు అందరిని మిస్ అవుతున్న ఫీల్ అనిపించింది. చివరగా అందరినీ పలకరించి మేము తీసుకున్న కొన్ని వస్తువులు యధావిధిగా తిరిగి ఇచ్చేస్తూ బయలుదేరి వచ్చేసాము. నేను మా ఇంటికి చేరాను. మిగిలిన 14 మంది కూడా వారు వారు వాళ్ల ఇంటికి చేరారు. నాకు ఒకసారి హమ్మయ్య అనేట్టుగా అనిపించింది. వచ్చి రెస్ట్ తీసుకున్నాను. సాయంత్రం పూట భోజనం చేసి పడుకున్నాము.

కానీ మేము రోజు ఫౌండేషన్‌లో చేసిన పనులన్నీ ఇంకా కళ్లముందే జరుగుతున్నట్లు అనిపించింది. ఈ విషయాన్ని తోటి వారితో కూడా మాట్లాడడం జరిగింది. తమకు కూడా అలాగే ఉందని అన్నారు. మొత్తానికి నాకు తెలియని ధైర్యం, నమ్మకం... ఈ క్యాంపు ద్వారా నేను గ్రహించడం జరిగింది

నాకు తెలిసి ఇది సరిగ్గా ఉపయోగించే వాళ్లకి ఇది ఒక జీవిత మలుపు అని నేను

చెప్పగలుగుతాను. మేము ఫౌండేషన్‌కి మరియు గురువుగారికి మరియు నాకు సమాచారాన్ని అందించిన వాళ్లకి ఎప్పటికీ ఋణపడి ఉంటాను. ధన్యవాదములు...

ఇట్టి వారి జ్ఞాపకాలతో, అభయ సంస్థకు నాయకత్వము వహించిన మిత్రుడు, సాయి ఆత్మబంధువు కొత్తమసు రంగారావును సదా గుర్తు చేసుకోవాలి. నాకు శ్రీ సత్యబాబా వారిచ్చిన సాయి సోదరుడు అనుకోవాలి. వారి సౌజన్యము, సౌశీల్యము, సహచర్యము, సాన్నిధ్యం, సామీప్యం, స్నేహం అన్నీ కూడా నన్ను మరియు అభయ సంస్థను మరొక మెట్టు ఎక్కించినాయి. వారు 2022లో పరమపదించే దాకా అభయ అధ్యక్షులుగా సేవలు అందించారు. వారి ఇంటినే అభయ కేంద్రంగా మార్చేసారు. నా సహచరుడిగా మారి సేవలలో కృష్ణ సారథ్యం చేసినారు. (పూర్తి వ్యాసం కోసమై "స్వతస్ఫూర్తిని" చదువగలరు).

సాయి కలిపినదీ బంధము
సాయము చేసిన సంబంధము
చేయి పట్టి నన్ను నడిపిన వైనము
రంగా... రావులే మళ్ళీ ఇది నిజము
జన్మరాహిత్యమైనదిలే నీకు సత్యము
జన్మాంతము దాకా నిన్ను తలుస్తాము
అభయాంజలి ఘటిస్తూనే ఉంటాము

ఇలా నా శేష జీవితాన్ని విశేష జీవితంగా చేసే ప్రయాణంలో... ప్రేమను పంచుతూ... ప్రేమను పెంచుతూ... ప్రేమతో జీవిస్తూ పరిమళిస్తున్నాను. ఎక్కడి దాకా ఈ పయనం సాగుతుందో తెలియదు.

103

Reached forest for the rest of life

భారతదర్శనం తర్వాత నా జీవితంలో జరిగిన అత్యంత అద్భుతమైన విశేషం ఏది అని ఆలోచిస్తే, అది నా నగర జీవితం నుండి అడవికి వెళ్లడమే.

స్వామి ఎన్నో సార్లు చెప్పిన ఒక విశేష వాక్యం అప్పుడు నా మనసుకు బలంగా తాకింది. "అందరూ అడవికి వెళ్తామంటారు. వెళ్లడం ఎందుకు అంటే... Going for rest to the forest అని చెబుతారు. కానీ నిజంగా చేయవలసింది ఏమిటి అంటే... "తల అడవిలో ఉండాలి, కానీ చేతులు సమాజంలో ఉండాలి" అని స్వామి చెబుతారు. (Head in the forest, hands in the society) ఈ వాక్యాన్ని నేను నా జీవితానికి వేద వాక్యంలా స్వీకరించాను. శంకరాచార్య చెప్పిన విశేషం బాగా నాకు గుర్తొస్తుంటుంది.

బాలాస్తావత్ క్రీడాసక్తః
స్తరుణిస్తావత్ తరుణిసక్తః
వృద్ధాస్తావత్ చింతాసక్తః
పరమే బ్రహ్మణి కోపినసక్తః

కానీ ఈ మూడు వాక్యాలు కూడా నేను ఎప్పుడూ జీవితంలో అనుభవించలేదు. చిన్నప్పుడు నా చుట్టూ ఉన్న వాళ్లందరూ కూడా ఆడి పాడుతున్న సమయంలో నేను దైవ చింతనలో నా సమయాన్ని గడిపేవాడిని.

ఇక యుక్త వయసులో జరగాల్సిన ఏ ఒక్క విశేషము జరగలేదు. ఇంకా చెప్పాలంటే యవ్వనంలో ఉపనయన సంస్కారం చేశారు తల్లిదండ్రులు. ఉపనయనము అంటే ఉప అంటే దగ్గరగా నయనము అంటే దృష్టి. భగవత్ దృష్టికి దగ్గరగా వెళ్లాలంటే ఉత్తమ మార్గం సేవ అని దానిని భుజస్కంధాల మీద వేసుకున్నాను.

50 ఏళ్లు దాటిన తర్వాత నాలో ఏ కోశాన కూడా చింత, ఆలోచన, ఆతృత, ఆందోళన ఏమీ

లేదు. కారణం ఏమిటో తెలుసా? ఎప్పుడు చూసినా సేవా కార్యంలో నన్ను నేను అంకితం చేసుకోవడమే. ఈ రోజు... ఈ క్షణంలో తుది శ్వాస విడవడానికైనా నేను సిద్ధంగానే ఉంటాను. ఎలాంటి ఆందోళన ఆతురత ఆవేదన ఏమీ లేదు.

శార్వరీ నామ సంవత్సర ఉగాది, నా 50వ పుట్టు పండగ రోజు, అదీ అమావాస్య రోజు అభయ ఆనంద నిలయానికి వెళ్లడం, ఆ క్షణంలో మా అమ్మ నా తోడు ఉండడం చాలా యాదృచ్ఛికం అనుకోవాలి. అమ్మతో పాటుగా నేను నగరం వదిలి ఆ అభయ ఆనంద నిలయానికి వెళ్లాను. ఎక్కడో బెంగళూరులో ఉండాల్సిన అమ్మ నాకు తోడుగా సుమారు రెండు నెలల పాటు అభయ ఆనందనంలో ఉండడం జరిగింది. ఉగాది వచ్చింది, ప్లవ నామసంవత్సరం రోజు నేను స్వామి వారి దగ్గర కూర్చుని ప్రార్థన చేస్తున్నాను. ఆ సమయంలో అనిపించింది నేను ఎట్లా వచ్చాను ఏంటి? అని చెప్పేసి. నిజానికి ఆ సమయంలో కరోనా చూస్తుండగానే భారతదేశానికి వ్యాప్తి చెందడము. ప్రధానమంత్రి అప్రమత్తం అయి హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విశేషం చెప్తుంటే నాకు నాకే ఆశ్చర్యంగా ఉంది.

నేను అభయ ఆనంద నిలయానికి చేరిన నాలుగు రోజులకు దేశం మొత్తం లాక్ డౌన్ ప్రకటించారు. అసలు చెప్పాలంటే విశ్వ మానవ చరిత్రలో లాక్ డౌన్ అనేది గత వందేళ్లలో కూడా ఎప్పుడు జరగలేదు. నేను నిజంగా సిటీలో ఉండి ఉంటే ఏం జరిగేదో నాకు తెలియదు కానీ, స్వామి వారు నన్ను ఇలా కాలరు పట్టి అలా లేపి పడేసినట్లుగా సిటీ నుండి అభయ ఆనంద నిలయంలో పడేశారు. అక్కడ నన్ను చూసుకోవడానికి జనాలు, నేను చూసుకోవడానికి జనాలు, నా చుట్టూరా 20-30 మంది ఆశ్రమ వాసులు, అడవిలో అద్భుతమైన వాతావరణంలో, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, ఆ ప్రశాంతమైన పరిసరాలు నాకు లభించడం నిజంగానే దైవ కృప అనుకున్నాను.

ఉగాది రోజు నేను బాధపడుతూ, "అయ్యో స్వామి ఇలా లాక్ డౌన్ ఐపోయింది. నేను బయటికి వెళ్లలేను, బయటి వాళ్లు ఇక్కడికి రాలేరు ఏం చేయాలి అనుకుంటున్నాను." స్వామి దయతో నాకు ఒక దివ్యమైన ప్రేరణ కలిగింది..."ఏయ్ విద్యార్థుల కోసం ఒక పుస్తకం వ్రాయి"

పూర్వము, స్వతంత్ర సంగ్రామ యోధులను చెరసాలలో వేసిన సమయంలో, వారిని గృహ నిర్బంధం చేసిన సమయంలో, వాళ్ల సమయాన్ని ఏ విధంగా వినియోగించుకున్నారు? ఆ రోజుల్లో మంచి పుస్తకాలు చదివేవారట, లేదా వాళ్ల కుటుంబాలకి ఉత్తరాలు వ్రాసే వాళ్లట, లేదా వాళ్ల అనుభవాలని ఉత్సాహ పూరితంగా జనాలకి ప్రభావితం చేయడానికి గ్రంథాలుగా రచించేవారట. ఆ విషయం గుర్తుకొచ్చి, ఈ స్వీయ నిర్బంధనమును సాకుగా తీసుకుని అలా నేను పుస్తకం వ్రాయవచ్చు అనుకున్నాను.

భగవద్ ప్రేరణ వలన గత నాలుగు దశాబ్దముల నుండి దేశ వ్యాప్తముగా కొన్ని లక్షల కిలో మీటర్లు ప్రయాణం చేసి, ఎన్నో రాష్ట్రాలలో, మరెన్నో లక్షల మంది విద్యార్థిని విద్యార్థులను కలిసి, మాట్లాడి, ముచ్చటించి, ఉత్సాహ ప్రోత్సాహములు అందించి... ప్రేరణ నింపే భాగ్యం కలిగింది. ఎక్కడికి వెళ్లినా ఎవరితో మాట్లాడినా నేటి విద్యార్థుల జీవన విధానంలో చోటు చేసుకుంటున్న వివిధ విశేషాలు కొంత బాధ కలిగిస్తున్నాయి. ప్రధానముగా విద్యార్థులు తమ చదువును పరీక్షలను ఏ విధంగా తీసుకుని ముందుకు వెళ్తున్నారో గమనిస్తే చాలా విషయాలు అవగతం అవుతుంటాయి.

అందు వలన నేను ఎక్కడ మాట్లాడినా ఎన్ని వేల మందితో సంభాషించినా, నాకు తెలిసింది నేను చెప్పడం మానుకుని, విద్యార్థులతో ముచ్చటిస్తూ అసలు వారు ఎదుర్కొంటున్న సమస్యలు

ఏమిటి? ఎందుకు చదవ లేక పోతున్నారు? అసలు ఫెయిల్ అవడానికి కారణం ఏమిటి? వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి? ఇలా కొంత చర్చించి వారి తోటే కారణాలు చెప్పించడం ద్వారా వారిలో అయ్యో ఈ కారణాల వల్లనే కదా నేను చదవ లేక పోయాను... కనీసం ఇప్పటి నుండైనా నేను నా తప్పులు సరి దిద్దుకుని బాగు పడాలన్న వైఖరిని వారిలో తెప్పించే ప్రయత్నం చేస్తుంటాను.

తదనంతరం వాళ్లకు వారుగా ఏకరవు పెట్టిన కారణాలనే ఒక్కొక్కటిగా తీసుకుని, వాటికి సహజమైన, సందర్భానుసారమైన, సవివరమైన, సోదాహరణములతో, నేను నవ్వుతూ... వాళ్లని నవ్విస్తూ వారికి ఆత్మీయుడిలా అమ్మ తమ్ముడిగా మామయ్యగా మారి సరి అయిన సమాధానాలు చెప్తూ వారి గుండెల నిండా స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తుంటాను.

మాట్లాడేది హృదయ పూర్వకముగా ఉంటుంది కాబట్టి, సభ ఏదైనా, స్థలం ఏదైనా, సమయం ఏదైనా... మాట్లాడేది ఏ వయసు వారైతోనైనా, ఎలాంటి పిల్లలతో అయినా... నా మాటలు వారిలో స్ఫూర్తి నింపడం నేను చూస్తుంటాను. నయా పైసా ఖర్చు లేకుండా నా దేశ భవిష్యత్తును తీర్చి దిద్ద గలిగే అద్భుత మయిన అవకాశం నాకు ఈ ఉపన్యాస కళ ద్వారా కలిగింది కదా అని ఎన్నో సార్లు పొంగి పోతుంటాను. వంద మంది ఉంటే ఒక లాగా... వేల మందుంటే ఇంకో లాగా కాకుండా, విద్యార్థులలో స్ఫూర్తి నింపడమే లక్షంగా చేసుకుని సేవ చేస్తున్నాను.

ఈ నేపథ్యంలో... నాతో సంభాషిస్తూ... ఎంతో మంది:

అయ్యా! మీరు చెప్పే ప్రతి విషయం పిల్లలకి మాత్రమే కాదు పెద్దలకు కూడా చాలా ఉపయోగకరముగా ఉన్నాయి. మీరు ఇలాంటి విషయాలు పుస్తక రూపంలో అందిస్తే బాగుంటుంది అనే పుస్తక ప్రియులున్నారు

మేము, ఉపాధ్యాయులమే అయినా... మా జీవితములో ఏనాడు ఇలాంటి విషయాల గురించి ఆలోచించడం గాని చర్చించడం గాని చేయలేదు. మీరు చెప్పే విషయాలు విద్యార్థుల కంటే మాకే ఎక్కువగా ఉపయోగ పడతాయి అనే అధ్యాపకులున్నారు.

అయ్యా! దయ ఉంచి, మీరు చెప్పే మాటలను, ఉపన్యాసాలు పుస్తక రూపములో అందిస్తే తరాలు మారినా అంతరాలు మారినా యువతరానికి ఎప్పుడైనా మను ముందు ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగపడే కర దీపిక అవుతుంది అనే విద్యావేత్తలున్నారు

మీరు, మీ గొంతు పోయేతట్లు చెప్తుంటే మాకు కాస్తా బాధగా ఉంది... మీరు ఏదైనా చేసి మీరు మాట్లాడే సమయంలో ఖర్చు అయినా పరవాలేదు వీడియో తీసి వాటిని యూట్యూబ్‌లో పెడితే మరెంతో మందికి ఉపయోగం అవుతుంది అనే శ్రేయోభిలాషులున్నారు.

మీ భావనలు, చెప్పే విధానం, కట్టు, బొట్టు, జుట్టు, ఆకట్టుకునే చతురత, అనర్గళమైన ఉపన్యాస ధోరణి ఇలా అన్ని ఎంతో స్ఫూర్తి దాయకముగా ఉంటాయి... ఎంతో సహజంగా మీరు సామాజిక, సాంఘిక, పౌరాణిక, దేశ భక్తి ప్రభోదితమైన విషయాలను, సంఘటనలను కళ్లకు కట్టినట్టు చెప్పే విధానం నిజంగా విద్యార్థులకు జీవిత కాలపు స్ఫూర్తి నింపుతుంది అనే తల్లి తండ్రులున్నారు.

సార్, మీరు మాట్లాడేది వింటుంటే... అయ్యో ఇన్నాళ్లు నేను చదువునే కాదు, నా జీవితాన్ని కూడా ఎంత వృధా చేసానో తెలుస్తోంది. ఇక నుండైనా నన్ను నేను మంచి మార్గంలో పెట్టుకుని తల్లి తండ్రులకు సాయం చేస్తాను... బాగా చదువుకుంటాను అనే వేల మంది విద్యార్థినీ విద్యార్థులున్నారు.

ఇలాంటి ఫీడ్ బాక్ ఎన్నో చోట్ల వస్తుంటుంది. కానీ నేనెప్పుడూ వాటి గురించి ఆలోచించనే

లేదు... చేస్తున్న దివ్య కార్యాన్ని మరింత శ్రద్ధ భక్తులతో చేసుకుంటూ ముందుకు వెళ్లడం తప్ప ఇంకో ఆలోచన రాలేదు. కొన్ని చోట్ల గంటల తరబడి మాట్లాడుతుంటాను... మరి కొన్ని చోట్ల గొంతు ఒత్తిడికి గురై మాట్లాడలేని సందర్భాలున్నాయి. ఇంకొన్ని చోట్ల చెస్ట్ పెయిన్ వచ్చి ఇబ్బంది పడి ఉంటాను. దేహమునకు వయసు పెరిగే కొద్దీ వచ్చే కష్టాలు ఇవన్నీ. మును ముందు నా దేశము కోసం నేనేమి చేయగలనో తెలియదు. ఇప్పుడు ఈ దేహానికి 50 ఏళ్లు వచ్చేసాయి. శక్తి యుక్తులు మునుముందు ఎలా ఉంటాయో తెలియదు.

ఇలాంటి పరిస్థితులలో, ఇబ్రహీంపట్నంలోని అభయ ఆనంద నిలయమును వేదికగా చేసుకుని, రాబోయే తరాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఒక పుస్తకం వ్రాయాలని సంకల్పించాను. అందుకు శ్రీ శార్వరి నామ ఉగాదిని ముహూర్తంగా నిర్ణయించి, విశ్వ వ్యాప్తంగా మానవాళిని పట్టి కబలిస్తున్న కోవిడ్-19 (కరోనా) భారత ప్రజలకు ఏకాంత వాసమును ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులందరి ప్రయోజనం కోసమై పుస్తకము వ్రాసే కార్యాన్ని తీసుకున్నాను.

ఈ పుస్తకములో విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు లేవనెత్తిన 63 సమస్యలకు, విచారములకు, కష్టములకు, అంశములను... నాకు తెలిసిన విధంగా వాటికి కావలసిన సమాధానములను ఇచ్చే ప్రయత్నమునకు రూపమే "Compass... Finding the Right Direction!."

ఇందులో ప్రతి విషయానికి, సమస్య, వివరణ, సమాధానం, సూత్రములు, ఉదాహరణ, ప్రేరణదాయకమైన కథ, ఒక స్ఫూర్తి మంత్రము, ఒక చిత్రము ఉంటుంది. అన్ని కలిపితే ఒక్కో వివరణమును ఒక్కో కథలా చెప్పుకునేంతగా తీర్చి దిద్దే ప్రయత్నం చేశాను.

ఈ పుస్తకము వర్తమాన మరియు భావితరాల విద్యార్థులకు ఉపయోగపడితే నా జీవితము సార్థకమైనట్లే అని తలచాను. మునుముందు వయోభారము చేత నేను మాట్లాడ లేకపోయినా... నా భావనలు భారతీయులందరి తోటి ఉంటాయని సంతృప్తి పడొచ్చు అనుకున్నాను. రేపు నేను చచ్చిపోయినా... ఈ పుస్తకం ద్వారా నేను అందరితో కల కాలం జీవించినట్లుగానే అనుకుంటాను.

ఈ అద్భుతమైన ఆలోచనలు వ్యాసములుగా మొదట అభయ సమాచార మాస పత్రిక ద్వారా తెలుగులో ధారావాహిక లాగా ప్రచురించ బడినాయి. ఆ తదుపరి ఆడియో మరియు వీడియో పాఠాలుగా తీర్చి దిద్దాలి. తరవాత హిందీ మరియు ఆంగ్ల భాషల లోకి తర్జుమా చేయ బడింది. అందరికి ఉపయగముగా ఉపయుక్తముగా ఉండడం వలన ఈ పుస్తకాన్ని 3 భాషలలో ప్రచురించడం జరిగిపోయింది. 2023 - 2025 మధ్య కాలంలో CSR నిధులతో మూడు భాషలలో సుమారు 30,000 పుస్తకాలు ముద్రించి, తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక ఉత్తర్వుతో ప్రభుత్వ పాఠశాలల గ్రంధాలయాలకు చేర్చడం జరిగింది. పాఠకులందరికి తప్పక ఈ రచనలు స్ఫూర్తి నింపగలవని నా ప్రగాఢ విశ్వాసము.

ఈ రచనల్లో నాకు అభయ సైనికులు లలిత లహరి, Dr సాయిలత, మహేష్, శ్రీమతి లక్ష్మీ, శ్రీమతి సుహాసిని, ప్రశాంతి, డా. Ch కామేశ్వరి, సురభి చైతన్య, డా. రాజకుమారి, డా. నర్మద, శ్రీమతి భవాని, మహమ్మద్ రంజాన్, భాగ్యలక్ష్మి ఇలా ఎంతో మంది స్వచ్ఛందంగా సాయం చేశారు.

ఇంతటి మహత్కార్యం కేవలం స్వామి వారి ఆశీస్సులతోనే జరగగలదని నా ప్రగాఢ విశ్వాసం.

ఈ రోజు నేను వానప్రస్తము ఉన్నాను. ముందుకు సాగుతూ నేను నిజంగా ఎవరో తెలుసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే నన్ను మరింత మెరుగుపరుచు కోవడానికి, నన్ను తిరిగి నిర్వచించుకోవడానికి, నా జీవితాన్ని కొత్తగా మలచుకోవడానికి ఇది నాకు అవసరం.

104

కరోనా నన్ను సాయి మాత కరుణ పొందేలా చేసింది

మిత్రులారా! భారతదర్శనము, వానప్రస్థ సంకల్పము, అభయ ఆనంద నిలయములో నివాసము, ఇవన్నీ కూడా యాదృచ్ఛికంగా జరిగినవి కాదు అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. చిన్ననాటి నుండి నేను కన్న ప్రతి కల నిజమైందా ఏమి!? అనిపిస్తూ ఉంటుంది.

అభయ ఆనంద నిలయంలో నేను అడుగిడిన వేళా విశేషము ఏమిటో తెలియదు. యావత్ ప్రపంచము కూడా కరోనా మహమ్మారికి గురి అయ్యి, తల్లడిల్లుతున్న సమయంలో, దైవానుగ్రహ విశేషము చేత, నా చుట్టూతా ఒక రక్షణ వలయం ఏర్పడినది. పిలిస్తే పలికే వాళ్లు, రమ్మంటే వచ్చే వాళ్లు, చుట్టూరా నేను కాపాడుకోవాల్సిన వాళ్లు ఉన్నారు.

అసలు కరోనా అడవిలో ఉండే ఆశ్రమ ఛాయలకే రాదు అని ఎంతో ధైర్యంగా, ఎంతో విశ్వాసంతో, ఏం చేయచ్చు ఈ కరోనా లాక్ డౌన్‌లో అని చాలా రకాల ప్రణాళికలు రచించడం మొదలు పెట్టాము. భగవత్ సంకల్పం వలన కరోనా బాధితుల సహాయ కార్యక్రమాలకు శ్రీ కారం చుట్టాము. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభయ స్వచ్ఛంద సేవకులు అందరూ చాలా పాజిటివ్‌గా స్పందించారు. స్వీయ నిర్బంధంలో, ఎలా సేవా కార్యక్రమాలు చేయాలని మేము ఆలోచించినప్పుడు, ప్రధానంగా... దిక్కు లేకుండా, పని దొరకక, ఇంటికే పరిమితమైన తక్కువ ఆదాయం ఉన్న మధ్య దిగువ తరగతి కుటుంబాల పై దృష్టి సారించి, వారికి పదిరోజులకు కావలసిన ఆహార ధాన్యాలు, శానిటైజర్లు, మాస్కులు, వ్యక్తిగత రక్షణ కిట్లు వంటి వస్తువులు అందించటం మొదలు పెట్టాము. వీటన్నింటినీ చేర్చి అభయ అమృత కలశం పేరుతో అందించడం మొదలు పెట్టాము.

ఎప్పుడు స్వామి చెప్పే మాటలు నాకు ప్రతి క్షణం అనుభవంలోకి వస్తూనే ఉంది. "లోన భావనలు పవిత్రమైతే, దేవుడే ఆ కార్యాన్ని సాధించడానికి పని చేస్తాడు." అలాగే ఈ అభయ అమృత కలశ సంకల్పాన్ని అందరితో పంచు కోవడము జరిగింది.

మిత్రులారా, మీరు ఊహించగలరా? మార్చ్ 2020లో ప్రారంభమైన లాక్‌డౌన్, మార్చ్

నుండి జూన్ నాలుగు నెలలలో దేశంలోని 7 రాష్ట్రాలలో సుమారు 10 లక్షల మందికి సేవ చేసే అవకాశం మాకు లభించింది.

ఒక్క అడుగు కూడా అభయ ఆనంద నిలయం బయటకు వేయకుండా సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించగల అదృష్టం నాకు కలిగింది.

ఇబ్రహీంపట్నం కేంద్రంగా జరుగుతున్న కార్యక్రమాన్ని గురించి తెలుసుకున్న ఎంతో మంది ఔత్సాహికమైన గ్రామీణ మహిళలు, అభయ ఉపాధి శిక్షణ పొందిన వారు సంస్థకి రావడం, ఆనంద నిలయంలో లారీలలో వచ్చి చేరే టన్నులకొద్దీ సరుకులను, ఔషధాలను అమృత కళశాలుగా చేయడం జరిగింది. చాలా కలివిడిగా, చాలా హడావిడిగా రోజుకి 50 మంది భోజనం చేయడం అక్కడ, ఎన్నో విశేషాలు జరిగాయి.

ఆ సమయంలో ఎంతో మంది ఆత్మీయులు నన్ను వారించినారు. అరేయ్! జాగ్రత్త ఇంత మంది వస్తున్నారు, కరోనా చాలా ప్రమాద కరమైన రీతిలో వ్యాప్తి చెందుతోంది" అని చెప్పి. నేను అందరికి చెప్పేవాడిని "ఏయ్ ఈ అడవిలోకి ఎందుకు వస్తుంది కరోనా? అద్భుతమైన వాతావరణము, స్వచ్ఛమైన గాలి, జనారణ్యానికి దూరంగా ఉన్న అడవి ఇది ఇక్కడ నాకే కాదు, ఇక్కడున్న ఎవరికీ రాదు, ఇక్కడికి వచ్చినా పోతుంది" అని ఆత్మ విశ్వాసంతో చెప్పాను.

మిత్రులారా! తాను ఒకటి తలిచిన దైవం ఒకటి తలుస్తుంది అన్నట్టుగా, జూన్ 29 అనుకుంటాను. మొట్టమొదటిసారి, నా శరీరంలో తెలియని ఇబ్బంది, గొంతులో నెప్పి, శ్వాసలో ఇబ్బంది, దగ్గు ఇవన్నీ వచ్చాయి. కారణాలు నాలుగు-ఐదు ఉన్నాయి. నేను చేసే కార్యక్రమంలో భాగంగా,నాలుగు నెలలుగా నగరంలో అక్కడ ఇక్కడ కొద్ది సార్లు తిరిగాను. కొంత మంది వేరే వ్యక్తులు ఆశ్రమానికి రావడం, నేను వారితో కూర్చోవడం, నేను వ్రాసిన కంపాస్ పుస్తకాన్ని సమీక్షించడానికి కొంత మంది ఉపాధ్యాయులతో భేటీ అవ్వడం, అదే సమయంలో స్నేహితుల ఇళ్లకు భోజనానికి వెళ్లడం, డాక్టర్ సాయి లతను మహారాష్ట్రలో అకోలాలో ఉన్నత వైద్య విద్య కోసం కాలేజీలో వదిలి రావటం, ఇలా కారణాలు ఏవైనా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నాలుగు రాష్ట్రాలలో సంచరించడం జరిగింది.

జూన్ 29 నుండి జూలై మొదటి వారానికి నా ఆరోగ్యం క్షీణించి అత్యంత ప్రమాదకర స్థాయికి వెళ్లిపోయింది. అభయ సభ్యులు డాక్టర్ శూలపాణి, రాజ్యలక్ష్మి హాస్పిటల్, హైదరాబాద్ వారు చాలా దయతో PPE కిట్‌లో వచ్చి నన్ను పరీక్షించి, కరోనా అని నిర్ధారించారు. చూస్తుండగానే నేను కుప్ప కూలిపోయే స్థాయికి వెళ్లిపోయాను. ఏం చేయాలో తెలియదు. చెప్తే ఎట్లా ఉంటుందో తెలియదు. అక్కడ ఆశ్రమ వాసులు భయపడి పోయారు. బయట వాళ్లు కూడా భయపడిపోయారు. తరువాత నేను నిర్ణయాధికారాన్ని కోల్పోయాను. ఆత్మీయులు కూడా ఎవరూ రాలేక పోయారు. అందరికీ ప్రాణ భయమే. దయానంద్, సాయి సోదరుడు ఎప్పుడూ లేనిది ఆ సమయంలో మొదటి సారి ఆశ్రమానికి వచ్చి నన్ను తీసుకుని వెళ్లి ఆసుపత్రిలో ICUలో చేర్చాడు. నిజంగానే స్వామి దయతో వచ్చాడు దయానంద్ అనిపించింది. లేదంటే ప్రాణం పోయేదేమో తెలియదు.

ఆస్పత్రిలో చేరిన కొన్ని గంటలకు చాలా అపస్మార్క స్థితికి వెళ్లిపోయాను. చికిత్స అందిస్తున్నారు. చూసే వాళ్లు ఎవరు లేరు. ఒక అనాథ లాగానే ఉండి పోయాను ఆస్పత్రి మంచం మీద. లక్షల రూపాయలు ఖర్చు అయిపోయింది. ఐదు పైసలు కూడా నా ఖాతాలో లేదు.

వానప్రస్థమునకు వెళ్లే ముందరె, నా దగ్గర మిగిలి ఉన్న నాలుగైదు లక్షల రూపాయలు మా

ఇళ్లలో ఉన్న చిన్నపిల్లలకు అందరికీ కూడా మునుముందు నేను ఇవ్వలేక పోతానేమో, ఇక నా ఖాతాలో ఐదు పైసలు కూడా ఉండనవసరం లేదు వానప్రస్తం అన్నప్పుడు నాకు ఎందుకు ఇంక అని చెప్పి డబ్బులన్నీ కూడా పిల్లలందరి పేరు మీద చెక్కులు వ్రాసి పంపించేశాను.

నలుగురికి సాయం చేయాలని పెట్టిన అభయ సంస్థకి నేను బరువు అయిపోయానే అని ఎంతో వేదన చెందుతున్న సమయంలో కొన్ని వందల మంది శ్రేయోభిలాషులు, బంధువులు, మిత్రులు, అభయ బోర్డు సభ్యులు, వాలంటీర్స్ ముందుకు వచ్చి, సుమారు ఆరు లక్షల రూపాయలు ప్రోగు చేశారు. నా ఆరోగ్యం కోసమై ఒక ఉద్యమమే చేసారు అందరూ... మిత్రుడు రంగారావు ఆధ్వర్యంలో.

ఇక నా చాప్టర్ అయిపోయింది అనుకున్నాను. ఆస్పత్రి నుండి స్మశానంకే అనిపించింది. కానీ నేను అసలు బాధపడలేదు భయపడలేదు.

ఎందుకంటే నేను ఎప్పుడూ 45 సంవత్సరాలు మాత్రమే బ్రతుకుతానని అనుకునే వాడిని. చంద్రమానం ప్రకారం చూస్తే నాకు 50 కాదు 45 అని, ఇక ఈ దెబ్బతో నేను పోయినట్టే అని అనుకున్నాను.

నేను టాయిలెట్‌కి వెళ్లలేకపోయాను, బెడ్ మీద నుంచీ లేవలేకపోయాను, ఆహారం ఒక్క చంచ కూడా తిన లేకపోయాను, శ్వాస కూడా సరిగ్గా తీసుకోలేకపోయాను.

రోజుకు 30-40 సార్లు మందులు, ఇంజెక్షన్లు నా శరీరంలో వేసే వారు. నిరంతర మానిటరింగ్‌లో పెట్టారు. మొదట ఒక మాస్క్ వేశారు.

మాస్క్ తీసి ఆక్సిజన్ పెట్టే ప్రయత్నం చేశారు. ఆక్సిజన్ లోపలికి వెళ్లకపోతే "బైపాప్ మాస్క్" అనే మరో రకం మాస్క్ వేసారు, వెంటిలేషన్‌కి ఒక అడుగు క్రింది చికిత్స. అపస్మారక స్థితిలో ఉండిపోయాను.

ఏమి చేయాలో తెలియలేదు. వెళ్లిపోయాననే అనుకున్నాను. నాకు తెలియకుండగానే ఊపిరి అందక ఛాతీ పైకి కిందికి ఎగిరి పడుతున్న దృశ్యం నాకు ఇంకా గుర్తుంది. చాలా యాతన... మగతగా ఉంది... చుట్టూరా ICUలో యాంత్రిక శబ్దాలు వినిపిస్తున్నాయి... మత్తులోకి జారి పోతున్నాను.

అలాంటి సమయంలో అకస్మాత్తుగా ఒక దివ్య వాణి వినబడింది. ఏయ్! చూడు!! అని, వెంటనే గాలిలో ఒక అద్భుత దివ్య హస్తము లేచింది, ఆ హస్తాన్ని చూసి నన్ను నేను మర్చిపోయా, ఏమిటిది ఈ హస్తం ఎలా ప్రత్యక్షమైంది అని ఆశ్చర్యం అయ్యింది!

అద్భుతమైన బంగారు నగిషీలు చెక్కిన గాజులు, కర కంకణాలు, ఉంగరాలు తదితర ఆభరణాలతో ఉన్న దివ్యమైన హస్తము నా కళ్లకు కనిపిస్తోంది, ఆ అదృశ్య వాణి ఆదేశం ఇస్తోంది... వెళ్లు లోపలికి అంటూ... అసలు శరీరానికి రంధ్రమే చేయకుండా ఆ దివ్య హస్తము నా శరీరంలోకి దూరిపోయి ఊపిరితిత్తులలో, ఛాతీలో, పేగులలో శుభ్రం చేస్తున్నట్లు తిరిగింది. ఇటు వెళ్లు అటు వెళ్లు అని ఆ దివ్య వాణి చెప్పడము, నేను చూస్తుండగానే నాకు అనుభవం ఔతుండగానే, నా శరీరం లోపల తిరిగి అదృశ్యం అయింది.

ఆ క్షణం నుండి కోలుకోవడం మొదలు పెట్టాను. ఆ రోజు నుండి నేను నిదానంగా కోలుకోవడం మొదలు పెట్టాను. మరుసటి 24 గంటల్లోనే ICU నుండి బయటకు వచ్చాను. పునర్జన్మ అంటే ఇదేనా అనిపించింది. నా జీవితం తిరిగి పునఃప్రారంభమైంది. తర్వాత నన్ను డా శూలపాణి తన

ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. ఆ సాయి భక్తుడు నా జీవితానికి సంజీవినిగా మారినారు. అక్కడ వారి కుటుంబ స్వీయ పర్యవేక్షణలో నేను మరో వారం రోజులు స్వీయ నిర్భంధన నియమాలు పాటిస్తూ, విశ్రాంతి తీసుకొన్నాను.

ఆ సమయంలో, రాజలక్ష్మి ఆస్పత్రిలో డా. హిమబిందు & డా శూలపాణి నా పై ప్రత్యేకమైన శ్రద్ధ చూపించారు. ఎవ్వరు చూడడానికి వీలు లేకుండా ఏర్పాట్లు చేశారు. మాట్లాడటానికి కూడా ఎవరూ లేరు. నేను మాత్రమే నాతో ఉన్నాను.

ఆ క్షణంలో, నాకు అభయ ఆనందం నిలయ సిబ్బంది గుర్తుకు వచ్చింది. అభయ ఆనంద నిలయం మేనేజర్, వెంకట్, నన్ను చిన్న పిల్లాడిలా, ఒక చిన్న పాపలాగా చూసుకున్నాడు. ICUలో ఉన్న 24 గంటల అనుభవం నేను మర్చిపోలేక పోతున్నాను. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లు అనిపించింది. మామూలు మనిషిలా లేను.

ఏమిటి ఆ హస్తం, అమ్మవారా? అమ్మనా? స్వామినా? దేవుడా? దేవతా నాకు తెలియదు కానీ, ఆ దివ్య హస్తం నా శరీరంలోకి వెళ్లిన అనుభవము మనసులో నిక్షిప్తమైపోయింది.

ఎన్నో ఆలోచనలు సుడి తిరుగుతున్నాయి ఆలోచనలు అన్నీ కూడా వెంటనే నేను నా ఫోన్ తెప్పించుకొని ఐదు రోజుల తర్వాత వ్రాయడం మొదలు పెట్టాను.

ఒక రాత్రి, నా బాగోగులు చూసేందుకు వచ్చిన మేనేజర్ వెంకట్‌తో, "అయ్యా వీడియో ఒకటి తీయవయ్యా, నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను నా కృతజ్ఞతను వ్యక్తం చేస్తాను" అని చెప్తే వీడియో తీశాడు.

అంబా! సూక్ష్మ స్థూల కారణ మాతృక
అన్నీ నీవై, అందరి ప్రాణములు నీలోనే దాచి నావు
కరుణామయి మాత కారుణ్యమేమైనదమ్మా భవానీ!
కరోనా విలయమును సృష్టించి కసి తీర్చుకొందువా
అన్ని ప్రాణములలో ఉన్న ప్రాణవాయువు నీవే
తల్లీ... తాపమారంగా మా తమస్సును తెంచవమ్మా
తప్పులన్ సరిచేసి జీవజాతి తెన్నులన్ మార్చి
పునఃప్రాణ ప్రతిష్ట చేసి మమ్ము కూర్చవమ్మా
వేరెవరిని వేడుకొందును చెప్పవమ్మ నీవే ఒప్పుకుందు
ఇంకెవరున్నారు ఇక్కడ నీవుగాక మరి నాకు దిక్కు
మహమ్మారి యందువా మహిమలున్న దానివి కాదా
కరుణించవమ్మా రక్షించవమ్మా క్షమియించి కటాక్షించు
లోకమాత నేను నీకు సమర్పించుకొందునమ్మా

కరోనా విలయంలో యావత్ప్రపంచం విలవిలలాడి పోతున్న ఈ తరుణంలో మనమందరం ప్రార్థిద్దాం. ఆ అమ్మనే ఈ జగత్తులో జరుగుతున్న ప్రతి విషయానికి కారణం, మూలం, ఆధారం అని తెలుసుకొని, ఆమె చిత్తం లేనిదే ఏదీ జరగదని అంగీకరించి, ఆమె కృపే అన్నిటికి కారణమని మనసారా నమ్ముదాం. సమస్త లోకాః సుఖినో భవంతు. అందరూ బాగుండాలి, అందరూ క్షేమంగా ఉండాలి. ఆ భగవతి కరుణ మనందరి మీద ఉండాలి అని కోరుతున్నాను.

ఇది జరిగింది. ఈ కవిత చాల భావోద్వేగ పూర్వకంగా, చాలా అద్భుతంగా వచ్చింది.

ఆయాస పడుతూ, అసలు ఇంకా గొంతు కూడా పెగలట్లేదు. అలాంటి సందర్భం అది. మర్చిపోకూడదు నేను రికార్డ్ చేయాలి అని చెప్పి, రికార్డ్ చేయడము. ఓం శాంతిః శాంతిః శాంతిః అని చెప్పి ఆపేసాను.

సరిగ్గా ఆ సమయంలో ఆ రాత్రి పూట, గది తలుపు ఎవరో కొట్టిన శబ్దం అయింది, చాలా ఆశ్చర్యమైంది ఈ సమయంలో ఎవరబ్బా అని తలుపు తీస్తే... డా. శూలపాణి గారు బయట చేతిలో ఒక ప్లేట్‌తో నిలబడి ఉన్నారు. ఆ ప్లేట్ నిండా ఆహార పదార్థాలు తెచ్చారు. బాలచంద్ర గారు బాగున్నారా? సాయిరామ్! అంతా క్షేమమేనా? అని అడిగారు. ఆయన కూడా స్వామి భక్తుడే. అందరి క్షేమం గురించి నేను పైన ఇంట్లో చండీహోమం చేశాను. అమ్మవారి ప్రసాదం మీ కోసం తెచ్చాను" అని చెప్పారు.

అది విని ఆశ్చర్యంతో మాట రాలేదు. వారు లోపలికి వచ్చి అమ్మవారి యజ్ఞ శేషాన్ని నానుదిటి మీద అద్ది, ప్రసాదం అందించి వెళ్లారు.

నేను చేష్టలుడిగి అలాగే ఉండి పోయాను. తేరుకోవడానికి కొంత సమయం పట్టింది. స్వామి సంకల్పము వల్లనే చావు దాకా వెళ్లి, వెనుతిరిగి రావడం. నేను ఉన్నానయ్యా! అని స్వామి చెప్పినట్టుగా, ఆ దివ్యహస్తం, అభయ హస్తమై నాకు పునర్జన్మ ఇచ్చింది అని చెప్పడానికి ఎట్టి సందేహము లేదు.

స్వామి నాకు రెండో జన్మను ఇచ్చారు
సాయి మాత కొత్త జీవం ఇచ్చారు.

ఈ జీవితం ఇక నా చుట్టూ ఉన్నోళ్ల కోసం అంకితం చేసుకోవాలన్న నిర్ణయం చేశాను చివరి క్షణము దాకా సేవలోనే అంకితము కావాలని దీక్ష తీసుకున్న పవిత్ర క్షణాలవి. ఆ పవిత్ర క్షణాలని మళ్లీ గుర్తు చేసుకుంటూ ఈ విశేషాలతో ఈ వ్యాసం ముగిస్తున్నాను.

105

ఆచార్యులే అనుగ్రహించి పంచిన అవ్యాజ ప్రేమ

సుమారు దశాబ్ద కాలం క్రితం (2014), ఒక రోజు అభయ సంస్థకు శ్రీ చిన్న జీయర్ స్వామీజీ నుండి ఈ మెయిల్ వచ్చింది. అభయ సమాచార పత్రిక వారికి ఈ మెయిల్‌లో చేరగా, వారు దాన్ని ఆసాంతం చదివి వ్రాసిన ప్రత్యుత్తరం అది అని అర్థం అయింది.

"బాలచంద్ర గారు! మీరు చేస్తున్న సేవలు చూసి చాలా సంతోషం అయింది. ఒక రూపాయి సేవకోసం ఖర్చు పెట్టాలంటే 10 సార్లు ఆలోచించే ఈ లోకంలో... ఇంత నిస్వార్థంగా, ఇంత అవిశ్రాంతంగా, మీరు సేవలు చేయడం ఎంతో ప్రశంసనీయం. మీకు సమయం ఉన్నప్పుడు ఒక సారి కలుద్దాం. మంగళాశాసనములతో... ॥చిన్న జీయర్॥"

నాకు నోట మాట రాలేదు... చేష్టలుడిగి పోయాను. శ్రీ సత్య సాయి మార్గంలో పయనిస్తూ... మరే ఇతర ఆధ్యాత్మిక గురువులను నేను సందర్శించలేక పోయాను. అసలు ప్రపంచంలో ఉండే ఏ ఇతర గురువులను... ఆచార్యుల గురించి పెద్దగా తెలుసుకున్నది లేదు. కానీ, వారు నా గురించి తెలుసుకుని ఉత్తరం వ్రాయడం అంటే! ఎలా వివరించాలో తెలియలేదు.

ఒక ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఇలా అభయ ఫౌండేషన్ చేస్తున్న సేవల గురించి వ్రాయడం అంటే... సామాన్యమైన విషయం కాదు. చేతులు వణుకుతుండగా వారికి ఎంతో భయ భక్తులతో నమస్కరించి వ్రాసాను.

స్వామీజీ, మీరు ఎంతో దయతో వ్రాసిన విషయాలు చదివి మా ఆనందానికి అంతే లేదు. మీవంటి వారి ఆశీర్వాదాలు అందుకోవడం అంటే అది మేము చేసుకున్న అదృష్టం. ఈ సేవా కార్యక్రమాలు అన్ని కూడా కేవలం నేను మాత్రమే చేయడం లేదు. ఎంతో మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేతులు కలిపి నిష్కామ భావనతో సేవ చేస్తున్నారు. స్వామి వారు అనుమతి ఇస్తే అందరం కలిసి వచ్చి దర్శనం చేసుకుంటాము. అని వేడుకున్నాను.

ఆశ్రమ సందర్శనం లోపుగా... స్వామి వారి గురించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నాను.

వారు విశిష్టాద్వైత ప్రచారకులుగా, శ్రీ రామానుజాచార్యుల వారి సిద్ధాంతాలకు ఎన్నో విశేష కార్యక్రమాల ద్వారా ప్రాచుర్యం కల్పిస్తున్నారు. వారి ఆశ్రమాలు దేశ విదేశాలలో ఉన్నాయి. వారిని సేవించే భక్తులు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలలో ఉన్నారు.

ఆ తరవాత సుమారు 25 వాహనాలలో వంద మందిమి బయలుదేరి దివ్య సాకేతం ఆశ్రమానికి వెళ్లాము. ఎంతో దయతో, మరెంతో కరుణతో మమ్మల్ని ఆదరించి... ఆశీర్వదించి... అనుగ్రహించి మంగళాశాసనములు అందించారు.

ఆ సందర్భంలో అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన నేను వారిని 3 కోరికలు కోరాను. వారు ఎంతో దయతో ఆలకించారు.

"స్వామి! మీరు అభయ ఫౌండేషన్ నవమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలి" అనగానే తప్పక వస్తాము, డేట్ చెప్పండి అంటూ... రెండవ కోరిక అన్నారు.

"స్వామీ, అభయ ఆనంద నిలయం, హైదరాబాద్‌కు దూరంగా అడవిలో ఉంది. ఒకసారి స్వామి వారు విజయం చేసి ఆశ్రమాన్ని పునీతం చేయాలి." అనగానే

"అలాగే, ఎప్పుడు వెళదాం చెప్పండి" అన్నారు. మూడో కోరిక ఏమిటి అన్నారు.

"స్వామి! మీరు ఈ రోజు పట్టిన అభయ చేతిని ఇక ముందు వదలద్దు!" ఇలా 3 కోరికలు స్వామి ముందుంచగానే స్వామి ఎంతో మధురమైన మందహాసంతో చేయిత్తి అభయ మిచ్చి మంగళాశాసనములు అందించారు.

తదాదిగా! వారి దివ్యాశీస్సులు అభయ సంస్థ కార్యక్రమాలలో అనర్గళ గంగా ప్రవాహంలా అలా పారుతూనే ఉన్నాయి. వారి సౌజన్య... సౌశీల్య... సౌభాగ్యముల చేత సదా సేవలలో అద్భుతాలు ఆవిష్కృతం అవుతూనే ఉన్నాయి. వారి సహచర్యంలో... సామీప్యంలో... సాన్నిధ్యంలో అభయ ఫౌండేషన్ దినదినాభివృద్ధి చెందుతూ సాగిపోతుంది.

నేపాల్ భూకంప బాధితుల సహాయార్థం స్వామి వారు స్వయంగా ఫోన్ చేసిన సందర్భం జీవితములో మరచి పోలేంది. స్వామి వారు అడిగారని 48 గంటలలో 5000 దుప్పట్లకు కావలసిన వనరులు సమీకరించడం ఒక అద్భుతం. వారి సాన్నిధ్యంలో పొందిన ప్రతి అనుభవమూ కూడా శ్రీ సత్య సాయి భగవానుడి దయానుగ్రహం చేత నేర్చుకున్న పాఠాల విలువను తెలిపేదిగా ఉండి... భగవానుడి మీద నాకున్న భక్తిని మరింతగా పెంచింది.

గత దశాబ్ద కాలంగా శ్రీ చిన్న జీయర్ స్వామి వారు ఇచ్చిన అనుగ్రహాన్ని నెమరు వేసుకుంటూ... వారి నుండి నేను ప్రత్యక్షంగా నేర్చుకున్న గుణ పాఠాలను ఇక్కడ మీ కోసమై క్లుప్తంగా వివరిస్తున్నాను.

SRI CHINNA JEEYAR: ఆంగ్ల అక్షరాలను ఒక్కోటి ఒక్కో పుష్పములా తీసి వాటితో సుగంధ భరితమైన సందేశాల మాల కట్టే ప్రయత్నానికి రూపం ఈ క్రింద పేర్కొన్న విషయాలు.

S - Simple Living & High Thinking

ఈ ఆధునిక యుగములో ఎందరో సన్యాసులు / సాధువులను చూస్తున్నాం. కానీ వీరి నిరాడంబర జీవన శైలి చూసినపుడు నిజంగా ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఆశ్రమములో వారు పాదచారులై సంచరించేది చూస్తే ఇది అర్థం అవుతుంది. ఎన్నో సౌకర్యాలు మరెన్నో వసతులు సమకూర్చుకునే శక్తి ఉన్నా... ఈ రోజు కూడా కటిక నేలపైన కూర్చుని... తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. అసలు ఇంత సామాన్యంగా కనిపించే వ్యక్తా విశిష్టాద్వైత ప్రవక్తగా విశ్వ జనులచేత

కీర్తించ బడుతున్నాడు అనిపించక మానదు. దేశాధినేతలు ప్రముఖులు వారి ఉన్నత భావాలను... ఉత్తమాదర్శలను గమనించి ప్రేరణ పొందడం నేను చూసాను. వారి ఉన్నత భావాలకు నిలువెత్తు నిదర్శనం శ్రీ రామానుజ సహస్రాబ్ది సమతా మూర్తి ఆలయ సముదాయం. వారికి భారత దేశ అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ వరించిందంటే ఆశ్చర్యం లేదు మరి.

R - Reguvenating Idealogy

ఈ సహస్రాబ్ది క్రింద నిర్వచించ బడిన విశిష్టాద్వైత సిద్ధాంతాలకు మళ్లీ జీవం పోసి, ఆధునిక విశ్వ జీవులకు ఆ రామానుజ సిద్ధాంతాలు ఏ విధంగా ఆచరణీయమో తెలియ చేయడం చూస్తే ఒక అద్భుతం అని చెప్పాలి. పామరులకు, పండితులకు, ప్రముఖులకు, ప్రసిద్ధ వ్యక్తులకు, సామాన్యులకు, అసమాన్యులకు ఇలా అన్ని వర్గాల వారికి రామానుజాచార్యుల సిద్ధాంతాలు యోగ్యమైనవిగా... ఆచరణీయనైనవిగా... పునర్వైభవాన్ని తెచ్చిన వైనం చూస్తే... జగదాచార్యుల పై వారికున్న భక్తి తెలుస్తుంది. ఇక ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఉండే విశ్వ జనులు ఆధ్యాత్మిక పర్యాటకులై రామానుజ సహస్రాబ్ది... సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రానికి పోటెత్తుతున్నారు.

I - Inspiring Involvement

నేపాల్ భూకంప బాధితుల కోసమై వారు తాత్కాలిక టెంట్లు తెప్పించారు. వాటిలో పరుచుకోవడానికి రగ్గులు అభయ సేకరిస్తోంది. వాటిని చూపించేందుకు దివ్య సాకేతమునకు వెళితే... వారు అక్కడ మైదానంలో వేసిన టెంట్లు పరిశీలిస్తున్నారు. ఒక దానిలోకి స్వయంగా వెళ్లి, దాని ఎత్తు మరియు నిడివి చూస్తుంటే ఆశ్చర్యం అయింది. వారేంటీ అంత సూక్ష్మంగా చూడాల్సిన అవసరం ఉందా!? అని... అవి పరిశీలిస్తూ ఆశ్రమ నిర్వాహకులకు సూచనలు ఇచ్చేది చూస్తే మరింత ఆశ్చర్యం అయ్యింది.

ఇదే స్వామి వారు... వెయ్యి కోట్లతో చేపట్టిన రామానుజ సహస్రాబ్ది ఆలయ సముదాయాన్ని కూడా అంతే సూక్ష్మ దృష్టితో... సునిశితంగా ప్రతి అంకము కూడా చూస్తూ... వాస్తు శిల్పులకు మరియు నిర్మాణ నిపుణులకు దిశ నిర్దేశం ఇచ్చింది చూసినప్పుడు మరింత ఆశ్చర్యం అయ్యింది. ఇట్టి స్ఫూర్తి దాయకమైన ప్రమేయం వలననే కదా వారి కార్యం జగద్విదితం అయ్యింది అనిపించింది.

C - Caring the Cause

2014 సంవత్సరంలో అనుకుంటాను. కంపెనీ సెక్రెటరీ ఉద్యోగం చేస్తున్నప్పుడు నేను సొంత డబ్బుతో కొన్న కారు పాతబడి ఇబ్బంది పెడుతోంది అని అభయ ధర్మకర్తల సమావేశంలో తెలిపాను. అందరూ చేరి, మీరు ప్రస్తుతం పూర్తి కాలము మీ సేవలను అభయ కోసమై వెచ్చిస్తున్నందున... 12 లక్షల రూపాయల బడ్జెట్‌తో ఫౌండేషన్ తరఫున కొత్త కారును ఖరీదు చేయండి అని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

నాకా నిర్ణయం అంత రుచించలేదు. తరవాత నేను అందరికి సందేశం పంపించాను. అయ్యా! మనము సంస్థకు వీలైతే ఆస్తులు సమకూర్చాలి కానీ, ఇలా దాతలు సంస్థకు ఇచ్చిన విరాళములను ఖర్చు చేయడం పాడి కాదు. అందువలన నా పాత కారు అమ్మితే వచ్చిన 3 లక్షలు, మరియు ఉద్యోగం వదిలిపెట్టినందుకు కంపెనీ వారిచ్చిన 3 లక్షలు పరిహారం... మొత్తం 6 లక్షలు కారు

నిమిత్తమై అభయ సంస్థకు విరాళంగా ప్రకటిస్తున్నాను. మీరు అందరూ కూడా దయతో ఎంతో కొంత విరాళం ఇచ్చినట్లైతే... మనం కారు కొని సంస్థకు ఇచ్చినట్లవుతుంది అని చెప్పాను.

24 గంటలు గడవక ముందే... మొత్తం 12 లక్షలు సమకూరింది. రెనాల్ట్ వారి 8 సీట్ల వాహనం కూడా చూసేసి, కాస్తా మొత్తాన్ని అడ్వాన్సుగా కట్టి రసీదు తీసుకున్నాము.

అప్పుడు, ఒక ధర్మకర్త సందేహం వెలిబుచ్చారు... అయ్యా ఇప్పుడు మనం చేస్తున్న వ్యవహారం విమర్శలకు దారి తీస్తుందేమో కాస్తా ఆలోచించండి. ఇప్పటి దాకా చిన్న కారులో తిరిగిన మీరు... ఉన్నట్టుండి ఉద్యోగం వదిలి అభయ కోసం పని చేస్తున్న సమయంలో పెద్ద వాహనంలో తిరగడం బాగోదేమో!?

ఈ సందేహానికి సమాధానం ఎవరు చెప్పాలి... సంకటంలో పడేసింది నన్ను. దిక్కు తెలియక, జీయర్ స్వామి వారికి వ్రాసుకున్నాను.

స్వామి వారు ఎంతో దయతో... నాకు సమాధానం పంపినారు.

బాలచంద్ర గారు... అక్షయ తృతీయ రోజున మంగళాశాసనాలు అందుకోండి. మీరేమి చేసినా బంగారమే అవుతుంది. మీతో పని చేసిన వాళ్లకు బంగారము అవుతుంది. మీ మాట కూడా బంగారమే అవుతుంది. వెంటనే వెళ్లి ఆ పెద్ద వాహనం కొనండి. అది మీ సుఖం కోసం కాదు... దాని వలన ఆరోగ్యంగా ఉంటూ ప్రయాణం చేస్తారు... మరింత మందిని చేరుకుని సేవ చేస్తారు. ఏమైనా తక్కువ ఐతే మాకు చెప్పండి. మేము కూడా సాయం చేస్తాము అని చెప్పారు.

నా ఒళ్లంతా పులకరించి పోయింది. స్వామి వారిని ఒక్క రూపాయి ఇవ్వమని అర్థించాను. వారు సరే అన్నారు. అప్పుడు వారు కూడా కారుకు యజమాని అయ్యారు అని చెప్పి, వాహనాన్ని వారి చేతుల మీదుగా డెలివరీ తీసుకొమ్మని ప్రార్థించాను.

వారెంతో ప్రేమతో... అభయ కార్యం మీద దయతో నాడు స్వయంగా కొత్త వాహనాన్ని అందుకుని, వాహన చోదకుడిగా మారి నన్ను అందులో కూర్చోబెట్టుకుని దివ్య సాకేతం నాలుగు వీధుల్లో నడిపి... 50001 రూపాయలు అనుగ్రహించి! మరిన్ని మంచి పనులు చేయమని మంగళశాసనములు అందించటం నేను మరువలేను. ఆ తరవాత కాలంలో మరొక మూడు వాహనాలను కూడా స్వామి వారు స్వయానా డెలివరీ తీసుకుని వాటిని సేవలకు అంకితం చేశారు. మంచి పని కోసమై వారు చూపించే దయను చూస్తే హృదయం ద్రవించి కళ్లలో కన్నీళ్లు స్రవిస్తాయి.

H - Heartful Appreciation

దశాబ్ద కాలంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా వారికి అభయ సమాచార పత్రిక పంపుతూ ఉంటాము. ఎన్నో సార్లు స్వామి వారు ఆ సమాచార పత్రికలను ప్రశంసించడం విన్నప్పుడు... గుండెల నిండుగా సంతృప్తి కలుగుతుంది. వారి హృదయ పూర్వకమైన ప్రశంసలు ఎన్నో కార్యక్రమాలలో అందుకునే భాగ్యం అభయ సంస్థకు కలిగింది. ఎన్నో సార్లు వారు స్వయంగా అభయ కార్యక్రమాలకు విజయం చేసి... అభయ ఆత్మ బంధువులను, ధర్మకర్తలను, దాతలను, స్వచ్ఛంద సేవకులను, లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడటం అంటే అది సామాన్యమైన విషయం కాదు. వారి ప్రతి ప్రశంస కూడా అభయ ఫౌండేషన్‌కు ఉద్యమోత్సాహాన్ని అందిస్తూనే ఉంటుంది.

I - Involving Leadership

నాకు గుర్తుంది... సమతా మూర్తి లోకార్పణ కార్యంలో రాముడికి ఉడతలా సేవించాలి అని, వారి అనుమతితో దివ్య సాకేతములో సుమారు 5 నెలలు ఉండి పోయి, ప్రారంభోత్సవ కార్యక్రమాలలో స్వచ్ఛందంగా సేవించుకున్నాను.

ఆ సమయంలో ఆచార్యులు బయట నుండి వెళ్లిన నా లాంటి వాడికి ఏ విధంగా కార్యనిర్వహణ అనుగ్రహించారో తలచుకుంటే ఇప్పటికీ మనసు విచలితమవుతుంది.

సామాన్య కార్యకర్తను కూడా కాదు. కానీ సహస్రాబ్ది ప్రాజెక్ట్ మొదటి రోజు నుండి పనులు చూస్తున్న వారితో సమానంగా నన్ను నిలబెట్టారు. అందరికి స్వయంగా నన్ను పరిచయం చేశారు. తెలుగు రాష్ట్రాలలో పర్యటించి వికాస తరంగిణి సంస్థ సభ్యులకు ఆచార్యుల సందేశాన్ని మరియు సేవ చేసే అవకాశాన్ని అందించమని ఆశ్రమము తరఫున వాహనాన్ని ఏర్పాటు చేసి, తోడుగా స్వామి వారి అంతరంగికులను సైతం ఇచ్చి పంపించారు. వేలాది మంది స్వామి వారి భక్తులను కలిసి ఉత్సాహ పరిచే అరుదైన అవకాశం ఇచ్చారు. సమతా మూర్తి లోకార్పణ కార్యంలో 10000 మంది సేవకులను కార్యశూరులుగా మార్చే ప్రణాళికలను నాతో రచింప చేశారు. అంతే కాదు, సమతా మూర్తి స్ఫూర్తి కేంద్ర పర్యవేక్షణ కేంద్రములో నన్ను ఆశ్రమ ప్రతినిధిగా నియమించి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించే అవకాశం ఇచ్చారు. చివరికి ప్రధాన మంత్రి భద్రతా సిబ్బందితో సైతం చర్చించి వారి పర్యటన ఏర్పాట్లు చేయించారు.

అసలు, నా లాంటి సామాన్యుడికి వారు ఇలా నాయకత్వం ఇవ్వడం అంటే ఏమిటి అన్నది అర్థం కాలేదు. అయినా ఆ నాడు కోతులను ముందుంచి రాముడు యుద్ధం చేయించ లేదా?... మరి నాలాంటి వాడిని ముందు నిలబెట్టి స్వామి కార్యం చేయించడం పెద్ద సంగతి కాదు కదా!

N - Never said no to Good

వారిని ఎన్నో సందర్భాలలో గమనించాను. ఎప్పుడు కూడా మంచిని వద్దని వారించలేదు. మంచి పనిని ప్రోత్సహించడమే చూసాను. భారత దర్శన్ సంకల్పం తీసుకుని 2019వ సంవత్సరంలో వారి దగ్గరికి వెళితే... తప్పక వెళ్లండి! మంచి జరుగుతుంది. మీ ఆలోచనలను దేశానికి వివరించండి అని ప్రోత్సహించారు. ఎప్పుడు వెళ్లాలి స్వామి అని అడిగితే! తమ మెడలోని పవిత్ర మాలను నా మెడలో అలంకరించి తదేవ లగ్నం సుదినం తదేవ... తారా బలం చంద్ర బలం తదేవా... అంటూ... వెంటనే బయలుదేరమని చెప్పడంలోని అంతరార్థం గమనిస్తే... మంచి పని ఎప్పుడూ వాయిదా వేయవద్దు వెంటనే చేయాలన్న శ్రీ సత్య సాయి మాటలు గుర్తుకు వచ్చాయి. ఆ తరవాత 180 రోజుల భారత దర్శన్ యాత్రను దిగ్విజయంగా ముగించాను కూడా. నా అనుభవాల గ్రంథాన్ని వారే ఆవిష్కరించారు.

N - Newer Technology

ఆధునిక యుగంలో... ప్రతి ఒక్కరికి సాంకేతికత దగ్గరైంది. శ్రీ చిన్న జీయర్ స్వామి వారి సాంకేతిక జ్ఞానము నైపుణ్యము ఎవరినైనా అబ్బుర పరుస్తుంది. చాలా సందర్భాలలో వారిని స్వయంగా కలిసి మాట్లాడటం సాధ్యం కాదు. కానీ సాంకేతికత ద్వారా వారితో ఎప్పుడైనా సంపర్కం కావచ్చు. కొత్త టెక్నాలజీని వారు స్వయంగా ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, నేర్చుకుంటూ, నైపుణ్యాలను పెంచుకుంటూ

ఉండటం అనేది ఈ రోజు ఎవరికైనా సరే నేర్చుకోవాల్సిన పాఠమే! వారు, వారి సంస్థలు అన్ని చోట్లా కూడా సాంకేతికతకు పెద్ద పీట వేయడం చూసాను. ఇక వారి నేత్ర విద్యాలయం ఒక ఆధునిక మహిమగా పేర్కొనవచ్చు. అక్కడి పాఠశాల అంధ విద్యార్థులు సహితము కంప్యూటర్‌ను ఉపయోగించి పరీక్షలు వ్రాయడం దేశంలోనే అరుదుగా చెప్పచ్చు. అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా వారు తమ సందేశాలను అన్ని వర్గాలకు అందించే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది.

A - Affectionate All the Time

వారికి వ్రాసుకున్న ఏ విషయం కూడా వారి దయా దృష్టి నుండి తప్పించుకోలేదు ఇప్పటిదాకా. ఎన్నో విషయాలు చిన్నా పెద్దా... చీకూ చింతా లేకుండా ఒక తండ్రితోనో లేక ఆత్మీయుడితోనో చెప్పుకునే విధంగా చెప్పు కంటూనే ఉన్నాను.

2020 సంవత్సరం అనుకుంటాను... ఆచార్యుల మాతృ మూర్తి పరమపదము చేరుకున్నారు. కరోనా సమయం అయినా సరే తండోపతండాలుగా జనం ఆ పుణ్య మూర్తిని దర్శించుకుని నివాళి సమర్పిస్తున్నారు. ఆ దృశ్యం చూసి చాలా భావోద్వేగంతో వారికి ప్రదక్షిణ చేసి, స్వామి వారికి కనిపించి, వెను తిరిగి వస్తూ... ఆ మాతృ మూర్తికి భావ పూర్ణ శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికి ఒక సందేశం పంపించాను. అంతే గాక ప్రతి సంవత్సరం అభయ ఆనంద నిలయంలో అన్న ప్రసాదం వారి జ్ఞాపకార్థం అందిస్తామని విన్నవించాను. మీరు నమ్మరు... 16వ రోజు అనుకుంటాను... స్వామి వారి ఆశ్రమ నిర్వాహకులు ఫోన్ చేశారు. అయ్యా! మీరు వ్రాసిన సందేశం శ్రీవారు చదివారు. ఎంతో సంతోషించి, అభయ ఆనంద నిలయానికి వారి అమ్మ గారి పేరు మీద లక్ష రూపాయలు పంపమని ఆదేశించారు. నా నోట మాట రాలేదు. వారికి అమ్మ మీద ప్రేమ నాకు తెలుసు... కానీ అభయ మీద ప్రేమను చూపించడం అంటే ఒక దివ్య శక్తి చేరినట్లు అయ్యింది మా కార్యంలో...

J - Joyful Living

వారి దిన చర్యను చూస్తే... అసలు వారికి విశ్రాంతి ఎప్పుడు ఉంటుంది అన్నది తెలియనే తెలియదు. ఎప్పుడు నిద్రిస్తారు అన్నది కూడా అర్థం కాదు. ఎందుకంటే వారి నుండి సందేశాలు మధ్య రాత్రి, తెల్లవారుఝామున కూడా వస్తాయి. అసలు వారు ఎప్పుడు ఆరగిస్తారు అన్నది కూడా తెలియదు... కానీ వారు దినమంతా ఎంతో ఆనందంగా... ఆహ్లాదంగా... అవ్యాజ ప్రేమతో అందరికీ కనిపిస్తూ ఉంటారు. ఆచార్యులను చూస్తే... మనం అలా ఉండగలిగితే ఇక మన జన్మ సార్థకం ఔతుంది అనిపించక మానదు.

E - Encouraging the Good Work

ఆచార్యుల వారి జీవితాన్ని ఒక సారి పరిశీలిస్తే... మంచిని ఎక్కడున్నా సరే వారు ప్రోత్సహిస్తూనే ఉండటం గమనించ వచ్చు. వారిని ఎప్పుడు దర్శించినా... ఎంత సేపు వారి సన్నిధిలో గడిపినా ఇదే విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఎంత ప్రేమతో మాట్లాడతారు. ఎంత వివరంగా మాట్లాడతారు. ఎంత దయతో మాట్లాడతారు... ఎదుటి వారి హృదయాలను ప్రభావితం చేస్తారు. నా జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని వారికి విన్నవిస్తూ ఉంటాను. వారెప్పుడూ సత్కార్యాలను ప్రోత్సహిస్తూ ఉంటారు. అంతే కాదు... అవసరం ఐతే చేస్తున్న పనులను సరి దిద్దిమని సూచిస్తుంటారు.

E - Empathising with one in need

చాలా ఏళ్ల క్రితం రాజి అని ఒక అమ్మాయిని అభయ సంస్థ ద్వారా ఎవరెస్టు శిఖరం ఎక్కేందుకై సుమారు 20 లక్షలు సేకరించే ప్రయత్నంలో ఉన్నాము. స్వామి వారికి వ్రాసుకొని ఆ ప్రయత్నంలో మేము విజయం సాధించాలని... ఆ అమ్మాయికి వారి దర్శనం చేయించాలని తీసుకుని వెళ్లాను. ఎంతో దయతో ఆమెను ఆశీర్వదించి ప్రయత్నం చేయమని ప్రోత్సహించారు. చాలా ప్రయత్నం చేసాము వనరులు సేకరించేందుకు... చివరికి ఇంకో 5లక్షలు కావాల్సి వచ్చింది. ఇదే విషయాన్ని వారితో విన్నవిద్దాము అని అందరితో పాటుగా వారి దర్శనం చేసుకున్నాం.

స్వామి! ఇలా ఇంకొక 5 లక్షలు తక్కువ పడింది అంటే... ఎంతో మధురంగా! పెరుమాళ్లు దయ ఉంటే అది కూడా వచ్చేస్తుంది అని సెలవిచ్చారు. అంతే... ఆ గుంపులో ఉన్న ఒక భక్తుడు వెంటనే అందుకుని... "స్వామి వారు అనుగ్రహిస్తే ఆ 5 లక్షలు మేము అందజేస్తాము" అని చెప్పారు. ఇది కలయా నిజమా అన్నది అర్థం చేసుకోవడానికి ఒక 5 నిముషాలు పట్టింది. అదే రోజు సాయింత్రం బహిరంగ సభలో 5లక్షల చెక్కు ఆ అమ్మాయి కోసం ఇవ్వడం జరిగి పోయింది. మంచిని వారు ప్రోత్సహించే తీరు ఎవరినైనా సరే ముగ్ధులను చేస్తుంది, సదాచారులుగా మార్చేస్తుంది అని చెప్పేందుకు ఇది ఒక ఉదాహరణ.

A - Aspiring Attitude

వారి లక్ష్యాలు చాలా సమున్నతంగా ఉంటాయి. ఎంతో దార్శనికతతో ప్రతి విషయాన్ని చూస్తారు అన్నది అర్థం ఐనప్పుడు ఆశ్చర్యం ఔతుంది. ఎవరికైనా సరే వారికున్న ఉన్నత లక్ష్యాలు, ఆశావహ దృక్పథం, పట్టుదల, నేర్చుకోవడం, తపన ఉంటే... ఈ ప్రపంచంలో ఎట్టి అద్భుతాలైనా సాధిస్తారు అని తెలుసుకున్నాను. వారి ఆశ్రమాలు దేశ విదేశాలలో ఉన్నాయి... వాటిని నిర్వహించడం అంటే అది మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఒక పాఠం అవుతుంది.

R - Righteous Approach

వారి జీవితం అంతా కూడా 'సత్యం వద... ధర్మం చర', ధర్మో రక్షతి రక్షితః, సర్వ జీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి అన్న ఆర్యోక్తుల సమాహారం అనిపించక మానదు.

ఇట్టి మహనీయుల సహచర్యంలో చరించే అరుదైన భాగ్యము శ్రీ సత్య సాయినాథుడు ప్రసాదించాడని నేను నమ్ముతున్నాను.

106

స్వచ్ఛంధ సంస్థలు... స్వీయ సంస్కరణ కేంద్రాలు

శ్రీ సత్య సాయి సేవా సంస్థలో సుమారు 4 దశాబ్దాలుగా ఎన్నెన్నో సేవలు చేసే అవకాశం స్వామి వారు ఇచ్చారు. 20 ఏళ్ల క్రితం వరకు ఇక వేరే ప్రపంచం తెలియకుండా... కేవలం స్వామి వారి రూప నామములు నమ్ముతూ, సాయి సంస్థ సిద్ధాంతాలను, నియమ నిబంధనలను పాటిస్తూ గడిపేసాను.

రెండు దశాబ్దాల క్రితం (2006) స్వామి సంకల్పం చేత... వ్యాపార, వాణిజ్య, వ్యవహార సంస్థలను, స్వామి పరిచయమే లేని బంధు మిత్రులను, శ్రేయోభిలాషులను, సహోద్యోగులను సేవా ప్రస్థానంలోకి తీసుకుని రావాలన్న తపవతో, సేవోత్సాహంతో అభయ ఫౌండేషన్ స్థాపించడం జరిగింది.

అభయ సంస్థ ద్వారా వందలాది స్వచ్ఛంద సంస్థలతో చేయి కలిపి సేవలు చేసే భాగ్యం కలిగింది. భారత దేశంలో వివిధ రాష్ట్రాలలో ఆయా సందర్భాన్ని బట్టి... అవకాశాన్ని బట్టి భావ సారూప్యం గల స్వచ్ఛంద సంస్థలతో చేరి ఎక్కువ మరియు మంచి ఫలితాలను రాబట్టే ఆర్తితో పని చేసే అవకాశం కలిగింది. ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భూకంపాలు, మహమ్మారిలు సంభవించినప్పుడు, అభయ సంస్థ ప్రాభవం ప్రభావం లేని రాష్ట్రాలలో వారికి సేవ చేయాలన్న ఆకలితో, అక్కడ ఉండే స్థానిక సంస్థలతో చేతులు కలిపి మంచి పని చేసే ప్రయత్నం గత 2 దశాబ్దాలుగా అభయ బృందం చేస్తూనే ఉంది.

సామాన్యంగా... ఏ స్వచ్ఛంద సంస్థ కూడా మరొక స్వచ్ఛంద సంస్థతో చేరి పని చేయదు. కానీ అభయ ఆలోచన ఏమిటి అంటే... సేవ కేవలం మేమే చేయాలి... మేము మాత్రమే చేయాలి అన్న సంకుచిత భావన ఎప్పుడూ లేదు. చిన్న సంస్థలు ఐనా సరే మనము అనుకున్న పనికి వారి చేయూత అవసరం ఐతే వారితో సంతోషంగా చేయి కలిపి ముందుకు వెళ్లడమే!

కొన్ని సంస్థలకు ధన వనరులు ఉండవు, మరి కొన్నింటికి సృజనాత్మకత లోపించి ఉంటుంది,

ఇంకొన్ని వాటిలో మానవ వనరులు ఉండవు, మరి కొన్ని సంస్థలకు నెట్ వర్క్ ఉండదు, ఇంకొన్ని వాటిలో సరి అయిన ప్రభుత్వ అనుమతులు ఉండవు... ఇలా పరస్పర బలం మరియు బలహీనతలను ఆధారంగా చేసుకుని.. చేయి చేయి కలిపి సమాజ సేవలు చేస్తున్నాం.

కొన్ని సందర్భాలలో ఇతర సంస్థలతో పని చేస్తున్నప్పుడు మంచి గుణ పాఠాలు కూడా నేర్చుకుంటూ ఉంటాము. ఎన్నో సార్లు ఎదురు దెబ్బలు కూడా తిని తల బొప్పి కట్టి ఉంటుంది. ఎంతో మంచి భావనతో మనం చేద్దామని అనుకున్నా... అవతలి వ్యక్తులు పారదర్శకంగా లేక పోవడం వలన మా చేతులు కాలే దాకా వెళ్లాయి. కానీ సేవను అసిధారా వ్రతంలా ఎంచి భావసారూప్యం ఉన్న సంస్థలతో చేయి చేయి కలిపి సేవలు చేస్తూనే ఉన్నాము. అనుకున్నది సాధించ గలిగితే... విజయ పాఠం. సాధించలేక పోతే జీవిత పాఠం!!

ఈ జీవిత గమనంలో కొన్ని సంస్థలతో పని చేయడం మాత్రం మరచి పోలేని అనుభవం నాకు. ఎంతో విలువైన భాగస్వామ్యం మాదై, మేము చేపట్టిన సమాజ సేవలు మరింతగా శోభించాయి అంటే ఇట్టి వారితో చేతులు కలిపి చేయడం వలన. అలాంటి కొన్ని సంస్థల గురించి, వారి శ్రేష్ఠత్వం గురించి, వారి సౌజన్యంతో చేసిన మంచి పనుల గురించి, వారినుండి నేర్చుకున్న విలువైన పాఠాల గురించి ఇక్కడ ప్రస్తావించే ప్రయత్నం చేస్తున్నాను.

100 Smiles - Telangana

చిన్నప్పుడు ఒట్టికాళ్లతో నడిచి బడికి వెళ్లిన అబ్బాయి... ప్రస్తుత కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాములోని చికాగో పట్టణంలో ఉన్నత ఉద్యోగం చేసేకి వెళ్లడం అన్నది సామాన్యమైన విషయం కాదు. చెర్లపాలెం నుండి చికాగోకి చేరిన వ్యక్తి కథ ఇది. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరుకు దగ్గరలో ఉన్న ఒక చిన్నకు గ్రామం చెర్లపాలెం. అక్కడ పుట్టి, అక్కడే పెరిగి ప్రభుత్వ పాఠశాలలో చదివి, అయ్యో ఇలా చదివితే కాదు బాగా చదవాలి అని వారి తాత గారి ఊరు, తొర్రూరుకు నడుచుకుంటూ వెళ్లిపోయాడు అంత చిన్న వయసులో. కారణం అక్కడ మంచి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుకోవచ్చు అన్న ఆపేక్షతో! అలా మొదలైన తన జీవితం CBIT కళాశాలలో ఇంజనీరింగ్ పట్టభద్రుడిగా మారేదాకా సాగింది. విశ్వవిద్యాలయ ఆవరణ నియామకాలలో భాగంగా అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం సాధించగలిగాడు.

చక్కటి ఉద్యోగం, చేతినిండా డబ్బులు... ఇవేవీ తనకు సంతృప్తి ఇవ్వలేదు. ఏదో చేయాలని, చిన్ననాడు తను పడిన కష్టాలే ఇంకెంతో మంది ఈ రోజుల్లో కూడా పడుతున్నారన్న విషయం గమనించి, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల లేమినీ గుర్తించి, దిశా దశ లేకుండా గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలు బ్రతికే విధానము... ఇలా ఇవన్నీ చూసి చలించిపోయి, ఆ గ్రామీణ ప్రాంతాల పిల్లల ముఖాలలో చదువుల చిరు నవ్వులు చూడాలన్న ఆలోచనతో 100 Smiles Charity Foundation స్థాపించాడు. తద్వారా మిత్రులు, శ్రేయోభిలాషులు, సహోద్యోగుల సహాయ సహకారాలతో ఎప్పుడు వీలైతే అప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేవాడు. కేవలం మాటలతో సరిపుచ్చకుండా, అక్కడ మౌలిక సదుపాయాలు లేమిని గుర్తించి, తనకు తోచిన విధంగా వ్యాపార సంస్థల నుండి సేకరించిన విరాళాలతో తన సొంత వనరులు వెచ్చించి ప్రభుత్వ బడులలో కాస్త కూస్తా మంచి పని చేసేవాడు. తద్వారా అక్కడి విద్యార్థిని విద్యార్థుల హృదయాలలో ఆత్మవిశ్వాసాన్ని రగిల్చాడు.

సుమారు దశాబ్ద కాలం నుండి సాగుతున్న ఈ సేవా ప్రస్థానంలో భాగంగా అతను 50 ప్రభుత్వ పాఠశాలలలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం, 500 మంది ఉపాధ్యాయులను ఉత్సాహపరచడం, సుమారు 20000 మంది విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించడం జరిగింది.

అంతటితో ఆగలేదు, విదేశాలలో ఉద్యోగం చేయాలన్న తపనతో హైదరాబాదు నుండి అమెరికా సంయుక్త రాష్ట్రములోని చికాగో పట్టణానికి చేరాడు. మధ్యలో వివాహం కూడా చేసుకున్నాడు. భార్యా బిడ్డ, అమ్మానాన్న, అన్నా వదిన... కుటుంబం అంతా ఉన్న సరే, తన నిజ ఆనందాన్ని సేవలో వెతుక్కునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ఇతని పేరు మనోజ్ కుమార్ చిట్టిమల్ల అప్పుడెప్పుడో ఒక సేవా కార్యక్రమంలో నన్ను కలిశాడు. ఆనాటి నుండి నేటిదాకా అభయ ఫౌండేషన్, 100 స్మైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్నో పాఠశాలలలో మౌలిక సదుపాయాల కల్పన చేసింది.

ఇతని గురించి చెప్పడం అంటే ఒక కదిలే ఉత్సాహం ఎలా ఉంటుందో చూపించడమే ఔతుంది. ఒక నడిచే సేవకుడిని పరిచయం చేయడమే అవుతుంది. వీరు మరియు వీరి బృందము 100 స్మైల్స్ ఫౌండేషన్‌ని అలా ముందుకు తీసుకెళ్తూనే ఉన్నారు

వీరి నుండి నేను నేర్చుకున్న పాఠాలు

- సేవ అంటే బాధ్యత, బరువు కాదు...
- సేవ అంటే సదా ప్రవహించే ఉత్సాహము!!
- సేవ అంటే అన్ని వదిలి వెళ్లడం కాదు...
- సేవ చేయి చేయి కలిపి చేయడం!!

సేవలో ప్రణాళిక, పత్రాలు, నిర్వహణ, యాజమాన్యం మరియు పారదర్శకత ప్రాధాన్యత.

ఒకసారి పట్టుకుంటే అనుకున్నది సాధించేదాకా విశ్రమించని వైనం!! స్వచ్ఛంద సంస్థల సంయుక్త భాగస్వామ్యం... పరస్పర గౌరవంతో ఎలా చేయొచ్చు

ఇలా ఎన్నో పాఠాలను నేర్చుకుంటూనే ఉన్నాను. మనోజ్ కుమార్ మరియు 100 స్మైల్ చారిటీ ఫౌండేషన్ తెలంగాణలో ఒక నమ్మకమైన భాగస్వామిగా అభయ ఫౌండేషన్తో నిలచింది అంటే ఎట్టి సందేహము లేదు. సేవ అనేది సమాజంలో మార్పు కోసం కాదు సేవ అనేది స్వీయ పరివర్తనకై అన్న సత్యసాయి సూత్రము ఇట్టి వారి జీవితంలో ప్రతిబింబిస్తుండడం చూస్తుంటే ఎంతో ఆనందం అవుతుంది.

NDSO - Tamilnadu

జెపి. జే ప్రభాకర్ వారి పేరు. సుమారు 70 ఏళ్ల వయసు. ఈ వయసులో వారి శ్రీమతితో కలిసి దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో పర్యటిస్తూ ఉంటారు. వారి ఏకైక లక్ష్యం ఏమిటి అంటే ఎక్కడ మంచి స్వచ్ఛంద సంస్థలు మరియు స్వచ్ఛంద సేవకులు ఉంటే వారిని గుర్తించడం, వారితో పాటు చేతులు కలిపి... వారికి అవసరమైన విధంగా సహాయ పడటం... ఇది వారి నిత్య కృత్యము. ఉంది తమిళనాడులోని చెన్నపట్నం అదేనండి చెన్నైలో! ఐనా దక్షిణ భారతదేశంలో సుమారు 6000 స్వచ్ఛంద సంస్థలను ఏకం చేశారు.

Networking and Development Center for Service Organisation (NDSO) అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి తద్వారా చిన్న మధ్యకారు స్వచ్ఛంద సంస్థలకు సాధికారత కలిగించే ప్రయత్నం చేస్తున్నారు.

గత దశాబ్ద కాలము నుండి వారిని అతి దగ్గరగా గమనించినప్పుడు, నాకు అర్థమైంది ఏమిటి అంటే ఎవరైనా సరే సంస్థను ఏర్పాటు చేసి తద్వారా ఏదో ఒక మంచి పని చేయడం సామాన్యంగా మనం చూస్తాము. కానీ, వీరు అలా కాదు... దేశంలోని వేల సంస్థలను ఒక త్రాటి మీదికి తెచ్చి, వారికి కావలసిన వనరులను సమకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం వనరులు మాత్రమే కాకుండా వారికి దిశ దశ నిర్దేశం చేస్తున్నారు. ఈ వయసులో సేద తీరాల్సిన సమయం, కానీ మీద పడే వయసుని కూడా లెక్కచేయకుండా, దూరభారాలు చూడకుండా, అలా నిత్యయాత్రికుడి లాగా వారు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వెళుతూ ఉంటారు.

అభయ ఫౌండేషన్ ద్వారా వారు చేస్తున్న ఎన్నో కార్యక్రమాల్లో చేయూతను అందించడం జరిగింది. ప్రధానంగా తమిళనాడు రాష్ట్రంలో 2014వ సంవత్సరంలో జరిగిన CSR Conclave సందర్భంగా వారితో మొదటిసారి పరిచయం అయింది. ఆనాటి నుండి నేటిదాకా దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రంలో అయినా సరే, ఏదైనా సేవ చేయాలి అంటే వీరి సహాయం తీసుకోవాల్సిందే అన్నంతగా వీరి సంస్థ మీద ఆధార పడ్డాము.

అభయ హంట్ ద సమ్మర్, అభయ హంట్ ద వింటర్, అభయ సాధికారత పథకాలు, ప్రకృతి వైపరిత్యాలలో సాయం, ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు, పర్యావరణ సంరక్షణ, చెన్నై వరదల్లో సాయం, చిన్న సంస్థలకు చేయూత ఇలా ఎన్నెన్నో కార్యక్రమాలలో వీరితో భాగస్వామ్యం సమాజ హితానికి దారి తీసింది.

శ్రీ సత్య సాయి బాబాను నమ్మి... వారిని దేవుడిలా తలచుకుని... వారు జీవిస్తున్న విధానం నాలాంటి వారికెందరికో ఆదర్శం అందిస్తుంది.

వీరి నుండి నేర్చుకున్న పాఠాలు...

- సేవలో పారదర్శకత ఉండాలి
- ఆర్థిక క్రమ శిక్షణను పాటించాలి
- ధనమును నేరుగా తీసుకోవద్దు
- సేవలో నిరాడంబర జీవన శైలి
- ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వడం
- ఎంత పెద్ద పని అయినా సాధించడం
- నిత్య యాత్రికుడై సంస్థలను గుర్తించడం
- తమ శేష జీవితాన్ని విశేషంగా గడపడం
- ఎంత ఎదిగినా ఒదిగి ఉండే పరిపక్వత

నిస్వార్థ - ఆంధ్రప్రదేశ్

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు... శ్రీమతి సైతం ప్రభుత్వ టీచర్. ఇద్దరు బిడ్డలు, ఇద్దరూ వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. చిన్న కుటుంబం, చింతలు లేని కుటుంబం. ఇంకేం కావాలి చెప్పండి, ఎవరికైనా!

కానీ, చిన్ననాటి నుండి సామాజిక సేవా దృక్పథంతో జీవితంలో తను మాత్రమే బ్రతకడం కాదు, తనతో పాటుగా పదిమందికి చేతనైన సాయం చేయాలన్న ఆకాంక్ష. చాలా కష్టపడి ప్రభుత్వ టీచరుగా ఉద్యోగం సంపాదించారు. అంతే కష్టపడి పెళ్లి చేసుకున్న తరవాత కూడా తన శ్రీమతిని

చదివించి టీచర్‌ను చేశారు. ఇంత చెప్తున్నాను అంటే వారిది పెద్ద వయసు అనుకునేరు... ఏమి కాదు, కేవలం 48 సంవత్సరాల వయస్సు.

పదేళ్ల క్రితం ఉరవకొండ పట్టణంలో భావ సారూప్యం కలిగిన శ్రేయోభిలాషులు, మిత్రులు, సహోపాధ్యాయులతో చేరి నిస్వార్థ సేవా ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ప్రతినెల కనీసం ఒక సేవ చేయాలనే లక్ష్యంతో, విద్య, పర్యావరణము, ఆధ్యాత్మికత తదితర రంగాలలో సేవలు చేయాలని ప్రయత్నం చేసేవాళ్లు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నవోదయ మరియు కేంద్రీయ విద్యాలయాల ప్రవేశ పరీక్షల కోసమై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బోధనా తరగతులు నిర్వహించే వాళ్లు. ఆధ్యాత్మిక వేత్త భిక్షమయ్య గురూజీ సహచర్యంలో శ్రీ సత్య సాయి బాబా భక్తుడిగా మారి, నిశ్శబ్దంగా తనకు చేతనైన సేవలు ఎంతో నిస్వార్థ భావనతో చేస్తుండే వారు.

చాలా సంవత్సరాల క్రితం, Dr ఆంజనయ్య ద్వారా, నాతో మాట్లాడి 10వ తరగతి విద్యార్థులకోసం ఉరవకొండలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆహ్వానించారు. అలా వారు చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలిసింది. ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశం కోసం నిర్వహించే బోధనా తరగతులు కేవలం ఒక గ్రామానికి కాకుండా జిల్లాకు రాష్ట్రానికి అందించాలని... అందుకు అభయ వారితో నిలబడుతుందని చెప్పాము. అలా అభయ, నిస్వార్థ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గత 5 సంవత్సరాలుగా అభయ ధన వనరులు, వ్యవస్థ సిద్ధం చేస్తే... వారు బోధనా సిబ్బందిని ఏర్పాటు చేసి 30 రోజుల ఉచిత బోధనా తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి దాకా సుమారు 600 మంది ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన పిల్లలకు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం కల్పించడం జరిగింది. అంతే కాదు వారి ఆధ్వర్యంలో ఎన్నెన్నో కార్యక్రమాలు ఆంధ్రదేశంలో చేయగలిగాము. ఎక్కడా భేదాభిప్రాయం లేదు... అంతా ఏకాభిప్రాయమే! సదభిప్రాయమే! సేవాభిప్రాయమే!!

అన్నట్లు వీరి పేరు చెప్పడం మరిచాను కదూ... వీరి పేరు వెంకట్ తాటికొండ... ఊరు ఉరవకొండ... అభయకు వారు పెద్ద అండ. పేరు చివర ఉండే కుల ప్రస్తావన ఎప్పుడో తీసేసాడు సుమా! ఇప్పుడు ఆయన సేవకుడు, అంతే!

ఇక వీరి నుండి నేర్చుకున్న పాఠాలు

- సదా సాదా సీదాగా బ్రతకడం ఎలా?
- సామాన్య స్థాయి... అసామాన్య సేవ!
- ఎదుటి వారిలో దేవుని చూసే దృష్టి!!
- సౌమ్యం... సౌజన్యం... సౌశీల్యం! ఎలా?
- కోరికలపై అదుపు... సంపాదనలో పొదుపు!
- ఫ్యామిలీ... వర్క్... సేవ బ్యాలెన్స్
- అణుకువతో అందరిని గెలవడం ఎలా?
- అనుకున్నది సాధించేదాకా విశ్రమించని వైనం!

నిజానికి, వారిని చూసినప్పుడు వారి పాదాలకు మ్రొక్కాలి అనిపిస్తుంది. వారి వినయ విధేయతకు నీరాజనం పట్టాలి అనిపిస్తుంది. ఇంత చేసి, ఎంతో గొప్పలు చెప్పే మనుషులున్న ఈ లోకంలో... సదా దైవార్పిత భావంతో... అణిగిమణిగి అందరిని సేవించే గుణానికి సెల్యూట్ చేయాలని అనిపిస్తుంది.

స్వామి ఇలా ఎంతో మందిని తమ సైనికులుగా తయారు చేసి సమాజంలోని ప్రతి ప్రదేశంలో విడిచారు అనిపిస్తుంది.

Yuva Shakthi - Karnataka

సుమారు ఒకటిన్నర దశాబ్ద కాలం క్రితం అనుకుంటాను, అప్పుడు అభయ ధర్మకర్తగా ఉండే మంచికంటి రాజశేఖర్ అభయ ధర్మకర్తల సమావేశానికి వస్తున్నపుడు తనతో పాటుగా ఒక వ్యక్తిని తీసుకుని వచ్చారు. వారు సమావేశం ఆద్యంతం జరుగుతున్న విషయాలని గమనిస్తూ నాతో కాసేపు మాట్లాడారు. చూడండి కోలార్ జిల్లాలో ఉన్న బెల్లంబరి అనే కుగ్రామంలో పుట్టాను. ఇంట్లో సుమారు 12 మంది కుటుంబ సభ్యులు. గొర్రెల పెంపకము... వ్యవసాయ పనులు కుటుంబానికి జీవనాధారం.

అక్కడినుండి బెంగళూరు దాకా వచ్చి మా కుటుంబంలో ఉన్నత చదువులు చదువుకున్న ఒకే ఒక్కడిగా మారాను. నన్ను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పింది జనోపకారి దొడ్డన్నశెట్టి గారు. సుమారు 100 సంవత్సరాల క్రితం బెంగుళూరు KR మార్కెట్‌లో స్థాపించిన SLN చారిటీస్ నా జీవితాన్ని మార్చేసింది. వారే నన్ను అక్కున చేర్చుకుని ఉన్నత విద్యాభ్యాసం కల్పించారు. ఇదిగో ఈరోజు ఉన్నత ఉద్యోగం చేస్తున్నానంటే, ఇలాంటి వారే కారణం అని చెప్తే చాలా ఆశ్చర్యం అయింది.

తనకు తన స్వగ్రామంలో ఒక స్థలం ఉంది, ఆ భూమిని అభయ ఫౌండేషన్‌కి విరాళంగా ఇస్తానని చెప్పారు. అది విన్న నేను అయ్యా ఇప్పటిదాకా సమాజానికి ఏం చేసావు!? అంటే అతను అన్నాడు ప్రస్తుతం నేను సంపాదిస్తున్నాను, సమాజానికి ఇంకా ఏమీ చేయలేదు... ఇంకా ముందు ఏమైనా చేయాలని అనుకుంటున్నాను అన్నాడు.

నేను చెప్పాను, "అంటే నీకు అంత కాలం జీవించగలననే నమ్మకం ఉందా ఏమిటి? ఏదైనా మంచి పని చేయాలి అనుకుంటే వెంటనే చేయాలి. లేదంటే మళ్లీ చేస్తామో లేక చస్తామో తెలియదు."

ఈ మాటలు అతని జీవిత దృక్పథాన్ని మార్చేసాయి. అప్పటి నుండి అభయ సంస్థతో చేతులు కలిపి ఎన్నో సేవాకార్యక్రమాలకు నేపథ్యం అయ్యాడు. ఈ వ్యక్తిలో భగవంతుడు ఎంతటి శక్తిని ఇచ్చాడు అన్నది గమనిస్తే ఎవరైనా అచ్చెరువు చెందాలి.

కర్ణాటక ప్రాంతంలో ప్రధానంగా సేవలకు వేదిక ఉండాలన్న సంకల్పంతో తన సొంత వనరులతో... మిత్రులందరి సహకారముతో Yuva Shakthi Seva Foundation స్థాపించారు. ఆ నాటి నుండి అభయను మాతృ సంస్థలా చేసుకుని కర్ణాటక రాష్ట్రంలో ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేశారు. కుటుంబం అంతా అతని మంచి సంకల్పానికి దాసోహం అయింది. బంధు మిత్రులు తోడు నిలిచారు. ధనం ఎప్పుడూ అడ్డు కాలేదు. సేవా క్షేత్ర యాత్ర చేస్తూనే ఉన్నారు.

అజగొండహళ్లి, బెంగళూరుకు దగ్గర White Field శివార్లలో ఉన్న ఒక ప్రాంతం. అక్కడ అభయ, యువ సంయుక్త ఆధ్వర్యంలో జేనగూడు ఆశ్రమాన్ని నిర్మాణం చేశారు. ప్రస్తుతం అందులో కామకోటి నాదస్వర పాఠశాల నడుప బడుతోంది. సుమారు 45 మంది చిన్నారులకు వసతి భోజన సౌకర్యంతో, నాదస్వరం, డోలు నేర్పిస్తూ... సాధారణ విద్యను కూడా నేర్పిస్తున్నారు. కంచి కామకోటి పీఠం వారి నేతృత్వంలో జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో గత 5 సంవత్సరాలుగా చక్కగా సాగుతోంది.

అభయ, యువ సంయుక్త ఆధ్వర్యంలో విద్య, వైద్యం, సాధికారత, ప్రకృతి వైపరిత్యాలలో సాయం, దుప్పట్లు మరియు గొడుగులు పంచడం... ఇలా ఎన్నో సేవలు ఎంతో సుహృద్భావ

వాతావరణంలో చేస్తున్నాము.

వీరి నుండి నేను నేర్చుకున్న పాఠాలు

- ఎంత ఎదిగినా సరే మూలాలు మరవద్దు
- సంపాదన ముఖ్యం... సేవ ఇంకా ముఖ్యం
- కుటుంబాన్ని సేవతో సంధించడం ఎలా
- ఎంత కావాలో అంతే సేకరించే అలవాటు
- నిస్వార్థ సేవలకు ఎప్పుడైనా కనక వర్షమే
- ఎంత కష్టం వచ్చినా విలువలు వదలద్దు
- సాధించే వయసులో స్వచ్ఛంద పదవి విరమణ చేయడం
- శేష జీవితాన్ని సేవతో ముడి వేసి విశేష జీవితాన్ని గడపడం
- నిత్యం సమాజ సేవకులకు తోడు నిలవడం

ఈ పాఠాలు నేను సదా గమిస్తున్నప్పుడు... ఒక వ్యక్తి, కుటుంబ సభ్యుడు, ఉద్యోగి, సామాజిక సేవకుడు ఆదర్శంగా జీవిస్తే ఆధ్యాత్మికత ఎలా జీవితములో ప్రభవిస్తుంది అన్నది చూస్తుంటే... ఎంతో స్ఫూర్తి కలుగుతుంది. అన్నట్టు చెప్పడం మరిచాను. ఈ వ్యక్తి పేరు భూషణ్ భారతీయ తన పేరు ముందు ఉండే ఇంటి పేరు, పేరు తరువాత వచ్చే తండ్రి పేరు రెండూ తొలగించి నేను భారత మాత బిడ్డను అనుకుని భారతీయ అని పెట్టుకున్నాను.

నా జీవిత ప్రయాణంలో నేను అతి దగ్గరగా చూసిన ఈ వ్యక్తులు, వారు సృష్టించిన వ్యవస్థలు చూస్తుంటే... స్వచ్ఛంద సంస్థలు కాదు, స్వీయ సంస్కరణ కేంద్రాలు కదా అని తప్పక అనిపిస్తుంది.



107

ఆ నలుగురు! ఎవరు?

నలుగురుకీ పంచితే... జీవితం
నలుగురుని పెంచితే... జీవితం
నలుగురుని బాగుచేస్తే... జీవితం
నలుగురు మెచ్చుకుంటే... జీవితం
నలుగురు వచ్చిపోతే... జీవితం
నలుగురు మద్య చచ్చిపోతే... జీవితం
నలుగురు మోసుకెళ్తే... జీవితం
నలుగురు మంచిగా తలిస్తే... జీవితం
నలుగురు వెనక నిలబడితే... జీవితం!

సగం జీవితం అయి పోయింది... ఇది సగమా... సంగమమా... సంయోగమా? అన్నది రాబోయే రోజులు నిర్ణయం చేస్తాయి. ఈ జీవం... జీతం... జీవితం... సాయి మార్గంలో సంజీవనం కావాలని ఆశ... కాదు ఆశయం.

నేను పోతే ఎవరు!? అన్నది ప్రతి ఒక్కరి సందేహం! నేనేమైనా మంత్ర దృష్టనా? నా తరవాత ఎవరు అని చెప్పడానికి? ఈ జీవితం నలుగురి కోసమై పుట్టింది... అలాగే సాగుతుంది, ఇది మాత్రం తథ్యం.

కానీ, నేను పోతే మోసే వాళ్లు నలుగురు ఉండాలి కదా!? నాకేమో ఆ ఆశ కూడా లేదు. మొన్నామధ్య నా వీలునామా వ్రాసాను. స్వామి ఇచ్చిన సంస్కారం తనువులోని అణువణువు

ప్రవహిస్తుంటే కవితావేశం పొంగి పొరలుతుంటే భావావేశం పదాలుగా మారి నా కలంలో నుండి జాలువారింది.

నా వీలునామా!

ఆస్తి పాస్తి లేదు! వస్తే గీస్తే ఏమి రాదు
ఇల్లు వాకిలి లేదు! పెళ్లాం పిల్లలు లేరు
ఇక్కడున్నప్పుడు కూడ బెట్టిందేమి లేదు
తెలిసిన నలుగురూ వస్తారని ఆశ లేదు!

అస్థులు గంగలో కలిపితే మోక్షం రాదు
అస్తిత్వం నేను చేసిన మంచి చెడుతో వస్తుంది
రేపు పోయాక తలచుకోవడంలో ఏముండదు
ఇప్పుడే పదుగురు చేయూతనందించాలి!

సమాధి కాదు! నా కార్యం సమాధానం
విగ్రహాలు కాదు... చేసిన పనే అనుగ్రహం
స్మారకము కాదు, చేసిన సేవయే స్మరణం
చిత్రపటం కాదు... చెప్పాల్సింది నా చిత్తం!

చచ్చిన తరవాత శవాన్ని మోసే వాళ్లెందుకు
చావక మునుపు నాతో వచ్చేవాళ్లుండాలి
చావు నన్ను పావుగా చేసి తీసుకుని వెళ్తే
చరితార్థం చేస్తా భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకిచ్చి

మోసే వాళ్లు వద్దు... కాల్చే వాళ్లు వద్దు
నాకు దినాలు పెట్టడానికి ఎవ్వరూ సెలవలు పెట్టద్దు
వద్దులే అందరి సమయం వృధా చేయొద్దు
అభయతో అడుగులు వేస్తే అదే ముద్దు!

వినతులు... ప్రణతులతో... మీ, బాలచంద్ర!

కానీ, నేను పయనించిన మార్గంలో నిలబడే నలుగురు ఎవరు? అన్న దానికి భగవంతుడు ఈ రోజు నా కళ్ల ముందు నిలపిన కొద్ది మంది గురించి వ్రాసే ప్రయత్నం చేస్తున్నాను. మును ముందు మరి కొందరు నిలబడ వచ్చును... ఏది ఏమైనా ఈ సత్ కార్యం నిలబడదు... సత్య మార్గంలో సాగిపోతుంది అని నమ్ముతాను.

శివకృష్ణ

2006వ సంవత్సరం, అప్పుడే అభయ ఫౌండేషన్ ప్రారంభం చేసాము. నేను సురానా గ్రూప్‌లో కంపెనీ సెక్రటరీగా ఉద్యోగం చేస్తున్నాను. ఒక రోజు ఆఫీసు దగ్గరికి, కాకినాడ నుండి అబ్బాయి వచ్చాడు. నిరుపేద కుటుంబం నుండి వచ్చిన అబ్బాయి. "Hyderabad Central University"లో మంచి ర్యాంక్ వచ్చింది. కానీ అడ్మిషన్ ఫీజు కట్టేందుకు కూడా డబ్బులేదు. కుటుంబం ఆర్థిక ఇబ్బందిలో ఉంది. మీకు వీలవుతే సాయం చేయండి అని అతని డిగ్రీ లెక్చరర్ నాకు లెటర్ వ్రాయిస్తే తీసుకుని వచ్చాడు. చాలా బాధ అయింది. కట్టాల్సింది లక్షల్లో లేదు... వేలల్లో ఉంది. ఆ అబ్బాయికి వచ్చిన ర్యాంక్ చూస్తే సామాన్యంగా లేదు... వెంటనే ఆర్థిక సాయం అందించాం.

అప్పటి నుండి... తను ఆర్థిక ఇబ్బంది లేకుండా చక్కగా MCA పూర్తి చేసాడు. చదువైన తరవాత ఒక చిన్న సంస్థలో ఉద్యోగం వచ్చింది. కొన్నేళ్ల తరవాత ఎప్పుడో నేను... అయ్యో సాయం తీసుకున్న వాళ్లు ఎవరు తిరిగి రావడం లేదని చాలా బాధపడింది చూసాడు... ఆ నాటి నుండి నేటి వరకు ఒక దీక్షను తీసుకుని అభయతో ప్రయాణం మొదలు పెట్టాడు. నా జీవితంలో చేస్తున్న మంచి పనికి ఒక కోటలా నిలబడ్డాడు.

తను చిన్న వాడు కావచ్చు! కానీ
అకుంఠిత దీక్షతో ఎలా ఉండాలి
కార్య దక్షత ఏ విధంగా చూపాలి
సేవకు సమయం ఎలా ఇవ్వచ్చు
లైఫ్‌లో అభయకు స్థానం ఇవ్వాలి
పనులకు యాజమాన్యం వహించే తీరు
ఎంత కష్టమొచ్చినా నిలబడే స్థైర్యం
నిరాడంబరంగా ఎలా జీవించాలి
కన్న వాళ్లకు... కట్టుకున్న వాళ్లకు న్యాయం
పట్టుకుంటే సాధించే దాకా వదలని వైనం!
కోపం పెదవిని దాటని వ్యక్తిత్వం!

ఇలా ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను! నేర్చుకంటూనే ఉన్నాను!!

5000 రూపాయలు సాయం చేస్తే... 50 లక్షల సంపాదనతో జీవితంలో స్థిరపడ్డాడు... ప్రయాణం సాగుతోంది. లక్షలు సంపాదించినా సరే! అభయ లక్ష్యాల కోసం తన శక్తి సామర్థ్యాలను ఉపయోగిస్తున్నాడు. ప్రస్తుతం అభయ సంస్థకు ధర్మకర్తగాను, కార్యదర్శి గాను సేవలు అందిస్తున్నాడు. నాకు కొడుకులు లేరన్న బాధ లేదు, రక్త సంబంధమేమి లేదు, హృదయ సంబంధమే అంతా! అభయ నావకు చుక్కాని కాగలడన్న నమ్మకం నాది.

చెప్పడం మరిచాను... శివకృష్ణ కాకినాడలో శ్రీ సత్య సాయి బాలవికాస్ విద్యార్థి చిన్నప్పుడు.

సుష్మ

తన తండ్రిని నమ్మిన వాళ్లు మోసం చేస్తే... చాలా పట్టుదలతో తన బాధ్యత మరవకుండా నానా కష్టాలు పడ్డాడు... ఇద్దరి పిల్లల చదువు కొనసాగించాలని తల్లి కూడా ఎన్నెన్నో ఆశలతో

బిడ్డను కొడుకును చదివించే ప్రయత్నం చేసింది. చిన్నప్పటి నుండి తరగతిలో ఇద్దరూ ప్రథమ శ్రేణి విద్యార్థులే సుమా! ఇంజనీరింగ్‌కు వచ్చారు... మంచి ర్యాంక్ తెచ్చుకున్నారు... కన్వీనర్ కోటాలో ప్రసిద్ధ కళాశాలలో ప్రవేశం వచ్చింది. కానీ కనీసం వనరులు కూడా లేవు. ప్రభుత్వం చెల్లించే రుసుముకి మించి ఖర్చు ఉంది. అదిగో అప్పుడు తన స్నేహితురాలు శారద ద్వారా అభయ సంస్థకు వచ్చింది ఇది 2007లో జరిగింది. ఆ పాప చాతుర్యం, చదువు, సంస్కారం చూసి నాలుగేళ్లు సాయం చేసాము. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం సంపాదించింది. అభయ ఆనంద నిలయ స్థాపనకు మూల కారణంగా నిలచింది. దశాబ్ద కాలంగా అభయ హోమ్ బోర్డు సభ్యులరాలిగా ఉంటోంది. కాల క్రమేణా పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లింది. అప్పుడప్పుడు చేతనైన సాయం చేసేది. బాధ్యతలు తనను వెనకడుగు వేసేలా చేసాయి. కానీ అభయను మరువలేదు. ప్రస్తుతం స్వదేశానికి వచ్చింది... చురుకుగా చేతనైన సేవలు చేస్తోంది.

చాలా చాతుర్యం, చతురత, సృజనాత్మకత, కళాత్మకత, నైపుణ్యంతో పది మందిలో ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది.

లలిత లహరి

వరసకు మనవరాలు అవుతుంది. జీవితంలో ఇప్పటి దాకా నేను చూసిన అతి కొద్ది మంది మేధావుల్లో ఈ అమ్మాయి ఒకరు అని చెప్పుకోవాలి. B.Com., LL.B చదివి, ఉన్నతోద్యోగం చేస్తుంది. 56 ఏళ్ల నాకు ఈ 30 ఏళ్ల పిల్ల పాఠాలు బోధిస్తుంది ఇది సత్యం. ఏదో సాధించాలనే ఆర్తి, తపనతో బ్రతుకుతుంది.

చదువు, చాతుర్యం, గ్రాహ్యశక్తి, భావ వ్యక్తీకరణ, పట్టుదల, విచక్షణ, దూర దృష్టి, కష్టమొచ్చినా తట్టుకునే సామర్థ్యం, రచనా వ్యాసంగం, సామాజిక దృక్పథం వీటన్నిటితో ఒక ప్రత్యేక మైన వ్యక్తిగా నిలబడింది.

అన్నిటికీ మించి నా కోసం నిలబడే ప్రేమ... నన్ను చూసుకోవాలనే వాత్సల్యం... ఎంత దూరంలో ఉన్నా నా బాగోగులు గురించి ఆలోచించే తత్వం... ఇలా ఎంతో అనురాగంతో నా పాపలాగానే మారిపోయింది.

భారత దర్శన్ మరియు కంపాస్ పుస్తక రచనలో నాతో పాటుగా కలం పట్టి రచయిత్రిగా కూడా మారిపోయింది. మునుముందు... నేనున్నా లేకున్నా సమాజ సేవలలో తనదైన శైలిలో అభయకు తోడు నిలుస్తుందని నా విశ్వాసం.

కీర్తి

మేన కోడలు. మొత్తం కుటుంబంలో చిన్నప్పటి నుండి నేను ఎత్తుకుని పెంచిన ఎంతో మంది పిల్లల్లో ఒక పాప. చాలా అద్భుతమైన వ్యక్తిత్వం. మేనల్లుడు కొన్ని సంవత్సరాలు అభయ ధర్మకర్తగా ఉన్నాడు. వివాహానంతరం... విదేశాలకు వెళ్లి పోయాడు. ఎప్పుడో ఒక సమయంలో సంస్థాగత కార్యక్రమాలలో తోడు నిలుచునే వాళ్లు కనబడటం లేదు అని కన్నీళ్లు పెట్టుకుంటే... ఇదిగో, పెళ్లి చేసుకుని స్థిరపడి పోయిన పెద్దింటి కోడలు... నా మేనకోడలు నా బాధను అర్థం చేసుకుంది. మామా! నాకు చేతనైన సాయం నేను చేస్తాను. మా వారి అనుమతితో నీవు చేస్తున్న మంచి పనిలో నేను తోడుంటాను అని చెప్పింది. గత 10 సంవత్సరాలుగా అభయకి చేదోడు వాదోడుగా

ఉంటోంది. ఎన్నో సందర్భాలలో ఒక ప్రక్క అత్తింటి వాళ్లను, కట్టుకున్న వాడిని, కన్న బిడ్డల్ని చూసుకుంటూ, జీవితంలో కాస్తా సమయాన్ని వనరులను అభయ కోసమై వెచ్చిస్తున్న ఈ అమ్మాయి తప్పక అభయ ఆశయ సాధనలో ఎప్పుడో ఒకప్పుడు తప్పక మమేకం ఔతుందన్న ఆ పాపను చూస్తుంటే ఆశ నాలో కలుగుతుంది...

ప్రశాంతి

ప్రాణమిత్రుడు కీ.శే. రంగారావు ఒక్కగానొక్క కుమార్తె. సోదరి శ్రీమతి కృష్ణవేణి గారాల పట్టి. ఒకటిన్నర దశాబ్ద కాలం నుండి, నన్ను, తన నాన్న గారితో పాటుగా ఎన్నో సార్లు చూస్తూ... వారి కుటుంబానికి ఒక ఆత్మీయుడిలా భావించింది. మావయ్యా అంటూ ఎంతో ప్రేమగా నన్ను పిలుస్తూ... నా కళ్ల ముందే పెరిగి పెద్దయింది... ఉన్నత చదువుల కోసమై ఆస్ట్రేలియా దేశంలో ఉంది. స్వామికి చిరకాల భక్తులైన వేణి రంగారావుతో చేరి మేమంతా ఎన్నో గ్రామాలకు వెళ్లి సేవలు చేసే వాళ్లం. ఆ పుణ్య దంపతులు ఆ తరవాత కాలంలో అభయ సంస్థలో చురుకైన పాత్ర పోషించారు. అభయ సంస్థ అధ్యక్షులుగా రంగారావు, సంచాలకులుగా వేణి రావు సేవలందిస్తూ... వారి ఇంటినే సేవా కేంద్రంగా మార్చి, వందలాది మందికి సాధికారత కల్పించారు. ఆ సమయంలో తల్లితండ్రుల సేవా దృక్పథాన్ని పుణికి పుచ్చుకున్నది ప్రశాంతి. ఇంట్లో ఏ విశేషం జరిగినా నాతో సెలబ్రేట్ చేస్తూ ఉంటారు. తను నన్ను God Father అంటూ ఉంటుంది.

నాన్న అకాల మరణంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. ఆ పాపను నా పాపగా చూసుకోవడం మొదలైంది. ఆ తరవాత బోర్డు మీటింగులో... ప్రశాంతిని పిలిచి, తన తండ్రి అధ్యక్షులుగా ఉంటూ సేవించిన అభయ కోసం నిలబడమని సూచించాము. అందరికి మాట ఇచ్చింది... అభయ బోర్డు సభ్యురాలిగా నిలబడింది. రంగా అవార్డ్‌ను స్థాపించి ప్రతి సంవత్సరం వారి తండ్రి పేరు మీద ఆదర్శ సేవకులను గుర్తించి, వారిని గౌరవించి తండ్రిని తలుచుకుంటోంది. తను వీలైనంత సమయాన్ని అభయ కోసమై ఇస్తోంది. కంపాస్ ఆంగ్ల పుస్తక రచనలో నాతో పాటు నిల్చుంది. ఇదిగో నేను పోతే అభయ సేవా ప్రస్థానం ఆగకుండా చూసుకునే మరొక ఆత్మ బంధువు ప్రశాంతి అనుకుంటున్నాను. ఈ జీవితంలో నేను హృదయానికి హత్తుకుని ప్రేమించిన పాప ప్రశాంతి తన చదువు, సంస్కారం, ఎల్లలెరుగని ప్రేమ, సేవ చేయాలన్న ఆకాంక్ష, మావయ్య అంటే విశ్వాసం వెరసి అభయ సంస్థకు ఒక హోప్ లాగా నిలబడింది ప్రశాంతి.

సాయిలత...

శ్రీ సత్యసాయి అనుగ్రహంతో నాకు దొరికిన పాప. నాన్న ఉన్నా లేనట్టే! అమ్మ చాలా కష్టపడి పెంచింది. కర్నూల్ సత్య సాయి బాలవికాస్ విద్యార్థిని. ఇంటర్ చదివే సమయంలో ఆర్థిక సాయం కోసం వచ్చింది 2012లో అనుకుంటాను. ఇంటర్‌లో అభయ చేయి పట్టింది... మళ్లీ విడువలేదు. అంచెలంచెలుగా ఎదిగింది. ఇంటర్, MBBS, MS, DNB, OBGY చదివింది. గైనకాలజిస్ట్‌గా మారింది... డాక్టర్ తిరుమలేష్‌ను వివాహం చేసుకుంది. అభయ కోసం వీలున్నప్పుడల్లా నిలబడింది. నన్ను దిక్కులా పెట్టుకుంది జీవితంలో. తను ఎదుగుతూ, సంస్థను కూడా చూసుకుంది. అభయ గర్వించే అతి కొద్ది మంది విద్యార్థుల్లో మొదటి వరుసలో నిలిచింది. నా ఆనందం కోసమై శ్రమించింది. అత్తగారింటికి వెళ్లినా కూడా అమ్మను మరువలేదు, అభయను మరువ లేదు. తన భావనలో, తన

మాటలో, తన పనిలో అభయను సంధించి... అభయకు రాయబారిగా మారింది. అభయ బోర్డు సభ్యురాలిగా సేవలు అందిస్తోంది. భవిష్య ధర్మకర్తగా అడుగులు వేస్తోంది.

నాతో పాటు కంపాస్, సత్య స్ఫూర్తి, విముఖం ఇలా చాలానే పుస్తకాలు రచించడంలో చురుకైన పాత్ర పోషించింది. సాయి మార్గంలో! జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళస్తూ పుస్తకాన్ని తనే నెత్తికెత్తుకుని ఎన్నో ఏళ్లుగా నిశ్శబ్దంగా నేను వ్రాసిన వ్యాసాలు... కవితలు... పద్యాలు... అప్లోడ్ చేసిన వీడియోలు... నేను చేసిన ఉపన్యాసాలు... నా రచనలు... జరుగుతున్న సేవా కార్యక్రమాలు అతి సమీపం నుండి చూసి... పరిశోధించి... సమయం ఇచ్చి పుస్తక రూపం ఇచ్చింది. నన్ను కూడా బిడ్డలా చూస్తుంది. అభయకు ఉత్తరాధికారులుగా ఇలాంటి పిల్లలు కనిపిస్తారు.

సందేశ్

మంజుల రామకృష్ణల పెద్దబ్బాయి. తన తండ్రి 30 ఏళ్ల క్రితం CS చేయాలనుకుని బెంగళూరుకు వచ్చాడు. బాలవికాస్ జ్యోతక్క పంపితే నన్ను వెతుకుతూ వచ్చాడు. కారణాంతరాల వలన CS చేయలేదు... వ్యాపార వ్యవహారాలలో స్థిరపడి పోయాడు. పెళ్లి చేసుకున్నాడు. కానీ నాతోనూ, అభయతోనూ సంబంధం విడుచుకోలేదు. పెళ్లయ్యాక భార్య పిల్లలకు కూడా నేను సుపరిచితం అయ్యాను. సందేశ్ చిన్నప్పటి నుండి తల్లి తండ్రుల ప్రేమానురాగాలతో పెరుగుతూ... సామాజిక సేవా దృక్పథంతో... అభయ సంస్థతో ప్రయాణం చేసాడు. ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన CA పూర్తి చేసి బెంగళూరులో ప్రఖ్యాత సంస్థ అయిన PWCలో పని చేస్తున్నాడు. ఈ కాలం పిల్లలు ఎంతో మంది సాయం చేస్తామని కళ్లముందు నుండి మాయమైపోతుంటారు. అలాంటి కోవకు చెందని అబ్బాయి సందేశ్. నేనెప్పుడు ఈ పిల్లాడిని చూసినా పుత్ర వాత్సల్యం కలుగుతుంది. అభయకు భవిష్య ధర్మ కర్తగా నిలబడగల తేజస్సు ఇతనిలో కనిపిస్తూ ఉంటుంది.

ఇంకా, వైష్ణవి, మహేష్, లీలావతి, చిన్మయి, లలిత్ రంగా, కౌస్తుభ్, సూర్య, షిర్డీషా, ప్రణతి మొదలగు పిల్లలు కూడా కనిపిస్తారు. ఎవరో ఒకరు, ఎపుడో అప్పుడు వస్తారన్న ఆశతో అలా సాగి పోతున్నాను. కాలం నిర్ణయిస్తుంది... ఆ నలుగురు ఎవరన్నది!

Institutions and Organizations founded by individuals generally flourish during their lifetimes. Once the founder departs from the scene, his or her organization either gains more vitality or disintegrates in time. It all depends on whether the followers have appreciated the vision of their leader. When the vision is clear and followed consistently, the organization grows even after the founder's departure. If the organization has centered around a personality cult and people have become attached to an individual, it is very possible that the organization will disintegrate after the passing of its leader.

108

సాయి మార్గంలో! జీవిస్తూ... ప్రేమిస్తూ... పరిమళిస్తూ!!



విశ్వవ్యాప్తముగా 23 నవంబర్, 2025 నాడు స్వామి వారి శత వర్ష బ్రహ్మోత్సవము, భక్తి శ్రద్ధలతో వివిధ సేవా కార్యక్రమాలతో జరుపుకుంటున్న అందరికీ శిరము వంచి అభివాదం చేస్తున్నాను.

2011వ సంవత్సరంలో స్వామి వారి మహాభినిష్క్రమణము సుమారు ఒకటిన్నర దశాబ్దాల కాలం మన జీవితాలలో పెను మార్పులకి కారణముగా నిలిచింది. ఎన్నెన్నో నవాళ్లని మనమందరం ఎదుర్కొన్నాము. సాయి భక్తులకు ఇది నిజంగా ఒక పరీక్షా సమయము. ఈ పరీక్షా సమయంలో కూడా స్వామి వారు మనము నేర్చుకోవలసిన ఎన్నో గుణపాఠాలని మనకు బోధించినారు.

స్వామి వారి శత వర్ష బ్రహ్మోత్సవం సందర్భంగా వారి దివ్య సన్నిధిలో అష్టోత్తర శత సాహిత్య పుష్పాలతో నా ఆత్మీయుల కథనే నా ఆత్మకథగా వ్రాసి అర్పించే ప్రయత్నం చేస్తున్నాను.

ఈ రోజు మన ముందు ఉన్న సవాలు ఏంటి అని ఒకసారి ఆలోచిస్తే,

స్వామి వారు 96 ఏళ్లు కదా చెప్పారు, 86 ఏళ్లకే నిష్క్రమించారు.

స్వామి లేకుండా జీవించడం అనేది దుర్భరంగా ఉంది.

స్వామి వారి దర్శన, స్పర్శన, సంభాషణ, పాద నమస్కార, ప్రసాద భాగ్యాలు దూరమయ్యాయి.

దైవ నాయకత్వ ప్రాప్తిని మనం కోల్పోయాము.

సాయి సంస్థ కార్యక్రమాలు ఒడిదుడుకులకు లోనయ్యాయి.

కరోనా కష్ట కాలము సాయి కార్యములకి ఒక అడ్డు గోడగా నిలిచిపోయింది.

ఇలాంటివి మనమందరం వింటున్నాము కదూ, మిత్రులారా! భక్తుడికి భగవంతుడికి హృదయ సంబంధమే తప్ప, మిగతా అంశములు ఏవి సాధనకి అడ్డు రావు అని గ్రహించాలి.

స్వామి వారు తమ 86 ఏళ్ల జీవిత కాలంలో మనందరికీ అందించిన సాయి సందేశ ఝరులు మన హృదయాంతరాళములలో జీవనదులుగా మారినప్పుడు, ఇక స్వామి కార్యమునకు వచ్చిన ఢోకా ఏమి లేదు అని మనం తెలుసుకోవాలి.

కానీ మనముందున్న నిజమైన సవాలు ఏమిటి అంటే, స్వామి చెప్పింది మనము చేయలేకపోవడమే. స్వామి వారి 100వ పుట్టు పండుగ సందర్భంగా, స్వామి వారు ఏమి చెప్పారు? మనం ఏం చేయలేక పోతున్నాం? ఎందుకు చేయలేక పోతున్నాం? అనేది ఒకసారి ఆలోచిస్తే, సత్యం బోధ పడుతుంది.

స్వామి వారు ఏమి చెప్పారు?

"దేహ భావన వీడి ఆత్మ భావన పెంచమన్నారు."

"అందరినీ ప్రేమించు అందరినీ సేవించమన్నారు."

"ఎల్లప్పుడూ సాయము చేయి, ఎవరికీ హాని తలపెట్టకన్నారు."

"మన జీవితమే వారి సందేశముగా మలచమన్నారు."

"నవసూత్ర నియమావళిని జీవితములో పాటించమన్నారు."

"సాయి సంస్థలే నిజ మోక్ష మార్గములు అన్నారు"

"ఒక్కొక్కరిని ఒక్కొక్క సాయి స్వరూపముగా మారమన్నారు."

"మానవతా విలువలను నిత్యాచరణ సిద్ధాంతములుగా తీర్చిదిద్దమన్నారు."

విశ్వవ్యాప్తముగా ఉన్న సాయి భక్తులందరూ సాయి సందేశములను ఆచరించి జీవితమును సార్ధకత చేసుకున్నట్టు అవుతే, మనం ఎదుర్కొంటున్న ఏ సవాలు కూడా మనల్ని ఇంచైనా కదిలించలేవు.

ఇది అక్షర సత్యము! తరచుగా స్వామి వారు బహిరంగంగాను, అంతరంగీకంగాను ఎన్నో సందర్భాలలో చెప్పిన ఈ సందేశములు మనం ఆచరించలేకపోవడమే నిజంగా మనం ఎదుర్కొన్న సవాలు అని గ్రహించాలి.

యుగ యుగములుగా మానవాకారముతో వచ్చిన ఏ అవతారము కూడా శాశ్వతముగా ఈ భూమి పైన నిలిచిపోలేదు అని మనందరికీ తెలుసు. కానీ ఆ అవతార వాణి, బాణీ, శ్రీవాణి, అంతర్వాణిగా మారి తరాలు మారిన అంతరాలు మారిన వారు ప్రవచించినటువంటి సందేశములు అమరములై నిలిచి నేటికీ కూడా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నవి అని మనం ఎరుగుదుము.

స్వామి మన కళ్ల ముందు లేనంత మాత్రాన స్వామి వారు దశాబ్దముల కాలము పాటు మనలో పెంచి పోషించిన భక్తి విశ్వాసములు మాయమైపోతాయా? చెప్పండి. స్వామి భౌతికంగా లేని ఈ సమయంలోనే కదా మనమంతా స్వామి సందేశాలు ఆచరించాల్సిన అవసరము అవశ్యముగా ఉంది. స్వామితో మనం గడిపిన క్షణాలు, స్వామి మనతో మాట్లాడిన మాటలు, స్వామి సందేశాలు, స్వామి దివ్యోపన్యాసాలు, స్వామి నడవడి, స్వామి ప్రవర్తన, స్వామి అవతార కార్యము, ఇవన్నీ కూడా మనతో మమేకమైనప్పుడు, మన జీవితాలలో అనుష్టించినప్పుడు... మనము స్వామి ఒక్కటిగా మారిపోమంటారా?

వెన్న వంటి హృదయము,
వెన్నలవంటి మనసు
తేనె వంటి మాటలు

ఇవే కదా స్వామి మనకి ఇచ్చిన సూత్రములు. ఇవే కదా ఈ రోజు నిజ మోక్ష మార్గమునకు దివ్య మంత్రములుగా మనం తెలుసుకోవాలి. స్వామి చాలాసార్లు చెప్తుండగా విన్నాను,

మనసునందున మంచి మాట నందున మంచి
చేతనందున మంచి పొడమకున్న
సాయి మిమ్ము మెచ్చి సంతోష మెటులిచ్చు
చెప్పరయ్య మీరు ఒప్పు కొందు!
ఈ సందేశం ఒక్కటి చాలదా
మన జీవితాలను సార్ధకం చేయడం కోసం!!!

మనము పోయే లోపుగా, బ్రతికే పనులు చేద్దాం. మిత్రులారా! స్వామి వారిని సర్వాంతర్యామిగా, సర్వ హృద్వాసిగా మనము చూడగలిగింది నిజమవుతే ఈ రోజు మన జీవితాలలో స్వామి సందేశాలని అనుష్ఠించగలిగితే, మనలను కూడా స్వామిని చూసి నట్టుగానే చూస్తారు అనడంలో ఎట్టి సందేహము లేదు.

ఒక సారి ఏకాంత సౌధ సంభాషణ సమయంలో ఒక సోదరుడు స్వామి వారిని అడిగాడు, "స్వామి మీరు నాతో ఉన్నారని భావించి కూడా తప్పులు చేస్తున్నాను స్వామి, ఏం చేయాలి" అని అడిగాడు. స్వామి వారు నవ్వుతూ చెప్పారు "బంగారు! స్వామి నీతో ఉన్నారు అంటే నీవు వేరు స్వామి వేరు ఐపోతుందయ్యా, తప్పులు చేయడానికి ఆస్కారం ఉంది. స్వామి నాతో ఉన్నారని కాదయ్యా, స్వామి నాలో ఉన్నారని అనుకుని పని చేయవయ్యా! అప్పుడు స్వామే నువ్వుగా మారితే ఇక తప్పులు ఎందుకు జరుగుతాయి" అని చెప్పారు!

ఇది ఒక అద్భుతమైన మంత్రం, అద్భుతమైన వ్యూహం, అద్భుతమైన సాధన. ఈ నవంబర్ నెలలో స్వామి జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భంలో, మనం ప్రతి ఒక్కరూ మన జీవితాన్ని మరింత మెరుగు పరచుకునేందుకు, మన జీవన విధానాన్ని పునర్నిర్వచించుకునేందుకు ప్రయత్నించాలి. స్వామి నేను, వేరు కాదు" అనే ఆలోచనను మనస్ఫూర్తిగా గ్రహించే అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పుడు ఒక్క సారి మనందరం కూడా ఇందాక చర్చించిన సవాళ్లను ఒకసారి ఆలోచిద్దాం. నిజంగా మనమే స్వామి అవుతే సమస్యలను ఏ విధంగా ఎదుర్కొంటాము అన్నది మనం ఆలోచించాలి. అప్పుడు ఇక కర్తవ్యం బోధపడక మానదు కదా! మనం ఏం చేయాలో ఇంక ప్రక్కన వాళ్లు ఎవరు చెప్పక్కర్లేదు, మనమే స్వామిగా ఉన్నప్పుడు మనమే మన ప్రక్క వాళ్లకి దిశా నిర్దేశం చేయ గలిగిన వాళ్లం అవుతాం. మనలో స్వామి ఉండడం అంటే... మన ఆహార్యము, ఆంగికము, అభినయము, వేషము, భాష, ఇవన్నీ కూడా స్వామి లాగా మారక్కర్లేదు. సాయి పేరుని మన పేరు ముందర వెనక తగిలించుకోనక్కర్లేదు, మన జీవితాలలో స్వామి విలువలని మనం ఆచరించ గలిగితే, మన చుట్టూ ఉన్న వాళ్లకి స్వామి తప్పకుండా మనలో కనిపిస్తారు అని నేను నమ్ముతున్నాను.

ఇలా చెప్తుంటే, మరొక విశేషం గుర్తొచ్చింది. తన చుట్టూ చేరిన పిల్లలతో స్వామి ముచ్చటిస్తూ, ఒక అబ్బాయిని పట్టుకొని "ఏయ్!! ఎవరు నువ్వు?" అని అడిగారు. అంటే ఆ చిన్న అబ్బాయి వెంటనే వినమ్రంగా 'నేను స్వామిని' అన్నాడు. చిన్న అబ్బాయి కదా, స్వామి ముచ్చటగా నవ్వుతూ... "మరి ఇంకేం అట్లా దర్శనం ఇచ్చిరా వెళ్లి" అని చెప్పారు. అప్పుడు ఆ చిన్నారి బాబు, "స్వామీ!" అన్నారు అప్పుడు స్వామి చెప్పారు "బంగారు నువ్వే స్వామి అనుకోవడం వేరు, స్వామి లాగా జీవించడం వేరయ్యా." అంటే "నేనే స్వామిని" అని భావించడం అంత ముఖ్యము కాదు, మనం స్వామిలా జీవించాలి, స్వామి చూపిన మార్గంలో నడవాలి అని తెలుసుకుంటే మన జీవితాలను సార్థకం చేసుకున్న వాళ్లం అవుతాము.

స్వామి వారి 100వ పుట్టు పండుగ సందర్భంగా వారి సందేశాన్ని ఒక్కటైనా సరే మనం పాటించే ప్రయత్నం చేస్తే అదే స్వామికి ఇచ్చిన నిజమైనటువంటి నివాళి.

గత 12 నెలలుగా స్వామి వారి 99వ పుట్టు పండుగ నుండి స్వామి వారి 100వ పుట్టు పండుగ వరకు సుమారు 108 అనుభవ వ్యాసాలని స్వామి వారి చెంత సమర్పించాలని తీసుకున్న ఈ దీక్షను ఈ రోజుతో నేను ముగిస్తున్నాను. ఈ వ్యాసాల రూపంలో స్వామి చెంత నేర్చుకున్న

విషయాలు, స్వామి సన్నిధిలో పొందిన అనుభవాలు, స్వామి సేవకులలో గమనించిన పాఠాలు, స్వామి సేవలలో నేర్చుకున్న పాఠాలు అన్నీ కూడా నేను ఏకం చేసే ప్రయత్నం చేశాను. చిన్న పుష్పాలలాగా ఏర్చి కూర్చి ఒక దండ లాగా, ఒక హారం లాగా స్వామి పాదాల దివ్య సన్నిధిలో సమర్పిస్తున్నాను. హృదయములో నుండి వచ్చిన ఈ మాటల ఊటలని స్వామి వారి దివ్య సన్నిధిలో సమర్పిస్తూ మీ అందరి వద్ద సెలవు తీసుకుంటున్నాను, జై సాయిరాం!!

ఏ విధంగా సమాజంలో వ్యక్తుల నుండి, శక్తుల నుండి, వ్యవస్థల నుండి, సంస్థల నుండి చివరికి దివ్యత్వం నుండి ప్రభావితం చెందారు అన్నది ఈ పుస్తకం ద్వారా తెలిపే ప్రయత్నం చేశారు.

- శ్రీనివాసులు హుగ్గహళ్లి,

శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, హైదరాబాద్.

I am humbled by his privilege of having personal audience and guidance with Bhagavan and spreading Sai ideas and ideologies at various forums across the country.

- CA Narayana Rangaiah Sunku,

President, abhaya Foundation, Bengaluru

This book is more than a chronicle of initiatives and it is a testament to the transformative power of empathy in action.

- K V Ramakrishna,

Chairman, abhaya, Mumbai.

During his training, I used to ask him, "When is your marriage?" I was surprised to hear that he was considering remaining a bachelor.

- CS M Adinarayana,

Former VP & CS, NATCO, Hyd.

Over the years, I have watched Bala transform from a brilliant learner into a reformer, a Swamiji, a Sage, and a Voice of conscience for an entire generation.

- CS PS Rao,

Corporate Advisor, Hyd.

This book is a real-life account of a young man who dared to dream and devoted himself to a life of purpose. It carries the wisdom of Bhagawan Sri Sathya Sai Baba.

- Dr. Gopi Krishna Pidatala,

CEO, Vista Imaging and Medical Centre, Hyd.

ఈ పుస్తకంలో పేర్కొన్న ప్రతి మనిషిది ఒక విలక్షణ గాథ, ప్రతి జీవితం ఒక పాఠశాల, ప్రతి కథ మేల్కొలిపే ఘంటారావం అనడంలో సందేహం లేదు. ఈ కథ సాధారణ మనిషి గురించి కాదు, సేవను శ్వాసగా మార్చుకున్న అసాధారణ వ్యక్తి గురించి.

- డా. పి. సాయిలత, MBBS, MS, DNB (OBGY)
Hospet.

abhaya FOUNDATION
an assurance for no fear...

502, Vipanchi Residency, Lane Beside Paradise Take Away,
Masab Tank, Hyderabad - 500 028. Telangana

abhayafoundation@yahoo.com
abhaya@abhayafoundation.org
99592 20450 | 81437 07803
abhayafoundationHyd
abhaya Foundation-Home of Happiness
www.abhayafoundation.org
www.abhayahome.org
Balachandra Sunku
Balachandra Sunku
abhayaheart abhayaheart